శ్రీ రామ సేవ

శ్రీ మదాంధ్ర

వాల్మీకి రామాయణము

(మందరము) అయోధ్య కాండము-2

గ్రంథకర్త:
వావిలికొలను సుబ్బారావు



తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

శ్రీమదాంధ్ర

వాల్మీకి రామాయణము

(మందరము) అయోధ్య కాండము-2

రచన

వావిలికొలను సుబ్బారావు

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

SRI MADANDHRA VALMIKI RAMAYANAMU

(MANDARAMU) AYODHYA KANDAMU-2

T.T.D. Religious Publication Series No:
© All Rights Reserved

e_Book Edition : 2023

Copies:

Published by :
Sri A.V. Dharma Reddy, IDES
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

D.T.P:
Publications Division,
T.T.D, Tirupati.

Printed at :
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati.

-: మున్నుడి :-

శ్లో॥ వేదవేద్యే పరే పుంసి, జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసా దాసీత్, సాక్షాద్రామాయణాత్మనా ॥

వేదము ద్వారా తెలిసికొనవలసిన పరంధాముఁడగు శ్రీమన్నారాయణుఁడు దశరథ మహారాజు కుమారుఁడు శ్రీరామచంద్రునిగా దుష్ట శిక్షణార్థము, శిష్ట రక్షణార్థము అవతరించగా, వేదము ప్రచేతస మహాముని కుమారుఁడగు వాల్మీకి మహర్షి ద్వారా శ్రీమద్రామాయణముగా రూపొందినది.

ఇహ, పర సాధకమగు సంస్కృత రామాయణమునకు యథానువాదమని పండితప్రశంసలచే పేరొందిన ఆంధ్రవాల్మీకి రామాయణమును శ్రీశ్రీశ్రీ వాసుదాసస్వామిగా లబ్ధప్రతిష్ఠులైన కీ॥శే॥ శ్రీ వావిలికొలను సుబ్బారావుగారు యిప్పటికి సుమారు నూఱు సంవత్సరముల క్రిందట రచించుటేగాక, ప్రతి పద్యమునకు అర్థ, తాత్పర్య, విశేష వివరణలతో కూడిన వ్యాఖ్యానమును "మందరము" అనుపేర చేతనుల ఉజ్జీవనార్థము అనుగ్రహించిన విషయము ఆంధ్రలోక మెఱింగినదే.

మందర వ్యాఖ్యానమెంత ఉత్కృష్టమైనదో యిన్ని సంవత్సరములుగా అయ్యది పునర్ముద్రణల నొందుచుండుటయే నిదర్శనము.

విజయవాడ నగర వాస్తవ్యులు, శ్రీ కోదండరామసేవక ధర్మసమాజ కార్యనిర్వాహకవర్గ భూతపూర్వ కోశాధికారి, మఱియు శ్రీశ్రీశ్రీ దాసశేషస్వామి వారి పాదాశ్రితులు, ప్లీడరు అయిన కీ॥శే॥ శ్రీ కొత్తూరు శ్రీరామమూర్తి (కీ॥శే॥ శ్రీ కొత్తూరు సీతారామయ్యగారి కుమారుఁడు) స్మృత్యర్థముగా, ధర్మపత్ని శ్రీమతి జానకి అచ్యుతప్రీతిగా సమర్పించిన ద్రవ్య సహాయమున (లక్ష రూపాయలు) యీగ్రంథము పునర్ముద్రణ నొందుచున్నది.

దాసకుటీస్థ శ్రీ వైదేహీ, రామానుజ. సంజీవరాయ సహిత కోదండరామ ప్రభువు గ్రంథ పునర్ముద్రణ దాతకు మరియు కుటుంబ సభ్యులకెల్లరకు యితోధిక శ్రేయఃపరంపరల నొసంగు గాత:

'దాసకుటి'
అంగలకుదురు-522 211
తేది 01-12-2007.

— రామానుజదాసుఁడు

అయోధ్యాకాండము - విషయసూచిక

2వ భాగము

పుట

123. శ్రీరామ వనవాస నిమిత్తకమైన దుఃఖమును లక్ష్మణుండు గుహునితోఁ జెప్పుట. ౬౪౪
124. శ్రీరాముఁడు గంగను దాఁటఁ బ్రయత్నించుట ౬౪౮
125. సుమంత్రుఁడు తన్నరణ్యమునకుఁ దోడ్కొనిపొమ్మని శ్రీరాముని వేఁడుకొనుట ౬౫౧
126. శ్రీరాముఁడు సుమంత్రుని సమాధానపఱచుట ౬౫౩
127. సుమంత్రుఁడు శ్రీరాముని వదలిపోలేక పరితపించుట ౬౫౭
128. శ్రీరామలక్ష్మణులు జడలు ధరించుట ౬౬౫
శ్రీరాముని వానప్రస్థాశ్రమ స్వీకార విషయిక చర్చ ౬౬౭
129. సీతాదేవి గంగను బ్రార్థించుట ౬౭౦
జాలకు-గుట్టలకు నదులకు హిందువులు నమస్కరింతురను నాక్షేపమునకు సమాధానము ౬౭౧
130. శ్రీరాముఁడు తల్లిదండ్రులఁ దలంచి దుఃఖించుట ౬౭౯
మోక్షమనునట్టి బ్రహ్మానందమునకు భగవంతుఁడొక యుపాయమే యయినను ఆచార్యుఁడంతకంటె సులభోపాయమను విషయము ౬౮౫
131. లక్ష్మణుండు శ్రీరాము నూరార్చుట ౬౮౯
పరమభక్తి నిరూపణము ౬౯౦
132. శ్రీరాముఁడు భరద్వాజాశ్రమమునకుఁ బోవుట ౬౯౨
నమస్కార విషయము ౬౯౫
133. భరద్వాజముని శ్రీరామునకుఁ జిత్రకూట మార్గముఁ దెలుపుట ౭౦౨
134. సీతారామలక్ష్మణులు శ్యామవటంబుఁ జేరుట ౭౦౭
135. శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటమునందలి చిత్రములం జూపుట ౭౧౦
136. శ్రీరాముఁడు వాల్మీకి మహర్షిని సందర్శించుట ౭౧౪
137. శ్రీరామలక్ష్మణులు చిత్రకూటంబునం బర్ణశాల నిర్మించుట ౭౧౫
గృహశాంతి విషయిక చర్చ - హింసానిరూపణము ౭౧౬

		పుటలు
138.	సుమంత్రుఁడు మరల నయోధ్యకుఁబోవుట	౭౨౧
139.	సుమంత్రుని రథముంజూచి పౌరులు దుఃఖించుట	౭౨౨
140.	సుమంత్రుఁడు దశరథుఁజూచుట	౭౨౬
141.	దశరథుఁడు సుమంత్రుని శ్రీరామలక్ష్మణుల వృత్తాంతమడుగుట	౭౨౮
142.	సుమంత్రుఁడు దశరథునకు శ్రీరామ వాక్యములఁ దెలుపుట	౭౩౦
143.	సుమంత్రుఁడు దశరథునకు లక్ష్మణవాక్యంబులఁ దెలుపుట	౭౩౨
	శ్రీరామ వనవాసదిన విషయిక చర్చ	౭౩౮
144.	సుమంత్రుఁడు తాను వచ్చు మార్గమునఁజూచిన విశేషములు జెప్పుట	౭౩౯
145.	సుమంత్రుఁడు పౌరుల దుఃఖమును దశరథునకుఁజెప్పుట	౭౪౧
146.	సుమంత్రునితో దశరథుఁడు దన్ను శ్రీరాముఁడున్న చోటికిఁ దీసికొని పొమ్మని చెప్పుట	౭౪౨
147.	సుమంత్రుఁడు కౌసల్య నూరార్చుట	౭౪౮
148.	కౌసల్య దశరథునితో సతని దుశ్చేష్టగుఱించి చెప్పుకొని యేడ్చుట	౭౫౫
	శ్రాద్ధ నిమంత్రణ నిరూపణము	౭౫౮
149.	దశరథుఁడు కౌసల్యను క్షమింప వేఁడుట	౭౬౫
150.	దశరథుఁడు తాను జంపిన ముని బాలకు వృత్తాంతముఁ గౌసల్యకుఁ జెప్పుట	౭౭౨
151.	ఋషి తనపుత్రునకై విలపించుట	౭౮౯
	ఏకపత్నీవ్రత విచారము	౭౯౩
152.	ఋషి దశరథుని శపించుట	౭౯౬
153.	దశరథుఁడు మృతుఁడగుట	౮౦౨
154.	దశరథు మృతికై యంతఃపుర స్త్రీలేడ్చుట	౮౦౪
	సహగమన విషయము	౮౦౭
155.	అరాజకత్వ దోషవర్ణనము	౮౧౪
156.	మంత్రి, పురోహితులు భరతునకు దూతల నంపుట	౮౨౨
157.	భరతుఁడు దుస్స్వప్నముఁగని పరితపించుట	౮౨౫
	స్వప్న విషయము	౮౨౮
158.	రాజదూతలు భరతునితో సంభాషించుట	౮౩౦
159.	భరతుఁడయోధ్యకుఁ బ్రయాణంబగుట	౮౩౫

	పుటలు
160. భరతుఁడయోధ్యా దుస్థితికి వగచుట	౭౩౭
161. భరతుఁడు కైకేయి మేడకుఁబోవుట	౭౪౩
విధవా ధర్మములు	౭౪౪
162. కైకేయి భరతునకు దశరథుఁడు మరణించుటఁ దెలుపుట	౭౪౫
163. కైకేయి భరతునకు శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుఁట దెలుపుట	౭౫౧
164. భరతుఁడు కైకేయిని దూషించుట	౭౫౩
భరతుఁడు తల్లిని దూషించుట దోషముకాదా ?	౭౫౪
165. భరతుఁడు కౌసల్యఁ జూడఁబోవుట	౭౬౧
166. భరతుఁడు కౌసల్యతో శపథంబులు సేయుట	౭౬౪
శాస్త్రోల్లంఘన మొనర్చువాఁడు భగవదనుగ్రహ పాత్రుఁడు	
కాఁజాలఁడను విషయము	౭౬౯
సన్న్యాసము కలికాలమున నిషిద్ధమనుట	౭౭౧
167. కౌసల్య భరతు నూరార్చుట	౭౭౭
168. భరతుఁడు తండ్రి శవంబును జూచి యేడ్చుట	౭౮౦
169. భరతుఁడు దశరథున కుత్తరక్రియలు సలుపుట	౭౮౨
క్షత్రియుల కాశౌచము పదునాఱు దినములై యుండఁ	
బదినాళ్ళనుట యెట్లు ?	౭౮౪
సపిండీకరణ విషయము	౭౮౫
నివాపాదులు పూర్తికాఁగానే కర్తల శ్రేయస్సు కోరినవారు	
చెప్పవలసిన ఉపశాంతి వాక్యములు	౭౮౮
170. రాజకర్తలు భరతునిఁ బట్టాభిషేకము చేసికొనఁ బ్రార్థించుట	౮౦౫
171. పౌరులు వనమార్గంబును జక్కఁబఱుచుట	౮౦౭
172. వసిష్ఠుఁడు భరతునిఁ బట్టాభిషేకము చేసికొమ్మని చెప్పుట	౮౧౪
భరత పారతంత్ర్య నిరూపణము	౮౧౭
173. భరతుఁడు శ్రీరాముఁ దోడితేరఁ బ్రయాణమగుట	౮౨౩
174. గుహుఁడు భరతుని రాకఁగని సందేహించుట	౮౨౬
175. గుహుఁడు భరతునిఁ జూడవచ్చుట	౮౨౮
176. గుహుఁడు భరతునుద్దేశంబు సందేహించి యడుగుట	౮౩౧
177. గుహుఁడు భరతునకు లక్ష్మణ వృత్తాంతముఁ దెలుపుట	౮౩౯

		పుటలు
	గుహుని పలుకులువిని భరతుఁడు దుఃఖించుట	౯౪౩
178.	భరతుఁడు గుహుని సీతారాముల నిద్రాహార విషయంబు లడుగుట	౯౪౫
	భరద్వాజుం డిచ్చినదాని శ్రీరాముఁడెట్లు పరిగ్రహించెను ?	౯౪౬
	శ్రీరాముఁడు పరుండినస్థలమును గుహుఁడు భరతునకుఁ జూపుట	౯౪౮
179.	శ్రీరాముఁడు పరుండిన స్థలముఁజూచి భరతుఁడు పరితపించుట	౯౫౦
180.	భరతుఁడు గంగానది దాఁటుట	౯౫౬
181.	భరతుఁడు భరద్వాజ మహర్షిని సందర్శింపఁ బోవుట	౯౭౧
182.	భరద్వాజుఁడు భరతుని రాకకుఁ గారణ మడుగుట	౯౭౩
183.	భరద్వాజుఁడు భరతునకు విందుపెట్టుట	౯౭౯
184.	భరతుఁడు భరద్వాజర్షిని రామాశ్రమంబునకుఁ ద్రోవయడుగుట	౯౮౫
185.	భరతుఁడు భరద్వాజునకుఁ దనతల్లుల నెఱింగించుట	౯౮౬
186.	భరతుఁడు చిత్రకూటంబునకుఁ బ్రయాణమగుట	౯౯౦
187.	భరతుఁడు శత్రుఘ్నునకుఁ జిత్రకూట వనంబు వర్ణించిచెప్పుట	౯౯౩
	నివృత్తిమార్గ నిష్ఠా వివరణము	౯౯౬
188.	శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటంబున వినోదములఁ జూపుట	౯౯౮
	వనవాస విషయము, గృహస్థాశ్రమ ప్రాశస్త్యము	౧౦౦౩
189.	శ్రీరాముఁడు సీతకు మందాకినీ నది వర్ణించి చెప్పుట	౧౦౦౬
190.	లక్ష్మణుండు శ్రీరామునితో భరతుఁడు సేనలతో వచ్చుట దెలుపుట	౧౦౧౪
191.	భరతునిపైఁ గినిసిన లక్ష్మణుని శ్రీరాముఁడు శాంతిపఱచుట	౧౦౧౮
192.	భరతుఁడు పాదచారియై శ్రీరామాశ్రమంబు వెదకుట	౧౦౨౫
193.	భరతుండు రామాశ్రమంబుఁ జూచుట	౧౦౨౯
	శ్రీరాముఁ డౌపాసన మొనరించు విషయము	౧౦౩౩
194.	భరతుఁడు శ్రీరాముని దర్శించుట	౧౦౩౮
195.	శ్రీరాముఁడు భరతుని కుశలప్రశ్న సేయుట	౧౦౪౨
196.	శ్రీరాముఁడు కుశలప్రశ్నవ్యాజంబున భరతునకు ధర్మోపదేశము సేయుట	౧౦౪౪
197.	రామలక్ష్మణులు తండ్రికి నివాపము లిచ్చుట	౧౦౮౫
	పిండప్రదాన విషయిక చర్చ	౧౧౮౯

పుటలు

198. పౌరులు శ్రీరాముని పర్ణశాలకుఁ బోవుట ౧౦౯౨
199. కౌసల్య సుమిత్రకు శ్రీరామలక్ష్మణుల యేటినీటిరేవుఁ జూపి దుఃఖించుట ౧౦౯౫
200. కౌసల్యాదులు శ్రీరాముని జూచుట ౧౦౯౭
ఇత్వసంధిని గుఱించి
201. శ్రీరాముఁడు భరతునితో నీవు నిర్దోషివని చెప్పుట ౧౧౦౮
202. భరతుఁడు శ్రీరాముని రాజ్యముగ్రహింపఁ బ్రార్థించుట ౧౧౧౧
203. శ్రీరాముఁడు భరతునకు దుఃఖోపశాంతి వాక్యంబులు చెప్పుట ౧౧౧౫
204. భరతుఁడు శ్రీరామునితోఁ దన దుఃఖమునకుఁ గారణము చెప్పుట ౧౧౨౮
205. భరతుఁడు శ్రీరామునితో వనవాసంబతని కర్తృధర్మంబుగాదనుట ౧౧౩౨
గృహస్థాశ్రమ ప్రాశస్త్యము ౧౧౩౪
206. శ్రీరాముఁడు భరతునితో నతఁడు రాజగుట ధర్మమని చెప్పుట ౧౧౪౧
207. జాబాలి శ్రీరామునితో నాస్తికవాక్యములఁ జెప్పుట ౧౧౪౫
చార్వాకమతము ౧౧౫౧
208. శ్రీరాముఁడు జాబాలికి సత్యమవశ్యానుష్ఠేయమని బోధించుట ౧౧౫౮
209. జాబాలికి శ్రీరాముఁడు కర్మంబవశ్య కర్తవ్యంబని చెప్పుట ౧౧౬౭
210. జాబాలి శ్రీరామునితోఁ దన్ను క్షమింప వేడుట ౧౧౭౫
211. వశిష్ఠుఁడు శ్రీరామునితో జ్యేష్ఠుఁడు రాజ్యార్హుఁడని పూర్వరాజ వృత్తాంతముఁ జెప్పుట ౧౧౭౬
212. వసిష్ఠుఁడు శ్రీరాముని రాజ్యంబుఁ గొనుమని వేఁడుట ౧౧౯౨
213. శ్రీరాముఁడు వసిష్ఠునితో నాచార్యులకంటెఁ దల్లిదండ్రులు శ్రేష్ఠులని చెప్పుట ౧౧౯౬
214. శ్రీరాముఁడు వనవాసానంతరము రాజ్యంబుఁగొన నంగీకరించుట ౧౨౦౩
215. శ్రీరాముఁడు భరతుని సమాధానపఱుచుట ౧౨౦౯
216. శ్రీరాముఁడు భరతునకు దనపాదుక లొసంగుట ౧౨౧౦
217. భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణమయి భరద్వాజాశ్రమంబుఁజేరుట ౧౨౧౩
218. నిరానందయైన యయోధ్యాపురి వర్ణనము ౧౨౧౮
219. భరతుఁడు మరల నయోధ్యఁ బ్రవేశించుట ౧౨౨౧
220. భరతుఁడు నందిగ్రామముఁ జేరుట ౧౨౨౩

పుటలు

221. ఋషీశ్వరులు చిత్రకూటంబు విడిచిపోవుట ౧౨౩౨
వృద్ధఋషి తపఃకష్టంబుల శ్రీరామునితోఁ జెప్పుట ౧౨౩౩
222. సీతారామలక్ష్మణు లత్రిముని యాశ్రమంబుఁ జేరుట ౧౨౩౬
223. సీత కనసూయ హితోపదేశంబుఁ జేయుట ౧౨౪౦
224. సీత యనసూయ వాక్యంబులకు మోదించుట ౧౨౪౪
225. అనసూయ సీతాదేవి కంగరాగాదు లిచ్చుట ౧౨౪౭
226. సీత యనసూయకుఁ దన స్వయంవరము వృత్తాంతముఁ జెప్పుట ౧౨౪౮
227. అనసూయ సీతకు సాయంకాలము వర్ణించి చెప్పుట ౧౨౫౪
భూతపిశాచము లెవ్వరిని బాధించునను విషయము ౧౨౫౯

తాత్పర్యము

అన్న పాదములు కడిగి తడియొత్తిపోయి చెట్టుక్రింద లక్ష్మణుఁ డుండఁగా సుమంత్రునిగూడి గుహుఁడు శ్రీరాముని గుణాతిశయములను బ్రసంగించుచు నెక్కువ ప్రేమచే విల్లెక్కుపెట్టి ఱెప్పవ్రాల్పక నిద్రపోక శ్రీరామచంద్రుని రాత్రి యంతయు రక్షించుచుండెను.

కం. ధీమంతుండు యశస్వి ద, యామండనుఁడున్ మహాత్ముఁ ♦ డవిదితకష్టుం
డామహిపసుతుఁడు సుఖి యా, భూమిం బన్నుండ రేయి ♦ వోయెన్ మెల్లన్. ౧౩౧౯

ధీమంతుండు = సత్యవాక్య పరిపాలనము వ్రతముగ సాధింపవలయు నను బుద్ధిగలవాఁడు. యశస్వి=ఆకారణముచేతనే కీర్తిని సంపాదించినవాఁడు. దయామండనుఁడు = సర్వభూతదయమే యాభరణముగాఁ గలవాఁడు. మహాత్ముఁడు=గొప్ప మనస్సుగలవాఁడు. అవిదితకష్టుండు=కష్టమిట్టిదని యెఱుఁగనివాఁడు. (౧) సుఖమునే యనుభవించినవాఁడు (౨) సమచిత్తుఁడు. ద్వంద్వాతీతుఁ డగుటచే నిది సుఖమని యిది దుఃఖమని భేదము తెలియనివాఁడు. మహిపసుతుఁడు = రాజకుమారుఁడు. సుఖి=ఇతరులకుఁ గష్టములుగాఁ దోఁచినవికూడఁ దనకుసుఖముగానే యెంచువాఁడు. పన్నుండున్ = పండుకొని యుండఁగా, మెల్లన్=మెల్లగాఁబోయెను. వేగిరముపోయిన సఁదయమైన సీయన యడవులలోఁ గష్టపడవలసి వచ్చునే యని మెల్లగాఁ బోయెను.

తాత్పర్యము.

బుద్ధిమంతుఁడును-గీర్తిమంతుఁడును-గృపాభూషణుఁడును-మహాత్ముఁడును-గష్టమెఱుఁగనివాఁడును-నగు రాజకుమారుఁడు సుఖముగా నాభూమిమీఁదఁ బండుకొని యుండఁగా మెల్లగా రాత్రి గడచిపోయెను.

౫౧-వ సర్గము.

ఉ. అన్ననిమిత్తమై వగ య ♦ థార్థము మేల్కనియున్న లక్ష్మణున్
సన్నుతశీలుఁ గన్గొని భృ ♦ శం బగుశోకముతో గుహుండు నో
యన్న! త్వదర్థమై యదె శ ♦ యం బుపకల్పిత మయ్యె, దాన సౌ
ఖ్యోన్నతి నిద్రపొమ్ము శ్రమ ♦ మూడఁగ, నీ విటు లుండ నేటికిన్. ౧౩౨౦

వగయథార్థము=వాస్తవమైన దుఃఖము, యథార్థము మేల్కనియున్న=కుఱుకుపాటులేక-ఱెప్పవ్రాల్పక మేల్కని యుండెను, సన్నుతశీలున్= సజ్జనులచేతఁ బొగడఁబడిన నడవడి గలవానిని, భృశము = అధికము, త్వదర్థమై=నీనిమిత్తమై, శయంబు = పడక, ఉపకల్పితమయ్యెన్ = ఏర్పాటుకాఁబడెను. సౌఖ్యోన్నతిన్=సౌఖ్యాతిశయముచే.

తాత్పర్యము

అన్నయగు శ్రీరామచంద్రుని కొఱకు వంచసలేని దుఃఖము గలవాఁడై వంచనలేక మేలుకనియున్న, సాధువులచేఁ బొగడఁబడిన, నడవడి గలట్టి లక్ష్మణునిఁజూచి యధికమైన దుఃఖముతో గుహుండు అన్నా లక్ష్మణా నీనిమిత్తమై యిదిగోఁ బడుక యేర్పాటు కాఁబడినది. దానిపై యథాసుఖముగ నిదురింపుము. బడలిక తీరును. నీవేల యిటుల మేల్కని యుండవలెను.

ఉ. మానితరాజపుత్ర! సుకు • మారుఁడ వీ విట నున్నవారలో
  కానలయందఁ ద్రిమ్మరెడి • కర్కశదేహులు గాన జానకీ
  జానిని జాగరూకత ని•శాసమయంబున సప్రమత్తులై
  పూనికఁ గాచుచుండుదము • హామ్మ శయింపు యథాసుఖంబుగన్. ౧౩౨౧

నేను మేల్కొనక యున్న శ్రీరామున కేమైన నపాయమువచ్చిన నేమి చేయవలయు నందువేమో.

మానితరాజపుత్ర=గౌరవింపఁబడు రాజకుమారా. నీవు రాజపుత్రుఁడవగు కారణముచేతనే గౌరవింపఁబడఁ దగినవాఁడవు. అదియునుగాక సుకుమారుఁడవు. త్రిమ్మరెడి=తిరిగెడి, కర్కశదేహులు=ఎంతకష్టమైన నోరువఁగల కఠినదేహములు గలవారు, జానకీజానిని = జానకినిజాయ (భార్య)గాఁ గలవానిని, బహువ్రీహి సమాసాంతమున జాయ జానియగు. సు. వ్యా. సమా ౯౯ సూ. శ్రీరాముని, జాగరూకతన్ = హెచ్చరికతో, నిశాసమయంబునన్ = రాత్రికాలమందు. అప్రమత్తులై = ప్రమాదపడనివారై!

తాత్పర్యము

పూజ్యుఁడవైన రాజకుమారా! నీవు సుకుమారుఁడవు. ఇక్కడ నున్నవారో యడవులయందే తిరుగ నభ్యాసపడిన కఠినదేహులు. కావున శ్రీరాముని రాత్రి యంతయు హెచ్చరిక గలవారమై ప్రయత్నముతో గాచుచుండెదము. నీవు పోయి సుఖముగ శయనింపుము. శ్రీరామున కేమో యను భయములేదు.

ఉ. ఏమన రాము కంటెఁ బ్రియుఁ • డెవ్వఁడు నెందును లేఁడు నాకు, నీ
  భూమిని సత్య మిద్ది యన•పోహము సత్యము పైఁ బ్రమాణ మో
  సౌమహితాత్మ సత్కృపఁగ•దె మహనీయయశంబు గేవలం
  బౌమహితార్థమున్ విపులమైన • సుధర్మముఁ గందు నాయనా! ౧౩౨౨

మాయన్న నిమిత్తమై నీవింత శ్రమపడనేల యందువా? అనపోహము= అసత్యముగాదు. కేవలం బౌమహితార్థమున్=కేవలము గొప్ప ప్రయోజనము- మోక్షము.

తాత్పర్యము

శ్రీరాముని నిమిత్తమై నీకిశ్రమమేల? పండుకొమ్మనెదవా? విను. శ్రీరామునకంటె నెక్కువ ప్రీతిపాత్రుఁడు నాకెచ్చట నెవ్వఁడులేఁడు. ఆయన యందు నాకంతటి యనన్యభక్తికలదు. ఇది యపోహముగాదు. సత్యముపైఁ బ్రమాణముచేసి చెప్పెదను. ఈమహానుభావు దయచేఁగదా గొప్పకీర్తి యసమానమైన గొప్పప్రయోజనము విస్తారమైన ధర్మఫలము గానఁగలను. అట్టివానినే నుపేక్షింతునా?

ఉ. జ్ఞాతులు నేను నల్గడల • సజ్యశరాసనముల్ ధరించి సం
ప్రీతిగఁ గూర్కు మామకసు•హృత్తమునిన్ సహదారు నప్రమా
దాతతరీతిఁ గాతుఁ జతు•రంగబలంబు లెదిర్చె నేనియున్
ఖ్యాతిగ నాయెఱుంగని దొ•కండును లేదు వనాంతరంబునన్. ౧౩-౨౩

జ్ఞాతులు=బంధువులు, నల్గడలన్=నాలుగు దిక్కులందు, సజ్యశరాసనముల్=ఎక్కుపెట్టినవిండ్లు, మామక=నా, సుహృత్తమునిన్ = మిత్రులయందు శ్రేష్ఠుఁడగు వానిని, సహదారున్ = భార్యతోఁ గూడినవానిని, అప్రమాదాతతరీతన్=విస్తారమైన హెచ్చరికతో; కాతున్ = రక్షింతును, వనాంతరంబునన్ = అడవిలోపల.

తాత్పర్యము.

భార్యతోడ నిదురించు నాప్రియమిత్రుని నేను నాబంధువులు నెక్కిపెట్టిన విండ్లతో నాలుగు ప్రక్కల మిగుల హెచ్చరికతోఁ జతురంగబలములతో నెవఁడైన నెదిరించినను నిద్రాభంగము కాకుండ రక్షింపగలను. ఈ యరణ్యమునందు నాకుఁ దెలియనట్లెవ్వరును రాలేరు.

ఉ. జంకకుమన్న లక్ష్మణుఁడు • జాలి ననున్ గుహ లేదు భీతియేన్
శంకయు నేని ధర్మమతి • సర్వవిధంబుల నీవు గానఁగాఁ
బంకజనేత్రుఁ డైనరఘు • వరుఁడు సీతయు గొడ్డునేలపై
గొంకక పవ్వళింపఁగను • గూర్కఁగ నాకది యెట్లు సాధ్యమా? ౧౩-౨౪

జంకకుము=సందేహపడకుము, శంకాతద్భవము జంకు, జాలిన్=వ్యసనముతో,ధర్మమతిన్=ధర్మముతోఁగూడిన మనస్సుతో, గొడ్డునేలపై=ఆచ్ఛాదనములేని భూమిమీఁద, పవ్వళింపఁగను=పండుకొనఁగా, కూర్కఁగన్ = నిదురింపఁగా.

తాత్పర్యము

లక్ష్మణా! వీరు కావఁగలరోలేరో వీరినెట్లు నమ్మవచ్చునని సందేహింపకుము. అనిన గుహునితో లక్ష్మణుఁ డిట్లనియె. మిత్రమా నేను నిద్రపోక యుండుటకు శ్రీసీతారాముల కపాయమ మేదైనఁ గలుగునో యను భయము కారణముగాదు. నీవు రక్షింపలేవేమో యను సందేహముగాదు. ఏలయనఁగా నీవు భయముచేఁ

జేయవలసి వచ్చెనే యని చేయువాఁడవు గావు. భర్తృని ధర్మమనుసరించి శ్రద్ధతో నన్ని విధముల నీవు రక్షించుచున్నావు. రక్షింపగలవు. కాని కమలములవంటి నేత్రములుగల శ్రీరాముఁడును నట్టిదేయగు సీతయు నుత్తనేలమీఁద, నేకొతుకు లేక, పండుకొని యుండఁగా సుఖనిద్రమాట యటులుండనీ నేను కన్నుమూయు టకు నైన నాకు సాధ్యమా. నేనుమూయఁ బ్రయత్నించినను ఱెప్పలు మూఁతలు పడునా? అసాధ్యకార్యము నేనెట్లు చేయఁగలను?

—• { శ్రీరామవనవాసనిమిత్తక మైనదుఃఖమును లక్ష్మణుఁడు గుహునితోఁ జెప్పుట. } •—

ఉ. కంటికి నిద్రవచ్చునే, సుఃఖం బగునే బ్రదు కైన. మానసం
బంటునె భోగముల్, ప్రియహి•తా! దితిజామరకోటి నేనియున్
గెంటఁగ జాలు గంటుకొనఁ • గేలిగ నట్టిమహాత్ముఁ డిందు వా
ల్గంటియుఁ దాను జీర్ణతృణ•కల్పితశయ్యఁ బరుండి యుండఁగన్. ౧౩-౨౫

ప్రియహితా=మిక్కిలి ప్రీతిగల మిత్రుఁడా, దితిజామరకోటి=దైత్యులయు దేవతలయు సమూహములను, కంటుకొనన్=విరోధించెనేని, కేలిగన్ = ఆటపాట నవలీలగ, గెంటఁగఁజాలున్ = తఱుమఁగొట్టఁగలఁడు. వాల్గంటి=స్త్రీ; జీర్ణతృణ కల్పితశయ్యన్=చివికిన గడ్డిచే నేర్పఱిచిన పడుకమీఁద. పరుండి = పండుకొని.

తాత్పర్యము

ప్రియ మిత్రుఁడా! దేవదానవసంఘముల నైనను విరోధించెనేని యవ లీలగ నాటవలెఁ దఱుమఁగొట్టఁగల మహాసమర్థుఁడు తాను దన భార్యతోఁ జివికిన గడ్డిపడుకమీఁదఁ బండుకొనఁగా నాకెట్లు కంటికి నిద్రవచ్చును. బ్రదుకైన నెట్లు సుఖంబగును. భోగములు మనస్సునకైన రుచించునా?

చం. తపములఁ గ్లేశపాటున వెతం గని యొక్కని నాత్మతుల్యు నా
యపరిమిత ప్రతాపుని వ • నాంతరవీథులఁ ద్రోచి యాజి దాఁ
గృపణతఁ బెద్దకాలము మ • హిన్ మని యుండుట గల్ల; మిత్రమా!
విపుల యనాథ యై చెడెడు • వేగము సత్యము చూచు చుండుమీ. ౧౩-౨౬

తపములన్=ఉపవాసాది వ్రతములను, క్లేశపాటున=యజ్ఞాది శ్రమముల యొక్క, వెతన్=బాధచేత, ఆత్మతుల్యున్ = గుణములందుఁ దనతో సమానుని, ఒక్కని=ముఖ్యుని, అపరిమిత ప్రతాపుని = పరిమితిలేని ప్రతాపము గలవానిని, ఆజి=దశరథుఁడు, కృపణతన్=దీనత్వముచే, మని = బ్రదికి, కల్ల=అబద్ధము, విపుల=భూమి, అనాథయై=దిక్కులేనిదై.

తాత్పర్యము

ఉపవాసాది వ్రతములచేతను యాగాదులవలని వెతలచేతను, లేకలేక తన వంటివాని నొక్క కుమారుని, మితిచెప్పరాని పరాక్రమము గలవానిని, గాంచి

కడపట నతని నడవులపాలుచేసిన దశరథుఁడు దుఃఖమున దీనుఁడై చాలఁగా లము భూమిమీఁద బ్రతికియుండుట యసత్యము కావున భూమి దిక్కులేనిదై త్వరలోనే చెడును. నామాట సత్యము చూచుచుండుము.

కం. ఏడిచి యేడిచి హా యని చేడెలు గాసిల్లి సొమ్మ•సిలి పడ ధరపై
నేడుపురొద లేకా నృపు, వీ డెల్లను నుండుఁ గాదె•విగతధ్వనియై. ౧౩౨౭

విగతధ్వని = ధ్వనిలేనిది.

తాత్పర్యము

హాయని స్త్రీలందఱు నేడిచి యేడిచి గాసిపడి మూర్ఛపోయి భూమిమీఁదఁ బడఁగా నేడుపుధ్వనియైన లేక రాజగృహము పాడుపడినట్లు ధ్వనిలేకయుండును గదా.

కం. వనితామణి కౌసల్యయు, జననాథాగ్రణియు నాదు•జననియు నీరే
యినిసైన నెల్లవారును, మని యుండుదురా యటంచు • మది శంకింతున్.

తాత్పర్యము

వనితారత్నమైన కౌసల్యయు రాజు, నాతల్లి తక్కినవారీరాత్రియైన బ్రతికియుందురా యని నేను సందేహించుచున్నాను.

కం. మనిన మనవచ్చుఁ జుమి నా,జనయిత్రి మనంబు నిల్పి•శత్రుఘ్నునిపై
మన నేర దనుచు వగచెద,జనసుత వీరసువు రాము•జనని క్షణంబున్. ౧౩౨౯

తాత్పర్యము

శత్రుఘ్నుని మీఁది ప్రేమచే నతఁడెన నున్నాఁడుకదా యని నాతల్లి సుమిత్రాదేవి బ్రదికిన బ్రదుకు నేమోకాని వీరునిగన్న తల్లియని ప్రసిద్ధిగన్న కౌసల్యాదేవి యొక క్షణమైన నిఁక జీవింపదని దుఃఖించెదను.

కం. అనురక్తజనాకీర్ణయు, ననఘజనసుఖావలోక • నాహ్లాదద యా
ఘననగరి రాజుఁగూల్చె వ్య,సనసంకులయగుచుఁజెడును•సత్యము హితుఁడా.

తాత్పర్యము ౧౩౩౦

అనురక్త జనాకీర్ణయు = అనురాగముగల జనులచే, సర్వత్రనిండినది. అనఘ=జన = దోషరహితులైన జనులకు, సుఖావలోక నాహ్లాదద = సుఖమైన చూపులకు సంతోషము నిచ్చునది. ఘననగరి=గొప్ప పట్టణము. వ్యసన సంకుల = వ్యసనములచేఁ గలఁతనొందినది.

తాత్పర్యము.

అనురాగముగల జనులచే నిండినదియుఁ బుణ్యాత్ములైన జనుల సుఖకరములైన చూపులకు సంతోషము కలిగించునదియు నగు పెద్దపట్టణము రాజు మరణించిన కారణమున, వ్యసనముచేఁ గలఁత చెంది చెడుట సత్యము.

ఆ. తనదుపెద్దకొడుకు • జనసుతచారిత్రుఁ, బ్రియు మహానుభావు•నయగుణాఢ్యు
రాము సౌకుమార్య•ధాముఁ జూడక రాజు, మేనితోడ నెట్లు•మెలఁగువాఁడు

తా త్ప ర్య ము ౧౩౩౧

రాజమరణము నిశ్చయించి యింతపట్టుగఁ జెప్పెదవే. అదియెట్టు లందు వేని వినుము. జ్యేష్ఠకుమారుఁడు లోకులందఱిచేత శ్లాఘింపఁబడిన నడవడి గల వాఁడు. నీతిగుణ సంపద గలవాఁడు. సుకుమారత్వమునకు స్థానమైనవాఁడు నగు శ్రీరాముని జూడక రాజు దేహము ధరించి యెట్లు తిరుగఁగలఁడు. కావున నాయన చచ్చుటయే సిద్ధము. నిరపరాధిని నిష్కారణముగఁ బెద్దకొడుకును నడవులపాలుచేసి పుత్రశోకముచేతను బాపబలముచేతను జావక బ్రదికెనేని యంత కఠినచిత్తుఁడు నంతటి మహాపాపి మఱియొకఁ డుండఁడు.

కం. పతి నృపతి గతించుట గని, సతి యగుకౌసల్య బిద్దు•సత్వరముగ, నా
సతిగతిఁ గని నాజనని యుఁ, బతితోడిద లోక మనుచుఁ•బ్రాణము విడుచున్.

తా త్ప ర్య ము ౧౩౩౨

రాజు మరణించుటచూచి పతివ్రతయగు కౌసల్యయుఁ ద్వరగానే చచ్చును. కౌసల్య మరణించుట చూచి నాతల్లియుఁ బతిలోకమే తనకని ప్రాణము వదలును.

శా. మించెన్ మించె గతించె సర్వమును భూ•మీనాథుఁ డీరాముఁ దా
నెంచెన్ రాజుగఁ జేయఁ, జేయకయ ము•న్నే యీల్గు, నన్నేళఁ దా
మలచుం జేరి భజించి యానృపతిని•ర్యాణంబునం బైతృకో
దంచత్కార్యము లెల్లఁ దీర్చెదరు సి•ద్ధార్థుల్ తనూసంభవుల్. ౧౩౩౩

ఈల్గున్ = చచ్చును, అంచున్ = సమీపమందు, నిర్యాణంబునన్ = మరణంబున, పైతృకోదంచత్కార్యములు = చచ్చినవారికిఁ జేయవలసిన యూర్ధ్వదైహిక క్రియలు, సిద్ధార్థుల్ = కృతార్థులు, తనూసంభవుల్ = కొడుకులు భరతశత్రుఘ్నులు.

తా త్ప ర్య ము.

సర్వము మించిపోయెను. ఇప్పుడు చేయఁదగిన దేదియులేదు. ఏమి మించినదందువా. రాజు శ్రీరాముని రాజుగఁ జేయనెంచెను. అట్లు చేయుటకు ముందే చచ్చును. రాజు మరణించిన సమయమున భరతశత్రుఘ్నులు సమీపమున నుండి కొడుకులు చేయవలసిన యూర్ధ్వలోక క్రియలు దీర్చి కృతార్థులయ్యెదరు. మాకా భాగ్యముకూడ లేదు.

సీ. అక్కటా తండ్రికి • నౌర్ధ్వదైహికముల, భరతశత్రుఘ్నులు•పరఁగఁ దీర్చి
రమ్యచత్వరముల•రమణీయపథములఁ, బ్రాసాదహర్మ్యాది•భవనములను
వారముఖ్యల రథ•వారణవాజుల, నవ్యతౌర్య త్రిక•నాదములను
హృష్టపుష్టప్రజా•బృందంబులను సర్వ,కళ్యాణసంపూర్ణ•కలనములను

తే. నిష్కుటారామచయములు•నిత్యవరస, మాజమహములనొప్పుపే•రోజ నాదు
తండ్రి యేలెడియారాజ•ధానియందు, సంచరింతురు వారలు•సమ్మదమున. ౧౩౩౪

అక్కటా = అయ్యో! ఔర్ధ్వదైహికములన్ = మరణించినవారి కూర్ధ్వ లోకముల సుఖము కలుగుటకై చేయు పితృకార్యములు, రమ్యచత్వరములన్= మనోహరములైన ముంగిళ్లచేతను రమణీయ పథములన్ = అందమైన బాటల చేతను ప్రాసాద=దేవాలయములు, రాజులయిండ్లు, హర్మ్య=ధనికుల యిండ్లు. "హర్మ్యాదిర్ధనినాంవాసః ప్రాసాదో దేవభూభుజా"మ్మని యమరుఁడు. వార ముఖ్యల=వారస్త్రీలయందు ముఖ్యలగు వారియొక్కయు, తృతీయాసప్తము లకుఁ బ్రాయికంబుగ జడంబునకు ద్వితీయ బహుళంబుగనగు. సు.వ్యా.కారక. ౭౧ సూ. నామైకదేశే నామగ్రహణమ్మని వారస్త్రీ వార యని చెప్పఁబడియె. ఇట్లులే సత్యభామను భామయని కాని సత్యయని కాని భీమసేనుని భీముఁడని ప్రయోగములు కలవు. నవ్యతౌర్యత్రిక నాదముల=మనోహరములగు నృత్త గీత వాద్యముల యొక్కయు, ఈ మూఁటికిఁ దౌర్యత్రికమనిపేరు. హృష్టపుష్ట ప్రజాబృందములన్ = సంతోషముతోడి పుష్టిగల జనుల సమూహములచేతను, సర్వకల్యాణ సంపూర్ణ కలనములను = పుత్రజన్మాదులగు శుభకార్యముల యొక్కయుఁ బూర్ణముగ నిండియుండుటను, నిష్కుటారామ చయముల = ఇంటికిఁజేరిన తోఁటల సమూహములచేతను, నిత్యవరసమాజ మహములన్ = ఎడఁదెగక జరగు గొప్ప సభలయుత్సవములచేతను, పేరోజన్=గొప్ప కాంతిచే.

తా త్ప ర్య ము.

అయ్యో తండ్రికి నూర్ధ్వలోకక్రియలుదీర్చి భరతశత్రుఘ్నులు నందము లైన ముంగిళ్లచేతను మనోహరములైన బాటలచేతను ప్రాసాదములు హర్మ్య ములు మొదలైన యిండ్లచేతను నుత్తమ వేశ్యలచేతను రథములు నేనుఁగులు గుఱ్ఱములు వీనిచేతను శ్రవ్యములైన నృత్యగీత వాద్యములను మూఁడు విధ ములైన వాద్యధ్వనులచేతను సంతోషించినట్టియుఁ బుష్టిగలట్టియు జనుల సమూహముచేతను, అన్నివిధములైన శుభకార్యములు పూర్ణముగాఁ గూడి యుండుటచేతను, ఇండ్లకుజేరిన తోఁటల గుంపులచేతను, ఎల్లప్పుడు జరగు గొప్ప సభలయుత్సవములచేతను నొప్పు గొప్పకాంతిచే నాతండ్రియేలు రాజ ధానియందు సంతోషముతో సంచరింతురు.

ఉ. అంతకు జీవయుక్తుఁడయి•యాజి వెలుంగుచునుండి మేము ని
శ్చింత మరణ్యవాసమును•జేసి ప్రతిజ్ఞను దీర్చి యాపయిన్
గాంతుమొకో యయోధ్య, మఱి•గాదిలితండ్రిపదాబ్జ మెయ్యెద
ర్శింతుమొ మిత్రమా! యనుచుఁ•జెప్పుచునుండ గతించెరేయియున్. ౧౩౩౫

అంతకున్=అంతవఱకు, మేము మరలివచ్చువఱకు జీవయుక్తుఁడు=ప్రాణముతో నుండువాఁడు, నిశ్చింతము = ఏచింతలేక, నిశ్చింతము అవ్యయీభావ సమాసము, గాదిలి=ప్రీతిగల. ఇంతవఱకు నూరువిడిచిన రెండవనాఁటి చరిత్రము.

తాత్పర్యము

మే మరణ్యవాసమునుండి మరలి వచ్చువఱకు దశరథుఁడు జీవించియుండెనేని మేము కాననవాసము ముగించి ప్రతిజ్ఞ దీర్చి యామీఁద నయోధ్యచూడఁగలమా. తండ్రి పాదకమలములను దర్శింపఁగలమా, మేము ప్రతిజ్ఞ దీర్చినను దండ్రి జీవించి యుండఁడేని యయోధ్యయందు మాకేమి కార్యము అప్పటికి మరలఁ బోనేల యని చెప్పుచుండఁగనే రాత్రి గడచిపోయెను.

కం. గురుసౌహృదమున లక్ష్మణుఁ, డురుశోకమునం దపించు • చుండఁగ గుహుఁడున్
బరమార్తిఁగార్చె నశ్రులు, జ్వరపీడిత మగుమతంగ • జంబును బోలెన్. ౧౩౬

గురు సౌహృదమునన్=అన్న తండ్రి వీరియందలి స్నేహభావముచే. మతంగజంబును=ఏనుఁగును.

తాత్పర్యము

అన్నయందలి తండ్రియందలి స్నేహభావముచే లక్ష్మణుఁ డధిక శోకమునఁ బరితాప పడుచుండఁగా నిట్టివారి కిట్టిదశ వచ్చెఁగదా యని గుహుఁడును నధిక దుఃఖముచే జ్వరబాధపడు నేనుఁగువలెఁ గన్నీరు కార్చెను.

—• ౫౨-వ సర్గము. శ్రీరాముఁడు గంగను దాఁటఁ బ్రయత్నించుట. •—

ఉ. లాలితమూర్తి లేచి శుభ • లక్షణు లక్ష్మణుఁ జూచి తమ్ముఁడా
యోలి గతించె రేయి యరు • ణోదయవేళయు డాసె వింటి వే
మేలికలస్వనంబులను • మేల్కొలిపెం బికకేకిలోక ప
్రత్యాళి, దరింపఁగాఁ జనుద • మాపడిఁ బొఱడిజాహ్నవీనదిన్. ౧౩౭

లాలితమూర్తి=ఇంతగాసిపడినను అందమైన యాకారముగల శ్రీరాముఁడు. ఓలి=క్రమముగా, అరుణోదయవేళయు=సూర్యోదయమగు సమయము. డాసెన్=సమీపించెను. మేలికల స్వనంబులను=మేలైన యవ్యక్తమధుర ధ్వనులచే, పికకేకి లోకప్రత్యాళి=కోవిలలు, నెమిళ్లు వీని సమూహము, పక్షిసంపు, తరింపఁగాన్=దాఁటఁగా, జాహ్నవీనదిన్=గంగానదిని.

తాత్పర్యము.

దేహకష్టము మనోవ్యథ రెంటిచేతను బీడింపఁబడినను ముఖవర్చస్సు మాఱని శ్రీరాముఁడు నంతటి గాసిపడియు ముఖప్రసన్నతను వదలక శుభచిహ్నములే గానఁజేయి లక్ష్మణుఁజూచి తమ్ముఁడా రాత్రి క్రమముగాఁ గడచిపోయెను. సూర్యోదయవేళ కావచ్చినది. కోకిలలు నెమిళ్లు లోనగు పక్షులు అవ్యక్త మనోహర

ధ్వనులచే లోకులను మేలుకొలుపుచున్నవి. వేగముగఁ బాఱుచున్న గంగానదిని దాఁటఁ బోవుదమా.

చం. అనుడు సుమంత్రునిన్ గుహుని • నాతఁడు మీరలు వింటిరే కదా
యనఘుని దేశమంచుఁ దన • యన్నకడన్ నిలువన్, గుహుండు చ
య్యనఁ దనమంత్రులం బిలిచి • యంద అరిత్రచయాదియుక్తనా
వను సమకట్టుఁడీ దృఢము • వర్ణ్యము నావికవంతమున్ వెసన్ ౧౩౩౮

నిదేశము=ఆజ్ఞ, అరిత్రచయాదియుక్తనావను=తెడ్డుకట్టెలగుంపులు మొదలైన వానితోఁగూడిన యోడను, దృఢము=గట్టిగానుండునది, వర్ణ్యము=మెచ్చుకొనఁదగినదానిని, నావికవంతము=ఓడనడపెడివారిని గలది, వెసన్=శీఘ్రముగా-

తాత్పర్యము

శ్రీరాముఁడా ప్రకారము చెప్పఁగా లక్ష్మణుఁడు గుహుని సుమంత్రునిఁజూచి యీపుణ్యాత్మునియాజ్ఞ మీరు విన్నారుకదా. కావలసిన కార్యము కానిండనిన గుహుఁడును దనమంత్రులఁబిలిచి మీరందఱు శీఘ్రముగఁ దెడ్లు కట్టెలు మున్నగు నోడనడపు సామానులు గలట్టియు గట్టిగానుండునట్టియు రంగులుపూసి శ్లాఘ్యమైనదియు నోడనడుపువారు సిద్ధముగాఁగలదియు నగు నావను సిద్ధపఱుపుఁడు.

చం. అనవుడు వారు గూర్చి తెలి • యంబఱుపం దము నేలువానికిన్
వినయముతోడ మ్రొక్కి రఘు • వీరునకున్ గుహుఁ డాడు దేవ! నా
వను సమకట్టు టయ్యెఁ బిద • పం బని యెయ్యది? గంగ దాఁటఁగాఁ
జను నిఁక దీన నన్న రఘు • సత్తముఁ డెంతయు సంతసిల్లుచున్. ౧౩౩౯

సమకట్టుటయ్యెన్=సిద్ధము చేయఁబడియె. ఇది మూఁడవనాఁటి చరిత్రము.

తాత్పర్యము

గుహుఁ డీప్రకారము చెప్పఁగా వారంద అట్లుచేసి తమప్రభువగు గుహునకుఁ దెలుపఁగా గుహుఁడును శ్రీరామునకు వినయముతో నమస్కరించి యిట్లనియె. దేవా నావసిద్ధమయ్యెను. అవల దేనిని జేయుమని యాజ్ఞ. ఇఁకగంగ దాఁటవచ్చునని శ్రీరాముఁడును సంతోషించినవాఁడై.

కం. కృతకాముఁడ నైతిని నా, హితుఁడా! యీవస్తుతతుల • నెక్కింపుము నా
నతఁ డట్ల చేయ వీరులు, ధృతఖడ్గకలాపచాప • దీపితతనులై. ౧౩౪౦

కృతకాముఁడను = నెఱవేర్పఁబడిన కోరికగలవాఁడను, ధృతఖడ్గకలాపచాపదీపితతనులై =ధరింపఁబడిన కత్తులు, పొదులు, విండ్లు వీనిచేఁ బ్రకాశించు దేహములు గలవారై -

తాత్పర్యము

శ్రీరాముఁడు గుహునితో నిట్లనియె. నామేలుకోరు మిత్రమా! నాకోరిక నెఱవేఱెను. గంపగడ్డపాఱ చీరలు మొదలగు వస్తువుల నన్నిటిని నోడపై నెక్కిం

పుము. అని పతఁడట్లుచేయ శ్రీరామలక్ష్మణులు కత్తులు నమ్ములపొదులు-విండ్లు దేహమున ధరించినవారై-

కం. రాముఁడును లక్ష్మణుఁడు సీ, తామహిళాయుక్తిగంగఁ • డాయఁగఁ గని నా
కేమి సెల వింకఁ జెపుమా, ప్రేమంబున ననుసుమంత్రుఁ • బ్రియమునఁ
గనుచున్. ౧౩౪౧

సీతామహిళాయుక్తిన్ = సీతాదేవితో, డాయఁగన్ = సమీపింపఁగా, సెలవు = ఆజ్ఞ.

తాత్పర్యము

సీతాదేవితోడ శ్రీరామలక్ష్మణులు గంగసమీపమునకుఁ బోఁగాఁ జూచి సుమంత్రుఁడు నాకేమియిఁకనాజ్ఞయని ప్రేమతో నడుగఁగా నతనిఁ బ్రీతితోఁ జూచుచు.

చం. తనకుడికేల నాతని య • థామతి నంటి సుమంత్ర! యింక వే
చనుము నృపాలుపాలికిని • జాగరితృత్వముఁ బాయఁ బోకుమీ
చనుదుము కాల్నడన్ వనికి • స్యందనమున్ విడి, మద్వివాసనా
ర్తిని గడుగ్రుక్కుతండ్రిని న • తిస్థిరభక్తిని గాచి యుండుమీ. ౧౩౪౨

యథామతిన్=మనసార, వే=త్వరగా, జాగరితృత్వము=హెచ్చరిక,స్యందనము=తేరు, మద్వివాసనార్తిని=నావియోగదుఃఖమును.

తాత్పర్యము

తనకుడిచేత నాతని భుజముపైఁ జేయివైచి మనసారఁ దాఁకి సుమంత్రా! యింక నీవు త్వరగారాజునొద్దకుఁ బొమ్ము. హెచ్చరిక వదలకుము. మేము రథము విడిచి నడచి యడవికిఁ బోయెదము. నేను దమ్ము విడిచిపోయితినన్న దుఃఖముచే మిగుల శోషించు తండ్రిని మునుపటికంటె మిక్కిలి స్థిరమైన భక్తిని గాచి యుండుము.

కం. ఇందాఁక మమ్ముఁ గూర్మిని, స్యందనమునఁ దెచ్చి మేలు • సలిపితి కడు నా
సందించితి నిఁకఁ బురికిం, బొందుగఁ జనుమా శతాంగ • ముం గొని సరగన్.

కూర్మిని=ప్రేమచే, స్యందనమునన్=తేరియందు, శతాంగమున్ = తేరిని, సరగన్=శీఘ్రముగ, ఇంత + దనుకన్=ఇందాఁక.

తాత్పర్యము

ఇంతవఱకుఁ బ్రేమతో రథముపై దెచ్చి మాకెంతో యుపకారము చేసితివి, చాలసంతోషించితిని, ఇఁక నీవు జాగుచేయక తేరిని దీసికొని యూరికిఁ బొమ్ము.

—• { సుమంత్రుఁడు తన్నరణ్యమునకుఁ దోడ్కొని పోవ శ్రీరాముని వేఁడుకొనుట. } •—

చం. అన విని నాతఁ డిట్టు లను • నక్కట లోకములోన నొక్కఁడేన్
దనమది సమ్మతింపఁడు గ•దా భవదీయవనీనివాసమున్
మనమున బ్రహ్మచర్యమును • మార్దవ మార్జవవేదపాఠముల్
గనుఁగొనువాఁడ నిష్ఫలమ•కా నిఁక నీ వరుగంగఁ గానకున్.　　౧౩౪౪

భవదీయవనీనివాసమున్ = నీవరణ్యమున వసించుటను, మార్దవము = మెత్తనితనము ఆర్జవము=ఋజుత్వము, వేదపాఠముల్ = వేదాధ్యయనము, నిష్ఫలమకా=ఫలము లేనిదేయని.

తా త్ప ర్య ము

అని శ్రీరాముఁడు చెప్పఁగా విని సుమంత్రుఁ డిట్లనియె. రామచంద్రా! నీవరణ్యమునకుఁ బోవుటను సమ్మతించినవాఁడు లోకమున నొక్కఁడైన లేఁడుగదా అట్లుండియు నీవిటు లడవులకుఁ బోవలసినట్టు లేర్పడుట చూడఁగా బ్రహ్మచర్య వ్రతము, మెత్తనితనము,వంచనలేమి వేదాధ్యయనములివియన్నియు శ్రమము పడుటకై సాధింపవలసినవేకాని వానివలనఁ బ్రయోజనము లేదని తలఁచు చున్నాను.

భాగ్యవంతం ప్రసూయేథా మాశూరం మాచపండితమ్।
శూరాశ్చ కృతవిద్యాశ్చ మమపుత్రా వసంగతాః॥

క్రొత్త పెండ్లికూఁతురు ద్రౌపది యత్తగారికి నమస్కరింపఁగాఁ గల్యాణీ నీవు భాగ్యవంతుని గుమారునిఁ గనుము అనఁగా నేనుక్షత్రియకన్యను వైశ్య కన్యకను దీవించునట్లు దీవించెదవేల యందు వేని శూరులుపండితులైన నాకొడుకు లరణ్యములపాలయిరి. అదృష్టవంతులైన దుర్యోధనాదులు రాజ్యసుఖ మనుభ వించుచున్నారు. అను కుంతీవాక్యము స్మరించునది.

కం. ప్రాకృతులట్టులు వనమున, నీకరణిన్ నీవు తమ్ముఁ•డిల్లాలును దుః
ఖాకులుల రగుట భువి న, వ్యాకులుఁడై కడచి బ్రదుకు•వాఁడెవ్వఁ డొకో.
౧౩౪౫

ప్రాకృతులట్టులు=సామాన్యజనులవలె, దుఃఖాకులులరు = దుఃఖముచేఁ గలఁత నొందినవారు, అవ్యాకులుఁడై=విచారముచే మనసుచెదరనివాఁడై, కడచి = అతిక్రమించి-

తా త్ప ర్య ము

సామాన్య క్షుద్రజంతువులవలె నీవు నీకంటెఁ జిన్నవాఁడు నీతమ్ముఁడు అంతకంటెఁ జిన్నది ఆఁడుపిల్ల నీభార్య యాప్రకారము దుఃఖముచేఁ గలఁత చెందుటచూడ విచారములేక కాలముకడచి జీవించువాఁడును లోకమునఁగలఁడా.

ఉ. తమ్ముఁడు భార్యయుం గొలువ • దండక నీవు వసించి మూఁడులో
కమ్ములు గెల్చినంతప్రథఁ గాంతు మహాత్మక! నీవు మమ్ము ఛ
ద్మమ్మున నిట్లు గూల్చితి గ•దా! యెటు లేగి దురాత్మురాలు పా
పమ్ముల కిక్క కైకవశ•పాటున నుందుము దుఃఖ మందుచున్. ౧౩౪౬

ప్రథ=కీర్తి, ఛద్మమ్మునన్=వంచనచేత, కూల్చితి=చంపితివి, ఇక్క=స్థానము, వశపాటున=వశపడి యుండుటచే-

తాత్పర్యము

తమ్ముఁడు భార్య సేవింపఁగా నీవు దండకలో వసించి మూఁడు లోకమ్ములు గెలిచినంత కీర్తిని సంపాదింపఁగలవు. మహాత్మా! నీ కేలోటునులేదుగాని పాపాత్మురాలగు కైకచేసిన మోసముచాలక యింకను శ్రీరాముఁడు రాజగును రామరాజ్యమున నింతకంటె విశేషముగ సుఖింతుమని కొండంతయాశతో నీ ప్రభుత్వమున కెదురుచూచు మమ్మందఱను నిమిషములో మోసగించి మాయాశ వ్యర్థముచేసి యిటువచ్చితివిగదా. ఇఁక నాకిఁక నెట్లుపోదును. పోయితినిబో చెడుమనసుగలిగి పాపములకు స్థానమైన కైకకులోపడి కష్టములుపడుచు నెట్లు జీవింతుము. (ప్రజల పక్షమున సుమంత్రుఁడు చెప్పుమాట-ఇచ్చట మోసమను నది నిద్రించు ప్రజల విషయమై వర్తించినవిధమనియైనఁ జెప్పవచ్చును.)

చం. అని తన ప్రాణతుల్యుఁ డగు•నామహనీయునిఁ గూర్చి బిగ్గ రో
దన మొనరించి హా యనుచు • ధారగ నశ్రులు గాఱఁ గొంతకుం
బనిమెయి నిబ్బరించుకొని • మార్జనముం బొనరింప నీట న
య్యనఘునిఁ గాంచి రామవిభుఁ • డాదట నెయ్యము మీఱ నిట్లనున్. ౧౩౪౭

ప్రాణతుల్యుఁడు=ప్రాణముతో సమానమైనవాఁడు, అంతటి ప్రియుఁడు=విడువరానివాఁడు, మార్జనము=కడుగుట, ఆదటన్ = ప్రీతితో, నెయ్యము = స్నేహము కన్నీరు అపరిశుద్ధము. దాఁకరానిది, దానిని దాఁకినపుడు నీటఁ గన్నులు దుడుచుకొని చేయికడుగుకొని యాచమింపవలయునని శాస్త్రము కావున నిచటఁ గన్నులు కడుగుకొనుట యాచమించుట కుపలక్షణము.

తాత్పర్యము

ఈ ప్రకారముచెప్పి యావలఁ బలుకలేక తన ప్రాణములతో సమానమై ప్రియమై విడువరానివాఁడగు నామహాత్ము నుద్దేశించి గట్టిగ హా యని కన్నీరు గాఱుచుండ నేడ్చి కొంతసేపటికిఁ బ్రయత్నముచే నిబ్బరించుకొని కన్నులు కడుగుకొనఁగా నిర్దోషియయి భక్తుఁడగు నతనిఁజూచి శ్రీరామచంద్రవిభుఁడు ప్రేమతో స్నేహాతిశయమున నిట్లనియె.

— శ్రీరాముఁడు సుమంత్రుని సమాధాన పఱుచుట. —

కం. అయ్యా! నినుఁ బోలినకడు, నెయ్యుఁడు రఘువులకు నెందు♦నేఁ గలఁడే, మా
యయ్య యెటు గుంద కుండునొ, యయ్యనువు ఘటింప నీక♦యగునుహి
తాత్మా. ౧౩౪౮

కడునెయ్యుఁడు=మిక్కిలి స్నేహముగలవాఁడు-రఘువులకు=రఘువంశ రాజులకు=వంశమువారను నర్థమున బహువచనము, హితాత్మా = మేలుగోరు మనస్సు గలవాఁడా-

తా త్ప ర్య ము.

అయ్యా! నీవంటి మిక్కిలి స్నేహముగలుగువాఁడు రఘువంశ రాజులకు నెందైన లభించునా? కావున మా మేలుగోరు మనస్సుకలవాఁడనగుటచే మాతండ్రి యెట్లు వ్యసనపడకుండునో యాయుపాయము చేయుటకు నీవే తగినవాడవు.

ఉ. ఇంతగఁ జెప్పఁగా వలసె ♦ వృద్ధు మదీయవియోగదుఃఖిత
స్వాంతుఁడు కామభారచలి♦తాత్ముఁడు గావుటఁ జేసి, యాధరా
కాంతుఁడు కైక ప్రీతి కయి ♦ కార్యము నెయ్యది చెప్ప దాని నా
వంతఁ దిరస్కరింప వల ♦ దయ్య ఘటింతువు గాక ప్రీతితోన్. ౧౩౪౯

వృద్ధు=ముసలివాఁడు- రూ. వృద్ధుఁడు-నిచమూర్ఖధూర్త- వృద్ధగృహస్థ భ్రష్టచార్వాక శబ్దంబులకు ఉత్తగు డుజ్ విభాషనగు- సు.వ్యా. తత్స.౨౦ సూ. మదీయ వియోగదుఃఖితస్వాంతుఁడు=నన్ను నెడఁబాసిన దుఃఖముగల మనస్సు గలవాఁడు-కామభారచలితాత్ముఁడు=కామాతిశయముచే స్వస్థచిత్తము లేనివాఁడు-కావుటఁజేసి=అయినకారణమున-ధరాకాంతుఁడు=రాజు- ఆవంత=కొంచెమైనను-

తా త్ప ర్య ము.

ఓమి శ్రీరామచంద్రా: నీతండ్రి ప్రభువు. ఆయన మమ్ముఁగాపాడుచు రావలయును. ఆయనను మేము గాపాడవలయును విపరీతములు చెప్పెదవేమి యందువేమో ఆయనవిషయము నీకింతదూరము చెప్పవలసివచ్చిన కారణము చెప్పెద వినుము. ఆయన ముసలివాఁడు చపలచిత్తుఁడగుటకు నాయొక కారణమే చాలును. దానిపై నన్నెడఁబాసిన దుఃఖముచేఁ జీకాకుపడిన మనస్సుగలవాఁడు. దానికిఁదోడు కామాతిశయముచే స్వాధీనముతప్పిన మనస్సుగలవాఁడు. ఇట్టివాని స్థితియెంతపరాధీనమో నీవేయాలోచింపుము. ఆకారణముచే రాజు కైకసంతోషము నకై యేపని చెప్పినను దానినిగొంచెమైనను నిరాకరింపక ప్రీతితోఁ జేయుచుండుము.

తే. ఏతదర్థంబ గా దొకో ♦ నృపతివరులు, రాజ్యపరిపాలనము సేత ♦ రాగసంచ
నెట్టిపనియందు నేఁ దమ♦పట్టినట్టి, పట్టు సాధింపఁ జూచెద♦రెట్టు లైన. ౧౩౫౦

ఏతదర్థంబ=ఈనిమిత్తమే.

తాత్పర్యము

రాజులు రాజ్యపరిపాలనమున కాసక్తులగుటకుఁ గారణమిదియేకదా. ఏదందువేమో యేపనియందైనను నదియల్పమైనను గొప్పదైనను దప్పైనను ఒప్పైనను న్యాయరీతినో యన్యాయరీతినో తాముపట్టినట్టే సాధింపఁ జూచెదరు.

ఆ. ఎట్టులైన నతని • కేయప్రియంబును, నుదిలిపాటు లేక • యుండునట్టు
లప్రమాదవృత్తి•నరయుచు నుండుమా, యదియ నాదుకోర్కి•యనఘశీల. ౧౩౫౧

ఉదిలిపాటు = పరితాపము, అప్రమాదవృత్తిన్ = హెచ్చరికతోఁ గూడిన వ్యాపారముచే, అనఘశీల=పుణ్యచరిత్రా:

తాత్పర్యము

ఏవిధముగనైన నతని కప్రియంబును బరితాపము కలుగక యుండునట్లు హెచ్చరికతో నీవు విచారించుకొనుచుండుము- పుణ్యశీలా-నిన్ను నేను గోరునది యిదియె-

కం. అద్ధరణీశుఁడు మిక్కిలి, వృద్ధుండును నార్యశీలుఁ • డెఱుఁగఁడు దుఃఖం
బిద్ధజితేంద్రియుఁ డతనికి, శ్రద్ధగ నామాట సలిపి• సాష్టాంగనతుల్. ౧౩౫౨

అద్ధరణీశుఁడు=ఆధరణీశుఁడు- ఆరాజు. త్రికంబునకు నసంయుక్తంబులును బుకారంబును సూష్మరేఫేతరంబులు నైన హల్లులు పరంబులైనపుడు వానికి ద్విత్వంబు బహుళంబుగానగు. బహుళగ్రహణముచే పరంబైన వర్గద్వితీయ చతుర్థములు తత్పూర్వవర్గ విషమంబులతో సంయుక్తములగు సు.వ్యా.సమాజ ౩౬ సూత్రము. అద్ధిరాగ్రణి గెల్పుటుత్సవమునండయ్యె న్నభమ్మంతయున్ అని ఆముక్తమాల్యద- ఆంధ్రలక్షణానభిజ్ఞులు అధ్ధరణీశుఁడు అధ్ధిరాగ్రణి యని వ్రాయుదురు. ప్రాసభంగము. ఉచ్చారణమున కసాధ్యము.

తాత్పర్యము

ఆ రాజు మిగుల ముసలివాఁడు సాధువర్తనము గలవాఁడు. ఇంతవఱకు దుఃఖమెట్టిదో యెఱుఁగఁడు. జితేంద్రియుఁడు. అతనికి నీవు నాప్రతినిధిగ సాష్టాంగ నమస్కారములు గావింపుము.

మ. అనుమీ నావచనంబుగాఁ బతి కయో•ధ్యం బాయఁగా నయ్యెఁగా
వనవాసం బొనరింపఁగా వలసెఁగా•బాధల్ పడ న్వచ్చెఁగా
యని నేఁ జింతిల, లక్ష్మణుండు మదిలో•నార్తిం గొనం, డుర్వరా
తనయారత్నము దుఃఖముం గొనదు, త•థ్యం బింత భూమీశ్వరా. ౧౩౫౩

తాత్పర్యము

ఇట్లు సాష్టాంగ నమస్కారములు గావించి రాజుతో నామాటగా నిట్లనుము అయోధ్యను విడువవలసి వచ్చెఁగదా వనవాసము చేయవలసి వచ్చెఁగదా కష్టపడ

వలసివచ్చెఁగదా యని నేనాలోచించుటలేదు. లక్ష్మణుఁడు దుఃఖింపఁడు. సీతయు వ్యసనపడదు. రాజా యిది నిశ్చయము.

కం. ఈరేడబ్దంబులు సం, చారముఁ గావించి వనులఁ • జయ్యన రా, నన్
ధారణికన్యను లక్ష్మణు, గారమునఁ జూడఁ గలవు • గ్రమ్మఱఁ దండ్రీ. ౧౩౫౪

ఈరేడు=ఇరు + ఏడు=పదునాలుగు-అబ్దంబులు=సంవత్సరములు-గారామునన్=ప్రేమతో-క్రమ్మఱఁ జూడఁగలవు. ఇది లంకలో వాస్తవపడియెను.

తాత్పర్యము

పదునాలుగు సంవత్సరము లడవులందుఁ దిరిగి త్వరగా రాఁగా నన్ను-లక్ష్మణుని సీతను మరలఁ జూడఁగలవు.

కం. అని చెప్పుము జనకునకున్, జననికిఁ గైకకును దక్కు • జనయిత్రులకున్
గొనకొని మఱిమఱి చెప్పుము, యనఘ కుశల మడిగినాఁడ • నందఱ ననుచున్. ౧౩౫౫

జనయిత్రులకున్=తల్లులకు-

తాత్పర్యము

అని మాతండ్రికిఁ జెప్పుము. నాజనకునికిఁ గౌసల్యకుఁ గైకకుఁ దక్కిన తల్లులకుఁ బనిపూని వారినందఱ కుశలమడిగినాఁడనని మఱి మఱి చెప్పుము.

ఆ. అవల నేను సీత • యార్యుండు లక్ష్మణుం, డమలసూక్తులన్ మ • దంబఁ గుశల
మడిగినారమనుము • నంఘ్రులపైఁ ప్రాలి, ప్రొక్కినారమనుము • నొక్కియనుము ౧౩౫౬

ఆర్యుండు=జ్యేష్ఠభ్రాతననుసరింపవలయునను గొప్ప ధర్మమును జేయుచేఁ బూజ్యుఁడు. ఆర్యుఁడు లక్ష్మణుఁడు అనుటచేఁ దనధర్మమునందుఁదానుండి నాకుసేవ చక్కఁగాఁ జేయుచున్నాఁడని తెలియఁజెప్పుమని భావము. అమలసూక్తులన్=వంచనలేని మాటలచే-మదంబన్=నాతల్లిని-అంఘ్రులపైఁ ప్రాలి=పాదముల మీఁదఁబడి-తల్లికిఁ గౌసల్యకుమాత్రము పాదములంటి నమస్కరింపమనుటచేఁ దక్కిన సవతితల్లు లట్టి నమస్కారమునకు యోగ్యులుకారు. "ఆచార్యవదాచార్యదారే వృత్తిః పాదసంవాహనవర్జ"మ్మని శాస్త్రముకలదు. ఆచార్యవిషయమున నెట్లువర్తింపవలయునో ఆయనభార్యయందునట్లేవర్తింపవలయునుగాని పాదములంటరాదు. ఈ నిషేధము సవతితల్లులయందును నన్వయించును. నొక్కి=వత్తి.

తాత్పర్యము

కౌసల్య కైక మొదలయినవారిని గుశల మడిగిన తరువాత నేను సీత యార్యుఁడగు లక్ష్మణుఁడు వంచనలేని మాటలచే నాతల్లికుశల మడిగినారమని మఱియునడిగియామెపాదములపైఁబడి మ్రొక్కినారమనియొత్తియొత్తిచెప్పుము.

చం. పిలువఁగఁ బంచి కైకసుతు • వేగ యథామతి యౌవరాజ్యమున్
నిలుపుము వానియందు; సత•నిం గవుఁగింటను జేర్చి రాజ్యసం
కలితునిఁ జేయ మత్కలిత•గాఢతరార్తి దొలంగు నంచు న
ర్మిలి వచియింపు తండ్రికిని•బ్రీతి చెలంగెడునట్లు మిత్రమా! ౧౩౫౪

ఈప్రకారము కుశలప్రశ్నాదులు జరిగినపిమ్మటఁ దండ్రికిఁ జెప్పుమని కొన్ని విషయములు చెప్పుచున్నాఁడు: యథామతి=తనయభిప్రాయప్రకారము-రాజ్యసంకలితుని=రాజ్యముతోఁగూడినవానిని-మత్కలిత=నావియోగమువలనఁ గలిగిన-గాఢతరార్తి=మిక్కిలి యధికమైన దుఃఖము, అర్మిలిన్=ప్రేమతో-

తాత్పర్యము.

కైక కుమారుఁడగు భరతునిఁద్వరగాఁ బిలిపించి తనయభిప్రాయ ప్రకారము వానికి యౌవరాజ్యమిమ్ము-వానిని గౌఁగిలించి రాజ్యముతోఁ గూడినవానిఁ జేయఁగా నన్ను పెడనాడుటచేఁ గలిగిన దుఃఖము తొలఁగిపోవును. అని తండ్రి సంతోషించునట్లు నాయందుఁ బ్రేమయుంచి చెప్పుము.

సీ. భరతుండు పురమున • కరుదెంచి నంతట, ననుము నామాటగా • నతనితోడఁ
దండ్రియం దేరీతిఁ • దగవు వర్తింతువో, తల్లుల కారీతిఁ • దగవు సలుపు
నీతల్లి కైకయీ•మాతకు మిన్నగా, సలసుమిత్రాదేవిఁ • దలఁపు మనుము
నాతల్లి గౌసల్య • నయగతిఁ బ్రోవు వి, శేషంబుగా నని • చెప్ప వయ్య

ఆ. అప్ప చెప్పినట్లు • యౌవరాజ్యంబును, బూను నీవు రెండు•భువనములను
నుండువారి సౌఖ్య•మొందింపఁ జాలెద, పవని నేలుమనుము•న్యాయ్యముగను. ౧౩౫౭

కైకయీమాతకున్=తల్లి కైకకంటె-అన్యదూర సమీపేతరోత్తరాద్యర్థయోగంబునఁ గంటె కువర్ణకంబులగు-సు. వ్యాకారక. ౧౯-సూ. మిన్నగా = ఎక్కువగా-అప్ప=తండ్రి

తాత్పర్యము.

భరతుఁ డయోధ్యాపురమునకు వచ్చినతరువాత నేను జెప్పితినని యీమాట లతనితో ననుము.

తండ్రియం దేన్యాయమున వర్తింతువో తల్లులందఱియం దారీతినే న్యాయముగ వర్తిల్లుమనుము- నీకన్న తల్లికంటె నెక్కువగా సుమిత్రాదేవిని దలఁపుమనుము. నీతిమార్గమున నాతల్లిని విశేషముగఁ బ్రోవుమని చెప్పుము- తండ్రి చెప్పినట్లు రాజ్యభారము వహించి నీవు రెండులోకముల నుండువారిని సౌఖ్యపడఁ జేయఁగలవు. కావున న్యాయ్యమార్గమున రాజ్యమేలుమని చెప్పుము.

—• సుమంత్రుఁడు శ్రీరాముని విడిచి పోలేక పరితపించుట. •—

ఉ. పొమ్మనుచున్ మరల్చ రఘు•పుంగవుమాటల నాలకించి దుః
ఖమ్మున నిట్లు పల్కె నన•ఘా! యుపచారము కాదు, దేవ! నె
య్యమ్మునఁ జెప్పువాఁడ భయ • మందక, భక్తుఁడకా యటంచు స్నే
హమ్మున నన్ క్షమింపుము, ద•యాకర! నామనవిన్ గ్రహింపుమీ. ౧౩౫

ఉపచారము = గౌరవార్థము చెప్పునది- వాస్తవము కానిది. దయాకర = దయకు స్థానమైనవాఁడా-

తాత్పర్యము

అనిచెప్పి పోయిరమ్మనఁగా, శ్రీరాముని వాక్యములను విని దుఃఖపడుచు సుమంత్రుఁ డిట్లనియె. దేవా! నేను జెప్పఁబోవునది గౌరవార్థము చెప్పుమాట గాదు. భయములేక స్నేహభావమ్మునఁ జెప్పుచున్నాఁడను. నీవు నాయందు స్నేహముంచి వీఁడు మన భక్తుఁడేకదా యని నాతప్పును క్షమింపుము. నీవు దయావంతుఁడవు కావున నామనవి నంగీకరింపుము.

తే. కసుపుదుఃఖంబునను గ్రాఁగు•పడఁతిఁ బోలి,
తావకీనవియోగార్తిఁ • దత్తరించు
నాయయోధ్యకు నిన్నిటఁ•బాయఁబెట్టి,యెట్లుచనువాఁడనాగతి•యేమితండ్రి!

తావకీన వియోగార్తిన్=నీ వెడఁబాయుటవలనఁ గలిగిన దుఃఖముచే-

తాత్పర్యము

పుత్రశోకముచేఁ గాలిపోవుచున్న స్త్రీవలె నిన్ను విడనాడుటచేఁ గలిగిన దుఃఖముచేఁ దత్తఱపాటు చెందుచున్న యాయయోధ్యకుఁ నిన్నిచట వదలి నే నెట్లుపోవఁగలను. పోయినను నా తండ్రీ నాగతియేమి ?

కం. మును రామయుక్తముగురథ, మును గనినపురంబు నేఁడు•మొగిఁ దద్ధీనం
బును గనిన లేటమొగమై,మునుఁగదె దుస్సహపుశోక•మునను మహాత్మా!

రామయుక్తము=శ్రీరామునితోఁ గూడినది- తద్ధీనంబును=శ్రీరాముఁడు లేనిదానిని, తత్+హీనము=తద్ధీనము, వర్గము తొలి నాలుగక్షరములకుఁ బరమైన హకారమునకు నావర్గ చతుర్థాక్షరము వైకల్పికముగనగు- తత్+హీనము =తద్ధీనము-తద్హీనము. సు. వ్యా. సంస్కృత సంధిపరిచ్ఛేదము ౨౧-వ సూ. లేటమొగము=పెడమొగము. తెల్లవోయిన ముఖము.

తాత్పర్యము

ముందు శ్రీరామునితోఁ గూడిన రథమును జూచిన పురము నేఁడు శ్రీరాముఁడు లేని రథమును జూడఁగాన వెలవెలపాటునఁ జూడఁజాలక పెడమొగము పెట్టి సహింపరాని శోకమున మునుఁగదా. ఇచ్చట పురమనఁగాఁ బురమునందలి జనులుగాక తక్కిన జీవజంతువులని గోవిందరాజులు. పురజనుల విషయము క్రింది పద్యమునఁ గలదు.

కం. ఈరిత్తరథముఁ గనుఁగొని, పౌరులు సూతావశేష • బాధితసేనా
  వారము హతవీరముగతి, వారక కని బహుళదుఃఖ•వశు లగు టరుదే. ౧౩౬౨

రిత్తరథము = నీవులేనిరథము-పౌరులు=పురజనులు-సూతావశేష బాధిత సేనావారము=సారథియొకఁడు మాత్రము మిగులునట్లుగా శత్రువులచే బాధింపఁబడిన సేనాసమూహము-హతవీరము=చంపఁబడిన వీరులఁగలది.

తాత్పర్యము

నీవులేని రథమును నేను దోలుకొనిపోఁగా నూరిజనులు శత్రువులచే వీరులందఱు చావఁగా సారథిమాత్రము మిగులునట్లుగా బాధింపఁబడిన సేనాసమూహమును జూచినట్లుచూచి యధికదుఃఖమునకు లోపడుట యాశ్చర్యమా.

ఉ. దూరనివాసివై ననినుఁ • దోయజనేత్ర! తలంచి లోకులున్
  గూరినకూర్మిఁ బల్లటిలి • కూమను నీరును బాసియున్ నిజో
  దారసుభావనాగతి సఁ•దాగతిగా నిను నెంచి నీశుభా
  కారముఁ జూచు చుండెదరు•కన్నులఁ గట్టినయట్లు రాఘవా. ౧౩౬౩

దూరనివాసివి=దూరమందు నివసించువాఁడవు-తోయజనేత్ర=కమలముల వంటి కన్నులుగలవాఁడా-పల్లటిల్లి = విరవిరఁబోయి-నిజోదారసుభావనాగతిన్= తమ గొప్పధ్యానవిధమున- సదాగతిగాన్=నిత్యరక్షకునిఁగా శుభాకారము=దివ్య మంగళ విగ్రహము.

తాత్పర్యము

కమలాక్షా-దూరదేశవాసివైన నిన్నుఁదలఁచుకొని లోకులును గూర్మిచేత విరవిరఁబోవు మనస్సులతోఁగూడి నీళ్లువదలి తమవిశేషధ్యానమార్గమున నిన్నుఁ దమకు సర్వరక్షకుఁడవనియెంచి నీ దివ్యమంగళవిగ్రహము కన్నులకుఁ గట్టినట్లు రామచంద్రా చూచుచుండెదరు.

ఉ. నీవును గంటివే కద య•నిందితశీల! భవత్ప్రవాసవే
  ళావిలలోకశోకము వి•లాపవిధంబును నన్ను నారథం
  బీవిధిఁ జూచి వెందియును • నేడ్చెడివారలు వార లంతకు
  న్వేవిధముల్, సహింప నగు•నే ననుబోఁటికి దానిఁ జూచినన్. ౧౩౬౪

అనిందితశీల=నిందింపఁబడని యాచారముగలవాఁడా- భవత్ప్రవాసవేళా విలలోకశోకము = నీవరణ్యమునకుఁ బ్రయాణమైనకాలమందుఁ గలఁతచెందిన మనస్సులుగల జనులదుఃఖము-విలాపవిధంబును=వారేడ్చిన తీరును-ఈవిధిన్= నీవులే నట్టి యీవిధమును- అంతకంటె = మునుపేడ్చినదానికంటె-వేవిధముల్= వేయి తెఱఁగులన్-నేను బోవుటకు మరల వచ్చెదవేమో యని యాశగలవారై యుండి నేను నొంటరిగాఁ బోఁగానే యిఁక నాశలేదని మునుపటికంటె నెక్కువగా నేడ్తురు- ననుబోఁటికిన్ = నావంటివానికి-

తా త్ప ర్య ము

శ్లాఘ్యచరిత్రా నీవరణ్యమునకై బయలుదేఱినపుడు గుండెలు చెదఱి లోకు లేడ్చినయేడ్పు నీవే కన్నారఁ జూచితివికదా నేను నిన్నుఁ బిలుచుకొని వత్తునేమో యని యాశతో నుండువారు నీవులేని శూన్యరథమును నేనొకఁడనే తోలుకొని పోఁగా నిఁక రాఁడని నీ యాశమాని మునుపటికంటె వేయంత లెక్కువగా నేడు తురు. నావంటి వాఁడు దానిని జూచి సహింపఁగలఁడా.

సీ. అక్కటా! మీతల్లి • యయ్య నాపుత్రకుం, డేఁడినా నేమను•వాఁడ నేను
మేనమామింటికి • నేను దోడ్కొనిపోయి, విడిచితి నీ వింక • నడల వలదు
తల్లిరో యందునా•తగ వెఱింగియు నెట్టు,లనృతంబు రోయక•యాఁడువాఁడ
ననృత మాడఁగ నేల • యనెదవా నే నెట్లు, పాపపుసత్యంబుఁ • బలుకువాఁడ

తే. నిన్ను నీదేవి లక్ష్మణు • నీరజాక్ష
నెమ్మి వహియించుహయములు • నేఁ డ పెట్లు
మన్ని యోగంబునను దాము • మరల నేర్చు?
రమ్యగుణసాంద్ర దయఁ జూడు • రామచంద్ర. ౧౩౬౫

అడలవలదు=వ్యసనపడవలదు- తగవు=ఉన్న విధము-అనృతంబు= అసత్యము రోయక=అసహ్యించుకొనక-పాపపుసత్యంబు = బాధాకరమైన యథార్థమును- హయములు=గుఱ్ఱములు- మన్ని యోగంబునను = నాప్రేరణముచేత-రమ్యగుణసాంద్ర = మనోహరములైన గుణములచే దట్టమైనవాఁడా.

తా త్ప ర్య ము

అయ్యో! నేను మరలి యూరికిఁబోఁగానే మీతల్లిని జూడక తప్పదుగదా! చూడఁగానే "సుమంత్రా: నాచిన్ని కుమారుఁడు శ్రీరామచంద్రుఁడేఁడయ్యా" యని తప్పక యడుగునుగదా? అడిగిన నామెకు నేనేమని ప్రత్యుత్తరము చెప్పుదును? అమ్మా మేనమామయింట విడిచి వచ్చినానమ్మా నీవేడువకుము అని చెప్పుదునా. అసత్యమాడరాదని ధర్మము తెలిసి తెలిసి యసహ్యించుకొనక యెట్లసత్య మాడుదును. అసత్యమేలచెప్పవలె నున్నదున్నట్లు చెప్పరాదాయంటి వేని నరక బాధవంటి బాధను గలిగించు సత్యము నేనెట్లు చెప్పుదును. ఇదంతయుఁ బురమునకుఁ బోయిన నాఁటిముచ్చటలు. ముందు పురమునకుఁ బోవుటెట్లు? నిన్ను సీతాదేవిని లక్ష్మణుని మోచితెచ్చిన గుఱ్ఱములు నీవులేక నేను మరలించినను సదలించినను గొట్టినను నవిపురముపైపు మరలునా? నీవెంతోరమ్యగుణ సాంద్రుఁడవే రామచంద్రా యింత కఠినచిత్తుఁడవై యిందఱి బాధించుచున్నావు కదా.

కం. సాధ్యంబు గాదు మరలి య, యోధ్యకుఁ బోవంగ నాకు • నూరక నా కా
రాధ్యుఁడవు పరపి కరుణా, నిధ్యాన మనుజ్ఞ నిమ్ము•నీతో వత్తున్. ౧౩౬౬

ఆరాధ్యుఁడవు=ఆరాధింపఁ దగినవాఁడవు- కరుణానిధ్యానము=దయతోఁ గూడిన యాలోచనను, పరపి=వ్యాపింపఁజేసి, అనుజ్ఞయిమ్ము=సమ్మతింపుము.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నీవులేక యయోధ్యకుఁ బోవ నాకు సాధ్యముకాదు. ఏలన మీఁదఁజెప్పిన కారణములేకాక మఱియొక ముఖ్యకారణముగలదు. అదియేదనః- నీవు నాకారాధింపఁదగిన దేవుఁడవు- ఆరాధించువాఁ డొకచోట నారాధింపఁబడు దైవమొకచో నుండిన నారాధకుఁ డేమిచేయఁగలఁడు. నీవు నాతోడ రానొల్లవేని దయయుంచి వీఁడు నాయారాధకుఁడు వీనిని రక్షింపవలసిన భారము నాది కావున నాయొద్ద వీనినుంచుకొందమని యాలోచించి నీతోవచ్చుట కనుజ్ఞనిమ్ము.

ఆ. కాదు కూడ దనుచుఁ • గరుణమాలుచు నాదు, ప్రార్థనంబు వ్యర్థ•పఱిచె దేని
రథముతోడనేను•ప్రజ్వలదగ్నికి, మే నొసంగువాఁడఁ•జూ నిజంబు. ౧౩౬౭

ప్రజ్వలదగ్నికిన్=మండుచున్న యగ్నిహోత్రునకు- చూ = సుమా- 'చూడుమా' హ్రస్వరూపము. తాత్పర్యము.

నేను నీతోవచ్చుటకుఁగాదు నీవు నాతో రాఁగూడదని దయవిడిచి నాప్రార్థనము వృథాచేసితివా నీయనుగ్రహమునకుఁ బాత్రముగాని యీదేహమువ్యర్థము కావున నిన్నారాధించుటకు సాధనమైన యీరథముతోడ నేను నుండెడు మంటకు నాదేహమును నీకుఁ బ్రీతిగ నాహుతి చేయుదును. ఇది నిజము సుమా.

కం. వనముల నీదుతపంబున, కును విఘ్నముఁ గూర్పఁ గలవు•క్రూరపుజంతుల్
గొనకొని వానిని రథమున, వినిహతములు చేయువాఁడ • వివరింపు మెదన్.

వినిహతములు=నిశ్శేషముగాఁ జంపఁబడినవి. ౧౩౬౮

తాత్పర్యము

అయ్యా! నీవు నాతోడవచ్చి నాకేమిసేవ చేయఁగలవందువేమో. నాకైంకర్యవిధము నేనుజెప్పెద వినుము. అడవులందు నీవుచేయు తపస్సునకుఁ గ్రూరజంతువులు పులులు మొదలయినవి విఘ్నములు చేయఁగలవు. అట్టి వానిని రథమెక్కి పోయి నిశ్శేషముగా వధించెదను. ఇది తగినసేవ యగునో కాదో యాలోచింపుము.

కం. నీరథముఁ గడపుసౌఖ్యముఁ, గూరెడిభాగ్యంబు లేదు • కోమలగాత్రా
ఘోరారణ్యముల న్నీ,తో రా సుఖి నౌదు నన్నుఁ • ద్రోపకు తండ్రీ.౧౩౬౯

కూరెడి=పొందెడి, ఘోరారణ్యములన్=భయంకరమైన యడవులందు.

తాత్పర్యము

నీవు కోమలగాత్రుఁడవు- ఎన్నఁడు నడిచి తిరిగినవాఁడవుకావు. ఇట్టి నీకుఁ గష్టముతోఁపకుండ నీకు సారథినై సుఖించు సదృష్టము నేనయోధ్యకుఁబోయిన నాకుఁగలుగదు. నీవు పట్టాభిషిక్తుఁడవైనచో నీకు రథముగడపి కడదేఱుదనను

కొంటిని. అదియు లభించినదికాదు. మఱి యేవిధమైన సుఖముఁ గోరెదవందువా ఈ భయంకరారణ్యములలో నీతోడ వచ్చితినేని సుఖింతును. కావున నేను సుఖింపఁ దండ్రీ నీకు నాయందు దయగలదేని నన్నుఁ ద్రోచివైవకుము.

కం. సమ్మతి నీభయదారణ్యమ్ముల నీ పజ్జనుండ • నాశ గొలిపెడిన్
జుమ్మీ యట్లే కానీ, రమ్మని యొకమాట యనవె • రాజీవాక్షా. ౧౩౪౦

సమ్మతిన్=నిండుమనస్సుతో, భయదారణ్యమ్ములన్=భయముకలిగించు నడవులందు, పజ్జన్=అంచున.

తాత్పర్యము

నిండుమనస్సుతో నీభయంకరములైన యడవులందు నీయొద్దనుండ నాశయగుచున్నదిసుమా. కావున సరియ నీవుకోరినప్రకారము రమ్మని యొక మాటమాత్రము కమలాక్షా యనుము నేనుగోరునది యింతియ.

కం. మిట్టలఁ బల్లంబుల నీ, గుట్టంబులు నిను వహించి • కొని పోయి శ్రమం
బిట్టింక నీకుఁ గొలుచుచు, నిట్టియలం బరమగతికి • నేగెడు రామా. ౧౩౪౧

ఇట్టింకన్=ఇంకన్+ఇంకన్=ఇట్టింకన్=పూర్ణముగా నింకిపోవ, ఇట్టియలన్= ప్రక్కల నిత్యబహువచనాంతము, పరమగతికిన్=పరమపదమునకు.

తాత్పర్యము

నేనడిగిన నొకమాటయనితివా- బాగుపడువాఁడను నేనొకఁడనే కాను. నీసేవచేసి యాగుఱ్ఱములు ముక్తికిఁబోవును.మిట్టలయందుఁ బల్లములయందు నీగుఱ్ఱంబులు నిన్ను మోచికొనిపోయి నీకు శ్రమములేకుండునట్లు నీపార్శ్వంబు లందుండి నీసేవచేసి పరమపదమునకుఁ బోఁగలవు. వారివారి శక్తికొలఁది భక్తితో నెవరెట్టి నీసేవచేసినను ననుగ్రహింతువుగదా.

కం. తలఁగక నీశుశ్రూషను దలతోఁ జేయుచు వసింతు • దండక నీతో
మలయుచు నయోధ్య యేటికి, నిలింపతల మైన నేల • నినుఁ గొలువంగన్. ౧౩౪౨

తలఁగక=తొలఁగిపోక, శుశ్రూషను=సేవను, మలయుచున్=సంచరించుచు, నిలింపతలము=స్వర్గము దేవతలుండు ప్రదేశము.

తాత్పర్యము

వదలిపోక నీపరిచర్యను దలతోఁజేయుచు దండకారణ్యమందు నీతో సంచరించుచుందును. అంతటి నీసేవాభాగ్యము నాకుఁ గలిగెనేని యయోధ్య యేల స్వర్గమేల ?

నీసేవ తుచ్ఛములైన యైహిక స్వర్గ కైవల్య ఫలములకంటె హెచ్చగు మోక్షఫలమునే యిచ్చును.

కం. దురితాత్ములు సురనగరముఁ, జొరఁజాలనియట్టు లెట్లు•చొరఁగా నేర్తున్
ధరణీశసుత యయోధ్యా,పుర మే నొంటిగను గోలు•పోయియు నిన్నున్. ౧౩౪౩

దురితాత్ములు=పాపాత్ములు, సురనగరము=స్వర్గము చొరఁజాలనియట్లు; ప్రవేశింప సాధ్యపడని విధమున, కోలుపోయియు = విడనాడియు- పోఁగొట్టుకొనియు-

తాత్పర్యము

పాపాత్ములు స్వర్గమునఁ బ్రవేశింప సాధ్యపడని విధమున నీయాశ్రమమును వదలి యొంటిగఁబోయి యయోధ్యానగర మెట్లు ప్రవేశింపఁగలను.ఎంత ఘోర పాపము చేయకుండిన నీతోడ నుండకుండుట లభించునా ?

ఉ. ఉబ్బిట లూఁగెడిన్ హృదయ • మొండుతలంపున నాసఁ జేసి, యీ
గుబ్బములన్ శతాంగమునఁ • గూర్చి నే రథచోదకుండ నై
చిబ్బునఁజీద కీవు గడ•చేయఁగఁ గానఁ జతుర్దశాబ్దముల్
పబ్బెలు వాఱ భూమి యద్రుఁ•వన్ మిముఁ దోడ్కొనిపోవ నాకికన్. ౧౩౪౪

ఉబ్బిటలూఁగెడిన్=ఉబ్బాంత లూఁగుచున్నది- ఊఁగు+ఊఁగు=ఉబ్బిటలూఁగు- అనఁగా మిక్కిలి తొందరపాటున నేకారుచున్నవి. ఒండుతలంపునన్ = ఒకానొక యాలోచనతో, ఆసఁజేసి=ఆశచేత- చేసి ఇది చేతవిభక్త్యర్థ కాన్వయంబు అవి తత్ప్రీత్యయార్థక వర్ణకంబులకును, వలనతుఁ,దయిచుగ సమప్రయుక్తమగును. ఇది క్త్వార్థకముకాదు. శతాంగమునన్=రథంబునందు, రథచోదకుండనై=తేరు నడపువాఁడనై- చిబ్బున ఇది ఛీదుటయందలి ధ్వన్యనుకరణము. కడచేయఁగన్=ముగింపఁగ, కానన్=అడవియందు,చతుర్దశాబ్దములు=పదునాలుగు సంవత్సరములు, పబ్బెలువాఱన్=పబ్బెలుపాఱఁగా,అద్రువన్=అదరఁగా- అద్రువన్=ఇందలి అకారము గురువుకాదు. ముక్తపరత్ర రు వర్ణంబునకు ముందటి దు వర్ణంబు నుత్వంబునకు లోపంబు విభాషనగు- అగుచోఁ దత్పూర్వంబు గురువుగాదు. సు.వ్యా. ప్రకి. 15-వ సూ. సంయుక్తాక్షరమునకు ముందటియక్షరము గురువను ఛందశ్శాస్త్ర సూత్రమున కిది యపవాదము. ఇట్లు అద్రుచు విద్రుచు ఎద్రుచు గద్రుచు కుద్రుచు ఇందలి మొదటి వర్ణములు గురువులుగావు. ఇట్లే ఇగ్రుచు చిద్రుపలు అను వానిలోని ప్రథమాక్షరములు గురువులు కావు.

చం. ఎద్రిచిన కాల పాకమున నీగతి నీమదిఁ గ్రోధవల్లికన్
బద్రిచినవారు మన్నిశిత బాణపరంపరలై మిడుంగులుల్
విద్రుపఁగఁ దత్ఫలంబుల చవిం జరితార్థులుగా శరీరపుం
జిద్రుపలు చేయఁ దత్సతుల చేతులఁ గాకులంబు వాతులన్. నాచ. ఉహ.

ఇది చంపకమాలావృత్తము. ఇగ్రుచుకోర్కులఁ దనడెందమునతళింప- కవివర్ణ.

తాత్పర్యము.

రామచంద్రా! ఒకానొక యాలోచనగలిగినది- దానియందలి యాసచేత హృదయ మదియెప్పుడెప్పుడు నెఱవేఱునా యని యేకారుచున్నది.అది యేమం టివా వినుము. నీవు పదునాలుగుసంవత్సరములు చిట్టునఁజేరక సాంతము చేయఁగా నిన్ను రథమందే కూర్చుండఁబెట్టుకొని దాని కీగుఱ్ఱములనే కట్టి నేనే సారథినై భూమి గడగడలాడును బ్రిద్దలువాఱుచుండ మిమ్ము నయోధ్యకుఁ దోడుకొని పోవలెను. ఇది నాయాశ. దీనిని నెఱవేర్పఁజేయుము.

కం. నీసంగాతంబున వన, వాసంబున నేండ్లు నాల్గుపది యొకత్రుటి యౌ
నీసంగతిఁ బాసిన త్రుటి, నాసిం బడఁ జేయు నొక్క కల్పము వోలెన్.౧౩౫॥

సంగాతంబునన్=సాంగత్యంబున- కూడియుండుటచే, నాల్గుపది=పదు నాలుగు, త్రుటి=నిమిషకాలము- అల్పకాలము, నీసంగతిఁబాసిన=నిన్ను విడిచి పోయిన, కల్పము=బ్రహ్మజీవితకాలము.

తాత్పర్యము

రామచంద్రా! నీసాంగత్యముచే వనవాసము పదునాలుగేండ్లును నొక నిమిషకాలమే యగును. నీ విడిచిపోయిన త్రుటికాలమే కల్పమై యయాస మును గలుగఁ జేయును.

కం. భక్తుఁడ భృత్యుఁడ నీ కను,రక్తుఁడ మత్స్వామిసుతచరణయుగసేవా
సక్తుఁడ దృఢశక్తుఁడ నో,భక్తావనశీల నన్నుఁ బాయఁగఁ దగవే.　　౧౩౬

భక్తుఁడన్=నీయందు భక్తిగలవాఁడను, భృత్యుఁడను=సేవకుఁడను, అను రక్తుఁడన్=నీయందనురాగము గలవాఁడను, మత్స్వామిసుత=నాప్రభువు కుమా రునియొక్క, చరణయుగ=రెండుపాదములయొక్క, సేవా=పరిచర్యయందు, సక్తుఁడన్=ఆసక్తిగలవాఁడను, దృఢశక్తుఁడన్ = దృఢమైన శక్తిగలవాఁడను, భక్తావనశీల=భక్తుల రక్షించు స్వభావముగలవాఁడా, తగవే=న్యాయమే.

తాత్పర్యము

రామచంద్రా! నీకు భక్తుఁడను సేవకుఁడను. నీయందనురాగము కలవాఁ డను. నాప్రభుకుమారుని పాదయుగముల సేవయందాసక్తిగలవాఁడను. సేవచేయుటయందు దృఢమైన దేహశక్తిగలవాఁడను. ఈవిధముగ నీసేవ కన్ని విధముల యోగ్యుఁడను. నీవో భక్తుల రక్షించు నాచారము గలవాఁడవు. ఇట్టి నీ వట్టినన్ను విడనాడ ధర్మమా. దీనివలన భక్తుఁడు భృత్యుఁడు ననురక్తుఁడు నగు నాశ్రితుని నిష్కారణముగ విడువరాదని సూచితము.

శ్లో. భక్తంచ, భజమానంచ, తవాస్మీతి చ వాదినమ్
త్రీనేతాన్ విషమప్రాయాన్, విషమేష్వపి సత్యజేత్.

భక్తుని, సేవించువానిని నీవాఁడననువానిని ఈముగ్వురను గష్టదశయందైనను విడువరాదు. (ఇది సూర్యునితో జమదగ్ని చెప్పినమాట. అనుశాసనిక పర్వము)

శ్లో. బ్రహ్మహత్యా గురోర్ఘాతో, గోవధః స్త్రీవధ స్తథా
తుల్య మేభిర్మహాపాపం, భక్తత్యాగా దుదాహృతమ్
భజంతం భక్తమత్యాజ్య, మదుష్టం త్యజతస్సుఖమ్
నేహానాముత్ర పశ్యామి తస్మాచ్ఛక్ర దివంవ్రజ. మార్కండేయుఁడు.

భక్తుఁడై సేవచేయువానిని దుర్గుణములు లేనివానిని విడిచినవానికి నీలోకమునఁ బరలోకమున సుఖములేదు. పైపెచ్చు బ్రహ్మహత్య- గోహత్య-స్త్రీహత్య చేసిన పాపము లభించును. ఇట్లుండ నెట్లు శ్రీరాముఁడు సుమంత్రుని వదలెను.

సుమంత్రుఁడు దశరథుని సేవకుఁడుగాని శ్రీరాముని సేవకుఁడు గాఁడు. అట్టివానిని దశరథునాజ్ఞ లేక కూడఁ బిలుచుకొని పోరాదు. శ్రీరామచంద్రుని నూళ్లు పల్లెలు దాఁటి వెలుపల విడిచిరమ్మని రాజాజ్ఞ. ఆవలఁ బొమ్మని రాజాజ్ఞ లేదు.

కం. పౌనఃపున్యంబుగ నిటు, దీనాలాపములఁ దన్నుఁ • ధృతి చెడి వేఁడం
గా నిజసారథి కనియెన్, మానుగభృత్యానుకంపి • మహిజావిభుఁడున్. ౧౩౭౭

పౌనఃపున్యముగన్=పునఃపునః = మఱిమఱి, దీనాలాపములన్ = ఏడుపు మాటలతో, ధృతి=సంతోషము, భృత్యానుకంపి=భృత్యులయందు దయగలవాఁడు, మహిజావిభుఁడు=సీతాపతి=శ్రీరాముఁడు- "ధృతిర్యోంగాతరే ధైర్యే ధారణే ప్రీతిసౌఖ్యయోః. ॥నానా॥ ॥౭॥

తాత్పర్యము

ఈవిధముగఁ బలుమాఱు శోకముతోఁగూడిన మాటలచే సంతోషముచెడి తన్నుఁ బ్రార్థింపఁగా- భృత్యులయందు దయగలవాఁడయ్యును శ్రీరాముఁడు తన సారథి కిట్లనెను.

సీ. పరమభక్తుఁడ వీవు • భర్తృవత్సల! నేను, నిజ మింత యెఱుఁగని • నిష్ఠురుఁడనె?
యేనిమిత్తము పురి • కేగు మంటిని నిన్ను, వివరింతు నయ్యది • వినఁగదయ్య
నీయరుగుట చూచి • పోయెఁ బో రాముఁ డంచును నమ్మునాపిన్న • జనని కైక
నావనిపోక కాఁ • నందించి ధర్మజ్ఞుఁ, దంత్రిఁ గల్లరి యని • తలఁప కుండు

తే. భరతుఁ డేలెడిరాజ్యంబుఁ • బడయవలయుఁ,
గైక యనినాదుముఖ్యసం • కల్పమయ్య
రాజునకు నాకుఁ బ్రియముగ • రథముతోడ,
నగరికిని జని చెప్పుమా • నాదునుడులు. ౧౩౭౮

భర్తృవత్సల=భర్తయగు రాజునందుఁ బ్రేమగలవాఁడా, నిష్ఠురుఁడనే= కఠినుఁడనా, కల్లరి=అసత్యవాది, నుడులు=మాటలు.

తాత్పర్యము.

భర్తయందుఁ బ్రేమగలవాఁడా! నీవు భక్తమాత్రుఁడవేకావు. పరమభక్తుఁడవు. ఇది సత్యము. ఈమాత్ర మెఱుఁగని యంత కఠినచిత్తుఁడనా. నిన్నేమి కారణమున నయోధ్యకుఁ బొమ్మంటినో యది వివరించెద వినుము. ఊరికివచ్చిన నిన్నుఁజూచి నిజముగ రాముఁ డడవికిఁబోయెనని నాపినతల్లి కైక నమ్మును. నీవు పోకపోయినచో నే నడవులకుఁ బోలేదనియు నేయూరనో దాఁగియున్నాననియు నామె సందేహించును. నీవు పోయినయెడల సంతోషించి రాజసత్యమాడలేదు. శ్రీరాముని నిజముగానే యడవులకుఁ బంపెనని యసత్యవాది కాఁడని యామె తలఁచును.

భరతుఁ డేలురాజ్యంబు కైక యనుభవింపవలయునని నా ముఖ్యాభిలాష. కాఁబట్టి నీవు నాకును రాజునకుఁ బ్రియమగునట్లు రథముతోడఁబోయి నేను జెప్పినమాటలఁ జెప్పుము.

—♦ శ్రీరామలక్ష్మణులు జడలు ధరించుట. ♦—

సీ. అని యూరడించి యి♦ట్లను గుహుఁ గనుఁగొని,
జనయుతం బిచ్చోటఁ♦జనదునిలువ
నాశ్రమవాసి నై♦యర్హవిధంబుగ, మునిజనభూషణం♦బనఁగఁ దగిన
వరనియమంబున ♦ వర్తిలి తండ్రికిఁ, గరము హితంబుగ♦ధరణిసుతకు
సౌమిత్రికిని హిత♦కాముఁడ వై జడల్, దాల్చెద మఱ్ఱిపాల్♦త్వరగఁ దెమ్ము
తే. నాఁగ నతఁ డట్లు సేయ సౌం♦దర్యధాముఁ,
డైనరాముండు తనకును♦ననుజునకును
జడలుగావించె నిబ్భంగి♦జటిలుఁడయ్యె, దీర్ఘబాహుండు గుణనిధి♦దేవనిభుఁడు.

ఊరడించి=సమాధానపఱిచి, జనయుతంబు = మనుష్యులతోఁ గూడినది, ఆశ్రమవాసినై = ఆశ్రమ మేర్పఱుచుకొని యందు వసించువాఁడనై, అర్హవిధంబుగన్=తగినవిధముగ, మునిజనభూషణంబు=మునులకు నలంకారమైనది, వర నియమంబునన్=శ్రేష్ఠమైన నియమముతో, కరము=మిక్కిలి, హితకాముఁడవై =హితముకోరినవాఁడనై, జటిలుఁడు=జడలుగలవాఁడు, దీర్ఘబాహుఁడు = నిడివిచేతులు గలవాఁడు.

సీతాలక్ష్మణులకు హితముగోరువాఁడనై =శ్రీరాముఁడు జడలుధరించి వానప్రస్థ నియమంబున నుండెనేని యందలి ఫలమున సగభాగ మాయన యర్ధాంగలక్ష్మి సీత పంచుకొనుటచే నామెకు హితము. అడవికివచ్చి నాగరులవేషమున గృహస్థువలె నుండుట సరిగాదు. కావునఁ దాను జడలుధరించిన లక్ష్మణుఁడును జడలు ధరించును. కావున నాయనకు హితము.

సౌందర్యధాముఁడు దేవనిభుఁడిత్యాది విశేషణములచే నిట్టిమహానుభావునకుఁ గూడ నిట్టివేషము ధరింపవలసివచ్చెఁగదా యని కవి పరితాపపడుచున్నాఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁడు సుమంత్రు నిట్లూరార్చి గుహుఁడు తన్నచ్చటనే వసింపుమనియు నదియు నరణ్యమే కావున వ్రతహానిలేదనియుఁ బ్రార్థింపఁగా నాయననుజూచి యిట్లనియె. మిత్రమా! యిది జనుల సందడిగల ప్రదేశము కావున నరణ్యప్రదేశమయినను నిందు నిలువరాదు. జనులు లేనిచోట నాశ్రమము నేర్పఱుచుకొని యందు వానప్రస్థుఁ డుండఁదగినవిధంబుగ ముని జనుల కలంకారంబగు నేలపడక బ్రహ్మచర్యము లోనగు నుత్తమ నియమంబున వర్తించుచుఁ దండ్రికి హితమైనరీతి సీతకు లక్ష్మణునకుఁ బ్రియముకోరిన వాఁడనై కాదు. హితము కోరినవాఁడనై జడలు ధరించెదను. మఱ్ఱిపాలు త్వరగఁ దెప్పింపుము. అనిన నతఁడట్లు చేయఁగా దేవనిభుఁడు సౌందర్యధాముఁడు సుందరకాయుఁడైన శ్రీరామచంద్రమూర్తి తాను జడలు ధరించి లక్ష్మణుని ధరింపఁజేసెను. ఈరీతిగ నిడివిచేతులు గలవాఁడును, కల్యాణగుణనిధియు విష్ణువిభుఁడైన శ్రీరాముఁడు జడధారియయ్యెను.

శ్రీరాముఁడు తనకును లక్ష్మణునకును జడలు గావించె ననుటచే లక్ష్మణునందుఁ బ్రయోజ్య కర్తృత్వము తెలియవలెను.

కం. నారలవసనంబులు నిల, జీరాడెడునిడుదజడలు • చెలు వొసఁగంగా
శ్రీరామలక్ష్మణులు చెన్నారిరి సాక్షాన్మృగేంద్రు•లట్టుల యంతన్. ౧౩౮౦

తాత్పర్యము

నారచీరలు నేలజీరాడు నిడుపులైన జడలు నందగింపఁగా శ్రీరామలక్ష్మణులు సాక్షాన్మృగేంద్రులఁ గాంతిగలవారైరి.

కం. వసిగొని యావల వైఖా,నసమార్గస్థుండు నగుడు • నళినాక్షుఁడు దా
వెస సహలక్ష్మణుఁడై గుహు, దెసఁ గని యిట్లనియెఁ
బ్రీతి • దెప్పలు దేలన్. ౧౩౮౧

వసిగొని=పూని (వసి+కొని). విఖనస్సు అనునాయన బ్రహ్మగోటఁ బుట్టిన యొకఋషి. "యేనఖాస్తే వైఖానసాః యేవాలాస్తే వాలఖిల్యాః" యని ప్రమాణము. వినఖ యనునది విఖనయని సింహాది శబ్దములవలె వర్ణవిపర్యయంబున నయ్యెను. అతఁడు చెప్పినది వైఖానసము. వైఖానస మార్గస్థుఁడు=విఖనస్సు చెప్పిన వానప్రస్థాశ్రమ మందుండువాఁడు. వైఖానస శబ్దచర్చ యరణ్యకాండమునఁ జేయఁబడును. శ్రీరాముఁడు వానప్రస్థాశ్రమ ధర్మమును బరిగ్రహించి నటు లిచ్చటఁ జెప్పఁబడెనుగదా. ఆయన యాయాశ్రమ ధర్మమంతయు స్వీకరించెనా? కొన్నిటిని మాత్రమే స్వీకరించెనా ? ఆయాశ్రమ ధర్మమంతయు గ్రహించెనేని యాయాశ్రమమే గ్రహించినట్లయ్యెను. అట్లయ్యెనేని మరల గృహస్థాశ్రమమునకు రాఁదగఁడు. శ్రీరాముఁడు మరల గృహస్థుఁడయ్యెఁగదా. "ఆరూఢపతితోహిస" యని పై యాశ్రమమునకుఁ బోయినవాఁడు మరలఁ

గ్రిందియాశ్రమమునకు వచ్చెనేని వాఁడు పతితుఁడు అనికదా ప్రమాణము. ఆ యాశ్రమ ధర్మములఁ గొన్నిటిని గ్రహించెననుట యుక్తముకాదు. గృహస్థుఁడుగానుండి వానప్రస్థుల కసాధారణ ధర్మమైన జటాధారణాది కరణము శాఖారండత్వమువలె నాశ్రమరండత్వమునకుఁ గారణమగును. ఒకశాఖయందుండి మఱియొక శాఖాధర్మముల నాచరించువాఁడు శాఖారండ యనియు నొకయాశ్రమమందుండి మఱియొక యాశ్రమధర్మముల నాశ్రయించువాఁడు "ఆశ్రమరండ" యనియుఁ జెప్పఁబడును. కావున శ్రీరాముఁడు వానప్రస్థధర్మ మంగికరింపరాదని పూర్వపక్షము.

సిద్ధాంతము :- శ్రీరాముఁడు వానప్రస్థధర్మముల నన్నిటిని గ్రహించె ననుటయే యుక్తము. కొన్ని సంకటసమయముల నాపద్ధర్మముగ నీవిధముగ సంకల్పించుకొనవచ్చును. ఆ యాపత్తు దీరిపోయిన మరలఁ బూర్వాశ్రమమునకుఁ బోవచ్చును. "అల్పుఁ డధికవృత్తినున్న దోషవిధముగాదు" భారతము. ఇది యాపద్ధర్మ విషయము. అట్లులే యాపదలందుఁ దన యాశ్రమమునకంటెఁ గొంతకాల ముత్తమ యాశ్రమమందుండ సంకల్పించుకొనవచ్చును.

ఇచ్చట శ్రీరాముఁడు స్వబుద్ధిపూర్వముగ వానప్రస్థాశ్రమము స్వీకరించినవాఁడుకాఁడు. జనకునియాజ్ఞ - జననియాజ్ఞ - పదునాల్గు వర్షములు బహుకాటవులయందు సంచరింపఁగనిష్ఠ చనఁగవయ్య, పట్టాభిషేక సంభ్రమమంతయును వీడి జడలుఁ జర్మముదాల్చి చనుమవయ్య" యనికదా కైక శ్రీరామునకుఁ జెప్పెను. "నారలుగట్టి జింకయజినంబు ధరించి జడల్ వహించి సంచారము చేయఁగావలయు సంయమియై పదునాలుగేండ్లు సీతారనుఁడుండు దండకను" అనికదా కైక దశరథునిఁగోరెను. కావున నీవానప్రస్థాశ్రమ స్వీకారము తండ్రిని సత్యవాదినిజేయు తలంపుతో నాయనయాజ్ఞ నిర్వహింప నంగీకరించినదేకాని విరాగియై యావజ్జీవము నేను వానప్రస్థుఁడుగా నుండెదనని సంకల్పించి శాస్త్రోక్త విధిపూర్వకముగ గ్రహించిన వానప్రస్థముగాదు. విరాగియై గృహస్థాశ్రమమును వదలి నేనిఁక వానప్రస్థుఁడనో సన్న్యాసినోయయ్యెదనని సంకల్పించి శాస్త్రోక్త పద్ధతి యాయాశ్రమము స్వీకరించి దాని నిర్వహించు శక్తిలేక మరలఁ బూర్వాశ్రమమునకు వచ్చినవాఁ డారూఢపతితుఁడు. అట్టివాని 'నారూఢపతితోహిస' యని శాస్త్రము నిందించుచున్నది. శ్రీరాముఁ డట్టివాఁడుకాఁడు. ఆపద్ధర్మపరులయెడ నీశాస్త్రమున కవకాశమేలేదు. కావుననే యుధిష్ఠిరాదులు సన్న్యాస మాపద్ధర్మముగాఁ దత్కాలమున కంగీకరించి పిదప నాపదదీఱఁగానే మరల గృహస్థాశ్రమము నొందిరి. దీనికి "సమ్యక్సంకల్పజః కామో ధర్మమూల మిదం స్మృత" మ్మని మనుస్మృతి వాక్యము ప్రమాణము.

సహలక్ష్మణుఁడై = లక్ష్మణుతోఁ గూడినవాఁడై, దెసన్ = దిక్కు - దిశాశబ్దభవము, తెప్పలుదేలన్ = ఉప్పొంగుచుండఁగా.

తాత్పర్యము

తల్లిదండ్రులయాజ్ఞ నిర్వహించు పనిపూని శ్రీరామచంద్రుఁడు వానప్రస్థాశ్రమమం దుండఁగోరి లక్ష్మణుతోడఁ గలసి సంతోషాతిశయముచే గుహునితో నిట్లనియె.

కం. జలకోశదుర్గజనపద, ములపట్టుల నప్రమాద♦మున వర్తిలుమా
చెలి! యేమఱకుము తనవా,రలను దురారక్షతమము♦రాజ్యంబరయన్. ౧౩౮-౫

బల, కోశ, దుర్గ, జనపదములపట్టులన్ = చతురంగసేనలు లోనగువానియందును, ధనకోశము దాన్యకోశము లోనగు బొక్కసములందును, జలాది దుర్గములందును ఊళ్లజనుల విషయమునందును, అప్రమాదమున్=హెచ్చరిక తప్పక, వర్తిలుమా=నడచుకొనుము, తనవారలను=తనకనుకూలురైనవారలను, దురారక్షతమము=మిక్కిలి కష్టముచే రక్షింపఁదగినది.

తాత్పర్యము

సేనలు, బొక్కసములు, దుర్గములు, ఊళ్లు, పల్లెలు మొదలగువాని విషయమందు జాగ్రత్తతోఁ బ్రవర్తింపుము. స్నేహితుఁడా! యేమఱకుము. ఆలోచించి చూడ రాజ్యము మిగులఁ బ్రయాసముచే రక్షింపఁదగినది.

సీ. అని యాన తిచ్చి న♦రాగ్రణి వడిఁ జని, జానకీ సౌమిత్రి♦సహితుఁ డగుచు
గంగాతటంబునఁ ♦ గన్గొని నావను, నది వేగ తరియింప ♦ మదిని గోరి
యన్న లక్ష్మణ నీవు♦మున్ను నావికఁ బట్టి, కదలకుండఁగ దానిఁ♦బదిలపఱచి
యీ మనస్విని మెల్ల♦నెక్కించి యనుపదం,బున నీవు నెక్కుమీ♦పొమ్మటన్న
తే. నాత్మవంతుండు లక్ష్మణుం♦డట్లు సీత,
మున్న యెక్కించి తానెక్కి♦యున్నఁజూచి
సరసిజాక్షుండు నెక్క ని♦షాదనేత, జ్ఞాతులనుజూప నడపుఁడీ♦నావ యనుడు.

గంగాతటంబునన్=గంగాతీరమందు, నావిక=ఓడ, మనస్విని=నిందయందు మతుప్పు (1) ధైర్యముగలదానిని అని పరిహాసవచనము- అనఁగాఁ బిఱికిదానిని, (2) ధీరను- అనుపదంబునన్=వెంటనే,ఆత్మవంతుఁడు=(1)శ్రీరాముని యభిప్రాయ మెఱిఁగినవాఁడు, (2) జితేంద్రియుఁడు-నిషాదనేత=బోయరాజు, జ్ఞాతులను=బాంధవులను, ఆనతి=ప్రకృతి అజ్ఞప్తి.

తాత్పర్యము

ఈప్రకారము గుహునకు శ్రీరామచంద్రమూర్తి యాజ్ఞయిచ్చి సీతాలక్ష్మణులతోడఁ ద్వరగాఁబోయి గంగాతీరముఁజేరి నావనుజూచి యాలస్యములేక నదిని దాటఁగోరి యన్నా!లక్ష్మణా నీవు నావను ముందుగాఁగదలకుండఁ బదిలముగఁ బట్టుకొని యీ పిఱికిదానిని మెల్లగ నెక్కించి వెంటనే నీవునెక్కుము.పొమ్మనిన జితేంద్రియుఁడుమ నన్నయభిప్రాయ మెఱిఁగినవాఁడును నగు లక్ష్మణుఁడు

శ్రీరామాజ్ఞచొప్పున సీతను ముందుగా నెక్కించి పిదపఁ దా నెక్కియుండఁగాఁ జూచి శ్రీరామచంద్రుఁడును నెక్కఁగా గుహుఁడు తన బంధువులతో నావ నడుపుఁడనెను.

ఎక్కించి=ఎక్కునట్లుచేసి- సీతచేతిని లక్ష్మణుఁడు పట్టుకొని యెక్కించి యనియు నర్థము చెప్పవచ్చును. సీత మనస్విని = దృఢమైన మనస్సుగలది యని చెప్పుటచేతను లక్ష్మణుఁడాత్మవంతుఁడని చెప్పుటచేతను దాఁకినను దోషములేదు. కామమునఁ దాఁకిననే దోషము. అయినను నావ కదలకుండ రెండుచేతులఁ బట్టినవాఁ డేచేత సీతను బట్టుకొని యెక్కించెను? కావున సీత తనంతటఁ దానే నావ యెక్కుట కనుకూలపడునట్లు లక్ష్మణుఁడు నావను బట్టుకొనె ననియె గ్రహింపనగును.

ఆ. రామచంద్రుఁ డంత • బ్రాహ్మణక్షత్రయో,
గ్యంబు మంత్రవరము • నాత్మహితము
పొంటె జపముఁ జేసి • భూమిజాలక్ష్మణ, యుక్తి నాచమించి • యుల్లసించి. ౧౩౮౪

బ్రాహ్మణక్షత్రయోగ్యంబు=బ్రాహ్మణులకు క్షత్త్రియులకు యోగ్యమైనది. "సుత్రామచామ్పృచా నావమరో హేదవ ఉత్తరేత్త"ని క్షత్త్రియాధికారము. మంత్రవరము=శ్రేష్ఠమైన మంత్రము; "దైవీంనావ"మను బ్రాహ్మణ క్షత్త్రియ సాధారణ మంత్రమును, ఆత్మహితముపొంటెన్=తన మేలుకొఱకు, భూమిజాలక్ష్మణయుక్తిన్=సీతాలక్ష్మణులతోడ, ఆచమించి=ఆచమనముచేసి, ఉల్లసించి=సంతోషించి.

దీనివలన మహానదిని దాఁటునపుడు ఆచమించి జపింపవలయునని సూచన.

ఉత్తర్యోదకమాచామే దవతీర్య తద్వైవచ, ఏవంస్యాత్తేజసాయుక్తో, వరుణోపి సుపూజితః॥ అశ్వలాయనుఁడు. పడవయెక్కి, పడవ దిగి, ఈరెండు సమయంబుల నాచమింపవలయును. దీనివలనఁ దేజస్సతిశయించును. వరుణుఁడు పూజింపఁబడును.

తాత్పర్యము

అంతట ననఁగా నావ కదలఁబోవునపుడు నావలోనుండి నావయెక్కి ప్రయాణము చేయవలసినపుడు బ్రాహ్మణులు క్షత్త్రియులు జపింపఁదగిన శ్రేష్ఠమైన మంత్రమును శ్రీరామచంద్రమూర్తి తన మేలునకై జపించి శ్రీసీతాలక్ష్మణులతో నాచమించి సంతోషించి.

చం. సబలు నిషాదనాథు గుహు • సారథిసత్తము నాసుమంత్రునిన్
నిబిడదయాతిరేకమున • నిల్వుఁడ టంచు ననుజ్ఞ యిచ్చి నౌ
శబరులఁ దీవరింప దృఢ • సారసమాహితకర్ణధార మై
సొబగుగ నేగె నోడ రయు • సుందరమై స్వృహతాంబుపూర మై. ౧౩౮౫

సబలున్=సేనతోఁగూడినవానిని- శ్రీరాముని సగౌరవముగఁ బంపుటకై గుహుఁడు తనసేననుగూడఁ ప్రయాణసమయమునకు రప్పించెను. నిషాదనాథున్ = బోయనాయకుని, నిబిడదయాతిరేకమునన్ = దట్టమైన దయయొక్క యతిశయముచే, అనుజ్ఞ=అనుమతి, నౌశబరులన్=నావనడపు బోయలను, తీవ

రింపన్=వేగ నడపుఁడని తొందర పెట్టఁగా-దృఢసార సమాహిత కర్ణధారమై=దృఢమైన బలము హెచ్చరికతో సిద్ధపడి నావ నడపువారిని గలదై-సొబగుగన్=అందముగ-ఇటు నటు కదలక-రయసుందరమై=వేగముచే సందమై-స్ఫ్యహతాంబుపూరమై=తెడ్డుకట్టెలచేఁ గొట్టఁబడిన జలప్రవాహము గలదై.

తాత్పర్యము.

సేనలతోడి బోయనాయకుని గుహుని నుత్తమసారథియైన సుమంత్రుని నిండు దయతో నిలువుఁడని యనుజ్ఞయిచ్చి యోడనడవు బోయలనుద్దేశించి వేగముగాఁ బోనిండని తీవరింపఁగా దృఢమైన బలముగలదై హెచ్చరికగల నావ నడపువారిని గలదై యిటు నటు లోపలి మనుష్యులు పొరలునట్లు కదలక వేగముగఁ దెడ్డుకట్టెలచేఁ గొట్టఁబడుచున్న జలప్రవాహముగలదై, యోడపోయెను.

— సీతాదేవి గంగను బ్రార్థించుట. —

తే. ఏటివడుమంతరంబున • కేఁగియచటఁ, దోయజాతాక్షి తనకేలు • దోయిలించి
ద్రెుక్కి, భాగీరథీదేవి•దిక్కుఁ జూచి, భక్తిపూర్వకముగఁ జెప్పెఁ•బ్రార్థనంబు. ౧౩౮౬

నడుమంతరంబునకున్=నడిమిభాగమునకు-తోయజజాక్షి=కమలముల వంటి కన్నులుగల సీత-దోయిలించి=దోసిలివలె చేతులుజోడించి-భాగీరథీదేవి=గంగాదేవి-భక్తపూర్వకముగన్=భక్తిముందుండునట్లు-ప్రార్థనము=వేఁడికోలు.

తాత్పర్యము

ఏటి నడిమిభాగమునకు నోడపోఁగానే యచట సీతచేతులు జోడించి గంగానది దిక్కుఁజూచి భక్తితో నిట్లు ప్రార్థించెను.

కం. అమ్మా భాగీరథి! నెయ్యమ్మున నీదాశరథి వ•నాంతరవాసం
బిమ్ముగఁ దీరుచు నట్టుగ, సమ్మతి రక్షింప వమ్మ•సాగరుకొమ్మా! ౧౩౮౭

వనాంతరవాసము=అడవులలోఁ గాఁపురము-ఇమ్ముగన్=కొఱఁతలేకుండఁ జక్కఁగ-సాగరుకొమ్మా=సముద్రుని యిల్లాలా! నెయ్యమ్మునన్=స్నేహముచే-నీవు భాగీరథివి=భగీరథునాఁడు బిడ్డవు-ఈశ్రీరాముఁడాయన మనుమఁడు.కావున నీయన మనవాఁడుగదా యను భావమున-

తాత్పర్యము

తల్లీ! గంగాదేవీ! యీ దశరథరాజు కుమారుఁడు శ్రీరాముఁడు వనవాస దీక్ష యేకొఱఁతలేకుండ నెఱవేర్చునట్లు లోసాగరుదేవీ! భగీరథుని కూఁతురా నీకు నీయనకుఁగల సంబంధము దలఁచియైన స్నేహభావమున నీయననురక్షింపుము.

కం. ఈరేడబ్దంబులు వనిఁ, దీరిచి, తాఁ దమ్ముతోడ • దేవీ నాతో
వారక నిను మఱి గానఁగఁ, జేరఁగఁ గనవమ్మ చంద్ర•శేఖరుకొమ్మా! ౧౩౮౮

ఈరేడబ్దంబులు=పదునాలుగేండ్లు-వనిన్=అడవియందు-వారక=విఘ్నము లేక-చంద్రశేఖరుకొమ్మా=చంద్రునిఁ దలయందు ధరించిన శివునిదేవీ-కనవమ్మా= సంకల్పింపుము. తాత్పర్యము.

శంకరుదేవీ! అడవిలోఁ బదునాలుగేండ్లుండి ప్రతిజ్ఞదీర్చి యీరామచంద్రుఁడావలఁ దాను దనతమ్మునితోడను, నాతోడను నిర్విఘ్నముగ మరల నిన్నుఁ జేరునట్లు లనుగ్రహింపుము.

కొందఱు తత్త్వజ్ఞానహీనులు ఱాలకు-గుట్టలకు-చెట్లకు-నదులకు హిందువులు నమస్కరింతురని యాక్షేపించుచుఁ దమయజ్ఞానమును బ్రకటించుకొందురు. వాస్తవమేమన వాసుదేవస్సర్వమ్ - సర్వంఖల్విదంబ్రహ్మ - హరిమయము గాని ద్రవ్యము పరమాణువు లేదన్నట్టు లీశ్వరుఁ డొకఁడే యంతర్యామి యగుటయే కాక రూపం రూపం ప్రతిరూపో బభూవ యన్నట్లు మన్నొక్కటియే చట్టి బాన పిడుత యను వేఱువేఱు పేర్లచే నానారూపములు వహించినట్లు తానే సర్వరూపములు సర్వనామములునై యున్నాఁడు. కావున సర్వము భగవన్మయమే భగవత్స్వరూపమే కాని యితరపదార్థ మేదియు లేదు. కావున నెవరు దేనికి నమస్కరించినను నారూపము వహించి యందంతర్యామిగా నుండు భగవంతునకే నమస్కరించుచున్నారుగాని వేఱు దేనికి నమస్కరించుటలేదు. ప్రణమేదీశ్వరకలా మాశ్వచండాల గోఖరమ్మన్నట్టు సర్వము నీశ్వరభావముచే నమస్కరించుట తత్త్వజ్ఞలక్షణము. తెలియకయైన నమస్కరించుట మధ్యముల లక్షణము. దాని నిషేధించుట మూఢులగు బాహ్యుల లక్షణము. మనదేహములం దీశ్వరుఁ డెట్లున్నాఁడో యన్నిట నట్లే యున్నాఁడనియు స్థూలదృష్టికిఁ గానవచ్చునది యాయనకు శరీరమగు ప్రకృతి యనియు గ్రహింపవలయును. జగత్సర్వం శరీరం తే=సమస్తజగము నీశరీరము త్వం ధారయసి భూతాని వసుధాం చ సపర్వతామ్ అంతేపృథివ్యా సలిలే దృశ్యసేత్వం" నీవే భూతములను బర్వతముతోడి భూమిని ధరించెదవు. భూమిలో నీళ్లలో నీవే కానవచ్చెదవు అని యుద్ధకాండమున ౧౨౦-వ సర్గమునందలి బ్రహ్మస్తుతియందుఁ గలదు. దృశ్యతే శ్రూయతేపివా అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణస్థిత యన్నట్లు కానవచ్చునవి వినవచ్చునవి లోపల వెలుపల నుండునవి సర్వమును వ్యాపించి నారాయణుఁ డున్నాఁడను శ్రుతివాక్యము స్మరించి భక్తిపరులై యుండువారు బుద్ధిమంతులు. శరీర వికారములు ప్రకృతివే కాని యాత్మలవి కావు. ఈసందర్భమున నీవాక్యములు స్మరణీయంబులు-

ఆబ్రహ్మస్తంబపర్యంతం, పరమాత్మ స్వరూపకమ్
స్థావరం జంగమంచైవ, ప్రణమామి జగన్మయమ్॥

బ్రహ్మ మొదలు గడ్డిగంటవఱకు చరాచరములందు సర్వము పరమాత్మ స్వరూపము కలదే. కావున జగన్మయుఁడైన భగవంతునకు నమస్కారము.

యత్కించి త్సృజ్యతేయేన, సత్త్వజాతేనవై ద్విజ
తస్య సృజ్యస్య సంభూతౌ, తత్సర్వం వై హరే స్తను ॥
విష్ణుపురాణము. ౧ అం. ౨౨ అ. ౩౫ శ్లో.

ఖం వాయురగ్ని స్సలిలం మహీంచ, జ్యోతీంషి సత్త్వాని దిశోద్రుమాదీన్
సరి త్సముద్రాంచ హరేశ్శరీరం, యత్కించ భూతం ప్రణమే దనన్యః॥
భాగ. ౧౧-౨, ౪-౧.

ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి, నక్షత్రాదులు, జంతువులు, దిక్కులు, చెట్లు మొదలైనవి నదులు సముద్రములు మొదలైనవేవేవి కలవో యన్నియు విష్ణువు శరీరమే కావున ననన్యబుద్ధి నమస్కరింపవలయును.

కం. క్షేమముగ మరలినప్పుడు, నేమంబుగ సర్వకామ◆నిచయము చేరన్
వ్యోమధునీ నినుఁ బూజా, స్తోమంబుల ముదితఁ జేయు◆దుం గడుభక్తిన్.

క్షేమముగన్=కుశలముగ, నేమంబుగన్ = నియమముతో, సర్వకామనిచయము=అన్ని కోరికల సమూహము, వ్యోమధునీ=ఆకాశమునందుఁ బ్రవహించు నదీ, **పూజా స్తోమంబులన్=పూజాపదార్థముల** సమూహములచే, ముదితన్ = సంతోషించినదానిఁగా-

తా త్ప ర్య ము.

ఏవిఘ్నము అపాయములేక శ్రీరామలక్ష్మణులు నేను మరలి వచ్చినపుడు మాకోరికలన్నియు నెఱవేఱఁగా నియమముతో నిన్ను బహువిధంబుల నీవు సంతోషించునట్లు పూజింతును.

సీ. దేవి! నీ వనఁగను ◆ కేవలనదివౌకో, త్రిపథగా ఖ్యాతని ◆ దేజరిల్లి
బ్రహ్మలోకంబునఁ ◆ బరఁగుచు నీలోక, మందుఁ గంధీశుని◆ల్లాల వగుచు
క్షాళితకల్మష◆స్నాతకపుంజ వై, యలరు నిన్నెట్లుకొం◆డాడ నేర్తుఁ
గరముల మోడ్చెదఁ◆గాకుత్స్థతిలకుండు, గ్రమ్మఱి యే తెంచి◆ప్రాప్తరాజ్యుఁ
తే. డగుడు నీప్రీతిగాఁగ బ్రా◆హ్మణులకిచ్చు,
దాన నూర్వేలు గోవులు◆మానితాన్న
వస్త్రములు నీకు వేసురా◆భాండములును, గరుణఁజూడము పూసి గం◆గాభవాని.

కేవలనదివౌకో=సామాన్య నదీమాత్రమవా, త్రిపథగాఖ్యాతిని=త్రిపథగ యనుకీర్తిచేత- ఈవిషయము బాలకాండమున విస్తరింపఁబడినది, కంధీశ = సముద్రరాజు, ఇల్లాలవు=భార్యవు, క్షాళిత స్నాతక కల్మషపుంజవై =కడిగి వేయఁబడిన స్నానముచేయువారి పాపసమూహము గలదానవై, కొండాడన్=స్తుతింప, **సురాభాండములు**=కల్లుకుండలు, భవాని=భవునిభార్య భవాని, బ్రహ్మలోకంబునఁ బరఁగుచున్=బ్రహ్మలోకంబున బ్రహ్మదేవుని కమండలువునం దుండునది- దీనితోనే త్రివిక్రమావతారమున బ్రహ్మదేవుఁడు విష్ణుపాదములు కడుగఁగా

నాతీర్థము గంగయై బయలువెడలినది. ఈవిషయమే ౧౩౦౦-న పద్యమున "హరిపాద సంచ్యుత యైనదాని"నని చెప్పఁబడియె.

తాత్పర్యము

దేవీ! నీవనిన సామాన్యనదివాయేమి? త్రిపథగ యని మూఁడు త్రోవలఁబాఱి కీర్తికాంచినదానవు. బ్రహ్మలోకమం దుండుచు నీలోకమున సముద్రరాజు భార్యవై నీయందు స్నానము చేయువారి పాపములనెల్లఁ గడిగివైచినదానవై యొప్పు నిన్ను నేనేమని పొగడఁగలను? చేతులు జోడించి నమస్కరించెదను. శ్రీరామచంద్రుఁడు మరలివచ్చి రాజ్యమును బొందినవాఁడాయెనా నీకు సంతోషముగ లక్ష గోవులను బ్రాహ్మణులకిచ్చెదను.నీకు మంచియన్నము వస్త్రములు వేయి కల్లుకుండలు సమర్పింతును.కావునఁ దల్లీ గంగాభవానీ దయచూడుము.

కం. నీతీరంబుల నుండెడి, పూతక్షేత్రములఁ దీర్థ•ముల దేవతలన్
నీతముగాఁ బూజించెదఁ, బ్రీతిం గను గంగ కలుష•వినరవిభంగా. ౧౩౯౧

పూతక్షేత్రములన్=గంగాద్వార (హరిద్వార) కాశీ ప్రయాగాది పవిత్ర క్షేత్రములను, నీతముగాన్=నియతముగ, కలుషవిసరవిభంగా = పాపముల సమూహములను భంగించుదానా-ఇందు పూత శబ్దము తీర్థముతోడను దేవతల తోడను నన్వయించును.

తాత్పర్యము

గంగాదేవీ! నీ యొడ్డులందుండు కాశీ మొదలగు పవిత్ర క్షేత్రములను మణికర్ణికాది పవిత్రములయిన తీర్థములను అట్టి దేవతలను నియమముగాఁ బూజించెదను. పాపచయములఁ జెఱుచుదానా నన్ను దయతోఁ జూడుము.

సమాసంబునందలి పూర్వపదంబు వ్యవహితంబైన యుత్తరపదంబుతోడ నన్వయించును. "పరుల ధనమునకు విద్యాపరిణతికిం దేజమునకు మనంబెరియఁగ ననహ్యపడు నన్నరుఁడు." భారతము. పరుల ధనమునకుఁ, బరుల విద్యాపరిణతికిఁ బరుల తేజమున కని యన్వయము.

కం. తనతమ్మునితో నాతో, ననఘుఁడు శ్రీరామచంద్రుఁ•డామోదమునన్
వనవాసముఁ దీరిచి మఱి, చనుదేరఁగఁ గుశలిగాఁ బ్ర•సాదింపు దయన్.

ఆమోదమునన్=సంతోషముతో, కుశలిగాన్=క్షేమముతోఁ గూడినవానిఁగా, ప్రసాదింపుము=అనుగ్రహింపుము.

తాత్పర్యము

ఏదోషమెఱుఁగని శ్రీరామచంద్రుఁడు వనవాసము ముగించి సంతోషముతో దమ్మునితోడను నాతోడను క్షేమముగా మరలి వచ్చునట్లు దయతోఁ ననుగ్రహింపుము.

కం. అని వేఁడుచు నుండఁగ భూ,తనయ వడిన్ నావ గంగ•దక్షిణతటమున్
జనుడు నట డిగ్గి రందఱుఁ, దనతమ్మునిఁ బల్కు దశర•థప్రభువుండున్.

దక్షిణతటమున్=దక్షిణపుటొడ్డు, చనుడున్=చనిన యనంతరము, దశరథ ప్రభువుండున్=శ్రీరాముఁడు-

తాత్పర్యము

ఈ ప్రకారము సీత ప్రార్థించుచుండఁగ వేగముగఁ బోయి నావ యావలి యొడ్డు చేరెను. అచట నందఱు దిగిరి. అప్పుడు శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె.

శా. సౌమిత్రీ! యిఁక నేమఱం దగదు ర•క్షాప్రక్రియన్, నిర్జనం
బే మానుష్యసమేత మేనియును నే•ర్మిన్ మున్నుగా నీవు పో
వ్మా మార్గమ్మును జూచికొంచు, బడి సీ•క్ష్మాపుత్రియేతెంచు, నే
నో మీయిద్దఱఁ గాచుచున్ వెనుక యై • యుర్వీజకున్ వచ్చెదన్. ౧౩౯౪

సౌమిత్రీ=సుమిత్రనందనా- సుమిత్రనామము స్మరించుటచే నీతల్లి నీకే మనిబుద్ధిచెప్పెనో దానిని స్మరింపుము. "ఏమఱెదవుసుమీ యెప్పుడైన నీమనం బుననేని" యని చెప్పలేదా. ఆమాటలు స్మరింపుమని భావము. రక్షాప్రక్రియన్=రక్షించు కార్యమునందు, నిర్జనంబేన్=జనములేని ప్రదేశమైనను, మానుష్య సమేతమేనియున్ = మనుష్యులతోఁగూడిన ప్రదేశమైనను, నేర్మిన్=నేరిమిన్=నేర్పుతో- హెచ్చరికతో, బడి=వెంబడి, క్ష్మాపుత్రి=సీత, ఉర్వీజకున్=సీతకు-

తాత్పర్యము

సౌమిత్రీ! యిఁక రక్షించుకార్యమునందు మన మేమఱరాదు. జనములుగల ప్రదేశమందైనను జనములులేని ప్రదేశమందైనను నీవు త్రోవచూచుకొని ముందుగాఁబొమ్ము, నీవెంట నీసీతవచ్చును. నేనో మీయిద్దఱ రక్షించుచు సీతకు వెనుకప్రక్కఁగా వచ్చెదను.

ఈపద్యమునందు విలోమముగాఁ బ్రణవము చెప్పఁబడినది.అనులోమముగా నరణ్యకాండమందలి ౧౪-౨వ పద్యమునఁ జెప్పఁబడెను. లక్ష్మణుఁడు మకార మును సీత- ఉకారమును, శ్రీరాముఁ డకారమును సూచించెడిని. మకారో జీవ వాచక యన్నట్లు లక్ష్మణుఁడు జీవుని, ఉకారము=లక్ష్మిని, అకారార్థో విష్ణువని అకారము శ్రీరాముని సూచించును. ప్రపంచము (లీలావిభూతి) యీ యర ణ్యమే. ఇందుఁ బ్రవేశించిన ప్రతిదేహమునం దీమూఁడు తత్త్వములు గలవు.

ఈ యరణ్యమందు సంచారముచేయువారు సీతను అనఁగాఁ బ్రకృతిపరి ణామమైన దేహమును ముందుంచి యనఁగా దానిని మార్గదర్శిగాఁ గొనియది పోయినత్రోవ లక్ష్మణుఁడు అనఁగా జీవుఁడుపోయెనా యిరువురకు నపాయము తప్పదు. కావున దేహరక్షాభారము అవ్యవధానముగ జీవునందు, సవ్యవధాన

ముగ నీశ్వరునందుఁ గలదు. జీవుఁడు చేతనుఁడు జ్ఞానస్వరూపుఁడు. కావునఁ దాను ముందుపోయి ప్రకృతిని దేహము తనవెంటవచ్చునట్లు చేసికొనెనా యిరువుర కపాయములేదు. నేను మీ యిద్దఱిఁ గాచుచున్ వచ్చెదననుటచేఁ బ్రకృతిని జీవుని రక్షించువాఁ డీశ్వరుఁ డగుచున్నాఁడు. భగవంతుఁడు ప్రయోజకకర్త- జీవుఁడు ప్రయోజ్యకర్త- 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతన' యను భగవద్గీతా వాక్యము. బాలకాండము ౧౮-వ సర్గమందలి- 'అథ లక్ష్మణ శత్రుఘ్నౌ సుమిత్రాజనయత్సుతౌ వీరౌ సర్వాస్త్రకుశలౌ విష్ణోరర్ధసమన్వితౌ' అను వాక్యము ననుసంధించిన యెడల లక్ష్మణుని జీవస్థానమునఁ జెప్పుటయందలి సమంజసత్వమును సీత పృథివీతనయ యని చెప్పుటచే నామెను బ్రకృతి పరిణామమైన దేహముగఁ జెప్పుటయందలి సమంజసత్వము గ్రహింపనగు.

భారతయుద్ధమందలి యర్జునునిరథము దేహముగను (రథశబ్దమునకు దేహమనియు నర్థముగలదు.) నరుని జీవునిగను (నరశబ్దమునకు జీవుఁడనియు నర్థము గలదు.) కృష్ణుని భగవంతునిగను గ్రహింపవలయును. శరీరమాద్యం ఖలు ధర్మసాధనమన్నట్లు శరీరమును జక్కఁగరక్షించినసే జీవునకు నీశ్వరునకు సంతోషము. ఈ మూఁడు తత్త్వముల గుఱించి యరణ్యకాండమందు విపులముగఁ జెప్పఁబడును.

కం. కాననినిర్మానుష్యపుఁ,గానన మిది కాన మనము • కడు హెచ్చరికన్
బూని పరస్పరరక్షను, మానక కావించుటయె స•మంజసవిధ మౌ. ౧౩౫

కానని=మనమెన్నఁడెఱుంగని, నిర్మానుష్యపుఁ గాననమిది = ఇది మనుష్యులులేని యడవి, పరస్పరరక్షన్=ఒకరినొకరు కాపాడుకొనుటయె, సమంజస విధము=యోగ్యమైన మార్గము.

తాత్పర్యము.

వాస్తవ మాలోచించిన శ్రీరామలక్ష్మణులకు సీతాసాహాయ్య మనావశ్యకము. ఆమెచేయఁగల దేదియులేదు. అయినను నరణ్యమున క్షేమముగ సంతోషముగ సంచరింపవలయుననిన సీతను క్షేమముగాఁ గాపాడుట యవశ్యకర్తవ్యము. ఆమెనుపేక్షించుట తమయగచాట్లకే. అట్టులే జీవాత్మ పరమాత్మలకు దేహ (ప్రకృతి) సాహాయ్య మనావశ్యకమైనను లోకయాత్ర సలుపవలసి వచ్చినప్పుడు దేహరక్షణ మవశ్యకర్తవ్య మగుచున్నది. దేహము నుపేక్షించిన జీవుఁ డుభయలోక భ్రష్టుఁడే. ఈయుద్దేశముతోఁ 'బరస్పరరక్ష' యని చెప్పఁబడెను. అటుగాక పరస్పర మనునది రామలక్ష్మణులకే యన్వయించిన సీత నుపేక్షించిన దోషమొదవును. వాల్మీకి యీ యర్థమును మనసునం దుంచుకొనియే దానికిఁ దగిన పదములఁ బ్రయోగించెను.

కం. కడచినకార్యము చక్కం, బడుట యరిది కానఁ గడవఁ•బడుటకు మున్నే
కడుకొని యవధానులమై, జడనేమియు లేక రక్ష•సలుపఁగ వలయున్.

కడచినకార్యము=మించిపోయిన కార్యము, చక్కఁబడుట=మరల బాగు పడుట, అరిది=అసాధ్యము,కడవఁబడుటకున్=మించిపోవుటకు, కడుకొని=పూని, అవధానులమై=హెచ్చరిక గలవారమై, జడను=సోమరితనము- ప్రమాదము-

తాత్పర్యము

మించిపోయినకార్యము మరలఁ జక్కఁజేయుట యసాధ్యము. కావున మించి పోవుటకు ముందే మనము ప్రయత్నించి హెచ్చరికగలవారమై, సోమరితనము లేక రక్షింపవలయును. ఈజీవున కీదేహముపోయిన వేఱొకదేహము రాదా యందురేమో. ఒకటిగాదు కోటియైన నొకటివెంట నొకటివచ్చును. అట్లు జన్మము లెత్తుచు నీ ప్రపంచారణ్యమం దుండఁగోరువాఁడు బుద్ధిమంతుఁడా. ఈ యొక దేహముతోనే యీ యరణ్యమునకు మరల రాకుండ వైకుంఠము (అయోధ్య) జేరువాఁడు బుద్ధిమంతుఁడా. ఈసీతపోయిన వేఱొకభార్య రాదా లోకములో స్త్రీలకు దారిద్ర్యము వచ్చినదా యని శ్రీరాముఁ డనలేదుకదా. శ్రీరాముఁ డేక పత్నీవ్రతుఁడై యేల యుండెను. కావున 'ఏతద్దేహావనాసే మాం త్వత్పాదం ప్రాపయస్వ' యన్నట్లు వైకుంఠముచేరు యత్న మీయొకదేహముతోనే చేయ వలయునుగాని వేఱొక దేహమునకై కాచుకొనరాదు. ఒక్కదేహముతో ముక్తి గాంచు మార్గమే రామాయణము బోధించునది. కావున దేహము నుపేక్షింప రాదు. దానిని రక్షించుచు మరల జన్మమునకు రానిగతి వర్తింపవలెను.

మ. జనసమ్మర్ద మొకింత గానక మనో◆జ్ఞంబుల్ మహారామము
ల్గానబౌ క్షేత్రము లేమి లేకయును గం◆డ్లున్ గుండ్లు మిం డ్లొప్పి భీ
జనకం బైనయరణ్యదేశ మిదె కం◆జాతాక్షి వైదేహియు
న్వనవాసశ్రమ మింకిటం దెలిసెడిన్ ◆ నా లక్ష్మణుం డాదటన్. ౧౩౮౪

మహారామముల్=గొప్పతోఁటలు, గానబు=అందము, క్షేత్రములు=పంటలు గల ప్రదేశములు, భీజనకంబు=భయమును బుట్టించునది, కంజాతాక్షి=కమల ములవంటి కన్నులుగలది, వైదేహి=విదేహరాజు కూఁతురగు సీత, వనవాస శ్రమము = అడవులయందు వసించుటయందుఁ గల ప్రయాసము, నాన్ = అనఁగా, ఆదటన్=ప్రేమతో-

తాత్పర్యము

మనుష్యులగుంపుల రాపిడి కొంచెమైనను లేక మనోహరములైన గొప్ప తోఁటలుగాని యందమైన పంటభూములుగాని యేదియులేక గుండ్లు గండ్లు మిండ్లుగలిగి భయమును గలిగించు నరణ్యప్రదేశ మిదియే. ఇఁకమీఁద వన వాసమునఁ గల ప్రయాసము సీత తెలిసికొనఁ గలదు. ఇంతసేపు రథము మీఁదఁ బ్రయాణము చేసినట్లు గాదు అని చెప్పఁగాఁ బ్రీతితో లక్ష్మణుఁడు.

కం. మున్నుగఁ జనుడును నాతని, వెన్నంటె క్షమాతనూజ•వెలఁదికిఁ బిఱుఁదన్
సన్నుతవీర్యుఁడు రాముఁడు క్రన్నన చనుచుండె
వారిఁ•గాచుచుఁ గడఁకన్. ౧౩౯౮

తా త్ప ర్య ము

ముందుగాఁబోఁగా నాయనను సీత వెంబడించెను. ఆమెకు వెనుక వీర్యవంతుఁడై యాయిరువురను గావ సమర్థుఁడైన శ్రీరాముఁడు ధనుర్ధరుఁడై హెచ్చరికతో మెల్లగాఁ బోవుచుండెను.

ముందుపోవువారికి వెనుకవారు గానరానట్లు జీవుఁడు దేహము తమ్ము రక్షించు భగవంతునిఁ గనుఁగొనఁజాలరు. వారికి గానవచ్చినను గానరాకున్నను భగవంతుఁడు తన రక్షాకార్యమును జేయుచునే యుండును. అది యెఱిఁగి తన రక్షాభారమాయనయందు వైచి ప్రకృతిని వెనుకవైచికొని సరియైన మార్గము చూచుచు హెచ్చరికతో నిర్భరుఁడు నిర్భయుఁడునై లోకయాత్రచేయు జీవికే భయములేదు. హాని లేదు.

కం. గంగాపరపారము నరు,గంగాఁగని జెప్ప వ్రాల్ప•కయ కడుద వ్వే
గంగా వారు సుమంత్రుఁ డ,భంగార్తిని జెందె గళిత•బాష్పం డగుచున్.

గంగానదియొక్క- అపరపారము=ఆవలియొడ్డు, అరుగంగాన్=పోఁగా, అభంగార్తిని=విడువని దుఃఖమును, గళితబాష్పుఁడు=జాఱు కన్నీళ్లుగలవాఁడు-

తా త్ప ర్య ము

వారు మువ్వురు గంగానది యావలియొడ్డునకుఁ బోఁగా తెప్పవ్రాల్పక చూచి చూచి వారు మిగులదూరము పోఁగా సుమంత్రుఁడు కన్నీరు గార్చుచు మిగుల దుఃఖించెను.

కం. [ఆలోకపాలనిభులు స,మాలోకితచారుసస్య•మహితావను లై
యాలోకబాంధవుఁడు మం,దాలోకుం డగుచు నిలిచి•యవ్వత్సమునన్.]
౧౪౦౦

లోకపాలనిభులు=ఇంద్రాదిదేవతలతో సమానులు-(2) వాస్తవమైన లోకపాలుఁడు భగవంతుఁడే గనుక నాయనతో సమానులు- అవతార దశనుబట్టి సమత్వము. సమాలోకిత=చక్కఁగాఁ జూడఁబడిన, చారు = మనోహరమైన, సస్య= ధాన్యముల పైరులచే; మహిత=గొప్పదైన, అవనులై=భూములు గలవారై, లోకబాంధవుఁడు=సూర్యుఁడు, మందాలోకుఁడు=మందమైన కాంతిగలవాఁడు, అగుడున్=కాఁగా, అవ్వత్సమునన్- ఆవత్సదేశమందు- మందాలోకుఁ డనుటచే నపరాహ్ణకాలము ముగియవచ్చెనని యెఱుఁగనగు. శ్రీరాములకాలమునాఁటికి వత్సదేశము లేదనియు నాకారణముచే దీని మూలశ్లోకము ప్రక్షిప్తమనియుఁ గొందఱ యభిప్రాయము. మత్స్యదేశమనునది యపపాఠము-గంగా యమునలకు నడిమి ప్రదేశము వత్సదేశము- దానికిఁ బడమటిదేశము పాంచాలము-

యమునకు దక్షిణ తీరమున శూరసేనదేశము. దానికిఁ బడమట మత్స్యదేశము. గంగా యమునల నడిమిప్రదేశమంతయు నరణ్యముగాదు. కొంత జనావాస ప్రదేశము లున్నట్లు ౧౪౭-౯-వ పద్యమువలనఁ దెలియుచున్నది. ఆకాలమున నీదేశమునకు వత్సమనుపేరు లేదందురేని మఱియొకపేరైన నుండియుండ వచ్చును. శ్రీరామాయణమందు 'అయోధ్యకు సాకేతమని,లంకకు సింహళమని' పేర్లు కానరావు.

చం. నళినదళాక్షు లొండొకవ•నస్పతినీడను జేరి [యిర్వురున్
దొలుత వరాహఋశ్యములఁ • దొడ్డరురుం బృషతంబు నా మృగం
బుల వధియించి నాల్గిటి, బు•భుక్షితు లౌట భుజించి రంద,] అ
య్యలఘుపరాక్రముల్ తరణి•యస్తమితుండుగ వార్చిరయ్యెడన్.౧౪౦౧

నళినదళాక్షులు = తామరఱేకులవంటి కన్నులుగలవారు- సీతారామలక్ష్మణులు, వనస్పతి=వృక్షము, వనస్పతినీడ యనిచెప్పుటచే నింకను నెండ గాయుచున్నదని భావము. ఇర్వురున్=రామ లక్ష్మణులు, వరాహ=పందిని, ఋశ్యము =మనుబోతును, రురున్=నల్లచారలుగల దుప్పిని, పృషతంబున్=సాధారణమైన దుప్పిని, వధియించి = చంపి, బుభుక్షితులౌటన్ = ఆఁకలిగొన్నవారగుటచేత, అలఘుపరాక్రముల్=గొప్ప పరాక్రమము గలవారు.

ఇర్వురున్- మొదలు భుజించిరంద అను సంతవఱకుఁ ప్రక్షిప్తమని యొకరు వ్రాసిరి. ప్రక్షిప్తమనఁగాఁ దొలుతఁ గవివ్రాసినది గాదనియు నడుమ నెవరో క్రొత్తగా నిఱికించిరనియు నర్థము. ఇది యట్టిద-సీతాదేవి రక్షణ విషయ మందన్ని హెచ్చరిక మాటలు కొంచెముముందు చెప్పిన శ్రీరాముఁడు, దాని నంగీకరించిన లక్ష్మణుఁడు నిరువురు సీత నొంటిగా విడిచి వేఁటకుఁబోయిరనుట విశ్వాసార్హముగాదు. అదియునుగాక వారిమువ్వురకు నాలుగు మృగములేల?

ఆపద్ధర్మమైనను 'నాకు వేఁటయందంత యిచ్ఛలే'దని చెప్పిన శ్రీరాముఁడు వ్యర్థముగా నాలుగు జీవజంతువులఁ జంపెననుట నమ్మఁదగినదికాదు. అది యునుగాక వనస్పతి=ఫలవృక్షము ఈశబ్దప్రయోగముచేఁ దత్కాలమున నది ఫలించి యుండెననియే గ్రహింపవలయును. కావున వారు మూఁడుదినము లుప వసించి ఫలవృక్షము క్రిందనుండియు ఫలములను దినక 'వ్యాఘ్రాణా ముప వాసంతు కారణం పశు మారణ'మ్మన్నట్లు నాలుగు మృగముల మాంసముతోఁ బారణచేసిరనుట వారి స్వభావమునకు విరుద్ధము. ఉద్దిష్ట పట్టాభిషేకదినమునకు ముందురాత్రి యుపవాసము. పట్టాభిషేక దినమంతయు నుపవాసము. రాత్రి తమసానది జలము మాత్రము గ్రోలిరి. ఆవల గంగాతీరమున గంగ ద్రావిరి. ఈదినమింతవఱకు భోజనములేదు. తరణి=సూర్యుఁడు. అస్తమితుండు=అస్త మించినవాఁడు, వార్చిరి=సంధ్యవార్చిరి. ఇది యూరువిడిచిన మూఁడవరాత్రి-

'అపుష్పా ద్వనస్పతిః' పుష్పములులేక ఫలించు పనస మేడి మొదలైనవి వనస్పతు లనఁబడును.

తాత్పర్యము.

సీతా రామ లక్ష్మణు-లొక వృక్షమునీడఁ జేరిరి. అచట సీతను నొంటరిగ విడిచి శ్రీరామ లక్ష్మణులుపోయి పందిని- మనుభోతును- చాఱలదుప్పిని- దుప్పిని నాలుగు మృగములఁ జంపి తెచ్చి యాఁకలిగొన్న వారగుటచే భుజించిరి. ఆవల సూర్యాస్తమానము కాఁగా సంధ్యవార్చిరి.

— ౫౩-వ సర్గము. శ్రీరాముఁడు తల్లిదండ్రులఁ దలంచి దుఃఖించుట. —

సీ. జానకీనాథుండు • సౌమిత్రిఁ గనుఁగొని, పల్లెల దాఁటివె • ల్పలిపొలంబు
నందు వసించుట • యాసుమంత్రుండును,
నెడఁబాయఁ దొలిరేయి • యిదియకాదె
కావునఁ గడిచిన • కార్యంబు దలపోసి, కొనుచు విచారంబు • గొనకు మయ్య
నిద్దురఁ జాలించి • నెఱజాగరూకత, నీ రేయి మొదలుగ • నిద్దఱమును
తే. సీత రక్షింపవలయును • రాతురులను, లలనక్షేమంబు మనయందు • నిలిచెఁగాదె
మనము తెచ్చినయాకుల • మహిని బఱచి, పండుకొనఁదగు
శిలయొండు • దిండుగాఁగ. ౧-౨

వెల్పలిపొలంబు = మనుష్యులు వాసముచేయు ప్రదేశములకు వెలుపల నుండు భూమి, నెఱజాగరూకత=పూర్ణమైన హెచ్చరికతో- నిద్దురలేక.

తాత్పర్యము.

శ్రీరామచంద్రుఁడు లక్ష్మణునిఁజూచి "లక్ష్మణా: పల్లెల నన్నిటిని దాఁటి జనులు నివసించు ప్రదేశమునకు వెలుపల నుండు భూమియందు వసించుట సుమంత్రుఁడుకూడ వదలిపోవుట యీరెండు జరగిన మొదటిదిన మిదియేకదా. (ఇది వనవాసకాలమున మొదటినాఁడు కాదు.)

కావునఁ గడచిపోయినదాని నాలోచించుచు విచారపడకుము- నిద్దురవదలి నిండుహెచ్చరికతో నీరాత్రిమొదలు మనమిద్దఱము రాత్రులందు సీతనురక్షింపవలయును. ఆమె యోగక్షేమము మనయందే నిలిచియున్నది. మనముదెచ్చిన యాకులు భూమిపైఁబఱచి తలక్రింద దిండుగా రాతినుంచుకొని పండుకొనఁదగును.

కం. అని సుఖశయ్యాయోగ్యుం, డనఘుండు కూర్చుండి నేల • నవరజునకుఁ దా
విన నింపగుశుభకథలం, జనవున వినిపించుచోఁ బ్ర • సంగవశమునన్.

సుఖశయ్యాయోగ్యుండు = సుఖమిచ్చు పానుపునందుఁ బండుకొన యోగ్యుఁడైనవాఁడు, అవరజునకున్=తమ్మునికి, ప్రసంగవశమునన్=మాటల ధోరణిని.

తాత్పర్యము

ఈ ప్రకారముచెప్పి సుఖశయ్యమీఁదఁ బండుకొనఁ దగినవాఁడు,నేలపైఁ గూర్చుండి ప్రొద్దుపోవువఱకుఁ గష్టము మనస్సునకుఁ దెలియకుండుటకు నింపైన మంచికథలను ప్రేమతో వినిపించునపుడు మాటల ధోరణియందు-

సీ. అన్న లక్ష్మణ! ధ్రువం•బమ్మహారాజేంద్రుఁ,డడలుచు నాసుతుం•డడవి కేగెఁ
గా యని పడియుండుఁ•గైకయుఁ దనకోర్కె,తుదదాఁకెఁగాయని•తుష్టినొందుఁ
గాదె యామెయుఁ దన•గాదిలిపుత్రుండు, క్రమ్మఱుడును రాజ్య•కారణమున
నమ్మహారాజుప్రా•ణమ్ముఁ దీయదు గదా, యేమి సేయఁగలాఁడు•వృద్ధు కైక
తే. వలపువలత్రాళ్ళఁ జిక్కిన•వాఁడు దిక్కు,మాలినాఁ డేను దూర మీ•లీల వచ్చు
కతనఁదెరువేమి తెలియకే•వెతలఁబడునొ,
యేమి సేయుదుఁదమ్ముఁడా•యిప్పుడేను. ౧౪౦౪

ధ్రువము=సత్యము, అడలుచున్=దుఃఖించుచు, తుష్టి = సంతోషము, గాదిలిపుత్రుండు = ప్రియకుమారుఁడు, క్రమ్మఱుడును = మరలివచ్చినపిమ్మట, కలాఁడు=కలవాఁడు, వలపు=మోహము, దిక్కుమాలినాఁడు=దిక్కులేనివాఁడైనాఁడు, కతనన్=కారణముచేత.

తాత్పర్యము

అన్నా! లక్ష్మణా! యామహారాజు నాకొడుకు అడవులకు దుఃఖపడుచుఁ బోయెఁగదాయని నేలకఱచుకొని పడియుండును ఇది సత్యము. ఇఁకఁ గైకయో నాకోర్కె నెఱవేఱెను అని సంతోషపడుచుండునుగదా. ఆకైక తన ముద్దుకొడుకు మేనమామయింటినుండి మరలిరాఁగానే నాకొడుకు యువరాజుగా నుండనేల? ఈ ముసలివాఁడు రాజుగానుండువఱకు నాకొడుకు పెద్దరాజు గాఁజాలఁడు. రాముఁడు మరలివచ్చువఱకు వీఁడు బ్రదికియుండెనా రామునిఁ పెద్దరాజునాఁ జేయును. వీఁడిప్పుడు చచ్చెనా నాకొడుకు పెద్దరాజేయగును. అని యీప్రకారమాలోచించి రాజ్యమునిమిత్తముగ మహారాజును జంపదుగదా. చంపిన నేమి చేయఁగలఁడు. చంపకుండిన నేమిచేయఁగలఁడు. ఏలన:- ముసలివాఁడు కనుకనే యేమిచేయుటకు ధైర్యము చాలనివాఁడు. దానికితోడు కైకయందలి మోహమను వలత్రాళ్ళలోఁ జిక్కుకొన్నాఁడు తాను విడిపించుకొని రాలేఁడు. విడిపింపఁగలవాఁడు లేఁడు. నేను విడిపింపఁగలనునాని దూరముండున్నవాఁడను. నేనిట్లు దూరముగ వచ్చినకారణముచే నేమిచేయుటకుఁ దెలియక యేబాధపడునో యేమో. తమ్ముఁడా నేనేమి యిప్పుడు సేయుదునురా-

శ్రీరామునివంటివాఁడు కైక విషయమై యింత పరుషముగ మాటలాడ వచ్చునా యని సందేహము. ఇది నిండుమనస్సుతోఁ జెప్పినమాటగాదు. లక్ష్మణుని మనస్సు పరీక్షించుటకై చెప్పెడిమాటయే. అవును కైక యటువంటిదే యని

లక్ష్మణుఁ డనియుండెనా వెంటనే చీవాట్లుపెట్టియుండును. లక్ష్మణుఁడు భరతుని వంటి ధర్మాత్ముఁడు కైకవంటిదాని కెట్లుపుట్టె నన్నంత మాత్రముననే నడిమి తల్లిని నీవిట్లు తిట్టకుమని చెప్పెనుగదా. "అనవిని కైక నేల దురుసాడఁగ రాఘవ వంశనాథుఁ డత్తనయు చరిత్ర చెప్పుము ముదంబగు"నని చెప్పెను. అరణ్య ౮౭౫-వ పద్యము.

కం. పేర్మి చెడ మనకు వ్యసనా,శర్మము మతివిభ్రమంబు♦జనపతి కగుటన్
ధర్మార్థంబులకంటెను, ధర్మజ్ఞా కామ మెంచె♦దన్ బలితముగన్. ౧౪౦౫

పేర్మి=గొప్పతనము, వ్యసనాశర్మము=వ్యసనమువలని కీడు, మతివిభ్రమంబు=కామమే సేవ్యమను భ్రాంతి, ధర్మార్థంబులకంటెన్=ధర్మముకంటెను-అర్థముకంటెను- బలితంబుగన్=బలముకలవానిగా నెంచెదను.

తాత్పర్యము

మనగొప్పతనము చెడునట్లు వ్యసనమువలనఁ గలుగు కష్టము మనకును, కామమే సేవింపఁదగినది యనుభ్రాంతి రాజునకును, గలుగుటచేత నర్థము కంటెను ధర్మముకంటెను గామమే బలమైనదని తలంచెదను.

రాజు కామవశుఁడై యధర్మమని భయపడక మనకుఁ గష్టముగలిగించి తానును గష్టపడుటచేతను, తన్నుఁగట్టఁత్రాళ్లు తానే తెచ్చుకొన్నట్టు తనప్రభుత్వము తానే పోఁగొట్టుకొనుటచేతను, ఈరెంటిని సహించియైనఁ గామభోగము సంధానక్తుఁడగుటచేత నారెండింటికంటెఁ గామమే బలవత్తరమని తలఁచెదను.

ఉ. కాదనె దేని లక్ష్మణ ని♦కారముమైనెటువంటి మూఢుఁడేన్
గాదిలిపుత్రునిన్ మనసుఁ♦ గన్గొని వర్తిలువానిఁ బ్రాయపుం
బైదలిమాటఁబట్టి యిటు♦ పాయునొకో ననుఁ దండ్రి పాసి న;
ట్లేది గనంగఁ జాలుఁ గుసు♦మేషుశరాహతచిత్తుఁ డేయెడన్. ౧౪౦౬

అటుగాదు ధర్మమే బలిష్ఠమందువా- నికారముమైన్=మోసవిధముచేత, గాదిలిపుత్రునిన్=ప్రియుఁడైనకుమారుని, ప్రాయపుంబైదలి=వయస్సుస్త్రీ, కుసుమేషు=మన్మథునియొక్క, శర=బాణములచే, ఆహత=కొట్టఁబడిన, చిత్తుఁడు=మనస్సుగలవాఁడు, 'కామాంధోపి నపశ్యతి' కామముచేఁ గన్నులు గానని వాని నేదియుఁ గనఁబడదు. అని కలదుగదా.

తాత్పర్యము

నీవుచెప్పినది సరిగాదు. ధర్మమే బలియమని నీవందువా? లక్ష్మణ!యటులైన మోసవిధముచేత నెంతటి తెలివిమాలినవాఁడైనను, దనప్రియకుమారునిఁ, దాను జెప్పకముందే తనమనస్సులోని విషయము తెలిసికొని యాప్రకారము వర్తించువానిని, వయస్సు పెండ్లము మాటవిని, నన్ను, మనతండ్రి వదలినట్లు వదలునా? కావునఁ గామమే బలీయము. మన్మథబాణములచేఁ గొట్టఁబడిన మనస్సుగలవాఁ డేది మంచియో యేది చెడ్డయో యెట్లు తెలిసికొనఁగలడు.

కం. జాయాయుక్తుం డాకై, కేయీసుతుఁ డొకఁడె సుఖితఁ•గెరలెడి నౌరా
మాయురె కోసలులేలెడు, నాయతధరణీస్థలమున•కధ్యక్షుండై. ౧౪౦౭

జాయాయుక్తుండు=భార్యతోఁ గూడినవాఁడు, సుఖత=సుఖమున, కెరలెడిన్=ప్రకాశించెడిని, కోసలులు=కోసలవంశపురాజులు, ఆయత=విస్తారమైన, ధరణీ స్థలమునకున్=భూమికి, అధ్యక్షుఁడై=ప్రభువై-

తా త్ప ర్య ము

భార్యతోడి భరతుఁడొకఁడె హాయిగా నుండువాఁడు ఔరా! కోసలరాజులు లేలెడి రాజ్యమంతయు వాఁడొకఁడే యేలువాఁ డయ్యెఁగదా- ఏమిచిత్రము.

ఆ. తండ్రి ముసలివాఁడు•దారుణాటవులందు, నే వసించి మిడుకు•చిట్టు లుంట
నేకముఖముగాఁగ•నేలఁడే రాజ్యంబు,నెల్లఁ గైకతనయుఁ•డేమి చెప్ప.

తా త్ప ర్య ము ౧౪౦౮

తండ్రి ముసలివాఁడు- అవును గాదనిచెప్ప సామర్థ్యములేనివాఁడు- చెప్పినను బరులు వినకున్న నేమియుఁ జేయలేనివాఁడు- భయంకరములైన యడవులందు నేను దుఃఖపడుచు నున్నాఁడను. పెద్దవారిరువురు రెండుత్రోవలు పట్టుటచే భరతుఁడొకఁడే యేకముఖముగ రాజ్యమంతయు నేలుసుగదా. ఈచిత్ర మేమనవలయును.

కం. సార్థక మగుధర్మంబును, నర్థంబును విడిచి కామ•మనువర్తించున్
వ్యర్థుం డెవ్వం డాతఁ డ,నర్థంబులు దశరథువలె•ననుభోగించున్. ౧౪౦౯

సార్థకము=ఇహలోకసుఖము పరలోకసుఖములను ప్రయోజనముగల- అనర్థంబులు=కీడులు- దశరథుని చర్యవలన లోకమెఱుఁగవలసిన నీతి యిదియే.

తా త్ప ర్య ము

ఇహపరలోక సాధనములైన ధర్మమును నర్థమును విడిచి యెవఁడు కామమును సేవించునో ఆవ్యర్థుఁడు దశరథునివలెఁ గీడులపాలగును.

ఇచట నొకసందేహము. దశరథుఁడు ధర్మార్థముల విడిచి కామమును సేవించెనా? తాను ధర్మపాశబద్ధుఁడనని దశరథుఁడు చెప్పెను. తనతండ్రి సత్యధర్మస్థితుఁడని శ్రీరామచంద్రమూర్తి చెప్పెను. ఇచ్చట దశరథుఁడు ధర్మాధర్మముల వదలి కామమునే సేవించె ననుట యెట్లుపపన్నము?

రాక్షసులతోడ యుద్ధమునకుఁ బోవునపుడును గైకేయిని దోడుకొనిపోవుట కామాతిశయముచేతనేకదా. భర్తను రక్షింపవలసినది భార్యకు విధియైయుండఁగా నామెకు రెండువరము లిచ్చుట కామాతిశయముచేతనేకదా. ఇవట్టులుండ "చంపఁదగనివానిఁ జంపింతు- నీకుఁగాఁ జంపఁ దగినవానిఁ జూన విడుతు ధనికుఁ బేదఁగాఁగ ద్రవాఢ్యుఁగా నిఱుపేద నేనొనర్తుఁ బ్రేమఁజెపుమ" అయో. ౧౦-౨౮ ఇవి కామము కన్నులకుఁ దట్టినవాని మాటలా ధర్మస్మృతి కొంచెమైన నున్నవాని మాటలా? కావున శ్రీరామచంద్రమూర్తి సత్యమే చెప్పెను.

కం. తననాథుని వధియింపఁగ, ననునీగతిఁ గాననముల • నవయం జేయన్
ఘనరాజ్యమెల్లఁ గూర్పఁగఁ, దనసుతునకుఁ
గైక మనకు•దాపుర మయ్యెన్. ౧౪౧౦

తాత్పర్యము

తనభర్తను జంపుటకు, నన్నడవులపాలుచేసి కృశింపఁజేయుటకుఁ దన కొడుకునకు రాజ్యము లభింపజేయుటకుఁ గైక మనకు దాపరించెను.

తే. అతులసౌభాగ్యమదమోహి•తాత్మయగుచు,
నాపయినికోపమునఁ జేసి•పాపబుద్ధి
యెంత బాధించునో కదే•శాంతలైన, నాదుతల్లిని నీతల్లి•నయమువిడిచి.

అతుల సౌభాగ్య మదమోహితాత్మయగుచున్ = అసమానమైన యైశ్వర్య సౌందర్య మదముచేఁ దెలివితొలఁగిన మనస్సుగలదై.

తాత్పర్యము.

నేను సవతికొడుకను, రాజ్యపాలనమందుఁ దనకొడుకున కడ్డమువచ్చు వాఁడ, నను కోపమునఁ బాపకార్యము చేయ నాలోచనగల కైక నాతల్లిని, నా కనుకూలుఁడగు నీతల్లిని, వారు శాంతచిత్తలై యేకీడైన సయిరించువారైన సను న్యాయముదప్పి యెంత బాధపెట్టునోకదా.

కం. నాకయి జనని సుమిత్రయు, జీకాకుపడంగ నేల • చెపుమా వేగన్
వే కానఁగఁ జను మాయమ, నీకడ, నుండియ యయోధ్య•కీవు కుమారా!
౧౪౧౨

జీకాకుపడఁగన్=చిక్కులలోఁబడగ, వేగన్=తెల్లవాఱఁగా, వే=త్వరగా, ఈకడనుండి య=ఇచ్చటనుండియే.

తాత్పర్యము.

లక్ష్మణా! నానిమిత్తమై నీతల్లి సుమిత్రాదేవి యేలకష్టపడవలయును జెపుమా. తెల్లవాఱఁగానే నీవు త్వరగా నిచ్చటనుండియే యయోధ్యకుఁబొమ్ము.

మీఁదఁజెప్పిన వగలమాటలన్నియు నీపర్యవసానమునకే. లక్ష్మణుఁ డయోధ్యకుఁబోవుట యావశ్యకమని చెప్పుటకై శ్రీరాముఁ డిన్నిపోకలఁ బోయెను. ఇవి మనఃపరీక్షావాక్యములు.

కం. దిక్కేదినకౌసల్యకు, దిక్కగుమీ నీవు తండ్రి • ధృతిఁ గానల కే
నొక్కండఁ జనుదుఁ దోడ్కొని, యిక్కమలేక్షణను దడ వి•కేలా యనుజా
౧౪౧౩

దిక్కేదిన=దిక్కులేని, దిక్కు=రక్షకుఁడవు, ధృతిన్=ధైర్యముతో, తడవు = ఆలస్యము.

తాత్పర్యము

ఏల నిన్నుఁ బొమ్మనుచున్నానో తెలియునా! దిక్కులేని కౌసల్యకు దిక్కయి యామెను రక్షింతువనియే. నాగతి యేమందువా నేను సీతను దోడ్కొని యొకఁడనే యడవులకుఁ బోదును.

కం. క్షుద్రక్రియాచరణరత, రౌద్రగతిం గైక పగఁ బ♦రాభవమును సో
పద్రవగతిఁ గావించును, భద్రము నాతల్లి యనుచు♦భరతున కనుపూ. ౧౪౧౪

క్షుద్రక్రియాచరణరత = నీచకార్యములు చేయుటయందుఁ బ్రీతిగలది, రౌద్రగతిన్=క్రూరమైనవిధమున, పగ=విరోధమును, పరాభవము=అవమానము, సోపద్రవగతిన్=ఉపద్రవముతో గూడినట్లు-

తాత్పర్యము

నీచకార్యములు చేయుటయందుఁ బ్రీతిగలకైక దయలేనిదై నాతల్లికి విరోధమును నవమానమును గావించునుజుమీ. కావున నాతల్లిని జాగ్రత్తగాఁ గాపాడుమని భరతునకుఁ జెప్పుము.

కం. నాతల్లియుఁ దొలిబామున, నేతల్లినిఁ బుత్రకునిని ♦ నెడఁబాపెనొ యా
హేతువునఁ జూవె యిటు లా,పూతచరిత్రకును దుఃఖములు ప్రాప్తించెన్. ౧౪౧౫

తొలిబామునన్=పూర్వజన్మమందు, పుత్రకునిన్=చిన్నబిడ్డను, పూతచరిత్రకున్ = పరిశుద్ధమైన నడవడిగలదానికి-

తాత్పర్యము.

పూర్వజన్మమునందు నాతల్లి యేచిన్నకొడుకును దల్లినుండి యెడఁబాపెనో- ఆపాపము కారణముగ నిపు డాపవిత్రమైన నడవడిగల యామెకు నిటువంటి పుత్రశోకము లభించెను.

కం. ఏవాసరమున నెద్దెస నేవయసున నెట్టికర్మ♦మెవఁడొనరించున్
ఆవాసరము నద్దెస నావయసున నట్టికర్మ♦మతఁడు భుజించున్. ॥పంచ॥

కం. కని పెంచి పెద్దఁ జేసెను, మనిచెను బహుకష్టములను♦మలయుచు నన్నా
జనని యిటు ఫలము వేళకు, గొనకొని విడిచితిని నేటి♦కొడుకను ఛీఛీ. ౧౪౧౬

మనిచెను=బ్రదికించెను, మలయుచున్=బాధపడుచు, గొనకొని=ప్రయత్నించి-

తాత్పర్యము.

నన్నుఁగనిపెంచి పెద్దవానిని జేసెను. అనేకవిధములయిన బాధలు పడుచు నన్ను బ్రదికించెను. అట్టికన్నతల్లిని నావలన సుఖమనుభవించవలసిన సమయమునఁ బ్రయత్నపూర్వకముగ వదలిపెట్టితిని. ఛీఛీ నేనొక కొడుకనా ?

తే. కన్నతల్లికి దరిలేని•గడుసుదుఃఖ, మిడితిఁ గంటివె నే నెట్టి•కొడుక నయ్య
పుడమిలోపల నాయట్టి•పుత్రకునిని, గనక యుండెడిఁ గాకయే•జననియేని. ౧౫౧౭

దరిలేని=మితిలేని, గడుసుదుఃఖము=సహింపరాని దుఃఖమును, ఇడితిన్= కలిగించితిని.

తాత్పర్యము

కడుపారఁ గన్నతల్లికి నేనెటువంటి తీవ్రదుఃఖమును గలిగించితినో చూచితివా? ఆహా! యెటువంటికొడుకను నేనును.! భూమిమీఁద నావంటికొడుకును నే తల్లియేని కనకయుండునుగాక.

చం. అటమట మయ్యె నాజనన • మంతయు లక్ష్మణ! యేమి చెప్ప, న
చ్చటఁ బలికిన్ ముదం బిడును • శారిక కీరముఁగాంచి యల్లదే
కుటిలవిరోధిపాదమున • గొబ్బునఁ గా టిడు మంచుఁ బల్కియేన్;
గటకట యంతమాత్రమును•గానయితిం గద మానవుండనై. ౧౫౧౮

అటమటము=వ్యర్థము, శారిక=గోరువంక, కీరమున్=చిలుకను, కుటిల విరోధిపాదమునన్= వంచనప్రవర్తనముగల శత్రువు కాలియందు (౧) తన శత్రువగు పిల్లికాలియందు (౨) కౌసల్యాశత్రువు కాలియందు, గొబ్బునన్= త్వరగా, కాటు=గాయము.

మోక్షమనునట్టి బ్రహ్మానందము నొందుటకు భగవంతుఁ డొకయుపాయమై యున్నను నాచార్యుఁడతనికంటెను సులభోపాయమని యీపద్యము సూచించుచున్నది.

నహ్యమ్మయాని తీర్థాని, నదేవా మృచ్ఛిలామయాః
తే పునం త్యురుకాలేన, దర్శనాదేవసాధవః॥ భాగ. ౧౧

జలమయములైన తీర్థములు మృచ్ఛిలామయములైన దేవతలు దీర్ఘ కాలమునకుఁగాని భక్తులఁ బవిత్రులఁ జేయఁజాలవు. సాధువు దర్శనమాత్రమున నే పవిత్రుని జేయును.అనికదా యాచార్యుఁడు సులభోపాయమనుటకుఁ బ్రమాణము. ఇచ్చట శారికయే యాచార్యుఁడు. శారికకు రెండు ఱెక్కలవలెనే యాచార్యునకు జ్ఞానకర్మములను రెండు ఱెక్కలుగలవు. శారిక స్త్రీలింగస్వారస్యమునుబట్టి స్త్రీప్రాయమితరత్సర్వమ్మని యుండుటచే నాచార్యుఁడు భగవత్పరతంత్రుఁడని సూచితము. ఆచార్యునికి భగవత్పారతంత్ర్యముండుటంబట్టియు జ్ఞానకర్మములను రెండు ఱెక్కలుండుటఁబట్టియు శారికయను పదమునకు నాచార్యుఁడని యర్థము చేయఁబడియె. తల్లికిన్=లోకులకు, ముదంబు=మోక్షానందము నిడును. 'పశుర్మనుష్యః పక్షీవాయేచవైష్ణవ సంశ్రయాః । తేనైవతే ప్రయాస్యంతి తద్విష్ణోః పరమంపదమ్'॥ అనునది దీనికిఁ బ్రమాణము వైష్ణవు నాశ్రయించిన పశువుగాని మనుష్యుఁడుగాని పక్షిగాని వానితోడ విష్ణువుయొక్క పరమపదమునకుఁబోవును అని యర్థము. ఆచార్యుఁ డెట్టివాఁడనఁగాఁ జెప్పు

చున్నాఁడు. కీరమున్=చిలుక సమానవర్ణముగల భగవంతునిఁ గాంచి, కుటిల విరోధి పాదమునన్=కుటిలవిరోధి=దుర్బుద్ధిగల సంసారమనెడి విరోధియొక్క, పాదమునన్=అధారములగు నహంకార, మమకారములందు- అహంకార మమ కారములు సంసారవృక్షమునకు నాధారములు. "అనాత్మన్యాత్మబుద్ధిర్వా అస్వే స్వమితియామతిః। అవిద్యాతరుసంభూతి బీజమే తద్ద్విధాస్థితమ్" అనాత్మవస్తు వగు దేహమందు నాత్మభ్రాంతియు తనసొత్తుగాని దానిని దనసొత్తని తలంచు టయు అవిద్యావృక్షమునకు సంభూతికారణములైన రెండుబీజములు రెండును గానై యున్నవి. గొఱ్ఱునస్ కాటిడుము=త్వరగా నశింపఁజేయుము. అనుచుఁ బలికి యాచార్యుఁ డిట్టికృత్యములను జేయుచుండును అని భావము. అంత మాత్రమును గానయితినిగదా. ఆచార్యునివలె మోక్షలాభమున శ్రీరాముఁడనెడి భగవంతుఁడు సులభోపాయముకాఁడని భావము, శ్రీరాముఁడనెడి భగవంతుఁడు అయోధ్యయనెడి వైకుంఠమునుండి బయలుదేఱి విరజానదియనెడి తమసా నదినిదాఁటి 'ద్వాసుపర్ణా సయుజాసఖాయా సమానంవృక్షం పరిషస్వజాతే। తయోరన్యః పిప్పలంస్వాద్వత్త్యన శ్నన్నన్యోఽభిచాకశీతి=ఈ రెండు మంచి ఱెక్కలుగల పక్షులు సయుక్కులు సఖులు నొక్కవృక్షముందేయున్నవి. ఆరెంటిలో నొకటి తియ్యని పిప్పలిఫలమును దినునది. రెండవది తినక ప్రకాశించునది- వృక్షము దేహము- పక్షులు జీవాత్మపరమాత్మలు- కర్మఫలములు తినునది జీవాత్మ- తినకయుండునది పరమాత్మ- వేదాంతమునఁ జెప్పఁబడినట్టి 'ఋతం పిబంతౌ సుకృతస్యలోకే గుహాంప్రవిష్టౌ పరమేపరార్ధ్యే' యని శ్రుతిచెప్పినట్లు కర్మఫలమును జీవునిచేఁ దినిపించుచుఁ దాను సంసారములో దిగినది మొదలు తన యనుభవములేని నిత్యసూరులనుదలఁచి చింతించుచుఁ దా నీసంసారమును జొచ్చి సంసారులను విశేషముగాఁ జక్కఁబఱుపకపోవుటచేతఁ దానై వచ్చి జనులఁ జక్కదిద్దుటకంటె నాచార్యపూర్వకముగా జనుల సంసారమునుండి యుజ్జీవింపఁ జేయుట యుత్తమపక్షము. అపుడే జనులు విశేషముగాఁ జక్కఁబడుదురని తలఁచి యట్లుచేసెనని యీకథాసందర్భమువల్ల నేర్పడిన సంగతికాన నాచా ర్యుఁడే భగవంతునికంటె సులభోపాయమని యీపద్యము ముఖ్యతాత్పర్యము.

తాత్పర్యము

లక్ష్మణా! నాజన్మము వ్యర్థము. ఏలయందువా? యేమని చెప్పుదును. మాతల్లి నన్నుఁ బెంచినట్లు చిలుకను గోరువంకనుగూడఁ బెంచెను. తనకు శత్రు వగు పిల్లి వచ్చిన గోరువంక చిలుకనుజూచి కుత్సితపు నడవడిగల విరోధికాలి యందుఁ గాటుపడఁగొఱుకుము మరల నిచ్చటికిరాకుండును అని చెప్పెను. అక్కా పిల్లివచ్చెఁ గొట్టుకొట్టుమనుట పెంపుడు చిలుకలకు గోరువంకలకు స్వభా వము. మనుష్యుఁడనైన నేనామాత్రమును జెప్పనైతినిగదా.

చ. ఎలమి మదంబ యేమి సుఖి • యించె ననుం గని పుత్రు, సౌఖ్యముల్
కలుగక యున్న మానెడిని • గాక యయో యెటువంటిదుఃఖముల్
గలిగెను నానిమిత్తముగఁ • గల్గియు నేమిఫలంబు చెప్పుమీ
యిలపయి నిట్టిపుత్రకుఁ, డ • దృష్టవిహీన మదంబ చూడఁగన్. ౧౪౧౯

మదంబ=నాతల్లి, అదృష్టవిహీన=నిర్భాగ్యురాలు.

తాత్పర్యము

నాతల్లి నన్నుఁగొడుకుగాఁగని యేమిసుఖించెను? సౌఖ్యములులేక మానెడినిగాక యయ్యో! నానిమిత్తమై యెటువంటి దుఃఖము లనుభవించుచున్నది. నావంటి కొడుకుండియు నేమిమేలు, మాతల్లి నిర్భాగ్యురాలుసుమీ.

ఆ. అడలు చుండుదాని • కల్పభాగ్యకు గొడ్డు, రాలిఁబోలి యున్న • యమలమతికిఁ
గొడుకుగాఁగఁ బుట్టి • కూర్చిన మే లేది, పలుకవయ్య నీవ • లలితచరిత.

అడలుచుండుదానికిన్ = దుఃఖించుచుండు దానికి, అల్పభాగ్యకున్ = కొంచెపు భాగ్యముగలదానికి, మగఁడని యొకఁడుండియు లేనివానివలె నుండుటమాత్రమే యల్పభాగ్యము. గొడ్డురాలిఁ బోలియున్నదానికిన్=కొడుకుండియు లేనిదానివలె నుండుదానికి, అమలమతికిన్ = నిర్మలమైన మనస్సుగలదానికి, లలితచరిత=మనోహరమైన గుణములు గలవాఁడా.

తాత్పర్యము

దుఃఖముల పాలుపడినదానికి, ముత్తైదువుగానుండుట యను భాగ్యము మాత్రముగలదానికిఁ గొడుకుండియు లేనిదానివలెనుండు దానికి (కదళీ వంధ్యకు) నేను గొడుకుగాఁబుట్టి యామెకుఁ జేసినమేలేదియో.

కం. నిర్భాగ్యురాలు గద నను, గర్భంబునఁ దాల్చి కనిన • కౌసల్య మహా
దుర్భరతరశోక ప్రా, దుర్భావంబున నలంగి • దూపిలు చుండున్. ౧౪౨౧

దుర్భరతర=మిక్కిలి భరింపరాని, శోకప్రాదుర్భావంబునన్ = శోకము కలుగుటచే, నలంగి=రాపిడిపడి, దూపిలుచుండున్=వ్యసనపడుచుండును.

తాత్పర్యము

నన్నుఁ దనగర్భమునఁ దాలిచి కనుటచేఁ గౌసల్య నిర్భాగ్యురాలే. కనుకనే సహింపరాని దుఃఖముకలదై బాధపడి వ్యసనపడుచుండును.

ఉ. ఏనొకరుండనే పుడమి • నెల్ల నయోధ్యను శాతబాణసం
తానవిదారితంబుగ నొ • నర్పఁగఁ జాలనె? కారణంబు లే
కేను బరాక్రమింపఁ దగు • నే? పరలోకభయంబు ధర్మభీ
జ్ఞానము మాన్చెడి న్నను న • సాధ్యమె పట్టము కట్టుకొంటయున్. ౧౪౨౨

శాతబాణ సంతానవిదారితంబుగన్=పదునైనబాణముల సమూహములచేఁ జీల్పఁబడినదిగా, ధర్మభీజ్ఞానము=ధర్మము చెడునేయను భయమునకుఁ గారణమైన జ్ఞానము.

తా త్ప ర్య ము

అట్లైనఁబోయి పట్టము కట్టుకొనరాదా నేను సహాయపడెదనందువా నేను బట్టముగట్టుకొనవలెనని తలఁచినయెడల నితరులసాహాయ్యము నాకేల? నేనొక్కఁడనే భూమినంతయు నయోధ్యను గుఱుకు ములుకుల వరుసలచే నణఁకిపైవలెనా? అట్లైన నిట్లీల యడవులకు వచ్చితివందువా? కారణములేక నేను బరాక్రమముఁ జూపవచ్చునా? చూపిన నేమియందువా? నిరపరాధులను జంపిన పాపముచేఁ బరలోకప్రాప్తి నాకు లేకపోవునను భయము, రాజ్యకాంక్ష ధర్మము చెఱిచితినని యపనింద వచ్చునే యనుభయము, వీనియొక్క జ్ఞానము నన్నాపనిచేయకుండఁ జేయుచున్నదికాని పట్టము కట్టుకొనుటకూడ నొక యసాధ్యకార్యమా.

దీనివలన నెంత బలవంతునకైనను, సమర్థునకైనను నధర్మప్రవర్తనము తగదని యేర్పడుచున్నది.

శ్లో. నృపాశ్చనాభాగ భగీరథా దయోమహీ మిమాం సాగరాంతాం విజిత్య
సత్యేనతేప్య జయంప్రాతలోకాన్నే శే బల్యస్యేతి చరే దధర్మమ్॥
అలర్కమాహు ర్నరవర్యసంతం సత్యవ్రతం కాశికరూశరాజమ్
విహాయరాజ్యాని వసూనిచైవ నేశే బలస్యేతి చరేదధర్మమ్॥ మార్కండే॥

నాభాగ భగీరథాదిరాజులు సత్యముచే సముద్రాంతభూమిని సాధించి పాలించిరిగాని బలవంతులమని యధర్మము ననుష్ఠింపలేదు.

తోటకము. అని పెక్కు తెఱంగుల ♦ నశ్రుయుతా
ననుఁడై విజనంపువ♦నంబున నా
యనఘాత్మకుఁ డేడిచి ♦ యానిశ యం
దౌనరనీ మునిపోలికి ♦ నున్న యెడన్. ౧౪-౨౩

అశ్రుయుతాననుఁడై=కన్నీళ్లతోఁగూడిన ముఖముగలవాఁడై, విజనంపు వనంబునన్=జనములులేని యడవియందు.

అనఘాత్మకుఁడు=పాపమెఱుఁగని మనస్సుగలవాఁడు, ఛందస్సు. తోటకమునకు నాలుగు సగణములు. ౯-వ యింట యతి.

తా త్ప ర్య ము

అని తనవలనఁ దల్లికి లోకులకుఁ గలిగిన దుఃఖము దలఁచి యనేకవిధములఁ గన్నీళ్లతోఁగూడిన కన్నులు కలవాఁడై యూరార్చుటకు జనులులేని యడవియందు నేపాపమెఱుఁగని శ్రీరామచంద్రుఁ డారాత్రియేడిచి మౌనవ్రతమూనిన వానివలె నూరకుండెను.

తోదకము. అలలు చలింపని♦యంబుధినామం,టలపెను పాఱధ♦సంజయునట్టుల్
నిలిపి విలాసము♦నివ్వెఱ నుండన్, లలివచనంబుల ♦
లక్ష్మణుఁ డాడెన్. ౧౪-౨౪

అంబుధి=సముద్రము, పెనుపు=అభివృద్ధి, అణన్=అణఁగిపోఁగా, ధనంజయునట్టుల్ = అగ్నిహోత్రునివలె, ధనంజయోర్జునే శక్రేదహనే దీహమారుతే. నానా.ర. నివ్వెఱన్=నిండు + వెఱ = నిండు వెఱగుపాటున, లలితవచనంబులన్=ఉత్సాహము కలిగించు మంచిమాటలచే.

తాత్పర్యము

అలలు కదలని సముద్రమువలె, మంటలు చల్లాఱిన యగ్నిహోత్రునివలె నేమము నిలిపి వెఱగుపడినట్లుండఁగా నుత్సాహకరములగుమాటల లక్ష్మణుఁడిట్లనియె. నిలిపి విలాప మనుటచేఁ దనంతటఁదానే యుపశమించుకొనెనని భావము. అలలు చలింపనియంబుధి=విశేషించి యలలు చలించుటకు ముఖ్యకారణము వాయువు. వాయువు ప్రేరితములై యల లెగయును. అట్టులే దుఃఖము ప్రేరించువారెవ్వరు లేక యుండిరని భావము.

ఈయుపమానము పూర్ణముగ శ్రీరామునం దన్వయింపదు. ఏలన-అలలు కలుగుటకుఁగారణము వాయువు మాత్రమేకాదు. భూభ్రమణము సూర్యచంద్రాకర్షణము మూలకారణము. గాలి ప్రేరణముచేఁ బెద్దయలలు లేకున్నను గ్రహాకర్షణమువలనఁ జిన్నయలలైన నుండును. అట్టులే శ్రీరామునందు శోకముండెనని యర్థమగును. ఈసందేహము తొలఁగింప మంటలు చల్లాఱిన నగ్నియని చెప్పెను. అగ్ని నిశ్శేషముగ నాశమైనట్లు శ్రీరాముని వ్యసనము నిశ్శేషముగ నశించెనని భావము.

—• లక్ష్మణుఁడు శ్రీరాముని నూరార్చుట. •—

ఉత్సాహము. నిక్కమింత రామచంద్ర • నీవు వీడి వచ్చుటన్
దిక్కుమాలి యాయయోధ్య • తేజు మాసి యుండెడిన్
జుక్కఱేఁడు లేని రేయి•చొప్పునన్; వ్యథామతిన్
స్రుక్కఁదగునె నేను సీత • స్రుక్కమే నినుం గనన్. ౧౪-౨౫

ఇట్లు దుఃఖించుచున్న శ్రీరాముని లక్ష్మణుఁ డిట్లూరార్చుచున్నాఁడు.

నిక్కము=నిజము, నిశ్చయశబ్దభవము, చుక్కఱేఁడు=చంద్రుఁడు, లక్ష్మణుని యుత్సాహవాక్యము లుత్సాహవృత్తమందుఁ జెప్పఁబడినవి. ఉత్సాహమునకు నేడు సూర్యగణములు, ఒక గురువు, ఐదవగణము మొదటి యక్షరము యతి. ఇందు నగణమురాక యన్నియు హగణములే యగునేని సుగంధివృత్తమగును. నగణహగణములకు సూర్యగణములని పేరు.

తాత్పర్యము.

రామచంద్రా నీవు చెప్పినమాటలందు నింతమాత్రము నిజము. నీవు వదలి వచ్చినకారణమున దిక్కులేనిదై యీ యయోధ్యకాంతిహీనమై చంద్రుఁడు లేని రాత్రివలె యుండుటయందు సందేహములేదు. కాని వనవాసమునకు రాకముందు చేయవలసిన యాలోచన వనవాసమునకై నిశ్చయించుకొనివచ్చిన పిమ్మట నిష్ఫ

డిక్కడ నాలోచించి దుఃఖపడుట తగినకార్యముగాదు. ముందుచేసిన కార్యముం గూర్చి వెనుక నాలోచించువాఁడు బుద్ధిమంతుఁ డనిపించుకొనఁబడఁడు. వెనుకఁ జింతించుట వెఱ్ఱితనము. నీవు ధైర్యముతోనున్న కారణముచే నాయన ధైర్యముతో నుండఁగా మనము దుఃఖించిన నాయనకు సంకటమగునేయని మేము నీ నిమిత్తమై నిబ్బరించు కొనియున్నారము. నీ విట్లు దుఃఖపడితివేని నీకై మేమెంత దుఃఖింపవలసియుండునో యాలోచింపుము.

మత్తకోకిలము. నిన్నుఁ బాసి ధరాతనూజయు • నేను నొక్కముహూర్తమే
నిన్నిలం గలవారమే తమ•నీటిఁ బాసినచేఁపల
ట్లన్న! యాజనకాఖ్యుఁ డేటికి•నంబ యేటికిఁ దమ్ముఁడేన్
నిన్నుఁ బాసిన స్వర్గమేటికి•నిక్క మియ్యది రాఘవా. ౨౪-౨౬

ధరాతనూజ=సీత.

తాత్పర్యము

రామచంద్రా! నీ విచ్చట దుఃఖపడుచునుండి నన్నారికిఁ బొమ్మంటివి గాని నామనస్థ్సితి యాలోచింపనైతివి. నేనుగాని సీతగాని మా సుఖముగోరి నీవెంట రాలేదు. సుఖమును గోరినవారమైతిమేని యయోధ్యయందే యుండి యుందుము. నీసేవగోరి వచ్చినారము. ఆసేవ నీపూరనుండినను జేయుదుము. అడవియందుండినను జేయుదుము. కాలదేశములు మాకుఁ బ్రధానములుగావు.

యన్ముహూర్తం క్షణంవాసి, వాసుదేవో న చింతితః
సాహానిస్తన్మహచ్ఛిద్రం, సాభ్రాంతి సాచవిక్రియా
ఏకస్మిన్నప్యతిక్రాంతే, ముహూర్తే ధ్యానవర్జితే
దుస్యుభి ర్ముషితానైవ, యుక్తమాక్రందితుం భృశమ్॥

అను వాక్యము లిచ్చట ననుసంధింపఁదగు.

మా కుత్తమపురుషార్థము నీతోడనుండి నీకు సేవచేయుటయే. అదియే మాకు సుఖము. అదియే మాకులాభము అదియే మాకు స్వభావసిద్ధము. మాయభిప్రాయము లిట్లుండ నిన్ను వదలి సీతయు నేను నొక్క ముహూర్త కాలమైన నుండఁజాలము. నీటిలోని చేఁపను మైటవేసిన బ్రతుకఁగలదా నిన్నాశ్రయించి జీవించియుండువారము. ఒకవేళ సీతాదేవి స్త్రీగావున్న స్త్రీలమనస్సు కఠినము గావున నిన్ను విడిచి కొంతకాలమైన నుండఁగలదేమో కాని నేనుమాత్రముండఁ జాలను. వాస్తవమిట్లుండ నిన్ను విడిచినపిమ్మట నాకు జనకుఁడేల; జననియేల; తమ్ముఁడేల; ఆ స్వర్గమే యెదురుగ వచ్చినను నేల?

దీనికే పరమభక్తియనిపేరు. అట్లు చేయవలసివచ్చెనేని సమస్తసోపాధిక బాంధవులవదలియైన భగవత్సేవ చేయవలయును. పునర్విశ్లేష భీరుత్వం పరమాభక్తిరుచ్యతే"యనిభగవంతునితో వియోగమువచ్చునేమోయని భయపడుటయేపరమ

భక్తి. ఇదియే ముక్తికారణము. భక్త్యా పరమయావాపి ప్రపత్త్యావా మహామునే: ప్రాప్యోహం నాన్యథాప్రాప్యః మమకైంకర్య లిప్సుభిః'' పరమభక్తిచేఁగాని ప్రపత్తిచేఁగాని నా కైంకర్యపరులకు నేను ప్రాప్యుఁడనేకాని యితరమార్గముల నేను లభింపను అని యర్థము.

ధరాతనూజామ నని ముందు చెప్పుటచే నీ యర్ధాంగలక్ష్మి, యనపాయినియగు సీతయెట్టిదో నేను నట్టివాఁడనే యని భావము. అరణ్యమునకు వచ్చెదనని నేను నిన్నుఁ గోరినపుడు సీతాదేవిని బురస్కరించుకొని యామె పురుషకార మూలమున నీకు శరణాగతి చేసితిని. ఇప్పుడు నీవు నన్ను వదలితివా నా శరణాగతి వ్యర్థమైనట్లే తన పురుషకారము వ్యర్థమయ్యెనుగదా యని నాగతికే యామెయు వచ్చును.

ఇందు మర్కటకిశోరన్యాయము చెప్పఁబడినది. క్రోఁతిపిల్ల తల్లి యెన్ని గంతులు పెట్టినను ఏమిచేసినను తల్లినివదలక కఱచుకొనియే యుండును. నీవు తల్లిని వదలిపొమ్మన్నఁ గ్రోఁతిపిల్ల యెందుఁబోఁగలదు? నాగతియు నంతే.

కం. అనుచు మును పున్నవృక్షం, బున క్రిందను సెజ్జఁ గూర్పఁ • బొరి సుఖముగ నా
 సనములు గొని రందఱుఁ ద,మ్ముని మాటల రామవిభుఁడు • మోదంబు గనెన్. ౧౪౨౭

వృక్షంబున క్రిందన్=చెట్టుయొక్క క్రింద, సమానంబున షష్ఠీసప్తమ్యర్థంబున నకారంబు పై కల్పికంబుగనగు. సెజ్జ=పడుక, శయ్యాశబ్దభవము.

తాత్పర్యము.

అని ముందుండిన చెట్టుక్రిందనే పడుకపఱుపఁగా మిక్కిలి సుఖముగా వారు కూర్చుండిరి తమ్ముని మాటలకు రామచంద్రుఁడును సంతోషించెను.

కం. గిరిసానుగోచరము కే,సరియుగ్మము మాడ్కి రామ • సౌమిత్రులు లో
 దరసంభ్రమములు పాయుచు, గురుశౌర్యులు నిర్జనవనిఁ • గొలిరి రేయిన్. ౧౪౨౮

గిరిసానుగోచరము=కొండచరులయందుఁ గానవచ్చునది, కేసరియుగ్మము=సింహములజంట, మాడ్కిన్=వలె, దరసంభ్రమములు = భయముతొట్రుపాటు, గురుశౌర్యులు=గొప్ప శౌర్యముగలవారు, నిర్జనవనిన్ = మనుష్యులులేని యడవియందు, కొలిరి=ఉండిరి.

తాత్పర్యము

కొండచరులయందుఁ గానవచ్చు రెండు సింహములవలె భయము తొట్రుపాటువదలి పరమపరాక్రమవంతులగు శ్రీరామలక్ష్మణు లారాత్రి మనుష్యులులేని యడవియందుండిరి.

—• ౫౪-వ సర్గము శ్రీరాముఁడు భరద్వాజాశ్రమంబునకుఁ బోవుట. •—

కం. అంతట నిర్మలనళిన్, కాంతునిబింబంబు దోఁప • గంగాయమునో
 పాంతపు దేశము భీకర,కాంతార మదృష్టపూర్వ•కమ్ర విషయముల్. ౧౪౨౯

నిర్మల నళినీకాంతుని బింబంబు=మలినములేని సూర్యబింబము,అనుటచే సూర్యునిబింబ ముదయించిన యేడు నిమిషములవఱకు నెఱ్ఱగానే యుండును. అవలఁ దెలుపగును, సూర్యుఁడు స్పష్టముగాఁ దెలియవచ్చువఱకుఁ గాచియుండు టకుఁ గారణ మా మహారణ్యములో మార్గములేమి, ఉన్నను దెలియరామియని యెంచవలయును. గంగాయమునోపాంతపుదేశము=గంగకు యమునకు మధ్యమున నుండుదేశము, భీకరకాంతారము=భయంకరమైన యడవి, అదృష్టపూర్వ= ముందుచూడని, కమ్రవిషయముల్=ఇంపైనదేశములు, ఇవి వత్సదేశమందలి యవాంతరదేశములు, ఇది యూరువిడిచిన నాలుగవనాఁటిచర్య.

తాత్పర్యము

అంతట సూర్యబింబము నిర్మలమైస్పష్టముగఁ గానరాఁగా గంగాయమునానదుల నడిమి దేశమునుండు భయంకరమైన యడవిని మునుపెన్నఁడు చూడని మనోహరములైన దేశములు.

కం. కనుఁగొనుచు యథాక్షేమము,గను వివిధధరారుహాళిఁ•గాంచుచు దివసం
 బున నర్ధమండలసమయ,మున లక్ష్మణుఁజూచి పురుష•ముఖ్యుఁడు పలుకున్. ౧౪౩౦

వివిధ ధరారుహాళిన్=అనేకవిధములైన చెట్లవరుసలను, దివసంబునన్= పగటియందు, అర్ధమండల సమయమునన్ = సూర్యబింబము సగము గ్రుంకి సగము కానవచ్చు సమయమందు, యథాక్షేమము = క్షేమము నతిక్రమింపని విధముగ.

తాత్పర్యము

చూచుచు క్షేమముగ నానావిధములైన చెట్లవరుసలు పరికించుచుఁ బగ టర్ధాస్తమాన సమయమున లక్ష్మణుఁజూచి పురుషశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రుఁ డిట్లనెను.

కం. అల్లదె ప్రయాగచుట్టును, బెల్లుగ దహనధ్వజంబు•విధమున ధూమం
 బుల్లాసంబుగఁ గమురా,జిల్లెడి ముని యచట నెలవు•చేకొనఁబోలున్. ౧౪౩౧

అల్లదె=అదిగో దూరమునఁ గానవచ్చుచున్నది, ప్రయాగ=ప్రయాగము, ఈ ప్రయాగమునకు సమీపమందే భరద్వాజాశ్రమ మిప్పటికినున్నది, అచ్చుగఁ బ్రయాగలోపల భోజరాజీయము. ౧ల-౨ గయాప్రయాగములనేసేవింపక,మను చరిత్ర ప్రయాగఁజేసిన ఆది ౭౭౭-౨౮. అని ప్రయోగములుండుటచే ప్రయాగ, ప్రయాగములని రెండురూపములు గ్రాహ్యములు. దహనధ్వజంబు విధమునన్=

పొగవలె, అగ్నిహోత్రుని ధ్వజమువలె, అగ్నికి ధూమధ్వజుఁడనిపేరు. ధూమధ్వజుఁడాజ్యవృష్టిఁ బ్రుంగుడుపడునే, భార. ధూమము=పొగ, రాజిల్లెడిన్ = ప్రకాశించుచున్నది, ముని=భారద్వాజుఁ, నెలవు=స్థానము, గంగా యమునా సంగమము పుణ్యప్రదేశమగుటచే ననేకు లనేకములగు యజ్ఞములు చేయుటచేఁ బ్రయాగము అను పేరుగాంచెను. తాత్పర్యము.

లక్ష్మణా! యిదిగోఁ జూడుము. అగ్నిహోత్రుని ధ్వజమువలె సంతోషముతోఁ బొగయెగయుచున్నది. అచట భరద్వాజముని యుండనోపు.

కం. గంగాయమునాతటినీ, సంగమమునఁ జేరితిమి నిజం బదె వింటే
భంగాన్యోన్యవిఘట్టనఁ, బొంగారు రవంబు వినఁగఁ బోలెడి నిటకున్. ౧౪౩౨

సంగమము=కలియుప్రదేశము, భంగాన్యోన్య విఘట్టనన్=అలలొక దాని నొకటికొట్టుటచే, పొంగరు=అతిశయించు, పొంగు + అరు) రవము=ధ్వని.

తాత్పర్యము.

లక్ష్మణా! మనము గంగా యమునా నదులుకలియు ప్రదేశమునకు వచ్చితిమి. అది యెట్లు తెలిసెననిన అల లొకదానితో నొకటి కొట్టుకొనఁగాఁ గలిగిన ధ్వని వినవచ్చుచున్నది వింటివా.

కం. రాజితవన్యపదార్థము, చే జీవిక నడపువారు చీల్చినకట్టెల్
భూజవిశేషములు భర, ద్వాజాశ్రమమందుఁ గంటె తమ్ముఁడ యనుచున్. ౧౪౩౩

రాజితవన్యపదార్థము=ప్రకాశించు వనములయందుఁ బుట్టిన వస్తువులచే, జీవిక=దేహయాత్ర, భూజవిశేషములు=పలువిధములైన చెట్లు.

తాత్పర్యము

అడవులయందుఁ బుట్టిన వస్తువులచే జీవనము చేయువారు చీల్చినకట్టెలు పలువిధములయిన చెట్లు భరద్వాజాశ్రమమందు లక్ష్మణా చూచితివా.

ఆ. అంత నపరకుభృదుపాంతదేశంబున, లంబమానరక్తబింబుఁ డగుచు
నరుణకిరణుఁ డమరనాధన్వులగిరి, యమున గంగఁగలియునట్టిచోట ౧౪౩౪

అపరకుభృత్+ఉపాంతదేశంబునన్ = పడమటికొండ సమీపంబున, లంబమాన=వ్రేలాడుచున్న, రక్తబింబుఁడు=ఎఱ్ఱని బింబముగలవాఁడు, అగుచున్=అరుణకిరణుఁడు = ఎఱ్ఱని కిరణములుగల సూర్యుఁడు, ధన్వులు = ధనుస్సుల ధరించినవారు.

తాత్పర్యము

పడమటికొండ సమీపంబున సూర్యుఁ డెఱ్ఱని బింబముగలవాఁడై వ్రేలుచుండఁ గాధనుర్ధరులైన యాశ్రీరామలక్ష్మణులుగంగాయమునలు కలియు స్థలమునందు.

కం. వెలయుభరద్వాజాశ్రమ, తలముం జేరంగ బెదరఁ దన్మృగపక్షుల్
బలియురు ముహూర్తమాత్రం, బెలమిం జని చొచ్చి రాశ్రమేలనన్నెల్లన్.

తన్మృగపక్షుల్=అందలి జింకలు, పక్షులు బెదరుచు=బలవంతులు, ఆశ్ర మేలన్=ఆశ్రమ + ఇలన్=ఆశ్రమభూమిని.

తాత్పర్యము

ఉన్న భరద్వాజమహాముని యాశ్రమభూమిని జేరఁగా విల్లు బాణములు ధరించిన బలవంతులైన శ్రీరామలక్ష్మణులఁజూచి యాశ్రమమందలి మృగములు పక్షులు భయపడి బెదరఁగా నాశ్రమ విచిత్రములఁజూచి సంతోషించుచుఁ గొం చెముసేపాశ్రమభూమిని మెల్లఁగాఁ జని ప్రవేశించిరి

భరద్వాజ శబ్దమునకు వ్యుత్పత్త్యర్థ మాయనయే యిట్లుచెప్పెను.

శ్లో. భరేఽసుతాన్ భరే శిష్యా, న్భరేదేవాన్ భరేద్విజాన్
భరే భార్యా మహం వ్యాజా, ద్భారద్వాజోస్మి శోభనే.

వ్యాఖ్య. అను. ౧౪-౨-వ అధ్యా.

ప్రజావై వా జస్తామేవ బిభర్తీతి శ్రుత్యనుసారేణ స్వనామాభరే ఇతి॥ అసు తాన్=అపుత్రాన్=ఉదాసీనాన్ దీనా నదీనాన్ పాలయామి

అర్థము.

నాపుత్రులు గానివారిని నుదాసీనులను దీనుల నదీనుల ద్విజులను భార్యను భరింతును. కావున నాపేరు సుందరీ! భరద్వాజుఁ డందురు.

సీ. ఆయాశ్రమస్థలి•నటు చేరి జానకీ,సహితులై తపసిద•ర్శనము సేయఁ
గోరి యదను వేచి•దూరంబునందున, నిలిచి తచ్ఛాత్రుల•వలన వార్తఁ
బుచ్చి లోఁజొచ్చి స•త్పూతశిష్యావృతు, సంశ్రితవ్రతునిఁ బ్ర•శస్తచరితు
నేకాగ్రచిత్తు సం•స్తోకతపోలబ్ధ, చక్షు మహాత్ముని•సన్నిధిఁ గని
తే. యగ్నిహోత్రవిధానంబు • సొంత మగుడు,నొయ్యలక్ష్మణజానకీ•యుక్తుఁ డగుచు
నళినలోచనుఁ డభివాద•నం బొనర్చి,పేరుకొనుచును దనపేరు•వెండిపలుకు. ౧౪౩౬

ఆశ్రమస్థలిన్=ఆశ్రమప్రదేశమును,అదను = సమయము,తచ్ఛాత్రులవల నన్=ఆయన శిష్యులవలన, సత్పూతశిష్యావృతున్=మిగులఁ బవిత్రులైన శిష్యు లచేఁ జుట్టుకొనఁబడినవానిని, సంశ్రితవ్రతునిన్ = చక్కఁగా ననుష్ఠింపఁబడిన వ్రతములు గల వానిని, ప్రశస్తచరితున్=లోకులచేఁ బొగడఁబడిన నడవడిగల వానిని, ఏకాగ్రచిత్తున్ = ఒక్కలక్ష్యమునందే నిలిపిన మనస్సుగలవానిని,అస్తోక= గొప్పదియగు,తపస్=తపస్సుచే,లబ్ధ=పొందఁబడిన, చక్షున్=కన్నులుగలవానిని, ఒయ్యన్=మెల్లగా, ఈ భరద్వాజుఁడు వాల్మీకి శిష్యుఁడగు భరద్వాజుఁడుకాఁడు. ఈయన వేదకమహర్షి అస్మద్గోత్ర మూలపురుషుఁడు.

తాత్పర్యము

ఆవిధముగా నాశ్రమప్రదేశముఁజేరి జానకీదేవితోఁ గూడినవారై శ్రీరామ లక్ష్మణు లమ్మహామునిని దర్శింపఁగోరి యది సాయంకాలమున నగ్నిహోత్ర సమయమగుట నదిముగియువఱకుఁ గాచికొని దూరముందేయుండి తరువాత నాయన శిష్యుల వలనఁ దమరాక చెప్పిపంపి రావచ్చునని శిష్యులువచ్చి చెప్పఁగా లోపలికిఁబోయి తపములచేఁ బవిత్రులయిన శిష్యులతోఁ గూడినవాఁడును, జక్కఁగ ననుష్ఠింపఁబడిన వ్రతములు గలవాఁడును, లోకులచేఁ గీర్తింపఁ బడిన నడవడి గలవాఁడును, ఏక లక్ష్యమునందు మనస్సుంచినవాఁడును, గొప్ప తపస్సుచే సంపాదించిన యోగ దృష్టిగలవాఁడును, గొప్ప మనస్సు గలవాఁడునునగు భరద్వాజుని నెదుట సమీపమునఁ జూచిరి. అగ్నిహోత్రకార్యము పూర్తి నాఁగా మెల్లగ శ్రీరాముఁడు జానకీ లక్ష్మణులతోఁ దనపేరు చెప్పుచు నమస్కరించెను. సీతాలక్ష్మణులు నట్లేచేసిరి. ఇట్లునమస్కరించినపిదప శ్రీరామచంద్రుఁడు మునీశ్వరుతో నిట్లనియె.

సమి త్పుష్ప కుశా జ్యాంబు, మృదన్నాక్షత పాణికమ్
జపం హోమం చ కుర్వాణం, నాభివాద యతే'ద్విజమ్.

ఆపస్తంబులు.

సమిధలు, పుష్పములు, దర్భ, నేయి, నీళ్లు, మృత్తు, అన్నము, అక్షతలు, చేతియందుఁ గలట్టియు, జపము హోమము చేయునట్టియు బ్రాహ్మణునకు నమస్కరింపరాదు.

నోదకుంభహస్తోభివాదయే, న్నభైక్షం చర, న్నపుష్పాజ్యహస్తో, నాశుచి, నదేవ పితృకార్యంకుర్వ, న్నశయాన, ఇతి. శంఖుఁడు.

జలకుంభము చేతియందుండువానికి, భిక్షకై తిరుగువానికి, పూలు, నేయి చేతియందుఁ గలవానికి అశుచిగా నుండువానికి దేవ పితృకార్యములు చేయువానికి శయనించి యుండువానికి నమస్కరింపరాదు. అని యుండుటచే సమక్షమునఁబోయిన నమస్కరింపరాదు.నమస్కరింపక యుండరాదుకావున హోమము సాంతమగువఱకు శ్రీరామచంద్రమూర్తి వెలుపలఁ గాచియుండెను.

సీ. దశరథ సుతులము♦వశిచంద్ర! శ్రీరామ,లక్ష్మణులము నాదు♦లలన జనక
నందన కల్యాణి♦నావెంటఁ జనుదెంచె, నిర్మలవ్రత యయి♦నిశ్చలుండు
నాచిన్నదమ్ముఁడు♦నన్ననుగమనించెఁ దండ్రి కాసలకు న♦స్థరలు మనినఁ
దండ్రియాదేశంబుఁ♦దలఁదాల్చి వనభూమి,కేతెంచితిమి ముని♦వృత్తినుండఁ

తే. నాయలునుగూర లశనంబు♦గాఁగ ధర్మ,గతిని జరియించువారము♦హితమునీశ
యనుడుగోవును నర్ఘ్యంబు♦నంబువులను,నన్నరసముల ఫలముల♦హాలినొసఁగె.

వశిచంద్ర=ఇంద్రియములను వశపఱచుకొనినవారిలో శ్రేష్ఠుఁడా, లలన=స్త్రీ, భార్య, కల్యాణి=మంగళకరములైన గుణములుగలది, నిర్మలవ్రత=మలినము లేని పాతివ్రత్యధర్మము ననుసరించినది, నిశ్చలుండు=చలింపని మనస్సుగలవాఁడు, అనుగమనించెన్=వెంటవచ్చెను, తరలుము=ప్రయాణమై పొమ్ము, ఆదేశంబు=ఆజ్ఞ, అశనము=ఆహారము, ధర్మగతిని=వానప్రస్థధర్మము ప్రకారము, హితమనీష=మేలుకోరు బుద్ధిగలవాఁడా, గోవున్=మధుపర్కాంశమైన యెద్దును, "మధుపర్కార్హోవేదాధ్యాయీఆచార్యఋత్విక్స్నాతకోవారాజావా ధర్మయుక్త" అని స్మృతి. బ్రాహ్మణుఁడు రాజునకునుధర్మప్రకార మాతిథ్యమీయవలయును.

రాజర్త్విక్స్నాతక గురూన్ ప్రియశ్వశురమాతులాన్
అర్హయే న్మధుపర్కేణ పరిసంవత్సరాత్పునః॥ మను. ౩-౧౧౯.

అర్ఘ్యంబు=చేతికి నీళ్లు మొదలయిన పూజాద్రవ్యములును, అంబువుల్=పాద్యమును, అన్నరసములన్=హవిస్సును, హాళిన్=ప్రీతితో.

తాత్పర్యము

ఇంద్రియములను వశపఱచుకొనిన వారిలో శ్రేష్ఠుఁడా, మేమిరువురము దశరథు కుమారులము, నేను శ్రీరాముఁడను పేరుగలవాఁడను. ఈతఁడు లక్ష్మణుఁడను పేరుగలవాఁడు. ఇది నాభార్య. జనకరాజుకూఁతురు. శుభగుణములు కలది కావునఁ బాతివ్రత్యధర్మము ననుసరించి నావెంట వచ్చెను. కష్టములందు మనస్సు చలింపనివాఁ డీ లక్ష్మణుండు నాచిన్నతమ్ముఁడును నావెంట వచ్చెను. మాతండ్రి యడవులకుఁ బొమ్మని యాజ్ఞాపించుటచే నాయనయాజ్ఞ దలఁదాల్చి యడవులకు మునులవలెఁ జరిపంపవచ్చితిమి. మామేలుగోరువాఁడా, వానప్రస్థధర్మము ననుసరించి కూరగాయలు దినియందుము అనిన భరద్వాజుఁడును నర్ఘ్యమును బాద్యమును ఎద్దును హవిస్సును ఫలములును బ్రీతితోనిచ్చెను.

కం. ముని-మృగపక్షిసమేతుఁ, డనఘుని శ్రీరామచంద్రు♦నర్చించి మఱిన్
ఘనుఁడు భరద్వాజుఁడు రా,ముని కుశలప్రశ్న మడుగ♦ముదితుండగుచున్. ౧౫౩౮

ముని మృగపక్షిసమేతుండు=మునులతోడను మృగములతోడను పక్షులతోడను గూడినవాఁడు అనుటచే, భరద్వాజుని మహిమవలన నాయనయొద్దనున్న మునులు మృగములు పక్షులుకూడ శ్రీరాముమహిమ నెఱిఁగినవై శ్రీరాముని నర్చించెనని భావము. అనఘునిన్=పాపస్పర్శలేనివాని, అర్చించి=పూజించి, కుశలప్రశ్నము=క్షేమసమాచారము, ముదితుండు=సంతోషించినవాఁడు.

తాత్పర్యము

భరద్వాజుఁడు తనతోడనున్న మునులతోడను, మృగములతోడను, పక్షులతోడను, శ్రీరామచంద్రుని బూజించి యాతరువాత గొప్ప తపోమహిమ గల భర

ద్వాజుఁడు శ్రీరామునితో మీతండ్రి బాగున్నాఁడా మీతల్లి క్షేమమా యని క్షేమ సమాచారము విచారింపఁగా శ్రీరాముఁడు సంతోషించినవాఁడై.

కం. వారిచ్చినయర్చల రఘు,వీరుఁడు గైకొని సుఖోప•విష్టుం డయినన్
గూరిమిని భరద్వాజుం,డా రామునికనియె ధర్మ్య•మగువాక్యములన్. ౧౪౩౯

వారు=భరద్వాజుఁడును అయనతోడి మునులు మొదలగువారు, అర్చలన్= పూజలను, కైకొని,=అంగీకరించి, సుఖోపవిష్టుండు = సుఖముగఁ గూర్చుండిన వాఁడు, కూరిమిన్=ప్రేమతో, ధర్మ్యము=ధర్మముతోఁగూడినది.

తాత్పర్యము

భరద్వాజుఁడు లోనగువా రొసఁగిన యర్ఘ్యాదులను గ్రహించి వీరుఁడగు శ్రీరామచంద్రుఁడు సుఖముగాఁ గూర్చుండఁగాఁ బ్రేమతో నాయనను జూచి భరద్వాజమహాముని ధర్మయుక్తములయిన మాటలతో నిట్లనెను.

ఉ. ఎన్నిదినాల కేను నిను • నిచ్చటఁ గంటిని రామ, నీకు నీ
బన్నముఁ, దండ్రి తేర కిటు•పంపుటయున్, వనిఁ జేరు టీకథల్
మున్నుగ వింటిఁ, బుణ్యతల•మున్ విజనంబు మహాపగారుసం
పన్నము కమ్ర మియ్యది,ని•వాసముఁ గైకొను మిందు నెమ్మదిన్. ౧౪౪౦

బన్నము=భగ్నశబ్దభవము, రాజ్యవిఘాతము, తేరకున్=నిష్కారణముగ, వనిన్=అడవిని, మున్నుగన్=నీవిచటికి రాకముందే, విజనంబు = జనములేనిది, మహాపగా = మహానదులచే, ఉరుసంపన్నము = మిక్కిలి భాగ్యవంతమైనది, కమ్రము = మనోహరమైనది, ఇందున్=ఈ యాశ్రమమందు.

తాత్పర్యము.

శ్రీరామచంద్రా! నిన్నుఁ బ్రత్యక్షముగ నిచటఁ జూడవలయునని యెన్ని దినాలుగనో యెంతో కోరుచుంటిని. నాయోగాభ్యాస సమయంబున హృదయంబునఁగనుపించు పరంధాముని యాకారమును గన్నులార నీప్రాకృతచక్షువులతోఁ జూచు భాగ్యము నాకెప్పుడు కలుగునాయని యెంతో యాశపడి యేకారుచుంటిని. (భక్తులందఱును గోరెడికోరిక యిదియే. ఇదియే పరిత్రాణాయసాధూనామ్మన్న చోటఁజెప్పఁబడిన ముఖ్యరహస్యార్థము.) ఇచ్చట ననుటచే దేహమును విడిచిన పిమ్మట వైకుంఠమునకువచ్చి యచ్చట నిన్నీరీతిగాఁ జూచుటగాదు. నాతపఃఫలముగా నీవే యిచ్చటికి వచ్చి దర్శనమీయవలయునని కోరుచుంటినని భావము. ఈ సాధు రక్షణము భగవంతుఁడు సంకల్పముచే నీవిధముగఁ దప్ప మఱియొక విధముగఁ జేయఁజాలఁడు. కావుననే యవతరించుట.(అని యవతార రహస్యము వెల్లడింపరాదు గావున లోకమర్యాద ననుసరించి చెప్పుచున్నాఁడు.) నీకుఁ బట్టాభిషేకము విఘ్నమగుటచేఁగలిగిన యవమానము కారణములేకయే మీతండ్రి నిన్ను నిట్టు లడవులకుఁబంపుటయు నీవు వనములందుఁ బ్రవేశించుటయు నీకథ

లన్నియు నీవు రాకముందే వింటిని,నీవరణ్యమున వసించుట కెక్కడికో పోనేల? ఇదిపుణ్యభూమి. జనులు లేనిది. గొప్పనదులనే యైశ్వర్యముగాఁగలది. నీవిందు వసింపుము.

తన నియమప్రకారము పరంధాముఁడగు శ్రీరాముఁడు తానైపోయి దర్శనమిచ్చి యనుగ్రహించిన భక్తులలో మొదటివాఁడు. మద్గోత్ర మూలపురుషుఁడైన భరద్వాజమహర్షియే. అట్టి మహానుభావుని గోత్రమందుఁబుట్టుట మహాపుణ్యవిశేషముననే యని యాగోత్రజులందఱు శ్రీరామునందు నట్టి భక్తివిశ్వాసములు కలవారై యుందురుగాక. ఈ విషయమున విశ్వామిత్రగోత్రజులు కలహమునకు వత్తురేమో. శ్రీరాముని వెదకుచుఁబోయినవాఁడు విశ్వామిత్రుఁడు. శ్రీరాముఁడు తానైపోయి దర్శనమిచ్చినవాఁడు భరద్వాజుఁడు. ఇది తారతమ్యము.

సీ.అనుచు భరద్వాజుఁ♦డాడ నాతనిఁగని, యనియె శ్రీరాముఁడు ♦ మునివరేణ్య
కడు సుదర్శుఁడనంచుఁ♦గనుఁగొన వత్తు రా,సన్న పౌరులు మఱి♦జానపదులు
మాజానకిని నన్ను ♦ మఱిమఱి గావున, నిచ్చట నిల్వంగ ♦ నిచ్చగింప
సుకుమారి జానకి♦సుఖముగావర్తింప, నేకాంతతల మొండు♦నెఱుఁగఁ జెపుమ
తే.యచటికిని బోవువార మం♦చనిన లోక,వీరు నిటకు దశక్రోశ ♦ దూరమునను
గంధమాదననిభఋక్ష♦కపిసమేత,వాటి సుఖదర్శనము చిత్రకూట మమరు.
౧౪౧

సుదర్శుఁడు=(౧)సులభముగఁ జూడఁదగినవాఁడు, (౨)నేత్రసాఫల్యము గలిగించు లోకైకసుందరుఁడు, ఆసన్నపౌరులు=సమీపముననుండు పురముల వారు, జానపదులు=పల్లెటూళ్ల వారు, ఏకాంతతలము=జనములు లేనిచోటు, దశక్రోశదూరమునన్=పదికోసులదూరము, కోసునకు రెండుమైళ్లు రెండున్నరమైలనియుఁగలదు. గంధమాదననిభ=గంధమాదనపర్వముతో సమానమై, ఋక్షకపిసమేతము=ఎలుఁగు బంటులతోను గవులతోను గూడినది, వాటి = ప్రదేశము, సుఖదర్శనము=దర్శనముచేతనే సుఖము గలిగించునది.(౨)సుఖముగాఁజూడఁదగినది. చిత్రకూటము=చిత్రకూటమనుపేరుగల పర్వతము. చిత్రకూటము సుఖదర్శనమని చెప్పినవాఁడు చిలుకలు గోరువంకలు నెమిళ్లు జింకలు లోనైనవి కలదనిచెప్పక యెలుఁగులు క్రోఁతులు గలవని చెప్పుటకుఁ గారణము. భవిష్యత్కాలమున నాయనకు వానితోఁ గలుగఁగల స్నేహము సూచించుటకే, నీయవతారప్రయోజనము సాధింప సహాయులుకాఁగలవారు నీకై యచటఁ గాచియున్నారని సూచించుటకే. అనాప్తులగు సుందరుల దర్శనము సుఖదర్శముకాదు. ఆప్తదర్శనమే సుఖదర్శనము.

తాత్పర్యము

అని భరద్వాజుఁడు చెప్పఁగా నాయనను జూచి శ్రీరాముఁ డిట్లనియె. మునీంద్రా నేనుసుందరుఁడననియు,సులభముగా నిపుడైనఁ జూడవచ్చుననియు, నిదివఱకు నాదర్శనముదుర్లభమనితలంచుచుండినవారందఱుసమీపముననుండు

పల్లెలవారు పట్టణములవారు నన్ను సీతాదేవిని దర్శింపఁ బలుమాఱువచ్చుచుందురు కావున నిచ్చట నిల్వమనస్సొప్పదు. సుకుమారియగు జానకి యీ జనుల రాయిడి లేక సుఖముగా నుండుటకు యోగ్యమైన స్థలము నొకటి చెప్పుము. అందుఁబోయి యుందుము. అనిన లోకైకవీరుఁడై రాక్షసులనెల్ల వధింపఁజాలిన శ్రీరామునకుఁగాఁగల కార్యమాలోచించి యిచ్చటికి రెండామడదూరమునం జిత్రకూటమను పర్వతము గలదు. అది గంధమాదనపర్వముతో సమానమై సువాసన గలవృక్షములు గలదు. అచ్చట నెలుఁగులు క్రోఁతులుగలవు. చూచుటకు సుందరమైయుండును. ఆహ్లాదకరమైయుండును.

తే. రామ తచ్చిత్రకూటప♦ర్వతముశిఖర,వితతు లెందాఁకఁగనఁబడుఁ♦బృథివినంత
దాఁకఁగలప్రాణకోటుల♦తలఁపులందుఁ,గలుషముండదు పుణ్యంబ♦సలుపఁ
బడును. ౧౫౨

శిఖరవితతులు=శిఖరముల సమూహములు, కలుషము=పాపము.

తాత్పర్యము.

రామచంద్రా! ఆచిత్రకూటపర్వతముయొక్క శిఖరము లెంతదూరము కనఁబడునో యంతదూరము లోపలఁగల జీవజంతువుల హృదయములందుఁ బాప చింతయుండదు. అవి పుణ్యమునే చేయుచుండును.

తే. అందు నూఱులకొలఁదు లేం♦డ్ల నఘశీలు,రై నఋషితల్లజులు పెక్కు♦రాచరించి
ఘోరతపమును దివమును♦గూడఁజనిరి, సహకపాలశిరస్కులై♦జగము లెన్న.
౧౫౩

అనఘశీలురు=పాపములేని స్వభావముగలవారు, ఋషితల్లజులు = ఋషిశ్రేష్ఠులు, సమాసంబున శ్రేష్ఠార్థమునఁ దల్లజశబ్దముపయోగింపఁబడును. సహకపాలశిరస్కులై=కపాలముతోను శిరస్సుతోను గూడినవారై, కపాలము కానవచ్చుచున్న శిరస్సుగలవారై, (2) కపాలశిరస్సును ఋషితోఁ గూడినవారై, శిరస్సు నేలమోపి విపరీతకరణిని గపాలాసనము దీర్ఘకాలమవిచ్ఛిన్నముగ సాధింపఁగా వెంట్రుకలు చర్మముపోయి పుఱ్ఱెకానవచ్చుచుండెనని యర్థము. శిరస్సును నది దేహమున కుపలక్షణముగా గ్రహించిన సశరీరులై స్వర్గమునకుఁ బోయిరని యైనఁజెప్పవచ్చును. ఎన్నన్ = మహాత్ములని లెక్కింపఁగా, (తలక్రిందమోపి కాళ్లుపైకెత్తి నిలఁబడుట విపరీతకరణియగును.)

తాత్పర్యము.

అందు నూర్లకొలఁది సంవత్సరములు పుణ్యాచారపరులైన ఋషిశ్రేష్ఠులు శిరస్సునేలమోపి వెంట్రుకలు,చర్మము సమసిపోవువఱకు విపరీతకరణిని దపస్సు చేసి స్వర్గమునకుఁబోయిరి.

తాత్పర్యము.

ప్రాణముపోవు సమయమున సజ్జనులచే స్తోత్రము చేయఁబడిన మంచి మనస్సుగల సద్గుణములచే దట్టమైన శ్రీరామచంద్రుని గన్నులారఁ జూడ లేకున్నాను ఇంతకంటె దుఃఖము వేఱొకటియుండునా.

ఉ. ఆతనిఁ జూడకుండెడు మ♦హావ్యథఁ బ్రాణము శోషగిల్లెఁ దీ
క్ష్ణాతపతాపవృద్ధికిని ♦ నల్పజలంబులయట్లు శెప్ప రా
పూతచరిత్రుచారుముఖ♦ముం బదునేనవయేఁటఁ గ్రమ్మఱన్
జూతురొ వారు నిర్జరుల ♦ చూ సుదతీమణీ! కారు మానవుల్. ౧౬౬౯

శోషగిల్లెన్=క్షీణించెను, తీక్ష్ణాతపతాపవృద్ధికిన్=తీవ్రమైన యెండవేఁడిమి యభివృద్ధిచే, అల్పజలంబులు=కొంచెపునీళ్ళు, పూతచరిత్రున్=పవిత్రమైన నడవడి గల శ్రీరామచంద్రుని, చారుముఖమున్ = మనోహరమైన మొగమును, నిర్జరులచూ=దేవతలేసుమా- లంకలో దశరథుఁడు దేవస్వరూపముననే చూచెను గదా.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని జూడమివలనఁ గలిగిన పెనుబాధచేఁ దీక్ష్ణమైన యెండ వేఁడిమికిఁ గొంచెపునీళ్లు క్రమక్రమముగా క్షీణించునట్లు నాప్రాణములు క్షీణించుచున్నవి. పదునైదవసంవత్సరమున నెవ్వరు మరల శ్రీరాముని ముఖముఁ జూతురో వారు దేవతలేకాని మనుష్యులుగారు. ఇది వాస్తవపడియెఁగదా.

ఉ. ఆనళినాయతేక్షణము ♦ లారమణీయతరోన్న సంబు నా
జా నగుకన్నుబొమ్మలు ల♦సద్ధళధాళ్య మెసంగుచెక్కులున్
శ్రీనుతశారదేందురుచి ♦ చిందెడిరాము ముఖారవిందమున్
మానిని ధన్యులౌజనులు ♦ మానుగఁ గాంతురు వెండి వచ్చినన్. ౧౬౭౦

నళినాయతేక్షణములు=కమలములవంటి దీర్ఘములయిన కన్నులు, రమణీయతరోన్నతనాసంబు = మిగుల సుందరమైన యెత్తైనముక్కు, జానగు = అందమైన కనుబొమలు, లసత్ ధాళధళ్యము=తళతళ ప్రకాశించు, శ్రీ=శోభచే, నుత=పొగడఁబడిన, శారద=శరత్కాలమందలి, రుచి=కాంతి, ముఖారవిందము =ముఖకమలము.

తాత్పర్యము

కమలములవలె దీర్ఘములైన యా కన్నులును సుందరమై యెత్తైన యాముక్కును, అందమైన యా కనుబొమలును తళతళమని ప్రకాశించు నా చెక్కులును కాంతిచే శ్లాఘింపఁబడిన శరత్కాలచంద్రునికాంతినిగల శ్రీరాముని ముఖము కమలమును దేవీ శ్రీరాముఁడు మరలివచ్చినపుడు పుణ్యాత్ములై జన్మము సఫలము కాఁగలవారు చూడఁగలుగుదురు.

కం. వనవాసము నెఱవేఱిచి, చను దెంచినపుణ్యు రామ♦చంద్రుని ఋజుమా
ర్గనయున్ శుక్రునిఁ గనుగతిఁ,గనుఁగొందురు పుణ్యతములు♦కౌతుక మమరన్.

కం. వేవిన మేల్కని మౌనిఁ ద, పోవిభవుం దావకీన • పుణ్యతలమునన్
గే వుచ్చితి హాయిగ నిఁకఁ, బోవఁగ సెలవిచ్చెదరె ప్ర • భూతపుఁగరుణన్. ౧౪౭

వేవినన్=తెల్లవాఱఁగా, వేగినన్ అనుదానిలో 'క్వచిద్గకారో వః' అను సూత్ర ప్రకారము గకారమునకు వకారము వచ్చెను. గకారమునకు వకారము వచ్చును గాని వకారమునకు గకారము రాదు. తపోవిభవున్=తపస్సంపదగలవానిని, తావకీనపుణ్యతలమునన్=నీయొక్క పుణ్యప్రదేశమందు, రే=రాత్రి, ప్రభూతపుఁగరుణన్=అధికదయతో, రే+పుచ్చితినా=రేవుచ్చితిన్.

తాత్పర్యము.

ఊరువిడిచిన యైదవనాఁటి యుదయమున శ్రీరామాదులు మేలుకని తపస్సంపదగల భరద్వాజ మునీంద్రునిఁజూచి నీపుణ్యప్రదేశమున రాత్రి సుఖముగఁ గడిపితిని. ఇఁకఁబోవ దయాతిశయమునఁ ననుజ్ఞ యిచ్చెదరా.

సీ. అనుడు భరద్వాజుఁ • డారఘూత్తముతోడ, ననుఁబోయి రమ్ము పు • ణ్యప్రభావ
చిత్రకూటంబు ప • విత్రమధురమూల, ఫలమధుయుత మగు • స్థలము వెండి
నానానగోపేత • మానితకిన్నరో,రగసేవితము మయూ • రనదకలిత
మిభరాజసేవిత • మెంతయుఁ బుణ్యంబు,రమణీయమగుఁ గాన • రామ పొమ్ము

ఆ. నీకుఁ దగిననెలవు • నిక్కంబ యచ్చోటఁ, గనుఁగొనంగఁ గలవు • కరిఘటలును
మృగసమూహములును • క్రీడావిలోలంబు,లగుచుఁ దిరుగుచుండ • నంబుజాక్ష. ౧౪౮

పుణ్యప్రభావ=పుణ్యమువలనఁ గలిగిన ప్రభావముగలవాఁడా! పవిత్ర... యుతము=పరిశుద్ధములై తియ్యనైనవేళ్లు పండ్లు తేనెతోఁగూడినది. నానా... సేవితము=అనేకములైన, నగోపేత = పలువిధములైన చెట్లతోఁ గూడినదియు, గౌరవింపఁబడిన కిన్నరులచేతను, సర్పములచేతను సేవింపబడినది. మయూరనదకలితము=నెమిళ్ల కేకా రావములతోఁ గూడినది. ఇభరాజసేవితము = గొప్ప యేనుఁగులచేఁ గొలువఁబడినది నిక్కంబ = నిజము, కరిఘటలు = ఏనుఁగుల గుంపులు, క్రీడావిలోలంబులు=ఆటల మరగినవి

తాత్పర్యము

ఈప్రకారము శ్రీరామచంద్రుఁ డడుగఁగా భరద్వాజుఁ డాయనతో నిట్లనియె. ధర్మమువలనఁగలిగిన ప్రభావముగలవాఁడా, చిత్రకూటపర్వతము పవిత్రములై తియ్యనైన కందమూలఫలములచేతను తేనెలచేతను గూడినస్థలము.మఱియును అనేక విధములయిన చెట్లతోఁగూడి కిన్నరులచేతను సర్పములచేతను ఏనుఁగుల చేతను ఆశ్రయింపఁబడినది. నెమిళ్ళకేకలచేఁగూడినది.మిక్కిలి పుణ్యప్రదేశము అందమైనది యగును. కావున శ్రీరామచంద్రా! యచటికిఁ బొమ్ము అది నీవు

నిలువఁదగిన స్థలము. అచ్చట నేనుఁగుల గుంపులు, మృగసమూహములు ఆట యందాసక్తి గలిగి తిరుగుచుండఁ జూడఁగలవు.

చిత్రకూటమహిమ భారతంబున నిట్లు చెప్పఁబడెను.

తతోగిరి వరశ్రేష్ఠే, చిత్రకూటే విశాంపతే
మందాకినీం సమాసాద్య, నదీంపాప ప్రమోచనీమ్
తత్రాభిషేకం కుర్వాణః, పితృదేవార్చనే రతః
అశ్వమేధ మవాప్నోతి, గతించ పరమాంవ్రజేత్॥ వనపర్వము.

పర్వతశ్రేష్ఠమైన చిత్రకూటమందలి పాపనాశకమైన మందాకినీ నది యందు స్నానముచేసి దేవపితృకార్యములు దీర్చినవారికి నశ్వమేధయాగ ఫలము పరమగతియుఁ గలుగును.

కం. ఝరులుం జరులుం దిరిగెడు, కరులున్ నిర్దరచయంబుఁ • గందరతతులున్
దరులున్ శుకపికనాదిత, తరులున్ నీపతికి హర్ష • దములగు ననుడున్. ౧౪౪

ఝరులున్=ప్రవాహములు, చరులున్=కొండలోయలు, కరులు=ఏనుఁగులు, నిర్దరచయంబు=పీలినరాలసందుల సమూహములు, కందరతతులున్ = గుహల సమూహములు, దరులు=రాలొకదానితో నొకటి సంధించిన స్థలములు, శుకపిక నాదిత తరులున్=చిలుకల కోకిలనాదములుగలచెట్లు, హర్షదములున్=సంతోష మిచ్చునవి.

తాత్పర్యము

నీటిప్రవాహములు, కొండలోయలు, సంచారముచేయు నేనుఁగులు, పీలిన రాలసందుల గుహలు రాలసంధులు చిలుకలు కోవెలలు ధ్వనించు చెట్లు ఇవ న్నియు నీ భార్యకు సంతోషమును గలిగించును.

—• { ౫౫-వ సర్గము. భరద్వాజముని శ్రీరామునకుఁ జిత్రకూటమార్గముఁ దెలుపుట. } •—

ఉ. బల్లునఁ దెల్లవాఱుటయుఁ • బార్థివపుత్రులు నిండుఁ బ్రీతి సం
ధిల్లఁగ మ్రొక్కి మౌని కవ • నీధ్రముచాయను బోవఁ బూనఁగా
సల్లలితోక్తి వారలకు • స్వస్త్యయనంబు ఘటించి సత్యవా
గ్వల్లభుఁ డేగె వెంట సుత • వర్గముతోఁ జనుతంద్రిపోలికన్. ౧౪౫

అవనీధ్రము=కొండ, సల్లలితోక్తిన్=మంచియింపైనమాటలచే, స్వస్త్యయ నంబు=స్వస్తి + అయనంబు = ఆశీర్వాదము, సత్యవాగ్వల్లభుఁడు = ముని శ్రేష్ఠుఁడు, ఋషులకు సత్యవచనులనిపేరు, వెంట=వెంబడి.

తాత్పర్యము

బల్లునఁ దెల్లవాఱఁగానే రాజకుమారులు భరద్వాజునివంటి మహర్షి యను గ్రహమునకు మనము పాత్రులమైతిమిగదా యని పరిపూర్ణసంతోషముతో మౌనికి నమస్కరించి చిత్రకూటమునకుఁ బోవుమార్గమున నరుగఁ బ్రయత్నింపఁగా వార

లను నింపైనవాక్యముల నాశీర్వదించి యాముని బిడ్డలవెంటఁబోవు తండ్రివలె, ఇచట సుతయనునది యేకశేషముగ గ్రహింపవలెను. సుతా+సుత=సుతులు.

సీ. రామునిఁ గని ముని♦రాజేంద్రుఁ డిట్లను జాహ్నవీసూర్యజా♦సంగమంబు
 జేరి యామీఁదఁ బ♦శ్చిమముఖ మై పాఱు, యమునతటం బట♦ననుసరించి
 చని చని యానది♦సత్వరంబుగఁ బాఱు,కడ రాకపోకలఁ♦గరము వాడఁ
 బడుట క్షుణ్ణం బైన♦బాటను గని యందుఁ, దెప్పఁ గట్టికొని మీ♦రొప్పమీఱ
తే. యమున నట దాఁటి యచ్చోట ♦ శ్యామ మనెడి
 పెద్దమఱ్ఱిచెట్టు బహుతరు♦వృద్ధ మగుచు
 సిద్ధసేవిత మగుదానిఁ ♦ జేరి మేలి
 దీవన లొసంగ బ్రొక్కింపు ♦ తీవఁబోణి. ౧౪౫౧

జాహ్నవీసూర్యజాసంగమంబు=గంగా యమునలు కలయుచోటు, కాళిందీ సూర్యతనయా యని నిఘంటువు, యముని సోదరి, పశ్చిమాభిముఖమై=పడమటి ముఖముగా యమునానది తూర్పుముఖముగాఁ బాఱునదియైనను గంగానది వచ్చి కలియుటచే నా వేగమునకు యమున తూర్పుగాఁబోక వెనుకకు మరలి పశ్చిమ ముఖమై కొంచెము దూరము పాఱును. అనఁగా మీరును బడమటి ముఖముగానే ప్రయాణము చేయుఁడని యర్థము. సత్వరంబుగన్ = త్వరతోఁ గూడినట్లు,అనుటచే గంగాప్రవాహమడ్డుపడుటచే యమున నీళ్లు మెల్లగాఁ బాఱుచోటు గాదని యర్థము. రాకపోకలన్=రాక + పోక = రాకపోకలు, ద్వంద్వసమాసంబునఁ బదంబుకంటెఁ బరంబయిన పరుషములకు గసడదవలు ప్రాయికంబుగ నగు సు.వ్యా.సమా.సంధి ౪౦ ప్రాయిక గ్రహణముచే 'ప'కారమునకు 'వ'కారము రాలేదు. క్షుణ్ణము=నలఁగినది, శ్యామము=నల్లగానుండుటచే శ్యామమను పేరు గల, బహుతరువృద్ధము=అనేక వృక్షములచే వృద్ధిపొందినది. ఊడలు పెక్కులు దిని భూమిలోనికిఁ బోయి మరల నవి చెట్టగుటచేఁ బెరిఁగినది. తీవఁబోణి-తీఁగఁ బోఁడి=తీఁగవంటి మేనిమి గలది.

తాత్పర్యము

శ్రీరాముని(జూచి భరద్వాజమహాముని యిట్లనియె. గంగా యమునలు కలియుచోటు చేరి యచ్చట యమున పడమటిముఖముగాఁ బాఱుచోట మీరును బడమటిముఖముగానే యేటియొడ్డు వెంబడి పోయిపోయి గంగనీరడ్డపడకుండుటచే యమున నీరెచ్చట త్వరగాఁ బాఱునో యాచోట జనులరాకపోకల త్రొక్కుడులచే నలఁగిన బాటనుజూచి యచ్చటఁ దెప్పకట్టుకొని మీరు యమునను దాఁటి పోయి పచ్చని యాకులుగలదగుటచే శ్యామమని పేరుగాంచిన పెక్కు చోట్లతోఁ గూడిన వృక్షమును జూచి యది మంచిదీవనలిచ్చునట్లు సీతచే బ్రొక్కింపుఁడు.

చం. నిలిచిన నిల్వఁ డందుఁ, దమి•నెక్కొనె నేనియుఁ బోవ నేగుఁ డా
వల, నట కొక్క క్రోశమున•వర్తిలు నీలవనంబు వెండి రేఁ
గులు వెదురుల్ మనోజ్ఞము ల•గున్, బహు వారము లేగినాఁడ, నీ
చెలువపుఁ ద్రోవ మార్దవము•చిచ్చుభయంబును లేదు రమ్యమౌ. ౧౪౫౨

తమి=కోరిక, నెక్కొనెనేని=కలిగెనేని, బహువారములు=పెక్కుతడవలు.

తాత్పర్యము.

ఆశ్యామవృక్షమునొద్ద సీతబడలియుండుటచే నిల్వఁదలఁచిన నిలువుండు. అటుగాక యావలఁబోవఁదలఁచినఁ బొండు, అక్కడికొక కోసుదూరమున నీలవనముగలదు. అందు రేఁగులు వెదుళ్లు మనోహరములై యుండును. ఈత్రోవ నేను బలుమాఱు పోయునాఁడను. ఈత్రోవ యందముగా నుండును. జాలు అప్పలులేవు. కాఱుచిచ్చు భయములేదు.

చం. అని ముని జాడఁ దెల్పి యన•ఘాత్మక! నిల్తునె యన్న రాముఁడున్
వినయము మీఱ లెస్స యన•నిర్మలశీలుఁడు పోవ లక్ష్మణుఁ
గనుఁగొని మౌనినాథునను•కంపకుఁ బాత్రుల మౌటఁ దమ్ముఁడా!
మనము సుపుణ్యు లంచు నర•మండనుఁ డాడుచుఁబోయి యావలన్. ౧౪౫౩

జాడ=పోవుమార్గము,నరమండనుఁడు=మనుష్యులందుసలంకారమైనవాఁడు.

తాత్పర్యము

ఈప్రకారము భరద్వాజుఁడు చిత్రకూటమునకుఁ బోవుమార్గము దెలిపి శ్రీరామచంద్రా యిఁక నేను నిలుతునా యనఁగా శ్రీరాముఁడును వినయముతో మంచిదియని యంగీకారము దెలుపఁగాఁ బరిశుద్ధచరిత్రుఁడైన భరద్వాజుఁడు మరలిపోయెను. అంత లక్ష్మణుఁగనుఁగొని శ్రీరాముఁడు తమ్ముఁడా! మనము మునీశ్వరు దయకుఁ బాత్రులమౌటచే మిగులఁ బుణ్యము చేసినవారమని నరుల కలంకారమైన శ్రీరాముఁడు చెప్పుచుఁబోయి యావల

అట్టి మహానుభావు గోత్రమున బుట్టినవారు తామెంతో ధన్యాత్ములనితలఁచి యిప్పటికిని దమయందుఁ బ్రసరించుచుండు నాయన దివ్యతేజస్సును దుష్టాహారము దురాచారము దుర్విచారములచే నాశము చేసికొనకుందురు గాక.

కం. సీతాపతి మున్నుగ యము,నాతటముం బట్టి పోయి•నది వడిఁ జనుచో
నాతరణికులులు గని చిం,తాతత్పరులై రె యెట్లు•దాఁటుద మనుచున్. ౧౪౫౪

సీతాపతిమున్నుగన్ = అనుటచే శ్రీరాముఁడు ముందుగను ఆవల సీతయును ఆవల లక్ష్మణుఁడు పోయిరని తెలియవలెను. భార్యాభర్తల నడుమ మఱియొకఁడు పోరాదుకదా. ఇచటఁ బ్రణవార్థము అనులోపముగా సూచింపఁబడెను. యమునా తటముఁబట్టి = యమునాతీరము వెంబడి, ఆతరణికులులు = సూర్యవంశమునఁ బుట్టిన శ్రీరామలక్ష్మణులు, చింతాతత్పరులు=ఆలోచనగలవారు.

తాత్పర్యము

అంతవఱకు వెనుకఁబోవుచున్న శ్రీరాముఁడు ముందుగా యమునా తీరము వెంబడిపోయి యానది వేగముగఁ బాఱుచోటుగని శ్రీరామలక్ష్మణులీనది యిచ్చట నెట్లుదాఁట సాధ్యమగునా యని యాలోచించిరి.

ఉ. కట్టెలమోవుఁ దెచ్చి, యెస•కంబుగఁ దెప్ప బిగించి రాఘవున్
గట్టివి యెండుబొంగులును • గట్టి, యుశీరము పైచి, మీఁదటన్
నెట్టన ప్రబ్బదీవెలను • నేరెడుకొమ్మలఁ గూర్చి, సీతకున్
దిట్టము సత్సుఖాసనముఁ • దీర్చె సుమిత్రతనూజుఁ డంతటన్. ౧౪౫

ఎసకంబుగన్=మిక్కిలి, ఉశీరము=వట్టివేరు, ప్రబ్బఁదీవెలన్=తీఁగలవంటి సన్నని ప్రబ్బకొమ్మలను, దిట్టము=దృఢము, సత్సుఖాసనము=మంచిసుఖమైన యాసనము.

తాత్పర్యము

కట్టెలమోపుదెచ్చి శ్రీరామ లక్ష్మణులు తెప్పబిగించిరి. ఇది యిరువురు చేయఁదగినకార్యము కావున నిరువురు చేసిరనిభావము. అట్లు కట్టినతరువాత నెండిన గట్టి వెదురు బొంగులనుగట్టి దానిపై వట్టివేళ్లుపఱిచి యామీఁద సన్నని ప్రబ్బ కొమ్మలను నేరేడుకొమ్మలను గూర్చి సుఖముగాఁ గట్టెలొత్తుకొనక యుండ నాసనము లక్ష్మణుఁడు కుదిర్చెను.

కం. ఇందిరవాడ్కి నచింత్యను, సుందరి దరలజ్జమాన•సుదతిని సీతన్
ముందుగ రాముఁడుడుపము,నం దెక్కఁగఁ జేసిపిదప•నవనిజప్రక్కన్.

ఇందిరవాడ్కన్=లక్ష్మీదేవివలె, అచింత్యన్=మనస్సుచేనాలోచించి తెలిసికొనరాని మహిమగలదానిని,"యస్యాస్తే మహిమాన మాత్మన ఇవ త్వద్వల్లభోపి ప్రభుర్నాలంమాతు" మన్నట్లు "మీమహిమ మీరలెఱుఁగరు శ్రీమహిళానాథ" యన్నట్లు సర్వజ్ఞత్వముగల లక్ష్మీనారాయణులగు సీతారాముల మహిమ వారే తెలిసికొనలేకుండఁగా నితరులనేమిచెప్ప? దరలజ్జమాన=కొంచెముగా సిగ్గుపడుచున్నదానిని, శ్రీరాముఁడు తనచేతిని బట్టుకొని తెప్పపై లక్ష్మణునెదుట నెక్కించుటచే వదినెశక్తి యింతమాత్రమా యని మఱఁది నవ్వునని సిగ్గు, ఉడుపము=తెప్ప.

తాత్పర్యము

లక్ష్మీదేవివలె నచింత్యమహిమగల సీతను సుందరిని గొంచెముగా సిగ్గుపడుచున్నదానిని గొంచెపు జిఱునవ్వుగలదానిని సీతను శ్రీరాముఁడు ముందుగఁ దెప్పపైఁ జేతిని బట్టుకొని యెక్కించెను. లక్ష్మణుఁడు నీళ్లలోదిగి పడవ కదలకుండఁ బట్టుకొన్న కారణముచే శ్రీరాముఁ డీపని చేయవలసివచ్చెను.

కం. ఆమెపరిష్కారంబులు, నామెవసనములును నాయు•ధావళి మఱియున్
రాముండు కఠినకాజము, లామహితప్లవమునందు•నారోపించెన్. ౧౪౬

పరిష్కారంబులు=సొమ్ములు, వసనములు=వస్త్రములు, కఠినాజములు =కఠినక+అజములు = గడ్డపాఱ తోలుగప్పిన గంప మొదలయినవి, మహిత ప్లవమునందున్=పెద్దతెప్పయందు, ఆరోపించెన్=ఉంచెను.

తా త్ప ర్య ము

ఆమెసొమ్ములు, చీరలు తమయాయుధముల సమూహములు గడ్డపాఱ, తోలుగప్పిన గంప, వీనినెల్ల శ్రీరాముఁడు సీతప్రక్కనుంచెను.

సీ. కదలక యుండఁగఁ•గాకుత్స్థు లాతెప్పఁ, బదిలంబుగాఁ జక్కఁ•బట్టుకొనుచు
సీత నెక్కించి ని•ర్భీతిఁ దరించుచోఁ,గాళింది మధ్యభా•గంబుఁ జేరఁ
గరములు ముకుళించి•ధరణీతనూభవ, యాహ్లాద హేవాక•ననియె నిట్లు
నిన్నుఁ దరించుచు•నున్నవారము దేవి, నాపతివ్రతము సాం•తంబుఁ జేసి
ఆ. సౌఖ్యముగను వెండి•చనుదేర దయఁ గన,వమ్మ మరలి పురికి•నరిగినపుడు
గవులు వేయుఁ గల్లు•ఘటములు వందయు,
నిచ్చెదాన నీకు•మెచ్చు గదుర. ౧౪౫౮

ఆహ్లాదన్=ఆసదిని, హేవాకన్=ఉత్సాహముతో, పతివ్రతము=పతి ననుస రించియుండు వ్రతము, సాంతంబు=తుదముట్టినది, గవులు=ఆవులు, వంద= నూఱు, కదురన్=కలుగఁగా.

జనులు రాకపోకలుగల రేవని భరద్వాజుఁడు చెప్పుటచేతను శ్రీరామ లక్ష్మణులెక్కిరని యందుఁ జెప్పకుండుటను ౧౪౫౯-వ పద్యమునందు జనకజ నటడించి యని మాత్రము చెప్పి శ్రీరామలక్ష్మణులు దిగిరని చెప్పకుండుట చేతను శ్రీరామలక్ష్మణులు పడవపై నెక్కలేదనియుఁ బడవను బట్టుకొని నడచి వచ్చిరనియు గ్రాహ్యము.

ఏటిలోదిగి నడచియైనఁ బోవవలయును. పడవమీఁదనైనఁ బోవలయును గాని చేతులతో నీది పోరాదు. "సబాహుభ్యాం నదీంతరే" త్తని మనువు.

తా త్ప ర్య ము

శ్రీరామలక్ష్మణులు కదలకుండఁగ నా తెప్పను బట్టుకొని సీత నెక్కించి భయములేక దాఁటునపుడు నది మధ్యమునకుఁ బడవరాఁగా సీతాదేవి చేతులు జోడించి యానదినిగూర్చి సంతోషముతో నిట్లనియెను. దేవీ యమునానదీ! నిన్ను దాఁటి పోవుచున్నారము. నాపాతివ్రత్యము భంగముగాకుండ వనవాస వ్రతము ముగించి సుఖముగ మరలివచ్చున ట్లనుగ్రహింపుము. మరల నయోధ్యాపురికిఁ బోయినపుడు వేయావులు బ్రాహ్మణుల కిచ్చెదను. నూఱు కల్లు కుండలు నీవు మెచ్చుకొనునట్లు నీ కిచ్చెదను.

కం. అని మ్రొక్కుచుండఁ దెప్పయుఁ, జనె దక్షిణతటమునకును•సరసకుఁ బ్రాసం
దనమునకు నంత వారలు, జనకజ నటడించి వదలి•చయ్యనఁ దెప్పన్.

దక్షిణ తటమునకున్=దక్షిణ తీరమునకు. సరస కుజానందనమునకున్ = రసవంతములయిన చెట్లచే నానందింపఁ జేయుదానికి.

తాత్పర్యము

ఈప్రకారము సీతాదేవి నమస్కరించుచుండఁగనే తెప్ప నుంచి రసవంతములైన చెట్లచే నానందింపఁజేయు దక్షిణతీరమునకుఁ బోయెను. అంత శ్రీరామలక్ష్మణులు సీత నక్కడ దిగఁజేసి చయ్యన పడవకట్లు విప్పిరి.

—• సీతారామలక్ష్మణులు శ్యామవటంబుఁ జేరుట. •—

కం. యమునాతీరవనంబులఁ, గ్రమముగఁ గనుఁగొనుచు నరిగి•క్రమహరితప
త్త్రముల బహుశీతలం బగు,విమలశ్యామాఖ్యవటము•వీరులు డాయన్.

యమునాతీరవనంబులన్=యమునానది యొడ్డునందలి వృక్షములను వరుసగఁ జూచుచుఁ బోయి మనోహరమైన యాకుపచ్చ రంగుగల యాకులచే మిగులఁ జల్లనయి నిర్మలమైన శ్యామమను పేరుగల మఱ్ఱి వృక్షమును సమీపింపఁగా.

కం. న్యగ్రోధముఁ గని జానకి, వ్యగ్రత నిట్లనియె భూజ•వంశోత్తమ! స
మ్యగ్రతి నాపతి నియమస,
మగ్రతఁ గనఁ జేయుమా న•మస్కృతిఁ గొనుమా. ౧౪౬౧

న్యగ్రోధము=మఱ్ఱిచెట్టు, వ్యగ్రతన్=దృఢమైన మనస్సుతో, భూజవంశోత్తమ=వృక్షముల వంశములఁ బుట్టినవానిలో శ్రేష్ఠమైనదానా- భగవంతుఁడు వటపత్త్రశాయిగదా. అట్టిభాగ్యము మఱియేచెట్టునకుఁ గలిగెను. సమ్యక్ + రతిన్ = నిండుప్రీతితో, నియమసమగ్రతన్=వనవాసనియమము పూర్ణముచేయుటచే, నమస్కృతిన్=నమస్కారమును.	తాత్పర్యము

మఱ్ఱిచెట్టునుజూచి జానకిదేవి దృఢమనస్సుతో నో వృక్షరాజమా! నాపతి వనవాసవ్రతము సాంతముచేయునట్లు నిండుప్రీతితో ననుగ్రహింపుము, నా నమస్కారమును గ్రహింపుము.

కం. నాయత్తలఁ గౌసల్య న, మేయచరిత వినుతగుణ సు•మిత్రను మరలన్
వ్యాయతముదమునఁ గనఁ గుజ,నాయక దయఁ జూడునన్ను•
నానతిఁగొనుచున్. ౧౪౬౨

అమేయచరిత=కొలఁదిచెప్పరాని సాధుగుణములఁ గలది, వినుతగుణ= స్తోత్రముచేయఁబడిన గుణములుగలది, వ్యాయతముదమునన్=విస్తారమైన సంతోషముతో, కుజనాయక=వృక్షపతీ, నతిన్=నమస్కారమును.

తాత్పర్యము

పరిమాణములేని మంచినడవడిగల కౌసల్య సాధువులచేఁ బొగడఁబడిన గుణములుగల సుమిత్ర యను నాయత్తలను మరల దర్శించునట్లు వృక్షనాయకా

నానమస్కారము గొని యనుగ్రహింపుము. ఇట్టి కార్యములను, శాస్త్రశ్రద్ధ దెలుపుటకు, లోకసంగ్రహార్థము మర్యాదాస్థాపనార్థము చేయఁబడెనని యెఱుఁగనగు.

సీ. అని వలగొన్నధరాత్మజఁ గనుఁగొని, సౌమిత్రితో రామచంద్రు డనియె
నీవు మున్నుగ సీతనెమ్మిఁ దోడ్కొని భరతాగ్రజా! చనుము సాయుధుండ
నగుచు వెంబడి వత్తు నరుగుత్రోవను సీత, లలితపుష్పం బైన ఫలమునైనఁ
గోరె నేనియు నీవు గొనివచ్చి యిమ్మునా, నట్ల కా కని యతఁ డరుగుచుండ
తే. మత్తమాతంగ యుగళంబు మధ్యమునను,జను కరేణుకభంగిని జనకతనయ
వార లిరువురనడుమను వఱలుప్రీతిఁ,
జనుచునుండెను వింతలఁ గనుచు నచట. ౧౪౯౩

వలగొన్న=ప్రదక్షిణించిన, ధరాత్మజన్=సీతను, భరతాగ్రజా=భరతుఁడన్నగాఁగలవాఁడా, ఇది బహువ్రీహి సమాసము.జన్మముచే భరతుఁడు లక్ష్మణుకంటెఁ బెద్దవాఁడు, కావున భరతునకు + అగ్రజా యని తత్పురుష సమాసము చెప్పరాదు. సాయుధుండన్=ఆయుధములను ధరించినవాఁడను, లలితపుష్పంబయినన్=అందమయిన పువ్వైనను, మత్తమాతంగయుగళంబు = మదించిన యేనుఁగుల జంట, కరేణుక=ఆఁడేనుఁగు.

తా త్ప ర్య ము.

ఈప్రకారము ప్రదక్షిణముచేసిన సీతను జూచి శ్రీరామచంద్రుఁడు లక్ష్మణునితో నిట్లనియె. సీతను నీవు వెంటఁదీసికొని ముందుపొమ్ము. ఆయుధముల ధరించినవాఁడనై నేను వెనుకవచ్చెదను. ఇట్లుపోవుత్రోవలో నందమైన పుష్పముగాని పండుగాని సీత కోరెనేని దానిని నీవు తెచ్చియిచ్చుచుండుము.అనిచెప్పిన నట్టులే కానిమ్మని చేత విల్లు బాణములులేక ముందుపోవుచుండెను. అట్లు వారి యిరువురినడుమఁబోవుచుండు సీత రెండు మదించిన యేనుఁగులనడుమఁబోవు నాఁడేనుఁగువలె నుండెను. అట్లామె వింతలు చూచుచుఁ బోవుచుండెను.

ఉ. ఎన్నఁడు మున్ను చూడనిమహిష్ఠవినోదకరంబు వృక్షమేన్
గ్రొన్నన యేనియుం గుసుమకుంజమ యేనియుఁ గానరాఁగ నా
చిన్నది దానిపేరు రఘుశేఖర యెయ్యది? రామచంద్ర యీ
క్రొన్నన నేమి యందు? రని కూరిమిఁ బ్రశ్న మొనర్చు వల్లభున్. ౧౪౯౪

మహిష్ఠవినోదకరంబు=మిక్కిలి వింతయై యాశ్చర్యకరమైన, క్రొన్నన=క్రొత్త+నన=క్రొత్తపుష్పమైనను, కుసుమకుంజము=పూలపొద.

తా త్ప ర్య ము

పూర్వమెన్నాఁడును జూడనట్టి మిక్కిలి యాశ్చర్యకరమైన చెట్టునుగాని క్రొత్త పుష్పముగాని పూఁబొదగానికనఁబడఁగా సీతాదేవి రామా! దాని పేరేమి? రామచంద్రా! దీనిపేరేమి? యని ప్రేమతో భర్తను బ్రశ్నించుచుండెను.

ఉ. నల్లవొ! యెంతవింత ఛద•నం బది, యీకుసుమంబు సొంపహో,
    పల్లవ ముల్లముం గరఁచె • బాపురె యీనుసుమోకటీవి నా
    నల్లలనామనంబుఁ గని • యంతన యంతన తత్పదార్థముల్
    పెల్లుగఁ దెచ్చి యిచ్చు నవ•లీల సుమిత్రసుతుండు భక్తిమై. ౧౪౬౫

నల్లవో=బళే, ఆశ్చర్యార్థకమైన యవ్యయము, ఛదనంబు=ఆకు, కుసుమము=పుష్పము, పల్లవము=చిగురు, ఉల్లము = మనస్సు, కరఁచెన్=కరఁగించెను, ననుమోక=నునుపైన మొక్క, లలనా=స్త్రీ, పెల్లుగన్=విస్తారముగ, అవలీలన్=అనాయాసముగ. తాత్పర్యము.

బలేబలే, రామచంద్రా! యీయాకు చూడుము. ఎంత వింతగా నున్నదో, రామా! యీపుష్పము చూడుము. ఏమి దీనిసౌందర్యము. ఆహా చిగురు హృదయమును గరఁగించుచున్నది. బాసు యీనునుపైన మొక్కవిభవము. అని సీతాదేవి యనఁగా, నామె మనస్సాయాదానిపైఁ బోయెనని యెఱిఁగి లక్ష్మణుఁడు దాని దాని దండిగఁదెచ్చి భక్తితో నిచ్చుచుండెను.

తే. వింత యిసుమయి జలము ల•త్యంతహృద్య
    హంససారసరవము లై • యమలమైన
    యమునఁ గ్రోశంబు చని కని • యచట హరిణ
    మాంసమునఁ బూటఁ గడపి రా•మహిపసుతులు. ౧౪౬౬

ఇసుము=ఇసుక, అయి=కలిగి, అత్యంత=మిక్కిలి, హృద్య=హృదయరంజకములైన, హంససారసరవము = హంసలయు బెగ్గురులయు ధ్వనిగలదై, వర్ణాగమముచే హస హంస యయ్యెను. హరిణమాంసమునన్ = జింకమాంసముచే, మీఁదఁ జెప్పిన వృక్షవర్ణనమునుబట్టిచూడ నీత్రోవలో భుజింపఁదగిన పండ్లుగల చెట్లులేకుండెననియు, ఆకారణమున జింకమాంసము భుజించి కాలక్షేపము చేసిరనియుఁ దోఁచెడిని.

తాత్పర్యము

వినోదకరమైన యిసుకయు మిగుల మనోజ్ఞములైన హంసలయు బెగ్గురులయు ధ్వనులుగల జలముగలిగి నిర్మలమైన యమునవెంటఁ గోసు దూరము పోయి యచట జింకమాంసము భుజించి రాజకుమారు లావూఁట గడపిరి.

తే. కేకికేకలుఁ గ్రోతుల•కిచకిచలును,హస్తిఘీంకారములుఁ బర్వ•యామునోప
    వనమునందు ధరాత్మజ•వలచుచోట, నీటియొడ్డున నిలిచిరి•మేటిబలులు.

కేకికేకలు = నెమిళ్ళ ధ్వనులు, యామునోపవనమునన్ = యమునానది తీరముననుండు వనమునందు.

తాత్పర్యము.

నెమిళ్ళకేకలు - క్రోఁతుల కిచకిచలు నేనుఁగుల ఘీంకారములు వ్యాపించి

యుండు యమునాతీరవనంబునందు సీత మెచ్చిన నీటియొడ్డున నా బల శాలులు రామలక్ష్మణులు నిలిచిరి.

—• { ౫౬-వ సర్గము. శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటమునందలి చిత్రములం జూపుట. } •—

సీ. ఆరేయియంతయు•నచ్చోటఁ గడపి వే,విన రాముఁడవసు ప్తు•ననుజు మెల్ల
మేల్కొల్పి యనియె సౌమిత్రి! వింటే వన్య,శుకపికశారికా•సుందరస్వ
నము లింకఁ బయనింప•సమయంబు నా నిద్ర, మత్తును గాసియు•నొత్తివైచి
లేచె నందఱు నిట్లు•లేచి యాయేటినీ రముల స్నానాదికా•ర్యములఁ దీర్చి
తే. చిత్రకూటంబునకు ముని•సింహదిష్ట
మార్గమునఁ బోవు చుండఁగ • మానవేంద్రుఁ
డాసరోజాక్షిఁ గనుఁగొని • యచటి చిత్ర
ములను నెల్లను దెలుపుచుఁ • బోవు చుండె. ౧౪౬౮

వేవినన్=ఉదయముకాఁగా, అపసు ప్తున్ = కొంచెముగా నిద్రించువానిని, అనుజున్=తమ్ముని, మేల్కొల్పి=నిద్రలేపి, శుకపికశారికా = చిలుకలయు కోవెల లయు, గోరువంకలయు, సుందరస్వరములు=ఇంపైన ధ్వనులు, గాసి=బడలిక, ఒత్తివైచి = తొలఁగఁద్రోచి, స్నానాదికార్యములు = స్నానము సంధ్య మొదలయిన పనులు,మునిసింహదిష్టమార్గమునన్=మునిశ్రేష్ఠుఁడైన భరద్వాజమహర్షి యుపదేశించిన మార్గమున, నిద్రపోవుచున్న లక్ష్మణుని శ్రీరాముఁడు నిద్రలేపె ననియు లక్ష్మణుఁడు నిద్రమత్తు తొలఁగఁద్రోచెననియుఁ జెప్పుటచే లక్ష్మణుఁడు పదునాలుగు సంవత్సరములు నిద్రాహారములు లేకయుండెననియు నట్టివానిచేఁ గాని యింద్రజిత్తు చావఁడనియుఁ జెప్పెడి వింతకథలు వినసొంపైనవేకాని వాల్మీకిమతము ననత్యములుమాత్రము కావు.

తాత్పర్యము

ఆ రాత్రియంతయు నాయేటియొడ్డుననే కడపి యుదయముకాఁగాఁ గొంచెము నిద్రించిన లక్ష్మణుని మెల్లగా నిద్రలేపి సౌమిత్రీ యడవియందలి చిలుకలు కోవిలలు గోరువంకలు కలకలమని విన నింపుగాఁ గూయుచున్నవి. వింటివా? యింకఁ బ్రయాణముసేయు సమయము. అనఁగా లక్ష్మణుఁడు నిద్ర మబ్బును దారినడచిన బడలికను దొలఁగఁద్రోచి లేచెను. అందఱు నిట్లు లేచి యాయేటి నీళ్ళయందు స్నానముచేసి సంధ్యాదులు తీర్చికొని భరద్వాజముని చెప్పినమార్గమునుబట్టి చిత్రకూటమునకుఁ బోవుచుండఁగా రామచంద్రుఁ డాసీతా దేవికి నచటి చిత్రములను దెలుపుచుఁ బోవుచుండెను.

ఉ. అల్లనెకంటె జానకీ! పలాశ మహీరుహకాననంబు లు
త్ఫలసుమాంచితంబు లయి • పోణిమి దీప్తము లైనయట్లు రా

జిల్లుచు నున్న పెల్లయెడ • స్వీయమనోహరసూనపంక్తులన్
పెల్లుగ మాలికావితతి • వేడ్క ధరించినభంగి నామనిన్. ౧౪౯౯

క్రింది పద్యములందు సీతాదేవికి శ్రీరామచంద్రుఁడు చెప్పినవి చూపినవి చెప్పఁబడుచున్నవి. పలాశమహీరుహకాననంబు=మోదుగుచెట్ల యడవి,ఉత్ఫుల్ల = వికసించిన, సుమ=పూలచేత, అంచితంబులయి = ప్రకాశించునవియై, దీప్తములు=మండుచున్నవి, మోదుగు పూవెఱ్ఱగానుండును గావున మండుచున్నట్లు చెప్పఁబడినవి, స్వీయ=తనవైన, మనోహర=మనస్సు నాకర్షించు, సూనపంక్తులన్=పూలవరుసలచే, పెల్లుగన్=విస్తారముగా, మాలికావితతిన్ = పూలదండల సమూహములచే, ఆమనిన్ = వసంతకాలమునందు, పలాశము = స్వపుష్పైః పలంమాంసం అశ్నాతీవ, తిష్ఠతీతివాపలాశః = పుష్పముచేత మాంసమును భక్షించుదానివలెనుండునది, పల + అశ=స్వరప్రధానయతి.

తాత్పర్యము

సీతా! యదిగో మోదుగుచెట్ల యడవులు కానవచ్చుచున్నవి చూచితివా. అవి వికసించిన పూలచే నెఱ్ఱనై మండుచున్నట్లున్నవి. ఈ వసంతకాలమందుఁ దమ మనోహరములైన పూలదండలచే నలంకరించుకొన్నవిధముగ నున్నవి.

"నిర్గంధా ఇవకింశుకా" యన్నట్లు మోదుగుపూలు వాసనగలవికావు చూచుటకుమాత్ర మెఱ్ఱగా నందముగానుండును. ఈ వృక్షములు తమ్ముఁ దామలంకరించుకొన్నట్లు చెప్పఁబడుటచే విద్యాగంధములేక,యితరులు బహూకరించి యిచ్చినవిగాక, తమంతటఁదామే దంభార్థముగ బిరుదులచేతను, నలంకారములచేతను నలంకరించుకొన్న మూఢులస్థితి ధ్వనించుచున్నది.

కం. కనుమీ పూచినజీడులు, జనములఁ జేరంగనీక • సరసన్ ఫలపత్రనిచయభరమున వంగెను, మనుగడ నేఁ గంటి నిట్టి•ప్రాఁకులు గలుగన్. ౧౪౭౦

సరసన్=సమీపమున, ఫలపత్రనిచయభరమునన్ = పండ్లయొక్కయు, ఆకులయొక్కయు సమూహముల బరువుచేత, మనుగడ=జీవితము.

తాత్పర్యము

పూచిన జీడిచెట్లు తమ సమీపమునకు జనులను దమచుట్టు కంపలను బొదలను పెంచుటచే రానీయక పండ్లయొక్కయు, యాకులయొక్కయు; బరువుచే వంగియున్నవి చూచితివా. ఇట్టి జీవనసాధనమైన చెట్లుండుటచే నేను బ్రతుకఁ గలిగితిని.

ఇది సర్వసంపత్తులు సమృద్ధిగనుండియుఁ బరులను యాచకులను దగ్గఱ రానీయని లోభులను సూచించుచున్నది. "ధర్మోరక్షతి రక్షిత" యన్నట్లు ధర్మాత్ములను వారి ధర్మమే రక్షించుచున్నది. వారికై నేను శ్రమపడవలసిన పనిలేదు. ఈచెట్లపండ్లు రాలఁగొట్టి నేను దిని దీనికిఁ బుణ్యము సమకూర్చినట్లు

దుష్టులను శిక్షించి యైనవారలను బాగుపఱుపవలయుననికదా నాయవతారము నుద్దేశ్యము. ఇట్టివారు లేకున్న నాకవతారకారణమే కలుగదు. మఱియును శ్రీరామునకు ముఖ్యాహారము ఫలమే యని యేర్పడుచున్నది.

తే. తేనెటీఁగల గూర్చిన • తేనెపెరలు, రెండుతూములతేనెతో • నిండి వ్రేలి
యాడుచున్నవియెవెభారు • హాగ్రములను,
గొండకొండను ననుజ! కఁ • న్గొమ్మువాని. ౧౪౭౧

తేనెటీఁగలు- తేనె+ఈఁగలు-కర్మధారయంబులం దుత్తున కచ్చుపరంబగు నపుడు టుగాగమంబు బహుళంబుగ నగు. సు. వ్యా. సంధి ౫౭ సూత్రము. ఈ సూత్రమున కీశబ్ద మపవాదము. బహుళగ్రహణముచే నుత్తుగాకున్నను టుగా గమము వచ్చెను. ఇట్టివే దుక్కిటెద్దు మిద్దెటిల్లు పల్లెటూరు లోనైనవి.

తా త్ప ర్య ము

తేనెటీఁగలు గూర్చిన తేనెపెర టొక్కొక్కటి రెండు తూముల తేనెతో నిండి గ్రహించువాఁడు లేక కొండ కొండయందుఁ జెట్టులకొనలయందు వ్రేలాడుచున్నవి. తమ్ముఁడా వానిని గనుఁగొమ్ము.

సరఘల్గూర్చిన తేనె మానవులకున్ సంప్రాప్తమైనట్లు లోభరతుల్ గూర్చిన విత్తముల్ పరులకుం బ్రాప్తించునుగదా.

కం. అల్లవిగో! నత్యూహము, లుల్లసితమనోజ్ఞకాన • నోద్దేశములన్
బల్లవసుమతల్పంబులఁ, గొల్లగఁ గూయంగ మాఱు • కూసెన్ నెమిళుల్.

నత్యూహములు=నీటియిఱ్ఱులు, ఉల్లసితమనోజ్ఞకాననోద్దేశములన్=మిక్కిలి ప్రకాశించు రమ్యమైన వనప్రదేశములందు, పల్లవసుమతల్పంబులన్ = చిగుళ్ళయు పూలయు పానుపులందు, కొల్లగన్=విస్తారముగ, నత్యూహో జలరంకుస్స్యాత్ - హలా.

తా త్ప ర్య ము

లక్ష్మణా! నత్యూహములు, పూలచేఁ బ్రకాశించు రమ్యమైన యడవి ప్రదేశములందుఁ బూలచిగుళ్ళ పానుపులందు విస్తారముగఁగూయఁగా నెమిళ్లు మాఱుకూయుచున్నవి.

ఇది వేదాధ్యయనము చేయువారిని సూచించుచున్నది.

ఉ. వారణయూథరాజితము • వల్గుశకుంతనితాంతకూజితో
దారము చిత్రకూట మదె • తమ్ముఁడ కంటివె తన్నగంబునన్
జారుసమప్రదేశమున • సారధరారుహవారమండితం
బై రహి మీఱుపుణ్యతల • మందు వసింపుద మన్న లక్ష్మణా. ౧౪౭౩

వారణఁయూథ రాజితము=ఏనుఁగుల గుంపులచేఁ బ్రకాశించునది, వల్గుశకుంత నితాంత కూజి తోదారము=మనోహరమైన పక్షులయొక్క యతిశయించిన ధ్వనిచే గొప్పదైనది, తన్నగంబునన్ = ఆపర్వతమందు, చారుసమ

ప్రదేశమునన్=మనోహరమై గుంతలు మిట్టలు గండ్లు గుండ్లులేని సమభూమి యందు, సారధరారుహ మండితంబై = సారవంతములైన చెట్లసమూహముచే సొగసై, రహిమీఱు=కాంతిచే నతిశయించు.

తాత్పర్యము.

ఏనుఁగుల గుంపుచేఁ బ్రకాశించునదియు మనోహరములైన పక్షుల గొప్ప ధ్వనులుగలదియు నగు చిత్రకూటపర్వత మిదిగోఁ గానవచ్చుచున్నది. లక్ష్మణా చూడుము. ఆపర్వతమున రమ్యమైన సమప్రదేశమున నాకులు బలసిన చెట్లచే నందమైనచోట మనము వసింతము.

సీ. అని పల్కి శ్రీరాముఁ•డనుజుండు సీతయుఁ,
దనతోడ రాఁజని•ఘనముదమున
నానావిహంగమ•నాదసంకులమును, బహుఫలమూలసం•పన్నమగుచు
సరసోదకంబును•జారుతరంబును, మంజులతాద్రుమ•మండితంబు
వరతపోధనగణ•వాసస్థలంబు నౌ,చిత్రకూటనగంబుఁ • జేరి యిచట
తే. మనకు సుఖజీవనం బగు•మంజులంబు,
బహుళఫలమూలయుక్తంబు•ప్రమదకరము
వివిధపుష్పితవల్లికా•విటపియుతము, నగుచు నున్నది లక్ష్మణా•నగతలంబు.

ఘనముదమునన్=అధిక సంతోషముతో, నానావిహంగమ=అనేకవిధములైన పక్షులయొక్క, నాద = ధ్వనులయొక్క, సంకులము = కలఁతచెందినది, బహుఫలమూల సంపన్నము=అనేకములైన పండ్లచే సమృద్ధమైనది, సరసోదకంబును=మంచి రుచిగల నీళ్లు గలదియు, చారుతరంబును = మిగుల సుందరమైనదియు, మంజులతాద్రుమమండితంబు = మనోజ్ఞములైన తీఁగలచేతను, చెట్లచేతను నలంకరింపఁబడినది. వరతపోధన గణవాసస్థలంబును=గొప్ప తపస్వుల గుంపులయొక్క కాఁపురముండు తావును, బహులఫలమూలయుక్తంబు =విస్తారముగ పండ్లతోడను వేళ్ళతోడను గూడినది, ప్రమదకరము = మిక్కిలి సంతోషముకలిగించునది, వివిధపుష్పిత వల్లికావిటపియుతము = అనేకవిధములుగఁ బూచిన తీఁగలతోను చెట్లతోను గూడినది,నగతలంబు=పర్వతప్రదేశము.

తాత్పర్యము.

ఈప్రకారముచెప్పి శ్రీరామచంద్రుఁడు లక్ష్మణుఁడు సీతాదేవి తనతోడ రాఁగా గమ్యస్థానము చేరితిమికదా యను సంతోషమున ననేకపక్షుల ధ్వనులచేఁ గలఁతచెందినదియు విస్తారముగ పండ్లు దుంపలుగలదియు,తియ్యని రుచిగల జలము గలదియు, సుందరమైనదియు మనోజ్ఞములైన తీఁగలు చెట్లు వీనిచే నలంకరింపఁబడినదియు తపస్సుచేసికొను గొప్పమునులకు నివాసభూమి యైనదియునగు చిత్రకూట పర్వతముచేరి లక్ష్మణా యిచ్చట మనము సుఖముఁగ

జీవింపవచ్చును. ఏలన స్థలము మనస్సునకు సమ్మతమైన యింపైయున్నది. ఫలమూలములు విస్తారముగ నున్నవి. నానావిధములైన తీఁగలు చెట్లు పుష్పించి యున్నవి.

కం. పరమతపోవిభవులు ముని,వరు లీశైలంబునందు ♦ వాసము గొని నా
  రిరవుగ మనమును నీక్షితి,ధర మంద వసింప వచ్చుఁ♦దలఁగని ప్రీతిన్.

పరమతపోవిభవులు = గొప్ప తపస్సె సంపదగాఁ గలవారు, శైలంబునందున్=పర్వతమునందు, క్షితిధరమంద=పర్వతమందే.

తాత్పర్యము

గొప్ప తపోధనులగు మునిశ్రేష్ఠు లీ పర్వతమందే వాసము చేయుచున్నారు. మన మీపర్వతమే వాసస్థానముగాఁ జేసికొని సంతోషముతో నుండవచ్చును.

—♦ శ్రీరాముఁడు వాల్మీకిమహర్షిని సందర్శించుట. ♦—

కం. అని సీతయు రాముండును వినయంబున లక్ష్మణుండు♦వెనువెంటనురాఁ
  జనిరి మహాత్ముని వాల్మీకిఁ గన ముని కభివాదనంబుఁ♦గావించి రొగిన్.

అభివాదనంబు = నమస్కారము. ౧౪౭౬

తక్కిన ఋషీశ్వరులకడకుఁ బోయినపుడు శ్రీరాముఁడే ముందుపోయి నమస్కరించెను. వాల్మీకిని జూడఁబోయినపుడు సీత ముందుగఁబోయి మ్రొక్కెను. రాఁగల కాలమున వాల్మీకితోడఁ బనియుండుటచేఁ గాఁబోలు బాలకాండమున వాల్మీకి తమసాతీరమున నున్నట్లు చెప్పఁబడెను.ఇచ్చటఁ జిత్రకూటమున నున్నట్లు చెప్పఁబడెను. శ్రీసీతారామలక్ష్మణులు చిత్రకూటమునకు వచ్చినపుడు వాల్మీకియందే యుండెను. భరతదర్శనానంతరము మునులందఱు చిత్రకూటము విడిచిపోయినపుడు వాల్మీకియుఁ దమసాతీరముఁజేరెను.అగస్త్యునివలె నొక్కఋషియే పెక్కుతావుల నుండుటగలదు.ఇది యూరువిడిచిన యాఱవ దినము.

తాత్పర్యము

తమవెనుక వినయంబున లక్ష్మణుఁడురాఁగా శ్రీసీతారాములు ముందుపోయి మహాత్ముఁడైన వాల్మీకినిఁజూచి వరుసగ నమస్కారముఁ గావించిరి.

ఉ. ఆయనఘుండు వారలకు ♦ హర్షమునం దగుపూజ సల్పి వి
  చ్చేయుఁ డటంచు స్వాగతము ♦ సేమము ప్రశ్న యొనర్ప రాముఁడున్
  న్యాయముఁ దప్పకుండఁ దమ♦నామములుం దమరాక హేతు వ
  త్యాయతభక్తిఁ దెల్పి ముని♦యాజ్ఞను గాంచి వచించెఁ దమ్ముతోన్. ౧౪౭౭

తాత్పర్యము

ఆ పుణ్యాత్ముఁడైన వాల్మీకి వారలకు సంతోషముతోఁ బూజగావించి రండు కూర్చుండుఁడని చెప్పుచు వారి సుఖాగమనము క్షేమము ప్రశ్నసేయఁగా శ్రీరాముఁడు శాస్త్రప్రకారము దమపేరులును దమరు వచ్చినకారణమును మిగుల భక్తితోఁ దెల్పి మునియొద్ద సెలవుదీసికొని తమ్మునితో నిట్లనెను.

కం. గట్టివి వరదారువులం, గట్టుము యొకయాకుటిల్లు ♦ కడురమ్యముగా
  దిట్టమ్ముగ నన నాతఁడు, కట్టెఁ గుటీరం బొకండు♦క్ష్మారుహతతులన్. ౧౪౭౭

వరదారువులన్=శ్రేష్ఠమైన కొయ్యలచే, దిట్టముగాన్=దృఢముగా నుండు నట్లు, కుటీరము=గుడిసె, క్ష్మారుహతతులన్=చెట్లసమూహములచే.

తాత్పర్యము

గట్టివిగాను, శ్రేష్ఠమైనవిగాను జూచి కొయ్యలు దెచ్చి యొక్క పర్ణశాల సుందరముగా గాలికి వానకుఁజెడక దృఢముగనుండునట్లు నిర్మింపుమనిన లక్ష్మణుండును జెట్లకట్టెలు దెచ్చి గుడిసె యేర్పాటుగావించెను.

—♦ శ్రీరామలక్ష్మణులు చిత్రకూటంబునం బర్ణశాల నిర్మించుట. ♦—

సీ. గాలికి వానకుఁ♦గంప మొందనిదాని, బాహ్యావరణముల ♦ బద్ధ మగుచు
  భద్ర మై యొప్పెడు♦పర్ణశాలను గాంచి, శుశ్రూషమాణుఁడై ♦చూచు చున్న
  యేకాగ్రు లక్ష్మణు♦నెలమిఁ గాంచి వచించె,శ్రీరామచంద్రుఁడా♦ర్జింప వయ్య
  జింకమాంసంబును♦జేయంగఁ దగుఁ బూజ,
                    శాలకుఁ దగవాస్తు♦శమన విధియుఁ
తే. పెక్కునా ళ్లిల బ్రతుక న♦భీష్ట మైన,వారలకుఁ గరణీయ మా♦వశ్యకముగఁ
  గాన హరిణంబు నొక్కటిఁ♦గానఁజంపి,
                    తెమ్ము స్మరియించుకొమ్ము వి♦ధిప్రవృత్తి. ౧౪౭౮

కంపమొందనిదానిన్=ఊఁగులాడనిదాని, కదలనిదాని, బాహ్యావరణములన్=గోడలు మొదలగు వెలుపలి కప్పులచే, బద్ధము=కట్టఁబడినది, భద్రమై=శుభకరమై,పర్ణశాల=ఆకులతో నిర్మింపఁబడిన యిల్లు,శుశ్రూషమాణుఁడు=ఎప్పుడే పనిచెప్పునా చేయుదమా యని కోరుచుండువానిని,ఏకాగ్రున్=మనస్సు శ్రీరామ కైంకర్యమందే నిలిచి యితరపదార్థములపై బోనీయనివాని,ఎలమిన్=సంతోషముతో, ఆర్జింపవయ్య=సంపాదింపుమా, శాలకున్=ఇంటికి, వాస్తుశమనవిధి=గృహదేవతలకుఁజేయు శాంతికార్యము, కరణీయము=చేయఁదగినది, హరిణంబున్=జింకను, విధిప్రవృత్తి=శాస్త్రమునఁ జెప్పఁబడిన విధానము, దీనివలన వాస్తుశాంతి సేయక గృహప్రవేశము చేయరాదని యేర్పడుచున్నది.

తాత్పర్యము

గాలికివానకుఁ జలింపనిదాని గోడలు మొదలయిన బయటి యావరణములు దృఢముగాఁ గట్టఁబడినదియై పదిలముగానుండు నాకుటీంటిని జూచి యింక నేపనిచెప్పునా యెట్లుచేయుదుమా యని మనస్సంతయు నితరకార్యములకై పోనీయక తమ కైంకర్యమందే నిలిపియున్న లక్ష్మణు చూచి సంతోషించి శ్రీరామచంద్రుఁ డిట్లనెను. లక్ష్మణా జింకమాంసమును సంపాదింపుము, గృహదేవతలఁ బూజించి శాస్త్రప్రకారము శాంతిచేయవలయునుగదా.ఇది భూమిమీఁదఁ జిరకాలము బ్రతుకఁగోరినవారికి నవశ్యము చేయఁదగినకార్యము. కావున శాస్త్ర

మునఁ జెప్పఁబడిన విధానము స్మరణమునకుఁ దెచ్చికొమ్ము. జింక నొకదానిఁ జంపితెమ్ము.

'శయ్యాదేశే కామలింగేన దేహళ్యా మంతరిక్షలింగేన' యని యింటికి నొక్కొక్క దిక్కున నొక్కొక్క యధిష్ఠానదేవతయుండును. వీరిని బూజింపవల యును. ఆ పూజకుఁ బూర్వము ఇంటిభూమి ప్రదేశమున నుండెడి భూతపిశాచాదులకు శాంతికరమగు కార్యమును జేయవలయును. ఇది గృహప్రవేశార్థమైన కార్యము.

ఈశాంతి చేయక యింటిలోఁ బ్రవేశించెనేని యజమానునికి నాయువు క్షీణించును. భూతపిశాచాదులు యజమానుని బాధించుచుండును. "నచవ్యాధిభయంతస్య, నచబంధు జనక్షయం, జీవేద్వర్ష శతంసాగ్రం, కల్పమేకం వసేన్నరః" అని బ్రహ్మాండపురాణవాక్యము గలదు. గోవిందరాజీయము. వాస్తువు= గృహము, "ధిష్ణ్యంధామ నికేతనంచ సదనంవస్త్యంచ వాస్తుక్షయ" యని నిఘంటువు. "వాస్తురస్త్రీ గృహంసీమా సురంగా గృహభూఃపురీ" నానా. ర. కావున గృహపర్యాయమైన వాస్తుశబ్దము గృహాధిష్ఠాన దేవతలను దెలుపును. వారు శిఖిపర్జన్యుఁడు మొదలగువారు నలువదియైదుగురు. యజ్ఞార్థమైన పశువునుజంపిన దోషముకాదాయని బోధాయను లాక్షేపించిన యాక్షేపమునకు శాస్త్రప్రయోగము స్మరించుకొమ్మని సమాధానము చెప్పుచున్నాఁడు. శాస్త్రప్రకారము చేయుట మనపనికాని శాస్త్రము తప్పుచెప్పినదా ఒప్పుచెప్పినదా యని విచారించుట మనపనికాదు. మన శ్రేయస్సు కోరువాఁడని మనము నమ్మినరాజు చేయు నాజ్ఞయేదియైనను మన యభిప్రాయప్రకారమది యిష్టమైనను గష్టమైనను ఆప్రకారము మనము నడువవలసినది మనకు విధికాని దాని నాక్షేపించుట మన పనికాదు. ఆ ప్రకారము నడువకుండిన శిక్షకలుగును. శాస్త్రవిధి యట్టిది. కావున శాస్త్రవిశ్వాసము కలవారు దాని నాక్షేపింపరాదని తెలిసికొనుము. రాజన్యాయమైన శాస్త్రముచేసినాఁడనితోఁచిన నారాజ్యము విడిచి వెలుపలఁబొమ్ము. అట్టులే శాస్త్రవిశ్వాసములేనివారు ఆమతము విడిచి వేఱొక వేద బాహ్యమతమునకుఁ బోవలయునని భావము. మతమందుండి మతవిరుద్ధకార్యములు చేయరాదు. యజ్ఞార్థమై చేయు పశుహింస దోషముకాదు. ఈహింస పశువునకుఁ జేటుకలిగించెనేని యది మనకు దోషమే. యజ్ఞమునఁ జంపఁబడిన పశు వధోలోకమునకై పోక యుత్తమలోకమునకుఁ బోవుచున్నది. కాఁబట్టి పుంసు మాన్పుటకై చేయబడు శస్త్రచికిత్సవలె నుత్తమలోక ప్రాప్తికై చేయఁబడు హీనదేహహింస దోషకారి కాదు. ఈ విషయమున శాస్త్రమిట్లు చెప్పుచున్నది. "నవా ఉవేతన్మ్రియసే నరిష్యసిదేవాన్ ఇదేషిపథి భిస్సుగేభిః । యత్రయంతి సుకృతోనాపి దుష్కృతస్తత్రత్వాదేవస్సవితాదధాతు" అని వేదము. కావున యజ్ఞమునందలి వధ వధ కాదు అని స్మృతి. తీర్థీయము.

యజ్ఞార్థా త్కర్మణోన్యత్ర, లోకోయం కర్మబంధనః। తదర్థం కర్మకౌంతేయ ముక్తసంగ సమాచర॥ భ.గీ. ౩-౯ అర్జునా భగవదారాధనరూపమైన యజ్ఞాది శాస్త్రీయకర్మములకొఱకుఁ జేయఁబడు కర్మము శ్రేష్ఠము. అట్లుగాక స్వప్రయోజనము కొఱకైన కర్మము బంధహేతువు. కావున నీవు స్వప్రయోజనముఁకొఱకనియెడి సంగమును విడిచి యజ్ఞార్థము కర్మము చేయుము.

యజ్ఞశిష్టాశినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః

యజ్ఞశేషము భుజించునట్టి సత్పురుషుల సమస్తపాపములనుండి విడివడుచున్నారు. యజ్ఞార్థమనఁగా యజ్ఞోవై విష్ణువనియుండుటచే విష్ణు నుద్దేశించి చేయు నారాధనమనియు యజ్ఞశిష్టాశనమనఁగా విష్ణువునకు నివేదించిన ప్రసాదశేషమనియు నెఱుఁగనగు. భగవద్గీత బోధించునది యంతయు నిదేకదా. స్వధర్మనిర్వహణమందు శాస్త్రవిశ్వాసముంచి దానియందుఁ జెప్పఁబడిన ప్రకారము చేయు సంగరహితున కేపాపభయము లేదు. సమాధానము మాత్ర మిదిచెప్పుచు మాంసాభిలాషులై దేవపూజ నిమిత్తమాత్రముగ నుంచుకొని నాకుఁదలఁ, నీకుఁ బిక్క, యని కలహించువారికి హింసాదోష మంటకపోదు. అహింసా పరమోధర్మ యను వేదమే యజ్ఞములందుఁ బశువధ విధించుచున్నది. ఇందేవాక్యము ప్రమాణము? అను సందేహము వచ్చినపుడు భగవత్కైంకర్యభావముతో, శాస్త్రప్రకారము సమంత్రకముగఁ బరమార్థబుద్ధితోఁ జేయవలయుననియుఁ దదితర కారణముల నా కార్యము చేయరాదనియు, సందిగ్ధవిషయముల శిష్టాచారము గ్రాహ్యమనియు నిర్ణయ సింధ్వాది ధర్మశాస్త్రకారులు వచించిరి.

చం. అనవుఁడు నాతఁ డట్టులె ర◆యంబునఁ జల్పఁగ వెండి పల్కుఁ గ్ర
  స్నన హరిణామిషంబుఁ బచ◆నం బొనరింపు ధ్రువంబు ముహూర్తమున్
  దినము నటన్న లక్ష్మణుఁడు ◆ తెప్పన గృష్ణమృగంబుమాంస ము
  గ్నిని బచనంబు సేసి కల◆నెత్తురు పోయెడిదాఁక, నిట్లనున్. ౧౪౮౦

హరిణామిషంబున్=జింకమాంసమును, పచనంబు=పక్వము, ధ్రువము=స్థిరలగ్నము.

తాత్పర్యము

అని శ్రీరామచంద్రుఁడు చెప్పఁగా నట్లే చేసెదనని శీఘ్రముగ నట్లు చేయఁగా మఱియును శ్రీరాముఁ డిట్లనియె. ఈజింకమాంసమును బక్వమగువఱకు వండుము. ఈదినము ముహూర్తము స్థిరమైనది అని చెప్పఁగా లక్ష్మణుఁడు శీఘ్రముగ నల్లజింకమాంసమును నెత్తురుపోవువఱకువండి యిట్లనియె.

కం. పరిపూర్ణాంగంబులతోఁ, బరిపక్వం బగుట రామ◆భద్రా! కంటే
  హరిణము తొల్లిటిభంగిన, కర మొప్పెను దీర్పు దేవ◆కార్యముఁ గుశలా.

పరిపూర్ణాంగంబులతోన్=నిండిన యవయవములతో, పరిపక్వంబగుటన్=పచ

నము చేయఁబడిన దగుటచే, హరిణము=జింక, తొల్లిటిభంగిన=పూర్వవిధము ననే, జీవించియున్నప్పటివలె, కుశలా=సమర్థుఁడా = చేయవలసిన విధాన మంతయుఁ దెలిసినవాఁడా. తాత్పర్యము.

రామచంద్రా! యవయవములం దేదియు విచ్ఛిత్తిలేక వండఁబడుటచేఁ జూచితివా పూర్వము జీవించియున్నప్పు డెట్లుండెనో యట్లే యిప్పుడునున్నది. చేయవలసిన కర్మవిధానమందు నీవు నేర్పరివి కావున దేవకార్యము దీర్పుము.

సీ. అనవుడు శ్రీరాముఁ•డంబువులను దోఁగి,నియతి జపించి యా•నిఖిలవిధులఁ
దీర్చి దేవగణాళిఁ•దృప్తిగాఁ బూజింప, నందఱు నిలు సొచ్చి•రంత ముదితుఁ
డయి వైశ్వదేవబ•లియు రౌద్రవైష్ణవం,బులువాస్తుదోషముల్•పోవఁ ద్రోయు
పుణ్యాహవాచనం•బును శాంతిజపము లో,నగుమంగళ క్రియ•లాచరించి

తే.యాపగాజలంబుల స్నాన•మాడి పిదపఁ గ్రూరభూతప్రశాంతిపొ•ల్పారబలుల
నిచ్చె శ్రీరామచంద్రుఁడు•హితము చెలఁగ, శాస్త్రనిగదితరీతిఁ బ్ర•శస్తగతిని.
౧౪౧౫

అంబువులన్=నీటియందు, తోఁగి=స్నానము చేసి, ముదితుఁడయి=సంతోషించినవాఁడై, నియతిన్=ఏర్పాటుతో, జపియించి=వాస్తుశాంతిమంత్రములను జపముచేసి, నిఖిలవిధులన్=సమస్తకార్యములను, దేవగణాళిన్ = గృహాధిష్ఠానదేవతల సమూహముయొక్క పరుసను, వైశ్వదేవబలియున్ = వైశ్వదేవమను క్రియయందు వేసెడి బలియు, అందురౌద్రవైష్ణవంబులు = రుద్రునిబలియు, విష్ణుబలియు,వాస్తు దోషముల్=గృహమునందలి దోషములను, మంగళక్రియలు =శుభకార్యములు, అపగాజలంబులన్ = ఏటినీటియందు, స్నానమాడి = "తతస్సర్వౌషధీస్నానం యజమానస్యకారయేత్" అనెడి స్మృతివాక్యము ప్రకారము మరల స్నానముచేసెను. క్రూరభూతప్రశాంతి=పాపిష్ఠములగు పగలు సంచారముచేయునవియు రాత్రులందు సంచరించునవియునగు భూతము లడఁగునట్లు, శాస్త్రనిగదితరీతిన్ = శాస్త్రమునఁ జెప్పఁబడినప్రకారము, ప్రశస్తగతిన్ = ప్రశంసింపఁదగిన విధముగ.

తాత్పర్యము

లక్ష్మణుఁ డిట్లుచెప్పఁగా శ్రీరాముఁడు వారుణస్నానముగావించి వాస్తుదేవతల మంత్రముల జపించి చేయవలసినకార్యములు దీర్చి గ్రహదేవతలఁ దృప్తిగాఁ బూజింపఁగా నందఱు శ్రీసీతారామలక్ష్మణులు లోపలఁ బ్రవేశించిరి. అంత శ్రీరామచంద్రుఁడు సంతోషించి వైశ్వదేవముగావించి బలివేసి రౌద్రబలియు వైష్ణవబలియు వేసి వాస్తుదోషములు పోవునట్లు పుణ్యాహవాచనము శాంతిజపము మొదలయిన శుభకార్యము లాచరించి మరల నీటిలోమునిఁగి పిదపఁ గ్రూరభూతములకు శాంతిగలుగ బలులువైచి యీప్రకారము తమ

మేలునకై శాస్త్రమునఁ జెప్పఁబడినప్రకారము రాజకుమారుఁడైన నెంతచక్కఁగ శాస్త్రవిధానము తప్పకుండఁ గావించెనని ఋషులు మెచ్చుకొనునట్లు సర్వము దీర్చెను.

(౧) యజనము=యజ్ఞముచేయుట (౨) యాజనము=యజ్ఞముచేయించుట (౩) అధ్యయనము = వేదముచదువుట (౪) అధ్యాపనము=చదివించుట (౫) దానము=ఒకరికిచ్చుట (౬) ప్రతిగ్రహము=ఒకరిచేఁ బుచ్చుకొనుట ఇవి యాఱును బ్రాహ్మణ కర్మములు. ఇందు ౧-౩-౫-నకు మాత్రమే క్షత్రియుఁడధికారి. ఇట్లుండ బ్రాహ్మణుఁడు చేయవలసిన యాజనకార్యము క్షత్రియుఁడైన శ్రీరామచంద్రుఁ డెట్లుచేసెను? అని సందేహము.

యాజనము- అధ్యాపనము- ప్రతిగ్రహము ఈ మూఁడు బ్రాహ్మణునకు జీవనాధారముగ నేర్పఱుపఁబడిన వృత్తులుగాని యివిచేయకుండినఁ బ్రత్యవాయము లేదు. వర్ణాశ్రమ ధర్మవిధుల ననుసరించి యొకరి వృత్తిచే మఱియొకఁడు జీవింపరాదు కావున నితరజీవనోపాయముగల క్షత్రియునకు యజనాధ్యయనదానములందే యధికారముగలదు. తక్కినవానియందు లేదు. అయినను వీనిని క్షత్రియుఁడు వృత్తిగా నుంచుకొనిగాని లోభితనముచేఁగాని చేయరాదని శాస్త్రభావమే కాని యక్కఱ లవసరములందుఁ దాను జేయరాదని గాదు. ఇల్లుకట్టుట వడ్రంగికార్యము దానిని శ్రీరామ లక్ష్మణు లెట్లుచేసిరి ?

విశ్వామిత్రుఁడు క్షత్రియుఁడై యెట్లు త్రిశంకునిచే యజ్ఞము చేయించెను? ఇందును విశ్వామిత్రుఁడు వృత్తిగాఁ జేసినవాఁడుకాఁడు. బ్రాహ్మణు లెవ్వరు పూనుకొనమిని గృతజ్ఞత బాధింపఁగా నాకార్యము చేసెను. అట్లున్నను నది సరిగాదని వాసిష్ఠు లాక్షేపించిరి.

తే. ఆశ్రమంబున కనురూప • మైనవేది,
చైత్యములునాయతనములుఁ • జక్కఁ దీర్చి
వన్యమాల్యఫలాదులఁ • బక్వమాంస,
ములను దీర్థంబులను వేద • కలితములను. ౧౪౮౩

తే. జపములను దర్భవితతుల • సమిధలను య,
థావిధిగ జానకీయుక్తిఁ • బావనం బొ
నర్చి శాలాప్రవేశంబు • నడపి దేవ,సభనుహరివోలె శ్రీరామ • చంద్రుఁ డొప్పె.

అనురూపము=తగిన, వేదిచైత్యములు=అగ్నిహోత్రకార్యములకుఁ గావలసిన యరుఁగురూపములయిన బలిపీఠములు, ఆయతనములు=విష్ణుపూజాగృహములు, వన్యమాల్యఫలాదులన్=అడవియందుఁబుట్టిన పూలదండలు ఫలములు మొదలయినవానిని, పక్వమాంసములన్=వండిన మాంసములను, తీర్థంబులన్ =వేదమంత్రములచే మంత్రించిన జలములను, యథావిధిగన్=శాస్త్రమునతిక్రమింపకుండువిధమున, జానకీయుక్తిన్=సీతతోడ. ఇందుఁ గొన్ని దంపతులు

చేయు కార్యములు. పావనము=పవిత్రము, శాలాప్రవేశంబు=ఇంటిలోఁ జొచ్చుటను, దేవసభన్=సుధర్మయను పేరుగల దేవసభయందు, హరిపోలెన్=ఇంద్రునివలె.

౧౪లో౩-౧౪లో౪ నకు తాత్పర్యము.

ఆశ్రమమునకుఁ దగినట్టి యరుఁగులవంటి బలిపీఠములు విష్ణుమందిరములు చక్కఁగా నేర్పఱిచి యడవిపూలదండలు పండ్లు మొదలైనవానిచేతను బక్వమాంసములను వేదమంత్రములచే మంత్రించిన తీర్థములను మంత్రజపములను దర్భల సమూహములను సమిధలను శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము సీతతోడఁగూడి పవిత్రములఁజేసి యింటియందుఁ బ్రవేశించి దేవతల సభయగు సుధర్మయందు నింద్రునివలె శ్రీరామచంద్రుఁ డొప్పెను.

శా. నానాపక్షిమృగాకులంబు సుమనో • సద్వృద్రుమభ్రాజితం
బై నాగేంద్రమృగానునాదితము నై • హారిప్రతీరాఢ్య మౌ
కానన్ మాల్యవతీతటంబునను జో•కన్ జానకీ రాఘవుల్
సానందంబుగఁ గ్రీడ సల్పిరి ప్రవా•సాయాససంవిస్మృతిన్. ౧౪లో౫

నానాపక్షిమృగాకులంబు=అనేకవిధములైన పక్షులచే మృగములచేఁ గలఁతనొందినది, సుమనోసద్వృద్రుమభ్రాజితంబు=పూలచే నందమైన చెట్లచేఁ బ్రకాశించునది, నాగేంద్రమృగానునాదితము=పెద్దయేనుఁగులు లోనగు మృగముల ధ్వనులు గలది, హారిప్రతీరాఢ్యము=మనోజ్ఞమైన మంచితీరములచే సంపన్నముగాఁ జేయఁబడినది, మాల్యవతీతటంబునన్=మాల్యవతియనెడి నదియొడ్డున, జోకన్=ఉల్లాసముగా, సానందంబుగన్=సంతోషముతోఁ గూడినట్లుగ, క్రీడసల్పిరి=విలాసముగాఁ గేళిసలిపిరి, అనఁగా నీవనవాసము వారికి నుద్యానవన కేళివలె నుండెనుగాని వనవాసముగా నుండలేదని భావము. ప్రవాసాయాస సంవిస్మృతిన్=పరదేశమునకు వచ్చిన బడలికను బూర్ణముగ మఱచుటచే అయోధ్యయందున్న సుఖముకంటె నిచ్చట నెక్కువ సుఖముగ నుండెనని భావము.

తాత్పర్యము

అనేకవిధములైన మృగములచేతను, పక్షులచేతను గలఁతనొందినదియుఁ బూలచే నందమైన చెట్లచేఁ బ్రకాశించునదియు, నేనుఁగులు మొదలగు మృగముల ధ్వనులుకలదియు మంచితీరములు గలదియు నగు మాల్యవతి యను నదియొడ్డున నుల్లాసముగ శ్రీసీతారాములు తమ పరదేశవాసమునఁ గలుగు కష్టములను బూర్ణముగ మఱచి క్రీడ సలుపుచుండిరి.

ఇంతతో శ్రీరాముని వృత్తాంతము చాలించి యయోధ్యయందు జరిగిన విషయము కవిచెప్పుచున్నాఁడు.

—• ౫౭-వ సర్గము. సుమంత్రుఁడు మరల నయోధ్యకుఁ బోవుట. •—

సీ. దుఃఖార్తులై సుమం•త్రుండుగుహుఁడు రాముఁ,
గనుచూపుమేరదాఁ•కను దదీయ
కథ ముచ్చటించుచుఁ•గనుఁగొనుచుండి యా,
వల నింటికేగి రా • యలఘుమతులు
చని ప్రయాగమునందు•మునిభరద్వాజని,తోడ నుండుటయు సం•తోస మార
నాగిరిగమనంబు•నానిషాదాధిపు, చారులవలనను•జక్క నెఱిఁగి
ఆ.గుహునిచే ననుజ్ఞఁ•గొని సుమంత్రుం డయో,ధ్యాపురంబునకె ర•థంబుఁ దోలు
కొనుచు నరిగె వనటఁ•గోమలగంధవ, నాపగానగరము•లరసికొనుచు. ౧౪౮౬

దుఃఖార్తులై=దుఃఖముచేఁ బీడింపఁబడినవారై, తదీయకథ=శ్రీరాముని చరిత్రంబు, ముచ్చటించుచున్=చెప్పుచు, అలఘుమతులు=గొప్ప మనస్సులుగల వారు,శ్రీరామలక్ష్మణులు,ఆగిరిగమనంబు=చిత్రకూటపర్వతమువఱకుఁబోవుటయు, నిషాదాధిపు చారులవలనన్=గుహుని వేగువాండ్రవలన, కోమలగంధవనాపగా నగరములు=మంచివాసనగల వనములు నదులు పట్టణములు, అరసికొనుచున్= విచారించుచు.

తాత్పర్యము.

దుఃఖపీడితులై సుమంత్రుఁడు గుహుఁడు తమ కన్నులకుఁ గనవచ్చుదాఁక శ్రీరామునిఁజూచుచు నా ముచ్చటలే చెప్పుకొనుచుండి యాయన కానరాక పోఁగా వారింటికేగిరి.ఆశ్రీరామలక్ష్మణులు గంగదాఁటిన దినమొక చెట్టువఱకుఁబోవుటయు రెండవ దినము భరద్వాజాశ్రమమున నుండుటయు,మూఁడవదినము యమునా తీరమునఁబరుండుటయు, నాల్గవ దినము చిత్రకూటమునకుఁ బోవుటయు, నీ సమాచార మైదవదినము చారులు గుహునితోఁ జెప్పుటయు, సుమంత్రుఁడు విని శ్రీరాముల వృత్తాంతమంతయు నెఱిఁగినవాఁడై గుహునిచే ననుమతిగొని చక్కఁగ నయోధ్యా పురమునకే రథము తోలుకొని దుఃఖించుచుఁ ద్రోవలో సువాసనగల వనములు నదులు పట్టణములు చూచుచుఁబోయెను. ఈదిన గణనమందు భిన్నాభిప్రాయములు గలవు. అవి ౧౪౮౬-వ పద్యవ్యాఖ్యానమందుఁ జర్చింపఁబడును.

మ. చనుచున్ మూఁడవనాఁటి సంజ గతహ•ర్షం బౌట నిశ్శబ్దమై
కన శూన్యంబుగఁ దోఁచు చున్న పురముం•గన్నీటితోఁ జొచ్చి దు
ర్మనుఁడై వాజులు వారణంబులు ప్రజల్•రాజుల్ గనన్ రాక భూ
తనయావల్లభశోకహవ్యవహద•గ్ధం బై సవందంబునన్. ౧౪౮౭

మూఁడవనాఁటి సంజ=(౧) మూఁడవనాఁటి సాయంకాలము,(౨) మూఁ డవ+నాఁటిసంజ=దినమునందలి మూఁడవ సంధ్యాకాలము, అనఁగా సాయం కాలము.ఏదినమునుండి మూఁడుదినములనువిషయము౧౪౮౬-వపద్యవ్యాఖ్య యందుఁజర్చింపఁబడును,గతహర్షంబు=పోయిన సంతోషముగలది,సంతోషము

లేనిది. నిశ్శబ్దమై=శబ్దము లేనిదై, శూన్యంబుగన్=పాడుపెట్టినట్లుగ, దుర్మనుఁడై =దుఃఖముతోఁగూడిన మనస్సుగలవాఁడై, వాజులు=గుఱ్ఱములు, వారణంబులు= ఏనుఁగులు భూతనయావల్లభ= సీతాపతియైన శ్రీరామునియొక్క, శోక = శోకమనెడి, హవ్యవహ=అగ్నిచే, దగ్ధంబైన=కాలిన, చందంబునన్=విధముగా.

తా త్ప ర్య ము

సుమంత్రుఁడు పోవుచు మూఁడవనాఁటి సంధ్యాకాలమున సంతోషహీనమౌటచే శబ్దములేనిదై చూచుటకుఁ బాడుపడినట్లు దోఁచుచున్న పట్టనమును గన్నీళ్లు గార్చుచుఁ బ్రవేశించి శోకముతోఁ గూడిన మనస్సుగలవాఁడై గుఱ్ఱములుగాని యేనుఁగులుగాని ప్రజలుగాని రాజులుగాని కానరాక శ్రీరామశోకాగ్నిచేఁ గాలినట్లున్న విధముగ.

ఉ. తోఁచుచు నున్నదంచుఁ బురి●దోరముఁ జేరుచు వేగఁ జొచ్చి లోఁ
 గ్రాఁచుచు నున్న దుఃఖమునఁ●గ్రన్నన పోవ సుమంత్రుఁ డార్తిమైఁ
 బూఁచి పురీజనంబు రఘు●పుంగవుఁ డేఁడి యటంచు నాతనిన్
 వాఁచినయట్లు దుఃఖమున●వాంచినమోముల నడ్డగించినన్. ౧౪౭౭

తోఁచుచున్నది=కానవచ్చుచున్నది, దోరము=ద్వారము, ద్వారశబ్దభవము దోరము, గ్రాఁచుచున్=కాల్చుచు, క్రన్ననన్=శీఘ్రముగా, ఆర్తిమై=శోకముచే, వాఁచినయట్లు=కాళ్లు ముఖము వాఁచిన వారి విధముగ, వాఁచిన=ఉబ్బిన.

తా త్ప ర్య ము.

కానవచ్చుచున్నదని పురద్వారము చేరుచు వేగ లోపలికిఁబోయి లోపలఁ గాల్చుచున్న శోకముచే సుమంత్రుఁడు త్వరగాఁ బోవఁగాఁ బురజనులు శోకముచే వాఁచిన మోములతో వాఁచినవారివలె రథమున కడ్డమువచ్చి శ్రీరాముఁ డేఁడీయని యడుగఁగా

కం. గంగాతీరమునన్ రఘు, పుంగవుచే నాజ్ఞఁ గొంటిఁ ● బోయిరి వారున్
 గంగాతరణ మొనర్చి యు, నంగా హా రామయని జ●నంబులు వనటన్. ౧౪౭౮

గంగాతరణము=గంగనుదాఁటి, సీతారామలక్ష్మణులు చిత్రకూటమందున్నారని చెప్పినఁ బౌరులందఱు బయలుదేఱుదురని తలఁచి వారెక్కడ నుండునది తనకుఁ దెలియనట్లు గంగదాఁటి పోయిరనిమాత్రము చెప్పెదను.

తా త్ప ర్య ము

గంగాతీరమునందు శ్రీరాముచే నాజ్ఞఁగొంటిని. వారును గంగదాఁటి పోయిరని చెప్పఁగా జనులు హా రామా యని.

—● సుమంత్రునిరథముం జూచి పౌరులు దుఃఖించుట. ●—

ఉ. హా యనువారు భూపతన●యా యనువారలిఁ కేటిజీవమి
 స్సీ యనువారు గుంపు లయి ● చేసెడి దే మిఁక జచ్చినారమే

పో యనువారు దానసవ•పుణ్యసమాజవివాహవేళలం
దాయనఘాత్ము నింకఁ గన • నౌనెటు లం చనువారు నై రటన్. ౧౪౯౦

భూపతనయా=రాజకుమారా, దానసవపుణ్యసమాజ వివాహవేళలందున్= దానము, యజ్ఞము, పుణ్యసమాజములు గూడు సమయము పెండ్లి జరుగు కాలములందు, అనఘాత్మున్=పాపరహితమైన మనస్సుగలవానిని, దీనివలన నెక్కడనే శుభకార్యము జరిగినను వారికి సహాయుఁడై శ్రీరామచంద్రమూర్తి తానుండి యాకార్యము జరిగించుచుండెనని భావము.

తా త్ప ర్య ము.

హాయనువారును రాజకుమారా యనువారును నిఁకేటి బ్రదుకనువారును గుంపులుగూడి యిఁక మనమేమి చేయఁగలము, బ్రదికియుఁ జచ్చినవారితో సమానమే యనువారును, దానములు యజ్ఞములు పుణ్యసభలు పెండ్లిండ్లు చేయుకాలము వీనియిందిఁక నాయకమణివలె నాయనను జూడలేముగదా యను వారునైరి. ఎవరో దానముచేయుచోటి నీయనకేమి పనియనిన దేశము కాలము పాత్రము తెలిసి చేయుచున్నారా లేదాయని కనిపెట్టి చెప్పుటకు, యజ్ఞముల కేలపోవును? న్యాయార్జిత ధనముచేఁ జేయుచున్నారాలేదా, దక్షిణలు సరిగా నిచ్చుచున్నారా లేదాయని కనిపెట్టుటకు, ఆయా కర్మములందు సందేహములు వచ్చినయెడల వానిని బరిష్కరించి మఱచినవానిని జ్ఞాపకమునకు వచ్చునట్లుచేసి యే లోపములేక సాంతము చేయించుటకు, పెండ్లిండ్ల కేలపోవును? తాంబూలము నిమిత్తముగాదు వియ్యములో నేనైనఁ గలహములు ప్రాప్తించెనేని యిరువురకుఁ జెప్పవలసిన మాటలు చెప్పి సమాధానపఱచుటకు, లేనివారికి ధన మిచ్చుటకు, ఇట్లుచేయుటకుఁ గారణము తాననఘాత్ముఁడగుటచే నితరులకును గృత్యాకరణము అకృత్యకరణమునను పాపముల నుండి విడివడఁజేయుటకే.

సీ. ఆరామచంద్రుదు మో•మాదటఁ గనకున్న,మన కేది సుఖకర•మనఘులార
యాలోకహితుమోము•నాలోకనము లేక.యగుప్రియం బిఁక నెద్ది•యార్యులార
యానళినాక్షు డా•యుంగ లేకయుయున్నఁ,బొరి సుఖావహ మెద్ది•పుణ్యులార
మన తండ్రివలెఁ బ్రోచు•ననఘుఁడు పెడఁబాయ, దిక్కేది మనకింక•దీనులార
తే. యెంతనిర్భాగ్యులమొకదా•చింతసేయ,
నట్టిధర్మాత్ముఁ డటువంటి• యనఘమూర్తి
యట్టిహృదయాళుఁడట్టిద•యాపరుండు,
విడిచిపోయినమనియిట్లు•మిడుకుచుండ. ౧౪౯౧

ఆదటన్=ప్రీతితో, లోకహితున్=(౧) లోకమునకు మేలుగోరువానియొక్క, (౨)సూర్యునియొక్క, ఆలోకహితున్ = (౧)చూపునకుఁ జంద్రునివలె హితమైన వానియొక్క, ఆలోకనము = దర్శనము, సుఖావహము=సుఖము కలిగించునది. పెడఁబాయన్ = ఎడఁబాయఁగా, మని=బ్రదికి, మిడుకుచుండన్=దుఃఖపడుచుం డుటకు.

తా త్ప ర్య ము

ఆ శ్రీరాము మోమును ప్రీతితో మనముచూడఁ జాలమేని మనమెంత పాపరహితులమైనను మనకేమి సుఖముగలదు. (పాపరహితుఁడైనను భగవత్సాక్షాత్కారములేక ముక్తిసుఖములేదు.)మనమెంత యార్యులమైనను ఆచంద్రునివలెఁ గన్నులకుఁ బ్రీతిగలిగించువానిని సూర్యునివలె లోకహితమెంచువానిని జూడకున్న మనకేమి ప్రియముగలదు? సూర్యుని జంద్రునిఁజూచుటకుఁ గన్నులులేనివాఁడు ప్రియవస్తువు దేనిని జూడఁగలఁడు? మనమెంత పుణ్యులమైనను ఆకమలాక్షు సమీపింపమేని మనకు సుఖము గలిగించునది యేదికలదు? సాయుజ్యము కలిగినఁగాని శాశ్వతసుఖములేదు. దీనులమైయుండు మనకుఁ దండ్రివలె రక్షించు శ్రీరామచంద్రమూర్తి విడిచిపోఁగా నిఁక దిక్కెవ్వరు? దీనదశయందుఁ గన్నతండ్రియే రక్షకుఁడు. అట్టివాఁడు విడిచిన నితరులెవ్వరు కావఁగలరు?ఇంతయేల యాలోచించి చూడఁగా నటువంటి ధర్మాత్ముఁడు అటువంటి పుణ్యమూర్తి అట్టి మంచి హృదయము గలవాఁడు అట్టి దయావంతుఁడు విడిచిపోవఁగా నిట్లు దుఃఖించుచు నుండుటకు మనమెంత భాగ్యహీనులమోకదా. ఒకసారి జపపూజాదులచే భగవత్సర్శసాన్నిధ్యము గలిగియు మరల దానిని విడుచువాఁడు నిర్భాగ్యుఁడే.

కం. ఏది సుఖంబు నొసంగునొ,యేది యొకో ప్రియము జనుల•కెల్లను క్షేమం
బేదియొ కాచ్చెడునని సీ,తాదయితుఁడు మనలఁ బ్రోచెఁ• దండ్రియపోలెన్. ౧౪౮-౭

తా త్ప ర్య ము

శ్రీరాముఁడు మనకేది సుఖము కలిగించునో యేది ప్రజలకుఁ బ్రియమో యేది జనులకందఱకు క్షేమకరమో యని యాలోచించి యదియే చేయుచు మనలఁ దండ్రివలె రక్షించుచుండెనుగదా.

హేయగుణరహితుఁడు కల్యాణగుణ సహితుఁడునగుభగవంతుఁడు సర్వదా చేయుచుండు పని యిదియేకదా. ఎవని నెవని నెట్లెట్లు రక్షింతునాయని వానికి వానికి హితమైన కార్యమే చేయుచుండును.

కం. సరసిజలోచన లంగడి, తెరువులఁగిటికీలనుండి• తేరిం గనుచున్
బరిదేవన మొనరించిరి, ధరణిసుతానాథశోక•తాపార్దితలై. ౧౪౮-౮

అంగడితెరువులన్= బజారువీథులందు, పరిదేవన మొనరించిరి = ఏడ్చిరి, ధరణి సుతానాథ శోకతాపార్దితలై = రామశోకమువలనఁ గలిగిన తాపముచే బాధింపఁబడినవారై.

తా త్ప ర్య ము.

శ్రీరాముఁడు వెడలిపోయిననాఁడు శోకముచేఁ జాఁపచుట్టలవలె నేలఁబడిపోయినవారును సుమంత్రుఁడు తేరిని దెచ్చినవాఁడని విని శ్రీరామచంద్రమూర్తి

మరలి వచ్చెనేమోయని లేచి వీథులలోకి రాలేక కిటికీలనుండియే తేరిని జూచి మరల రామవియోగ శోకతాపముచే వాధపడిరి.

కం. సారథి పిహితాస్యుం డై, తేరిం దోలుకొని చనియెం • దెప్పున భూపా
గారమునకు నటడిగ్గి మ,హారయమున సర్వజనస • మాకుల మగుచున్. ౧౪౪

పిహితాస్యుండై=వస్త్రముచేఁ గప్పుకొనఁబడిన ముఖముగలవాఁడై, తెప్పునన్=శీఘ్రముగా, భూపాగారమునన్=రాజునింటికి, మహారయమునన్=మిగుల వేగముతో.

తాత్పర్యము.

జనులదుఃఖము తాను జూడలేక, శ్రీరాముని నడవులపాలు చేసి యేమని వచ్చితివని లోకులందురేమోయను సిగ్గుచేత, వారు వేయు ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరము చెప్పఁజాలక, వస్త్రముచే ముఖముకప్పుకొని జనులెఱుగకుండునటుల మిగుల వేగముగాఁ దేరినిదోలుకొని సుమంత్రుఁడు రాజునింటికిఁబోయి యచట దిగి మెల్లగాఁబోయిన జనులు మునురుకొందురను భయముతో మిగుల వేగముగ సుమంత్రునిరాక విని రామవార్త వినుటకై రాజుగతి తెలిసికొనుటకై గుంపులు గుంపులు చేరియున్న యన్ని తెఱఁగుల మనుష్యులచే వ్యాకులమై.

సీ. దిట్టంబు లగునేడు • తొట్టికట్టులు దాఁటి, యరుగ సౌధవిమాన • హర్మ్యరాజ
మందిరాగ్రంబుల • మందయానలు నిల్చి, రామశూన్యంబైన • రథముఁ జూచి
విపులహాహాకార • వికృతస్వరంబుల, నొండొరుఁ గనుఁగొని • యుల్ల మెరియ
నాయతవిమలనే • త్రాంతంబు లం దుండి, కాల్వలు వాఱంగఁ • గంటినీరు

తే. పొక్కుచును నేడ్వఁ బ్రాసాద • ములను నంత,
టంతటను నిల్చి దశరథు • నింతులెల్ల
మహిపసాన్నిధ్యమునఁ జేసి • మందమంద,
మగను నీరీతి నేడ్చిరి • మొగములుబ్బ. ౧౪౫

దిట్టంబులు=దృఢములు, సౌధవిమాన హర్మ్యరాజమందిరాగ్రంబులన్=సాధారణములైన మేడలయు నేడంతస్తులయు. "విమానోస్త్రీ దేవయానే సప్తభూమి గృహేపిచ" వై జయంతి, ధనికుల యిండ్లయుఁ బ్రాసాదములయుఁ బై భాగములందు, మందయానలు=స్త్రీలు, ఇదివఱకుఁ గటికుచకచ భారముచేతనే మెల్లగ నడచువారిప్పుడు ప్రబల శోకభారముకూడఁ జేరినకారణమున మిక్కిలి మెల్లగా నడచిరనిభావము. విపుల=విస్తారమైన, హాహా కార=హాహా యను, వికృత స్వరంబులన్=వికారపుధ్వనులచే, ఉల్లము=హృదయము, ఎరియన్=మండిపోవ, ఆయత=దీర్ఘములైనట్టియు, విమల=కన్నీటిచేఁ గాటుక కరఁగిపోఁగాఁ దెల్లనైనట్టియు, నేత్రాంతంబులందుండి=కనుఁగొనలనుండి, ప్రాసాదములు = రాజుల మేడలు, మహిపసాన్నిధ్యమునన్=రాజు సమీపమునను న్న కారణముచే, మందమందముగన్=మెల్లమెల్లగా.

తాత్పర్యము.

దృఢములైన తొట్టికట్టు లేనునట్టి యొంటిమేడలు, ఏడంతస్తుల మేడలు, ధనికులయిండ్లు, రాజులయిండ్లు వీని పైభాగములందు స్త్రీలు నిలిచి శ్రీరామచంద్రమూర్తి లేని రథమునుజూచి పెద్దగా హా హా యని వికారధ్వనులతో నొకరి నొకరుచూచుచు హృదయము మండుచుండ దీర్ఘములై కన్నీటివఱదచేఁ గాటుక కరఁగిపోవుటచే దెల్లనైన కన్నుల కొలుకులయందుండి కన్నీరు కాల్వలు పాఱనేడ్చుచుండఁగా నంతఃపురస్త్రీలుండు ప్రాసాదములందు సమీపమునకు రాక దూరమందందందు నిలిచి దశరథుని భార్యలందఱు రాజు సమీపమున నున్న కారణమున మెల్లమెల్లగ నిట్టేడ్చిరి.

ఉ. రామునితోడ నేగి యిటు ♦ రామునిఁ గానలపాలు సేసి తా
నేమని కోసలాత్మజకు ♦ నీతఁడు చెప్పెడి వాఁడొ, యెట్టు లిం
కేము మనంగ సాధ్య మొకొ ♦ యీగతి నామెయు రాముఁ బాసి మే
నోమెడి నట్టి దుష్కర మ♦యో యెటు లోర్చు దురంతతాపమున్. ౧౪౯౬

మనంగన్=బ్రదుకుటకు, మేనోమెడినట్టి=దేహమును రక్షించుకొనుచున్నది కదా, దుష్కరము = మిగులఁగష్టకార్యము, దురంతతాపము = అంతములేని తాపము.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తితోడఁ బోయి యాయనను నడవులపాలుచేసి వచ్చి తానేమని కౌసల్యకు సమాధానము వీఁడు చెప్పఁగలఁడు. ఆమెకేమైనఁ జెప్పినిండు- చెప్పకపోవనిండు మన మేమని బ్రదుకను ? ఎట్లు బ్రదుకను ? ఇది సాధ్యమా. అయ్యో శ్రీరాముని బాసియుఁ గౌసల్య యింకను దేహము రక్షించుచున్నదికదా. ఎంత యసాధ్యమైనకార్య మామె చేయుచున్నది. దేహము రక్షించిన నేమి లాభము. ఈ సహింపరాని దుఃఖతాపమెట్లు భరింపఁగలదు.

—♦ సుమంత్రుఁడు దశరథుఁ జూచుట. ♦—

సీ. అనుచు రాచపడంతు♦లాడు చుండఁగ విను,
చమితశోకహుతాశ♦నార్చిఁ గ్రాఁగు
చున్నదో యన నొప్పు♦చున్న రాజగృహంబు,నం దెనిమిదవక♦క్ష్యను సదీన
మానసు నాతురు♦మహితపుత్రవ్యథా,మ్లానుఁ బాండరగృహ♦మధ్యమునను
గాంచి నమస్కృతిఁ♦గావించి శ్రీరాము, వాక్యంబు లెల్లను♦వరుసఁ జెప్ప
తే. మౌనియై విని విభ్రాంత♦మానసమున, నేలపైఁబడి మూర్ఛిల్ల♦నేలతేఁడు
బాహువుల నెత్తి హోయని♦భామ లెల్ల, రోదనము సేయ సాగిరి♦క్రూరగతిని.

రాచపడంతులు=రాజస్త్రీలు, అమితశోక హుతాశనార్చిన్ = మితిలేని శోకమను నగ్నిజ్వాలలచే, క్రాఁగు = కాలు, సదీనమానసున్ = శోకముతోఁ గూడిన మనస్సుగలవానిని, ఆతురున్=బాధపడువానిని, మహితపుత్రవ్యథామ్లానున్=గొప్ప

దగు పుత్రశోకముచే వాడినవానిని, పాండరగృహమధ్యమునన్ = తెల్లయింటి నడుమ, కళాకాంతులు లేకుండుటచేఁ దెల్లఁబోయినదని భావము. విక్రాంత మానసమునన్=విశేషముగఁ గలవరపడిన మనస్సుతో, నేలఱేఁడు=రాజు.

తా త్ప ర్య ము

ఈప్రకారము రాజస్త్రీలు మాటలాడుకొనుచుండ వినుచు విస్తారశోకాగ్నిచేఁ గాలిపోవుచున్నదో యన్నట్లున్న రాజగృహము నందలి ఏడవ కక్ష్యయందు దీన మైన మనస్సుగలవానిని బాధపడువానిని పుత్రశోకముచే వాడినవానిని, తెల్లని యింటియందున్నవానిని దశరథునిఁజూచి నమస్కరించి శ్రీరాముని వాక్యము లన్నియుఁజెప్పఁగా బదులు చెప్పక విని కలఁతపడిన మనస్సుతో నేలమీఁదఁ బడి రాజు మూర్ఛపోఁగా స్త్రీలు తమ చేతులచే నాయన నెత్తి హాయని తీవ్ర ముగ నేడువసాగిరి.

సీ. కౌసల్యయు సుమిత్ర • బాసటగా నాథు, నెత్తి యిట్లనియె భూ • మీశ! యీతఁ
డఘటనఘటనాస • మర్థునిదూత కా,ఁడవులయందుండి • యరుగుదెంచె
నింత యన్యాయంబు • నేఁ జేసితిని గదా,
యని యేల లజ్జించె • దధిప యిపుడు
లే లెమ్ము పుణ్యంబు • చాల నీకు లభించు, నేడ్చిన ఫలమింక • నేమి గలుగు
తే. నెవ్వతెకు నీవు జడిసి సీ • తేశవార్త, యైన నడుగవో యట్టినీ • ప్రాణదయిత
కైక యిట లేదు సత్యంబు • గాన దిటము,
దెచ్చుకొని మాటలాడంగ • వచ్చునీకు. ౧౨౧౩

బాసటగాన్=సహాయముగా, అఘటనఘటనా సమర్థునిదూత = ఇతరుల కసాధ్యములైన కార్యములను సాధించు నేర్పుగల శ్రీరాముని దూత, జడిసి = భయపడి, ప్రాణదయిత = ప్రాణమువలెఁ బ్రియురాలు, దిటము = దార్ఢ్యము. అఘటనఘటనాసమర్థుని దూత గావున సుమంత్రునియందును నఘటనఘటనా సామర్థ్యము కొంతగలదని భావము. సీతారామలక్ష్మణులను బుద్ధిపూర్వకముగా నడవులందు విడిచి వారు నడచిపోవఁజూచి ప్రాణముధరించి మరల నింటికి రాఁగల రాతిగుండెవాఁడు సుమంత్రుఁ డొక్కండే. ఇది యితరులకు సాధ్యమగు పనిగాదు. వారచ్చటనే ప్రాణము విడిచియుందురు.

తా త్ప ర్య ము

సుమిత్రాదేవి సహాయపడుచుండఁ గౌసల్య నేలమీఁదఁబడిన దశరథు లేవ నెత్తి యిట్లనియె. రాజా యితఁడు అసాధ్యకార్యముల సాధించు శ్రీరామచం ద్రుని దూత, అడవులనుండి వచ్చినాఁడు. ఇంత యధర్మకార్యము నేను జేసి తినిగదా యని యిపుడేల సిగ్గుపడెదవు ? నీకుఁజాలఁ బుణ్యమువచ్చునుగాని లేలెమ్ము. కార్యము మించినతరువాత నిపుడేడ్చిన రాఁగల లాభమేమి? ఎవతెకు నీవు భయపడి నీ కొడుకువార్తయైన నడుగనొల్లవో యట్టి నీ ప్రాణప్రియురాలు కైక యిచ్చట లేదు. ఇది సత్యము. కావున ధీరుఁడవై మాటలాడవచ్చును.

మ. అని కౌసల్య నితాంతదుఃఖమున మూ♦ర్ఛాక్రాంత యై నేల వ్రా
లిన శుద్ధాంతసరోజపత్రనయన ♦ లీక్షించి హాహారవం
బున నేడ్వం గని చుట్టుపక్కఁగలపూ♦వుంబోండ్లు వృద్ధాళి యౌ
వనవంతుల్ విలపించి రంతిపురి ♦మ్రో♦వన్ హల్లకల్లోల మై. ౧౪౯౯

నితాంతదుఃఖమునన్=అధికమైన దుఃఖముచే, మూర్ఛాక్రాంతయై=మూర్ఛచే నాక్రమింపఁబడినదై, శుద్ధాంతసరోజపత్రనయనల్ = అంతఃపురస్త్రీలు, పూవుంబోండ్లు=స్త్రీలు, వృద్ధాళి=ముసలివారి సమూహము, యౌవనవంతుల్=వయస్సు నందుండువారు, అంతిపురికిన్ = అంతఃపురమందు,హల్లకల్లోలమై=అల్లకల్లోలము గందరగోళము, మ్రోవన్=ధ్వనింపఁగా.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము చెప్పి కౌసల్య యధిక దుఃఖమున మూర్ఛపోయి నేలపైఁ బడఁగా నంతఃపురస్త్రీలు చూచి హాహాయని యేడువఁగా నంతలంతలనున్న స్త్రీలు ముదుసళ్లు ప్రాయపువారు నంతఃపుర మల్లకల్లోలమగు నట్లేడ్చిరి.

—♦ { ౫౮-వ సర్గము. దశరథుఁడు సుమంత్రుని శ్రీరామలక్ష్మణుల వృత్తాంత మడుగుట. } ♦—

ఉ. అంతట మూర్ఛఁ దేఱి మను♦జాగ్రణి యాత్మసుతాగ్రగణ్యవృ
త్తాంత మెఱుంగఁ గోరుమతిఁ ♦ దాల్చిన సూతుఁడు కేలు మోడ్చి య
త్యంతవిషాదచిత్తుఁ బరి♦తప్తు నవగ్రహ మైనరోగ మౌ
దంతిని బోలువాని వసు♦ధాపతి డాసిన నంత నాజియున్. ౧౫౦౦

ఆత్మసుతాగ్రగణ్యవృత్తాంతము=తన పెద్దకొడుకు చరిత్రము,అత్యంతవిషాదచిత్తున్=మిక్కిలి దుఃఖించు మనస్సుగలవానిని, పరితప్తున్ = మిక్కిలి తాపము నొందినవానిని, నవగ్రహము = క్రొత్తగాఁ బట్టుపడినదగుటచే రోగము గల, దంతిన్=ఏనుఁగును.

తా త్ప ర్య ము

అంతట రాజు మూర్ఛనుండి లేచి తన పెద్దకొడుకువార్త తెలియఁగోరఁగా సూతుఁడు కేలుమోడ్చి మిక్కిలి విషాదముతోఁగూడిన మనస్సుగలవానిని, పరితాపము చెందువానిని, క్రొత్తగాఁబట్టుపడి రోగముచేఁ బీడింపఁబడు నేనుఁగువలె నుండు వానిని రాజును సమీపింపఁగా దశరథుఁడును.

కం. ధూళిని బ్రుంగిన మేనును, గాలువలై పాఱుబాష్ప♦కణములు మున్నే
వ్రాలినతలయును నార్తిం,దూలినమో మైన సూతు♦తోడం బలికెన్. ౧౫౦౧

సీ. అత్యంతసుఖి యయి♦యలరు ధర్మాత్ముఁ డే, చెట్టుమొదళ్ల వ♦సించె నయ్యొ
రాచబిడ్డఁడు శయ♦నోచితుం డతికోమ,లుండు నేనేలపైఁ♦బండె నయ్యొ

యెవ్వనిబడి నేగు♦నిభరథభటతతి, వాఁ డేవనంబున♦వనరె నయ్య
లేలిహానమృగావ♦ళీనిషేవితకాన, నమునఁ గొండిక లెట్లు♦నవసి రయ్య

ఆ. బాల ముద్దరాలు♦పరమపతివ్రత, యన్నెపున్నె మెఱుఁగ♦నట్టిసీత
వెంట నంటఁ బుత్రు♦లొంటి మైఁ గాల్నడ, నరదము డిగి యెట్టు♦
లరిగి రయ్య ౧౫౦౨

అత్యంతసుఖీ=మిగుల సుఖము ననుభవించువాఁడు, శయనోచితుండు=పానుపుపైఁ బండుటకుఁదగినవాఁడు, అతికోమలుఁడు = మిగుల మృదువైన దేహముగలవాఁడు, ఇభరథభటతతి = ఏనుఁగులయుఁ దేరులయు భటులయు సమూహము, లేలిహాన=పాములచేతను, మృగావళీ=మృగముల వరుసలచేతను, నిషేవిత=సేవింపఁబడిన కూడిన, కాననమునన్=అడవియందు, కొండికలు=పిల్లవాండ్రు, అన్నెపున్నెము=అన్యము, పుణ్యము=పాపము పుణ్యము, ఒకానొకచో ద్వంద్వంబునం బూర్వపదంబు క్లీబసమంబగు, అగుచో నా మువర్ణకంబునకు లోపంబగు. త్రి. సమా. ౨౯ ద్వంద్వం బప్రాణివాచక కృదంతఘటితం బేకవచనాంతంబునగు, త్రి. సమా. ౩౦. తాత్పర్యము.

అయ్యా! మిక్కిలి సుఖమనుభవించు ధర్మాత్ముఁ డేచెట్ల మొదళ్ల వసించెను? రాజకుమారుఁడై మృదువైన హంసతూలికాతల్పమందుఁబరుండ యోగ్యతగలిగి మిగుల మృదువై యంటినఁగందు దేహముగలవాఁ డేనేలపైఁ బండుకొనెను? ఎవ్వనివెంట నేనుఁగులు గుఱ్ఱములు తేరులు కాలిభటులు పోవుచుందురో యట్టివాఁ డొంటిగ నేయడవియందు దుఃఖించుచున్నాఁడు. పాములయు మృగములయు గుంపులతోఁగూడిన యడవియందుఁ బిల్లవాండ్రెట్లు బాధపడి కృశించిరి? చిన్నది సుందరి మిగులఁ బతిభక్తిగలది, యిది కష్టమిది సుఖము ఇది సత్యము, ఇది మోసము అని తెలియనిది. ఇట్టి సీత తమ వెంటరాఁగా నాపుత్రులొంటరిగా నడచుచు రథము దిగి యెట్లు పోయినారు.

కం. కన్నారఁ గాంచినాఁడవు, మన్నందనయుగ్మ మడవి♦మందర మశ్వుల్
మన్నుగఁ జొచ్చినగతిఁ జొరఁ,గన్నివే ధన్యతముఁడు♦కావె సుమంత్రా.
౧౫౦౩

నందనయుగ్మము=ఇరువురు కొడుకులు, మందరము=మందరపర్వతమునందు, సప్తమ్యర్థమునఁ బ్రథమ, అశ్వుల్=అశ్వనీదేవతలు, అశ్వనీదేవత లిరువురు వీరు దేవవైద్యులు. వీరు స్వర్గమున నుండువారయ్యు, నోషధులకై మందరపర్వతమునందుఁ బ్రవేశించినట్లు, జడంబైన సప్తమికిఁ బ్రథమవైకల్పికంబుగ నగు, సు.వ్యా. కారక ౩౩. ధన్యతముఁడవు=ధన్యతముఁడవు, కొన్నియెడల మధ్యమోత్తమ పురుషంబులకుఁబ్రథమపురుషమగు,సు.వ్యా.కారక ౪౦.

తాత్పర్యము

సుమంత్రా: మందరపర్వతమం దశ్వినీదేవతలు ప్రవేశించినట్లు నాయిరువురు

కొడుకు లడవయందుఁ బ్రవేశింపఁగా నీవు కన్నులారఁ జూచితివి. అంతవఱకుఁ జూచు భాగ్యము నీకు లభించెను గావున నీజన్మమే సార్థకము.

ఉ. ఏ మనె రామచంద్రుఁడు మ ♦ ఱే మనె నయ్య సుమిత్రపట్టియున్
భూమితనూజ యే మనియెఁ ♦ బొ మ్మనువేళను నిన్నుఁ జెప్పుమా
మామహనీయుఁ డుండుతల ♦ మాతఁడు దేని భుజించె? నెట్టు లే
నీమెయిఁ దాల్చువాఁడ విని ♦ యేనియు సాధులలో యయాతినాన్. ౧౫౦౪

ఈమెయిన్ = ఈ దేహమును, సాధులలో యయాతినాన్ = యయాతి స్వర్గమునుండి భ్రష్టుఁడై భూమిమీఁదఁ బడునపుడు నన్ను సాధువులుండుచోట వేయుమని యింద్రునిఁగోరెను. ఆప్రకారమే కాఁగా సాధుసాంగత్యముచే మరల స్వర్గమునకుఁ బోవఁగలిగెను. అట్టులే నేను శ్రీరాముని కథలు వినుటచే నీదేహము ధరింపఁ గలుగుదును. సాధుసాంగత్యము, సాధుసల్లాపము ప్రథమ తరణో పాయము. సాధుసంగంబు సర్వార్థసాధకంబు.

తా త్ప ర్య ము

నిన్ను మరలిపొమ్మని చెప్పినపుడు శ్రీరామచంద్రుఁ డేమిచెప్పెను. లక్ష్మణుఁ డేమనెను. సీతాదేవి యేమనెను చెప్పుము. ఆ రామచంద్రుఁడుండు ప్రదేశమెట్టిదియో దేనిని భుజించెనో చెప్పెదవేని యతని చరిత్రము వినియైనను సాధువులలోఁబడిన యయాతివలె నీ దేహమును ధరించియుండెదను. సాధుసాంగత్యము, సాధుసల్లాపము ప్రత్యక్షము లభింపనపుడు వారి చరిత్రలు వినుటయు శ్రేయస్కరమే.

కం. అని తన్ను నృపతి యడిగిన, విని కంఠగతోరుబాష్ప ♦ వికలరవుం డై
వనరుచుఁ బలుకులు దడఁబడ, ననియె సుమంత్రుండు రఘుకు ♦ లాగ్రణితోడన్.

కంఠగత = కంఠమునుబొందిన, ఉరుబాష్ప = విస్తారమగు కన్నీళ్లచేత, వికలరవుండై = గద్గదపాటొందిన ధ్వనిగలవాఁడై, వనరుచున్ = దుఃఖపడుచు.

అని రాజడిగిన విని కన్నీళ్లు కుత్తుక కడ్డపడ గద్గదస్వరముగలవాఁడై మాటలు తడబడఁ దుఃఖపడుచు దశరథునితో సుమంత్రుఁ డిట్లనియె.

—♦ సుమంత్రుఁడు దశరథునకు శ్రీరామవాక్యములఁ దెల్పుట. ♦—

సీ. నామాటవిదితాత్మ ♦ నాతండ్రి మ్రొక్కుమీ,
పదములఁబడి మొట్ట ♦ మొదటసూత
వారికి వారికి ♦ వల నగురీతిగా, నాకుఁగా నభివాద ♦ నములు సేసి
శుద్ధాంతకాంతల ♦ సుఖమెకా మీ కెల్ల, ననుచు నామాటగా ♦ నడుగ వయ్య
మాతల్లిఁ గౌసల్య ♦ మఱిగాంచి కుశలాభి, వాదనంబులు సల్పి ♦ పలుకు మిట్టు

ఆ. లెల్లకార్యములను ♦ నేమఱ కోయమ్మ! ధర్మనిత్య వగుమ ♦ తగినవేళ [౧౫౦౬
నగ్న్యగారపరత ♦ నలయకు; పతిపాద, ములను గొలుము దేవుఁ ♦ గొలుచునట్లు.

విదితాత్మన్=నా మనస్థితి తెలిసినవానిని, అభివాదనములు=నమస్కారములు, శుద్ధాంతకాంతలన్=అంతఃపుర స్త్రీలను, కుశలాభివాదనంబులు = కుశలప్రశ్న చేసి నమస్కరించి, ధర్మనిత్యవు=ధర్మమందు స్థిరమైనమనస్సుగలదానవు, అగ్న్యగారపరతన్=అగ్నుల రక్షించుటయందు. భర్త హోమాగ్నులను రక్షించుట పెద్దభార్య కార్యము, ఆ యధికార మితరులకులేదు. అలయకుము=ఉపేక్ష సేయకుము.

తాత్పర్యము

మొట్టమొదట నావిధము తెలిసిన నా తండ్రికి నామాటుగా నేను మ్రొక్కితినని చెప్పి పాదములమీఁదఁబడి నమస్కరింపుము. తక్కినవారికి వారివారికిఁ దగినట్లు నాకుఁగా నమస్కారములు చేయుము. అంతఃపుర స్త్రీలనందఱను మీకుఁ గుశలమా యని నే నడిగితి ననుము. అవల నాతల్లి కౌసల్యను గుశలమడిగి సాష్టాంగ నమస్కారము గావింపుము. అట్లు గావించి యిట్లు చెప్పుము. తల్లీ! యన్ని కార్యములను మునుపటివలెనే యేమఱకచేయుము, వ్యసనముచే నేపనియు మానవలదు. ఎల్లప్పుడు పాతివ్రత్యధర్మమునందు స్థిరబుద్ధిగలదానవై యుండుము, నాకొడుకున కిట్టికష్టము గలిగించెనని నాతండ్రి నుపేక్షింపకుము. ఆ యా సమయములందు నగ్నిహోత్రమును రక్షింపుము, భర్త పాదములను దేవునిఁ గొలుచునట్లు గొలువుము.

ఉ. మానముపొంతఁ బోక, యభి♦మానము దూరముఁ జేసి, ఊనిక
న్యూనకుఁ గైకకున్ మనసు ♦ నొవ్వక యుండెడుమైఁ జరింపు, త
త్సూనుఁడు నేలఱేఁ డనుచుఁ ♦ జూడుము! రాజులు విత్తవృద్ధు లన్
నానుడి నీ వెఱుంగవె? మ♦నంబున నిల్పుము రాజధర్మముల్. ౧౫౦౭

మానము=నా సవతికి దాసుఁడై పెద్దభార్యను నన్ను నవమానించెఁగదా యను కోపము. అభిమానము=నేనుత్తమ క్షత్రియవంశమున జనించినదానను గర్వము, ఊనికన్యూనకున్=రాజునకంటెఁ దక్కువగాని దానికి, నొవ్వక=నొప్పి కలుగక, మైన్=విధముగా, తత్సూనుఁడు = ఆమెకొడుకు, నేలఱేఁడు = భూమికధిపతి, విత్తవృద్ధులు=ధనముచే గొప్పవారు, నానుడి=సామెత.

తాత్పర్యము

నాసవతికి వశపడి నన్నవమానించె ననుకోపమునకు సమీపమున కైనఁ బోక నేనుత్తమక్షత్రియ కన్యనను గర్వమువదలి రాజునకు సమానురాలైన కైక మనస్సునకు నొప్పి కలుగకయుండు విధమునఁ బ్రవర్తింపుము. ఆమెకొడుకే రాజుగదాయని యాలోచింపుము. రాజులు విత్తముచే వృద్ధులేకాని వయస్సుచేతఁ గాదను సామెత నీకుఁ దెలియదా. కావున రాజధర్మములను మనస్సున నిలుపుము.

చం. భరతుఁడు వచ్చినం గుశల•వార్తలు మద్వచనంబుగాఁగ నీ
వరయుము; యెల్లతల్లు లెడ • న్యాయపువృత్తిన సంచరింపుమీ
ధరణిపతిత్వ మూని ముది•తండ్రిని జిక్కులఁ ద్రోయఁ బోకుమీ
వరనృపభూరిభోగములఁ • వాలుము తండ్రి వచించుపద్ధతిన్. ౧౫౦౮

తాత్పర్యము.

భరతుఁడు వచ్చినపుడు కుశలప్రశ్నలను నే నడిగినట్లు నీవడుగుము. సవతి కొడుకు వీనితో నేమి మాటలని యూరకుండకుము. నామాటలుగా నీ పై మాట లతనికిఁ జెప్పుము. అందఱు తల్లులయందును న్యాయ్యమగు విధము గానే సంచరింపుము. ప్రభుత్వము చేతికిరాఁగానే ముసలి తండ్రిని జిక్కులలోఁ ద్రోయు నాలోచనలు సేయకుము. తండ్రి చెప్పినమార్గమున రాజభోగము లనుభవింపుము.

చం. అని వచియింపు మంచు నయ•నాంబులు రాలఁగ వెండిఁ బల్కె నీ
జననిగఁ జూడవయ్య యను•జా! సుతగర్ధిని నాదుతల్లి, నం
చును గనునీరు నించెఁ గడు•శోకమునన్ ధరణీశ! ఫుల్లకో
కనదదళాక్షుఁడా మహిజ•కాంతుఁడు రాముఁడు మోము వ్రాల్చుచున్. ౧౫౦౯

వచియింపుము=చెప్పుము, నయనాంబులు=కన్నీళ్లు, అనుజా=తమ్ముఁడా! సుతగర్ధిని=తన కొడుకునందుఁ బ్రేమగలది, ఫుల్ల=వికసించిన, కోకనద=ఎఱ్ఱకమలమువంటి, అక్షుఁడు=కన్నులుగలవాఁడు, తొలుతనే యెఱ్ఱనికన్నులు శోకించుటచే మఱింత యెఱ్ఱనయ్యెను. తాత్పర్యము

అని చెప్పుమని చెప్పి కన్నుల నీళ్లుకాఱుచుండ మఱియును నిట్లు భరతునితోఁ జెప్పుమనెను. తమ్ముఁడా తన సుతునియందుఁ బ్రేమగల నాతల్లిని నీతల్లి వలెఁ జూచుకొనుము. నీ తల్లికి నీయందువలె నాతల్లికి నాయందుఁ బ్రేమ యుండుట తప్పుగా నెన్నకుము. అని మిక్కిలి శోకముతో తలవంచి యావలఁ జెప్ప నిష్టములేక యెఱ్ఱతామరలవంటి కన్నులుగల శ్రీరామచంద్రుఁడు కన్నుల నిండ నీరునించెను.

ఇప్పుడింత కెక్కువ చెప్పుట యనుచితమని శ్రీరాముఁడు చెప్పఁడయ్యెఁ గాని "సుప్తప్రమత్త కుపితానాం వచసైర్భావ జ్ఞానందర్శితవ్య" మ్మను న్యాయమున అనఁగా నిద్రపోవువానియొక్కయు, మత్తెక్కినవానియొక్కయుఁ గోపించువానియొక్కయు, మాటలచే మనస్సునుండుదానిఁ గనుఁగొనవలయు ననియర్థము. కావున మనస్సున నుండునది సీతాపహరణానంతరము బయలు పఱుచుచున్నాఁడు.

—• సుమంత్రుఁడు దశరథునకు లక్ష్మణువాక్యంబులఁ దెలుపుట. •—

సీ. సౌమిత్రియో రోష•సంభ్రమంబున రోఁజుచును నిట్టులనియెను•వినుము దేవ
యేయపరాధంబుఁ • జేయఁ గానలఁ ద్రోచె, రాజపుత్రాగ్రణి•రామచంద్రు

మీరాజు చెప్పువమా ♦ తేరకు పూ కిట్లు, వ్యసనంబు గలుగంగ ♦ వలచు కైక
తుచ్ఛశాసనమును ♦ దొడ్డగాఁ దలఁ దాల్చి, చేయఁగా రానట్టి ♦ చెనఁటి సేఁతఁ
ఆ. జేసెఁ గార్యబుద్ధి ♦ వాసిగ వరదాన, లాభముననొ రాజ్య ♦ లోభముననొ
యేమి హేతువైన ♦ రాముని బాయుటఁ నిష్కృతియునులేని ♦ దుష్కృతంబ.
౧౫౧౧౦

సౌమిత్రియో = లక్ష్మణుఁడో-ఓ యనునది లక్ష్మణుఁడు శ్రీరామునివలెఁ బ్రియములు (ఇచ్ఛకములు) చెప్పలేదనియు మనస్సులో నున్నదున్నట్లు స్పష్టముగాఁ జెప్పెననియుఁ దెలుపుచున్నది. రోషసంభ్రమమః = కోపమువలనఁ గలిగిన త్రొట్రుపాటుచే, రోఁజుచున్ = బుసకొట్టుచు, తేరకున్ = నిష్కారణముగా, తుచ్ఛశాసనమును = నీచమైనయాజ్ఞను, దొడ్డగాన్ = గొప్పదిగా, చెనఁటిసేఁత = దుష్టకార్యమును, కార్యబుద్ధిన్ = చేయఁదగినదను నభిప్రాయముతో, వరదానలాభమునన్ = వరము సఫలము చేయుటవలనఁ గలుగు లాభము- ఇది స్వర్గము రాజ్యలాభమునన్ = రాజ్యమునందుఁగల యాశచేతనో- ఏ కారణముచేనయినను, నిష్కృతి = ప్రాయశ్చిత్తము, దుష్కృతము = పాపము

తాత్పర్యము

ఇఁక లక్ష్మణుఁడో కోపముచేఁ గలిగిన త్రొట్రుపాటుచే రోఁజుచు నిట్లని యెను. ఓయీ సుమంత్రా! మీరాజేమిదోషము పెట్టి రాజు పెద్దకొడుకును శ్రీరామచంద్రుని నడవులలోఁ ద్రోచెనో చెప్పుము. సవతికొడుకులమైన కారణమున మాకు వ్యసనము కలిగింపఁగోరిన కైకయొక్క నీచమైన యాజ్ఞను గొప్పగా ననివార్యమైన దానిఁగా శిరసావహించి చేయరాని చెడ్డకార్యమును జేయఁదగినకార్యమని మీరాజు చేసెను. ఇచ్చినవరము నెఱవేర్చుట దోషమాయందువేని తొలుత వరము లిచ్చిన సమయంబున శ్రీరాముఁడు కానలకుఁ బోవలయునని భరతుఁడు రాజు గావలయునని కోరలేదు. అప్పుడు కోరినవరములను నీవిప్పుడు కోరువరములేవి యని యడిగి తెలిసికొనక యెట్లిచ్చెదననెను. ఒకవేళఁ గోరెనుబో శాస్త్రవిరుద్ధములయి పరులకు బాధాకరములై లోకగర్హితములైన వరముల నెట్లిచ్చెను. ఒంటి కొడుకును, పెద్దకొడుకును విడువరాదని శాస్త్రముచెప్పుచున్నదికదా. శాస్త్రవిరుద్ధవరము లీయవచ్చునా? అటుగాక పరులరాజ్య మపహరించుకోరికచే నందువా అట్లైనను దుష్టమే. శాస్త్రప్రకారము పెద్దవానికి రావలసిన రాజ్యము పిన్నవానికెట్టులీయుమనెదవు. ఇయ్యనని చెప్పియుండవచ్చునుగదా. మీరాజునకు శాస్త్రమర్యాద నుల్లంఘించి యేకారణముచేఁ జేసినను నీపాపమునకుఁ బ్రాయశ్చిత్తము లేదు.

"సత్యంవద" సత్యమును జెప్పుమను సామాన్యధర్మమును బురస్కరించుకొని విశేషధర్మమగు శ్రీరామాశ్రయమును వదలినవానికిఁ బ్రాయశ్చిత్త మెందుండి వచ్చునని వాస్తవార్థము.

కం. దైవప్రేరణమున నిటు, గావించె నటంచు ననెదె•కలుగఁగ వలదా
దైవమునకుఁ గారణ మొకఁ, డావిధ మేదైన నున్న•నాడుము వినెదన్.

తాత్పర్యము ౧౫౧౧

అయ్యా! దీనియం దాయనదోషములేదు. దైవము ప్రేరేపింపఁగా నిట్లు చేసెదనందువా? దైవమైనను గారణముపెట్టి చేయునుగాని నిష్కారణముగఁ జేయదుగదా. అట్టికారణమున్నఁ జెప్పుము వినెదను.

కం. ఆలోచింపక మతి లే, కీలోకవిరుద్ధకార్య•మిటు చేసెను భూ
పాలుం డనియెడె దానికె, జాలిం గొనియెదము దాన•జనపతి యేడ్చున్.

తాత్పర్యము ౧౫౧౨

ఆయన సమ్మతించియే చేసినకార్యమైనయెడల నిపుడిటు లేడ్చునాయనె దవా ఆలోచనము కొంచెమైననులేక యిటువంటి లోకవిరుద్ధకార్యము చేసెను గదా యనియే మేమును నేడ్చుచున్నాము. ఆకారణముచేతనే రాజేడ్చుచు న్నాఁడు. చేయఁదగిన కార్యము చేసితినని తోఁచిన నేలయేడ్చును.

కం. రాముఁడె భ్రాతయు భర్తయు,
రాముఁడె ప్రియబంధువరుఁడు•రాముఁడెచుమ్మీ
రాముఁడె నాజనకుండును,భూమిపునెడ లేదు జనక•బుద్ధి సుమంత్రా. ౧౫౧౩

అయ్యా! తండ్రివిషయమున నీవిట్లు కఠినముగ మాటలాడవచ్చునా యందువా? సుమంత్రా! రాజునందు నాకు జనకుఁడను భావము పోయినది. ఇంతఘోరకార్యము చేసినవాఁడు తండ్రియెట్లగును?కావున నాకు నన్నయైనను శ్రీరాముఁడే, భర్తయైనను శ్రీరాముఁడే-ప్రియబంధువైనను శ్రీరామచంద్రుఁడే దండ్రియైనను శ్రీరామచంద్రమూర్తియే- శ్రీరాముఁడుగాక నాకు వేఱుగ సోద రుఁడులేఁడు-భర్తయులేఁడు-ఇష్టబంధువులేఁడు-తండ్రియులేఁడు-ఎవ్వరులేరు. ప్రాకృతుఁడైననుదండ్రిని విడువవచ్చునా యనిన.

'గురోరవలిప్తస్య కార్యాకార్య మజానతా, ఉత్పథం ప్రతిపన్నస్య పరిత్యాగో విధీయతే." పద్యము ౫౮౩ అయోధ్య చూడుము. ఉచితముకొలఁది యట్టితండ్రిని విడువచ్చును దండింపవచ్చును. భీష్ముఁడిట్లు చేసినవాఁడేకదా.

ఇట్లుచెప్పుటచేఁ బరమైకాంతి ప్రాకృతులైన సమస్త బాంధవులను వారు విరోధించిరేని వదలి భగవత్కైంకర్యము చేయవలయునని యేర్పడుచున్నది. తనవలె భగవత్కార్య పరులైనవారిని విడువరాదు. ఇచట గోపికలవాక్యములు స్మరింపఁదగినవి. "పతిసుతాన్వయభ్రాతృబాంధవా! నతివిలంఘ్యతేం త్యచ్యు తాగతా" భర్తను సుతులను తోడఁబుట్టినవారిని జుట్టములను నందఱినివదలి నిన్ను వదలలేక నీవు మమ్ము వదలవని (అచ్యుత) వచ్చితిమనికదా యని వారు చెప్పిరి. భగవత్కార్యమున కనుకూలుర విడువరాదుగాని దానికడ్డమువచ్చు తక్కినవారి నెవ్వరినైనఁ విడువవచ్చును.

పితరం మాతరందారాన్ పుత్రాన్బంధూన్ సఖీన్ గురూన్। రత్నాని ధన ధాన్యాని క్షేత్రాణిచ గృహాణిచ। సర్వధర్మాంశ్చసంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్। లోకవిక్రాంత చరణౌ శరణంతే వ్రజంవిభో। ఆత్మారాజ్యం ధనంచైవ కళత్రం వాహనానిచ। ఏతద్భగవతే సర్వ మితితత్ప్రేక్షితం సదా॥ యనికదా భగవచ్ఛరణార్థుల లక్షణము. వారికి విడువరానిదిలేదు.

ఆ. సర్వలోకహితుని • సర్వలోకప్రియు, ననఘు ధర్మరతు జ • నాభిరాము
రాము విడిచి యెట్లు • రంజింపఁ జేసెదు, ధరణి నెల్ల ననుము • దశరథునకు.

తాత్పర్యము ॥౧౪॥

నామాటగా రాజును నీవిట్లడుగుము. సర్వలోకములకు సమస్తభూతములకు మేలుకోరువాఁడును, సర్వజనులకు నిష్టుఁడైనవాఁడును నేదోషమంటనివాఁడును, ధర్మమందే యాసక్తిగలవాఁడును, జనులను సంతోషింపఁజేయువాఁడును నగు శ్రీరాముని విడిచి నీవు రాజనుపేరు సార్థకము చేసికొనఁదలఁచితివేని యెల్ల ప్రజల నెట్లు రంజింపఁజేయఁగలవో చెప్పుమనుము. తండ్రి కనుటకు మనస్సొప్పక దశరథుఁడని చెప్పెను.

నీ కార్యమునకు నీకైక నీభరతుఁడు సంతోషింపవలయునుగాని మఱి యెవ్వరు సంతోషింపరు. సర్వలోకములకు స్వాభావికజనకుఁడు బంధువునగు, శ్రీరాముని వదలి నిన్ను నేనాశ్రయింతునాయని భావము.

కం. ఇంతటిలోకవిరుద్ధపు, వింతలఁ బచరింపు నీవు • విశ్వంభరకున్
గాంతుఁడ వెట్లగు దనును సు,మంతా నామాటగాఁగ • మహిపున కనుమా.

॥౧౫॥

విశ్వంభరకున్=భూమికి, కాంతుఁడవు=మనోహరుఁడైన విభుఁడవు,సుమంతా=సుమంత్రశబ్దభవము సుమంత్రుఁడు, సుమంత్రాయనినను ప్రాసభంగము లేదు.

తాత్పర్యము

నీవు ప్రజలను రంజింపఁజేసినను జేయలేకున్నను నీవు ప్రభువుగాఁ గూడ నుండఁదగవు. ఏలన? ఏకాలమందైనను నెట్టి యధర్మిష్ఠుఁడును జేయని యంతటి లోకవిరుద్ధమైనకార్యమునుజేయు నీవు భూమికి నెట్లు ప్రభువుగా నుండ నర్హుఁడవు.కావున రాజ్యము వదలిపొమ్మనినేను జెప్పితినని రాజునకుఁ జెప్పుము. ఇట్లడుగునను భయముచేఁ గాఁబోలు సీతారామలక్ష్మణులు సెలవుతీసికొనుటకై పోయినపుడు దశరథుఁడు లక్ష్మణుని బలుకరించిన వాఁడుకాఁడు.

తే. అనియె,జానకియో యూర్పు • లొనర సోఁకు,
సోఁకినట్టులు దిగ్భ్రమఁ • జూచుచుండెఁ
గాని దుఃఖంబెఱుంగని • కమలనయన,యేడ్చుచుండె మహారాజ • యేమి యనక

సోఁకు=దయ్యము, సోఁకినట్టులు=ప్రవేశించినట్లు.

తాత్పర్యము

శ్రీరాముఁడట్లు ప్రియము పలికెను. లక్ష్మణుఁ డిట్లు నిష్ఠురములాడెను. ఇఁక సీత యేమనెనయ్యా యందువా యామె దయ్యము పట్టినదానివలె దిక్కుతోఁపక యూరక చూచుచుండెనుగాని యెన్నఁడు దుఃఖమెఱుఁగని యామె యేమియుఁ జెప్పక యేడ్చుచుండెను.

కం. కనునీరు దొరఁగుచుండెడు, పెనిమిటిముఖపంకజంబు◆వీక్షించుచు వా
డినమోముఁదమ్మితో నను,గనుచు మహిజ బాష్పవారి◆గార్చుచు నుండెన్

తాత్పర్యము. ౧౫౧౪

కన్నీళ్లు గార్చుచున్న తనభర్త ముఖకమలమును జూచుచు వాడినముఖముతో నన్నుఁ జూచి సీతాదేవి కన్నీరు గార్చెను.

కం. సౌమిత్రి బాహుపాలితుఁ,డై మోమశ్రులను దడియ◆నంజలితోడన్
రాముండు నిలిచి యుండెను,
భూమిజ నను రథము ఁగనుచుఁ◆బొక్కుచు నిలిచెన్ ౧౫౧౮

బాహుపాలితుఁడై=బాహువులచే రక్షింపఁబడినవాఁడై, అనుటచే లక్ష్మణుఁడాయుధము ధరించియుండెనని భావము. మోము=ముఖము, అశ్రులన్=కన్నీటితో, పొక్కుచున్=దుఃఖించుచు.

తాత్పర్యము

లక్ష్మణుఁడు శరచాపహస్తుఁడై యన్నను గాచుచు నిలచియుండెను. శ్రీరాముఁ డేడ్చుచుఁ జేతులుమోడ్చి నిలఁబడియుండెను. సీతాదేవి నన్ను రథముఁ గనుచు దుఃఖించుచుండెను.

ఎవరెట్లుపోయినను నేమైనను దనకుఁ గావలసినది రామసేవ.కావున నాయనను రక్షించుచు నాయనపై మనస్సు దృష్టియుంచి లక్ష్మణుఁడునిలిచియుండెను.

తనమీఁద నింత ప్రేమగలవారి కింతకష్టము తన నిమిత్తము వచ్చెఁగదా యని శ్రీరామచంద్రమూర్తి యేడ్చుచుండెను. నీవు రథమును దోలుకొనిపోయిన శ్రీరాముఁ డెట్లు పాదచారియై యడవులందు నడువఁగలఁడని సీత నన్ను రథమును జూచుచుండెనని భావము.

౫౯-వ సర్గము.

చం. అనుడు నృపేంద్రుఁ డిట్లనియె◆నావలి శేషకథాంశ మింక వా
కొనుము సుమంత్రః యన్న రఘు◆కుంజరు లంత జడల్ ధరించి గ్ర
క్కనఁ గుశచీరధారు లయి◆గంగను దాఁటి ప్రయాగవంకగాఁ
జనిరి, సుమిత్రపట్టి రఘు◆చంద్రముఁ గాచుచు మున్నుగాఁ జనెన్. ౧౫౧౯

శేషకథాంశము=మిగిలిన కథాభాగము, వాకొనుము=చెప్పుము, ప్రయాగవంకగా=ప్రయాగప్రక్క.

అనిన రాజు తరువాతి కథాశేషము చెప్పుమనిన సుమంత్రుఁడిట్లనియె. రామలక్ష్మణు లిరువురు జడలు ధరించి కుశపవిత్రములను నారచీరలను గట్టిన వారై (యిక్కడఁ గట్టుకొనిపోయినవి పరిత్యజింపలేదనుటకై మరలఁ జెప్పఁబడెను.) గంగనుదాఁటి ప్రయాగకుఁ బోవుత్రోవను బోయిరి. లక్ష్మణుఁడు శ్రీరాముని రక్షించుచు ముందుగాఁ బోయెను.

కం. ఆతని వెంబడిఁ జనె భూ,జాతయుఁ దన వెన్క రామ•చంద్రుఁడు రాఁగన్
　క్ష్మాతలధవ! యింతయుఁ గని,
　　　　　　చేతము దుఃఖార్ణవమున•జిడిముడివడఁగన్. ౧౫-౨౦

దుఃఖార్ణవమునన్ = దుఃఖసముద్రమందు, చిడిముడిపడఁగన్ = తొట్రుపడఁగా.

తాత్పర్యము

ఆ లక్ష్మణుఁ వెంబడి సీతాదేవిపోయెను. ఆమె వెనుక శ్రీరాముఁడు పోయెను. ఇదంతయుఁ జూడఁగా నామనస్సు దుఃఖసముద్రమునఁ దొట్రుపాటు పొందెను. ఈ రెండు పద్యముల మూలశ్లోకములు ప్రక్షిప్తములని వ్రాయఁబడినవి.

కం. మావుల మరలింపఁగ సీ,తావిభు వేర్పాటు చూచి•తత ముష్ణాశ్రుల్ [౧౫-౨౧]
　నావుగఁ గాఱఁగ మరలవ, భూవల్లభ! యవియు శోక•పూర్ణములగుచున్.

మావులన్=గుఱ్ఱములను, వేర్పాటు-వేఱుపాటు=విడిచిపోవుట, ఉష్ణాశ్రుల్=వేఁడికన్నీళ్లు, లావుగన్=విశేషముగ బలముగ.

తాత్పర్యము

గుఱ్ఱములను దేరికిఁగట్టి మరల వెనుకప్రక్కకుఁ ద్రిప్పఁగా శ్రీరాముఁడు తమ్ము వదలిపోవుటఁజూచి శోకపూర్ణములై విస్తారముగ వేఁడి కన్నీరు కార్చుచునవి యెంత త్రిప్పినను వెనుకకు మరలవు.

త్ఫ్రీయము- బ్రహ్మరుద్రేంద్రాదులకును దుర్లభమైన శ్రీరామసేవ మా భాగ్యవశమున లభించెను. అట్టిది నిర్దయుఁడైన దైవముచే విఘ్నము కాఁబడెను. ఇఁక మేమేమి చేయవచ్చును.మాజీవనమే వ్యర్థము. అని గుఱ్ఱములత్యంత దుఃఖముచేఁ గన్నీరు కార్చెను. అతి కఠినహృదయుఁడైన నేను మరల్చినను గుఱ్ఱములు మరలినవికావు. ఎంతో కష్టముమీఁద మరల్చితినని భావము. శ్రీరాముల వియోగమునైఁపని పశువులకంటె ఆవియోగమందు వానిని బలవంత పెట్టిన నా జన్మము నికృష్టమని తోఁచెను. భగవత్సేవచేయువారి కడ్డముపోవువారు నీచజన్ములని భావము.

తే. ఇరువురకు రాజపుత్రుల•కేను మ్రొక్కి
　వగపు సహియించి గుహునితో•వచ్చి యుంటి
　బహుదినంబులు నే నంద•వార్త నంపఁ
　డా రఘూద్వహుఁ డనియెడి•యాశఁ జేసి.　　　౧౫-౨౨

వగపుసహించి=దుఃఖము నోర్చుకొని, భగవద్వియోగము కలిగినను భాగవత సాంగత్యమున్నయెడల శోకింపఁ గారణములేదు. కావున శ్రీరామ వియోగ దుఃఖమును దదీయుఁడైన గుహుని సాంగత్యమున సహించితినని భావము. బహుదినంబులు = అనేకదినంబులు, వార్త=కష్టము తోఁచినపుడు నన్ను రమ్మనియో తాను వచ్చెద నిలువుమనియో నిషాదులచేఁ జెప్పి పంపకపోవునాయను నాశచేత;

ఇచ్చట బహు దినములనఁగా మూఁడు దినములనియే గ్రహింపవలయును. గుహునితో వటమూలమున నుండుట మొదటి దినము. శ్రీరామచంద్రమూర్తి గంగనుదాఁటుట రెండవ దినము. భరద్వాజాశ్రమమునందుండుట మూఁడవ దినము. అచ్చట భరద్వాజుఁడు శ్రీరామచంద్రునిఁ జిత్రకూటమున వసింపుమని చెప్పుటయు మూఁడవదినముననే.నాఁడే సుమంత్రుఁడుబయలుదేఱి యయోధ్యకస్తమయకాలమునకుఁ జేరెను. ఇట్లు మూఁడు దినములని తీర్థీయులు.

దీనిపై నొక పూర్వపక్షము తోఁచుచున్నది.

గుహుఁడు సుమంత్రుఁడు గంగాతీరమునందున్న దినము సీతారామలక్ష్మణులు నుండిరి. అదియైన నొక రాత్రియే, కావున నదియు లెక్కకుఁ దీసికొనరాదు. కావున సీతారామలక్ష్మణులు గంగదాఁటిన దిన మొకటి. భరద్వాజాశ్రమమున నుండినది రెండవ దినము. ఆ దినమే మీకుఁ జిత్రకూటము తగిన స్థలమని భరద్వాజుఁడు చెప్పెను. ఆ వార్తవిని చారులారాత్రి ప్రయాణముచేసి గుహ సుమంత్రులకుఁ దెలుపఁగా వెంటనే సుమంత్రుఁడు బయలుదేఱి యామూఁడవనాఁటి సాయంకాలమున నయోధ్యఁజేరెను. ౫౯౮౩-వ పద్యము నందలి మూఁడవనాఁటి సంజయను లెక్క యిదియే.

౫౯౮౯-వ ఆగిరి గమనము అనునదియుఁ జిత్రకూటమున నున్నట్లు సుమంత్రుఁడు చెప్పకుండుటయు విని శ్రీరామచంద్రమూర్తి చిత్రకూటము చేరువఱకు గుహునితో నుండెనని స్థాపింపఁజాలదు. చూడు ౫౯౮౫-వ అందుఁ జిత్రకూట ప్రస్తావనలేదు.

గోవిందరాజీయమున రెండభిప్రాయము లీయఁబడినవి. శ్రీరాముఁడు గంగనుదాఁటి వృక్షమూలమున నొకనాఁడు, రెండవ దినము భరద్వాజాశ్రమమున, మూఁడవ దినము యమునానదీ తీరమునముండి, నాలవ దినము చిత్రకూటముఁ జేరెను.అయిదవ దినమున గుహుని దూతలు మరలివచ్చి యాసంగతి చెప్పిరి. ఆఱవ దినము సుమంత్రుఁడు బయలుదేఱి సాయంకాలమునకు నయోధ్యఁ జేరెను.

ఈ యభిప్రాయము సమంజసముగాఁ దోఁపదు ౫౯౮౩-వ పద్యమున మూఁడు నాళ్లనియే యున్నది. చిత్రకూటమునకుఁ బోవ నిశ్చయించుకొన్న వార్త సుమంత్రునకుఁ దెలిసియుండునుగాని చిత్రకూటపర్వతము చేరినవార్త తెలియదు. తెలిసియుండిన రాజుతో నయోధ్యలోఁ జెప్పియే యుండును.

అదియునుగాక సుమంత్రుఁడు వచ్చి యయోధ్యచేరిన నాఁటిరాత్రి శ్రీరాముఁడయోధ్యవిడిచిన యైదవనాఁటి రాత్రియేయని ౧౫౮౮-వ పద్యమందలి కౌసల్యా వాక్యమువలనఁ దెలియనయ్యెడిని. ఇఁక రెండవ యభిప్రాయము శ్రీరామచంద్రుఁడు రెండవ దినమున భరద్వాజాశ్రమమునకుఁబోయి చిత్రకూట నివాస విషయము మాటలాడునపుడు దూతలు విని మూఁడవదినమున వచ్చి గుహునితోఁ జెప్పుట. నాలవదినమున సుమంత్రుఁడు బయలుదేఱుట యని.

నాలుగవదినము సుమంత్రుఁడు బయలుదేఱెననుట మూఁడవదినమే. సుమంత్రుఁడు సాయంకాలమున నయోధ్య చేరెననుటతో విరోధించును.కౌసల్య చెప్పిన ఏను నిశలతోను విరోధించును. ఈ రెండవ పక్షమున గుహునితో సుమంత్రుఁడు మూఁడు దినములు పూర్తిగా నున్నట్లును దీర్ఘియవ్యాఖ్యాన ప్రకారము మూఁడవ దినమునఁ గొంచెముకాలమే యుండెననియు నేర్పడును.

రెండవనాఁటి సాయంకాలమే శ్రీరాముని చిత్రకూట గమనము నిశ్చయింపఁబడెను. ఇది శుక్లపక్షము, సీతతోడ రామలక్ష్మణు లొకటిన్నరదినము మెల్లగ నడచినదూరము చక్కనిదోవతెలిసి నడక వాడుకపడిన బోయవాండ్రకు మూఁడు జాములకంటె నెక్కువ పట్టియుండదు.రెండవ దినము వెన్నెలరాత్రిలో బయలుదేఱినను చారులు మూఁడవదినము నుదయమున 7-8 గంటలకైన శృంగిబేరము చేరియుందురు. 9 గంటలకు సుమంత్రుఁడు బయలుదేఱినను సాయంకాలమునకు నయోధ్య చేరియుండును. ఇది యైదవరాత్రియు నగును. కావున సీతా రామలక్ష్మణులు యమునాతీరముననున్నరాత్రి సుమంత్రుఁ డయోధ్యఁజేరెను.

ఇటు శ్రీరాముని నటు దశరథుని విడిచియున్న యొక్కొక్క గడియ సుమంత్రునిపాలికి నొక్కొక్కదినముగ నుండెననియు నాకారణమున బహు దినములని చెప్పెననియు నెంచఁదగు.సంస్కృతమున మూఁడు బహుత్వమును సూచించును

—• సుమంత్రుఁడు తాను వచ్చుమార్గమునఁ జూచిన విశేషంబులఁ జెప్పుట.•—

చం. మలమల మాఁడి యుండె సుమ•మంజులకుట్మలకోరకావళుల్
సలసలఁ గ్రాఁగు చుండెను గొ•లంకులు నేఁటులఁ బల్వలంబులున్,
గలగల లాడు చుండెను న•గంబుల నాకులు నెండి వ్రత్తలై,
విలవిల వోవు చుండెఁ బృథి•వీధవ! చిత్తము ద్రోవ వచ్చుచోన్. ౧౫.౨౩

సుమ=పూలయొక్కయు, మంజుల=మనోహరములైన, కుట్మల=సగము వికసించిన మొగ్గలయు, కోరక=ఏమియు వికసింపని కాయ మొగ్గలయు, ఆవళుల్=సమూహములు, పల్వలంబులు = అల్పసరస్సులు, నగంబులన్ = చెట్లయందు, వ్రత్తలై = వడుగులై, 'ఖిన్నతవాడివ్రత్తలయి' యని మనుచరిత్ర. ద్రావిడమందు నీపదమున కిదియే యర్థము.

తాత్పర్యము.

రాజా నేను మరలివచ్చునపుడు త్రోవల నున్నచెట్లయందలి పూలు,సగము విచ్చిన మొగ్గలు కాయమొగ్గలు మలమల మాఁడియుండెను. కొలంకులు, నదులు, చిన్నసరస్సులు వీనియందలి నీరు సలసల క్రాఁగుచుండెను. చెట్ల యందలి యాకులు వాడి వరుగులై గలగల లాడుచుండెను. ఇవన్నియుఁ జూచిన నా మనస్సు విలవిలపోవుచుండెను. ఈప్రకార మంతస్సంజ్ఞములైన వృక్షాదులు కూడ రామవియోగమున శోకాగ్నిని మరగి పోవుచుండెను.

కం. మెదలవు కాకోదరములు కదలవు వన్యేభములును◆ఘాతుకమృగముల్
రొదయైన వినఁగ రా దట,సదమలగుణశీలః రామ◆చంద్రభృశార్తిన్.౧౩-౨౪

కాకోదరములు=పాములు, మెదలవు=బయట సంచరింపవు, వన్యేభములు =అడవి యేనుఁగులు, ఘాతుకమృగముల రొదలు = హింసించు స్వభావముగల క్రూరమృగముల ధ్వనులు, భృశార్తిన్=అధిక వేదనచే

తాత్పర్యము.

రామచంద్రునకుఁగలిగిన యధికమైన వేదన కారణముగ పాము లాహార నిమిత్తమైనను బయట సంచరింపవు. అడవి యేనుఁగు లున్నతావుల నట్లే పడి యుండెను. గాని కదలినవికావు, క్రూరమృగములు ధ్వనించినవికావు.

శ్రీరాముని విరహమువలన సమస్త భూతములు పడెడి కష్టమును వర్ణించు నెపమున శ్రీరాముఁడు సర్వాంతర్యామి యను విషయము కవి విశదపఱుచు చున్నాఁడు. కాదేని కైకేయి మాటవిని నేనుచేసిన యకార్యమువలన నెందఱ కెంతదుఃఖము కలిగెనని దశరథునకుఁ దోఁచుటకైనఁ జెప్పుచున్నాఁడు.

సీ. లీనపుష్కరపత్ర◆లీనమీనవిహంగ,తప్తపద్మమృణాళ◆తతులఁ గంటిఁ
బూర్వంబునట్టులు◆పొరి జలజప్రసూ,నములేని స్థలజసు◆మములు గాని
కమ్మవాసన లించు◆కయు నీవు తోఁటలు, శూన్యంబులై నవి◆మాన్యచరిత
యెక్కడివిహగంబు◆లక్కడనే సోలి,పడి యుంట నవి మును◆బాడు దోఁచె
ఆ. నేమి చెప్పవాఁడ◆నేయూర నౌకని చేస్, దేటమొగము లేదు◆మాటిమాటి
కూర్పు పుచ్చువార◆లుర్వీజధవులేమి, నిలుపుగుండెతోడ◆నిలిచి చూచి.

౧౩-౨౩

లీన=అధికతాపముచే నీటిలో దాఁగిన,పుష్కరపత్ర=తామరాకులయొక్కయు, లీన=నీటిలోఁ డాఁగిన, మీన=చేఁపల, విహంగ=జలపక్షులయొక్కయు, తప్త= వేఁడిచేఁ గ్రాఁగిన, పద్మ = తామర పూవులయొక్కయు, మృణాళ = తామర తూఁడులయొక్కయు, తతులన్=సమూహములను, కంటిన్=చూచితిని, జలజ ప్రసూనములేని=నీటఁబుట్టిన పూలైనను, స్థలజసుమములేని=నేలమీఁదఁబుట్టిన

పుష్పములైనను, కమ్మవాసనలు=సువాసనలు, విహంగంబులు=పక్షులు, నిలువు గుండె=కొట్టుకొనుట నిలిచిపోవు గుండె.

తాత్పర్యము

శ్రీరాముని వియోగమువలనఁ గలిగినట్టియు నాయనకుఁ గలిగినట్టియు నధిక తాపముచే నీటిలో డాఁగిన తామరాకుల (తేలాడవలసినవి మునిఁగినవని భావము.)గుంపులను నీళ్ళలో డాఁగిన చేఁపలు జలపక్షులయు వేఁడిచేఁ గ్రాఁగిన తామరలు, వాని తూండ్లయు సమూహములఁ గంటిని. మునుపటివలె నీటితామరలుగాని మెట్టతామరలుగాని కొంచెమైనను బరిమళింపవు. తోఁటలయందు నెక్కడిపక్షు లక్కడనే పడి సంచారముగాని కలకల ధ్వనులుగాని లేకుండుటచే నవియును శూన్యములై కానవచ్చెను. ఇఁక నూరిలోన నొకరికైన మొఖము తేటగా లేదు. మాటిమాటికి నిట్టూర్పులు పుచ్చుచున్నారు. శ్రీరాముఁడు లేని కారణమున నేను వచ్చునపుడు నిలువుగుండెపడి కదలక మెదలక నోటమాటలేక బొమ్మలవలె నిలిచి లోకులు చూచుచుండిరి.

— సుమంత్రుఁడు పౌరుల దుఃఖమును దశరథునకుఁ జెప్పుట —

ఉ. రాముఁడు లేనిస్యందనము • రాఁగని పౌరులు దుస్సహవ్యథో
ద్దామత రాజమార్గమునఁ • దల్లడ మందిరి, కాంత లన్నసో
భూమిప! సౌధవీథులను • బొక్కుచు హా యని యేడ్చి, ఇంక నే
నేమి వచించువాఁడ ధర • నీశ్వర! దుస్సహలోకశోకమున్. ౧౪-౭౬

స్యందనము=రథము, రాన్=రాఁగా, దుస్సహవ్యథోద్దామతన్=సహింపరాని దుఃఖాతిశయముచే, దుస్సహలోకశోకమున్ = సహింపరాని జనుల దుఃఖమును.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి లేని తేరిని నేను దోలుకొనిరాఁగాఁ జూచి పురజనులు సహింపరాని దుఃఖాతిశయముచే రాజవీథియందుఁ దల్లడించిరి. ఇఁక నాఁడువారో మేడలమీదనుండి హాయని బిగ్గనేడ్చిరి. పురజనుల తీవ్రశోకమును గుఱించి యింతకెక్కువ నేనేమి చెప్పఁగలను.

కం. విపులాయతనేత్రంబులఁ, బ్రమదలు కన్నీటితోఁ బర•స్పరవీక్షా
క్రమ మేది యేడ్చు చుండిరి, శమియింప వశంబు గాని•సంతాపమునన్.

తాత్పర్యము. ౧౫-౭౭

స్త్రీలు కన్నులనుండి నీరుకాఱుచుండ కాటుక కరఁగిపోయి తెల్లనైన నిడివాలుఁ గన్నులతో నొకరినొకరు చూడక యెవరంతటవారు దుఃఖము నణఁచుకొనలేక యేడ్చుచుండిరి.

కం. వీరలు పగగలవారలు, వీర లుదాసీనజనులు • వీరలు హితు లం
చో రాజ! నెఱుఁగ నైతిని, వారక జను లెల్లవారు•వనరుచు నుంటన్. ౧౬-౭౮

ఉదాసీన జనులు=మధ్యస్థులు, వసరుచునుంటన్=దుఃఖించుటచే- శత్రువులు మిత్రులు నీకనికాని వారిలోవారికనికాని గ్రహింపవలెను.

తాత్పర్యము

జనులందఱు నేకవిధముగ దుఃఖించుటచే వీరు శత్రువులు వీరు మిత్రులు వీరు మధ్యస్థులు అని నేను దెలిసికొనలేక పోయితిని. శ్రీరామచంద్రుని విషయమున శత్రువులు లేరు, మధ్యస్థులు లేరు.

కం. సంతోషరహితలోకాయు, సంతప్తహయద్విపార్త•శబ్దార్దితయున్
 జింతానిశ్వాసయు భూ,కాంతా! కౌసల్య యనఁగఁ•గ్రాలెం బురియున్. ౧౨-౨౯

సంతోషరహితలోకయు=సంతోషములేని జనముగలదై, సంతప్త=మిక్కిలి శోకముచేఁ బరితపించు, హయ=గుఱ్ఱములయు, ద్విప = ఏనుఁగులయు, ఆర్త శబ్ద=ఏడుపు ధ్వనిచే, అర్దితయున్=పీడింపఁబడినది, చింతానిశ్వాసయు = వ్యసనమువలనఁ గలిగిన నిట్టూర్పుగలది.

తాత్పర్యము

సంతోషములేక శోకముచేఁ బరితపించు గుఱ్ఱములయు నేనుఁగులయు నేడుపుధ్వని, చింతచేఁగలిగిన నిట్టూర్పులుగలదై యిక్కడ నీకౌసల్యాదేవి యెట్టులున్నదో నయోధ్య యంతయు నట్లెయున్నది. శ్రీరామవియోగమునఁ గన్నతల్లి కౌసల్యయెట్లున్నదో పురమంతయు నట్లెయున్నది. ఈమెను జూచినఁ బురమంతయుఁ నీవుచూచినట్లే. ఈమె కన్నతల్లియని యెక్కువ దుఃఖముగాని వారన్యులని తక్కువదుఃఖముగాని కనఁబడలేదు. ఇంతవఱకుఁగల గ్రంథముచే శ్రీరాముఁడు సర్వాంతర్యామి యను విషయము కవి సూచించెను గాపునఁ బ్రబంధ గతవస్తువుచే వస్తుధ్వని- ఇట్లు శ్రీరాము దుఃఖమునకై ప్రజలు దుఃఖించుటకు గారణము ౬-౨౯-వ పద్యంబునఁ జెప్పఁబడెను.

కం. ఈరీతి సూతుఁ డాడిన, ఘోరపుఁ బలుకు లాలకించి • గాఢవ్యసనో
 దారత దారితమతి యై, కూర్మి గద్గదిక మంత్రి•కుంజరు ననియెన్. ౧౩-౩౦

ఆలకించి=విని, గాఢవ్యసనోదారతన్ = దృఢమైన దుఃఖాతిశయముచే, దారితమతియై=చీల్పఁబడిన మనస్సుగలవాఁడై, గద్గదికన్=డగ్గుత్తికచే, మంత్రికుంజరున్=మంత్రిశ్రేష్ఠుని. తాత్పర్యము

ఈవిధముగా సూతుఁడు చెప్పఁగా రాజువిని దృఢముగ నాటిన శోకముచే మనస్సు చీల్పబడినవాఁడై డగ్గుత్తికతో మంత్రిశ్రేష్ఠుఁడగు సుమంత్రునితో నిట్లనియె.

—• { సుమంత్రునితో దశరథుఁడు దన్ను శ్రీరాముఁ డుండుచోటికిఁ దీసికొని పొమ్మని చెప్పుట. } •—

సీ. పాపాభిజనభావ • బాలిశ కైకేయి,వినియుక్తమై నవి•వేకి నగుచు
 మంత్రకుశలు లైన•మంత్రులు వృద్ధులు,హితులు ధీయుతపౌరు•లింద దఱిం

మసల నొక్కరితోడ•మంతనంబుండక, స్త్రీమోహమునఁ జేసి • చేసినాఁడ
నేమియో మునిఁగి పో•యినయట్లు సాహసం,బిది భవితవ్య మై•యేఱువడియెఁ
ఆ. గులవినాశమునకుఁ•గూడె యదృచ్ఛమై, యిట్టి ఘోరదుఃఖ•మేను నీకుఁ
గొంచెమేని మేలు•గూర్చియయుండినఁ,
బొమ్ము తోడుకొంచుఁ•బుత్రుకడకు. ౧౩౧

తానడిగిన ప్రశ్నకుఁ బ్రత్యుత్తరమిచ్చుటయే గాక రాజ్యక్షోభాదుల నధికముగా సుమంత్రుఁడు వర్ణింపఁగావిని దశరథుఁడు నేనుజేసినది లోకసమ్మతముగాని దుష్కార్యమని తెలుపుటకై యితఁడీ రాజ్యక్షోభను గుఱించి చెప్పియున్నాఁడనితలఁచి తానుజేసినది దుష్కార్యమేయని యొప్పుకొనుచున్నాఁడు.

పాపాభిజనభావ=పాపరూపమై వంశపరంపరగా వచ్చిన యభిప్రాయము కలది. చావుము బ్రదుకు మేచందమైనను గమ్ము చెప్పకవిడనని మగని నిర్బంధించిన తల్లి గలది. (౯౯౧-వ ప.) బాలిశ=మూర్ఖురాలు- ౩౪౦-౩౪౧ పద్యములు చూడుఁడు.) ధర్మమొ లేకధర్మమొ ఋతంబొ యసత్యమొ యౌను గాక యొదుర్మతి యేల నేను విడుతున్ భవదాశ్రుతమిక దక్కినన్- రాముని రాజుగఁ జేసెదవా మహిత విషంబుఁ గ్రోలి వసుధేశ! యిదే నీముందట నీవుగనన్, నేమరణము నొందుదాన నిక్కము సుమ్మీ అని చెప్పెనుగదా. వినియుక్తిమైన్=విశేషప్రేరణముచేత, అవివేకిన్=యుక్తాయుక్త పరిజ్ఞానము లేనివాఁడను, ఇంద=ఈగృహమందే, మసలన్=తిరుగుచుండఁగా, మంతనంబుండక = ఆలోచింపక, స్త్రీమోహమునఁజేసి = ఆఁడుదానియందుఁగల మోహముచేత, భవితవ్యమై = అనుభవింపవలసినదై - ఇది యిట్లుకావలసినదై, కులవినాశమునకున్=వంశము నాశమైపోవుటకు, యదృచ్ఛమై=దైవసంకల్పితమై.

తాత్పర్యము

వంశపరంపరగా వచ్చిన పాపాభిప్రాయము గలదియు, మూర్ఖురాలునగు కైకేయి ప్రేరణముచే నిది చేయవచ్చును ఇది చేయరాదను నాలోచనములేక యాలోచనము చెప్పుటయందు నేర్పరులైన మంత్రులు- పెద్దవారు- మేలుకోరువారు- బుద్ధిమంతులైన పౌరులంద ఱీయింటియందే పట్టాభిషేకమునకై గుమిగూడియుండినను నొకరితోడనైన నాలోచింపక స్త్రీలయందు నాకుఁగల దుష్కామముచే మతిచెడి వెంటనే చేయకున్న నేమో మునిఁగిపోయినట్లు త్వరపడి యింత సాహసకార్యము చేసితిని. కులమీవిధముగ నాశము గావలసి యుండుటచే నింత భయంకర దుఃఖము దైవికమై తటాలున వెనుకముందు నాలోచింపనీక తటస్థించెను. అయినదేమో యయినది. నీకెన్నఁడైన నేనేదైన మేలుచేసియుంటినేని బదులు మేలుచేయ నీకు సమ్మతమేని నన్ను శ్రీరామునొద్దకుఁ దీసికొనిపొమ్ము.

మంత్రులతో నాలోచింపక చేసినకార్యమునకై దశరథుఁడు పశ్చాత్తాప పడుట ధర్మ్యమే. దశరథుఁడు చేసినది తప్పు.

"కం. వినుమధు రాహారంబులు, గొనుటయుఁ బెక్కండ్రు నిద్రగూడిన యెడమే, ల్కనియుండుట గార్యాలో, చనము దెరువు నడచుటయుఁ జన దొక్కనికిన్." అను నీతి నతిక్రమించెను. దశరథుఁడు పురల సభచేసి నిన్న సభలో శ్రీరాముని రాజు చేసెదనని చెప్పితిని. ఇప్పుడు కైకకు నిట్లు వరమిచ్చి తిని. ఈధర్మసంకట సమయమున నేమిచేయుమనెదరు అని మంత్రులతో నాలో చించియుండిన నింద యతనియందు లేకుండును. అట్లు చేయకుండుటకుఁ గార ణము స్త్రీమోహమని యతఁడె చెప్పెను. ఆ మోహఫల మనుభవించుచున్నాఁడు.

౨౯-౨-వ పద్యంబున నాలోచన యొంటరిగాఁజేయుట రాజదోషమని చెప్పఁబడెను.

కం. ఇప్పటికిని నాయానతి, తప్పక చెల్లెడిన యేని♦తనయునిఁ దెమ్మీ
తెప్పున రాముఁడు లేమిని, ముప్పొదవెడి బ్రతుక లేను♦మూర్తం బేనిన్.

తాత్పర్యము ౧౫౩-౨

అటు నీవు పోవుట సరిగాదు. నీవు పోఁబూనిన నాఁడు వారందఱు పయ నింతురు. ఊరివారందఱు బయలుదేఱుదురు, అందువేని నట్లైన నేను రాజ నని నాయాజ్ఞ మీఱరాదని నీకుండిసయెడల శ్రీరామునినే వెంటనే పిలుచుకొని రమ్ము. ఆప్రకారమో యీ ప్రకారమో యేదో యొకవిధముగ శ్రీరామునిఁ జూడ కుండిన నల్పకాలమైన నేను బ్రదుకను మరణింతును.

ఉ. దూరము పోపు నేమొ యల♦తోయజమిత్రకులోద్వహుండు నా
తేరిని బన్ని నన్నటకుఁ ♦ దెప్పునఁ దోడ్కొని పొమ్ము సారథీ!
యారమణీయమూర్తి విమ♦లాయతకీర్తి జగజ్జనాళిహృ
ద్వారిజవర్తిఁ గాంచఁగల♦వాఁడ ధరన్ మని యుండఁగల్గినన్. ౧౫౩౩

తోయజమిత్రకులోద్వహుండు=సూర్యవంశము నుద్ధరించువాఁడు, రమ ణీయమూర్తిన్ = మనోహరమైన యాకారముగలవానిని, విమలాయతకీర్తిన్ = నిర్మలమై విస్తారమైన కీర్తిగలవానిని, జగజ్జనాళి = లోకమునందలి జనసమూ హముయొక్క, హృత్=హృదయమనెడి, వారిజ-కమలమందు వర్తిన్=వర్తించు వానిని, మనియుండఁగల్గినన్ = బ్రదికియుంటినేని. ఇందలి విశేషణములు మూఁడును భగవంతునందు నన్వయించును.

తాత్పర్యము

శ్రీరాముఁడు మరలిరాఁడందువా అట్లైన మనమిట్లు ముచ్చటలాడుచుండి జాగుచేసిన శ్రీరామచంద్రుఁడు దూరముపోవును. కావున రథమును సిద్ధముచేసి తీసికొనిరమ్ము. ఆ యప్రాకృత దివ్యసుందర విగ్రహమును ఆ మహాయశో వంతుని, ఈశ్వరువలె సమస్తజనుల హృదయమున నుండువాని జీవితదశ యందే చూడఁగలుగును.

ఉ. ఆనగుముద్దునెమ్మొగము ♦ నామణికుండలమండితంబు లౌ
వీనులు నాప్రఫుల్లదర♦విందవిశాలవిలోచనంబు లా

జానుసుదీర్ఘ బాహువులఁ ♦ జారుతరం బగువృత్తదంతముల్
గానకయున్న సంయమనిఁ ♦ గానఁగఁ బోక ధ్రువంబు సారథీ. ౧౫౩౪

మణికుండల మండితంబులు=రత్నములచేఁ చేయఁబడిన చెవిపోగులచే నలంకరింపబడినవి, వీనులు=చెవులు, ప్రఫుల్లత్ = చక్కఁగా వికసించిన, అరవింద=కమలములవలె, విశాల=వెడల్పయిన, విలోచనంబులు=కన్నులు, ఆజానుదీర్ఘబాహువులు=మోఁకాటినంటు చేతులు, వృత్త=వర్తులమైన, సంయమినిన్=యమపట్టనంబును, ధ్రువంబు=సత్యము, భగవత్స్వరూప సాక్షాత్కారము లేని వాఁడు నరకమునకుఁబోవుట యరుదా? ఈ కాలమున నిది మానసికము.

తాత్పర్యము

చిఱునవ్వుచే నందమైన ముఖమును రత్నములు చెక్కిన పోగులను బాగుగ వికసించిన కమలములవలె విశాలములైన కన్నులను మోఁకాటినంటు నిడుపాటి చేతులు మనోహరములైన దంతములను జూడకయుంటినేని నేను మరణించుట సత్యము.

తే. ఇంతకంటెను దుఃఖ మిం♦కేది గలుగు? నిట్టిమరవస్థలోనున్న♦యట్టి నేను
గన్నులారఁగ రఘురాముఁ♦గానవైతి,
నేనియు సుమంత్ర! దిక్కేది♦యింకనాకు. ౧౫౩౫

తాత్పర్యము.

సుమంత్రా! శ్రీరాముని విడిచి యుండుటకంటె మిగుల దుఃఖకరమైనవి నాకేవిగలదు. ఇట్టి యాసన్న మరణావస్థలోనుండు నేను గన్నులార నా శ్రీరామచంద్రుఁ జూడకపోయితినా నాకేది దిక్కు ?

కం. హారామా రామానుజ, హారమణీమణి ధరాత్మ♦జా దుస్సహదు
ష్పారవ్యథ దిక్కఱిన, ట్టీరీతిని జచ్చుచున్న ♦ నెఱుఁగర మీరల్. ౧౫౩౬

రామానుజ=లక్ష్మణా? రమణీమణి = స్త్రీరత్నమా? ధరాత్మజా=సీతాదేవి, దుస్సహదుష్పారవ్యథన్=సహింపరాని దాఁటరాని శోకబాధచే, దిక్కఱినట్లు = దిక్కులేనివానివలె. రెండవ పాదమునఁ బ్లుత యతి. భీతి తర్కశోక గీత దూరాహ్వాన సంశయార్థములను జరగుఁ బ్లుతము.

తాత్పర్యము

హా రామా? హా లక్ష్మణా? హా సీతాదేవి సహింపరాని దాఁటరాని బాధచే దిక్కులేనివానివలెఁ జావనున్న నన్ను మీరలెఱుఁగరుకదా.

సీ. అని యేడు మున్గి దుః♦ఖాంబుధిఁ గౌసల్య,దిక్కు మొగం బయి♦దేవి రామ
శోకమహాభోగ ♦ మై కంజనేత్రావ ధూరత్నవిశ్లేష♦పారగంబు
నై శ్వసితోర్మిమ♦హావర్తమై బాష్ప, ఫేనజలావిలా♦భీల మగుచు
హస్తవిక్షేపమీ♦నౌఘమై క్రందితో, దీర్ణరవంబు ప్ర♦కీర్ణ కేశ

తే. శైవలంబును గేకయ♦స్మృతలేంద్ర,పుత్రికాబడబాముఖ♦మును మదశ్రు
వేగజము మంథరావాక్య♦నికటనక్ర,భీకరము పాపినీవర-మేల మగుచు.

ఇందు శ్రీరామవియోగ దుఃఖమును సముద్రముగాఁ గవి వర్ణించు చున్నాఁడు.

దుఃఖాంబుధిన్=దుఃఖసముద్రమునందు, రామశోకమహాభోగమై=శ్రీరాముని విడుచుటవలనఁ గలిగిన దుఃఖమనెడి వైశాల్యముగలదై, కంజనేత్రా = కమలమువంటి కన్నులుగల, వధూరత్న=సీతయొక్క, విశ్లేష=వియోగమనెడి, పారగంబు=గట్టునుగలదై, శ్వసితోర్మి మహావర్తమై=నిట్టూర్పులనెడి యలలలోని గొప్పసుడులుగలదై, బాష్పఫేన జలావిలాభీలయగుచున్- బాష్ప=కన్నీరనెడి, ఫేన=నురుగుతోడి, జల=జలముచేత, ఆవిల=కలఁతనొందిన,అభీలము=భయంకరమైనది, హస్తవిక్షేపమీనాఘమై = చేతులు విదిర్చుటయనెడి చేఁపల సమూహముగలదై, క్రందిత=ఏడుపనెడి,ఉదీర్ణరవంబు=గొప్ప ధ్వనిగలదై,ప్రకీర్ణకేశ శైవలంబును=విరిసిన వెండ్రుకలనెడి పాఁచితీఁగలుకలదై, కేకయక్ష్మాతలేంద్ర తనయా=కైకయనెడి, బడబాముఖమును=బడబానల ముఖముగలదై, మదశ్రు వేగజము=నాకన్నీటి వేగమువలనఁ గలిగినది, మంథరయొక్క వాక్యములనెడి, వికటనక్ర=భయంకరమైన మొసళ్ళచే, భీకరము=భయమును గలిగించునదియై, రాముఁ డరణ్యమునకుఁ బోవుటకు మంథరయే మూలకారణమని దశరథునకుఁ దర్వాత దెలిసినదని యిదిసూచించుచున్నది. తత్కాలమున నెఱుఁగఁడుకాని యావల దాసీజనులు చెప్పుటచేఁ దెలియవచ్చినది. పాపినీ = పాపాత్మురాలగు కైకయొక్క, వర=వరములనెడి, వేలము = చెలియలి కట్టగలదై.

తాత్పర్యము

ఈప్రకారము రాజు దుఃఖసముద్రములో మునిఁగి కౌసల్య దిక్కు ముఖము త్రిప్పి దేవీ: రామశోకమనెడి వైశాల్యమును గలిగి సీతావియోగమనెడి యొడ్డునారసి నిట్టూర్పు సుడులతోఁ గన్నీటి నురుగుతో భయంకరమై యేడ్చునపుడు చేతుల విదిలింపులనెడి చేఁపల సంచారము గలిగి యేడుపనెడి ధ్వనియు విరియఁబోసిన వెండ్రుకలనియెడి పాఁచియుఁ గైకయనెడి బడబాముఖము గలదై నాకన్నీరనెడి నదుల వేగముచేఁబుట్టి మంథరవాక్యములనెడి మొసళ్లు పాపాత్మురాలగు కైక వరములనెడి చెలియలి కట్టకలిగి.

కం. రామప్రవ్రజ్యాయుత, మౌమహితార్ణవమునందు • నబలా యిపుడా
రాముఁడు దోడ్పడకుండిన, నే మునుఁగుదు; దాఁట లేన•యీదుఃఖాబ్ధిన్.

రామప్రవజ్యాయుతము = రాముఁడు దేశము విడిచిపోవుట యనెడి నిడివిగలదైన, మహార్ణవమునందున్=గొప్ప సముద్రమునందు.

తాత్పర్యము

శ్రీరాముని దేశత్యాగమే నిడివిగాఁగల యీగొప్ప సముద్రమునందు నిప్పుడా శ్రీరాముఁడు సహాయుఁడై రాకయుండిన నేను మునిఁగిపోదును. ఈ దుఃఖసముద్రమును దాఁటలేను.

దుఃఖసముద్రమున మునుఁగువానికి శ్రీరామానుగ్రహమే తరణోపాయము.

చం. అనుజసమేతురాముఁ గన • నాశ జనించియుఁ గానలేన, యో
వనితరో! యింతకంటెఁ బెనుఁ•బాపము గల్గునె? యంచు మూర్ఛిలం
దనయునిమిత్తమై హృదయ•నాథునిఁ గూర్చియు నిబ్బడింపఁగా
మనమున దుఃఖ మామహిళ • మాననిభీతి వణంకి వెండియున్. ౧౫౩౯

అనుజసమేతున్=తమ్మునిలోఁ గూడినవానిని, ఇబ్బడింపఁగాన్=రెట్టింపు కాఁగా, ఇదివఱకు కొడుకున కేడ్చునది యిపుడు మగఁడేమగునో యనికూడ నేడువవలసి వచ్చినది.

తాత్పర్యము

లక్ష్మణుతోడి శ్రీరామునిఁజూడ నాశగలిగియుఁ జూడలేకయున్నాఁను. ఇంతకంటె ఘోరపాపముండునా? యని మూర్ఛపోయిపడఁగాఁ గొడుకు నిమిత్తమై మగనిఁగూర్చియు దుఃఖము రెండింతలుకాఁగా నా కౌసల్య వదలని భయముచే వణఁకి మఱియును.

౬౦-వ సర్గము.

ఉ. భూతము సోఁకిన ట్లుసురు • పోయినయట్లయి రామమాత యా
సూతునిఁ జూచి యిట్లనియె • సూతకులాగ్రణీ! నన్ను రాముఁడున్
సీతయు లక్ష్మణుం డెచటఁ • జేరిరొ యచ్చట వీడు పుణ్య మౌ;
ఖ్యాతచరిత్రుల న్విడిచి • కాయము నిల్వదు పో నిమేషమున్. ౧౫౪౦

భూతము=దయ్యము, ఉసురుపోయినట్లు=ప్రాణము పోయినవిధమున, ఖ్యాత చరిత్రులన్=ప్రసిద్ధికెక్కిన నడవడిగలవారిని, కాయము = దేహము.

తాత్పర్యము

దయ్యముపట్టినట్లు దేహము తెలియక ప్రాణముపోయినట్లు చేష్టలుడిగి కౌసల్య మఱి సుమంత్రునిఁజూచి సూతవంశరత్నమా? శ్రీరాముఁడు సీత లక్ష్మణు డెచ్చటఁ జేరినారో యచ్చట నన్ను వదలిపెట్టుము, నీకుఁ బుణ్యము కలుగును. ఏలన నాప్రఖ్యాతచరిత్రుల విడిచి నిమిషమైనను దేహము నిలువదు. కావున నన్నచట విడిచినఁ బ్రాణరక్షణము చేసిన పుణ్యముబ్బును.

చం. మరలుపుమయ్య తేరు గుణ • మండను లుండెడిదండకాటవిన్
సరగున నన్ను వీడు మిఁక • నాసుతులం గదియంగ లేనిచో
నరుగుట నిశ్చయంబు యము • నాలయసీమకు నంచు నేడ్చునన్
గరుణము దోఁప నారమణిఁ•గాంచి సుమంత్రుఁడు పల్కె మ్రొక్కుచున్.

మరలుపుము=వెనుకకుఁ ద్రిప్పుము, గుణమండనులు=కల్యాణగుణములే

యలంకారముగాఁ గలవారు, సరగునన్=త్వరగా, కదియంగన్=సమీపింపఁగా, యమునాలయసీమకున్ = యముని గృహప్రదేశమునకు.

తాత్పర్యము

అయ్యా, సుమంత్రా! తేరిగుఱ్ఱముల నింకను విప్పలేదుగదా? విప్పవలదు. తేరిని వెనుకకుఁ ద్రిప్పుము. కల్యాణగుణములే యలంకారముగాఁగల నాకొడుకు లుండెడి దండకారణ్యమందు నన్నుఁ ద్వరగా వదలుము. నాకొడుకులను నేను గలిసికొనలేకపోయితినా యమపురికిఁ బోవుట నిశ్చయము. అని యేడ్వఁగా శోకముతో నామెను జూచి నమస్కరించి సుమంత్రుఁ డిట్లనెను.

—• సుమంత్రుఁడు కౌసల్య నూరార్చుట. •—

కం. విడువుము శోకము మోహము, విడువుము దుఃఖభ్రమంబు•విడి పరితాపం
బడవులలో దేవి! నీకొడుకు చరించెడిని నీదు•కోడలితోడన్. ౧౫౪౨

తాత్పర్యము

తల్లీ! శ్రీరాముఁడు విడిచిపోయె ననుశోకము విడువుము. అడవులలో వారికేమి యాపద గలుగునోయను మోహము విడువుము. శ్రీరామునకు దుఃఖము గలిగినదను మతిభ్రమము వదలుము. ఏ తాపములేక నీకొడుకు నీకోడలితోడ నడవులలో సంచరించుచున్నాఁడు.

కం. సౌమిత్రియు ధర్మరతిన్, భామారత్నంబ! రాము•పదపంకజముల్
నేమములను విజితేంద్రియుఁడై మహితపరంబు నొంద•నర్చనసేయున్.

తాత్పర్యము ౧౫౪౩

లక్ష్మణుఁడో ధర్మమందలి ప్రీతిచే శ్రీరామచంద్రుని పాదకమలములను గొప్ప పరమపదంబు సంపాదింపఁగోరి యింద్రియములజయించి ప్రాకృత సుఖములను గోరక నియమముదప్పక సేవించుచున్నాఁడు.

ఉ. రామునిమీఁద మానసము • రాజముఖీమణి సీత నిల్పి తా
ధామమునందుఁబోలె జన • తారహితాటవి నైజభంగియ
ట్లామెత నొంది భీతియు ర•వంతయుఁ గానక ధీరయట్టులెం
తో ముద మారఁగాఁదిరుగు • చున్నది కాన దొకింతదైన్యమున్. ౧౫౪౪

రాజముఖీ=చంద్రునివంటిముఖముగల స్త్రీలయందు, మణీ = రత్నము వంటిది, ధామమునందుఁబోలెన్=స్వగృహమునందువలె, జనతారహితాటవిన్= జనసమూహములులేని యడవియందు, నైజభంగిన్=స్వాభావవిధమున, ఎప్పటి యట్లు-ఆమెత=తృప్తి, ధీర=ధైర్యముగలది, ఒకింత = కొంచెమైనను, దైన్యమున్ = వ్యసనమును.

తాత్పర్యము

స్త్రీరత్నమగు సీతాదేవి మనస్సంతయు శ్రీరామునిమీఁదనే నిల్పి తన యింటి యందెట్లులో యట్లులే యెప్పటివలెఁ గ్రొత్తస్థలమనియెంచకతృప్తిపడి భయము

కొంచెమైనను లేక ధీరురాలివలె నెంతో సంతోషముగా వ్యసనమనునది లవమైనను లేక తిరుగుచున్నది. తన మనస్సంతయుఁ దనభర్తయందే యున్న కారణమునఁ దానరణ్యములో నుండుట యామెకు స్ఫురింపనేలేదు.

భక్తుల చరిత్ర యింటియందున్నను నడవియందున్నను నేకవిధముగానే యుండును. ఇంట నడవియందున్నట్టును, నడవిని నింటియందున్నట్లుండును. అక్కడ నిక్కడఁ జేయవలసినకార్యము శ్రీరామునిమీఁద మనస్సు నిలుపుటయే. అందు నేమఱుపాటురాదు. తక్కిన వేషియున్నను వ్యసనము భయములేదు. అడవియు నయోధ్య యని సుమిత్ర చెప్పెనుగదా.

కం. ప్రమదావనాంతరములం, బ్రమదామణి మున్ను తిరుగు•భాతిని జనశూ
   న్యము లగు నడవులయందును,
                  రమియించుచు నున్న దమ్మ•రాగము మీఱన్. ౧౫౪౫

ప్రమదావనాంతరములన్ = స్త్రీలుసంచారముచేయు నుద్యానవనముల లోపల, మున్ను=ఇంతకుఁ బూర్వము, తిరుగుభాతిని=తిరుగునట్లే, జనశూన్యములు=మనుష్యులు లేనివి, రమించుచున్నది=క్రీడించుచున్నది.

తాత్పర్యము

స్త్రీలు దిరుగు నుద్యానములలోఁ బూర్వము భయములేక యెట్లు క్రీడించుచుండెనో యావిధముననే సీత జనులులేని యడవులందును బ్రీతితోఁ గ్రీడించుచున్నది.

కం. బాలికవలె బాలేందుక,ళాలాలితనిటల యౌని•లాసుత నిజహృ
   త్పాలాధీనాత్మక జన,జాలచ్యుత వనులలోను•సతి రమియించెన్. ౧౫౪౬

బాలికవలెన్=చిన్నపిల్లవలె, బాలేందుకలా లాలితనిటల=పాడ్యమి,విదియ నాఁటి చంద్రకళవంటి యందమైన నొసలుగలది, ఇలాసుత = భూపుత్రి, నిజహృత్పాలాధీనాత్మక=తన హృదయేశ్వరు నధీనమునను న్న మనస్సుగలదై, జనజాల సమూహముచే, చ్యుత=విడువఁబడిన, వనులన్=అడవులలో, రమించెన్= క్రీడించెను.

తాత్పర్యము

సీతాదేవి తన మనస్సును దనపతి స్వాధీనముందుంచి మనుష్యులులేని యడవులందుఁగూడఁ జిన్నబిడ్డవలె నాడుకొనుచున్నది.

ఇంద్రియముల మూలమున మనస్సు పోయి విషయముల సంస్పర్శ కలిగిననే యవి కానవచ్చుట వినవచ్చుట లోనైనవి. మనస్సైకాగ్రముగ భగవంతుని పైనుంచి నపు డేపదార్థము కానరాదు. ఏ ధ్వని వినరాదు. దేనినిని జూచుట వినుట లేనపుడు భయములోనైనవి యెక్కడినుండివచ్చును.

సీతాదేవిని బాలిక యను విషయమున, 'బాల్యేన తిష్ఠాసేత్' పిల్లవానివలె నుండవలెను అను శ్రుతి స్మరించునది. చిన్నపిల్లవలె సీతాదేవి యభిమానము భయమువదలి వర్తించెనని భావము.

కం. తదధీనం బయి ప్రాణము,మది తద్గత మగుచు నుంట•మహిజ కయోధ్యా
పద మడవి రాములేమి, న్మదిరాక్షికి వన మయోధ్య•నాథుం డుంటన్.

తదధీనము = రామాధీనము, మది = మనస్సు, తద్గతము = అయనను బొందియుండునది.

మచ్చిత్తాః మద్గతప్రాణాః బోధయంతః పరస్పరమ్ ।
కథయంతిచ మాంనిత్యం తుష్యంతి చ రమంతిచ ॥ భ. గీ.
"మయ్యేవమన అధత్స్వ,మయి బుద్ధిం నివేశయ నివసిష్యసి మయ్యేవ"
భ. గీ. ౧౨.

అను శ్లోక మీసందర్భమున ననుసంధించునది. మహిజకున్=సీతకు.

తా త్ప ర్య ము.

ప్రాణము శ్రీరాముని స్వాధీనముఁజేసి యనఁగా రక్షాభార మాయన యందు వైచి మనస్సాయనయందే నిలిపి యుండుటచే సీతకు శ్రీరాముఁడు లేని యయోధ్య యడవి శ్రీరాముఁడున్న యడవియే యయోధ్య. మనస్సు ప్రాణములేని దేహ మెందున్న నేమిసుఖింపఁగలము. భక్తులకు భక్తురాండ్రకు సీతాచరిత్ర మనుసరణీయము. సదా స్మరణీయము.

ఉ. రాముని లక్ష్మణున్ జనక • రాజతనూభవ త్రోవ నున్నయా
గ్రామములం బురంబులఁ దఁరంగిణులన్ ద్రుమపాళిఁ గాంచి పే
రేమియొ వీని? కెందుఁ జను • నియ్యవి? యేమది? యంచుఁ బ్రశ్నలన్
గోమలి సేయుచుం జనియెఁ•గూర దొకింతయు శోక మాత్మలోన్. ౧౨౪౮

జనకరాజతనూభవ=సీత, తరంగిణులు = ఏఱులు, ద్రుమపాళిన్ = చెట్ల గుంపులను, కూరదు=పొందదు. తా త్ప ర్య ము

సీతాదేవి త్రోవఁబోవునపుడు శ్రీరామలక్ష్మణులను ఆగ్రామము పేరేమి యీ యూరిపేరేమి యీనదిపేరేమి ఆచెట్లపేరేమి ఈ నదులెచ్చటికిఁ బోవును. అని ప్రశ్నలు వేయుచుఁ బోయెనుగాని శోకమనునది యామె పొందినదిగాదు.

ఇది రథముమీఁదఁ బోవునపుడు జరగిన సమాచారము. వారు నడచి పోగాఁ సుమంత్రుఁడు చూచిననాఁడు అందు పురాదులు లేవు.

తే.మనపురంబున కొకక్రోశ•మాత్రమున్న,
యాటతోఁటను క్రీడించు•నరుసమునను
నడవిఁ దిరుగుచు నున్నదా•యమలచిత్త,
యామెకై నీవె దుఃఖింప•నగు నటమ్మ. ౧౨౪౯

తా త్ప ర్య ము.

నిర్మల మనస్సుగల యాసీత మననగరమున కొకకోసు దూరమందున్న క్రీడావనమందు నాటలాడువిధమున నడవియందును దిరుగుచున్నది. ఆమెకై పామరు లేడువవలయునుగాని నీయట్టిది యేడువవచ్చునా?

సీ. ఇప్పుడు జ్ఞప్తి నా♦కిం తియ కైకేయిఁ,గూర్చి తటాలునఁ ♦ గోపులాంగి
యేమేమొ పల్కె న♦వెల్ల దోఁపన యిప్పు, డని ప్రమాదంబున♦జనకతనయ
పలికినపలుకులు♦పలుకఁ బూనియును ద,
త్ప్రస్తావమును ద్రిప్పి♦ప్రమదకరము
లైనవాక్యంబుల♦ననియె మధురముగ, దారి గాసిని గాని ♦ ఘోరవాత
తే. వేగమునఁ గాని యెండల♦వేఁడినేని,
సంభ్రమునసేనిఁ జంద్రాంశు♦సదృశకాంతి
వికృతినొందద యింతేని♦విడువు చింత,తల్లి నీపాదమాన త♦థ్యంబు సుమ్ము

తాత్పర్యము ౧౨౨౦

సీత గంగదాఁటి పోవునపుడు కైకేయి విషయమై చెప్పిన కొన్ని కఠినోక్తులిపుడు సుమంత్రునకు జ్ఞప్తికివచ్చి కౌసల్య కింపుగానుండునని చెప్పఁబూని మరలఁ గొంతయాలోచించి యీమాట లిపుడుచెప్పిన వీరికిఁ బ్రాణాంతకము లగునని కావునఁ జెప్పరాదని నిశ్చయించి జ్ఞాపకము లేదనుచున్నాఁడు.

ప్రమాదంబునన్=హెచ్చరికలేమిని, ప్రమదకరములు=సంతోషకరములు, ఘోరవాతవేగమునఁగాని=భయంకరములైన గాడ్పుల వేగముచేఁగాని, మధురముగన్=తియ్యనగా, సంభ్రమము = సంభ్రమ శబ్దభవము, చంద్రాంశుసదృశకాంతి=వెన్నెలతో సమానమైనకాంతి, వికృతి=వికారము, నీపాదమాన = నీపాదములుసాక్షిగా,తటాలునన్=కోపులాంగి యేమేమొ పల్కె ననుటచేత జ్ఞప్తిలేకుండుటకు హేతువుసూచించెను. కైకేయిఁగూర్చి యనుటచే సుమంత్రుఁడు తాను చెప్పఁదలఁచుకొన్న విషయము సూచించెను. జ్ఞాపకంబింతియు యనుటచే నింక జ్ఞాపకము చుకొమ్మని కౌసల్య ప్రేరింప నవకాశము సూచించెను. ఇప్పుడు తోఁపదనుటచే నీ దుఃఖమును జూచిన నామనస్సు వికలమైపోయినది జ్ఞప్తికిఁ దెచ్చుకొన సాధ్యపడదు.మీ రింత దుఃఖించుచుండ జ్ఞాపకమువచ్చినను జెప్పరాదు అని సుమంత్రుఁడు మాటను జాఱవిడిచెను. ఇట్లు మాటతప్పింప హేతువు కవియేచెప్పుచున్నాఁడు. ప్రమదకరములైన మాట లనుటచే సుమంత్రుఁడు చెప్పఁబూనిన సీతావాక్యములు దుఃఖకరములనిసూచితము. సుమంత్రుఁడు దాఁచిన సీతావచన మిట్టిదని నిష్కరించి చెప్పసాధ్యమా? ఇతమిత్థమని యెవరైనఁజెప్పిన నెట్లునమ్మవచ్చును. ఈప్రశ్నలకు సమాధానము కవి యీమాట నెచ్చటనైన వివరింపకుండినచో నిది యెవరికిని జెప్పసాధ్యముగాదుగాని కవి దీని నాయనశైలిపద్ధతి ననుసరించి ముందు చెప్పఁగలఁడు. యుద్ధకాండమున ౬౭౪-వ పద్యము

హా జగదాలమారికయికా నెఱవేఱెనుగా త్వదీప్సితం
బోజగజంత వంశకలశోదధి చంద్రుఁడు గ్రుంకె వంశస
ద్బీజము పాడుచేసితివి తెంపరివై యిఁకమీఁద హాయిగా
నే జడనింతలేక సుఖియింపుము గుండియ నిబ్బరంబుతోన్.

అని సీత తనయభిప్రాయము వెల్లడించెను.

శ్రీరాముని నడవులకుఁ బంపుటకుఁ గైకేయి యభిప్రాయ మిది యని సీత యిట్లు గ్రహించెను. తన కొడుకునకు రాజ్యము లభింపఁజేయుటమాత్రమే కైక యుద్దేశమేని శ్రీరాముని నడవులకుఁ బొమ్మనఁ గారణములేదు. కావున శ్రీరాముని నడవులకుఁబంపుటకుఁ బ్రబలమైన యుద్దేశము వేఱొకటి యుండవలెను.అదియేదన శ్రీరాముఁ డడవులకుఁబోయెనా సీతపోవుటయు నిశ్చయము. ఆయనను విడిచి యామె యుండదు. ఆమె యడవులకుఁబోయెనా రాక్షసులు హరించుటచేతనో భక్షించుటచేతనో మఱి యేవిధముగనో యామె కపాయము రాకతప్పదు. ఆమె కపాయము వచ్చెనా శ్రీరాముఁడు బ్రతుకఁడు. లోకులనం దఱ వశపఱుచుకొనిన శ్రీరాముఁడు చచ్చినఁగాని నా కొడుకునకు రాజ్యము స్థిర పడదు. శ్రీరాముని నిట్లుపాయముచేఁ జంపవలెఁగాని ప్రత్యక్షముగఁ జంపుమని కోరనురాదు. అది సాధ్యముకాదు. అని కైక యాలోచించెనని సీతాదేవి యభిప్రాయపడెను. ఇది యపోహముగాదు "శ్రీరాముఁడు కానలోనన విరామతఁ బొందు నిజంబు" అని మంథర చెప్పెఁగదా ? (అయో. ౨౫౬-వ పద్యము.) కైక యభిప్రాయమును శ్రీరామచంద్రమూర్తియు నిట్లే గ్రహించెను. "సుప్త ప్రమత్త కుపితానాం వచనైర్భావజ్ఞానం ద్రష్టవ్య"మ్మను లోక న్యాయానుసారముగా నారణ్యకాండమున "సీతాకారణముగనే। వీతాసుఁడనైన నీవు వేపురి కరుగన్। జేతము రంజిలఁ గామా। న్వీతయగుచు భరతుమాత విలసిల్లుఁగదా" అరణ్య. ౯౯౪-వ పద్య. అయోధ్య. ౧౨౧౪-౧౨౧౮-వ యందును నీ విషయము సూచితము. ఈ పద్యములందు సీత యేమియుఁ జెప్పలేక యేడ్చుచు భర్తముఖమునుజూచుచు మరల మరల సుమంత్రుని మోముఁజూచుచు గన్నీరు కార్చుచున్నట్లు చెప్పఁబడెను గదా? ఆమె యపుడు చేసినపనులచేఁ బూర్వము తానన్నమాట జ్ఞప్తికివచ్చినట్లును దానిని జెప్ప ననుజ్ఞగోరి భర్తముఖముఁ జూచుటవలన నామాట మరల సుమంత్రునితో నిపుడు చెప్పరాదనియు, సుమంత్రుని జూచుచుఁ గన్నీరు కార్చుటవలన నా మాట సత్తపరాములతోఁ జెప్పవలదనియు నామె సూచించెను.

తాత్పర్యము.

అమ్మా! సీతనుగుఱించి నాకు జ్ఞప్తియుందుండు నదింతియే. కైకేయి నుద్దేశించి సీత యేవో కొన్నిమాటలు చెప్పెనుగాని యవి యిప్పుడు జ్ఞప్తికిరాలేదు. అని ప్రమాదమున సీతాదేవి చెప్పినమాటలు చెప్పఁబూని యవి యిపుడు చెప్పరాదని తలఁచి యాప్రస్తావమును ద్రిప్పి సంతోషకరములైన వాక్యముల నిట్లు ప్రియ్యముగాఁ జెప్పఁబూనెను. దోవ ప్రయాణముచేసిన బడలికచేతఁగాని క్రూరమైన గాడ్పుల వేగముచేఁగాని యెండల వేఁడిమిచేఁగాని సీతాదేవియొక్క వెన్నెలతో సమానమైన దేహకాంతి కొంచెమైన మాఱినదికాదు. అమ్మా! ఇది నిజము. నీ పాదములపై నొట్టుపెట్టుకొని చెప్పుచున్నాను.

కం. అంభోజపత్త్రనిభము సు,ధాంభోనిధితనయతుల్య • మయి రాజిలు నా
కుంభినిసుతముఖముకురము, జృంభము రవ యేని వికృతిఁ • జెందదు తల్లీ.

అంభోజపత్త్రనిభము=కమలము రేకుతో సమానము, సుధాంభోనిధితనయ తుల్యము=చంద్రునితో సమానమైనది, కుంభినిసుత=సీతయొక్క, ముఖముకురము=ముఖమను నద్దముయొక్క, జృంభము=వికాసము. "జృంభస్తు జృంభణే త్రిషునాతు వికాసేస్యాత్" నానా. ర. రవయేని=కొంచెమైనను, వికృతి=మార్పు.

తాత్పర్యము

తామరరేకుతో సమానమై చంద్రునివలెఁ బ్రకాశించు నా సీతాదేవియొక్క యద్దమువంటి ముఖముయొక్క వికాసము కొంచెమైనను మాఱినదికాదు.

కం. లాక్షారసనిభపదములు, లాక్షారసహీనము లయి • లలితసుకాంతిన్
సాక్షాత్కమలముకుళములె, లక్షింపఁగ నిప్పుడును ని • లాసంభవకున్. ౧౨౨

లాక్షారసనిభపదములు=లక్కవలె నెఱ్ఱనైన పాదములు, లాక్షారసహీనము లయి=లక్కరసము పూసికొనకపోయినను, లలితసుకాంతిన్ = మనోహరమైన మంచికాంతిచే, సాక్షాత్కమల ముకుళములె = ప్రత్యక్షముగాఁ దామర మొగ్గలె, లక్షింపఁగాన్=చూడఁగా, ఇలాసంభవకున్=సీతకు.

తాత్పర్యము

పాదములు చిగుళ్ళవలె నెఱ్ఱగానుండుటకై యిప్పటివారు కాళ్ళకుఁ బారాయణమని సున్నము పసుపుకలిపి పూసికొనునట్లు పూర్వము లక్కకరఁగించి పలుచనఁగా నున్నప్పుడు దానిని బూసికొను వాడుకయుండెను. సీతాదేవి పాదములు స్వభావసిద్ధముగనే పగడములవలెఁ జిగుళ్ళవలె నెఱ్ఱగా నుండును. అయినను నింట నున్నప్పుడు లాక్షారసము పూసికొనుచుండెను. ఇప్పుడట్టి పూఁతలు లేకుండినను నామె పాదములు స్వభావకాంతిచేఁ దామరమొగ్గలవలె నెఱ్ఱగానే యున్నవి.

ఉ. సొమ్ములమీఁది ప్రేమమున • సుందరి జానకి నూపురమ్ములన్
సమ్మతి దాల్చియె హృదయ • నాథునితో సరిగాఁగ నేగువే
గమ్మునఁ బోవఁ బాదములు • ఘల్ ఘలు ఘల్లన హేలవోలె మో
దమ్మున నేగఁ గంటిఁ జుమి • తల్లి యిఁ కేటికి నీకుఁ జింతిలన్. ౧౨౩

నూపురమ్ములు = అందెలు, హృదయనాథునితోన్ = పెనిమిటితో, హేలవోలెన్=క్రీడవలె, మోదమ్మునన్=సంతోషముతో.

తాత్పర్యము

సొమ్ములమీఁది యాశచే సీతాదేవి యందెలను బాదములనుండి తీయకయే శ్రీరామునితో సరిగాఁగ వేగముగ నడవవలయునని పోవుచుండఁగాఁ బాద

ములు ఘల్లుఘల్లున నాటవలె సంతోషమునఁబోవుచుండ నేను జూచితిని. ఇంకను నేమిటికమ్మా? నీవు విచారపడెదవు.

శ్రీరామునితో నడువలేకపోయిన నీ శక్తి యింతయే యని లక్ష్మణుఁడు నవ్వునేమోయని లజ్జ. మెల్లగా నడచినఁ బ్రయాణము సాగకపోవునుగదా యని చింత తాను నడవఁజాలక శ్రమపడుచున్నాననిన శ్రీరామచంద్రమూర్తి నొచ్చుకొనునేమో యను విచారము. ఇన్ని యాలోచనలతో శ్రీరామునితోపాటు సీతయు నడచెను. సీతకు సౌమ్ములమీఁది యాశకు మగనివెంటఁ బోవలయునను నుత్సాహమునకుఁ గొఱఁతలేకయుండెనని భావము. ౨౦౩౩-వ పద్యము చూడుఁడు.

కం. శ్రీరామబాహుదుర్గం, బారఁగఁ దా నాశ్రయించి • యడవిని బులులన్
గౌరుల సింగంబులఁ గన్నారఁగఁ గాంచియును భీతి • నందదు సుమ్మీ.

శ్రీరామబాహుదుర్గంబు=శ్రీరాముని బాహులనుకోటను, అరఁగన్ = పూర్ణముగా, గౌరులన్=ఏనుగులను తాత్పర్యము

శ్రీరాముని బాహులనుకోటదు రక్షకముగాఁగొని యడవియందలి క్రూరములగు పులులను భయము గలిగించు నేనుఁగులను వానికి భయంకరములగు సింహములను గన్నారఁజూచియు భయపడదు. కోటలో నుండువారు వీనికి భయపడుదురా? ఆమె స్వభావ భీరుత్వమువదలి ధీరయయ్యెను. శ్రీరామరక్షితులు ధీరులుగాక భీరులు కాఁగలరా?

కం. వారికిఁగా మన కేనియు, భారమునుంగూర్చియైనఁ • బొగలకు మమ్మా
వీరిచరిత్రము స్థిరమై, ధారిణి సత్కీర్తితోడఁ • బరలక నిలుచున్. ౧౫౫౫

తాత్పర్యము

అమ్మా వారడవులలోఁ గష్టపడుచున్నారనికాని, వారు మనలను విడిచిపోయి మనకింత దుఃఖము కలిగించిరే యనికాని రాజు వారి నడవులపాలు చేసెఁగదా, యనికాని నీవు వ్యసనపడకుము. వీరి చరిత్రము స్థిరమై కీర్తితోడ భూమియందు నిలుచును.

దీనివలన ధర్మపద్ధతిఁ గీర్తిసంపాదించుటకై లోకక్షేమమునకై పడెడు శ్రమమునకు విచారపడరాదు. యశస్సు పరులశ్రేయస్సు గోరువా రెంతకష్టమైన నోర్వవలయును. వారికై యితరులు పరితాప పడరాదు. చేతనైన సాహాయ్యము చేయవలయును నిరుత్సాహపఱుపరాదు.

చం. జనకునియాజ్ఞఁ బూని తన • సత్యము లోకములో రహింపఁగా
మునిజను లేగుమార్గమున • మోదముతో ఫలపత్రభోజి యై
యనఘుఁడు నిత్యకీర్తిఁ గను • నార్తిని గూరకు మన్న నామెయుం
దనయుఁ దలంచి యేడ్చెను సుతా సుకుమార కుమార రాఘవా. ౧౫౫౬

ఫలపత్రభోజి=పండ్లు ఆకులు తినువాఁడు.

తా త్ప ర్య ము

అయ్యో! దిక్కుమాలిన పక్షులవలె నిష్కారణముగా నడవులలో నల్లాడుట యేమికీర్తికరకార్యము ? దానివలన నిహమా పరమా ? యందువేమో. అట్లుగాదమ్మా? అడవుల కేలపోయెను ? పాపముచేసి శిక్ష యనుభవించుటకై పోయెనా? లేదుకదా! జనకునియాజ్ఞ నిర్వహించుటకుఁ దన సత్యము లోకములోఁ బ్రకాశింపఁజేయుటకుఁగదా పోయెను?పోయి మునిజనులవలె వానప్రస్థమార్గమున ఫలములు పత్రములు భుజించుచు ధర్మమార్గమున! శాశ్వతమైన కీర్తిని సంపాదించును. కావున వ్యసనపడకుము, అని చెప్పఁగా నామెయుఁ గొడుకును దలఁచి సుకుమారా కుమారా మారాకారా రామా యని యేడ్చెను.

—• { ౬౧-వ సర్గము. కౌసల్య దశరథునితో సతని దుశ్చేష్టగుణించి చెప్పుకొని యేడ్చుట. } •—

చం. అని విలపించుచున్ సుదతి • యాత్మవిభుం గని పల్కు భూమిపా!
తనరెడి రాఘవుం డిల వ•దాన్యుఁడు కారుణికుండు సత్యవా
గ్ధనుఁడు ప్రియైకవాది యని • గాఢయశంబు; సుఖప్రవృద్ధు లా
వనమునఁ బుత్రకుల్ నృపతి•వర్యతనూజయుఁ గుందు టెట్లొకో. ౧౫౩౪

వదాన్యుఁడు=దాత, కారుణికుండు=దయగలవాఁడు, సత్యవాగ్ధనుఁడు=సత్యవాక్కులే ధనముగాఁగలవాఁడు, ప్రియైకవాది=ముఖ్యముగాఁ బ్రియములే చెప్పువాఁడు, గాఢయశంబు=అధికకీర్తి, సుఖప్రవృద్ధులు=సుఖముగాఁ బెరిఁగినవారలు, పుత్రకుల్ = చిన్నికుమారులు, ఈ విశేషణములు యథార్థములుగను గ్రహింపవచ్చును. ఎత్తిపొడుపుమాటలుగను గ్రహింపవచ్చును.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారమేడ్చుచుఁ గౌసల్య మగనిఁజూచి యిట్లనియె. రాజా! నీకు దాతయని దయగలవాఁడని సత్యవాదియని యధిక కీర్తియగునుగాక యని యైనఁ జెప్పవచ్చును.

రాజా! యాఁడుది కోరినంతమాత్రముననే వరములిచ్చెనే యెంతటిదాత యనియు- అలకులు, ఆఁడుకులు- అన్నట్లు వయసుపిల్లయగు ఆఁడుదాని దుఃఖముచూచి సహింపలేక మనస్సు కరఁగినవాఁడాయెఁగదా యెంతటి దయావంతుఁడనియు, కొడుకులుపోనీ- కోడలుపోనీ- పెండ్లాలేమపనీ దేశమంతయు నేడువనీ తానుజావనీ పెండ్లానికిఁ జెప్పినమాట తప్పని సత్యవాది యనియుఁ, దన్నునంతటి యప్రియములు పలికినదానితోను బ్రియములే పలికెఁగదా? యెంతటి ప్రియైకవాదియని నానావ్రతముల నుపవాసములఁ బ్రయాసపడి కనిన పెద్దకొడుకును దనవార్ధకమందు విడిచెఁగదా? యెంతటి త్యాగియని లోకములో నీకు నధికకీర్తి వచ్చినరాని, ఎంతో సుఖముగఁ

బెరిఁగినవారే యీ చిన్న బిడ్డలు వారును మహారాజుకూఁతురు సీతయు నెట్లడవులలో దుఃఖపడఁగలరని తలఁచితివి ?

దాతృత్వముచేత, దయచేతఁ, బ్రియవచనశీలతచేత, నాకు నిచ్చిన రాజ్యము వాచాపూర్వముగ నిచ్చినదానిని మరల నే నీయనని చెప్పఁజాలక తండ్రియందలి భక్తిచే మరల రాజ్యమిచ్చెనని శ్రీరామునకు యశస్సువచ్చిన రానీ, కష్టము లెట్లు సహింపఁగలరని యైనఁజెప్పవచ్చును.

కం. చలికిన్ వేఁడికి గాలికి, వలిగొనక తపింప కెట్లు • వడిఁ బడక వనీ
స్థలిఁ దరుణి శ్యామ సుఖయుత,
మలయున్ సుకుమారిసుఖిత • మైథిలి చెపుమా. ౧౩౩

తరుణి=లేఁతవయస్సుగలది, శ్యామ = నడివయస్సుది, పదునాఱేండ్లకు బాల్యముపోవును. అది మొదలు తారుణ్యమే ఇపుడు సీతకు ౧౮ ఏండ్లు, సుఖయుత=సుఖముతోఁగూడినది, సుకుమారి=కోమల దేహముగలది.

తా త్ప ర్య ము

రాజా! మగపిల్లవాండ్రెట్లయిన నడవులలో బాధ సహించెదరనుకొన్నను జలికివణఁకక వేడికిఁ దపింపక, గాలికి వడఁబడక యడవులలో లేఁతవయస్సుది, సుఖమనుభవించు వయస్సుగలది సుఖమనుభవింప నభ్యాసపడినది,మృదువైన దేహము గలది మిథిలరాజు కూఁతురు. సీత యేప్రకారము తిరుగఁగలదో నీవే చెప్పుము.

ఉ. పప్పును నూరుగాయలును • బచ్చడులుం దననోటి కింపుగా
నొప్పగ నంజుకొంచు మృదు • వోగిరమున్ భుజియించుసీత హా
యుప్పును లేక చప్పిడివి • యుర్విని రాలినగడ్డిగింజ లే
చొప్పునఁ దా మెసంగెడివొ • చూడుము దేవ! భవత్కృతంబులన్. ౧౩౪

ఓగిరము=అన్నము, భవత్కృతంబులన్=నీవు చేసినకార్యములను, ఓగిరము ప్ర. ఆహారము.

తా త్ప ర్య ము

పప్పు ఊరుగాయలు పచ్చడులు తన నోటికి రుచిగా నంజుకొనుచు నన్నముదిను సీత యయ్యో! యుప్పులేక చప్పగానుండునట్టి నేలరాలిన గడ్డిగింజలను తానేవిధముగఁ దినఁజాలునో నీవు చేసినపని యెట్టిదో చూడుము.

కం. గీతంబుల మంగళరవ, జాతంబుల వీను లలర • సతతము విను నా
సీత యెటు వ్యాఘ్రము హర్యృక్షాతతభీకరరవంబు • నాలించెడినో. ౧౩౫

తా త్ప ర్య ము

మంగళవాద్య ధ్వనులయందుఁబుట్టిన గీతములను వీనులార విని సంతోషించు సీత యేవిధముగాఁ బులులయు సింహములయు ఎలుగుల భయంకర మగు ధ్వనులను వినునో విని భయపడకుండునో.

ఉ. ఎక్కడఁ బవ్వళించెనొ సు•రేశ్వరకేతనసన్నిభుండు దా
నక్కట నాసుతుండు పరి•ఘాభమహాభుజ మొప్ప దిండుగా
దిక్కిల లేనివానిపగి•దిన్ నునుఁబచ్చిక మెత్తపాన్పుగా,
దిక్కెవఁ డుండు తండ్రియ మ•దిం గలుషించి వ్యథాబ్ధిఁ ద్రోయఁగన్?

సురేశ్వరకేతన సన్నిభుండు=ఇంద్రధ్వజముతో సమానమైనవాఁడు, పరిఘాభ=ఇనుపగుదియతో సమానమైన, మహాభుజ=గొప్పభుజము, వ్యథాబ్ధిన్ = దుఃఖసముద్రమునందు. తాత్పర్యము.

ఇంద్రధ్వజమువంటివాఁడగు నాకొడు కినుపగుదియఁబోలిన తన చేతిని దిండుగాఁ దలక్రిందనుంచుకొని దిక్కులేనివానివలె నేలమీఁద మెత్తని పచ్చి గడ్డి పానుపుగా నెందుఁ బండుకొనెనోకదా? తండ్రియే కోపించి దుఃఖసముద్రములోఁ ద్రోయఁగా నీక దిక్కెవ్వఁడగును?

ఉ. ఎన్నఁడు చూడఁ గల్గునొ క•దే వికచాంబుజపత్రవర్ణమున్
సన్నవపద్మసౌరభల•సచ్ఛ్వసనంబును బద్మనేత్రమున్
బ్రన్నని వ్రేలుముంగురుల•రమ్యమునై దరహాసభాసమౌ
పున్నమచందురుం దెగడు•పుత్రునిముద్దు మొగంబు నే నిఁకన్. ౧౨౬౨

వికచాంబుజపత్రవర్ణమున్=వికసించిన తామరరేకువంటి రంగును, సన్నవపద్మసౌరభల సచ్ఛ్వసనంబును=మంచి క్రొత్తనైన కమలములయొక్క పరిమళమువలె నింపైన యూర్పును, పద్మనేత్రమున్ = కమలమువంటి కన్నులను, ప్రన్నని=ఇంపై, వ్రేలుముంగురులు = ముఖముపై వ్రేలాడు ముంగురులు, రమ్యమునై=మనోజ్ఞమై, దరహాసభాసము=చిఱునవ్వుచేఁ బ్రకాశించు, తెగడు= తిరస్కరించు. తాత్పర్యము

వికసించిన తామరరేకు వన్నెకలదై, మేలైన క్రొందామరయొక్క పరిమళమువంటి సువాసనగలయూర్పు గాలియుఁ గమలములవంటి గన్నులును, ఇంపై ముఖముపై వ్రేలాడు ముంగురులును, చిఱునవ్వు అనెడు వెన్నెలగల నిండు చందురునిబోలిన నాకొడుకు ముద్దు మొగము నేను మరల నెన్నఁడు చూతునోకదా?

తే. ఇంత లయ్యును నాగుండె•యింత లింత,
లగుచుఁ బెటలక యుండుట•యరసిచూడ
వజ్రసారమయంబుగా•వచ్చు నిక్క; మట్లుగాకున్న వేతున్క•లగుచుఁ బోదె.

తాత్పర్యము ౧౨౬౩

ఇంతకష్టము వచ్చినను నాగుండె చిన్నచిన్న ముక్కలై పెటిలిపడకయుండుటకు నది వజ్రసారముతోఁ జేయఁబడుటయే కారణమై యుండవలయును. అట్లుగాకుండెనేని యిప్పటికి వేయితునుకలై పెటిలిపోయి యుండదా.

కం. నాకొడుకును నాకోడలి, నాకుం గావలయువారి • నట్టడవుల న
స్తోకసుఖార్హులఁ ద్రోచితి, వేకాలమునందు భర్త•యిట్టిఁడుఁ గలఁడే? ౧౫౬౪

నట్టడవులన్ = అడవులనడుమ, కుఱు-చిఱు-కడు-నిడు- నడు శబ్దంబుల ఉడల కచ్చుపరంబగునపుడు ద్విరుక్త టకారంబగు- నడు + అడవి = నట్టడవి, అస్తోక సుఖార్హులన్=అమితసుఖమునకు నర్హులైనవారిని- ఇట్టిఁడు=ఇట్టివాఁడు, అట్టి- ఇట్టి- ఎట్టి శబ్దంబులకు వాఁడు వారు పరంబులగుచో 'వా'కు లోపంబు వైకల్పికంబుగ నగు- ఇట్టి+వాఁడు=ఇట్టిఁడు.

తాత్పర్యము

నాకొడుకును నాకోడలిని నాకుఁ గావలసినవాఁడగు లక్ష్మణుని నెంతో సుఖపడ యోగ్యులగువారిని నడవుల నడుమఁద్రోసితివే- ఏకాలమందైనను నీవంటి మగఁడును గలఁడా. నాకొడుకు నీకొడుకు గాఁడా నాకోడలు నీకోడలు గాదా. నామీఁది కోపముతో నిట్లుచేయవచ్చునా? ఎలుకమీఁది కోపముతోఁ దన యింటికిఁ జిచ్చుపెట్టుకొనువాఁ డుండునా?

సీ. పదునేనవేట నాఁ•పట్టి కానలనుండి, వచ్చెనేన్ భరతుండు•వసుధ నేలు
చుంట రాజ్యమునకు•నుల్లసింపఁడుదాన, భరతుఁడిచ్చిన నొడఁ•బాటుగొనఁడు
శ్రాద్ధంబునకు యోగ్య•బ్రాహ్మణుఁ బిలువక, ధనలోభమునఁజేసి•ధరణిసురులు
తమవారలకు భోజ•నము పెట్టి యోగ్యుల, మీరిష్టపంక్తి కే•తేరుఁ డనిన
ఆ. నట్టివారియింట•నమృతమేనియు వెండి, సుగుణవంతుఁ డైన•సూరి యమర
సన్నిభుండు ద్విజుఁడు•సమ్మతింపఁడు గ్రోల,
నాఁగ వినమె మనము•నాథజగతి. ౧౫౬౫

పట్టి=బిడ్డ, ఒడఁబాటుగానఁడు=అంగీకరింపఁడు, సూరి=పండితుఁడు, అమర సన్నిభుండు=దేవతలతో సమానుఁడు, ద్విజుఁడు = బ్రాహ్మణుఁడు, నాఁగన్ = అనఁగా.

తాత్పర్యము

పదునైదవ సంవత్సరమున నాకొడు కడవులనుండి వచ్చెనేని భరతుఁడు రాజ్యమేలుచుండు కారణమున రాజ్యము దానై కొనసంతోషింపఁడు. భరతుఁ డిచ్చినను నంగీకరింపఁడు. శ్రాద్ధమునకు యోగ్యుఁడగు బ్రాహ్మణుని బిలువక దక్షిణ యియ్యవలసివచ్చునని పిసినితనమున నధములగు బంధులగువారికి భోజనముపెట్టి యోగ్యులగువారిని మీరు మాయిష్టపంక్తికి రండనిన దేవతలతో సమానులైన బ్రాహ్మణులు సుగుణములుగల పండితులైనవారు వారియింట మరల నమృతమైనను గ్రహింతురా? యని చెప్పఁగ మనము వినలేదా ?

దీనివలన యోగ్యులగు బ్రాహ్మణులు నిమంత్రణమునకు లభించునపుడు లోభముచే వారిని బిలువక యయోగ్యులగు తన బంధువులను బిలుచుట దోష మని యేర్పడుచున్నది.

న శ్రాద్ధే భోజయేన్మిత్రం, ధనైః కార్యోఽస్య సంగ్రహః
నారిం న మిత్రం యం విద్యాత్, తం శ్రాద్ధే భోజయేద్ద్విజమ్.
మను. ౩-౧౩౮.

స్నేహితుని శ్రాద్ధమందు వరింపరాదు. వేఱువిధంబుగా ధనంబొసంగి వానిని జేరఁదీయవలయును. కర్త యెవ్వనిని దనకు శత్రుఁడనిగాని మిత్రుఁడని కాని తలంపఁడో యట్టివానని శ్రాద్ధమున నిమంత్రింపరాదు.

ఎవఁడు దేవ పితృకార్యంబులందు స్నేహితులనువరించునో యా హవ్య కవ్యములు వ్యర్థములు. అట్లు వరించినవాఁడు స్వర్గలోక భ్రష్టుఁడు. స్నేహితుల కిచ్చు దక్షిణ పైశాచదక్షిణ యనఁబడును. జ్ఞానవంతులు దొరకనపుడు స్నేహితుల నిమంత్రింపవచ్చునుగాని శత్రువులను గూడదు. వేదాధ్యయనము చేసినవారు- జ్ఞానులు దొరకనపుడు తల్లితండ్రిని- మేనమామను- మేనల్లుని- పిల్లనిచ్చినమామను- దోఁడఁబుట్టినదాని కొడుకును- గురువును- దౌహిత్రుని-అల్లుని- పినతల్లి కొడుకులను- ఋత్విజుని- శిష్యుని వరింపవలయును. దేవతాకార్యములందు బ్రాహ్మణుని కులగోత్రాదులు విచారింపఁ బనిలేదుగాని శ్రాద్ధాదులందు బ్రాహ్మణుని యోగ్యతను బరీక్షించియే నిమంత్రింపవలెను ఇఁకఁ జెప్పఁబడువారు హవ్యకవ్యాదులందు నిమంత్రణమునకు యోగ్యులుగారు.

దొంగ- పతితుఁడు- నపుంసకుఁడు- నాస్తికుఁడు- బ్రహ్మచారి- ముండనము చేసికొన్నవాఁడు- వేదాధ్యయన శూన్యుఁడు-బట్టతలవాఁడు- ఎఱ్ఱని తలవెండ్రుకలు గలవాఁడు-జూదరి-బహుయాజకుఁడు-వైద్యుఁడు-కూలికి గుడిపూజ చేయువాఁడు-వర్తకముచే జీవించువాఁడు-కూలికై రాజాజ్ఞను ఱరివారియాజ్ఞను నెఱవేర్చువాఁడు - పుచ్చిన గోళ్ళుకలవాఁడు- నల్లని దంతములు గలవాఁడు- గురువునకు విరుద్ధముగా నడచువాఁడు- అగ్నిహోత్రము లు వదలినవాఁడు-వడ్డి వ్యాపారము చేయువాఁడు-క్షయరోగి-పసులమేపరి-అన్నకంటె ముందు పెండ్లి చేసికొన్నవాఁడు- బ్రహ్మద్వేషి- తమ్మునికి వివాహమైనను దాను వివాహములేకయుండువాఁడు-పెక్కురకై యుంచిన ద్రవ్యముచే జీవించువాఁడు-నర్తకుఁడు- సన్న్యాసిగానుండి స్త్రీసంపర్కము గలవాఁడు- శూద్రస్త్రీ మగఁడు- మొదట నొకనిని పెండ్లాడి యావల రెండవవానిని పెండ్లాడినదాని కొడుకు- ఒంటి కంటి వాఁడు- తనభార్యాజారుని దనయింట నుంచుకొన్నవాఁడు- కూలికి వేదము చెప్పువాఁడు- జీతమిచ్చి యధ్యయనము చేయువాఁడు- శూద్రశిష్యుఁడు-శూద్ర గురువు-పరుషములాడువాఁడు-మగఁడు బ్రదికియుండఁగా మఱియొకనికిఁగన్న కొడుకు- వీఁడే కుండుఁడు- మగఁడు చచ్చినవెనుక జారునికిఁబుట్టినకొడుకు(గోళకుడు) తల్లిదండ్రులను గురువును నిష్కారణముగ వదలినవాఁడు- పతితులతోఁ గూడి తిరుగువాఁడు- పతితులతో సంబంధము చేసినవాఁడు- ఇండ్లు తగులబెట్టినవాఁడు-విషము పెట్టినవాఁడు- కుండగోళకుల యన్నము తిన్నవాఁడు- సముద్ర

యానమొనర్చినవాఁడు, స్తుతిపాఠకుఁడు, నూవులనుండి నూనెదీయువాఁడు, తప్పు సాక్ష్యము చెప్పువాఁడు, తండ్రితో వాదించువాఁడు, మద్యపానముచేయు వాఁడు- పాపరోగము గలవాఁడు- ధర్మము చేసెదనని మోసగించువాఁడు- రస వస్తువు లమ్మువాఁడు- అక్కకు పెండ్లిగాకుండఁగా ముందు తాను బెండ్లిచేసి కొన్నదాని మగఁడు, మిత్రద్రోహి, జూదమాడించి జీవించువాఁడు- కొడుకునొద్ద వేదాధ్యయనము చేసినవాఁడు- అపస్మారి- గండమాల గలవాఁడు- బొల్లిగల వాఁడు- కొండెములు చెప్పువాఁడు- పిచ్చివాఁడు- గ్రుడ్డివాఁడు- వేదనిందకుఁడు- వాస్తుశాస్త్రముచే జీవించువాఁడు- దూతకూలికి చెట్లనుబెంచువాఁడు- కుక్కలను బెంచువాఁడు- డేగలను బెంచువాఁడు- కన్యను జెఱచినవాఁడు- హింసాస్వభా వము గలవాఁడు- శూద్రవృత్తియం దాసక్తి గలవాఁడు- ఆచారహీనుఁడు-ధర్మ కార్యములం దుత్సాహములేనివాఁడు-యాచనచే జీవించువాఁడు-తానే కృషిచేసి జీవించువాఁడు- ఏనుఁగుకాలు కలవాఁడు- పెద్దలచే నిందితుఁడు-విధవను బెండ్లా డినవాఁడు- ధనమునకై పీనుఁగుల మోయువాఁడు- కాయకంటివాఁడు- వీరిని శ్రాద్ధములందు బ్రాహ్మణ శ్రేష్ఠుఁడు నిమంత్రణమునకుఁ జెప్పరాదు.

శ్రాద్ధశేషము వరులు భుజింపరాదు.

సాయంప్రాతశ్చ భుంజీత నాంతరాళే సమాహితః
అకాలేనతు భుంజీత పరశ్రాద్ధే తథైవచ ॥

సాయంకాలము ఉదయము భుజింపవచ్చును. నడుమ భుజింపరాదు. అకాలమున భుజింపరాదు, పరశ్రాద్ధములయందు భుజింపరాదు, వ్రతులయు విధవలయు యతులయు శ్రాద్ధములందు భుజింపరాదు. ఈ శ్రాద్ధములందు భుజించినవారు నరకగాము లగుదురు. (మార్కండేయ) అయినను సగోత్రులు స్వకుల్యులు జ్ఞాతులు భుజించిన దోషములేదు. జ్ఞాతులుతప్ప దక్కినవా రన్య శ్రాద్ధశేషాన్నము భుజించిన ప్రాజాపత్యవ్రత మాచరింపవలెను. మామ- మేన మామ- గురువు- అన్న- కొడుకు- బ్రహ్మనిష్ఠుఁడు- యోగి- వీరి శ్రాద్ధశేషా న్నము భుజించిన దోషములేదు. (జాబాలి)

కం. మును ముస్గుడిచినవారలు, జనవర! బ్రాహ్మణులె యైన • సమ్మతిఁ గుడువన్
గొనరు తిరస్కృతవిప్రులు, విను శృంగచ్ఛేద మైన • వృషభములట్టుల్.

తిరస్కృతవిప్రులు=తిరస్కరింపఁబడిన బ్రాహ్మణులు, శృంగచ్ఛేదము= ఛవర్ణము పరమైనపుడు పూర్వస్వరమునకును ఛవర్ణమునకును నడుమ చ్ వర్ణ మాగమమగును, శృంగను=పచ్చికకొన, ఒకయెద్దు కొఱికి విడిచినదానిని మఱి యొకయెద్దు తినదు.

తాత్పర్యము

నిమంత్రితాన్నమున కున్నవారలు బ్రాహ్మణులయినప్పుడు వెనుకటివారు భుజింపవచ్చునుగదా? ముందు భుజించినవారు శూద్రులయినఁగదా నిషేధ

మందురేమో ముందు భుజించినవారు బ్రాహ్మణులేయైనను యోగ్యతా పక్షపాతములేక లోభమున నయోగ్యులకు ముందు భుజింపఁబెట్టఁబడెనేని యాశిష్టము సద్బ్రాహ్మణులు గ్రహింపరు. వృషభమునకుఁ గొమ్ములుకొట్టి నట్లవమానముగాఁ దలంతురు. ఒకయెద్దు భుజించిన తృణాగ్రములను వేఱొకయెద్దు భుజించునా ?

కం. మును తప్పుఁ డనుభవించిన,
ధనమును రాజ్యంబుఁ బిదపఁ•దానెటులు గొనున్
ఘనమతి వరిష్ఠుఁ డగునా,తనయుండు జ్యేష్ఠుఁడు నగుట•ధరణిప! చెపుమా.

ఒక యెద్దు తిని విడిచినదానిని మఱియొకయెద్దు భుజింపదుగదా! అట్టి నియమము పశువులయందేయుండఁగా ముందు తప్పుఁ డనుభవించి విడిచిన ధనమును రాజ్యమును బిదప గొప్ప బుద్ధిగలవాఁడు శ్రేష్ఠుఁడునగు నాకొడుకెట్లు గ్రహింపఁగలఁడో రాజా చెప్పుము.

కం. పరజంతుభుక్తశేషము,గురుబల మగువ్యాఘ్ర మెందు•గోరదు తినఁగాఁ
బురుషవ్యాఘ్రం బేటికిఁ, బరభుక్తముఁ గోరు నేవ•పడక మహీశా. ౧౫౬౮

పరజంతుభుక్తశేషము = ఇతరజంతువులు తోడేలు మొదలైనవి తినఁగా మిగిలినదానిని, గురుబలము=గొప్ప బలముగలది, పరభుక్తము = ఇతరులచే ననుభవింపఁబడినది, ఏవపడక=అసహ్యించుకొనక.

తాత్పర్యము

ఇతరజంతువు భుజింపఁగా మిగిలినదానిని బలముగల వేఱొకపులి యెపుడును దినఁగోరదు. పశువులయందే యిట్టి మర్యాదయుండఁగాఁ బురుషశ్రేష్ఠుఁడైన రాచకొడుకు శ్రీరామచంద్రుఁడు పరు లనుభవించినదానిని నసహ్యించుకొనక కోరునా ?

దీనివలన మానవంతుఁ డవమానపూర్వకముగ గొప్ప రాజ్యము లభించినను నైకొనఁడని సూచితము.

తే. యాతయామంబు లైనట్టి•యాజ్యకుశహ,
విస్సులును బురోడాశంబు•వెండి యూప
ఖాదిరంబుల నెవఁడైనఁ•గ్రమ్మఱంగ,
వాడుకొనునొక్కొ వెనుక స•వంబులందు. ౧౫౬౯

యాతయామంబులు="జీర్ణంచపరభుక్తంచ యాతయామ మిదంద్వయమ్" అమరుఁడు. ఒకసారి వాడుకొనఁబడినది.ఆజ్య-కుశ-హవిస్సులు=నెయ్యి దర్భలు నేతిహవిస్సులు, పురోడాశంబు=చేసినహవిస్సు, వెండియున్=మఱియును,యూప ఖాదిరములున్=చండ్ర మోదుగు మొదలయిన యూపస్తంభములు,సవములందున్=యజ్ఞములందు.

తాత్పర్యము

ఒకసారి యజ్ఞమున వాడుకొనఁబడిన నెయ్యి దర్భలు హవిస్సు పురోడాశము యూపస్తంభము వీనిని మఱియొక యజ్ఞమున నుపయోగింతురా ?

కం. హృతసార మైనసురవలెఁ, జ్యుతసోమముసవమురీతి • నుర్వీధవ! నా
సుతుఁ డేల యన్యభుక్తము, క్షితినిం గాంక్షించు; నంత • చెడి బ్రతికె నొకో?

హృతసారము=ఎత్తివేయఁబడిన సారముగలది, చ్యుతసోమము=విడువఁబడిన సోమరసముగలదియగు, సవమురీతిన్=యజ్ఞమువలె, అన్యభుక్తము=ఇతరులచే ననుభవింపఁబడినదియగు, క్షితినిన్=భూమిని.

తాత్పర్యము

సారముతీయఁబడిన కల్లువలె సోమములేని యజ్ఞమువలె రాజా నాకొడుకేల యితరు లనుభవించి విడిచి నిస్సారమైన భూమిని గోరును. నాకొడుకంత చెడి బ్రతికినాఁడని తలఁచితివా?

కం. ఇంతటియవమతి సీతా,కాంతుఁడు సహియించు నెట్లు • కలదే నిజవా
లాంతముఁ ద్రొక్కిన వ్యాఘ్రము,
శాంతత దా నోర్చియుంట • జగతిం జెపుమా. ౧౩౪౧

అవమతి=అవమానము, నిజవాలాంతము=తనతోఁకకొసను, శాంతతన్=శాంతితో.

తాత్పర్యము

రాజా! యింత యవమానము నా పుత్రుఁడు సీతానాథుఁ డెట్లనుభవింపఁ గలఁడు. లోకమునఁ దన తోఁకకొనను ద్రొక్కిన పులి శాంతితో నూరకుండుట గలదా? నా పుత్రుఁడు సీతానాథుఁడనుటవలన శ్రీరామచంద్రుఁడు తానట్టి రాజ్యము గ్రహించెనేని దానివలనఁ గన్నతల్లికిఁ గట్టుకొన్నభార్యకు నవమానము సంభవించునని భావము. వారి కవమానము వచ్చుకార్యము మగవాఁడు చేయఁడు పాదుకారాజ్యము వలన నీ విచారము దప్పినది.

చం. భువనము లెల్ల నొక్కటయి • పూనినయేనియు నాతనూభవున్,
లవమును భీతి గొల్పఁగ న • లంతులు గావు మహారణంబునన్,
భువిని నధర్మవర్తులను • బూన్పఁగ ధర్మపథంబుఁ దద్విధిన్
దవిలినమానసంబునను • దా నిటు సైఁచెడిఁ గొత దుఃఖముల్. ౧౩౪౨

భువనములు=లోకములు, లవమును=కొంచెమైనను, వలంతులు=శక్తిగలవి, అధర్మవర్తులన్=అధర్మమార్గమందు నడచువారిని, ధర్మపథంబు=ధర్మమార్గము.

తాత్పర్యము

తోఁకత్రొక్కిన పులి సహించి యూరకుండదు నిజమే. అట్లులే నీకొడుకునకు రోషము పౌరుషము బలముండిన నేలరాజ్యము పట్టముకట్టుకొనఁ గూడదనెదవా? సామర్థ్యము లేకకాదు. పదునాలుగు లోకములన్నియు నొక్కటై ప్రయత్నించి పైనెత్తివచ్చినను మహాయుద్ధమున నవి నాకొడుకునకు భయము గలిగింప శక్తిగలవికావు. అయినను లోకమున నధర్మమార్గమందుండువారిని సామ్యవిధి ధర్మమార్గమందు వర్తింపఁజేయఁగోరి దానికిఁదాను మార్గదర్శిగా

నుండవలయునని యా విధియందుఁ దన మనస్సంతయు నుంచుటచే దుఃఖములు సహింప నిచ్చగించెను. తానధర్మమందుండువాఁ డితరుల నెట్లు ధర్మమున నుంపఁగలఁడు దీనివలన రామావతారము స్వానుష్ఠానమున ధర్మోపదేశము చేయునది యని యేర్పడెను.

చం. కలితసువర్ణపుంఖశిత • కాండములన్ దహియింపఁ జాలెడిన్
జలనిధి నేని భూతముల • సంఘమునేని యుగాంతకాలున
ట్టుల యటువంటిసింహబలుఁ•డున్ వృషభాక్షుఁడు గండుమీనుచేఁ
బొలిసెడిచేఁపపిల్ల యనఁ • బోయె హతుం డయి తండ్రిచేతనే. ౧౨౭౩

కలితసువర్ణపుంఖ=కూడిన బంగారు పింజలుగల, శిత=పదునైన,కాండములన్=బాణములచే, జలనిధినేనిన్=సముద్రమునైనను, భూతములన్=జంతువులను, యుగాంతకాలునట్టుల=ప్రళయకాలమందలి యమునివలెనే, సింహబలుఁడున్=సింహముబలమంత బలముగలవాఁడు, వృషభాక్షుఁడు=మదించిన యెద్దు కన్నులవంటి కన్నులుగలవాఁడు, పొలిసెడి=గండుమీను=పెద్ద మగచేఁప.

తా త్ప ర్య ము

బంగారు పిడులుకలిగిన కఱకుబాణములచే సముద్రమునైనను సమస్త భూతములనైనను ప్రలయకాలమందలి యమునివలెఁ గాల్చివేయఁగలఁడు. అటువంటి సింహబలుఁడు మదించిన యెద్దు కన్నులవంటి కన్నులుగలవాఁడు పెద్ద మగచేఁపచేఁ జచ్చెడి పిల్లచేఁపవలెఁ దండ్రిచేతనే చంపఁబడెను.

ఉ. ఈవును ధర్మవేదివి న•రేశ్వర! చెప్పుము కన్నపుత్రునిన్
నీ విటు గానలన్ నవయ • నెట్టితిగా, యిది రాచవారు భూ
మీవిబుధార్యవర్యులును • మెచ్చు సనాతనధర్మశాస్త్ర మెం
దే విధియించెనో విహిత•కృత్యముగాఁ దెకతెర కక్కటా? ౧౨౭౪

తా త్ప ర్య ము

రాజా! నీవును ధర్మము తెలిసినవాఁడవేకదా? కన్న కొడుకును నడవుల యందిట్లు కృశింపఁజేసితివిగదా? ఇది రాజులు బ్రాహ్మణులు వైశ్యులు నంగీకరించిన ధర్మశాస్త్రములందు నిష్కారణముగాఁ చేయఁదగిన కార్యమని యెంనైన విధియించెనేమో చెప్పుమా?

కం. పతి మొదటిదిక్కు సతికిన్,సుతుఁడు ద్వితీయుండు, ననుఁగు•జుట్టం బాపై
గతి యయ్యెడుఁ బరికింపఁగ,
గతి యన్యము లేదు సుమ్ము•కాంతకు నధిపా! ౧౨౭౫

తా త్ప ర్య ము.

రాజా! నీకేమి మహారాజువు? నిన్నాదరించుటకుఁ గైకవంటి భార్యగలదు. భరతునివంటి కొడుకుగలఁడు, కాని నాగతియేమి? నేనాఁడుదానను,ఆఁడుదానికి

మొదటిదిక్కు కట్టుకొన్నమగఁడు. వాఁడు లేనపుడు రెండవదిక్కు కడుపునఁ బుట్టినకొడుకు. ఈ యిరువురులేనివారికిఁ బ్రేమగల బంధువులు తోడఁబుట్టినవారు మూఁడవదిక్కు. ఈముప్వురుతప్ప నెంతయాలోచించినను స్త్రీకి వేఱొకదిక్కులేదు

పితారక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే
వార్ధకే తనయోరక్షే న్నస్త్రీస్వా తంత్ర్యమర్హతి॥ యని ప్రమాణము.

నస్త్రీస్వాతంత్ర్యమర్హతి యనఁగా స్త్రీ తన్నుఁదాను గాపాడుకొనునట్టి స్థితికి బంధువులు తీసికొనరాదు స్త్రీరక్షాభారము బంధువులగు పురుషులయందున్న దని యర్థము. స్త్రీరక్షాభారము స్త్రీయందేవిడిచినచో వేఱుగతి లేనపుడో యడ్డి గెడువాఁడు లేమినో దుష్టవర్తనముకలది కావచ్చును.

చం. సవతికి నీవు దక్కి నన్నుఁ ♦ జాఁగఁబగొట్టుట నీవు గల్గియున్
ధవుఁడవు లేనివాఁడ, విఁక ♦ నాసుతునిన్ వనిఁ ద్రోచి తీవ, నా
కెవరును లేరు చుట్టములు ♦ నేనెదఁ గానల కన్నచో మగం
డవు మని యుంటఁబోల, దిటు ♦ నాశము చేసితి నన్ను నన్నిటన్. ౧౫౨౬

తాత్పర్యము

శాస్త్రమిట్లు చెప్పుచున్నదిగదా నాగతియేమో యాలోచించి చెప్పుము.

నీవు నాసవతికి వశుఁడవై నన్ను హింసించుటచేత మొదటిదిక్కు. మగఁడవైన నీవుండియు లేనివాఁడవే? ఇఁక రెండవ దిక్కు కొడుకు. వానిని నడవుల పాలుచేసి యుండియు లేనివానిఁ జేసితివి. నాకు దగ్గఱచుట్టము లెవరులేరు. కొడుకు వెంట నడవులకుఁ బోదమనిన మగఁడవగు నీవు బ్రతికియుండుటచే నట్లు పోవుటకు లేదు. నీవు నన్నన్నివిధముల నాశము చేసితివిగదా? నాగతి యేమి. నాకు రక్షకులెవరు?

నాలుగవ పాదంబున ననునాసికాక్షర యతి.

గీ. అలద్రుతంబునకును మధ్య మానునాసి
కమునకును జెల్లునను నాసికయతులనఁగ
డాపలను బార్ణములు గల్గుటత డఢలును
దథదధలును గ్రమంబున దానవారి. అప్ప.

చం. హత మయి పోయె నీవలన ♦ జ్యాతల, మీవును మంత్రు లెల్లరున్
హతు లిఁక, నేను నాసుతుఁడు ♦ నాశన మైతిమి, పౌరులందఱున్
హతుల, నితాంతసమ్మదము ♦ నన్దర నీప్రియురాలు నీసుతుం
డతులితభోగయుక్తు లయి ♦ హాయిగ నేలుచు నుందు రిం కిటన్. ౧౫౨౭

తాత్పర్యము

మగఁడవైన నీవలన నాశమైనదానను నేనొకతనేకాదు నీవంటి యవివేకి రాజగుటవలన నీ భూమీ రాజ్యమంతయు నాశమైనదే? ప్రజలులేనప్పుడు నీవేల? ప్రజలుండినఁగదా వారినిమిత్తమై రాజుండవలె? రాజులేనిచో మంత్రులేల? నేను

నాసుతుఁడు చెప్పఁబనిలేదు. ఎప్పుడో నాశమైతిమి. ఇందఱుపోఁగాఁ బురజను లుందురా? వారు చచ్చినవారే. అందఱు పోఁగా నిండుసంతోషముతో నీప్రియు రాలు నీకొడుకు ననసమానభోగము లనుభవించుచు హాయిగా నుందురు.

చం. అనుచుఁ గఠోరభంగిఁ దను • నాడిన భూపతి వించు శోకవే
దనను సహింపలేక పడి • తాలిమి దూలి ధరాతలంబునన్
వనిత నిజంబ పల్కెడి, న•నన్యకృతంబు మహాఘ మేమి నే
నొనరిచినాఁడనో యనుచు•నుల్లమునం దలపోఁత ముగ్గుచున్. ౧౫౪౭

కఠోరభంగిన్=కఠినమైనవిధముగ, తాలిమి = ఓర్పు, అనన్యకృతంబు = ఇతరులెవరు చేయనిది, మహాఘము = ఘోరపాపము, తలపోఁతన్ = ఆలోచన యందు.

తాత్పర్యము

ఈప్రకారము కౌసల్య తన్నుఁ గఠినముగాఁ బలుకఁగావిని శోకబాధ సహింపలేక యోర్పులేక భూమిపైఁబడి యిది యాఁడుదైనను శోకమున మునిఁగియుండియు సత్యము పలుకుచున్నది. ఈమె చెప్పినదానియం దసత్య మేదియు లేదు. నిష్కారణముగఁ బరులను బాధించు ధర్మము ధర్మముకాదు. ఒక ధర్మముచేయువారు తాముచేయు ధర్మము మఱియొక ధర్మమును బాధించు నది కానిదిగాఁ గనిపెట్టవలెను. ఇది నేనాలోచించినవాఁడను గాను, ఎవరుచేయని యింతటి మహాపాపము నేనేమిచేయుటచే బుద్ధిలోపమై యింతటి చేయరానిపని చేసితినో యని యాలోచించెను.

అత్యుత్కటైః పుణ్యపాపై, రిహైవ ఫలమశ్నుతే
త్రిభిర్వర్షైః త్రిభిర్మాసై, స్త్రిభిర్పక్షై స్త్రిభిర్దినైః ॥

మిక్కిలి యతిశయించిన పుణ్యఫలము గాని పాపఫలము గాని యీలోక మందే మూఁడు సంవత్సరములలోఁగాని మూఁడు నెలలోఁగాని మూఁడు పక్షములలోఁగాని మూఁడు దినములలోఁగాని యనుభవమునకు వచ్చును. అని కలదు కావున నీజన్మమం దింత ఘోరపాపఫల మనుభవించుటకు నేనుజేసిన పాప మేమి యని యాలోచించెను.

—• ౬౨-వ సర్గము. దశరథుఁడు కౌసల్యను క్షమింప వేఁడుట. •—

కం. సోలుచు మూర్ఛను ధరపై, వ్రాలుచుఁ గౌసల్యమోము•బరికించుచుఁ జిం
తాలులితమానసంబున నాలోచన సేయఁ బ్రాక్కృ•తాఘము దోఁచెన్. ౧౫౪౮

చింతాలులిత మానసంబునన్ = విచారముచే వ్యాకులమైన మనస్సుచే, ప్రాక్కృతాఘము=ముందుచేసిన పాపము, తోఁచెన్=మనస్సునకు వచ్చెను.

తాత్పర్యము

మూర్ఛచేఁ బరవశుఁడై నేలమీఁదఁబడి తెలివితెచ్చుకొని కౌసల్యముఖముఁ

జూచి చింతచే వ్యాకులమైన మనస్సుతో నాలోచింపఁగాఁ బూర్వము తానుజేసిన పాపము స్మృతికి వచ్చెను.

చం. తెలియమి శబ్దవేధు లగు•తీవ్రశరంబులఁ జేసినట్టియా
కలుషము బుద్ధిఁ దోఁచినను•గాతరుఁ డై ద్విగుణంబుగా మునిన్
బొలియఁగఁ జేఁతకుం దనదు•పుత్రునిపోకకు నుమ్మలించు చం
జలి ఘటియించుచున్ సతిప్ర•సాదముకై తల వంచి యిట్లనున్. ౧౯౩౦

తెలియమిన్=తెలియకపోవుటచే, అబుద్ధిపూర్వకముగ, శబ్దవేధులు=వస్తువు కానరాకపోయినను ధ్వనినిబట్టి యాలక్ష్యమును భేదించుబాణములు, కలుషము= పాపము, కాతరుఁడై=విహ్వలుఁడై, ద్విగుణంబుగాన్=ఇబ్బడిగా, పొలియఁగఁ జేఁతకున్=చంపినదానికిని, ఉమ్మలించుచున్=దుఃఖించుచు, సతిప్రసాదముకై= కౌసల్య యనుగ్రహము కోసరమై.

తాత్పర్యము

అజ్ఞానముచే శబ్దము గుఱిగాఁ గొట్టు బాణములచేతఁ దానుజేసిన పాపము స్మృతికిరాఁగా భయపడినవాఁడై మునికుమారుని జంపుట తనకొడు కడవులకు బోవుట యాలోచించి రెట్టింపు దుఃఖముతోఁ జేతులుమోడ్చి కౌసల్యయెడఁ దాను జేసిన మహాపరాధముఁ దలంచి సిగ్గునఁ దలవంచి యామె యనుగ్రహము సంపాదింపగోరి యిట్లనెను.

చం. కరుణ దొఱంగ వెన్నఁడును • గానిజనంబుల మీఁద నేని, నన్
గరుణ క్షమింపు దేవి! కను•గానక చేసితిఁ దప్పు నీయెడన్,
గరములు మోడ్తు, ధర్మరత • కాంతలకుం బతి నిర్గుణుండయేన్
గరము లసద్గుణుం డయినఁ • గాని సమక్షపుదైవతం బగున్. ౧౯౩౧

కానిజనంబులమీఁదన్=విరోధులమీఁద, కనుగానక = కన్నులు తెలియక, మోడ్తున్=ముకుళింతును, ధర్మరతకాంతలకున్=పతివ్రతాధర్మమందుఁ బ్రీతిగల కాంతలకు, నిర్గుణుండయేన్=గుణహీనుఁడైనను, లసద్గుణుండు = మంచి కీర్తి కరములైన గుణములు కలవాఁడైనను, సమక్షపుదైవతము=ప్రత్యక్షదేవత.

తాత్పర్యము

దేవీ! నీ వేనాఁడును నీవిరోధులయందైనను దయతప్పనిదానవు. కావున నా యపరాధమును క్షమింపుము. కామాంధకారమునఁబడి కన్నులు తెలియక నీవిషయమున గొప్పయపరాధమును జేసితిని. కావున నేను నీకు పగవాఁడనే. అయినను నీకుఁ జేతులు జోడించి నమస్కరించెదను. పతివ్రతలగు స్త్రీలకు మంచిగుణములు గలవాఁడైనను జెడుగుణములు గలవాఁడైనను బతియేకదా ప్రత్యక్షదేవత.

చం. నిరుపమధర్మతత్పరవు • నిత్యము లోకులు నేయు మంచినె
బ్బరల నెఱుంగు దీవు, గుణ•భాగ్యవు, వుంటిని నుప్పుఁ బెట్టదే

పరితపియించు నన్నిటులు • పల్కుదె? దుఃఖిత వయ్యు, శాంతమున్
గరుణఁ దలంప రాదె? ననుఁ•గర్కశవాక్యము లాడఁ బాడియే? ౧౨౮౨

నిరుపమధర్మతత్పరవు=అసమానమైన ధర్మమునందు నాసక్తిగలదానవు, గుణభాగ్యవు=సద్గుణసంపత్తిగలదానవు, దుఃఖితవయ్యున్ = దుఃఖించుచున్న దానవైనను, కర్కశ వాక్యములు=కఠిన వాక్యములు.

తాత్పర్యము

ధర్మాసక్తియందు నీ వసమానవు. లోకములోనివారు చేయు మేలుకీళ్ళు నీవెఱుఁగుదువు. సద్గుణ సంపత్తిగలదానవు. ఇన్ని మంచిగుణములు నీయందుండియుఁ బుంటిలో నుప్పుపెట్టినట్లు గోరిచుట్టుపై రోఁకటిపోటు వేసినట్లు పుత్రశోకముతోనేడ్చు నన్ను నీవు పరుషములాడి మఱింత దుఃఖపెట్టవలయునా ? నీకెంతదుఃఖముండినను స్వయంకృతాపరాధమున వాఁడేడ్చునదియే చాలును. నేను మఱింత దుఃఖింపఁజేయవలయునా? యని శాంతత వహించి అయ్యో పాపము కట్టుకొన్న మగఁడేయని దయదలఁపరాదా. ఇంతకఠినముగా మాటలాడుట ధర్మమా.

తే. అనుచు దీనోక్తిఁ బ్రార్థించు • నధిపుఁ జూచి
భయము సంభ్రమ మొదవంగఁ • బ్రాణనాథు
నంజలిని బద్మ మన శిర • మందుఁ దాల్చి
నారి కన్నీరు గార్చె ప్ర • ణాళిఁ బోలి. ౧౨౮౩

దీనోక్తిన్=వ్యసనముతోఁగూడిన మాటలచే, సంభ్రమము=తొట్రుపాటు, అంజలిని=చేమోడ్పును, నారి = స్త్రీ, కౌసల్య, భయము = ధర్మహాని భయము, భర్త నాకు నమస్కరించునట్లు వర్తించితినిగదా. దీనివలన నాధర్మమునకు హాని వచ్చెనే అని భయము.

తాత్పర్యము.

ఈవిధముగా దుఃఖముతోడి మాటలతోఁ దన్ను వేఁడుకొనుచున్న భర్తను జూచి ధర్మభయముచేతను దొట్రుపాటుచేతను, నతని యంజలిని పద్మమువలె శిరమందుఁదాల్చి కౌసల్య నీటి గొట్టమునుండి నీరు పాఱునట్లు తన కన్నుల నుండి నీళ్ళుకార్చెను.

చం. పలికె హృదీశుఁ బ్రాణధవ • పాదములం బడి వేఁడుదాన నన్
జెలువను వేఁడికోలు దగు • నే? ననుఁ జంపఁగ నీకు న్యాయమే
యలుకక తన్ను వేఁడుకొను•నట్లు నిజేశ్వరు బాధపెట్టు నా
కలికి యిహంబునుం బరము • గానదు, దుర్గతి నొందఁ గల్గెడున్. ౧౨౮౪

హృదీశున్=భర్తను, ప్రాణధవ = ప్రాణేశ్వరా, చంపఁగన్ = ధర్మహాని కలిగించుటయుఁ జంపుటయు సమానములేకదా.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నీచరణములప్రాలి నేను బ్రార్థించెదను. నేనాఁడుదానను. కావున దెలివిమాలినదానను నీకు లోపడియుండుదానను. నీవు నన్ను శాసింపఁదగుదు. కాని ప్రార్థింపఁదగునా? ఇట్లు నాకు స్వధర్మహాని కలిగించుట నన్నుఁ జంపుటగాదా. ఇది నీకు ధర్మమా. జంకులేక తన్నుఁ బ్రార్థించునట్లు తన భర్తను బాధపెట్టుస్త్రీ యిహమందును బరమందును జెడును. రెంటను దానికి సుఖము లేదు. అది నరకమునకే పోవును.

చం. తెలియనిదానఁగాను జగతీవర! సత్యరతుండ వంచు ని
శ్చలపరధర్మమూర్తి వని • సత్యముఁ జెప్పెద విన్ము • నాసుతున్
దలఁచుకొలంది యే మన ని • తాంతము భగ్గనిమండుఁ గడ్పులో
బలితపుఁబుత్రశోకమునఁ • బల్కితి, నన్ను శమింపఁగాఁ దగున్. ౧౫౮౫

తాత్పర్యము

నీవు సత్యమందుఁ బ్రీతిగలవాఁడవని చలింపని గొప్పధర్మమే యలంకారముగాఁ గలవాఁడనని నేను దెలియనిదానఁగాను, అయినను నాస్థితి యథార్థము చెప్పెదవినుము. మగఁడు సత్యాత్ముఁడను సంతోషమునకంటెఁ బుత్రశోకము బలిష్ఠముగానున్నది. కావున నాకొడుకును దలఁచుకొలఁది కడుపు భగ్గని మండుచున్నది కావున నాపుత్రశోకముకొలఁది నేను బలికితినిగాని నిన్ను నొప్పింపవలయునని తలంపుచేఁగాదు. నేనుజేసినది తప్పు. నన్ను క్షమింపుము. నిన్ను నొప్పించిన నాకు రాఁగలలాభ మేమిగలదు? ఇది పతివ్రతల లక్షణము.

కం. శోకంబున ధైర్యము చెడు, శోకంబున నాశ మొందు • శ్రుత మఖిలంబున్
శోకంబున సర్వము చెడు, శోకము సరిపోలు వైరి • చొప్పడఁ డెందున్.

తాత్పర్యము ౧౫౮౬

శోకమనునది సామాన్య దుర్గుణముకాదు. శోకముచే ధైర్యము చెడును. శోకముచేఁ బెద్దలవలన వినినసీతి ధర్మజ్ఞాన మఖిలము నాశమగును. ఇంతయేల శోకముచే సమస్తము చెడును. శోకమువంటి శత్రువులేఁడు. అతికోపమునందువలె నతిశోకమునందును మనస్సు వికలమగును. కావున నెవరినైన నెంతమాటయైన నందురు. కాని వివేకముకలవారు పశ్చాత్తాపపడి క్షమింపవేఁడుదురు. అతిసంతోష మిట్టిదే. అతి సర్వత్రవర్జయేత్తనుట యథార్థ విషయము.

ఆ. పగఱుచేతితోడ • బాఁదినదెబ్బలు, సైఁప వచ్చుఁగాని • సైఁపరాదు
స్వల్పమైనఁ గాని • యాకస్మికంబుగ, దాపరించు శోక • తాపవహ్ని. ౧౫౮౭

పగఱు=పగవారు, బాఁదినన్=కొట్టిన.

తాత్పర్యము

శత్రువులు చేతితోఁగొట్టిన దెబ్బలు సహింపనగును గాని తటాలున వచ్చిన శోకమువలనఁ గలిగిన సంతాపాగ్నిని గొంచెమైనను సహించుట కష్టము. దేహ కష్టమునకంటె మనోవేదన తీవ్రము.

కం. ఏనునిశ లేగె రాముఁడు, కాననవాసంబు చేయఁ • గడఁగినది మొదల్
మానవవర! శోకంబున, నేనేఁడులు గడచినట్టు • లేర్పడె నాకున్. ౧౫౮

తాత్పర్యము

శ్రీరామచంద్రుఁ డరణ్యవాసముచేయ మొదలుబెట్టినది మొదలు నేటికి నైదు రాత్రులు గడచెను, రాజా! శోకాతిశయమున నవియే నాకైదు సంవత్సరములవలెఁ గడచెను.

ఈ యైదురాత్రు లేవియను విషయమునఁ బూర్వ వ్యాఖ్యాతలు భిన్నాభిప్రాయులై యున్నారు.

౧. కొందఱు మొదటిరాత్రి తమసాతీరము, రెండవరాత్రి గంగాతీరము, మూఁడవరాత్రి గంగ దక్షిణతీరమందలి వనస్పతిక్రింద, నాలవరాత్రి ప్రయాగ, ఐదవరాత్రి యమునాతీరము, అఱవదినంబునఁ బగటు శ్రీరాముఁడు చిత్రకూటమునకుఁబోవునని వృత్తాంతము తెలిసికొని యా పగటి సాయంకాలమున సుమంత్రుఁ డయోధ్యచేరెను.

ఈ విధముగ నైదురాత్రుల లెక్కయందురు.

౨. కొందఱు గంగదాఁటువఱకు వనవాసిత్వములేదు గావున అపైన వనస్పతి, భరద్వాజాశ్రమ, యమునాతీర, చిత్రకూటముల నాలుగురాత్రులు నాలుగవరాత్రి సుమంత్రుఁడు బయలుదేరెను. ఐదవరాత్రి యీ వచనము.

౩. గోవిందరాజుల యభిప్రాయమేమన :—

ఆగిరిగమనంబు నానిషాదాధిపు చారులవలనను జక్కనెఱిఁగి గుహునిచే ననుజ్ఞగొని సుమంత్రుఁడు అయోధ్యాపురమునకుఁ బోయెను అని చెప్పినపిదప "చనుచున్ మూఁడవనాఁటి సంజపురముం జొచ్చి"యని చెప్పఁబడెను. కావున నయోధ్య విడిచినది మొదలు అఱవదినముండుగనా చిత్రకూటప్రవేశము. ఆవల చారులవలన నేడవదినమునో యెనిమిదవదినమునో నూతుఁ డావృత్తాంతము విని యావల మూఁడవదినము సాయాహ్నమునఁగదా యయోధ్య చేరెను. అప్పటికి పదియవదినమో పదునొకండవదినమో కావలయునే యైదవదిన మెట్లనిన సమాధానము చెప్పెదను. 'తృతీయేఽహని=మూఁడవ నాఁడనఁగా దినమున మూఁడవ భాగము సాయంకాలమని యర్థము. ఆగిరి గమనమనఁగా గమన ప్రయత్నమని యర్థము. "గుహునితో వచ్చియుంటి బహుదినంబులు నేనండ" యుచ్చుట బహు దినంబులనుటచే మూఁడు దినంబులు శృంగిబేరపురమందు

సూతుఁ డుండెను. నాలుగవదినంబున ఋజుమార్గమున రాత్రిపగలు నడచి వచ్చిన చారులవలన శ్రీరాముని చిత్రకూటప్రవేశ ప్రయత్నము విని యా దినము సాయంకాలమునఁ ద్వరగా నయోధ్యా ప్రవేశము. ఆ దినమందే కౌసల్య నేఁటి కైదురాత్రులని చెప్పెను.

౫. తీర్థీయుల యభిప్రాయము మొదటిరాత్రి, తమసాతీరము రెండవ రాత్రి, గుహపురమున మూఁడవరాత్రి, గంగాదక్షిణతీర వనస్పతి మూలమున నాలుగవ దినము ప్రయాగయందు, ఐదవదినము యమునావనమందు, ఆఱవ నాఁడు సుమంత్రుఁ డయోధ్యాప్రవేశము. ఈవిధముగ మూఁ దయిదురాత్రు లని లెక్క.

౬. ఈ వ్యాఖ్యాత యభిప్రాయమేమన :—

గంగదాఁటిన తరువాతఁగాని వనవాస దినములు లెక్కకురావనుట సరి గాదు. ఏలన :—

"వనమున నాలుగుంబదియు వర్షములుండఁగ మీరలిప్పుడే చనుఁడని చెప్పెఁ గైక యది సాగుతనేఁడు మొదల్గరాఘవా" యను సూతవాక్యమువలన విఘ్నమైన పట్టాభిషేకదినమే వనవాసమునకు మొదటి దినమని యేర్పడు చున్నది. అదియునుగాక ౬౫౮-వ పద్యమువలన వనవాసవ్రతమునాఁడే పూని నట్లేర్పడుచున్నది. కావున గంగదాఁటినతరువాత వనవాసదీక్షయనుట సరిగాఁ దోఁపదు. తమసాతీర మడవిప్రదేశమనియేకదా సీతను వాల్మీకాశ్రమమునఁ దమసాతీరమున నుంచుట. కావున రెండవ యభిప్రాయము సరిగాదు. శ్రీరా ముఁడు విడిచినది మొదలు కౌసల్యకు దినమొకయేఁడుగాని గంగదాటినది మొదలుకొనికాదు. కౌసల్యా! దశరథుల సంభాషణము పగటిపూఁటయని ౧౫౫౦వ పద్యమున సూర్యాస్తమానము చెప్పుటచే గ్రహింపవలెను. దీనిచే నైదురాత్రు లేగెననుట యుపపన్నము. ఏలన సుమంత్రుఁడు రాత్రి యయోధ్య ప్రవేశిం చెను. ఈ సంభాషణము పగటిపూఁట కావున మఱునాఁటి పగలనియే గ్రహింప వలసియుండును గాని సుమంత్రుఁడు చేరిన రాత్రిపూఁట జరిగినది యనరాదు.

మొదటిదినము రాత్రి తమసాతీరము, రెండవరాత్రి గంగాతీరము మూఁడవనాఁటిరాత్రి వనస్పతిమూలము, నాలుగవనాఁటి రాత్రి భరద్వాజాశ్ర మము, ఐదవనాఁటిరాత్రి సుమంత్రుఁ డయోధ్యాప్రవేశము, ఆఱవనాఁటి పగ లీసంభాషణము, కావున నైదురాత్రు లేగెననుట సముచితము.

గోవిందరాజులు సుమంత్రుఁ డయోధ్య చేరకముందే యీసంభాషణము జరగెనని యభిప్రాయపడినట్లు 'తద్దినే' యనుటఁచేఁ దెలియుచున్నదిగాని కథా క్రమముఁజూచిన నది సరిగాఁ దోఁపదు ఏలన నీసంభాషణము జరగుచుండఁగనే సూర్యుఁ డస్తమించెననియు రాత్రియయ్యెననియు, రాజు నిద్రించెననియు నర్ధ రాత్రమున మేల్కని మునివధ వృత్తాంతము చెప్పెననియు నది యాఱవరాత్రి

యనియు, ౧౫౮౦-౧౫౮౧-వ పద్యములవలన నేర్పడుచున్నది. ఈరాత్రి సుమంత్ర సంభాషణకెడములేదు. కావున సుమంత్రుఁ డయోధ్యప్రవేశించి శ్రీరామ వృత్తాంతము చెప్పిన పిమ్మటనే యీ సంభాషణము జరగెనని గ్రహించుట యుక్తము. గోవిందరాజులు మూఁడు దినములు పూర్ణముగా సుమంత్రుఁడు గుహునొద్దనుండెనని యభిప్రాయపడుటచే నైదును సరిపెట్ట నిట్లు వ్రాయవలసివచ్చెనని తోఁచుచున్నది. 'సాయాహ్నసమయే తృతీయేఽహని మూఁడవదినము సాయంకాలమని యర్థమగుచుండ దినమునందు మూఁడవ భాగమైన సాయాహ్నమనియర్థము చెప్పుటయందు సారస్యమేమో? దినము యొక్క సాయాహ్నమనినఁ జాలునుగదా? మూఁడవ భాగమైన సాయాహ్నమనుటయం దేమివిశేషము. కావున మూఁడవ దినమున సాయంకాలముననియే యర్థముచేయుట యుక్తము. మూఁడు దినములం దెక్కువ బలముమోపి యిక్కడ వెనుకదినము వృత్తాంతము ముందు దినము జరిగినదనుటకంటె మూఁడవదినమునఁ గొంతభాగమే సుమంత్రుఁడు గుహునితో నుండెననుట యుక్తమని యీ వ్యాఖ్యాత యభిప్రాయము. వారివారికి రుచించునట్లు వారు వారు గ్రహింపవచ్చును.

కం. చింతించుకొలఁది శోకం, బంతంతకుఁ బెరుఁగ సాగు • నభివృద్ధి నదీ
కాంతుఁడు తటినీవేగా, క్రాంతుం డయి కాంచురీతి • గతి యేమి యొకో.

నదీకాంతుఁడు=సముద్రుఁడు, తటినీ=నదులయొక్క, వేగ=వేగముచే, ఆక్రాంతుఁడయి=ఆక్రమింపఁబడినవాఁడై.

తాత్పర్యము

నదుల వేగముచే సముద్రుఁ డభివృద్ధిఁగాంచుననుు లోకోపవాద ప్రకారము ఆలోచించుకొలఁది దుఃఖ మతిశయించుచున్నది. నాగతియేమి కాకున్నదో?

తే. అనుచుఁ గౌసల్య యూరార్పఁ • నస్తమించె,
దివసనాథుఁడు రేఁ గ్రమ్మె • నవనిభుఁడు
సతిహితోక్తుల వినియును • శాంతిలేక, కన్నుగూర్కెను వగపునఁ • గలఁకపడుచు.

దివసనాథుఁడు=సూర్యుఁడు, రే=రాత్రి, సతి=భార్యయగు కౌసల్యయొక్క, హితోక్తులన్=మేలగుమాటలను, కన్నుగూర్కెన్=నిదురించెను. ఈపదము గాఢ నిద్రను సూచింపదు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పుచుఁ గౌసల్య యూరార్పఁగా సూర్యుఁడ స్తమించెను. రాత్రి వ్యాపించెను. రాజు కౌసల్యచెప్పిన హితవాక్యముల వినియును వ్యసనముచేఁ గలఁకపడుచు కన్నులు మోడ్చెను.

౬౩-వ సర్గము.

ఉ. మారుతమాత్ర, మంత నృప • ముఖ్యుఁడు మెల్లని యాత్మదోషమున్
గూరిచి చింత వేఁడివెలుఁ • గున్ గ్రసియించెడిరాహుపోలికన్

ఘోరముగాఁగఁ బైకొనుడుఁ • గోడలినిం గొడుకుం దలంచి యా
క్ష్మారమణేంద్రుఁ డాఱవనిశన్ నడురే ధవళాక్షి కిట్లనున్. ౧౪౯౧

మూరుతమాత్రము=అల్పకాలము, వేఁడివెలుఁగున్=సూర్యుని, నడురే=అర్ధరాత్రమున.

తాత్పర్యము

అల్పకాలము నిద్రపోయి రాజేంద్రుఁడు మేలుకని తానుజేసిన పాపము గుఱించిన యాలోచన సూర్యుని రాహువు మ్రింగినట్లు భయంకరముగాఁ బైకొనఁగా గొడుకును గోడలిని దలఁచి యాఱవనాఁటి యర్ధరాత్రమునఁ గౌసల్యతో నిట్లనియె.

ఇది యాఱవనాఁటిరాత్రి చర్య. ఈయాఱవనాఁటిపగలు కౌసల్య దశరథుని నిష్ఠురములాడుట. ఐదవనాఁటిరాత్రి సుమంత్రుఁడు మరలివచ్చి దశరథుని జూచుట.

-• దశరథుఁడు తాను జంపిన మునిబాలకువృత్తాంతముఁ గౌసల్యకుఁజెప్పుట•-

కం. మేలైనను గీడైనను, శీలవతీ! మనుజుఁ డెద్ది • సేయుఁ బరులకున్
వాలాయంబుగ నది ఫల,కాలంబునఁ గుడుచు వేఱ•గలుగదు చెలువా!

తాత్పర్యము ౧౪౯౨

సదాచారసంపన్నులారా! మేలుగానీ కీడుగానీ మనుష్యుఁడు పరులకు నేదిసేయునో దానిని ఫలకాలంబున ననుభవించునుగాని, యొకటి చేసిన వేఱొక ఫలము రాదు.

వాఁడువాఁడు చేసిన కర్మము వాని నీడవలె సర్వకాల సర్వావస్థల వెన్నంటియుండునేకాని విడిచియుండదు.

శ్లో॥ శయానం చానుశేతేహి, తిష్ఠంతం చానుతిష్ఠతి
అనుధావతి ధావంతం, కర్మపూర్వ కృతంనరమ్॥

మనుష్యుఁడు పూర్వము చేసినకర్మము వాఁడు పండుకొనిన నదియుఁ బ్రక్కన పండుకొనును. నిలువఁబడెనా నిలువఁబడును. వాఁడు పరువెత్తెనా యదియు వెంటనే పరువెత్తును.

శ్లో॥ యస్యాంయస్యా మవస్థాయాం యత్కరోతి శుభాశుభమ్
తస్యాంతస్యా మవస్థాయాం తత్ఫలం సముపాశ్నుతే॥

ఏ యే దశయందు నేయే శుభాశుభకార్యము చేయునో యాయా దశయందు వాఁడాఫలము ననుభవించును.

శ్లో॥ శుభేన కర్మణా సౌఖ్యం దుఃఖంపాపేన కర్మణా॥
శుభకార్యముచేసిన సౌఖ్యము పాపకర్మముచేసిన దుఃఖము కలుగును.

శ్లో॥ యథాధేను సహస్రేషు వత్సోవిందతి మాతరమ్
తథాపూర్వ కృతంకర్మ కర్తార మనువిందతి॥ మను.

దూడ వేయియావులలో నుండు తనతల్లి నెట్లు తెలిసికొనునో కర్మము కూడఁ గర్తనట్లే తెలిసికొనును.

కం. వ్యాపారారంభమునం, బ్రాపించునొ దాన శుభము • పాపఫలంబే
 ప్రాపించునొ యని చూడని,యాపురుషుఁడు బాలిశుండ•యగును గుణాఢ్యా.

దానన్ = చేయఁదలఁచిన కార్యమువలన. ౧౯౬౩

తాత్పర్యము.

ఒక కార్యము నారంభించునపుడు దానివలనఁ బుణ్యమువచ్చునా పాపము వచ్చునా యని యాలోచనలేని పురుషుఁడు మూఢుఁడే యగును.

చం. ఫలములు పూలకొద్దు లని • బాలిశుఁ డొక్కడు మావితోటలన్
 దళన మొనర్చి, యచ్చోటను • నాటుచు మోదుగుచెట్లు, వానినిన్
 జలములు పోసి యక్కజిగ • సాఁకి. ఫలాగమవేళఁ జింతవేఁ
 దలరు; విచారశూన్యులకృ•తంబులఁ గల్గు ఫలంబు లిట్టివో. ౧౯౬౪

బాలిశుఁడు = బుద్ధిలేనివాఁడు, విచారశూన్యుల = ఆలోచన లేనివారియొక్క, కృతంబులన్ = కార్యములవలన, అర్థాంతర న్యాసాలంకారము,

దీనివలనఁ బ్రతి మనుష్యుఁడు తానుజేయు కార్యమువలన మేలుకలదా కీడుకలదా యని యాలోచించి యావలశుభకార్యమునే చేయవలయును. పాప కార్యము మానవలయును.

తాత్పర్యము

పూలకొలఁది ఫలము లుండునని తలఁచి బుద్ధిలేనివాఁడొకఁడు మోదుగు పూవులను జూచి యాహా యాపూలే యింతరమ్యముగా నున్నవే వీనివలనఁ గలుగు పండ్లింకెంత మనోహరముగా నుండునో యని భ్రాంతుఁడై మామిడి తోఁటలను గొట్టివైచి వానిస్థానములందు మోదుగుచెట్లను నాటి వానికి నీళ్ళు పోసి యక్కజగలిగి చక్కఁగాఁ బెంచి ఫలములు గలిగినపుడు విచారముచే దుఃఖించును, బుద్ధిహీనులు చేయుకార్యము లిట్టివేసుమా.

కం. ఈదృగ్విధకర్మములకు, నీదృగ్విధ ఫలము లనుచు • నెఱుఁగక యెవఁడే
 నాదటఁ బను లొనరించిన, మోదుగుపెంపరినిబోలి•ముచ్చిరుఁ జుమ్మీ.

ఈదృక్విధ = ఇటువంటి, కర్మములకున్ = పనులకు, ఈదృగ్విధ ఫలములు = ఇటువంటి ఫలములు, ఆదటన్ = ప్రీతితో, పెంపరి = పెంపుచేసినవాఁడు, ముచ్చిరున్ = శోకించును.

తాత్పర్యము

ఇటువంటి కర్మములుచేసిన నిటువంటిఫలము గలుగునని యెఱుఁగక యెవఁడైనను ఆసక్తితోఁ బనులుచేసెనేని మోదుగుచెట్లను బెంచినవానివలె ఫల కాలమున శోకించును.

కం. అట్టుల యామ్రవణంబును, గొట్టి పలాశముల నాటి • కొనను ఫలంబుల్
పుట్టఁగ రామునిఁ బాసెడు, నట్టుగ మతి లేని యేను • నడలెదఁగంటే. ౧౫౯౬

ఆమ్రవణంబున్=ఆమ్ర+వనము=మామిడి వనమును, ఫలాశములన్= మోదుగులను.

ఆమ్రవణము గొట్టుట=శ్రీరాముని పట్టాభిషేకము విఘ్నపఱచియైన నడవికిఁ బంపుట, మోదుగువనము=కైకేయిని బ్రతిష్ఠించుట, ఫలము=రామవియోగము.

తాత్పర్యము

ఆ విధముగ మామిడి వనమును నఱికి మోదుగులునాటి తుదకు ఫలములు శ్రీరాముని వదలియుండునట్లు కలుగఁగా బుద్ధిలేని నే నేడ్చుచున్నాను జూచితివా, నేనుజేసిన యొకానొక కర్మమునకు శ్రీరామచంద్రుని నెడఁబాయునట్లు ఫలముకలుగఁగా బుద్ధిలేనినేను దుఃఖించుచున్నాను చూచితివా.

కం. పిన్నటనాఁటను జాపము, విన్ననువునఁ దాల్చి శబ్ద • వేధిఖ్యాతిన్
జెన్నలరుచుఁ గావించితి, మున్నొకపాపంబు నేను • మూఢుఁడ నగుచున్.

పిన్నటనాఁటన్ రూ. పిన్ననాఁటను=నేను జిన్నవాఁడనుగానున్న కాలమందు, విన్ననువునన్=నేర్పుతో, శబ్దవేధిఖ్యాతిన్=శబ్దవేధియని పేరుపడినవాఁడనై.

తాత్పర్యము

నేను జిన్నవాఁడనుగా నున్నప్పుడు విల్లుధరించి నేర్పున శబ్దవేధియని పేరొందినవాఁడనై పూర్వ మొకపాపము బుద్ధిలేనివాఁడనై చేసితిని.

కం. బాలుఁడు విషమున్ మ్రింగిన, పోలిక మోహమునఁ బాప • మును జేయారన్
లోలాక్షి! కావించితి, వాలాయము దాని ఫలము • వలసెం గుడువన్.

తాత్పర్యము ౧౫౯౭

బాలుఁడు విషమును దనచేతులఁ దీసికొని తానేమ్రింగినట్లు లజ్ఞానమునఁ జేయారఁ బాపముచేసితిని. బలవంతముగాఁ దప్పక దానిఫల మనుభవింప వలసివచ్చెను.

ఉ. పామరుఁ డొక్కరుండు సుమభాస్వరతం గని కింశుకంబులన్
గోమునఁ బెంచినట్లు సుమ • కోమల! నేనును భావ్యనర్థమున్
నామదిఁ గానలేక యిటు • నాశన మౌటకు శబ్దవేధ్యజం
బౌమహితాఘముం జలుపు • టయ్యెను, దత్కథ విన్ము చెప్పెదన్. ౧౫౯౮

సుమభాస్వరతన్=పూలకాంతిని, కింశుకంబులన్=మోదుగులను, గోమునన్ =గారాబమున, సుమకోమల బహువ్రీహి పూవువలె మృదువైన దేహముగలదానా, సుమకోమలి యనురూప మసాధువు. భావి=రాఁగల, అనర్థమున్=కీడును, శబ్దవేధ్యజంబు=శబ్దవేధివలనఁగలిగిన, మహితాఘమున్=గొప్ప పాపమును.

తాత్పర్యము

ఒకానొక జ్ఞానము లేనివాఁడు పూలకాంతిని జూచి గారాబముగ మోదుగులను బెంచినట్లు కోమలాంగీ! నేనును దానివలన రాఁగల కీడు నూహింపలేక యిటు నాశమై పోవుటకై శబ్దవేధి బాణప్రయోగముల వలన నొక గొప్ప పాపము చేసితిని. అకథ చెప్పెదను వినుము.

చం. అకృతవివాహ వప్పటికి • నబ్జముఖీ! యువరాజ నేనునున్,
    బ్రకటితరీతి నయ్యెడను • వానలకాలము దాపరించె ద
    ర్పకమద కామసంభ్రమవి•వర్ధన మై, మహిసారమున్ సహ
    స్రకరుఁడు పీల్చి ప్రేల్చుచు ర•సాస్థలి దక్షిణదిక్కుఁ జేరినన్.   ౧౬౦౦

నేను మీయింటికి వచ్చినపిమ్మట నట్టిపాపము నెన్నఁడు చేయలేదే ఎప్పుడు చేసితివనినఁ జెప్పుచున్నాఁడు.

అబ్జముఖీ = కమలమువంటి ముఖముగలదానా, అకృతవివాహవు = నీవు పెండ్లికానిదానవు, దర్పకమద = మన్మథసంబంధమైన గర్వము, కామసంభ్రమము = కామమువలనఁ గలిగిన తొట్రుపాటు, వివర్ధనమై = వృద్ధిచేయునదియై, మహిసారమున్ = భూమియందలి సారమును, సహస్రకరుఁడు = వేయికిరణములు గల సూర్యుఁడు, ప్రేల్చుచున్ = ప్రేలునట్లు చేయుచు, రసాస్థలి = భూప్రదేశము.

తాత్పర్యము

కమలముఖీ, నీకు నప్పటికి వివాహముకాలేదు. నేను యువరాజనై యుంటిని. భూమియందలి సారమును సూర్యుఁడు పీల్చి భూమిని ప్రేలునట్లుచేసి దక్షిణదిక్కు చేరఁగా మదనదర్పమును గామమువలనఁగలుగు తొట్రుపాటును వృద్ధిచేయుచు వానకాలము ప్రాప్తించెను.

ఆ. వేఁడి మాయ మయ్యె • వెలసెను మేఘముల్, స్నిగ్ధకాంతితోడ • నీట బలిసి
    కప్పకూఁత లెగసె • నొప్పుగ సారంగ, బర్హినినద మయము • వర్వె మింట.

స్నిగ్ధకాంతి = మినమినమను జిడ్డుకాంతి, సారంగ = చాతకములయు, బర్హి = నెమిళ్ళయొక్కయు, నినదము = ధ్వని, మింటన్ = ఆకాశమందు.

తాత్పర్యము

వేఁడి మాయమయ్యెను, నీటిచే బలిసిన మేఘములు మినమినలాడుచుండెను. కప్పలు కూయదొడఁగెను. చాతకములయు నెమిళ్లయు ధ్వనులాకాశమున వ్యాపించెను.

తే. జడికి ఠెక్కలపై వైపు • తడియుచుండ,
    స్నాన మొనరించినట్టు లై • శకునివితతి
    గాలివాసకు నూఁగున • గ్రములు గలుగు చెట్లకొమ్మల నెట్టెట్లొ • చేరెనపుడు.

జడికిన్ = వానకు, శకునవితతి = పక్షిసమూహము.

తాత్పర్యము

పక్షులు తమఱెక్కపైపైపున వాననీళ్ళుపడి తడియఁగా స్నానముచేసి నట్టులై గాలికి వానకు నూఁగాడు కొనలుగల చెట్లకొమ్మలయందు ఱెక్కలుతడిసి బరువగుటచేఁ గష్టముపై చేరి నిలిచెను.

కం. బోరున కురిసిన కురిసెడి, ధారలచేఁ దోఁగి మత్త•దంతియుఁ దద్వాః
పూరంబుల గిరి నిశ్చల,వారిధివలెఁ దోఁచెనపుడు•వారిజనయనా. ౧౬౦౩

తోఁగి=స్నానముచేసి, మత్తదంతి=మదించినయేనుఁగు, తద్వాఃపూరంబులన్=ఆనీటి ప్రవాహములందు, గిరివలెన్=కొండవలె, నిశ్చల = చలనములేని, వారిధివలెన్=సముద్రమువలె, తోఁచెన్=కానవచ్చెను, వారిజనయనా=కమలము వంటి కన్నులుగలదానా.

తాత్పర్యము

బోరున కురిసినట్టియు మీఁదఁ గురియుచున్నట్టియు వర్షధారలచేఁ దడిసి మదపుటేనుఁగు ఆనీటి ప్రవాహములయందుఁ గొండవలె నెత్తుగను అలలులేని సముద్రమువలెఁ గదలకయుఁ గానపచ్చెను.

కం. గైరిక ధాతుమిశ్రితగౌ, రారుణవర్ణముల శుద్ధ • మౌ సెలయేఱుల్
వారక ప్రవహించెను గాం, తారానలభస్మయుతపృ•దాకులభంగిన్. ౧౬౦౪

గైరిక=గిరియందుఁబుట్టిన, ధాతు = రంగులుగల కావిరాయి మున్నగు మన్నులతో, మిశ్రిత=కలిసినవగుటచే, గౌరము=తెలుపు, అరుణ=ఎఱుపు,వర్ణంబులన్=రంగులచే, శుద్ధము=నిర్మలమైన, సెలయేఱుల్=కొండవంకలు, కాంతారానల=కాఱుచిచ్చువలనఁ గలిగిన, భస్మ=బూడిదతో, యుత=కూడిన, పృదాకుల భంగిన్=పాములవలె.

తాత్పర్యము

కొండలయందుఁ బుట్టిన మన్నులతోఁ గలియుటచేఁ దెలుపు నెఱుపు రంగులు గలిగి శుద్ధములైన సెలయేళ్లడ్డములేక కాఱుచిచ్చువలనఁ గలిగిన బూడిదలతోఁగూడిన పాములవలెఁ బ్రవహించెను.

తే. వానకాలంబునందు నో•వనజనేత్ర, యాకులారుణతోయంబు•లగుచు నేఱు
లొడ్డులను బొర్లి పాఱుచు•నుండె! నేను,
గ్రమతర మైనయాసుఖ•కాలమునను. ౧౬౦౫

ఆకులారుణతోయంబులు=కలఁతచెందిన యెఱ్ఱనినీళ్ళు, ఒడ్డులన్=గట్టులను, క్రమతరము=మిగుల మనోహరము.

తాత్పర్యము

వానకాలమందు నేళ్ళు కలఁతచెందిన నెఱ్ఱనినీళ్ళుకలవై గట్టులపైఁ బొరలి పాఱుచుండెను. నేను మిగుల మనోహరమైన యాసుఖకాలమందు.

సీ. బాణి నై కోదండ•పాణి నై తే రెక్కి, వేఁటపైఁ దగిలిన • వేడ్కకతన
సరయూతటంబున•సారంగమహిషాది, ఘాతుకమృగములఁ•గడకఁ జంప
రేవుమాటున నొక్క•రేపూఁట నొంటిగ, నుండితి వివృతచా•పుండ నగుచు
నప్పు డాలించితిఁ • జప్పు డేనుఁగు జల, మానురవంబును•బోనిదానిఁ
తే. గటికిచీఁకటికతమునఁ • గనుల కెద్ది, చూడరాకున్న శబ్దంబు•జాడపట్టి
గజముకా నెంచి యేసితిఁ•గాండ మొండు, సర్పసన్నిభ మాధ్వని•చక్కటికిని. ౧౬౦౬

బాణినై =బాణముల ధరించినవాఁడనై, కోదండపాణినై =విల్లుచేతియందుఁ గలవాఁడనై, సారంగమహిషాది ఘాతుకమృగములన్ = ఏనుఁగులు దున్నపోతులు మొదలగు హింసచేయు మృగములను, కడఁకన్ = ప్రయత్నపూర్వకముగ, రేవుమాటునన్=జంతువులు నీళ్ళుత్రాగవచ్చు రేవునొద్ద మాటుపెట్టుకొని, రేపూఁటన్=రాత్రివేళ, వివృతచాపుండన్ = ఎక్కుపెట్టిన వింటిని గలవాఁడనై, ఆలించితిన్=వింటిని, ఆనురవంబున్=త్రాగుచున్న చప్పుడును, పోనిదానిన్=పోలినదాని, గజముకా=గజమేయగునని, కాండము=బాణము, సర్పసన్నిభము=పాముతో సమానమయినది, ధ్వనిచక్కటికిన్=ధ్వనికలిగినచోటికి సరిగా.

తాత్పర్యము

బాణము విల్లు ధరించినవాఁడనై తేరెక్కి వేఁటయందుఁగల మక్కువచేత సరయూ తీరమునందు నేనుఁగులు దున్నలు మొదలగు క్రూరజంతువులను జంపుటకై యవినీళ్లు త్రాగురేవునొద్ద మాటు కల్పించుకొని యొక రాత్రివేళ విల్లెక్కుపెట్టి యొంటరిగనుండితిని అప్పుడేనుఁగు నీళ్ళుత్రావిన చప్పుడువంటి చప్పుడు వినవచ్చెను. దట్టమైన చీఁకటి కారణముగ నేదియుఁ గానరాకయుండెను. శబ్దంబు జాడపట్టి యేనుఁగేయని తలఁచి పామువంటి బాణమును ధ్వని కలిగినచోటికి సరిగా విడిచితిని.

కం. ఘనశరము పడినచోటన, విన వచ్చెన్ హా యటంచు•విశదం బగుచున్
మనుజస్వర మచ్చట నొక,ముని నాశితబాణపాత•మున నేలఁ బడెన్. ౧౬౦౭

ఘనశరము = గొప్పబాణము- ఏనుఁగును బడఁగొట్టుటకుఁ జాలినంతది. విశదంబు=స్పష్టము, మనుజస్వరము=మనుష్యధ్వని, శితబాణపాతమునన్=పదునైన బాణముపడుటచే.

తాత్పర్యము

నాపెద్దబాణము పడినచోటనే స్పష్టముగ హాయను మనుష్యధ్వని వినవచ్చెను. నాపదునైన బాణము పడినచోట నదితగిలి మునియొకఁడు నేలఁబడెను.

సీ. పడి యిటు లనియెఁ ద•పస్వి నౌనాయట్టి,వానిపై బాణంబు•పడుట యెట్లు?
నరులు మిట్టాడని•నడురేయి నీటికై, వచ్చితి నేటి కె•వ్వండొ నన్ను
వధియించెఁగా యిట్లు•వానికి నే నేమి, యొగ్గు చేసితి నొక్కొ•యెన్నఁడైనఁ

బరహింసనము మాని•పరఁగుచు ఋషి నయి,

యాకులు నలము లా•హారముగను

ఆ. బొట్టపోసికొనుచుఁ•బూని జటాభార,ములను నారచీర•ములను గట్టి
యడవిలోన నుండు•నట్టినే నేడ నీ, క్రూరబాణమునను•గూలు టేడ. ౧౬౦౮

మిట్టాడని=సంచరింపని, ఎగ్గు=కీడు, పరహింసనము=ఇతరుల హింసిం చుట- అలంకారము విషమము- గీ, తగని వస్తుద్వయంబు సందర్భ మెచట, నైన వర్ణింపఁబడెనేని నదియ విషమ, మనఁగఁదగు నీ శిరీష మృద్వంగియెడ, నిట్టి చేతోభవ జ్వరం బేడననఁగ. తాత్పర్యము

ఆ ముని నేలఁబడి యిట్లనెను- తపస్సుచేసికొను నాయట్టివానిపై నెట్లు బాణముపడెను. నరులు సంచరింపని నడిరేయి నీళ్లకై వచ్చితిని. ఎవ్వండో నన్ను నిష్కారణముగాఁ జంపెఁగదా- వానికి నేనేమికీడు నేసమయమునఁ జేసి తినోకదా- ఇతరుల హింసించుట వదలి ఋషినై యాకులలములు దినుచుఁ గడుపునించుకొనుచు జడలుధరించి నారచీరలనుగట్టి యడవిలోనుండు నేనేడ. ఈ క్రూరబాణముచేఁ జచ్చుట యేడ.

ఉ. ఎవ్వఁడు నన్నుఁ జంపి యిటు • లేపరమార్థముఁ బొందఁ బోవునో
యెవ్వని కేమి యెగ్గు ఘటి • యించితినో, గురుతల్పగుంబలెన్
బ్రువ్వఁగఁ దిట్టకుండుదురె • భూజను లాతని, నిష్ఫలంబు గా
కెవ్వఁడిఁకేమి వాఁబుకొను • నిట్టియనర్థపుఁ జేఁత దైవమా. ౧౬౦౯

పరమార్థము=గొప్ప ప్రయోజనము, గురుతల్పగుంబలెన్=గురుభార్యను బొందినవానివలె, అనర్థపుఁ జేఁతన్=కీడుకలిగించు కార్యముచే.

తాత్పర్యము.

ఎవ్వఁడు నన్నిటు చంపి యేమి పరమలాభమును బొందఁ బోవునోగదా. వాఁడిట్లుచేయుటకు వానికి నేనేమికీడు చేసితినో. గురుభార్యను బొందినవానిఁ దిట్టినట్లు లోకులు వానిఁ దిట్టకుందురా. వాని ప్రయత్నము వ్యర్థమేకాని దైవమా నన్నుఁజంపి వాఁడేమి వాఁబుకొనను.

సీ. అక్కటా! నామృతి•కడలను గాని నేఁ, జిరకాలముగఁ బ్రోది•సేయు చున్న
వృద్ధదంపతులఁ దండ్రినిఁ దల్లిఁ దలఁచిన, గుండెలు రుల్లనుఁ;గూలువారు
నాచావు విని నంత•నాగురుల్ దిక్కేది, యింక నేగతిఁ జరి•యింపఁ గలరు
అవివేకి బాలిశుం•డైనయెవ్వఁడొ యొక్క,శరమున ముచ్వుర•సంహరించె

తే. ననుచుఁ గరుణోక్తులాడిన•నాలకించి,

నంత విరవిర పోయె నా•యుపయములు

పరమదుఃఖితుఁడై నసేఁ•బట్టియున్న,

ధనువు బాణంబుఁదనుయంత•ధరణిఁ బడియె,

అడలన్=దుఃఖింపను. చిరకాలపుగన్=దీర్ఘకాలముగ, ప్రోది=రక్షణము, వృద్ధదంపతులన్=ముసలివాండ్రగు భార్యాభర్తలను, గురుల్=తల్లిదండ్రులు-ఏకశేషము. గురువు+గుర్వీ=గుర్వ్యులు, దిక్కేది=దిక్కులేక, అవివేకి=వివేకము లేనివాఁడు, బాలిశుఁడు = మూఢుఁడు, కరుణోక్తులు = వ్యసనముతోఁగూడిన మాటలు, కరుణ + ఉక్తులు=కరుణోక్తులు.

తాత్పర్యము.

అయ్యో! నాచావునకు నేను దుఃఖింపనుగాని నేను దీర్ఘకాలముగ రక్షించుచున్న ముసలిదంపతులను నా తల్లిని దండ్రిని దలఁచిన గుండెలు ఝల్లుమనియె. ఏలన నాచావు వినినంతనే వేఱుదిక్కులేని కారణమున వారు చత్తురు. చానకున్న వారీయడవినెట్లు తిరుగఁ గలరు. ఒప్పు తప్పులు తెలియని మూఢుఁడెవఁడో యొక్కబాణమున ముగ్గురిని జంపెను. అను యేడుపుమాటలు వినఁగానే యవయవములు విరవిరపోయెను. నాచేతి విల్లుబాణములు తమయంతఁదామే నేలఁబడెను.

విల్లు బాణములు నేలఁబడెనసుటచే మొదట బాణము తప్పెనేని రెండవది వేయుటకు సంధించి యుండెనని గ్రాహ్యము.

ఉ. ఉల్లము ఝల్లనంగ సర • యూతటసీమకుఁ బోయి కంటి నేఁ
బెల్లుగ నెత్తుటం దడిసి • విద్ధఘటోదకుఁడై ధరిత్రి మే
నెల్లను ధూళి గ్రుంగి సుమ•తీ! యవకీర్ణజటాభరంబుతో
మల్లడిగొంచుఁ బొర్లుసను • మార్గణవేదనఁ గుందుతాపసున్.   ౧౯.౧౧

ఉల్లము=హృదయము, సరయూతట సీమకున్=సరయూనది తీరప్రదేశమునకు, పెల్లుగన్=విశేషముగ, విద్ధ ఘటోదకుఁడై =దొరలిన కుండలోని నీళ్లు కలవాఁడై, మేను=దేహము, గ్రుంగి=మునిఁగి, అవకీర్ణ జటాభరంబుతోన్=చెదరిన జడలసమూహముతో, మల్లడి గొంచున్ = తపించుచు, మార్గణవేదనన్ = బాణము వలనఁ గలిగినబాధచే, సుమతీ=మంచి మనస్సు గలదానా- అనుటచే నీవెప్పటికి సుమతివే, చిన్నప్పటినుండి నేనెప్పటికి నిర్దోషుల హింసించు కుమతినే యని భావము.

తాత్పర్యము

ఆ మాటలువిని గుండెలు ఝల్లనఁగా సరయూతీర ప్రదేశమునకుఁబోయి విస్తారముగ నెత్తుటిలోఁ దడిసి దొరలిపోయినకుండలోని నీళ్ళతోఁ, జెదరిన జడలతో నేలమీఁదఁబడి దుమ్ములోమునిఁగి తాపము పడుచుఁ బొర్లుచు బాణ వేదనచే బాధపడుచున్న తాపసిని మంచి మనస్సుగలదానా! గంటిని.

కం. కంటిని గనినంతన నెఱిమంటలు గన్నులను గ్రమ్మ•వాణవకుఁడు నన్
గెంటసము లాడె వాలుం, గంటీ యిట్లనుచు నేమ•నా వచియింతున్.

నెఱమంటలు=నిండు మంటలు, మాణవకుఁడు=బాలుఁడు, గెంటసముఁలు = నిష్ఠురములు, వాలుంగంటీ = దీర్ఘములైన కన్నులుగలదానా- అనుటచే నీకుండు దూరపుఁజూపు దూరాలోచనము నాకులేవని భావము.

తాత్పర్యము

చూచితిని- చూడఁగానే వాలుఁగంటీ నిప్పుజ్వాలలు కన్నులందుఁ గ్రమ్మి యుండఁగా బాలుఁడు నన్ను నీ ప్రకారము నిష్ఠురములాడెను. వాని నేనేమని చెప్పుదును.

సీ. అడవులఁ బడియుండు • నట్టినే నీ కేమి యపకృతిఁ జేసితి • నయ్య్య రాజ
గురువులు నను డప్పి • గొని నీరు దెమ్మన్న, వచ్చి నీచేతను • జచ్చినాఁడ
నను నొక్క బాణంబు • నను గొట్టి దానన, యంధులు వృద్ధులు • నైనవారు
జననిని జనకుని • సంహరించితి వీవు, దప్పిచేఁ బెదవులు • దడిపికొనుచు
తే. నెపుడు వచ్చునొ కొడు కంచు • నెదురు చూచు
చున్న వారలు సహియింప • నోర్తు రెట్టు ?
లిలను బడియుండు నన్నెట్టు • లెఱుఁగుఁ దండ్రి ?
శ్రుతము నాతపమును ఫల • శూన్య మయ్యె. ౧౬౧౩

తాత్పర్యము.

ఓయిరాజా! యడవులందు నొంటిగఁ బక్షులవలెఁ బడియుండు నేను నీకేమి యుపకారము చేసితినయ్యా! నా తల్లి దండ్రులు దప్పిగొని నన్ను నీళ్లు దెమ్మని చెప్పఁగా వచ్చి నీచేతను జచ్చితిని. నన్ను నొక్కబాణముచేఁగొట్టి వృద్ధులు గ్రుడ్డులునైన నాతల్లిదండ్రులనుగూడఁ జంపితివి, దప్పిచేఁ బెదవులను నాలుకతోఁ దడుపుకొనుచు మాకొడు కెప్పుడు వచ్చునాయని కాచి వేచి యున్న వారీవార్తపిని యెట్లు సహింతురు. నేల కఱచుకొని పడియుండు తండ్రి నన్నెట్లు తెలిసికోఁగలఁడు- నేను విన్నది నాతపము ఫలహీనమై పోయెఁగదా. వానికిదియా ఫలము.

ఉ. కన్నులు లేవు రోయఁ, గొడు • కా యని యేడ్చుచు నుందు రింటనా
యున్నవిధం బెఱుంగ, నెవ • రో వచియించెడివారు వారి, నా
పన్నులెఱింగి రేని నడు • వంగను నేరనివారు వార లే
తెన్నున నన్ను రోసెదరు • ద్రిమ్మరి త్రిమ్మరి గుట్ట గుట్టయున్. ౧౬౧౪

రోయన్=వెదుకుటకు, ఆపన్నులు=ఆపద్దశయందుండువారు, తెన్నునన్= మార్గమున.

తాత్పర్యము

నన్ను వెదకుటకా వారికిఁ గన్నులు లేవు. కావున నింటిలోనే పడి కొడుకా కొడుకాయని యేడ్చుచుందురు. అంతకు మించి వారేమి చేయఁగలరు. నిర్మానుష్యమైన యీయడవిలో వారికినాగతి చెప్పువారెవరు? ఒకవేళఁనెవరైనఁజెప్పి రనుకో నడువను లేనివారు గుట్టగుట్ట తిరిగి తిరిగి యేవిధముగ నన్ను వెదకఁ గలరు.

ఆ. నఘుపలేనివాఁడు♦నాగతి యెఱిఁగియు, నేమి సేయఁ గలఁడు♦వృద్ధుఁ డకట
గాలిఁ గూలుచెట్టుఁ♦గాలునే కావంగ, నుర్విఁ గూలుచున్న♦యొండు ద్రాని.

తా త్ప ర్య ము

నే నిచటఁ బడియున్నానని యెవరైనఁ జెప్పఁగాఁ దెలిసికొన్నాఁడనుకో తెలిసికొనియుఁ గాళ్లులేని వాఁడేమిచేయఁగలఁడు. అందు వృద్ధుఁడు. గాలికిఁబడి పోవు నొకచెట్టు తనవలెనే నేలఁబడుచుండు మఱియొకచెట్టును గావఁగలదా.

చం. అరుగుము నీవ రాఘవ! ర♦యంబునఁ దండ్రి వసించుచోటి కీ
వరుగకయున్నశాప మిడు ♦ నాగ్రహ మెత్తి; దవంబు కాన నాఁ
బరుషత నిన్ను నీక్షణము ♦ భస్మము సేయుఁ, దదాశ్రమంబుఁ బోఁ
దెరు విటు కాల్త్రోవ యదె ♦ తెప్పున శాంతుని జేయు తండ్రినిన్. ౧౬౧౬

రాఘవా=దశరథా- ఇట్లు సంబోధించుటచే నింతకుఁబూర్వ మీబాలుఁడు దశరథునిఁ జూచియున్నట్టు లూహింపవలయును. రాజు వేటకై యీ ప్రాంతములఁ దిరుగునపుడు చూచియుండవచ్చును. దవంబు=కొఱుచిచ్చు, కానన్=అడవినో యన్నట్లు.

తా త్ప ర్య ము

దశరథా నీవు త్వరగా మాతండ్రి వసించుచోటికిఁ బొమ్ము. నీవు పోక పోయితివా వారు చిచ్చడవిని గాల్చునట్లు నిన్నుఁ గోపమున శపించి దహించి యీ క్షణమ భస్మముచేయుదురు. ఆయాశ్రమమునకుఁ బోవుమార్గమిదియే. ఇటు త్వరగాఁ బోయి మాతండ్రి కోపింపకుండ శాంతుని జేయుము.

కం. నీ వతని వేఁడుకొన్నను, నీవలనం గినుక గొనఁడు ♦ నీశర మింకన్
భూవర దీయుమ యసుబు న,దీవేగం బిసుకతిన్నె♦తీరునఁ గోసెన్. ౧౬౧౭

కినుక గొనఁడు=కోపింపఁడు, అసుబు=ప్రాణము.

తా త్ప ర్య ము

నీ వాయనను ప్రార్థించితివా నీయందుఁ గోపింపఁడు- ఏటివేగ మిసుక దిన్నెను గోయునట్లు నీ బాణము నా ప్రాణములను దెగఁగోయుచున్నది. కావున నీ బాణమును నూడఁ దీయుము.

కం. అనవుడు బాణముఁ దీయమిఁ, దనువేదన దుస్సహంబు♦దానిం దీయన్
దనువు దొఱంగు నటంచును, వనటం బడునన్ను దీను♦బాలుం డనియెన్.

తా త్ప ర్య ము

బాణమును దీయకుంటినా బాధ సహింపరాదు. తీసితినా ప్రాణముపోవును. ఏమిచేయుదునా యని దుఃఖపడుచుండు నన్నుఁజూచి బాలుఁడిట్లనియెను.

చం. అడలకు మయ్య తీయ భవ♦దాశుగ మిప్పుడు బ్రహ్మహత్య వ
చ్చెడు నని, తద్భయంబు మది♦జేర్పకు, నేను ద్విజుండఁగాను జూ;

పొడమితి శూద్రకాంతకును ♦ భూమిప వైశ్యున; కంచు వేదనన్
బుడమిని బొర్లి సొమ్మసిలెఁ ♦ బోఁడు పల్కఁగలేక తోలుచున్. ౧౬౧౯

భవదాశుగము=నీ బాణము- వైశ్యునకు శూద్రస్త్రీయందుఁ బుట్టినవాఁడు కరణజాతివాఁడు- వైశ్యాత్తు కరణః శూద్ర్యాం విన్నాస్వేష్వ విధిస్మృతః వైద్యనాథీయము, పోఁడు=బాలుఁడు. ఉత్తమజాతి పురుషునకు నధమజాతి స్త్రీకి జనించినవాఁడు తండ్రి జాతివాఁడు కాఁజాలఁడు. రావణాసురుఁ డిట్టివాఁడే కదా?

తాత్పర్యము

రాజా నీ బాణము దీసినయెడల నేను మరణింతును. నేను మరణించితినా నీకు బ్రహ్మహత్యవచ్చునని భయపడకుము. నేను బ్రాహ్మణుఁడనుగాను. నేను వైశ్యునకు శూద్రస్త్రీయందుఁ బుట్టినవాఁడను అని చెప్పి బాధపడలేక భూమి మీఁదఁబడి బాలుఁడేడ్చుచు శ్వాసపుచ్చుచు మాటాడలేక మూర్ఛపోయెను.

ఆ. నెఱఁకు నాటి యున్న ♦ కఱకుబాణమువానిఁ, బలుకలేనివాని ♦ వణఁకువానిఁ
బొరలువానిఁ జేష్ట ♦ పొలిసినవాని మేన్, ముడుఁచువానిఁ గాంచి ♦ ములికిఁ బెఱుక

నెఱఁకు = మర్మస్థానము.

తాత్పర్యము

మర్మస్థానమందుఁ గ్రుచ్చికొనియుండు బాణముగలవానిని, మాటలాడలేని వానిని, వణఁకుచుండువానిని, నేలపైఁ బొరలాడువానిని, జేష్టలుడిగినవానిని, దేహము ముడుఁచుకొన్నవానిని, గాంచి బాణము నూడఁదీయఁగా.

కం. ఆతండు నన్నుఁ గనుచున్, భీతుండై ప్రాణములను ♦ విడిచెన్ నే నా
పూతచరిత్రకునిన్ సర,యూతీరశయాను గాసి ♦ నూర్చెడివానిన్. ౧౬౨౧

భీతుండై=తన తల్లిదండ్రుల గతియేమో యని భయపడినవాఁడై నీవు పోయి చెప్పుమని యర్థము సూచించు దృష్టుల నన్నుఁజూచుచుఁ బ్రాణములను విడిచెను. నేనో యా పవిత్రచరిత్రముగలవానిని సరయూనది యొడ్డునఁబడి యుండువాని బాధచే నూర్పులు పుచ్చువానిని.

కం. జలములఁ దడిసిన మేనిం, గలవానిని జూచి చూచి ♦ కళవళపడుచున్
విలపించితి విలపించితిఁ, జెలియా! నాకెట్టియఘము ♦ చేపడె ననుచున్.

తాత్పర్యము ౧౬౨౨

దొరలినకుండ నీళ్లచేఁ దడిసిన దేహముగలవానిని జూచి చూచి యయ్యో నా కెటువంటి పాపము సంభవించెనని యూరక యేడ్చితిని.

సప్తవ్యసనములలో రెండువ్యసనములఁ జెడినవానికి (స్త్రీవ్యసనము, వేఁటవ్యసనము) దశరథుఁడే దృష్టాంతము.

కం. అని చెప్పి మునికుమారుని, మనమునఁ దలపోసి యేడ్చె ♦ మానిని కనియెన్
జనపతి మునిపతిఁ గానఁగ, జనుటయె నేమంబొ కాక ♦ చనమియ మేలో.

తాత్పర్యము.

అని యీ ప్రకారము చెప్పి యాముసికుమారునిస్థితి మనస్సునకు రాఁగాఁ గన్నులఁగట్టినట్లె యేడిచి మరలఁ గౌసల్యతో నిట్లనెను. దేవీ! యావల నే నిట్టు లాలోచించితిని. మునీశ్వరు నే నిపుడుపోయి చూచుట మేలా. అక్కడికిఁ బోక యుండుట మేలా?

కం. పొరపాటున నాకెంతటి, దురితము ప్రాపించె ననుచు•దురపిల్లుచు నేఁ
బరమోదక మాఘటిఁ గొని, యరిగితి వినియున్నత్రోవ•నాశ్రమమునకున్. ౧౬-౩౪

పొరపాటు=ప్రమాదము, దురితము=పాపము, దురపిల్లుచున్ = దుఃఖించుచు, ఘటిన్=కుండయందు.

ప్రమాదవశమున నాకెటువంటి పాపము వచ్చెనురా దైవమా యని దుఃఖించుచు నానదీ తీర్థమును నాకుండయందుఁ దీసికొని బాలుఁడు చెప్పఁగా వినియున్న త్రోవనుబట్టి యాశ్రమమునకుఁ బోయితిని- చీఁకటి వ్యాపించినట్లు ముందు చెప్పఁబడెను.

వెలుతురున కేమి యుపాయముచేసెనో. వైద్యుత దీపమువంటిదేదైన నొక సదుపాయము నలునియొద్ద నున్నట్లుండె నేమో. శృంగార నైషధమునఁ బడుకటింటి వర్ణనము చూడుఁడు. (౪ ఆ. ౧౬౯ ప.)

చం. నడువఁగలేనివారి, నయ • నంబులు గాననివారి, వృద్ధులై
వడఁకెడిమేనివారి, హత • పక్షఖగంబులఁ బోలువారలన్,
బడుగుల, నింత సేపయిన • బాలుఁడు రాఁడు జలంబుఁ గొంచు నం
చడలెడివారి, మత్కృతని • రాశులఁ, గంటిని యత్నహీనులన్. ౧౬-౩౫

హతపక్షఖగంబులఁబోలు వారినిన్ = కొట్టఁబడినఱెక్కలుగల పక్షులవంటి వారిని. బడుగులన్=మిక్కిలి ముసలివాండ్రను, అడలెడివారిన్ = పరితాపపడెడి వారిని, మత్కృతనిరాశులన్ = నాచే నిరాశులుగఁ జేయఁబడినవారిని, యత్నహీనులన్=కేవలము పరాధీనులై- తమకుఁదా మేమియుఁ జేసికొన నేరనివారిని- చూచితిని.

తాత్పర్యము.

నడువలేనివారిని, గన్నులులేనివారిని, ముసలులై దేహములు వణఁకువారిని, ఱెక్కలు తెగఁగొట్టఁబడిన పక్షులవంటి వారిని, మిగుల ముదుసళ్లను, నింతకాలమయ్యెనే నీళ్లు తీసికొని పిల్లవాఁడు రాఁడాయెఁగదాయని తపించువారిని, ఆవిషయమున నాచే నాశలేనివారుగాఁ జేయఁబడినవారిని, పరాధీనులై యేమియుఁజేసికొనలేనివారినిఁ జూచితిని.

కం. మునిపుత్రునిఁ జంపిన పెన్వనటన్ వ్యాకులత నొంద•స్వాంతము వెఱచే
తన గుండె లదుర నాశ్రమ,
మును డాసెడికొలఁది వగపు•ముమ్మర మయ్యెన్. ౧౬-౭౬

వనటన్=శోకముచే, స్వాంతము=మనస్సు, వ్యాకులతనొందన్=కలవర పడుచుండఁగా, వెఱ=భయము, ముమ్మరము=అధికము.

తాత్పర్యము

మునికుమారుని జంపితినిగదా యను పెద్ద దుఃఖముచే మనస్సు వ్యాకుల పడుచుండ నాశ్రమము సమీపించుకొలఁది గుండెలు కొట్టుకొనుట యెక్కువ కాఁగా దుఃఖము విశేషించెను.

తే. కాలిచప్పుడు వారింత•యాలకించి,యెంత సేపాయెరా తండ్రి•యిదిగొ సున్న
యేటినీటికి నీ వేఁగి•యింతతడవు, తడయఁగాఁ జెల్లునా నీకుఁ•గొడుకుఁ గున్న.

ఆలకించి = విని, తడయఁగాన్ = ఆలస్యము చేయఁగా, ఇదిగొ = ఇది సామీప్యమును దెలుపును.

తాత్పర్యము

దూరమునందే నాకాలి చప్పుడు వారు కొంచెముఁవిని కొడుకువచ్చెఁగదా యని తలఁచి కుమారా యీ సమీపముననున్న యేటికిఁబోయి వచ్చుటకు నెంత సేపు చేసితివిరా తండ్రీ! యింత యాలస్యము చేయవచ్చునా చిన్నినాయనా.

ఉ. నాలుక లెండ మాకు నిట • నాయన! నీటికిఁ బోయి యాటలన్
గాలముఁ బుచ్చు చుంటి గద • కాలవిళంబన మైన రాఁడుగా
బాలుఁ డటంచుఁ బెన్వగపు • పాటునఁ దూలెడి నీదుతల్లియున్
నీళులు దెమ్ము, యెన్నఁడిది • నేరవు, నేఁడ యి దేల పుత్రకా! ౧౬-౭౮

కాలవిళంబనము=జాగు, పెన్వగపుపాటునన్=గొప్ప దుఃఖముచే.

తాత్పర్యము

నాయనా! మాకు నాలుక లెండిపోవుచున్నవే నీటికై పోయి మాకష్టము లాలోచింపక యాడుకొనుచుంటివికదా. ఇంత తడవాయెనే నాకొడుకు రాఁడా యెనే యని నీతల్లి యెంత దుఃఖించుచున్నదో యెఱుఁగవుకదా. ఇప్పుడైనను నీళ్లు దెమ్ము. ఎప్పుడిట్లు సేయవే ఈ దినమే యిట్లు చేసితివేల తండ్రీ!

ఉ. తప్పుగ నెంచఁ బోకుము సుతా! నిను నేమొ త్వదీయమాతయేన్
దప్పులు పట్టి యుండినను • ధన్యుఁడ వీవు తపోధనుండ! మా
తెప్పయు నీవ, మాగతియు • దృష్టియు నీవ, యటంచుఁ బ్రాణ మే
మెప్పుడు నీపయి న్నిలుప • నేటికిఁ బల్క వయో కుమారకా! ౧౬-౭౯

త్వదీయమాత = నీతల్లి.

తా త్ప ర్య ము.

పుత్రా నేనుగాని నీతల్లిగాని యెప్పుడైన నిన్నుఁ దప్పు పట్టి యుండితి మేని యది దోషముగా నెంచకుము- నీవు తపోధనుఁడవు. మాతాపితృ శుశ్రూషచే ధన్యుఁడవు. ఈ సంసారసాగరము దరించుటకు నీవే మాకుఁ దెప్పవు, మాకు గతులు కల్పింపవలసినవాఁడవు నీవే- మాదృష్టులు నీవేయని మాప్రాణము లన్నియు నీ మీఁద నిలిపియుండఁగా నేలరా నాయనా మాటలాడవు.

ఆ. కనులు లేనిమాకుఁ • గనులు నీ వనుచును, దిక్కు లేనిమాకు • దిక్కు నీవ
యనుచు నమ్మియుండ • నగునయ్య నీ కిట్లు, ను పేక్ష సేయ • మహితచరిత.

తా త్ప ర్య ము

కన్నులులేనిమాకు నీవే కన్నులు- రక్షకుఁడులేని మాకు నీవే రక్షకుఁడవు. అని నమ్మియుండఁగా నీవు ముపేక్షింప దగునా.

ఆ. అనుచు నీరెలుంగు • నను దొట్రుపాటునఁ, బలుకు చున్నయట్టి • పరమమునిని
జేరఁ బోయి చెనఁటి • సేఁత భీతిల్లుచు, నల్లనల్ల నిట్టు • లంటి నేను. ౧౬౩౧

ఈ రెలుంగునన్=సన్ననిగొంతుతో, తొట్రుపాటునన్ = తొందరపాటున, చెనఁటిసేఁత=నేను జేసిన చెడ్డపనికై, భీతిల్లుచున్=భయపడుచు, అల్లనల్లన్ = మెల్ల మెల్లగా.

తా త్ప ర్య ము

అనియిట్లు సన్న గొంతుతోఁ దొందరపాటుతో మాటలాడుచున్న యా మునిశ్రేష్ఠుని యొద్దకుఁబోయి నేను జేసిన పాపకార్యముఁ దలఁచి భయపడుచు మెల్ల మెల్లగా నిట్లంటిని.

ఉ. పుత్రుఁడఁగాను మీకు, ముని • పుంగవ! పంక్తిరథుండఁ బేరునన్,
క్షత్రియుఁడన్, మహాఘమును • సజ్జనగర్హితమైన నీచచా
రిత్రము నల్పి పొందితిని • నే సరయూతటభూమి వేఁటకై
గాత్రము డాఁచి హస్తమున • గార్ముకముం గొని వేచి యుండఁగన్. ౧౬౩౨

పంక్తిరథుండన్ = దశరథుండను- పఙ్క్తియని వ్రాయుట సంస్కృత వ్యాకరణానుసారి యైనను నాంధ్రభాషయందట్టి సంయోగములేదు. తత్సమములనను నాసికస్థానమున బిందువే వచ్చును. "సింగంబాఁకటితో గుహాంతరము నం జేడ్పాటుమైనుండి మాతంగ స్ఫూర్జిత" యని తిక్కనయు "నిండుమనంబున వ్యనవనీత సమానము పల్కుదారుణా ఖండల శస్త్రతుల్యము" అని నన్నయ భట్టారకుఁడు. మఱి నాంధ్రకవులందఱు నిట్లే ప్రయోగించినారు గాని తద్విరుద్ధ ప్రయోగమొకటియైన లేదు. మహాఘము=గొప్ప పాపము, సజ్జన గర్హితము = సాధువులచే నిందింపఁదగినది, నీచ చారిత్రము = క్షుద్రపు నడవడి, రే=రాత్రి, సరయూతటభూమి=సరయూనది తీరప్రదేశమునకు, గాత్రము=దేహము, డాఁచి =మఱుఁగు పఱిచి, కార్ముకము=విల్లు, వేచి = కాచుకొని,

తాత్పర్యము

మునీంద్రా! మీకు నేను బుత్రుఁడనుగాను. నాపేరు దశరథుఁడు- నేను క్షత్రియుఁడను- సత్పురుషులు నిందించు నీచపు నడవడిని ప్రవర్తించి గొప్ప పాపము సంపాదించితిని. ఈ రాత్రియందు సరయూతీర భూమికై వేఁటకై వచ్చియుండి దేహముదాఁచి చేతవిల్లుగొని మృగమునకై కాచియుండఁగా.

చం. బుడబుడ మన్న నాదము త♦పోధన, వీనుల వింటి నాదుస
 వ్వడి నది కుండ ముంచెడిర♦వం బని యెంచక దంతి నీళ్లు ద్రా
 వెడినులి వన్న భ్రాంతి వెస♦ వేసి శరంబున డాసి యొమ్మునన్
 బెడిదపుటమ్ము నాట ధర♦ వ్రీలినమౌని నొకండుఁ జూచితిన్. ౧౬౩౩

నాదము=చప్పుడు, తపోధన=తపస్సే ధనముగాఁ గలవాఁడా,వీనులన్=చెవుల, నాదుసవ్వడి=ధ్వనిజాడ, దంతి=ఏనుఁగు, ఉలివు = చప్పుడు, బెడిదపు టమ్ము=భయంకరమైన బాణము, వ్రీలిన=పడిన.

తాత్పర్యము

తపోధనా యిట్లు నేను బొంచి కాచియుండఁగా నీళ్ళలో బుడ బుడ మను చప్పుడు వినవచ్చెను. ధ్వనిజాడఁబట్టి యది కుండముంచెడి ధ్వనియని తలంపక యేనుఁగు నీళ్ళుత్రావు చప్పుడని తలఁచి శీఘ్రముగ బాణముతో వేసి దగ్గఱఁ బోయి యొమ్మున బాణము నాటఁగా నేలఁబడియున్న యొక మనుష్యునిఁ జూచితిని.

కం. అనఘాత్ములార! వనగజ,మును జంపఁగ నీట బాణ♦మును విడిచిన మీ
 తనయుని నది వధియించెను, వినిపించె నతండు తనదు♦వృత్తాంతంబున్.

అనఘాత్ములారా=పాపములేని మనస్సులుగలవారలారా, వనగజమును =అడవియేనుఁగును, వధియించెన్=చంపెను.

తాత్పర్యము

పుణ్యాత్ములారా! యడవియేనుఁగును జంపుటకై నేను ప్రయోగించిన బాణము మీకొడుకును జంపెను. అతఁడే తనవార్తయంతయుఁ దెలిపెను.

ఉ. ఆతనిమాటచొప్పునన ♦ యాశుగముం బెఱుకంగ నాతఁడున్
 హా తలిదండ్రులార! ముది♦యంధకులార! యటంచుఁ గూలె నే
 నాతనిబోధపద్ధతి మ♦హాత్మకులార! కనంగ వచ్చితిన్
 బాతకి వీని మీమనసు♦వచ్చినరీతి నొనర్పుఁ డింకిటన్. ౧౬౩౪

ఆశుగము = బాణము, అంధకులార = గ్రుడ్డివారలారా, బోధపద్ధతిన్ = ఆయన బోధించిన మార్గమున, పాతకిన్=పాపిని.

తాత్పర్యము

అతని మాటప్రకారము బాణము నూడఁబీకఁగా నతఁడు హా తల్లిదండ్రు లారా ముసలి గ్రుడ్డులారా యని చచ్చెను. నేనాతఁడు నేర్పినమార్గమున

మిమ్ముఁ జూడ వచ్చితిని. ఈపాపాత్ముని నిఁక మీమనస్సువచ్చినట్లు చేయుఁడు.

క్షమింపుఁడనికోరక మీ యిష్టమువచ్చినట్లు చేయుఁడననేల? పాప మతి ఘోరమైనది, క్షమింపదగినది కాదని యంతరాత్మ చెప్పుచున్నది. దండింపుఁ డనుటకు నోరురాలేదు. కావున మీయిష్టమువచ్చినట్లు చేయుఁడనెను.

కం. మీసుతు నజ్ఞానంబున, నే సంపితి నిమిషమునను•నిజ మిది నేనో
దోసిని ననుఁ గరుణింతురొ, శాసింతురొ యిచ్చకొలఁది•సలుపుఁ డటన్నన్.

అజ్ఞానంబుననే=తెలియమిచేతనే, సంపితిన్=వధించితిని, దోసిన్=దోషము చేసినవాఁడను, శాసింతురొ=దండింతురో, ఇచ్చకొలఁది=ఇష్టముచొప్పున.

తాత్పర్యము

మీకొడుకును నే నజ్ఞానముచేతనే నిమిషములోఁ జంపితిని- ఇది నిజము. నేను దోషము చేసినవాఁడనే నాయందు దయయుంచి మన్నించుటయు దండించుటయు మీయిష్టము. ఎట్లుచేసినను జేయుఁడు.

చంపు శబ్దము రూపాంతరము సంపు 'సారంగాహితమున్ సంపెఁగన హర్షమేపునఁ బొదలన్- హరిసల ౨-౨ అ. దశరథుఁడు తనదోషమును జెప్పు కొనుటచే నల్పదండముతో క్షమింపఁబడెను. పశ్చాత్తాపమున సగముపాపము పోవును గొప్పవారియెడల నపరాధము చేసినవారు తమయపరాధమును జెప్పు కొని క్షమింపవేఁడుట శ్రేయస్కరము. సరకముదప్పును. ఇట్లుచేయని కారణము చేతఁగదా పరీక్షితుఁ డట్లువచ్చెను.

ఉ. పాపభయంబుచే వగపు•పాటున నా యనినట్టి కర్కశా
లాపము వీనులం బడఁ బ్ర•లాపము సేయుచు నుష్ణబాష్పధా
రాపరిణాహ మారఁగ భ•రంపడి యూర్చుచుఁ బల్లటిల్లుచున్
దాపున నున్న నన్ను ముని•తల్లజుఁ డిట్లని పల్కె నార్తుఁడై. ౧౯౩౪

వగపుపాటు=వ్యసనపడుట, కర్కశాలాపములు = కఠినములైన మాటలు, వీనులన్=చెవులయందు, ప్రలాపము=ఏడుపు, ఉష్ణబాష్ప=వేఁడికన్నీళ్ళ, ధారా= ధారలయొక్క, పరిణాహము=ఎక్కువ, పల్లటిల్లుచున్=దుఃఖించుచు.

తాత్పర్యము

పాపభయముచేతను వ్యసనముతోడను నేను బలికిన కఠినపు మాటలు చెవులఁబడఁగానే గట్టిగాఁ గొడుకా కొడుకా యని యేడ్చుచు వేఁడి కన్నీళ్ల ధారలు ప్రవాహముగాఁ బాఱఁగా నిట్టూర్పు లధికముగా నూర్చుచుఁ దపించి యార్తుఁడైన యా మునిశ్రేష్ఠుఁడు సమీపమునందున్న నన్నుద్దేశించి యిట్లు పల్కెను.

శా. వానప్రస్థునిఁ జంపి క్షత్రియుఁడె ని•ల్వం జాలు? నా వజ్రియేన్
స్థానభ్రష్టత మిక్కిలిం గనఁడె ప్ర•జ్ఞాపూర్వముం జేసినన్

క్ష్మానాథా! బ్రదుకంగఁ గంటి నిటు ప ♦ శ్చాత్తాప మారంగ నీ
వే నీపాపముఁ జెప్పుటన్; శిరము కా ♦ దేన్ బోదె వేవ్రక్కలై. ౧౬౩౮

వజ్రి=ఇంద్రుఁడు, స్థానభ్రష్టతన్=పదవినుండి పడినవాఁడగుటను, ప్రజ్ఞా పూర్వమున్=బుద్ధిపూర్వకముగా.

తాత్పర్యము

రాజా! వానప్రస్థునిఁజంపి క్షత్రియుఁడా బ్రతుకఁగలవాఁడు. బుద్ధిపూర్వకముగఁ జేసినవాఁడు దేవేంద్రుఁడైనను నాపదవినుండి పడిపోఁడా. నీవు పశ్చాత్తాపము గలవాఁడవై నీపాపమును నీవేచెప్పుటచేత బ్రదుకఁ గలిగితివి. నీవు చెప్పకుండితివేని నీతల యావెంటనే వేయివ్రక్కలై పగిలియుండదా.

చం. ఎఱిఁగి యెఱింగియున్ ముని న ♦ హీనతపోధను బ్రహ్మవాదినిన్
గఱకుశరంబునం దునుమఁ ♦ గాఁ దల గూలెడి నేడువ్రక్కలై
మఱకువఁ జేయుటం గలిగె ♦ మన్గడ నొంద, నెఱింగి చేసినన్
నెఱి రఘువంశమే చెడదె ♦ నీ వన నెంతటివాఁడ వోనృపా. ౧౬౩౯

అహీనతపోధనున్=అధికతపమే ధనముగాఁ గలవానిని, బ్రహ్మవాదినిన్=బ్రహ్మజ్ఞానము గలవానిని, కఱకుశరంబునన్=పదునైన బాణముచే, తునుమఁగాన్=నఱకఁగా- చంపఁగా, మఱకువన్=అజ్ఞానముచే, మన్గడ=బ్రతుకుపాటు.

తాత్పర్యము

తెలిసి తెలిసి మునిని, గొప్పతపమే ధనముగాఁ గలవానిని, ఆత్మజ్ఞానిని, బదునైనబాణమున ఖండించిన వానితల యేడుతునుకలై నేలఁబడును. నీవజ్ఞానముచేఁ జేయుటవలన బ్రదుకఁ కలిగితివి. తెలిసియే నీవు చేసియుండిన నీరఘువంశమే మూలముట్టుగ నశించియుండదా. నీవన నెంతమాత్రము.

ఈ వానప్రస్థుని వాక్కులవలనఁ దెలిసి చేసినపాపమున కెక్కువ శిక్షయనియుఁ బ్రమాదమునఁ జేసినదానికిఁదక్కువ శిక్షయనియు నేర్పడుచున్నది.

అకామతః కృతేపాపే, ప్రాయశ్చిత్తం విదుర్బుధాః
కామకార కృతేప్యాహు, రేకే శ్రుతి నిదర్శనాత్.

తెలియకచేసిన పాపమునకుఁ బ్రాయశ్చిత్తము గలదని పండితులు చెప్పుదురు. మఱికొందఱు బుద్ధిపూర్వకముగఁ బాపము చేసినను బ్రాయశ్చిత్తము కలదని శ్రుతివాక్యమువలనఁ జెప్పిరి.

ఇట్లనుటచేఁ బ్రమాదమునఁ జేసినపాపమునకు లఘుదండన మనియుఁ దెలిసిచేసిన దానికిఁ గ్రూరదండ మనియు నేర్పడెను.

ఉ. ఎచ్చట మాసుతుండు పడి ♦ యెన్ నృప! తోడ్కొని పొమ్ము మమ్ము నీ
నచ్చటికిం దనరాజు రుధి ♦ రార్ద్రశరీరుఁ బ్రకీర్ణజూటుఁడై

చచ్చి ధరాస్థలిన్ యమవశంగతుఁడై పడియున్న పుత్రు లో
నిచ్చ జనించెఁ జూడ నన నేఁ గొనిపోయితి వారి నిద్దఱన్. ౧౬౪౦

తనూజున్=కొడుకును, రుధిరార్ద్ర శరీరున్=నెత్తుటిచేఁ దడిసిన దేహము గలవానిని, ప్రకీర్ణజూటుఁడై=విరిసిన జడలు గలవాఁడై, యమవశంగతుఁడై=యమునకు వశపడినవాఁడై.

తాత్పర్యము

రాజా! మా కుమారుఁడెక్కడఁ జచ్చిపడి యున్నాఁడో యక్కడికి మమ్ముఁ దోడుకొని పొమ్ము. నెత్తుటఁదడిసిన దేహముతో విరిసిన జడలతోఁజచ్చి మృత్యుదేవతవశుఁడై నేలఁబడియున్న కొడుకును జూడ మాకుఁ గోరిక కలిగెను అనిన నేను వారి నిద్దఱ నచ్చటికిఁగొని పోయితిని.

— ఋషి తనపుత్రునకై విలపించుట. —

ఆ. కాలధర్మమొందిఁ గూలిన నిజపుత్రుఁ, దడవి తడవి చూచి తండ్రి యనియె
నేల పుత్ర! తండ్రి యేతెంచియుండిన, దండ మిడవు నీకు దగునె యిట్లు.

కాలధర్మము = మృతి.

తాత్పర్యము

చచ్చి నేలఁబడిన తనకొడుకును దేహము నిమిరినిమిరిచూచి తండ్రి యిట్లనియె. పుత్రా తండ్రి నీసమీపమునకు నేను వచ్చినపుడు నీవు నాకు నమస్కరింపకుండుట నీకు ధర్మమా? పెద్దవారు తనయొద్దకు వచ్చినపుడు కూర్చుండిన పిన్నవారు లేచి కులధర్మపద్ధతి నమస్కరింపవలెనని నీతిబోధ.

ఉ. అయ్యయొ నాతనూజ! పలుకాడ విదేమిర, కోప మేలరా,
యియ్యెడ నేలపైఁ బడిన దేటికిరా, యొకమాట చెప్పరా,
నెయ్యము నాపయిం గలుగ నేరద యేనియుఁ దల్లిఁ జూడరా,
తియ్యనివల్కు వల్కర, మదిన్ వగ పాయఁగఁ గౌఁగిలింపరా. ౧౬౪౧

తనూజా = కొడుకా.

తాత్పర్యము

అయ్యయ్యొ కొడుకా యేలరా మాటలాడవు. ఏలరా నాపైఁ గోపగించితివి. నేలమీఁద నిప్పుడిట్లేలరా పడితివి. ఒక్కమాట యేదైనఁజెప్పరా నామీఁద నీకు స్నేహములేదేని నీతల్లినైనఁ జూడరా. తియ్యని పలుకొకటి పలుకరా నాయనా మాదుఃఖము తీరఁ గౌఁగిలింపరా.

కం. క్రమమారఁగఁ గమహృదయం, గమముగ శాస్త్రాది సకల కళల నపరరా
త్రములందు నెవఁడు చదువఁగ, సమలమతీ యింక వీనులారఁగ విందున్.

క్రమమారఁగన్=క్రమము దప్పింపక, హృదయంగమముగన్=మనస్సునకింపుగ, శాస్త్రాది సకలకళలన్ = శాస్త్రము మొదలగు సకల కళలను, అపర

రాత్రములందున్=రాత్రియొక్క కడపటి భాగమందు, అమలమతీ=మలినము లేని మనస్సు గలవాఁడా, వీనులారఁగన్=చెవులార.

తా త్ప ర్య ము

నిర్మల మనస్సుగలవాఁడా! క్రమముదప్పింపక చదువవలసిన విధముగ మిగుల సంతోషకరముగ శాస్త్రములోనగు కళలను నుదయమున రాత్రి యుండఁగనే లేచియెవఁడు చదువఁగ నీకఁ జెవులార వినఁగలను.

కం. ఎవఁ డింక స్నాన మొనరిచి, సవరగ సంధ్యాగ్నిహోత్ర♦సముపాసనముల్
సువిహితముగ నొనరిచి నన్, బ్రవిమలమతి భీతుఁ గొల్చుఁ♦ బట్టీ! చెపుమా. ౧౬౪౪

తా త్ప ర్య ము

ఎవఁడు స్నానముచేసి శాస్త్రప్రకారము తాంత్రికముగ సంధ్య- అగ్ని హోత్రము- ఉపాసనముచేసి పుత్రశోకమువలనఁ గలిగిన భయముగలనన్ను నాసమీపముననుండి యుపచారము చేయును,

ఇచ్చటి సంధ్యావందనము నమస్కార పూర్వకము తాంత్రికమునగు. శూద్రస్త్రీయందు వైశ్యునికిఁ గలిగినవాఁడుగదా కరణ జాతివాఁడు. వీనికి హోమాధికారమెచ్చటినుండి వచ్చెను. అనిప్రశ్న- కరణజాతి యనులోమజాతియే కాని విలోమజాతి కాదు. ఎక్కువజాతి పురుషునకుఁ దక్కువజాతి స్త్రీకిఁ బుట్టిన వాఁడు, పురుషుని జాతికంటెఁ దక్కువవాఁడును స్త్రీజాతికంటె నెక్కువవాఁడు నగుచున్నాఁడు. ఇది వివాహితుల విషయముగాని బంకుటాంఢ్ర విషయము గాదు. వేశ్యలవిషయముగాదు. కావునఁ గరణజాతియందు నీబాలుఁడు శూద్ర జాతికంటె నెక్కువవాఁడగుచున్నాఁడు. రావణాసురుఁడు నిట్టివాఁడే- వాఁడు బ్రాహ్మణ సవర్ణుఁడే కాని బ్రాహ్మణ జాతివాఁడు కాఁడు.

"నమస్కారేణ మంత్రేణ పంచయజ్ఞాన్ సమాపయేత్" తని శూద్రులకుఁ బంచయజ్ఞాధికారము చెప్పఁబడియుండ వారికంటె నుత్తముఁడగు కరణజాతి వానికి నేల లేకపోవునని గోవిందరాజులు తీర్థీయులు వ్రాసియున్నారు. రావణా సురుని వర్ణ విషయము సుందరకాండమునఁ జర్చింపఁబడును.

చం. తిరుగఁగ లేనివారి, నొక♦దిక్కు నెఱుంగనివారి, నిత్యక
ర్మరతికి శక్తి లేని మము♦రాగమునం బలుకందమూలముల్
వరమతి సత్ప్రియాతిథికి♦భాతిని మా కిడి నిండుప్రీతితో
నరసెడువార లెవ్వ రిఁక♦హా తనయా! చన నీకు న్యాయమా. ౧౬౪౫

నిత్యకర్మరతికిన్ = నిత్యకర్మానుష్ఠానమునకు, సత్ప్రియాతిథికిభాతిని= మంచి ప్రియమైన యతిథినివలె, అరసెడువారు=విచారించువారు. నాలవపాద మునఁ బ్లుతయతి. భాతికివలె ననుసర్థ మాంధ్రమందు గలదు. సంస్కృతంబున లేదు.

తాత్పర్యము

నడవలేనివారి నేదిక్కులేనివారి నిత్యకర్మములు చేయుటకు శక్తిలేని మమ్ముఁ బ్రేమముచే ననేకములైన కందమూలము లిచ్చి మంచి ప్రియుఁడైన యతిథికివలె నిండుప్రీతితో నెవరాదరించును? హా కుమారా! యిట్టి యనాథుల విడిచిపోవ నీకు ధర్మమా?

తే. కడుపుదుఃఖంబునను గడుఁ • గ్రాఁగుచున్న,
నీదుతల్లినిగృపణను • నిండుముసలిఁ
గనులు గానని దాని నే • కరణిఁ జెపుమ, నాయనా! యింక భరియింప • నాకు
వశము?

తాత్పర్యము

కొడుకు చచ్చెనను దుఃఖమున మిగులఁ గాలిపోవుచున్న దీనురాలిని నీతల్లిని నిండు ముసలియై కన్నులు గానరానిదానిని నే నేవిధముగ నింక భరింపఁగలను. చెప్పుమా.

ఉ. పోకుము కాలువీటికిని • బుత్ర! యిదే భవదీయమాతతో
వేకువ యైన వచ్చెదను • వెంబడి, నిల్వుము నేను జెప్పెదన్
మాకొమరున్ సహింపుము య • మా! గురులన్ మముఁ దోడితేరఁగా
జేకుఱెఁ గాలయాపనము • శిక్షకుఁ బాత్రుఁడు గాఁడటంచునున్. ౧౬౪

కాలువీటికిన్=యమునిపురమునకు, భవదీయమాతతోన్=నీతల్లితో, వేకువయైనన్=ఉదయము కాఁగా, కాలయాపనము=జాగు.

తాత్పర్యము

కుమారా! నీవు యమపురికిఁ బోవలదు నిలుము తెల్లవాఱఁగానే నీవెంబడి నీతల్లితోడ నేనువచ్చెదను. వెంటనే యేలరావైతివి జాగేలచేసితివని యముఁడు నిన్ను దండింపఁబూనెనా యముఁడా మాకుమారుని క్షమింపుము. దండింపకుము తల్లిదండ్రులైన మమ్ముఁ దోడితెచ్చుటకై యాలసించెను వీఁడు గురుపూజా దురంధరుఁడు కావున శిక్షకుఁ బాత్రుఁడు కాఁడు. అని మేము చెప్పెదము.

చం. నిలువఁగ నెట్టు లోఁ దనయ • నిన్నెడఁ బాసి వ్యథాభరంబునన్
నలఁగుచు దిక్కు లేకిటు వ • నంబుల గ్రుగ్గఁగ; నాదుమువ్వలన్
గలితమహాయశుండు గత • కల్మషుఁ డాశమనుండు జాలి ని
న్నలుగఁడు కూర్మిఁగూరియభ • యం బొసఁగున్ మముఁ జూచి సంతతన్.

వ్యథాభరంబునన్=దుఃఖాతిశయముచే, కలితమహాయశుండు=పొందఁబడిన మహాకీర్తిగలవాఁడు, గతకల్మషుఁడు=పోయిన కల్మషముగలవాఁడు, శమనుండు=యముఁడు, అలుగఁడు=కోపింపఁడు, అభయము=భయములేమి.

తాత్పర్యము.

నావెంట మీరేల రావలయును. ఇంకను గొన్నిదినములు భూలోకమున నుండరాదా యందువేని వినుము. నిన్నెడఁబాసి దుఃఖాతిశయముచే నలఁగుచు దిక్కులేక యిటువంటి యడవులలోఁ గ్రుళ్లుచు నెట్లుండ శక్యమగును. అదియును

గాక మేము నీవెంట వచ్చితిమా నామనవి విని గొప్ప కీర్తిగలవాఁడు పాపము లేనివాఁడునగు యముఁడు మమ్ముఁ జూచినంతనే మనస్సుగరఁగి యయ్యో పాపమే యని దయగలవాఁడై నీవాలసించినందునకు నీపైఁ గోపింపక దయచే నభయమే యొసఁగును.

సీ. అఘము నీచేసినయది లేదు పాపి యౌ,
    క్ష్మానాయకుఁడు నిన్నుఁ జంపెఁ బుత్ర:
  దాన నాసత్యసత్తపముల బలమున, శస్త్రయోధులగతిఁ జనుము కలన
  వెనుకంజ పెట్టక మునుపోటునను గూలు,శూరులలోకంబుఁ జేర వయ్య
  సగరదిలీపులు శైబ్యనహుషధుంధు,మారులు జనమేజయారిజేత
ఆ. యరిగినట్టిగతికి నరుగుము పుత్రక! యేది గతియొ మునుల కెల్ల సాధు
  వులకు భూమిదులకుఁ గలుగు నేగతి యట్టి,గతికి నీవు చనుము హితచరిత్ర!

అఘము=పాపము, నాసత్యసత్తపముల బలమునన్=నాసత్యము మంచి తపస్సు వీనిబలముచే, శస్త్రయోధులగతికిన్=శస్త్రము ధరించి యుద్ధముచేయు వారి గతికి, కలనన్=యుద్ధమందు, వెనుకంజ=వెనుక+అంజ = ముందుబెట్టిన కాలు వెనుకకుఁ బెట్టుట- మునుపోటునకు నెదురుగానుండు. ఎదురుగా నుండు వానిచే ఁదొమ్మున దెబ్బతని, భూమిదులకున్=భూదానము చేసినవారికి.

తాత్పర్యము

కుమారా! నీవిట్లు బాల్యమున మాకుముందు చచ్చుటకు నీవుచేసిన పాపమేదియులేదు. కాని పాపపురాజు నిన్నుఁ జంపెను. ఆకారణముచే నాసత్యము బలముచేతను నా తపోబలముచేతను జెప్పెదను వినుము నీవు శస్త్రమున సమ్ముఖమున ఁరొమ్మున దెబ్బదిని మరణించితివి కావును నీవును శస్త్రయోధులై రణమున ముందుపెట్టినకాలు వెనుకకుఁదీయక ముందుపోటున దెబ్బదిని చచ్చు వీరుల లోకమునకుఁ బొమ్ము. సగరుఁడు దిలీపుఁడు శైబ్యుఁడు నహుషుఁడు ధుంధుమారుఁడు జనమేజయుఁడు పోయినట్టిగతికి నీవును బొమ్ము. మునులకు సాధువులకు భూమి దానముచేసినవానికి నేదిగతియొ యాగతికి నీవుపొమ్ము.

శ్లో॥ ఆహవేషు యథాన్యోన్యం, జిఘాంసంతో మహీక్షితః
  యుధ్యమానా పరంశక్త్యా, స్వర్గం యాంత్య పరాఙ్ముఖః॥ మను. 7-89.

రాజులు వెనుకంజపెట్టక మిగుల శక్తిగలవారై యొకరి నొకరుఁ జంపఁ గోరి చేసిన యుద్ధమందుఁ జచ్చినవానికి స్వర్గప్రాప్తి కలుగును.

శ్లో॥ ద్వావిమౌ పురుషౌలోకే, సూర్యమండలభేదినౌ
  పరివ్రాడ్యోగ యుక్తశ్చ, రణే చాభిముఖో హతః॥

లోకమున యోగయుక్తుఁడై ప్రాణము విడిచిన సన్న్యాసి, ఎదురుఁరొమ్మున దెబ్బదిని చచ్చిన శూరుఁడు వీరిరువురు సూర్యమండలము భేదించి పోదురు.

తే. ఏకపత్నీ వ్రతస్థు లనేకగోస,హస్రదాతలు గుర్వర్చనాభిరతులు
  యోగసంపరిత్యక్త దేహులును జనెడి,యట్టిపరలోకములకు నీవరుగు వత్స!

ఏకపత్నీవ్రతస్థులు = వివాహమాడిన మొదటిభార్యతోఁదప్ప రెండవ భార్యతోఁగాని యితర స్త్రీతోఁగాని రమింపని వ్రతమునుగలవారు. భార్యలతో నెందఱితో నైనను రమించినను జారుఁడుగాక యుండువాఁడును నేకపత్నీ వ్రతస్థుఁడని కొందఱీశబ్దమునకు విపరీతార్థము చెప్పుచున్నారు. వీరి యభి ప్రాయమున మూఁడువందల మువ్వదిముగ్గురు భార్యలుగల దశరథుఁడును వేలకొలఁది భార్యలుగల రాజులును ఏకపత్నీవ్రతస్థులే. శ్రీరాముఁడు బహు భార్యుఁడనువా రేకపత్నీవ్రత శబ్దమునకుఁ జెప్పెడి యర్థమిదియే. ఇట్టి విప రీతార్థములు సాధింపఁ బండితులే యర్హులు. ఏకపత్నియనఁగా నొకనికిమాత్రము భార్యగానుండు పతివ్రత యని స్త్రీపర్యాయమున నర్థము. ఏకపత్నీవ్రత మిదంకోనాశయితు మిచ్ఛతి, కిష్కింధా. దీనికి పండితులు ఏకే ముఖ్యాన్య కేవలా యని నిఘంటు వుదాహరించుచు ఒక మగనివెనుక మఱియొక మగని వానివెనుక మఱియొకని వివాహమాడువారును నేకపత్నీవ్రతలే. యనియు సాధింపగలరు.

గోవిందరాజీయ వ్యాఖ్యయందు "ఏకపత్నీవ్రతస్యేతి, ఇదంచవ్రత మను కూలాయాం పుత్రిణ్యాం పత్న్యాం బోధ్యం" అని కలదు. అనఁగా నీవ్రతము అనుకూలయుఁ బుత్రులు గలదియు నగు పత్నియందని తెలియవలయునని యర్థము. ఇది కాముకపక్షము. భార్య పుత్రవతియయినను గాకపోయినను రెండవ భార్యను స్వీకరింపక యుండుట యుత్తమపక్షము. "పుత్రార్థం నోద్వహేదన్యాం, కర్మపుత్రాహి యోగినః। అపుత్రోపి పరంయాతి, కర్మిణాన్యోపి సత్సుతః" అను భారద్వాజ సంహితోక్తియె దీనికిఁ బ్రమాణము. పుత్రులులేరని పురుషుఁడు రెండవభార్యను బరిగ్రహింపవలసిన పనిలేదు. పుత్రుఁడులేకున్నను కర్మ పరమును బొందును. సత్సుతులు గలిగినను కర్మగానివాఁడు పొందలేఁడు. పుణ్యగతులు గలిగించునది వాఁడు వాఁడు చేసిన కర్మము.

ఏకపత్నీవ్రతము ద్వివిధము. ఏకఃపతిః యస్యాఃసా ఏకపత్నీతస్యాః వ్రతమేకపత్నీవ్రతమ్" ఏకాచనాపత్నీచ ఏకపత్నీ సైవ వ్రతమేక పత్నీవ్రతమ్" అని విగ్రహము.

ఎవతెకుఁ బెనిమిటి యొకఁడో ఎవనికిభార్య యొకతెయో వాఁడేకపత్ని. వానివ్రత మేకపత్నీవ్రతము. ఈపద్యమున నేకపత్నీ వ్రతస్థులనుటచే నీయిరు దెగలవారు చెప్పఁబడినారు.

శ్లో॥ ఆసీతామరణాత్ క్షాంతా, నియతా బ్రహ్మచారిణీ
యోధర్మ ఏకపత్నీనాం, కాంక్షంతీ తమముత్తమమ్ ॥

పతివ్రతయగు స్త్రీ భర్తగతించిన తరువాత ఓర్పుగలదై బ్రహ్మచర్యవ్రత స్థుల నియమములు పూని మరణమువఱకు భోగాములఁగోరక యుండవలయును.

శ్లో॥ అనేకాని సహస్రాణి కుమార బ్రహ్మచారిణామ్
దివంగతాని విప్రాణా మకృత్వా కులసంతతిమ్ ॥

బాల్యమున బ్రహ్మచారులై వివాహము చేసికొనని సనకాదులు వేనవేలు సంతానము లేనివారయ్యు స్వర్గమును బొందిరి. కావున సంతానము లేదని యెవరు వ్యసనపడరాదు.

శ్లో॥ మృతేభర్తరి సాధ్వీస్త్రీ, బ్రహ్మచర్యే వ్యవస్థితా
స్వర్గం గచ్ఛత్యపుత్రాపి, యథాతే బ్రహ్మచారిణః॥

భర్త చనిపోయినపిమ్మట పతివ్రతస్త్రీ బ్రహ్మచర్యమం దుండెనేని పుత్రులులేకపోయినను ఆ సనకసనందన వాలఖిల్యాదులవలె స్వర్గము పొందును. కావున బిడ్డలు లేరని స్త్రీలు పరపురుషులతో సంభోగింపరాదు. అట్టులే పురుషులును. ఒకపురుషున కొకతెకంటె నెక్కువగ లభించు భార్యలు పూర్వ జన్మంబుల దుష్కామ సంబంధమున లభించినవారని తెలియనగు. ఒక జన్మమున నొకనికి నొకతెయు, నొకతెకు నొకఁడును భార్యగా భర్తగానుండుట యుత్తమ ధర్మము తక్కినది కామకార్యము. అనేక గోసహస్రదాతలు = పెక్కు వేల గోవుల దానముచేసినవారు, గుర్వర్చనాభిరతులు=గురుసేవయందు విశేష ప్రీతిగలవారు, యోగసంపరిత్యక్తదేహులు=యోగబలమున దేహమును విడిచిన వారు, వత్స=కుమారా!

తాత్పర్యము.

ఒంటిభార్యను మాత్ర మేగలవారు, పెక్కువేలగోవుల దానము చేసినవారు గురుసేవయందు ప్రీతిగలవారు, యోగముచే దేహము విడిచినవారు, పొందు లోకములకుఁ గుమారా! నీవును బొమ్ము.

ఆ. ఊర్ధ్వలోకలాభ•ముల్లంబునను నిల్పి, గంగ సూర్యతనయ•గలియుచోట
నగ్నియందొ నీళ్ళ•యందునొ తమమేని, విడుచువారిగతికిఁ•గొడుక!పొమ్ము.

ఊర్ధ్వలోకలాభము=పై లోకములప్రాప్తి, ఉల్లంబునను=మనస్సునందు, సూర్యతనయ=యమున. తాత్పర్యము

కొడుకా! యూర్ధ్వలోకములు పొందు కోరికతో గంగా యమునా సంగమ స్థలంబున నగ్నియందొ నీళ్ళయందొ తమదేహము విడుచువారిగతికిఁ బొమ్ము.

గంగా యమునా సంగమమున మరణించువారును వానప్రస్థులుగా నుండి వ్రతము జరుపఁజాలని జీర్ణశరీరులును నగ్న్యాదుల దేహము విడిచిన నాత్మహత్యా దోషము లేదు.

కం. మావంశసంభవులకున్, లేవు సుమీ యధమగతులు • నీ కెట్టు లగున్
నీవధకుఁ గారణం బగు,నావానికిఁ గలుగుఁ గాక•యవి నాపుత్రా! ౧౬౫॥౨

తాత్పర్యము.

మావంశమునఁ బుట్టినవారికి నధోగతులులేవు. అట్లుండ నీకు నధోగతులెట్లు కలుగఁగలవు. నీవేవిధముగఁ జచ్చినను నీకు నధోగతులురావు. గాని నీవు తపస్సు పూర్తిచేసి దేహము విడువనీయక యిట్లు ఘోరవిధమున నకాలమృత్యువుగూర్చినవాని కా యధోగతులు గలుగునుగాక! సయోహవై పరమం బ్రహ్మవేద! బ్రహ్మైవభవతి నాస్యాబ్రహ్మవిత్కులే భవతి॥ ముండ. ౩-౨౯.

ఒక్కొక్క జన్మమునను బ్రారబ్ధానుభవ నియతి గలదు. అట్లు దానిని బూర్ణముగ ననుభవింపనీయక నడుమ విఘ్నము గలిగించిరేని యతఁడు లోకక్కపకాలము పిశాచమై యుండవలసియుండును. అట్టిదోష మా విఘ్నకరుని బాధించును. దీనిచే నివారింపరాని రోగముచేఁ బీడింపఁబడువానిని జంపుట దోషముగా దనువారి దుర్మతము ఖండితము.

కం. అని పనవి పనవి యేడ్చుచు,
మునివరుఁ డుదకంబు లిచ్చె• మొగిఁ బుత్రునకున్
మునిసుతుఁడు దివ్యరూపం, బున శక్రునితోడ నిల్చె•పుష్కరవీథిన్. ౧౬౫౩

పుష్కరవీథిన్ = ఆకాశమార్గమునందు.

తాత్పర్యము

అని పనవిపనవి యేడ్చుచు నామునివరుఁడు పుత్రున కుదకంబులిచ్చెను. అప్పుడు మునికుమారుఁడు దివ్యరూపము ధరించి యాకాశమున నింద్రుతోడ నిలిచి. శక్రునితోడనిల్చె యనుటచేఁ బితృపూజాధురంధరు నాబాలునిఁ బిలుచుకొనిపోవ నింద్రుఁడే వచ్చెనని సూచితము.

ఉదక ప్రదానానంతరము దివ్యస్వరూపము వచ్చినదనుటచేఁ బ్రేతమునకు జలప్రదానము చేయువఱకు నారూపము పోదని యేర్పడుచున్నది.

శ్లో॥ నస్నానేన నమౌనేన, నైవాగ్ని పరిచర్యయా
బ్రహ్మచారీ దివం యాతి, నయాతి గురుపూజనాత్॥   శంఖ.

స్నానములచే, మౌనముచే, నగ్నిపరిచర్యచే బ్రహ్మచారి స్వర్గమునకుఁ బోఁడు. తలిదండ్రుల, గురువుల సేవచేతనే పోవును. ౮౨౯-వ ప. చూడుము.

కం. గురులకు నిట్లనియె మీ,పరిచారము సేఁత నాకుఁ • బరలోకసుఖో
త్కరములు ఘటిల్లెఁ గావునఁ, బరితపియింపకుఁడు మీరు•బ్రహ్మవిధిజ్ఞుల్.

పరిచారము సేఁతన్=పరిచర్య సేయుటవలన, పరలోక సుఖోత్కరములు= పరలోకము ననుభవింపఁదగిన సుఖసమూహములు, ఘటిల్లెన్=కలిగెను, బ్రహ్మవిధిజ్ఞుల్=బ్రహ్మవిధిజ్ఞులారా- వైదికకర్మ మెఱిఁగినవారలారా! పరితపియింపకుఁడు=పరితాపము పొందకుండుఁడు.

బ్రహ్మవిధిజ్ఞులార యనుటచేఁ బ్రేతమునకుఁ జేయవలసిన వైదిక కర్మములుచేయుఁడని సూచితము.

తాత్పర్యము

తల్లిదండ్రులతో నిట్లనియె- వైదిక ధర్మవిధిజ్ఞులారా! మీకు శుశ్రూష చేసినకారణముచేత నాకూర్ధ్వలోక సుఖము లనేకములు ప్రాప్తించెను. కావున నాకై మీరు సంతాప పడవలదు.

తే. వచ్చెదరు మీరు నన్జేర◆భవ్యులార, సత్వరంబుగ నంచు భా◆స్వరవిమాన
మునను దివ్యశరీరంబు◆నను దివంబుఁ,
జేరఁ బోయె మునీంద్రకు◆మారకుండు.

తాత్పర్యము.

పుణ్యాత్ములారా మీరుకూడ నన్ను శీఘ్రముగ స్వర్గమునఁ గలిసికొనఁ గలరు. అనిచెప్పి ప్రకాశించు విమానమున దివ్యశరీరము ధరించి యా ముని కుమారుఁడు స్వర్గము చేరఁబోయెను.

తే. తనయుఁ డీభంగి దివమేగఁ◆దాపసుండు,
నెలఁతతోఁగూడి యతనికి◆నీళ్లువిడిచి
కరములు మోగిడ్చితనయాంతి◆కమునసున్న, నన్నువచియించె దుఃఖసం◆
తప్తుఁడగుచు.

తాత్పర్యము

కొడు కీప్రకారము స్వర్గమునకుఁబోఁగా నాతాపసుండు భార్యతోఁగూడి యతనికి నివాపము లిచ్చి తనసమీపమునఁ జేతులు ముకుళించి నిలువఁబడి యున్న నన్ను దుఃఖమునఁ దపించుచు నిట్లనియెను.

—◆ ఋషి దశరథుని శపించుట. ◆—

ఉ. భూమిప! యేకపుత్రకు న◆పుత్రకుఁ జేసితి గాదె నన్ను, నిం
కేమిభయంబు చా వనఁగ◆మృత్యువుఁ గూర్పుము నన్ను నిప్పుడే
ధీమహితున్ శుచిన్ సుతునిఁ◆ దేరకుఁ జంపితి జ్ఞానహీనతన్
హామిక దీఱ నిన్నిదె భ◆యంకరదుఃఖము గల్గఁ దిట్టెదన్. ౧౬౨౬

ఏకపుత్రకున్ = ఒంటికొడుకు గలవానిని, అపుత్రకున్ = పుత్రుఁడులేని వానిఁగ, హామిక=గర్వము. తాత్పర్యము

ఓయిరాజా! యొంటికొడుకునుఁగల నన్ను గొడుకులేనివానిఁగఁ జేసితివి. ఇఁకఁ జావనిన నాకేమిభయము. కావున నన్నుఁగూడ నిప్పుడే చంపుము. నిష్కారణముగ గొప్పబుద్ధిగలవానిని శుచిని నాకొడుకును నజ్ఞానముచేఁ జంపితివి కావున నీపొగరణఁగునట్లు భయంకరమైన శాపము నీకిచ్చెదను.

కం. నాకిప్పు డిట్టిపుత్రక,శోకంబును గూర్చుకతన◆సుతశోకమునన్
భూకాంతుఁడ? నీవిటులే, యేకాంతము వగచి వగచి◆యీల్గెదు వింటే. ౧౬౨౭

తాత్పర్యము

నా కిప్పు డిట్టిపుత్రశోకము గలిగించిన కారణముచే నీవును మావలెఁ బుత్రశోకముచే మిక్కిలి యేడ్చియేడ్చి చచ్చెదవుగాక!

కం. తెలియక చేసినకతమునఁ, గలుగదు సుమి బ్రహ్మహత్య•క్షత్రియ? నీకున్
గలిగెడు దాతకు దక్షిణ,ఫల మన శీఘ్రంబ యిట్టి•భంగియు నీకున్. ౧౬౭౯

కతమునన్=కారణముచేత, బ్రహ్మహత్య=తెలియకచేసిన కారణమున నీకు బ్రహ్మహత్య లేదనికదా వానప్రస్థుఁడు చెప్పెను. బ్రాహ్మణునిఁ జంపినఁగదా బ్రహ్మహత్య. మరణించిన బాలుఁడు కరణజాతివాఁడుగదా. వానిఁ జంపుటవలన బ్రహ్మహత్య యెట్లువచ్చును? అప్రసక్తియే లేనపుడామాటచెప్పనేల? యని సందేహము. బుద్ధిపూర్వకముగ శూద్రునిఁ జంపినను బ్రహ్మహత్యకలదు గాని లేకపోలేదు.

శ్లో॥ విప్రేతు సకలందేయం, పాదోనం క్షత్రియేస్మృతమ్
వైశ్యేర్ధం పాదయేకస్తు, శూద్రజాతిషు శస్యతే॥　　బృహద్విష్ణువు.

బ్రాహ్మణునిఁ జంపినఁ బూర్ణబ్రహ్మహత్య గలదు. క్షత్రియునిఁ జంపిన ముప్పాతికగలదు. వైశ్యుని జంపిన నర్ధముగలదు. శూద్రుని జంపినఁ బాతిక గలదు. మరణించిన బాలుఁడు శూద్రుఁడుగాఁడు.శూద్రస్త్రీయందు వైశ్యునకుం బుట్టినవాఁడగుటచే శూద్రునికంటె హెచ్చు వైశ్యునికంటెఁ దక్కువ. అదియును గాక యితఁడు మాతృపితృపూజా నియతుఁడు గుణవంతుఁడు అనఁగాఁ గుల మున బ్రాహ్మణుఁడు గాకున్నను బ్రాహ్మణగుణము లన్నియు నతనియందుఁ గలవు. కావున బ్రహ్మహత్యా ప్రశంస.

తాత్పర్యము

తెలియక చేసినకారణముచే నీకు బ్రహ్మహత్యవంటి ఘోరపాపము గలుగదుకాని యల్పప్రాయశ్చిత్తముచేఁ దొలఁగుపాపము గలదు. కావున దాతకు దక్షిణఫలమువలె నిప్పుడు మాకువచ్చిన స్థితియే నీకును గలుగునుగాక.

ఆ. ఇట్లు నాకు శాప•మిచ్చి పల్దెఱఁగుల, వగచి పుత్రకునకు•వార లిరువు
రంతఁ జితను బేర్ప•నగ్నిఁ జొచ్చి దివంబుఁ,
జేరఁ జనిరి యేమి•చెప్ప నింక. ౧౬౮౦

పల్దెఱఁగులన్=అనేకవిధముల, వగచి=దుఃఖించి.

తాత్పర్యము

ఈప్రకారము వారు నన్ను శపించి పుత్రునకై యనేకవిధముల నేడిచి వారిరువురును నేను సొదపేర్పఁగా వారగ్నిలోఁ బ్రవేశించిరి.ఇంకేమిచెప్పుదును.

ఇది యాత్మహత్యగాదు.

శ్లో॥ అనుష్ఠానా సమర్థస్య, వానప్రస్థస్య జీర్యతః
భృగ్వగ్ని జలసంపాతై, ర్మరణం ప్రవిధీయతే॥　　వి. పు.

ముసలితనముచే ననుష్ఠానము జరుపుకొనలేని వానప్రస్థుఁడు కొండమీఁద నుండి పడిగాని యగ్నిలోనీళ్ళలోఁబడిగాని ప్రాణము విడువవచ్చునని విధింపఁ బడినది.

తే. శబ్దవేధిశరంబున•సంయమీంద్రుఁ,బిడ్డ సేయుట, బాణంబుఁ•బెఱుకుటయును
బాల్యమునఁ జేసినట్టియా•పాప మిపుడు,స్మృతికి వచ్చెను దేవిరో! •

తాత్పర్యము చింతకతస.

శబ్దవేధి బాణముచే మునికుమారుని వేయుట ఆబాణము పెఱుకుట వాఁడు చచ్చుట లోనగునవి బాల్యమునఁజేసిన యాపాప మిపుడేల నాకీదుఃఖము కలిగె నని యాలోచింపగా స్మరణమునకు వచ్చెను.

కం. ఆకలుషముఫల మీవిధి, జేకూరె నపథ్యభుక్తి • చేసినయేనిన్
బై కొన కున్నె రోగముఁ హాకౌసల్యా? యిఁ కేమి•యనఁ గలవాఁడన్.౧౬౬౨

కలుషముఫలము=పాపఫలము, ఈవిధిన్=ఈరీతిగ, చేకూరెన్=లభించెను, అపథ్యభుక్తి=అపథ్యపు భోజనము, పై కొనకున్నె=పై పడకుండునా.

తాత్పర్యము

ఆపాపముఫల మీరీతిగ నేఁడు లభించెను. దేహమునకు సరిపడని భోజనము చేసిన రోగముదాకయుండునా? అయ్యో కౌసల్యా! యిఁకేమి నేను జెప్పఁగలనే

వ్యాధుల యుత్పత్తికి ముఖ్యకారణ మాహారమే. అతిభుక్తి=మితమునకు మించి తినుట, అధ్యశనము = భోజనముచేసి లేచి మరల భోజనముచేయుట. అకాలభుక్తి- రాజసాహారభుక్తి- దేహ తత్త్వమునకు సరిపడనివి తినుట యివి రోగకారణములు. ఇవన్నియు నపథ్యములే యగును.

తే. ఆయుదారులవాక్యంబు • లంబుజాక్షి
యిపుడు సరిదాఁకెఁ బుత్రశో • కేధితార్తిఁ
బ్రాణములు నేను విడుచుట • ప్రాప్తమయ్యె
నరులు మరులును మిక్కుట • మయ్యెఁ దన్వి. ౧౬౬౩

ఉదారులవ్ =(1) గొప్పవారల- అనఁగా గొప్పతపోబలము గలవారల (2) బిడ్డలులేని నాకు వారివాక్యబలమున బిడ్డలు గలిగిరి కావున వారుదారులు బిడ్డలు లేకున్న నాకీదుఃఖానుభవములేదు. వారి శాపప్రకారము నాకీయను భవము రావలసియున్నది. కావున నదిసత్యమగుటకై బిడ్డలు కలిగిరనిభావము. పుత్రశోక+ఏధితార్తిన్ = పుత్రవియోగ శోకముచేఁ బెరిఁగినబాధచే, అరులు మరులు=తెలిపిమఱపులు. తాత్పర్యము

ఆ గొప్పవారిమాట లిపుడనుభవమునకు వచ్చెను. పుత్రశోకముపలనఁ బెరిఁగినబాధచే నేను జావవలసివచ్చెను. దాని సూచనగాఁ దెలివు మఱపులును నధిక మయ్యెను.

కం. కన్నులు గన రాకున్నవి, నిన్నుం గనలేను మాని•నీమణి! నన్నున్
దిన్నగ స్పృశియింపుము టం,చన్నరపతి యేడ్చు చిట్టు•లనె వెఱ సతికిన్.

తాత్పర్యము

నాకుఁ గన్నులు కానరాకయున్నవి. నీ వెందుండునది నేను జూడఁజాల కున్నాను. కావున దేవీ నీవు నన్ను స్పృశింపుము. అని యీప్రకార మేడ్చుచు మరణభీతి నిట్లనియె.

ఉ. రాముని కేను జేసినది ♦ రాజముఖీ! విను నాకుఁ జెల్లు, నా
రాముఁడు నాకుఁ జేసినది ♦ రామునకే సరి, యెట్టు లంటివా
భూమిని నెట్టిదుశ్చరితుఁ ♦ బుత్రునిఁ బాయువివేకి యుండునే?
యామెయిఁ బొమ్మటన్న సుతుఁ♦డెవ్వఁడు దండ్రిని సైఁపఁ జాలెడిన్?

శ్రీరాముని విషయమున నేనుజేసిన వినాశరూప ఘోరకార్యము బాలక హంతనైన క్రూరుఁడగు నాకే తగినకార్యము ఆనాఁడట్లు మునికుమారుని జంపి తిని. ఈనాఁడిట్లు కన్నకుమారుని జంపునంతకార్యము చేసితిని. ఇట్టికార్యము నేనుదప్ప మఱియొకఁడు చేయఁడు. చేయఁజాలఁడు. నావిషయమున శ్రీరా శ్రీరాముఁడు చేసినది శ్రీరామునకేచెల్లును. ఆవిధముగా మఱియొకఁడు చేయఁ జాలఁడు. అదేమనిన లోకమున నెటువంటి చెడునడవడి గలవానినైనఁ గన్న కుమారుని జ్యేష్ఠుని వదలునట్టి వివేకహీనుఁ డుండునా? ఒకవేళ యుండునను కొన్నను నీవిధముఁగ నిష్కారణముగ నడవికిఁ బోరా యన్నంతనే సహించి యూరకుండు కొడుకుండునా?

కం. యమపురి కేగినవారలు, తమవారిని జూడ వశమె ♦ తన్వీ కానన్
క్షమ జీవించియ యుండఁగఁ, గమలాక్షుని రామచంద్రుఁ♦గనఁ గాంక్షింతున్

తాత్పర్యము ౧౬౬౬

యమపురికిఁ బోయినవారు మరలఁ దమవారిని నీలోకమున నున్నవారిని జూడసాధ్యమా కావున భూమిపై జీవించియుండఁగనే కమలములవంటి కన్నులు గల శ్రీరామచంద్రునిఁ జూడఁగోరెదను.

ఉ. రామకరంబు సోఁకినను ♦ రామముఖాబ్జముఁ జూడఁ గల్గినన్
భామరొ యంతకాలయము ♦ సజ్జనఁ బోవక దక్కవచ్చుఁ జు
మ్మా మది సంభ్రమించె, స్మృతి ♦ మాటుపడెన్ నిన్నుఁ గాన నేరనే,
నేమ మిఁ కెట్లు గల్గుఁ, ద్వర ♦ సేసెద రిద్దిగోఁ గాలకింకరుల్. ౧౬౬౭

తాత్పర్యము

శ్రీరామునిచేయి నన్నుఁదాఁకినను శ్రీరామచంద్రుని ముఖకమలమును జూడఁగలిగినను యముని పురమునకుబోక బ్రదుకవచ్చును.మనస్సా తొట్రుపాటు పడుచున్నది. స్మృతి మాతపోయినది. నిన్నుఁజూడఁజాలను. ఇఁక నేనెట్లుబ్రదికి బాగుండఁగలను. అదిగో యమకింకరులు రమ్మని తొందరపెట్టుచున్నారు.

కం. ఎన్నఁగ నింతకు దుఃఖం, బున్నె నా కెందు మరణ♦మొందెడివేళన్
గన్నారఁ గాన నైతిని, సన్నుతమతి రామచంద్రుఁ♦సద్గుణసాంద్రున్.

తాత్పర్యము.

ప్రాణముపోవు సమయమున సజ్జనులచే స్తోత్రము చేయఁబడిన మంచి మనస్సుగల సద్గుణములచే దట్టమైన శ్రీరామచంద్రుని గన్నులారఁ జూడ లేకున్నాను ఇంతకంటె దుఃఖము వేఱొకటియుండునా.

ఉ. ఆతనిఁ జూడకుండెడు మ॰హావ్యథఁ బ్రాణము శోషగిల్లెఁ దీ
క్ష్ణాతపతాపవృద్ధికిని ॰ నల్పజలంబులయట్టు లెవ్వ రా
పూతచరిత్రుచారుముఖ॰ముం బదునేనవయేఁట॰ గ్రమ్మఱన్
జూతురొ వారు నిర్జరుల ॰ చూ సుదతీమణీ! కారు మానవుల్. ౧౬౬౯

శోషగిల్లెన్=క్షీణించెను, తీక్ష్ణాతపతాపవృద్ధికిన్=తీవ్రమైన యెండవేఁడిమి యభివృద్ధిచే, అల్పజలంబులు=కొంచెపునీళ్ళు, పూతచరిత్రున్=పవిత్రమైన నడవడి గల శ్రీరామచంద్రుని, చారుముఖమున్ = మనోహరమైన మొగమును, నిర్జరులచూ=దేవతలేసుమా- లంకలో దశరథుఁడు దేవస్వరూపముననే చూచెను గదా.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని జూడమివలనఁ గలిగిన పెనుబాధచేఁ దీక్ష్ణమైన యెండ వేఁడిమికిఁ గొంచెపునీళ్లు క్రమక్రమముగా క్షీణించునట్లు నాప్రాణములు క్షీణించుచున్నవి. పదునైదవసంవత్సరమున నెవ్వరు మరల శ్రీరాముని ముఖముఁ జూతురో వారు దేవతలేకాని మనుష్యులుగారు. ఇది వాస్తవపడియేఁగదా.

ఉ. ఆనళినాయతేక్షణము ॰ లారమణీయతరోన్న సంబు నా
జా నగుకన్నుబొమ్మలు ల॰సద్ధళధాళ్య మెసంగుచెక్కులున్
శ్రీనుతశారదేందురుచి ॰ చిందెడిరాము ముఖారవిందమున్
మానిని ధన్యు లౌజనులు ॰ మాసుగఁ గాంతురు వెండి వచ్చినన్. ౧౬౭౦

నళినాయతేక్షణములు=కమలములవంటి దీర్ఘములయిన కన్నులు, రమణీయతరోన్నతనాసంబు = మిగుల సుందరమైన యెత్తైనముక్కు, జానగు = అందమైన కనుబొమలు, లసత్ ధాళధళ్యము=తళతళ ప్రకాశించు, శ్రీ=శోభచే, నుత=పొగడఁబడిన, శారద=శరత్కాలమందలి, రుచి=కాంతి, ముఖారవిందము =ముఖకమలము.

తాత్పర్యము

కమలములవలె దీర్ఘములైన యా కన్నులును సుందరమై యెత్తైన యాముక్కును, అందమైన యా కనుబొమలును తళతళమని ప్రకాశించు నా చెక్కులును కాంతిచే శ్లాఘింపఁబడిన శరత్కాలచంద్రునికాంతినిగల శ్రీరాముని ముఖము కమలమును దేవీ శ్రీరాముఁడు మరలివచ్చినపుడు పుణ్యాత్ములై జన్మము సఫలము కాఁగలవారు చూడఁగలుగుదురు.

క. వనవాసము వెలవేతిచి, చను దెంచినపుణ్యు రామ॰చంద్రుని బుజుమా
ర్గనయున్ శుక్రునిఁ గనుగతిఁ,గనుఁగొందురు పుణ్యతములు॰కౌతుక మమరన్.

ఋజుమార్గసయున్=వక్రమార్గమును విడిచి తన యెప్పటి సరియైన త్రోవ నుండు వానిని.

తాత్పర్యము

అరణ్యవాసము ముగించి వచ్చిన పుణ్యాత్ము శ్రీరామచంద్రుని వక్రగమనము వదలి యెప్పటియట్ల సరియగు మార్గమునుబొందిన శుక్రునివలె విశేష పుణ్యము చేసినవారు సంతోషముతోఁ జూతురు.

ఆ. కానరావు కనులు • వీనులు వినరావు, చిత్తమోహమునను • జెలియ యెడఁద
తునుకలైనయట్లు • తోఁచుచున్నది,
యింద్రియములు లేవొ • యే మెఱుఁగ.

తాత్పర్యము

కన్నులా కానరావు, చెవులా వినరావు, చిత్తవిభ్రమముచేత హృదయము తునుకలైనట్లు తోఁచుచున్నది. ఇంద్రియములుగలవో లేవో తెలియఁజాలకున్నాను.

ఆ. చమురు లేనిదివ్వె • చవులచందంబునఁ, జిత్తనాశమునను • జిగురుఁబోణి
యింద్రియంబు లెల్ల • నిట్టట్టు వికలంబు,లయ్యె నేమి చెప్ప • నగునె యింక.

తాత్పర్యము

చమురులేని దీవపుఁగాంతులవలెఁ జిత్తము నశించుటచే నింద్రియములు కూడ నిట్టట్టులు చెదరి వాని కార్యము లవి చేయఁజాలకున్నవి. ఇంక నేనేమి చెప్పఁగలను.

తే. ఏటివేగంబు కూలంబు • నెల్ల నురలఁ
ద్రోయు చందంబునను నిప్డు • తోయజాక్షి
తనయశోకంబువేగంబు • నను ననాథు
వనటఁ గూల్చుచు నున్నది • యనుచు మఱియు. ౧౬౭౪

తాత్పర్యము

ఏడినీళ్ల వేగమొద్దును గూలఁద్రోయువిధమున నిపుడు పుత్రశోకముయొక్క వేగము దిక్కులేని నన్ను దుఃఖముచే గూల్చుచున్నది. అని చెప్పి మఱియు,

ఉ. హాయను, నాదుముద్దుఁదన • యా యను, నెక్కడ కేగి తీవు రా
రా యను, నీవ దిక్కు గద • రా యను, నన్ను భృశార్తి ముంపఁ బ
న్నే యను, నొంటి వీడఁ దగు • నే యను, మద్దశఁ జూచియైనఁ బో
రా యను, నిట్లు నీకుఁ దగు • రా యను నయ్యయొ పుత్రకా! యనున్.

తాత్పర్యము ౧౬౭౫

హాయనును, ముద్దుకుమారా యనును, ఎక్కడికిఁ బోయితివిరాయనును, నీవేకదా నాకు దిక్కనును, నన్నుఁ దీవ్రదుఃఖమున ముంపఁజనునా యనును, ఒంటిగా నన్ను విడిచి నీవు పోఁదగునాయనును, నాదుర్దశఁజూచియైనఁ బోరా యనును ఇట్లుచేయ నీకుఁదగునటరాయనును అయ్యో! కొడుకా కొడుకా యనును,

కం. హా రామ! మహాబాహూ! హా రాకాచంద్రవదన ♦ హా ప్రియపుత్రా!
హా రక్షక! యెట కేగితి, రారా యాయాస మణఁప♦రా పుణ్యమగున్. ౧౬౭౬

తాత్పర్యము

హా రామా! దీర్ఘబాహువులుగలవాఁడా! హా పూర్ణచంద్రునివంటి ముఖము గలవాఁడా! హా ప్రియకుమారా! అయ్యో నా రక్షకుఁడా! ఎందుఁ బోయితివిరా రారా నాయాయాస మణఁపరా నీకుఁ బుణ్యమగునురా ?

శా. కౌసల్యా! నినుఁ గూడ నే జెఱిచితిం ♦ గాంతా సుమిత్రా! నినున్
గాసింబెట్టితి, నాదుదాయ వగుకై ♦ కా! మత్కులోన్మూలినీ!
యీసంతాపము నీవ పెట్టితివి చం♦డీ! యంచు వాపోవుచున్
జేసెం గాలము మధ్యరాత్రమునఁ దా♦సీతేశుఁ జింతించుచున్. ౧౬౭౭

మత్కులోన్మూలినీ = నావంశమును మొదలంటఁ బెఱికివైచినదానా? మూఁడవ పాదంబునఁ బ్లుతయతి. కాలముచేసెన్=మరణించెను.

తాత్పర్యము

కౌసల్యా! నా పాపముచే నేను జెడుటయేగాక నావంటిపాపికి భార్యవగుటచే నీకును బుత్రశోకము గలిగించి చెఱిచితిని. సుమిత్రా యెంతో యింపైన నడవడికలదానా? నిన్నుఁ జాలఁగష్టపెట్టితిని. పగదానవైన కైకా వంశనాశకులారా యిందఱికి దుఃఖము నీవేకదా తెచ్చిపెట్టితివి. ఓసీ చండీయని యేడ్చుచు దశరథుఁ డర్ధరాత్రమున శ్రీరాముని జింతించుచుఁ బ్రాణములు విడిచెను. ఇది యాఱవనాఁటి వృత్తాంతము.

—♦ ౬౫-వ సర్గము. దశరథుఁడు మృతుఁ డగుట. ♦—

సీ. వేగుఁబోకట వంది♦విశ్రుతగాయకుల్, సూతులు వేర్వేఱ♦చొచ్చి నగరు
మంగళాశీర్వచో♦మానిత స్తవములు, ప్రాసాద మంతెల్లఁ♦బరఁగఁ జేయఁ
బాణివాదకు లంతఁ♦బఱతెంచితమనేర్పు,
మెయిఁ గరతాళముల్♦మిగులఁగొలుప
నారవంబున నృపా♦లాలయగతపంజ రస్థశాఖాస్థప♦త్రరథచయము
తే. మేలుకొని కలకల మని♦లీలఁ గూయ,
వ్యాహృతంబులు పుణ్యశ♦బ్దంబు లొలయ
వేణువీణారవంబులు♦విస్తరిల్ల, నిలయ మెల్లను రవమున♦నిండి యుండె.

వేగుఁబోకటన్ = ఏడవనాఁటి యుదయమున, వందివిశ్రుతగాయకులు = వందులు సంగీతశాస్త్రము ప్రకారము పాటపాడువారు మాగధులు, మంగళాశీర్వచోమానిత సవములన్=శుభకరములైన దీవనలరూపములై గౌరవింపఁబడు స్తోత్రములచేత,పాణివాదకులు=చేతితోఁ దాళములు వేయువారు, నృపాలాలయగత=రాజునింటియందుండు, పంజరస్థ=పంజరములనుండునట్టియు, శాఖాస్థ= చెట్లకొమ్మలయందుండునట్టియు, పత్రరథచయము = పక్షుల సమూహము, వ్యాహృతంబు=బ్రాహ్మణులు చెప్పు పుణ్యశబ్దంబులు. పుణ్యపురుష పుణ్యక్షేత్ర పుణ్యతీర్థముల కీర్తనలు, నిలయము=ఇల్లు.

తా త్ప ర్య ము

ఉదయకాలమున వందులు, గాంధర్వశాస్త్రప్రకారము పాటలు పాడువారు వంశమును వర్ణించు సూతులు వేఱువేఱుగా వచ్చి నగరు ప్రవేశించి శుభకరములై యాశీర్వాదన రూపకములగు స్తోత్రములు చేయు ధ్వనులు రాచనగరునందు వ్యాపింపఁగాఁ జేతులఁ దాలము వేయువారు, తను నేర్పుకొలఁది కరతాళములు వేయుచుండఁగా నాధ్వనికి రాజు నింటియందు నుద్యానవన వృక్షములందలి చెట్లకొమ్మలయందు నుండు పక్షులు వినోదముగాఁ గూయఁగా బ్రాహ్మణులు పుణ్యక్షేత్ర పురుషులగుఱించి చెప్పుచుండఁగాఁ బిల్లంగ్రోవులయు వీణలయు ధ్వనులు విస్తారముకాఁగా నాయిల్లంతయు ధ్వనితో నిండియుండెను.

సీ. అవలఁ గల్య సే♦వావిచక్షణకామి,నీవర్షధరపాళి ♦ నిర్మలహరి
చందనసంపృక్త♦సలిలముల్ కాంచన,ఘటముల మజ్జన♦కార్యములకు
నినిచి మంజు ప్రాశ♦నీయానులేపన, దర్పణాభరణవ♦స్త్రసుమములను
గన్యకల్ సిద్ధంబు♦గావించికొని సర్వ,లక్షణసంపన్న ♦ లలితవిధుల
తే. నుండ నుదయంబునకు మున్న♦యుచితరీతి,
వేవినను రాక యున్నఁ బృ♦థ్వీవరుండు
కారణం బేమి యనుచు శం♦కావిలోల,
మతుల నుండఁగఁ జెంగట♦మలయుసతులు. ౧౬౨౦

కల్యసేవావిచక్షణ = ఉదయకాలమునఁజేయు సేవయందు జ్ఞానముగల, "కల్యమహర్ముఖే" నానా. ర. కామినీ=స్త్రీలయు, వర్షధర=షండులయు, పాళి= సమూహము, నిర్మల = మలినములేని, హరిచందన సంపృక్తసలిలములన్ = శ్రీగంధముతోఁ గూడిననీళ్ళు,కాంచనఘటములన్=బంగారు పాత్రములయందు, మజ్జనకార్యములకున్=స్నానము మొదలగు పనులకు, నినిచి=నిండించి,మంజు =మనోహరమైన, ప్రాశనీయ=పుక్కిలించెడి సమయమున స్వీకరించెడి జీలకఱ్ఱ మొదలగునవి. (౨) గంగానది పుణ్యతీర్థములు, (౩) అఖిలపాప నివారణార్థము సకలవైదిక కర్మాధికార సంపాదనార్థము ప్రతిదినము పుచ్చుకొనెడి వారి గృహారాధ్యుఁడగు శ్రీరంగనాయకుల పాదతీర్థము తులసి మున్నగునవి. విలేపన=గంధము, దర్పణ = అద్దము, ఆభరణవస్త్ర సుమములు = సొమ్ములు వస్త్రములు పూలు, కన్యకల్ = పడుచులు, (భోగముపడుచులు) సర్వ....విధులన్=సమస్త లక్షణములతోఁగూడిన మనోహరములగు నేర్పాటుతో, వేవినన్= సూర్యోదయమైనను, శంకావిలోలమతులన్ = సందేహముచేఁ జలించుచున్న మనస్సులతో, చెంగటన్=సమీపమున, మలయు=సంచరించు.

తా త్ప ర్య ము

అవల నుదయకాలసేవయందు నేర్పరులగు స్త్రీలు షండులు పరిశుద్ధములై హరిచందనముతోఁగూడిన జలములను బంగారుకుండలలో స్నానముచేయించు

టకై నిండించి మనోహరమై లోపలఁ బుచ్చుకొనఁదగిన పుణ్యతీర్థములను పూసి కొనఁదగిన గంధము, చూచుటకు నద్దము ధరించుట కాభరణములు, జలతారు వస్త్రములు సువాసనగల పుష్పములు, (ఇవి యన్నియు నిద్దురలేవఁగానే చూచుట శుభకరము.) మొదలగు మంగళపదార్థములను భోగము పడుచులు సూర్యోదయమునకు ముందే సిద్ధముచేసికొని సమస్త శుభలక్షణములతోడి యేర్పాటులతో నుండఁగా నుదయమునకు ముందే వెలుపలరావలసిన రాజు సూర్యోదయమైనను రాకుండుట కేమికారణమని సందేహపడుచునుండఁగ రాజు సమీపమునఁ దిరుగు స్త్రీలు.

ఉ. మెల్లగఁ జేరి యానృపతి॰మేల్కొలుపం బయిఁ జేయి వైచి య
ల్లల్ల నయుంబు దోఁపఁ దను॰ పంటియు నిద్దురలక్షణంబు భూ
వల్లభునందుఁ గాన కెటు॰ వైచినకాలును గేలు నట్టులే
చల్లగ నుంట, వ్రేలిడిన॰ శ్వాసము నాసికయందు లేమిచేన్. ౧౬౧౦

తాత్పర్యము

సద్దుచేయక సమీపించి యా రాజును మేలుకొలుపుటకై మీఁదఁ జేయి వైచి మెల్లమెల్లగ దేహముఁదాఁకి నిద్దురపోవువాని లక్షణములు రాజునందుఁ గానక యెటువేసినకా లట్టులే యెక్కడవేసినచేయి యక్కడనే చల్లగనుండుట చేతను ముక్కునొద్ద వ్రేలుపట్టఁగా శ్వాసము రాకుండుటచేతను.

కం. గుండియ లదరమిఁ గని యా,యుండజనయనాళి కంప॰మందుచు హృన్నా
థుండు మనుట సందియపడి, యుండెను బ్రత్యాపగాతృ॰ణోత్కర [మనఁగన్.

తాత్పర్యము

గుండెలదరకయుండుటచేతను నాస్త్రీసమూహము రాజు ప్రాణేశ్వరుఁడు బ్రదికియుండుట సందేహించి యేటినీటి కెదురుగనుండు గడ్డిపోఁచలవలె భయమున వణఁకెను. హృన్నాథుఁడనుటచే వీరు రాజపత్నులని యెఱుఁగఁదగును.

కం. వడఁకుచుఁ బార్థివుఁ గనుచుం,దడఁబడఁ బాదములఁ జక్క॰దర్శించి మదిం
దొడరినశంకయె నిజమని, మిడుకుచుఁ గోసలసుతాస॰మీపం బరుగన్.

తాత్పర్యము. ౧౬౧౨

ఇట్లు వడఁకుచు రాజునుచూచి పాదములు తడఁబడ మఱియుఁ జక్కఁగాఁ బరీక్షించి చూచి రాజు చచ్చెనను తమ సందేహమే నిజమని దుఃఖించుచుఁ గౌసల్యాదేవి యొద్దకుఁబోగా.

—॰ దశరథుమృతికై యంతఃపుర స్త్రీ లేడ్చుట. ॰—

సీ. పుత్రశోకంబునఁ॰ బొగలుచుఁ గౌసల్య, యును సుమిత్రయు జేని॰యొద్దఁ జచ్చి
నట్టులు వెల్లని॰యాస్యంబుతోఁ దిమి,రావృతతారక॰లట్లు తేజు
మాసి బొంది నుఁ॰సుఱు మాత్రతోఁ బడినిద్రఁ,
జెందియుండఁగ వారి॰స్థితిని నృపతి
మృతిని గనుంగొని॰మెలఁతలు గొల్లున, హతయూథపతివశా॰తతులభంగి

తే. నొక్కపెట్టి యాక్రోశింప • నుల్లమదర, లేచికౌసల్యయు సుమిత్ర • చూచివిభుని
దాఁకి గతజీవుఁడగుట స • త్యంబెఱింగి, ధరణిఁ ద్రెళ్లిరి ప్రాణనా • థా! యటంచు.

వెల్లనియాస్యంబుతోన్=తెల్లపాటినముఖముతో, తిమిరావృత తారకలట్లు=ఉత్పాతకాలమున నావరించు చీఁకటియందలి నక్షత్రములవలె, తేజమాసి=కాంతి హీనములై, ఉసురుమాత్రతోన్=ప్రాణము మాత్రముతో అనఁగా నూపిరిమాత్ర మాడుచుండుటచే బ్రదికియున్నారని తలంపవలయునేకాని యాకారమునఁ బీనుఁగులవలెనే యున్నారని భావము. హతయూథపతి వశాయువతులభంగిన్=యూథనాథుఁడు చచ్చిన యాఁడేనుఁగులగుంపులవలె, ఆక్రోశింపన్=ఏడువఁగా, ఉల్లమదరన్=గుండెలుకొట్టుకొన, గతజీవుఁడు=ప్రాణముపోయినవాఁడు, సత్యంబు=నిజము, త్రెళ్లిరి=పడిరి, చచ్చిన రాజునకు బ్రదికియుండు కౌసల్యా సుమిత్రలకు విశేషభేదము గానరాదని భావము.

తాత్పర్యము

రాజు చచ్చెనని సందేహించుచు నయినను గౌసల్యాదేవివచ్చి చూచి నిశ్చయింపవలెనని రాజు సమీపమందే పుత్రశోకముతో నేడ్చియేడ్చి తెల్లనిముఖముతో నుత్పాతకాలమునఁ గ్రమ్ముచీఁకటియందలి నక్షత్రములవలెఁ గాంతిలేని కనుగ్రుడ్లతో నూపిరిమాత్రముకలవారై పడి కౌసల్యయు సుమిత్రయునుండఁగా వారి స్థితిని రాజు మృతినిగని రాజు చచ్చినట్లు వీరుకూడఁ జావనున్నారని తలఁచి యూథనాథుఁడు చచ్చిన యాఁడేనుఁగులవలె నొక్కసారిగ గొల్లున నేడువఁగా నా ధ్వని విని గుండెలదుర గౌసల్యయు సుమిత్రయు లేచి భర్తను దాఁకి చూచి ప్రాణముపోవుట నిశ్చయించి ప్రాణేశ్వరాయని నేలఁబడిరి.

ఉ. నేలను ధూళి సోలిపడి • నింగిని నుండి ధరాతలంబునన్
రాలినచుక్కయట్లు రుచి • నాశిలి కోసలకన్య యుండినన్
జాలిఁగఁ దక్కుచేడియలు • సంభ్రమపాటున రోదనధ్వనుల్
గోలున నింపఁగైకయును • లోనగుకాంతలు పల్లటిల్లఁగన్. ౧౬౮౪

నింగినినుండి=ఆకాశమునుండి, ధరాతలంబునన్=భూమియందు, రుచి=కాంతి, నాశిలి=నాశమైపోయి, పల్లటిల్లఁగన్=దుఃఖింపఁగా, కైకయును అనుటచే దశరథుఁడు చచ్చెనన్న వార్తవిని కైకయు నాపల నచ్చటికివచ్చెనని గ్రహింపవలయును.

తాత్పర్యము

నేలమీఁద దుమ్ములో మూర్ఛపోయి పడి యాకాశమునుండి భూమిమీఁదఁ బడిన నక్షత్రమువలెఁ గాంతిచెడి కౌసల్యయుండఁగాఁ దక్కిన స్త్రీలు దుఃఖవేగముచే నేడ్పుధ్వను లిల్లునిండఁజేయఁగాఁ గైక మొదలగు నితరస్త్రీలు దుఃఖించుచుండఁగా.

కం. చుట్టంబు లెల్లవారును, జుట్టుకొని ధరాతలేంద్రు • సుదతుల్ చేతుల్
పట్టుకొని పెక్కు విధముల, బిట్టుగను బ్రలాపములను • బెరసిరి యంతన్.

తా త్ప ర్య ము

బంధువులందఱు రాచపీనుఁగును జుట్టుకొని రాజభార్యలు చేతులు పిసికి కొని యొకరిచేతు లొకరుపట్టుకొని యనేకవిధముల గట్టిగా నేడ్చిరి.

౬౬-వ సర్గము.

ఉ. శాంతదవానలం బనఁగ • శంబరహీనమహార్ణవం బనన్
గాంతివిహీనభాస్కరుని•కైవడి నున్నమృతుం బతిన్ వ్యథా
క్రాంత మనంబునం గనులఁ • గాల్వలు కట్టఁగ బాష్పవారి భూ
కాంతుశిరంబు స్వాంకమునఁ•గ్రాలఁగ రామునితల్లి కైకతోన్. ౧౬౮౬

శాంతదవానలంబు=చల్లారిన కాఱుచిచ్చు, శబరహీనమహార్ణవంబు = నీళ్లు లేని సముద్రము, కాంతిహీనభాస్కరునికైవడిన్ = కాంతిలేని సూర్యునివలె, మృతున్ = మరణించినవానిని, వ్యథాక్రాంతమనంబునన్ = దుఃఖబాధచే నాక్ర మింపఁబడిన మనస్సున, బాష్పవారి=కన్నులనీళ్లు, స్వాంకమునన్=తన తొడల మీఁద.

తా త్ప ర్య ము

చల్లారిన కాఱుచిచ్చువలె నీళ్లులేని మహాసముద్రమువలె కాంతిలేని సూర్యునివలెనున్న మరణించిన భర్తను శోకబాధచే నాక్రమింపఁబడిన మన స్సుచేఁ గనుల నీళ్లు కాల్వలు పాఱఁగా రాజు శిరస్సును దనతొడలపై నుంచు కొని కౌసల్య కైకతో నిట్లనియె.

ఉ. ఓసి దురాత్మురాల! యిఁక • నుల్లము చల్లసగా నకంటకం
బౌసిరి యెల్లరాజ్యమును • హాయిగఁ గైవసపెట్టుకొమ్ము నీ
గాసి సహింపఁ జాల కిటు • కాంతుఁడు స్వర్గముఁ జేరె రాముఁడా
యాసము నొందెడిన్ వనుల • హా నెఱవేఱెఁగ నీదుకోరికల్. ౧౬౮౭

దురాత్మురాలా = చెడ్డ మనస్సుగలదానా, ఉల్లము = హృదయము, అకంటకంబు=బాధించువారులేని, కైవసపెట్టుకొమ్ము = స్వాధీనపఱుచుకొమ్ము, నీగాసి=నీవుపెట్టెడి బాధ, కాంతుఁడు=భర్త.

తా త్ప ర్య ము

ఓసి చెడుమనస్సుగలదానా! యిఁక హృదయము చల్లనగా నితరులవలన బాధలేని రాజ్యమును సంపదను సుఖముగ స్వాధీనపఱుచుకొమ్ము. నీబాధపడ లేక రాజు చచ్చెను. శ్రీరాముఁ డడవులఁ జొచ్చెను. నీ కోరికలు నెఱవేఱెనుగదా. ఇఁక నీవేయాటలాడిన వలదను వారెవరు?

కం. చోరభయసహిత మైనమహారణ్యమునందు నొంటి • యరిగెడిసతినా
నేరీతి నుండఁగల నీ,యూరం బతిసుతుల విడిచి•యాపిరితోడన్? ౧౬౮౮

చోరభయసహితము=దొంగలవలని భయముతోఁగూడినది, మహారణ్యము నందున్=గొప్ప యడవియందు, సతినాన్=స్త్రీయనఁగా.

తాత్పర్యము

దొంగలభయముగల పెద్దయరణ్యమునందుఁ దోడులేక యొంటరిగాఁ బ్రయాణముచేయు స్త్రీవలెఁ బతిని సుతుని విడిచి యీయయోధ్యానగరనే నూపిరితో నెట్లుండఁగలను.

కం. తనపాలిదైవతం బగు,తనమగని న్విడిచి బ్రతుకఁ●దమకము సేయున్
వనజాక్షి యెవతె ధర్మం,బును విడచిన కైక దక్క●భూవలయమునన్.

తాత్పర్యము ౧౬౮౪

తనపాలిదేవుఁడగు మగనివిడిచి బ్రదుకుటకు ధర్మము విడిచిన కైకదక్క మఱి యేస్త్రీ యుత్సహించును.

ఈ ప్రకారము చెప్పిన కౌసల్య భర్తతోడ సహగమనమేల చేయలేదు? పతివ్రతలు సహగమనము చేయవలయునుగదా యని శంక.

శాస్త్రములందు స్త్రీలు భర్త మరణించినపుడు వారి వెంట సహగమనము చేయవలయునని, చేయరాదని రెండు విధములఁ జెప్పఁబడినదిగాని సహగమనమే వైధమని చెప్పఁబడలేదు. కనుకనే 'భర్తరిప్రేతే బ్రహ్మచర్యం తదన్వారోహణంవేతి విష్ణుస్మరణాత్' వైద్యనాథీయము అని రెండును వికల్పముగాఁ జెప్పఁబడెను.

మృతేభర్తరియానారీ సమారోహేత్ హుతాశనమ్
సారుంధతీసమాచారా త్స్వర్గేలోకే మహీయతే-శంఖః
పృథక్ చితిం సమారుహ్య నవిప్రాగంతుమర్హసి
బ్రాహ్మణస్త్రీకి మగనికాష్ఠముదప్ప రెండవ కాష్ఠములేదు.
సహగమన పక్షమున నిత్యాది వాక్యములు గలవు.

శ్లో॥ యాస్త్రీ బ్రాహ్మణజాతీయా మృతంపతి మనువ్రజేత్
సాస్వర్గ మాత్మఘాతేన నాత్మానం నపతిసంనయేత్ ॥

ఆంగిరస స్మృతి.

నమ్రియతే సమంభర్త్రా బ్రాహ్మణీ శోకకర్శితా
నబ్రహ్మ గతిమాప్నోతి మరణా దాత్మఘాతినా ॥

వ్యాఘ్రపాదుఁడు.

ఇట్లు సహగమనమును నిషేధించు వాక్యములు గలవు.

శ్లో॥ అష్టౌ మహిష్యః కథితా రుక్మిణీ ప్రముఖాస్తుయాః
ఉపగుహ్య హరేర్దేహం వివిశుస్తా హుతాశనమ్
రేవతీ చాపిరామస్య దేహమాశ్లిష్య సత్తమా
వివేశ జ్వలితంవహ్నిం తత్సంగాహ్లాదశీతలమ్
ఉగ్రసేన స్తుతచ్ఛ్రుత్వా తథైవానక దుందుభిః
దేవకీ రోహిణీచైవ వివిశుర్జాత వేదసమ్॥ వి. పు. ౫-౩౮.

దీనివలన రుక్మిణీ మొదలగువారు రేవతి దేవకి రోహిణి సహగమనము చేసిరని తెలియుచున్నది.

సహగమనము చేయనివారెందఱో గలరు.

పాండురాజు భార్యలలో మాద్రి సహగమనముచేసెను.కుంతి చేయలేదు.

సహగమన మాత్మహత్య ఆత్మహత్యను శ్రుతులు నిషేధించుచున్నవి. "తస్మాదుహన పురాయుషః ప్రేయాత్" అసూర్యానామ తేలోకాః అంధేనతమసా వృతాః। తాం స్తేప్రేత్యా భిగచ్ఛంతి యేకేచాత్మ హనోజనాః॥ ఈశావాస్య॥

ఆత్మహత్యలన్నియు నరక కారణములుగావు.

"సితాసితే సరితో యత్రసంగతే" యను శ్రుతిప్రకారము గంగా యమునా సంగమునఁ బ్రాణములు విడిచినవారికి నరకగతులు లేవుకదా ? ఈ రామాయణ మందే ౧౬౬౦-వ ప. వానప్రస్థులు చితి చొచ్చిరికదా. అరణ్య. ౫౪ శరభంగుఁ డగ్నిలోఁ బ్రవేశించెఁగదా ౧-౭౫౪-వ ప. శబరియు నిట్లే దేహమును విడిచెఁ గదా? వీరికి నరకమురాక యుత్తమగతులే వచ్చెనుగదా ? యుద్ధమునందుఁ జంపువారికి హింసాదోషము చచ్చెడివారి కాత్మహత్యాదోష మెట్లులేదో వీరికి నట్లు లేదు. అటులే భక్తిచే ననుగమనము చేయు పతివ్రతలకు నాత్మహత్యా దోషము లేదు. సుకృతమే కలదు. అటయిన సహగమనముచేయుట శ్రేష్ఠమా చేయకుం డుట శ్రేష్ఠమా? భర్తతోడ సహగమనము చేసిన స్త్రీకి భర్తృసాలోక్యము వచ్చి నట్లే భర్త మరణించిన తరువాత జీవించియు బ్రహ్మచర్యవ్రతమును సాధించిన స్త్రీకిని భర్తృసాలోక్యము గలదు. ఫలభేదము లేదు.

ఆసీతా మరణాత్ కాంతా నియతా బ్రహ్మచారిణీ
యోధర్మ ఏకపత్నీనాం కాంక్షంతీ తమనుత్తమమ్ ॥
అనేకాని సహస్రాణి కౌమార బ్రహ్మచారిణామ్
దివంగతాని విప్రాణా మకృత్వా కులసంతతిమ్ ॥
మృతేభర్తరి సాధ్వీస్త్రీ బ్రహ్మచర్య వ్రతేస్థితా
స్వర్గం గచ్ఛత్యపుత్రాపి యథాతే బ్రహ్మచారిణః ॥ మను.

ఈశ్లోకముల కర్థము ముందు (౭౯౪-వ పుట) వ్రాయఁబడెను. కావున సహ గమనము చేయకపోయినంత మాత్రమునఁ బతివ్రతయగు స్త్రీకిఁ బరలోక హాని లేదు. కాలవిలంబనము మాత్రము గలదు. ఇరువురకు ఫలము సమానమనుటకు.

గీ. పాండురాజు పీఁటె బహురత్నఖచిత వి. మానమెక్కి గొంతి మాద్రి తనయు
పాంతభాగమున సుఖాసీనలుగ నాదు, వలను వచ్చుచున్నవాఁడు కంటె.
స్వర్గారోహణపర్వము ౧-౬౨.

అని సహగమనముచేసిన మాద్రికి, సహగమనముచేయని కుంతికి నిరు వురకు సమానఫలము భర్తృసాలోక్యము చెప్పఁబడెను.

సహగమనముచేయు పతివ్రత యార్త ప్రపన్నుని వంటిది. సహగమనము చేయని పతివ్రత దృప్తప్రపన్నుని వంటిది. దృప్తప్రపన్నుఁడు దేహాంతరము వఱకు సైఁచును. ఆర్తప్రపన్నుఁడు క్షణమైన నీలోకమున నుండనొల్లఁడు. ఇరువురకు ఫలము సమానమే. ఎక్కువ తక్కువలు లేవు. కావునఁ గౌసల్య సహగమనము చేయకపోవుట దోషముగాదు.

కం. పిసినారి దోష మెఱుఁగునె, పిసఁ గింపాకంబుఁ దినెడి♦పేఁడిరీతిన్
బస గలరఘువంశంబును, మసిఁ గలిపె గయాళి కైక♦మంథరకొఱకై.

పిసినారి=లోభి, పిసిని + అరి, సంధియందు దీర్ఘమిటనిత్యము, పిసన్= అవివేకము, కింపాకము = విషము కలిపిన యన్నము, పస = సారము సామ ర్థ్యము మసిఁగలిపెన్=బూడిదలోఁ గలిపెను.

తాత్పర్యము

లోభి దోషమునుదాని నెఱుఁగునా ధనాశచే లోభి యేపాపకార్యమైనఁజేయును. అవివేకముచే విషముగలిపిన యన్నమును దినెడి బుద్ధిలేనివానివలె గయ్యాళి కైక ప్రసిద్ధికెక్కిన రఘువంశమును బూడిదపాలు చేసెను. ఇంతయు దేనికి? మంథరకొఱకు.

కం. చెనఁటినుడి నాలు చెప్పిన, జనపతి విని రామచంద్రు ♦ సతితో వనికిన్
బనిచె నటంచును వినినన్, జనకుఁడు నాయట్టు లెంత♦సంకటపడునో. ౧౬౯౧

చెనఁటినుడిన్=దుష్టవాక్యమును, ఆలు=భార్య.

తాత్పర్యము

భార్య చెప్పిన చెడ్డబోధవిని రాజు దశరథుఁడు శ్రీరాముని సీతతో నడవులకుఁ బంపెనని విని నావలె జనకరాజెంత సంకటపడునో?

కం. ఇక్కడ జనపతి యీల్గుట, దిక్కఱి వైధవ్యమునను ♦ దీనత్వమునన్
గ్రుక్కుచు నేనుండుట తా, నక్కడ నాతనయుఁ డెఱుఁగఁ♦డకటా వనిలోన్.

తాత్పర్యము.

ఇక్కడ రాజు చచ్చుట దిక్కులేనిదాననై విధవనై యేడ్చుచు నేనుండుట యక్కడ నడవిలో శ్రీరాముఁ డెఱుఁగఁడుకదా?

ఉ. ఏ మనుకొందు నట్టడవి ♦ నెన్నఁడు దుఃఖ మెఱుంగనట్టి యా
కోమలి మైథిలాత్మభవ ♦ క్రూరమృగేంద్రతరక్షుఋక్షశా
ఖామృగసూకరాహిపృథు ♦ గండకభీషణరావభీతయై
రాముని నాశ్రయించుచు భ♦రం బగుకష్టము లెల్ల నోర్చెడిన్. ౧౬౯౩

మైథిలాత్మభవ = మిథిలాధిపతియగు జనకునికూఁతురు సీత, క్రూర.... భీతయై=హింసచేయు, మృగేంద్ర=సింహములయు, తరక్షు=చిఱుతపులులయు, ఋక్ష=ఎలుఁగు గొడ్డులయు, శాఖామృగ=కోఁతులయు, సూకర = అడవిపందులయు, అహి=పాములయు, పృథు=గొప్ప, భీషణ = భయంకరమైన, రావ =

ధ్వనిచే, భీతయై=భయపడినదై, ఏమనుకొందున్=దేనికనియేడ్తును, మగఁడు చచ్చెనని యేడుతునా? కొడుకునకై యేడ్తునా! కోడలు నట్టడవులలో స్త్రీలకు సహింపరాని దుఃఖమనుభవించుచున్నదని యేడ్తునా? తరక్షుబుక్ష = సంధి ప్రకృతి భావము. తాత్పర్యము.

దేనికి నేనేమనుకొందును, నడి యడవిలో నెన్నఁడు దుఃఖమెట్టిదో యెఱుఁగనిది కోమలదేహము గలది. మిథిలరాజు కూఁతురు చూడ భయంకరములైన సింహములు చిఱుతలు ఎలుగుఁలు-క్రోఁతులు- పందులు- పాములు, పెద్ద ఖడ్గమృగములు- వీనియొక్క భయంకరధ్వనులచే భయపడినదై శ్రీరాముని నాశ్రయించుచు భరింపరాని యధిక కష్టములెల్ల సహించుచున్నది.

చం. కనుఁగొన నల్పపుత్రకుఁడు • కానఁడు పెక్కురనైన, వృద్ధుఁడున్
జనకుఁడు దుస్సహార్తిఁ బడి • సంపరితప్తుఁడు నై నశించు, నే
నును సతి నౌట సువ్రతము • నూల్కొని యీవిభుతోడ నిప్డుడే
చనియెదఁ గాలుప్రోలికిఁ గృ•శానుశిఖాపరిదగ్ధగాత్ర నై. ౧౬౯౪

అల్పపుత్రకుఁడు=కూఁతురే కొడుకనియెంచి యుండువాఁడు, సతిన్=పతివ్రతను, "సతీసాధ్వీ పతివ్రతా" నిఘంటు "ఆర్తార్తే ముదితాహృష్టా ప్రోషితే మలినాకృశా। మృతేమ్రియేత యాపత్యౌ సాస్త్రీజ్ఞేయా పతివ్రతా॥" యని మగని సంతోషమే తన సంతోషము మగని దుఃఖమే తన దుఃఖము మగఁడు పరదేశమున నుండిన మలినవస్త్రము గట్టి కృశించునది, చచ్చినఁ దోడఁజచ్చునది యెవతోయామె పతివ్రతయని పతివ్రతా లక్షణము, సువ్రతము = మంచి వ్రతమును, నూల్కొని=పూని, కాలుప్రోలికిన్=యమునిపురమునకు, పురశబ్దభవము ప్రోలు, దీని పర్యాయముగ వేలను శబ్దమొండుగాన నయ్యెడి. బద్దివేలు=చిట్టివేలు, కృశానుశిఖా=అగ్నిశిఖలచే, పరిదగ్ధ=బాగుగా దహింపఁబడిన, గాత్రనై= దేహముగలదాననై. తాత్పర్యము

తన కూఁతురు పడుకష్టములను దలఁచి తన్నుకొడుకులు లేక యొక్కరిద్దఱు కూఁతులేకాని పెక్కురు కూఁతులైన లేక యా కూఁతురే కొడుకని యెంచియుండు ముసలివాఁడు జనకరాజు సహింపరాని బాధపడి మిక్కిలి తపించి కృశించును. నేనో పతివ్రతనైన కారణమునఁ బాతివ్రత్యము విధిననుసరించి సహగమనము చేసి యగ్నిహోత్రునకు దేహము సమర్పించెదను.

చం. అని పలవించుచుండి వ్యవ•హారవిదుల్ చనుదెంచి తత్సతిన్
సనయత నూఱడించి యిల•క్ష్మాపతిగాత్రము నూనెతొఁగులో
నునిచి యనంతరక్రియల • నొప్పుగఁ దీర్చిరి రాజకార్యముల్,
తనయుఁ డొకండు లేమి నట • ధర్మవిదుల్ నృపుఁ గావఁ బంచుచున్.

పలవించుచుండన్=ఏడ్చుచుండఁగా, వ్యవహారవిదుల్=జరుగవలసినకార్య

విధము తెలిసినవారు, తత్పతిన్=ఆ కౌసల్యను, సనయతన్=మంచి మాటలతో, న్యాయమార్గమున, ఊఱడించి=సమాధానపఱిచి, అనంతరక్రియలన్ = అవలఁ జేయవలసిన కార్యములను, నలుగురు కొడుకులుండియు సమయమునకు నొక కొడుకైన నొద్దలేఁడయ్యె, వసుదేవునిగతి యిట్లేయయ్యె. కొడుకులకై యేడ్చువా రీరెండు నిదర్శనముల గుణపాఠముగ గ్రహింతురుగాక. వాస్తవ పుత్రుఁడు భగవంతుఁడే.

తా త్ప ర్య ము.

అని విలపించుచుండఁగా రాజకీయ వ్యవహారములు తెలిసినవారు వచ్చి కౌసల్య నూరార్చి రాజు దేహమును నూనెకాఁగులోనుంచి యావలఁ జేయవల సిన రాజకార్యములు దీర్చిరి. కొడుకొకఁడైన సమీపమున లేమిని ధర్మవిదులగు వారు రాజశరీరమును గావఁదగువారికి నాజ్ఞచేసిరి.

శా. తైలద్రోణిని నుంప భూరమణు శుద్ధాంతాంగనల్ చూచి భూ
పాలా! పోయితె యంచు నార్తరవలై • బాహుద్వయం బెత్తుచున్
వాలాయంబుగ నెత్తి మోఁదికొనుచున్ • బాష్పాంబులీనాస్యలై
ప్రాలం బొచ్చిరి హా పతీ చనితివే • ప్రాణేశ యం చుర్విపై. ౧౬౯౬

నూనెకాఁగులో నుంపఁగా రాజు నంతఃపురస్త్రీలు చూచి రాజా పోయితివా యని యేడ్పుధ్వనులుగలవారై రెండు చేతులుమీఁది కెత్తుచు దబాదబా యని బలముగఁ దలకొట్టుకొనుచుఁ గన్నీళ్లలో మునిఁగిపోయిన ముఖములుగలవారై పతీ ప్రాణేశ్వరాయని నేలపైఁ బడసాగిరి. దహనమునకుఁ దడవగునట్లుండినచో శవమును నూనెలో వేసి యుంచవలెను. "అహితాగ్నిం జనేప్రమీతం తైల ద్రోణ్యా యవధాయ శకటేన హరంతి" యాజ్ఞవల్క్యుడు ఔరసులుండువారికిఁ బుత్రులు తప్ప మఱియొకరు సంకలనము చేయరాదు.

సీ. సత్యసంధుఁడు రామ•చంద్రుఁడు ప్రియవాది,
వాసెనీవునుమమ్ముఁ•బాయఁదగునె ?
చెనఁటికైకయి వేఱు•చేసెను శ్రీరాముఁ, బతిహంత్రి కడ నెట్లు•వచ్చు నిలువ
విధవల మగుచును•విభుఁ డగు నీకు మా, కెల్ల దిక్కన్న సీ•తేశుఁ డొకఁడె
యట్టిధన్యుండు రా•జ్యశ్రీలఁ బెడఁబాసెఁ, జనితిని నీవును • స్వర్గపురికి
ఆ. మగని నిన్నుఁ జంపె•సుగుణి రామునిఁ బాపె, వీరు లక్ష్మణునిని•విడిచి పెట్టె
ముద్దుఁగోడలై స•ముగ్ధ సీతఁ దొలంచెఁ, ద్రుంప దింక నెవరి•దుష్టకైక ?

పతిహంత్రి=మగనిని జంపినది.

తా త్ప ర్య ము.

సత్యప్రతిజ్ఞుఁడై ప్రియములు మాటలాడు శ్రీరామచంద్రుఁడు మమ్ము వదలిపోయెను. నీవుకూడ విడిచిపోవ న్యాయ్యమా దుష్టురాలగు కైకయి శ్రీరాముని వేఱుచేసెను. మగనిఁజంపిన యటువంటిదానియొద్ద నెట్లు విధవలమై నిలువఁగలము. నీకు మాకుఁ బ్రభువు దిక్కైనిన శ్రీరాముఁడొకఁడే. అట్టి పుణ్యా

త్ముఁడు రాజ్యసంపద విడనాడెను. నీవును స్వర్గమునకుఁబోయితివి. మగఁడవైన నిన్నుఁజంపెను. మంచిగుణములుగల శ్రీరాముని నెడఁబాపెను. వీరుఁడైన లక్ష్మణునిని విడిచిపెట్టెను. ఏమియుఁదెలియని సుందరిని సీతను దగ్గరనుండకుండఁ జేసెను. ఇఁక నీదుష్టురాలు కైక యెవరిని జంపఁజాలదు ? ఎవరినైన జంపఁ గలదు. ఇఁక మేమెంత లెక్కయా దానికి.

కం. కైక యనుమాటలం బడి, యేకరణిని నిలువఁ గలము॰యిచ్చట సని దుః
ఖాకులచిత్తంబుల న, స్తోకంబుగఁ బొరలి పొరలి॰దూపిల్లంగన్. ౧౧౯౮

తాత్పర్యము

కైకయనెడి నిష్ఠురవాక్యముల సహించుచు నేవిధముగా నిందు మేము నిలువఁగలము. అని దుఃఖముచేఁ గలఁతపడిన మనస్సులతో మిక్కిలి పొరలి పొరలి యేడువఁగా-

కం. పతి లేనిసతిని దారా,పతి లేనిర్రాత్రియామఁ బోలి॰ పట్టనము ధరా
పతిలేమిని దేజోవ,ర్జితమై శోభిల్లకుండెఁ॰ జింతాయుతమై. ౧౧౯౯

తాత్పర్యము

మగఁడుచచ్చిన మగువవలె నలంకారములేక చంద్రుఁడులేని రాత్రివలె దుఃఖాంధకారమున మునిఁగి రాజులేనికారణముచే నయోధ్యాపురి కాంతిలేక చింతతోఁగూడి ప్రకాశింపకుండెను.

మాలిని. కలయఁగ జను లెందుం॰ గార్పఁగన్ బాష్పవారిన్
గులతరుణులు హాహా॰ ఘోషముల్ నించు చుండన్
లలి నలుకులు ముగ్గు॰ ల్గానరా కెట్టియింటన్
బొలుపు దొఱఁగి యుండెం॰ బ్రోలు గుర్తింపకుండన్. ౧౨౦౦

కులతరుణులు=కులస్త్రీలు, ప్రోలు=పురము. మాలినీవృత్తమునకు ననమ యయగణములు ౯-వ యింట యతి.

తాత్పర్యము

ఎక్కడఁ జూచినను జనులు కన్నీరు గార్చుచుండఁగా గులస్త్రీలు హాహాకారములు చేయుచుండఁగా నేయింటియందును నందముగా నలుకులు ముగ్గులు లేక యిది యయోధ్యపురమా యని గుర్తింపరాక యుండునట్లు సౌందర్యము చెడియుండెను.

కలితాంతము. భూమీశ్వరుఁడేడ్చుచు॰బొంది విడన్,
భామాజన మార్తిని॰వ్రాలనిలన్
శ్రీమద్రవి యస్తముఁ॰జేరఁ జనెన్,భూమిం బెనుఁజీఁకటి॰పొల్పెసఁగెన్.

బొంది=దేహము, శ్రీమద్రవి=కాంతియుక్తుఁడైన సూర్యుఁడు,అస్తము= అస్తపర్వతము, క్రుంకుపల. కలితాంతమునకు తటజవగణములు ౮-వ యక్షరము యతి.

తా త్ప ర్య ము

పుడమిఁ జేఁడేడుచుచు శరీరమునువదల, దశరథుని భార్యలందఱు దుఃఖమున నేలఁ్రవాలిరి. శోభాయుతుఁడగు సూర్యుఁడస్తగిరిఁ జేరఁజనెను. భూమి యందుఁ జెనుచీఁకటి యావరించెను.

కం. సుహృదాప్తులు చేరియు న,న్మహిపతిసుతులేమిఁ జూచి•మానిరి తనువున్
దహనము సేయక యాతని,
గృహమందున యుంచి రతనిఁ•గృతమతు లగుచున్. ౧౭౦౪

సుహృదాప్తులు=సుహృత్ + ఆప్తులు, స్నేహితులు, బంధువులు. దీని వలనఁ గొందఱు శవమును దీర్ఘకాల ముంచరాదు. కావున నప్పుడే దహనము చేయ నభిప్రాయపడిరనియు వీరు దాని నంగీకరింపలేదనియుఁ దోఁచెడి.

తా త్ప ర్య ము.

దశరథు స్నేహితులు బంధువులు చేరి యారాజు కుమారుఁ డొకఁడైన లేకుండుటఁజూచి శవమును దహనము సేయుటమాని బుద్ధిమంతులై యింటి యందే పదిలపఱిచిరి.

మాలిని. తామరసాప్తుఁడు లేనినభం బనఁ•దారలు లేనిత్రియామ యనం
గా మహితాత్ముఁడు భూపతి లేమిని • గద్గదకంఠసమాకులితా
యామమహాపథచత్వరసంఘము • నై పురి యొప్ప నరుల్ సతులున్
స్తోమములై చెడఁదిట్టుచు నుండిరి•ద్రోహ మొనర్చినకైకయినిన్.

తామరసాప్తుఁడు=సూర్యుఁడు, నభంబు=ఆకాశము, త్రియామ=రాత్రి, మహితాత్ముఁడు=గొప్ప మనస్సుగలవాఁడు, గద్గదకంఠ = డగ్గుత్తికగల కంఠ ధ్వనిగలవారిచేత, సమాకులిత=కలఁతపడినవియు, ఆయామ = దీర్ఘమైనవియు నగు, మహాపథ=రాజమార్గములు, చత్వరసంఘము = నాలుగువీథులు గలియు ప్రదేశముల గుంపులు కలదియు, స్తోమములై = గుంపులు గుంపులుగాఁజేరి చెడఁదిట్టుచున్=నోటికి వచ్చినట్లు నాశమైపోనీయని తిట్టుచు.

మాలినీ వృత్తమునకు ఏడు భగణములు గురువు, ౧౩వ యింట యతి.

తా త్ప ర్య ము

సూర్యుఁడులేని యాకాశము, నక్షత్రములేని రాత్రి యన్నట్లు గొప్ప మనస్సుగల రాజు లేకుండుటచే వ్యసనముచే డగ్గుత్తికపడిన కంఠములవారిచేఁ గలఁతచెందిన రాచబాటలు- నాలుగుత్రోవలు కలియుచోటులు గలిగి పుర మొప్పుచుండెను- పురుషులు స్త్రీలు గుంపులు గుంపులుగాఁజేరి రాజద్రోహము భర్తృద్రోహము పుత్రద్రోహము ప్రజాద్రోహము చేసిన కైకయిని నాశమైపోనీ యని నోటికి వచ్చినట్లెల్ల దిట్టుచుండిరి.

౬౭-వ సర్గము.

సీ. తరువాత వఱువాతఁ♦దరణి దూర్పునఁ దోఁప, రాజకర్తలు ద్విజ♦రాజవరులు
గౌతమమౌద్గల్య♦కాత్యాయనులును మా,ర్కండేయజాబాలి♦కాశ్యపులును
వామదేవుండును♦వల నొప్ప సభ దీరి, మంత్రియుక్తంబుగ♦మౌనివేంద్రు
వరపురోధ వసిష్ఠు♦వంకఁ గనుంగొని, క్ష్మాపతి స్వర్గంబుఁ♦జనుట కతన
తే. రేయినూఱేండ్లవిధముగఁ♦బోయెమనకు,
రాజుపరలోకగతుఁడయ్యె♦రాముఁడనుజు
తోడఁగానకుఁజనియెశ♦త్రుఘ్న యుక్తి,
రాజగృహమున భరతుండు♦గ్రాలువాఁడు.

తరువాత=అవల, వఱువాతన్=ఎనిమిదవదినము నుదయము, తరణి = సూర్యుఁడు, కర్తలు=రాజు నేర్పఱుచువారు, ద్విజరాజవరులు=బ్రాహ్మణశ్రేష్ఠులు, వరపురోధ=శ్రేష్ఠుఁడగు పురోహితుఁడు రూ. పురోధసుఁడు.

తాత్పర్యము

అవల నెనిమిదవనాఁటి యుదయమునఁ దూర్పున సూర్యుఁ డుదయింపఁగా రాజును నిర్ణయించు నధికారముగలవారు బ్రాహ్మణశ్రేష్ఠులు గౌతముఁడు మౌద్గల్యుఁడు కాత్యాయనుఁడు మార్కండేయుఁడు జాబాలి కాశ్యపుఁడు వామదేవుఁడు వీరందఱు మంత్రులతోడ సభదీరి రాజపురోహితులందు శ్రేష్ఠుఁడగు వసిష్ఠునిఁజూచి మునీంద్రా! రాజు మరణించుటచేత నిన్నయొక్క రాత్రిరేయి మనకు నూఱేండ్ల విధముగఁబోయెను. రాజు పరలోకమేగెను. రాజ్యమునకు రావలసిన పెద్దకొడుకు కడవులపాలాయెను. శత్రుఘ్నునితోడ భరతుఁడు మేనమామయొద్ద రాజగృహమను పురమున నున్నాఁడు.

కం. ఘను లగురాసుతులం దెవ్వని నైనను రాజుఁజేయ♦వలయుం బురి కో
యనఘః యరాజక మొదవిన,జనములు రాష్ట్రములు మిగుల♦సంకటపడవే.

తాత్పర్యము

గొప్పవారగు రాజకుమారులం దెవ్వనినైన నొకని పురమునకు రాజుగాఁ జేయవలయును. అటుగాక యున్నరాజ్య మరాజకమైనచో జనములు రాష్ట్రములు మిగుల సంకటపడునుగదా.

—♦ అరాజకత్వ దోషవర్ణనము. ♦—

కం. ధారిణి యరాజకము గా, వారిధరచయంబు దివ్య ♦ వార్ధారాప్తిన్
వారక చపలాగర్జో,దారంబుగ వృష్టి నిడదు♦తగుసమయములన్. ౧౭౦౬.

ఇదిమొదలు కవియరాజకత్వవర్ణనము నెపంబున దశరథరాజున్నప్పటి నాగరకత సూచించుచున్నాఁడు.దీనివలన నప్పటినాగరకత యెట్టిదై నదిగ్రహింపనగు

అరాజకము=రాజులేనిది, వారిధరచయంబు = మేఘముల సమూహము, దివ్యవార్ధారాప్తిన్=వర్షధారలపొందికచే, వారక=అడ్డములేక,వర్షప్రతిబంధ కారణములులేక, చపలాగర్జోదారంబుగన్ = విశేషముగ మెఱుపులు గర్జలుగలదై,

వృష్టి=వర్షము. యజ్ఞములు దేవపూజలు లేమిని వానలు లేవు.

తాత్పర్యము

భూమిని బాలింప రాజులేకుండెనేని మేఘసమూహము వర్షధారలతోఁగూడి యుఱుములు మెఱుములతోడ నవారిగాఁ దగినసమయములందు వర్షముగురియదు.

కం. ధారిణి యరాజకము గాఁ, గారున బీజములు నాటి•కాఁపుజనంబుల్
పైరు నొనర్పరు ఫలసం,వారగ్రహణంబు నమ్మ•వలనెది లేమిన్. ౧౭౦౭

కారునన్=ఆయాసమయమందు, బీజములు=విత్తనములు, ఫలసంవార గ్రహణంబు=ఫలసమూహము (ధాన్యపుగింజలను గ్రహించుట), వలను=ఉపాయము.

తాత్పర్యము

భూమిని బాలింప రాజులేకుండెనేని యాయాధాన్యముల నాటవలసిన సమయములందుఁ గాఁపులు విత్తనములునాటి పైరులు పెట్టరు, ఏలన:-పైరుపండును, అధాన్యము దొంగలపాలుగాక యింటికిఁదేఁగల మను నమ్మకములేకుండుటచే.

కం. ధారిణి యరాజకముగాఁ, బూరుషవశవర్తు లగుచుఁ•బొదలరు పుత్రుల్
దార, లరాజకమున లే,వారయవిత్తములు లేర•యాండ్రు మగలకున్.

తాత్పర్యము ౧౭౦౮

పూరుష వశవర్తులగుచున్=మగవారికిలోపడి బిడ్డలుగాని పెండ్లాలుగాని వర్తింపరు. రాజులేని దేశమున మగవారి కిదినాధనమని యిది నాభార్యయని చెప్ప సాధ్యపడదు. ఏనిమిషమున నేబలవంతుఁడు వచ్చి హరించుకొనిపోవునో-యెవ్వఁడెఱుఁగును. వానిని దండించువాఁడెవ్వఁడు.

కం. అత్యాహిత మిటు గూడిన, సత్యం బెట నుండు నెందు•శౌచం బుండున్
క్షిత్యధిపతి యొకఁ డుండుట, యత్యావశ్యకముగా మ•హర్షి ప్రవరా.

అత్యాహితము = అధిక భీతి, క్షిత్యధిపతి = భూమికిఁ బ్రభువు, మహర్షి ప్రవరా=మహర్షులయందు శ్రేష్ఠుఁడా?

తాత్పర్యము.

జారులవలనఁ జోరులవలనదుష్టులవలన నధికభయము కలుగఁగాసత్యమెచట నుండును. శౌచ మెచటనుండును. కావున రాజుండుట యత్యావశ్యకముగదా.

కం. ధారిణి యరాజకముగాఁ, జారుతరోద్యానములు ప్ర•శస్తపుఁబుణ్యా
గారంబులు గలుగవు సభ, చేరరు మానవులు మదుల•స్తిమితత లేమిన్.

చారుతరోద్యానములు=మిగుల మనోహరములైన యుద్యానములు, ప్రశస్తపుఁ బుణ్యాగారంబులు=మిగులఁ గొనియాడఁదగిన పుణ్యగృహములు, స్తిమితత=నెమ్మది.

తాత్పర్యము

భూమిని బాలించుఁ బ్రభువులేకున్న నెవరంతటవారు స్వతంత్రించి ప్రవేశించి చెట్లుకొట్టి పాడుచేయుదురు గావున మనోహరములైన యుద్యానములు నుండవు. క్షుద్రులు ప్రవేశించి యపరిశుద్ధము చేయుదురు గావున క్షేత్రములు

నిలువవు. మనస్సులందుఁ గుదురుపాటు లేకుండుటచే సభలందు మనుష్యులు చేరరు.

కం. ధారిణి యరాజకముగా, ధారిణిసురు లధ్వరములఁ • దలఁపరు సలుపన్
గూరిసచోరభయమున ను,దారులు ధను లయ్యు నిడరు • దక్షిణ లెందున్.

ధారిణిసురులు=బ్రాహ్మణులు, అధ్వరములన్=యాగములను, ఉదారులు =దాతలు.

తాత్పర్యము

రాజు పాలింపని దేశమందు సొంతమగు సనునమ్మకము లేమిచే బ్రాహ్మణులు యజ్ఞములు చేయఁదలఁపరు. దొంగల భయమువలన దాతలు ధనికులయ్యు దక్షిణల నీయరు.

కం. ధారిణి యరాజకముగా, రారాజన్నర్తకనట • రాష్ట్రసమృద్ధి
స్ఫారోత్సవయాత్రాసం,చారంబులు గనఁగ రావు • సమ్మద మారన్. ౧౭౧౨

రారాజత్=మిక్కిలి ప్రకాశించు, నర్తక=నాట్యమాడువారును, నట=అభినయముతో నర్తించువారును గలవియు, రాష్ట్ర = దేశముయొక్క, సమృద్ధి = వృద్ధిచేత, స్ఫార=వెలయునట్టివియునగు, ఉత్సవ=దేవోత్సవములు, యాత్రా= తీర్థయాత్రకై సంచారములు, ఉత్సవతీర్థయాత్రలు లేనిచో దేశమునకు హాని కలుగునను నంశమును రాష్ట్రసమృద్ధి స్ఫారయనుపదము సూచించుచున్నది.

తాత్పర్యము

భూమి యరాజకమయ్యేనేని నటులు నర్తకులుగలవియు రాష్ట్రవృద్ధి వెలయించు నుత్సవములు యాత్రార్థమైన సంచారములు సంతోషముగాఁ జూతమన్నఁ గానరావు.

కం. ధారిణి యరాజకముగా, బేరులు లాభంబు గనరు • బేహారములం
దీరుపఁ దగవులు తగునధి,కారులు లేకుంటఁగొనుటఁ • గడు లంచములన్.

బేరులు=కోమట్లు, బేహారములన్=బేరములందు, బేహారి- వి. బేరి.

తాత్పర్యము

అధికారులు లంచములు తీసికొనుటచే తగవులను న్యాయముగాఁ బరిష్కరింతురను నమ్మకము లేకుండుటచేతఁ గోమట్లు బేరములందు లాభము సంపాదింపలేరు.

కం. ధారిణి యరాజకముగాఁ, బౌరులు స్వేచ్ఛానువృత్తి • బహురమ్యకథా
ధోరణి వెలయరు పలుసిం,గారంబులు చేసికొనరు • కంజాతాక్షుల్. ౧౭౧౪

స్వేచ్ఛానువృత్తిన్=వారివారి యిష్టానుసారము, బహురమ్యకథాధోరణిన్= మిగుల వినోదములైన కథలు చెప్పుటయందు.

తాత్పర్యము

పాలించు రాజులేనపుడు పౌరులు వారిమనస్సు నిశ్చింతముగా లేమిచే వారి వారి యిష్టానుసారము కథలు చెప్పుకొనరు. దుష్టులభీతిచే స్త్రీలు సింగారించుకొనరు.

కం. ధారిణి యరాజకముగాఁ గూరిమిఁ గైసేఁత లొప్పఁ • గొమిరెలుఁ గేళిన్
సారారామంబులను బ,చారములన్ సౌఖ్యపడరు • సాయాహ్నములన్. ౧౬౧౨

కైసేఁతలు=శృంగారములు, కొమిరెలు=వయస్సుస్త్రీలు, కేళిన్ = ఆటయందు, సారారామంబులన్=సారవంతములయిన యుద్యానములందు, పచారములు=వేడుకగాఁ దిరుగుటలు, సాయాహ్నములన్=సాయంకాలములందు.

తాత్పర్యము

రక్షించు రాజులేనపుడు వయసు పడుచులు శృంగారించుకొని ప్రేమతో విలాసముగాఁ దోఁటలయందు వేడుకగా సాయంకాలములందుఁ దిరుగుచు సుఖింపరు.

కం. ధారిణి యరాజకముగా, స్వారిం జనఁ బోరు సతులు • వల్లభయుతలై
తేరులపై వరసుమనో, వారాపచయంబుకొఱకు • వనభూములకున్. ౧౬౧౬

స్వారి = సవారి, వల్లభయుతలై = భర్తలతోఁ గూడి, వరసుమనోవారాపచయంబుకొఱకు=మంచి మేలైన పూలగుంపులను గోయుటకై.

తాత్పర్యము.

పాలించు ప్రభువులేనపుడు భార్యలు భర్తలతోఁ దేరులపైఁ గూర్చుండి మేలైన పూలుగోయుటకై వనములకు సవారిపోరు.

కం. ధారిణి యరాజకముగా, భూరిధనుల్ గోపజనులు • బ్రొద్దు మఱఁగినన్
ద్వారములు తెఱచి నిద్రం, గూరరు చోరులభయాన • గుండియ లద్రువన్.

భూరిధనుల్=విశేషధనముగలవారు, గోపజనులు = గొల్లవారు, బ్రొద్దు= బ్రధ్నశబ్దభవము, సూర్యుఁడు, మఱఁగినన్=చాటునకుఁబోగా=అస్తమింపఁగా.

తాత్పర్యము

ప్రభువులేనిరాష్ట్రమందు విశేషధనము గలవారు గొల్లవాండ్రు సూర్యుఁ డస్తమింపఁగా దొంగల భయమువలన గుండెలదరుటచేత వాకిండ్లు తెఱచి నిద్రింపరు.

పూర్వమున జనులు చోరభయములేక తలుపులు తెఱచియుంచి నిద్రించుచుండిరి. చోరులవలనఁగలుగు నష్టి గ్రామాధికారి కట్టవలయునని రాజాజ్ఞ కావున వారు రాత్రియంతయుఁ బ్రహరి తిరుగుచుండుట.

కం. ధారిణి యరాజకముగా, వారణరత్నములు షష్టి • వర్షాంచితముల్
తీరుగ ఘంటానాదము, లారఁగ ఘంటాపథముల • నలవడదు చనన్. ౧౬౧౮

వారణరత్నములు = శ్రేష్ఠములైన యేనుఁగులు, షష్టివర్షాంచితముల్ = అఱువదియేండ్లుగలవి, ఘంటానాదము = మీఁద వ్రేలవేసిన గంటల చప్పుడు, ఘంటాపథములన్=రాచబాటలందు. తాత్పర్యము

రాజులేని నగరమున నఱువది సంవత్సరముల వయస్సుగల యేనుఁగులు గంటలనాదముతో రాచబాటలందుఁబోవ సాధ్యపడదు.

కం. ధారిణి యరాజకముగా, నారాచాభ్యాసమున విం సంబడు పటుమౌ
ర్వీరావము విన రా దెట, వీరులకుం జిత్త మొక్కవిధమున లేమిన్.౧౭౧౯

నారాచాభ్యాసమునను = బాణములువేయుట యభ్యసించునపుడు, పటు మౌర్వీనాదము = దృఢమైన యల్లెత్రాటి చప్పుడు; వీరలకుఁ జిత్తమొక్క విధముగా నుండక నానాచింతలపాలై పోవుటచే.

తాత్పర్యము

రాజులేని నగరమున బాణవిద్య నేర్చుసమయమున వినవచ్చు నల్లెత్రాటి చప్పు డావీరుల మనసొక్క విధముగ లేకుండుటచే నెందును వినరాదు.

కం. ధారిణి యరాజకముగా, దూరవిషయగాము లగుచుఁ దోరపువస్తుల్
బేరంబునఁ గొని యరిగెడు, నూరుభవుల్ సుఖితఁ జేరరూళ్లను బల్లెల్.

దూరవిషయగాములు = దూరదేశములకుఁబోవువారు, తోరపువస్తుల్ = విస్తారముగ పదార్థములను, ఊరుభవుల్ = ఊరువులందుఁబుట్టిన వైశ్యులు, సుఖితన్ = సుఖముగా.

తాత్పర్యము

రాజులేని రాష్ట్రమందు దూరదేశమునకుఁబోవుటకై వస్తువులనుగొని తీసికొనిపోవు కోమట్లు సుఖముగా నూరు చేరరు. దోవలందు దొంగలచే దోఁపుడు పోయి దెబ్బలు తినవలసియుండును.

కం. ధారిణి యరాజకముగా, ధీరత యతి యొంటిగాఁగఁ దిరుగఁడు పండన్
దారి రవి గ్రుంకుచోటన, కోరం డట నన్న దాత గొఱలమి నొకఁడున్.

తాత్పర్యము. ౧౭-౨౧

రాజు పాలింపని దేశమున సన్న్యాసి యొంటరిగాఁ దిరుగఁడు. అన్నదాత లేనికారణమున నెక్కడఁ బ్రొద్దుగ్రుంకునో యక్కడనే పండుకొనఁడు.

సన్న్యాసి కృత్రిమదీపము లుపయోగింపరాదు. సూర్యుఁడు చంద్రుఁడు నక్షత్రములే వానికి దీపములు దివ్వటీలు. కావున నెక్కడఁ బ్రొద్దుగ్రుంకునో యక్కడనే పండుకొనవలయునుగాని చీఁకటిలోఁ దిరుగరాదు. ఈ నియమము కలికాలమందు లేదని వృద్ధపరాశర స్మృతి.

అరాజకదేశములో నట్లు పండుకొనిన భుక్తి యభావమగునుగనుక రాత్రియైనను నన్నము పెట్టువాఁడున్నచోటికిఁ బోవలసియుండును.

కం. ధారిణి యరాజకముగా, మూరదు పుణ్యంబు యోగమును క్షేమంబున్
ఘోరారులచేసేనలు, ధీరుఁడు పతి లేమి మొదలఁదెగటాఱి చనున్.౧౭-౨౨

యోగము = లేనిది సంపాదించుట, క్షేమము = ఉన్నది రక్షించుట, ఘోరారులచేన్ = భయంకరులైన శత్రువులచే, తెగటాఱి = నాశమై ఖండింపఁబడినదై.

తాత్పర్యము

అరాజకమైన రాజ్యంబునఁ బుణ్యము కలుగదు. యోగములేదు. క్షేమము లేదు. యుద్ధమునకుఁబోయిన సేనలు ధీరుఁడైన నాయకుఁడు లేనికారణమున శత్రువులచే ఖండింపఁబడును.

కం. ధారిణి యరాజకముగా, సారతరానందమునను ♦ జనములు పురిలో
వారణ ఘోటకరథయా, నారూఢులు నగుచు నిచ్చ♦నరుగరు మౌనీ:౧౯-౨౩

సారతరానందమునన్=నిర్మల దృఢమైన సంతోషముతో, వారణ=ఏనుఁగులు, ఘోటక=గుఱ్ఱములు, రథ=తేరులు, యాన = వాహనములమీఁద, ఆరూఢులు=ఎక్కినవారు, నిచ్చ=ఎల్లప్పుడు, ఇచ్ఛ=ఇష్టప్రకారము.

తాత్పర్యము

రాజులేని దేశమందు మిక్కిలి సంతోషముతోఁ బురమునందలి జనులు ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములు లోనగు వాహనములెక్కి వారివారి యిష్ట ప్రకారమెప్పుడు తలఁచినప్పుడు సంచారము చేయరు.

కం. ధారిణి యరాజకముగాఁ, బారంగత మగుచు శాస్త్ర♦పటలిన్ జన మి
చ్ఛారతి వనముల నుపవన, తీరంబుల వాదములను,♦దేఁడు మహీపున్.

పారంగతము=తుదముట్టినది, శాస్త్రపటలిన్=శాస్త్రసమూహమును, ఇచ్ఛారతిన్=ఇష్టప్రకారము, వనములన్ = ఋషులుండు నరణ్యములందు.

తాత్పర్యము

పాలించు రాజులేని దేశమందు జనులు శాస్త్రములు నెల్లఁ దుదముట్టఁ జదివి వారివారి యిష్టప్రకారము ఋషులుండెడి వనములందుఁ దోఁటలయందు నదీతీరములందుఁ దమ పాండిత్యమహిమచే వాదములను గృతార్థులుగారు.

కం, ధారిణి యరాజకముగా, నారయఁగా దేవతార్చన♦నార్థము సుమనో
హారోపహారములఁ దమిఁ, బౌరులను సదక్షిణముగఁ♦బరఁగింప రెటన్.

దేవతార్చనార్థము=దేవుని బూజించుకొఱకు, సుమనోహారోపహారములు= పూలదండలు నైవేద్యవస్తువులు, తమిన్=కోరికతో, సదక్షిణముగన్ = దక్షిణల తోడ.

తాత్పర్యము

రక్షించు రాజులేనిచోట దేవుని పూజానిమిత్తము పూలదండలు నైవేద్య వస్తువులు దక్షిణలతోడఁ దీసికొని పురజనులు దేవాలయాదులకుఁబోరు.

కం. ధారిణి యరాజకముగా, సారాగరుచందనాది♦చర్చలను వసం
తారూఢ వృక్షములవలె, భూరమణకుమారు లెందుఁ♦బొలయరు సుఖులై.

సారాగురుచందనాదిచర్చలన్=చేవగల యగరుచెక్క శ్రీగంధముచెక్క మొదలగువానితోఁదీసిన గంధములను బూసికొనుటచే, వసంతారూఢ వృక్షముల వలెన్ = వసంతకాలమందలి పూచినచెట్లవలె, భూరమణకుమారులు = రాజ కుమారులు.

తాత్పర్యము

రాజు పాలింపని రాజ్యమందు సారవంతములైన యగురు శ్రీగంధముల గంధము పూసికొని వసంతకాలమందలి చెట్లవలె రాజకుమారులు సుఖులై యెందును సంచరింపరు.

కం. నీళ్ళులు లేనిస్రవంతులు, సల్లలితతృణాళి లేని • సారవనంబుల్
వల్లవులు లేనియావులు,వల్లభుపాలనము లేని•వసుధయు సమముల్. ౬౭-౨౪

స్రవంతులు=నదులు, సల్లలితతృణాళి=మంచి మనోహరమైన గడ్డిసమూహము, వల్లవులు=గొల్లవాండ్రు, వల్లభు=రాజుయొక్క, వసుధ=భూమి.

తాత్పర్యము

నీళ్ళులేని యేళ్ళు మంచి మృదువైన పచ్చికలేని వనములు, కాపరులగు గొల్లలులేని యావులు, రాజులేని భూమి సమానములు.

కం. కనఁ దేరికిఁ గేతనమును, ననలునకుం బొగయుఁ జిహ్న•మగు నారీతిన్
మనకును ధ్వజ మగుభూపతి, మనలోకము విడిచి చనె న•మర్త్యులపురికిన్.

తేరికిన్ = రథమునకు, కేతనము = ధ్వజము, అనలునకున్ = అగ్నికి, చిహ్నము=గుఱుతు, అమర్త్యులపురికిన్=దేవతల నగరమునకు=స్వర్గమునకు.

తాత్పర్యము

రథమునకు ధ్వజము, అగ్నిహోత్రమునకుఁ బొగ గుర్తగునట్లు మనకును రక్షాచిహ్నమగు రాజు మనలోకము విడిచి స్వర్గముఁ జేరెను.

కం. ధారిణి యరాజకముగా, నేరికి నెది సొంత మనుచు•నెన్నఁగ రా దెం
దూరక జనులొక రొకరిన్, వారక మ్రింగుదురు మత్స్య•వర్గముభంగిన్.

తాత్పర్యము. ౬౭-౨౬

భూమి యరాజకమైనప్పుడు బలవంతులది సొమ్ము గావున నిది నాసొంతమని దేనిని జెప్పరాదు. చిన్నచేఁపలను పెద్దచేఁపలు మ్రింగునట్లు మనుష్యులొకరి నొకరు చంపుదురు.

తే. ఛిన్నమర్యాదు లగుచు నా•స్తిక్యమూని,
నృపతిచే మున్ను శిక్షితుల్•నీచజనులు
రాజు లేమిని జంకక•తేజు మెఱసి, స్వప్రభావంబు వాఁగెదు•వారు గారె.

ఛిన్నమర్యాదులు=తెగిపోయినకట్టుబాటులుగలవారు,నాస్తిక్యము=దేవుఁడు లేఁడు పరములేదు అని.

తాత్పర్యము

శాస్త్రనిబంధనములను ద్రెంచివైచి దేవుఁడులేఁడు పరములేదని మాధ్యమిక బౌద్ధులవలెను, అచల పరిపూర్ణవాదులవలెను వాదించి యట్లు చేయుటకై మునుందు శిక్షింపఁబడినవారగు నీచజనులు రాజులేనికారణమున దండించువాఁడు లేమిని సందేహింపక తమ ప్రభావంబు పదరుచుందురు. ఇది యిప్పుడు అనుభవసిద్ధము.

కం. పన్నుగ నిత్యము మేనికిఁ, గన్నులవలెఁ జుమ్మి రాజు ♦ క్ష్మాజనములకున్
సన్నుతధర్మము సత్యము,ల న్నిలుపుం జెడక బలక ♦ళాయుతుఁ డగుచున్.

బలకళాయుతుఁడు=దేహబలము శాస్త్రజ్ఞాన బలముగలవాఁడు.

తాత్పర్యము

కన్నులు దేహమునకు సరియైనమార్గముఁజూపి దుష్టమార్గము నుండి తొలఁగిపోవఁ బట్టుదలఁగా జేయునట్లు రాజును ప్రజలకుఁ గన్నులవలెనై సాధు సమ్మతమైన ధర్మమును సత్యమును జెడకుండ దేహబలముతోను శాస్త్రబలము తోను గూడినవాఁడై స్థాపించును.

కం. రాజే సత్యము ధర్మము, రాజే సత్కులజులకును ♦ ప్రథితకులంబున్
రాజే తల్లియుఁ దండ్రియు, రాజే హితపథ్యకరుఁడు ♦ ప్రజలకు నెల్లన్. ౧౭౩౨

ప్రథితకులము = ప్రసిద్ధికెక్కిన కులము, హితపథ్యకరుఁడు = హితము పథ్యమునైనదాని నిచ్చువాఁడు.

తాత్పర్యము

ప్రజలకందఱకు రాజే సత్యము, రాజులేనియెడ సత్యము లేదు. అట్టులే రాజులేనియెడ ధర్మములేదు. కావున రాజే ధర్మము.

గొప్ప కులమునఁబుట్టినవారికి వారి కులమును రక్షించువాఁడు రాజే, తల్లివలెఁ దండ్రివలెఁ బోషణధారణకర్త రాజే, హితము శ్రేయస్కరమునైన దానిని జేయువాఁడు రాజే.

కం. దండధరవిత్తనాథా, ఖండలవరుణులను మీఱుఁ ♦ గడిమిని భూపా
ఖండలుఁడు మహితవృత్తి సు,మండితుఁడయి జగము లెల్ల ♦ మన్నింపంగన్

దండధర=యముని, విత్తనాథ=కుబేరుని, ఆఖండల=ఇంద్రుని, వరుణుని, పాపుల దండించుటయందు యముఁడు, ధనదత్వమునందుఁ గుబేరుఁడు పాలనమందు నింద్రుఁడు సదాచార నియమమునందు వరుణుఁడు ప్రసిద్ధులు. ఈ నాలుగు గుణములు రాజునందుండును గావున వారిలో నొక్కొక్కనికంటె రాజే శ్రేష్ఠుఁడు. కడిమిని=పరాక్రమమునందు, భూపాఖండలుఁడు=రాజశ్రేష్ఠుఁడు, మహిత సువృత్తిమండితుఁడయి=శ్లాఘనీయమైన నడవడియనుదానిచే నలంక రింపఁబడినవాఁడై.

తాత్పర్యము

రాజేంద్రుఁడు దక్షిణదిక్కున కధిపతియగు యముఁడు, నుత్తరదిక్కున కధిపతియగు కుబేరుఁడు, తూర్పుదిక్కున కధిపతియగు నింద్రుఁడు, పశ్చిమ దిక్కున కధిపతియగు వరుణుఁడు చేయుకార్యములు దానొక్కఁడే పరాక్రమ ముచేఁ జేయుచు శ్లాఘనీయమైన నడవడియే యలంకారముగాఁ గలవాఁడై జగములు గౌరవింపఁగా లోకమును బాలించును.

కం. సాధువుల నసాధువులన్, క్ష్మాధవుఁ డిల విభజనంబు ♦ సలుపనిచో న
య్యాః ధారిణిపలయమ్ము న, మేధితతమము న మునింగి ♦ మిడుకదె చెపుమా.

తాత్పర్యము.

రాజొకఁడుండి వీరు సాధువులు కావునఁ బూజ్యులు.వీరసాధువులు కావున దండ్యులునని వేఱువేఱ విభజించి రక్షింపవలసినవారిని రక్షించి శిక్షింపవలసిన వారిని శిక్షింపకున్న పక్షమున భూచక్రమంతయు గాఢాంధకారమున మునిఁగి దుఃఖింపదా ?

కం. జీవితుఁడై యుండఁగనే, భూవిభుఁడు త్వదీయవాక్య♦మును మీఱము పా
రావారము వేలనువలె, నీ వేళను జెప్ప నేల ♦ హితసంకల్పా. ౧౭౩॥

జీవితుఁడై=బ్రదికియున్నవాఁడై, త్వదీయవాక్యమున్=నీమాటను, పారావారము=సముద్రము, వేలను=చెలియలికట్టను, హితసంకల్పా = లోకహితము గోరువాఁడా?

తాత్పర్యము.

రాజు జీవించియున్న కాలమందే చెలియలికట్టను సముద్రమువలె నీ యాజ్ఞను మీఱక వర్తించుచుంటిమి ఇఁక నిప్పుడేమి చెప్పవలయును. కావున లోకహిత మాలోచించి రాజ్యమున కొక ప్రభువు నేర్పాటుచేయుము.

కం. నృపతి యొకఁ డుండఁ డేనియు,
విపినమగున్ రాష్ట్రమిదియు♦విదితము నీకున్
నృపుఁగా దశరథసుతు నీ,విపు డొనరించుటయె తగు ము♦నీంద్రప్రవరా!
మునీంద్రప్రవరా=మునీంద్రులలో శ్రేష్ఠుఁడా? [౧౭౬

తాత్పర్యము

రాజనువాఁ డొకఁడు లేకుండిన రాష్ట్రమడవియగును. ఇది నీకుఁ దెలిసిన విషయమే. కావున దశరథుని కుమారులలో నొకని రాజుగా నిర్ణయింపుము.

—♦ ౬౮-వ సర్గము. మంత్రి పురోహితులు భరతునకు దూతల నంపుట. ♦—

చం. అనుడు వసిష్ఠుఁ డా యనఘు♦ లాడినవాక్యము లెల్ల నాదటన్
విని భరతుండుఁ దమ్ముఁడును ♦ నెమ్మిన రాజగృహంబునందు సౌ
ఖ్యనిరతి నున్నవారు జవ♦నాశ్వములం గొని దూత లిప్పుడే
చని వడిఁ దోడి తేవలయు ♦ సాగెడు నెయ్యది వారు లేనిచోన్. ౧౭౭

ఆదటన్=ఆదరముతో, తమ్ముఁడు=శత్రుఘ్నుఁడు, రాజగృహంబునందున్=కేకయరాజ పట్టణమందు, జవనాశ్వములన్ = వేగముగల గుఱ్ఱములను, వారు=భరత శత్రుఘ్నులు.

తాత్పర్యము

రాజకర్తలు మొదలగు సభ్యు లీప్రకారము చెప్పఁగా నాపుణ్యాత్ములు చెప్పిన మాటలు విని వసిష్ఠుఁ డిట్లనియె. అయ్యలారా! భరతుఁడు శత్రుఘ్నుని తోడ మేనమామ పురమగు రాజగృహంబున సుఖముగ నున్నాఁడు. వారిరువురు లేక యేపని యెట్లుసాగును. కావున దూత లిప్పుడే వేగవంతములయిన గుఱ్ఱములపైఁ బోయి వారిని శీఘ్రముగఁ దోడుకొని రావలయును. భరతునకే దా రాజు రాజ్యమిచ్చెను.

సీ. అగు నగు సన్న సిద్ధార్థ విజయు జయం, తాశోకనందనాఖ్యాతదూత
లను గాంచి మునివల్కెఁ వినుఁడు కర్తవ్యంబు,
జవనాశ్వముల నెక్కి చనుఁడు వేగ
రాజగృహాఖ్యపురంబును జేరంగ, నందుఁ గించిచ్ఛోకమొందక కిరు
భరతునిఁ గనుఁగొని గరిమ నాయాజ్ఞగాఁ, బలుకుఁడీ శోకంబు నళుకు లేక
తే. క్షేమ మడిగిరి మంత్రివసిష్ఠు లేదొ, ముఖ్య మైనట్టిపని యుంట మూర్తమైనఁ
దడపు సేయక రమ్మని నుడివినా రటంచుఁ
జెప్పుఁడు మఱి యేమి యనఁగవలదు. ౧౭౩౮

కించిచ్ఛోకము=కొంచెమైనను శోకము, అళుకు=జంకు భయము.

తాత్పర్యము

అని వసిష్ఠుఁడు చెప్పఁగా వారందఱు సరిసరి అదియేకదా రాజనియ మనము. కావున నదే బాగని యంగీకరింపఁగా సిద్ధార్థుఁడు, విజయుఁడు, జయంతుఁడు, అశోకుఁడు, నందనుఁడు అను పేరుగల దూతలను (వీరామంత్రుల పేర్లుగల దూతలేకాని మంత్రులుగారు. మంత్రులు క్షేమ మడిగినట్లు క్రిందఁ జెప్పఁబడును) బిలిచి యిట్లనియె. మీరు చేయవలసినకార్యము చెప్పెద వినుఁడు, వేగవంతములైన గుఱ్ఱములనెక్కి రాజగృహమను పేరుగల పురమందు శోకమనునది యెఱుఁగకయుండు భరతునిజూచి వసిష్ఠుఁ డిట్లాజ్ఞాపించెనని నా మాటగా మీరిట్లు చెప్పుఁడు. చెప్పుటకు భయపడవలదు. చెప్పుటయందు జంకనువలదు. రాజకుమారా! వసిష్ఠుఁడు లోనగు మంత్రులు మీక్షేమమడిగిరి. ఏదో ముఖ్యమైన పనియుండుటచే నల్పకాలమైన జాగులేక రమ్మనినారు అని మాత్రము చెప్పుఁడు. ఇంకేమియు మీరు చెప్పవలదు.

ఉ. చెప్పకుఁ డీర లాతనికి సీతవిభుండు ప్రవాసి యౌట, మీ
యప్ప దివంబుఁ జేరె నని యైనను, ఱేనికిఁ గైకపట్టి కిం
పౌ ప్పగువస్త్రభూషణము లుత్తమ మైనవి కొంచు నేగుఁడీ
తెప్పున, నన్ను వారికి విధించి యొసంగినదారి బత్తెముల్. ౧౭౩౯

ఈరలు=మీరు, ప్రవాసి=పరదేశవాసి అరణ్యమునయుండుట, అప్ప=తండ్రి, ఈశబ్దమునకు అక్కయనియు కొన్ని మండలముల నర్థముగలదు.

తాత్పర్యము

మీరు భరతునకు శ్రీరాముఁ డరణ్యమునకుఁబోయిన వార్తగాని మీతండ్రి మరణించెననికాని చెప్పవలదు. ఆయన కిచ్చుట కింపై శ్రేష్ఠమైన వస్త్రములు భూషణములు కొనిపొండు. అని వారికి దారిబత్తెమునకు వలసినది యీయఁగా.

సీ. కైకొని వారు స్వాగారంబులకు నేగి, సమ్మతాశ్వములను సరగ నెక్కి
పయన మై వలసిన వస్తువుల్గొని వసిష్ఠున కెఱిఁగించి చయ్యనను జనుచుఁ
నపరతాలాఖ్య మౌనద్రికిఁ బడమర,యును ప్రలంబాద్రికి నుత్తరంబు
నగుచు నీ రెంటిమధ్యమునఁ బాఱెడిమాలి, నీనదిబడి నేగి నెఱిగ హస్తి.

తే. నాపురముపొంత జాహ్నవీ♦నదిని దాఁటి
యవలఁ బశ్చిమముఖముగ♦నరిగి జాంగ
లంబుత్రోవను బాంచాల♦కంబుఁ జొచ్చి
కొలఁకులను నదులను గనుం♦గొనుచువారు. ౧౪౦

స్వాగారంబులకున్=తమ యిండ్లకు, సమ్మతాశ్వములన్ = వేగముగఁ బోఁగలవి దూరప్రయాణముగాసి సహింపఁగలవియని వారికి సమ్మతమైన గుఱ్ఱములను, నెఱిగన్=చక్కఁగ.

తాత్పర్యము.

దారిబత్తెములను దీసికొని భార్యలకుఁ జెప్పుటకు, గుఱ్ఱములను దీసికొనుటకునై తమ యిండ్లకుఁబోయి వేగముగఁ బోఁగలవి దూరపుఁ బ్రయాణముగాసి సహింపఁగలవని వారికి సమ్మతమైన గుఱ్ఱములనెక్కి ప్రయాణమై కావలసిన వస్తువులు తీసికొని పోవుచున్నారమని వసిష్ఠున కెఱిఁగించి శీఘ్రముగఁబోవుచు నపరతాలమను కొండకుఁ బడమర ప్రలంబాద్రికి నుత్తరంబునై వాయవ్య మూలగ నీ రెండు కొండలనడుమఁ బ్రవహించు మాలినీనది వెంబడి చక్కగఁ బోయి హస్తినాపురమునొద్ద గంగదాఁటి యచ్చటనుండి పశ్చిమాభిముఖులై కురుదేశములోని భాగమగు జాంగలముత్రోవను బాంచాలదేశంబుఁ బ్రవేశించి సరస్సును చూచుచు.

సీ. చని చని కార్యవ♦శంబున ద్రుతగతిఁ, దతజానాకుల శర♦దండ యనెడి
తటినిఁ దరించుచుఁ♦దత్పశ్చిమతటస్థ,సత్యోపయాచన♦క్ష్మాజ మెఱిఁగి
చని కుళింగపురంబుఁ♦గని యభికాళమన్, గ్రామంబుదాఁటి త♦త్ప్రాంతలసిత
బోధిభవన మను♦భూధరంబును జేరి, యాజిపూర్వమహిధ♦వానుభూత
తే. మిక్షుమతిఁ గాంచి యందు దో♦సెఁడు జలంబుఁ
గ్రోలి తప మున్నపుణ్యవి♦ప్రాళిఁ గాంచి
యంత బాహ్లిక దేశము♦ధ్యంబుదాఁటి
పోయి యవల సుదామాఖ్య♦భూమిధరము. ౧౪౧

తాత్పర్యము

కార్యవశమున నతిశీఘ్రముగఁ బ్రయాణముపోవుచు జనులచే నిండియుండు శరదండ యను నదినిదాఁటి దానికిఁ బడమటనున్న నికూలమను పేరుగల సత్యోపయాచనమగు (కోరిన కోరికలిచ్చునది) వృక్షమునకు నమస్కరించి కుళింగపురము ప్రవేశించి యభికాళమను గ్రామముదాఁటి యాప్రాంతమందుండు బోధి భవనమను పేరుగల పర్వతముసమీపించి దశరథునకుఁ బూర్వపు రాజు లనుభవించిన యిక్షుమతీనదిఁగాంచి యందొక దోసెఁడు నీళ్ళుద్రావి (ఎక్కువగఁద్రావి ప్రయాణముచేసినఁ గడుపునొప్పి వచ్చును) యందుఁ దపము చేయుచున్న పుణ్యవంతులైన బ్రాహ్మణులఁ జూచి యావల బాహ్లిక దేశము నడుమ దాఁటిపోయి యావల సుదామ మను కొండను నందు.

సీ. విష్ణుపదంబును♦వీక్షించుచు విపాశ, శాల్మలీతరువును ♦ జారువాపి
కానదీపల్వల♦కమ్రతటాకాళిఁ, దిలకించుచును మృగ♦ద్విపమృగేంద్ర
శార్దూలభీకర♦సత్త్వాళి దృష్టించి, చని చని యావల ♦ శ్రాంతతురగు
లైనదూతలు దూర♦యానంబు నడచి శీఘ్రంబునఁ గని గిరి♦వ్రజపురంబు

తే. భర్తకును బ్రియ మొదవింప♦భర్తృవంశ,
సుప్రతిష్ఠకుఁ గులమోము♦సుమతులైన
దూత లల్లంతరేయి సం♦ప్రీతిఁబురిని,జొచ్చి నిశ యెల్లనొకచోటఁ♦బుచ్చిరంద ౧౭౪౭

తాత్పర్యము

విష్ణుపాదములుండుటచే విష్ణుపదమను పేరుగాంచిన క్షేత్రమును జూచుచు, వసిష్ఠుఁడు పుత్రశోకమున మరణింపఁగోరి కట్లుకట్టుకొని తనయందు దుముకఁగా నాయనకట్లను దొలఁగించి తీరమునఁ జేర్చుటచే విపాశయను పేరుగాంచిన నదిని బూరుగుచెట్టును మనోహరములైన బావులు నదులు చిన్న సరస్సులు నిండైన చెఱువులు కనుఁగొనుచు, జింకలు, ఏనుఁగులు, సింహములను బెద్ద పులులను మఱియు భయంకర జంతువులను జూచి పోయిపోయి యచటఁ జాల దూరము నడచుటచే డస్సిన గుఱ్ఱములుగల దూతలు చాల దూరము నడచి త్వరగా గిరివ్రజపురంబును జూచిరి. (గిరివ్రజ మనునది కేకయరాజ పట్టణమునకు మఱియొక పేరు. ఇదియె రాజగృహమని ముందు చెప్పఁబడెను.)

తమభర్తయగు దశరథునకు శీఘ్రముగఁ బ్రేతకార్యములు చేయించి పరలోకమును గలిగించి యాకారణమునఁ బ్రియము కలిగించుటకు నిక్ష్వాకు వంశమును దృఢపఱచుటకు, ఆ వంశమును భరతుని మూలమున రక్షించుటకు, బుద్ధిమంతులైన దూతలు కొంత రాత్రి గడచినపిమ్మటఁ బురంబు బ్రవేశించి రాత్రియంతయు నొకచోటఁ గడపిరి.

—♦ ౬౯-వ సర్గము. భరతుఁడు దుస్స్వప్నముఁ గని పరితపించుట. ♦—

కం. ఏరాత్రియందు దూతలు, చేరిరి తత్పురము నాని♦శీథినియందే
క్రూరస్వప్నము కైకకు,మారుండును గాంచి మిగుల♦మల్లడిగొనియెన్.

తత్పురము=ఆ గిరివ్రజపురము, నిశీథిని=రాత్రియందు, క్రూరస్వప్నము=చెడు కల, మల్లడిగొనియెన్=పరితపించెను.

తాత్పర్యము

ఏ రాత్రియందు దూతలు భరతుఁడున్ననగరముఁ బ్రవేశించిరో యా రాత్రియందే కైక కుమారుఁడు ప్రభాతవేళఁ జెడ్డకలఁగాంచి మిగుల సంతాపించెను.

కం. వేకువన లేచి తత్స్మృతి, వ్యాకులుఁడై యున్న నిష్ట♦వాదులు మిత్రుల్
శోక మణంపఁగ సభలోఁ, బోకల నెన్నేని యుబుసు♦పోకకుఁ బోవన్. ౧౭౪౮

వేఁకువన=ఉదయముకాఁగానే, తత్స్మృతిన్=ఆస్వప్నము జ్ఞప్తికివచ్చుట చేత, వ్యాకులుఁడై = కలఁతనొందినవాఁడై, ఇష్టవాదులు = ఇష్టమైన మాటలు చెప్పువారు, మిత్రులు=స్నేహితులు, ఉబుసుపోకకున్=ప్రొద్దుపోవుటకు.

తాత్పర్యము

ఉదయముకాఁగానే భరతుఁడు లేచి రాత్రి గన్నకల స్మృతికిరాఁగా కలవర పడినవాఁడై యుండఁగా నింపైన వాక్కులుచెప్పు స్నేహితు లాయనదుఃఖ మణఁచుటకుఁగాను సభలోఁ బ్రొద్దుపోవుటకు ముచ్చటల నెన్నేని యేమేమో చెప్పిరి.

కం. కొందఱు కథలు వచించుచుఁ, గొందఱు హాస్యంబు లాడి•కొందఱు నాట్యా
దిం దిలకింపఁగఁ జేసియుఁ, గొందఱు వాద్యముల నెఱపి•కొఱ గాకున్నన్.

తాత్పర్యము ౧౪౫

కొందఱు వింత కథలు చెప్పిరి. కొందఱు హాస్యము లాడిరి. కొందఱు నాట్యములాడి చూపిరి. కొందఱు వాద్యముల వాయించిరి. అన్నియు వ్యర్థము లాయెను. ఆయనకుందు దీఱదాయెను.

చం. ప్రియసఖుఁ డొద్దకుం జని సు•హృజ్జను లందఱుఁ జుట్టి కొల్వ నే
ల యెద ముదంబుఁ గాన? వని • లాలన వేఁడిన నాతఁ డిట్లనున్
నయమున మిత్రుఁడా! వినుము • నాయతిదీనతకారణంబు ని
శ్చయ మిది భీషణంపుఁగల • సంకటపెట్టెడి నేమి సేయుదున్. ౧౪౬

ఎదన్=హృదయమందు, ముదంబు=సంతోషము, లాలనన్=బుజ్జగింపు మాటలు, అతిదీనతన్=మిగుల దుఃఖపాటుయొక్క, కారణంబు = హేతువు, భీషణంపుఁగల=భయంకరమైన స్వప్నము.

తాత్పర్యము

ముఖ్యస్నేహితుఁడు భరతు సమీపమునకుఁబోయి తక్కిన స్నేహితులం దఱుఁజుట్టి సేవింపఁగా రాజకుమారా! యేల నీకు మనస్సున సంతోషములేదు అని బుజ్జగింపుమాటలు నడుగఁగా నాయన నయముతో నిట్లనియెను. మిత్రుఁడా! నా మిక్కిలి దుఃఖమునకు హేతువు చెప్పెద వినుము. ఈకల నిశ్చయము. ఇది భయంకరమైన కలయగుటచే మనస్సును జాల సంకటపెట్టుచున్నది. నేనేమి చేయుదును

సీ. కలలోన మాతండ్రి•మలినుఁడై ముక్తకే,శుండయి శైలమ్ము•నుండి పేఁడ
మడువులోఁ గూలిన•మాడ్కిని దా నందుఁ, గప్పగంతులతోడఁ•గడఁగి నవ్వు
కొనుచు దోసిటిలోనఁ•గొని తైల మానిన,కరణిఁ దిలోదన•గ్రాసయుక్తిఁ
దలక్రిందుగా నుండి•తైలంబు మెయినిండఁ,
బూసి తానాతైల•మునను మునుఁగఁ

తే. గంటి శుష్కించి పోయె సా•గరము లెల్లఁ
గువలయాప్తుండు ధరణిపైఁ • గూలఁబడియెఁ
జిమ్మచీఁకటి ముంచె జ • గమ్ము నెల్లఁ
బట్టపేనుఁగుదంతంబు • భగ్నపడియె. ౧౪౭

మలినుఁడై=మాసిన దేహముగలవాఁడై, ముక్తకేశుండయి=విరియఁబోసి కొనిన వెండ్రుకలుకలవాఁడై, శైలమ్మునుండి=పర్వతమునుండి, ఆనినకరణిన్=త్రాగినట్లు, తిలోదనగ్రాసయుక్తిన్=నూవులయన్నముతోడ, మెయినిండన్=దేహమునిండ, శుష్కించి=ఎండి, కువలయాప్తుఁడు=చంద్రుఁడు, చిమ్మచీఁకటి=గాడాంధకారము, భగ్నపడియెన్=విఱిగెను.

తాత్పర్యము

మాసినదేహముగలవాఁడై తల విరియఁబోసికొని కొండమీఁదనుండి తాను పేఁడమడువులోనికి దుమికినట్లును అందులోఁ గప్పవలె గంతులు పెట్టుచు నవ్వుచు దోసిటిలో నూనెగొని నూనె యన్నముఁ దిని త్రాగినట్లును దలక్రిందికిఁ గాళ్ళు పైకినుంచి నూనె దేహమునిండఁ బూసికొని తా నా నూనెయందు మునిఁగినట్లును సముద్రము లెండినట్లును జంద్రుఁడు నేలపైఁబడినట్లును గాఢాంధకారము లోకమునిండ వ్యాపించినట్లును,బట్టపేనుఁగు దంతము విఱిగినట్లును గలగంటిని.

ఆ. అగ్ని చల్లపడియె•నవని బ్రద్దలు వాఱె, నెండిపోయెఁ జెట్టు•లెల్లయెడలఁ
బొగయు చుండె శైల•ములు; నల్లయినుప పీఁఠంబుమీఁద నల్ల•డంబు

బ్రద్దలుపాఱెన్=పగుళ్ళు పోయెను, డంబు=కాంతి. [గలుగు.

తాత్పర్యము

నిప్పు చల్లనయ్యెను. భూమి పగుళ్ళుపాఱెను. చెట్టులన్నియు నెండిపోయెను. కొండలు పొగరాఁజుచుండెను. నల్లయినుపపీఁటమీఁద నల్లకాంతిగల.

తే. అంబరముఁ దాల్చి కూర్చున్న•యాజి దన్నుఁ,
గృష్ణపింగళ లంగనల్•గేలినవ్వు
చుఁడ నెఱ్ఱనిపూవుల•దండ లమర, సఖరరథమున దక్షిణా•శకును జనియె.

అంబరము=వస్త్రము, అజి = దశరథుఁడు, కృష్ణపింగళుల్=నల్లనివారు పచ్చనివారు, సఖరరథమున్=గాడిదలఁగట్టిన తేరియందు, దక్షిణాశకున్=దక్షిణ దిక్కునకు, పూర్వపద్యమందలి కడపటి కలుగు అనునది ఉదంత దర్థ్యార్థక విశేషణము. దానికి అచ్చు అగు 'అ' పరమైనపుడు నుగాగమము నిత్యముగా వచ్చి నంబరము కావలయును. అయినను పద్యాంతమగుటచే సంధి విడఁదీసి వ్రాయఁబడియె. వాక్యాంతమున సంధిలేమి దోషముగాదని పెద్దలందురు. ప్రయోగములును గలవు.

తాత్పర్యము

వస్త్రమునుధరించి కూర్చున్న దశరథుఁడు తన్ను నల్లని పచ్చని స్త్రీలు పరిహసించి నవ్వుచుండ నెఱ్ఱనిపూవుల దండలు ధరించి గాడిదలుకట్టిన తేరిపై దక్షిణదిక్కుగాఁ బోయెను.

తే. రక్తవాసిని యొక్కర్తు•రాజుఁ జూచిఁ నవ్వుచుండెను;వికృతాన•నంబు గలుగు
రాక్షసియొకర్తు నాతండ్రిఁ•బ్రసభమునను,
లాగుచుండఁగఁ గంటి నీ•లాగు కలను. ౧౭౫౦

రక్తవాసిని = ఎఱ్ఱని వస్త్రము ధరించినది, వికృతాననంబు = వికారపు ముఖము, ప్రసభమునన్=బలాత్కారముగ, ఈలాగు=ఈవిధముగ.

తా త్ప ర్య ము

ఎఱ్ఱగుడ్డ కట్టుకొన్న యొకస్త్రీ రాజునుజూచి నవ్వుచుండెను. వికారపు ముఖముగల యొకరాక్షసి నాతండ్రిని బలాత్కారముగ లాగుచుండెను. ఇటువంటి కలగంటిని.

కం. ఈరాత్రి యిట్టిభయదా, కారపుఁగలఁ గంటి దీన • గాకుత్థ్సునకో
శ్రీరామునకో నాకో, యారయ లక్ష్మణునకో లఁ•యంబు ఘటిల్లున్.౧౭౯౧

ఈరాత్రి=ఇప్పుడు కడచినరాత్రి, భయదాకారపుఁగల = భయంకరమైన స్వరూపముగల కల, దీనన్=దీనిచే, కాకుత్థ్సునకో=దశరథునకో, లయంబు = మరణము, ఘటిల్లున్=కలుగును.

తా త్ప ర్య ము.

ఈ కడచినరాత్రి యిటువంటి భయంకరమైన కలగంటిని. ఈ కల ఫలమే మందురా. దశరథుఁడో రాముఁడో నేనో లక్ష్మణుండో మరణించుట కలుగును.

కం. ఖరయుక్తవాహనంబుల, నరుఁ డెవ్వం డేగుఁ గలను•నాతిచిరముగాఁ
బరఁగును నాతని చితిపై, నురు వగుధూమములు దీన•నుల్లం బనగనెన్.

ఖరయుక్త వాహనంబులన్ = గాడిదలఁగట్టిన వాహనములపై, నాతిచిరముగాన్ = మిక్కిలి సమీపకాలమందే, న+అతిచిరము = అనతి చిరము కావలసియుండినను నైకము, నారాయణుఁడు లోనగు నిట్టి శబ్దములుగలవు. ద్వితీయ పాదమున నజ్ యతి.

ఈ రామాయణమున దశరథ-భరత-త్రిజటలు స్వప్నములు గన్నట్లు చెప్పఁబడెను. ముప్వురు స్వప్నములు సత్యములే యయ్యెను. ఈ విషయము శాస్త్రేతిహాసములందును విపులముగఁ జెప్పఁబడెను. కావున స్వప్నములు సత్యములేకాని యసత్యములుగావు.

రోగేధాతు వికారేవా దివాస్వప్నో నిరర్థక, స్వర శాస్త్రము. రోగముల వలన ధాతువికారములవలన వచ్చుకలలు పగటికలలు వ్యర్థములు.

వాతకం పిత్తకంచైవ చింతితంచానువర్జయేత్॥ బృహస్పతి॥ వాతపిత్తముల వలన వచ్చు కలలు, తానాలోచించుచుండినవే వచ్చు కలలు వదలవలయును.

స్వప్న కాలము

స్వప్నాస్తు ప్రథమేయామే సంవత్సర విపాకినః
ద్వితీయే చాష్టభిర్మాసై స్త్రిభిర్మాసై స్తృతీయకే
చతుర్థయామే యస్స్వప్నో మాసేన ఫలదః స్మృతః
అరుణోదయ వేళాయాం సద్యఏవ ఫలంలభేత్

గో విసర్జన వేళాయాం దశాహేన ఫలం భవేత్
భవేదేవంచ సుస్వప్నే దుస్స్వప్నేతు తదర్థకమ్
సుస్వప్న దర్శనాదూర్ధ్వం నిద్రాళు ర్నపునర్భవేత్
దుస్స్వప్న దర్శనాదూర్ధ్వం శుద్ధశాంతిం సమాచరేత్
అనుక్త్వాచ పునర్నిద్రాం లభేతద్దోష శాంతయే
సుస్వప్నం బ్రాహ్మణేభ్యశ్చ నివేద్యాశిష మాప్నుయాత్
నపున శ్శయనంకుర్యా న్న రాత్రౌ తన్నివేదయేత్ ॥

మొదటి జామునవచ్చిన కల సంవత్సరమునకు ఫలించును. రెండవ జామున వచ్చినది ఎనిమిది నెలలలో, మూఁడవ జామునవచ్చినది మూఁడు నెలలలో, నాలుగవజామున వచ్చినది నెలలో, నరుణోదయవేళ వచ్చినది వెంటనే ఫలించును. ఆవులకు దూడలు విడుచువేళ వచ్చినకల పది దినములలో ఫలించును. ఇట్లు మంచి కలలు, చెడు కలలు వీనిలో సగము మంచి కలలు వచ్చిన తరువాత మరల నిద్రపోరాదు. ఉదయముకాఁగానే బ్రాహ్మణులకుఁ జెప్పి వారి యాశీర్వచనము పొందవలయును. చెడుకలలు వచ్చినతరువాత నిద్రింపవలయును. శుద్ధుఁడై శాంతి గావింపవలయును. స్వప్నవిషయ విచారము సుందరకాండమునఁ ద్విజటాస్వప్నఘట్టమునఁ జూచునది. తక్కిన విషయములందు వ్రాయఁబడును.

తాత్పర్యము

గాడిదలఁగట్టిన వాహనములపైఁగల యం దెవ్వఁడు పోవునో శీఘ్రముగానే వాని చితిమీఁద గొప్ప ధూమములు వ్యాపించును. దానివలన హృదయము పగిలెను.

చం. తడఁబడె మాట, కుత్తుకయుఁ ♦ దద్దయు నెండెడిఁ, జిత్తమన్ననో
సుడివడఁ జొచ్చె, నెట్టిగడు♦సుందనపున్నుడి వింట గల్గునో,
యుడుకుట మానసంబు మొగ♦మొప్పదు మీయెడఁ బ్రీతిఁ బల్క, నే
యెడ భయకారణం బెఱుఁగ ♦ నెత్తినభీతిని దల్లడిల్లెడిన్. ౧౭౩

కుత్తుక=గొంతు, తద్దయు=మిక్కిలి, సుడివడఁజొచ్చెను=సుడి తిరిగినట్టు తిరుగ నారంభించెను, గడుసుందనపున్నుడి=కఠిన వాక్యము.

తాత్పర్యము

మాటలు తడఁబడుచున్నవి. గొంతు మిక్కిలి యెండిపోయెను. మనస్సు సుడిగుండములోఁబడిన దానివలె సుళ్ళుపెట్టుచున్నది. స్థైర్యములేదు. ఎటువంటి పరుషవాక్యము విందునోనేమో? మనస్సుడుకుటచేత మీతో సంతోషముగ మాటలాడుటకు ముఖము చెల్లలేదు. భయకారణమేమో యిప్పుడు నాకుఁ దెలియదు. భయముచే మనస్సు తల్లడిల్లుచున్నది.

కం. ఏలొకొ నాస్వరయోగము, దూలెన్నా కాంతి మాసెఁదూపిలె నెదయున్
వాలాయము కారణ మే,మో లవమును దోఁప దయ్యెఁనుల్లంబునకున్.

స్వరయోగము=స్వభావమైన కంఠధ్వనితోడికూడిన, తూలెన్=చెడిపోయెను, ఎద=హృదయము, దూపిలెన్=శోకించుచున్నది, వాలాయము=నిర్బంధము, లవమును=కొంచెమైనను. తా త్ప ర్య ము

స్వభావమైన నాకంఠస్వరమేమి కారణమో చెడినది. నా కాంతియు మలిన మైనది. మనస్సు యప్రయత్నముగ సంతాపించుచున్నది. కారణమేమో కొంచె మైనను మనస్సునకుఁ దోఁచినదికాదు.

కం. మును పెన్నఁ డెఱుంగనియీ, పెనుఁజెడుకల వివిధగతులఁ బీడించుటచే
ననుఁగుంజెలికాఁడా! నా, జనకున కేమో యటంచుఁ సంతాపింతున్. ౧౭౦॥

తా త్ప ర్య ము

ఇంతకుఁ బూర్వమెన్నఁడు రాని యిటువంటి యీ పెద్ద చెడ్డ కల నన్ను నానావిధములఁ బీడించుటచేఁ బ్రేమగల మిత్రుఁడా? నా జనకునకేమి కీడు మూఁడెనో యని సంతాపపడుచున్నాను.

ఈ దుస్స్వప్నఘట్టమునందు "అథస్వప్నే పురుషం కృష్ణం కృష్ణదంతం పశ్యతి ఖరై ర్వా" యనుశ్రుతి వివరింపఁబడెను. మఱియు మేలుకొన్న కాల మందు మనమనుకొన్న విషయమే కలలో వచ్చెనేని యది నిష్ప్రయోజనము. ఫలము కలగన్నవానికో వాని సమీప బంధువులకో కలుగుననియు నందు వివ రింపఁబడెను.

కం. అని తనస్వప్న చరిత్రము, వినిపించుచు మిత్రులకునుఁ వేఁదుఱు గొనుచున్
జనకునిఁ దలఁచుచుఁ జింతా, వననిధి మునుఁగుచు నతండుఁ వ్యథపడు [చుండన్.

తా త్ప ర్య ము

ఈప్రకారము తన కల విధమును స్నేహితులకు వినిపించుచుఁ బిచ్చి యెత్తిన వానివలెనగుచుఁ దండిని స్మరించుచుఁ జింతాసముద్రమునందు మునుఁగుచు నతఁడు బాధపడుచుండఁగా.

—౦ ౭౦ వ సర్గము. రాజదూతలు భరతునితో సంభాషించుట. ౦—

సీ. తత్సమయమున దూఁతలు వచ్చి నృపుచేత,
నృపపుత్రుచేత నర్చితులు నగుచు
క్షితిపతిపాదముల్ఁ చేనంటి భరతునిఁ, గని యిట్టు లనిరి యోఁ శ్మైకశత్ర
మీసేమ మడిగిరిఁ మీపురోహితమంత్రు, లెల్లరుఁ బయనింపుఁ మింక వేగ
యాత్యయికంబు కాఁర్యంబు నీయొనరింపఁ,దగిన దున్నది యటఁ నగలు వస్త్ర

తే. ముల నొసంగిరి నీకయిఁ తొలుత నిమ్ము, వీన వింశతికోటులుఁ పృథ్వీపతికి
మేనమామకుఁ బదికోట్లుఁ నా నతండు, వానిఁ గైకొని యిట్లనిఁ వారి నడిగె.

అర్చితులు=గౌరవింపఁబడినవారు, క్ష్మాకళత్ర=రాజా, ఆత్యయికంబు = మిక్కిలి యవశ్యమైనది. తాత్పర్యము

ఆసమయమందే దూతలు వచ్చి కేకయరాజుచేతను రాజకుమారుచేతను, గౌరవింపఁబడినవారై రాజు పాదములను దమ చేతులతోఁ దాఁకి భరతునిఁ జూచి యిట్లనిరి. రాజా! మీ పురోహితులు మంత్రులుసందఱు మీ సేమ మడిగిరి. ఇఁక వేగముగఁ బ్రయాణము సేయుము. అందు నీవు చేయవలసిన మిక్కిలి యనివార్య కార్యమున్నది. ఆభరణములు వస్త్రములు నీ కిమ్మని యిచ్చిరి. వీనిలో మొదట నిఱువదికోటులు రాజుగారి కిమ్ము. మీ మేనమామకుఁ బది కోట్లిమ్ము. అనిన భరతుఁడు వానిని గైకొని వారితో నిట్లనియె.

రాజుతో సమానముగా రాజపుత్రునకు నిచ్చిన నది బహుమానమనిపించు కొనదు. కావునఁ బెద్దపిన్నల తారతమ్యమెంచి యియ్యఁబడెను.

సీ. మాతండ్రి దశరథ•మహిపతి కుశలియే, సౌఖ్యమా శ్రీరామ•చంద్రునకును
నారోగ్యవంతుఁ డే•యనఘుఁడు సౌమిత్రి, సేమమే మౌనివ•సిష్ఠునకును
భద్రమే శ్రీరామ•భద్రునిమాతకు, నార్య ధర్మజ్ఞధ•ర్మైకనిరత
కామోదమేకదా•యతి ధర్మ మతియైన, లక్ష్మణుజననికి•లలితశీల

తే. కాత్మకామ సదాచండి•యతులకోప, శీలయును బ్రాజ్ఞమానిని•చెనఁటినాదు
తల్లికేవ్యాధిలేదుక•దా మఱేమి, పలికె మీతోడ మీరిట•వచ్చునపుడు. ౧౭౨౮

ఆర్యా=పెద్దతల్లికావున పూజ్యురాలు, ధర్మజ్ఞ=ధర్మము తెలిసినది, ధర్మైక నిరతకున్ = ధర్మము ననుష్ఠించుటయందే ప్రీతిగలదియగు కౌసల్యకు, ఆమోదమేకదా=సంతోషమేకదా, అతిధర్మమతి=మిక్కిలి ధర్మముతోఁగూడిన మనస్సు గలది, లలితశీలకున్=మనోహరమైన నడవడిగలదానికి, ఆత్మకామ=తనలాభమె కోరునది, సదాచండి = ఎప్పుడు క్రూరస్వభావముగలది, అతులకోపశీల = అస మానమైన కోపముతోఁగూడిన స్వభావముగలది. ప్రాజ్ఞమానిని = తన్నుఁదానే పండితురాలనని తలఁచునది, చెనఁటి=దుష్టురాలు, వ్యాధిలేదుకదా = రోగము లేదుకదా. కౌసల్యకు భద్రమా సుమిత్ర కామోదమా యని యడిగి కైకకు రోగము లేదుకదా యని యడుగుటచే నామెకు రోగమువచ్చిననే లోకమునకు క్షేమమని యప్పుడే చేష్ట చేయకయుండునని భరతుని యభిప్రాయమని తోఁచు చున్నది.

తనకుఁ జెడ్డకలవచ్చుట, దాని ననుసరించి దూతలు వచ్చి తీవరించుట, తన తల్లిగుణము తానే వచ్చి చేయవలసిన యవశ్యకార్యమున్నదని దూతలు చెప్పుట యివి యన్ని యాలోచించినఁ దనతల్లి యేదో కొంప కనర్థము తెచ్చి పెట్టినదని అది తనకుఁదప్ప నితరులకుఁ జక్కఁజేయ సాధ్యముకానిదగుటచేఁ దనకుఁ జెప్పి పంపిరని భరతుఁడు తలఁచెను.

కౌసల్యా సుమిత్రులకంటె గైక చిన్నది. కావున వారి యిరువురక్షేమ మడిగినపిమ్మటఁ గైక క్షేమ మడిగెను. కైక తక్కిన వారినిఁబట్టి నడిమిది కావున మధ్యమాంబయని యరణ్యకాండమునఁ జెప్పఁబడెను. నతేంబా మధ్యమాతాత గర్హితవ్యా కదాచన, యని రాముఁడు లక్ష్మణునితో ననును.

తా త్ప ర్య ము

దూతలారా! మాతండ్రి దశరథమహారాజుగారు కుశలముతో నున్నారా? శ్రీరామచంద్రునకు సుఖమా ? లక్ష్మణు డారోగ్యవంతుఁడేకదా ? వసిష్ఠునకు క్షేమమా? పూజ్యురాలును ధర్మము తెలిసినదియు ధర్మమాచరించుటయందే మిగులఁ బ్రీతిగలదియునగు కౌసల్యాదేవికి భద్రమా ? మిగుల ధర్మమతియు మనోహరమైన స్వభావముగల సుమిత్రాదేవి సంతోషముతో నున్నదా ? తన లాభమే కోరునదియు మూర్ఖురాలగుటచేఁ గ్రూరయును మిగులఁ గోపస్వభావముగలదియు, జ్ఞానము శూన్యమైనను, దన్నుఁ దానొక పండితురాలని తలఁచునదియు, దుష్టురాలగు నాతల్లి కేరోగములేదుకదా ? ఆమె మీరిచ్చటికి వచ్చునపుడు మీతో నేమి చెప్పెను.

చం. అనుడును దూత లెంతొ వినయంబున నాడిరి మీర లిష్టు కో
రినమనవారికిన్ సుఖమె శ్రీసతి పద్మ వరించు గాత ని
న్ననఘు గుణాఢ్య! యేల యిఁక నాలము, వే పయనింపు మన్న నే
జనపతికిన్ వచించి యిదె చయ్యన వచ్చెద నంచుఁ బల్కుచున్. ౧౭౫

ఎంతో=మిక్కిలి, మీరలిష్టుకోరిన మనవారికిన్ సుఖమె=(౧) మీరు కోరిన మనవారలందఱు సుఖులుగానే యున్నారని యొక యర్థము. (౨) రెండవ యర్థంబున వ్యతిరేకార్థక బోధక ప్రశ్నార్థకము. నీవు కోరినవారికిని సుఖమా ? కొంపకూలి యేడ్చుచుండ సుఖమెందుండి వచ్చునని భావము. శ్రీసతి=లక్ష్మీదేవి, పద్మ=చేతియందుఁ బద్మముగలది, పద్మము=ప్రపంచ చిహ్నము ప్రపంచమందలి జీవకోటి స్థితి ప్రవృత్తులామె కరగతములని యర్థము. ఆకారణముచేతనే లక్ష్మీదేవి రూపములు విగ్రహములు దీర్చునపు డామె యెడమచేతఁ గమలముం తురు. లోకేశ్వర యామెయేకదా ? ఇట్లు చెప్పుటచే నీకు రాజ్యపట్టాభిషేకము కాఁబోవునని సూచితము. ఇది వసిష్ఠ నాజ్ఞప్రకారము బహిరంగముగఁ జెప్పరాదుగదా? ఈ కారణముచేతనే ౧౭౪-వ పద్యమందు క్ష్మాకళత్రయని బోధించిరి. అనఘున్=ఏదోషమెఱుఁగని నిన్ను, గుణాఢ్య = ప్రభువుగా నుండువాని కుండవలసిన గుణములు కలవాఁడా? ఆలము=ఉపేక్ష, పయనింపుము=ప్రయాణముచేయుము.

తా త్ప ర్య ము

అని యీప్రకారము భరతుఁడు ప్రశ్నింపఁగా నాలస్యముచేసిన సందేహించునని వెంటనే తమ భావము బయటపడకుండునట్లు మిక్కిలివినయముతో నిట్లు చెప్పిరి. మీరు కోరినవారికందఱకు సుఖమే. నిన్ను దోషరహితుని సాధుగుణా

ఘ్నుని బద్మహస్తయైన లక్ష్మీదేవి వరించునుగాక. ఇంకనేల జాగుచేసెదవు ? శీఘ్రముగ లెమ్ము. ప్రయాణము చేయుము. అని చెప్పఁగా రాజుగారికిఁ జెప్పి శీఘ్రముగా వచ్చెదనని చెప్పుచు.

చం. భరతుఁడు తాతఁ గన్గొని నృ♦పాల యయోధ్యకుఁబోయి వచ్చెదన్
దొరపడు చున్నవార లిదె ♦ దూతలు మీ రెపు డిచ్ఛయించినన్
సరగున నచ్చె వత్తు నన ♦ సమ్మతిఁ జెంది యతండు నాయనా!
గురులఁ బురోధ మంత్రులను♦గూరిమి సేమపుమాట లాడుమీ. ౧౭౬౦

సరగునన్=శీఘ్రముగ, భరతునియొద్దకు దూతలు వచ్చిరని విని యాయన యున్నచోటికిఁ గేకయరాజు యుధాజిత్తు వచ్చిరనికాని భరతుఁడే వారికిని నాఁడు వారికిని జెప్ప వారి యిండ్లకుఁ బోయెననికాని గ్రహింపవలెను.

తాత్పర్యము

భరతుఁడు తాతయగు కేకయరాజును జూచి రాజా! యయోధ్యకుఁబోయి వచ్చెదను దూతలు తీవరించుచున్నారు. మీరెప్పుడు కోరిన నప్పుడు త్వరగా వచ్చెదను. అనిన నా రాజు సమ్మతించి నాయనా గురువులను బురోహితుని మంత్రులను బ్రేమతో సేమ మడిగితినని చెప్పుము.

కం. రామునకును లక్ష్మణునకు, ధీమహితద్విజుల కెల్లఁ♦దెలుపుము కుశలం
బీమహితకంబళాది,స్తోమము వారలకు నెల్ల ♦ సొంపుగ నిమ్మీ. ౧౭౬౧

ధీమహితద్విజులకున్=బుద్ధిబలముచేఁ బూజ్యులగు బ్రాహ్మణులకందఱకు, మహితకంబళాదిస్తోమము=గొప్పవగు కంబళ్ళు మొదలగువాని సమూహము.

తాత్పర్యము

శ్రీరామునకు లక్ష్మణునకు బుద్ధిచేఁ బూజ్యులయిన బ్రాహ్మణులకు మాకుశలము దెలుపుము. ఈ కంబళ్ళు తీసికొనిపోయి వారికందఱ కిమ్ము.

తే. అనుచుఁగాంచననిష్కస♦హస్రయుగముఁ
బదియునార్నూర్లవాజుల♦భరతునకును
గంబళాజినవిత్తంబు♦లింబు మేఱ, నొసఁగె సత్కృతి మున్నుగ♦నుల్లమలర.

కాంచననిష్కసహస్రము = రెండువేల బంగారు నిష్కములు పదునాఱు నూర్ల గుఱ్ఱములను, కంబళాజినవిత్తంబులు = కంబళ్ళు పులి జింక మొదలైన వాని చర్మములు ధనములు సంతోషముతో సత్కారపూర్వకముగ భరతున కిచ్చెను. నిష్కములు,(౧) వక్షోభూషణములు, పతకములు, (౨) దీనారములు బంగారు నాణెములు, "నిష్కోస్త్రీ హేమ్నిదీనారే సాష్టేకర్ష శతేపలే వక్షో విభూషణే కర్ష" యని వైజయంతి.

ఉ. బాసటగాఁగ నశ్వపతి ♦ పంపె నమాత్యుల సద్గుణాఢ్యవి
శ్వాసులఁ బ్రోవఁ దోడుగ వెం♦సం దనయల్లునకున్ యుధాజితుం

డాస నిరావదుద్భవము ♦ లైంద్రశిరంబుల దంతులన్ జవో
ద్భాసిఖరంబులన్ భయద ♦ దంష్ట్రిము లొసెను బ్రోదికుక్కలన్. ౧౭౬.౩

బాసటగాఁగన్=సహాయులుగా, అశ్వపతి=కేకయరాజు, సద్గుణాఢ్య విశ్వాసులన్=మంచి సంపత్తిగలిగి నమ్మఁదగినవారిని, అమాత్యులన్ = అమా=సహ, ప్రాణాన్ త్యజంతి యను వ్యుత్పత్తిప్రకారముకూడఁ బ్రాణము నిచ్చువారు అని యర్థము. మంత్రులు=ఆలోచన చెప్పువారు- ఆలోచనలు కార్యరూపముగఁ బరిణమింపఁజేయువా రమాత్యులు. ఇరావదుద్భవము=ఇరావంతమను పర్వతమునఁ బుట్టినవి, ఐంద్రశిరంబులన్=ఇంద్రశిరమను పర్వతమునఁబుట్టినవి, దంతులన్= ఏనుఁగులను, జవోద్భాసిఖరంబులన్=వేగముచేఁ బ్రకాశించు కంచరగాడిదలను, భయదదంష్ట్రిములు=భయము కలిగించు కోఱలుగల పెద్ద సాకుడు కుక్కలను.

తాత్పర్యము.

అశ్వపతియగు కేకయరాజు భరతునకు సహాయులుగా మంచి గుణసంపత్తి గలిగి నమ్మఁదగినవారలను త్రోవతోడుగఁ బంపెను. మేనమామయగు యుధాజిత్తుఁడు దన మేనల్లునకు నాశతో నిరావంతమునందు నింద్రశిరంబునందుఁ బుట్టిన యేనుఁగులను వేగముచేఁ బ్రకాశించు కంచరగాడిదలను భయంకరములైన కోఱలుగల సాకుడు కుక్కలను నిచ్చెను.

ఉ. ఇచ్చినవానిఁ గైకొనియు ♦ నేమిముదం బెద లేక స్వప్నయా
వచ్చరితంబు దూత లిడు ♦ వావిరితీవరపాటు నెంతయే
నిచ్చ మెలంగఁగా భరతుఁ ♦ డేగఁ గడంగినయంతఁ దాతయున్
సచ్చరితుండు మామయును ♦ సమ్మతి వీడ్కొలుపన్, రథంబులన్. ౧౭౬౪

స్వప్నయావచ్చరితంబు=కలలోఁదోఁచిన సమస్తవిషయములును, కడంగిన యంతన్=ప్రయత్నము చేయఁగా, వీడ్కొలుపన్=పోయిరమ్మని సాగనంపఁగా.

తాత్పర్యము

ఇట్లు మేనమామ యిచ్చినవానిని దీసికొనియుఁ గొంచెమైన మనస్సులో సంతోషమనునదిలేక కలలోఁదోఁచిన విషయము, దూతలుపెట్టు తొందర మనస్సులో మెదలుచుండఁగా భరతుఁడు పోవఁ బ్రయత్నింపఁగాఁ దాతయు మంచి నడవడిగల మేనమామయు నిండుమనస్సుతో సాగనంపఁగా రథంబులందు.

ఉ. తమ్ముఁడుఁ దాను నెక్కి సుర♦ధామము వెల్వడుసిద్ధుపోల్కి వే
గమ్మున నూరు వీడి బల♦కాండము గొల్వఁగ మండలోరుచ
క్రమ్ముల నొప్పు తేర్లు తుర♦గమ్ములు గోవులు నుష్ట్రసంఘముల్
సమ్మతిఁ గొంచు భృత్యజన♦సంతతి వెంబడి రా మహాత్వరన్. ౧౭౬౫

సురధామము=స్వర్గము, బలకాండము=సేనాసమూహము, మండలోరు చక్రమ్ములన్=గుండ్రమై గొప్పవగు చక్రములచే, ఉష్ట్రసంఘముల్=ఒంటెల గుంపులు- తమ్ముఁడు తానునెక్కెననుటచే భరతునకంటె శత్రుఘ్నుఁడు తొందర పడుచున్నాఁడని భావము. తాత్పర్యము.

తమ్ముఁడు తాను నెక్కి స్వర్గమునుండి బయలు వెడలిన సిద్ధునివలె శీఘ్రమ్ముగ నూరువిడిచి సేనలు గొలువఁగా వర్తులు గొప్పవయిన చక్రములచే నొప్పు తేర్లు గుఱ్ఱములు నావులు ఒంటెల సంఘములుకూడఁ దీసికొని బంటులు తనవెంటరాఁగా మిగుల వేగమున-

—♦ ౭౧-వ సర్గము. భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణం బగుట. ♦—

సీ. రాజగృహమునుండి♦ప్రాఙ్ముఖుండై కొంత,
చని సుదామాఖ్యంబు♦ధునిని దఱిసి
యతివిశాలం బగు♦హ్లాదిని దరియించి, పశ్చిమముఖ మయి♦పాఱునది శ
తద్రు వేలాధాన♦తటమున లంఘించి, యపరపర్పటముల♦నాశ్రయించి
ఘనశిలావహనది♦ననఘుఁడు దాఁటుచు, నాగ్నేయమున హృద♦యానురంజ

తే. కంబు నగుపురమును శల్య♦కర్తనంబుఁ
జూచి చైత్రరథంబున♦సొంపు మెచ్చి
గంగయు సరస్వతియునాఁగ♦రంగుమీఱు
జోడునదులను గాంచి యా♦సూర్యకులుఁడు. ౧౭౬౬

ప్రాఙ్ముఖుండై=తూర్పుముఖముగలవాఁడై, ప్రాక్+ముఖము=ప్రాఙ్ముఖము. అనునాసికములు పరమగుచోఁ బదాంతములైన యక్ప్రత్యాహార వర్ణంబుల కావర్గమందలి యనునాసికవర్ణములు వికల్పముగ నాదేశమగును- ధునిని =నదిని, తఱిసి = సమీపించి- హ్లాదిని; ఏలాధానతటమునన్ =ఏలాధానమను పురమునొద్ద- ఏలకులు పుట్టుప్రదేశము గావున దీనికి నేలాధానమనిపేరు. అపర పర్పటములన్ = అపరపర్పటమనెడి గ్రామములను- పర్పటములు అది యొక జాతి యోషధీలతలు- వానికి సమీపమునసుండు గ్రామములు- పర్పటములు- 'అచూరభవశ్చ' యనెడి పాణిని సూత్రప్రకారము వచ్చిన తద్ధితప్రత్యయము నకు 'వరణాదిశ్చ' యనుపాణిని సూత్రప్రకారము లోపము లుపియుక్త వద్వ్యక్తి వచనతా' యను సూత్రానుసారము ముందున్న ప్రయత్యయము లోపించినను నున్నది అందేకవచనార్థమే. పూర్వ పర్పటమని యొకగ్రామము. అపరపర్పట మని యొకగ్రామము. ఆశ్రయించి=అలసట తీర్చుకొనుటకై పొంది, శిలావహ నది- శిలావహయను గొప్పనది- ఱాలను లాగునది కావున శిలావహయని పేరు. ఆగ్నేయమునన్ = అనదికి నాగ్నేయదిక్కునను, హృదయానురంజకము=మన స్సును సంతోషపఱుచునది, శల్యకర్తనము = శల్యకర్తనమను పట్టనము- (మనస్సులోని శల్యము=దుఃఖమును కర్తనము=కత్తిరించునది- కావున శల్య కర్తనమని పేరు)చైత్రరథంబున సొంపు=చైత్ర రథమునందలి సొంపు,అలుక్స

మానము- కుబేరుని వనమగు చైత్రరథముతో సమానముగ నుండుటచే నాపేరు పెట్టఁబడినది- గంగా సరస్వతులు- ఇచ్చట గంగయనఁగా సింధునది- గంగయె మూఁడు పాయలయ్యెననియు నందు సింధువొకటి యనియు బాలకాండమునఁ జెప్పఁబడెను (చూ. ప. ౬౦౩ బాల.) యమునదాఁటిన పిమ్మట భాగీరథిని దాఁటినట్లు ౧౭౬౭-వ పద్యమునఁ గలదు కావున నిది యదిగాదు.

దూతలు పోవునపుడు గుఱ్ఱములపై బోయిరి కావున సమీపమార్గమునఁ బోయిరి. ఇప్పుడు సేనతోడ నాత్రోవఁబోవ సాధ్యపడదు. కావున మఱియొక త్రోవ పోవలసివచ్చెను. కావున మార్గములు భిన్నములు.

తాత్పర్యము

రాజగృహమునుండి తూర్పుదిక్కుగాఁ గొంతదూరముపోయి సుదామ యను నదిని సమీపించి మిగుల విశాలమైన హ్లాదినిదాఁటి యక్కడినుండి పశ్చిమ దిశగాఁ బాఱు శత్రుదునదిని నేలధానమను నూరియొద్దదాఁటి యపర పర్పట ములయొద్దఁ గొంచెముసేపు నిలిచి యావల శిలావహయను నదినిదాఁటి యచ్చటినుండి యాగ్నేయదిశయందు శల్యకర్తనమను పురమునుజూచి చైత్ర రథమును దర్శించి గంగాసరస్వతులను రెండునదులను జూచి-

సీ. వీరమత్స్యోత్తర • భారుండవనిఁ జొచ్చి, కొండలనడుమను • గొమరు మీఱు
నలకుళింగంబు నా • వల యమునాతీర,
మున బలంబులుఁ దాను • ముదము మీఱ
విడిసి సేదలు దీర్చి • కడిగి గుఱ్ఱంబులఁ దాము మజ్జన మాడి • దప్పి తీఱ
జలములు గ్రోలి యా • వలనీరములు లేమి, జలము లానదియంద • సంగ్రహించి
తే. ఘోరవనములలోఁ జొచ్చి • కుంజరంబు, మీఁద రాకొమరుండు దా • మింటఁజనెడి
గాలిపోలిక వానిని • లీల దాఁటి, చేరె భాగీరథీనదీ • తీరభూమి. ౧౭౬౪

వీరమత్స్యోత్తర భారుండవనిన్ = వీరమత్స్యములనెడి దేశముల కుత్తర మునునుండు భారుండమను వనమునఁ బ్రవేశించి, సేదలుదీర్చి బడలికఁ బోవఁ జేసికొని, ఆత్మనేపద+మనిత్యము గావునఁ దీర్చియని చెప్పఁబడియె. మజ్జనము =స్నానము, కుంజరము=ఏనుఁగు, మింటఁజనెడిగాలి=నేల నానుకొనిపోవుగాలి వనపర్వతముల కారణమున మందవేగమై యుండును- ఆకాశమున నడ్డములేక వేగమునఁ బోవును.

తాత్పర్యము

వీరమత్స్యములను దేశముల కుత్తరమునునుండు భారుండవనమునఁ బ్రవేశించి కొండల నడుమనుండు కుళింగదేశమున కావల యమునాతీరమున సేనలు దాను నిలిచి బడలిక దీర్చుకొని గుఱ్ఱములఁ గడిగి తాను స్నానముచేసి దాహమాఱ మంచినీళ్ళుద్రావి యావల నీళ్ళులేమిని నచ్చటనే జలములు పదిల పఱచుకొని యడవి ప్రదేశములలోఁ దూటి భద్రజాతి యేనుఁగుమీఁద వానినెల్ల దాఁటి భరతుఁడు గంగాతీర ప్రదేశముఁ జేరెను.

తే. అంశుధానాఖ్య దేశంబు•నందుఁ బ్రాగ్వ,టాఖ్యపురిని భాగీరథి•నధిగమించి
యవలఁ గుటికోష్టికానది•యవల ధర్మ, వర్ధనాఖ్యపురంబును•వరుసఁ గాంచి.

అంశుధానమను దేశమందుఁ బ్రాగ్వటమను పురమునొద్ద గంగను దాఁటి యవలఁ గుటికోష్టికానది యవల ధర్మవర్ధనమను పురమును వరుసఁజూచి.

సీ. తోరణదక్షిణ•ధారుణి నుండి జం,బూప్రస్థనామక•పురముఁ జేరి
రమ్యవరూథ మన్•గ్రామంబు దరి వనీ,స్థలి నిల్చి తూర్పుగఁ•జనుచు నుజ్జి
హానంబునం బ్రియ•కారామమును డాసి, యచ్చట జవనంబు•లశ్వములను
రథమునకును గట్టి•రాజకుమారుండు, వాహిని మెల్ల రాఁబలికి తూర్ణ

ఆ. ముగను ద్రోవనడచి•మొగి సర్వతీర్థంబు,నందు నొక్క రేయి•యనఘుఁడుండి
యొప్పఁగాఁగఁగదలి•యుత్తానికాదివా,హినులఁ గుటికహస్తి•పృష్ఠకమున.

తోరణ దక్షిణధారుణినుండి=తోరణదేశమున దక్షిణ భాగమునుండి, వాహిని=సేన.

తాత్పర్యము

తోరణదేశమున దక్షిణభాగమునుండి జంబూప్రస్థమను పురముఁజేరి యావల రమ్యవరూథమను గ్రామము సమీపమున వనమునందు నిలిచి తూర్పుగఁ బోవుచు నుజ్జిహానమునొద్దఁ దమరాష్ట్రములోఁ జేరిన ప్రియకమను కడపచెట్ల వనమును సమీపించి యచ్చట నేనుఁగుడిగి వేగవంతంబులైన గుఱ్ఱములను రథమునకుఁ గట్టించి యందుఁ గూర్చుండి భరతుఁ డిఁకమీఁద మన రాష్ట్రము గావున మెల్లగా రండని సేనలకుఁజెప్పి శీఘ్రప్రయాణముచేసి సర్వతీర్థంబునందు నొక్కరాత్రియుండి యక్కడనుండి పయనమై లోఁతులేనిదగుటచే నుత్తానక యనునది మొదలగు నదులను దాఁటి కుటికయను నదిని హస్తిపృష్ఠకమునందు దాఁటి (ఏనుఁగువీపువలె తెత్తైనది హస్తిపృష్ఠకము)

సీ. దాఁటి లౌహిత్యప•త్తనసమీపమునఁ గ,పీవతిఁ దఱియించి•వీరవర్యుఁ
డేకసాలంబునఁ(లెసఁగుస్థాణుమతిని, వినతంబునను గోమ•తిని గమించి
యధ్వపరిశ్రాంతి•యణఁగఁ గళింగపు, రంబున సాలవ•నంబునందు
నొక్కింత నిలిచి రే•తక్కక యది దాఁటి, యరుణోదయంబున•భరతుఁ డాత్మ

తే. పురము మనునిర్మితంబయి•సిరులమీఱు,
నయ్యయోధ్యను గనుఁగొనె•నవనినాథ
తనయుఁడిట్టులుసప్తరా•త్రములునడచి,
తనదుపురమునుజూచిసూ•తునకుననియె. ౧౭౭౧

అధ్వపరిశ్రాంతి = దోవనడచినగాసి, ఒక్కింత = కొంచెముసేపు, అరుణోదయంబునన్=సూర్యోదయమువేళ, సప్తరాత్రములు=ఏడురాత్రులు- ఏకదేశ సంఖ్యావ్యయవంబులకును సర్వసంఖ్యాత పుణ్యశబ్దములకును బరమైన రాత్రిశబ్దము అకారాంతమగును. సు. వ్యా. సమాస ౨౩ సూత్ర. కపీవతి = అన్యేషామపి దృశ్యత యను సూత్రప్రకారము దీర్ఘము.

తాత్పర్యము

ఎఱ్ఱమట్టి గలదగుటచే లౌహిత్యమను పేరుగల పట్టనమునొద్దఁ గ్రోఁతులు పెక్కులుండుటచే, గపీవతి యనుపేరుగల నదినిదాఁటి యేకసాలమందుండు స్థాణుమతీ నదిని వినతమునొద్ద గోమతీనదిని దాఁటి యచట దోవగాసి శమింపఁ గళింగపురమున సాలవనంబునందుఁ (మద్దితోఁపు) గొంచముసేపు నిలిచి రాత్రి వేళనే యది యెల్లదాఁటి యరుణోదయంబున భరతుఁడు దను యయోధ్యా పురమును జూచెను. ఈవిధముగా నేడురాత్రులు ప్రయాణముచేసి యెనిమిదవ దిన ముదయము దూరమునందే యయోధ్యనుజూచి తన సారథితో నిట్లనియె.

—♦ భరతుఁ డయోధ్యాదుస్స్థితికి వగచుట. ♦—

ఉ. సారథి! కంటివే నృపతి♦సత్తమపాలిత మౌచు యజ్వసం
వారములన్ శమాదిగుణ♦భాసురపాళుల వేదపారగో
దారచయంబులన్ వెలసి ♦ తద్దయుఁ దెల్లనిసుద్దఁ బోలుచున్
దూరదృష్టి కీపురము ♦ దోఁచి ముదంబు ఘటింప దేలొకో. ౧౭౭౧

నృపతిసత్తమ=రాజశ్రేష్ఠుఁడగు దశరథునిచే, పాలితము=రక్షితము, యజ్వ సంవారములన్=శాస్త్రప్రకారము యజ్ఞముచేసిన దీక్షితులసమూహము, శమాది గుణభాసుర పాళులన్ = శమదమాది గుణములచేఁ బ్రకాశించువారును, వేద పారగ = వేదమును సాంతముగఁ జదివినవారలయు, ఉదారచయంబులన్ = గొప్పవారునగు బ్రాహ్మణుల సమూహములచే.

తాత్పర్యము

చూచితివా సారథీ! యయోధ్యయెట్లున్నదో రాజులందు శ్రేష్ఠుఁడయిన దశరథుఁడు పాలించుచున్నను యజ్ఞములు చేసినట్టియు శమదమాది గుణము లచేఁ బ్రకాశించునట్టియు వేదములు తుదముట్ట నధ్యయనముచేసినట్టియు గొప్ప వారల సమూహముచే నొప్పియు నెత్తురులేనివాని ముఖమువలెఁదెల్లనై తెల్లసుద్ద వలె దూరమునుండిచూడఁగా నీయయోధ్య నాకు సంతోషము కలిగింపకున్నది.

దశరథుఁడు పోయినది మొదలుగ నిండ్లకు సున్నముకొట్టుట మొదలగు సంస్కారములు లేకపోవుటచేఁ గాంతిచెడి సుద్దవలె నున్నదని భావము.

కం. మున్నెప్పుడుఁ గలకల మని, యన్నులపురుషులరవంబు♦లతిదూరమునన్
జెన్నుగ వినఁబడు నిపు డా సన్నంబున కరిగి వినము♦సారథి యేలా?

అన్నుల=స్త్రీల, రవంబులు=ధ్వనులు, ఆసన్నంబునకున్=సమీపమునకు.

తాత్పర్యము

పూర్వము సకలవేళల స్త్రీల పురుషుల గలగలమను ధ్వని దూరమునకే వినవచ్చుచుండును. ఇప్పుడు సమీపమునకు మనమువచ్చినను వినఁబడకున్నది సారథీ! యేమికారణమై యుంౘును.

కం. కేళీలీలాలోలజ, నాలులు సాయంతనముల ♦ నారామములన్
హాళిమెయి నుండి వేకువ, నేలా చన రిండ్లకడకు♦నియ్యెడ సూతా. ౧౭౭౩

కేళీలీలాలోల జనంబులు = క్రీడా విలాసంబులందు నాసక్తిగల జనంబులు, ఆరామములందున్=తోఁటలయందు, హాళిమెయిన్=సంతోషముగ.

తాత్పర్యము

విలాసముగాఁ గ్రీడించుటయం దాసక్తిగల మనుష్యులు సాయంకాలములందుఁ దోఁటలలోఁ గ్రీడించి యుదయమున వారివారి యిండ్లకుఁ బోవుచుందురు. ఇప్పుడొకఁడైనఁ బోవువాఁడు లేకున్నాఁడే. ఏలసూతా.

శా. నాకుం జూడఁగ సారథీ! పుర మర♦ణ్యప్రాయమై తోఁచెడిన్,
రాకల్ పోకలు సేయ రెవ్వరుఁ బురిన్ ♦ యానంబులం దేని, నా
నాకుంభీంద్రతురంగమంబులపయి ♦ న్హర్షంబున న్లోకు ల
స్తోక క్రీడలు సల్ప రెవ్వ, రెదయున్ ♦ దోలాయితం బయ్యెడిన్. ౧౭౭౪

అరణ్యప్రాయము=అడవితో సమానము, యానంబులందున్=వాహనములందు, నానాకుంభీంద్ర=అనేకములైన యేనుఁగులమీఁదను, తురంగమంబులపయిన్=గుఱ్ఱములమీఁదను, అస్తోక క్రీడలు=గొప్పయాటలు, దోలాయితంబు=ఉయ్యేలవలె నూఁగునది- దోలా రూ. డోలా. తద్భ. డోలి.

తాత్పర్యము.

సారథీ నాకుఁజూడ మనుష్యసంచారములేని వనమువలెఁ నయోధ్య గానవచ్చుచున్నది. వాహనములమీఁద నొకరైనను బురినుండి వచ్చువారులేరు. పురికిఁ బోవువారులేరు. పెక్కులగు నేనుఁగులమీఁద గుఱ్ఱములమీఁదఁ గ్రీడ సలుపువారు కానరాలేదు. ఇవన్నియుఁజూడ మనస్సు సందేహముచే నుయ్యాలవలె స్థిరములేక యున్నది.

ఉ. మత్తశుకీపికంబులను ♦ మంజులరంజక కందళంబులన్
హత్తినకేళికారతి స ♦ మాగతసుందరబృంద సంగతిన్
జిత్త మిగుర్పఁ జేయుసర♦సీసుమమందిరకందరంబులన్
సత్త నెసంగుతోఁట లివి ♦ సారథీ! యేగతి పట్టెఁ జూచితే. ౧౭౭౫

మత్తశుకీపికంబులను=మదించిన యాఁడు చిలుకలచేతను కోవెలలచేతను, మంజుల=సుందరములై, రంజక = మనస్సును రంజింపఁజేయు, కందళంబులన్=చిగుళ్ళచేతను, హత్తిన=పొందిన, కేళికారతిన్=ఆటలయందలి ప్రీతిచేతను, సమాగతసుందర బృందసంగతిన్ = గుమిగూఁజేరిన యందగాండ్ర గుంపుల కూడికచేతను, సరసీ = కొలఁకులచేతను, మందిర = ఇండ్లు, కందరములు = గుహలు వీనిచేతను, సత్త=సత్తువతోను.

తా త్ప ర్య ము

మదించిన యాఁడుకోకిలలచేతను చిలుకలచేతను రమ్యమై మనస్సును సంతోషింపఁజేయు చిగుళ్ళచేతను ఆటలయందుఁ బ్రేమగలుగుటచే వచ్చిన సుందరుల గుంపులచేతను మనస్సు చిగిరించునట్లుచేయు కొలఁకులు పూల యిండ్లు పూలగుహలు వీనిచేతను సారవంతమై ప్రకాశించు తోఁటలివి విచారించువారులేమి నేగతిపట్టినవో చూచితివా.

కం. రాలెడునాకులతోడను, వ్రీలెడుశాఖాచయముల♦వృక్షంబు లయో
గోలున నేడ్చెడి రీతిని, లీలాచ్యుతిఁ దోఁచె సూత ♦ లీలావనులన్. ౧౭౭౬

తా త్ప ర్య ము

రాలుచున్న యాకులతో విఱిగిపడెడు కొమ్మలతో గోలుగోలున నేడ్చున ట్లందముచెడి క్రీడావనములందుఁ జెట్లెట్లున్నవో చూడుము.

కం. కనరా రొక్కరుఁ దోఁపుల, వినరాదు విహంగరుతము♦వీనుల కింపై
చనుదేర దగురుచందన, ఘనధూపమిళత్సమీరు♦కమ్మనితావుల్. ౧౭౭౭

తా త్ప ర్య ము

తోఁపులందు నొకరైనను గనులకుఁ గానరాకున్నారు. వీనులకు నింపు గలుగ పక్షులధ్వనియు వినరాకున్నది. అగరు చందనము వీని గొప్ప పొగలచేఁ గూడిన గాలి కమ్మని వాసనలతో వీవకున్నది.

కం. భేరీమృదంగవీణా, చాయనినాదములు తొల్లి♦చందంబున నే
లా రావు వినఁగ శకునము, లారయ మేల్గావు హృదయ♦మాకులతఁ
[గనెన్.

తా త్ప ర్య ము

భేరులయు మృదంగములయు వీణెలయు మనోహరములైన ధ్వనులు పూర్వమువలె నేలవినరాకున్నవి. ఆలోచింపఁగా శకునములు మంచివిగావు. కావున హృదయము కలఁత చెందెను.

ఈ వర్ణనముఁబట్టి భరతుఁడు నగరము సమీపించెనని తెలియవలయును.

చం. ధ్రువ మిది యెట్టులున్ శుభము♦దుర్లభ మౌను మదీయబంధులం
దవశతఁ జెందెడిన్ హృదయ♦మారటపాటున నంచుఁ దత్పురిన్
జవమున వైజయంత మను♦సత్ప్రథఁ గాంచినద్వారసీమఁ జొ
చ్చి విజయ మడ్గుదర్శకులు ♦ చెచ్చెర రా వెనువెంట నేగుచున్. ౧౭౭౯

తా త్ప ర్య ము

ఇది నిశ్చయము. నా సమీప బంధువులం దెవరికో యేమో యశుభము ప్రాప్తించినది. ఆరాటముచే నా మనస్సు పరవశమైపోవుచున్నది. అని చెప్పుచు వైజయంతమను పేరుగల పడమటి గవనిలోనుండి నగరములోఁ బ్రవేశించి తన్నుఁ జూచి విజయమును బ్రశ్నచేయువారు తనవెంటఁ ద్వరగా రాఁగా నూరిలోఁ బోవుచు.

చం. పరిపరిరీతులన్ మనము ♦ బ్రద్దలు వాఱఁగ సూతుతో ననున్
గురుఁడు వసిష్ఠుఁ డేమిటి కొ♦కో పిలిపించె నకారణంబుగన్
దొర తొర రమ్మటంచు ననుఁ ♦ దోఁచె నెదో యశుభంబు గల్గెడిన్
విరవిర వోయె మేను గడు♦విహ్వలభావము గాంచెఁ జిత్తమున్. ౧౭౮౦

తా త్ప ర్య ము

భరతుఁడు సారథితో నిట్లనియె. సారథీ! యాలోచించుకొలఁది నామనస్సు నానావిధముల బ్రద్దలు బ్రద్దలుగాఁ బగిలిపోవుచున్నది. పెద్దవారు దశరథుఁడు శ్రీరాముఁ డుండంగా వసిష్ఠుఁడు నన్నుఁ బిలిపింపఁ గారణమేదైన నుండవల యునుగదా? తొందర తొందరగా రమ్మని వసిష్ఠుఁడు చెప్పి పంపినపుడు దాని కేదియో కారణము లేకుండునా? ఇవన్ని చూచిన నేదో కీడుమూఁడినట్లే తోఁచు చున్నది. దేహమా విరవిర పోవుచున్నది. మనస్సా విహ్వలమగుచున్నది.

చం. నృపతివినాశకాలమున ♦ నేవి ఘటిల్లు నటంచు వింటినో
యిపు డవి యెల్లఁ దోఁచెడిని ♦ నిచ్చట సారథి! పెంట లూడ్చుటో,
విపులసుధూపధూపములు♦వెల్వడుటో, పచనంబు సేయుటో,
సపరికరంబుగా బలులు ♦ సల్పుటయో, కన మీగృహంబులన్. ౧౭౮౧

తా త్ప ర్య ము.

ఇది వీథులవెంటఁబోవుచు ననుకొనుమాటలు రాజు మరణించి నపుడేవేవి జరుగునని ముందు వింటినో యవియెల్ల నిప్పు డీయూరఁ గానవచ్చుచున్నవి. అవి యేవియంటివా? ఈ యిండ్లలోఁ గసవూడ్చుటలేదు. మంచి వాసనగల పొగలు బయలుదేఱుటలేదు. వంటలులేవు. కావలసిన వస్తువులతోఁ బూజలు సలుపుటయులేదు.

కం. గేస్తులభవనము లెల్లన, పాస్తశ్రీకంబు లయ్యెఁ♦బ్రభ చెడిరి జనుల్
సిస్తుగఁ బూలవిపణులను, రస్తులు గన రా వొకండుఁ♦గ్రయ్యంబగుచున్.

గేస్తులభవనములు=గృహస్థులయిండ్లు, అపాస్తశ్రీకంబులు = పోయిన లక్ష్మి కలవి, పూలవిపణులన్ = పూలయంగళ్ళయందు, క్రయ్యంబగుచున్ = విక్రయింపయోగ్యమై, రస్తులు=పదార్థములు.

తా త్ప ర్య ము

గృహస్థులయిండ్లన్నియుఁ గాంతివిహీనములై లక్ష్మి తొలఁగిపోయినట్లు న్నవి. జనులు కాంతి చెడియున్నారు. అందముగాఁ బూలయంగళ్ళయందు నమ్మఁదగిన పదార్థమొకటియు లేకున్నది.

చం. అలుకవు, రంగవల్లుల జ♦నావళు లుంపవు, దేవతాగృహం
బుల రమణీయ మాల్యములఁ♦బూన్పవు, మానిసి మోముఁ జూడఁగా
నలవడ దందుఁ బాడిడిన♦యట్టులు దోఁచెను, గుళ్ళు దొల్లియ
ట్టుల లసియింప వేలొకొ క♦డుం బరితాపము పుట్టె సారథీ. ౧౭౮౩

తాత్పర్యము.

జనములు దేవాలయముల నలుకలేదు. ముగ్గులు పెట్టలేదు. మంచి పూల దండలు వ్రేలఁదీయలేదు. మనుష్యుల ముఖము చూతమనఁ గానరాదు. అన్నియుఁ బాడుపడినట్లున్నవి. ఏలొకో గుళ్ళు మునుపటివలెఁ బ్రకాశించుట లేదు. ఇవన్నియుఁ జూచిన మిక్కిలి పరితాపము కలుగుచున్నది.

కం. కొన రమ్మరు వైశ్యులు చిం,
తను మునిఁగినవార లయి య•థాపూర్వముగన్
గన రారు వాడుమోములఁ, బని చెడి యున్నార లేమి•భంగియొ సుతా.

తాత్పర్యము. ౧౫౪౪

వైశ్యులు కొనుటయులేదు అమ్ముటయులేదు. అందఱు వ్యసనములో మునిఁగియున్నారు. మునుపటివలెఁ గానరాకున్నారు. వాడిన ముఖముతోఁ బని చెడియున్నారు, ఏమిటికోగదా ?

ఉ. కోవెలలలందుఁ జైత్యముల • గూరిన పెంపుడుపుల్గులున్ వ్యథా
భావములన్ శిరంబు లర•వ్రాల్చి తొరంగెడి బాష్పవారితో
వావిరిపల్లటిల్లెడిని • వారిజనేత్రలు పూరుషుల్ దురం
తావిలవృత్తి నార్తిపడ•నయ్యె కతం బది యేమొ దైవమా. ౧౫౪౫

తాత్పర్యము

దేవాలయములందును రచ్చకొట్టములందునుగల పెంపుడు పక్షులు దుఃఖ భావములతోఁ దలలు నగమువంచి కాఱుచున్న కన్నీటితో మిక్కిలి శోకించుచున్నవి. స్త్రీలు పురుషులు నంతములేని కలఁతతో శోకింపఁగారణమేమి కలిగెనో?

ఉ. వాటికి సూతుతో నిటులు•మాటలు చెప్పుచుఁ బోయి శూన్యశృం
గాటక వేశ్మరథ్యముల • గాఢరజోరుణయంత్రదేహళీ
వాటక వాటఝూటముల • వర్తిలుస్వర్గనికాశ మైనయు
వ్వీటిని జూచి దుఃఖమున•విహ్వలుఁడై తల వాంచి వేగియై. ౧౫౪౬

వాటికిన్ = పలుమాఱు, శూన్య = జనములులేని, శృంగాటక = నాలుగు త్రోవలు కలియుచోటులచేతను, వేశ్మములన్ = ఇండ్లచేతను, రథ్యములన్ = వెడలుపు బాటలచేతను, గాఢ=అధికమైన, రజస్=దుమ్ముచే, అరుణ = ఎఱ్ఱనైన, యంత్ర=యంత్రములయు, దేహళీ=కడపలయు, కవాట=తలుపులయు, ఝూట ములన్=సమూహములచే, స్వర్గనికాశము=స్వర్గముతో సమానము, వీటిన్ = పట్టణమును, విహ్వలుఁడై =కలఁత చెందినవాఁడై.

తాత్పర్యము

ఎడపాదడపా యీప్రకారము సారథితో మాటలు చెప్పుచుఁబోయి జనములులేని నాలుగుత్రోవలు కలియుచోటులను,ఇండ్లను వీథులను ఉపయోగింపకుండుటవలన నధికమైన దుమ్ముచే నెఱ్ఱనైన యంత్రములు కడపలు తలుపులు

వీని సమూహములచే వర్తిలుచు పూర్వము స్వర్గముతో సమానమైయుండిన యా యయోధ్యా పట్టణమును జూచి దుఃఖముచేఁ గలఁతచెందిన మనస్సుగల వాఁడై తలవంచుకొని వేగమున.

—♦ ౭౨-వ సర్గము. భరతుఁడు కైకేయి మేడకుఁ బోవుట. ♦—

కం. జనకుని మేడకుఁ జని యట,
జనకుఁడు గనరామి నతఁడు♦చయ్యనఁ జనుడున్
జననీగృహంబులోనికిఁ, దనప్రోషితసుతునిఁ జూచి♦తతమోదమునన్. ౧౭౮౭

తాత్పర్యము

తండ్రి యెప్పుడుండు మేడకుఁబోయి యచట నాయన లేకుండఁగా దల్లి యింటిలోనికిఁ బోఁగాఁ బరదేశముపోయి యుండివచ్చిన తన కొడుకును జూచి కైక మిక్కిలి సంతోషముతో.

కం. కనకాసనంబుఁ దటుకున, జనయిత్రియు దుముకఁ జూచి♦చరణంబులకున్
వినతుండయినన్ భరతుం, దనయంకముఁ జేర్చి శిరము♦దా మూర్కొనుచున్

కనకాసనంబున్ = బంగారుపీఠమునుండి, వినతుండు = నమస్కరించిన వాఁడు, అంకము=తొడ, మూర్కొనుచున్=వాసనచూచుచు.

తాత్పర్యము

బంగారుతోఁ జేయఁబడిన యెత్తు పీఠముపైఁ గూర్చుండిన తల్లి తన్నుఁ జూచి తటాలున నేలదుముకఁగా భరతుఁడు పాదములకు నమస్కరింపఁగాఁ బుత్రునిఁ దన తొడలపైఁ గూర్చుండఁబెట్టుకొని శిరము వాసనచూచి యిట్లనియె.

శా. ఎన్నాళ్ళాయెనొ యూరు విడి తనయా♦యెంతేఁ బథశ్రాంతిచే
నున్నావోకద? మేనమామ సుఖియై♦యున్నాఁడుగా? యందు నీ
విన్నాళ్లెట్టులు ద్రోచి? తక్కడ ముదం ♦ బేపారెనా నీకు? నా
యన్నా! కన్నులఁ గట్టు చుండితివిగా♦యత్యంతమున్ నా కిటన్. ౧౭౮౯

పథశ్రాంతిచేన్=మార్గాయాసముచేత.

తాత్పర్యము

నాయనా! నీవూరు విడిచి యెన్నాళ్ళాయెను? మార్గాయాసమున మిగులఁ బడలియున్నావుకదా? మేనమామ సుఖమా? ఏవిధముగా నీవచటఁ గాలముఁ ద్రోచితివి. అక్కడ నీకు సంతోషముగా నుండెనా? అన్నా! యిన్నాళ్ళిచ్చట నాకుఁ గన్నులఁగట్టి నట్లుంటివికదా ?

కం. అని యడిగిన నిజజననికి, ననియెన్ భరతుండు నేఁటి♦కాటునొకండున్
జనె నమ్మ రేలు మామస,దనమును నే విడిచి లెస్స♦తాతయు మామన్.

తాత్పర్యము ౧౭౯౦

అని తల్లి యడుగఁగా భరతుఁ డిట్లనియె. అమ్మా! నే నూరు విడిచి యేడు రాత్రులు గడచెను. తాత మామ యందఱు క్షేమముగా నున్నారు.

కం. వారిడిరి ధనము లెల్ల న,వారిగ నవియెల్ల మెల్ల♦వచ్చుచు నుండన్
దారిన్ మున్నే వచ్చితిఁ, దీరక సందేశహరులు ♦ తీవరపెట్టన్. ౧౭౯౧

అవారిగన్=విస్తారముగ, సందేశహరులు=దూతలు.

తాత్పర్యము

వారు నాకు దండిగ ధనమిచ్చిరి. అవి యెల్ల మెల్లగ వెనుక దోవలో వచ్చుచున్నవి. దూతలు తొందరపెట్టిన కారణమున ముందుగా నేను వచ్చితిని.

చం. అడిగినవాని నీవు చెపు♦మా జననీ! కనకాంచితంబు నీ
పడుకొనుపాన్పు శూన్య మయి♦భాసిల కున్నది రాచవారలున్
మిడికెద రేల దీనత; న♦నింద్యచరిత్రుఁడు తండ్రి యింద యె
ప్పుడు భవదీయ గేహమునఁ♦బొల్చును నేఁ డిట లేఁ డ దేమొకో? ౧౭౯౨

కనకాంచితంబు = బంగారుచేఁ బ్రకాశించునది, శూన్యమయి = సంస్కారములేనిదై, భాసిలకున్నది=ప్రకాశింపకున్నది, రాచవారలు=రాజబంధువులు లోనగువారు, అనింద్యచరిత్రుఁడు = నిందింపఁబడని నడవడి కలవాఁడు, ఎప్పుడు=సర్వదా, భవదీయగేహమునన్=నీ యింట.

ఆ ముచ్చట లటుండనిమ్ము. నా ప్రశ్నలకుఁ బ్రత్యుత్తరము లిమ్ము. తల్లీ! నీవు పండుకొను పానుపు పాడుపెట్టినట్టులేల వాడుకొనఁబడక సంస్కార శూన్యమై ప్రకాశింపకున్నది. ఏల రాజబంధువులు రాజునకు సంబంధించిన వారు దుఃఖపడుచున్నారు? దోషరహితుఁడైన నా తండ్రి రాజకార్యములు లేని యప్పు డెప్పుడును నీ యిల్లు విడిచియుండఁడుగదా నేఁడు లేఁడే యేల ?

విధవా ధర్మములు.

ఏకకార స్సదాకార్యో నద్వితీయః కదాచన
యవాన్నైర్వా ఫలహారై, శ్శాకాహారైః పయోఘృతైః
ప్రాణయాత్రాం ప్రకుర్వీత యావత్ప్రాణః స్వయంవ్రజేత్
పర్యంక శాయినీనారీ విధవా పాతయేత్పతిమ్
తస్మాద్భూశయనంకార్యం, పతిసౌఖ్య సమీహయా
నచాంగో ద్వర్తనంకార్యం, స్త్రియా విధవ యాక్వచిత్
గంధద్రవ్య స్యసంబంధో నైవకార్య స్తథాక్వచిత్
తర్పణం ప్రత్యహంభర్తుః కుర్యా త్కుశతి లోదకైః
తత్పితు స్తత్పితుశ్చాప, నామగోత్రాను పూర్వకమ్
విష్ణోస్తు పూజనం కార్యం, పతిబుద్ధ్యానచాన్యథా
పతిమేవ సదాధ్యాయే ద్విష్ణురూప ధరంపరం
ఏవంధర్మ పరానిత్యం విధవాపి పతివ్రతా॥

అర్థము. భర్త మరణించిన స్త్రీ యొంటిపూఁట భుజింపవలెను. రెండవసారి భుజింపరాదు. యవాన్నముతోఁగాని ఫలముతోఁగాని, శాకములతోఁగాని, పాలుతోఁగాని, నెయ్యితోఁగాని ప్రాణముతానై పోవువఱకు ప్రాణయాత్ర జరుపవలెను. మంచముమీఁదఁ పఱుపుమీఁదఁబండుకొను విధవ మగని నరకమునఁబడద్రోయును. కావునఁ బరలోకమునఁ దనపతి సౌఖ్యమును గోరునది భూమిమీఁదఁ బండుకొనవలెను. సువాసనగల పదార్థముల సంబంధమెప్పుడునుగూడదు. విధవ నలుగు పెట్టించుకొనరాదు. (ఇవి తాంబూలము, దలదువ్వుకొనుట మొదలగు భోగముల కుపలక్షణమని యెఱుఁగునది) ప్రతిదినము దర్భలు, పూవులు నీళ్ళతో దన భర్తకు ఆయనతండ్రికి, ఆయన తండ్రికి నామము గోత్రము చెప్పి స్నానవేళ నీళ్ళు విడువవలయును. తన పతియును తలంపుతోనే విష్ణుపూజ చేయవలెను. మఱియొక భావముతో మఱియొకని బూజింపరాదు. భర్తను విష్ణుస్వరూపుఁడుగా ధ్యానింపవలెను. ఇట్టి ధర్మము లాచరించునది విధవయైనను బతివ్రతయే.

పాసుపు పాడుపెట్టఁబడినదనుటచే విధవలు మంచములమీఁదఁ బఱుపులమీఁదఁ బండుకొనరాదని యేర్పడుచున్నది. శ్రీరాముని నెప్పుడు ద్వేషించెనో యాగడియయందే కైకకు విధవాత్వ చిహ్నములు అలంకారహీనత నేలపడకమూలయింట ముల్గుట ముసుఁగు లోనైనవి నప్పుడే ప్రాప్తించెను. (చూ. అయో. ౨౫౭, ౨౫౮, ౨౯౪-వ ప.) కావున శ్రీరామద్వేషము సౌభాగ్య నాశకరము. కావున రామకోటి వ్రాయుటను రామభజన పూజను ద్వేషించు స్త్రీలకు వైధవ్యము తప్పదు.

—♦ కైకేయి భరతునకు దశరథుఁడు మరణించుట దెలుపుట. ♦—

చం. జనకునిఁ జూడఁ గోరి యిటు◆చయ్యన వచ్చితి నిందు వ్రెుక్కఁగా,
వినయము మీఱ నాయనకు◆వే వచియింపుము, పెద్దభార్యయిం
టను గలఁడే? యటం చకుగ◆నందనుతో వచియించె ఘోర వా
ర్తను బ్రియబుద్ధిఁ గైక నిజ◆రాజ్యమహాశఁ బ్రమోహితాత్మయై. ౧౭౯౩

ఘోరవార్తన్=భయంకరమైన వృత్తాంతమును, నిజరాజ్యమహాశన్=తనకు రాజ్యమందుఁగల గొప్ప యాశచే, ప్రమోహితాత్మయై=మిక్కిలి మోహమునొందిన మనస్సుగలదై.

తాత్పర్యము

వినయముతోఁ దండ్రినిజూచి నమస్కరింపవలయునను కోరికతో నిటు వేగముగ వచ్చితిని. ఆయనకు నేను వచ్చినవార్త చెప్పి పంపుము. పెద్ద భార్య కౌసల్య యింటియందున్నాఁడా? అట్లైన నేనక్కడికే పోయెదను అని యడుగఁగా భయంకరమైన వృత్తాంతమును దనకు రాజ్యమందుండు మహాశ యాయనకుఁగలదని మిగుల మోహముచెందిన మనస్సుగలదై యది యాయనకుఁ బ్రియమను తలంపుతో నిట్లనియె.

ఆ. యజ్ఞశీలుఁ డనఘుఁ♦డవనీధవుండు మ,హాత్ముఁ డధికతేజుఁ♦డార్యసుగతి
యెల్లభూతములకు♦నెయ్యది గతి నీదు,తండ్రి యట్టిగతికిఁ♦దనయ యరిగె.

యజ్ఞశీలుఁడు=యజ్ఞముచేయు స్వభావముగలవాఁడు, అనఘుఁడు=పాప రహితుఁడు, మహాత్ముఁడు=గొప్ప మనస్సుగలవాఁడు, అధికతేజుఁడు = గొప్ప తేజస్సుగలవాఁడు, ఆర్యసుగతి=ఆర్యులకు మంచి రక్షకుఁడగువాఁడు, ఇట్టివారు గదా రాజుగారు అని చావువార్త చల్లగాఁ జెప్పుచున్నది.

తాత్పర్యము

నాయనా! నీతండ్రి రాజుగారు సామాన్యుఁడా? ఆయనకు యజ్ఞములుచేయు టయే స్వభావము. పాపమెట్టిదో యెఱుఁగఁడు. గొప్ప మనస్సుగలవాఁడు,మిగుల తేజముగలవాఁడు, ఆర్యులకెల్ల దిక్కయినవాఁడు, ఇట్టివాఁడయ్యును, నీతండ్రి భూమిమీఁదఁ బుట్టినవన్నియు నే త్రోవఁబోవునో యాత్రోవనే పోయెను.

చం. అని వచియింపఁగా భరతుఁ♦డార్తిని హా యని నేలఁ ద్రెళ్ళి చ
చ్చినగతి నుండి లేచి తన♦చేతుల నెత్తి విలాపయుక్తుఁడై
వనరుచు దిగ్భ్రమం గొనుచు♦వ్రాలుచుఁ జూడుము నన్ను నాయనా!
యను నెట కేగితో యను ద♦యామతి నన్గనరాదొకో యనున్. ౧౭౫

తాత్పర్యము

అని యిట్లు కైక తనతండ్రి మరణవార్తను జెప్పఁగా విని భరతుఁడార్తుఁడై హా తండ్రీయని నేలపైఁబడి చచ్చినవానివలె నుండి లేచి చేతులెత్తి యేడ్చుచు దుఃఖపడుచు దిగ్భ్రమగొనుచు నేలవ్రాలుచు నాయనా! నన్నుఁ జూడుమా యనును. ఎక్కడికిఁ బోయితివి తండ్రీయనును, దయచే నన్నుఁ జూడరాదా యనును.

ఉ. శారదరాత్రి యందు సమ♦సారసశాత్రవుచే నభంబున
ట్లీరమణీయశయ్య మును♦పెంతయుఁ గాంతి వహించు, నేఁడయో
యారమణుండు లేమి జల♦జారివిహీననభంబుపోలికన్
నీరము లెండి నట్టిపెను♦నీరధిచందముగాఁగఁ దోఁచెడున్. ౧౭౬

శారదరాత్రియందున్ = శరత్కాలమందలి రాత్రియందు, సమసారస శాత్రవుచేన్=నిండు చందురునిచే, నభంబునట్లు=ఆకాశమువలె, జలజారివిహీన నభంబు పోలికన్=చంద్రుఁడులేని యాకాశమువలె, నీరములు=నీళ్లు, పెనునీరధి చందము=మహాసముద్రమువలె, తోఁచెడున్=కానవచ్చుచున్నది.

తాత్పర్యము.

శరత్కాలమునాఁటి రాత్రియందుఁ బూర్ణచంద్రబింబముచే నాకాశము వలె నీయందమైన శయ్య రాజు పండుకొనుటచే నెంతయో కాంతిగలదై యుం డెను. నేఁడో యా రాజు లేనికారణమున చంద్రుఁడు లేని యాకాశమువలె జలము లెండిన మహాసముద్రమువలెఁ గానవచ్చుచున్నది.

కం. అనుచును వదనముఁ జేలం,బునఁ గప్పి కుఠారకృత్త•భూజం జన భూ
మిని వ్రాలి యేడ్వఁ గరి నా,
నినుఁ డన నెల యనఁగ నొప్పు•నింద్రసమానున్. ౧౭౯౭

వదనము=ముఖము, చేలంబునన్=వస్త్రముచే, కుఠారకృత్తభూజంబనన్=గొడ్డలిచే నఱకఁబడిన చెట్టువలె, కరినాన్=ఏనుఁగో యనునట్లు, ఇనుఁడనన్=సూర్యుఁడనునట్లు, నెలయనన్=చంద్రుఁడనునట్లు, ఇంద్రసమానున్=ఇంద్రునితో సముఁడైన వానిని.

తాత్పర్యము

అని చెప్పుచు వస్త్రముతో ముఖముఁగప్పుకొని గొడ్డలిచే నఱకఁబడిన చెట్టు వలె నేలపైఁబడి యేడ్వఁగా మదించిన యేనుఁగువలె సౌమ్యదర్శనమునఁ జంద్రునివలెఁ బ్రతాపమున సూర్యునివలెనుండు నింద్రసమానుని.

కం. తనయుఁ దనకరముల మె, ల్లన లేవఁగఁ బట్టి యెత్తి•లాలించి జేడిం
గొని కాఱునీరు దుడుచుచుఁ, జనవు మెఱయఁగ్గైక యనియె•శాంత
మనమునన్.

తాత్పర్యము

కొడుకును దనచేతులతోఁబట్టి మెల్లన లేవనెత్తి బుజ్జగించి వానవలెఁ గన్నులనుండి కాఱునీళ్ళను దుడుచుచుఁ జనవుతోఁ గైక శాంతిగల మనస్సుతో నిట్లనియె.

కం. లే లెమ్ము రాజ! యేలా; యీలీలన్ వగచె దిట్టు•లిల వ్రాలి నినున్
బోలినసుమతులు వగతురె, కాలంబును మీఱి బ్రతుకఁ•గానరు వశమే. ౧౭౯౮

రాజ=(౧) రాజవంశమునఁ బుట్టినవాఁడు ధైర్యము విడిచి పరుల చావున కిట్లేడ్చునా? (౨) నీవు రాజవై యెంతో సుఖసంతోషము లనుభవింప వలసియుండఁగా నేడ్చెదవేల? భరతుఁడు రాజపీఠ మంగీకరించుననియే కైక తలంపు. ఆమాట చెప్పిన సంతోషించునని రాజా యనుచున్నది.

తాత్పర్యము

రాజా! లే లెమ్ము. ఈవిధముగా నేలపైఁబడి యేల యేడ్చెదవు? నీవంటి బుద్ధిమంతులుగలరా? బుద్ధిమంతు లిట్లేడ్తురా? నియమిత కాలమును మించి బ్రతుకఁగా నరునకు వశమా ?

చం. చదివితి వెల్లవేదములు • సభ్యసుసమ్మతవర్తనంబులన్
బొదలితి, దానయజ్ఞ విధిఁ • బొల్చు నజస్రము మందరంబునన్
మొదలురవిప్రభంబలెను • నీమతి, యేడ్చుట లాభ మేమొ నీ
మదిఁ బరికింపుమా యనుడు • మ్రోఁ బడి పొర్లుచు నెట్ట కే నసున్. ౧౮౦౦

సభ్యసుసమ్మత వర్తనంబులన్=సాధువులకు మిగుల సమ్మతమైన నడవడిచే, అజస్రము=ఎల్లప్పుడు, మందరంబునన్ = మందర పర్వతమునందు, రవిప్రభంబలెన్=సూర్యకాంతివలె, ఉత్తరాయణమున మందరగతుఁడైన సూర్య కాంతి విశేషముగఁ బ్రకాశించునని ప్రసిద్ధము. తక్కిన పర్వతములకంటె మందర మెత్తగుటచే సూర్యకాంతి దీర్ఘకాలముండునని భావము. దానయజ్ఞ

విధి = దానమనెడి విష్ణుపూజ 'యజ్ఞోవై విష్ణుః' శ్రుతి. దానవిధి యజ్ఞవిధి యనియుఁ జెప్పవచ్చును. యజ్ఞార్థాత్. భ. గీ. ౩-౯ అనుచోట యజ్ఞోవై విష్ణు రితిశ్రుతేః యని శంకరులు వ్రాసియున్నారు.

తాత్పర్యము

నాయనా! సమస్తవేదములు చదివితివి. సభకు యోగ్యులకు పెద్దలకు నిష్టమైనవిధముగా వర్తించెదవు. మందర పర్వతమందు సూర్యకాంతివలె దానమనెడి విష్ణుదేవపూజయందు నీమనస్సెప్పుడు నిలిచియుండును. నీ విట్టివాఁడవు కావునఁ జచ్చినవారికై యేడ్చుటవలన లాభముగలదేమో యాలోచింపుము. అని చెప్పఁగా భరతుఁడు నేలపైఁబడి పొర్లుచు మాటలాడలేకయుండియు నతికష్టముపై నిట్లనెను.

ఉ. రాముని యౌవరాజ్యమున•రాజిలఁ జేయునొ, కాక యజ్ఞమే
శ్రీమహితుండు తండ్రి యొన•రించునొ, యంచును నాశ వచ్చితిన్
భూమిధవుం గనుంగొనెడి•పుణ్యము లేమిని గోర్కు లెల్లఁ గ
ట్టా మొదలాఁటిపోయెను, నె•డందయు వ్రీలెడిఁ దున్క తున్కలై. ౧౨౦౧

రాజిలన్=ప్రకాశింపఁగ, ఎడంద=హృదయము.

తాత్పర్యము

తండ్రి శ్రీరాముని యౌవరాజ్యమున నిలుపునో యేదేని యజ్ఞమే చేయునోయను నాశచే వచ్చితిని. రాజును జూచెడి పుణ్యము లేకుండుటచే నాకోరుకు లెల్ల నయ్యో మొదలంట నాశమయ్యెను. హృదయమును ముక్కలు ముక్కలై పగిలిపోవుచున్నది.

ఉ. ఏ మయి యుండెఁ దండ్రి కిట • నే నరుదేరకమున్నె బిద్దఁగా?
నామయ మెద్ది? ధన్యులు గ•దా పితృ కార్యము లెల్లఁ దీర్చ రా
రాముఁడు లక్ష్మణుండును, ధ•రాపతి నేఁ జనుదేర మూర్ధముం
బ్రేమను మూర్కొనండె తన•మేన నొకింతయుఁ బ్రాణ ముండినన్.

బిద్దఁగాన్=మరణింపఁగా, ఆమయము=రోగము, మూర్ధమున్=శిరమును, మూర్కొనండె=వాసనచూడఁడా, మేనన్=దేహమందు.

తాత్పర్యము

నేను రాకముందే యింటఁ జచ్చుటకు నాయన దేహమునకు నేమయి యుండెను? రోగము పేరేమి? తండ్రికిఁ బరలోకకార్యము లొనర్చిన శ్రీరామ లక్ష్మణులెంత పుణ్యులోకదా? నేను వచ్చువఱకుఁ దండ్రి బ్రదికియుండిన నాశిరమును వాసనచూచి యుండునుగదా?

కం. ధూళిని బ్రుంగిననామెయిఁ, జాలఁగ ననురక్తిఁ దుడిచి•స్వకరంబుల నన్
లాలించునాతఁ డెవఁ డిఁక, నాలీలాస్పర్శ మిడెడి•హస్తం బేదీ. ౧౨౦౩

క్రుంగిన=మునిఁగిన, మెయి = దేహము, అనురక్తిన్=అనురాగముచే, స్వకరంబులన్=తన చేతులచే, లీలాస్పర్శము=సుఖస్పర్శము, ఏదీ=లేదేయని యర్థము.

తాత్పర్యము

ఇఁక దుమ్ములో మునిఁగిన నా దేహమును దన చేతులచేఁ బ్రేమమునఁ దుడిచి బుజ్జగించువాఁ డెవఁడు? నాకు సుఖముగఁ దాఁకెడి చేయి యేదీ ?

ఉ. ఎవ్వఁడు నాకు భ్రాత, పిత • యెవ్వఁడు, చుట్టము నెవ్వఁ డెప్డు నే
నెవ్వరికింకరుండనొ య•హీనగుణాకరుఁ డైనరాముకై
చివ్వన వార్తఁ బంపు మిఁక•జ్యేష్ఠుఁడె తండ్రి వివేకశాలి, కే
నవ్విభుఁడే మదీయగతి • యౌటను వ్రాలెదఁ దత్పదద్వయిన్. ౧౨౦౪

భ్రాత=అన్న, పిత=తండ్రి, అహీనగుణాకరుఁడు = గొప్ప గుణములకు స్థానమైనవాఁడు, చివ్వనన్=త్వరగా, వివేకశాలికిన్=యుక్తాయుక్తములు దెలిసిన వానికి, మదీయగతి = నాదిక్కు, పదద్వయిన్ = రెండు పాదములందు, లక్ష్మణుఁడు చెప్పిన (౧౨౧౩-వ ప) మాటలకు వీనికి భేదముకలదేమో చూడుఁడు. ఇందుఁ గింకరుఁడనని చెప్పుకొనుట విశేషము.

తాత్పర్యము

ఎవఁడు నాకన్నయో యెవఁడు తండ్రియో, బంధువెవ్వఁడో యెప్పుడైనను నే నెవ్వని కింకరుఁడనో యట్టి మహాగుణఖనియగు శ్రీరామచంద్రునకు నేను వచ్చిన వార్త చెప్పి పంపుము. తండ్రి పోయినకారణమున నిఁక నన్నయే కదా తండ్రివలెఁ బూజ్యుఁడు. ఆయనయేకదా నాకిఁక రక్షకుఁడు, కావున నాయన పాదయుగముపైఁ బడెదను.

కం. ప్రాకటధర్మజ్ఞుఁడు స,త్యైకరతుం డమలచరితుఁ • డౌ జనకుఁడు తా
నాకంబున కేఁగెడిచో, నా కేమని చెప్పు మనెనొ•న్యాయహితోక్తుల్. ౧౨౦౫

ప్రాకటధర్మజ్ఞుఁడు=ప్రసిద్ధధర్మములఁ దెలిసినవాఁడు, సత్యైకరతుండు= సత్యమందే ప్రీతిగలవాఁడు,అమలచరితుఁడు=మలినములేని నడవడిగలవాఁడు, నాకంబునకున్=స్వర్గమునకు, న్యాయహితోక్తుల్=ధర్మముతోఁగూడిన మాటలు, దీనివలన మరణించువారును దీర్ఘప్రవాసము చేయఁబోవువారును, బిడ్డలకు బుద్ధులు చెప్పవలయునని సూచన. వాలియు నిట్టులే చేసెనుగదా?

తాత్పర్యము

ధర్మము దెలిసినవాఁడని ప్రసిద్ధి కెక్కినవాఁడు సత్యమందే ప్రీతిగల వాఁడు, మలినములేని నడవడిగలవాఁడు నగు మా తండ్రి స్వర్గమునకుఁబోవు సమయంబున నాకు ధర్మముతోఁగూడిన హితబోధ యేమిచేసెను.

కం. జనకుండు కడపట నాకై,యని నట్టిహితంబు వినఁగ•నాశపడెద నం
చును భరతుఁడు పలికిన నా,తనికి యథాతథ్యముగను•దరుణి వచించెన్.

యథాతత్త్వము=వాస్తవము నతిక్రమింపక యున్నదున్నట్టులు.

తాత్పర్యము

తండ్రి మరణించునప్పుడు కడపట నాకుఁ జెప్పుమని చెప్పిన హిత వాక్యములను నేను వినఁగోరెదను. అని భరతుఁడు చెప్పఁగ నాకైక యున్న దున్నట్టు లిటుచెప్పెను.

కం. రామా యని సీతా యని, సౌమిత్రీ యనుచు మిగుల♦సంతాపముతో
భూమీశుఁ డేడ్చు చేడ్చుచుఁ, దా మేనిం బాసి విబుధ♦ధామముఁ జేరెన్.

విబుధధామము=స్వర్గము. [౧౮౦౭

తాత్పర్యము

రామాయని సీతాయని లక్ష్మణాయని మిగుల దుఃఖముతో నేడ్చుచు నేడ్చుచు రాజు స్వర్గమునకుఁ బోయెను.

చం. అవిరళపాశపీడితమ♦హాకరి నాఁగఁ దపించి చచ్చుచో
భువిజను లెవ్వ రాభువన♦పూజ్యుని రాము ససీతు లక్ష్మణున్
సవురుగ వెండి రాఁ గనఁగఁ♦జాలుదు రట్టిర ధన్యు లంచుఁ దా
నివి కడమాట లాడె, మఱి♦యింతకు నాడఁ డొకం డటం చనన్. ౧౮౦౮

అవిరళపాశపీడితమహాకరి=దట్టమైన పగ్గములచే బాధింపఁబడిన పెద్ద యేనుఁగువలెఁ దాపమునొంది చచ్చునపుడు లోకపూజితుఁడైన రాముని సీతతోఁ గూడినవానిని, లక్ష్మణుని క్షేమముగ మరలిరాఁగ నేమనుష్యులు చూడఁగలుగుదురో వారే పుణ్యాత్ములని యెనెనేకాని యింతకుమించి వేఱొకమాట మాట్లాడిన వాఁడుకాఁడు. కావున నీకుఁ జెప్పినమాట లేమియులేవు.

కం. విని రెండవయప్రియమును, దనజనని వచింప మిగులఁ♦దహతహపడుచున్
మనమున విషణ్ణవదనం,బున భరతుం డనియె జనని♦మోమునుఁగనుచున్.

అప్రియము = అనిష్టము, విషణ్ణవదనంబునన్ = విషాదముతోఁ గూడిన ముఖముతో.

తాత్పర్యము

ఈప్రకారము రెండవ యప్రియవాక్యమును దల్లి చెప్పఁగావిని మనసున మిక్కిలి పరితాపపడి యేడుపుముఖముతోఁ దల్లి ముఖముఁ జూచుచు నిట్లనెను.

కం. అమ్మా రఘురాముఁడు దా, నమ్మహిళారత్న మైన♦యవనీసుతతోఁ
దమ్మునితో నెట కేగెనొ,యమ్మెయిఁ జన హేతు వేమొ♦యాడుము తెలియన్.

మహిళారత్నము=స్త్రీరత్నము, అవనీసుతతోన్ = సీతతో, తమ్మునితో = లక్ష్మణునితో, అమ్మెయిన్=ఆ విధముగా, ఆడుము=పలుకుము.

తాత్పర్యము

అమ్మా! శ్రీరాముఁడు సీతాదేవితో లక్ష్మణుతో నెచటికిఁ బోయెను. అట్లు పోవఁ గారణమేమి కలిగెనో తెలియఁ జెప్పుము.

కం. అని యడిగినఁ గైకేయియు, వినన ప్రియ మైనవార్తఁ • బ్రియ మనుబుద్ధిన్
దనయునకుఁ జెప్పఁ దొడఁగెను,దనచేసినయట్టిపని య•థాతత్త్వముగన్.

అప్రియమైనవార్త=విననింపుగాని వృత్తాంతము, ప్రియము=ప్రీతికరము• యథాతత్త్వముగన్=వాస్తవముగ, తానుజేసిన ఘనకార్యము తన తనయుఁడు మెచ్చుకొని సంతోషించునను తలంపుతోఁ దన ప్రతిష్ఠగోరి తన ప్రతాపము చెప్పుచున్నది.

తాత్పర్యము

అని ప్రశ్నింపఁగా గైకేయియు వినుటకు దుఃఖకరమైనవార్తను సంతోషవార్తయను బుద్ధితోఁ దాను జేసినపని యున్నదున్నట్టు లిట్లు చెప్పఁదొడఁగెను.

—• కైకేయి భరతునకు శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుటఁ దెలుపుట. •—

ఉ. నారలు గట్టి దండకవ•నంబున కేగెను బుత్ర! రాముఁడా
ధారిణికన్యతోడఁ బిన•తమ్ముఁడు గొల్వ నటంచుఁ బల్కినన్
దారుణవార్తకున్ భయవి•దారితమానసుఁడై స్వవంశశీ
లోరుమహత్త్వ మెంచుచును • సోదరసద్గుణశంక నిట్లనున్. ౧౮౧౨

నారలు=నారచీరలు, దారుణవార్తకున్=భయంకరమైన వృత్తాంతమునకు, భయవిదారితమానసుఁడై = భయముచేఁ జీల్పఁబడిన మనస్సుగలవాఁడై, స్వవంశశీలోరు మహత్త్వము = తన వంశము యొక్క సదాచారవిషయమైన గొప్పతనము, సోదరసద్గుణశంకన్ = అన్నయందు మంచి గుణవిషయమైన సందేహము, అనఁగా నన్న యేదైనఁ జేయరానిపనిచేసి శిక్షింపఁబడెనా? వంశమునకు నపకీర్తి వచ్చెనేయను సందేహముతో, దండకవనము=ఇది సాధ్యసమాసము గావున దీర్ఘము రాలేదని తెలియవలయును.

తాత్పర్యము

కుమారా! నారచీరలు గట్టుకొని శ్రీరాముఁడు సీతతో లక్ష్మణుతో దండకారణ్యమునకుఁ బోయెను. అనిన నా భయంకరవార్త విని భయముచేఁ జీల్పఁబడిన మానసముగలవాఁడై యన్న యేదో చేయరానిదోషము చేసెను దానివలన వంశమునకు నపకీర్తివచ్చెనే యని తలంచుచు నిట్లనెను.

ఉ. కోరఁడుగా ధరామరుని • కూర్చినవిత్తము లెవ్వియేనియున్ ?
గ్రూరత దోషహీను ధని•కున్ నిఱుపేదను నొంపలేదుగా ?
కోరఁడుగా పరాంగనల • కూటమి, శ్రీరఘురామచంద్రునిన్
గారణమేమి భ్రూణహుని•కైవడిఁ ద్రోయఁగ దండకాటవిన్? ౧౮౧౩

ధరామరుని కూర్చినవిత్తము = బ్రాహ్మణుఁడు కూడఁబెట్టిన ధనము, దోషహీనున్=పాపము చేయనివానిని, ధనికున్=ధనవంతుని,నొంపలేదుగా=నొప్పింపలేదుగదా? పరాంగనలన్ = ఇతర స్త్రీలయొక్క, కూటమి=సాంగత్యము, భ్రూణహునికైవడి=భ్రూణహత్య చేసినవానివలె, భ్రూణహుండనఁగా వేదాధ్యయనము

చేసినవాఁడు. "అనూచానో గుణైర్యుక్తో వ్రతవిద్యా యువాన్శుచిః । భ్రూణ ఇత్యుచ్యతే సద్భిః స్త్వేషయో విజితేంద్రియః॥" అను భ్రూణలక్షణ వాక్యమిటఁ బ్రమాణము.

తాత్పర్యము

అమ్మా! శ్రీరామచంద్రుఁడు బ్రాహ్మణవిత్తమును నాశింపలేదుగదా? నేరముచేయని ధనవంతునైనను నిఱుపేదనైనను బాధింపలేదుగదా? పరాంగనల సాంగత్యము చేయలేదుగదా? అట్లు చేయఁడేని శ్రీరామచంద్రుని భ్రూణహత్య చేసినవానివలె నడవులలోఁ ద్రోయఁగారణమేమి?

కం. అనవుఁడు బండితమానిని,యును జపలయు నైన కైక•యున్నది యున్న
ట్టనుఁ గామినీస్వభావం,బునఁ దనచేఁతకును దానె•పొంగుచు మదిలోన్.

పండితమానిని = తాను పండితురాలు గాకుండినను, బండితురాలనని తలంచునది, పండితమానియొక్క స్త్రీలింగరూపము పండితమానిని, చపలయు = స్థిరబుద్ధి లేనిది, కామినీస్వభావంబునన్=కామముగల స్త్రీలస్వభావగుణముచే, పొంగుచున్=సంతోషమున నుబ్బుచు.

తాత్పర్యము

అని భరతుఁ డడుగఁగాఁ బండితురాలనని తలంచు చపలచిత్తయగు కైక యున్నదున్నట్లు కామముగల స్త్రీస్వభావమునఁ దాను జేసినపనికిఁ దానే యుబ్బిపోవుచు నిట్లనెను.

ఉ. రాముఁడు గొంచెమేన్ గొనఁడు•బ్రాహ్మణవిత్తమొకప్పు డేనియున్
గాముకుఁడై పరాంగనలఁ • గన్నులనైనఁ గనండు, పేదనేన్
శ్రీమహితాఢ్యు నేనియు వి•శేషుని నొంపఁడు; నీదుతండ్రినిన్
రామునిఁ గాన కంప నినుఁ•రా జొనరింపఁగ నేన కోరితిన్. ౧౮౮౧౫

కాముకుఁడై = దుష్టకామముగలవాఁడై, పరాంగనలన్ = ఇతరుల భార్యలను, శ్రీమహితాఢ్యులన్ = సంపదచే నధికుఁడగు వానిని గొప్పవానినైనను, నొంపఁడు=బాధింపఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి బ్రాహ్మణధనమును గొంచెమైనను గోరినవాఁడు కాఁడు. పరస్త్రీలను గామదృష్టిచేఁ గన్నెత్తియైనఁ జూడఁడు. పేదవానినైనను గొప్పగుణముగల నిర్దోషిని బాధింపఁడు. శ్రీరాముని నడవులకంపుమని నిన్ను రాజుగాఁ జేయుమని నేనేరా నీ తండ్రిని గోరితిని.

కం. తనమాటను నిల్పియె నీ,జనకుఁడు వని కనిచె రాము•సహజన్మునితో
జనకజతోఁ బిమ్మటఁ బ్రియ,తనయుం గనలేమి వనటఁ•దా మరణించెన్.

తాను జెప్పినమాటపై నిల్చి నీ తండ్రి తమ్మునితోడను సీతతోడను,

శ్రీరాముని నడవులకుఁ బంపెను. అట్లు పంపి తన ప్రియకుమారుని జూడక యుండలేక దుఃఖముచేఁ దానే చచ్చెను.

ఉ. నీకొఱ కింతకార్యమును ♦ నే ఘటియించితిఁ బుత్ర! మానుమీ
శోకము నీకుఁ గా నెదురు♦చూచెద రెల్లపురోహితాదు ల
స్తోకధరావిభూతి వర♦శూరకులాగ్రణి నిన్నుఁ బూన్పఁగాఁ
జేకొన వయ్య ధైర్యమును ♦ సిద్ధము గమ్మభిషేక మందఁగన్. ౧౮౧౪

అస్తోకధరావిభూతి=గొప్పదగు భూమిసంపద, పూన్పఁగాన్ = పూనునట్లు చేయఁగా.

తాత్పర్యము

కొడుకా! నీ నిమిత్తము నేనింతకార్యముఁ జేసితిని, ఏడుపు మానుము, పురోహితులు మొదలగువార లీరాజ్యసంపద నీవు పూనునట్లు చేయవలయునని నీ రాకకై యెదురుచూచుచున్నారు కావున ధైర్యముఁ దెచ్చుకొని పట్టాభిషేకోత్సవమునకై సిద్ధపడుము.

కం. ఈనగరం బీరాజ్యం, బీనానాకోశచయము ♦ లెల్లను నీ వౌ
భూనాథునిసంస్కారము,గా నీయభిషేకవిధియుఁ♦గావింత్రు ద్విజుల్.

తాత్పర్యము. [౧౮౧౫

ఈపట్టణ మీ రాజ్యము నానావిధములైన బొక్కసములు నివన్నియు నీవే యవును. రాజునకుఁ గావలసిన సంస్కారములు ముగిసినతోడనే బ్రాహ్మణులు నీకభిషేకము చేయుదురు.

—♦ ౭౩-వ సర్గము. భరతుఁడు కైకేయిని దూషించుట. ♦—

చం. అనవుడుఁ దండ్రిచావుఁ దన♦యన్నయుఁ దమ్ముఁడు గాన కేగుటల్
విని భరతుండు శోకమున♦వేఁగుచు నిట్లనుఁ దల్లితోడ నా
జనకునిఁ దండ్రివంటిరఘు♦చంద్రము రామునిఁ బాసి యేడ్చు నీ
యనదకు హీనభాగ్యునకు♦హా సిరి యేటికి రాజ్య మేటికిన్. ౧౮౧౬

వేఁగుచున్=కాలిపోవుచు, అనదకున్=అనాథ శబ్దభవము అనద దిక్కులేనివానికి, హీనభాగ్యునకున్=నిర్భాగ్యునకు దరిద్రునకు.

తాత్పర్యము.

అని కైక చెప్పఁగాఁ దండ్రిమరణము నన్నయుఁ దమ్ముఁడు నడవులకుఁ బోవుట విని భరతుండు శోకాగ్నిని గాలిపోవుచుఁ దల్లితోడ నిట్లనియె నా తండ్రినిఁ దండ్రితోడ సమానుఁడగు రఘువంశశ్రేష్ఠుఁడగు శ్రీరామచంద్రమూర్తిని విడనాడి యేడ్చు నీ యనాథునకు నీ నిర్భాగ్యునకు నయోధ్యాయైశ్వర్యమేల? రాజ్యమేల?

ఉ. చండి! ధరావతి స్గైడపి ♦ సద్గుణసాంద్రుని రామచంద్రునిన్
దండక మౌనిఁ జేసి భృశ♦దారుణ దుఃఖముమీఁద దుఃఖమున్

బుండున నుప్పు నిడ్డగతిఁ • బూని ఘటించితి నాకు; నాన్నృపా
ఖండలుఁ డయ్యె చిన్చు నోడిఁ•గట్టఁ గదే నినుఁ బొంది మూఢుఁడై.

చండీ=క్రూరకర్మురాలా! గెడపి=చంపి, భృశదారుణ దుఃఖముమీఁదన్=అధికమై భయంకరమైన దుఃఖముమీఁద, దుఃఖమునన్=రెండవ దుఃఖమును, నృపాఖండలుఁడు = రాజేంద్రుఁడు, కైకచేసిన యకార్యముఁ దలఁచుకొలఁది కోపమతిశయించుటచే దూషించుచున్నాఁడు.

తాత్పర్యము

ఓసీ క్రూరురాలా! రాజును జంపితివి, సాధుగుణములు విశేషముగఁగల శ్రీరామచంద్రుని నడవులపాలు చేసితివి. ఈప్రకారము పుండుచేసి యాబాధ చాలనట్లు దానిలో నుప్పును గూరినట్లు తీవ్రదుఃఖముమీఁద దుఃఖమును నాకుఁ గలిగించితివిగదా. అయ్యో! యారాజేంద్రుఁడు బుద్ధిలేనివాఁడై నిన్నుఁదెచ్చుకొని నిప్పును నొడిలోఁ గట్టుకొన్నవాఁ డయ్యెఁగదా.

ఉ. ఎక్కడ దాపరం బయితి•వే చెనఁటీ! యిటు కొంపఁ గూల్పఁగా?
నక్కట కాళరాత్రిగతి • నాధరణీశుని నీవ చంపితే?
ప్రుక్కడి! యీకులంబునను•మోహమునన్ సుఖ మెల్లఁ గూల్చితే?
దిక్కఱి చచ్చెఁ దండ్రి కడు•దీనత నిన్ను వివాహ మాడుటన్. ౧౮-౧౯

కాళరాత్రి = ప్రలయకాలమందు సర్వము నాశముచేయు మహాశక్తి, ప్రుక్కడి=బుద్ధిలేని నీచురాలా. మోహమునన్=అజ్ఞానముచే,దిక్కఱి=దిక్కులేక.

తాత్పర్యము

ఓసీ దుష్టురాలా! మావంశము నాశముచేయుటకు నీవెక్కడ దాపరించితివే. సమస్తలోకము నాశముచేయు కాళరాత్రివలె రాజును జంపితివిగదా. బుద్ధిలేని దానా అజ్ఞానముచే ధనకాంక్షచే నీ వంశసుఖమెల్లను నాశముచేసితివికదా. నిన్నుఁబెండ్లాడిన కారణమున రాజు దిక్కులేనివాఁడై చచ్చెను.

'ఆచార్యశ్చపితాచైవ మాతాభ్రాతాచ పూర్వజః నార్తేనాప్యవమంతవ్యా' యని తానెంతదుఃఖములో నున్నను ఆచార్యుని, తండ్రిని, తల్లిని అవమానింపరాదని శాస్త్రము చెప్పుచుండఁగా నెట్లు భరతునివంటి ధర్మాత్ముఁడు తల్లిని నింతకఠోరముగ నిందించెను ?

భరతుఁడు చేయరానిపని చేయలేదు. భర్తను జంపుటచేతను రామచంద్రమూర్తిని మరణాంతకదశయం దుంచుటచేతను, కైక వాగ్దండనమునకేగాక వధకును యోగ్యురాలే. (చూ. ౧౬౩౪-వ ప.) అయినను దల్లియని నోటి మాటలతో వదలెను. అధర్మమందున్న తండ్రిని, ఆచార్యుని, మిత్రుని, తల్లిని, భార్యను, కొడుకును, పురోహితుని రాజు దండింపవచ్చును. మనువు.

పితాచార్యః సుహృన్మాతా భార్యా పుత్రః పురోహితః

నాదండ్యోనామ రాజ్ఞోస్తి, యస్త్వధర్మేణ తిష్ఠతి.

ఈ శ్లోకమునకు ముద్రితపాఠము కొంచెము భిన్నముగానున్నది. ఇదిగాక;

"కార్యమియ్యది యిదియు నకార్యమనుచుఁ
దెలియకైనను గర్వంబు బలిమినైనఁ
గాని తెరువునఁ జనియెడి వానిగురుని
నైన దండింపవలయు." అయోధ్యా. ౫౯౩.

అని యుండుటచే భరతుఁడు తల్లిని దిట్టుట దోషముగాదు.

మ. అనఘున్సత్యరతాత్ము నాజనకు నేఁలా చంప? నాయన్న స
జ్జనసమ్మాన్యు నరణ్యభూములకుఁ బుచ్చం గారణం బేమె? యిం
కను గౌసల్య సుమిత్రయుం గడుపుదుఃఖం బెట్టు సైరింతురే?
మనుటే దుష్కర మింక వార లిట నస్సన్మాత పాపీ దరిన్. ౧౮-౨౨

పాపరహితుని=సత్యమందుఁ బ్రేమగల మనస్సుగలవానిని నాతండ్రిని నేటికే చంపితివి. సజ్జనపూజితుఁడైన మాయన్న నేల యరణ్యభూములకుఁబంపితివే. ఇంకను గౌసల్యయు సుమిత్రయుఁ బుత్రశోకము నెట్లు సహింపఁగలరే? దుఃఖము సహించుమాటయేల నాతల్లివైన నీసమీపమున వారిఁక బ్రతుకుటే దుర్లభము. సహింపలేక వారును జత్తురు.

మ. తతధర్మాత్ముఁ డనుత్తమవ్రతుఁడు శ్రద్ధాభక్తియుక్తంబుగా
సతమున్ రాముఁడు గన్నతల్లిగతి నిన్సంభావనం దన్పఁడే?
నతసల్లోకయు దీర్ఘదర్శినియు నా నాతల్లి కౌసల్య స
మ్మతిఁ దోఁబుట్టినదానిరీతి నినుసమ్మానింపదే ప్రేముడిన్? ౧౮-౨౩

తతధర్మాత్ముఁడు = విశేషముగ ధర్మమందే మనస్సుగలవాఁ డగుటచే నీవు సవతితల్లివైనను గన్నతల్లివలెనే యెంచువాఁడు, అనుత్తమవ్రతుఁడు = ఉత్తమోత్తమములయిన వ్రతములు గలవాఁడు, శ్రద్ధాభక్తియుక్తంబుగాన్= శ్రద్ధతోడను భక్తితోడను, సతమున్=ఎల్లప్పుడు, సంభావనన్=బహుమానముచే, తన్పఁడే=తృప్తిపడఁజేయుచున్నవాఁడుకాఁడా? నతసల్లోకము=నమస్కరించు సత్పురుషులుగలదియు, దీర్ఘదర్శినియు=దూరాలోచన గలదియు, ప్రేముడిన్= ప్రేమచే, "దూరానర్థస్య సందర్శీ దీర్ఘదృష్టిః ప్రకీర్త్యతే".

తాత్పర్యము

మిగుల ధర్మాత్ముఁడును నుత్తమోత్తమవ్రతుఁడునునగు శ్రీరామచంద్రుఁడు నీవు సవతితల్లివి పరమపాపివనికూడ నెంచక తన తల్లియే యనుతలంపుతో శ్రద్ధాభక్తులతోఁ దన తల్లిని నాదరించినట్లు నిన్ను గౌరవించుచుండలేదా? సత్పురుషులచే నమస్కరింపఁబడినదియు దూరాలోచనముగలదియు నగు నాతల్లి కౌసల్య మనఃపూర్వకముగఁ బ్రేమతోఁ దన చెల్లెలివలె నిన్ను నాదరింపదా?

ఉ. ఆమహనీయపుత్రకుఁ గృ॰తాత్మకు నారలు గట్టఁజేయుచున్
భీమమహాటవీస్థలుల॰ నెట్టియు దుర్భగురాల! కొంచెమేన్
నీమదిఁ గుందఁ జాలవ య॰నింద్యచరిత్రుని శూరు సత్ప్రథున్
రాముఁ బ్రవాసిఁ జేసియు దు॰రాత్మిక యేమిఫలంబుఁ గాంచెదే. ౧౮-౨౪

అటువంటి మహాత్మురాలి కుమారుని, కృతాత్మకున్=సత్కారములందు దిట పడిన మనస్సుగలవానిని, భీమమహాటవీస్థలులన్=భయంకరమైన గొప్ప యడవు లందు, నెట్టియు=బలాత్కారముగఁ బోవఁద్రోచియు, దుర్భగురాల=దరిద్రురాల శ్రీరాముని విడనాడుసది పుణ్యమున దరిద్రురాలుగాక మఱియేవతె, ధన దారిద్ర్యము నింద్యముగాదు. గుణదారిద్ర్యము నింద్యము, అనింద్య చరిత్రునిన్= శ్లాఘ్యమైన నడవడిగలవానిని, శూరున్=పరాక్రమము గలవానిని, సత్ప్రథున్= గొప్పకీర్తిగలవానిని, ప్రవాసి = దేశాంతరవాసిని, దురాత్మిక = చెడ్డమనస్సు గలదానా?

తాత్పర్యము

అటువంటి మహానుభావురాలి కుమారుని ధర్మమునఁ బరిపక్వమైన మనస్సు గలవాని నారచీరలు గట్టునట్లుచేసి తలఁచుటకే భయంకరమైన పెద్ద యడవు లందు బలాత్కారముగఁద్రోసియు దరిద్రురాలా కొంచెమైనను నీవు మనస్సు నందైన వ్యసనపడలేకయున్నావు. శ్లాఘ్యశీలుని శూరుని సత్కీర్తిమంతుని శ్రీరాముని నూరువెడలఁగొట్టి నీవు పొందఁబోవు పుణ్యలాభ మేమి కలదు.

కం. రామునియెడ నే నెట్టిఁడ,నై మెలఁగుట నీ వెఱుంగ॰వైతివి లుబ్ధా!
యీమహితానర్థము ధర, కీమాడ్కిం దెచ్చి పెట్టి॰తివు కులఘ్నీ. ౧౮-౨౫

ఎట్టిఁడను=ఎట్టివాఁడను, లుబ్ధా=ధనాశగల పిసినీ, మహితానర్థము=గొప్ప కీడు, కులఘ్నీ=వంశ నాశకురాలా ?

తాత్పర్యము

శ్రీరాముని విషయమున నేనే భావముగలవాఁడనై చరించుట పిసినిగొట్టా నీవు తెలిసికొనలేకపోయితివి. ఓసీ వంశనాశకురాలా! నాకొకనికేకాదు. ఈ భూమికి నీ వెంతకీడు గలిగించితివో యెఱుంగలేవుగదా?

ఉ. శూరకులాగ్రగణ్యులును॰ శుద్ధమనస్కులు రామలక్ష్మణుల్
దూరగులైన నేబలము॰తో ధర నేలఁ గలాఁడ నింక? న
మ్మేరునగంబుపొంతఁ గల॰ మేరువనం బన వారిప్రాపుచే
ధారణి నేలు చుండె వసు॰ధాపతి యాజి యనన్యభేద్యుఁడై. ౧౮-౨౬

శూరకులాగ్రగణ్యులును=శూరుల సమూహమునందు మొదట లెక్కింపఁ దగినవారు, శుద్ధమనస్కులు=నిర్మలమైన మనస్సుగలవారు, దూరగులైనన్= దూరమునందుండువారైరేని నేబలముతో నేనింత గొప్పరాజ్యమును భరింపఁ గలను, అనన్యభేద్యుఁడై=ఇతరులకు భేదింపరానివాఁడై.

తాత్పర్యము

శూరుల సమూహములో మొదట నెన్నఁదగినవారును, నిర్మలమైన మనస్సు గలవారును నగు శ్రీరామలక్ష్మణులు దూరదేశవాసులు కాఁగా నేమిబలముతో నీరాజ్యము నీనగరము నిఁక నేను బాలింపఁగలను ? స్వయముగ రాజ్యము రక్షించుకొను శక్తి చాలకున్నను మేరవు పొంతనున్నవనము గహనమైన మేరువుచే రక్షింపఁబడునట్లు రామలక్ష్మణుల సహాయమువలన దశరథుఁడు శత్రువులకు భేదింపరానివాఁడై పాలించుచుండెను. ఇప్పుడు వారి సహాయములేక నేనెట్లు పాలింపఁగలను.

తే. భూరివిక్రమశాలు లౌ•వారిచేతఁ, దాల్పఁబడయోగ్య మైనయీ•ధరణీభరము
నన్నుఁ బోఁటికి శక్యమే•యెన్నిచూడ, నెద్దుబరువును లేగఁ దా•నెట్లు మోయు•

భూరివిక్రమశాలులు=విశేష పరాక్రమముచేఁ బ్రకాశించువారు, లేఁగ = లేఁతదూడ, దృష్టాంతాలంకారము.

తాత్పర్యము.

విశేష పరాక్రమవంతులచేత భరింపఁబడఁదగిన యీ భూభారమును నావంటి బాలుఁడు భరింప నెట్లు సాధ్యమగును. పెద్ద యాఁబోతుకోడె మోయఁదగిన బరువును లేఁగ యెట్లు మోయఁగలదు.

ఉ. ఓపుదుఁ గాక బుద్ధిబల•యోగబలంబులచేత ధారణిం
బ్రోవ నరింప, నట్లయినఁ • బుత్రకగర్ధిని వైననీదుబల్
పాపపుఁగోర్కిఁ దీర్పఁగను • బాల్పడ నోపుదునే? దురంతహృ
త్తాపముచేత మాఁడు మిఁక • దథ్యము నీ కిది శిక్ష రాక్షసీ. ౧౮-౨౮

ఓపుదున్= సమర్థుఁడనగుదును, ప్రోవు=రక్షణము, బుద్ధిబల=గ్రహణము ధారణము మొదలగు నష్టాంగములతోఁ గూడిన బుద్ధిబలముచేతను, యోగబలంబుచేతను = సామదానభేద దండోపాయములచేతను, పుత్రకగర్ధినివి = ధర్మమువిడిచియైన పుత్రునకు లాభము గలిగింపవలయుననుటయే ముఖ్యముగాఁ బాటించుదానవు, పాపపుఁ గోర్కి=పాపిష్ఠమైన యాశను, తీర్పఁగను= నెఱవేర్పఁగను, దురంత = అంతములేని, హృత్తాపముచేత = మనోవ్యథచేత, మాఁడుము=కాలిపొమ్ము.

తాత్పర్యము

దశరథుఁడనిన ముసలివాఁడు నీవు రాజకుమారుఁడవు కావా? క్షత్రియవంశమునఁ బుట్టలేదా ? యౌవనవంతుఁడవుకావా ? నీకేల యితరుల సహాయము. ఆలోచనలు చెప్పుటకు పనులుచేయుటకు మంత్రులు నధికారులులేరా? నీవు పడు కష్టమేమి యనెదవు కాఁబోలు, బుద్ధిబలముచేత సామదానాద్యుపాయములచేత భూమి రక్షింప సమర్థుఁడనేయగుదుకో, అయినను నీవు ధర్మముగాని యధర్మముగాని (చూ. ౩౮౦-వ ప)న్యాయ్యముగాని యన్యాయ్యముగాని పుణ్యమురాసీ పాపమురానీ యేమార్గమునసైనఁ బుత్రునకు ధనము సంపాదించి యియ్య

వలయుననుపాపిష్ఠమైన నీ యాశను జక్కఁజేయుటకు నేను బూనుకొనఁజాలను. కావున నీసంకల్పము వ్యర్థముకాఁగా నాదురంత తాపముచేతనే మాడిఁపొమ్ము? నీ కదియే శిక్ష వేఱుశిక్ష పనిలేదు.

ఉ. రాముఁడు నిన్నుఁ దల్లివలెఁ ♦ బ్రత్యయబుద్ధిని జూచుచుంటచే
నేమియుఁ జేయ నిన్ను మది ♦ నీయకొనం జుమి, గాకయున్న నిన్
బూమెలమారి! దూరముగఁ♦బుచ్చి సుఖింపనె, యిట్టిబుద్ధి నీ
కే మని పుట్టెనె, చెనఁటి ♦ హేయచరిత్ర సువంశపాంసనీ. ౧౨-౨౯

ప్రత్యయబుద్ధిని=తల్లివను విశ్వాసముచేత, ఈయకొనంజుమి = అంగీకరింపనుజుమా, బూమెలమారి=మోస స్వభావముగలదానా, హేయచరిత్ర=నిందింపఁదగిన నడవడిగలదానా?

తాత్పర్యము

వ్యర్థసంకల్పవై యేడ్చుచుండుము. నీకిది శిక్షయంటివే నేను నీకు మేలు తలఁపఁగా దానికి బదులుగా నిదియా నీవు నాకుఁ జేయుమేలు అనెదవా? వినుము. అంతకెక్కువ శిక్షచేయుటకు ననుకూలములేమిని నిన్నింతతో విడువవలసి వచ్చినది. శ్రీరాముఁడు నిన్నుఁ దల్లియను విశ్వాసముతోఁ జూచుచుండు కారణముచే నేను నిన్ను వేఱువిధముగా దండించిన నాయనకుఁ గోపమువచ్చునే యని భయపడి యంతతో విడువవలసివచ్చినది. అటుగాకున్న నోసి మాయలమారీ! నీవు చేసిన మోసపుఁజేఁతలకు నిన్నూరనుండి దూరముగా వెడలఁగొట్టి హాయిగా సుఖింపనా? ఓసి దుష్టురాలా! నీచ చరిత్రా సద్వంశనాశకురాలా? నీకేమని యిటువంటి పాపపు బుద్ధిపుట్టెనే?

ఉ. మాకులమందు జ్యేష్ఠుఁడు క్ష♦మాభర మెల్ల భరింప సోదరుల్
ప్రాకటభక్తి చే జనకు♦భంగిని నాతనిఁ గొల్చు టొప్పు, న
స్తోకపుధర్మ మిది తెలిఁగు♦దోఁపదొ నీ, కిది యెల్లరాజులున్
జేకొనుచుంద్రు, మాయెడ వి♦శేషముగాఁ గొనియాడఁగాఁబడున్. ౧౨౩౦

క్షమాభరము = భూభారము, రాజ్యభారము పెద్దవాఁడే భరింపవలయుననుటకు, "జ్యేష్ఠఏవతు గృహ్ణీయాత్ పిత్ర్యం ధన మశేషతః। శేషాస్త మను జీవేయుర్యథైవ పితరంతథా॥" మనువు. చరిత్రం చరితంశీలం చారిత్రంచ సమం మతమ్మని హలాయుధుఁడు.

తాత్పర్యము

మా వంశమునఁ బెద్దవాఁడు భూభారమును వహింపఁగాఁ దక్కిన సోదరులు చిన్నవాండ్రందఱు నాయనను దండ్రినివలె సేవింపఁదగును. ఇది గొప్ప ధర్మము. నీకేల యిది తోఁపలేదు, ఈధర్మము సమస్తరాజులు పాటింతురు. అందు మావంశమందది విశేషముగా గౌరవింపఁబడును. మావంశమున దానికి భిన్నము రానేకూడదు.

తే. అట్టి ధర్మైకరక్షుల♦యనఘవంశ,సాధుచారిత్రశోభుల ♦ శస్తచరిత
యుతుల మనియెడిపొగ రిప్పు♦డుర్విఁగలసె,
నీదుసంబంధమునఁజేసి ♦ నీచురాల. ౧౮౩౧

ధర్మైకరక్షులన్ = (1) ధర్మమే ప్రధానముగఁగొని రక్షించువారియొక్క (2) ధర్మమునే ముఖ్యముగా రక్షించువారియొక్క, చారిత్రశోభులన్ = పాప రహితమైన వంశముచేతను మంచి నడవడిచేతను ప్రకాశించు వారియొక్క,శస్త చరితయుతులము=కీర్తింపఁబడిన శీలముతోఁ గూడినవారము రక్షుల, శోభుల యనియెడి షష్ఠ్యంతములకుఁ బొగరుతో నన్వయము,శస్తచరితులము అనునది ఆ పొగరు వివరణము, ఉర్విఁ గలిసెన్=మట్టిపాలాయెను.

తా త్ప ర్య ము

ఓసీ నీచురాలా! యిదివఱకు మావంశమునఁ బుట్టినవారు ధర్మమునే ప్రధాన ముగ రక్షించుకొనువారు ధర్మమునే ప్రధానముగఁగొని లోకులఁ బాలించువారు ఏదోషములేని వంశమునఁ బుట్టినవారు మంచిచరిత్రముచేఁ బ్రకాశించువారు. ఇట్టివారని మేము శ్లాఘ్యమైన నడవడిగలవారము. అనియెడి పొగరుండెను. నీతో సంబంధముచేసిన కారణముచే నా మాపొగరు మట్టిలోఁ గలిసెను.

కం. నీపుట్టినయింటను గోత్రాపాలురలోన జ్యేష్ఠు ♦ ధరణీపతిఁగాఁ
జేపట్టరె? నీతల నేఁ,లా పుట్టెనె యిట్టి చెనఁటి♦యాశయమసతీ? ౧౮౩౨

గోత్రాపాలురు=భూమిని రక్షించువారు, రాజులు చేపట్టరె=అంగీకరింపరా, చెనఁట యాశయము=దుష్టమైన యభిప్రాయము.

తా త్ప ర్య ము.

పతివ్రతాధర్మ మెఱుఁగని పాపినీ! మావంశముమాట యటుండనిమ్ము, నీపుట్టినింటి వంశముమాట చెప్పుము. నీపుట్టినయింటి రాజులలోఁ బెద్దవాఁడే రాజని యంగీకరింపరా ఇట్టిదుర్బుద్ధి నీతలయందే యేల క్రొత్తగా నెందులేనిది పుట్టెనే.

కం. నన్నుఁ జంపఁ జాలునంతటి ఘనతరదుఃఖంబు నీవు ♦ గలిగించితి గా
వున నీయిష్టముఁ దీర్చెడి,ననికిన్ నేఁ బూనఁ జాలఁ♦బాపచరిత్రా. ౧౮౩౩

తా త్ప ర్య ము

ఓసి పాపాత్మురాలా! నన్నుఁ జంపఁజాలినంత దుఃఖము నీవు నాకుఁ గలిగించి నాతండ్రిని జంపినట్లే నన్నుఁజంపఁ జూచితివి. మాతండ్రి మోహవశ మున నీమాయమాటలకు లోపడి చచ్చెను, నేనును జావనైనఁ జచ్చెదనుగాని నీమాటలకు లోపడను. నీయిష్టము నెఱవేఱుపకున్నఁ జచ్చెదనని నాతండ్రితో నంటివిగదా (౩౪౧౫) నేను నీకోరిక నెఱవేర్పను. చచ్చెదవేని జావుము.

కం. ఇష్టముఁ దీర్పమి గాక య, నిష్టంబును గూర్తు నిట్టి నీ కిప్పుడె యా
శిష్టుని స్వజనప్రియు నో, దుష్టాత్మిక మరలఁజేయు దుం బురమునకున్.

తా త్ప ర్య ము [౧౮౩౪

ఓసీ దుష్టాత్మురాలా నీయిష్టము నెఱవేర్పకుండుటయేకాదు, నీయిష్టము నకు విరోధముగనుండు కార్యమును జేసెదను. ఏమిచేసెదవందువా, ఆ సాధు వైన శ్రీరాముని స్వజనులయందుఁ బ్రియముగలవానిని పట్టణమునకు మరలి వచ్చునట్లు చేసెదను.

కం. కొనివచ్చు టె కా దిట కా, యనలప్రభు నేను సుస్థి రాంతఃకరణం
బున దాసుఁడనై కొలిచెద, జనపతిఁగాఁజేసి యతని సమ్మద మారన్.

తా త్ప ర్య ము ౧౮౩౫

ఊరక తెచ్చుటమాత్రమేకాదు. అగ్నిప్రభ కలిగిన యాయననే రాజుగాఁ జేసి స్థిరమైన యంతఃకరణముతో నాయనకు దాసుఁడనై ఛత్రచామరాదులసేవ చేయుచు నాయనకు సంతోషము గలిగింతును. ఇది నీమీఁది కోపముతోఁ జేయు పనికాదు. కోపముతోఁ జేయుపని కోపముచల్లారిన నిలిచిపోవును. ఇది నాస్వరూప ప్రాప్తము గావున శాశ్వతముగా నుండును. నా స్వరూపముచేతనే నేనాయనకు దాసుఁడను. ఇది నీవు తెలియక తాఱుమాఱుచేయఁ జూచితివి.

కం. ఇటు భరతుఁడు కటకటఁ బడి, కుటిలాత్మికఁ గైకఁ దిట్టి కుతిలపడంగాఁ
బటుతరదుఃఖంబున నా, ర్భటు లొనరిచెఁ గందరస్థ పారీంద్ర మనన్. ౧౮౩౬

కుటిలాత్మన్=వంచనమనస్సుగల కైకను, కుతిలపడంగాన్=బాధపడఁగా, ఆర్భటులు=పెద్దధ్వనులు, కంధరస్థ=గుహాలోనుండు, పారీంద్రము=సింహము, గుహకు నింటికి నుపమానోపమేయములు. 'సింహః, కంఠీరవో, భీమః విక్రాంతః కరిమాచలః। పంచశిఖశ్చ శైలాటః పారీంద్రః శ్వేతపింగళః॥' త్రికాండశేషము.

తా త్ప ర్య ము.

ఈ ప్రకారము నసహ్యపడి వంచనమనస్సుగల కైకను బాధపడఁగాఁ దిట్టి మిక్కిలి దుఃఖముతోఁ గుహలోని సింహమువలె పెద్దధ్వను లొనరించెను.

౭౪-వ సర్గము.

కం. అని పరుసము లాడియు నె, మ్మనమున నంతంత రేఁగు మన్యూద్ధతి ని
ట్లనియెను భరతుఁడు కైకం, గనుఁగొని రోషమున మేనఁ గంపం బెత్తన్.

దుర్వార్త వినఁగానే కలిగిన యల్పకోపముచే మృదువుగాఁ దల్లిని నింత వఱకు దూషించెను. ఆమెచేసినకార్య మాలోచించుకొలఁదిఁ ఘోరతరముగాఁ గానవచ్చుటచేఁ గోపము మఱింతవృద్ధికాఁగాఁ దీవ్రముగ దూషించుచున్నాఁడు. పరుసములు=నిష్ఠురములు, రేఁగు=విజృంభించు, మన్యూద్ధతిన్ = కోపాతిశయముచే, కంపము=వణఁకు.

తాత్పర్యము

ఈప్రకారము కఠినోక్తులాడియుఁ దనమనస్సునఁ గైకచేసినకార్యమాలోచించుకొలఁది గోపమంతకంతకు హెచ్చఁగాఁ గైకనుజూచి దేహము వణఁకుచుండ నిట్లనియె.

కం. ఛీ పో యీరాజ్యము విడి, పాపచరిత్రా నృశంస♦బాలిశ యిటు ధ
ర్మాపాయము ఘటియించితి,వా పోవుము నేను దెగిన♦వాఁడ నటంచున్.

తాత్పర్యము ౧౮౩౮

చెడునడవడిగలదానా ఛీపో నీతల్లివలె నీవీ రాజ్యమునందుండ కడవులకుఁబొమ్ము. క్రూరురాలా బుద్ధిలేనిదానా యిటువంటి ధర్మహానికార్యము చేసితివిగదా భార్యాభర్తృన్యాయము నీయందులేదు కావున మగఁడు చచ్చెనని నీవేడ్చియుండవు నేను జచ్చితినని యేడువుము.

కం. భూరమణుఁడొ పుణ్యుఁడు సీ, తారమణుఁడొ తిట్టి రేమొ♦తత్పూర్వము నీ
కారణమున సురపురికి మ,హారణ్యానులకు వార♦లరుగఁగ నొకటన్. ౧౮౩౯

తత్పూర్వము=నీవిట్టి పాపకార్యము చేయుటకుముందు, మహారణ్యానులకున్=పెద్ద యడవులకు.

తాత్పర్యము

(నీ కారణమున స్వర్గమున కొకరిని ఘోరారణ్యములకు నొకరిని నేకకాలమునఁ బంపితివే) రాజుగాని, పుణ్యాత్ముఁడు శ్రీసీతావిభుఁడుగాని (భరతుఁడు శ్రీరాముని బుణ్యుఁడని చెప్పెనుగాని నిష్కారణముగా శ్రీరాము నడవికంపి పాపకార్యము చేయుటచేఁగాఁబోలు పుణ్యుఁడను విశేషణము దశరథునిపక్షమునఁ జెప్పలేదు) నీవిట్లు దుష్కార్యము చేయుటకుముందు తిట్టిరా.

కం. కైకేయీ కూల్చుటచే, నీకులమును భ్రూణహత్య♦యేఁప నిను నధో
లోకమున కరుగు నీకుం, జేకుఱదు సలోకసుఖము♦సిద్ధము పతితోన్. ౧౮౪౦

భ్రూణహత్య=గర్భస్రావము చేసికొనుటవలనఁ గలిగెడు జీవహత్యాపాపము, "భ్రూణోర్భకే స్త్రైణ గర్భే గర్భిణ్యాం శ్రోత్రియే ద్విజే" నానా. ర. గర్భముదించుకొను స్త్రీలు మహాఘోర నరకములకుఁబోయి యావల మఱుజన్మంబునఁ బశుపక్ష్యాది హీనయోనులందు జన్మింతురు. సలోకసుఖము = సాలోక్యసుఖము, పతివ్రతలైన స్త్రీలకుఁ బతితోడ సాలోక్యసుఖముఁ గలుగును. ఇట్టిసుఖము పతిభక్తిలేని స్త్రీలకుఁ గలుగదు.

తాత్పర్యము.

కైకేయీ! యీవంశమును గూలిపోవునట్లు చేయుటచే నిన్ను భ్రూణహత్య బాధింపఁగా నీవధోలోకముల కరుగుము. నీకునీభర్తతో సాలోక్యసుఖము గలుగదు.

మ. తిర మౌ క్రూరపుటెత్తికోలు గలయీ ♦ దృగ్ఘోరపాపక్రియా
చరణాసక్తను నిన్నుఁ గాంచినజగ ♦ జ్జాతప్రియుండైన శ్రీ

ధరణీజాపతి చెంత లేమి భయము • త్పాదిల్లెఁగా కక్కటా
ధరణీరాజ్యము నాకుఁ గల్గుటలు మి • థ్యల్ దుష్టకష్టాత్మికా.   ౧౮౪౧

తిరము = ఫలము కలుగువఱకు వదలనిది, ఎత్తికోలు = ప్రయత్నము, ఈదృక్=ఇటువంటి, ఘోర = భయంకరమైన, పాపక్రియా = పాపకార్యముల యొక్క, ఆచరణ = చేయుటయందు, ఆసక్తను = ఆసక్తిగలదానిని, జగజ్జాత ప్రియుండు = జగముల సమూహమునకుఁ బ్రియుఁడు. "బృందజాతోఽస్త్రీ నద్వయోః" నానా. ర. ధరణీజాపతి = శ్రీరాముఁడు, ఉత్పాదిల్లెన్ = కలిగెను, మిథ్యలు=అసత్యములు, దుష్టకష్టాత్మికా=పాపపు నీచమనస్సుగలదానా.

తాత్పర్యము

దుష్టమైనది నీచమైనదియగు మనస్సుగిలదానా! స్థిరమైన పట్టుదలతో నిర్దయమైన ప్రయత్నముగల యిటువంటి భయంకరమైన పాపకార్యము చేయుటయందు నాసక్తిగల నిన్నుఁజూచి లోకముల సమూహముల కన్నిటికిఁ (నీకుఁదప్ప) బ్రియుఁడైన సీతావిభుఁడు నాసమీపమున లేనికారణమున నాకు రాజ్యము వచ్చుటచే నేనేలుట యసత్యముగాని నీచేఁ జచ్చుట నిజమని భయము కలుగుచున్నది. వైధవ్యమునకును హత్యకు వెఱువక మగనిఁ జంపిన పాపాత్మురాలవు నీ యిష్టప్రకారము పోని నన్నుఁజంపుట యాశ్చర్యమా. నీ యిష్టప్రకారము పోయితినా లోకనిందచే నధర్మముచేఁ జత్తును.

కం. మన్నిగొని నాదుజనకుని, నన్నం గానలకు నెట్టి • యపయశమున్ నా
కు న్నెతిఁ దలఁగట్టితివే, యెన్నయమున జగతి శిరము • నెత్తిచరింతున్.

మన్నిగొని=చంపి, ఎన్నయమునన్=ఏన్యాయము ననుసరించి-

తాత్పర్యము

నాతండ్రిని జంపితివి. నాయన్నను గానలకంపితివి. ఈరెంటికి నేను మూలకారణమని నాకు నపకీర్తి తలకుఁగట్టితివి. ఇఁక సలువురిలో నేమి న్యాయ మెంచి తలయెత్తి తిరుగఁగలను.

ఉ. తల్లివి గావు నీవు, చెడు • దాయవు నాకు, నృశంస కాముకా
చెల్లదు పల్క, నీమొగముఁ • జెల్లదు చూడఁగ భర్తృఘాతినీ!
చెల్లరె రాముమాతయు సుశీల సుమిత్రయు లోనుగాఁగ నా
తల్లులు దుఃఖమందఁ గనిరి • తథ్యము నీ విటు దాపరించుటన్.   ౧౮౪౩

దాయవు=పగదానవు, నృశంస = దయలేనిదానా, కాముక = ధనాశగల దానా, మైథునాశగలది కాముకి, భర్తృఘాతినీ=మగనిఁ జంపినదానా.

తాత్పర్యము

నీవు నాకుఁ దల్లివిగావు, కొడుకుల సుఖము కీర్తి కోరునది తల్లిగాని నీవలె దుఃఖము నపకీర్తి గలిగించునది తల్లియెట్లగును? చెడ్డపగదానవు ఏపగవారును

జేయలేని కార్యము నీవుచేసితివి. పగవారు యుద్ధమునఁ గొట్టినఁ గొట్టఁగలరు గాని నీవలె వంశనాశమును వంశమునకు నాకు నపకీర్తిని వచ్చునట్లు చేయఁ గలరా. ఇట్టిదానవు నీవు నాకుఁ దల్లివిగావు బంధువవైనను నెట్లుకాఁగలవు? నీవు నృశంసవు కనుకనే శ్రీరామ లక్ష్మణుల నట్లు కష్టపడఁజేసితివి. కాముకవు కనుకనే మగనిని జంపితివి. ఇట్టినీతో మాటలాడరాదు. మాటలాడినఁ బాపము వచ్చును. పలుకకుండుటే కాదు నీముఖమైనను జూడరాదు. ఏల? నీవు భర్తను జంపితివి గావున నీవిటు కొంపకు దాపరించుటచే నిజముగా శ్రీరాముని తల్లియు లక్ష్మణుని తల్లియు మొదలయిన నాతల్లులందఱు చాల దుఃఖము పొందినవారైరి.

చం. అతులితధర్మశీలుఁ డగు • నశ్వపతిప్రభుపుత్రి వీవుగా
  వతనికులంబుఁ గూల్ప నుద • యంబయినట్టిపిశాచి వేలనన్
  సతతసుధర్మనిష్ఠుఁ డగు•సత్యపరాక్రముఁ రాముఁ గానఁ ద్రో
  చితివి దివంబుఁ జేర్చితివి•శ్రీఘ్రమ తద్వ్యథ నాదుతండ్రినిన్. ౧౨౪

అతులిత ధర్మశీలుఁడు=అసమానమైన ధర్మస్వభావము గలవాఁడు, అశ్వపతి=కేకయరాజు, అశ్వపతియు జనకునంతటి కర్మయోగి. "జనకాదయో జన కాశ్వపతి ప్రభృతయ" అని శంకరభాష్యము భ. గీ. ౩-౨౦, పిశాచివి=అఁడు దయ్యమవు, సతత=ఎడఁదెగని, సుధర్మ=మంచిధర్మమందు, నిష్ఠుఁడు = నిష్ఠ గలవాఁడు, సత్యపరాక్రమున్=సత్యమే బలముగాఁ గలవానిని, దివంబున్= స్వర్గమును, తద్వ్యథన్=ఆ శోకముచే.

తా త్ప ర్య ము.

అసమాన ధర్మనిష్ఠుఁడగు కేకయరాజు కూఁతురవు నీవుకావు ఆయన కూఁతురవైన పక్షమున నాయనగుణము నీయందుండవలయును అటులయిన నే నెవతెనందువా- ఆయన వంశమును నపకీర్తిచే నాశముచేయఁ బుట్టిన యాఁడు దయ్యమవు. నావలన నాతని వంశమునకేల యపకీర్తి యందువా, కేకయ వంశమునఁ బుట్టిన యాఁడుబిడ్డలా అబ్బా మగనిని జంపు కైకలేయని యెవఁడును వారిని వివాహమాడ భయపడుదురు. పుట్టినింటివారికి నటువంటి యపకీర్తితెచ్చి, మగని యింటివారికో యెల్లప్పుడు ధర్మమందే నిష్ఠగల సత్య పరాక్రము శ్రీరాము నడవులఁద్రోచి యాశోకమున నాతండ్రిని స్వర్గమున కంపితివి.

కం. లోకాప్రియ! నీకృతి నే, లోకములకుఁ జెడినవాఁడ • లుబ్ధా! భవద
  స్తోకాఘము నన్నంటుట, రాకాసీ! తల్లి వనిన•రావె కలుషముల్. ౧౨౫

లోకాప్రియ=ప్రజలకు నప్రియురాలా, నీకృతిన్ = నీవుచేసిన కార్యము వలన, లుబ్ధా=పిసినీ, భవద స్తోకాఘము=నీగొప్పపాపము, రాకాసీ=రాక్షసీ శబ్ద భవము రాకాసి, కలుషముల్=పాపములు.

తాత్పర్యము

ప్రజల కందఱకు నీ వప్రియమైన కార్యము చేసినదానవగుటచే లుబ్ధా నీకారణమున నేను లోకములకు నప్రియుఁడనై చెడినవాఁడనే, తల్లివంటివాఁడే కొడుకు. ఈక్షోభమునకు మూలకారణమతఁడే తాను జాటుగనుండి తల్లిచే నీ కార్యము చేయించెననికదా లోకులు తలఁతురు. ఆకారణమున నామేలెవరు కోరుదురు. ఇటువంటినిన్నుఁ దల్లియనిన బాపములు రావా.

తే. సన్ను తాచార యైనకౌ॰సల్య నకట,సుతవియుక్తను జేసి యే॰గతిని బడయ
నీవు గోరితివే సి॰॰యెట్టిఘోర,నరకమునఁ బడుదానవో॰దురితశీల. ౧౮౪౬

సన్ను తాచార=సత్పురుషులచే స్తోత్రముచేయఁబడు నాచారముగలది, సుతవియుక్తను=కొడుకు నెడఁబాసినదానిని.

తాత్పర్యము

సత్పురుషులచే నుతింపఁబడు నాచారముగల కౌసల్యను గొడుకులేని దానిఁగాఁజేసి నీవెట్టులే సంపదనొందఁగోరితివి. పాపాత్మురాలా నీకు సంపద రాదు. అదియటుండ నరకము తప్పకవచ్చును.

ఆ. బంధుసంశ్రయుఁడు॰పరమ ధర్మిష్ఠుండు, పెద్దవాఁడు తండ్రి॰యుద్దివాఁడు
కోసలాత్మజాత॰కొమరుఁ డన్నియతుని, నెఱుఁగ వటఁవె క్రూర॰హేయచరిత.

క్రూర హేయచరిత=దయలేని నీచమైన నడవడిగలదానా, కౌసల్యకొడుకు, బంధుసంశ్రయుఁడు=చుట్టములకుఁ బ్రాపయినవాఁడు, పరమధర్మిష్ఠుఁడు=శ్రేష్ఠ మగు ధర్మమందు నిష్ఠగలవాఁడు, అన్నియతుని=ఆ నియమవ్రతుని.

తాత్పర్యము

దయాహీనురాలా! నీచపు నడవడిగలదానా, కౌసల్యకొడుకు బంధువుల కందఱకుఁ బ్రాపయినవాఁడని పరమ ధర్మాత్ముఁడని నాకుఁబెద్దవాఁడని తండ్రితో సమానుఁడని నీ వెఱుఁగవటవే? అతనికిఁజేసిన కీడందఱకుఁ జేసినట్లేకదా.

కం. కన నంగ ప్రత్యంగజుఁ,డును హృదయాజ్జాతజాతుఁ॰డును నగుపుత్త్రుం
డెనసిన ప్రేమను దల్లికి, ఘనతరుఁ డగు సుతునిసాటి॰గా రేబంధుల్.

కడుపునఁబుట్టిన కుమారుని విడిచియుండుట తల్లిసహింపదని తెలుపుటకై అంగాదంగాత్సంభవసి యను శ్రుతి వాక్యము స్మరించి చెప్పుచున్నాఁడు.

అంగ ప్రత్యంగజుఁడును=అంగములవలనఁ బ్రత్యంగములవలనఁ బుట్టిన వాఁడు, అంగములు ముఖ కంఠ కుక్షి వక్షః పాదములు. ప్రత్యంగములు. నేత్ర నాసికాంగుళ్యాదులు."అంగాదంగాత్సంభవసి హృదయా దధిజాయసే ఆత్మావై పుత్త్రనామాసి" యను శ్రుతియందున్న అంగాత్+అంగాత్ అనియెడి రెండు పదములలో మొదటి పదమునకు ముందు చెప్పినట్లు ముఖాద్యంగములే యర్థము. రెండవపదమునకుఁ బ్రత్యంగములని యర్థము. అంగప్రత్యంగ

తేజస్సువలనఁ బుట్టుటయే "అంగాదంగాత్సంభవసి" యనుదాని యర్థము "యదేతద్రేతస్తదేతత్సర్వేభ్యోంగేభ్యస్తేజస్సంభూత" మనెడి శ్రుతి యా యర్థమునకుఁ బ్రమాణము. స్త్రీ దేహమున శోణితమే రేతస్సనఁబడును.

హృదయాబ్జజాతుఁడును=జీవాత్మస్థానమగు హృదయకమలము నుండి పుట్టినవాఁడును, వీనికే యౌరసుఁడని పేరు. ఎనసినప్రేమన్=అధికమగు ప్రేమ చేత, ఘనతరుఁడు=మిక్కిలిగొప్పవాఁడు, ఏబంధుల్=అన్నలు దమ్ములు లోనగు వారు, వానిపాటి=పుత్రునితో సమానము పుత్రునివంటి ప్రేమపాత్రులుగారు. ఇతర బంధువులు మితమైన ప్రేమకుఁ బాత్రులనిభావము. ఇంత యసమాన ప్రీతిపాత్రుఁడగు పుత్రుని పరుల బలాత్కారమున వదలుట తల్లికి నెంతదుఃఖకరముగా నుండునోయని భావము. కామధేనువు బంధువుల కష్టముఁజూచి సహింప లేక దుఃఖించినది. కౌసల్య పుత్రవిషయమున దుఃఖించె నన్నదానింగూర్చి యేమి చెప్పవలయునని సూచించుటకై వాని సాటిగారే బంధుల్ అని చెప్పఁబడెను.

సీ. మున్నొక్కనాఁడిలఁ • దున్నుచుఁ దనసుతుల్, నాఁగటిమ్రాఁకుల • వ్రేఁగు కతన
మెడలు వ్రేలఁగవైచి • పుడమిఁ గూలినమట్ట,మధ్యాహ్నమునను ధ • ర్మజ్ఞసురభి
పుత్రశోకంబున • బోరనయేడ్చిన, నశ్రువుల్ క్రిందుగ • నరుగుచున్న
పురుహూతుపై పడఁ • బుణ్యగంధములైన, కన్నీళ్ళు సురభివి • గాఁ దలంచి

ఆ. శిరము మీఁది కెత్తి • పరికించి నభమున, నిలిచి యేడ్చుచున్న • నిర్జరగవి
యొద్దకేగి మిగుల • నుద్విగ్నుఁడగుచును, మోడ్పుఁగేలఁబలికె • మొదవుతోడ.
౧౮౪౯

తల్లికిఁ బుత్రశోకము దుస్సహమను విషయమునకు నొక్క యితిహాసము నుదాహరణముగ వివరించుచున్నాఁడు. వ్రేఁగు=భారము, ధర్మజ్ఞ=దున్నవలసిన దెంతకాలమో యను ధర్మము తెలిసినది, సురభి=కామధేనువు, అశ్రువుల్=కన్నీరు, పైపడు ననుదానితో నన్వయము, పురుహూతుపై పడ. పైపడు, చేపడు, లోపడు నను నవి తోపాటువలె నేకశబ్దంబులు. ఇవి షష్ఠ్యంత శబ్దంబులతోఁ జేరును. పుణ్యగంధములు=మంచివాసనగలవి, పరీక్షించి తద్భవము పరికించి, నభమునన్=ఆకాశమునందు, నిర్జరగవి=దేవతరయావు, కామధేనువు, ఉద్విగ్నుఁడు=భయపడినవాఁడు, మోడ్పుఁగేలన్=అంజలితో, మొదవుతోడన్=ఆవుతో.

తాత్పర్యము

పూర్వమొకనాఁడు కామధేను వాకాశమునఁబోవుచు భూమిని దున్నుచున్న తనబిడ్డలగు నెద్దులు మట్టమధ్యాహ్నమందు నాఁగటికొయ్యల బరువుచే మెడలు వ్రేలవైచి నేలఁగూలఁబడఁగా నెప్పుడెంతకాలము దున్నవచ్చును.ఎప్పుడు దున్న రాదు అనుధర్మము తెలిసినదగుటచే నాకామధేనువు పుత్రులకు వచ్చినకష్టముఁ జూచి బోరున నేడుచుచుఁ గన్నీరుఁగార్పఁగా నవి క్రిందుగఁబోవుచున్న యింద్రుని

మీఁదఁబడఁగా నాయనతలయెత్తి యాకాశమున నిలిచి యేడ్చుచున్న యా దేవతలగోవును జూచి యామెయొద్దకుఁబోయి మిగుల భయపడి చేతులు జోడించి యిట్లనెను.

కం. మాలో మెదలుచు జగముల, మేలుం దలపోయునీకు♦మిడుకఁగ భయ మే
లీల ఘటియిల్లె మాచేఁ, గ్రాలదుగా నెందుభయవి♦కారముగోవా! ౧౮౨౦
మెదలుచున్=తిరుగుచు, మిడుకఁగన్=దుఃఖింపఁగా, ఏలీలన్=ఏవిధముగా.

తాత్పర్యము

మాలో నొకతై తిరుగుచు లోకముల మేలునాలోచించుచుండు నీకు వ్యసన పడఁ గారణమేమి కలిగెను! మావలన నీకేమి భయము కలుగలేదుకదా.

చం. సురపతి యిట్లు పల్కినను ♦ జూచి సుపర్వులధేను వి ట్లనున్
హరి హరి మీనిమిత్తమున ♦ నాపద లే దెపు డేని, దుస్స్థితిన్
వరటెడిపుత్రులం గన న ♦ వారితశోకము వచ్చెఁ, గంటివే
ఖరకరతప్తదీనతను ♦ కార్శ్యయుతంబుల నాదుబిడ్డలన్. ౧౮౨౧

సురపతి=ఇంద్రుడు, సుపర్వులధేనువు=దేవతలయావు, హరిహరి=ఇది వినరానిమాట విన్నప్పుడు పాపపరిహారము నిమిత్తము చెప్పెడుమాట, భగవన్నామస్మరణము సర్వపాపములకు శాంతి, దుస్స్థితిన్=చెడ్డదశచే, వరటెడి=శుష్కించు, ఖరకర=సూర్యునిచే, తప్త=తపించునట్లు చేయఁబడిన,దీన=దుర్బలము లైన, తనుకార్శ్యయుతంబులన్=దేహముల చిక్కుటతోఁగూడినవి.

తాత్పర్యము

ఇంద్రుఁ డీప్రకార మడుగఁగా గామధేనువాయనతో నిట్లనియె. హరిహరీ యెంతపాపపుమాట యంటివయ్యా మీనిమిత్తముగ నాకెపుడునాపదలేదు. భూమి మీఁదఁ గష్టదశ ప్రాపించి కృశించుచున్న కొడుకులఁ జూడఁగా శోక మాఁపరాక దుఃఖించితిని. తీక్ష్ణములైన సూర్యకిరణములచేఁ దపించి చాలినంత మేపులేమిచే దుర్బలములై కృశించిన దేహములుగల నాబిడ్డలఁ జూచితివా?

కం. బడుగులయి యొడిగిలఁబడఁ,
గడు ముక్కులు మూసి మేను♦గాల్చుచుఁ గోలన్
బొడుచుచుఁ దోఁకలు విఱుచుచు,
బడియల మోఁదుచునుగాసి ♦ పఱచిరి కాఁపుల్. ౧౮౨౨

బడుగులు=శక్తిలేనివి, ఒడిగిలంబడన్=మొండికివేసికొని లేవక నేలఁ బడియుండఁగా.

తాత్పర్యము

బలహీనములయి నాగండ్లీడ్వలేక మొండికివేసికొని నేలపైఁబడఁగా గాఁపులు దయాహీనులై వానికి నూపిరాడకుండునట్లు ముక్కులు గట్టిగామూసియు, దేహములమీఁద వాఁతలువేసియు, ముల్లుకోలలతో నెత్తుటుగాఱఁ బొడిచియుఁ, దోఁకలు విఱిచియు, దుడ్డుకఱ్ఱలచే బాఁదియు, నెట్లు కష్టపెట్టుచున్నారో చూడుము.

కం. పొడముట నాకడుపున నీ,
యిడుములఁ బడుచుంటఁ జూచి•యేమియుఁ జేయన్
వడి చాలమి నిటు వగచెదఁ,
గొడుకుంబలె నిష్టతముఁడు • కోమలి కున్నే. ౧౮౫౩

పొడముటన్=పుట్టుటచేత, ఇడుములన్=కష్టములను, వడి=శక్తి, వగచెదన్ = ఏడ్చెదను, ఇష్టతముఁడు = మిక్కిలి యిష్టుఁడు, కోమలికిన్=స్త్రీకి, ఉన్నే= ఉండునా, కలఁడా, లేఁడనిభావము.

తాత్పర్యము.

నాకడుపునఁ బుట్టుటచే నివి యిట్లు కష్టపడుటఁజూచియు నేమిచేయుటకు శక్తిచాలక యీప్రకార మేడ్చుచున్నాను. పుత్రునకంటె నెక్కువ యిష్టబంధువు స్త్రీకిఁ గలఁడా.

కం. వేలకొలందులు బిడ్డలు, భూలోకమునందు నుండిఁ • బొగలెడిసురభిన్
బౌలోమీపతి గని వని, తాళికి సుతచయమె పరమ•మంచుఁ దలంచెన్. ౧౮౫౪

ఉండిన్=ఉండియును, పొగిలెడి=దుఃఖించెడి, పౌలోమీపతి=ఇంద్రుఁడు, వనితాళికిన్ = స్త్రీలసముదాయమునకు, సుతచయమె = కొడుకులసమూహమె, పరము = శ్రేష్ఠము. తాత్పర్యము.

వేలకొలందులు బిడ్డలు భూలోకమందుండియు సందేహోయొక కొన్ని కష్టపడుచున్నవని దుఃఖించు కామధేనువును జూచి యింద్రుఁడు స్త్రీలకు బరమేష్ఠుఁడు పుత్రుఁడేకదా యని తలఁచెను.

చం. అసమశుభప్రవృత్తము స•మస్తజగంబులఁ బ్రోచుకోర్కెయున్
లసితసమృద్ధియున్ నిరత•లాలితసద్గుణ చక్రవాళ మీ
డ్యసహజశీలమును గలస•హస్రసుతాఢ్యము కామధేనువే
వ్యసనము నొంద రాము నెడఁ•బాసినకోసలకన్య నేమనన్. ౧౮౫౫

అసమ=సాటిలేనిదియు, శుభ=మేలుకలిగించునదియునగు, ప్రవృత్తము= గొప్పచరిత్రకలది, లసితసమృద్ధియున్=ప్రకాశించెడి సమృద్ధిగలది, ఎందును గొఱఁతలేనిది, నిరత=అభిలాషకలజనులచేత, లాలిత=ఆదరింపఁబడిన, సద్గుణ= మంచిగుణములయొక్క, చక్రవాళము=సమూహము, ఈడ్య, శీలము=ఈడ్య= పొగడఁదగిన, సహజ=స్వభావసిద్ధమైన, శీలము=నడవడిగలది, సహస్రసుతాఢ్యము = వేయికొడుకులచే సంపూర్ణమైనది, ఇచట సహస్రశబ్దము అనంతము అను నర్థమును దెలుపును. తాత్పర్యము

అసమానమై శుభకరమైనచర్యయు, జగములనన్నిటిని రక్షించుకోర్కెయుఁ బ్రకాశముగాఁదెలియు సమృద్ధియుఁ బ్రేమగలవారిచే నాదరింపఁబడిన మంచిగుణముల సమూహము పొగడఁదగిన సహజమైన యాచారము వేలకొలఁదిబిడ్డలుఁగల

దియునగు కామధేనువే దుఃఖింపఁగా నొంటికొడుకునుగల కౌసల్య శ్రీరాము నెడఁబాసి యేడ్చుట యేమివింత.

తే. ఏకసుత సాధ్వి కౌసల్య • హీనబుద్ధి, వైనసీచే వివత్స యై • యడల కున్నె
  యట్టిపాపంబుచేత నో•గట్టివాయి!
  యుభయలోకంబులను దుఃఖ•మొందెదీవు. ౧౨౩౬

ఏకసుత=ఒంటికొడుకునుగలది, సాధ్వి=పతివ్రత, హీనబుద్ధివి=బుద్ధిలేనిదా నవు వివత్సయై=బిడ్డలేనిదై, గట్టివాయి=గట్టిగావదరు నోరుగలదానా, గయ్యాళీ.

తా త్ప ర్య ము

ఒంటికొడుకునుగలది, పతివ్రతయగుటచే మగఁడుచేసిన కార్యమునకుబదులు చెప్పలేనిది (ఆమెదశయందు నీవుండిన నీవు సహించియుండవని భావము) యగు కౌసల్య బుద్ధిలేని నీచే బిడ్డలేనిదై యేడువకుండునా? అట్టులామెను దుఃఖ పెట్టిన కారణముచే నోసి గయ్యాళీ! రెండు లోకంబులను నీవు దుఃఖించెదవు.

మ. చని మాయన్నను దోడితెచ్చి, ధరణీ • సామ్రాజ్యధౌరేయుఁగా
  వినయం బారఁగఁ జేసి, తత్పదములం • బెంపార సేవించి, యీ
  జనకానంతర కార్యముల్ సలిపి, నే • సత్కీర్తియుం బుణ్యవ
  ర్ధనముం గూర్చెదఁ జూచు చుండు జలధా•రాపూర్ణనేత్రాంత వై. ౧౨౩౭

నిష్కారణముగా నీవు కౌసల్య నేడిపించితివిగదా, నిన్ను నే నేడ్పించెదను జూడు మనుచున్నాఁడు.

ధరణీసామ్రాజ్యధౌరేయుఁగాన్ = భూమిప్రభుత్వము నువహించువానిఁగా, జనికానంతర కార్యముల్ = తండ్రికై చేయవలసిన పితృకార్యములను, పుణ్య వర్ధనము = పుణ్యాభివృద్ధి, జలధారాపూర్ణ నేత్రాంతవై = కన్నీటిజలధారలతో నిండిన కనుఁగొనలు గలదానవై.

తా త్ప ర్య ము

మాయన్న శ్రీరామచంద్రుఁ డుండుచోటికిఁబోయి యాయనను బిలుచు కొనివచ్చి మిగుల వినయముతో భూమీప్రభుత్వమును వహింపఁ జేసి యాయన పాదములఁ గొలిచి తండ్రికిఁ జేయవలసిన పైతృకకార్యములుచేసి నీవు నాకు సంపాదించి యిచ్చిన యపకీర్తికి బదులు సత్కీర్తిని బాపమునకుమాఱు పుణ్య వృద్ధిని సంపాదించెదను. నీవిపత్తికి, శ్రీరామునంసత్తికి, నాప్రతిపత్తికి నీవు కన్నులనిండ నీళ్ళుపెట్టుకొని యేడ్చుచుఁ జూచుచుండుము. నీవు కౌసల్యకుఁ గలిగించిన దుఃఖమెట్టిదో యప్పుడు నీకు దెలియును.

కం. పిలుచుకొని వచ్చి రాముని, నిలుపుదు రాజ్యంబునందు•నిజముగ మఱి నేఁ
  దలఁగక చొచ్చెద మునిజన, నిలయం బగుకాననంబు•నీవు కనంగన్.

తాత్పర్యము.

శ్రీరామచంద్రమూర్తి రాజయ్యేనేని కౌసల్య రాజమాతయని గౌరవింపఁ బడునని సవతికి నిట్టిగౌరవము దగునా అట్టిగౌరవము నాకు రావలయుననికదా నీవు చేసిన యాలోచన:- నీ వేడ్చుచుఁ జూచుచుండఁగనే శ్రీరామునే రాజుగఁ జేసెదను. కౌసల్యకే రాజమాతయను గౌరవము కలిగించెదను. నీ కామాత్ర మేడుపే కాదు అంతకు నెక్కువగ నిప్పుడు కౌసల్య యెట్టులేడ్చుచున్నదో యట్లు నీవేడువఁ జేసెదను. ఏమిచేసెదవందువా? శ్రీరామునిఁ బిలుచుకొనివచ్చి రాజ్యమునందు నిలుపుటమాత్రమేగాదు నీవు చూచుచుండఁగనే యిప్పుడు శ్రీరాముఁ డెట్లు మునివేషముధరించి యడవులకుఁ బోయెనో యట్లు మునివేషముధరించి మునులుండెడి యడవులకు నేనుబోయెదను.

కం. కన్నులకొలుకుల మెదలెడి, కన్నీళ్ళులతోడుతన్ సం॥కలజనులు భృశా
పన్నులు కన నీచేసిన, యన్నీచపుఁజేఁత శక్యం॥ మౌనే సైఁపన్. ౧౮౫౯

తాత్పర్యము

నీకు రాజ్యము రావలయును. అది నీకు స్థిరపడవలయునని శ్రీరాముని నడవులకుఁ బొమ్మంటిని, నీకు రాజ్యమక్కఱలేదేని పోనిమ్ము. నీ యిష్టప్రకారము శ్రీరామునకే యిచ్చుట. నీవేలయడవులకుఁబోవలె? ఎవరుకోరనులేదు రాజు చెప్పనులేదుగదా యందువా? కన్నులకొలుకులందు నీళ్ళుగాఱఁగాఁ బ్రజలేడ్చినది శ్రీరామునకు రాజ్యములేకపోయెననికాదు. శ్రీరాముఁ డరణ్యములపాలై పోయెనని యేడ్చిరి. అట్లు లోకులందఱు నేడ్చునట్లుచేసిన నీ నీచపుఁజేఁత నీవట్టులేడ్చునఁగాని నేనెట్లు సహింపఁగలను. కావున నీవేడ్చుచుండవలయు నని పోయెదను.

కం. ఈయెడ నగ్నిని దూఁకుము, హా యని దండకను జొరుము॥ యురిపోఁతను వే
పాయుము ప్రాణము వేఱొక, ప్రాయశ్చిత్తంబు లేదు॥పాపిని నీకున్ ౧౮౬౦

తాత్పర్యము

నీవు పుత్రశోకమున నేడ్చుశిక్ష నీకుఁజాలదు. అదియెప్పటికగునో, కావున నీవుచేసిన పాపమునకుఁ బ్రాయశ్చిత్తముగ నిప్పుడే యగ్నిలో దూఁకుము. హా యని యేడ్చుచు దండకలోఁ బ్రవేశింపుము. లేదా యురిపోసికొని చావుము. ఇట్టిది తప్ప నీకు వేఱొక ప్రాయశ్చిత్తములేదు.

చం. అడవుల కంచినట్టియతః॥లాఘవము వాయఁగ రామచంద్రమునిన్
గడువడిఁ దోడి తెచ్చి జన॥కాండము లెంతయు సంతసింపఁగాఁ
బుడమికి రాజుఁ జేసి కడుఁ॥ బుణ్యుఁడ నయ్యెద, నంచు నేలపైఁ
బడి స్పృశిచోదితేభ మనఁ॥ బా మన రోఁజుచు నుండెఁ గ్రుద్ధుఁడై. ౧౮౬౧

అతులాఘము=అసమానమైన పాపము, జనకాండములు=జనసమూహములు, సృణిచోదితేభము = అంకుశముచేఁ గొట్టఁబడిన యేనుఁగు, క్రుద్ధుఁడై = కోపము గలవాఁడై.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని నడవులకంపిన మహాపాపముపోవ నాయనను మరలఁ బిలుచుకొనివచ్చి జనసమూహము మిక్కిలి సంతోషించుచుండఁగా భూమికిరాజుఁ జేసి నేను బుణ్యుఁడనయ్యెదను. అవి నేలపైఁబడి యంకుశముచేఁ గొట్టఁబడిన యేనుఁగువలెఁ గ్రుద్ధుఁడై రోఁజుచుండెను.

౭౨-వ సర్గము

చం. భరతుఁడు రక్తనేత్రుఁడయి • పాఱఁగవైచి విభూషణంబులన్
బరిశిథిలాంబరుండగుచు • వ్రాలె మహక్షయమందు వ్రాలు నా
సురపతికేతువో యనఁగ • జొక్కి యటుండియు వెండి లేచి ని
ష్ఠుర గతి దీన మాతదెసఁ • జూచి యమాత్యులతోడ నిట్లనెన్. ౧౮౯౨

రక్తనేత్రుఁడయి=ఎఱ్ఱని కన్నులుగలవాఁడై - పరిశిథిలాంబరుండు=జాఱిపోవువస్త్రముగలవాఁడు - మహక్షయమందుస్ = ఉత్సవము కడపట - వ్రాలు= నేలఁబడు - సురపతికేతువో = ఇంద్రధ్వజమో - చొక్కి=మూర్ఛపోయి - నిష్ఠుర గతిన్ = పరుషవిధమున - అమాత్యులతోడన్= భరతునిరాక విని యాయనను జూచుటకై వచ్చిన మంత్రులు అమాత్యులు మొదలగువారితో.

తాత్పర్యము

భరతుఁడు రోషముచేఁ గన్నులెఱ్ఱచేసికొని శరీరముమీఁద ధరించిన సొమ్ములనెల్లఁబాఱవైచి కట్టువస్త్రము జాఱిపోవుచుండ నుత్సవము కడపట నేలఁబడు నింద్రధ్వజమువలె శోషపోయి నేలఁబడి కొంచెముసేపులో లేచి మొగము వ్రేలవైచుకొనియున్న కైకను బరుషపుఁ జూపులఁజూచుచుఁ దన్నుఁజూడ నచ్చటికివచ్చిన యమాత్యులతో నిట్లనెను.

ఉ. కోరినవాఁడఁ గాను సిరిఁ • గుత్సితయోజన సేయఁ దల్లినిం
బ్రేరణ సేయ, భూమిపస•మీక్షిత మౌనభిషేకవార్తనన్
జేరదు దూరదేశమునఁ • జిన్నసహోదరుతోడ నుండుటన్
ధారిణికన్య రాఘవులు • దండక కేగు టెఱుంగ నేమియున్. ౧౮౯౩

సిరి=శ్రీ-ఐశ్వర్యము, కుత్సితయోజన =దురాలోచన - ప్రేరణసేయన్= ప్రేరించిన వాఁడనుగాను - భూమిపసమీక్షిత = రాజుచే సంకల్పింపఁబడిన - రాఘవులు=రామలక్ష్మణులు.

తాత్పర్యము.

అయ్యా యమాత్యులారా వాస్తవము చెప్పెదవినుఁడు. రాజ్యము నాకుఁ గావలయునని నేనుగోరలేదు. అది లభించుటకై దురాలోచనసేయుఁ దల్లిని నేను

ప్రేరేపింపనులేదు. రాజు సంకల్పించిన శ్రీరాముని పట్టాభిషేకవార్తయైనను నేను దూరదేశమునఁ దమ్మునితో నుండినకారణమున విన్నవాఁడనుగాను. శ్రీ సీతారామ లక్ష్మణులు దండకారణ్యమునకుఁ బోవుటయు నేనెఱుంగను.

కం. అని పెద్దయెలుంగున రోదన మొనరించుటయును విని • ధ్వనిసడిగొని యి
ట్లనియె సుమిత్రకుఁ గోసల, తనయామణివింటె కైక • ధామమునందున్.

సడి=జాడ - ధామమునందున్=ఇంటియందు. ౧౨౬౪

తాత్పర్యము

అని పెద్ద పెట్టున గొంతెత్తి యేడ్చుటయు విని ధ్వనిజాడఁబట్టి కౌసల్య సుమిత్రతోఁ గైకయింటియందు వింటివా యేడ్పుధ్వని.

—• భరతుఁడు కౌసల్యఁ జూడఁ బోవుట •—

ఉ. వచ్చినవాఁడు చూడ ఖల • వర్తన కైకసుతుండు దీర్ఘదృ
క్సచ్చరితుఁడు వానిఁ గనఁ • గా మదిగొల్పెడు నంచు దీనయై
వచ్చుట కుద్యమించెను వి • వర్ణత గార్శ్యము దోపఁ బ్రాణముల్
వచ్చునొ పోవునో యనున • వస్థను దత్సుతుఁ డున్న చోటికిన్. ౧౨౬౫

ఖలవర్తన=దుర్మార్గపు నడవడిగల-దీర్ఘదృక్సచ్చరితుండు=దూరాలోచనముగల మంచినడవడిగలవాఁడు - భరతుని విషయమైన నిట్టి యభిప్రాయము గలది కావునఁ గైకచేసినపనిని భరతుఁడు సమ్మతింపఁడనియే కౌసల్య యభిప్రాయము. మది గొల్పెడున్=మనస్సు పుంకొల్పుచున్నది - వివర్ణతన్=కాంతి మాఱుటచేతను - కార్శ్యము=దేహము కృశించుటయు - అవస్థను=దశయందు - ఉద్యమించెన్=ప్రయత్నించెను - ఆసుతుఁడనుటచేఁ గౌసల్యకు భరతునియందు సవతి కొడుకను భేదభావములేదని తెలియుచున్నది.

తే. భరతశత్రుఘ్నులంత నా • పరమసాధ్వి,
యున్నయింటికిఁబోయి తా • రుల్లమగల
శోకవేగంబునను ధర • సోలియున్న,
యంబ నాలింగనము చేసి • యడలఁగతయు. ౧౨౬౬

పరమసాధ్వి=ఉత్తమ పతివ్రత-ఉల్లము=మనస్సు: ఆగలన్=భేదిల్లఁగా, సోల=మూర్ఛపోయి, అడలన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము.

ఇట్లు కైకతో ముచ్చటలాడిన తరువాత భరత శత్రుఘ్నులు పెద్దలు పుణ్యస్త్రీపురుషులున్న చోటికిఁ దామే పోవలయునుగాని తమనిమిత్తమై వారు వచ్చునట్లు చేయరాదను ధర్మము స్మరించి తల్లియగుటయేగాక యుత్తమ పతివ్రతయుఁగావునఁగౌసల్యయున్న యింటికిఁదామేపోయి దుఃఖముచే గుండెలువ్రీలి దేహము తెలియకనేలఁబడియున్న యాయమ్మనుగౌఁగిలించి దుఃఖింపఁగా నాయిల్లాలును,

చం. భరతునిఁ జూచి యిట్టు లనెఁ • బ్రాజ్య మకంటక రాజ్యమెల్లనో
భరతుఁడ! నీకు నీవలచు•భంగి లభించెఁగదా క్షణంబులో
ఖరతరకార్యశీల యగు•కైకకతంబున; తింక ఁబొమ్ముపైఁ
గర మిడి నినిద్రపొందు కృత•కార్యధురీణుల రీవు తల్లియున్. ౧౮౬౭

ప్రాజ్యము=విస్తారమైనది-అకంటకము=ముండ్లవలె బాధించు శత్రువులు లేనిది-వలచుభంగి=కోరిన విధముగ, ఖరతర=మిక్కిలి కఠినమైన, కార్యశీల=కార్యముచేయు స్వభావముగలది, కతంబునన్=కారణముగా-కృతకార్యధురీణములగు నెఱవేర్పఁబడిన కార్యభారముగలవారు - ధురీణలను = ఏకశేషకావున పుల్లింగరూపము ఁబొమ్ముపైఁ గరమడి, నిద్రపొందు=ఇది సామిత విచారము లేక హాయిగా నిద్రింపుఁడు.

తాత్పర్యము.

భరతునిఁజూచి యిట్లుపలికెను. విస్తారమై బాధించువారులేనిదైన రాజ్యమంతయు నీవు కోరినట్లు భరతా నీకు మిక్కిలి క్రూరమగు కార్యముచేయు స్వభావముగల నీతల్లి కారణము నన్ని నల్పకాలములో లభించెఁగదా. కార్యభారము నెఱవేర్చుకొంటివి కావున నీవు నీతల్లియింక ఁబొమ్ములపై జేతులుంచుకొని విచారము మాని హాయిగా నిద్రపొందు.

ఉ. కట్టఁగఁ బంచి నాసుతునిఁ • గర్కశచీరములన్ వనంబులన్
నెట్టఁగ నేమి వారుకొనె•నీజనయిత్రి నృశంసతామతిన్,
గట్టిఁడి పంపకున్నె ననుఁ • గాఱడవిం బడ, నట్టులైన నా
పట్టి హిరణ్యనాభు నెడఁ•బాయకకూడి సుఖించి యుండుదున్. ౧౮౬౮

కర్కశ చీరములన్ = కఠినములైన నారచీరలను, నృశంసతామతిన్ = క్రూరపు మనస్సుతో-కట్టిఁడి=కట్టు+ఇఁడి, కట్టులకు లోపడియుండనిది, మర్యాదాహీనురాలు, హిరణ్యనాభున్=బంగారువలె నింపైన బొడ్డుగలవానిని, బహువ్రీహిని నాభి అకారాంతమగును. నాభిశబ్దమిచ్చట దేహమున కుపలక్షణము మనోహరమైన శరీరముగలవాఁడని భావము. "హిరణ్మయవపుః ధృతశంఖచక్రః" "హిరణ్య కేశ హిరణ్యశ్మశ్రు" వను శ్రుతి వాక్యములు స్మరించునది. పట్టిన్=కుమారుని.

తాత్పర్యము

క్రూరమగు మనస్సుగల నీతల్లి నా కొడుకును గఠినములైన నారచీరలు కట్టఁజేసి యడవులకుఁబంపి యేమిలాభము సంపాదించెను. రాజ్యలాభము నీ పట్టాభిషేకముతో నేవచ్చెను. శ్రీరాముఁడు దండకకుఁ బోవుటచే వచ్చిన లాభమేమి? మర్యాదహీనురా లప్పుడే శ్రీరామునితోడఁ గౌసల్యను నడవికిఁబంపుమని మగనిఁ గోరియుండరాదా అప్పుడు గాకున్న నిప్పుడు రాజ్యమంతయుఁ దనదే కావున

నిప్పుడు పంపకుండునా యేమి? అవశ్యము పంపును. అట్లైన నేను నాకొడుకు హిరణ్యనాభునితోడ సుఖముగా నుందునే.

ఉ. అంపఁగ నేల నేనె వసుంధరాధిపునగ్నులతో సుమిత్రతో
నింపుగ రాముఁడున్న యెడకేగెద నాతఁడ సంస్కరించుఁ బా
లింపుము నీవ మాతృకమలీమసతార్జితధాన్యవిత్తగో
సంపదిభాశ్వపూర్ణము రసాస్థలి నీసరి లేనిరాజ వై. ౧౮౬౬

మాతృత = తల్లియొక్క - మలీమసతా = క్రూరకార్యముచేత, ఆర్జిత = సంపాదింపఁబడిన ॥ ధాన్య = ధాన్యములచేతను, విత్త = ధనముచేతను - గో= ఆవులచేతను - సంపత్ = సంపదచేతను - ఇభ=ఏనుఁగులచేతను - అశ్వ=గుఱ్ఱములచేతను - పూర్ణము=నిండినది - రసాస్థలి=భూప్రదేశము.

తాత్పర్యము

కైక పొమ్మనుటకు నేనేల కాచుకొనియుండవలెను. మగఁడు లేని దానికి దిక్కు కొడుకేగదా. నాకొడుకుదగ్గఱకు నేను బోవుటకు నా కొకరిసమ్మతమేల? కావున మీతండ్రి నిత్యము వ్రేల్చు నగ్నిహోత్రము పెద్దభార్యనగు నా స్వాధీనమందే కదా యున్నది. దానితోనేగదా రాజునకు సంస్కారము కావలసియున్నది. నీవు తనకు సంస్కారము చేయఁగూడదని నీతండ్రి చెప్పెనుగదా. (ప.౧౧౪౩) నీ తల్లినిగూడ వదలెదనని నీవు నాకు భార్యవు గావని రాజే చెప్పెఁగదా. కావున రాజునకు సంస్కారముచేయు నధికారము నీకు లేదుగదా. ఈకారణముచేత నగ్నిహోత్రము దీసికొని నేను సుమిత్ర యిరువురము శ్రీరాముఁడున్నచోటికిఁ బోవుదుము. చేయవలసిన సంస్కారములన్నియు శ్రీరాముఁడే చేయును. నీవో కుత్సితవ్యాపారముచే నీ తల్లి సంపాదించి యిచ్చిన ధనధాన్యవిత్తకోశముల చేతను గోవులచేతను గుఱ్ఱములు నేనుఁగులు మొదలగు వానిచేతను నిండిన భూమియంతయు నాసరిరా జెవఁడురా యని చెప్పుకొనుచుఁ బాలింపుము.

దశరథుని యగ్నిహోత్రములతోఁ గౌసల్య తాను శ్రీరామచంద్రమూర్తి యున్నచోటికిఁ బోయెదను. ఆయనయే తండ్రి కుత్తరక్రియలు నెఱవేర్చునని చెప్పెనుగదా. ఇట్లామె చేయవచ్చునా? తండ్రి కుత్తరక్రియలు కొడుకులలో నెవరైనఁ జేయవచ్చునుగాని సమీపమందులేని కొడుకు వచ్చువఱకు సమీపమందుండువారు చేయరాదని శాస్త్రములేదు. ఎవఁడు సమీపమందున్నాఁడో వాఁడే చేయవలయును. నిత్యాగ్నిహోత్రముతోఁ బ్రేతసంస్కారము జరుగవలయును గాని,యితరాగ్నితోఁ జేయరాదు.అట్లుండ నేనగ్నిహోత్రమును దీసికొనిపోయెద ననవచ్చునా! అదియునుగాక దశరథునకామెయొక్కతెయే భార్యగాదు.సుమిత్రా కైకేయులున్నారు. వేరు క్షత్రియస్త్రీలుగారేని యప్పుడు పెద్దభార్యయగుక్షత్రియస్త్ర కధికారము, అట్టులునులేదు. కావున దశరథునకుఁ గౌసల్య యెట్టిభార్యయో

తక్కిన యిరువురు నట్టివారే. యజ్ఞము చేసినపుడు ముప్వురు భార్యల నుంచుకొని చేసెనుగాని కౌసల్య నొక్కతెనే యుంచుకొని చేయలేదు. కావునఁ నగ్నిహోత్రమందు ముప్వుర కధికారము గలదు కావునఁ గైకసమ్మతిలేక యెట్లగ్నిహోత్రమును గౌసల్య తీసికొనిపోఁగలదు.

సమాధానము. కౌసల్య యాలోచింపక నిష్కారణముగఁ జెప్పలేదు. ఎందఱు భార్యలుండినను అగ్నిహోత్రరక్షణాధికారము పెద్దభార్యదేగాని యితరులదికాదు. జ్యేష్ఠభార్యతోడ నగ్నిహోత్రము వచ్చును. "జ్యేష్ఠాచే దగ్నిసంయుక్తాహ్యన్యాగచ్ఛే ద్యథాసుఖమ్" కావునఁ గైక కధికారములేదు. అదియునుగాక.

గీ. కేవలార్థ పరవు క్లిష్టధర్మవు నీవు, గాన నగ్ని సాక్షికముగఁ గొనిన
తావకీన కరముఁ దద్దయు విడిచితి, నిందు నూర్ధ్వలోకమందుఁగూడ.

అయో, ౧౧౪౩

అను దశరథునివాక్యము చొప్పునఁ గైకకిపుడు తాను దశరథుని భార్యయని చెప్పుకొను నధికారముకూడ లేదు. అటైన భరతునిఁగూడ వదలిపెట్టెఁగదా యనిన భరతుఁడు కైక యిష్టముచొప్పున వర్తించి శ్రీరామచంద్రమూర్తికి రాజ్యము లేకుండఁజేసె నేని యతఁడును దనకుత్తరక్రియలు చేయరాదని చెప్పెను.

కం. భరతుండీరాజ్యముఁ గొని, మఱియుట గలిగినను వాఁడు మొగిని నివాపా
చరణం బొనురుపఁ దండ్రికిఁ, బరగతి నవి నాకుఁగాక పరఁగుత మనుచున్॥

అని కదా చెప్పెను. కైకకుట్రలో భరతుఁడు చేరలేదు. కావున భరతునకుత్తరక్రియలు చేయునధికారము గలదు. భరతుఁడు శపథముచేసి తన యభిప్రాయమును దెలుపకముందు కౌసల్య తా నగ్నిహోత్రములతో శ్రీరామచంద్రమూర్తి యున్నచోటికిఁ బోయెద ననెను. కావున నామె యిట్లనుట తప్పుగాదు.

—♦ భరతుఁడు కౌసల్యతో శపథంబులు సేయుట ♦—

కం. అని పరుసంబులు పలికిన, విని పుండున సూది గ్రుచ్చు♦విధమైనను దుః
ఖనిహతిని ద్రెళ్లె భరతుఁడు, వనితామణిపాదములను♦వాలిసమూర్ఛన్.

పరుషంబులు=కఠినవాక్యములు పుండునసూది గ్రుచ్చినట్లు కైకేయి చేసినది హృదయమున పుండు. కౌసల్యమాటలు దానిలోఁ గ్రుచ్చినసూదులు.

౧౮౬౫వ పద్యములో భరతుని విషయమున సదభిప్రాయము సూచించిన కౌసల్య యిప్పుడేల యిట్లు పరుషములాడెనని సందేహము దోఁపవచ్చును. ఇది దోషి యని నిశ్చయించి యనిన మాటలుకావు. ఆయన మనస్సు తెలిసికోవలెనని యనిన మాటలు. తరచినఁగదా వెన్నపడును.

తాత్పర్యము

అని కఠినవాక్యములు కౌసల్య చెప్పఁగా విని పుండులో సూదిగ్రుచ్చినట్లు మఱింత బాధ కలుగఁగా దుఃఖముచేఁ గౌసల్యపాదములపై మూర్ఛపోయి పడెను.

శా. ఒల్లంబోయి యొకింత తెలి వినయం • బొప్పారఁ జేమోడ్పుతోఁ
దల్లీ! యేటికి నిందలాడెదవు; క్రొ • త్తా నీకు శ్రీరాముపైఁ
జెల్లౌనాస్థిరభక్తి? నే నెఱుఁగ నే • వృత్తాంత మేపాపమున్
గల్లల్ గావివి, యంతద్రోహినొకొ య • న్నం గానలం ద్రోయగన్. ౧౮౭౧

ఒల్లంబోయి=మూర్ఛపోయి.

తాత్పర్యము

మూర్ఛపోయి కొంచెము తెప్పఱిల్లుకొని లేచి వినయముతోఁ జేతులు ముకుళించి యిట్లనియె. తల్లీ! యేల నన్నుఁ దేరకు నిందించెదవు. శ్రీరాముపై నాకు నెట్టి స్థిరభక్తి గలదో యది నీవెఱుంగని క్రొత్తవిషయమా. ఇక్కడి పట్టాభిషేకవిషయముగాని యది నా తల్లి విఘ్నముచేసి శ్రీరాముని నడవులకుఁ బంపిన పాపపుఁ జరిత్రగాని నేనేదియు నెఱుఁగను. ఇది యసత్యముగాదు. అన్నను గానలపాలు సేయునంతటి పాపినా.

ఉ. రాముని పోక కొప్పిన • దురాత్ముఁడు శాస్త్రసులబ్ధమైన ప్ర
జ్ఞామహిమంబుఁ బాయుత, నృ • శంసజనంబులఁ గొల్చుఁగాత, దు
ర్నీముఖి మేహసర్జన మ • శీతకరాభిముఖంబు సేయునా
పామరుఁ డేగుదుర్గతుల • పాలయి పోవుత ధర్మతత్పరా. ౧౮౭౨

భరతుఁడు తనయందు దోషములేదనుటకుఁ బ్రమాణములు చేయుచున్నాఁడు. ఇవన్నియు నెవ్వనికో యన్వయించునట్లు చెప్పఁబడినను 'నిర్విశేషం నసామాన్య'మను న్యాయమున భరతునందే యన్వయింపవలెను. నేను శ్రీరాముని కానల ప్రయాణము సమ్మతించియుండిన నాకు నీ పాపాత్ములకుఁ గలుగు దుర్గతులు గలుగునుగాకయను భావము. కైకకుఁ దగిలినను దగులవచ్చును.

ఇందు భరతుఁడు తనకు శాస్త్రజ్ఞానములేక పోవునుగాక యని శపథము చేసెను.

శ్లో॥ యః ప్రవృత్తిం శ్రుతిం సమ్యక్ఛాస్త్రం వా మునిభిః కృతమ్
దూషయ త్యనభిజ్ఞాయ, తం విద్యా ద్బ్రహ్మఘాతుకమ్॥

శ్రుతిజ్ఞానముగాని, స్మృతి జ్ఞానముగానిలేక యాశ్రుతితప్పు యీస్మృతి తప్పని యెవఁడనునో వాఁడు బ్రహ్మహత్యచేసినవాఁడే. భార - అను

శాస్త్రజ్ఞానములేక దానిని దూషించువాఁడు, భగవంతుని దూషించువాఁడే ఏలన.

శ్లో॥ ప్రకాశయితు మాత్మానం, భక్తానాం హితకామ్యయా
అవతీర్ణో జగన్నాథః, శాస్త్రరూపేణ వై ప్రభుః
తస్మాచ్ఛాస్త్రేషిధృతిః కార్యా, భక్తిర్మోక్ష పరాయణైః
అభక్తస్య పరేశా స్త్రేషి, భగవాన్న ప్రసీదతి
శ్రవణం శ్రావణంచింతా । తదర్థే తస్య సంగ్రహః ।
చోదితానా మనుష్ఠానాం । శాస్త్ర భక్తస్యలక్షణమ్ ॥

భక్తుల మేలుగోరి తన్నుఁ బ్రకాశింపఁ జేయుటకు భగవంతుఁడు శాస్త్ర రూపమున నవతరించెను. కావున మోక్షమం దాసక్తిగలవారు శాస్త్రమందు భక్తి గలవారై యుండవలయును. శాస్త్రమందు భక్తిలేనివారు భగవంతునియందు భక్తిలేనివారే. కావున వారి విషయమున భగవంతుఁడు ప్రసన్నుఁడుగాఁడు. శాస్త్రము నందలి విషయములు వినుట వినిపించుట మనముచేయుట దాని నిమిత్తమై దానిని సంగ్రహించుట శాస్త్రము చెప్పినట్లు నడచుకొనుట యివి శాస్త్ర భక్తుని లక్షణములు. "శ్రుతి స్మృతిర్మమైవాజ్ఞా" యని యుండుటచేఁ దన యాజ్ఞ మీఱి వర్తించువారి విషయమునఁ బ్రభువెట్లు ప్రసన్నుఁడగును? ఇఁక దూషించువాని గతి యేమి?

తామసానాం విమూఢానాం, పతితానాం భవార్ణవే
విపరీతంచ సకలం, ధర్మజ్ఞానం ప్రకాశతే.

తామసులకు మూఢులకు సంసార సముద్రమున మునిఁగి యుండువారికిఁ బసిరికలు గలవానికి వస్తువులవలె ధర్మజ్ఞానము విపరీతముగాఁ బ్రకాశించును.

సూర్యున కెదురుగా మూత్రము విడుచుటకూడదు.

ప్రత్యాదిత్యం, ప్రత్యనలం, ప్రతిగాశ్చ ప్రతిద్విజమ్
యే మూత్రయంతి పథిచ, తే భవంతి గతాయుషః పరాశరుఁడు.

సూర్యునకు- అగ్నికి- గోవునకు బ్రాహ్మణునకు నెదుటను బాటనడుమను మూత్రము విడుచువాని యాయువు క్షీణించును.(చూ.మనుస్మృతి౪-౪౪-౫౨)

ఈ పద్యము మొదలు కవి భరతుని శపథము నెపంబునఁ బాపకార్యముల నెఱిఁగించుచున్నాఁడు.

నృశంస జనంబులన్=క్రూరజనముల - దుశ్శేముషి=చెడుబుద్ధి, మేహసర్జనము=మలమూత్రముల విడుచుట - అశీతకరాభిముఖంబు = సూర్యునకెదురుగాఁదిరిగి- దుర్గతులన్ = నరకముల.

శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవ సమ్మతించిన దుష్టమనస్సుగలవాఁడు గురుముఖమున శాస్త్రము చదువుటవలనఁ జక్కఁగా లభించిన బుద్ధివిశేషము పోయినవాఁడగునుగాక. (సత్పురుషుని యెడఁజేసిన యపరాధము శాస్త్ర జన్యజ్ఞానమును

నాశము చేయునని భావము) క్రూరజనుల సేవించునుగాక, బుద్ధి హీనుఁడై సూర్యున కెదురుగాఁదిరిగి మల మూత్రములు విడుచునట్టి మందుఁడు పోవు నరకములపాలై పోవునుగాక.

ఉ. హేమిక సుప్తధేనువు ని ♦ జాంఘ్రితలంబులఁ దన్ను వానికిన్
ప్రేమ యొసంగి నట్ల ఘన ♦ కృత్యము లెల్లను జేయఁ బంచి తా
నేమియు నీయ కూరకయ ♦ భృత్యునిఁ బంచెడివాని కేగతుల్
రామునిపోకకొప్పిన దు ♦ రాత్మున కాగతు లబ్బుఁ దల్లిరో. ౧౮౪౩

హేమికన్=అహంకారముచే, సుప్తధేనువు=నిద్రించు గోవును, నిజాంఘ్రితలంబులన్=తనకాళ్ళతో-ఘనకృత్యములు=గొప్పకార్యములు.

దేవతానాం రాజ్ఞశ్చ బ్రాహ్మణస్య గోరితి పదోపస్పర్శనం వర్జయేత్తని అపస్తంబులు.

దేవతా విగ్రహములనుగాని రాజునుగాని బ్రాహ్మణుఁగాని గోవునుగాని కాలిచేఁ దాఁకరాదు.

తాత్పర్యము

పండుకొనియున్న యావును గాలితోఁదన్నువాఁ డేగతులకుఁ బోవునో ప్రేమ గలవానివలెనే నటించి భృత్యునిచే గొప్పపనులు చేయించి యేమియుఁ బ్రతిఫల మియ్యనివాఁ డేగతికిఁ బోవునో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవ సమ్మతించిన యాదుర్మార్గునకు లభించుగతులు నాకు లభించును గాక-

ఉ. ప్రేమను భూతజాలముల ♦ బిడ్డలఁబోలెను సాఁకు నట్టి యా
భూమిపుపట్ల ద్రోహమతిఁ ♦ బూనెడివానికి, షష్ఠభాగమున్
నేమపుఁబన్ను లాగి యవ ♦ నిం దయఁ బ్రోవనివాని, కేగతుల్
రామునిపోకకొప్పిన దు ♦ రాత్మున కాగతు లబ్బుఁ దల్లిరో. ౧౮౪౪

తాత్పర్యము.

లోకుల నందఱను దనబిడ్డలవలె రక్షించురాజునెడ ద్రోహముదలంచువాని కేగతులు గల్గునో ఆఱవభాగము పన్నుతీసికొని ప్రజలను రక్షింపనిరా జేగతులకుఁబోవునో యాగతులు శ్రీరాముని యరణ్యవాసము నే నంగీకరించియుంటి నేని నాకుఁ గలుగునుగాక.

తన్నుఁబోషించు కరుణగల ప్రభువునకు ద్రోహమెంచువాఁడు క్రోఁతిగఁ బుట్టును.

భర్తృపిండాను పశ్నన్యో । రాజ ద్విష్టాని సేవతే
సోపిమోహసమాపన్నో, మృగోజాయతే వానరః,   భారత-అనుశా.

ప్రజలవలనఁ బన్నుదీసికొని వారి రక్షింపని రాజు వారి పాపములనెల్ల ననుభవించును.

అరక్షితారం రాజానాం, । బలిషడ్భాగహారిణమ్
తమాహు స్సర్వలోకస్య । సమగ్రమల హారకమ్- మను.

ఉ. హామముతోడ మున్న తన ♦ సత్రమునం దొగి సర్వ దక్షిణన్
గామము దీర నింత యొసఁ ♦ గం గలవాఁడ నటంచుఁ బల్కి తా
నామఖ మైన వంచనము ♦ లాడెడియాతఁడు పోవుదుర్గతిన్
రామునిపోని కొప్పిన దు ♦ రాత్ముఁడు పోవుట గల్గుఁ దల్లిరో. ౧౮౭౫

తా త్ప ర్య ము

తానుజేయు యజ్ఞమునందు ముందుగా మంచిమాటలతో నింతదక్షిణ నిచ్చెద నని చెప్పి మాటనిష్కర్ష చేసికొని యజ్ఞమైన పిమ్మట మోసపు మాటలాడి దక్షిణ లీయనివాఁ డేగతికిఁబోవునో శ్రీరామునిపోక కొప్పిన పాపియు నాగతికిఁ బోవునుగాక.

ఉ. సామజఘోటకప్రకర ♦ సంకులశస్త్రసమాకులోగ్రసం
గ్రామమునందుఁ బాఱెడిధ ♦ రాపతికిన్, గురుదిష్టతత్త్వమున్
సోమరి యై మది న్మఱచు ♦ శుంఠున కేగతి గల్గు నందురో
రామునిపోక కొప్పిన దు ♦ రాత్మున కాగతి గల్గుఁ దల్లిరో. ౧౮౭౬

సామజ=ఏనుఁగులయొక్క, ఘోటక=గుఱ్ఱములయొక్క, ప్రకర=సమూహములచే, సంకుల=నిండినట్టియు, శస్త్రసమాకుల=ఆయుధములచేనిండినదియు నగు,సంగ్రామమునందున్=యుద్ధమునందు, పాఱెడి=పిఱికియై పరువెత్తెడి, ధరాపతికిన్=రాజునకు, గురుదిష్టతత్త్వమున్=గురువుచెప్పిన పరలోకోపయోగమగు వేదాంతార్థరహస్యమును, సోమరి=(సోము+అరి) మందుఁడు, శుంఠునకున్=మూఢునకు.

బ్రహ్మోజ్ఝతా వేదనిందా, కౌటసాక్ష్యం, సుహృద్వధః
గర్హితా నాద్యయోజగ్ధిః, సురాపానసమాని షట్ మను ౧౧-౫౬

గురువుచెప్పు బ్రహ్మజ్ఞానమును మఱచువాఁడు, తర్కయుక్తులచే వేదనింద చేయువాఁడు, తప్పుసాక్ష్యము చెప్పువాఁడు, స్నేహితుని జంపువాఁడు గర్హ్యములగు నుల్లి మొదలగునవి తినువాఁడు, ఈయార్గురు సురాపానము చేసినవారితో సమానము.

తా త్ప ర్య ము

రెండుపక్షములవారు యుద్ధసన్నద్ధులై యుండుసమయంబునఁ బిఱికియై పరువెత్తిపోవు రాజేగతికిఁబోవునో గురువుచెప్పిన వేదాంతార్థరహస్యమును సోమరితనమున ననుష్ఠింపక మఱచువాని కేగతిగలుగునో యాగతి శ్రీరాముని పోక నంగీకరించినవానికిఁ గలుగునుగాక.

ఉ. సోమరవిప్రభావిభవు • సుందరవిగ్రహు సింహశౌర్యు నా
స్వామిని సింహసంహనను • సామజవిక్రము వ్యూఢబాహువున్
రాము దృఢాంసు రా జగుచు • రాజిలు చుండఁగ భద్రపీఠిపై
రామునిపోఁకకొప్పిన దు•రాత్ముఁడు చూడమి కల్గుఁగావుతన్. ౧౨౭౭

సోమరవిప్రభావిభవున్ = సూర్యచంద్రుల కాంతివంటి కాంతి సంపదగలవానిని, సుందరవిగ్రహున్=అందమైన యాకారముగలవానిని, సింహశౌర్యున్=సింహము శౌర్యమువంటి శౌర్యముగలవానిని, నాస్వామిన్=నన్నుఁదనసొత్తుగాఁ గలవానిని, స్వముగలవాఁడు స్వామి, సింహసంహననున్=ప్రత్యవయవస్ఫూర్తి చక్కఁగాఁ గలవానిని, 'వరాంగ రూపోపేతో యస్సింహసంహననోహిసః' అమరుఁడు. సామజవిక్రమున్=ఏనుఁగు నడకవంటి నడకగలవానిని, వ్యూఢబాహువున్ = బలిసిన రెట్టలుగలవానిని; దృఢాంసున్=గట్టిమూఁపురములు గలవానిని.

తాత్పర్యము

శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోవుట కంగీకరించినవాఁడు సూర్యచంద్ర కాంతిగలవాఁడును, దివ్యసుందర విగ్రహుఁడును సింహపరాక్రముఁడును. నాకు స్వామియు సింహసంహనుఁడును ఏనుఁగునడకవంటి నడకగలవాఁడును బలిసిన రెట్టలు గలవాఁడును దృఢములైన మూఁపురములు గలవాఁడునునగు శ్రీరాముఁడు రాజై సింహాసనమునం దుండఁగా జూచుభాగ్యము లేనివాఁడగునుగాక.

కం. దూరీకృతకరుణుండై, వార కజతిలోదనములఁ • బరమాన్నముఁ దా
నూరక తినుఖలుగతి యా శ్రీరాముని పోక కొప్పు•చెనఁటికిఁ గలుగున్ ౧౨౭౮

దూరీకృతకరుణుండై =దూరముగాఁజేయఁబడిన దయగలవాఁడై, అజతిలోదనములన్= మేకమాంసము నూవులతోఁ గలసినయన్నము, పరమాన్నము, పాయసము, ఊరక=పండుగలు పర్వములు దేవతాది కార్యములు లేక జిహ్వా చాపల్యముచే, పాయసము అపూపముల (అప్పచ్చుల) కుపలక్షణము. పయస్సు (పాలు)తో వండినది పాయసము.

తాత్పర్యము

దయలేనివాఁడై మేఁకమాంసము నూవులయన్నము పాయసము నిష్కారణముగఁ దిను దుష్టునిగతికి శ్రీరాముని యరణ్యగమన మొప్పిన దుష్టుఁడు పోవును.

ఉ. తామసవృత్తిఁ బెద్దలను • ధార్ష్ట్యమునం గనువాని, గోవు ను
ద్ధామపుఁగ్రొవ్వునం దనప • దంబునఁ దాఁకెడివాని, కొజ్జపై
నాముననిందఁ జెప్పుకుటి•లాత్మునకున్ గతి యెద్ది గల్గునో
రామునిపోకకొప్పిన దు•రాత్మున కాగతి గల్గుఁ దల్లిరో. ౧౨౭౯

తామసవృత్తిన్=తమోగుణమునకు సంబంధించిన నడతతో, దార్ఢ్యమునన్ = దిట్టతనముచే, ఉద్దామపు=అధికమైన, ఒజ్జపై = గురువుమీఁద, అమునన్ అహంకారముచే, కుటిలాత్మునకున్=వక్రమనస్సుగలవానికి.

తాత్పర్యము

తామసపు నడవడిచేఁ పెద్దలను దిరస్కారబుద్ధిచేఁ జూచువానికి, అధికమైన గర్వముచే నావును గాలఁదాఁకెడువానికి గురువుమీఁద నహంకారమున నిందలు చెప్పు వక్రబుద్ధికి నేదిగతియో శ్రీరాముని పోక కొప్పినవాని కాగతియే ప్రాప్తించునుగాక.

ఆచార్యమృత్విజంశ్చైవ, గురూంశ్చైవ తపోనిధిమ్
మునీంశ్చాప్య వమన్యంతే, తేభవంతిహి రాక్షసాః మను.

ఆచార్యుని, ఋత్విజుని, గురువును, తపస్విని, మునిని నెవఁ డవమానించి మాటలాడునో వాఁడు రాక్షసుఁడుగాఁ బుట్టును.

ఉ. తా మది విశ్వసించినహి • తప్రవరుం జెలుసంగఁ జూను నా
పామరుఁ డాత్మసమ్మకము • బల్మి రహస్యముఁ జెప్ప దానినిన్
భూమిజనాళికిం దెలుపు • పూరుషుఁ డేగతిఁ బోవునందురో
రామునిపోక కొప్పినదు • రాత్మకుఁ డాగతిఁ బోవుఁ దల్లిరో. ౧౮౮౦

తాత్పర్యము

తన్ను నమ్మినస్నేహితునిఁ జెలుపఁజూనినవాఁడును, మూఢుఁడును మనస్సునందు విశేషమైన సమ్మకముచే స్నేహితుఁడుగదా యని రహస్యము చెప్పఁగా దానిని లోకుల కందఱకుఁ దెలుపువాఁడును నేగతికిఁ బోవునని పెద్దలు చెప్పుదురో శ్రీరాముని పోక కొప్పినవాఁ డాగతికిఁ బోవునుగాక.

తనకు రహస్యముని చెప్పినదానిని బయలుపఱచువాఁడు చేఁపయై యావల మృగమైపుట్టును.

విశ్వాసహర్తా తు నరో, మీనో జాయేత దుర్మతిః
భూత్వా మీనోష్టవర్షాణి, మృగోజాయేత తత్పరమ్. భారత.అను.

సీ. మేలునకును మఱు • మేలు సేయనివాఁడు, మేలు మఱచిన యట్టి • బాలిశుండు
సజ్జనావళిచేత • సంపరిత్యక్తుఁడు, సిగ్గు దలంపని • చెన్నఁటీఁడు
లోకమునకుఁబగ • యైకలంగనివాఁడు, పెండ్లము బిడ్డలు • భృత్యజనులుఁ
దనరియు గృహమునఁ • దానొక్కఁడే మంచి,
యన్నంబుఁ దినియెడి • యఘరతుండు

ఆ. తనసమానురాలి • దారను నైకోక, సంతు లేక చచ్చు • జనుఁడు ధర్మ్యమైన క్రియలులేని • యతఁడేగుగతు లగు, రాముపోక కొప్పు • రాక్షసునకు.

బాలిశుఁడు=మూఢుఁడు, సంపరిత్యక్తుఁడు=విడువఁబడినవాఁడు, చెన్నఁటీఁడు=దుష్టుఁడు, కలంగనివాఁడు = కలఁక లేనివాఁడు, అఘరతుండు = పాపరతుఁడు, సంతు = సంతానము, ధర్మ్యము=ధర్మయుక్తము, రాక్షసునకున్ = రాక్షసునివంటి క్రూరచరిత్రునకు, తన సమానురాలిన్=కులగుణాదులందు.

బ్రహ్మచారి గృహస్థుఁడై పిదప సన్న్యాస మవలంబింపవలెఁగాని ఋణముక్తుఁడుగాక బ్రహ్మచర్యాశ్రమమందుండియే సన్న్యాస మవలంబింపరాదని యీ వాక్యములవలన నేర్పడుచున్నది. బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్తని శాస్త్రముండుటచేత నిక్కడఁ జెప్పిన విషయము వైరాగ్యము లేనివానిని గుఱించినదని చెప్పరాదు. బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్తనునది బ్రహ్మచారిగానుండియే సన్న్యసించుట యుత్తమపక్షమని యర్థముగాదు. గృహస్థాశ్రమమునుండియే సన్న్యసించుట యుత్తమ పక్షము- ఏదేని కారణముచే గృహస్థుఁడుగా నగుటకు సాధ్యపడనియెడల బ్రహ్మచారిగానే సన్న్యసింపవలె ననునది యధమపక్షము. ఆపద్ధర్మము- పిల్లనిచ్చువాఁడు లేకపోవుటయే యాపత్తు అని యీశ్రుతి కర్థము- కాఁబట్టి యిక్కడఁ జెప్పినట్లు గృహస్థుఁడైన పిమ్మటనే సన్న్యసింపవలెను. ఆ వాక్యమందే ఇతరథా యనియుండుటచే నీయర్థము స్ఫురించుచున్నది. గోవింద రాజీయము.

ఈ కలికాలమున సన్న్యాసమే స్మృతి విరుద్ధము. వ్యాస మతమున ౪౪౦౦ సంవత్సరములుదాఁటిన నిషిద్ధము- వైరాగ్యము కుదిరిననాఁడే సన్న్యసింపవలయుననుట యీకాలము నాటిమాటకాదు. ఈమాత్రము దెలియక పరాశరాదులు కలియుగమున సన్న్యాసము నిషేధింపలేదు. వానప్రస్థమే నిషిద్ధమైన యీ కలికాలమున సన్న్యాసమెట్లు శాస్త్రసిద్ధము కాఁగలదు ఇప్పుడు నిజమైన జ్ఞాన వైరాగ్యములు దుర్లభము- అవి పూర్ణముగ లేనివాఁడు భక్తిప్రపత్తులచే సన్న్యసిగాకయే ముక్తుఁడు గావచ్చును. గృహస్థధర్మము నిర్వహింపలేని దుర్బలుఁడు సన్న్యాసి యగును. బ్రహ్మ విష్ణు శివులు సన్న్యాసులా? వసిష్ఠ యాజ్ఞవల్క్యాగస్త్యాదులు గృహస్థులు గారా?

తాత్పర్యము

మేలుచేసినవారికి నుపకారము చేయవలసిన సమయమువచ్చి చేయశక్తియుండియుఁ జేయనివాఁడు, తనకుఁ జేసిన మేలు మఱచినమూఢుఁడు, సాధువులుగానుండువారు తమలోఁ జేర్చుకొనుటకుఁ దగనివాఁడని త్రోసివేయఁబడినవాఁడు, చెడుకార్యముచేసియు లజ్జింపని దుష్టుఁడు, ప్రజలకు విరోధియయ్యును గలఁక చెందనివాఁడు, భార్యబిడ్డలు సేవకులునింటనుండియు వారికిఁబెట్టక తానొక్కఁడే మంచియన్నముఁదిను పాపరతుఁడు- కులమునఁ దనతో సమానురాలగు దానిని గ్రహింపక సంతానములేక చచ్చువాఁడును, ధర్మకార్యములు చేయనివాఁడెగతికిఁబోవునో శ్రీరాముని బోక కొప్పిన క్రూరాత్ముఁడాగతికిఁ బోవును.

తనకు మేలైనవిధముగా వంటచేయించుకొని తిని యింటిలోని యితరులకు మఱియొకవిధముగఁ బెట్టువాఁడు కుక్కగను నావలఁ జండాలుఁడుగానుబుట్టును.

బుభుక్షితేషు భృత్యేషు, యఏకోశ్నాతి మానవః
శ్వయోనిం చ సమాసాద్య, చండాలో జాయతే నరః ॥

మేలుచేసినవారికి నపకారము చేసినవాఁడు శ్వాసకాసిగను, జ్వరపీడితుఁడుగను సర్వాంగ రోగిగను బుట్టును. పరుల బిడ్డలను ద్వేషించువాఁడు చచ్చిన బిడ్డలు గలవాఁడై తుదకు బిడ్డలులేనివాఁడగును.

అపకారంతు యః కుర్యా దుపకర్తరి యన్నరః
శ్వాసకాసీ, జ్వరీ సర్వగాత్రరోగీ, మృత ప్రజః
మృతపుత్రోథ వంధ్య స్స్యాద్యోద్వేష్టి పర సంతతిమ్॥ మాధవీయము.

తన సమానురాలి దారసుగ్రైకోక-

బ్రాహ్మణక్షత్రియ యోవైశ్యః సవర్ణేపాణి సంగ్రహమ్
అకృత్వాత్వన్యజాయాయాః పతంతి నృప సంగ్రహాత్॥ మార్కండేయ

బ్రాహ్మణుఁడుగాని క్షత్రియుఁడుగాని వైశ్యుఁడుగాని శూద్రుఁడుగాని తన జాతియందే వివాహము చేసికొనవలయును- అట్లుచేయక యితరజాతి భార్యలను సంగ్రహించినఁ బతితుఁడగును.

సవర్ణాగ్రే ద్విజాతీనాం, ప్రశస్తా దారకర్మణి
కామతస్తు ప్రవృత్తానా, మిమాస్స్యుః క్రమశోవరాః॥

బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు సవర్ణ కన్యకలనే వివాహమాడవలయును. కామదాసు లనులోమ వివాహములఁ జేయుదురు.

శూద్రాం శయన మారోప్య, బ్రాహ్మణో యాత్యధోగతిమ్
జనయిత్వాసుతంతస్యాం బ్రాహ్మణ్యాదేవ హీయతే.

తన శయనమందు శూద్రస్త్రీనిఁ బండుకో నిచ్చినవాఁడధోగతుల పాలగును. దానియందు బిడ్డలుగన్నవాఁడు బ్రాహ్మణ్యమునే పోఁగొట్టుకొనును.

వృషలీ ఫేనపీతస్య, నిశ్వాసోపహతస్యచ
తస్యాంచైవ ప్రసూతస్య, నిష్కృతి ర్నవిధీయతే॥ మను. ౩-౧౭-౧౯

శూద్రస్త్రీయొక్క యధరపానము చేసినవానికి దాని నిట్టూర్పు సోఁకినవానికి దానియందు బిడ్డలు పుట్టించినవానికిఁ బ్రాయశ్చిత్తము లేదు.

సీ. రామచంద్రునియాయ•రణ్యవాసము సమ్మతించిన యట్టియ•కించనుండు
తనయాలికడుపునఁ•దనయాలిఁ గానక,
యలమటించుచును న•ర్థాయు వగుచుఁ
బరలోక మేగెడు•వాఁడగుఁ గావుత, వృద్ధుల బాలుర•నృపతి సతుల
వధియింపఁ గలిగెడి•పాపంబు భృత్యుల,విడిచినపాపంబుఁ•గుడువఁ గలఁడు

ఆ. కల్లు లక్క యుప్పుఁగరళంబు లోహంబు, పలల మమ్మి పోష్యవర్గములను
　బ్రోచువానిగతికిఁబోవును శ్రీరాము, కానకరుగుటెఱుఁగుఁకలుషబుద్ధి.

అకించనుండు=దరిద్రుఁడు, తనయాళిన్ = బిడ్డల వరుసలను, అలమటించుచున్=వ్యసనపడుచు, అర్ధాయువు = చిన్నవయస్సులోనే చచ్చువాఁడు, పలలము=మాంసము, పోష్యవర్గములన్=తాను బోషింపవలసిన వారిని, కలుషబుద్ధి=పాపపు బుద్ధిగలవాఁడు, గరళంబు=విషము.

'లాక్షాలవణ మాంసాని వర్జనీయాని విక్రయే' యనుస్మృతి వాక్యమిట స్మరించునది.

నూఱుకార్యములు చేసియైన భార్యను బిడ్డలను బోషింపవలయుననునది ముందుచెప్పిన స్మృతి వాక్యమున కపవాదము- కావున నీయకార్యము చేయ [రాదు.

తాత్పర్యము

శ్రీరాముని యరణ్యవాసము సమ్మతించిన దరిద్రుఁడు తాను శాస్త్రప్రకారము వివాహమాడిన భార్యయందుఁ గొడుకులను గనక చింతపడుచు నడిమి వయస్సులోనే మరణించునుగాక. ముసలివారినిఁ బిల్లవాండ్రను రాజును స్త్రీలను వధించిన పాపము, నిష్కారణముగ సేవకుల విడిచిన పాపంబుఁ బొందగలఁడు. కల్లు, లక్క, యుప్పు, విషము, ఇనుము, మాంస మమ్మి తాను రక్షింపవలసిన భార్యలను బిడ్డలు మొదలగువారిని రక్షించువాఁ డేగతికిఁబోవునో శ్రీరాముఁ డరణ్యమునకుఁ బోయినవార్త తెలిసినవాఁడు పోవును.

కం. ఘోరాజి డాయఁ బాఱెడి,భీరువు చేపడినఁ జంపుఁవిధమునఁ దల్లీ
　మారణ మొనరింపఁగ నగు, శ్రీరామునిపోక కొప్పుఁచెనఁటిని నిపుడే.

తాత్పర్యము　[౧౭౭౩

యుద్ధకార్యములు లేనపుడు రాజద్రవ్యమును దినుచుండి భయంకర యుద్ధము సమీపింపఁగాఁ బరువెత్తిపోవు పిఱికి దొరకెనేని వానినెట్లు చంపవలయునో శ్రీరాముని పోకకొప్పిన వాని నట్లు చంపవలయును.

సీ. కేలఁ గపాలంబు ♦ గ్రాలఁ జింపులు గట్టి, వెఁదుఱుపోలికఁబిచ్చ మెత్తి
　తిరుగును ధరణిని ♦ ద్రిమ్మటకాఁ డగు; నక్షపానంబులఁనతివలందుఁ
　దగు లగు మతి సతతంబుఁ గామక్రోధ.వశుఁ డగు రామునిఁపట్ల వంచ
　కుండు, ధర్మపుబుద్ధిఁగూలుఁ గావుత వాని, కెడ్డధర్మపుబుద్ధిఁయెసఁగుఁగాత
ఆ. వాఁ డపాత్రములనుఁవర్షించు ధన మెల్ల, వానిసంచితంబు ♦ లైనధనము
　లన్ని దొంగపాలఁయగుత శ్రీరాములఁపట్లద్రోహమెంచు ♦ పాపమతికి.

కేలన్=చేతియందు, కపాలంబు=పునుక, వెఁదుఱుపోలికన్ = పిచ్చివానివలె, అక్షపానంబులన్ = జూదమందు- సారాయి త్రాగుటయందు, అపాత్రములన్=అయోగ్యులయందు- కామక్రోధవశుఁడగు.

త్రివిధం నరకస్యేతం, ద్వారం నాశన మాత్మనః
కామక్రోధ స్తథాలోభః। తస్మాదే తత్త్రియంత్యజేత్. భ. గీ.

కామక్రోధలోభములు నరక ద్వారములు. తన్ను నాశము చేయునవి. ఆత్మను నాశముచేయును కావున వానిని వదలవలయును.

ధర్మపుబుద్ధి కూలుఁగావుత.

యేనాస్తికా నిష్క్రియాశ్చ, గురు శాస్త్రాతిలంఘినః
అధర్మాజ్ఞా దురా చారా, స్తే భవంతిగ తాయుషః ॥ అను.

నాస్తికులు క్రియాహీనులు గురువును శాస్త్రమును నుల్లంఘించినవారు అధర్మాత్ములు నజ్ఞులు దురాచారులు వీరికి నాయువు క్షీణించును.

అపాత్ర దానము

ప్రతిశ్రుత్యా ప్యధర్మ సంయుక్తో, నదద్యాత్ ॥ గౌతమ.

ముందుగ నిచ్చెదనని చెప్పియు వాఁడధర్మసంయుక్తుఁడయ్యేనేని యీయరాదు.

నవార్యపి ప్రయచ్ఛేత్తు, బైడాలవ్రతికేద్విజే
నబకవ్రతికే పాపే, నావేదవిధి ధర్మవిత్
త్రిష్వప్యేతేషు దత్తంహి, విధినాప్యార్జితం ధనం
దాతుర్భవే దనర్థాయ, పరత్రాదాతు రేవచ॥ మను. ౪-౧౯౨

ధర్మమెఱిఁగినవాఁడు బైడాలవ్రతముగల బ్రాహ్మణునకు బకవ్రతముగల బ్రాహ్మణునకు వేదమెఱుఁగని బ్రాహ్మణునకు మంచినీళ్లైన నీయరాదు.

ఈ మువ్వురకు ధర్మరీతి సంపాదించిన ధనము నెవ్వఁడు దానమిచ్చునో యెవఁడు పుచ్చుకొనునో వారి కిరువురకుఁ బరలోకమునఁ గీడుకలుగును.

కం. రవి యుదయించెడివేళల, రవి గ్రుంకెడివేళ నిద్దురం గొనుజడుఁ డే
యవిధింబడు జనకసుతా,ధవుద్రోహియు నట్టియవిధిఁ దప్పకపడెడున్. [౧౮౮౫

తాత్పర్యము.

సూర్యుఁడుదయించువేళల- సూర్యుఁడస్తమించువేళల నిద్దురవోవువాని కేకష్టములు గలుగునో యాకష్టములు శ్రీరామ విషయమున ద్రోహమొంచిన వానికిఁ గలుగునుగాక.

నాశ్నీయాత్సంధి వేళాయాం, నగచ్ఛేన్నాపి సంవిశేత్॥ మను. ౪-౫౫

సంధ్యాకాలములందు భుజింపరాదు. ప్రయాణము చేయరాదు. పరుండరాదు.

ఉ. పాప మదెద్ది గల్గు గురు భార్యను బట్టిననీచబుద్ధి, కే
పాపము గల్గు నిండ్లకును వహ్నిఁ దగిల్చినయట్టికూళ, కే
పాపము మిత్రవంచనను బాటిలు, నాఘనపాప మొందు సీ
తాపతిఁ గైతవంబున వ్యథ బడఁ జేసినయట్టి ద్రోహికిన్. ౧౮౮౬

కూళకున్=దుష్టునకు, కైతవము=వంచన, క్రూరశబ్ధభవము కూళ.

తా త్ప ర్య ము

గురుభార్యతో సంగమించిన నీమన కేపాపమో యిండ్లకు నిప్పుపెట్టినవాని కేపాపమో మిత్రుని వంచించినవాని కేపాపమో యట్టి గొప్పపాపము శ్రీరాముని వంచనచే దుఃఖపెట్టిన ద్రోహికిఁ గలుగునుగాక!

ఆశ్రమేవా వనే వాపి గ్రామేవా నగరే పురే
అగ్నిం సముత్సృజేన్మోహాత్, తం విద్యాత్ బ్రహ్మఘాతుకమ్.

ఆశ్రమములకు, నడవులకు, గ్రామ, నగర, పురములకు, నిండ్లకు నిప్పు పెట్టినవానికి బ్రహ్మహత్యచేసిన పాపము వచ్చును.

గురుభార్యను బొందినవాఁడు కుక్కగాఁబుట్టి మూఁడు సంవత్సరము లుండి యావల నరకమునకుఁబోయి మరలఁ గ్రిమిగాఁబుట్టును.

కం. దేవతలయుఁ బితరులయుం, బావనమతి జనకులయును॰బరిచర్యకుఁ గాఁ
డేవాఁ డాపాపము సీతావిభునెడ ద్రోహమెంచు॰తన్నరున కగున్. ౧౮౭౪

తా త్ప ర్య ము

శ్రీరాముని విషయమున ద్రోహమెంచినవానికి దేవతలయుఁ బితృదేవతలయు జీవించియుండు తల్లిదండ్రులయు సేవ కలుగకుండునుగాక?

తేషాం త్రయాణాం శుశ్రూషా పరమంతప ఉచ్యతే
అనాదృతాస్తు యస్యైతే, సర్వాస్తస్యా ఫలాః క్రియాః. మను.

ఆ మువ్వురి శుశ్రూషయే పరమ తపస్సు. అదివిడిచి యెవఁ డేతపస్సులు చేసినను వ్యర్థములు.

తే. పెక్కుబిడ్డలవాఁడును॰బేదవాఁడు, జ్వరముచే బాధపడువాఁడు॰సంతతంబు
బహుళకష్టంబులకుఁ జిక్కి॰వగచువాఁడు,
నగును రాముని వనవాస॰మనుమతింప. ౧౮౭౫

తా త్ప ర్య ము

శ్రీరాముని వనవాస మంగీకరించినవాఁడు పెక్కురు బిడ్డలఁగన్న పేదవాఁ డగును. (పేదతీకమునఁ బెక్కురుబిడ్డలు గలిగినచో సంసారబాధ నరకబాధకంటె నెక్కువ. బిడ్డలులేక దరిద్రుఁడైనను బిడ్డలుగలిగి ధనికుఁడైనను ఆబాధ లేదు.) ఎల్లప్పుడు జ్వరముచే బాధపడువాఁడగును. పెక్కు కష్టంబులకుఁ జిక్కి దుఃఖించువాఁడగును.

ఆ. చేతు లొగ్గినుతులు॰సేయుచు నాశను, గనులు మీఁది కెత్తి॰కనుచు దీనుఁ
డగుచువేఁడువాని॰యాసను వృథ సేయు,నమ్మ రాముపోక॰ననుమతించి. [౧౮౭౬

తా త్ప ర్య ము

తల్లీ! శ్రీరామునిపోక ననుమతించినవాఁడు దరిద్రుఁడై చేతులొగ్గి స్తోత్రములు చేయుచు నాశచేతఁ గన్నులు మీఁదికెత్తిచూచుచు దీనుఁడై యాచించువాని యాసను వ్యర్థముచేయువాఁ డగును.

చం. అనుపమసత్యధర్మరతు◆లైన మహాత్ములతోడి చెల్మి స
జ్జనసుతకీర్తియున్ సుజన◆సత్క్రియ లీక్షణమంద పాయుతన్
జనకుని శ్రద్ధమీఱఁ బరి◆చర్య లొనర్ప కనర్థకారుఁ డౌ
జననిరొ రాముఁ గానలకు◆సాగఁగఁ జేసినపాపజాతియున్. ౧౨౬౦

అనుపమ సత్యధర్మరతులు=సత్యమందు ధర్మమందు నసమానమైన ప్రీతి గలవారి, చెల్మి=స్నేహము, సజ్జనసుతకీర్తియున్= సత్పురుషులచేత స్తోత్రము చేయఁబడిన కీర్తియును, సుజనసత్క్రియలు=మంచివారుచేయు మంచి దేవ పిత్రాది కార్యములు, జననికిన్=జననీజనక శుశ్రూష ముందుచెప్పినను జననీ శుశ్రూష నిత్యానుష్ఠేయమని తెలుపుటకై మరలఁ జెప్పఁబడియె. తల్లి పతిత యైనను నామెకుఁగొడుకు శుశ్రూష చేయవలెను.

తాత్పర్యము

తల్లీ! శ్రీరామునిఁ గానలకుఁ బంపినవానికి సత్యధర్మములం దసమాన ప్రీతిగల సత్పురుషుల సహవాసము సాధువులచే స్తోత్రముచేయఁబడు కీర్తియు సుజనులు చేయు దేవపితృపూజాది సత్కార్యము లీనిమిషమునందే పాయును గాక! తల్లికి శ్రద్ధతోఁ బరిచర్యచేయని కీడరి యగునుగాక!

సుజనులకు దేవపితృకార్యము లనివార్యములు నిత్యములు అవి చేయ కుండరాదు. ప్రతిదినము దేవతార్చన చేయకయుఁ బితృవేళలఁ బితృకార్య ములు చేయకయు భుజించువాఁడు కాకియై పుట్టును.

శ్లో. దేవకార్య మకృత్వాతు, పితృకార్యమథాపివా
అనిర్వాప్య నరోహ్యశ్నన్ మృతోజాయతి వాయసః. మాధవీయము.

ఉ. మాయలమారియున్ గడుసు◆మాటలమారియు దోషకారియున్
న్యాయముఁ దప్పి ఱేనికి వ◆ణంకెడివాఁడును లోభి యయ్యెడున్
జాయను ముట్టునీళ్ళదివ◆సంబున నొద్దన యుండి క్రీడలన్
డాయనిదుష్టుఁ డౌత రఘు◆నందనుపోకకు నొప్పునాతఁడున్. ౧౨౬౧

తాత్పర్యము.

శ్రీరామచంద్రుని వనవాసగమన నంగీకరించినవాఁడు మాయలమారియుఁ బరుషముగా మాటలాడువాఁడును దోషములు చేయువాఁడును న్యాయముదప్పి నేరములుచేసి రాజునకు భయపడువాఁడును బిసినారియు నగునుగాక! అట్టి వాఁడు తన భార్య ముట్టుస్నానముచేసిననాఁడు సమీపమందేయుండియుఁ గ్రీడింపని దుష్టుఁడగునుగాక!

శ్లో. ఋతుస్నాతాంతు యోభార్యాం, సన్నిధౌ నోపగచ్ఛతి
ఘోరాయాం భ్రూణహత్యాయాం, యుజ్యతే నాత్రసంశయః.

సమీపమందుండియు ఋతుస్నానము చేసిన భార్యతో నెవఁడు సంభోగింపఁడో వానికి ఘోరమగు భ్రూణహత్యవచ్చును సందేహము లేదు. ఇట్లని యిరువురిలో నొకరు వ్యాధిపీడితులయి యుండిరేని సంగమింపరాదు. నిషిద్ధ దినములైనను గూడదు.

కం. ధర ధర్మదారఁ గూడక, పరదారలఁ గూడుత్యక్త • వరధర్మరతి
స్థిరుఁడౌ తరాము నడవుల, కరుగన్ ఘటియించినట్టి • యా బాలిశుఁడున్.

తాత్పర్యము. [౧౨౯౨

శ్రీరాముఁ డడవులకుఁ బోవఁజేసిన యామూఢుఁడు ధర్మశాస్త్రప్రకారము వివాహమాడిన భార్యతో రమింపక యితరుల భార్యలతోఁ గూడుచు శ్రేష్ఠమగు భార్యాభర్తల ధర్మమందుఁ బ్రీతిలేనివాఁ డగునుగాక!

శ్లో. అకారణాద్ధర్మపత్నీం, త్యాగీ స్యాచ్చ జలోదరీ
వేశ్యాం కులవధూం కృత్వా, వర్తతేయో నరాధమః. మాధవీయ.

నిష్కారణముగాఁ దనధర్మపత్నిని వదలిన నరాధముఁడును, వేశ్యను భార్యవలెఁ జేసికొనిన నీచుఁడును జలోదరము గలవాఁడుగ నగును.

ఉ. కూడును నీళ్లు నీక తన • కుం గలబిడ్డలఁ జంపువిప్రుఁడున్,
దోడనె చచ్చు బిడ్డలను • దోరముగాఁ గను బ్రాహ్మణుండు, లే
దూడలయాలపాల్పిదుకు • దుష్టుఁడు, బ్రాహ్మణదత్తహర్తయున్,
గోడును రామచంద్రునకుఁ • గూర్చినవాఁ డగుఁ జుమ్మి తల్లిరో. ౧౨౯౩

తాత్పర్యము

శ్రీరామచంద్రునకుఁ గష్టము గలిగించినవాఁడు తన బిడ్డలకుఁ గూడు నీళ్ళుపెట్టక చంపువాఁడును బుట్టినవెంటనే చచ్చు బిడ్డలనుగను బ్రాహ్మణుండును లేతదూడలుగల యావుపాలు పిదుకు దుష్టుఁడును బ్రాహ్మణులకై దానము చేసినదాని హరించువాఁడు నగునుగాక!

కం. జలదూషక విషదాయక, కలుషంబులు రెండు గలుగుఁ • గావుత జననీ
పలుగాకి యెవఁడు రాముని, బలుగాసిం బెట్టి పిపిన • వాసము కతనన్.

తాత్పర్యము [౧౨౯౪

శ్రీరాముని వనవాసము కారణముగా నేనీచుఁడు కష్టపెట్టెనో వాఁడు త్రాఁపుట కుపయోగపడు నీటియందు మలమూత్రములు విడుచుట, ముఱికివస్తువులను మ్మి వేయుట, లోనగు కార్యములు చేసినవాఁడును విషము పెట్టువాఁడును నగునుగాక!

త్రాగెడినీళ్ళను, జెఱుచుటయు విషముపెట్టుటయు సమానములు.

నాప్సు మూత్రపురీషంకుర్యాన్న నిష్ఠీవేత్. తైత్తి.

నీళ్ళయందు మలమూత్రములు విడువరాదు. ఉమ్మివేయరాదు.

ఇత్యేవ మాదయశ్చాన్యే, నరకాభృశదారుణాః

యమస్య విషయేఘోరాః, శస్త్రాగ్నివిషదాయినః
పతంతితేషు పురుషాః పాపకర్మరతాస్తుయే. వి. పు.

ఈ మొదలైన యనేక ఘోరనరకములు యముని పురమందుఁ గలవు. శస్త్రము అగ్ని విషము వీనిచే జనులకుఁ గీడుకలిగించు పాపాత్ము లీనరకములఁ గూలుదురు.

ఉ. నీరముఁ గోర డప్పి జన•నీ! గృహమందున కల్గి మంచినీ
రార నొసంగ కేవియొ యు•పాయములం జను మన్న వంచకుం
డారసి యుప్పునీరముల • నాతని కిచ్చుసతండు వోవుత
న్నారక మేగు నీదుప్రియ•నందనుపోకడ కొప్పు నాతఁడున్. ౧౮౯౫

తాత్పర్యము

దప్పిగొని త్రాగుటకు నీళ్ళడుగఁగా నింట మంచినీళ్ళుండియు నేదో నెపముపెట్టి లేదుపొమ్మనువాఁడును, ఉప్పునీళ్ళిచ్చువాఁడును బోవు నరకములకు శ్రీరాము వనవాస మంగీకరించినవాఁడు బోవునుగాక! నరకమె నారకము స్వార్థక తద్ధితాంతము.

తే. తగవులను దాను మధ్యస్థుఁ • డగుచుఁ జెలిమి
నందు నొకనికి జయ మొందు • నట్లు తెలుపు
వానిగతి యగు జానకీ • జానియెడల
నఘము నెంచినవారల • యరుగుగతియు. ౧౮౯౬

తాత్పర్యము

ఇరువురు కలహించి తన్ను మధ్యస్థుఁడుగా నుండి ధర్మముగాఁ బరిష్కరింపఁగోరఁగా నందొకనిపైఁగల స్నేహభావముచే వానికి మేలుగలుగునట్లు పరిష్కరించువాఁ డేగతికిఁబోవునో శ్రీరామునిపట్ల బాపమెంచినవాఁ డాగతికిఁ బోవునుగాక!

బహువ్రీహిని జాయ జాని యయి జానకీజానియయ్యె. ఎవనికి జానకి జాయయో వాఁడు జానకీజాని.

—• కౌసల్య భరతు నూరార్చుట. •—

చం. ఇటు పతిహీనయున్ సుత•విహీనయు నై దురపిల్లుతల్లినిన్
బటుశపథాళి నూఱడఁగఁ • బల్కియు దుఃఖము పేర్మి నేల పైఁ
దటుకున వ్రాల నాయమయుఁ•దత్సుతుఁ గాంచి వచించెఁ దండ్రి! యెం
తటిశపథంబు లాడితివి • దారుణతాపముగల్గె నిన్ననన్. ౧౮౯౭

దురపిల్లు=దుఃఖించు, పటుశపథాళిన్=తీక్ష్ణములైన ప్రమాణ సమూహములచే; భరతుఁడు చేసిన ప్రమాణములవలన రెండుగుణములు గానవచ్చుచున్నవి. భరతుఁడు తనయందు దోషములేదని చెప్పుట; రెండవది తా నిట్టిఘోరపాపము చేసితినిగదాయని కైకకుఁ దోఁపఁజేయుట, ఇట్లగుటచే భరతునందు నెట్టికల్మష లేశలేపము గానరాదని దృఢపడెను.

ఖరతుఁడు ప్రమాణముచేయుటచే నిర్దోషులగువారు తమయందు నిష్కారణ నిందమోపఁబడినచోఁ దమయందట్టి దోషములేదని ప్రమాణముచేయవచ్చునని సూచింపఁబడియె.

విశ్వామిత్రుఁడు తన నూర్వురు కొడుకులను వసిష్ఠుఁడు చంపెనని దోషమాపాదించినపుడు వసిష్ఠుఁడు ప్రమాణముచేసెనని మనుస్మృతియందుఁగలదు. తమయందు దొంగతనము మోఁపబడినపుడు సప్తర్షులు ప్రమాణముచేసిరని భార-అను పర్వమందుఁగలదు.

తాత్పర్యము

మగఁడులేనిదియు సుతుఁడులేనిదియునై దుఃఖించుతల్లిని దీక్ష్ణములైన ఘోరప్రమాణములచే నూరడిల్లఁబలికియు దుఃఖాతిశయముచేఁ దటాలున నేలపైఁబడఁగాఁ గౌసల్యయు నాకొడుకునుజూచి నాయనా యెంతటి కఠినములైన ప్రమాణములు చేసితివి- నిన్నుఁజూడఁగా నాకు మిక్కిలి పరితాపము గలుగుచున్నది.

కం. నాతనుజాతువియోగము, చేతను దపియించునాదు•చిత్తము నీవా
గ్జాతంబులఁ బీడించియు, నాతనయా యసువు నిలిపి•నాఁడవు నాకున్.

నా తనుజాతువియోగము=నా కొడుకు నెడఁబాసియుండుట- ఇది యేకదేశిసమాసము- సు-వ్యా-సూ-౪౪ వాక్యపరిచ్ఛేదము. వాగ్జాతంబులన్=వాక్యసమూహములచే. నా తనయా యనుటచే నీవు నైకకొడుకవుగావు. రాముని వలె నా కొడుకవే. ఇఁక నాదుఃఖము సగము శమించినది అని భావము.

తాత్పర్యము

నాచిత్తము నాకొడుకును విడిచియుండవలసివచ్చుటకే తపియించుచున్నది. దానికిఁదోడు నీ ప్రమాణ వాక్యములు మఱింత తపింపఁజేసినవి. అయినను నీమీఁది సందేహము తొలఁగిపోవునట్లుచేసి నాప్రాణము నిలిపినాఁడవు. నా కుమారా నీవిట్లుచేయకుండిన నేనే గతిపట్టియుందునో.

ఉ. తమ్ముఁడు లక్ష్మణుండు బలెఁ • దద్ద యదృష్టము నీవునున్ సుధ
ర్మమ్మును బాయ వన్నయెడ • రాజిలు పుత్రక! సత్యసంధతన్
నెమ్మది సజ్జనుల్ చనెడి•నిస్తులలోకముఁ బొందు, మంచు నం
కమ్మున నిల్పి కట్టుకొని•రాజియ హా యని యేడ్చె దీనయై.   ౧౨౮౬

తద్ద=మిక్కిలి, అదృష్టము = పూర్వపుణ్యఫలము, అంకమ్మునన్ = ఒడియందు- దీనివలన వయస్సువచ్చినవారినైనను, కొడుకువరుసవారిని వృద్ధస్త్రీలును, కూఁతువరుసవారిని (కోడలిని) వృద్ధపురుషులు కుడి తొడమీఁదను గూర్చుండఁబెట్టుకొనుట దోషముగాదు.

తాత్పర్యము

నాయనా! యిది నా యదృష్ట విశేషము- నీ తమ్ముఁడగు లక్ష్మణునివలె నీవును జ్యేష్ఠకనిష్ఠసోదర న్యాయము వదలినవాఁడవుకావు. సత్యసంధుఁడవై

ప్రకాశింపుము. నీకు సత్పురుషులకుగలుగు పుణ్యలోకములు కలుగునుగాక యని యతనిఁ దనదొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని దుఃఖబాధచే దీనురాలై హాయని యేడ్చెను.

కం. ఇమ్మెయిని శోక మోహభ,రమ్మున మూర్ఛలను నేల•వ్రాలుచుఁ గడు దీ
ర్ఘమ్ముష్ణమ్ముగ రోఁజుచు,నుమ్మలికము నొంద రేయి•యుం గడఁ గాంచెన్.

ఇమ్మెయిన్ = ఈవిధముగా, శోక మోహభరమ్మునన్ = శోకమోహముల యతిశయముచే, కడుదీర్ఘము=మిక్కిలి నిడివి, ఉష్ణము=మిక్కిలివేఁడి, ఉమ్మలికము=సంతాపము.

తాత్పర్యము

ఈవిధముగఁ బుత్రమోహముచేతను బుత్రుని పికిచిన దుఃఖముచేతను భూమిమీఁదఁబడి మిగులవేఁడి నిట్టూర్పులు విడుచుచు దుఃఖించుచుండ నారాత్రి గడచిపోయెను.

ఇది భరతుఁడు కేకయపురము విడిచిన యెనిమిదవనాఁటి చరిత్రము.

—• ౭౬-వ సర్గము. భరతుఁడు తండ్రి శవంబునుజూచి యేడ్చుట. •—

కం. వేకువ యగుడు వసిష్ఠుఁడు కైకయిసుతుఁ గాంచి పల్కు•గాఢ ప్రేమన్
శోకింపకు మన్నా నీ, వీకరణిన్ ఫలము గలదె•యేడ్చుచు నుండన్.

వేకువ=ఉదయము. [౧౯౦౧

తాత్పర్యము

భరతుఁడయోధ్యచేరిన మఱునాఁటి యుదయమున వసిష్ఠుఁడు భరతునిఁ జూచి యతిశయ ప్రేమతో నన్నా యేల యేడిచెదవు- ఏడువకుము- ఇట్లేడుచుచుండిన రాఁగల లాభమేమి?

మ. అవనీనాథతనూజ! నీజనకుసం•యానక్రియల్ దీర్పఁగాఁ
దవు నాకార్యము నిర్వహింపు మన నా•తండున్ ధృతిం బూని శా
స్త్రవిధిన్ దండ్రికి నౌర్ధ్వదైహికములం•జల్పంగఁ దా నెంచి భూ
ధపనిద్రాగతతుల్యకాయము సుపీ•తత్విట్చయోదాత్తమున్. ౧౯౦౨

సంయానక్రియల్=ప్రేతను స్వర్గమునకుఁ బంపెడికార్యములు, ధృతిన్=ధైర్యమును, ఔర్ధ్వదైహికములన్=ఊర్ధ్వదేహసంబంధము ఔర్ధ్వదైహికము- ప్రేతకార్యములు, భూధవ=రాజుయొక్క, నిద్రాగతతుల్య=నిద్రపోయినవానితో సమానమైన, కాయము=దేహము- నూనెకాగులోనుంచిన కారణముచే దేహము లవమైనఁ జెడలేదు. వికారము నొందలేదు. సుపీత =మిక్కిలి పచ్చని, త్విట్=కాంతుల, చయ=సమూహముచే, ఉదాత్తము=గొప్పది.

తాత్పర్యము

రాజకుమారా! నీవు నీ తండ్రికిఁ బరలోకక్రియలు దీర్పఁదగునుగదా. ఇఁక

సి కార్యములు చేయుమనిన భరతుండును ధైర్యముఁ దెచ్చుకొని యేడ్పుమాని శాస్త్రప్రకారము తండ్రికిఁ బరలోక క్రియలు చేయఁదలంచి నిద్రపోయినవాని వలెనుండు రాజుదేహమును దీర్ఘకాలము నూనెలో నుంచుటచేఁ బచ్చపాఱిన దానిని.

కం. నానారత్నపరిష్కృత, మౌనుజ్జ్వలహేమశయన • మం దిడి కైకే
యీనందనుఁ డతిదుఃఖితుఁ, డై నానాగతుల నేడ్చె • నారటపడుచున్.

నానారత్న పరిష్కృతము = అనేక రత్నములచే నలంకరింపఁబడినది యగు, ఉజ్జ్వలహేమశయనయు = ప్రకాశించుచున్న బంగారు పానుపునందు, ఇడి=ఉంచి.

తాత్పర్యము

అనేక రత్నములచే నలంకరింపఁబడిన బంగారు మయమైన శయనము మీఁదనుంచి భరతుఁడు మిగుల దుఃఖము గలవాఁడై యనేకవిధముల నారట పడుచు నేడ్చెను.

శా. రాజేంద్రా! యటు విప్రవాసి నగునే • రాకుండ మున్ ధర్మని
ష్ఠాజుష్టాత్ముఁడు రామచంద్రుని మహా • శౌర్యుండు సౌమిత్రినిన్
వ్యాజం బేమియొ పంపఁ గానలకు నీ • తాధీశనిన్ నన్ను నీ
యోజన్ బాసియు నెందుఁబోయితివొ య • య్యో తండ్రియెట్టేడ్చెదన్.

విప్రవాసిన్=పరదేశమందున్నవాఁడును, ధర్మనిష్ఠాత్ముని = ధర్మమందలి నిష్ఠచేఁగూడినవానిని, వ్యాజంబేమియొ=ఏమినెపమో, ఓజన్ = విధముగా నాకుఁ గదా యిచ్చితినంటివి- నేను గ్రహింతునో గ్రహింపనో నాయభిప్రాయము దెలిసికోవలసిన పనిలేదా. అట్లు నా యభిప్రాయము దెలిసికొనకముందే శ్రీరాముని నరణ్యమునకుఁ బంపవలసిన కారణ మేమికలిగెను. నేనువచ్చువఱకు నిదానింపరాదా.

తాత్పర్యము

రాజేంద్రా! పరదేశమందుండు నేను రాకముందే ధర్మనిష్ఠగల రామ చంద్రుని మహాశౌర్యముగల లక్ష్మణుని నడవులకుఁబంప నేమికారణము కలి గెను. అట్లు శ్రీరాముని నన్ను నొద్దలేకుండఁజేసికొని తండ్రీ! యెందుఁబోయి తివో. దేనికని నే నేడ్తును.

కం. నిరుపమనిర్మలచరితుఁడు ధరణీతనయావిభుండు • తలఁగి చనుటకున్
బరిపరివిధముల నేడ్వఁగఁ, బరికింపవు నన్ను నిచటి • వారి మహీశా. ౯౧౦౫

నిరుపమ=సరిలేని, నిర్మల=మలినములేని, చరితుఁడు = మంచి నడవడి గలవాఁడు.

తాత్పర్యము

శ్రీరాముని నొక్కని నడవికిఁ బంపితివిగాని దాని ఫలముగ నేను నిచ్చట నుండువారేవిధముగ నేడ్చుచున్నామో చూడవుగదా.

కం. రాముఁడు వనులకుఁ జన స్వ,ర్ధామమునకు నీవు పోవఁ•దగుగతి యోగ
క్షేమంబుల నిఁక నెవ్వరు, భూమీశ్వర కూర్చువారు•భూజనములకున్.

తా త్ప ర్య ము [౧౯౦౧

ప్రజల యోగక్షేమములు విచారింపనలసినవారు నీవు శ్రీరాముఁడు. మీ యిరువురిలో శ్రీరాముఁడడవులకుఁ బోయెను. నీవు స్వర్గమునకుఁ బోయితివి. ఇఁకఁ బ్రజల యోగక్షేమము లెవరు విచారింతురు.

కం. రాజ వగునీవు లేమిని, రాజిల్ల దనాథ మగుచు • రాష్ట్రంబు నిశా
రాజు రహింపని రాతిరి, యోజను రాణింప దీయ•యోధ్య మహాత్మా.

అనాథము = దిక్కులేనిది, నిశారాజు = చంద్రుఁడు, రహింపని = ప్రకాశింపని, ఓజను=విధమున.

తా త్ప ర్య ము

దేశమునకు రక్షకుఁడవైన నీవు మరణించుటచే రాష్ట్రము నాయకుఁడు లేనిదై చంద్రుఁడు ప్రకాశింపని రాత్రివలె నీ యయోధ్యాపురము ప్రకాశింపక యున్నది.

—• భరతుఁడు దశరథున కుత్తరక్రియలు సలుపుట •—

సీ. అని పలవింపఁగాఁ•గని భరతునితోడఁ, బలుకు వసిష్ఠుఁ డో•భవ్యచరిత
ప్రేతకార్యములు తం•డ్రికిఁ జల్పు పనిఁబూను,మీవిచారము మాను•మీవటన్న
నగుగాఁక యని యాతఁ•డాచార్యఋత్విక్పు, రోహితాదుల వేగ•రూఢి వెలయ
సమకట్టుఁ డన బహి•స్థ్సలి నున్ననృపునగ్ను;
లను యథావిధిఁ దెచ్చి•రనఘులైన

తే. యాజకులు ఋత్విజులు సంత•సవనిపాలు,
శవము శిబికను నిల్పి బా•ష్పంబులురల
మోయఁ బరిచారకులు చల్ల•మున్ను వెండి,పైఁడి,
చేలలుపటఇచుచు•బాటలందు. ౧౯౦౨

పలవింపఁగాన్=విలపింపఁగా, భవ్యచరిత్ర=శుభకరమైన నడవడికలవాఁడా, సమకట్టుఁడు=ప్రయత్నముచేయుఁడు, ఆచార్యులు=వసిష్ఠవామదేవాదులు,"ఉపనీయవదేద్వేద మాచార్యస్స ఉదాహృత" యని శాస్త్రము, ఋత్విక్కులు = యజ్ఞమున వరింపఁబడినవారు,పురోహితులు=రాజునకు నభివృద్ధికొఱకు శాంతిక పౌష్టికాది కార్యనుుల జరపువారు. "త్రయ్యాంచ ధర్మకృత్యేచ శాంతికర్మణి పౌష్టికే। అధ్వరేయాశ్చకుశలస్సస్యాద్రాజ పురోహిత" అని శాస్త్రము. రూఢి= నిశ్చయము, బహిస్థ్సలిన్=అగ్నిగృహమునకు వెలుపల- ఇంట శవముండుటచే

సపరిశుద్ధి కావున సగ్నిని బయట నుంచిరని భావము. నృపు అగ్నులన్=రాజు యొక్క గార్హపత్యాద్యగ్నులను, శిబికను=పల్లకియందు.

తాత్పర్యము

అని యేడ్చుచుండఁగా విని వసిష్ఠుఁడు భరతుతో నిట్లనియె శుభచరిత్రా నీవిట్లులేడ్చుచుండుట తగదు. తండ్రికిఁ బ్రేతకార్యములు జరుగవలసియున్నవి. వానిని జేయయత్నింపుము. అని చెప్పఁగా సరియని యంగీకరించి యాచార్యులను ఋత్విక్కులను పురోహితులను జరుగవలసిన కార్యములకై మీరు ప్రయత్నింపుఁడనిన వారు వెలుపలనున్న గార్హపత్యాద్యగ్నులను శాస్త్రప్రకారము దెచ్చిరి. అంత యాజకులు ఋత్విజులు రాజుపీనుఁగును పల్లకియందుంచిరి. పరిచారకులు కన్నీళ్ళు కాఱుచుండ మోసిరి. పీనుఁగునకు ముందు వెండి బంగారుపూలు చల్లుచు బాటలందు వస్త్రములు పఱచుచుఁ గొందఱుపోవ.

సీ. జనములు కొందఱుఁ♦చన మఱికొందఱు, చందనాగరువులు♦సరళపద్మ
కము గుగ్గిలంబు ధూ♦పము వేయుచునుబోవ, గంధాది బహువిధ♦కాష్ఠములను
బేర్చినచితిమీఁదఁ♦జేర్చి భూమీశుని, ఋత్విజుల్ మంత్రస♦మేతముగను
భరతునిచే నగ్నిఁ♦బ్రజ్వలింపఁగఁ జేసి, సామమంత్రంబులు♦చదువు చుండ

తే. నృపతికాంతలు పల్లకి♦లెక్కి వృద్ధ,
యుక్తముగఁ బురి వెడలి వా♦రున్న చోటి
కరిగిసవ్యాపసవ్యంబు♦గాఁగఁ జుట్టి, రధిపుఁ గౌసల్యలోనగు♦సజ్జముఖులు.

సరళపద్మకము = దేవదారు చెక్కలచేఁ జేసిన ధూపవస్తువులు, కాష్ఠములను = కట్టెలను, సవ్యాపసవ్యంబులు = ప్రదక్షిణముగను అప్రదక్షిణముగను, చుట్టి=తిరిగి, పల్లకీలు=పల్లంకికాశబ్ద భవము పల్లకీ- పల్లకి యని హ్రస్వాంతమును గలదు.

తాత్పర్యము

కొందఱు చందనము అగరు దేవదారు ధూపములు గుగ్గిలము ధూపము వేయుచుఁబోఁగా శ్రీగంధపుఁజెక్కలు మొదలయిన కట్టెలతోఁ బేర్చిన సొదమీఁద రాజు దేహముంచి ఋత్విజులు మంత్రములు చెప్పుచు భరతునిచే నగ్ని నంటునట్లుచేసి సామమంత్రంబులు చదువుచుండ రాజస్త్రీలు కౌసల్య మొదలగువారు పల్లకిలెక్కి పురమునువిడిచి భరతుఁడు మొదలగువారున్న చోటికిఁ బోయి శవమునకుఁ బ్రదక్షిణముగను నప్రదక్షిణముగాఁగను దిరిగిరి.

కం. మించినవగ వారలు దుఃఖించినఁ దద్రవము మాఁడఁ♦గీ డొక్కటిగా
గ్రౌంచీసహస్ర మాక్రో,శించినగతి నెగసెఁ గరుణ♦చేష్టాయుక్తిన్. ౧౬౧౦

క్రౌంచీసహస్రము=ఆఁడుక్రౌంచపక్షుల గుంపులు, అక్రోశించినన్=ఏడ్చిన, కరుణచేష్టాయుక్తిన్=శోకపుఁగార్యముతోఁ గూడినట్లు.

తాత్పర్యము

అతిశయించిన దుఃఖముచే వారందఱేడువఁగా నా ధ్వని కిడుకలిగినపుడు వేయియాఁడు క్రౌంచపక్షులొక్కసారిగా దుఃఖస్వరముతో నేడ్చినట్లుండెను.

ఉ. వారక యేడ్చుచున్ సతులు • పల్లకులన్ సరయూతటంబునన్
జేరి పురోధలున్ సచివ • శేఖరులున్ మఱి తారుఁ బుత్రుతో
నీరము వీడి యశ్రుయుత • నేత్రములం బురిఁ జేరి పండుచున్
ధారిణి ఘస్రముల్పది యథా•విధిఁ బుచ్చిరి సూతకంబుతోన్. ౧౬॥

సచివశేఖరులు=మంత్రి శ్రేష్ఠులు, అశ్రుయుత నేత్రమున్ = కన్నీళ్ళతోఁ గూడిన కన్నులతో, ధారిణిం బండుచున్=భూమిపైఁబండుకొనుచు, "క్రియల్లబ్ధాశ్శయనాః భూమావస్యపేయుస్తే, పృథక్'' అని యాశౌచములవారికి భూశయ్యావిధియుక్తము, సూదకంబుతోన్=మృతాశౌచంబుతో = చావంటుతో, పదిఘస్రముల్ = పది దినములు- "షోడశాహేన భూపాలా" యను శాస్త్రానుసారము క్షత్రియులకు నాశౌచము పదియాఱు దినములయియుండఁగా నిటఁ బదిదినములే యాశౌచమని చెప్పుట యెట్లు యుక్తము- సమాధానము— క్షత్రియస్తు దశాహేన స్వకర్మ నిరతశ్శుచిః అను శాస్త్రానుసారము యిచ్చటఁ బదిదినములే క్షత్రియుల కాశౌచము చెప్పఁబడియున్నది. ముందుచెప్పిన శాస్త్రము స్వకర్మ నిరతుఁడు కాని క్షత్రియునకని యూహింపవలయును.

ఇచ్చట స్త్రీలు ప్రదక్షిణ తర్పణములఁజేసినట్లు చెప్పుటయు బోధాయన సూత్రానుసారమని యెఱుంగునది- "ప్రదక్షిణ మపి బాంధవాః కుర్వంతి ఏవం మార్గేపిచితా మారోప్యచితాయా మే మేత్యేకే" యని బోధాయన సూత్రము.

ఈ ప్రకరణమున శవముతో నిప్పు తెచ్చినట్లును శవమును సొదపైఁబెట్టినట్లును సమంత్రకముగ నిప్పంటించినట్లును దానికిఁ బ్రదక్షిణించినట్లును బది దినము లాశౌచముతో నున్నట్లును జెప్పినది దేశకుల సూత్రభేదములచేఁ బ్రేత కార్యములు భిన్నములని తెలుపుటకైనను బ్రధానములు చెప్పినది యప్రధానములఁ దెలిసికొనుటకని యైనను నెఱుఁగునది.

ఆశౌచ దినములందు నేలపైఁ బండుకొనవలయునుగాని మంచములు పఱుపులు పనికిరావు.

తాత్పర్యము.

స్త్రీలు వారించువారులేక యేడ్చుచుఁ బల్లకులందుఁబోయి సరయూతీరంబునఁజేరి పురోహితులు మంత్రిశేఖరులు తాముఁ గొడుకుతోడ నీళ్ళువిడిచిన నీటితోడి కన్నులతో నూరుచేరి నేలపైఁబండుకొనుచుఁ బదిదినములు సూతకముతోఁ గడిపిరి.

౭౭-వ సర్గము.

సీ. పదునొకండవనాఁడ♦భరతుఁ డాశౌచంబు, దీర్చి పండ్రెండవ♦దినమునందు
శ్రాద్ధకర్మము లెల్ల♦జరపి బ్రాహ్మణులకు, నమితధనాన్నర♦త్నములు మేలి
చేలలు నిర్భర♦శ్వేతబాస్తికములు, గోవులు నూఱుల♦కొలఁది గాఁగ
దాసదాసీయాన♦ధామవితతు లెల్ల, దానంబు లిచ్చెను♦దండ్రిగుఱిచి

తే. మఱి త్రయోదశదినమున♦మహితనయుఁ,
డస్థిసంచయనార్థమై♦యరుగుదెంచి
రోదనధ్వను లెసఁగని♦రుద్ధబాష్ప,కంఠుఁడై చితిమూలంబుఁ♦గదిసి యేడ్చె.

ఆశౌచము=అంటు-మైల, తీర్చి = పుణ్యాహవాచన నవశ్రాద్ధాదులచేనని శేషము,శ్రాద్ధకర్మములెల్లన్=షోడశమాసికములు సపిండీకరణము మొదలైనవి- సపిండీకరణము సంవత్సరాంత కృత్యమైనను గాలవైపరీత్యమునుబట్టి ముందుగనే చేయుదురు. గరుడ పురాణమున :—

ద్వాదశాహే త్రిపక్షేవా। షణ్మాసే వత్స రే పివా
సపిండీ కరణం ప్రోక్తం మునిభి స్తత్త్వదర్శిభిః॥
మయాతుప్రోక్ష్యతే తాత్త్వ శాస్త్ర ధర్మాను సారతః
చతుర్ణా మేవ వర్ణానాం ద్వాదశాహే సపిండనమ్ ॥
అనంత్వాత్కలి ధర్మాణాం పుంసాంశ్చైవాయుషః క్షయాత్
అస్థిరత్వా చ్ఛరీరస్య, ద్వాదశాహేప్రశస్యతే ॥ ౧౩ ౮-౨౯-౩౦

పండ్రెండవ దినమందుగాని మూఁడవపక్షమందుఁగాని ఆఱవనెలయందుఁ గాని సంవత్సరాంతమునఁగాని సపిండీకరణము చేయవచ్చునని తత్త్వమెఱిఁ గిన మునులుచెప్పిరి కాని కలిధర్మము లనంతములగుటను,పురుషుల యాయువు క్షీణించుటచేతను శరీర మస్థిరమగుటను బండ్రెండవదినమందే సపిండీకరణము నాలుగు వర్ణములవారు చేయఁదగునని శాస్త్రీయమైన నా యభిప్రాయము అని కలదు.

చేలలు=వస్త్రములు, నిర్భర=అనేకములగు, ఉద్గాఢ నిర్భరః తీవ్రై కాంత నితాంతాని గాఢబాఢ దృఢానిచ- అమరుఁడు, శ్వేతబాస్తికములు = తెల్లమేకల మందలను, త్రయోదశదినమునన్=పదమూఁడవ దినమునందు, అస్థిసంచయ నార్థమై=ఎముకల నేఱుటకై, అరుగుదెంచి = తండ్రిని దహించినచోటికి వచ్చి, కదిసి=సమీపించి- అస్థిసంచయనము పదుమూఁడవదినమునఁ జేయునట్లు బోధా యన సూత్రము గలదు. "ద్వితీయేహ్నియుగ్మదివసేషు అర్థమాసాన్మాసాన్ ఋతూన్ సంవత్సరం వా సంచయనం కుర్యా" త్తని యాసూత్రము:- దాసీ దాసయని యుండవలసియుండినను త్వద్దాసదాసీగణా ఇత్యాది మహాకవి ప్రయోగములు కలవు.

తా త్ప ర్య ము

పదునొకండవ దినమందే భరతుఁడాశౌచము ముగించి పండ్రెండవ దినమందుఁ బుణ్యాహవాచనాది కర్మములన్నియు జరిపి విస్తారముగ ధనము- అన్నము- రత్నములు- వెలగల వస్త్రములు- తెల్లమేకఁల మందలు నూర్లకొలఁది గోవులు- దాసులను- దాసికలను- వాహనములను- ఇండ్లను ఈ మొదలయినవానిని దండ్రి నుద్దేశించి బ్రాహ్మణులకు దానమిచ్చెను. అవలఁ బదుమూఁడవదినమునందు రాజకుమారుఁ డస్థిసంచయనము కొఱకై తండ్రినిఁ గాల్చినచోటికి వచ్చి కన్నీటిచే నడ్డగింపఁబడిన కంఠముగలవాఁడై సౌధ దగ్గఱ చేరి యేడ్చెను.

కం. న న్నప్పగించితివి మా,యన్న యయినరామచంద్రు•హ స్తమునకు నా
సన్నుతుఁడు కాన కరుగుట, నన్ను నిరాశ్రయుఁడుగా నొ•నర్చితె తండ్రీ.

నిరాశ్రయుఁడు=దిక్కులేనివాఁడు, సన్నుతుఁడు=సత్పురుషులచేఁ గొనియాడఁబడినవాఁడు.

తా త్ప ర్య ము

తండ్రీ! నన్ను మాయన్న శ్రీరామచంద్రునకు నప్పగించితివి- ఆయన యడవికిఁబోవుటచే నన్ను దిక్కులేనివానిఁగాఁ జేసితివికదా రెండును నీవు చేసినవే,

కం. కొడుకొక్కఁడ వానిని గా,ఱడవులఁ ద్రోయుటను ననద•యై యేడ్చెడు నీ
పడతిఁని గౌసల్యను నిటు, విడి యెచటికి నేగి తయ్య•ప్రియహితచరితా.

ప్రియహితచరితా=ప్రియము హితమునైన నడవడిగలవాఁడా, అనద=దిక్కులేనిది- అనాథశబ్దభవము.

తా త్ప ర్య ము

నీ పట్టపుదేవియగు నీ కౌసల్యకు నొకఁడే కొడుకు- వానిని నీవు కాఱడవులకుఁ బంపితివి- ఆమె దిక్కులేక యేడ్చుచున్నది. అట్టి యామెను వదలి నీ వెచ్చటికిఁ బోయితివి.

కం. అని కాలుట నెట్టన యై, వెనుబూదిని నిండియున్న•పిత్రస్థితలం
బును గని జనకునిఁ దలఁచుచు,
బనవి పనవి యేడ్చి నేలఁ•బడియెన్ మూర్ఛన్. ౧౯౧॥

తా త్ప ర్య ము

ఈప్రకారముగాఁ గాలిన కారణమున నెట్టనయై విస్తారపు బూదితోనిండి యున్న తండ్రి యెముకలుండు స్థలంబుజూచి తండ్రినిఁదలఁచి వెక్కివెక్కి యేడ్చి మూర్ఛపోయి నేలఁబడెను.

ఆ. ప్రక్కనున్నవారు•పట్టి యెత్తియుఁ గట్టు,
సడలు వజ్రిధ్వజము•సరణిఁబడియె
నాకపతితుఁ డగుయ•యాతిని డాసెడి,ఋషులభంగిసచివు•లెల్లఁగదియ.

ఇట్లు పడినవానిని ప్రక్కనున్నవారు పట్టియెత్తఁగాని యవశుఁడైన కారణమునఁ గట్టిన కట్టు వదలిపోఁగాఁబడెడి యింద్రధ్వజమువలెఁబడెను. అప్పుడు స్వర్గమునుండి పటిన యయాతిని ఋషులవలె మంత్రులందఱు సమీపించిరి.

సీ. భరతుండు నేలపైఁ బడిన శత్రుఘ్నుండు, జనకుగుణాంగంబు లను స్మరించి
సంతాపభరమున సంజ్ఞావిహీనుఁడై, యున్మత్తుపోలికి నుండి వెండి
తలపోసి తలపోసి తండ్రిగుణంబుల, నిట్లని విలపించె నెద గలంగ
మంథరాప్రభవ మమంథరకైకయీ, గ్రాహసంకులము వరప్రదాన
తే. మయగురుక్షోభమైన యీ మహితశోక,
సాగరంబున మముముంచి చనితె తండ్రి
బాలు సుకుమారు సంతత లాలితాత్ము, భరతు విడనాడ నీకెట్లు వచ్చె మనసు.

గుణాంగంబులను=గుణములను అవయవములను, సంజ్ఞావిహీనుఁడై = తెలివితప్పినవాఁడై, ఉన్మత్తుపోలికన్=పిచ్చివానివలె, మంథరాప్రభవము=మంథరవలనఁ బుట్టినది, అమంథర = అధికమైన, కైకయీగ్రాహ = కైకయనెడి మొసలిచే, సంకులము=కలఁతనొందినది, వరప్రదానమయగురుక్షోభము=వరమిచ్చుటయనెడి గొప్ప కలఁతగలది, సాగరము=సముద్రము, సంతతలాలితాత్మన్=సంతోషపెట్టఁబడిన మనస్సుగలవానిని.

తాత్పర్యము.

భరతుఁడు ధైర్యముతో నిబ్బరించుకొని యున్నంతవఱకుఁ దానును ధైర్యముతోనుండిన శత్రుఘ్నుఁడు భరతుఁడు పడిపోఁగానే యీయనగతి యేమగునో యని భయపడి యప్పుడప్పుడు తమకుఁగావలసినవి తానై యిచ్చి సంతోషపఱుచు తండ్రి గుణములను దలఁచి దుఃఖాతిశయమునఁ దెలివితప్పి పిచ్చివానివలె నుండి స్మృతి తెచ్చుకొని మఱిమఱి తండ్రిగుణములను నాలోచించి యాలోచించి హృదయము కలఁతనొందఁగా నిట్లని యేడ్చెను. మంథరవలనఁబుట్టి కైకేయియనెడి పెద్దమొసలితోఁ గూడి వరదానమనెడి కలఁతగల యీగొప్ప దుఃఖసముద్రమునందు మమ్ము దండ్రీ ముంచిపోయితివా ? బాలుఁడు సుకుమారుఁడు ఎప్పుడు నీచే సంతోషపెట్టఁబడిన మనస్సుగలవాఁడు నగు భరతుని విడనాడిపోవ నీకెట్లు సమ్మతమాయెను.

సీ. ఎవ్వరో మ మ్మింక నేవి కోరిన నిచ్చి, బుజ్జగించెడివారు పుణ్యశీల
మాకోరుభోజ్యముల్ మాకోరుపానంబు, లింకఁ గొమ్మని యొవ్వఁ డిచ్చుఁ దండ్రి
మంచిచేలంబులు మంచిభూషణములు, పిలిచి మాకీయంగఁ దలఁచు నెవఁడు
తగినబుద్ధులు సెప్పి తగవులు బోధించి, మమ్ము నెవ్వఁడు దిద్దు మహితచరిత
ఆ. తొడను జేర్చి మమ్ముఁ బుడికి ముద్దాడుచు, గారవించు నింకఁ గరుణ నెవఁడు
నిన్ను విడిచి చెడక నిలిచిన ధారిణి, ప్రళయవేళ నైన భంగపడదు. ౧౯౧౮

తాత్పర్యము

పుణ్యస్వభావా! మేము కోరినవి మాకిచ్చి మమ్ము నిఁక నెవరు లాలింతురు? మేము కోరిన భోజ్యములు పానములు మాకు నిఁక నెవరిత్తురు? మంచి వస్త్రములు మంచి సొమ్ములు మమ్ము రమ్మనిపిలిచి యిచ్చువారెవరు? ఆయా సమయములందుఁ దగిన బుద్ధులు చెప్పి న్యాయము బోధించి మమ్ముఁజక్క జేయువాఁ డెవఁడు? మమ్ముఁ దొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని దేహమునిమిరి ముద్దుపెట్టుకొనుచు నెవఁడు దయతో నాదరించును. నీవు పోయినను దాను జెడి పోక నిలిచిన భూమి ప్రళయకాలమందైనను జెడదు.

కం. ఇది కావలయునె పుత్రక, యిది కావలయునె యటంచు•నీరీతి మమున్
  ముదమున బలవంతం బుగ, నెది గోరిన నిచ్చువార•లెవరో యింకన్.

తాత్పర్యము. [౧౯౧౯

కుమారా! నీకిదికావలయునా? నాయనా నీకిది కావలయునా యని బలవంతముగ మమ్మడిగి యడిగి బలవంతపెట్టి యేదికోరినను మాకింక నెవరిత్తురు.

చం. జనకుఁడు స్వర్గ మేగెనఁట•సత్యచరిత్రుఁడు రామచంద్రుఁడున్
  వనములదారిఁ బట్టె నఁట • వచ్చునె నిల్పఁగ మేనఁ బ్రాణముల్
  వనముల నైనఁ జొచ్చెదను•వహ్నుల నైనఁ జొరంగఁబాఱెదన్
  గని కని యాయయోధ్యఁ జొరఁ•గా మది గొల్పదు వారు లేమినిన్.

తాత్పర్యము [౧౯-౨౦

తండ్రియా స్వర్గమేగెను సత్యచరిత్రుఁడు శ్రీరాముఁడా యడవులకుఁ బోయెను. ఇఁక దేహమునఁ బ్రాణములు నిల్పశక్యమా కాదు కావున నేనును నడవులకైనఁ బోయెదను. అగ్నిలోనైన దూఁకెదను అంతియకాని చూచి చూచి వారు లేకుండుటచే నయోధ్యలోఁ బ్రవేశించుటకే మనస్సురాకున్నది.

సీ. అనుచు సోదరు లిటు•లడలుచు ధరణిపైఁ, గొమ్ములు విఱిగిన•కోడె లనఁగఁ
  బడినఁ దోవచ్చిన•వారును విలపింపఁ, జేరి వేదాంతి వ•శిష్ఠమౌని
  భరతునిఁ గనుఁగొని•జరిగెడిఁ బదియుమూఁ,
  డవనాఁడు వృథ కాల•యావనంబు
  చనునె శేషాస్థిసం•చయనంబు సాంతంబు, గావలదే యది•గాక మఱియు
తే. నాఁకలియు దప్పిశోకమో•హములు జరయు
  మరణ మనియెడి నిరుమూఁటి•మర్త్యుఁ డెవఁడు
  పరిహరింపఁగ శక్తుఁడు? • భరత! తగునె
  యపరిహార్యంబునకు శోక? • మనుచు నుండ. ౧౯-౨౧

సోదరులు=అన్నదమ్ములు, భరతశత్రుఘ్నులు, కోడెలు=ముదిరిన పోతు దూడలు, వేదాంతి = వేదాంతమెఱిఁగినవాఁడు, జ్ఞాని, శేషాస్థిసంచయనంబు = మిగిలిన యెముకలఁ బ్రోగుచేయుట. ఇది పూర్వమే ముగిసినది కావున దేశా

చార ప్రకారము స్థలశోధనము, కాలయాపనంబు=కాలము గడపుట, సాంతంబు=అంతముతో, గూడినది = ముగిసినది, జర = ముసలితనము, ఇరుమూఁటిన్ = ఆఱిటిని, పరిహరింపఁగన్=త్రోసివేయఁగ, శక్తుఁడు = శక్తిగలవాఁడు, అపరిహార్యంబునకున్=పరిహరింపరానిదానికి, "అపరిహార్యేర్థే నత్వంశోచితు మర్హసి" యను గీతావాక్యమనుసంధించునది.

తాత్పర్యము.

ఈప్రకారము చెప్పుచు భరతశత్రుఘ్ను లిరువురు దుఃఖపడుచుఁ గొమ్ములు విఱిగిన కోడెలో యనునట్లు నేలమీఁదఁ బడఁగాఁ గూడవచ్చినవారును నేడుచుచుండఁగా జ్ఞానియగు వసిష్ఠమౌని భరతునితో నిట్లనియె. భరతా పదుమూఁడవ నాఁడు జరుగుచున్నది. వ్యర్థముగఁ గాలము గడపుట తగునా మిగిలిన యెముకల సంచయనము పూర్తికావలదా. నీ విట్టులుండిన నది యెట్టులగును. అంతేగాక ఆఁకలి, దప్పి, శోకము, మోహము, జరామరణము లనియెడి ద్వంద్వములను నెవఁడు ద్రోసివేయఁగలఁడు. త్రోసివేయ సాధ్యముగాదేని యట్టిదానికై దుఃఖింపవలయునా? దుఃఖింపక యేమిచేయుమనెదవు అనిన సహించుకొనుము.

ఆగమాపాయినో నిత్యా, స్తాన్ తితిక్ష స్వ భారత. భ. గీ. ౨. అ.

కం. అంత సుమంత్రుఁడు తదనుజు, చెంతకుఁ జని లేవ నెత్తి • చెప్పె నతనికిన్
జింతాహరమగుభూతభ,వాంతయథావృత్తమెల్ల • సంతతఁ గొమరుల్.

తాత్పర్యము [౧౯-౨౨]

అంత సుమంత్రుఁడు శత్రుఘ్నునొద్దకుఁబోయి లేవనెత్తి యాయనకు దుఃఖమును బోఁగొట్టు భూతముల పుట్టువిధము చచ్చువిధము నంతయుఁ జెప్పెను. అంతట నా రాజకుమారులు.

దీనివలన నివాపాదులు పూర్తికాఁగానే కర్తల శ్రేయస్సుకోరినవారు శోకోప శాంతివాక్యములుచెప్పి కర్తల నూరార్పవలయునని యేర్పడుచున్నది.

ఉపశాంతివాక్యము లీవిధముగఁ జెప్పవలయునని స్మృతులు చెప్పుచున్నవి. పంచ భూతములవలన నేర్పడిన యీశరీరములు జీవుని ప్రారబ్ధానుభవమునకై భగవత్సంకల్పమున కలుగుచుండును. ఆ ప్రారబ్ధానుభవము ముగియఁగానే యచట నవి పనికిరావు గావున నవిమరలఁ బంచభూతములలోఁ గలిసిపోవును. మరల నేప్రారబ్ధము జీవుఁడనుభవింపవలసి యున్నదో దానికిఁ దగినశరీరము జీవునకు వచ్చుచుండును. ఇవి కర్మవశమున వచ్చునవి కావున రావలదనిన రాక యుండవు. పోవలసినవేళవచ్చినఁ బోకయుండవు. ఇట్లనివార్యమైన రాకపోకలు గల యీదేహమునకై యేడువనేల? మనశరీరములే యిట్టివై యుండ మనవలెనే వారివారి కర్మము లనుభవింప దేహములతోఁ బుట్టిన జీవుల దేహములకై యేడువనేల? పోయిన జన్మంబులందు మన మెవరితో నెట్టి సంబంధము గలవారమై యుంటిమో వారట్టివారై యీజన్మమున దాపరింతురు. ఏ చుట్టమైనను,

ఏ బిడ్డయైనను వాని వాని ఋణము తీర్చుకొనిపోవుటకు వచ్చునేకాని మనల నుద్ధరించుటకు వచ్చువారులేరు.

వాయువశమున నాకాశమున మేఘములవలె నీటివేగమున నేటియందుఁ గట్టెలవలె దేహులు కర్మవశమునఁ గలియుచుందురు, వీడిపోవుచుందురు. దేహములా నీటి బుగ్గలవలెఁ గారు మెఱుఁగులవలె క్షణభంగురములు, క్రిందియాఁకు నేఁడురాలిన పైయాకు రేపురాలును. నేఁడు వీఁడుపోయిన రేపు మనము పోదుము. బంధుస్నేహము చలిపందిటిలోని పాంథస్నేహమువంటిది యని యీలాగు చెప్పవలెను.

ఉ. వానకు నెండకున్ సుడియు•వాసవుటెక్కెము లట్లు లొప్పుచున్
  మానక కాఱుబాష్పముల • మార్జితులైనను వారి మంత్రులన్
  దీనతఁ దక్కుకర్జములఁ • దీర్పుఁ డటంచును వేగిరించి య
  న్యూనముగా సమస్తము క్రి•యోత్కరమున్ ముగియింప నందఱున్.

సుడియు=చెడునట్టి, మార్జితులైనను=తడిసినవారుకాఁగా, కర్జము=కార్యము, అన్యూనముగాన్=కొఱఁతలేకుండ, క్రియోత్కరమున్ = కార్యసమూహమును.

తాత్పర్యము

ఎండకెండి వానకుఁదడిసి చెడిపోవు నింద్రధ్వజమువలె నా రాజకుమారులు శోకాగ్నిఁ దపించి కన్నీటి జడవానచే నాని కాంతిపాసియుండఁగా వారి మంత్రులను దుఃఖముచేఁ దక్కుకార్యములు ముగింపుఁడని త్వరించి కొఱఁత లేకుండఁ జేయవలసిన కార్యములన్నియుఁ జేసి ముగింపఁగా నందఱును.

—•౭౮-వ సర్గము. శత్రుఘ్నుఁడు భరతు నూరార్చి మంథరను దన్నుట.•—

కం. ఇండులకుఁ బోవ శత్రు,ఘ్నుం డట రఘురాముఁ జూచు•కోరిక నపుడే
  దండకకుఁ బోవుతలఁ పెద,నిండిన భరతునకు ననియె•నిర్వేదమునన్. [౧-౨

తాత్పర్యము

వారివారి గృహములకుఁ బోఁగా రఘురాముఁ జూడవలయునను కోరికతో నపుడే దండకకుఁబోవు తలంపుగల భరతునితో శత్రుఘ్నుఁడు విచారపడుచు నిట్లనియె.

కం. గతిచెడి వగచెడి భూత,ప్రతతుల కన్నింటి కెపుడు•ప్రభు వెవ్వఁ డగున్
  గతి యాతండే నీకును, గతి యంచును జెప్పవలెనె•కలుషవిహీనా. ౧-౨౩

తాత్పర్యము

దిక్కులేక దుఃఖించు భూతసమూహములకన్నింటికి సర్వకాలముల నెవ్వఁడు ప్రభువో వాఁడే నీకును దిక్కని పాపములేనివాఁడా నేను జెప్పవలయునా.

పాపాత్ములుగా నుండువారికిఁగూడ నతఁడే శ్రీరాముఁడే దిక్కయి రక్షించుచుండ నేపాపమెఱుఁగని నీకు రక్షకుఁడనిచెప్పఁ బనిలేదనిభావము. మనకు అనక నీకు అనుటకు భరతుఁడు భగవత్పరతంత్రుఁడు,శత్రుఘ్నుఁడు భాగవత పరతం

త్రుఁడు. కావున శత్రుఘ్నునకు భరతుఁడే ముఖ్యుఁడు. నీమూలమున నాకు, అని యర్థము.

సీ. మన కన నేల సమ • స్తభూతాళికిఁ, బట్టుగొ మ్మగు రామ • భద్రుఁ డధిక
సత్త్వవంతుం డయ్యుఁ • జాలనిపోలికి, నాఁడుది పొమ్మని • నంత వనికిఁ
బోయె నౌరౌర ప్ర • భూతపరాక్రమ,వంతుఁ డాలక్ష్మణు • నంతవాఁడు
జనకు నటుండు మం • చనక రాముఁడు వని,
కరుగఁ దా నెట్లొకో • యనుమతించె
తే. నాఁడు దాడించు నట్లెల్ల • నాడి తప్పుత్రోవలను బోవువానిని • దొలుతఁ దాన
నీత్య నీతుల నారసి • నిగ్రహింపఁ దగదె? జనకుం డటంచును • దలఁపఁ దగునె?

తాత్పర్యము [౧౬-౨౬

అన్న నీకు రక్షకుఁడని ప్రేలుమడఁచి లెక్కించి చెప్పనేల- సమస్త భూతములకు నాశ్రయమగు శ్రీరామభద్రుఁడు మహా బలవంతుఁడయ్యును నసమర్థుని వలె నొకయాఁడుది పొమ్మనినంత మాత్రముననే యంబేదవలెఁ దలవంచుకొని పోయెను. ఏమి యాశ్చర్యము- శ్రీరాముఁడు తండ్రికిఁ బరతంత్రుఁడు కావున నాయన చెప్పినట్లు వినవలయునని తలంచెనుబో శ్రీరామునకుఁ బరతంత్రుఁడైన లక్ష్మణుఁడు విస్తారబలము కలవాఁడు. అంతవాఁడు తండ్రిని ఛీ యటుండు నీ పెత్తనమేమి నా స్వామిని నీవా యడవికిఁ బంపువాఁడవని ధిక్కరింపక శ్రీరామునివెంటఁ దానుగూడఁ బోవుటకెట్లుసమ్మతించె-ఇది యంతకంటె ఆశ్చర్యము. ఆఁడుది యెట్టులాడించిన నట్లెల్లనాడి తప్పు త్రోవలఁ బోవువానిని నీతియిది దుర్నీతి యిదియని నివారించి మొట్టమొదటనే నిగ్రహింపఁదగునుగదా. అది విడిచి తండ్రియని మర్యాద యెంచఁదగునా- నీతి తప్పి చరించువాఁడా తండ్రి.

సమయత్యాగినో లుబ్ధాన్ గురూనపిచ కేశవ
నిహంతి సమరే పాపాన్, క్షత్రియస్సహిధర్మవిత్. శాంతి. ౩౩-౧౬

భీష్మార్జునాదులిట్లు చేసినవారే, విభీషణ ప్రహ్లాదులు పరోక్ష కారణములు.

మ. అని శత్రుఘ్నుఁడు పల్కఁ దూర్పునఁ బ్రతీ • హారంబునన్ మేనఁ జం
దనముం బూసి సుమాళిఁ దాల్చి నృపవ • స్త్రంబుల్ మణీహేమమం
డనముల్ మేఖల మధ్యమం దమరఁ ద్రా • టం గట్టఁబడ్డట్టిక్రోఁ
తినబోలెం జనుదేర మంథరయు న • ర్థిన్ దానిఁ దద్వార్థపతుల్. ౧౬-౨౭

తాత్పర్యము

శత్రుఘ్నుఁడిట్లు చెప్పుచుండఁగా దూర్పువాకిటఁ దనయుపాయము సఫలమాయెను. ఇఁక భరతుఁడు రాజగును- కైక రాజమాతయగును. ఆమెకు ముఖ్యురాల నేనగుదును. ఈ వీరందఱు నాచేతిక్రింది వారే- నేనెట్లుచెప్పిన నట్లునడువవలసినవారే. ఇంతకార్యముచేసినది నేనని నాప్రతిష్ఠ యందఱకుఁ దెలియవల

యునుగదా. అందఱవలెఁగాక నేను విశేషముగ సొగసు చేసికొనిపోయిన నెవరిది యని భరతుఁడడుగును. ఇదియే నీకు రాజ్యము వచ్చునట్లుచేసిన బుద్ధిమంతు రాలు మంథరయను దాసి యని యచ్చటివారు చెప్పుదురు. అప్పుడు భరతుఁడు నన్ను బహూకరించును. భరతుఁడు బహూకరించిన శత్రుఘ్నుఁడు బహూకరిం చును. వారిద్దఱు గౌరవించిన నన్నందఱు గౌరవింతురని యాలోచించి మంథర దేహమునిండ మంచిగంధముపూసికొని పూలు సిగయందు ముడిచి కైక తన కిచ్చిన రాజు ధరించు చొక్కాయంగవస్త్రములోనైనవియును రత్నములు బంగారుతోఁ జేయఁబడిన యాభరణములు నడుమున నొడ్డాణము ధరించి నడుమునకుఁ ద్రాడుకట్టిన క్రోఁతివలె భరతునకు నెప్పుడు పట్టాభిషేకముచేయ నాలోచించుచున్నారో విందమని కులుకుచుఁ గులుకుచు నెంతో కోరికతో రాఁగా దానిని ద్వారమందుండువారు.

ఉ. పట్టి దయావిహీనఁ గడ ♦ పార్థివనందనుమ్రోల నిల్పి యీ
కట్టిఁడిచేతఁ బుట్టెఁ జుమి ♦ కష్టము లన్ని యరణ్యదేశమున్
మెట్టుట రామచంద్రుఁ, డవ♦నీపతి స్వర్గముఁ బోక, యిచ్చ నీ
కెట్టులొ యట్లు సేయు మన ♦ నెంతయు మండి సుమిత్రపట్టియున్. ౧౯-౨౦

తాత్పర్యము

దయలేనిదానిని బట్టుకొనిపోయి కడపటి రాజకుమారుఁడైన శత్రుఘ్నుని ముందట నిలిపి యయ్యా యీ దుష్టురాలిచేతఁ జుమీ యీ కష్టములన్నియు నిందఱకుఁ బ్రాప్తించెను, శ్రీరాముఁడరణ్యమునకుఁ బోవుట, రాజు స్వర్గము నకుఁబోవుట దీనివలననే, దీని నీయిష్టమేమి చేయఁదలఁచితివో చేయుమనిన శత్రుఘ్నుఁడు కోపంబున-

శత్రుఘ్నుఁడింతవఱకు దానిపేరు వినెనేకాని మంథరను జూచినవాఁడుకాఁడు.

ఉ. అంతకు మూల మాచెడుగ ♦ యన్నుడి వీనుల సోఁకినంత నే
కాంతము సంతపించి యటఁ♦గల్గినవారల నెల్లఁ గాంచి భూ
కాంతుని మత్సహోదరులఁ♦గాఱియ పెట్టిన యానృశంస దు
శ్చింతన నిప్పుడే కుడువఁ♦జేసెదఁ జూడుఁడు తత్ఫలం బనన్. ౧౯-౨౧

తాత్పర్యము

అన్నికష్టములకు మొదటికారణ మీదుష్టురాలే యనుమాట చెవులలోఁబడి నంతనే యా దాసియా యింతయనర్థము కలిగించినదని మిక్కిలి సంతాపపడి యందున్న వారినందఱఁజూచి రాజును నాయన్నలను బాధపెట్టిన యీ క్రూరు రాలిని దురాలోచనపరను దాని యాలోచన ఫలము నిప్పుడే యనుభవింపఁ జేసెదను- చూడుఁడు అని చెప్పఁగా.

కం. వారు సఖీజనవృత యగు, క్రూరచరిత్రకను నల్ల • కుబ్జ నొగి బలా
త్కారమునఁ బట్టనది తద,గారము మార్మోయ నేడ్వఁ • గని నృపసుతుఁడున్ [౧౬౩౦

తాత్పర్యము.

దానియనుగ్రహము సంపాదించుకొనుటకై దానితోడ వచ్చిన చెలికత్తెలవేఁ జుట్టఁబడియుండు క్రూరపు నడవడిగల యామంథరను నచ్చటివారది తప్పించుకొనిపోవ యత్నించుచుండఁగా విడువక బలవంతముగాఁ బట్టుకొనఁగా నాగయ్యాళిముండ యిల్లు ప్రతిధ్వని యిచ్చునట్టులేడ్చెను. అది వగలమారి ముండ యని తెలిసికొని.

చం. కినుకను బట్టి నేలఁ బడి • కీ క్కనఁ దాఁచిన నద్దురాత్మ హో
యనుచును నేడ్చుచుండ సర • యంబుగ నీడ్చెను నేల దానినిన్
గని యట నున్న దాసులును • గాఢతరాగ్రహయుక్తుఁ డైనయా
తనిఁ గని మూల కొక్కతెగ • దాఁగఁగ బోవుచుఁ గంపితాంగులై. ౧౬౩౧

తాత్పర్యము

కోపముతోఁబట్టుకొని తన్నినతన్నున కది కీక్కని నేలఁబడి యఱవఁగా నాపాపాత్మురాలు హోయనియేడ్చుచుండ శీఘ్రముగ నేలఁబడఁదన్ని, భూమి మీఁదఁబడి పొరలునట్టు లెగసి యెగసితన్నఁగా నచ్చటనున్న దాసికలు మిగులఁ గోపించియున్న యాయనను జూచి యొకతె పోయినమూలకు మఱియొకతె పోక దాఁగఁబోవుచు దేహము గడగడవడఁకుచుండ.

ఉ. ఒండొరుఁ జూచి యందఱు స • ముగ్రత నీతనిఁబాట చూడఁగాఁ
జెండెడి మూలముట్టుగను • జెచ్చెర నిండఱఁ, గోసలాత్మజన్
నిండుమతిన్ దయారతను • నిర్మలధర్మచరిత్రఁ గావు మీ
గండ మటంచు వేఁడఁ దగుఁ • గా యని పాఱిరి యామె యొద్దకున్. ౧౬౩౨

తాత్పర్యము

ఒకరినొకరుచూచి యందఱును నీయన కోపము విధముచూచిన నీదాసికలందఱు నిటువంటివారే- వీరు తేరకుతిని కూర్చుండి యిట్టికార్యములా చేయుచున్నారని యందఱను మొదలంట నిప్పుడే యాలస్యములేక నఱికివైచును- కావున మనమందఱము దయాస్వభావముగలది నిర్మలమైన ధర్మశీలయునగు కౌసల్యయొద్దకుఁబోయి నిండుమనస్సుతో మా యీ గండమునుండి రక్షింపుమని ప్రార్థించుట యుక్తము- మఱియెవరు మనల రక్షింపఁజాలరని యామె యొద్దకుఁ బరువెత్తిరి.

చం. మనుజవరేణ్యనందనుఁడు • మంథర మొత్తొ యనంగ భూమిమీఁ
దను బడఁ దాఁచి యీడ్చుడును • దానిధరించినసొమ్ములున్ నివే
శనమును శారదాంబరము • చా ద్వెనరించెను, గూన్మదాసికిన్
గనుకనిఁ గైక యడ్డ మరు • గన్ వెస నాపెను దిట్టఁ గ్రుద్ధుఁడై. ౧౬౩౩

తాత్పర్యము

శత్రుఘ్నుఁడు మంథర మొఱ్ఱోయనుచుండ భూమిమీఁదఁబడఁదన్ని బఱబఱ యీడ్వఁగా నది ధరించిన సొమ్ములు చెదరపడి యాయింటిని శరత్కాలమందలి యాకాశమువలెఁ గనఁబడఁజేసెను. తన ప్రేమకుఁ బాత్రురాలైన దాసికి వచ్చిన దురవస్థఁజూచి దానిని రక్షించుటకై కైక యడ్డముపోఁగా నామెను గోపించినవాఁడై తిట్టెను.

ఉ. తిట్టియు దారుణోక్తులను ♦ దిమ్ముచెడన్ వడిఁ దన్నఁబోయినన్
దొట్టినభీతిఁ గైకయు సు♦తున్ శరణంబుఁ జొరంగ నాతఁడుం
బిట్టలుక న్వహించినసు♦మిత్రసుతుం గని సైఁప వయ్య యీ
కట్టిఁడి; నెల్లప్రాణులను♦గాంత లవధ్యలు గారె తమ్ముఁడా. ౧౯౩౪

తాత్పర్యము

భయంకరములైన తీక్ష్ణవాక్యములఁదిట్టియు నంతతోఁబోక యామె తల దిమ్మవదలునట్లు తన్నఁబోఁగా మంథరదశ తనకును బట్టునని భయపడినదై భరతుని చాటునకుఁబోయి భరతా భరతా కాపాడుమని శరణుచొచ్చెను. ఆయనయు శరణాగత రక్షాధర్మపరుఁడు కావున మిగులఁగోపమున మండిపడుచున్న శత్రుఘ్నునిఁ జూచి యీ దుష్టురాలిని సహింపుము- చంపకుము- తమ్ముఁడా ప్రాణముగల యన్నిజాతులలోను స్త్రీలు చంపఁదగనివారుగదా.

చం. అనఘుఁడు మాతృఘాతకుఁడ♦నంచును రాముఁడు నామొగంబునుం
గనుగొనఁ డన్న భీతి యెదఁ♦గల్గదయేనియు నీదురాత్మఁ గై
కను బలి వెట్టనే యిలకుఁ♦గాతరఁ గుబ్జను జంప నల్కయె
త్తున నతఁ డేల పల్కు మన♦తో మొగమిచ్చి ధ్రువంబు చూడుమా.

తాత్పర్యము [౧౯౩౫

తమ్ముఁడా! దీని దుష్టచేష్టలను విని యిన్నిదినములు సైఁచితివి. నీవెంతో నాకంటె శాంతచిత్తుఁడవే- ఏలన- పాపరహితుఁడైన శ్రీరాముఁడు నేను దీనిని జంపినచో వీఁడు తల్లిని జంపినవాఁడు వీనిముఖముఁజూడరాదని నాముఖముఁ జూడఁడేమోయను భయము నాహృదయమున లేకుండెనేని నేనెప్పుడో దీనిని భూమికి బలిపెట్టియుందును. భయపడి యేడ్చుచున్న కుబ్జను జంపితిమా వీరు స్త్రీహంతలు వీరితో మాటలాడరాదని మనయన్న మనతో మొగమిచ్చి మాటలాడఁడు నిజమాలోచింపుము.

తే. అనుఁడు భరతునిమాటల♦నాలకించి, తోన కుబ్జను విడిచెశ♦త్రుఘ్నుఁడదియుఁ
గాళ్ళపైఁ బడియేడ్వఁగఁ గైక దేర్చె, నురులఁ జిక్కిన క్రౌంచినా♦నొరలుదాని.

తాత్పర్యము [౧౩-౨౬

ఈప్రకారము భరతుఁడు చెప్పగా నాయనమాటలను విని సత్యమనియెంచి శత్రుఘ్నుఁడు వెంటనే కుబ్జను వదలిపెట్టెను. ఉరులలోఁ జిక్కినలఁగిన క్రౌంచి

వలెనుండుదానిని, తన కాళ్ళపైఁబడి యేడ్చుచు దానిని, గైక యేడువ కేల యేడ్చెదవు. వారి మేలునకై వారు సుఖపడవలయునని మనమూలోచించి చేసితిమి. వారికంతమాత్రము తోఁచినదికాదు. వారికది సరిపడకున్న మనమేమి చేయఁగలము. వారి ప్రారబ్ధబల మనుకొందము. నా కొడుకురాజుగాక యెట్లు తప్పించుకొనఁగలఁడు. అందఱు చెప్పిన వినకుండునా వినక యేమిచేయఁ గలఁడు. రాజులేకున్న నందఱుచెప్పకుందురా? కావున భరతుఁడు రాజగువఱకూరకుండుము. ఆవల వీరిపని విచారింతము. అని సమాధానపఱిచెను.

-◆ ౭౯-వ సర్గము. రాజకర్తలు భరతునిఁ బట్టాభిషేకము చేసికొనఁ బ్రార్థించుట ◆-

సీ. పదియునాలవనాఁటి◆యుదయంబునను రాజ,
కర్తలు భరతునిఁ◆గాంచి యనిరి
పరమగురుం డైన◆నరపతి తనజ్యేష్ఠ,తనయు రాముని లక్ష్మ◆ణుని వివాసి
తులఁ జేసి స్వర్గంబుఁ◆దోడన తానేగె, రాజవు మాకీవు◆రాజతనయ
కమ్మిట్టు దైవయో◆గమ్మున నీయరా, జకరాజ్య మిందాఁక◆వికలపడదు
తే. వలయునభిషేక స్వద్వస్తు◆వులను గూర్చి,
పౌరులును మిత్రులును వేచి◆నారు వీరె
పితృపితామహపాలితం◆బతుల రాజ్య,
మెల్ల వహియించి మ మ్మెల్ల◆నేలుమనిన. ౧౯౩౪

తాత్పర్యము

పదియు నాలవనాఁటి యుదయమున సింహాసనమునకు రాజు నభిషేకము చేయు నధికారము గలవారు భరతునిఁజూచి మాకు గురువులలో శ్రేష్ఠుఁడైన మీ తండ్రి తనపెద్దకొడుకును శ్రీరాముని లక్ష్మణునితోడ దేశాంతరమునకుఁ బంపి వెంటనే తానుగూడ స్వర్గమునకుఁబోయెను. కావున రాజకుమారుఁడవైన నీవే మాకిప్పు రాజవుకమ్ము. దైవవశమున రాజ్యమరాజకమయ్యుఁ జెడక యిందాఁక మంచిదశయందే యున్నది. పౌరులు మంత్రులు పట్టాభిషేకమునకుఁ గావలసిన వస్తువులనెల్ల గూర్చి నీయాజ్ఞకు వేచియున్నారు. వీరె చూడుము. నీతండ్రి దాతలు పాలించిన యసమాన రాజ్యమంతయు నీవు వహించి మమ్మెల్లఁ బాలింపుము? "రాజానం ప్రథమంవిందే, త్తతోభార్యాం తతోధన" మ్మని శాస్త్రము ప్రకారము రాజేకదా ముఖ్యరక్షకుఁడు.

కం. అర్థిని నభిషేకపుసుప,దార్థములఁ బ్రదక్షిణించి◆ తతభక్తిని ద
న్నర్థించునెల్ల వారికిఁ, బార్థివసుతుఁ డిట్లు పలికెఁ◆బరమప్రీతిన్. ౧౯౩౫

తాత్పర్యము

రాజ్యకర్తలు (**King-makers**) చూపించిన యభిషేకవస్తువులనెల్లఁ బ్రీతితో భక్తితోఁ బ్రదక్షిణము గావించి తన్నుఁ బ్రార్థించు నెల్లవారికి మిగులఁ బ్రీతితో రాజకుమారుఁ డిట్లనియె.

సీ. లోకులారా వినుఁ డు♦మాకులమునయందు, జ్యేష్ఠుఁ డర్హుండు రా♦జ్యేందిరకును
నన్నిట్లు పల్కంగ♦న్యాయమా మీకెల్ల, మాయన్న రాముని♦మహిపుఁ జేసి
నేన వసించెదఁ ♦ గాననంబులలోన, నీరేడువర్షంబు♦లిది నిజంబు
మాయన్న శ్రీరాము♦మరలించి దెచ్చెద, సంతనకట్టుఁ డు♦సకల సైన్య

తే. ములను గూర్పుండు కొంపోదు♦మున్నుగాఁ గ,
నెల్లయభిషేకవస్తువు♦లెల్లవారు
రండు పట్టాభిషేక మ♦రణ్యమునన, రామునకుఁ జేయువాఁడను♦రాగ మెసఁగ.

రాజ్యేందిరకున్=రాజ్యలక్ష్మికి, ఈరేడు వర్షంబులు = పదునాలుగేండ్లు, సంతనకట్టుఁడు=సిద్ధపడుఁడు.

తాత్పర్యము

లోకులారా నాయభిప్రాయము వినుఁడు, మావంశమందు రాజ్యలక్ష్మిని వరింప నర్హుఁడు పెద్దవాఁడే. ఇది మీ రెఱుఁగరా తెలిసి తెలిసి నన్నిట్లకార్యము చేయ బ్రేరింప మీకు న్యాయ్యమా? మాయన్న శ్రీరాముని రాజుగఁజేసి యాయనకు మాఱుగ నడవులలో నేనే పదునాలుగేండ్లు వసించెదను. ఇది నిజంబు ప్రయాణంబున కందఱు సిద్ధపడుఁడు. మాయన్న శ్రీరాముని మరలించి పురమునకుఁ దెచ్చెదను. సమస్త సైన్యములను సిద్ధముచేయుఁడు. అభిషేక వస్తువులనెల్ల నక్కడికే తీసికొనిపోదును. అరణ్యమందే యాయనకుఁ బట్టాభిషేకము చేసెదను.

కం. సవనాగ్ని రీతిఁ దెచ్చెద, నవనీపతిఁగాఁగఁ జేసి♦యభిషేకమహో
త్సవమున ద్మాతనయాధవు, నవనీజనులార! నిశ్చ♦యం బిది సుండీ.

సవనాగ్ని=యజ్ఞమందలియగ్ని, సుండీ=చూడుండి సంగ్రహరూపము.

తాత్పర్యము

ఊరికివెలుపల యజ్ఞముచేసి యింటికి మరల నాయగ్నిని దెచ్చినట్టు లడవియందు మాయన్నకుఁ బట్టాభిషేక మహోత్సవము జరపి రాజునుజేసి పట్టనమునకుఁ బిలిచికొని వచ్చెదను. ప్రజలారా యిది నిజముసుండీ.

ఉ. పేరునమాత్రఁ దల్లి యగు♦వేఱిఁడి కైక సకామఁ జేయఁగాఁ
గోరఁ జుఁడీ, ధరాధరముఁ ♦ గూర్చి మదగ్రజునిందు నేన కాం
తార నివాసి నయ్యెదఁ, బ♦థంబులఁ దీర్పఁగ మిట్టుపల్లముల్
భూరికశిల్పివర్గములఁ♦బుచ్చుఁడు పంపుఁడు దుర్గవేత్తలన్. ౧౯౪౧

వేఱిఁడి = వీఱిఁడి = అవివేకి, "వీఱిడియైన మానిసికి వెండి వివేకముగల్గ నేర్చునే" భార. ఉద్యోగ. సకామన్ = కోరిక ఫలించినదానిఁగా, పథంబులన్ = మార్గములందు, మిట్టుపల్లముల్ = ప్రాయిక గ్రహణముచే మకారము రాలేదు. సంధి. సూ. ౪౦ సు. వ్యా. భూరిక స్వార్థంబున కప్రత్యయము, విశేషముగ

శిల్పవర్గములన్=శిల్పపుఁ బనులు చేయువారి సమూహములను, దుర్గవేత్తలన్=దుర్గములఁ గట్టుటకుఁ దెలిసినవారిని.

తాత్పర్యము

కన్నతల్లికుండవలసిన గుణములు లేకున్నను గడుపునఁ బుట్టిన దోషమునఁ దల్లియని చెప్పుకొనవలసిన నేను వివేకములేని కైకకోరిక కొనసాగఁ జేయుటకు గోరనుజుండు. ఇచ్చట మాయన్నకు భూభారముఁగూర్చి నేనేయడవియందుఁ బదునాలుగు సంవత్సరము లుండెదను. కావున నాయన యున్నచోటికిఁ బోవుటకుఁగాను త్రోవలు చక్కఁజేయింపుఁడు. మిట్టపల్లములు సమముగాఁ జేయుటకు విశేషముగ శిల్పులను దుర్గవేత్తలను బంపుడు.

చం. అన విని వార లెల్లఁ బ్రమ♦దాశ్రుతరంగితలోచనంబులన్
మనుజవరేణ్యపుత్త్రుఁ గని♦మానితవాక్కులఁ బల్కి, రన్నకున్
గొనకొని రాజ్య మీయ మది♦గూర్చుతలం పది లెస్స, దాన నీ
కనయముఁ గూర్చుగాక నిర♦పాయినియై సిరి సంప్రమోదముల్. ౧౯౪౨

ప్రమదాశ్రుతరంగితలోచనంబులన్=సంతోషబాష్పములచే నిండిన కన్నులచే, మానితవాక్కులన్=శ్లాఘ్యమైన మాటలతో, అనయము=సర్వదా, నిరపాయినియై=ఎడఁబాయనిదై, సిరి=లక్ష్మి, సంప్రమోదముల్=అత్యధికమైన సంతోషములను.

ఏదైన శుభవార్త వినుటవలననో, గంధము పూలు ధరించుటవలననో గలుగు సంతోషము మోదము. తొలిచూలు కొడుకు పుట్టినాఁడనియో చిరకాలనష్టమైన ధనము లభించుటయో యిట్టివానివలనఁ గలుగునది ప్రమోదము. ఇవి క్షణకాల భంగురములు. తనకుఁగలిగిన సర్వస్వము స్వామికి సమర్పించుటచేఁ గలుగు శాశ్వత బ్రహ్మానందము సంప్రమోదము. ఇట్టిదానిని శ్రీ కలిగించునుగాక యనుటచే శ్రీ పురుషకారము సూచింపఁబడియె. అనయము నిరపాయిని యను శబ్దము లీయర్థమును స్ఫురింపఁజేసెడిని. "త్యాగేనైకేనా మృతత్వమానశుః" ఒక్కత్యాగముచేతనే మోక్షముకలదని శ్రుతిచెప్పుచున్నది. పితృదత్తమైన సంపూర్ణ రాజ్యము భోగమును, ధర్మరక్షణార్థమై సింహాసను మనస్సుతో వదలుటకంటెఁ ద్యాగము మఱియెద్ది కలదు 'సలింగం ధర్మకారణ' మ్మని యుండుటచే మానసిక త్యాగము శ్రేష్ఠము కాని బాహ్యవేషధారణము ముఖ్యమైనదికాదు. అది సుకరము.

తాత్పర్యము

ఆమాటలువిని వారందఱు సంతోషబాష్పములచే నిండిన కన్నులతో రాజకుమారునిఁజూచి శ్లాఘ్యమైన వాక్కుల నిట్లనిరి. రాజనందనా! నీవు మీయన్నకు రాజ్యమీయవలె నను తలంపు మిగుల మేలైనది. ఇట్టి యుదారభావము నీకుండుటచే నీకు శాశ్వతముగా శ్రీదేవి యత్యధిక సంతోషములను శాశ్వత బ్రహ్మానందమును గలిగించునుగాక.

కం. నరవర! నీయాజ్ఞప్తిని, వరశిల్పుల మార్గవిదులఁ • బంచితి మిపుడే
గురుభక్తుల ననుచును నిర్భరముదమున వారు చనిరి • పనులం దీర్పన్.

నరవర=(1) మనుష్యులందు శ్రేష్ఠుఁడా (2) జీవులందు శ్రేష్ఠుఁడా, అనాయాసముగ నప్రయత్నముగ నయాచితముగ లభించిన యింతటి రాజ్యము శ్రీరామునకు భక్తితో సమర్పించువాఁడు నరవరుఁడగుట యేమివింత, ఆజ్ఞప్తి= ఆనతిని, వరశిల్పులన్=శిల్పులందు శ్రేష్ఠులైనవారిని. మార్గవిదులన్=మార్గము దెలిసినవారిని, గురుభక్తులన్= (1) గొప్ప భక్తిగలవారిని, (2) గురువులందు భక్తిగలవారిని, నిర్భరముదమునన్=విశేష సంతోషముతో.

గురుభక్తులగు మార్గవిదులే శ్రీరామ దర్శనప్రాప్తి తమకేకాక తక్కినవారికిని గలుగుమార్గములు చక్కఁజేయువారని భావము. దానికి, నరవర=పురుషోత్తమ, ఆజ్ఞప్తి=ఆనతికావలయును, భగవత్ప్రీతులైన గురుభక్తులే యాకార్యము చేయఁగలవారు భక్తిలేనివారి నిట్టికార్యముల నియోగించినఁ గీడును గలుగవచ్చును.

తాత్పర్యము

రాజా! నీయానతిప్రకారము గురుభక్తుల మార్గవిదుల వరశిల్పుల నిపుడే పంపితిమి. అని వారును పనులు చక్కఁజేయఁబోయిరి.

—• ౮౦-వ సర్గము. పౌరులు వనమార్గంబును జక్కఁబఱుచుట. •—

సీ. అంత స్థలజ్ఞులు • యంత్రకుల్ ఖనకులు, సూత్రకర్మ చణులు • శూరవరులుఁ
గమ్మరి వడ్రంగి • గమ్మటీంద్రులును, గూలి, వాండ్రును మేదర • వాండ్రు బావి
త్రవ్వువారును బేలు • దార్లును మార్గదర్శకులును లోనుగాఁ • జతురులైన
పనివాండ్రు మున్నుగాఁ • జనిరి సముద్రంబు, పున్నమరే పొంగి • పొరలురీతి
తే. గాసిఁబడుదు మెఁయనక ప్ర • యాసమనక,
రామచంద్రునిఁ జూచెడి • ప్రమదమునను
దమకుఁదామ బయల్ దేఱి • తరలిచనిరి,
మూఁగియెల్లరుఁ దమకొఱ • ముట్లుకొనుచు. ౧౯౪౪

స్థలజ్ఞులు=భూమిలక్షణము దెలిసినవారు పోవలసిన స్థలము నెఱిఁగినవారు, యంత్రకుల్=1) మృగములఁ బట్టువలలులోనగు యంత్రములుగలవారు, ఖనకులు=త్రవ్వువారు, సూత్రకర్మచణులు=సూత్రముచేఁ జేయు కార్యము సూత్రకర్మము, నేత, దానియందు నిపుణులు = సాలెవారు, 2) కొలతలు చూచుటకై వంకరలు లేకుండుటకై నూలుపట్టువారు, కమ్మరి = ఇనుపపని చేయువాఁడు, వడ్రంగి=వడ్లపనిచేయువాఁడు, ప్ర, వర్ధకి, కమ్మటీంద్రు=కమసాలవారు, బేలుదార్లు=గోడలు కట్టువారు, మార్గదర్శకులును=దోవచూపువారు, కొఱముట్లు=సాధనములు, తమకుఁదామ=ఒకరు చెప్పక పిలువక తమంతటఁదామే, శ్రీరామకార్యమునకుఁ బిలువకయేవచ్చి వారిచేసగు కార్యములు చేయువారుత్తములు,

సాత్త్వికులు. పిలిచిన వచ్చిపనిచేయు రాజసులు మధ్యములు. పిలిచినను రాని వారధములు తామసులు- మూఁగి=గుంపుగూడి.

తాత్పర్యము

అంతట స్థలజ్ఞానము గలవారు యంత్రములు గలవారు వలలగుంతలు త్రవ్వువారు సాలెలు- నూలుపట్టువారు శూరులు కమ్మరులు వడ్రంగులు కమసాలులు కూలివాండ్రు చాఁపల బుట్టలనల్లు మేదరవాండ్రు బావులు త్రవ్వువారు బేలుదార్లు మార్గము చూపువారు మొదలగు నేర్పరులైన పనివాండ్రు పున్నమ నాఁటి సముద్రము పొంగువిధమున ముందుగాఁ గూటికి నీళ్ళకు శ్రమపడుదుమొ యనక దేహమునకుఁ గష్టమనక శ్రీరామచంద్రునిఁ జూడవలయునను కోరికచేత నొకరిచేఁ బిలిపించుకొనక తమంతటఁ దామే తమ తమ పనిసాధనములు తీసికొని గుంపులై బయలుదేఱిపోయిరి.

దీనివలన నెట్టిహీన జాతివాఁడైనను భక్తిగలవాఁడయ్యేనేని వాని వాని స్వధర్మముచేతనే భగవద్దర్శనప్రాప్తికి యోగ్యుఁడగుచున్నాఁడని యేర్పడుచున్నది.

నజాతిః కారణంలోకే, గుణ ఏవహికారణమ్మని శ్రీరామానుజ సూక్తి.

భగవత్కార్యము చేయవలసివచ్చినపుడు మనల నెవరు పిలువలేదే మనమేల పోవలెననియుంకుట దోషము అది భక్తుని లక్షణముగాదు.

ఉ. ముండ్లును బాలుఁ జెట్లు మును♦ముట్టుగ నూడ్చుచుఁ, ద్రోవ కడ్డమౌ
గండ్లను బూడ్చి లేనియెడ ♦ వృక్షసమూహము నాటి, గండ్రగొ
డ్డండ్లను గత్తులం బొదల♦ ఛాకమెయిన్ విదళించి చక్కఁగా
బండ్లును బోవున ట్లడవి ♦ బాటలు దీర్చుచుఁ బోవఁ గొందఱున్. ౧౯॥౫॥

మునుముట్టుగ = మొదలంట, నిశ్శేషముగ, ఛాకమెయిన్ = బలముచే, హాయి, బహు. బాలు.

తాత్పర్యము

పోవుబాటయందు నడచువారికి సంకటము గలిగించు ముండ్లను బాలను జెట్లను నిశ్శేషముగఁ దీసివైచుచుఁ ద్రోవ కడ్డమైన గుంతలను గండ్లను బూడ్చుచుఁ జెట్లు లేనియెడఁ జెట్లగుంపులను పొదలను గండ్రగొడ్డండ్లచేతను గత్తులచేతను నఱికివైచి బండ్లుపోవునట్లు లడవిలో బాటలు దీర్చుచుఁ గొందఱు పోయిరి.

తన శ్రేయస్సుమాత్రముగోరి పనిచేయు స్వార్థపరుఁడు త్తముఁడుగాఁడు. పదుగురకును సుకరమైన మార్గమేర్పాటుచేయువాఁడే యుత్తముఁడని భావము.

సీ. కొందఱు చొరరాని♦కుటిలకాననములఁ, దగులంగఁ బెట్టిరి♦ధగధగ మనఁ
గొందఱు మట్టంబు♦నొందించి రున్నతస్థలులఁ బల్లంబుల♦సత్వరముగఁ
గొందఱు పెద పెద్ద♦గుంటలు పూడ్చిరి, వంతెనల్ గట్టిరి♦వలయుచోట
రాగొట్టునేలల♦బాగుగఁ జదిపిరి, చెఱువుకట్టలఁ గొన్ని♦నఱికి రంధ్రఁ

తే. గొంద అరిగట్టివాఁగులు♦కొండవంక, గముల భద్రము పఱిచిరి♦కడలినాఁగఁ
బెనుజలాశయముల నీరు♦గననిచోట,
మడుఁగులను ద్రవ్వి రెల్లరు♦గడియలోన. ౧౧॥౬౯

కుటిల కాననములన్ = వంకరటింకరై దోవలు సరిగాలేని యడవులను, తగులంగఁ బెట్టిరి=కాల్చిరి, మట్టంబు=నేలతో సమము, ఉన్నతస్థలుల = ఎత్తు ప్రదేశములను, చదిపిరి=నలియఁగొట్టిరి, అరిగట్టి = అడ్డముగిట్టి, కడలినాఁగన్= సముద్రమోయనునట్లు, జలాశయములన్=మడుఁగులను.

తాత్పర్యము

మనుష్యులు ప్రవేశించుటకు వల్లలేని వంకరటింకరదోవలుగల యడవులను గొందఱు ధగధగమండఁ దగులఁబెట్టిరి. కొందఱు పెద్దగుంతలఁబూడ్చిరి. ఏళ్ళమీఁదఁ బెద్దవంకలమీఁద వంతెనలఁగట్టిరి. జాతిగొట్టు నేలలయందలి జాలను నలియఁగొట్టి మెత్తగా నుండఁజేసిరి. నీళ్ళులేని చెఱువులకట్టలను దెగఁ గొట్టిరి. కొందఱు చిన్న వంకలకు వాఁగులకు నడ్డముగట్టిరి. నీళ్ళులేనిచోటుల మడుఁగులు చెఱువులు నేర్పాటుచేసిరి.

సీ. గారపూఁతలతో ని♦గారపుఁగుట్టిమ,తలములు పొసఁగించి♦కొలఁకులందుఁ
బూలచెట్లను మఱి ♦ మేలిస్వనంబుల పక్షుల ధ్వజములఁ♦బరఁగజేసి
విడుదలపట్టుల ♦ వివిధసుమంబులఁ, గై సేసి చందన ♦ గంధవారిఁ
జల్లఁగనాసేన♦చనుత్రోవ సురపథ,మోయన శోభిల్లె♦నొప్పుమెఱసి

తే. యాజ్ఞ మేరకు నధికారు♦లచటనచట, రుచిరతలముల భరతున♦కుచిత మైన
సన్నివేశాళిఁ గూర్చిప్ర♦శస్తతార, సొగసు చేసిరి మఱి పెక్కు♦తెగలవాని.

నిగారపు=శ్రేష్ఠములై, కుట్టిమతలములు = రాతికల్పనపు నేలలయందు, విడుదల పట్లులన్=దిగుచోటులందు, కై సేసి=అలంకరించి, సురపథమో=దేవతలమార్గమో, సన్నివేశాళిన్=ఉండుటకుఁదగిన వసతులను, డేరాలను, ప్రశస్తతారన్=మంచినక్షత్రమున, పెక్కు తెగలన్=అనేకవిధముల.

తాత్పర్యము

రాతికట్టడపు నేలలను గారపూఁతలతో నునుపుగానుండఁజేసిరి. కొలఁకుల యొడ్డులందుఁ బూల చెట్లను మంచి వనములను అందుఁ బక్షులను ధ్వజములను వ్యాపింపఁజేసిరి. మనుష్యులు దిగియెడి చోటులను బుష్పములతో నలంకరించి గంధపునీళ్ళు చల్లఁగా నాత్రోవ దేవమార్గమున్నట్టులుండెను. సురపథమనునది ముక్తజీవుఁడు పోవు దేవయానము:- (అర్చిరాది మార్గమును సూచించుచున్నది. భగవంతుని సన్నిధికిఁ గొనుపోవునది యదియకదా. మీఁదఁ జెప్పిన వన్నియుఁ గ్లేశములను ప్రతిబంధకముల నివారించుటగా నెఱుఁగనగు,

అనఁగా మిట్టలు పల్లములు నేలసమముగాఁ జేసి యనఁగా మిట్టలు సమము చేయుట సంతోషాతిశయమున నుప్పొంగక మిట్టపడకయుండుట. పల్లములు సమముచేయుటయనఁగా దుఃఖమునఁ గ్రుంగిపోక సమబుద్ధియైయుండుట- సమబుద్ధియై యుండుట 'సమత్వంయోగ ఉచ్యతే' యనికదా భగవద్గీత చెప్పుచున్నది. ఇవి ద్వంద్వముల కన్నిటికి నుపలక్షణగా నెఱుఁగునది. వంతెనల్ కట్టుటయనఁగాఁ దమ్ము ముంచు శక్తిగల విషయసుఖంబులందు దిగక వానిని స్పృశింపక పైపైననే దాఁటిపోవుట. తమమార్గమున సుఖప్రయాణము సేయనీయక సంకటపెట్టువారిని బంధువులను గొట్టియైన మృదువు పఱుచుట బాగొట్టు నేలలఁ జదుపుట, మడుఁగులు త్రవ్వుట, పూలచెట్లుంచుట, విడుదల నేర్పాటు చేయుట యనునది భక్తిమార్గమునఁబోవు భాగవతులకు సాహాయ్యముచేయుట- ఇట్టులే తక్కినవి యూహించునది.

భరతుఁడు దిగుటకుఁ దగిన స్థలములని యధికారులు చెప్పినచోట డేరాలు గొట్టి పందిళ్ళు వేసి యనేకవిధముల వానిని మంచినక్షత్రమందు నలంకరించిరి.

సీ. మున్నిసుమును దుమ్ము•మొనసిన త్రోవలే,యెసఁగెను బఱఖల•నింద్రకీల
  భాసురవీథులఁ•బ్రాసాదపంకులఁ,గమ్రసౌధములఁ బ్రా•కారములను
  ధ్వజముల నంబర•తలముల నొరసెడి,వరవిమానకపోత•పాలికలను
  నవ్యమైసురరాజ•నగరంబు దొరయుచు, నాజాహ్నవీతీర•మమరెఁ ద్రోవ

తే. చంద్రతారాసముత్కర•సహితమైన, తారకాపథనిభ మయి•తనరె నపుడు
  శిల్పవరనిర్మితం బయి•చెలువు మీఱె,
    యంతనాందీముఖము రేయి•యందునెలమి. ౧౯౪౮

తాత్పర్యము

పూర్వమినుక దుమ్ముగానుండిన నేలలే యిపుడగట్టలచేతను- ఇంద్రకీల పర్వతములవలెఁ బ్రకాశించు వీథులచేతను ధనికులు రాజులు దిగుటకుఁదగిన మేడలుగల యిండ్లచేతను బ్రాకారములచేతను, టెక్కెములచేతను నాకాశమును దగులు నెత్తైన శ్రేష్ఠములైన యేడంతస్తుల మేడలచేతను గొణిగెల యందలి గువ్వగూండ్లచేతను మనోహరమై దేవతానగరముతో సమానమగుచు గంగానదీతీరమువఱకుఁ ద్రోవయేర్పాటయ్యెను. అది చంద్రునితోడను నక్షత్రములతోడను గూడిన నాకాశముతో సమానమై వారి పనులందు శ్రేష్ఠులైన శిల్పులచే నేర్పాటు చేయఁబడి యందగించెను. గంగాతీరమువఱకు నీవిధమున యాత్రికులకు సౌకర్యమును గలిగించిరనుటచే గౌషీతకి యుపనిషత్తునందుఁ జెప్పఁబడిన యతివాహకులు విరజానది వఱకుఁ జేయుకార్యముల స్ఫురింపఁ జేయుచున్నది. అక్కడ నడవులందుఁ బనివాండ్రట్లు పనిచేయుచుండ నిచ్చట

నయోధ్యయందు శ్రీరామచంద్రమూర్తిని బిలుచుకొనివచ్చుటకై యారంభము సేయఁదలఁచిన దినమునకు ముందురాత్రియందు భరతుని పట్టాభిషేకము కొఱకు వసిష్ఠుని యాజ్ఞానుసారముచేయు శుభకార్యమునకు ముందటి రాత్రి యందు దుఃఖశాంతికై చేసిన శుభకార్యము కలుగునని యధ్యాహార్యము.

౮౧-వ సర్గము.

సీ. సూతులు మాగధుల్ ♦ స్తోత్రపాఠంబుల, శ్శ్రేయసోక్తులఁ ♦ జదువు చుండ
యామదుందుభులు కోఁ ♦ ణాభిహతంబులై, మొరయ శంఖంబుల ♦ మ్రోఁతలెసగ
భరతుండు మేల్కని ♦ పరమదుఃఖితుఁ డయి, నరపతి నేఁ గాను ♦ నా కివేల
చాలింపుఁ డని చెప్పి ♦ శత్రుఘ్నుఁ గనుఁగొని, కంటివే తమ్ముఁడా ♦ కైక యెంత
తే. జగములకు నెల్ల నపకృతి ♦ సలిపె నన్నుఁ,
ప్రబలదుఃఖంబులకు నెల్లఁ ♦ బాత్రుఁ జేసి
దశరథుం డేగె నదిఁ గర్ణ ♦ ధారహీన, తరి యనన్ రాజ్యలక్ష్మియుఁ ♦ దల్లడిల్లె.

శ్శ్రేయసోక్తులన్=శుభము కలిగించుమాటలను, యామదుందుభులు = జాముజామునకుఁ గొట్టెడినగారాలు, కోణాభిహతంబులై =వాగించెడి కట్టెలచేతఁ గొట్టఁబడినవై, అపకృతి=అపకారము, నది = ఏటియందు, కర్ణధారహీన = ఓడ నడపువాఁడులేని, తరి = పడవ, రాజ్యలక్ష్మియు = పెద్దరాజున్నప్పుడే పెద్ద కొడుకును రాజుచేసి విచ్ఛేదములేక యేలఁబడు రాజ్యలక్ష్మి.

తాత్పర్యము

సూతులు మాగధులు మంగళకరములైన మాటలచే స్తోత్రపాఠంబులఁ జదువుచుండఁగా, జాముజామునఁ గొట్టు నగారాలు వాగించుకొడువులచేఁ గొట్టఁబడి ధ్వనించుచుండ, శంఖముల మ్రోఁతలధికముగాఁగ భరతుఁడు మేలుకొని మిగుల దుఃఖించి వారినిజూచి రాజును నేనుగాను. రాజునకుండవలసిన విధి యన్నియు నాకేల చాలింపుఁడనిచెప్పి శత్రుఘ్నునిఁజూచి తమ్ముఁడా! చూచితివా కైక లోకమునకంతయు నెంతయుపకారము చేసెనో నన్నెంత బలిష్ఠదుఃఖము నకుఁ బాత్రునిఁ జేసెనో రాజు మరణించుటచే నడపువాఁడు లేనియోడ యేటి నీళ్ళలోఁ గదలుచున్నట్టు రాజలక్ష్మియు రాజులేక తల్లడిల్లుచున్నది.

కం. మన కెల్లరకును దిక్కగు, ననఘుని శ్రీరాము నడవికి ♦ న్యాయేతర యై
పనిచెను నా తల్లియ యే, మని యేడ్చెద నయ్యయిట్టి ♦ యాగడమునకున్.

తాత్పర్యము   [౧౯౩౦

మనకందఱకు రక్షకుఁడగు పుణ్యాత్ముని శ్రీరామచంద్రమూర్తిని న్యాయము తప్పి యడవులకు మఱియెవ్వరుగాదు నాతల్లియే పంపెను. ఇటువంటి దుష్కార్యములకు నేనేమని యేడ్తునయ్యా.

సీ. అని యేడ్వ శుద్ధాంత ♦ జనములు పలవించు, చుండ వసిష్ఠుఁ డ ♦ త్యుత్తమార్ఘ
రత్నమయం బయి ♦ రాజిల్లుకొల్వుకూ, టంబును శిష్యగ ♦ ణంబు గొల్వఁ

జొచ్చికాంచనమయ•సుఖదపీఠంబున, నాసీనుఁడై సేవ•కాళిఁ జూచి
ద్విజుల నమాత్యులఁ•బెద్దలఁ బిలుఁడాత్య,
యికమొందు గలదు భూ•మీశసుతుల
తే. భరతశత్రుఘ్నులను హిత•వరుల విజయు,
నలసుమంత్రునితోడుత•ననఁగ వారు
పిలువ హలహలశబ్దంబు•బలియ వచ్చి, రంద ఱశ్వరథాదివా•హనములెక్కి.

శుద్ధాంత జనములు=అంతఃపురముననున్న వారువారు, పలవించుచుండన్=ఏడ్చుచుండఁగా, అత్యుత్తమార్ఘరత్నమయంబయి=మిక్కిలి శ్రేష్ఠములై వెలగల రత్నములచే నిండినదయి, కాంచనమయి=బంగారుతోఁ జేయఁబడిన, సుఖద = సుఖమునిచ్చు, పీఠంబునన్ = పీఁటయందు, ద్విజులన్ = బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులను, అత్యయికము = శీఘ్రముగఁ జేయవలసిన యవశ్య కార్యము, విజయుఁడు సుమంత్రుఁడు మంత్రులు అశ్వరథాది వాహనములు= గుఱ్ఱములు రథములు మొదలగు వాహనముల నెక్కి.

తాత్పర్యము.

ఇక్కడ నింటియందు భరతుఁడిట్లు లేడ్వఁగా నంతఃపురమున వారును నేడ్చుచుండిరి. అక్కడ వసిష్ఠుఁడు మిక్కిలియుత్తమమై వెలగల రత్నములచే నిండియున్న కొలువుకూటమునందు శిష్యులతోడఁ బ్రవేశించి బంగారుపీఁట యందు సుఖముగఁగూర్చుండి సేవకులనందఱఁజూచి మీరు బ్రాహ్మణ,క్షత్రియ, వైశ్య ప్రముఖులను అమాత్యులను పెద్దలను రాజకుమారులను భరత శత్రుఘ్నులను మంత్రులగు విజయ సుమంత్రాదులను నవశ్యము చేయవలసిన కార్యము గలదని పిలుచుకొని రండనఁగా వారుపోయి యట్లే యందఱకుఁ దెలియఁజెప్పఁగా వారెల్లరు హలహల శబ్దములతో గుఱ్ఱములను దేరులను వారి వారి కిష్టమైన యితరవాహనముల నెక్కివచ్చిరి.

కం. వచ్చెడిభరతునిఁ గనుచు వి,యచ్చరవిభు నాకవాసు•లట్టుల యెదురై
వచ్చి దశస్యందను మును, పచ్చుపుమతిఁ గొలుచునట్టు•లందఱుఁ గొలువన్.

వియచ్చరవిభున్=వియత్+చర+విభున్=ఇంద్రుని, నాకవాసులు=స్వర్గమున నుండువారు. తాత్పర్యము.

ఇట్లువచ్చి సభకు వచ్చుచున్న భరతున కెదురుగ నింద్రున కెదురుగఁ బోవు దేవతలవలెఁబోయి తోడితెచ్చి పూర్వము దశరథు నెట్లుగొలిచిరో యట్లే గొలిచిరి.

కం. తిమినాగసంవృతం బగు, స్తిమితోదకరత్న శంఖ•సికతాహ్రద మ
ట్లమరె సభ భరతుచేఁ బూ,ర్వము దశరథుచేతఁబోలె•రాజ దలిర్పన్. ౧౮౨౩

తిమి=తిమియను చేఁపలతోను, నాగ=పాములతోను, సంవృతము=చుట్టఁబడినది, స్తిమిత+ఉదక = కదలని నీరుగల, రత్నశంఖసికతా = రత్నములు,

శంఖములు, ఇసుకగల, హ్రదము=మడుఁగు, తిమినాగములకుసాటి భరత శత్రుఘ్నులు, స్తిమితోదకమునకు వసిష్ఠుఁడు రత్నశంఖసికతాదులకు వివిధ యోగ్యతలుగల సభ్యులు సాటియగుదురు.

పూర్వము దశరథునిచేవలె నిప్పుడు భరతునిచేఁ బ్రకాశించు సభ తిమి నాగములచేతను స్తిమితోదకముచేతను రత్నములతో శంఖములతో నిసుకతోఁ గూడిన పెద్ద మడుఁగువలె నుండెను.

-• ౮౨-వ సర్గము. వసిష్ఠుఁడు భరతునిఁ బట్టాభిషేకము చేసికొమ్మని చెప్పుట•-

సీ. ఆర్యజనాకీర్ణ•మైనయాసభలోన, నర్హాసనంబుల•నందఱకును
  నియమించి కూర్చుండ•నయమున వచియించి,
                    భరతుఁ డున్నంత స•భాస్థలంబు
  వస్త్రాంగరాగప్ర•భావిభాసిత మయి, శారదసంపూర్ణ•చంద్రకలిత
  యామ్నియును బోల•నలరి వసిష్ఠుఁడు, లేచి యెల్లరఁ బాఱఁ•జూచి కైక
తే. తనయుతో నిట్లు వచించె•ధర్మవిదుఁడు,
                    మృదువుగా వత్స నీతండ్రి•పృథివియేలి
  ధర్మపద్ధతి బహుధన•ధాన్యవతిని, ధరణి నెల్లను నీకిచ్చి•యరిగె దివికి.

ఆర్యజన=పెద్దమనుష్యులచే, ఆకీర్ణము=నిండినది, అర్హాసనంబులన్=వారి వారికిఁ దగిన యాసనములను, నయమునన్=మంచిమాటలతో, వస్త్ర=ధరించిన వస్త్రములయొక్కయు, అంగరాగ=గంధపుఁ బూఁతయొక్క, ప్రభా=కాంతిచే, విభాసితమై=ప్రకాశించినదియై, శారద సంపూర్ణచంద్రకలిత=శరత్కాలము నందలి (కార్తీక మాసమునందలి) సంపూర్ణచంద్ర=నిండుచందురునితో, కలిత= కూడిన, యామినియుఁబోలెన్=రాత్రివలె, అలరి=సంతోషించి, పాఱఁజూచి= కలయఁజూచి, ధర్మవిదుఁడు=రాజవంశ ధర్మము తెలిసినవాఁడు, మృదువుగాం మెత్తని మాటలచే, వత్స=కుమారా.

తాత్పర్యము

పెద్దమనుష్యులచే నిండిన యాసభలో వచ్చినవారి నందఱను వారివారికిఁ దగిన స్థానంబులందుఁ గూర్చుండుఁడని మంచిమాటలతో భరతుఁడు చెప్పి తన యాసనమునఁ దానుండఁగా సభాప్రదేశము వస్త్రములయు గంధపుఁ బూఁత లయుఁ గాంతిచేఁ బ్రకాశించి శరత్కాలమునాఁటి నిండు చందురుఁడుగల రాత్రివలె నుండఁగా సంతోషించి రఘువంశధర్మము నెఱిఁగిన వసిష్ఠుఁడు లేచి యందఱను గలయఁజూచి భరతుతోడ నిట్లనియె కుమారా! నీతండ్రి రాజ్యపరి పాలనము ధర్మమార్గమునఁ గావించి విశేష ధనధాన్యములతోఁ గూడిన భూమిని నీకిచ్చి స్వర్గమునకుఁ బోయెను.

తే. సత్యధృతి రామచంద్రుఁడు•సత్పురుషుల, ధర్మపద్ధతిఁ దలపోసి•తండ్రియాజ్ఞ
  నడువ నడవికి జనియెను•నళినవైరి, వెన్నెలను బాయ లేనట్టి•విధము దోఁప.

సత్యధృతి = సత్యమునఁ బట్టుదలకలవాఁడు, నళినవైరి = చంద్రుఁడు, 'జీవతో వాక్యకరణాత్, ప్రత్యబ్దం భూరిభోజనాత్, గయాయాం పిండదానాచ్చ, త్రిభిఃపుత్రస్య పుత్రతా' యని పుత్రలక్షణము. తండ్రి జీవించియుండు కాలమున నాయన మాటప్రకారము నడచుట, ఆయన మరణించినతరువాతఁ బ్రతి సంవత్సరము విశేషముగ నన్నదానము చేయుట, గయయందుఁ బిండప్రదానముచేయుట యీమూఁడు చేయువాఁడు పుత్రుఁడనఁబడును. వానియందుఁ బుత్ర శబ్దము సార్థకము అను ధర్మము తెలిసిన శ్రీరాముఁడు.

తా త్ప ర్య ము

సత్యమందు స్థిరబుద్ధిగల శ్రీరామచంద్రుఁడు సజ్జనుల ధర్మమార్గమాలోచించి తండ్రియాజ్ఞ నడుపఁ జంద్రుఁడు వెన్నెలను బాయలేని విధముగఁ బుత్రధర్మమును నెడఁబాయలేక యడవికిఁ బోయెను.

వెన్నెలను బాయలేని చంద్రునివలె ననుటచే శ్రీరామచంద్రుని జీవతోవాక్యకరణాత్తను ధర్మమునుండి యెడఁబాయఁజేయ నీకు సాధ్యముగాదనియు, నీవాయనను బిలుచుకొని వచ్చుట పట్టాభిషేకము చేయుట యనునది వ్యర్థప్రయత్నమనియు, ఈ పదునాలుగు సంవత్సరములు నీవు రాజైనను గాకున్నను రాజ్యపాలన భారము తప్పదనియు, వసిష్ఠు నభిప్రాయమనియు నుపమానబలముచే స్ఫురించుచున్నవి.

చం. జనకసహోదరప్రదము • క్ష్మాతల మెల్ల నకంటకంబుగాఁ
    గొనుము నిజాభిషేకమును • గొబ్బునఁ గైకొను మంత్రులెల్లరున్
    ఘనముదితాత్ము లీధరణి • నాల్గుచెఱంగుల నున్న ఱేండ్లు నీ
    కొనరిన రక్తిఁ గూర్తురు స • ముత్సుకులై బహుళంపుఁ గానికల్. ౧౭౫౮

జనకసహోదరప్రదము = తండ్రిచేత నన్నచేత నీయఁబడినది, అకంటకంబుగాన్ = శత్రువులులేకుండ, ఘనముదితాత్ములు = మిక్కిలి సంతోషించినవారు, నాల్గుచెఱుంగులన్=నాలుగు దిక్కులందు.

తా త్ప ర్య ము

నీకు రాజ్యము నీకంటెఁ బెద్దవారగు నీతండ్రి, అన్న మనఃపూర్తిగా నిచ్చినదేకాని యన్యాయార్జితముకాదు. నేనీరాజ్యమును గైకొన్న న్యాయమైన ప్రభువుగాఁడని యెవరైన నీతో విరోధింతురను భయము నీకక్కఱలేదు. తిరస్కరించువాఁడులేకయె నీవు పట్టాభిషేకము చేసికొనవచ్చును. ఈవిషయమున మంత్రులందఱు సంతోషించువారే. మంత్రులేకాదు నాలుగుదిక్కుల నీయేలుబడికి లోపడిన రాజులందఱు నిన్ను రాజుగా నంగీకరించి నీకుఁ బ్రీతితో విస్తారముగఁ గానుక లర్పింతురు. సర్వజన సమ్మతివిషయమై నీవు సందేహింపఁ బనిలేదు.

రాజకర్తలు దీనికి ముందే యీవిషయము ప్రస్తావించిరే మరల నిదియేలయని సందేహింపఁ బనిలేదు. అది రాజకర్తలకు సుబ్యోగులకు భరతునకు భరతు

నింట జరిగిన సంభాషణమేకాని జరుగవలసిన క్రమపద్ధతి ననుసరించి జరగిన వ్యవహారము కాదు. బహిరంగమున విషయము పరిష్కారము కావలయునని యీసభ గూర్పఁబడెను.

చం. అన విని భూరిశోకమున • నాత్మ నిజాన్వయధర్మ మెంచుచున్
ఘను రఘురామునిం దలఁచి • గద్గదపాటున నక్కుమారుఁ డి
ట్లని కలహంసనాదమున • నాగురువర్యుని గర్హలాడె ఛీ
యని గురు వంచు నిండుసభ•యంచును గొంకక యారటంబునన్. ౯౨౨

భూరిశోకమునన్=గొప్పవ్యసనముచే, నిజాన్వయధర్మము=జ్యేష్ఠుఁడేరాజ్యార్హుఁడను తమవంశ ధర్మమును,ఎంచుచున్=తలంచుచు, కలహంస నాదమునన్=కలహంస స్వరమువంటి స్వరముతో, గర్హలాడెన్=నిందించెను, ఆరటంబునన్= పరితాపముతో, కొంకక = సందేహింపక, భూరిశోకమునన్ = తండ్రిచచ్చెనని శోకమునొందెను. శ్రీరామచంద్రునిమాఱు నీవు పట్టాభిషేకము చేసికొమ్మనుటచే నెక్కువగ శోకించెను. వసిష్ఠునంతటివాఁడుకూడ నన్నీ యధర్మకార్యమునఁ బ్రేరేంపవచ్చునాయని యధిక శోకము, నిజాన్వయధర్మమెంచుచున్=వసిష్ఠుఁడు ధర్మమెంచక కక్కుర్తి పక్షము నాపద్ధర్మము నెంచెనని భావము.

ఘనుఁడగు రాముఁడనుటచే ఘనుఁడు రాముఁడుండఁ నధముఁడనగు నాకు రాజ్యమిచ్చెద ననుచున్నారే వీరెంత మతిహీనులని భరతుఁడెంచెను. ఆ కుమారుఁడు = ఆ బాలుఁడు, బాలునకున్న వివేకము వసిష్ఠునకు లేదాయెఁగదా కుమారుఁడనిన నాకుమారుఁడు కుమారుఁడుగాని యందఱు కుమారులా కు + కుమారుఁడు = కుత్సిత పాపమును జంపువాఁడు కుమారుఁడు అశబ్దము భరతునందుఁగదా సార్థకమ్మని కవి యాశ్చర్యపడుచున్నాఁడు. "కుపాపేల్పే కుత్సితాయా" మ్మని నానార. సుఖానుభవ యోగ్యకాలమున నయాచితము, నప్రయత్నలబ్ధమైన గొప్పరాజ్యము వచ్చినను ధర్మలోపభయమున వలదనుచున్నాఁడే వీఁడెక్కడి పిల్లవాఁడని యాయన జితేంద్రియత్వమునకుఁ గవి యాశ్చర్యపడుచున్నాఁడు.

గురువర్యునిన్=గురువర్యుఁడయ్యు నింత యధర్మమై క్రూరమైన కార్యమందు బాలుని నన్నుఁ బ్రేరింపవచ్చునా. గురువంచున్. అష్టాన్యేతాన్యవ్రతఘ్నాని హ్యాపోమూలం ఘృతంపయః। హవిర్బ్రాహ్మణ కామ్యంచ గురోర్వచన మౌషధ। మ్మనునట్లు గురువాక్యము వినిన వ్రతభంగము లేదను న్యాయమును నాదరించి నిండుసభయందు గురువునం దేదేని దోషముండిన నీకిది సరియైన నడతగాదని రహస్యముగఁ జెప్పవలయునుగాని నలుగురిలో నవమానింపరాదు అను శాస్త్రమునుగూడఁ దలంపక, ఛీ యని గర్హలాడెన్=ఛీయని నిందించెను. భరతుఁడు వసిష్ఠుని నిందింపఁ గారణములేమన :- వసిష్ఠుఁడు = పురోహితుఁడు ముందు హితమెంచువాఁడు. అట్టివాఁడు తనకు హితమైనదాని బోధింపక

ప్రియములాడుచున్నాఁడు. కావున నాయన పురోహితుఁడు కాఁడు. (౨) ఆచార్యుఁడు=ఆచార్యుఁడగువాఁడు శిష్యులను శాస్త్రీయమైన సదాచారమున నిలుపువాఁడు. అట్టివాఁ డశాస్త్రీయమైన దురాచారమందుండఁ బ్రేరేపించుచున్నాఁడు. ఇట్టివాఁ డెట్లాచార్యుఁడగును. కావున నాయన గర్హ్యుఁడే. రహస్యముగ నిందింపరాదా యనిన నిండుసభలోఁ గూర్చుండఁబెట్టి ప్రశ్నించినపుడు బహిరంగముగఁ బ్రత్యుత్తరమీయక రహస్యముగఁ జెప్పెదను లెమ్మనరాదు. ప్రత్యుత్తరమీయకుండిన నది యంగీకారసూచక మగును.

కావునఁ బ్రత్యుత్తరమీయక తప్పదయ్యెను. గర్హించుటకు మఱియొక కారణమేమన నలుగురు తన ప్రభుత్వము నంగీకరింపరేమో యను భయముచే వలదనుచున్నానని యాభయము నాకక్కఱలేదని నానిరాకరణమునకు నసత్యార్థ కల్పనము చేసెను. ఇది కేవల మసహ్యము.

చం. గురుకులవాసి యై శ్రుతు ల • కుంఠితరీతిని నభ్యసించి యె
ల్లరు మతి మంతుఁ డంచనఁ • జెలంగెడి ధర్మరతాత్మ రాజ్యమే
పురుషుఁడు నావలెం గొనఁగఁ • బూనును? బంక్తిరథేంద్రుపట్టి నై
గురుఁ డగురామచంద్రుసిరిఁ • గోరఁగ సంతతిపాపజాతినే ? ౧౯౦

గురుకులవాసియై=ఇక్కడ కులమనఁగా నిల్లు, విద్యాభ్యాసము నిమిత్తమై గురుసేవచేయుచు గురునింటనే యున్నవాఁడై, శ్రుతులు=వేదములు, అకుంఠితరీతిన్=ఏమిలోపము లేనట్లు, మతిమంతుఁడు=శాస్త్రార్థములను జక్కఁగ గ్రహించినవాఁడు, ధర్మరతాత్మన్=అర్థము దెలిసికొనుటయేగాక యందుఁ జెప్పఁబడిన ధర్మకార్యముల యనుష్ఠానమందు నభిలాషకలవానియొక్క, నావలెన్ = శాస్త్రబద్ధుఁడగు నావలె, పట్టి = కుమారుఁడు, గురుఁడు=పెద్దవాఁడు, పాపజాతినే = పాపపుజాతియందుఁ బుట్టినవాఁడనా! పాపాత్మునకుఁ బుట్టినాఁడనా; పాపపురీతిఁ బుట్టినాఁడనా?

తాత్పర్యము

గురుకులవాసముచేసి కొఱఁతలేకుండ వేదములెల్ల నభ్యసించి యందఱచేత బుద్ధిమంతుఁడనిపించుకొని ధర్మాచరణమందుఁ బ్రీతిగలవాని రాజ్యమును నావలె శాస్త్రబద్ధుఁడగువాఁడెవ్వఁడు గ్రహింపఁబూనును. దశరథుని కుమారుఁడనై యన్నయగు శ్రీరామచంద్రుని లక్ష్మిని నేను గోరుటకు నంతటి నీచజన్ముఁడనని తలఁచితివా? నేనే పాపాత్ముఁడనని తలఁచితివా? పాపాత్ముఁడగువాని కొడుకనని తలంచితివా? నే నెట్టివాఁడనని నీవీయధర్మము నాకుపదేశింప వచ్చితివి ?

కం. పుట్టియు దశరథునకు నే, నెట్టులు హరియింతు రాజ్య•మీరాజ్యమునున్
అట్టులె నేనును రాముని, వి ట్టగుటను నీవ చెప్పు• మీ ధర్మగతన్. ౧౯౧

తాత్పర్యము.

దశదిశలందుఁ దనరథమువలెఁ దనకీర్తిని వ్యాపింపఁజేసి శ్రీరామునితోడఁ బ్రాణములు విడిచిన దశరథుని కుమారుఁడనై శ్రీరాముని రాజ్యము నేనెట్లు

హరింతును? ఈరాజ్యము, రాజ్యమువలె నేను రెండు శ్రీరామచంద్రమూర్తివే, వాస్తవమిట్లున్న కారణముచే ధర్మమాలోచించి నీవే చెప్పుము.

అన్యయుష్మదస్మత్కార్యంబులందుత్తరోత్తరంబు బలీయంబను సూత్ర ప్రకారము (సు. వ్యా. కారక. సూ. ౪౨) ఈరాజ్యము నేను రాముని వారమని యుండవలెను. రామునివి యనుట సరిగాదని యాక్షేపింపరాదు. ఏలన భరతు నభిప్రాయమున రాజ్యమెట్లు శ్రీరామునిసొత్తో నేను వాచ్యమైన యీదేహము జీవుఁడు నట్టిదే- పారతంత్ర్యమందు రెండును సమానములే. స్వవినియోగ మందు దానికెట్లు స్వాతంత్ర్యములేదో నాకు నట్లేలేదు. కావున నేను నచేతనము వంటి వాఁడనే, తన పారతంత్ర్యము సూచింప 'రామునివి' యని చెప్పెను. అహంశబ్దవాచ్యుఁడు కేవల ప్రత్యగాత్మయేకాదు. దేహవిశిష్టాత్మ కావున దేహము ఆత్మ రెండును భగవత్పరతంత్రములే- పారతంత్ర్యమందు రెండును సమాన ములే- కావున రాజ్యమెట్లు శ్రీరామునిసొత్తో యట్టులే నేను శ్రీరాముని సొత్తునే- నాసొత్తు నేను గాను- కావునఁ దన సొత్తులను స్వామి యుపేక్షింపవలయునుగాని సొత్తులు తమలోఁ దాము నొకరి నొకరపేక్షించునా? కావున రాముని సొత్తులగు నేను రాజ్యము మా యిరువురిలో నొకరి నొకరు నపేక్షించుట యుక్తము కాదు, అట్లొకరి నొక రపేక్షింపవచ్చునేని రాజ్యమేల నన్నపేక్షింపరాదు. కావున మమ్మిద్దఱను శ్రీరాముఁడే యపేక్షింప స్వతంత్రుఁడు కావున నేను రాజ్యము రాముని సొత్తులమగుటచే నా స్వభావమునకుఁ దగినట్టి ధర్మమును (అనఁగా రక్షకుఁడు వీఁడు రక్ష్యమిది యను ధర్మమును) నాకు (లోకములో నుండు నెవ రికో గాదు. లోకములో ననేకులు తండ్రిని నన్నను వధించికూడ రాజ్యమేలు దురు అట్టివాఁడను నేను గాను) చెప్పుమే నా స్వరూపమాలోచించి చెప్పుమాయని ప్రార్థించెదను. నీవు సామాన్యధర్మము నాలోచించి చెప్పితివి విశేషధర్మము నాలోచింపవైతివి. ఒకరి ధర్మము మఱియొకరికిఁ జెప్పరాదు.కావున నాధర్మము నాకుఁ జెప్పుము. అయ్యో! ఒక స్వామివే యగు సొత్తొకదాని నొకటి రక్షింపఁ జాలదంటివే, ఒకని సొత్తయిన పెట్టె వాని సొత్తయిన రత్నమును రక్షించుట లేదా అట్టులే రాజ్యమును నిన్ను రక్షించునందువా? పెట్టె రత్నమును రక్షిం చుట స్వామి ప్రేరణము చేతనే కాని స్వయముగాఁ గాదు. స్వామి తాను ధరిం చిన రత్నమును దాను ధరింప నొల్లనప్పుడు పెట్టెలోనుంచి బీగమువేసి చెవిని దన స్వాధీన మందుంచుకొనును.

అంతేకాని పెట్టె తానై స్వతంత్రించి తనలోనికి రత్నమును దీసికొని మూఁత బిగించుకొనునా. అట్టులే రాజ్యము నేను శ్రీరామచంద్రునివారమే. మే మిరువురము ఆయన వినియమనము క్రిందనుండువారము. ఆయన యెట్లు చెప్పిన నట్లు జరగవలయును కాఁబట్టి యీవిషయము శ్రీరామచంద్రుని సన్ని ధిలోఁజెప్పి పరిష్కరించుకొందము పదుండు- మనమెంత ప్రార్థించినను నిపుడు

సమయముకాదని నా స్వాధీనపఱిచెనేని యాయన శక్తిమీఁద నాయనకుఁ బర తంత్రుఁడనై యాయన యాజ్ఞకుఁ బద్ధుఁడనై యాయన వచ్చునంతదాఁకఁ బెట్టె రత్నమును రక్షించినట్లు నేను రక్షించెదను కాని యాయన యాజ్ఞలేక నేను స్వతంత్రించి రక్షింపను. కావున నాయన సన్నిధానమునకుఁబోయి రాజ్యమును మనలను గూడ గ్రహింపుమని ప్రార్థింపవలెను. కైకేయీ వర నిర్బంధముచే నాకు రాజ్యమువచ్చినను నాదికాదు. బలాత్కార కృత్యములనెల్ల నకృత్యము లుగాఁగదా మనువు విధించెను. కావున కైకేయీ నిర్బంధముచే దశరథుఁడు నా కిచ్చియు నీయనివాఁడే. శాస్త్రమునకు వంశాచారమునకు విరోధముగఁ దాఱు మాఱుచేయు నధికారము దశరథునకు లేదు. కావున శ్రీరామా! యీరాజ్యము నీ సొత్తే కాని నాది కాదని యాయనకుఁ దెలియఁ జెప్పవలెను.

ఉ. ఓజమునన్ దిలీపనహు ♦ షోపముఁడై నరఘూత్తముండు దా
నాజివిధాన రాజ్యరమ ♦ నందఁగ నర్హుఁడు పెద్ద యౌట చే
భూజనశస్తధర్మగుణ ♦ పూతుఁడు గావుట శ్రేష్ఠుఁ డౌట నే
యోజనచేత నన్ను ధర ♦ నూను మ టంటివి చెప్పుమా మునీ? ౧౯౬౦

ఓజమునన్ = దేహబుద్ధి బలములందు, రూ. ఓజస్సు, దిలీపనహుషోప ముఁడు = దిలీపునకు నహుషునకు సమానుఁడు, దిలీపుఁడు సూర్యవంశపురాజు నహుషుఁడు చంద్రవంశమురాజు ఉపలక్షణచే రెండువంశములందు శ్రీరామ చంద్రుని మించినవాఁడు లేఁడని భావము. ఆజివిధానన్=దశరథునివలె, రాజ్య రమ = రాజ్యలక్ష్మి, భూజన = భూమియందలి సమస్త జనులచేత, శస్త=కొన యాడఁబడిన, ధర్మగుణ = ధర్మగుణముచే, పూతుఁడు = పవిత్రుఁడైనవాఁడు, యోజన=ఆలోచన.

తాత్పర్యము

దేహబల మనోబలములచే దిలీపునకు నహుషునకు సమానుఁడైన శ్రీరామ చంద్రుఁడు దశరథునివలె రాజ్యలక్ష్మిఁ బొందుటకుఁ బుట్టువుచేఁ బెద్దవాఁడును సర్వజనులచే శ్లాఘింపఁబడిన పవిత్రగుణములచే శ్రేష్ఠుఁడు కావున నర్హుఁడు. ధర్మమిట్లుండ నేమి యాలోచించి నన్ను రాజ్యము గ్రహింపు మంటివి.

కం. జ్యేష్ఠుఁడు ప్రాయంబునఁ గడు, శ్రేష్ఠుఁడు గుణములను నట్టి♦సీతేశురమన్
నిష్ఠురతం గాంక్షింపఁ గ,నిష్ఠుఁడనై యంత నేను♦నీచాత్ముఁడనే? ౧౯౬౧

తాత్పర్యము

వయస్సునందుఁ బెద్దవాఁడు గుణములనుబట్టి శ్రేష్ఠుఁడు అటువంటి శ్రీరామచంద్రుని లక్ష్మినిఁ రెండు విషయములఁజిన్నవాఁడనగు నే నాశించు నంతటి నీచపు మనస్సుగలవానిఁగాఁ దలఁచితివా.

కం. కలుషాత్మక సేవిత మై, తలఁగక నిరయము ఘటించు♦దారుణపాపం
బిల నేను జలిపి యిక్ష్వా,కులవంశమ్మున కకీర్తిఁ♦గూర్తున కాదే. ౧౯౬౨

తాత్పర్యము

పాపాత్ములాచరింపఁ దగినదియుఁ దప్పక నరకము గలిగించునదియు నగు ఘోరపాపము నేను జేసితినేని యిక్ష్వాకుల వంశమున కంతయు నపకీర్తి కలిగించినవాఁడ నగుదును గదా.

ఉ. కన్నది చేసినట్టియవ ♦ కార్యము నాకు రుచింప దేమి మా
యన్న వనాంతరస్థునకు ♦ నంజలి చేసెద నింద యుండి, వి
ద్వన్నుత! యాతఁ డేలఁగల ♦ వాఁడు సుమీ భువనత్రయంబు, నేఁ
గ్రన్నన రాముత్రోవఁ జనఁ ♦ గా మదిఁ బూనితి మాట లేటికిన్. ౧౯౬౩

తాత్పర్యము.

మునీంద్రా వేయిమాటలతో నేమిపని- నన్నుఁ గనుట తప్పఁ దల్లియం దుండవలసిన గుణములు లేనిదగు నాఁడుది చేసిన దుష్కార్యము నాకుఁ గొంచెమైన నిష్టమైనదికాదు. వినరానిమాట నిప్పుడు వింటిని గావున నా పాపము పోవఁ బ్రాయశ్చిత్తముగా నిందుండియే నమస్కరించెదను. (సర్వపాపములకుఁ బ్రాయశ్చిత్తము శరణాగతియే. అది యిందుండియే యిప్పుడు చేసి యావలఁ బ్రత్యక్షముగఁ జేసెదను.) జ్ఞానులచే స్తోత్రము చేయఁబడినవాఁడా! మూఁడు లోకము లాయనయే యేలునుగాక. ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తి పోయినత్రోవ నేను బోయెదను.

కం. అన విని యెల్లసదస్యులుఁ, గనులను బ్రమదాశ్రు లురల♦క్ష్మాతనయానా
థునిపై నిలిపిరి చిత్తం,బనంతర మిటు ననఁ దొడఁగె♦నానృపసుతుఁడున్.

సదస్యులు=సభ్యులు, ప్రమదాశ్రులు = సంతోషబాష్పములు, ఉరలన్ = రాలఁగా, క్ష్మాతనయానాథునిపైన్=శ్రీరామునిపై.

తాత్పర్యము

ఈ ప్రకారము భరతుఁడు చెప్పఁగా సభవారందఱు శ్రీరామచంద్రుని మరలఁ జూడఁగలము గదా యని కన్నులనుండి సంతోషబాష్పములు రాలఁగా శ్రీరాముని మీఁద మనస్సులు నిలిపి యెపుడెపుడు పోదమా యని యాలోచించుచుండిరి. ఆవల మఱియు భరతుఁడిట్లనెను.

మ. వినుఁడీ సభ్యులు! రామచంద్రుఁ బురికిన్ ♦ విచ్చేయఁగా వేఁడువాఁ
డను నే నేగతి నైన, నాయనయు రాఁ♦డా యార్య సౌమిత్రిమా
డ్కని ఘోరాటవిలో వసించెదేను జుం ♦ డీ, రండు నాతోడ మీ
రును, నెట్టైన రఘూత్తముండు చనుదేఁ♦రుం జేయుదుం దద్విధిన్. ౧౯౬౪

సభ్యులు=సభ్యులారా! మధ్యమ పురుష బహువచన యోగంబున నారగాగమంబు విభాషనగు- సు వ్యా- తత్సమ ౬౭ సూ. విచ్చేయఁగాన్ = విజయము+చేయు = విచ్చేయు, వచ్చునట్లుగా, ఘోరాటవిలోన్ = భయంకరమైన యరణ్యమందు, చనుదేరున్=వచ్చునో, తద్విధిన్=ఆ యేర్పాటును.

తా త్ప ర్య ము.

సభ్యులారా! వినుండు- పట్టనమునకు రమ్మని శ్రీరామచంద్రుని నేయే విధములఁ వేఁడవచ్చునో యన్ని విధముల వేఁడెదను. ఆయన రాఁడాయెనా లక్ష్మణునివలె నేనుగూడ నాయన సేవచేయుచు భయంకరమైన యడవులందే యుందును. మీరు నాతోడరండు. ఎట్లుచేసిన శ్రీరామచంద్రుఁడు వచ్చునో యట్లుచేసెదను.

ఉ. పంచితి మున్నె యెల్లపని ♦ వాండ్రను ద్రోవలు చక్కఁజేయఁగా,
నెంచితిఁ బోవఁ దూర్ణముగ ♦ నే నని చెంత సుమంత్రుఁ జూచి నీ
వంచితరీతియై మనబ♦లావళి సిద్ధపడంగ మాత్ర నా
యంచినయట్లు చేయు మన ♦ నాతఁడు నర్మిలి నట్ల సేయఁగన్. ౧౯౬౬

అర్మిలిన్ = ప్రేమతో.

తా త్ప ర్య ము

త్రోవలు చక్కఁజేయుటకై పనివాండ్రనందఱను నింతకుముందే పంపితిని- నేనును శీఘ్రముగఁ బోవఁదలంచితిని. అని సమీపముననున్న సుమంత్రుఁ జూచి మన సేనల నన్నిటిని దగినరీతి ప్రయాణమునకై సిద్ధపడఁజేయుము- అనఁగా నాయనయు నట్లు చేసెను.

శా. సేనానాయకులుఁ బురీజనములున్ ♦ శ్రీరాముఁ దోడ్తేర భూ
మీనాథాత్మభవుండు దాను జనఁగా ♦ మేకొంట విన్నంతలో
నానందంబున నింట నింటఁ దమి యో ♦ ధాఙ్గ్నలున్ భర్తలన్
వే నిండారు ప్రయత్నముల్ సలుపఁగాఁ ♦ బ్రేరించి రాయాత్రకున్. ౧౯౬౭

మేకొంటన్=అంగీకరించుట, తమిన్ = సంతోషముతో, యోధాఙ్గ్నలు= యుద్ధభటులు భార్యలు, నిండారు ప్రయత్నములు = పూర్ణప్రయత్నములు.

తా త్ప ర్య ము

సేనానాయకులతోఁ బట్టన వాసులతోఁ భరతుఁడు శ్రీరామచంద్రునిఁ బిలుచుకొని వచ్చుటకై యంగీకరించెనని వార్తవిన్నతోడనే సంతోషముతో సేనాభటుల భార్యలు పౌరుల భార్యలు నందఱు భర్తలిండ్లకు రాఁగానే యేమీ యాలస్యము పోదము పదండు ప్రయాణమునకుఁ గావలసిన యత్నములు పూర్ణముగాఁ జేయుఁడు మీరాకకై కాచియున్నాము కావలసిన పదార్థములన్ని మూటలు గట్టి సిద్ధముగా నుంచితిమని త్వరింపసాగిరి.

పురుషులు రాజాజ్ఞకు నెట్లు బద్ధులో స్త్రీలు భర్తల యాజ్ఞ కట్లు బద్ధులేయైనను రాజాజ్ఞ యగువఱకు భర్తలుపేక్షించుటచే స్త్రీలేమియుఁ జేయఁజాలక యుండిరి. ఆ ప్రతిబంధము తీఱిపోఁగానే వారి వారి పురుషులను వారు వారు త్వరింపసాగిరి. భగవత్కార్యములందు స్త్రీలట్లే చేయవలయును. పురుషులను నయప్రియములతో బలాత్కరించియైన వారిచే భగవత్కార్యములు చేయింపవలెను.

మగవారే యూరకున్నారే- లేనిపెత్తనము మనకేలలేయని యుత్తమస్త్రీ లూర కుండరాదు. స్త్రీల యందు రసోద్రేకము మెండు. ఏరసమైనను వారియందు విపరీతముగానే యుద్రేకించును. ఇచట వారి యదృష్టము కొలఁది గోపికల యందు శృంగార రసమువలెఁ గరుణ కరుణారసములు మిశ్రములై యయోధ్యాపుర స్త్రీలకుఁ బురుషులకు ముక్తి కారణములైనవి.

ఉ. కొందఱు ఘోటకంబులను ♦ గొందఱు కోడెలబండ్ల వెండియుం
గొందఱు స్యందనంబులను ♦ గొబ్బున సిద్ధపడంగఁ గైకయీ
నందనుఁడున్ సుమంత్రుఁ గని ♦ నాయరదంబును సజ్జితంబుగాఁ
బొందుగఁ జేయు మన్న విని♦పొంగుచు నాతఁ డొనర్చె నాగతిన్. ౧౯౬౮

ఘోటకంబులన్=గుఱ్ఱములను, స్యందనంబులను = రథములను, గొబ్బ నన్=త్వరగా, సజ్జితంబుగాన్=సిద్ధముగా.

తాత్పర్యము

కొందఱు గుఱ్ఱముల మీఁదను, గొందఱు కోడెలబండ్లమీఁదను గొందఱు తేర్లమీఁదను బోవుటకు సిద్ధపడఁగా భరతుఁడు సుమంత్రుఁగని నారథమును సిద్ధముచేసి తెమ్మనఁగా నతఁడును సంతోషముతో నట్లే చేసెను.

మ. భరతుం డంత సుమంత్రుఁ జూచి ధ్వజినీ♦వారంబుతో సాగుమీ
త్వరతో లోకహితార్థినై రఘుపతిన్♦వాంఛింతుఁ దోడ్తేర; నా
వరుసం దెల్పె బలప్రధాననగరీ ♦ వాస్తవ్యమిత్రాళికిన్
వరవిప్రాదికజాతు లుష్ట్రఖరస ♦ ద్వాహాదులం బోవఁగన్. ౧౯౬౯

ధ్వజనీ వారంబుతోన్ = సేనాసమూహముతో, సాగుమీ = ప్రయాణము చేయుము, లోకహితార్థినై =లోకము మేలుకోరినవాఁడనై, వాంఛింతున్ = కోరె దను, తోడ్తేరన్=పిలుచుకొని వచ్చుటకు, వరుసన్=క్రమముగా, బల = సేనకు, ప్రధాన=మంత్రులకు, నగరీవాస్తవ్య=పౌరులకు, మిత్రాళికిన్=స్నేహితులకు, వర=గొప్పవారగు, విప్రాదిక జాతులు=బ్రాహ్మణులు మొదలుగాఁగల జాతులు, ఉష్ట్ర=ఒంటెలు, ఖర=కంచరగాడిదలు, సద్వాహాదులన్ = మంచివాహనముల మీఁద.

తాత్పర్యము

అంతట భరతుఁడు సుమంత్రుఁజూచి నీవు త్వరతో సేనాసమూహముతోఁ బయనింపుము. లోకము మేలు గోరినవాఁడనై శ్రీరాముని బిలుచుకొనివచ్చు టకుఁ గోరుచున్నాను. అనఁగా నతఁడు సేవకులకుఁ బ్రధానులకుఁ బురజనులకు స్నేహితులకు బ్రాహ్మణాది జాతులకు నొంటెలమీఁద మంచి వాహనములమీఁదఁ బోవఁ జెప్పెను.

—♦ ౮౩-వ సర్గము. భరతుండు శ్రీరాముఁ దోడితేరఁ బ్రయాణమగుట. ♦—

సీ. అవల వేవినఁ గైక♦యాత్మభవుం డుత్త,
　　　మస్యందనము నెక్కి♦మంత్రిగురులు
　ముస్నుగాఁ జనఁగ న♦త్యున్నతనాగముల్, నడువ వెన్నంటుచు♦నవసహస్ర
　మాయుధీయులునొక్క♦యఱువదివేవురు నూఱువేల్ గుఱ్ఱముల్♦మీఱిరాఁగఁ
　గైక సుమిత్రయుఁ♦గౌసల్యతోడరా, యానంబులను హర్ష♦మారఁ జనియె
తే. జానకీనాథు లక్ష్మణ ♦ సహితుఁ గనఁగ
　నుత్సుకత వారికథ లెల్ల ♦ నుల్లమలర
　నొండొరులు ముచ్చటించె జ ♦ నోత్కరంబు
　లెచట నున్నాఁడొ శ్రీరాముఁ ♦ డేమొ యనుచు.　　　౧౯౭౦

వేవినన్ = ఉదయమగుకాఁగా, ఉత్తమస్యందనము = శ్రేష్ఠమైన రథము, అత్యున్నత నాగముల్=ఎత్తైన యేనుఁగులు, ఆయుధీయులు=ఆయుధములచే జీవించువారు, యానంబులను=వాహనములమీఁద, ఉత్సుకతన్=సంతోషముతో, జనోత్కరములు=జనుల సమూహములు.

తాత్పర్యము.

అవలఁ దెల్లవాఱఁగా భరతుఁడు శ్రేష్ఠమైన రథమునెక్కి ముందుగా మంత్రులు గురువులు పోఁగా వెనుకప్రక్క నెత్తైన యేనుఁగులు తొమ్మిదివేలు రాఁగా నాయుధములు ధరించినవా రఱువదివేలు నూఱువేలు గుఱ్ఱములు రాఁగా గౌసల్యయు సుమిత్రయుఁ దోడరాఁ బశ్చాత్తాపురాలైన కైక సంతోషముతో వాహనములమీఁద రాఁగా లక్ష్మణుతోడనుండు జానకీనాథుని జూడఁజనియె. ప్రజను శ్రీరామచంద్రుఁ డెక్కడనున్నాఁడో యేమిచేయుచున్నాఁడో యని సీతారామ లక్ష్మణుల కథలే యొకరికొకరు చెప్పుచుండిరి.

౧౯౩౯-వ పద్య వ్యాఖ్యానమందుఁ జెప్పినట్లు కైక కింతవఱకు మంత్రులు లోకులు చెప్పి భరతుఁడు రాజ్యముంగీకరించునని యాశయుండెను. ఆయాశ భగ్నమైనది. ప్రజలంద ఱాబాలగోపాలము శ్రీరామునందే పక్షపాతము వహించియున్నారని స్పష్టపడెను. కావునఁ దానుజేసినది దుష్టకార్యమనియు నింకను మూర్ఖత వహించిన దనను గీడేకలుగుననియుఁ దనకోరిక నెఱవేఱదనియుఁ దోఁచి సుముఖి యయ్యెను.

సీ. ఎన్నండొకో యంబు♦భృన్నిలు స్థిరసత్త్వు, నాజానుబాహు మ♦హావ్రతస్థు
　లోకసంఘాతైక♦శోకనాశనదక్షుఁ, గాంచుట యాతనిఁ ♦ గనుటమాత్ర
　చాలుఁ గా మన♦స్తాపంబు లెల్లను, విరియింపఁ జీఁకటిఁ♦దరణియట్ల
　టంచు నీరీతి భాషించుచుఁ బౌరులు, సీతేశుకథ లెల్లఁ♦జెప్పికొనుచుఁ

తే. గోమటులు రత్నకారులుఁ గుమ్మరులును,
గమ్మరులు గమసాలులుఁ గంబళకులు
గందవొడివారు ఖేల్దారఁ గములు నెమిలి,విసనకఱ్ఱలవాండ్రును బెజ్జగాండ్రు.

అంబుభృత్=నీళ్ళనుధరించిన మేఘమువంటి, నీలున్=నల్లనివానిని, జలమును ధరించిన నల్లనిమేఘమే వర్షము కురియునది. శరత్కాలమందలి తెల్లమేఘమేమి యియ్యగలఁదు? అట్టులే శ్రీరామచంద్రుఁడు కోరినవారి కోరికల వారిగ నీయఁగలఁడని భావము. దూరమునందున్నను 'ఘర్మాభితప్తః పర్జనమ్' ఎండ వేఁడిమికిఁ దపించినవాఁడు మేఘమును వలె సన్నట్లు విడువసాధ్యము కాని సౌందర్యము కలవాఁడు. మేఘశ్యామున్ = మేఘమును జూచినంత మాత్రముననే కర్షకు లెట్లుసంతోషింతురో యట్లు శ్రీరామచంద్రుని జూచినంత మాత్రముచేతనే భక్తులు సంతోషింతురనుట.

స్థిరసత్త్వన్=సత్త్వగుణమందు స్థిరుఁడైనవానిని. (౨) స్థిరవ్యవసాయుని, "ద్రవ్యాసు వ్యవసాయేషు సత్త్వమస్త్రీతు జంతుషు" అని యమరుఁడు. (౩) తనయందు స్థిరముగా నెలకొన్న సత్త్వగుణము గలవానిని, ఆజానుబాహున్=ఆయతాశ్చ సువృత్తాశ్చ యన్నట్లు మోఁకాటినంటు చేతులుగలవానిని (౨) తన సౌందర్య మనుభవింపవలెనన్నచో నట్లే కానిమ్మనునట్టి యౌదార్యముగల వానిని (౩) తన సౌందర్యానుభవమును జనులకిచ్చుటకుఁ దగిన సామర్థ్యము కలవానిని ఇట్టి యౌదార్య సామర్థ్యములు గొప్పభుజములు కలవానికేఁగదా కలుగును. మహావ్రతస్థున్=తనయాప్తులు చెప్పినను ద్రోసివేయనంతటి దృఢమైన సత్యశరణాగత రక్షణాది వ్రతముల దీక్షపట్టినవానిని, లోకసంఘాత=జనసమూహమునకు, ఏక=ఒకఁడేయగు. శోకనాశన=శోకమును నాశముచేయుటయందు, దక్షున్ = సమర్థుఁడైనవానిని, లోకుల ప్రధాన దుఃఖము జననమరణ సంసార రూపక దుఃఖమే. దానిని నాశముఁ జేయఁగలవాఁడు శ్రీరాముఁడొక్కఁడే యని భావము. ఇంతటి మహాత్ముని నెన్నఁడు చూతుమోకదా, చూచినంతమాత్రము చేతనే రాఁగలలాభమేమి యందువా ? ఆయన ముఖచంద్రునిఁ జూచితిమేని కైకేయివలన మనకు జనించిన దుఃఖాంధకారమంతయు నొక్కసారిగ సమూలము నశించును అని భావము. మనస్తాపంబులు = మనస్సులోని దుఃఖములు, పెరియింపన్ = నశింపఁజేయుటకు, అతనిఁ గనుటమాత్రము చాలును. మన మాయనను సమీపించినపు డాయన మనలఁజూచి చిఱునవ్వు ముఖముతో నుండనువలదు. మనలను గటాక్షించి యొకప్రియమైన పలుకు పలుకనువలదు, దానికై మనము ప్రయత్నింపనువలదు. మమ్ము రక్షింపుమని యాయన కాళ్ళ మీఁదఁ బడనువలదు. ఆమాట మనమననువలదు. మన మాయనను దూరము

నుండి దర్శించితిమేని మన దుఃఖములన్నియు దమంతటఁ దామే పటాపంచ లగును అని భావము. ఎట్లన- తరణి = సూర్యుఁడు చీఁకటిని విరియించినట్లు సూర్యదర్శనము కాఁగానే చీఁకట్లన్నియు నెంతదూరముననున్నను దమంతటఁ దామే మాయమైపోవునుగదా. ఇట్లు చెప్పుటచే స్వధర్మమువదలి నన్నొకనినే శరణు పొందుము, ఏడువకుమనిన కృష్ణునికంటె శ్రీరాముఁడే కరుణాళుఁడని సులభుఁడని భావము. ౧౯౩ లోని చనిరి అనుదానితో నన్వయము.

రత్నకారులు=రత్నములు సానపెట్టువారు, కమసాలులు. కంసాలులనుట తప్పు, ఆంధ్రంబున బిందుపు పరుష సరళంబులకు ముందుండునుగాని తక్కిన వర్ణములకు ముందుండదు. కంబళకులు=కంబళ్లు నేయువారు, బెజ్జగాండ్రు = రంధ్రములు వేయువారు.

తాత్పర్యము

మేఘశ్యాముఁడును, స్థిరమైన వ్యవసాయము గలవాఁడును, మోఁకాలి నంటు చేతులుగలవాఁడును, గొప్పవగు సత్యశరణాగత రక్షణములందు స్థిర ముగ నుండువాఁడును,లోకసమూహముల ముఖ్యదుఃఖమును నాశముచేయుట యం దొక్కఁడేయైనవాఁడుననగు శ్రీరామచంద్రునిఁ గాంచుట యెన్నఁడోకదా (ఇట్టి యుత్కంఠ లేక భగవద్దర్శనప్రాప్తి లేదు. ఎప్పుడెప్పుడని యేకారవలెను. ఇట్టి తహతహపాటే పరమభక్తి లక్షణము) సూర్యునిఁ జూచినఁ జీఁకటి నశించు నట్లు మన మనస్సునందలి దుఃఖములన్నియు నశించుటకు నతని దర్శనము మాత్రము చాలును అని యారీతి శ్రీరామచంద్రమూర్తి కథలు చెప్పుచుఁ గోమ టులు, రత్నములు సానపెట్టువారు, కుమ్మరులు, కమ్మరులు, కమసాలులు, కంబళ్ళునేయువారు, గందపొడి చేయువారు, బేల్దారులు, నెమలియీకలతో విసన కఱ్ఱలు కట్టువారు, బెజ్జములు వేయువారు.

తే. సాలెలును బింపగాండ్రును•జాకులుఁ దల,
యంటువాండ్రును నొడల్ పట్టు•నట్టివారుఁ
గుత్రపుంబనివారును•గొల్లవారు, వెజ్జు లీడిగవాండ్రును•బెస్తవాండ్రు.

సాలెలును=వస్త్రములు నేయువారు, చేలలు నేయువారు సాలెలు, చాకులు = చాకలవాండ్రు, ఒడల్=దేహము, వెజ్జులు=వైద్యులు.

తాత్పర్యము

సాలెవాండ్రు, బింపగాండ్రు, చాకలవాండ్రు, తలంటువాండ్రు, నొప్పులు వోవ దేహము పిసుకు జెట్టులు, గుడ్డలు కుట్టువారు, గొల్లవారు, వైద్యులు, కల్లు గీయు నీడిగవాండ్రు, బెస్తవాండ్రు.

కం. చేడెలతో నట్టువులును, బాడబులును వారివారి • వాహనములపై
వేడుక శుద్ధాంబరము,తోడ విలేపనము లాది•తోఁ జనిరంతన్. ౧౯౩

తాత్పర్యము

తమ స్త్రీలతోడ నట్టువవాండ్రు, బ్రాహ్మణులు, వారి వారి వాహనముల మీఁద సంతోషముతోఁ బెద్దల యొద్దకుఁ బెరువాళ్ళ యొద్దకు మాసినగుడ్డలు

కట్టుకొని మలినదేహములతోఁ బోరాదు కావునఁ బరిశుద్ధ వస్త్రములు కట్టుకొని గంధపుఁబూఁతతోడఁ బోయిరి.

పై మూఁడు పద్యములు ౧౯౪౪-౧౯౪౫ వఱకుఁగల పద్యము లానాఁ డెట్టెట్టి పనివాండ్రుండిరో వారి నాగరకత యెట్టిదో తెలుపుచున్నవి. అబాలగోపాలము శ్రీరామచంద్రునందుఁ బ్రజలకుఁగల భక్తియుఁ దెలుపుచున్నవి.

చం. చని చని కొంతదూర మిటు ♦ సాశ్వసనాగసయానపాళు లై
జనములు రామమిత్రగుహ ♦ సంపరిపాలితశృంగిబేరముం
గనుఁగొనె జాహ్నవీతటిని ♦ గౌతుక మారఁగ రమ్యదేశమం
దును విడిసెం జమూతతియుఁ♦దూర్ణమ యచ్చట నిల్వఁ బ్రీతిమై. ౧౯౫౪

సాశ్వ = గుఱ్ఱములతోడివారు, సనాగ = ఏనుఁగులతోడివారు, సయానపాళులు=వాహన సమూహములతోఁ గూడినవారునై, రామమిత్ర = రామునకు స్నేహితుఁడైన, గుహ=గుహునిచే, సంపరిపాలిత = మిక్కిలి చక్కఁగా రక్షింపఁబడుచున్న, పాలితముగాక, పరిపాలితముగాక. రామమిత్ర సంపరిపాలిత మనుటచే, శ్రీరాముని మీఁదికి నాయన విరోధులెవ్వరైన నెప్పుడైన నొంటరిగానో సేనతోనో వచ్చెదరేమో యని మిగుల జాగ్రత్తతో గుహుఁడు సన్నాహపడియున్నాఁడని తెలియవలయును, తన్నుఁగలసిన వానిని రక్షించువాఁడుగదా మిత్రుఁడు. జాహ్నవీతటిని=గంగాతీరమందు, కౌతుకము=సంతోషము, రమ్యదేశమందు=మనోహర ప్రదేశమందు, చమూతతియున్=సేనాసమూహము, విడిసెన్=దిగెను.

తాత్పర్యము

జనులందఱు వారి వారి గుఱ్ఱములు నేనుఁగులు ఇతర వాహనములు గలవారై కొంతదూరము పోయి పోయి శ్రీరామచంద్రుని మిత్రుఁడగు గుహుఁడు చక్కఁగా హెచ్చరికతోఁ బాలించు శృంగిబేర పురమును జూచిరి. ఇప్పుడు దీని సంగ్రూర్ అందురు. సేనయు గంగాతీరమందు రమ్యమైనప్రదేశమందు దిగెను.

మ. భరతుం డంతట వారిఁ గాంచి తరియిం ♦ పన్ వచ్చు రే పిన్నదిన్
వరగంగోదకపాళిఁ దండ్రికి నివా ♦ పంబే నిటం గూర్చెదన్
సరగన్ మీరలు స్వోచితస్థలములన్ ♦ సంప్రీతినిల్వుండు నా
నరుసం బారఁగ వారు నిల్చిరి యథా♦ర్హస్థానసంస్థాయులై. ౧౯౫౬

తరియింపన్ వచ్చున్=దాఁటవచ్చును, వరగంగోదకపాళిన్=దివ్యములైన గంగా జలముచే, నివాపము = తర్పణము, పుణ్యతీర్థములకుఁ బుణ్యక్షేత్రములకుఁబోయినపుడు తీర్థోపవాసము క్షేత్రోపవాసముచేసి తర్పణము చేయవలయును గావున నట్లు చేయఁదలఁచినవాఁడై, స్వోచితస్థలములన్=వర్ణాశ్రమాచార ప్రకారము వారికిఁ వారికిఁ దగిన స్థలములందు, అరుసము=హర్షము, యథార్హ=యోగ్యతకుఁదగిన, స్థాన=ప్రదేశములందు, సంస్థాయులై=ఉన్నవారై.

తాత్పర్యము

భరతుఁడు వారినందఱనుజూచి యీ నదిని రేపు దాఁటవచ్చును. నేను గంగాజలములచేఁ దండ్రికిఁ దర్పణముచేయవలసియున్నది. మీరును వెంటనే మీకు మీకుఁ దగిన స్థలములందు నిలువుండని చెప్పఁగా వారును వారి వారి వర్ణాశ్రమాచార పద్ధతి ననుసరించి వారికి వారికి బాగని తోఁచిన చోటులనుండిన వారైరి.

—♦ ౮౪-వ సర్గము. గుహుఁడు భరతురాకఁ గని సందేహించుట. ♦—

ఉ. అంత నిషాదనేత గుహుఁ♦డాధ్వజినీచయ మెల్లఁ గాంచి యే
కాంతరయంబునం దనహి♦తాళుల నెల్లరఁ జూచి కంటిరే
యంతయు గానరాదు మతి♦నైన గణింపఁగ నట్టిసేన యీ
పొంతలఁ జేరె సాగరము♦పోలికిఁ జూడ్కికి బ్రేఁగు గొల్పెడిన్. ౧౯౭౬

నిషాదనేత = బోయిరాజు, ధ్వజనీచయములు = సేనా సమూహములు, ఏకాంతరయంబునన్=మిగుల వేగముతో, పొంతలన్=సమీపమందు, సాగరము పోలికన్=సముద్రమువలె, బ్రేఁగు=భారము.

తాత్పర్యము

భరతుఁడిట్లు సేనలతో వచ్చుచుండ బోయరాజగు గుహుఁడా సేనాసమూహమునుజూచి మిక్కిలి వేగముతోఁ దన స్నేహితులనందఱఁజూచి చూచితిరికదా యీ సేనకుఁదుద తెలియరాలేదు. ఇంతయని మనసుచేనైన లెక్కింప రాక యున్నది. ఇంతటి సేన మన ప్రాంతమునకుఁ జేరవచ్చుచున్నది. చూచుటకు సముద్రమువలె భారము తోఁచుచున్నది.

తే. ఖలుఁడు దుర్బుద్ధి భరతుండు♦బలము లెల్లఁ,
గొలువ వచ్చె నిజం బదె♦కోవిదార
కేతనమ్ము రథమ్మున♦రీతి మెఱసె పీనిబాటలు చూడంగ♦వెఱుదోఁచె. ౧౯౭౭

ఖలుఁడు=దుష్టుఁడు, దుర్బుద్ధి=చెడ్డబుద్ధిగలవాఁడు, భరతుఁడని నీకెట్లు తెలిసెనందురా, కోవిదార కేతనము = కాంచనపు ధ్వజము, శూరులు వారి వారి గుణములను దెలుపు ధ్వజములను వారు వారు ధరింతురు. తమ పరాక్రమమును దెలుపుటకు సింహమును, బలమును దెలుపుటకు నేనుఁగును, రోషము తెలుపుటకుఁ బామును, ధ్వజపటలములందు వ్రాయింతురు. ఇక్ష్వాకులు వంశ పరంపరగాఁ గోవిదార ధ్వజమునే ధరింతురు. భరతుఁడు ఖలుఁడు దుర్బుద్ధి యనుటచే నతఁడు శ్రీరామచంద్రుని మీఁదికి యుద్ధమునకై సేనతోఁ బోవుచున్నాఁడని గుహుఁ డభిప్రాయపడినట్లు సూచితము.

తాత్పర్యము

దురాలోచనగల దుష్టుఁడు భరతుఁడు సేనల నన్నిటిని దీసికొని వచ్చిన వాఁడు కోవిదారధ్వజమే వాఁడు భరతుఁడని తెలుపుచున్నది. ఈధ్వజము ధరింపఁ గలవాఁడు దశరథుఁడా చచ్చెను. శ్రీరామచంద్రుఁడా యరణ్యమందుండెను.

ఇఁక భరతుఁడుగాక వీఁడు వేఱొకరుఁ డెట్లగును, వీని మార్గము సౌమ్యముగాఁ గానరాలేదు. విరుద్ధముగాఁ గానవచ్చుచున్నది. అన్న మీఁద భక్తితోఁబోవు చున్నాఁడేమో యందురా ఇంతసేన యేల ?

ఉ. కట్టునొ చంపునో మనలఁ • గైకతనూజుఁడు తండ్రిచేత దా
నెట్టఁగఁ జేసి రామవిభు • నిర్జనభూమిఁ దదీయసంపదన్
నెట్టన క్రూరుఁడై కొనియు • నేఁ డిదె కంటిరె సేనతోడ లోఁ
బుట్టినకింక రాముఁ బొరి•పుచ్చఁగఁ బోయెడు నొండెఁ జూడఁగన్. ౧౯౭౮

నిర్జనభూమిన్=జనములు లేని ప్రదేశమునందుండ, కింకన్=కోపముచే, పొరిఁ బుచ్చఁగన్=చంపఁగ.

తాత్పర్యము

మనము శ్రీరామచంద్రుని మిత్రులమగుటచే భరతుఁడు మనలను గట్టునో చంపునో తెలియదు. వీఁడు ఖలుఁడు దుర్బుద్ధి యని నీకెట్లు తెలియునందురా శ్రీరామచంద్రుని నడవులంబడ బలాత్కారముగఁద్రోచి యాయన సంపత్తు నంతయు హరించియు నంతతో సంతోషింపక క్రూరుఁడై యాయనఁ జంపుటకై సకల సేనలతోఁ గోపోద్రేకము గలవాఁడై పోవుచున్నాఁడు. అటుగాక యూరక చూడఁబోవు వానికి సేనయేల? కావున వీని యుద్దేశము వేఱుగానున్నది. అది సౌమ్యముగాదు.

ఉ. రాముఁడు నాదుభర్త రఘు•రాముఁడు నాచెలి గాన నెట్టులే
నోమెద రామచంద్రుని, ర•యోద్ధతి మీరలు గాంగతీరమున్
ధీమస మారఁ గాపుఁడు వి•నిద్రత సేనలతోడ నావలం
దామిషమూలపక్వసుఫ•లాదుల నింపుఁడు పెంపు మీఱఁగన్. ౧౯౭౯

ఓమెదన్=రక్షించెదను, రయోద్ధతిన్=వేగాతిశయముచే, గంగతీరమున్=గంగాసంబంధమైన గట్టును, ధీమసమారన్=నిండుధైర్యముతో, వినిద్రత=హెచ్చరికతో, ఆమిష=మాంసము, మూల=వేళ్లు, పక్వ=పండిన, సుఫలాదులన్=మంచి పండ్లను.

తాత్పర్యము

ఇప్పుడు మనముచేయవలసిన దేమనెదరా. భరతుఁడు గంగదాఁటిపోకుండఁ జేయుట మన పని. శ్రీరామచంద్రుఁడు నాభర్త- శ్రీరామచంద్రుఁడు నా మిత్రుఁడు గావున నాయనను నే నెట్టులైన భరతుని బారిఁ బడకుండ రక్షించెదను, కాఁబట్టి మీరతిశీఘ్రముగాఁబోయి వీరు గంగయొద్దకు రాకుండ హెచ్చరికతో ధీరులై కాపాడవలయును. దానికై మీరు మనకుఁగల యోడల నన్నిటిని సిద్ధముచేసి వానియందు మోచినంత మాంసము వేళ్లు పండ్లు నింపుఁడు. ఎన్ని దినములు యుద్ధముచేయవలసివచ్చునో యేమో శ్రీరామచంద్రమూర్తి నిన్నుఁ

గోరలేదుగదా. నీవేల బల వద్విరోధమునకై కాలు ద్రవ్వెదవందురా? అట్లనుట ధర్మముగాదు. కోరినను గోరకున్నను భర్తనుగాచుట భృత్యుని కార్యము అట్టులే మిత్రసంరక్షణము కావున నా కార్యము నేను జేయకుండుట వలనఁ గృత్యాకరణ దోషము అకృత్య కరణ దోషము రెండును లభించును. నా భృత్య మిత్ర కార్యము నేను నిర్వహించుటయందు నెదుటివాని బలా బలములు నేను విచారింపవలసిన పనిలేదు. తన స్వామికై తన సర్వస్వముగోలు పోవుట శ్లాఘ్యమే కాని నింద్యముగాదు.

కం. నావల నేనూటిని గొని, నావకు నావకును నూ ఱ◆నంతబలాఢ్యుల్
కైవర్తకు లుండుఁడు నది, రేవుల నన్నిటను మీ ర◆రీణశ్రద్ధన్. ౧౯౮౦

అరీణ శ్రద్ధన్=చక్కని శ్రద్ధతో, కైవర్తకులు=బెస్తలు.

తా త్ప ర్య ము

ఐదునూర్ల నావలను సిద్ధముచేయుఁడు. ఒక్కొక్క నావలో నూఱుగురు మంచి బలవంతులు బెస్తలుండుఁడు. ఈ ప్రకారమన్ని రేవులయందును జక్కని శ్రద్ధతో నుండుఁడు.

కం. రామునెడఁ బ్రీతుఁ డేనియు, సేమంబున దాఁటుఁగాక ◆చిటముట పడినన్
భూమీశనందనుఁడు దా,నేమాడ్కిం జనునొ చూప◆నే యొకచేయిన్.

తా త్ప ర్య ము [౧౯౮౧

శ్రీరామునియెడ భరతుఁడు ప్రీతిగల వాఁడాయెనా సుఖముగా గంగ దాఁటింతము. అటుగాక కోపించినవాఁడాయెనా గంగయెట్లు దాఁటునో చూతము గాక. నా చేతనైనంత నేను జేయకవిడుతునా. ఇందఱను గంగపాలు చేయనా?

—◆ గుహుఁడు భరతునిఁ జూడ వచ్చుట ◆—

చం. అని మధుమాంసభక్ష్యము లు◆పాయనముం గొని వేగ వచ్చువీ
రుని గుహుఁ గాంచి సూతుఁడు ని◆రూఢజవంబున నేగి కైకయీ
తనయునిఁ గాంచి రాఘవహి◆త ప్రవరుండు గుహుఁడు వచ్చె నీ
యనకు సువేద్యముల్ సకల◆మైనపథంబులు దండకాటవిన్. ౧౯౮౨

మధుమాంస భక్ష్యములు=తేనెమాంసము మొదలగు తినుపదార్థములు, ఉపాయనము=కానుక, నిరూఢ జవంబునన్=అతివేగమున, రాఘవహిత ప్రవరుండు=శ్రీరాముని ముఖ్యస్నేహితుఁడు, సువేద్యముల్=చక్కఁగా దెలిసినవి. పథంబులు=మార్గములు ఉపాయనముంగొనివచ్చి యనుటచే గొప్పవారియొద్దకుఁ బోవునపుడు రిక్తహస్తములఁ బోరాదని సూచన.

శ్లో॥ ధర్మమర్థంచ కామంచ త్రితయం యోఽభికాంక్షతి
రిక్తపాణిర్న పశ్యేత, రాజానం దైవతం గురుమ్.

ధర్మార్థ కామములం గోరువాండు రాజును దేవుని గురువును జూడంబోయి నపుడుత్త చేతులంబోరాదు. గర్భిణీ స్త్రీలను బసిబాలురను జూడంబోయినపుడును రిక్త హస్తములం బోరాదు.

తాత్పర్యము

ఈ ప్రకారము తన స్నేహితుల కందఱకుంజెప్పి తాను భరతుని మనస్సు దెలియంగోరి తేనె మాంసము పిండివంటలులోనైనవి గానుకలు తీసికొని భరతు నొద్దకు వచ్చుచుండంగా సుమంత్రుండు చూచి యతిశీఘ్రముగాంబోయి శ్రీరామ చంద్రుని ముఖ్యస్నేహితుండు గుహుండు వచ్చుచున్నాండు. ఈయనకు దండకా రణ్యములోని సకల మార్గములు చక్కంగా దెలియును.

చం. దరిసెన మిమ్మవశ్యముగ•దాశరథీ మన రామలక్ష్మణుల్
ధరణిజయుం జరించెడిత•లంబు నెఱుంగు నిజంబు నాంగ నా
భరతుండు తోడి తెమ్మనుడు • బంధుజనాన్వితు బోయనాయంకున్
బరువడిం దోడితేర నృప•వర్యుండు సత్కృతిం దన్ప నాతండున్. ౧౬౮౩

దరిసెనము=దర్శనము, తలంబు=స్థలము- నాంగన్=అనంగా, బంధు జనాన్వితున్=చుట్టములతోంగూడిన వానిని, పరువడిన్=క్రమముగా. నౌకరి వెంట నౌకరిని, సత్కృతిన్=సత్కారము, గౌరవము.

తాత్పర్యము.

భరతా! యీ గుహునకు నీవు తప్పకదర్శనమిమ్ము. మన సీతారామ లక్ష్మణులుండుచోటు వాస్తవముగ నీతం డెఱుంగును. సరియైన స్థలము దోవ తెలియక యెక్కడకని యే మార్గముననని మనము వెదకుచుం బోవుదము అని చెప్పంగా భరతుండు పిలుచుకొని రమ్మనెను. సుమంత్రుండునుబోయి చుట్టముల తోడ గుహుని వరుసగాం బిలుచుకొనివచ్చి వారి నందఱం దెలుపంగా వారి నందఱను భరతుండు గౌరవించెను.

మ. రమణీయం బగుదేశ మియ్యది వరా•రామంబునా నొప్పెడిన్
సుముదం బారంగ నిందు నిల్వం దగదే• చూడంగ మీయిల్లె కా
కమలాక్షా! మము మోసగింపం దగునా•కారా దొకో యుష్మదా
గమవార్తన్ మునుమున్నపంప,నిట వేం•డ్కన్నిల్వం బ్రార్థించెదన్. ౧౬౮౪

ఇయ్యది = నేనుండెడి యీ యరణ్య ప్రదేశము, ఆరామము = తోంట, సముదంబు=మిక్కిలి సంతోషము, ఆరంగన్=అభివృద్ధికాంగా, యుష్మదాగమ వార్తన్=నీవు వచ్చు సమాచారమును.

తా త్ప ర్య ము.

అంతట గుహుఁడిట్లనియె. రాజకుమారా! కమలములవంటి కన్నులుగల వాఁడా, నేనుండు నీ యరణ్య ప్రదేశము మనోహరమై తోఁటవలెనుండునుగాని భయంకరమైన యడవిగానుండదు. కావున నిందు నిలువుము. ఇదియును మీ యిల్లే కదా. ముందు మీరు వచ్చువార్త చెప్పి పంపరాదా? చెప్పకుండఁ దటాలున వచ్చిమమ్ము మోసగింపవలెనా. నీ విచ్చటనే నిల్వఁ బ్రార్థించెదను.

అంతగుంపు ముందువచ్చి బాటలు వేయఁగా గుహునికిఁ దెలియక కాదీ మాట చెప్పుట- కావలసిన పదార్థములు సిద్ధము చేయుమని ప్రత్యేక దూతలఁ బంపలేదని భావము.

కం. కలవు ఫలమూలములు కొల్లలుగా వివిధంబు లగుపలలములు నిషాదుల్
వలనుగ శుష్కార్ద్రంబులు, పలసినయంతయును దేరవలఁతు లధీశా.

పలములు=మాంసములు, శుష్కార్ద్రంబులు=ఎండినవి   [౧౮-౮౫
పచ్చివి, వలఁతులు=సమర్థులు, అధీశా=ప్రభూ.

తా త్ప ర్య ము

రాజా! యిచ్చటఁ బండ్లు వేళ్లు కొల్లలుగానున్నవి. అనేక విధములయిన మాంసములు గలవు. ఈ మాబోయ లెండినవి కాని పచ్చివికాని కావలయునంత తెచ్చుటకు సమర్థులు.

కం. కావున నీ సేనలతో, నీవును నేఁ డింద యుండి నిశ గడపి యిటన్
వేవినఁ జనంగ నగు ధా, త్రీవర నా ప్రార్థనంబు దీర్పు మటన్నన్. ౧౯-౮౬

తా త్ప ర్య ము

కాఁబట్టి నీ సేనలతో నీవును నేఁడంతయు నిందే యుండి రాత్రియిందే గడపి యుదయమైన పిమ్మటఁ బోవవచ్చును. నా ప్రార్థనము సఫలము చేయుము అని ప్రార్థింపఁగా.

-- ౮౫-వ సర్గము గుహుఁడు భరతునుద్దేశంబు సందేహించి యడుగుట --

సీ. భరతుండు సంప్రీతి బల్కు మద్గురుసఖా! యింతసేన నొకండు వెలమిగార
వింప నెంచితివి సే విపిధకామంబులు, నిత్య మభ్యుదయమై నెగడుఁ గాక
యన్నరసము కంటె నాదరణరసంబు, నీ పల్కుల మెచ్చు వచ్చె
గంగ దాఁటఁగరాదు గహన మీదేశంబు, మాకు భరద్వాజ మౌనియాశ్ర
ఆ. మంబు దెరువుదెల్పు మా యన గుహుఁడనుఁ, బ్రకట శౌర్యుఁడైన రామభద్రు
నందు దుష్టబుద్ధిఁ జెంద వేనియు దాశ,
వీరవరులఁ బుత్తు వెంట వత్తు. ౧-౬

మద్గురు సఖా=నాగురువగు శ్రీరామచంద్రునకు స్నేహితుఁడా, అనుటచే నీవును నాకు గురువు వంటివాఁడవే యని యన్నయందుఁ దనకు సదభిప్రాయము సూచించెనని భావము. గురువు = అన్న, ఎలమిన్=సంతోషముతో, అభ్యుదయమై = అభివృద్ధిచెంది, గహనము = చొరరానిది, దాశవీరవరులన్=వీరులగు బోయలందు శ్రేష్ఠులను, పుత్తున్=పంపుదును.

తాత్పర్యము

గుహుఁడు చెప్పిన మాటలు విని భరతుఁడు సంతోషముతో నిట్లనియె:— మాయన్నగారికి నీవు స్నేహితుఁడ వవుటచే నీవు నాకు నన్నవంటి పూజ్యుఁడవే ఇంత సేనను నీవొకఁడవే గౌరవింప నెంచితివి. నీ పలువిధములయిన కోరికలన్నియు సఫలములై యభివృద్ధి గాంచునుగాక. అన్నరసమునకంటె నాదరణరసము శ్రేష్ఠమని సామెత కలదు గదా కావున నీ మాటలకు మెచ్చుకొంటిమి. గంగ దాఁట మాకు సాధ్యపడదు. అడవియో చొరరానిది. కావున భరద్వాజమౌని యుండు నాశ్రమమునకుఁబోవుమార్గము తెలుపఁగోరెదననిన గుహుఁడును ప్రసిద్ధ శౌర్యుఁడైన శ్రీరామభద్రునందు నీకు దురభిప్రాయము లేదేని నీ వెంట బెస్త వాండ్రలోఁ బ్రముఖులుగానుండు వారిని బంపెదను. నేను వచ్చెదను. ప్రసిద్ధ శౌర్యుఁడనుటచే నీ వింతసేనతోఁ బోయినను నీ వలన నాయన కేభయము లేదని భావము.

ఉ. కారణ మేమి యిట్లు బలఁగంబులతోఁ జన రాముమీఁదికిన్ ?
దోరపు సందియంబు మదిఁదోఁచె, ననన్ మినువోలె నిర్మలుం
డౌరమణుండు పల్కె సఖా నను నీవు వచించినట్టియా
క్రూరపుఁగాల మెన్నఁటికిఁగూడకయుండెడుఁ గాక మిత్రమా. ౧౯౮౮

బలఁగంబులతోన్=సేనలతో, తోరపు సందియంబు=గొప్ప సందేహము, మినువోలెన్=ఆకాశమువలె, క్రూరపుఁగాలము=నిర్దయమైన కాలము.

తాత్పర్యము

ఇంతసేనతో శ్రీరామచంద్రుని మీఁదికిఁ బోవఁగారణమేమి? మంచి యభిప్రాయముతోఁ బోయెదనందువా? ఈ సేనయేల? కావున నామదిలో గొప్పసందేహముదయించెను. అని చెప్పఁగా నన్ని పదార్థముల సంపర్కము గలిగియు వాని దోష మంటని యాకాశమువలె నిర్మలుఁడైన భరతుండిట్లు చెప్పెను. అయ్యో మిత్రుఁడా! నీవు సందేహించిన పాపపుఁగాల మేనాఁటికిని రాకయుండునుగాక.

అది కలికాల పురుషుల ప్రవర్తనముకదా, ఇప్పుడెట్లువచ్చును.

ద్వి. కడు సూక్ష్మమగుచు నాకాశంబదెల్ల, యెడలనుండియు దేనినెట్లంటకుండు।
నట్టులు సర్వదేహంబు లందున్న, యట్టియాత్మయు దేనినంటకయుండు॥
భ.గీ. ౧౩-౩౨

ఆకాశమువలె నిర్మలుఁడనుటచే నెవరైన నాకాశమును మురికి చేయవలయునని యత్నించిన వారి చేతులు మురికియగునుగాని యాకాశము మురికిగాదు. అద్దమును మురికిచేయవలయునని బూడిదపూసి రుద్దిన వాని చేతులు మురికి యగునుగాని యద్దమునకుఁ బ్రకాశ మెచ్చును.

మ. అనుమానింపకు మయ్య నాయెడల మా•యన్నన్ రఘూత్తంసునిన్
  జనకాభున్ రఘురాముఁ దోడుకొని రా•సన్నాహినై పోయెదన్
  జనునే నీమది వేఱుగాఁ దలఁప? నే•సత్యంబ యంటిం జుమీ
  యనుడున్ నిర్భరసం ప్రమోదభరితుం•డై బోయఱేఁ డిట్లనున్. ౧౯౮౯

జనకాభున్=తండ్రితోసమానుని, సన్నాహినై పోవుచున్నాను. శ్రీరామచంద్రునకుఁ బట్టాభిషేకము చేయుటకొఱకు సేనలను బిలుచుకొని పోవుచున్నానుగాని యుద్ధమునకుఁగాదు. నిర్భర=అతిశయమై భరింపరాని, ప్రమోద=సంతోషముచే, భరితుండై=నిండినవాఁడై, ఱేఁడు=రాజు.

తాత్పర్యము

నాయెడల సందేహింపవలదు. నాతండ్రితో సమానుఁడైన మాయన్నయగు శ్రీరామచంద్రునిఁ బిలుచుకొని వచ్చుటకై సేనలతో సర్వప్రయత్నములతోఁ బోవుచున్నాను. నీ మనస్సున వేఱుగా దలంపుకు- నేను సత్యమును జెప్పుచున్నాను. అని చెప్పఁగా గుహుఁడు మిక్కిలి సంతోషించి యిట్లనెను.

ఉ. ధన్యుఁడ వీవ యోభరత•ధారిణిలోఁ గన రారు నిన్నుఁ బోల్
  మాన్యు లయత్న లబ్ధ మగు•ష్మాతలమెల్లఁ బరిత్యజింప సౌ
  జన్యము పేర్మిఁ జూచెదు య•శంబు ధ్రువంబు జగంబునందుఁ బ
  ర్జన్యనిభున్ రఘూత్తమునిఁ•గ్రమ్మఱుపం దమి గొంటి గావునన్. ౧౯౯౦

తాత్పర్యము

భరతా! మేలు మేలు నీజన్మము సార్థకము. నీవంటి పూజ్యులు లోకమందు లేరు. లోకములో రాజులుకొందఱు తండ్రులను నన్నలను జంపియైన రాజ్యమపహరింపఁ గోరు చుండఁగా నిప్రయత్నము లేకయే లభించిన రాజ్యమంతయుఁ గేవలము మంచివాఁడవగుట చేతనే వదలుకొనఁ జూచుచున్నావు. చేతికి వచ్చిన దివ్యఫలము నోరఁ బెట్టుకొనక యెవఁడు మఱియొకనికిచ్చును. ఇంద్రునితో సమానుఁడైన శ్రీరామచంద్రునిఁ మరలఁ బిలుచుకొని వచ్చుటకు నాశపడితివి. కావున నీ కీర్తిలోకమున శాశ్వతమై యుండును.

మ. అని సల్లాపము లాడు చుండ రవి డా•యం బోయె నస్తాద్రి, యా
  మినియున్ వర్ధిలె, సేన దీర్చ గుహుఁడున్•మిత్రాన్వయుం డర్థిఁ ద
  మ్మునితోఁ గ్రమ్మఱఁ బోయె శయ్యకు గుణాం•భోరాశి యాగర్భభా
  గ్యనివేశుం డగుధర్మమూర్తి హిగిలెం•గాకుత్థ్సచింతావ్యథన్, ౧౯౯౧

సల్లాపములు=మంచిమాటలు=అస్తాద్రి=ప్రొద్దుగ్రుంకుకొండ, యామిని=రాత్రి, మిత్రాన్వయుండు = సూర్యవంశమునఁ బుట్టినవాఁడు, అర్థిన్=కోరికతో, క్రమ్మఱఁబోయె శయ్యకనుటచే గుహుఁడు వచ్చునప్పటికి భరతుఁడు పండుకొనఁ బోవుచుండెనని ద్యోతకము. ఈ కారణము చేతనే సుమంత్రుఁడిది సమయము కాదని చెప్పక దర్శన మిమ్మని భరతునకుఁ జెప్పెను- గుణాంభోరాశి=ధైర్యాది సద్గుణములను ముత్యములకు సముద్రము వంటివాఁడు,ఆగర్భభాగ్యనివేశుండు=తల్లిగర్భములోనున్నది మొదలు ఐశ్వర్యమునకు స్థానమైనవాఁడు,ధర్మమూర్తి=ఇట్టిపాపమునకుఁ గారణమైన పాపమేదియు లేనివాఁడు,కాకుత్స్థవ్యథా చింతన్=శ్రీరాముని విషయమైన చింతయనెడు బాధచే, పొగిలెన్=దుఃఖించెను.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము ముచ్చటలాడుచుండఁగా సూర్యుఁడు పడమటి కొండకుఁ బోయెను. రాత్రి వృద్ధిపొందెను. మరలఁ దమ్మునితోడఁ బండుకొనఁబోయెను. పోయి పండుకొనెనే కాని నిద్రపోయినవాఁడు కాఁడు. ధైర్యాది సద్గుణములనెడి రత్నములకు సముద్రుని వంటి వాఁడును ఆగర్భ శ్రీమంతుఁడును ధర్మమూర్తియయ్యు శ్రీరామచింతవలనఁ గలిగిన బాధచే దుఃఖించుచుండెను.

కం. వనవహ్నితప్తవృక్షం,బును గోటరవహ్ని లోనఁ•బొగిలి పొగిలి కా
ల్చిన విధమున సంతాపం, బనఘాత్మకుహృదయ మంత•కంతకు నేర్చెన్.

వనవహ్నితప్త వృక్షంబును=కాఱుచిచ్చుచే వెలుపలఁ దపింపఁ జేయఁబడిన చెట్టును, కోటరవహ్ని=చెట్లబొరియలోనుండునగ్ని, లోనన్=లోపల, పొగిలి పొగిలి=కుమిలి కుమిలి, అనఘాత్ముని హృదయము పాపములేని భరతుని హృదయము, ఏర్చెన్=కాల్చెను.

తా త్ప ర్య ము.

కాఱు చిచ్చు సెగచే వెలుపల దహింపఁబడు చెట్టును ఆచెట్టు తొఱ్ఱలో నుండు నగ్ని కుమిలి కుమిలి లోలోపలనే కాల్చు విధాన సంతాప మాపుణాత్ము హృదయము నంతకంతకుఁ గాల్చెను. ఆ సంతాపముచే దేహముకూడ మండు నట్లుండెను.

కం. రవికిరణతప్తహిమగిరి, యవిరళముగ మంచుఁ గార్చు•నట్టివిధమునన్
ప్రవితతశోకానలసం,భవమగు చెమ్మటలు గార్చె•భరతుఁడు మేనన్. ౧౬౬౩

రవికిరణతప్త=సూర్యకిరణములచేఁ దాపమునొందునట్లు చేయఁబడిన,హిమగిరి=మంచుఁగొండ, మంచున్=మంచునీళ్ళను, ప్రవితతశోకానల సంభవము=విస్తారమైన శోకాగ్నిచేఁబుట్టిన,చెమ్మటలు=చెమటనీళ్ళను,మేనన్=శరీరమునందు,

తాత్పర్యము.

సూర్యకిరణముల వేఁడిమికి హిమవత్పర్వతము విస్తారముగ మంచు నీళ్ళు కార్చునట్లు విస్తార శోకమనెడి యగ్నివలనఁ బుట్టిన చెమటలను భరతుఁడు దేహమునఁ గార్చెను.

సీ. ధ్యాననిర్దరశిలా♦తతులవినిశ్వాస,ధాతువులను దైన్య♦తరుచయముల
దుఃఖసారంగసం♦దోహములను బ్రమో,హానంతమృగముల♦నసహనీయ
సంతాపకీచకౌ♦షధుల సమాక్రాంత,మగుశోకగిరితల♦మందుఁ బడిన
భరతుండు దీర్ఘని♦శ్వాసముల్ పుచ్చుచు, దుర్మనుం డై దిక్కు♦దోఁపకేడ్చు
ఆ. చుండె శమము లేక యొల్లఁబోవుచు భ్రష్ట, యూథ మైనవృషభ♦మో యనంగ
గుహుఁడు నతనిఁ జూచి♦కుతలపాటున నూఱ,
డించుచుండె రాము♦నెంచుకొనుచు. ౧౬౬౪

ధ్యాన=శ్రీరామునిఁ గూర్చిన ధ్యానమనెడి, నిర్దర=పగుళ్లులేని గొప్ప పైన, శిలాతతులన్=ఱాలసమూహముచే పర్వతమున రాలెక్కువగా నున్నట్లు భరతుని చింతయందు శ్రీరామధ్యాన మెక్కువ-కాన ధ్యానము శిలాతతులుగా రూపింపఁ బడినది. ధ్యాయతీవబకః, ధ్యాయతీవ పృథివీ ధ్యాయంతీవ పర్వతా యన్నట్లు పర్వతమువలె కదలక మెదలక తదేక ధ్యాన నిష్ఠుఁడై యుండెనని భావము.

తైలధారావత్ సంతతః అవిచ్ఛిన్న ప్రత్యయో ధ్యానం ॥
శంకర భాష్యము.భ.గీ. ౧౩-౨౪

వినిశ్వాస=పలువిధములగు నిట్టూర్పులనెడి ధాతువులను=గైరికాదిధాతువులచేతను, కొండలో ధాతువులు (Ores) పెక్కువిధములున్నట్లు లీతని నిట్టూర్పులును పెక్కువిధములని దీనినిబట్టి రూపణము. దైన్యతరుచయములన్=అయాయింద్రియ మాయాకార్యము చేయక యుండుట యనెడి తరుచయములన్=వృక్షపంక్తులచేత, దైన్యమునను దరువులను నజ్ఞానముండునుగాన రూపణము-దుఃఖసారంగ సందోహములను=దుఃఖమనెడి వేళ్ళగుంపులచేతను,మృగములు=పులులు తోడేళ్ళులోనగు క్రూరమృగములు ఇవియును బ్రమోహములును బ్రాణాంతకములుగాన నీ రూపణము యుక్తము-అసహనీయ=ఓర్వరాని సంతాప=మిక్కిలి తాపములనెడి,కీచక=వెదుళ్ళచేతను,గాలిలోపలదూఱి వెలువడునప్పుడు ధ్వనిపుట్టు వెదుళ్ళు కీచకములనఁబడును, ఓషధులను=మందుతీఁగెలచేతను, సమాక్రాంతము=బాగుగఁ జుట్టుకొనఁబడినది. శోకగిరితలమందున్=శోకమనెడి పర్వతమందు, దీర్ఘనిశ్వాసముల్ = అధికచింతచేఁ గలిగిన నిట్టూర్పులు, దుర్మనుండై=శోకముతోఁగూడిన మనస్సుగలవాఁడై,శమము=శాంతి,ఒల్లఁబోవుచున్=

మూర్ఛపోవుచు, భ్రష్టయూథము=తనమందనుండి తప్పిపోయినది, వృషభమో యనంగన్=ఎద్దోయనునట్లు, కుతిలపాటునన్=భరతునిఁ దుఃఖము జూడఁగలిగిన దుఃఖముచే.

తాత్పర్యము

శ్రీరామధ్యాన మనెడి పెద్ద గండ శైలములచేతను నిట్టూర్పు ధాతువుల చేతను దీనత్వమనెడి చెట్ల సమూహములచేతను, దుఃఖమనెడి జింకలగుంపు చేతను భ్రమమోహమనెడి యంతములేని క్రూరమృగములచే; సహింపరాని సంతాపమనెడి వెదుళ్ళు, ఓషధులచే, ఆక్రమింపఁబడిన శోకమనెడి కొండ ప్రదేశ మందుఁబడిన భరతుండు నిట్టూర్పులు పుచ్చుచు శోకముతోఁగూడిన మనస్సుగల వాఁడై దిక్కుతెలియక శాంతిలేక మూర్ఛ పోవుచు మందనుండి చీలిపోయిన యెద్దువలె నేడ్చుచుండెను. ఆయనను జూచి గుహుఁడు దుఃఖపడుచు శ్రీరాముఁ దలంచుకొనుచు నూఱడించుచుండెను.

—♦ ౮౬-వ సర్గము. గుహుఁడు భరతునకు లక్ష్మణవృత్తాంతముఁ దెలుపుట ♦—

తే. అవల నిషాదపతియు మ♦హానుభావుఁడై సలక్ష్మణుఁ గూర్చియి♦ట్లాడఁ దొడఁగె
శరశరాసనకరవాల♦కరుతవినిద్రు, భ్రాతృరక్షణపరు నిట్లు♦పలికినాఁడ. ౧౯౯౨

పామరు లిరువురు చేరిరేని పామర కథలచేఁ బ్రొద్దు పుచ్చుదురు. భక్తు లిరువురు చేరిరేని భగవత్కథలందు భాగవత కథలందుఁ బ్రొద్దులు పుచ్చుదురు. గుహుఁడు భరతుఁడిరువురు శ్రీరామభక్తులు. భక్తులగు వారికి భగవత్కథలు చెప్పినవే యెన్నిమార్లు చెప్పినను విసుఁగు వేసటయుండదు. ప్రియుల కథలు ప్రియులకెట్లో భగవత్కథలు భాగవతులకట్లే. కావునఁ బరమ భాగవతోత్తముఁడైన లక్ష్మణు కైంకర్య చరిత్రము భరతునకు గుహుఁడు చెప్పుచున్నాఁడు. భగవద్విషయోపదేశమందుఁ గ్రొత్త ప్రాఁత భేదములేదు. వినువా రాదరముతో వినినఁ జాలును.

సతాం ప్రసంగేమమ వీర్యసంవిదో। భవంతిహృత్కర్ణ రసాయనాః కథాః॥
అని భాగవతము

అవలన్=భరతుని మనస్థితి తెలిసి యాయన విషయమైనసందేహము దొలఁగిన పిమ్మట, నిషాదాధిపతి=బోయనాయకుఁడైన గుహుఁడు, ఇంటికిఁ బోయినవాఁడు భరతుఁడు పిలుపించుటచే మరల వచ్చెను.

మహానుభావుఁడైన=అడవిలోనుండు పక్షిమృగముల వృత్తాంతను దప్ప వేఱొకటి దెలియనివాఁడు గుహుఁడు, లక్ష్మణుఁడో భక్తియందు మహామహిమగల వాఁడు, అట్టివాఁ డిట్టివానిచరిత్ర చెప్పఁబూనుట మహాసాహసము. అయినను భక్తులు తమకుఁ దెలిసినది యల్పమైనను తమ సంతోషముకొఱకై కూడ భగవద్భాగవత

కథలు చెప్పుదురు. అడవి మనుష్యుఁడవు పామరుఁడవు నీకేమి తెలియునని భక్తు లనరాదు. సంతోషముగ వినవలయును. దానిచేఁ జెప్పెడు వానికి నుత్సాహము మెండగును. లక్ష్మణ శబ్దము గుఱుతునకు- నామధేయమునకు-సంపదకు-లక్ష్మణు నకుఁ బేరు- "చిహ్ననామ్నాస్స లక్ష్మీకే సౌమిత్రౌ। నానా.ర. కైంకర్యమే లక్షణ ముగాఁ గలవాఁడు కావున లక్ష్మణుఁడు ఆయన యందుండు మహానుభావత యదియే- అట్టి మహానుభావముగల లక్ష్మణుఁగూర్చి యిట్లు చెప్పఁదొడఁగె- శరశ రాస నకరవాలకరున్=బాణము-విల్లు-కత్తి వీనిని జేతియందుఁ గలవానిని-ఉన్నవి రెండుచేతులేకదా మూఁడువస్తువు లెట్లు ధరించెననరాదు. బాణము సంధించిన విల్లొకచేతను కత్తి యొకచేతను ధరించెనని భావము. వినిద్రున్=నిద్రలేని వానిని- నిద్రపోక యాయుధములు ధరించి యేమి చేసెనన, భ్రాతృరక్షణపరున్=అన్నను రక్షింపుట యదాసక్తి గలవానిని- గుహుఁడు సామంతరాజు-అడవిమనుష్యుఁడు అట్టివాఁడు మహారాజ యనక భరతా యని సంబోధించెను. దీనివలన నేకదేవతా భక్తులు పరస్పరము సౌహృదము- సౌభ్రాత్రము గలవారై యుండవలెనుగాని విద్యాధన జాతి మదములచే నే నెక్కువ వాఁడు తక్కువ యని తలఁపరాదని భావము. పూజ్యత భక్తికిఁగాని వ్యక్తికిఁగాదు.

తా త్ప ర్య ము

భరతుచర్య విషయమై దృఢనిశ్చయముగల గుహుఁడు శ్రీరామ కైంకర్య మను మహా మహిమగల సార్థకనామధేయుఁడైన లక్ష్మణు గుఱించి చెప్పఁ బ్రారం భించెను. భరతా! యన్నను రక్షింపవలయునను తలంపుతో బాణము సంధించిన విల్లొకచేతను కత్తియొకచేతను బట్టుకొని నిద్రలేకయున్న లక్ష్మణునితో నేనిట్లంటిని.

తే. తండ్రి! నీకొఱకై సుఖ♦దంబు మేలి,
శయన ముపకల్పితం బయ్యె♦సౌఖ్య మమర
నందుఁ జని నిద్దురింపు ప్ర♦యాసమఱఁగ,
విశ్వసింపుము నామాట♦విభుకుమార. ౧౯౯౬

సుఖదంబు = సుఖము నిచ్చునది, మేలిశయనము = శ్రేష్ఠమైన పడక, ఉపకల్పితము=బాగుగ నేర్పాటు చేయబడినది, అఱఁగన్=క్షయింపఁగా, విశ్వ సింపుము=నమ్ముము.

తా త్ప ర్య ము

తండ్రీ! రాజకుమారా! సుకుమారా! కుమారా! నీ నిమిత్తము సుఖము కలి గించు మంచి పడుక చక్కఁగ నేర్పాటు చేయఁబడినది. దానియందు సుఖముగ నిదురింపుము. చాలఁ బ్రయాస పడినాఁడవు. నిద్దురపోయి లేచితివేని శ్రమము దీఱును. మీ యన్నను దాసుఁడనగు నేను రక్షించెదను. నా మాట నమ్ముము.

ఉ. మానితరాజపుత్ర! సుకు•మారుఁడ వీ విట నున్న వారలో
కానలయంద త్రిమ్మరెడి • కర్కశదేహులు గాన జానకీ
జానిని జాగరూకత ని•శాసమయంబున నప్రమత్తతన్
బూనికఁ గాచుచుండుదుము•పొమ్ము శయింపు యథాసుఖంబుగన్. ౧౯౯౭

నేను మేల్కొనక యున్న శ్రీరామున కేమైన నపాయమువచ్చిన నేమి చేయవలయు నందువేమో.

మానితరాజపుత్ర=గౌరవింపఁబడు రాజకుమారా, నీవు రాజపుత్రుఁడవగు కారణముచేతనే గౌరవింపఁబడఁ దగినవాఁడవు- అదియునుగాక సుకుమారుఁడవు- త్రిమ్మరెడి=తిరిగెడి, కర్కశదేహులు=ఎంతకష్టమైన నోరువఁగల కఠినదేహములు గలవారు, జానకీజానిని=జానకినిజాయ (భార్య)గాఁ గలవానిని, బహువ్రీహి సమాసాంతమున జాయ జానియగు- సు. వ్యా. సమా. ౬౯ సూ. శ్రీరాముని- జాగరూకతన్ = హెచ్చరికతో, నిశాసమయంబునన్ = రాత్రికాలమందు, అప్రమత్తులై=ప్రమాద పడనివారై.

తా త్ప ర్య ము

పూజ్యుఁడవైన రాజకుమారా! నీవు సుకుమారుఁడవు. ఇక్కడ నున్నవారో యడవులయందే తిరుగ నభ్యాసపడిన కఠినదేహులు. కావున శ్రీరాముని రాత్రి యంతయు హెచ్చరిక గలవారమై ప్రయత్నముతో గాచుచుండెదము. నీవు పోయి సుఖముగ శయనింపుము. శ్రీరామున కేమో యను భయములేదు.

ఉ. ఏమన రాము కంటెఁ బ్రియుఁ • డెవ్వఁడు నెందును లేఁడు నాకు, నీ
భూమిని సత్యమిద్ది యన•పోహము సత్యము పైఁ బ్రమాణ మా
నీమహితాత్మసత్కృపఁగ•దే మహనీయయశంబు గేవలం
బౌమహితార్థమున్ విపులమైన•సుధర్మముఁ గందు నాయనా! ౧౯౯౮

మా యన్న నిమిత్తమై నీవింత శ్రమపడనేల యందువా? అనపోహము= అసత్యముగాదు, కేవలం బౌమహితార్థమున్=కేవలము గొప్ప ప్రయోజనము= మోక్షము.

తా త్ప ర్య ము.

శ్రీరాముని నిమిత్తమై నీకిశ్రమమేల ? పండుకొమ్మనెదవా? విను. శ్రీరామునకంటె నెక్కువ ప్రీతి పాత్రుఁడు నాకెచ్చట నెవ్వఁడులేఁడు. ఆయన యందు నాకంతటి యనన్యభక్తికలదు. ఇది యపోహముగాదు. సత్యముపైఁ బ్రమాణముచేసి చెప్పెదను. ఈ మహానుభావు దయచేఁగదా గొప్పకీర్తి యసమానమైన గొప్ప ప్రయోజనము విస్తారమైన మంచి ధర్మఫలము గాంచఁగలను. అట్టివాని నేనుపేక్షింతునా?

ఉ. జ్ఞాతులు నేను నల్గడల♦సజ్యశరాసనముల్ ధరించి సం
ప్రీతిగఁ గూర్కు మామకసు♦హృత్తమునిన్ సహదారు నప్రమా
దాతతరీతిఁ గాతుఁ జతు♦రంగబలంబు లెదిర్చె నేనియున్
ఖ్యాతిగ; నాయెఱుంగని దొ♦కండును లేదు వనాంతరంబునన్. ౧౯౯౯

జ్ఞాతులు=బంధువులు, నల్గడలన్=నాలుగు దిక్కులయందు, సజ్యశరాసనముల్=ఎక్కుపెట్టిన విండ్లు; మామక=నా, సుహృత్తమునిన్=మిత్రులయందు శ్రేష్ఠుఁడగు వానిని, సహదారున్=భార్యతోఁ గూడినవానిని, అప్రమాదాతతరీతిన్=విస్తారమైన హెచ్చరికతో, కాతున్=రక్షింతును, వనాంతరంబునన్=అడవిలోపల.

తాత్పర్యము

భార్యతోడ నిదురించు నా ప్రియమిత్రుని నేను నాబంధువులు నెక్కుపెట్టిన విండ్లతో నాలుగు ప్రక్కల మిగుల హెచ్చరికతోఁ జతురంగబలములతో నెవఁడైన నెదురించినను నిద్రాభంగము కాకుండ రక్షింపఁగలను. ఈ యరణ్యమునందు నాకుఁ దెలియనట్టివ్వరును రాలేరు.

ఉ. జంకకు మన్న లక్ష్మణుఁడు♦సన్నుత ధర్మపథంబు నెంచి ని
శ్శంకమనీష మాకుఁ గడు♦జాలి వచింపఁ దొడంగె, ధర్మమా
పంకజనేత్రుఁ డైనరఘు♦పర్యుఁడు సీతయు గొడ్డునేలపైఁ
గొంకక పవ్వళింపఁగను♦కూర్కుట నే? నది యెట్లు సాధ్యమౌ? ౨౦౦౦

జంకకుము=సందేహింపకుము, సన్నుత=సజ్జనులచే స్తోత్రము చేయఁబడు, ధర్మపథంబు=ధర్మమార్గము, ఎంచి=తలంచి, నిశ్శంక మనీషన్=సందేహములేని బుద్ధితో, జాలి=వ్యసనముతో, మాకున్=నాకు నాతోడివారికి, తొడంగెన్=ప్రారంభించెను, పంకజనేత్రుఁడు=కమలములవంటికన్నులు గలవాఁడు, గొడ్డు నేలపై=కటిక నేలమీఁద.

తాత్పర్యము

సందేహింపకుమని చెప్పఁగా సజ్జనులు మెచ్చు ధర్మ మార్గము ననుసరించి సందేహములేని మనస్సుగలవాఁడై మిక్కిలి దుఃఖముతో లక్ష్మణుఁడిట్లు చెప్పనారంభించెను. అయ్యా! మిత్రమా కమలములవంటి కన్నులుగల శ్రీరామచంద్రుఁడు సీతయు నుత్తనేలపైఁ గొంకులేక పవ్వళింపఁగా నేను సుఖముగా నిదురించుట ధర్మమా నీవు ధర్మమనినను నేనుప్రయత్నించినను నాకదిసాధ్యపడునా?

ఉ. కంటికి నిద్ర వచ్చునె? సుఖం బగునే బ్రదుకైన? మానసం
బంటునె భోగముల్? ప్రియహి♦తా! దితిజామరకోటి నేనియున్
గెంటఁగఁ జాలుఁ గంటుగొనఁ♦గేలిగ నట్టిమహాత్ముఁ డిందు వా
ల్గంటియుఁ దాను జీర్ణతృణ♦కల్పితశయ్యఁ బరుండి యుండఁగన్. ౨౦౦౧

ప్రియహితా=మిక్కిలి ప్రీతిగలమిత్రుఁడా, దితిజామరకోటి=దైత్యులయు దేవతలయు సమూహములను, కంటుకొనన్=విరోధించెనేని, కేలిగన్=ఆటవలె నవలీలగ, గెంటఁగఁజాలున్=తఱుమఁగొట్టఁగలఁడు, వాల్గంటి=స్త్రీ, జీర్ణతృణకల్పితశయ్యన్=చివికిన గడ్డిచే నేర్పరచిన పడుకమీఁద, పరుండి=పండుకొని

తాత్పర్యము

ప్రియమిత్రుఁడా! దేవదానవసంఘములనైనను విరోధించెనేని యవలీలగ నాటవలెఁ దఱుమఁగొట్టగల మహాసమర్థుఁడు తాను దన భార్యతోఁ జివికినగడ్డి పడుకమీఁదఁ బండుకొనఁగా నాకెట్లు కంటికి నిద్రవచ్చును. బ్రదుకైన నెట్లు సుఖంబగును. భోగము గములు మనస్సునకైన రుచించునా?

చం. తపమునఁ గ్లేశపాటున వెతం గని యొక్కని నాత్మతుల్యు నా
యపరిమితప్రతాపుని వనాంతరవీథులఁ ద్రోచి యాజి దాఁ
గృపణతఁ బెద్దకాలము మహిన్ మని యుండుట కల్ల; మిత్రమా!
విపుల యనాథయై చెడెడు వేగము సత్యము చూచుచుండుమీ. ౨౦౦౨

తపమునన్=ఉపవాసాది వ్రతములను, క్లేశపాటున=యజ్ఞాది శ్రమముల యొక్క, వెతన్=బాధచేత, ఆత్మతుల్యున్=గుణములందుఁ దనతో సమానుని, ఒక్కని=ముఖ్యుని, అపరిమిత ప్రతాపుని=పరిమితిలేని ప్రతాపము గలవానిని, ఆజి=దశరథుఁడు, కృపణతన్=దీనత్వముచే, మని=బ్రదికి, కల్ల=అబద్ధము, విపుల=భూమి, అనాథయై=దిక్కులేనిదై.

తాత్పర్యము.

ఉపవాసాది వ్రతములచేతను యాగాదులవలని వెతలచేతను, లేకలేక తన వంటివాని నొక్క కుమారుని, మితిచెప్పరాని పరాక్రమము గలవానిని, గాంచి కడపట నతని నడవులపాలుచేసిన దశరథుఁడు దుఃఖమున దీనుఁడై చాలఁగాలము భూమిమీఁద బ్రతికియుండుట యసత్యము. కావున భూమి దిక్కు లేనిదై త్వరలోనే చెడును. నామాట సత్యము. చూచుచుండుము.

కం. ఏడిచి యేడిచి హాయని, చేడెలు గాసిల్లి సొమ్మసిలి పడ ధరపై
నేడుపురొద లేకున్నృపు. నీడెల్లను నుండుఁ గాదె విగతధ్వని యై. ౨౦౦౩

విగతధ్వని = ధ్వనిలేనిది.

తాత్పర్యము

హాయని స్త్రీలందఱు నేడిచి యేడిచి గాసిపడి మూర్ఛపోయి భూమిమీఁదఁ బడఁగా నేడుపుధ్వనియైన లేక రాజగృహము పాడుపడినట్లు ధ్వనిలేక యుండును గదా.

కం. ఏనితామణి కౌసల్యయు, జననాథాగ్రణియు నాదుజననియు నీరే
యిని నైన నెల్లవారును, మని యుండుదురా యటంచు మది శంకింతున్.

౨౦౦౪

తాత్పర్యము

వనితారత్నమైన కౌసల్యయు, రాజు, నాతల్లిసుమిత్ర తక్కినవారి రాత్రి యైన బ్రతికియుండరా యని నేను సందేహించుచున్నాను.

కం. మనిన మనవచ్చుఁ జుమి నా, జనయిత్రి మనంబు నిల్పి • శత్రుఘ్నునిపై
మన నేరదు దుఃఖంబున, జననుత వీరసువు రాము • జనని క్షణంబునన్.

తాత్పర్యము [౨౦౦౫

కడగొట్టుకొడుకు శత్రుఘ్నుని మీఁది ప్రేమచే నతఁడైన నున్నాఁడుకదా యని నాతల్లి సుమిత్రాదేవి బ్రదికిన బ్రదుకునేమోగాని వీరునిగన్న తల్లియని ప్రసిద్ధిగన్న కౌసల్యాదేవి యొక క్షణమైన నిఁక జీవింపదని దుఃఖించెదను.

శా. మించెన్ మించె గతించె సర్వమును భూ • మీనాథుఁ డీరామునిన్
గ్రించుం డై ధరణీశుఁ జేయకయె తాఁ • గిడొందు నిక్కంబు, దా
మంచుం జేరి భజించి యానృపతి ని • ర్యాణంబునం బైతృకో
దంచత్కార్యము లెల్లఁ దీర్చెదరు సిద్ధార్థుల్ దదాత్మోద్భవుల్. ౨౦౦౬

ఊల్గున్=చచ్చును, అంచున్ = సమీపమందు, నిర్యాణంబునన్ = మరణంబున, పైతృకోదంచత్కార్యములు=చచ్చినవారికిఁ జేయవలసిన యౌర్ధ్వదైహిక క్రియలు, సిద్ధార్థుల్ = కృతార్థులు, తదాత్మోద్భవుల్ = అతని కొడుకులు భరత శత్రుఘ్నులు.

తాత్పర్యము

సర్వము మించిపోయెను. ఇప్పుడు చేయఁదగిన దేదియులేదు. ఏమి మించినదందువా? రాజు శ్రీరాముని రాజుగఁ జేయనెంచెను. అట్లు చేయుటకు ముందే చచ్చును. రాజు మరణించిన సమయమున నతని కొడుకులు భరత శత్రుఘ్నులు సమీపమున నుండి కొడుకులు చేయవలసిన యూర్ధ్వలోక క్రియలు దీర్చి కృతార్థులయ్యెదరు. మా కాభాగ్యముకూడ లేదు. మమ్మాయన కొడుకులుగ నెంచిన నిట్లడవులపాలు సేయునా? మాకాయనకు నీళ్ళువిడుచు భాగ్యముకూడ లేక పోవునా? మేమాయనకుఁ గొడుకులమని యెట్లుచెప్పుదును?

సీ. అక్కటా తండ్రికి • నౌర్ధ్వదైహికముల, భరతశత్రుఘ్నులు • పరఁగఁ దీర్చి
రమ్యచత్వరముల • రమణీయపథములఁ బ్రాసాదహర్మ్యాది • భవనములను
వారముఖ్యలచేత • వారణవాజుల, సత్యతౌర్యత్రిక • నాదములను
హృష్టపుష్ట ప్రజా • బృందములను సర్వకల్యాణసంపూర్ణ • కలనములను

తే. నిష్కుటారామచయముల • నిత్యవరస, మాజమహముల నొప్పి పే • రోజ నాడు
తండ్రియేలెడియారాజ • ధానియందు, సంచరింతురు వారలు • సమ్మదమున.

అక్కటా = అయ్యో! ఔర్ధ్వదైహికములన్ = మరణించినవారి కూర్ధ్వలోకముల సుఖము కలుగుటకై చేయు పితృకార్యములు, రమ్యచత్వరములన్=మనోహరములైన ముంగిళ్ళచేతను, రమణీయపథములన్=అందమైన బాటలచేతను,

ప్రాసాద=దేవాలయములు,రాజులయిండ్లు, హర్మ్య=ధనికులయిండ్లు,"హర్మ్యా దిర్ధనినాంవాసః ప్రాసాదో దేవభూభుజా"మ్మని యమరుఁడు. వారముఖ్యుల= వారస్త్రీలయందు ముఖ్యులగు వారియొక్కయు, తృతీయాసప్తములకుఁ బ్రాయికంబుగ జడంబునకు ద్వితీయ బహుళంబుగనగు- సు వ్యా. కారక ౧౭ సూ. నామైకదేశే నామగ్రహణమ్మని వారస్త్రీ వార యని చెప్పఁబడియె ఇట్టులే సత్య భామను భామయని కాని సత్యయని కాని భీమసేనుని భీముఁడని ప్రయోగములు కలవు. నవ్యతౌర్యత్రిక నాదముల=మనోహరములగు నృత్తగీత వాద్యముల యొక్కయు,ఈ మూఁటికిఁ దౌర్యత్రికమని పేరు. హృష్టపుష్ట ప్రజాబృందములన్= సంతోషముతోడి పుష్టిగల జనుల సమూహములచేతను, సర్వకల్యాణ సంపూర్ణ కలనములను=పుత్రజన్మాదులగు శుభకార్యముల యొక్కయు బూర్ణముగ నిండి యుండుటను. నిష్కుటారామ చయములన్=ఇంటికిజేరిన తోఁటల సమూహముల చేతను, నిత్యవరసమాజ మహములన్=ఎడఁదెగక జరుగు గొప్ప సభల యుత్స వములచేతను, పేరోజన్=గొప్ప కాంతిచే.

తాత్పర్యము

అయోధ్యా తండ్రికి నూర్ధ్వలోక క్రియలుదీర్చి భరతశత్రుఘ్నులు నందము లైన ముంగిళ్ళచేతను మనోహరములైన బాటలచేతను ప్రాసాదములు హర్మ్య ములు మొదలైన యిండ్లచేతను నుత్తమ వేశ్యలచేతను రథములు నేనుఁగులు గుఱ్ఱములు వీనిచేతను శ్రవ్యములైన నృత్యగీత వాద్యములను మూఁడు విధము లైన వాద్యధ్వనులచేతను సంతోషించినట్టియుఁ బుష్టిగలట్టియు జనుల సమూ హముచేతను, అన్నివిధములైన శుభకార్యములు పూర్ణముగాఁ గూడియుండుట చేతను, ఇండ్లకుఁ జేరిన తోఁటల గుంపులచేతను, ఎల్లప్పుడు జరగు గొప్ప సభలయుత్సవములచేతను నొప్పు గొప్పకాంతిచే రాజిల్లు నాతండ్రి యేలు రాజ ధానియందు సంతోషముతో సంచరింతురు.

"గృహారామస్తు నిష్కుటః" ఇంటినానుకొనియుండు తోఁట-నిష్కుటము.
ఆరామస్స్యా దుపవనం కృత్రిమం వనమేవయత్. అమరుఁడు.
మనుష్యులు వేసి పెంచినతోఁట యారామము.

కం. తన ప్రతినఁ దీర్చి క్షేమం,బున వర్తిలురాముతోడఁ ♦ బురికిన్ మరలన్
జనఁ గలమే మేమును నా,యనుఁగుంజెలీ! యంతపుణ్య♦మా మాకు నికన్.
౨౦౦౮

ప్రతిన=ప్రతిజ్ఞ. తాత్పర్యము

పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయుదుననిన తనప్రతిజ్ఞ దీర్చి సుఖముగానుండు శ్రీరామచంద్రమూర్తితో నయోధ్యానగరమునకు మరల మేము పోఁగలమా, ప్రియమిత్రమా! యిఁక మాకును నంతపుణ్యమా.

కం. అని యీరీతి సుమిత్రా,తనయుండు మహాత్ముఁడార్తిఁ • దరలుచుఁ బరిదే
వన మొనరించుచు నుండఁగఁ, జనియెన్ రేయెల్ల నేమి • సంభాషింతున్

తరలుచున్=సంకటపడుచు, పరిదేవనము=రోదనము. [౨౦౦౯

ఈ ప్రకారముగా గొప్పమనస్సుగల లక్ష్మణుఁడు శోకముతో సంకటపడుచు రోదనము చేయుచుండఁగా రాత్రియంతయుఁ గడచిపోయెను. నేనేమని చెప్పఁగలను. గుహున కున్నదున్నట్లు చెప్పుటకుఁ దెలియునేకాని యెక్కువ లూహించి వర్ణించి చెప్పు బుద్ధి చమత్కారము గలవాఁడు కాఁడు కావున లక్ష్మణువాక్యములు చెప్పి యింత కెక్కువ నేనేమి చెప్పఁగల ననెను. రాత్రిపోయెనే కాని లక్ష్మణు శోకము పోలేదు.

కం. ఖరకరుఁడు దోఁప జడలన్, ధరియింపఁగఁ జేసి యన్న • దమ్ముల నేనే
తరియింపఁ జేసితిని నీ,సురతటినిన్ సీతతోడ • సుఖ మేపారన్. ౨౦౧౦

ఖరకనుఁడు=సూర్యుఁడు, తోఁపన్=ఉదయింపఁగా తరియింపఁజేసితిని = దాఁటించితిని, సురతటినిన్=గంగను.

తాత్పర్యము.

సూర్యుఁ డుదయింపఁగనే యన్నదమ్ముల నిరువుర జడలు ధరియింపఁ జేసి సీతతోడ రామలక్ష్మణులను యథాసుఖముగ నేనే గంగ దాఁటించితిని.

కం. కుంజరయూథపతుల్యులు, కొంజక జడలను ధరించి • కొనివల్కలముల్
రంజిలుచుఁ గట్టి భూసుత,యుం జనుదేరంగఁ జనిరి • యుగ్రాయుధులై.

కుంజర యూథపతుల్యులు=ఏనుఁగు గుంపులలో నధిపతితో సమానులు, కొంకక=జంకక, వల్కలముల్=నారచీరలను, ఉగ్రాయుధులై = భయంకరము లైన యాయుధముల ధరించినవారై.

తాత్పర్యము

ఏనుఁగు మందలలోని పెద్దఏనుఁగులతో సమానులగు శ్రీరామలక్ష్మణులు జంకక జడలుధరించి నారచీరలు గట్టి సంతోషించుచు తమతోడ సీతాదేవిరాఁగ నాయుధములు ధరించి గంగ దాఁటిపోయిరి.

— • ౮౭-వ సర్గము. గుహునిపల్కులు విని భరతుండు దుఃఖించుట • —

సీ. అనవుడుఁ గైకయీ • తనయుఁ డాయప్రియ,
ముల విని యాధ్యాన • మున మునింగి
సింహసంహననుఁ డ • క్షీణబలాఢ్యుండు,
సుకుమారమూర్తి యు • స్సురు మటంచుఁ
బొక్కిమూర్ఛిలివ్రాలెఁ • బొడువఁదోత్రంబునఁ,బడియెడి యేనుఁగు • పగిదినంత
సరసన యుండెడి • శత్రుఘ్నుఁ డాతనిఁ, గౌఁగిటఁ బట్టి దుః • ఖమునఁ బొగిలె

తే. భర్తృశోకార్దితలు నుప • వాసకృశలు
భరతుతల్లులు నందఱు • సరగ వచ్చి

పుడమిఁ బడియున్నసద్గుణిఁ • గొడుకుఁ జూచి
యేడ్వఁగాఁ, గ్రుచ్చి కౌసల్య • హితము దోఁప. ౨౦౧౨

అప్రియములు=అనిష్టవాక్యములు, సింహసంహననుఁడు=అవయవస్ఫూర్తి గలవాఁడు, అక్షీణబలాఢ్యుండు = క్షయింపని బలసంపదగలవాఁడు, తోత్త్రంబునన్=అంకుశమున, సరసన=సమీపమందే, భర్తృశోకార్దితలు=మగఁడుచచ్చిన శోకంబున బాధపడుచుండువారు, ఉపవాసకృశలు=ఉపవాసములచే శుష్కించిన వారు, సద్గుణిన్=మంచి గుణములు గలవానిని.

తాత్పర్యము

అని చెప్పఁగా నాయనిష్టవాక్యముల విని యాచింతయందే మునిఁగిన వాఁడై సింహసంహననుఁడు క్షయింపని బలమే సంపదగాఁ గలవాఁడు కోమల దేహము గలవాఁడునగు భరతుఁ డుస్సురని యూర్చి శోకించి మూర్ఛపోయి యంకుశమునఁ బొడువఁగా నేలఁబడు నేనుఁగువలె నేలఁబడెను. అప్పుడు సమీప మందే ప్రక్కన యుండెడి శత్రుఘ్నుఁ డాయనను బట్టుకొని దుఃఖముచేఁ బొక్కి పోయెను. భరతుఁడు నేలఁబడినాఁడనివిని మగఁడుచచ్చెనని యేడ్చుచు నాహారములేక శుష్కించియుండు భరతుని తల్లులందఱు తొందరగావచ్చి నేలఁబడి యున్న సుగుణవంతుడైన కొడుకును జూచి యేడ్చుచుండగాఁ గౌసల్య హిత మెంచినదై

కం. కడుపారఁ గన్నబిడ్డను, గడుఁ బ్రేమ గలట్టితల్లి • కౌఁగిటఁ గొనున
ట్లుడి కెడిభరతుఁ దపోవతి, యడలుచు నిట్లనియె శోక • మారట పెట్టన్. ౨౦౧౩

తాత్పర్యము

కడుపారఁ గన్నబిడ్డను మిగులఁ బ్రేమగలతల్లి కౌఁగిలించుకొనునట్లు దుఃఖించుచున్న భరతుని గౌఁగిలించి దుఃఖముచేఁ దపించు కౌసల్య సంకట పడుచు శోకము బాధింపఁగా నిట్లనియె.

ప్రేమగలతల్లి యనుఃటచేఁ గైక కన్నతల్లియైనను ప్రేమగలదిగాదు గావున నామెను దన్నుఁ దాఁకవలదని భరతుఁడు నిషేధించుటచే నామె దాఁకలేదు. ఇంతటి కష్టము దెచ్చిపెట్టిన కాముక ప్రేమగలతల్లి యగునా? తల్లియైననగునా?

చం. తనువున వ్యాధి లేదు గద • తండ్రి! వచింపు, భవద్వశంబ యీ
యనఘకులంబు జీవితము • ప్రాణము లన్నను నీవ మాకు, నీ
జనకుఁడు స్వర్గ మేగ రఘు•చంద్రుఁడు కానకుఁ బోవ దీన నై
నినుఁ గని కాదె ప్రాణములు • నిల్పినదానను మేనఁ బుత్రకా. ౨౦౧౪

తనువునన్=దేహమునందు, వ్యాధి=రోగము.

తాత్పర్యము

తండ్రి! నీకు దేహమునందు శ్రీరామ విరహవేదనచేఁగల రోగము లేదు గద. నిష్పాపమైన యీ వంశము నీ స్వాధీనమందున్నది. నీవును మరణించితివా

శత్రుఘ్నుఁడును మరణించును. ఈవార్త శ్రీరామలక్ష్మణులు వినిరా వారక్క డనే చత్తురు. కావున నీతో వంశము నిలిచియున్నది. మాకో జీవితమున్నను ప్రాణమున్నను నీవే. నిన్నుచూచెనా నీదుఃఖముసహింపలేక శ్రీరామచంద్రుఁడు మరలి పురంబునకు వచ్చును. ఆయన వచ్చిన మేముబ్రదుకుదుము. నీవు మరణించితివా యాయనరాఁడు. నీవు నాయనలేక మేము బ్రదుకఁగలమా చచ్చిన వారమే. తండ్రి స్వర్గమునకుఁ బోయినను శ్రీరామచంద్రుఁ డడవులకుఁ బోయినను నీవు శ్రీరాముని మఱలఁబిలుచుకొనివత్తువను నాశతో నిన్నుఁజూచిగదా ప్రాణములు బిగఁబట్టుకొని యున్నాను.

ఉ. అక్కట యేకపుత్రనయి • యారట మొందెడినాదుపుత్రకుం
　డొక్కట నాలితోడ విపి • నోర్విఁకి నేగెడిచోట వింటి వే
　మొక్కొ సుమిత్రపట్టియెడ • నొందు ప్రియేతరవార్తఁ దండ్రి ? నీ
　విక్కరణిం దపింప నిను • నెవ్వరు దేర్చెడివారు నాయనా! 　౨౦౦౯

ఏకపుత్రను=ఒంటికొడుకు గలదానను, అరటమొందెడి=తపించెడి, విపినోర్వికిన్=అడవి ప్రదేశమునకు.

తాత్పర్యము.

తండ్రీ! యొంటికొడుకును గలదాననై యేడ్చుచుండు నాకొడు కడవికి భార్యతోడఁ బోయినచోట నాయనవిషయమైకాని లక్ష్మణువిషయమైకాని యశుభవార్త యేమైన వింటివా. ఏల యిట్లులేడ్చుచున్నావు. శ్రీరామచంద్రునొద్దకుఁ బోవుచున్నాముగదా. మమ్ము సమాధానపఱుప వలసినవాఁడవు నీవే యిట్లు లేడ్చుచుండిన నిన్నెవ్వ రూరార్చువారు.

కం. అని యేడ్వనొక్కమూర్తం, బునకుం దెలి వొంది మిగులఁ • బొగులుచుఁ గౌస
　ల్యను నూరార్చుచు గుహునిం, గని భరతుం డిట్టు లనియెఁ • గళవళపడుచున్.

తాత్పర్యము　[౨౦౧౬

అని యేడ్చుచుండఁగా గాఢమూర్ఛ మునిఁగిన భరతుఁడు ముహూర్తకాలమున స్మృతి వచ్చినవాఁడై లేచి మిగులదుఃఖపడుచుఁ గౌసల్యను దల్లీ! నీవనుకొన్నది యేదికాదు. భయపడకుమని యూరార్చుచు గుహునిఁజూచి యిట్లనియెను.

—• భరతుఁడు గుహుని సీతారాముల నిద్రాహారవిషయంబు లడుగుట. •—

సీ. మాయన్న యానాఁటి • రేయిదా నెక్కడ, నవనిపైఁ బవళించె • నయ్య చెపుమ
　వరసుకుమారి మా • వదినె యెచ్చటఁ బండె, నుండె నెచ్చట లక్ష్మ • ణుండు సఖుఁడ
　దేని భుజించిరి • దేనిపై శయనించి, రంతయుఁ జెప్పుమా • యనిన గుహుండు
　రాముని చరిత స • ర్వంబును జెప్పంగఁ, గడఁగెను బహువిధ • క్రమఫలము

ఆ. లతులభక్ష్యములను•నన్న పానాదులఁ, గొనుము నేను బోవఁ•గూర్మి మీఱ
నాదరించెఁగాని•యంతఁ డొక్కటియును, క్షత్రధర్మ మాత్మ•సంస్మరించి.

బహువిధ క్రమఫలములు=అనేక విధములైన మనోహరములైన పండ్లు, అతులభక్ష్యములను = అసమానములైన తినుపదార్థములను, క్షత్రధర్మము = క్షత్రియులకు దానాధికారమేకాని ప్రతిగ్రహాధికారము లేకుండుట యోజించి ఈవిషయమే సీతాదేవి రావణునితో నిట్లుచెప్పఁగలదు. "ఇచ్చునేకాని యొరులచేఁ బుచ్చుకొనఁడు, సత్యమాడునకాని యసత్యమాడఁ, డెట్టివేళల నివియచూ దిట్టమైన రామచంద్రుని వ్రతములు బ్రహ్మతేజ॥ ఇది యాత్మార్థవిషయ మని యెఱుంగునది, ఆతిథ్యము గ్రహించుట దోషముగాదు గాని యాదినమున శ్రీరామచంద్రుఁడు తీర్థోపవాసము గావించెను. ఆకారణమునఁ దీసికొనలేదు గుహుఁడు తెచ్చియిచ్చినది యాతిథ్యముకాదు. ఇంటికివచ్చినవాఁ డతిథి. శ్రీరామచంద్రుఁడు గుహునింటికిఁ బోలేదు. కానుకలందమా శ్రీరాముఁడు రాజుగాఁడు. ఈవిషయమున వాల్మీకియు "స్వధర్మము క్షాత్రము గారవించెడున్" అనిచెప్పెను.

ఈవిషయమున భారతమున నర్జునుఁ డంగారపర్ణుతోఁ జెప్పిన వాక్యములు చూడుఁడు.

ఎంతమిత్రులయిన నెన్నఁడు నొరులచే
విద్యయును శుభంబు విత్తచయముఁ గొనఁగనొల్ల. భార. ఆది. ౭.

తాత్పర్యము

మిత్రుఁడా! యానాఁటిరాత్రి మాయన్న భూమిమీఁద నెక్కడఁబరుండెను. మిగుల సుకుమారి మావదినె సీతాదేవి యెచ్చటఁబవ్వళించెను. లక్ష్మణుఁ డెచ్చట నుండి కావలికాచుచుండెను. వారు దేనిని భుజించిరి. దేనిపైఁ బండుకొనిరి చెప్పవయ్యా! యనిన గుహుఁడు శ్రీరాముని చరిత్ర మచ్చోట జరిగినది సర్వము చెప్పఁదొడంగెను. అనేకవిధములైన కమ్మనిపండ్లు, అన్నము, పానీయములు నేను దీసికొనిపోయితినిగాని దయతో మంచిమాటలచే నాదరించెనుగాని క్షత్రియ ధర్మము దలపోసి యొక్కటియైన వ్రేలువైచి యంగీకారసూచకముగ దాఁకిన వాఁడైనను గాఁడు.

కం. ఇచ్చుట యుచితము మాకుం,
బుచ్చుకొనుట తగ దటంచుఁ•బుణ్యాత్ముఁడు దా
మచ్చిక వచించి మరలం, బుచ్చెను నాయిడినవస్తు•వుల నెల్ల నృపా.

తాత్పర్యము [౨౦౧౮

అయ్యా! మిత్రవమా! క్షత్రియులమైన మాకు స్వార్జిత ముత్తమముగాని దత్తము గాదు. నీవు తెచ్చియిచ్చినది యాతిథ్యముగాదు, కానుకగాదు. కావున నేను దీసికోరాదు. అని స్వధర్మమను పుణ్యకార్యమందు మనస్సుగలవాఁడు ప్రేమతో మంచిమాటలుచెప్పి నేను దెచ్చియిచ్చిన వస్తువులనన్నిటిని మరల వెనుకకుఁ బంపెను.

రాజుల కీవద్యమునఁ జెప్పఁబడినదే ధర్మమేని శ్రీరాముఁడు భరద్వాజుఁ డిచ్చినదాని నెట్లుపుచ్చుకొనె నని యాక్షేపము.

సమాధానము. బ్రాహ్మణులు మధుపర్కాదులచే రాజులఁ బూజింపవలసి నట్లు శాస్త్రముండుటచేతను అట్టి ఋషియిచ్చినదాని నంగీకరించుట శ్రీరామునకే శ్రేయస్కరము గావున ఋషిపూజ నంగీకరించెను. (ఏలనఁ బ్రతిగృహీత పాప దాతయొక్క పాపమును బుణ్యదాతయొక్క పుణ్యమును స్వీకరించుచున్నాఁడు. కావున ఋషిపూజ గ్రహించుటవలన శ్రీరామునకే శ్రేయస్కరము) గాని గుహుఁడు బోయజాతి యగుటచేతను నతనికి శాస్త్రీయరాజపూజ శాస్త్రవిహితము గాకుండుటను కోసలరాష్ట్రమునకుఁ జేరని రాజగుటచేతను నతఁడిచ్చినదానిని బన్నని తలఁచుటకైనను గ్రహింపఁగూడమిచేత నతఁడిచ్చినవానిని శ్రీరామ చంద్రమూర్తి గ్రహింపలేదు. గుహుఁడు బోయజాతివాఁడైనను భగవద్భక్తాగ్రేస రుఁడు గాన శబర్యాదులకువలె నితనికిఁ బూజాధికారమున్నను శ్రీరాముఁ డిపుడు వ్రతనియమముఁ బూనియున్నాఁడు గాన నతఁడిచ్చిన దేదియు గ్రహింపలేదు. ఋషులిచ్చినను గ్రహించి యుండఁడని తిలక వ్యాఖ్యానము.

గుహుఁడు భక్తాగ్రేసరుఁడు శబర్యాదులవలన గ్రహించిన ట్లీతనివలనను బూజ గ్రహింపవచ్చును. తల్లిదండ్రులను బ్రియమిత్రులను వదలి వచ్చినవాఁ డగుటను శ్రీరాముఁడు మీఁదు మిక్కిలి దుఃఖించుచున్నవాఁ డగుటను అది పుణ్యనదీ తీరమగుటచేత నచట క్షేత్రోపవాసము చేయవలసియుండుటఁబట్టియు గుహుఁడు సమర్పించినవానిని శ్రీరాముఁడు గ్రహింపఁడయ్యెనని గోవింద రాజీయము.

మచ్చిక వచించి యనుటచేత నింత యభిప్రాయము స్పష్టపడుచున్నది యని యావ్యాఖ్యానమందే కలదు. అగస్త్యునిచే విల్లు బాణములు గ్రహించిన విషయము అరణ్యకాండము ౨౦౩ పద్యవ్యాఖ్యయందుఁ జూడుఁడు.

ఉ. ఆవల లక్ష్మణుండు విమలాంబువులం గొని తేర సీతతోఁ
 ద్రావి యుపోస ముండె మఱి దక్కినసీరము నీయఁ దమ్ముఁడున్
 ద్రావెను మువ్వు రంతట యథావిధి మౌనముతోడ సాంధ్యపూ
 జావిధిఁ దీర్ప లక్ష్మణుఁడు చయ్యన దర్భలశయ్యఁ గూర్చినన్. ౨౦౧౯

తాత్పర్యము.

నేనుదెచ్చిన వన్నియు మరలఁ బంపినతరువాత లక్ష్మణుఁడు నిర్మలజలము లను దీసికొనిరాఁగా సీతతోడ వానిఁద్రావి యుపవసించెను. తాను ద్రావఁగా మిగిలిన నీరము లక్ష్మణున కీయఁగా నాయనద్రావెను. అంతట నాముగ్గురు సంధ్యాకాలమునఁ జేయవలసిన దేవపూజాదులనఁగా సంధ్యావందనము మౌనమువహించి గావించిరి. ఆవల లక్ష్మణుఁడు దర్భలచేఁ బడుక కుదిర్చెను.

"ఒరులు ద్రావఁగఁ దక్కు నీరమున్" అని యొకరుద్రావఁగా మిగిలిన నీళ్లు మఱియొకరు ద్రావరాదని ముందు నిషేధవాక్యము కలదుగదా (చూ ప. ౭౮౧) ఎట్లు శ్రీరామునుచ్ఛిష్టము లక్ష్మణుఁడు పరిగ్రహించె ననరాదు. పురుషులు దేవోచ్ఛిష్టము, గురూచ్ఛిష్టము, జ్యేష్ఠభ్రాత యుచ్ఛిష్టము. స్త్రీలు భర్త యుచ్ఛిష్టమును గ్రహించుట దోషముగాదు "పితుర్జ్యేష్ఠస్యచ భ్రాతురుచ్ఛిష్టం భోక్తవ్య"మని కలదు.

ఇందు సీతయు సంధ్యవార్చినట్టున్నది. ఈ ప్రకారమే సుందరకాండ మందు హనుమంతుఁడు సీతాదేవినిగుఱించి యిట్లనుకొనెను. "కం. సంధ్యా కాలంబునఁదా। సంధ్యావందనముఁ జలుపఁ జనుదెంచును ని।ర్వంధ్యోదక యీనది కడ। కుఁ ధ్యానమొనర్చికొంచుఁ గూర్చి హృదీశున్. సుంద. ౪-౨౩". కావునఁ బూర్వయుగముల స్త్రీలకు సంధ్యావందనాధికారము గలదు. స్మృతి కర్తలు దానిని గలియుగమున నిషేధించిరి. యజ్ఞోపవీతము ప్రతినిధి మంగళ సూత్రధారణము వైదికముగాదనియు స్మార్తమనియు విజ్ఞులు చెప్పిరి.

౧౩౧౭-వ పద్యమున ముందు సంధ్యవార్చి యావల నీళ్ళు ద్రావినట్లున్నది. ఇచ్చట నీళ్ళుద్రావి సంధ్యవార్చిరని యున్నది. ఇందేది సత్యమని యాక్షేపము.

సమాధానము. అచ్చటఁ గథాక్రమము వరుసఁగ జెప్పఁబడినది కావున నదియె సత్యము. ఇచ్చట వరుస వివక్షింపక భరతుఁడడిగిన ప్రశ్నల కుత్తరము చెప్పుటయందు దేని భుజించిరి యనుప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరమిచ్చి యావలఁ దక్కినవిషయము చెప్పెను. ఇచ్చటఁ గ్రమ మవివక్షితము కావున నిందుఁ గథాక్రమము సరిగాలేదు. కావునఁ దినినయాహారమునుజెప్పి యావలఁ దక్కినకథను జెప్పెను. కావునఁ బూర్వోత్తర విరోధము లేదు.

తాత్పర్యము

కం. ఆపడుకయందు రాముఁడు, క్ష్మాపుత్రియుక్తి నుండ•సౌమిత్రియుఁ ద
చ్ఛ్రీపాదంబులఁ గడగియు, దాపున నిలఁబడక కొంత•దవ్వగఁ జనియెన్.

ఆ పడుకయందు శ్రీరామచంద్రుఁడు సీతతోడఁ బండుకొనెను. లక్ష్మణుఁడు శ్రీరాముని పాదములఁగడగి సీతచేత నీరుంచి సమీపమున నుండక కొంచెము దూరము పోయి నిలిచియుండెను.

ఆర్ద్రపాదంబులఁ బండుకొనరాదను నిషేధమునకుఁ దడికాళ్ళతో నీరు దుడుచుకొనక పండుకోరాదని యర్థము. భోజనము తడికాళ్ళతోనే చేయవలయును.

—• శ్రీరాముఁడు పరుండినస్థలమును గుహుఁడు భరతునకుఁ జూపుట.•—

కం. ఆరేయి రాముఁడును సీ:తారమణియుఁ బండినట్టి•దర్భ లివే యా
గారతరుపుమూలం బిదె, కూరిమిఁ గను మిందు నిద్రఁ•గూరిరి వారల్.

ఆ రాత్రి శ్రీరాముఁడు సీతయుఁ బండుకొనిన దర్భలివే చూడుము. వారు దిగిన గారచెట్టు మొదలిదే. ఇచ్చటనే వారు నిద్రించిరి. ప్రేమతోఁ జూడుము.

ఉ. సారతలాంగుళిత్రపుల • శాతకలంబక దంబపూర్ణతూ
ణీరములన్ మహాధనువు • నిర్భరవృత్తి ధరించి చుట్టు సం
చారము జేసి కాచె రఘు•సత్తము లక్ష్మణుఁ డెల్ల రేయి య
వ్వీరుని వెంట నంటితిని • విల్లును బాణము లూని నేనునున్.　　౨౦౨౨

సారతలాంగుళిత్రపులు = చర్మముతోఁజేయఁబడి గట్టివియగు నఱచేతిని వ్రేళ్లను రక్షించు హస్తకవచములను (gloves), శాత = పదునైన, కలంబ = బాణములయొక్క, కదంబ=సమూహముచే, పూర్ణ=నిండిన, తూణీరములన్= పొదులను, మహాధనువు=గొప్ప విల్లు, అల్లెత్రాడు లాగునప్పుడు వ్రేళ్ళను వింటి నడుమును గట్టిగఁ బట్టుకొన్నప్పు డఱచేతులను గాయపడకుండుటకై తొడుగు కొను చర్మముతోఁ జేయఁబడిన తిత్తులు. మహాశూరులు రెండుచేతుల సవ్యాప సవ్యముగ బాణములు ప్రయోగింతురు గావున వారికి రెండుభుజములమీఁద రెండమ్ముల పొదులుండును. ఈ కారణముచేతనే యర్జునునకు సవ్యసాచియని పేరు. ఆ కాలమునకు నాయనయొకఁడే సవ్యసాచి. శ్రీరామ లక్ష్మణు లిరువురు సవ్యసాచులే. నిర్భరవృత్తిన్ = అతిశయమైన యుపాయముచే, మిక్కిలి పూని కతో, చుట్టు=శ్రీసీతారాముల చుట్టు తిరుగుచు.

తాత్పర్యము

అల్లెత్రాటిదెబ్బ తగులకుండునట్లు వ్రేళ్ళు రాపెక్కకుండునట్లు తోలి కవచములను జేతికిఁ దొడిగికొని పదునైన బాణసమూహములచే నిండినపొదులను బెద్ద వింటిని మిగుల హెచ్చరికతో ధరించి శ్రీసీతారాములచుట్టు రాత్రియంతయుఁ దిరుగుచు రక్షించుచుండెను. నేనో విల్లును బాణములు ధరించి యాయన వెనుకనే పోవుచుంటిని. నీవేల విల్లుబాణములు ధరించితివి? అయనకు నీసాహాయ్యము కావలయునా? ఆయన వీరుఁడని నీవే చెప్పితివికదా? యందువేమో. నీవలె శ్రీరామచంద్రునకు లక్ష్మణుఁడును సవతికొడుకే, ఒక సవతి కొడుకు శ్రీరాముని నూరువెడలఁగొట్టెను. ఈతమ్ముఁడేమిచేయ వెంబడించినాఁడో?ఆయన యేదైన శ్రీరామునిపై బాణము ప్రయోగింపఁ బ్రయత్నించెనా వెంటనే యాయనతల దీయుటకై విల్లు బాణముల ధరించి వెనుకవైపుగాఁ బోయితిని.

కం. కునుకక తెవ్వన్ వ్రాల్పక, వెనుకొని యాత్మీయు లెల్ల•భృతకార్ముకులై
చనుదెంచిరి నావెంటన, యనఘా కాచితిమి యిట్టు•లాహరినిభునిన్.౨౦౨౩

కునుకక=తూఁగిపడక, ఆత్మీయులు = నాకుఁగావలసినవారు, భృతకార్ముకులై =భరింపఁబడిన విండ్లుకలవారై, హరినిభునిన్=ఇంద్రునితో నుపేంద్రునితో

సమానుని, హరినిభుఁడైన శ్రీరాముని నెవ్వరేమి చేయఁజాలరని నేనెఱుఁగుదును. అయినను నాదాసకృత్యము నేను నిర్వహింపవలె గదా యని తిరిగితిని.

తా త్ప ర్య ము

తూఁగక తెప్పవ్రాల్పక నా వారందఱు విండ్లుధరించి నావెంట వెనుక ప్రక్కగరాఁగా మేమందఱ మాయింద్రుని నుపేంద్రుని సమానుఁడైన శ్రీరామ చంద్రుని గాచితిమి.

౮౮-వ సర్గము. శ్రీరాముఁడు పరుండిన స్థలముంజూచి భరతుఁడు పరితపించుట.

కం. అని గుహుఁడు పల్క సర్వం,బును విని భరతుండు మంత్రి♦ముఖ్యులతోడన్
జని యింగుదిమూలము రా,
మునిశయ్యను జూచి యనియె♦మునుఁగుచుఁ జింతన్.

తా త్ప ర్య ము [౧-౪

ఈప్రకారము గుహుఁడు చెప్పఁగా సర్వము విని భరతుఁడు ముఖ్యమిత్రులతో గారచెట్టు మొదటనున్న శ్రీరాముని పడుకనుజూచి చింతలోమునిఁగి యిట్లనియెను.

ఉ. కంటిరె తల్లులార! రఘు♦కాంతుఁడు నాఁటిత్రియామ నిందు నీ
కంటకదర్భశయ్యపయిఁ ♦ గన్నుమొగిడ్చి శయించె, నల్లదే
కంటిరె నల్గి యున్న యది ♦ కాయమురాపిడిగుర్తు లల్ల వే
యంటినఁ గందుమేనఁట కు♦శాస్తరణం బఁట! యేమిచెప్పుదున్. ౫-౭

నాఁటి=ఈ గంగాతీరము చేరిననాఁటి, త్రియామయందు=రాత్రియందు, ఇందున్=ఈ స్థలమందు, నీకంటకదర్భశయ్యపయిన్= ముండ్లవలెనున్న యీ దర్భల పడుకమీఁద, శయించెన్=పండుకొనెను, కుశాస్తరణము=దర్భశయ్య, విషమాలంకారము.

తా త్ప ర్య ము

తల్లులారా చూచితిరా! ఆనాఁటిరాత్రి శ్రీరామచంద్రుఁడీ ముండ్లవంటి దర్భశయ్యమీఁదఁ గన్నులుమూసికొని యీప్రదేశమున నిదురించెనఁట.అదిగోఁ జూచితిరా దేహము రాచుకొనుటచే నలిగిన గుర్తులు. తాఁకిన గందు దేహమఁట యీదర్భలమీఁదఁ బండుకొనుటయఁట! నేనేమని యీవిపరీతమును జెప్పుదును.

చం. అతులయశస్వియై దశర♦థావనినాథతనూజుఁడై జగ
త్స్తుతమతియై కులీనుఁడయి ♦ దుర్ధరవిక్రమశాలియై జగ
త్పతి యగురాముఁడాయజిన♦తల్పవరంబులఁ బండు నాథుఁడీ
క్షితిఁ గుశతల్పసీమ నెటు ♦ చేర్చెనొ మేనెటు నిద్రఁ గూరెనో. ౮-౯

అతులయశస్వియై=అసమానమైన కీర్తిగలవాఁడై, జగత్=ప్రపంచముచే, స్తుత=పొగడఁబడిన, మతియై=మనస్సుగలవాఁడై, కులీనుఁడయి =గొప్పవంశమునఁ బుట్టినవాఁడై, దుర్ధరవిక్రమశాలియై=శత్రువులకు సహింపరాని యధిక

మైన విక్రమముచేఁ బ్రకాశించువాఁడై, జగత్పతి = ప్రపంచమును బాలించు వాఁడైన శ్రీరాముఁడు, అజినతల్పవరంబులన్ = పదునుచేయఁబడిన శ్రేష్ఠము లైన చర్మపుఁ బానుపులందు, కుశతల్పసీమన్=దర్భలచేఁ జేయఁబడిన పడు కలయందు, మేను=దేహము. ఇందుఁ జెప్పఁబడిన గుణములలో నొకటి యున్నను నిట్టి కఠినశయ్యపైఁ బరుండఁదగఁడు. అట్లుండ నిన్నియుఁ గలవాఁ డిట్టిశయ్యపైఁ బరుండ నర్హుఁడా.

తాత్పర్యము

అసమానమైన కీర్తిగలవాఁడును, దశరథునివంటి మహారాజునకుఁ గుమారుఁ డైనవాఁడును, ప్రపంచమంతయు స్తోత్రముచేయు మనస్సుగలవాఁడును, సద్వంశమునఁ బుట్టినవాఁడును, విశేషపరాక్రమముచేఁ బ్రకాశించువాఁడును, జగమంతయుఁ బాలించువాఁడును నగు శ్రీరాముఁడు మృదువైన కృష్ణాజిన ముల శయ్యయందుఁ బరుండువాఁడు సర్వజనగర్హ్యుఁడు, కేవల నిఱుపేద కుమారుఁడు నలువురచేత బుద్ధిలేదనిపించుకొన్నవాఁడు, నీచవంశమునఁ బుట్టిన వాఁడు, కేవల నీచసేవకుఁడు, గుండ్లలో ముండ్లలోఁ బండుకొనుటకు వాడుక పడినవాఁడు నగువాఁడు పండుకొనవలసిన యీ దర్భలశయ్యమీఁద దేహమెట్లు చేర్చెనో? పండుకొనెనసుకో నిద్రయెట్లు వచ్చెనోకదా!

సీ. ప్రాసాదతతుల నుప్పరిగల విహరించు,నట్టిఁడేఁ డుండెనే చెట్టునీడ
హైమతలాళి నుద్యానంబులం దుండు,ఘనుఁడు చరించెనే కటికినేల
మలయానిలముపీవఁ దలిరుఁ బాన్పులఁ బండు,
ధన్యుఁడు కూర్కెనే దర్భశయ్య
మంగళధ్వనులు చెలంగ మేల్కనునృప,వరుఁడు మేల్కొనియెనే వాశితములఁ
తే. బ్రోదిచిలుకలపలుకుల మోదమునను,వినెడుపతి యెట్లు వినియెనో వికటసత్త్వ
పరుషరవముల వేనవేల్ ప్రజలుగొల్వ,
నుండునతఁ డెట్టులుండెనో యొంటినిచట. ౨౦-౨౨

ప్రాసాదతతులన్=రాజులయిండ్లయందు, ఉప్పరిగలన్=(ఉపరిగృహము) మేడలమీఁద, హైమతలాళిన్ = బంగారుమయమైన ప్రదేశములయందు, కటిక నేలన్=కఠినభూమియందు, తలిరుఁబాన్పులన్=చిగుళ్ళతోఁ జేయఁబడిన పాన్పు సందు, వాశితములన్=నక్కలకూఁతలచేత, ప్రోదిచిలుకల = పెంపుడుచిలుకల, వికట=భయంకరములైన, సత్త్వ=మృగముల, పరుషరవములన్ = చెవులకు వెగటైన ధ్వనులను, వేనవేల్=వేలువేలు.

తాత్పర్యము

రాజుల యిండ్లయందలి మేడలమీఁదఁ దిరుగునట్టిరాజు చెట్టునీడయందా పరుండెను. ఉద్యానవనములందు బంగారుమయమైన ప్రదేశములనుండు గొప్పవాఁడు కఠినభూమిపైఁ దిరిగెనా? మలయపర్వతమునుండు వచ్చు చల్లని

కమ్మనిగాలి విసరఁగాఁ జిగుళ్ళ పాన్పులపైఁ బండుకొను భాగ్యశాలి దర్భ శయ్యలమీఁదనా పరుండెను? మంగళవాద్య ధ్వనులు మ్రోయఁగా నిద్ర మేల్కొను రాజశ్రేష్ఠుఁడు నక్కయీలల ధ్వనిచే మేలుకొనెనా? పెంపుడు చిలుకల పలుకులు సంతోషముతో వినువాఁడు భయంకర మృగముల కఠిన ధ్వనుల నెట్లు వినెనో? వేలకొలఁదులు జనులు సేవింపఁగా నుండు ప్రభు వొంటిగా నిచట నెట్టులుండెనో ?

సీ. మొరసురానేలయే♦వరహైమరాజత,ప్రాసాదమాయెనా ♦ రామ నీకుఁ
గఱకుదర్భలప్రోవు♦నెఱిమించుమెత్తని, పానుపు లాయెనా ♦ భ్రాత నీకు
గారవృక్షముకొమ్మ♦లా రాణఁ బట్టిన, నల్లినచందువా ♦ యన్న నీకు
హోరనుగాలియే♦యువిదలు వీచెడి.వింజామరలగాలి ♦ విభుఁడ నీకు

తే. వందిమాగధనుతిగీత♦వాద్యరవము; పరుషకాకనినాదమే ♦ పరమపురుష
కనకభూషణరాజిని♦స్వనము లకట, ఝిల్లికాగణరావమా♦శ్రీయుతాంగ.

రామచంద్రప్రభూ! మొరసురానేల=గులకరాలుగల నేలయే నీకు, వరహైమరాజతప్రాసాదమాయెనా = శ్రేష్ఠమైన బంగారు వెండిచేఁగట్టఁబడిన, రాజభవనమాయెనా, కఱకుదర్భలప్రోవు=ఆకురాయివలెనుండి దేహము వాఁతలుపడ గీసుకొను దర్భలరాశి, రాణన్=అందమున, చందువా = మేలుకట్టు, పరుషకాకనినాదమే=కఠినమైన కాకికూఁతలా, కనకభూషణరాజినిస్వనములు = బంగారు సొమ్ముల సమూహముల జిలిబిలి ధ్వనులు, ఝిల్లికాగణనాదమా=ఈలపురుగుల కూఁతయా, శ్రీయుతాంగ=కాంతితోఁగూడిన దేహముగలవాఁడా.

తా త్ప ర్య ము.

గులకలరాలనేల నీకు హా: రామచంద్రప్రభూ! బంగారు వెండిమయమైన మేడయాయెనా? ఒఱసుకొనిన వాఁతలుపడఁజేయు దర్భలరాశి యన్నా! నీకు నందమైన మెత్తని హంసతూలికాతల్పమాయెనా? గార చెట్టుకొమ్మలు సోదరా! నీకు దోమతెఱయాయెనా ? చెవులు గడియలుపడ హోరని వీచుగాలి విభూ! వయసు సుందరులు వీచు వింజామరలగాలి యాయెనా ? వందిమాగధుల స్తోత్రములు సంగీతవాద్యధ్వనులు కఠినములైన కాకికూఁతలా ? పరమపురుష! ఈలపురుగుల గీఁయను ధ్వనులు బంగారుసొమ్ముల జిలిబిలి ధ్వనులా ?

కం. మతి మోస మయ్యెఁ గా కీ క్షితి నిట్టిది సత్యమొండు♦చెలఁగునె, కలచే
నతిమోహపడితి నారఘు,పతి యేడన్ గటికి నేలఁ♦బండుట యేడన్ ?

తా త్ప ర్య ము   [౨౦-౨౯

ఒకదానిని జూచి మోహముచే నామనస్సు మోసపోయి వేఱొకటిగాఁ దలఁచుచున్నది. అట్లుగానియెడల నిటువంటి విపరీతసత్యమొకటి యుండునా? ఉండదు. ఇట్లుపోఁచుటకుఁ గారణమేమన నాకలచే నేను మోహపడితిని.

శ్రీరాముఁడెక్కడ? ఈ గొడ్డునేలమీఁదఁ బండుకొనుటయెక్కడ ? ఇది నిజమని యెట్లు నమ్మెదును?

కం. తలఁపఁగఁ గాలముకంటెను,బలితము దైవంబు గాదు ♦ పరికింపఁగ నీ
యిల దాశరథిని రాముని, ఖలునట్టులు నిద్దురింపఁ♦గాఁజేసెఁ గదా. ౨౦౩౦

తాత్పర్యము.

అన్నివిధముల గొప్పవాఁడగు శ్రీరాముని దశరథుకుమారుని బగమపాపి యగు దుష్టునివలె నిదురింపఁజేసెను గావున దైవముకంటెఁ గాలమే బలీయము. దైవము శ్రీరాముఁడే. కాలబలమున నాయనకిన్ని కష్టములు వచ్చినపుడు కాలమేకదా బలీయము.

శ్రీరామచంద్రమూర్తి కాలాత్మకుఁడగు భగవంతుఁడే. అయినను లీలా విభూతియందు మానవధర్మ మనుష్ఠానమునఁ జూపఁదలఁచినపుడు దాని నతిక్ర మించి తన పరత్వము ప్రకటింపరాదు కదా.

కం. జనకునిసుత యఁట దశరథ,జనపతికోడ లఁట రాము♦సతి యటఁ బ్రియద
ర్శన యఁట యాసీతయు, వని నేలను బండె నింత♦పాపము గలదే.

తాత్పర్యము   [౨౦౩౧

మగవాఁడు కావున శ్రీరాముఁడెట్లో కష్టమువహించె ననుకొన్నను సీత యెట్లు నేలపైఁ బండుకొనెను? ఆమెయనఁగానేమి సామాన్యురాలా? జనకమహా రాజు కూఁతురు, దశరథమహారాజు పెద్దకోడలు, శ్రీరామచంద్రుని భార్య, సంతోషకరమైన దర్శనము కలది. ఎట్టిదుఃఖమున మునిఁగియున్న మనస్సు గలవాఁడైనను ఆమెను జూచెనా దుఃఖము మఱచుటేకాదు, ఆనందమును బొం దును. అటువంటి యయోనిజ లోకపావని సీత యామె నేలపైఁ బండెనుగదా. ఇంతకంటెను గ్రూరవిషయము వేఱొకటికలదా."పాపం స్యాత్పూర్వ్విర పాప్మనో" వై జయంతి.

కం. ఇది మాయన్న పరుండిన,యది శయనము కఠినధరణి♦సటు నిటు పొర్లన్
జెదరి నలంగెను బూరియు,మృదుతనునకు దర్భశయ్య♦యేమనవచ్చున్.

పరుండినయది = పండుకొన్నది.   [౨౦౩౨

తాత్పర్యము

ఇది మాయన్న పండుకొనిన శయనము.నేల కఠినముగానున్న కారణముచేఁ బడకపొందక నిదుర సరిగాఁబట్టక యీప్రక్కకాప్రక్కకుఁ బొరలఁగా దర్భచెదరి నలఁగెను. మృదుదేహునకుఁ గఱకుదర్భ శయనము. దీనికేమనుకొందును.

ఉ. జానకి యుత్తమం బయిన♦శయ్య యిదే,యిట నామె సొమ్ములన్
మేన ధరించియే బడలి ♦ నిద్దుర పొందె నటంచుఁ దోఁచెడిన్
మానుగ నిందు నందు నవె♦ మంజుల కాంచన సూక్ష్మరేణువుల్
కానఁగ నయ్యెడిన్, విధిని♦కారము నే మనవచ్చు దైవమా.   ౨౦౩౩

మంజులకాంచన సూక్ష్మరేణువుల్=మనోహరమైన బంగారు సన్నని యణువులు, విధినికారము=దైవముచేసెడి మోసము, ఉత్తమంబయినశయ్య=సీతాదేవి గాత్రసంస్పర్శమువలన దానికి నిర్మాల్యమువలె నుత్తమదశ పూజ్యత గలిగెనని భావము.

తాత్పర్యము

జానకిదేవి పండుకొనుటచే నుత్తమమైనశయ్య యిదే, దీనియందు నామె సొమ్ములమీఁది యాశచే బడలికవలన వానిని దీయకయే పరుండెను. అది నీకెట్లు తెలియునందురా? సన్నని బంగారు రేణువు లిచ్చటనచ్చటఁ గానవచ్చుచున్నవి కంటిరిగదా దైవము మోసగించినపుడు మనమేమి చేయఁగలము. (చూ. ప. ౧౫౫౩.)

ఉ. భామిని యుత్తరీయ మిటఁ • బట్టుకొనెం గనుఁగొంటిరే కుశ
స్తోమమునన్ దుకూలమున•సూక్ష్మపుఁదంతువు లిందు రాజిలెన్,
నామది సాధ్వి యాసతికి • నాథునిశయ్యయె సౌఖ్యదాయి యా
నేమెయి నున్న నద్ది పగ • పేది శయించుట సీత యియ్యెడన్. ౨౦౩౪

తాత్పర్యము

సీతాదేవిపైఁట (యుత్తరీయము) యామెలేచునపుడు దర్భలందిచ్చటఁ బట్టుకొన్నది చూచితిరా ఆకారణముచే నామెకట్టుకొన్న పట్టువస్త్రములోని సన్నప్రోగు లిచ్చటఁ బట్టుకొన్నవి. సీతాదేవి యీప్రకారము పండుకొనుటచేఁ బతివ్రతకు నేవిధముగనుండినను మగనిశయ్యయే మిగులసౌఖ్యము కలిగించునని తోఁచెడిని. మగనికిఁ బ్రియమైనది యేదియైనను బతివ్రతయగు నతనిభార్యకుఁ బ్రియమే.

చం. కటకట యెంతపాపుఁడను • గష్టపుజీవిని నానిమిత్తమై
కుటిలత రాఘవుండు దన • కోమలితో నిటునంటిశయ్యపైఁ
గటికిధరిత్రి దర్భలను • గన్ను మొఁగుడ్చుట గల్గె దిక్కులే
నటు పెత యింతకన్నఁ గల•దా తలపోయఁగఁ గడుపు భగ్గనెన్. ౨౦౩౫

తాత్పర్యము

అయ్యయ్యో! నేనెంత పాపాత్ముఁడను, ఎంతటి నీచుఁడను, రామచంద్రుఁడు తన భార్యతో నిటువంటి ప్రక్కమీఁదఁ గఠినభూమిపై దర్భలయందు దిక్కులేని వానివలె నిదురించుటకు నేనుగదా కారణము. ఇంతకంటె దుఃఖకారణము గలదా? ఆలోచించినకొలఁది కడుపు మండిపోవుచున్నదే.

ఉ. పుట్టెను సార్వభౌమకుల•ము న్వెలిఁగించుచు, లోకసమ్మతిం
బట్టుగ సర్వలోకహిత•భావమునం జరియించె నీతికిన్
బట్టయి, యట్టిసుందరుఁడు • పద్మదళాక్షుఁడు రక్తలోచనుం
డిట్టికఠోరతల్పమునప•యిం బవళింపఁగఁ గల్గె నేమనన్. ౨౦౩౬

సార్వభౌముఁడు=సర్వభూమికి నధిపతి, చక్రవర్తి, సర్వలోకహితభావమునన్=సమస్త జనులకు మేలుచేయు తలంపుచే, పద్మదళాక్షుఁడు = కమలముల

వంటి కన్నులుగలవాఁడు, రక్తలోచనుండు=సౌభాగ్యచిహ్నమగు ఎఱ్ఱనికన్నులు గలవాఁడు, కఠోర తల్పము=కఠినశయ్య.

తాత్పర్యము.

సార్వభౌమ కులమగు సగరుని వంశమును బ్రకాశింపఁజేయుచుఁ బుట్టెను. లోకము సమ్మతించువిధముగ లోకమునకు హితమైన భావముతో వర్తించెను. నీతికి స్థానమయ్యెను. అట్టి సుందరుఁడు, అట్టి కమలనేత్రుఁడు, అట్టి రక్తలోచనుఁడు, ఇట్టి ఱంపమువంటి కఠినశయ్యపైఁ బండుకొనవలసి వచ్చెను.

కం. ధన్యుఁడు మహానుభావుఁడు, మాన్యుఁడు సౌమిత్రియే సు♦మా కష్టదశన్
వన్యస్థలి నన్నను సౌ,జన్యమునన్ వెంట నంటె ♦ సమయజ్ఞుం డై. ౨౦౩౪

తాత్పర్యము

అక్కఱకొదుకొన్నవాఁడే చుట్టమను న్యాయ మనుసరించి శుశ్రూష చేయవలసిన సమయమెఱిఁగినవాఁడై కేవలము తన మంచితనమే కారణముగా నన్నుకుఁ గష్టదశవచ్చినపు డడవులందు సహాయపడ వెంబడించెను. జన్మము సార్థకముచేసికొన్న యదృష్టవంతుఁడు భక్తిగొప్పమహిమ తెలిసినవాఁడు కావుననే లోకమునకంతయు లక్ష్మణుఁడే పూజింపఁదగినవాఁడు సుమా.

ఆ. ధన్యురాలు సీత♦తనపతితోడుత, వనికి నేగెఁ గుతుక♦మునను సరగ
మనకుచేష్టఁదలఁప♦మనల రాముండు ప్ర,సాదదృష్టిఁ గనుట♦సంశయంబ.

తాత్పర్యము [౨౦౩౫

పురుషులందు లక్ష్మణునివలె స్త్రీలలో సీతయొక్కతెయే ధన్యురాలు, మగఁడు పయనమైనవెంటనే సంతోషముతోఁ దానును బయలుదేఱెను.

తన విషయమున మనముచేసిన కుచ్చితపుఁజేష్ట లాలోచించిన శ్రీరాముఁడు మనల దయాదృష్టితోఁ జూచు ననుట సందేహమే.

ఆ. దశరథుండు విబుధ♦ధామంబుఁ జేరుట, రామవిభుఁడు గహన♦రాజిఁ బడుట
నారకాటి లేమి♦నల్లాడునావిక, పోలె ధరణితలము♦జాలిఁ బడియె. ౨౦౩౬

తాత్పర్యము

దశరథుఁడు స్వర్గమునకుఁ బోవుటచేతను శ్రీరామచంద్రుఁడు వనములలోఁ బడుటను నోడనడుపువాఁడులేక యల్లాడు నావవలె భూమి మిగుల వ్యసనములఁ బాలయ్యెను.

సీ. వనవాసియైనను♦వనజాతనేత్రుని, బాహురక్షిత మౌటఁ ♦ బత్తనంబుఁ
గౌనఁ గోరఁ డెవ్వఁడుఁ♦గోరఁ జాలు న దెట్లు,ప్రాకారములు గాచు♦వారులేక
యేనుఁగుల్ గుఱ్ఱంబు♦లేర్పాటె లేకయుఁ, దెఱచినగవఁకులు ♦ దెఱచి యుండ
దిక్కు లే కెదలను♦దక్కి మోదంబులు, ప్రజ లున్న యాపాడు♦పట్టనంబుఁ
ఆ. బగతుఁ డెవ్వఁ డైన♦భక్ష్యంబు విషమిశ్రి,
తంబుఁ దినెడిజడుఁడు♦ధరణిఁ గలఁడె
మన్నిమిత్త మకట♦యిన్ని క్లిష్టపులు వచ్చెఁ,బొచితంబుఁ జెప్ప♦వాఁడ వినుఁడు

వనవాసి=అడవులయందుండువాఁడు, వనజాతనేత్రుని=కమలమువంటి కన్నులుగల శ్రీరామునియొక్క, బాహురక్షితము = బాహుబలముచేఁ గాపాడఁబడునది, పత్తనంబు=నగరము, అయోధ్య.

శ్రీరాముఁ డరణ్యమందుండినను ఆయనభయముచే నేరాజైనను అయోధ్యపై దండెత్తివచ్చి వశపఱుచుకొనఁ బూనఁడని భావము. ఆయన భయముచేఁ గోరకుండుటేకాదు స్వతస్సిద్ధముగానే యెవ్వఁడుకోరఁడు. ప్రాకారములు = పురముచుట్టునుండు కోటగోడలు, ఎదలను=హృదయములయందు, విషమిశ్రితంబు=విషముతోఁ గలిసినది, జడుఁడు=బుద్ధిలేనివాఁడు, మన్నిమిత్తము=నేను గారణంబుగ, పాచితంబు=ప్రాయశ్చిత్తము.

తాత్పర్యము

ఏవిధముగఁ జూచినను నయోధ్యాపురమునకు భయములేదు. శ్రీరాముఁ డడవిలోనుండినను నాయన బాహుపరాక్రమముఁ దలఁచి యాపురిపై నెవఁడు నెత్తిరాఁడు. శ్రీరాముని భయముతోను బనిలేదు. స్వతస్సిద్ధముగనేరాఁడు. ఏలన నేరాజైనను సంపత్సమృద్ధిగల నగరమును వశపఱుచుకొనఁ గోరునుగాని ప్రాకారముల రక్షించువారులేక యేనుఁగులయు గుఱ్ఱములయు నేర్పాటులేక తెఱచిన గవని వాకిండ్లు మూయువారులేక తెఱచినట్లేయుండు రక్షించువారులేమి సంతోషములేకయుండు ప్రజలఁగలిగి పాడుపెట్టినట్లుండు నట్టనము నేశత్రువు వశపఱుచుకొన యత్నించును? విషముకలిసిన భక్ష్యంబు దినుమూఢుఁడును గలఁడా? దీని వశపఱుచుకొనువాఁడు లాభమేమియు ననుభవింప వెడిపోవునే కాని బాగుపడఁడు. ఇన్ని కష్టములకు నేనేకదా కారణము. కావున దానికిఁ బ్రాయశ్చిత్తము చెప్పెదను వినుఁడు.

ప్రాయశ్చిత్త శబ్దభవము పాచితము.

ఉ. పండెద నింతనుండి తృణ♦పర్ణచయంబున నొండె భూమిపై
నొండె, ధరించెదన్ జడల ♦ నూనెద నారల నెల్ల వేళలన్,
బండులఁ గందమూలములఁ ♦ బ్రాణము నిల్పెదఁ, దక్కు కాలమే
నుండెద హాయిగా వనిని ♦ నోరిమి నన్ప్రతిజ్ఞఁ దీర్చెదన్. ౨౦౪౧

ఇంతనుండీ = ఈదినము మొదలుకొని, తృణపర్ణచయంబుననొండెన్ = గడ్డియొక్కయు, ఆకులయొక్కయు సమూహమందుఁగాని, భూమిపైనొండెన్= భూమిమీఁదఁగాని, నారలన్=నారచీరలను, తక్కుకాలము = మిగిలినకాలము, ఓరిమిన్=ఓర్పుతో.

తాత్పర్యము

నేటినుండు నేను గడ్డిపడుకమీఁదఁగాని యాకుల పడుకమీఁదఁగాని పండుకొనెదను; లేదా భూమిమీఁదనైనఁ బండుకొనెదను; జడలను దాల్చెదను; సర్వకాలము నారచీరలు కట్టెదను; పండులు కందమూలములు దిని ప్రాణము

రక్షించుకొనెదను; పదునాలుగు సంవత్సరములలో శ్రీరామచంద్రుఁ డనుభ వింపఁగా మిగిలిన కాలమును నేను హాయిగా నోర్పుతో నడవులయందుండి యన్న ప్రతిజ్ఞను దీర్చెదను.

ఉ. ఏలెడుఁ గాక రామవిభుఁ • డీయిల లక్ష్మణుతోడ, నన్నకై
వాలినభక్తిఁ గాననని•వాసముఁ జేయుచు నాకుఁ దోడగున్
బాలిని బిన్న తమ్ముఁ, డట • బ్రాహ్మణముఖ్యు లయోధ్యలోన సీ
తాలలనేశుఁ బట్టము య • థావిధిఁ గట్టి సుఖింత్రుగా కెదన్.   ౨౦౪౨

తాత్పర్యము

శ్రీరామవిభుఁ డీభూమిని లక్ష్మణుఁడుతోడుగాఁ బాలించునుగాక, అన్న మీఁదనుండు నధికభక్తిచే నడవియందు నా పినతమ్ముఁడు శత్రుఘ్నుఁడు నాకు సహాయుఁడుగా నుండును. అక్కడ బ్రాహ్మణముఖ్యులు శ్రీరామచంద్రుస కయోధ్యలోఁ బట్టాభిషేకముచేసి సుఖింతురుగాక.

ఉ. దేవతలార! మ్రొక్కెదను • దీర్పుఁడు నాయభికాంక్షితంబు నే
నావిభు రామచంద్రు చర • ణంబుల వ్రాలి యనేకరీతులన్
వావిరి వేఁడుకొందు, రఘు•వర్యుఁడు నామతిఁ బోవఁ డేని నే
నే వని నుందు నందు, నతఁ • డేటికి నన్ను నుపేక్ష సేసెడున్!   ౨౦౪౩

అభికాంక్షితంబున్ = దృఢమైన కోరికను, వావిరి = బలము, నామతిన్= నా యిష్టప్రకారము, నన్నున్ = భ్రాతను, శిష్యుని, దాసుని, శరణాగతుని.

కాంక్షితము=కోరిక, అన్నబదులు మనము కానలకుఁబోయిన బాగుండును అనియే తొలుతనుండెను (చూ ౮౮౮౮ ప) అప్పటికింత పట్టుదలలేదు. ఇప్పు డిచ్చటి సంగతులన్నియుఁ జూచినపిమ్మట నాకోరిక బలపడి యడవులకుఁబోక తీరదు. తప్పకపోవలసినదే యను నభినివేశమెక్కువైనది. కావున నది యభి కాంక్షితము. స్వల్పమైన కాంక్షితము విమర్శపై బలిష్ఠము చేయుట అభికాంక్షి తము. భ.గీ. యందు అభిజానాతి యనుటకు శాండిల్యమహర్షి యిట్టియర్థమే వ్రాసియున్నాఁడు.

తాత్పర్యము

దేవతలారా! నాదృఢమైన కోరిక నెఱవేర్పుఁడు. మీకు నమస్కరించెదను. నే నా శ్రీరామచంద్రుని నానావిధముల నీవు పట్టాభిషేకము చేసికొమ్మని చరణ ములపైఁబడి పట్టుదలగా వేఁడుకొందును. నాయిష్టప్రకార మాయన చేయఁ డయ్యెనా నేనే యడవియందు నుందును. అట్లుచేసితినేని తమ్ముఁడను-శిష్యుఁ డను- దాసుఁడను- శరణాగతుఁడనునగు నన్నేల యాయన యుపేక్షించును. ఇదియంతయు భరతుఁడు గంగాతీరము చేరిననాఁటిరాత్రి జరిగినవృత్తాంతము.

—• ౮౯-వ సర్గము. భరతుండు గంగానది దాఁటుట. •—

మ. అనుచున్ వేఁగుచు నుండ వేగుటయు నా•క్ష్మాధీశసూనుండు త
మ్ముని శత్రుఘ్నునిఁ జీరి రేయి గనులన్ • మోడ్పంగనన్ రామచిం

తనచే; నాగుహుఁ దోడి తెమ్ము తటినిన్ ♦ దాఁటించుఁ గా కెల్లవా
రిని నా, జాగరణంబ నా కనుచు నీ♦రీతిం బ్రసంగించుచోన్. ౨౦౪౪

వేఁగుచునుండన్=పరితాపపడుచునుండ, వేగుటయున్=ఉదయముకాఁగా, క్ష్మాధీశసూనుండు=రాజకుమారుఁడు, చీరి=పిలిచి, తటినిన్ = నదిని, జాగరణంబ నాకున్=నాకును నిద్రలేదు, ప్రసంగించుచోన్=మాటలాడుచుండఁగా.

శత్రుఘ్నుఁడు భాగవత పరతంత్రుఁడగుటచేఁ జరమపర్వ నిష్ఠుఁడుగదా. ఆయనకేల రామచింతయను ప్రథమపర్వనిష్ఠయనిన భరతుని ప్రీతికొఱకైయని గ్రహింపవలెను. గురువునకుఁ బ్రీతికరమైనదే శిష్యునకుఁ బ్రీతికరమై యుండవలెను. ఆయన యిష్టదేవతయే తనకు నిష్టదేవత. ఆయనమతమే తన మతముగాని గురుశిష్యులు భిన్నమతములవారై యుండరాదు. కలిసి తెలియరాదు. తెలిసి కలియరాదు. శ్రీరామునకై భరతుఁడు తపించెను. ఆయిరువురనిమిత్తమై శత్రుఘ్నుఁడు తపించెను. ఇది యాచార్య ప్రాచార్య న్యాయమువంటిది.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము చెప్పుచుఁ దపించుచుండఁగా నుదయమయ్యెను. అప్పుడా భరతుఁడు శత్రుఘ్నుని బిలిచి రాత్రియంతయు శ్రీరాముని గూర్చిన చింతచేఁ గన్నుమూయలేదు. అందఱును నేఁడు దాఁటింపవలసిన పనియున్నది. కావున గుహుని బిలుచుకొనిరమ్ము. అనఁగా శత్రుఘ్నుఁడును రాత్రియంతయు నాకును నిద్ర లేదు. అని యీరీతి ముచ్చటలాడుచుండఁగా.

ఉ. వచ్చి గుహుండు గేల్మొగిచి ♦ స్వస్థత రేయి నదీతటంబునం
బుచ్చితిరే? సుఖంబొకొ చ♦మూతతి? కంచును స్నేహయుక్తి వా
క్రుచ్చిన సేమ మెల్లరకుఁ ♦ గూరిమి నీదుసపర్య లెల్ల మా
యిచ్చకు నెక్కె, గంగఁ దరి♦యింపఁగఁ జేయుము మమ్ము నెల్లరన్.

కేల్మొగిచి=చేతులు జోడించుకొని నమస్కరించి, స్వస్థతన్=నిర్విచారముగా, చమూతతికిన్ = సేనాసమూహమునకు, వాక్రుచ్చినన్ = చెప్పఁగా, కూరిమిన్ = ప్రేమతో, సపర్యలు=పూజలు, ఇచ్చకునెక్కెన్=తృప్తికరములైనవి.

తా త్ప ర్య ము

గుహుఁడువచ్చి నమస్కరించి నదీతీరంబున మీకు నిర్విచారముగా రాత్రి గడచిపోయెనా? సేనాసమూహమునకు సుఖమేకదా? యని స్నేహముతో మాటలాడఁగా నందఱకు క్షేమము; నీవుచేసినపూజలు నాకు మిక్కిలి తృప్తికలిగించెను.

కం. అని తీవరించి పలికిన, విని గుహుఁడున్ నగరి కేగి ♦ వేవేగమ త
జ్జనములఁ గని లేలెం డిఁకఁ, బనిగొని నావలను బూన్పఁ♦బదుఁడీ మీరల్.

తీవరించి=తొందరపెట్టి, పనిగొని=ప్రయత్నించి, లెండు+లెండు=లేలెండు.

తాత్పర్యము

అని తొందరపఱిచి పలికిన విని గుహుఁడు తన నగరికిఁబోయి మిగుల శీఘ్రముగ నామనుష్యులనెల్లర రారండని పిలిపించి యిఁక లేలెండు, నావలఁ బూన్పఁ బోవుఁడు అని చెప్పఁగా.

తే. సేనదాఁటింప వలయును•శీఘ్ర మనఁగ,
వారు రాజాజ్ఞఁదలఁదాల్చి•పంచశతము
నావలను దీర్చి పెద్దఘం•టలు గవాక్ష,
ములు పతాకలు కంబళ•ములునుగలిగి. ౨౦౪౭

తాత్పర్యము

మీరు సేన శీఘ్రముగ దాఁటింపవలయును. అనఁగ వారు రాజాజ్ఞ శిరసావహించి యైదునూర్లు నావలను జక్కఁజేసి పెద్దఘంటలు, కిటికీలు, ధ్వజములు, రత్నకంబళములును గలదై.

తే. స్వస్తికం బనుపేరఁ బ్ర•శస్తిఁగాంచు, గొప్పనావల నిల్పిన•గురులు విప్ర
జనులు మున్నుగఁ దల్లులు•సకలసతులు,
నెక్కిరందఱుఁ గుతుకంబు•లెదకునెక్క. ౨౦౪౮

స్వస్తికము ఈ యాకారముగానుండు సుఖకరములగు నోడలను, ప్రశస్తిగాంచి=ప్రసిద్ధికెక్కిన.

తాత్పర్యము.

స్వస్తికమనుపేరఁ బ్రసిద్ధికెక్కిన గొప్పనావల నిలుపఁగా వానియందు గురువులు బ్రాహ్మణులు దల్లులు, తక్కిన యంతఃపురస్త్రీలు సంతోషముతో నెక్కిరి.

తే. అన్ని నావలలోన మే•లగుచుఁబాండు,కంబళంబులు పఱచిన•క్రమఘంటి
కానినాదంబు చెన్న గు•దాని గుహుఁడు, తేర రాజకుమారులు•దీవరముగ.

పాండుకంబళంబులు=తెల్లకంబళ్ళు, క్రమఘంటికానినాదంబు =విననింపైన గంటలధ్వని, తేరన్=తీసికొనిరాఁగా.

తాత్పర్యము

అన్నియోడలలో మేలగుచుఁ దెల్లకంబళ్ళు పఱిచి చెవికింపైన గంటలధ్వనిచే నందమైనదాని గుహుఁడు స్వయముగఁ దీసికొనిరాఁగా రాజకుమారులిరువురు శీఘ్రముగ.

సీ. ఆరోహణ మొనర్పఁ•నావల శకటముల్, వస్తువు లన్ని యుఁ•బడవలందు
నెక్కింప నవ్వేళ•నే ముమున్న నేమున్న, యని యేట దిగియెడి•యట్టివారి
తమనివాసంబుల•దహియించునవ్వారి, నాపాత్ర యిది యిద్ది•నాది యనెడి
వారి పెన్నులివు ద్యో•పథ మంటెబెస్తలు, గాలిచాఁపల నెత్తఁ•గదలి చనియె

ఆ. సతులతోడఁ గొన్ని • శకటాళితోఁ గొన్ని, హరులతోడఁగొన్ని • యానయుగ్య
  తతులతోడఁ గొన్ని • తరు లేగి వింతగ, దించె గంగయవలి • తీరమునను.

ఆరోహణమొనర్పన్=ఎక్కఁగా, శకటముల్=బండ్లు, పెన్మొలివు=పెద్దధ్వని, ద్యోపథము=ఆకాశమార్గము,ద్యోవాహినీయని బాలసరస్వతి ప్రయోగముగలదు. హరులతోడన్ = గుఱ్ఱములతోడ, యానయుగ్యతతులతోడన్=యాన=రథములు పల్లకులు మొదలైనవి, యుగ్యములు=కాఁడికిఁగట్టునవి = ఎద్దులు, కంచరగాడి దలు, మొదలైనవి వీనిసమూహములతో, తరులు=నావలు, ఆవలితీరము=దక్షిణపుటొడ్డు.

తా త్ప ర్య ము

ఎక్కఁగా నాపిమ్మట బండ్లుమొదలైన వస్తువులను బడవలందెక్కింపఁగా నప్పుడు నేనుముందు నేనుముందని యేటిలో దిగెడివారలయు వారు వారు దిగియుండిన పందిళ్ళఁ గాల్చువారలయు (రాజభటులు నిర్గమనకాలమున శ్రీసమాగమార్థము తామున్ండిన యావాసముల దహింతురని ప్రసిద్ధి) నిది నాపాత్రయని యొకరనిన నిది నాపాత్రయని మఱియొకఁడనిన నీరీతి వాదులాడువారలయుఁ బెద్దధ్వని యాకాశమంటెను. బెస్తలు గాలిచాఁపల నెత్తఁగా నావలన్నియుఁ గదలి పోయెను. ఇట్లు కొన్ని స్త్రీలతోడను గొన్ని బండ్లతోడను గొన్ని గుఱ్ఱములతోడను గొన్ని రథాదివాహనములతోడను గొన్నియెద్దులు కంచరగాడిదలు మొదలగు వానితోడను నావలుపోయి గంగయావలి యొడ్డున దించెను.

కం. జంగ మధరణీధరము ల,నంగఁ బతాకములతోడ • నాగము లరిగెన్
  రంగుగ బరికాంద్రురతో, గంగానది నీఁదికొనుచుఁ • గమనీయగతిన్. ౨౦౫౧

జంగమ ధరణీధరంబులు=నడచుకొండలు, పతాకములతోడన్=ధ్వజములతో, నాగములు=ఏనుఁగులు, బరికాంద్రురతోన్=మావటివాండ్రతో, కమనీయగతిన్=అందమయిన నడకతో.

తా త్ప ర్య ము

ధ్వజములతో మావటీండ్రతో గంగానది నీఁదుకొనుచుఁ గొండలు పోవుచున్నవా యన్నట్టు లేనుఁగులు నడకొండలవలెఁ బోయెను.

ఉ. కొందఱు దాఁటి రీఁదుచును • గొందఱు తెప్పలమీఁదఁ బోవుచుం
  గొందఱు ప్రాఁకు లండఁగొని • కొందఱు కుండలపైఁ బరుండియున్
  గొందఱు యానపాత్రములఁ • గొందఱు కోలములం దరించి రా
  యందఱు వారి వారి కను • వైన తెఱంగులఁ బెక్కు రేవులన్. ౨౦౫౨

యానపాత్రములన్ = నావలను, కోలములన్ = తెప్పలను, తరించిరి= దాఁటిరి, అనువైన=అనుకూలమైన.

తా త్ప ర్య ము

కొందఱీఁదుచు దాఁటిపోయిరి. కొందఱు తెప్పలమీఁదఁబోయిరి. కొందఱు

పాలకిమొదలైన తేలికగానుండు ద్రాఁకులను జంకలలో నిఱికించుకొనియో వీఁపునకు నడుమునకుఁ గట్టుకొనియో కొందఱు కుండలబోర్లించి వానిమీఁదఁ బండుకొని కొందఱు నావలయందుఁ గొందఱు తెప్పలయందు వారివారి కనువైన వగు రేవులలో దిగి పోయిరి.

ఈపద్య మీ గ్రంథకర్త తొలుత రచియించిన కౌసల్యాపరిణయంబునఁ గాననగు- (చూ. అ. ౫-౬ వ.)

—♦ భరతుఁడు భరద్వాజమహర్షిని సందర్శింపఁ బోవుట ♦—

ఉ. అ మ్మెయి నేగి యందఱు ప్ర♦యాగ వనమ్మును మైత్ర మైనమూ
ర్తమ్మునఁ జేరి రంత నుచి♦తస్థలమం దొగి నెల్లవారి సౌ
ఖ్యమ్ముగ నుండఁ బంచి మను♦జాధిపుఁ డాత్మపురోహితాళితో
సమ్మతిఁ బాదచారి యయి♦చయ్యనఁ బోయె ఋషిప్రకాండమున్. ౨౦౩

అమ్మెయిన్=ఆవిధముగ, మైత్రమైనమూర్తమ్మునన్=మైత్రమను పేరుగల ముహూర్తమునందు, ముహూర్తము (రెండుగడియలకాలము=౪౮ నిమిషము లొక ముహూర్తము; ౨౪ నిమిషములు=ఒకగడియ). పగలు ముప్పది గడియలను ౧౫ భాగములుగా భాగించిన నందొక్కొక్క భాగమునకు నొక్కొక్క ముహూర్తమనిపేరు. మైత్రముహూర్తమున నొడ్డుచేరిరనఁగా గంగదాఁటునప్పటి కాఱుగడియల కాలమని యేర్పడియె. ఇంచుమించు ౮-౩౦ కాలము మైత్ర ముహూర్తము చెప్పుటచేత వీరికి నపరిమితభోగము లభించెడినని సూచించు చున్నది.భరద్వాజుని విందిదియేకదా. ఈ పదునేను ముహూర్తముల పేర్లు రెండు చోటుల రెండువిధములుగాఁ జెప్పఁబడినవి.అందు మొదటిది బృహస్పతిమతము.

రౌద్రస్సార్పస్తథా మైత్రః పైత్రో వాసవ ఏవచ । అపో వైశ్యస్తథా బ్రాహ్మ ప్రాజేశైంద్రాస్తథైవచ ॥ ఐంద్రాగ్నో నైరృతశ్చైవ వారుణార్యమణౌ భగి । ఏతేహ్నిక్రమశోజ్ఞేయా ముహూర్తాదశపంచచ॥ విధ్యమాధవీయమందు, ఆర్ద్రోరగ మిత్రమఘావసు జలవిశ్వాభిజి ద్విరంచేంద్రాః ఐంద్రాగ్ని మూల వరుణార్యమ భగయుక్తాదివాముహూర్తాస్స్యుః॥ ఏప్రకారమైనను మైత్రము మూఁడవది యగు చున్నది, ఉచితస్థలమందున్=అర్హమైనచోట, ఒగిన్=చక్కఁగా, ఆత్మపురోహితాళితోన్=తనపురోహితులసమూహముతో, సమ్మతిన్=నిండుమనస్సుతో, పాదచారియయి=వాహనమెక్కక కాలినడకతో, ఋషిప్రకాండమున్=ఋషిశ్రేష్ఠుని, ప్రత్యక్షదర్శనముగలవాఁడు ఋషి.

తాత్పర్యము

ఆవిధముగాఁ బోయి యందఱు మైత్రమనుపేరుగల ముహూర్తమందుఁ బ్రయాగవనమును జేరిరి. అంతనందఱను వారివారికి నుచితమైన స్థలమునందు

సుఖముగా నుండుఁడనిచెప్పి భరతుఁడు తనపురోహితులను దోడుతీసికొని పాద చారియై శీఘ్రముగా ఋషిశ్రేష్ఠుని,

పాదచారియయి యనిచెప్పుటచేఁ బెద్దలయొద్దకుఁ బెరుమాళ్ళయొద్దకుఁ బోవునపుడు వాహనమెక్కి పోరాదనియు నడచియే పోవలయుననియు వినయము సూచించు వేషమనఁగాఁ దలగుడ్డపెట్టుకొని చుంగులుజాఱ నంగవస్త్రములు గప్పుకొని కవచములు దొడుగుకొని పాదరక్షలువేసికొని రీవిగాఁబోక నడుమున కుత్తరీయము చుట్టుకొని పోవలయునని సూచన,

తే. జ్ఞానవృద్ధుఁ దపోవృద్ధు♦జంభదమన,వరపురోధ భరద్వాజుఁ♦బ్రవయుఁజూడఁ
బోవుచో మౌనివర్యుప్ర♦భూతరమ్య,నగవిరాజిత మైనవ♦నమ్ముఁ గనియె.

జ్ఞానవృద్ధున్=జ్ఞానముచే గొప్పవానిని, తపోవృద్ధున్=తపస్సుచేగొప్ప వానిని, జంభదమనవరపురోధన్=ఇంద్రుని పురోహితుని, బృహస్పతికి మమత యను దానియందుఁ బుట్టినవాఁడు, 'భరింపుమీద్వాజుననియె'నని భర+ద్వాజు ననుటచే భరద్వాజుఁడయ్యె, భరత్+వాజు=భరింపఁబడు, వాజము=రేతస్సుగల వాఁడు. అనఁగా రేతస్స్ఖలనము లేనివాఁడని యర్థము. భరద్వాజో హత్రి భిరా యుర్భిర్బ్రహ్మచర్యమువాస "తంహి జీర్ణగ్ స్థవిరగ్ం శయాన''మని శ్రుతి. ఈ కారణముచేఁ బ్రవయుఁడు=ముసలివాఁడు,భరద్వాజున్=బృహతో భరద్వాజయని శ్రుతి. ప్రసిద్ధుఁడైనవానిని, మౌనివర్యు=మునిశ్రేష్ఠునియొక్క, ప్రభూత= మిక్కిలి, రమ్య=అందమైన, నగ=వృక్షములచే, విరాజితము=ప్రకాశించునది.

తా త్ప ర్య ము

జ్ఞానముచేతను తపస్సుచేతను వయస్సుచేతను వృద్ధుఁడయి భరద్వాజుఁడను పేరుగల యింద్రుని పురోహితుని జూడఁబోవునపుడు నాయన మిగుల నందమైన వృక్షములచే బ్రకాశించు వనమ్మును భరతుఁడు చూచెను.

౯౧-వ సర్గము

చం. కని యొకకోసునంద జన♦కాండము నిల్వఁగఁ బంచి, శస్త్రముల్
ధనువునువీడి, మేనఁ బరి♦ధానము మీఁదికి నుత్తరీయముం
బొనరఁ, బురోహితాగ్రుఁ డయి ♦ పోవ వసిష్ఠునిఁ జూచినంత నా
సనముననుండి డిగ్గి తన♦ఛాత్రుల నర్ఘ్య మొసంగఁ బంచుచున్.

జనకాండమున్=జనసమూహమును, పంచి=ఆజ్ఞచేసి, పరిధానము=కట్టు వస్త్రము ఉత్తరీయము=పై వస్త్రము, పురోహితాగ్రుఁడయి=పురోహితుఁడగు వసిష్ఠుని ముందుంచుకొన్నవాఁడై, ఛాత్రులన్=శిష్యులను.

తా త్ప ర్య ము

ఇట్లుచూచి యొకకోసుదూరమునందే జనులనందఱ నిల్వనాజ్ఞసేసి యాభరణములు విల్లుబాణములు వదలి దేహమునఁ దెల్లని గట్టువస్త్రము మీఁదికి నుత్తరీ

యము మాత్రము గలవాఁడై వసిష్ఠుఁడు ముందుపోవుచుండఁగా నాయన వెనుకఁ దాను బోయెను. ఆ వచ్చుచున్న వసిష్ఠునిఁజూడఁగానే భరద్వాజుఁడు తానున్న యాసనము విడిచి దిగి తనశిష్యులను నర్ఘ్యముతెచ్చి తనచేతికిండని యాజ్ఞాపించుచు.

అంళగ "ఊసెద నారలనెల్లవేళలన్" అని చెప్పెనే ఇప్పుడీవస్త్రము లెట్లు వచ్చె ననరాదు. ఇది యారాత్రివేళచేసిన సంకల్పమే. అది ఇఁక నాచరణమందుంచుకొనఁబడును.

సీ. మునిభరద్వాజుఁడు♦ఘను వసిష్ఠునిఁ జేరి, యాతనిపిఱుఁదస♦యరుగుదెంచి
తన కభివాదనం♦బును ఘటించినవాని, దశరథసుతుఁ డని♦తలఁచి మదిని
నానుపూర్వ్యంబుగ♦నర్ఘ్యపాద్యంబుల, ఫలముల నొసఁగి నీ♦బలములకును
గోశమిత్రాళికిఁ, ♦ గుశలమకా యని, ప్రశ్నించి దశరథు♦పా టెఱింగి
తే. యుండుటను దాని నడుగక ♦ యుండె నంత
భరతుఁడు వసిష్ఠుఁడును మునిఁ ♦ బక్షిహరిణ
వృక్షదేహాగ్నులకు నెల్ల ♦ వేఱు వేఱఁ
గుశల మడిగిన నాయన ♦ కుశల మనుచు. ౨౦౫౯

పిఱుఁదస=వెనుకనే, చేరి=సమీపించి, వసిష్ఠ భరద్వాజులు సమానవయస్కులు గనుక నమస్కరింపలేదు. అనుపూర్వ్యంబుగన్=పెద్దపిన్నవరుసననుసరించి, బలములకున్=సేనలకు, కోశమిత్రాళికిన్=బొక్కసములకు స్నేహితులకు కుశలమకా=కుశల మేకదా యని, దశరథుపాటు=దశరథునిమరణము, దశరథుఁడు బాగున్నాఁడా యని మర్యాదకు నడిగినను భరతుఁ డేడువనారంభించును. దుఃఖకారణము కావున నప్రియప్రశ్న మడుగలేదు పక్షి=ఆశ్రమమందలి పక్షులకు, హరిణ=జింకలకు, వృక్ష=పూలచెట్లకు, పండ్లచెట్లకు, అగ్నులకున్=అగ్నిహోత్రమునకు, వేఱువేఱన్=ప్రత్యేక ప్రత్యేకముగా నొక్కొక్కదానినే.

తాత్పర్యము

భరద్వాజుఁడు వసిష్ఠునిఁ జేరఁబోయి యాయన వెనుకనేవచ్చి తనకు నమస్కరించువాని దశరథ సుతుఁడనితలఁచి పెద్దచిన్నవరుస ననుసరించి యర్ఘ్యము పాద్యము ఫలముల నొసఁగి భరతా! నీసేనలకు, ధనాగారములకు, స్నేహితులకుఁ గుశలమా యని యడిగి దశరథుఁడు మరణించుట యెఱిఁగినవాఁడు కావున నప్రియమైన యావృత్తాంతమును బ్రస్తావింపకయుండె. అంత భరత వసిష్ఠులును భరద్వాజుని మీపక్షులకు జింకలకుఁ బూల పండ్లచెట్లకు క్షేమమా యని వేఱువేఱఁ గుశలమడిగినఁ గుశలమే యని యాయన చెప్పెను.

—♦ భరద్వాజుఁడు భరతుని రాకకుఁ గారణ మడుగుట ♦—

చం. భరతునిఁ జూచి రాఘవుని♦పైఁ గలరక్తిని బల్కె, నేలుచున్
ధరణిని నీవు వచ్చినని♦దానముఁ జెప్పుము, నీదుచర్యలన్

దురితము దోఁచె, రామవిభుఁ ♦ దొయ్యలితో ననుజాతుతోడుతన్
జిరవనవాసిఁ జేసెఁ గద ♦ స్త్రీవశుఁడై నినుఁ గన్నయాతఁడున్. ౨౦౭౪

రక్తిన్=అనురాగముచే, శ్రీరామునియం దనురాగముచే ననఁగా భరతుని యందు ద్వేషబుద్ధిచేఁగాదని భావము. భరతునకు శ్రీరామభక్తి యెక్కువచేయ వలయుననియే భరద్వాజుని యభిప్రాయము. (౨౦౬౪-వ పద్యము చూడుఁడు) ఏలుచున్=పాలించుచు, నిదానము=మూలకారణము, దురితము=పాపము, తొయ్యలితోన్=భార్యయగు సీతతో, చిరవనవాసి=దీర్ఘకాల మరణ్యమం దుండు వానిఁగ, కన్నయాతఁడు=కనుటచేతఁ దండ్రియనవలయునుగాని గుణములచేఁ గాదు, స్త్రీవశుఁడై=ఆఁడుదానికి లోపడి.

తాత్పర్యము

భరతునిఁజూచి శ్రీరామచంద్రునియందుగల యనురాగముచే నతని రామ భక్తి దృఢపఱుప నిట్లనియెను. నీవు రాజ్యమేలుచు నిచ్చటికి వచ్చిన కారణమేమి? నీ నడవడికయందు దోషము కానవచ్చుచున్నది. నిన్నుఁ గన్నవాఁ డాఁడు దానికి లోపడి శ్రీరామచంద్రుని భార్యతోఁ దమ్మునితోఁ జిరకాల మడవులలో నుండఁ జేసెఁగదా.

ఉ. పొమ్మనినంత మా ఱనక ♦ పోయెఁ గదా పదునాలుగేండ్లు దా
సమ్మతిఁ గాన నుండఁగఁ బ్ర♦శస్తచరిత్రుఁ డపాపశీలికిన్
దమ్మున కెగ్గుగూర్చి వసు♦ధాతల మెల్ల నకంటకంబుగా
నెమ్మది నేల నెంచితివె ♦ నిర్దయవృత్తిని గైకనందనా! ౨౦౭౮

ప్రశస్తచరిత్రుఁడు=ప్రశంసింపఁదగిన నడవడిగలవాఁడు, అపాపశీలికిన్= పుణ్యచరిత్రుఁరామునకు, తమ్మునకున్=లక్ష్మణునకు, ఎగ్గు=కీడు, అకంటకంబు గాన్=బాధించువారు లేకుండునట్లుగా, నిర్దయవృత్తిన్=దయలేనివ్యాపారముచే, కైకనందనా=కైకకొడుకా, కైకను సంతోషపెట్టువాఁడా, ఇట్టివాఁడవైన నీయందు దశరథుగుణము లుండవుగాని కైకగుణములు లేకయుండునా?

తాత్పర్యము

కొడుకా పోయన కైకయొకమాట చెప్పఁగానే ప్రత్యుత్తరమైన చెప్పక పుణ్యచరిత్రుఁడగు శ్రీరామచంద్రుఁడు పదునాలుగేండ్లడవులలోనుండ సమ్మతించిపోయెఁగదా. అటువంటి ప్రశంసింపఁదగిన నడవడిగల వానికిఁ దమ్మునకు లక్ష్మణునకుఁ గీడు కలిగించి భూమియంతయు శత్రుబాధలేకుండ సంతోషముతో దయాహీనుఁడా పాలింపఁ జూచితివా?

కం. పాపార్జితంబు నింతటి, తీపా నీ?కనిన నతఁడు♦దీనుండై బా
ష్పాపూర్ణనేత్రుఁడై యతాపసుఁ గని యిట్టు లనియెఁ♦దడఁబడఁ బల్కుల్.
౨౦౭౯

పాపార్జితంబు=పాపకార్యములచే సంపాదించినది, ఇంతటితీపా=అన్నను దమ్ముని దేశమువెడలఁ గొట్టుటయేగాక యెందోయున్న చోటికిఁబోయి చంప యత్నించునంతటి తియ్యనిపదార్థమా? దీనుండై = దుఃఖించుచున్నవాఁడై, బాష్పపూర్ణనేత్రుఁడై = కన్నీళ్ళచేనంతట నిండిన కన్నులుగలవాఁడై, తడఁబడన్ = తొట్రుపాటు పడుచుండఁగా.

తాత్పర్యము

నీకుఁ బాపముచే సంపాదించిన ధన మింత ఘోరకార్యము చేయించునంతటి యింపైనదా? అనిన భరతుఁడు దుఃఖించుచుఁ గన్నులు నీళ్ళతోనిండఁగా మాట తడఁబడ నత్తపస్వితో నిట్లనియెను.

చం. అకట మహానుభావ! నినుఁ•నంతటివాఁడును నిట్టు లెంచ నీ
తకలుష వ్యర్థజీవిని గ•దా? యొకపాపము లేదు నాయెడన్;
వికటకఠోర వాక్కులను • వీనులఁ గ్రుచ్చుట మేల? కైకపు
త్రకుఁ డనునింద దప్ప నొక•తప్పును గల్గదు సుమ్ము నాయెడన్. ౨౦౯౦

మహానుభావ = గొప్పతపోమహిమగలవాఁడా- నినునంతటివాఁడును = నీయంత త్రికాలవేదియు, ఈమాటయే కౌసల్యాదేవియన్నప్పుడు ఈమెయాఁడుది, అందుఁ బుత్రశోకముచేఁ దపించుచున్నది. ఈమెకిట్టి సందర్భమున వాస్తవము తెలిసికొను బుద్ధిబలమెచ్చటిదని మిగుల సంతాపించినవాఁడఁగాను. మరల నిట్టులే గుహుఁ డడిగినప్పుడు అడవిమనుష్యుఁడు అనాగరికుఁడు నామనస్థితి వీఁడెట్లు తెలిసికోఁగలఁడని సహించితిని గాని త్రిలోకవేదివి త్రికాలవేదివగు నీవు నావిషయమై సందేహించినపుడు నాజన్మమే వ్యర్థమని భావము. వీతకలుషన్= పాపములేనివానిని, వ్యర్థజీవిని = వ్యర్థముగా జీవించువాఁడను, వికట=మిక్కిలి భయంకరమైన, కఠోర=కఠినములైన, వాక్కులను=మాటలను.

తాత్పర్యము

అయ్యో! తపోమహిమచే భూతభవిష్య ద్వర్తమానములఁ దెలిసికొను మహిమగలవాఁడా! నీవంటి మూఁడుకాలముల మూఁడులోకముల వర్తమానముల నెఱిఁగినవాఁడుకూడ నీప్రకారము నన్ను నిర్దోషిని దోషి యని యెంచెనేని నాజన్మమే వ్యర్థము నామనస్సునేను శోధించిచూచితిని గాని యొకతప్పైనఁ గానరాలేదు కాఁబట్టి భయంకరములై కఠినములైన వాక్కులను సూదులచే నా చెవులు గ్రుచ్చుటమేలా? నీవు పిలిచినట్లు కైకపుత్రుఁడను దోషముదప్ప నాయందు మఱియేదోషము లేదు. దైవము చేసినదానిని నేనెట్లు సవరింపఁగలను.

ఆ. నేను లేనివేళ • నిష్ఠుర యై నాఁడు, జనని సల్పినట్టి•చెనఁటిచేఁత
నామతంబుగాదు • నాయిష్టమును గాదు, దాన సంతసంబుఁ • బూన నైదను,

నిష్ఠురయై=కఠినవర్తనముగలదై, చెనఁటిచేఁత=చెడ్డకార్యము.

తాత్పర్యము

నామతంబుగాదు నాతోనాలోచించి నా యభిప్రాయము చొప్పునఁ జేసినది కాదు నాయిష్టమునుగాదు చేసినపిమ్మట నేనుదాని నంగీకరించిన వాఁడనుగాను.

ఉ. పోవుచు నున్నవాఁడ రఘు•పుంగవుఁ దోడ్కొనిరా నయోధ్యకున్
పావనశీల! యాయనఘు•పాదయుగంబులమీఁద వ్రాలి స
ద్భావమునన్ క్షమింపు మని•ప్రార్థన సేయఁగఁ బూనినాఁడ; నీ
తావిభుఁ డిప్డు డెచ్చట య•థాసుఖవృత్తిఁ జరించుఁ జెప్పుమా. ౨౦౬౨

పావనశీల = పవిత్రస్వభావముగలవాఁడా, పాదయుగంబులమీఁదన్ = రెండుకాళ్ళమీఁద, సద్భావమునన్ = మంచియభిప్రాయముతో, యథాసుఖవృత్తిన్=సుఖము నతిక్రమింపని వ్యాపారముతో.

తాత్పర్యము

అటైన నీవిపుడింత సేనతో వచ్చుటకుఁ గారణమేమందువా? పవిత్రచరిత్రా! శ్రీరామచంద్రుని నయోధ్యకుఁ బిలుచుకొని వచ్చుటకై పోవుచున్నాను. పోయి యేమిచేసెదవందువా? ఆయన రెండు పాదముల మీఁదఁబడి మంచి మనస్సు గలవాఁడవై నన్ను క్షమింపుమని ప్రార్థనచేసి యాయన కచ్చుటనే పట్టాభిషేకముచేసి పిలుచుకొని రాఁబూనినాఁడను. కావున శ్రీరాముఁ డెచ్చట హాయిగా విహరించుచున్నాఁడో యాస్థలమును చెప్పుము.

చం. స్థిరకృప నన్న నంతట వ•సిష్ఠుఁడు లోనగువారు వేఁడినన్
భరతునిఁ జూచి మౌని యిటు • పల్కెను రాఘవవంశ్య! నీకు నీ
గురుహితవృత్తియున్ దమముఁ • గోవిదసాధ్వను యాయితల్ దగున్
బరఁగుము నిత్యకీర్తివయి • భాసురతేజ జగత్త్రియంబునన్. ౨౦౬౩

స్థిరకృపన్ = స్థిరమైనదయచే, పైపద్యములోని చెప్పుమా యనుదానితో నన్వయము-గురుహితవృత్తియున్=అన్న మేలుకోరు వ్యాపారము, దమము= ఇంద్రియ నిగ్రహము, కోవిదసాధ్వనుయాయితల్=పండితులగు సాధుల ననుసరించి పోవలయుననుట, భాసురతేజ = ప్రకాశించు తేజస్సుగలవాఁడా, జగత్త్రియంబునన్=మూఁడులోకములందు,నిత్యకీర్తివి=శాశ్వతమైన కీర్తిగలవాఁడవు.

తాత్పర్యము

స్థిరమైన కృపతోఁ జెప్పుము. అని చెప్పఁగా వసిష్ఠుఁడు మొదలగువారు మునీంద్రా! భరతుని యభిప్రాయము దుష్టముగాదు ఆయన సత్యమే చెప్పెను. మంచిమనస్సుతోనే పోవుచున్నాఁడని ప్రార్థింపఁగా భరతునిఁజూచి భరద్వాజుఁ డిట్లనియె. దశరథనందనా! నీకు నన్నకు హితమైన వర్తనము, ఇంద్రియ నిగ్ర

హము, జ్ఞానులగు సాధుల ననుసరించి వర్తించుట దగును. నీ తేజస్సు లోకమునఁ బ్రకాశింప మూఁడులోకములందు శాశ్వతకీర్తి కలవాఁడవై యుండుము.

చం. ఎఱుఁగనివాఁడఁ గాను ధర◆ణీశ్వరనందన! నీమనంబు, నే
నెఱిఁగియు నీకుఁ గీర్తి ఘటి◆యింపఁగ బుద్ధి దృఢీకరింపఁగా
బిఱుసన నాడినాఁడిఁ; బృథి◆వీజయుఁ దమ్ముఁడుఁ గొల్వ రాముఁడున్
వఱలెడిఁ జిత్రకూటగిరి◆వర్యమునన్, నిజ మే నెఱుంగుదున్. ౨౦౬౪

తాత్పర్యము

రాజకుమారా! నీ మనస్సెట్టిదైనది నాకుఁ దెలియకపోలేదు. నేనెఱిఁగియు శ్రీరామభక్తియందు నీబుద్ధిని స్థూణానిఖనన న్యాయమున స్థిరపఱిచి నీకుఁ గీర్తికలిగింపఁగోరి పరుషవాక్యము లాడితిని. సీతారామలక్ష్మణులు మువ్వురు చిత్రకూటపర్వతంబున నున్నవారు. నిజముగా నాకుఁ దెలియును,

స్థూణానిఖననన్యాయ మనఁగా నొకగుంజను నేలలో గట్టిగాఁ బాఁతియు గట్టిగ నున్నదో లేదోయని కదలించి చూచుటవంటిది.

కం. ఈపూఁట నిందు నిల్వుము, నీపరిజనమంత్రిజనులు◆నీవుఁ బ్రియమునన్
రేపాడి పోవఁ జను సీ,తాపతిఁ గనఁ గామితార్థ◆దానప్రవణా. ౨౦౬౫

ఈపూఁట=పూఁట దినమునకుపలక్షణ- పరిజన=సేవకులతో, మంత్రిజనులతో, నీవునిలువుము- ఒకానొకచో సహార్థంబున యుష్మదస్మదర్థంబులభితంబగుచోఁ గ్రియలు తత్కర్తృకంబులు విభాషనగు. సు.వ్యా.వాక్య. సూ. ౨౧. ఈ సూత్రప్రకార మేకవచనక్రియ, రేపాడి=ఉదయమున, కామితార్థదానప్రవణా= కోరినకోరిక లిచ్చుటయందు నాసక్తి గలవాఁడా, కావున నాకోరిక నెఱవేర్చుము.

భరద్వాజుఁ డిట్లుచెప్పుటచే రాజు తనయింటికి వచ్చినపుడు సపరివారముగ నతనికి నాతిథ్యమిచ్చి యాదరింపవలయునని సూచన.

యావంతః ఖలువై రాజాన మనుయాంతి తేభ్యః
సర్వేభ్య ఆతిథ్యం క్రియతే ఐతరేయబ్రాహ్మణము.

తాత్పర్యము

కోరినవారికోరికలు నెఱవేర్చుటయం దాసక్తి గలవాఁడా నీవు నీపరిజనులతో మంత్రులతో నీదినము నా యాశ్రమంబున నిలువుము. శ్రీరామునిఁ జూడ రేపటి యుదయము పోవచ్చును.

౯౧-వ సర్గము

కం. అనవుడు నట్టులుకా యని, జనపాలతనూజుఁ డానిశనే నిలిచె నటన్
ముని యాతిథ్యార్థము ప్రార్థన మొనరుప నాతఁ డాభ◆రద్వాజు ననున్.

తాత్పర్యము ౨౦౬౬

అని ముని యాతిథ్యమిచ్చుటకై భరతుని బ్రార్థింపఁగా నారాత్రి యచ్చట

నిలుచుట కంగీకరించెను. నిలుచుట కంగీకరించి పరిజనులకందఱకు నాతిథ్య మిచ్చెదనన్నవిషయమై యిటుల భరద్వాజుతో ననెను.

కం. ఇచ్చితిరి పాద్య మర్ఘ్యం, బిచ్చితి రాతిథ్య మడవి ♦ నెసఁగెడదానన్
సచ్చరితా!తుష్టుఁడ నన, మచ్చిక నగ వంకురింప♦మౌని వచించెన్. ౨౦౬౭

ఇచ్చితిరి=పూజ్యార్థంబున బహువచనము.

తాత్పర్యము

మునీంద్రా! మీరర్ఘ్యమిచ్చితిరి, పాద్యమిచ్చితిరి, అడవిలోఁ బుట్టువానితో నాతిథ్యమిచ్చితిరి చాలసంతోషించితి ననిన నాయన నిష్కల్మష హృదయమునకు వినయమునకు గర్వములేమికిఁదానేల విందుపెట్టెద ననుచున్నానో యది తెలియ మికి నడపులయందు వాఁడింతకన్న నేమి యెక్కువ చేయఁగలఁడను నతని యభి ప్రాయమెఱింగి నామహిమ వీనికిఁ దెలియదా యెనని చిఱునవ్వునవ్వి ముని యిట్లనెను

ఉ. ఏమియొ కొంచె మిచ్చుటనె♦ తృప్తి వహించితి, నే నెఱుంగుదున్;
భూమిప! నీకు సేనకును ♦ భోజన మీయఁగ వేడ్క యయ్యెడున్
నామతి నీవు పోవుట ఘ♦నంబు ముదం బిడు నాకు, వాహినీ
స్తోమము దూరమం దిడితి ♦ తోడ్కొని రా వది యేల నావుడున్. ౨౦౬౮

తాత్పర్యము

రాజా! నేనేదియొ కొంచె మిచ్చుటచేతనే నీవు సంతుష్టుడవైతివి. అది నాకుఁ దెలియును. ఈదినము నీకు నీసేనకు నందఱకు భోజనము పెట్టవలయు నని నాయభిలాష.నామనస్సుప్రకారము నీవుపోయిన నాకు మిక్కిలి సంతోషమగును. నీవు సేనాసమూహమును దోడఁదీసికొనిరాక యొంటరిగా వచ్చితివేల?

చం. మునివర! మీభయంబునఁ జ♦మూనివహంబులఁ దేను, రాజులేన్
జనపతిపుత్రులేని జత♦నంబునఁ ద్యాజ్యము చేఁత మే లగున్
మునివిషయంబు, లశ్వకరి♦ముఖ్యబలాంగము రాశ్ర మోటజా
వనిరుహపాళిఁ దీర్చు నని ♦ వచ్చితి నొంటరిగాఁగ, నం చనన్. ౨౦౬౯

జతనంబునన్=యత్నము, తద్భవము, జతనము=ప్రయత్న పూర్వక ముగా, త్యాజ్యముచేఁత = వదలిపెట్టుట, మునివిషయంబులు = మునులుండు ప్రదేశములు, అశ్వకరి ముఖ్య బలాంగములు=గుఱ్ఱములు, ఏనుఁగులు మొదలగు సేనాంగములు, ఒంటెలు భటులు, ఆశ్రమోటజావనిరుహపాళిన్ = ఆశ్రమ మందలి పర్ణకుటీరమందలి చెట్లసమూహమును, తీర్చును=నాశముచేయును.

తాత్పర్యము

మునీంద్రా! మీవలన భయముచే నేను సేనలనుగూడఁ దీసికొని రాలేదు. రాజులైనను రాజకుమారులైనను మునుల యాశ్రమములందు సంచరింపక ప్రయత్నపూర్వకముగా వదలిపెట్టవలయును. సేనలయందలి యేనుఁగులు

గుఱ్ఱములు ఒంటెలు లోనగునవి యాశ్రమము నందలివియుఁ బర్ణశాలలయం దుండునవియు నగు వృక్షములను ధ్వంసముచేయునని దూరమునందే వదలి నే నొంటరిగానే వచ్చితిని. అవి వచ్చి మీయాశ్రమ వృక్షములను విఱిచి ధ్వంసము చేసిన మీరు కోపింతురు. మఱి శపింతురు. ఇది మీవలనిభయము.

ఒంటరిగానే=భరతుఁడొక్కఁడే రాలేదు. శత్రుఘ్నుఁడు వసిష్ఠాదులు కూడ వచ్చినవారే. కావున నొంటరిగా ననఁగా సేనలు మొదలయినవి లేకయనియర్థము.

కం. వలదు తడ వింక సేనలఁ, బిలిపింపు మటంచు మౌని♦ప్రియమునఁ బలుకన్
బలఁగం బంతయు రా రఘు,
కులముఖ్యుఁడు పనిచె నంతఁ ♦ గుతుకము మీరన్. ౨౦౭౦

తాత్పర్యము

అని చెప్పఁగా నీవు భయపడవలదు. ఆలస్యములేక నీవు సేనలఁ బిలిపింపుము. అని ముని సంతోషముతోఁ జెప్పఁగా సేనయంతయు రావలసినదని భరతుఁ డాజ్ఞాపించెను అంత సంతోషముతో.

—♦ భరద్వాజుండు భరతునకు విందుపెట్టుట ♦—

సీ. ఋషివరేణ్యుండగ్ని♦గృహమునఁ జొచ్చిము,మ్మాఱువార్చియుముఖ♦మార్జవంబు
నిరువారులు సల్పి భూ♦వరుం కాతిథ్యార్థ,మయి విశ్వకర్మ నా♦హ్వాన మొనరఁ
జేసి యాతిథ్యంబుఁ ♦ జేసెద సేనకు,విశ్వకర్మయుఁ ద్వష్ట♦వేగ నచ్చి
గృహసంవిధానంబుఁ ♦ నిప్పుడ సేయుఁడు, శక్రాదిదిక్పతుల్ ♦ సకలవస్తు
తే. తతుల సరయుఁడు ప్రాక్ప్రత్య♦క్కు లందు,
మింటనేలను గలిగిన♦మేటినదులు
కొన్ని యిక్షుజలంబులఁ ♦ గొన్ని సురను,
గొన్ని మైరేయముల నిటఁ ♦ గూర్చుఁగాక. ౨౦౭౧

అగ్నిగృహమునన్=అగ్నులుండు నింటియందు, ఇది దేవతాసన్నిధాన స్థలము గావునఁ బవిత్రము, ముమ్మాఱు = మూఁడుసారులు, అచ్యుత-అనంత-గోవింద యని కేశవ-నారాయణ-మాధవ యని,వార్చి=ఆచమించి,ఇచ్చట 'యు' ననునది యనుక్తసముచ్చయము, ముఖమార్జనంబు=రెండుమార్లు పెదవి దుడుచుకొనుట,ఇది సపర్వాంగాచమనమున కుపలక్షణ. త్రిరాచామేత్ ద్విఃపరిమృజ్య సకృదుపస్పృశ్య శిరశ్చక్షుషి నాసికేశ్రోత్రే హృదయమారభ్య అని చెప్పఁబడిన ప్రకారము ముఖమార్జనంబు పెదవి తుడుచుకొనుట, ఏవైదిక కార్యమునకు ముం దాచమింపవలెను. ఆచమింపక యేకార్యము చేయరాదు. ఆతిథ్యార్థము=అతిథ్యముకొఱకు, ఆహ్వానము=పిలుపు, విశ్వకర్మ = శిల్పకార్యముల నన్నిటిని జేయువాఁడు త్వష్ట=కొయ్యపనిచేయుశిల్పి, గృహసంవిధానంబు = ఇండ్లనుగట్టుటను, ముందుచెప్పఁబడు నన్నాదుల రక్షించుటకు నింద్రాదులఁ బిలుచుచున్నాఁడు. శక్రాదిదిక్పతుల్=ఇంద్రుఁడు మొదలయిన దిక్పాలకులు, ప్రాక్ప్రత్యక్కులందున్ = తూర్పుపడమరలందు, ఇక్షుజలంబులన్ = చెఱకుపాలవంటి నీటిని,

సురను, గౌడి పైష్టి మాగధి యనఁబడు మూఁడు విధములైన మద్యములను, మైరేయము=మిరాదేశమందు ఖర్జూరాదులచేఁ జేయఁబడు మద్యములను.

తాత్పర్యము

ఋషిశ్రేష్ఠుఁడయిన భరద్వాజుఁడు దేవతాసన్నిధాన మగుటచేఁ బవిత్రమైన యగ్నిగృహముఁబ్రవేశించి మూఁడుమార్లాచమించి రెండుమార్లు పెదవితుడుచు కొని రాజున కాతిథ్యము కల్పించుటకై దేవశిల్పి విశ్వకర్మను బిలిచి రాజుసేనకు నేనాతిథ్య మొసఁగెదను. నీవు త్వష్ట యిపుడేవచ్చి యందఱు దిగుటకు నిండ్ల నేర్పాటు సేయుఁడు. ఇంద్రాది దిక్పాలకులారా! సమస్త వస్తువులను విచారించు కొనుఁడు. తూర్పు పడమర నాకాశమున నేలఁగలిగిన నదులన్నియుఁ గొన్ని చెఱకుపాలవంటి నీటిని, గొన్ని సురను, గొన్ని మైరేయములను గూర్చుఁగాక.

సీ. దేవగంధర్వవి॰శ్వావసుహూహుఁడు హాహుఁడు నుభయవి॰ధాప్సరసలు
విశ్వాచియు ఘృతాచి ॰ వినుత యలంబుస, నాగదంతయు హేమ॰నగనివాస
హేమయుమిశ్ర కే॰శీఢ్యనామ్నియు మొదల్,
బ్రహ్మేంద్రులను గొల్చు॰పద్మముఖులు
తుంబురుఁ డాదిగాఁ॰దో డొప్ప మేళంబు, తో రండు ధనదుని॰తోషణదము
తే. వస్త్రభూషణసత్పత్ర॰వంత మంగ
నాఫలము నైన చైత్రవ॰నంబ రమ్ము
చంద్రుఁ డొసఁగుత భక్ష్యభో॰జ్యములు లేహ్య
చోష్యములు వివిధాన్నముల్ ॰ చొవ్ప చెడక. ౨౦౪

ఉభయవిధాప్సరసలు=దేవజాతి యప్సరసలు, గంధర్వజాతి యప్సరసలు, అందు ముఖ్యాప్సరసలు విశ్వాచి మొదలగువారు, పద్మముఖులు=స్త్రీలు, విశ్వాచి=అందఱిచేతఁ బూజింపఁబడునది, ఘృతాచి=నేయివలెఁ గరఁగునది, "వెన్నవలెం గరంగు నలివేణులఁ గౌఁగిటఁజేర్చు భాగ్యముల్" మనుచరిత్ర. అలంబుస=దేవతలకుఁ దగినది, బుసులనఁగా బుధులు దేవతలు, వారికి అలం = యోగ్యమైనది బుస + అలమ్మనునది వర్ణవ్యత్యయముచే అలంబుసమయ్యెను. నాగదంత=ఏనుఁగు దంతములవలె శుభ్రమగు దంతములుగలది. హేమ=బంగారుఛాయ గలది, హేమనగనివాస = హేమ ఇది వేఱొకతే. ఇది మహేంద్రపర్వతమున మయుఁడు కట్టియిచ్చినచోట నుండునది. స్వయంప్రభా బిలమందుండినది యిదియే. (చూ కష్కింధ. ౧-౨౮౯ పద్యము). ఇది మయుని యుంపుడుకత్తె. మిశ్రకేశి=దట్టమైన తలవెండ్రుకలు గలది, మిశ్రకేశీఢ్యనామ్ని=మిశ్రకేశియను శ్లాఘ్యమైన పేరుగలది, ఇట్లే పేర్లకు వ్యుత్పత్త్యర్థములు. తుంబురుఁడు=అప్సరస్త్రీలకు గానశాస్త్రము చెప్పువాఁడు, మేళంబుతోన్=నాగసరము మద్దెల తాలము లోనగు వాద్యములతో, ఇఁక భోగస్థానములఁ జెప్పుచున్నాఁడు. ధన

దుని=కుబేరుని, తోషణదము=సంతోషము నిచ్చునది, వస్త్రభూషణ సత్పత్రవంతము=వస్త్రములు భూషణములు అనెడిమేలైన యాకులుగలది, అంగనాఫలము=స్త్రీలనెడి పండ్లుగలది, చైత్రవనంబ=చైత్రవనమూ, ఇది కుబేరుని యుద్యానవనము పేరు,తోఁటలను,నదులను బిలుచుటయనఁగా వాని యధిష్ఠాన దేవతలను బిలుచుటగా గ్రహింపవలెను. అన్నపతియగు చంద్రునిఁ బిలుచుచున్నాఁడు. భక్ష్యములు = అప్పచ్చులు, భోజ్యములు = అన్నాదులు, లేహ్యములు=ఊరు పిండులు పచ్చళ్ళు మొదలయినవి; చోష్యములు=వడియాలు మొదలగునవి, వివిధాన్నముల్=అనేకవిధములయిన యన్నములు.

తాత్పర్యము

దేవగంధర్వ విశ్వావసులు, హాహాహూహూలు, దేవతాప్సరసలు, గంధర్వాప్సరసలు, విశ్వాచి ఘృతాచి యలంబుస నాగమేరుపర్వతముననుండు హేమమిశ్రకేశి మొదలయినవారు బ్రహ్మను నింద్రునిఁ గొలుచుస్త్రీలు తుంబురుఁడు మొదలుగా నందఱు మద్దెల తాళము మొదలగు కొలములతో రావలయును. కుబేరునికి సంతోషకరమై వస్త్రభూషణము లాకులుగాను స్త్రీలు ఫలములుగాను గల చైత్రవనమా! రమ్ము చంద్రుఁడా! భక్ష్య భోజ్య లేహ్య చోష్యములు నానావిధములైన యన్నములు సమకూర్పుము.

కం. పలుతెగ లగుపూవులచేఁ జెలు వగుమాల్యములు సురయు•సిద్ధరసముతోఁ
దులితము లగుపేయంబులు, గలిగింపఁగ వలయు శశిస•కలమాంసంబుల్.

మాల్యములు = పూలదండలు, పేయంబులు = త్రాగయోగ్యములైనవి, శశి=చంద్రుఁడు, సకలమాంసంబుల్=సమస్త విధములైన మాంసములు, సిద్ధరసముతోన్=అమృతముతో, తులితములు=సరిపోల్పఁదగినవియు.

తాత్పర్యము

అనేకవిధములగు పూవులచే నేర్పఱుపఁబడిన దండలు సుర, అమృతముతో సరిపోల్పఁదగినవియగు పేయంబులు, అన్నివిధంబులైన మాంసంబులు వీనినెల్లఁ జంద్రుఁడు సమకూర్పవలయును.

చం. అనుచు సమాధియుక్తుఁ డయి • యమ్ముని శిక్ష స్వరంబు తప్పరా
స్టను గరముల్ మొగిడ్చి జప•తత్పరుఁ డౌచును బ్రాఙ్ముఖుండునై
వినుతి యొనర్ప దేవతల • వేఱుగ వేఱుగఁ బేరువాడి చ
య్యన మలయాద్రిదర్దురసు•ఖానిల మయ్యెడ వీచె హాయిగన్. ౨౦౪౪

ఇంతకార్యము ముని యేశక్తిచేఁ జేసెననఁ జెప్పుచున్నాఁడు.

సమాధియుక్తుఁడై =అష్టాంగయోగమునఁ జెప్పఁబడిన సమాధితోఁగూడినవాఁడై, ఏకాగ్రచిత్తుఁడై, శిక్ష, స్వరంబు =శిక్షాశాస్త్రమునఁ జెప్పఁబడిన యుదాత్తాది స్వరములు, తప్పక = ప్రమాదపడక, "దుష్టశ్శబ్దస్స్వరతో వర్ణతోవా,

మిథ్యాప్రయుక్తోనతదర్థమాహ, సవాగ్వజ్రోయజమానంహినస్తి।యథేంద్రశత్రుస్స్వరతోపరాధాత్త" న్నట్లు వేదమున స్వరము తప్పినను శబ్దముతప్పినను బఠించువానిని బాధించును. అట్లు తప్పక చెప్పెనని యర్థము. కరములెమొగిడ్చి =చేతులుజోడించి, ఇది యాహ్వానముద్ర. దీనితోనే పిలువవరయును. ప్రాఙ్ముఖుఁడు=తూర్పుదిక్కుగాఁ దిరిగినవాఁడు, ఇట్లుండుటవలన జపము చక్కఁగా ఫలించును. జపతత్పరుఁడు=జపమున నభిలాషగలవాఁడు, దేవతలన్=విశ్వకర్మాదులను, పేరు + వాడి, పేరు + పాడి=పేరు చెప్పి, వేఱుగవేఱుగన్=ప్రత్యేక ప్రత్యేకముగ, ఒక్కొక్కరినే, మలయాద్రిదర్దుర సుఖానిలయ = మలయపర్వతము నుండి దర్దురపర్వతమునుండి సుఖకరమైనగాలి.

తా త్ప ర్య ము

అనిచెప్పి సమాధియందున్నవాఁడై యాముని స్వరముదప్పక శ్రద్ధతోఁ దూర్పుముఖముగాఁ దిరిగి జపముచేయుచు నాహ్వానముద్రఁ బట్టి చేతులు దోసిలి వలె జోడించి దేవతలపేర్లు చెప్పుచు వేఱువేఱుగ స్తోత్రముచేయఁగా శుభసూచకముగా మలయపర్వతము నుండి దర్దురపర్వతమునుండి చల్లని మెల్లని కమ్మని గాలి వీచెను.

కం. కురిసెను బువ్వులవానలు.
మొరసెను దుందుభులు దిశల • ముఖముల నెందున్
బెరసెను దివ్యామోదము, నెరసెను నచ్చరలపిండు • నృత్యము లంతన్.

దుందుభులు = దేవదుందుభులు, దివ్యామోదము = శ్రేష్ఠమైనసువాసన, బెరసెను=వ్యాపించెను, అచ్చరలపిండు = అప్సరస్త్రీల సమూహముయొక్క, నృత్యములు = ఆటలు.

తా త్ప ర్య ము.

పూలవాన కురిసెను, దిక్కులయందు దేవదుందుభులు ధ్వనించెను. దివ్యమైన వాసన వ్యాపించెను. అచ్చరల గుంపులయాటలు నెరసెను.

ఉ. అచ్చరమచ్చకంటుల ల • యాన్వితహారిసుఖావహంబు నౌ
నచ్చపువీణనాదముల • యం గెఱఁగించెను వారిరాకలన్
మెచ్చులు గొల్పునారవము • నిల్చినయంతస సేన లెల్ల నిం
పెచ్చఁగఁ గాంచి రచ్చటను • హృద్యము నౌగృహసంవిధానమున్. ౨౯

అచ్చర మచ్చెకంటుల=అప్సరస్త్రీలయొక్క, లయ=లయముతో, నృత్యగీతవాద్యముల యేకకాలవిరామము లయమనఁబడును, అన్విత=కూడిన, హారి =మనోహరమైనదియు, సుఖావహంబు=సుఖము కలిగించునదియు, ఔ=అయిన, అంగు=విధము, ఆరవము=ఆధ్వని, హృద్యము=మనోహరము, గృహసంవిధానమున్=ఇండ్ల యేర్పాటును.

తాత్పర్యము

అప్సర స్త్రీలయొక్క లయముతోఁగూడినదై మనోహరమై సుఖము గలిగించునదియగు స్వచ్ఛపు వీణెనాదముల విధము వారరాకల నెఱింగించెను. శ్లాఘ్యమైన యాధ్వని నిలువఁగానే యచట నేర్పాటుగాఁబడిన యిండ్లను సేన లెల్లఁజూచెను.

తే. ఉర్విసమతను గన నైదు♦యోజనములు, నీలవైడూర్యసన్నిభ♦స్నిగ్ధశాద్వ
లంబులొప్పారెనందు బి♦ల్వంబు వెలగ
మాదిఫలములు పనసలు♦మామిడులును. ౨౦౭౭

ఉర్వి=భూమి, సమతను=గుంటమిట్టలేక యుండుటను, చదరమగుటను, నీలవైడూర్య=నీలములతోను వైడూర్యములతోను, సన్నిభ=సమానములైన, స్నిగ్ధ=నునుపైన, శాద్వలంబు=పచ్చికపట్టు, బిల్వంబు=మారేడు, పనసలు; కుశ,దర్భ,పనస,వీనికిఁ దెనుఁగున ముపర్ణకంబులేదు. కుశాదులు స్త్రీసమంబులు.

తాత్పర్యము

ఐదామడభూమి చదరమయ్యెను. ఇంద్రనీలములతోను వైడూర్యములతోను సమానమైన వర్ణముగల నునుపారు పచ్చికపట్టులు వెలసెను. అందు మారేడులు వెలగలు మాదిఫలములు(మాతులుంగములు)పనసలు మామిడులు వృక్షములు వెలసెను.

కం. వెలసెను నట నుసిరికలును, ఫలయుక్తిని జైత్రవనము♦పఱతెంచె నదుల్
విలసితతటగతతరుసం, కలితంబులు నగుచు నటకుఁ♦గ్రన్ననవచ్చెన్.

ఫలయుక్తిని=పండ్లతో, వికసిత=ప్రకాశించు, తటగత=ఒడ్డునందున్న, తరు=చెట్లచే, సంకలితంబులు=కూడినవి, క్రన్ననన్=శీఘ్రముగ.

తాత్పర్యము

అందుసిరిక చెట్లునుండెను. పండ్లతోడఁ జైత్రవనము వచ్చెను. నదులు తీరమున నుండు చెట్లతోఁగూడినవై యచటికి శీఘ్రముగవచ్చెను.

సీ. చదరపుటిండ్లుఁ గుం♦జరవాజిశాలలుఁ, దోరణంబులు, హర్మ్య♦వారములును
సితమేఘనిభములు♦భృతతోరణంబులు, శుక్లమాల్యాకృతుల్♦సురసువాస
నాన్వితంబులు చతు♦రస్రసములై విశా, లంబులు శయనాస♦నంబులు మఱి
యానముల్ దివ్యర♦సాంచితాన్నంబులు,వస్త్రముల్ నిర్మల♦భాజనములు

తే. నైన రాజగృహంబులు ♦ నమరి యుండె
స్నానభోజనవసతులు ♦ శయనగృహము
లొప్పె భరతుండు తద్భవ♦నోత్తమంబుఁ
జొచ్చె మునియాజ్ఞ మునిశక్తి ♦ మెచ్చుకొనుచు. ౨౦౭౮

చదరము + ఇండ్లు=చదరపుటిండ్లు,కుంజర=ఏనుఁగులయు,వాజి=గుఱ్ఱములయు, శాలలు=ఇండ్లు, హర్మ్యవారములును=ధనికుల యిండ్లసమూహములు,

సితమేఘనిభములు = తెల్లనిమబ్బులతో సమానములు; భృతతోరణంబులు= భరింపఁబడిన తోరణములుగలవి, శుక్లమాల్యాకృతుల్ = తెల్లనిపూలదండల యాకారములుగలవి, పరమసువాసనాన్వితంబులు = శ్రేష్ఠమైన పరిమళముతోఁ గూడినవి, చతురస్రములై=చచ్చౌకములై, శయనాసనంబులు=శయన=పడుకలు, ఆసనములు=కూర్చుండు పీటలు మొదలైనవి,యానముల్=వాహనములు, దివ్యరసాంచితాన్నంబులు = అమృతమువలె మనోహరములైన యన్నంబులు. భాజనములు=పాత్రలు, ఐన=కల, రాజగృహంబులు=రాజులయిండ్లు, స్నానభోజనవసతులు=స్నానశాలలు భోజనశాలలు, శయనగృహములు=పడుకటిండ్లు తత్+భవనోత్తమంబు=ఆశ్రేష్ఠమైన యింటియందు, చొచ్చెన్=ప్రవేశించెను.

తాత్పర్యము

చదరపుటిండ్లు,ఏనుఁగులయు, గుఱ్ఱములయు నిండ్లు, తోరణంబులు, ధనికుల యిండ్లసమూహములు తెల్లమబ్బులతో సమానములు తోరణములు కట్టఁబడినవి తెల్లపూలదండవలె నుండునవి మంచి పరిమళముగలవి చచ్చౌకములై వెడలుపు పొడవుగల పడుకలు పీఁటలు వాహనములు, అమృతమువలె మనోహరములయిన యన్నములు వస్త్రములు నిర్మలములైన పాత్రలుగల రాజుల యిండ్లమరి యుండెను.అందు స్నానముచేయుటకు భోజనము చేయుటకు గదులు, పడుకటిండు లొప్పియుండెను. అటువంటి శ్రేష్ఠమైన యింటియందు మునియాజ్ఞ చొప్పున మునిశక్తి మెచ్చుకొనుచు భరతుఁడు ప్రవేశించెను.

చం. అనుచరమంత్రియుక్తిని నృ♦పాసనమున్ వ్యజనంబు ఛత్రమున్
గని యటఁ గైకయీసుతుఁడు♦గాఢతరం బగుభక్తి వానికిన్
జనుచుఁ బ్రదక్షిణంబు రఘు•చంద్రుఁ దలంచుచుఁ జామరంబుఁ గై
కొని సచివాసనంబునను♦గూరిమి మీఱఁగఁ గూరుచుండినన్. ౧౧౦

అనుచరమంత్రియుక్తిని=సేవకులయు, మంత్రులయు కూడికతో, నృపాసనమున్=రాజుకూర్చుండు సింహాసనమును, వ్యజనంబు=చామరము, ఛత్రమున్=తెల్లని గొడుగును, కని=చూచి, గాఢతరంబగు=మిక్కిలి యధికమైన, సచివాసనంబునను=మంత్రులు కూర్చుండు నాసనమునందు, భరతుని మనస్సు ప్రలోభింపఁజేసి పరీక్షించి దృఢపఱుచుటకే భరద్వాజుఁ డీవిం దమర్చెను.

తాత్పర్యము.

సేవకులు మంత్రులు తనవెంటరాఁగా లోపలఁ బ్రవేశించి భరతుఁడచ్చట రాజయోగ్యమైన సింహాసనమును వింజామరము శ్వేతచ్ఛత్రముఁజూచి శ్రీరామచంద్రునిఁ దలఁచి వానికి నత్యంతభక్తి నమస్కరించి ప్రదక్షిణముగాఁ బోయి చామరము చేతికిఁ దీసికొని మంత్రికూర్చుండు స్థానంబునఁ గూర్చుండెను.

తే. మంత్రులుఁ బురోహితులును గ్ర♦మంబుగాఁగఁ
గూరుచుండఁగ నారాచ♦కొమరు వెనుక
సైన్యపతియుఁ బ్రశాస్తయు ♦ సరస నుండి
రంత దివ్యప్రభావమ♦హర్షి మహిమ. ౨౦౮౧

తాత్పర్యము.

అవల వరుసగా మంత్రులు పురోహితులు రాజకుమారు వెనుకఁ గూర్చుండిరి. సేనానాయకుఁడు ప్రశాస్త (డేరాలు మొదలగు నివేశముల నేర్పాటు చేయువాఁడు **Palace Controller**) దగ్గఱనుండిరి. అట్లందఱు గూర్చుండిన తరువాత ఋషీశ్వరు మహిమచేత.

ఆ. ఆముహూర్త మంద ♦ యచ్చటఁ బాయస, కర్దమితము లేర్లు ♦ కైకతనయు
దాపునందుఁ బాఱె ♦ నాపగాతటములఁ, బాండుమృద్విలిప్త♦వసతు లమరె. ౨౦౮౨

పాయసకర్దమితములు=పరమాన్నముచే బురదగాఁ జేయఁబడినవి, ఏర్లు=నదులు, ఆపగా=నదులయొక్క, తటములన్=తీరములందు, పాండు=తెల్లని, మృత్=మంటిచే, విలిప్త=పూయఁబడిన, వసతులు=గృహములు.

తాత్పర్యము

ఆముహూర్తమందే యచ్చటఁ బాయసముచే బురదగాఁ జేయఁబడిన నదులు పాఱెను. ఆనదులయొడ్డులందుఁ దెల్లని సుద్దతోఁబూయఁబడిన యిండ్లు కానవచ్చెను.

కం. సురకంజాక్షులు దివ్యా,భరణవిభూషితలు బ్రహ్మ♦పనుపున నపుడే
యిరువది వేవురు వచ్చిరి,యరు దందుచు నుండఁ జూచు♦నట్టిజనంబుల్.

తాత్పర్యము ౨౦౮౩

దివ్యములైన సొమ్ములచే నలంకరింపఁబడిన దేవతాస్త్రీలు బ్రహ్మపంపఁగాఁ జూచువా రాశ్చర్యపడునట్లు లిరువదివేలమంది వచ్చిరి.

కం. పవడంబులచే నవర,త్నవితానముచేతఁ గాంచ♦నంబున సొబగౌ
వివిధాలంకృతు లొప్పఁగ, నవలా లేతెంచి రర్థ♦నాథునియాజ్ఞన్. ౨౦౮౪

అర్థనాథుని=కుబేరునియొక్క,నవలాలు=స్త్రీలు,ఇదిదేశ్యపదము;దీర్ఘాంతము.

తాత్పర్యము

పగడంబులచేతను, నవరత్నముల సమూహములచేతను బంగారుచేతను నందమైన నానాలంకారములుగల స్త్రీలు కుబేరుని యాజ్ఞ ప్రకారము వచ్చిరి.

తే. మనుజు నెవ్వరు సోఁకిన♦మాత్రలోన, వెఱ్ఱి పట్టినయటు లగు♦వికలమతిని
నట్టియచ్చర లరుదెంచి రమరవనము,
నుండి యిరువదివేవు ర♦త్యుత్సవమున. ౨౦౮౫

వికలమతిని = చెదరినమనస్సుతో, ఆచ్చరలు = అప్సరశ్శబ్దభవము అప్సరసలు, అమరవనము = నందనము, దేవతలయుద్యానము, అత్యుత్సవమునన్ = మిక్కిలి సంతోషముతో.

తాత్పర్యము

ఎవరు మనుష్యుని సోఁకినంతమాత్రముచేతనే వానిమనస్సు చెదరి పిచ్చిపట్టినయట్టు లగునో యటువంటి యప్సరసలు సంతోషముతో నిరువదివేలమంది వచ్చిరి.

కం. తుంబురునారదగోపులు, డంబున నీరేజహితు వి♦డంబించెడివా
రింబుగఁ బాడిరి మునియా,జ్ఞం బృథివీనాథతనయు♦సన్నిధియందున్.

తుంబురునారదగోపులు = తుంబురుతోడఁ జెప్పఁబడు నారదుఁడు దేవగంధర్వులలోఁ జేరినవాఁడు. వీఁడు దేవర్షి నారదుఁడుగాఁడు. అతఁడు పర్వతనారదుఁడని చెప్పునపుడు చెప్పఁబడును. డంబునన్ = కాంతియందు, నీరేజహితున్ = కమలాప్తుఁడగు సూర్యుని, నీరేజము అలుక్సమాసము. విడంబించెడివారు = పోలెడివారు, ఇంబుగన్ = మనోహరముగ, సన్నిధియందున్ = సమీపమందు.

తాత్పర్యము

కాంతిచే సూర్యుని బోలిన తుంబురుఁడు నారదుఁడు గోపుఁడనువారలు మునియాజ్ఞప్రకారము భరతునెదుట మనోహరముగఁ బాడిరి.

తె. మిశ్రకేశి యలంబుసా♦మీననేత్ర, పుండరీకయు వామన ♦ పోఁడిమిగను
భరతుముంగల నాడిరి♦పలు తెగలగు, చైత్రరథవనసుమముల♦చ్చటికి వచ్చె. [-౨౦౪౮

తాత్పర్యము

మిశ్రకేశి = చేఁపలవంటి కన్నులుగల యలంబుస - పుండరీక = వామనయను స్త్రీలందముగా భరతునిముందట నాడిరి. చైత్రరథవనమందలి నానావిధములైన పుష్పము లచ్చటికి వచ్చెను.

కం. మారేడులు మార్దంగికు, లై రావులు నర్తకులుగ ♦ నై తాండ్రలు నిం
పారంగఁ దాళధరులై, యారేయి ముదంబుఁ గూర్చె♦నమ్మునిముదలన్.

మార్దంగికులు = మృదంగము వాగించువారు, నర్తకులు = నాట్యమాడువారు, తాళధరులు = తాళములు వాయించువారు, ముదలన్ = ఆజ్ఞచే.

తాత్పర్యము.

మారేడువృక్షములు (వృక్షాధిదేవతలు) మృదంగములు వాగించిరి. రావిచెట్లు నర్తనములు చేసిరి. తాండ్రలు తాళములు వాయించిరి. ఈ ప్రకారము మునీశ్వరు నాజ్ఞచే నారాత్రి వారికందఱకు సంతోషము కలిగించిరి.

తే. తాలతిలకంబులును నక్త♦మాలకములు,
సరళములుఁ గుబ్జలగుచును ♦ సంచరింప
స్త్రీలరూపంబులం గొని ♦ శింశపలును,
నుసిరికలును జంబూద్రుమ ♦ విసరములును. ౨౦౪౯

తాలతిలకంబులు=తాటిచెట్లు బొట్టుగుచెట్లు, నక్తమాలకములు = కానుగు చెట్లు, సరళములు=దేవదారువులు, కుబ్జలు=పొట్టివారు, ఇఁక సంస్కృతభాషలో స్త్రీలింగాంతములగు పదములచేతఁ జెప్పఁబడు చెట్లను స్త్రీలుగనైనట్లు చెప్పుచున్నాఁడు. ఉసరిక సంస్కృతపదము గాకున్నను తెనుఁగున స్త్రీసమమే. శింశుపలు=ఇరుగుడుచెట్లు, జంబూద్రుమ = నేరేడుచెట్లయొక్క, విసరములు=సమూహములు.

తాత్పర్యము

తాటిచెట్లు, బొట్టుగుచెట్లు, కానుగుచెట్లు, దేవదారువులు కుబ్జలై తిరుగఁగా స్త్రీలవలెనై ఇరుగుడుచెట్లు ఉసిరికలు, నేరేడుచెట్లు.

తే. మాలతీమల్లికాజాతి•మంజు లతలు, నమ్మహాముని వర్యుని•యాశ్రమమున
శ్రవ్యతర మైనసూక్తుల•శ్రవణపర్వ,
ముగనుభాషించె సుందర•మూర్తులొప్ప. ౨౧౯౦

మాలతీ=జాజి, మల్లికా=మల్లె, జాజి=ఈజాతిలోఁజేరిన, మంజులతలు= అందమైన తీఁగలు, శ్రవ్యతరమైన=విననింపైన, సూక్తులన్=మంచిమాటలచేత, శ్రవణపర్వముగన్=చెవులపండువుగ, సుందరమూర్తులు = సొగసైన యాకారములు, భాషించెన్ = మాటలాడెను.

తాత్పర్యము

జాతి- మల్లెజాతుల యందమైనతీఁగ లాముని యాశ్రమమునందు విననింపైన మాటలచే వీనులకు విందుగ సుందరములైన యాకారములు ధరించి యిట్లు మాటలాడెను.

మ. మదిరాపాయులు! రండు త్రాగుఁ డిదిగో • మద్యంబు, నాఁకొన్నవా
రిదిగోఁ బాయస మారఁ గ్రోలుఁ, డివె • స్వేచ్ఛన్ మాంసముల్ మెక్కుఁడీ,
పదఁడీ యంచును నొక్కనొక్కనికి శం•పాదేహ లెన్మండ్రు స
మ్మద మారం దలయంటి నల్గిడుచు నం•భఃపూరముల్ పోయుచున్.

మదిరాపాయులు=మద్యముత్రాగువారలారా! మదిర యనునది ఆఫ్రికా దేశమునకుఁ బడమటివైపునసుండు మదిరా (Madiera) ద్వీపమునుండి వచ్చినది. అద్వీప మిప్పటికిని మద్యమునకే ప్రసిద్ధి. మద్యంబు = సారాయము, ఆఁకొన్నవారు=ఆఁకలిగొన్నవారు, ఆరన్=పూర్ణముగా, శంపాదేహలు=మెఱుఁగువంటి కాంతిగల దేహముగలవారు, అంభఃపూరముల్ = నీటి ప్రవాహములు.

తాత్పర్యము

సారాయి త్రాగెడువారలారా! యిదిగో సారాయము త్రాగరండు. ఆఁకలిగొన్నవారలారా! ఇదిగోఁ బాయసము. మాంసము దినెడివారలారా! యిదిగో స్వచ్ఛమైన మాంసము, పొండు పొండని యొక్కొక్కనికి నెనిమిదిమంది స్త్రీలు సంతోషముతోఁ దలయంటి నలుగుపెట్టి నీళ్ళు ప్రవాహములుగఁ బాఁజఁ బోసిరి.

చం. జిలుఁగుమడుంగు లిచ్చుచును • సీవిరులం గొని ప్రక్క నిల్చుచున్
గలికి సురన్ సుపాత్రములఁ • గమ్మగఁ గ్రోలఁగ నిచ్చి యిచ్చి యి
చ్చెలువున సంచరింప ముని•శిక్షితవాహనపుల్ గజాశ్వజా
ళులకును మేపు వెట్టిరి య•లోభగతిన్ ఖరభద్రజాతికిన్. ౨౦౯౨

జిలుఁగుమడుంగులు=సన్నని శుద్ధమైన వస్త్రములు, సీవిరులన్=విసనకఱ్ఱలను, ఇచ్చెలువునన్=ఈవిధముగ, మునిశిక్షిత = మునిచేనేర్పఁబడిన, వాహనపుల్=వాహనముల పతులు, గజాశ్వపాళులకున్ = ఏనుఁగులు గుఱ్ఱములు వీని సమూహములకు, ఖరభద్రజాతికిన్=కంచరగాడిదలకు, ఎద్దులకు, అలోభగతిన్= పిసినితనము లేకుండ.

తాత్పర్యము

పరిశుభ్రములైన వస్త్రము లిచ్చుచు విసనకఱ్ఱల విసరుచుఁ బ్రక్కనిలఁబడి మంచిపాత్రములందు సారాయము త్రాగనిచ్చుచుఁ దిరుగుచుండ ముని వాక్యముప్రకారము కొందఱు వాహనాధిపతులు గుఱ్ఱములకు ఎద్దులకు కంచర గాడిదలకు లోపములేకుండ మేపుపెట్టిరి.

కం. పేలలతో సారాయము, వాలాయము గలిపి చెఱకు•పా లిడిరి మహీ
పాలకసేనావాహన,జాలంబుల కెల్ల వెక్క•సం బగుదాఁకన్. ౨౦౯౩

మహీపాలక = రాజుయొక్క, సేనా = సేనలయొక్క, వాహనజాలంబులకున్ = వాహన సమూహములకు (వహించునది వాహనము.)

తాత్పర్యము

వెక్కసమగువఱకు సారాయమందుఁ జెఱకుపాలు- పేలలు- బొరుగులు- కలిపి భరతుని సేనలయందలి వాహనములకుఁ బెట్టిరి.

ఉ. కట్టరు రౌతు లశ్వములఁ • గట్టరు మావిటివాండ్రు దంతులన్
బొట్టలు నిండ మెక్కి పడి • పొర్లుచు గుర్తు లెఱుంగఁ జాలమిన్
దొట్టినసర్వకామములఁ • దోరముగాఁ దనివొంది వెండి కే
ల్పట్టి వియచ్చరాంగనలు • బల్విడి వెంబడి రాఁగ సైనికుల్. ౨౦౯౪

రౌతులు=రాహుత్త శబ్దభవము గుఱ్ఱపుదండునందు గుఱ్ఱములపై సవారి చేయువారు. ఆశ్వికులు ఈరౌతుశబ్దమే రావుతు. ఇందలి కడవర్ణము తు పోఁగా మిగిలినది రావు. ఇది పూర్వము గుఱ్ఱపుదండునందున్న శూరులే (మహారాష్ట్రులు- గోలకొండవేపారులు- వెలమలు) దీని నుపపదముగాఁ జేర్చుకొందురు. ఇప్పుడందఱుఁ జేర్చుకొనుచున్నారు. తోరముగాన్=అధికముగా, తనివి= తృప్తి, కేల్పట్టి=చేతిని బట్టుకొని, వియచ్చరాంగనలు=వియత్+చర+అంగనలు =దేవతాస్త్రీలు, సైనికుల్=సేనయందుఁ గొలువుండువారు.

తాత్పర్యము

కడుపులునిండఁదిని కావలసినంత త్రావి పొరలుచుఁ దమ గుఱ్ఱములేవో తమ యేనుఁగులేవో గుర్తుపట్టఁజాలక రౌతులు గుఱ్ఱములను గట్టినవారుగారు. మావటులేనుఁగులఁ గట్టినవారుకారు. వారువారు కోరిన సమస్తకోరికలును బూర్ణముగా నధికముగా లభించుటచేఁ దృప్తిపొందినవారై మఱియును దేవతాస్త్రీలు తమ చేతులు పట్టుకొని వెంబడిరాఁగా సైనికులిట్లని చెప్పఁదొడఁగిరి.

ఉ. పోమిఁక దండకాటవికిఁ ♦ బోమ యయోధ్యకు నుందు మియ్యెడన్
సేమము గల్గుఁ గాత నృప♦శేఖరుఁ డౌరఘురామమూర్తికిన్
క్షేమము గల్గుఁ గాక యల♦కేకయరాజతనూజపట్టికిన్
బోమిఁక వార లెట్లయినఁ ♦ బోదురు గాకని కూఁతపెట్టఁగన్. ౨౦౯౫

మేమిఁక దండకారణ్యమునకును బోము, మేమయోధ్యకును బోము. అడవియందు శ్రీరాముఁడు క్షేమముగ నుండునుగాక. అయోధ్యయందు భరతుఁడు క్షేమముగ నుండునుగాక వారలిరువు రెట్లయినఁబోనీ మేము దీనివిడిచి పోము అని కూఁతలుపెట్టిరి.

కామసుఖముల మరగిన రాజసులగతి యింతయే. "మధ్యేతిష్ఠంతి రాజసా" యను భగవద్గీతోక్తి యిట స్మరింపునది. "ఇప్పటి సుఖంబులె మేలయితోఁచు వారికిన్". భారతము.

సీ. ఆడెడివారును ♦ బాడెడివారును, గూడెడివారును ♦ వీడువారు
నవ్వువారును మదిఁ♦గ్రొవ్వువారును బరు,వెత్తువారును బూవు♦లెత్తువారు
నయియెల్లసైనికుల్♦నాక మియ్యది పొమ్మ,టంచుగర్జింపఁ బ్ర♦హర్షితమతిఁ
దిని యుండియును నన్న♦మును మఱి తినంగోరి,
యును గడుప్పలేమికి♦నుమ్మలింత్రు

తే. చేటులును బరిచారికల్ ♦ చేడియలును
నూతనాంబరములఁ దాల్చి ♦ రాతతముగ
మునికృతాన్నంబు దక్క న ♦ వ్వనములోన
రాజఁవేయరు ప్రాయ్యు లా ♦ రాజభటులు. ౨౦౯౬

నాకము=స్వర్గము, కం=సుఖము, అదిలేనిది అకమ్=దుఃఖము, న+అకమ్=దుఃఖములేనిది నాకము, స్వర్గము, గర్జింపన్=బొబ్బలుపెట్టఁగా, ప్రహర్షితమతిన్=సంతోషించిన మనస్సుతో, ఉమ్మలింత్రు=దుఃఖపడుదురు, చేటులు=దూతికలు, పరిచారికల్ = పరిచారము చేయువారు దాసీజనులు, చేడియలు = సైనికుల భార్యలు, నూతనాంబరములు=క్రొత్తవస్త్రములు, మునికృతాన్నంబు = ముని కల్పించిన యన్నము.

తాత్పర్యము.

ఆడువారు పాడువారు గూఁకువారు జతవీఁకువారు నవ్వువారు మదిలోఁ గ్రొవ్వువారు పరువెత్తువారు పూవుల నెత్తువారునై సేనలయందుండువారందఱు నిదియే స్వర్గము స్వర్గమిఁక వేఱెయెందున్నది యని సంతోషముతోఁ గేకలు వేయుచుండిరి. కొందఱు కడుపారఁ దినియుండియును రుచిగానున్న కారణమున మఱి తినఁగోరి యయ్యో కడుపుపట్టలేదే యని దుఃఖింతురు దూతికలు పరిచారికలు యితరస్త్రీలు క్రొత్తవస్త్రముల ధరించిరి. ఆ వనములో మునికల్పించిన యన్నముదక్క నితరాన్న మెవ్వరికిలేదు. రాజభటులెవ్వరు ప్రాయియ్యి రాఁజవేసినవారుకారు.

కం. మావులు ఖరములు లొట్టెలు, గోవులు మృగసంతతులును • గుంజరములు నా
నావికిరంబులు నాపో, కావటిలన్ ముదముఁగాంచె • నాసమయమునన్.

మావులు=గుఱ్ఱములు. ఖరములు=కంచరగాడిదలు, లొట్టెలు = ఒంటెలు, కుంజరములు=ఏనుఁగులు, నానావికిరంబులు=అనేకజాతుల పక్షులు, ఆపోక= తృప్తి, ఆవటిలన్=కలుగఁగా, ముదముగాంచెన్=సంతోషించెను.

తాత్పర్యము

ఈ విందునందు సంతోషించినవారు మనుష్యులుమాత్రమే కాదు గుఱ్ఱములు, కంచరగాడిదలు, లొటపిట్టలు, ఆవులు, మృగసమూహములు,ఏనుఁగులు, అనేకములగు పక్షులు తృప్తిపడి యాసమయమున సంతోషించెను.

కం. తల మాసిన మెయి మాసిన, వలువలుమాసిన నరుండు • పరికింపఁగ న
బ్బలముల లేఁ డొకఁడును నాఁ,కలిగొన్న యతండు లేఁడు • కలికంబునకున్.

మెయి=దేహము, వలువలు=వస్త్రములు, పరికింపఁగన్= చూడఁగా, తల మాసిన మెయిమాసిన వలువలుమాసిన యనునవి మూఁడును నరుఁడనుదానికి విశేషణములు కర్మధారయ సమాసము. బలములన్=సేనలయందు, కలికంబునకున్=కొంచెమైనను అను సర్థమున నిది వాడుకపదము.

తాత్పర్యము

తలమాసిన నరుఁడు దేహముమాసిన నరుఁడు వలువలుమాసిన నరుఁడు ఆఁకలి గొన్నవాఁడు కన్నులకుఁ గలికము వేసికొందమని వెదకినను నాసేనలయం దొకఁడైన లేఁడు.

కం. పలుదెగ లగుపలనిచయముఁ,
బలుతెగ లగుఫలచయములు • బహుకుసుమగణో
త్కలితధ్వజములు బంగరు, తెలె లొప్పెను వేనవేలు • దివ్యము లగుచున్.

పలుతెగలు=అనేకవిధములు, పలనిచయము=మాంసముల సమూహము, ఫలచయములు=పండ్లసమూహములు, బహు=అనేకములైన, కుసుమ=పుష్పముల

యొక్క, గణ=సమూహములచే, ఉత్కలిత=అలంకరింపఁబడిన, ధ్వజములు=టెక్కెములు, తెలెలు = పళ్ళెరములు, "తెలియపళ్ళెరంబు తెలెహరివాణంబు", నిఘంటువు.

తాత్పర్యము

దేవతలకు సంబంధించినవగు ననేకములయిన మాంసములు, పండ్లు, పూల సమూహములచే నలంకరింపఁబడిన ధ్వజములు బంగారు పళ్ళెరములు వేలకొలఁదు లొప్పుచుండెను.

సీ. వనపార్శ్వములఁ బాలు♦వరరుచిమంతంబు,
　　　　అమలధేనువులుచ♦న్నవియఁబిదికె
　మైరేయపాయస♦మాంసకూపంబులు, పెక్కులై యొప్పె న♦ల్దిక్కులందుఁ
　గుక్కుటంబులయుఁ గే♦కులయు జింకలయును,
　　　　వండినమాంసముల్♦నిండియున్న
　బంగారుపాత్రముల్♦రంగారుచెఱకుపాల్, బావులు స్నానసం♦భావ్యము లగు
ఆ. సురభికల్కములును♦సున్నిపిండులు నుష్ణ,
　　　　జలము లమరె మేలి♦కొలఁకులందు
　దంతధావనార్హ♦కాంతకూర్చాకృతు,లై నపుడక లెసఁగె♦నన్నికడల. ౨౧౦౦

వనపార్శ్వములయందున్=అడవిప్రక్క ప్రదేశములందు, వరరుచిమంతంబులు=మంచి రుచిగలవి, పాలు=నిత్యైకవచనమని కొందఱయభిప్రాయమని తెలియవచ్చెడిని. ఈ గ్రంథకర్త యభిప్రాయ మదికాదు. పాయి ఏకవచనము పాలు బహువచనము. రేయి, రేలు, బాయి, బాలు వలెనని యెఱుంగునది. అమ్మపాయి యని వాడుకయందునుగలదు కావున నిచట విశేషణ విశేష్యములు భిన్నవచనములు గావు. అమల=నిర్మలములైన, ధేనువులు=ఆవులు, చన్నులు=పొదుగు, అవియన్=పగులునట్లు, మైరేయి=సారాయముయొక్కయు,పాయస=పరమాన్నముయొక్కయు, మాంస=మాంసములయు, కూపంబులు = బావులు, నల్దిక్కులు, మిశ్రద్విగువు కావున బహువచనము, కుక్కుటంబులయు = కోళ్ళయొక్క, కేకులయు=నెమిళ్ళయొక్కయు, సురభికల్కములును = మంచివాసన పిండులు మొదలైనవి, స్నానసంభావ్యములు = స్నానసమయమున నుపయోగించుకొనఁబడునవి, ఉష్ణజలము=వేడినీరు, దంతధావనార్హ=పండ్లుతోముటకు యోగ్యములయిన, కాంత = మనోహరములైన, కూర్చాకృతులు=కూర్చముల యాకారముగలది. కూర్చమనునది దర్భలతోఁ బొడుగుగాఁ గట్టినది, పుడకలు=పుల్లలు, అన్నికడలన్=అన్నిదిక్కులయందు.

తాత్పర్యము

ఆ యడవిప్రక్కల నిర్మలములైన నావులు మంచి రుచిగల పాలను జన్నులు పగిలిపోవునట్లు పిండెను. నాలుగు దిక్కులందు సారాయములయుఁ బరమాన్నములయు మాంసములయు బావులనేకములుండెను. కోళ్ళయొక్క జింకలయొక్క నెమిళ్ళయొక్క వండిన మాంసముతో నిండించిన బంగారుపాత్రములు

చెఱకుపాల బావులు స్నానయోగ్యములగు మంచివాసనగల పొడుగు సున్ని పిండులు వేఁడినీళ్ళ సరస్సుల పండ్లుతోముకొనుటకుఁ దగిన కుర్చాకారములైన పుల్లలు నన్నిచోటులందు నుండెను.

కం. ఆవులమావులమెత్తలు, రేవులు కమలోత్పలసుమ•బృందంబులు నై
పావనజలములు గలనడ, బావులు మడుఁగులును శస్త్ర•వర్గము పీఁటల్.

మావుల=గుఱ్ఱముల, మెత్తలు=పఱుపులు, రేవులు=నీళ్ళదిగు మార్గములు, కమలోత్పల సుమబృందంబులను=కమలములయుఁ గలువపూలయు సమూహములు, ఐ=కలిగి, ఐ యొకానొకచోఁగల యర్థంబున నగు సు. వ్యా. వాక్య.౬౩ సూ. "కృష్ణుని సారథ్యమునై" "వెడలుపుటురమునై యల్లవాఁడె పాండవాగ్రజుండు'' అని భారత ప్రయోగములు కలవు. నడబావులు = దిగుడుబావులు, చేఁదుడుబావులు గావనుట.

తాత్పర్యము

ఆవులకు గుఱ్ఱములకుఁ బండుకొనఁ బఱుపులు, రేవులు, కమలములు, కలువలు, గుంపులు గుంపులుగఁ గల నిర్మల జలములుగల దిగుడుబావులు, మడుఁగులు, శస్త్రముల సమూహము కూర్చుండు పీఁటలు.

కం. మంచంబులు బంగారవుఁ, గంచములు రసాలరసము•గల డిగ్గియలున్
మంచిలవంగము లేలా,సంచయములుఁగమ్మఁబెరుఁగు•జానగుకడవల్.

రసాలరసము=జీలకఱ్ఱతోఁగూడిన మజ్జిగ, చిలికిన పెరుఁగు తక్రము. "అపక్వతక్రం సవ్యోషం, చతుర్జాత గుడార్ద్రికం। సజీరకం రసాలాస్యా న్మజ్జికా శిఖరిణీత్యపి'' వైజయంతి. ఇవి మజ్జిగయందలి భేదములు, శుంఠి పిప్పలి మిరియాలు కలిసిన మజ్జిగ సవ్యోషము. ఏలకులు- లవంగములు- తక్కోలములు- నాగపుష్పములు- చక్కెర- అల్లము- జీలకఱ్ఱ కలసినది రసాలము. డిగ్గియలు= దీర్ఘికా శబ్దభవము- నడబావులు మీఁదఁజెప్పినవి నీళ్ళ బావులు- ఏలాసంచయములు = ఏలకకాయల సమూహములు, కమ్మఁబెరుఁగు = తియ్యపెరుఁగుచే, జానగు=అందమైన, కడవలు=కుండలు.

తాత్పర్యము.

మంచములు-బంగారు కంచములు-తియ్యమామిడిపండ్లరసముగల దిగుడు బావులు- మంచిలవంగములు- ఏలకకాయల- కమ్మని పెరుఁగుకల కుండలు.

కం. ముచ్చెలును బావుకోళ్ళను నచ్చపుఁగిఱుచెప్పు లొప్పె• నద్దము లమరెన్
మెచ్చిడుకాటుకబరణులు, నిచ్చకొలఁది దువ్వెనలును•నెన్నియొ యుండెన్.

తాత్పర్యము [అ౧౦౪

ముచ్చెలు- పావుకోళ్ళు- కిఱ్ఱుకిఱ్ఱుమని నడచునప్పుడు ధ్వనించు చెప్పులు- అద్దములు- మంచికాటుకగల బరణులు దువ్వెనలు నివన్నియు నెన్నియో యుండెను.

కం. తూర్ణంబుగ భక్షితములు, జీర్ణంబులు గావుటకును • జిత్రౌషధసూ
దీర్ణంబు లయినజలములఁ, బూర్ణంబులు నైనస్థలులుఁ • బొలుపారె నటన్.

భక్షితములు=భుజింపఁబడిన పదార్థములు, తూర్ణంబుగన్=శీఘ్రముగ, జీర్ణంబులుకావుటకు = అఱుగుటకు, చిత్రౌషధసూదీర్ణంబులు = విచిత్రములయిన మందులతోఁగలిసిన, జలములు = నీళ్ళచే, పూర్ణంబులు = నిండినవి, స్థలులు = ప్రదేశములు.

తాత్పర్యము

భుజించినవి శీఘ్రముగ జీర్ణమగుటకుఁ జిత్రములయిన యౌషధములతోఁ గలిసిన జలములతో నిండిన ప్రదేశము లందుండెను.

కం. కలఁబోలుచు నద్భుతమై, చెలువం బగుమౌనివర్యు • చేసినవిందున్
దిలకించి యాజనంబులు, పలుకఁ దరము గానివింత • పాటుం గాంచెన్.

కలఁబోలుచున్=కలవలెనై. ఆశ్చర్యకరమై అద్భుతమగుటచే నది కలను బోలినదిగాని యసత్యమగుటచేఁ గాదు. ఏలనఁగా నీవిందు యథార్థవిషయము. చూ. ప. ౭౧౦౮. కలలయందలి పదార్థములు భగవంతునిచే సృజింపఁబడినవే యని యుపనిషత్తు చెప్పుచున్నది. కావున నిందలి యుపపానమును బట్టియు ౭౧౦౮ పద్యమునందలి విషయమునుబట్టియు దశరథ భరత త్రిజటాదుల కలలఁ బట్టియుఁ గలలు సత్యములనియే వాల్మీకి యభిప్రాయమని యేర్పడుచున్నది. మనస్సుచేఁ జేయఁబడిన పుణ్యాపాపముల ఫలములు కలలయం దనుభవింపఁబడును. దేహముచేఁ జేసినవి స్థూల దేహముచే ననుభవింపఁబడును. వాక్కుచేఁ జేసినవి నిందాస్తుతుల రూపమున వాక్కుచే ననుభవింపఁబడును. అనుకొన్నది, పూర్వమనుభవించినది, కాక యద్భుతమగుటచే నమ్మరాని సత్యమగుటవలనఁ గలను బోలుచు నందమై మునిశ్రేష్ఠుఁడు చేసిన విందును జనములు చూచి చెప్ప శక్యముగాని యాశ్చర్యమును బొందెను.

కం. నందనమున నమృతాంధో,
బృందంబులమాడ్కి నెలమి • వెలయుచు మునిసం
క్రందనువనమునఁ దజ్జను, లందఱు విహరింప రేయి • యంతయుఁ బోయెన్.

అమృతాంధో బృందంబులమాడ్కిన్=అమృత మాహారముగాఁగల దేవతల సమూహమువలె, ఎలమిన్ = సంతోషముచే, మునిసంక్రందను = మునీంద్రుని యొక్క.

తాత్పర్యము

స్వర్గమునందలి నందనవనమునందుండు దేవతలవలె సంతోషపడుచు మునీంద్రుని వనమున నాజనులందఱు సంచరించుచుండ రాత్రియంతయుఁ బోయెను.

పూర్వపద్యమునఁ జెప్పిన చిత్రమేమనఁగా స్వర్గమున సురేంద్రుని నందనముననుండు దేవతల భోగము మునీంద్రు వనముననుండు నీ మనుష్యులకుఁ గలుగుటయే యద్భుతము.

కం. గంధర్వులు బృందారక,సింధురయానలును నదులుఁ • జిక్కినవి తపో
బంధురుఁ డగుముని యాజ్ఞ వ,
సుంధర విడి దివికిఁ జనియె•సురచయములతోన్. ౨౧౦౭

బృందారక సింధురయానలు=దేవతాస్త్రీలు, తపోబంధురుఁడు=తపస్సుయొక్క యాధిక్యముగలవాఁడు, దివికిన్=స్వర్గమునకు, సురచయములతోన్=దేవతల సమూహముతో.

తా త్ప ర్య ము.

గంధర్వులు, దేవతా స్త్రీలు, నదులు తక్కినవియుఁ దపోబలాధిక్యముగల మునియాజ్ఞచే భూమిని విడిచి దేవతల సమూహముతో స్వర్గమునకుఁ బోయెను.

ఉ. త్రావినమత్తు మెక్కినప•దార్థము నిక్కు మెయిన్ ధరించున
పూవుల తావి మేనఁ గడుఁ • బూసినగంధమురీవి దివ్యభూ
షావిభవంబు వస్త్రముల • సంచయముల్ పొలుపార సైనికుల్
రే విలసిల్లినట్టులె స • లీలగ నుండిరి సర్వ మెంచుచున్. ౨౧౦౮

భరతునివెంట వచ్చినవారందఱు ననుభవించినది యింద్రజాలమువలె నసత్యముగాదనియు సర్వము వాస్తవమే యనుటకు నుదయమైనపిమ్మట నాజనుల స్థితిని గవి వర్ణించుచున్నాఁడు.

తా త్ప ర్య ము

ఉదయమైనను మఱునాఁటికి రాత్రి వారు త్రావిన సారాయము మత్తు దిగలేదు. తిన్నపదార్థములవలనఁ గలుగు దేహావస్థయుఁ బోలేదు. వారు ధరించిన పూలవాసనగాని దేహమునఁ బూసికొనిన గంధపు సొగసుగాని దివ్యములైన సొమ్ముల విభవముగాని కట్టుకొన్న వస్త్రములుగాని పోక యందమైయుండుటచే సైనికులందఱు రాత్రి యేప్రకారముండిరో యాప్రకారమే సర్వము స్మరించుచు విలాసముగ నుండిరి. కావున రాత్రి జరగినదంతయు వాస్తవమేగాని టక్కుగాదు. ఇటువంటి మహిమగల భరద్వాజ మహాముని గోత్రజులమనువా రిప్పుడే గతిలో నున్నారో వారే యాలోచించుకొందురుగాక.

కం. భరతుం డీగతి రాతిరి, పరివారముతోడఁ గడపి • వరువాతఁ జనెన్
దరిసింప భరద్వాజునిఁ, బరమర్షియు నతనిఁ జూచి•పరమప్రీతిన్. ౨౧౦౯

తా త్ప ర్య ము

ఈప్రకారము భరతుఁడు తన పరివారముతోఁ గడపినవాఁడై యుదయముకాఁగానే భరద్వాజుని దర్శింపఁబోయెను. పరమర్షియు నాయనను జూచి యెక్కువ ప్రీతితో నిట్లనియె.

—♦ { ౯౨-వ సర్గము. భరతుఁడు భరద్వాజర్షిని రామాశ్రమంబునకుఁ ద్రోవయడుగుట. } ♦—

ఉ. రాతిరి మావనంబునను ♦ రాజకుమారక! నీకు సౌఖ్యముం
ప్రీతియుఁ గూడెనయ్య? చెపు♦మీ భవదీయుల కాతిథేయమున్
జేతము లెస్స రంజిలఁగఁ ♦ జేసె నొకో? యన నమ్రుఁడౌచు భూ
నేత నిజాశ్రమంబు విడి ♦ నిర్గతుఁ డౌమునితోడ ని ట్లనున్.　　౨౧౧౦

తా త్ప ర్య ము

రాజకుమారకా! రాతిరి మా వనమందు నీకు సుఖముగా సంతోషముగాఁ గడచెనా? నేనొసఁగిన యాతిథ్యము నీవారికి మనస్సు సంతోషింపఁజేసెనా? యని యడుగ వినయమున వంగినవాఁడై భరతుఁ డాశ్రమము విడిచివచ్చు మునితోడ నిట్లనియె.

ఉ. సన్నుతశీల! రాత్రి సుఖ♦సంపదఁ దేలిరి యెల్లవారు, భో
గోన్నతి నిట్టి దట్టి దని ♦ యోపి వచింపఁగ నావశంబె, సం
పన్నము సర్వమున్, సచివ♦వర్యులకున్ జనపాళికిన్ సుశా
ల్యన్నము లాదిగా శుభప♦దార్థములం దని వయ్యె మాకునున్.　　౨౧౧౧

సన్నుతశీల=సాధువులచే స్తోత్రము చేయఁబడినవాఁడా, భోగోన్నతిన్=భోగాతిశయముచే, సంపన్నము=సమృద్ధమైనది, సుశాల్యన్నము = మంచి బియ్యపుటన్నము. తనివి=తృప్తి.　　తా త్ప ర్య ము

సత్పురుషులచేత స్తోత్రము చేయఁబడినవాఁడా! రాత్రి యందఱు సుఖ సంపద నోలలాడిరి. భోగాతిశయ మిట్టిదనిచెప్ప నాకుసాధ్యమా అన్నియు సమృద్ధియేకాని కొఱఁత దేనియందును లేదు. మా మంత్రిముఖ్యులకు మాకుఁ దక్కిన జనులకు మంచి వరియన్నములు మొదలుగాఁగల మేలిపదార్థములచేఁ దృప్తి గలిగెను.

కం. అన్నను గను తమకంబున, నున్నాఁడను సెల వొసంగు♦మోమునివర్యా!
విన్నపమునాలకించి ప్రసన్నుఁడ వై మైత్రిదృష్టి♦సాగింపు ననున్.

తమకంబునన్=త్వరతో, ప్రసన్నుఁడవై=సంతోషించినవాఁడవై, మైత్రిదృష్టి=స్నేహభావముచే, సాగింపుము=ప్రయాణము పోవనిమ్ము.

తా త్ప ర్య ము

అన్నగారినిజూచు త్వరగలవాఁడనై యున్నాను. మునీంద్రా యాజ్ఞయిమ్ము. నా విన్నపమువిని కోపింపక స్నేహభావముచే నన్నుఁ బోవనిమ్ము.

కామభోగవిషయంబుల భక్తునకుఁ బామరునకు నిదియేభేదము. పామరులీలోకసుఖములే పరమార్థములనినమ్మి యవి యనిత్యములనియుఁ దెలియక వానినే కోరుచు వానితోనే తృప్తిపడి ౨౧౧౦-వ పద్యమునఁ జెప్పినట్లు చెప్పుచుందురు. భక్తుఁడో గృహస్థుఁడుగానుండియు వానియం దభిలాషపడక భగవ

త్ప్రీతియె భరతునివలెఁ గోరుచుండును. విషయసుఖములు వానిమనస్సు నాకర్షింపఁజాలవు. భరతుని మనస్సిట్టిదౌనాకాదా తెలియుటకే భరద్వాజుఁడీపరీక్ష చేసెను.

ఉ. ఎక్కడ నున్న వాఁడొకొ ము♦నీశ్వర రాముఁడు, మార్గ మెద్దియో ?
యిక్కడ కెంతదూర? మిపు♦డేగఁగఁ గోరెద, నన్న మౌని యా
ప్రక్కన యోజనద్వయము♦పై నటుయోజన మేగఁ గానలోఁ
జక్కఁగ నిర్జనం బయిన♦చాయ, నటన్ నయనాభిరామ మై. ౨౧౧౩

నయనాభిరామమై=కన్నులకు మనోహరమై.

తా త్ప ర్య ము.

మునీంద్రా! శ్రీరామచంద్రుఁ డెక్కడనున్నాఁడు. ఆయన యుండుచోటికిఁ బోవు త్రోపయేది? ఆ స్థల మిక్కడ కెంతదూరము అక్కడకు నేను బోవఁగోరుచున్నాను. అని యడుగఁగా ముని వ్రేలఁజూపించుచు నిక్కడికి రెండున్నర యామడ దూరము పోవఁగా నడవిలో జనములులేని చక్కనిచాయ గలదు. అచ్చట గన్నులకు మనోహరమై.

సీ. చిత్రకూటం బనఁ♦ జెలువారు నగ మొండు, దానికి నుత్తర♦తలమునందు
సుందరతరులతా♦బృందతుందిలవని, మందాకినీనది♦ యందగించు
నాసదీనికటంబు♦నం దుండు జిత్రకూ,టం బను శైలంబు♦డంబుమీఱి
యారెంటి నడుమను♦నాశ్రమంబునఁ దండ్రి!
నీయన్న వసియించు♦నిక్కమిదియు

ఆ. నిట్లు దక్షిణముగ♦నేగుము దవ్వేగ, సవ్యదక్షిణముగఁ♦ జను నొకొండు
బాట దానియందు♦బలఁగంపు నడుపు మ,
చ్చోటఁగనెదు రాము♦సుగుణధాము. ౨౧౧౪

నగము=పర్వతము, ఉత్తరతలము = ఉత్తరప్రదేశమునందు, సుందరతరులతాబృంద తుందిలవని = అందమైన తీఁగలగుంపులచే నిండిన యడవి, మందాకినీ నది=మందాకినియను పేరుగల నది, ఇది భాగీరథికాదు. మందాకినియను పేరుగల చిన్న నది. నదీనికటంబునందున్ = నదికి సమీపమునందు, శైలంబు=పర్వతము, డంబుమీఱున్=కాంతిచే నతిశయించును, సవ్యదక్షిణముగన్=నైరృతిమూలగ, దవ్వు = దూరము, బలఁగంబు = సేన.

గుహుఁడు బంధువులతోడ వచ్చుచుండఁగాఁ ద్రోవతెలుపుమని భరద్వాజు నడుగుట గౌరవార్థము కానచ్చును. పామరులు చెప్పినది సరియైనను నది పండితులు మెచ్చువఱకు విశ్వసింపరాదని తెలుపుట కొండెనగు. కాళిదాసుఁడు శాకుంతలమున "ఆపరితోషా ద్విదుషాం! నసాధుమన్యేప్రయోగ విజ్ఞానమ్! బలవదపి శిక్షితానా మాత్మన్యప్రత్యయంచేత" యని చెప్పెనుగదా.

తా త్ప ర్య ము

చిత్రకూటమను పర్వతము మీకుఁగానిపించును. దీనికి నుత్తరభాగమందు నందమైనచెట్లు తీఁగలు గుంపులుగా నిండియుండు వనమొండుగలదు. అచ్చట మందాకినియను నది గలదు. ఆనదికి సమీపమందుండు పర్వతమునకే చిత్ర కూటమని పేరు. ఆ పర్వతమునకు నానదికి నడుమ ననఁగాఁ పర్వతమునకు నుత్తరముగ నదికి దక్షిణముగ నుండునాశ్రమమందు నాయనా! నీయన్న యున్నవాఁడు. ఇది నిజము. నేను యోగదృష్టి చూచితిని. కావున నిట్లు దక్షిణపు వైపుగ దూరముపొమ్ము. అట్లుపోఁగా నచ్చట నైరృతిమూల నొకబాటపోవును. ఆ బాటవెంట సేన పోనిమ్ము. అచట సుగుణధాము శ్రీరాముని జూడఁగలవు.

సీ. ఇట్లు భరద్వాజుఁ • డేగుమార్గంబును, దెలుపఁగ దశరథు • దేవు లెల్లఁ
దమయానములు డిగ్గి • తద్విప్రవరుఁ జుట్టి, కొలిచిరి కౌసల్య • పలుకవాలు
చిక్కినమేనితోఁ • బ్రక్క సుమిత్ర రా, మునిపాదయుగళికి • మ్రొక్కి నిలువ
వ్యర్థకామయు లోక • వర్గవిగర్హిత, కైక మ్రొక్కిడి ఋషి • లోకపతికి
ఆ. సిగ్గుచేత భరతు • చెంగట నిలిచిన, భరతుఁ జూచి యిట్లు • పలికెఁ దపసి
దివసనాథవంశ్య • తెలుపవే మీతల్లు, లెవ్వరనిన నాతఁ • డిట్టు లనియె. ౫౧౧౫

ఏగుమార్గంబును = రామాశ్రమంబునకుఁబోవు త్రోవను, దశరథుదేవులు = దశరథునిభార్యలు, యానములు = వాహనములు, పలుకవాలు = తెల్లవాటిన, చిక్కిన = శుష్కించిన, మేనితో = దేహముతో, వ్యర్థకామును = కొనసాగని కోరికగలది, లోకవర్గవిగర్హిత = జనసమూహముచే నిందింపఁబడినది, మ్రొక్కెడి = నమస్క రించి.

తా త్ప ర్య ము.

ఈప్రకారము రామాశ్రమమునకుఁబోవు మార్గమును భరద్వాజుఁడు తెలు పఁగా దశరథుని భార్యలందఱుఁ దమవాహనములు దిగి యా బ్రాహ్మణునిజుట్టి సేవించిరి. కౌసల్య తెల్లపాఱి శుష్కించిన దేహముతోఁ దనప్రక్క సుమిత్రరాఁగా మునీశ్వరు రెండుపాదములకు మ్రొక్కి నిలువఁగా నిష్ప్రయోజనమైన కోరిక గలదియు లోకనిందితయు నగు కైక నమస్కరించి యిట్టి యకార్యముచేసి యేమని యీయన యెదురుగ నిలుతునని సిగ్గుచే భరతు సమీపంబున చాటుగ నిలువఁగా భరతునిజూచి భరద్వాజుఁడు వీరిలో నీతల్లులెవ్వరెవ్వరో తెలుపుమని యడిగెను. భరతుఁడిట్లు చెప్పెను.

ఇదియును భరతుని మనస్సు శిక్షించుటకేయని గ్రహించునది.

—• భరతుఁడు భరద్వాజునకుఁ దనతల్లుల నెఱిఁగించుట. •—

ఉ. పుట్టెఁడుశోకభారమునఁ • బొక్కు చుపాసముచేఁ గృశించుచున్
బట్టుగ ధర్మదేవత య • నం గనుపట్టెడిసాధ్వి యాజికిం

బట్టపుదేవి, యీమెయ సు♦మా పురుషోత్తము సింహవిక్రముం
బట్టిగఁ గాంచె నయ్యదితి♦మాధవుఁ గాంచినపోల్కి రామునిన్. ౨౧౧౬

పుట్టఁడు=పుట్టి+ఎఁడు- అంద్వ్యం తాగమంబులందప్ప నపదాది స్వరంబున కచ్చుపరంబగునపు డన్నియచ్చులకు సంధినిత్యము. సు. వ్యా. సంధి ౧౪ సూ. అనఁగా— పుట్టికొలఁతగలయని యర్థము. శోకభారమునన్=శోకాతిశయముచే, పొక్కుచున్=దుఃఖించుచు, ఉపాసనచే=ఉపవాసముచే, కృశించుచున్=చిక్కిపోవుచు, సాధ్వి=పతివ్రత, ఆజికిన్=దశరథునకు, పురుషోత్తమున్=పురుషులకంటె నుత్తముని, సింహవిక్రమున్ = సింహము పరాక్రమమువంటి పరాక్రమముగలవానిని, పట్టిగన్=కుమారునిగ.

తాత్పర్యము

పుట్టఁడు శోకాతిశయముచే దుఃఖించుచుఁ బస్తులచేఁ జిక్కిపోవుచు ధర్మదేవత యనునట్లు గానవచ్చు పతివ్రతయే దశరథునకుఁ బట్టపుదేవియై పురుషోత్తముఁడు సింహవిక్రముఁడైన శ్రీరామచంద్రుని నదితి యుపేంద్రుని గన్నట్లు కుమారునిఁ గనెను.

ఉ. అల్లదె యీమె వామభుజ ♦ మల్లన నూఁది దురంతవేదనన్
మల్లడిగొంచు చరణ్యమున ♦ మ్లానసుమం బగుగన్నెరో యనన్
వెల్లనపాఱి తోఁచుసతి ♦ విశ్రుతశీల సుమిత్ర, తత్సుతుల్
సల్లలితప్రచారు లగు♦లక్ష్మణుఁడుం బినతమ్ముఁడీతఁడున్. ౨౧౧౭

వామభుజము=ఎడమభుజము, అల్లనన్=మెల్లగా, ఊఁది=ఒత్తి, దురంతవేదనన్=అంతములేనిబాధచే, మల్లడిగొంచున్=బాధపడుచు, మ్లానసుమంబు=వాడినపూవు, గన్నేరు=గన్నేరుచెట్టో, వెల్లనపాఱి=తెల్లనై, విశ్రుతశీల=ప్రసిద్ధికెక్కిన స్వభావముగలది, సల్లలితప్రచారులు = మంచి మనోహరమైన నడవడికలవారు.

తాత్పర్యము

అదిగో వణఁకుచున్న కౌసల్య క్రిందఁబడకుండునట్లు లామె యెడమ భుజమును దాను మెల్లగ నొత్తిపట్టి యంతములేని శోకమున బాధపడుచు నరణ్యమందు వాడినపువ్వుగల గన్నేరుచెట్టో యనునట్లయి తెల్లబాఱికానవచ్చు పతివ్రత ప్రసిద్ధికెక్కిన స్వభావముగలది సుమిత్రాదేవి. ఈమె కొడుకులే మంచి మనోహరములైన నడవడిగల లక్ష్మణుఁడు పినతమ్ముఁడగు నీ శత్రుఘ్నుఁడును

ఉ. ఏమె మహాపరాధము ము♦నీశ్వర! ప్రాణముమీఁదఁ దెచ్చెని
ష్పాపుల కన్నదమ్ములకుఁ ♦ బార్థివు స్వర్గతుఁ జేసె నట్టిదా
పాపిని మూఢచిత్త ఖల ♦ భామిని నిష్ఠురశీల శాఠ్యసం
ప్రాపితభోగ దుస్సుభగ♦మానిని కైకయి యిద్దియే సుమీ. ౨౧౧౮

ఏపె=ఏ+ఆపె=ఏపె, మహాపరాధము=గొప్ప దోషము, నిష్పాపులకున్=పాపరహితులకు, పార్థివున్=రాజగు దశరథుని, స్వర్గతున్ = స్వర్గమునుబొందినవానిని, పాపిని=పాపాత్మురాలు, మూఢచిత్త=బుద్ధిలేనిది, ఖల=దుర్మార్గురాలు, భామిని=కోపశీల- "కోపనాసైవభామినీ' అమరుఁడు నిష్ఠురశీల = పరుష స్వభావముగలది, శాఠ్యసంప్రాపితభోగ = మోసముచే సంపాదించిన భోగముగలది, దుస్సుభగమానిని=తానే యందగత్తెయను దురహంకారము గలది.

తాత్పర్యము

మునీశ్వరా! యెవతెచేసిన గొప్పదోషము పాప రహితులయిన శ్రీరామలక్ష్మణులకుఁ బ్రాణగండను కలిగించెనో? రాజగు దశరథుని స్వర్గమును బొందినవాని నొనరించెనో? అటువంటి పాపిని, బుద్ధిలేనిది, దుష్టురాలు, కోపశీల, పరుష స్వభావము గలది, మోసగించు నాచారముగలది, కోపించు స్వభావము గలది కైకయి యనునది యిదియే.

తే. ఆర్యరూపిణి యైన య ♦ నార్య యదయ,
పాపనిశ్చయ నాదుసం ♦ తాపమునకు
మూలకారణ మైనట్టి ♦ మూర్ఖురాలు, నన్నుఁగన్నదిగా నెంచు ♦ నన్ను తార్క్ష్య!

ఆర్యరూపిణి=రూపమున నార్యవలెఁ గనవచ్చునది, అనార్య=వాస్తవమున ననార్య. పాపములనుండి దూరముగఁ దొలఁగువాఁ డార్యుఁడని వ్యుత్పత్త్యర్థము. అదయ=దయలేనిది, పాపనిశ్చయ=పాపముచేయుటయందే నిశ్చయబుద్ధిగలది, నన్నుఁగన్నది=తల్లియను పదమునకు యోగ్యురాలుకాదు. కావున నిట్లుచెప్పెను.

తాత్పర్యము

చూపునకార్య, వాస్తవమున ననార్య, దయాహీనురాలు, పాపమందే నిశ్చయబుద్ధిగలది. నా దుఃఖమునకు మూలకారణమైన మూర్ఖురాలు. నన్నుఁగన్నదిగా నెంచుము.

కం. అని బాష్పగద్గదధ్వనిఁ, దన పలుకులు తొట్రుపడఁగ ♦ దర్వీకరరీ
తిని రోఁజుచుఁ గను లెఱ్ఱగఁ, బనవెడునాతనికి మౌని ♦ పతి యిట్లనియెన్.

బాష్పగద్గదధ్వని = కన్నీళ్ళడ్డపడుటచే గద్గదికగల కంఠధ్వనిచే, దర్వీకరరీతిన్=పామువలె, రోఁజుచున్=బుసగొట్టుచు, పనవెడు=శోకించు.

తాత్పర్యము

ఈప్రకారము కన్నీళ్ళడ్డపడుటచే డగ్గుత్తికపడిన గొంతుతోఁ దన పలుకులు దడఁబడఁ బాముపలె బుసగొట్టుచుఁ గన్ను లెఱ్ఱగఁజేసి శోకించునతనికి మౌనిపతి యిట్లనెను.

కం. సీతల్లి నేల దూఱెదు, ఖ్యాతయశా! రామవిభుని ♦ గహననివాసం
బాతతసుఖమం బగుఁ జు, మ్యాతపసుల కసురులకును ♦ మనుదనుజులకున్.

దూఱెదు = నిందించెదు, ఖ్యాతయశా = ప్రసిద్ధికెక్కిన కీర్తిగలవాఁడా, 'ఆమె సడవడివలననే నీవు కీర్తిగలవాఁడ వగుదువు. కావున నిందింపకుము. ఆమె యీపని చేయకున్న నీవెట్లు కీర్తిమంతుఁడవు కాఁగలవు. సానకు వేసి నపుడుగదా వజ్రమునకుఁ బ్రకాశమెక్కును. శ్రీరాముని, గహననివాసంబు= అడవియందుండుట, ఆతతసుఖదంబగు=విస్తారసుఖము కలిగించునది.

మనుదనుజులకున్=మనుజులకున్ + దనుజులకున్ ద్వంద్వాంత మందలి శబ్దము సమాసమునఁ బ్రతిపదముతో వేఱువేఱుగ సంబంధించియుండు- సు. వ్యా. సమాస సూ. ౧౪.

తాత్పర్యము

ప్రఖ్యాత కీర్తిగలవాఁడా! నీ తల్లి నేలదూఱెదు. శ్రీరాము సరణ్యావాసము తపసులకు దేవతలకు మనుజులకు దనుజులకు విస్తారసుఖము కలిగించునది యగును. కావున నామె నిందింపఁబడఁదగదు.

నీ తల్లు లెవరని ప్రశ్నించుటకుఁ గారణ మీహితము బోధించుటకే, కైక లేకున్న రామాయణమే లేదుకదా. త్రికాలవేదియగు భరద్వాజుఁడు శ్రీరామ చంద్రుఁడు చేయఁబోవు రాక్షసవధాదికము మనస్సునందుంచుకొని యిట్లు చెప్పెను.

—• భరతుఁడు చిత్రకూటంబునకుఁ బ్రయాణ మగుట. •—

కం. పయనింపుఁ డనిన మ్రొక్కుచు, హయగజరథవివిధవాహ•నాదులతోడన్
రయమునఁ జనఁ జొచ్చెను యమి,
నియమితమార్గమునఁ బుణ్య•నిష్ఠుం డంతన్. ౨౧-౨౨

పయనింపుఁడు=ప్రయాణముచేయుఁడు, హయగజరథ వివిధ వాహనముల తోడన్=గుఱ్ఱములు, రథములు; నానావిధ వాహనములు వీనితో, రయమునన్= శీఘ్రముగ, యమి=భరద్వాజునిచే, నియమితమార్గమునన్=నియమింపఁబడిన త్రోవన, పుణ్యనిష్ఠుఁడు=పుణ్యము చేయుటయందు నిష్ఠగలవాఁడు.

తాత్పర్యము.

ఇఁకఁ బ్రయాణము గండనిన నమస్కరించుచు గుఱ్ఱములు నేనుఁగులు రథములు నానా వాహనములు వెంటరాఁగా ధర్మనిష్ఠుఁడైన భరతుఁడు ముని చెప్పిన మార్గమున శీఘ్రప్రయాణము చేసెను.

కం. హాటకభూషోదంచిత, ఘోటకముల స్యందనముల• గురుజవమున నే
ర్పాటుగఁ దీరిచి జనతా,కోటులు పయనించె నెక్కి•కుతుకముతోడన్.

హాటకభూషోదంచిత=బంగారు భూషణములచేఁ బ్రకాశించు, ఘోటకము లన్=గుఱ్ఱములను, స్యందనములన్=తేర్లను, గురుజవమునన్=అధికవేగమున, జనతా=జనసమూహముల, కోటులు=పెక్కు సంఖ్యలు.

తాత్పర్యము

బంగారుసొమ్ములచేఁ బ్రకాశించు గుఱ్ఱములను రథములను మిగుల వేగముగ నొకదానితోనొకటి కలియక వేఱువేఱుగ వచ్చునట్లేర్పాటుచేసి శ్రీరామచంద్రుని జూచుకోరికతో ననేకసంఖ్యల ప్రజలు పయనించిరి.

కం. కంజరకక్ష్యారాజిత,కుంజరకన్యకలు నేనుఁ•గుల్ గంటలు మ్రోఁ
గం జనె జడికారున ఘన,పుంజంబులు గర్జ లొలయఁ•బోయెడిరీతిన్.

కంజర=బంగారుతోఁజేయఁబడిన, కక్ష్యా=త్రాళ్ళచే, రాజిత=ప్రకాశించు, కుంజరకన్యకలు=ఆఁడేనుఁగులు, జడికారునన్=వర్షాకాలమునందు, ఘనపుంజంబులు=ఏనుఁగుల గుంపులు, గర్జలు=ధ్వనులు.

తాత్పర్యము

బంగారు గొలుసులచేఁ బ్రకాశించు నాఁడేనుఁగులు మగ యేనుఁగులు గంటలు ధ్వనించుచుండఁగా వానకాలమందుఱుములతో మేఘముల గుంపులు పోవువిధమునఁ బోయెను.

కం. చినచిన్నవి పెదపెద్దవి, కన వివిధములై మహార్ఘ•కలితంబులు వా
హనములు పోవం దొడఁగెను, జనియె భటావళియుఁ బాద•సంచారమునన్.

మహార్ఘకలితంబులు=మిగుల వెలగలవి, పాదసంచారమునన్=కాలినడకతో

తాత్పర్యము

చిన్నవి మఱిచిన్నవి పెద్దవి యంతకుఁ బెద్దవి యగు వెలగల వాహనములు పోవుచుండెను. భటులు కాలినడకతోఁ బోయిరి.

కం. కను టెప్పుడొ కోడలి నా,యినతేజుల సుతుల ననెడి•యెలమిని దమవా
హనములఁ గౌసల్యాదులు, చనిరి మహాసమ్మదమున•సత్వర లగుచున్.

ఇనతేజులన్ = సూర్యుని తేజస్సువంటి తేజస్సుగలవారిని, ఎలమిని = సంతోషముతో, సత్వరలు = త్వరతోఁగూడినవారు.

తాత్పర్యము

కోడలిని సూర్యతేజులయిన కొడుకులను నెపుడెపుడు చూతుమా యను సంతోషముతోఁ ద్వరగాఁ గౌసల్యాదులు పోయిరి.

కం. భరతుఁడు తరుణార్కామృత, కిరణనిభం బయినపల్ల•కిని నెక్కి చనెన్
బరివారంబులు గొలువఁగ, నరిగెను వెనుమేఘ మన మ•హానీకినియున్.

తరుణార్క=బాలసూర్యునితోను, అమృతకిరణ=చంద్రునితోను, నిభంబు =సమానమైనది, పరివారంబులు = సేవకులు, సేనలు మొదలయినవి, మహానీకినియున్=గొప్పసేనయును.

తాత్పర్యము

బాల సూర్యచంద్రులతో సమానమైన పల్లకినెక్కి భరతుఁడు సేవకులు కొలుచుచుండఁగాఁ బోయెను. ఇట్టి మహాసేన.

కం. చని చని దక్షిణపుందెస, వనచయములు దాఁటి గంగ•పరవేలను జొ
చ్చెను త్రస్తపక్షిమృగమయి, పెను పగువన మొక్కఁ డచట•వీరవరుండున్.

గంగపరవేలను=దక్షిణదిక్కుగాఁ బాఱు గంగయొక్క పడమటియొడ్డున, త్రస్తపక్షిమృగము=భయపెట్టఁబడిన పక్షులు మృగములు, అయి=కలిగి, పెను పగు=పెద్దదయిన ఈగుంపునుజూచి యవి భయపడెనని భావము.

తాత్పర్యము.

దక్షిణపు దిక్కుగాఁ బోయిపోయి యచట దక్షిణముఖముగఁ బాఱు గంగ పడమటియొడ్డునఁ బ్రవేశించి భయపెట్టఁబడిన పక్షులు మృగములు గల యొక పెద్ద వనమును వీరాగ్రణి భరతుఁడు చూచెను.

౯౩-వ సర్గము.

సీ. అపురూప మగునమ్మ•హాసేనరాకకుఁ, గలగుండుపడుచు న•క్కానలోని
వనగజంబులు పర్వ•పాళె నాత్రొక్కుల, హల్లకల్లోలంబు•లగుచు ఋక్ష
రురుపృషతంబులు•గిరినదీవన రాజి, నెక్కడఁ జూచినఁ • బిక్కటిల్లె
వాహినీపతిఁ బోలు•వాహిని వర్షాబ్ద, మన భూమి నెంతయు•నాక్రమించెఁ

ఆ. చటులజవము లైన•సైంధవంబులచేత, గంధసింధురముల•గణముచేత
బంధురంబు లైన•వాహిని నడుచు చోఁ,గానరాదు దీర్ఘ•కాల మిలయు.

అపురూపము = అపూర్వశబ్దభవము, మునుపెన్నఁడు చూడనిది, కల గుండు=కలఁత, హల్లకల్లోలంబులు=తాఱుమాఱు, ఋక్ష = ఎలుఁగులు, రురు = దేహములపై మచ్చలులేని జింకలు, పృషతంబులు=మచ్చలుగల జింకలు, గిరి= పర్వతమునందును, నదీ=ఏటియొడ్డులందును, వనరాజిన్=వనముల గుంపుల యందును, పిక్కటిల్లెన్=నిండెను, వాహినీపతిన్ = నదులకుఁ బతియగు సము ద్రుని, వాహిని=సేన, వర్షాబ్దము=వర్షా+అబ్దము = వానకాలమందలి మేఘము, చటులజవములు = అతివేగములు, సైంధవంబులచేతన్ = గుఱ్ఱములచే, గంధ సింధురముల గణములచేతన్ = మదించిన యేనుఁగుల సమూహములచే, బంధు రంబు=దట్టమైన, దీర్ఘకాలము=చాలఁగాలము.

తాత్పర్యము

మునుపెన్నఁడుచూడని యామహాసేన వచ్చుటఁజూచి యా యడవిలోని యేనుఁగులు కలవరపాటుచెంది నలువంకలఁ బరువెత్తెను. వాని త్రొక్కులచేత నెలుఁగులు జింకలు తాఱుమాఱయి పరుగెత్తుచుఁ గొండలను నడవులను నేటితీర ములను నెక్కడఁజూచిన నవియే దట్టమయ్యెను. సముద్రమువంటిసేన భూమిని

వర్షాకాలమందలి మబ్బులాకాశమువలె నాక్రమించెను. అతివేగములైన గుఱ్ఱములు మదపుటేనుఁగులు వీనిచే దట్టమైన సేన నడచునపుడు చాలఁగాలము భూమిగూ గానరాకుండెను.

ఆ. ఇట్లు పోయిపోయి యెంతయు దవ్వుగ, వాహనములు డయ్యు వాసవాభుఁ
డచొటు చేరి పలికె ననఘు వసిష్ఠమౌ, నీంద్రుఁ జూచి కంటె యివ్వనంబు. [౨౧౩౦

తాత్పర్యము

ఇట్లు చాలదూరము పోయిపోయి వాహనములు బడలికచెందఁగా నింద్రునితో సమానుఁడైన భరతుఁడా చోటఁజేరి వసిష్ఠునిఁజూచి యిట్లనెను.

అచొట=కృతహ్రస్వంబగు త్రికంబు మీఁదిచోటు శబ్దంబు నోత్వంబున కత్వ హ్రస్వంబులు విభాషనగు సు. వ్యా సమాస. ౩౭ సూ.

కం. మనకు భరద్వాజుఁడు పల్కిన దేశం బిదిగఁ దోఁచె గిరి యది యగుఁబో
ఘనచిత్రకూట మివ్వా,హిని మందాకినియ కంటె రే దూరమునన్. ౨౧౩౧

నాలుగవ పాదంబునఁ బ్లుతయతి.

తాత్పర్యము

మనకు భరద్వాజుఁడు చెప్పిన ప్రదేశమిదియేయై యుండును. అదిగోఁ గానవచ్చునదియే చిత్రకూటము, ఈనదియె మందాకిని, అదిగో దూరమందు.

—• భరతుఁడు శత్రుఘ్నునకుఁ జిత్రకూటవనంబు వర్ణించి చెప్పుట. •—

కం. అసితజలదాభశోభా,లసితం బగువన మటంచు లక్ష్మణుననుజున్
దెసఁ గన్గొని గిరిసానుల,పసఁ జెఱుచు మదద్రితుల్య వారణగణముల్.

అసిత=నల్లని, జలదాభ=మేఘముతో సమానమైన, శోభా=కాంతిచే, లసితంబు=ప్రకాశించునది, గిరిసానుల=కొండపేటుల, పస = సారమును, మత్ = నాయొక్క, అద్రితుల్య=కొండలతో సమానములైన, వారణగణముల్ = ఏనుఁగులు గుంపులు.

తాత్పర్యము

నల్లని మబ్బులవంటి కాంతిగల వనము, అని చెప్పి శత్రుఘ్నుని జూచి కొండలతో సమానములైన నాయేనుఁగుల గుంపులు కొండచఱుల సారము చెఱుచునవియై యున్నవి.

ఉ. సామజముల్ చనంగ రభసంబున రాల్పొడి యయ్యె, వృక్షముల్
కోమలసూనరాజులను ఘుమ్మన రాల్చెను, సూక్ష్మకాత్యయ
శ్యామలవారివాహములు నంబువులం దొరఁగించుభంగి నై;
యామరకిన్నరోత్కరస మాచరితం బగుదేశ మల్లదే. ౨౧౩౩

సామజముల్ = ఏనుఁగులు, సామవేదమువలనఁ బుట్టినవని వ్యుత్పత్తి, రభసంబునన్=శీఘ్రముగ, ఱాలు=శిలలు, కోమలసూనరాజులను=మృదువులైన

పుష్ప సమూహములను, ఊష్మక+అత్యయ=ఎండాకాలముపోఁగా వర్షాకాలమం దలి, శ్యామల=నల్లనైన, వారివాహములు=మేఘములు, అంబువులన్=నీళ్ళను, తోరఁగించు=కురియించు, భంగినై = విధముగలదై, అమర=దేవతా సమూహ ములచేతను, కిన్నర=కిన్నరులయొక్క, ఉత్కర = సమూహముచేతను, సమా చరితంబు=సంచరింపఁబడినది.

తాత్పర్యము

మనయేనుఁగులు పోవువేగమున వానికాలిక్రిందఁబడిన శిలలు పొడియయ్యెను. వానకాలమందు నల్లని మేఘములు నీళ్ళబిందువులు వర్షించువిధమున చెట్లు కోమలములైన పూవులరాసులను ఘుమ్మను వాసన వ్యాపించుచుండఁగా రాల్చెను. అదిగో నాకానవచ్చునదే దేవతలు కిన్నరులు సంచారముచేయు ప్రదేశము.

చం. మకరనివాససాగరము•మాడ్కి రహించె మృగాకులంబు గో
 త్రకటకదేశముం గనితె• తమ్ముఁడ తోలఁగ సైనికుల్ భయా
 ధికగతిఁ బాఱఁ జొచ్చె నలు•దిక్కులవాతవిధూతశారద
 ప్రకటవలాహకావళి న•భస్స్థలిఁ బోలె మృగోత్కరంబులున్. ॥౧౨॥

మకరనివాస సాగరముమాడ్కిన్=మొసళ్ళువాసముచేయు సముద్రమువలె, మృగాకులంబు=మృగములచేఁ గలఁతచెందినది, గోత్రకటక దేశమున్=కొండ చఱులచోటు, భయాధికగతిన్ = భయముచే మిగులవేగమున, వాత = గాలిచే, విధూత=ఎగురఁగొట్టఁబడిన, శారద=శరత్కాలమందలి, వలాహక=మేఘముల, ఆవళి=సమూహము, నభస్స్థలిన్=ఆకాశమును, మృగోత్కరంబులున్ = మృగ సమూహములు.

తాత్పర్యము.

కొండచఱుల ప్రదేశము మృగములచేఁ గలఁతచెందినవై మొసళ్ళు వసించు సముద్రమువలె నున్నది. సైనికులు తఱుచుగా భయముచే నధికమైన గమనముతో మృగసమూహము లాకాశమునందు గాలిచే నెగురఁగొట్టఁబడిన శరత్కాల మేఘముల గుంపువలె నాలుగువైపులఁ బరువెత్తుచున్నవి.

తాత్పర్యము

కం. నల్లనిమేఘం బన రుచి మొల్లమి గలకురుల నెగయు•ముడి వైచి భటుల్
 పెల్లుగఁబూవులు ముడిచిరి, యల్లదిగో దాక్షిణాత్యు•లనఁగాఁ గంటే. ॥౧౩॥

రుచిమొల్లము=కాంతియొక్క యతిశయము, కురులన్ = వెంట్రుకలను, ఇది నిత్యబహువచనాంతము, దాక్షిణాత్యులు = దక్షిణదేశవాసులు, భరతుఁడు దక్షిణదేశము చూడలేదుగదా? ఇది యాయనకు నెట్లుతెలియునని సందేహింపఁ బనిలేదు. ఒక గొప్పనగరమం దన్ని దేశముల జనములుందురు వారు వారి వారి యాచారముల చొప్పుననే ప్రవర్తింతురు. రాకపోకలు లేవందురా ? దేశ మధ్య భాగమరణ్యముగానే యుండెనుగాని సముద్రతీరమున జనావాసములైన దేశ

ములే యుండెను. అదియునుగాక కప్పముగట్టుటకో యితర కారణములచేతనో యెందఱో వచ్చుచుఁ బోవుచుందురు. వీరిని భరతుఁడు చూచియుండును.

తాత్పర్యము

నల్లని మేఘమువలె నతిశయమైన కాంతిగల వెండ్రుకలను బైకి దక్షిణ దేశవాసులవలె సెగఁద్రోచి ముడివేసి దానియందుఁ బూవులను విశేషముగ ధరించిరి చూచితివా.

కం. జనవర్జిత మీశైలము, జనతాసంకీర్ణ మగుచు • సంశోభించెన్
మనపురి యయోధ్యరీతిని, గనులకుఁ బండువుగ నిపుడు•కాంచితె దీనిన్.

జనవర్జితము=జనులచే విడువఁబడినది, శైలము=కొండ, జనతా = జన సమూహముచే, సంకీర్ణము=వ్యాపించినది, సంశోభించెన్=ప్రకాశించెను.

తాత్పర్యము

నిర్మానుష్యమైన యీకొండ యిపుడు జనులతోఁ గూడినదై యయోధ్యా నగరమువలెఁ బ్రకాశించుచున్నది.

కం. గిట్టలతాఁకున ధూళులు, బుట్టి నభోమండలంబుఁ • బొరిఁగప్పినఁ దా
నెట్టన గాలియుఁ జెదరం, గొట్టెడి హర్షంబు నాకుఁ•గూర్చెడిభంగిన్. ౨౧౩౪

నభోమండలము=ఆకాశప్రదేశము, పొరిన్=పూర్ణముగా, నెట్టన=అడ్డులేక

తాత్పర్యము.

గుఱ్ఱములు లెద్దులు మొదలైనవాని గిట్టలు నేలతగులుటచే రేఁగినదుమ్ము లాకాశమును బూర్ణముగాఁ గప్పఁగా రామాశ్రమము గానరాకుండఁగా నాకు నదికనఁబడునట్లుచేసి సంతోషము గలిగించుటకై గాలి యీదుమ్మును జెదరఁ గొట్టెను.

ఉ. రామునిఁ గాంచుకౌతుకభ•రంబున నెవ్వడిఁ బోవు సైనిక
స్తోమముఁ గంటె తేరుగమి•తోరపునాదున నుల్కిపాఱు నీ
భూమిధరంబునందలి ప్ర•భూతమనోజ్ఞ మయూరపాళు లెం
తే ముద మొప్పఁ గూర్చెఁ గని•తే యవె సానువులందుఁ దస్ముఁడా.

కౌతుకభరంబునన్=సంతోషాతిశయముచే, నెవ్వడిన్=నెఱ + వడి=నిండు వేగమున, సైనికస్తోమము=సేనాభటుల సమూహము, తోరపునాదున = అధిక మైనధ్వనిచే, ఉల్కి పాఱు=భయపడి పరువెత్తు, ప్రభూత=మిక్కిలి యతిశయించిన, మనోజ్ఞ = రమ్యములైన, మయూరపాళులు = నెమిళ్ళ సమూహములు, ఎంతేన్=మిక్కిలి,ఏని శబ్దమునందలి 'ని' వర్ణము లోపింపఁగా మిగిలినరూపము 'ఎందేడెందము కందళించు' మనుచరిత్ర. హల్లు పరమైనపుడు ఏని శబ్దములోని ఇకారమునకు లోపము వైకల్పికము. సు. వ్యా. సంధి సూ. ౧౮. సానువులందున్=చఱులయందు.

తాత్పర్యము

తమ్ముఁడా! శ్రీరామచంద్రునిఁ జూడవలయునను సంతోషాతిశయముచే మిగుల వేగముగఁ బోవుచున్న సేనాభటులఁ జూచితివా? రథముల గుంపుల యధికమైన ధ్వనులను భయపడి పరువెత్తుచున్న మిగుల రమ్యమైన నెమిళ్లు చఱులందు మిగుల సంతోషము గలిగించుచున్నవి చూచితివా.

ఉ. కన్నులపండు వయ్యెఁ గనఁగానిది కేవలనాకతుల్య మై
యున్నది, తాపసాశ్రమము • లుండెడు నిం దని తోఁచెఁ, బుష్పసం
ఛన్నము లట్లు బిందుమృగ•సంతతు లయ్యెవె, రామునాశ్రమం
బున్నెడ రోయఁ బంప నగు • నొయ్యనఁ గొండొకసాధుసైన్యమున్.-౨౧౩౯

కేవల నాకతుల్యమైన=స్వర్గముతోనే సమానమైనది, పుష్పసంఛన్నము లట్లు = పూలచేఁ గప్పబడినవానివలె, బిందు మృగసంతతులు = చుక్కలుగల జింకల సమూహములు, ఉన్నెడ=ఉన్నస్థలము, రోయన్=వెదకుటకు, కొండొక= అల్పసంఖ్య భటులుగల, సాధు=యోగ్యమైన, సైన్యమున్ = సేనను, “సాధు స్త్రీషూచితేచారౌ సభ్యే వార్ధుషికేపి” నానా. ర.

తాత్పర్యము

ఇది చూచుటకెంతో సంతోషకరమై సాక్షాత్తు స్వర్గమువలెనే యున్నది. కావున నిచట మునుల యాశ్రమము లుండవచ్చును. ఏలయన నాశ్రమము లందు నందందు మచ్చలుగల జింకలు పూలచేఁ గప్పఁబడినట్లున్నవి. అదిగోఁ జూడుము. కావున నిందు శ్రీరామచంద్రమూర్తి యాశ్రమమున్న చోటు వెదకు టకై యల్పసేనాభటుల నాయుధపాణులు గానివారినిఁ బంపఁదగును.

చం. అన విని కొంద ఱేగి వని • నక్కడ నక్కడ రోసి యొక్క చోఁ
గని పొగ వేఁగు చుంటఁ జని • కైకయిపట్టికిఁ రద్దిగోఁ
గను మదె ధూమముం, గలుగ•గా నెటు నేర్చు జనంబు లేనిచో
టను బొగ, గాన నయ్యెడ దృ•ఢంబుగ నుందురు రామలక్ష్మణుల్.

వనిన్=అడవియందు, రోసి=వెదకి, ధూమము = పొగ, దృఢంబుగన్ = నిశ్చయముగ.

తాత్పర్యము.

అని చెప్పఁగాఁ గొందఱు విని పోయి యడవియందు నచ్చటచ్చట వెదకి యొకచోట పొగ యెగయుచుండుట చూచివచ్చి భరతునితో నల్లదిగోఁ బొగ చూడుము నిప్పులేక పొగయుండదు. మనుష్యులులేక నిప్పుండదు. కావున నక్కడ శ్రీరామలక్ష్మణు లుందురు. అని చెప్పిరి. దీనికే యనుమాన ప్రమాణమని పేరు. అనఁగా నూహించి తెలియునది.

ఉ. వారలు గాక యున్న రఘు•వర్యునితో సరి యైనమౌనులేన్
వారక యుందు రం దనిన • వారలమాటల నాలకించి య
వ్వారలతోడ ని ట్లనియె • వాహినితోడుత నింద నిల్వుఁడీ
మీరలు; నే సుమం త్రుఁడును • మేటిగురుండును బోదుమం చనన్. ౨౧౪౧

తా త్ప ర్య ము.

అందున్న మనుష్యులు శ్రీరామలక్ష్మణులు కారేని వారితో సమానులైన మునీశ్వరులయిన నుందురు. వారినడిగిన శ్రీరామ లక్ష్మణులుండు నాశ్రమమును జూపుదురు. అనిన వారలమాటలువిని మీరందఱు సేనతో నిందేనిలువుఁడు. రాజులందు నేను శత్రుఘ్నుఁడు మంత్రులందు సుమంత్రుఁడు పురోహితులందు గురుఁడు వసిష్ఠుఁడు పోదుము అని చెప్పఁగా.

ఉ. వ్యగ్రత సేన లందు నిలు•వన్, భరతుండును దౌల నున్నధూ
మాగ్రమునందు దృష్టి నిడి • యాదటఁ బోవుచు రాము నంద యే
కాగ్రముఁ జేసి చిత్తమును • హర్షవికస్వరుఁ డయ్యె రాఘవ
ప్రాగ్రసరున్ వెసం గనుల•పండువుగాఁ గనుఁగొందు నం చెదన్. ౨౧౪౨

వ్యగ్రతన్ = జాగ్రత్తతో, దౌలన్=దవ్వులన్ = దూరమునందు, ధూమాగ్రమునందున్=పొగ కొనభాగమందు, ఆదటన్=ప్రేమతో, ఏకాగ్రము = నిశ్చలము, హర్షవికస్వరుఁడు = సంతోషముచే వికాసము నొందినవాఁడు, రాఘవ ప్రాగ్రసరున్=రఘువంశపు రాజులలో శ్రేష్ఠునిన్.

తా త్ప ర్య ము

రాజాజ్ఞప్రకారము సేనలన్నియు జాగ్రత్తగా నందేనిలువఁగా భరతుఁడు దూరమునందున్న పొగకొనయందుఁజూపుంచి యాజాడపట్టుకొని ప్రీతి శ్రీరాముని నందే మనస్సు నిశ్చలముగ నిల్పి శ్రీరామచంద్రుని గన్నులవండువుగఁ గనుఁగొందునను సంతోషముతో వికాసమునొందిన మనస్సు దేహము కలవాఁడై.

ఆదియందు నిర్వేదము గలవాఁడుకాని నివృత్తి మార్గనిష్ఠుఁడు కాఁజాలడు. నివృత్తి మార్గనిష్ఠుఁడుకాని భగవదన్వేషణపరుఁడుకాఁడు. కైకచేసిన చేష్టవలన భరతునకుఁ దొలుత నిర్వేదము జనించెను. ఈ నిర్వేదమువలన భగవద్దర్శనాభిలాషయుఁ దత్ప్రయత్నము జరగెను. ఈ నిర్వేదము గుహునివాక్యములవలన బలపడెను. అవల భగవత్సాక్షాత్కారముగల యాచార్యోపదేశము కావలయును. ఆచార్యుఁడు పాత్రమెఱుఁగక యుపదేశింపఁడు. కావున భరద్వాజుఁడు భరతుఁడు నిజముగ భరతుఁడా యని పరీక్షించి (భర + త = భరమునందు నిశ్చయబుద్ధి గలవాఁడు. సర్వభరము భగవంతునిదేకాని తనదికాదను నిశ్చయము కలవాఁడు. తశ్శబ్దః పుంసి సంభోగే నిశ్చయే యని నానా. ర. తాను దాసుఁడేకాని స్వతంత్రుఁడు కాఁడని తలఁచువాఁడు). వ్యతిరేకవిధమున సహాయపడిన కైకను

దూషింపవలదని యెవ్వని ప్రాప్తి భరతుఁడు కోరియున్నాఁడో యాభగవంతుఁ డుండు స్థానమును దెలిపి యామార్గమును జూపెను. గురువు మార్గముఁ దెలుపునే కాని యన్వేషణకార్యము శిష్యునిదే. శిష్యుఁడెట్లు భరతుఁడుగా నుండవలయునో గురువు అట్లు భరద్వాజుఁడై (భరించు వీర్యముగలవాఁడై) అనఁగా బ్రహ్మచారియై యింద్రియనిగ్రహము కలవాఁడై శిష్యుని శ్రేయస్సుగోరువాఁడై బ్రాహ్మణుఁడై యుండవలయును. ఈమార్గము నీచజాతివాఁడు చెప్పఁగలిగినను వానిసాహాయ్యము పొందవచ్చునుగాని యనుష్ఠానమునకుఁ దగిన యుపదేశము చేయువాఁడు సద్బ్రాహ్మణుఁడై యే యుండవలయును. ఆకారణముచే గుహుఁడు చెప్పినను భరతుఁడు దానితోఁ దుష్టిపడక భరద్వాజునిచేఁ దెలిసికొనవచ్చెను. ఆ భరద్వాజుఁడు చిత్రకూటమందు శ్రీరామచంద్రుఁ డున్నాఁడని దృఢముగాఁ జెప్పెను. ఈదార్ఢ్యము యోగదృష్టి బలసాధ్యము. చిత్రకూటమనఁగా నాశ్చర్యమైన గృహము. ఇదియే హృదయగుహ. ఇది మందాకినీ తీరమందున్నది. అకిని=దుఃఖముగలది. ఆ దుఃఖము మందమైనది మందాకిని. దుఃఖమును హరించునది. ఇదియే సుషుమ్న. అది నదివలె దీర్ఘమై యుండును. గావునను నది స్త్రీలింగము కావున మందాకిని యని స్త్రీలింగము చెప్పఁబడెను. సుషుమ్న నాడివెంటఁ బోయినవారికి దుఃఖములేదని భగవత్ప్రాప్తికిదియె మార్గమని యోగశాస్త్రము, భాగవతము, ఉపనిషత్తులు చెప్పుచున్నవి. ఇది రెండున్నర యామడదూరమున నున్నదఁట, మీఁదినుంచియెంచిన (1) అజ్ఞాచక్రము (2) విశుద్ధచక్రము (3) అనాహతచక్రము. రెండవదానికి మూఁడవదానికి నడుమ నున్నది హృదయస్థానము. కావున రెండున్నర యనిచెప్పుట సరియు, ఈ పద్యమునందు దర్శన సమాకారతుల్యధ్యానము చెప్పఁబడియె. భరద్వాజవాక్య మాప్తవాక్యము దానిని విశ్వసించి కృషిచేయఁగాఁ బ్రత్యక్షదర్శనమునకు ముందనుమానచిహ్నములు కానవచ్చును అదియెధూమము. ఇది యాధారముచేసికొని యన్వేషింపఁగా సాక్షాత్కారము కలుగును. అది ముందు తెలుపఁబడును.

ఇంతటితో భరతుని వృత్తాంతము ప్రకృతము చాలించి యీసమయమున శ్రీ సీతారామలక్ష్మణు లేమిచేయుచుండునది కవి తెలుపుచున్నాఁడు.

-• ౯౪-వ సర్గము. శ్రీరాముఁడు సీతకుఁ జిత్రకూటంబున వినోదములఁ జూపుట •-

ఉ. అక్కడ రామచంద్రుఁడు ధ•రాత్మజతోఁ జిరకాల మద్రిపై
మక్కువ నుండియుం గుధర•మంజు లతల్ గనఁ గ్రొత్తక్రొత్తలై
పెక్కువనొందుప్రీతి నిడ • వేకువఁ గార్యము లెల్లఁ దీర్చి తా
నొక్కడ సీతకుం దనకు • నుల్లము హర్షము నొంద శైలమున్. —౧౪౩

ధరాత్మజతోన్=సీతతో, చిరకాలము=దీర్ఘకాలము, అద్రిపై=కొండమీఁద, కుధర=(1) పర్వతముయొక్క, కు + ధరము = ప్రకృతి, "కు స్త్రీ భువి కుపా

పేత్ప్రేకుతానాయాం" నానార. ప్రకృతి "నిత్యాసతతవిక్రియా" కావున సర్వదా వికారమునే పొందుచుఁ గ్రొత్తక్రొత్తగాఁ గానవచ్చుచుండును. "లోకవత్తు లీలా కైవల్యమ్మ"న్నట్లు రాజునకు గృహకృత్య విచారముకంటె వినోద క్రీడ సంతోషకరమైనట్లు భగవంతునకు నిత్యవిభూతికంటె లీలావిభూతి యెక్కువ ప్రీతికరమని భావము. మంజులతల్ = (1) సొగసులు, (2) మనోహరమైన తీఁగలు, పెక్కువ = అతిశయము, ఇడన్ = కలిగింపఁగా, వేకువకార్యములు = ప్రాతఃకాలకృత్యములు, స్నానసంధ్యాదులు, సీతకున్ = భర్తతోడనుండి వనముఁ జూచి హర్షింపఁగోరు సీతకు, ఆమె సంతోషమే తనసంతోషముగా నెంచు తనకు.

తాత్పర్యము

చిత్రకూటమందుండు శ్రీరాముఁడు సీతతో నెలదినములుగఁ గొండమీఁద నుండినను బర్వతముసొగసు దానియందలి మనోహరమైన తీఁగలు దినము చూచుచున్నవైనను గ్రొత్తక్రొత్తగాఁ గనుపించుచు విశేషప్రీతిని గలిగింపఁగా నానాఁడుదయకృత్యములగు స్నానసంధ్యాదు లన్నియుఁ దీర్చికొని సీతతో నొకచోటఁ గూర్చుండి సీతకు నామెకారణముగాఁ దనకు మనస్సున సంతోషము కలుగుచుండఁగా నాపర్వతమును.

చం. హరిహయుఁ డాపులోమజకు•నట్టులు దేవనిభుండు చూపుచున్
ధరణిజ కిట్లు పల్కె వని•తా! కను మీగిరిసొంపుఁ జూచినన్
బరమగురాజ్యమున్ విడిచి•వచ్చుటయున్ సుహృదాళిఁ బాయుటన్
మెరమెరఁ గూర్పఁజాలదు సు•మీ యిసుమంతయుఁ బద్మపాణిరో. ౨౧౪౪

హరిహయుఁడు = ఇంద్రుఁడు, ఆకుపచ్చ గుఱ్ఱములుగలవాఁడు, పులోమజకున్ = శచీదేవికి, శచీదేవి పులోముని కూఁతురు, దేవనిభుండు = దేవశబ్దము భగవంతునియందు ముఖ్యము- ఇతర దేవతలయం దౌపచారికము. కావున, దేవనిభుండు = విష్ణువుతో సమానుఁడగువాఁడు, అవతారమూర్తియగుటచే సమానత్వము, పద్మపాణిరో = (1) పద్మమువంటి పాణిగలదానా, (2) పద్మమును పాణియందుఁగలదానా, లక్ష్మీదేవీ, పరమగు రాజ్యమున్ = (1) శ్రేష్ఠమగు భూపాలనము- (2) నిత్యవిభూతి వైకుంఠము, సుహృదాళిన్ = స్నేహితులను- (2) నిత్యసూరులను ముక్తులను, మెరమెర = దుఃఖము, ఇసుమంతయున్ = కొంచెమైనను.

తాత్పర్యము

ఇంద్రుఁడు శచీదేవికి నాకపృష్ఠము చూపునట్లు శ్రీరామచంద్రుఁ డాచిత్రకూట శైలమును జూపుచు శ్రేష్ఠమైన రాజ్యమును విడిచివచ్చుటగాని మిత్రుల బాయుటగాని నాకుఁ బద్మహస్తా! కొంచెమైనను దుఃఖము కలిగింపకున్నది.

ఉ. అంబుజనేత్ర! యల్లదిగొ•నంబరచుంబినితంబలోలరో
లంబకదంబ కీరమృగ•లాలితదేశము లొప్పఁ గంటివే,

యంబుగఁ గొన్ని పచ్చ నయి • యింద్రమణిస్ఫటిక ప్రవాళపీ
తాంబరకైతకద్యుతులు • నై మఱికొన్నియు రాజిలెం జెలీ. ౧౧౪౫

అంబుజనేత్ర=కమలములవంటి కన్నులుగలదానా, అంబర=ఆకాశమును, చుంబి = ముద్దుపెట్టుకొనుచున్న, అనఁగాఁ దాఁకుచున్న, నితంబ = చఱియలయందు, లోల=సంచరించుచున్న, రోలంబ = తుమ్మెదలయొక్క, కదంబ = సమూహములచేతను, కీర=చిలుకలచేతను, మృగ = జింకలచేతను, లాలిత = మనోహరమైన, దేశము=ప్రదేశము, స్థలము, ఇంబుగన్=మనోహరముగ,ఇంద్రమణి=నీలములయొక్కయు, స్ఫటిక=స్ఫటికములయొక్కయు, ప్రవాళ=పగడములయొక్కయు, పీతాంబర=పచ్చని వస్త్రములయొక్కయు, కైతక=మొగలిపువ్వులయొక్కయు, ద్యుతులును = కాంతులను, ఐ=కలిగి, రాజిలెన్=ప్రకాశించెను.

తా త్ప ర్య ము

దేవీ! యల్లదిగోఁజూడుము. ఆకాశమంటుచున్న చఱియలయందు సంచరించు తుమ్మెదల గుంపుచేతను, చిలుకలచేతను, జింకలచేతను నందమైన ప్రదేశము. అందు గొన్నిపచ్చగాను గొన్ని నీలములవలె స్ఫటికములవలెఁ బగడములవలెఁ బచ్చని వస్త్రములవలె మొగలిపూవులవలెఁ గాంతులుగలవై ప్రకాశించుచున్నవి.

కం. క్రూరతఁ బాసి సివంగులు, ఘోరపు బెబ్బులులు దిరుగఁ • గూటములందున్
జారురవాన్వితనానా, హారివిహగతతులతోడ • నద్రి రహించెన్. ౧౧౪౬

కూటములందుల్=శిఖరములందు. చారు=మనోహరమైన, రవ=ధ్వనితో, అన్విత=కూడుకొన్న, నానా=అనేకవిధములయిన, హారి=మనోజ్ఞమైన, విహగ=పక్షులయొక్క, తతులతోడన్=సమూహములతో, అద్రి = పర్వము, రహించెన్=ప్రకాశించెను.

తా త్ప ర్య ము

చిత్రకూటపర్వతము శిఖరములందు నహింసావ్రత నిష్ఠాపరులైన మునీశ్వరుల సాంగత్యముచేతఁ బశుహింసచేయు సివంగులు భయంకరములైన పెద్దపులులు తమ క్రౌర్యముమాని తిరుగుచుండఁగా శ్రవ్యమైన ధ్వనులతోడి నానావిధములైన మనోహరములైన పక్షుల సమూహములతోఁ బర్వతము ప్రకాశించుచున్నది.

కం. సాలతినిశప్రియాళాం,కోలామ్ర శ్రీతమాల • కుజతిందుకవృ
క్షాళీయుత మై సుమఫల,జాలచ్ఛాయలనునొప్పు • చందముఁ గంటే. ౧౧౪౭

సాల = మద్దిచెట్లయొక్కయు, తినిశ = తినాస వృక్షములయొక్కయు, ప్రియాళ=మోరట వృక్షములయొక్కయు, ప్రియాళుశబ్ద మకారాంతముగలదు. అంకోల=ఊడుగు చెట్లయొక్కయు, ఆమ్ర = తియ్యమామిడిచెట్లయొక్కయు, శ్రీ=మారేడుచెట్లయొక్కయు, తమాలకుజ=కానుగుచెట్లయొక్కయు, తిందుక

వృక్ష=తుమ్మికి చెట్లయొక్కయు, ఆళీ=సమూహముతో, యుతము = కూడినది, సుమ = పూలయొక్కయు, ఫల = పండ్లయొక్కయు, జాల = సమూహముల యొక్క, ఛాయలన్ = కాంతులచే, "ఛాయాకాంతిః సూర్యజాయా, ప్రతిబింబ మనాతపః" నానా. ర. చందము=విధము.

తాత్పర్యము

మద్ది, తినాస, మోరట, యోడుగ, తియ్యమామిడి, మారేడు, కానుగు, తుమ్మికిచెట్లు వరుసలతోఁగూడి పూలపండ్ల సమూహముల కాంతులచే నొప్పు విధము చూచితివా.

ఉ. కీరమనోజ్ఞవాణి! యదె కిన్నరదంపతు లేకచిత్తతన్
హారివిహారలీలల నగాగ్రమునన్ రమియించుచున్నవా
రారయ రోమహర్షణము నయ్యె; నిజాంబరఖడ్గపాళులన్
భూరుహశాఖలందు నిడి పొంపిరిపోవుముదంబు పెంపునన్. ౨౧౪౮

కీరమనోజ్ఞవాణీ=చిలుకపలుకలవలె నింపైన వాక్కుగలదానా, దంపతులు=భార్యాభర్తలు, ఏకచిత్తతన్=ఒకమనస్సుతో, అనఁగా సమానమనస్సులతో, హారి=మనోహరములైన, విహారలీలన్=సంచారకేళులచే, నగాగ్రమునన్=పర్వతము పైభాగమున, రమియించుచున్నవారు=క్రీడించుచున్నవారు, రోమహర్షణము = సంతోషముచేఁగలుగు గగ్గురుపాటు, నిజ=తమ, అంబర=వస్త్రములయు, ఖడ్గ=కత్తులయు, పాళులన్=సమూహములను, భూరుహశాఖలందున్ = చెట్లకొమ్మల యందు, ఇడి=ఉంచి, పొంపిరిపోవు=వృద్ధిపొందుచున్న, ముదంబు = సంతోషముయొక్క, పెంపునన్=ఆధిక్యముచే.

తాత్పర్యము

చిలుకపలుకులవలె నింపైన వాక్కుగలదానా! అదిగోఁ జూడుము, కిన్నరులు భార్యాభర్త లొక్కమనస్సుతో మనోహరములైన లీలావిహారములతోఁ బర్వతము పైభాగమందుఁ గ్రీడించుచున్నారు. వారిని జూడఁగా గగ్గురుపాటు కలుగుచున్నది. తమ వస్త్రములను గత్తులను జెట్లకొమ్మలయందుంచి సంతోషము వృద్ధి పొందుచుండఁగా.

శా. క్రీడాదేశములఁ జరించెదరు వారే చూడు విద్యాధరుల్
పీడాలంకృతమస్తకల్? సకియ యుద్భేదించి భూభాగమున్
గూడంబాఱు జలప్రపాతములఁ గఙ్గో దేవి మత్తోత్కట
వ్యాడవ్యూహకటప్రసవన్మదఝరీవ్యాపార మేపారెడిన్. ౨౧౪౯

క్రీడాదేశములన్=ఆటపట్టులందు, విద్యాధరుల్=విద్యాధరస్త్రీలు, విద్యాధరి యేకవచనము, పీడాలంకృతమస్తకల్ = సిగదండలచే నలంకరింపఁబడిన శిరములు గలవారు- ఆపీడమనినను పీడయనినను దలకుజుట్టుకొను పూలదండకుఁబేరు. "ఆపీడశేఖరోత్తంసావతంసా శిరస్స్రజ'' యని హలాయుధుఁడు.

పీడావ్యథా కరుణయో శ్శిరోమాల్యాపగర్వయోః నానా. ర. ఉద్భేదించుకొని= పెకలించుకొని, జలప్రపాతములు=నీళ్లుపడుటలు, మత్త=మదించిన, ఉత్కట= అధికమైన, వ్యాడ=మదించిన యేనుఁగుల రూ. వ్యాళము, వ్యూహ=గుంపుల యొక్క, కట=చెక్కిళ్ళనుండి, స్రవత్=కాఱుచున్న, మద=మదపునీళ్ళయొక్క, ఝరీ=ప్రవాహముయొక్క, వ్యాపారము=కార్యము, ఏపారెడిన్ = అతిశయించె డిని, మొదటిపాదంబునఁ గాకు స్వరయతి.

తా త్ప ర్య ము.

ఆటల ప్రదేశములందు సిగదండలచే నలంకరింపఁబడిన తలలుగల విద్యాధర స్త్రీలు సంచరించుచున్నారు. అదిగోఁ జూడుము. సఖీ! భూమిని భేదించుకొని కలయఁ బ్రవహించుచున్న సెలయేళ్ళను దేవీ! చూడుము. అవి మదాతిశయముగల యేనుఁగులు చెక్కిళ్ళనుండి కాఱు మదముయొక్క ప్రవా హమును బోలి యున్నవి.

కం. కనఁ గనఁ గనులకుఁ విందుం, బొనరించెడిపెక్కుదెగల•పూవులవలపుల్
గొని గుహ వెడలెడి తెమ్మెర, జనకసుతా! యెవనిమదికి•సమ్మద మిడదో.

వలపుల్=వాసనలు, తెమ్మెర=తెమ్మ + ఎర=చల్లగాలి. తేమ రూ. తెమ్మ.

తా త్ప ర్య ము

చూడఁగాఁ జూడఁగాఁ గన్నులకుఁ బండువగు ననేకవిధముల పూవులవాస నలుగొని తెమ్మెర గుహ విడుచుచున్నది. ఇది యెవరికి సంతోషము గలిగింపదు?

ఉ. నీవును లక్ష్మణుండుఁ దరు•ణీమణి! కొల్వఁగ నెన్ని యేండ్లు నే
నీవనసీమ నున్న మది • కించుకయున్ వ్యథ లేదు, చారునా
నావిధపుష్పపక్వఫల • నవ్యశుకాదిశకుంతసంఘసం
భావితచిత్రకూటమును•బాయక నేఁ జరియింతుఁ బ్రీతితోన్. ౨౧౫౧

తరుణీమణీ=స్త్రీరత్నమా, వ్యథ=బాధ, చారు=మనోహరమైన, నానావిధ= అనేకవిధములైన, పుష్ప=పూలచేతను, పక్వ = పండిన, ఫల = పండ్లు, నవ్య శుకాది=మనోహరమైన చిలుకలు మొదలయిన, శకుంత=పక్షులయొక్క, సంఘ= సమూహముచే, సంభావిత=కూడుకొనిన, పాయక=వదలక.

తా త్ప ర్య ము

స్త్రీరత్నమా! నీవు లక్ష్మణుఁడు సేవింప నెన్నిసంవత్సరము లీ యడవి దున్నను నామనస్సులోనఁ గొంచెమైన బాధలేదు. మనోహరమై నానా విధమైన పూలచేతను బండిన పండ్లచేతను వింతయగు చిలుకలు మొదలగు పక్షులసంఘ ముచే గౌరవింపఁబడిన చిత్రకూటమును వదలక సంతోషముతో సంచరింతును.

కం. జనకునిఋణంబుఁ దీర్చుట,
యనుజునకుం బ్రియముఁ గూర్చు•టనుఫలయుగ్మం
బొనరెను జుమ్మీ యీనా,వనవాసముచేత ఫుల్ల • వనజదళాక్షీ! ౨౧౫౨

ఫుల్లవనజదళాక్షీ=వికసించిన కమలముయొక్క రేకులవంటికన్నులు గలదానా.

తాత్పర్యము.

వికసించిన కమలముయొక్క రేకులవంటి కన్నులుగలదానా! నా యీ వనవాసమునకు రెండు ఫలములు. ఒకటి తండ్రియప్పును దీర్చుట, రెండవది తమ్మునికి మేలు కలిగించుట.

తే. కలికి! యీచిత్రకూటన•గంబునందుఁ, జారుమానసవాక్కాయ•సంయతవయి
వివిధభావంబు లెల్లను•వేడ్క నరసి,కొనుచుఁ గ్రీడింతువే నన్ను•గూడి ప్రీతి.

కలికీ=అందకత్తెవగుసీతా, ఈ చిత్రకూట నగంబునందున్=భోగస్థానము నకు వలయు సౌభాగ్యమును విశేషముగఁగల యీపర్వతమున.మానసవాక్కాయ సంయతవై =స్వాధీనపఱుచుకొనఁబడిన త్రికరణములు గలదానవై, వివిధ = మలయానిలము, కోకిలాలాపము పుష్పహారము మొదలగు పలువిధములుగల, భావంబులు=ఉద్దీపన భావములను, ఇవి కామమును వృద్ధిపఱుచునవి, నన్నున్= సౌఖ్యానుభవ ప్రవాహమునందు నిన్నే ప్రధానురాలిఁగాఁ జేసెడినన్ను- "భావః పదార్థేసత్తాయాం క్రియాచేష్టాత్మయోనిషు, విద్వల్లీలాస్వభావేషు భూత్యభి ప్రాయ జంతుషు" నానా. ర. వివిధభావంబులు=వివిధ జంతువులనియుఁ జెప్ప నగు- 'యతౌతు బద్ధనియతౌ' నానా. యతమనఁగాఁ గట్టఁబడినదానికి నియ మింపఁ బడినదానికిఁ బేరు. మనోవాక్కాయసంయతువు = ఎవతెచేత మనో వాక్కాయములు సంయతములయ్యెనో యామె మనోవాక్కాయ సంయత, అరసికొనుచున్=చూచుచు.

తాత్పర్యము

సుందరీ! యీచిత్రకూట పర్వతంబునందు స్వాధీనపడిన మనోవాక్కాయ ములచే నానాజంతువులుచేయు విలాసచేష్టలను సంతోషముతోఁ జూచుచు నన్నుఁగూడి యుద్దీపనవిభావముతోఁ గ్రీడించెదవా!

కం. ఈవనవాసవ్రతమును, దేవీ! మాపెద్దలెల్లఁ • దెలిపిరి యపవ
ర్గావహ మని సంసృతిపా,శావచ్ఛేదక మటంచు•నాదరయుక్తిన్. ౧౧౪

అపవర్గావహము=మోక్షముగలిగించునది, సంసృతి=సంసారమనెడి,పాశ= త్రాటియొక్క, అవచ్ఛేదకము=త్రెంపుటగలది, ఆదరయుక్తిన్=ఆదరముతో.

తాత్పర్యము

ఈ వనవాసవ్రతమువలనఁ గలుగునది యైహికసుఖము మాత్రమేకాదు, సంసారమనెడి త్రాటిని ద్రెంచి మోక్షమునుగూడ నిది కలిగించునని మాపెద్ద లందఱును దెలిపిరి.

వనవాసము. ఈ ప్రపంచమున జీవులు పుట్టుట సంసారసుఖ మనుభవించు టకేకాదు. సంసారమును ధ్వంసముచేసి మోక్షముగాంచుటకును, అనఁగాఁ బైవద్యమునఁజెప్పినట్టు లింద్రియ నిగ్రహము కలిగి యైహికసుఖ మనుభవించు

గృహస్థుఁడు స్వాశ్రమ స్వధర్మ నిర్వహణముచేతనే మోక్షమును సంపాదింపఁ గలఁడు. అనఁగా నింద్రియ నిగ్రహముగల గృహస్థుఁడు మోక్షార్థమై వేఱొక యాశ్రమమును స్వీకరింపఁబనిలేదు.

ఆశ్రమములందన్నిట శ్రేష్ఠమైనది గృహస్థాశ్రమమే. అది శిక్షాశాల. లోకసేవ చేయుటకు, దయాదిగుణములను వృద్ధిచేయుటకుఁ, గామక్రోధ లోభ ముల జయించుటకు, నింద్రియ నిగ్రహము సాధించుటకుఁ బూర్ణముగా నేర్చు కొను తావు. దీనికి భయపడువాఁడు సన్న్యాసి యగును. నీళ్ళలోదూఁకి నీఁద నేర్చుకొని నీళ్ళకు భయపడనివాఁడు గృహస్థుఁడు. నీళ్ళనిన భయపడుచు స్నానము చేయుటకును జంకెడువాఁడు సన్న్యాసి. జితేంద్రియుఁడయిన గృహ స్థుఁడు నూర్వురు యువతుల నడుమ నున్నను జలింపఁడు. సన్న్యాసి స్త్రీ ముఖము చూచుటకే భయపడును. ఎక్కడ దనమనస్సు చలించునో యని భయము. వీఁడు తన మనోదుర్బలత్వమును దూషింపక స్త్రీలను దూషించును. గృహస్థుఁడు ధీరుఁడు, రణవీరుఁడు. వీఁడు భోగియై త్యాగియై యోగియగును. సన్న్యాసి భీరువు. ఎందో ప్రమాదపడి రాగియై చిలుముపట్టి చెడిపోవును. "జ్ఞాన మార్గపరిభ్రష్ట శ్చండాలీం యోనిజాయతే'' జ్ఞానమార్గమున భ్రష్టుఁడు చండా లుఁడుగాఁ బుట్టును భక్తున కాభయములేదు.

"ఐకాశ్రమ్యమితి సర్వేషువేదేషు ధర్మశాస్త్రేతిహాస పురాణేషు గృహస్థా ఏవాగ్నిహోత్రిణః। ప్రాధాన్యేన విధీయంతే, స్తూయతేచ, తతో గార్హస్థ్యస్య ప్రత్యక్షవిధానాత్ సఏవైక ఆశ్రమః। ఇతరేతు తత్రాశక్తానాం విధీయంతే ఇతి బహవ ఆచార్యా మన్యంతే'' వైద్యనాథీయము. కావున గృహస్థాశ్రమము నిర్వ హింపలేనివారు సన్న్యాసులగుదురు.

తే. పందలకొలంది చాఁపఱాలందు నిందు, నెందు నల్లగఁ దెల్లగ నెఱ్ఱనగను
బెక్కురంగుల నొప్పారు విధముఁ గంటె, సారసారససంకాశ చారువదన!

చాఁపఱాలు=చాఁపవలె విశాలములై చదరముగానుండు ఱాలు, సార = రసవంతమైన, సారస=కమలముతో, సంకాశ=సమానమైన, చారు = మనోహర మైన, వదన=ముఖముగలదానా.

తాత్పర్యము

పద్మముఖీ! ఈ పర్వతమునం దెందుఁజూచినను నల్లగ నెఱ్ఱగఁ దెల్లగ నానా వర్ణములతో నూర్లకొలఁది చాపఱాలున్నవి చూచితివా ?

తే. రేల సిరాలఁ దమడాలు లీలఁ గ్రాల,
వేలకొలఁది మహౌషధుల్ వెలయుచుండు
స్వప్రభాలక్ష్మి దెసలందు వఱలు చుండఁ, గొండ నెల్లెడ శిఖిశిఖా కోటులనఁగ,

రేలన్=రాత్రులందు, ఈరాలన్=పొదలయందు, ఈరములు=ఈరాలు, "ఈరాలఁ బోరాదు హేరాళము జవాది యీరాల నడుచక్కి నేగవలయు''వసు.

తమడాలు=తమకాంతి, లీలన్=విలాసముగా గ్రాలన్=ప్రకాశింపఁగా, మహౌషధుల్=గొప్ప మందుతీఁగలు, స్వప్రభాలక్ష్మి=తమ కాంతిసంపద, దెసలందు=దిక్కులయందు, వఱలుచుండన్=ప్రకాశించుచుండ, శిఖిశిఖాకోటులు=అనేకములైన యగ్నిజ్వాలలు, జ్యోతిష్మతీలతలు కొన్ని రాత్రులందు నగ్నిజ్వాలలవలెఁ బ్రకాశించును.

తా త్ప ర్య ము.

రాత్రులం దీపొదలందు నగ్నిజ్వాలలవలెఁ దమకాంతి నాలుగుదిక్కులందుఁ బ్రకాశింపఁగా వేలకొలఁది యోషధు లీపర్వతమునందుఁ బ్రకాశించుచున్నవి.

కం. కొన్నిగృహంబులడంబునఁ, గొన్నియు నెలతోఁట లట్లు♦కొండొకచోటన్
జెన్నారు నేకశిల యై, కన్నులపండువుగఁ జూడు♦క్ష్మాధరతలముల్. ౨౧౪

గృహంబులడంబునన్=ఇండ్లవలె, ఎలతోఁటలు = లేఁదోఁటలు, ఉద్యానవనములు, 'ఎల' యనునదియే వర్ణవ్యత్యయమై సంధిగలిసి 'లే' యయ్యెను. ఎల=లఎ=లే- ఎలనీరు- ఎలప్రాయము. మొ. ఏకశిల = ఒక్కరకము రాయి, ఒక బండ, క్ష్మాధరతలముల్=కొండప్రదేశములు.

తా త్ప ర్య ము

ఈ పర్వతప్రదేశమున గుహలు కొన్ని యిండ్లవలెనున్నవి. కొన్నిచోటుల నుద్యానవనములవలె నున్నవి. కొన్నిచోటుల విశాలముగ నొకబండగానే యున్నవి. ఇవన్నియు నెంతవినోదముగ నున్నవో చూడుము.

తే. భూమిఁ బెకలించుకొనివచ్చు♦పోల్కిఁ జిత్ర,
కూట మొప్పారెఁబున్నాగ♦కుష్టభూర్జ
పత్రములుమీఁదఁ బరచుదు♦ప్పటులుగాఁగఁ,
గాముకులతమ్మిపాన్పులు♦గ్రాలెనవిగొ. ౨౧౫

పున్నాగ=పున్నాగ వృక్షములు, కుష్ట=చెంగల్వకోష్టు, భూర్జపత్రములు=భుజపత్రి, ఇప్పుడు కాగితములవలెఁ దాటియాకులవలెఁ బూర్వ మీయాకులు వ్రాఁతకై యుపయోగించుచుండువారు. ఆకారణముచేతనే కాగితములకుఁ బత్రములను పేరు పోలేదు. ఆకులు తిరుగవేసినాఁడనియు వాడుకయందుఁ గలదు. తమ్మిపాన్పులు=తామరపూల పఱుపులు.

తా త్ప ర్య ము

చిత్రకూటము భూమిని బెకలించుకొని వచ్చినట్లున్నది. చూడుమా? పున్నాగములు, చెంగల్వకోష్ఠులు, భుజపత్రములు వీనియాకులు దుప్పటులువలెనై కాముకులు పండుకొను తామరపూల పఱుపులు ప్రకాశించుచున్నవి చూడుమా.

తే. కాముకుల మేనిరాపులఁ♦గందినలఁగి,
యున్న తామరదండల♦యొప్పు గనుమి
వారు బహువిధఫలముల♦నారగించి,వి త్తనంబుల మొట్టల♦విడిచినారు.

తా త్ప ర్య ము   [౨౧౬

కాముకీ కాముకులు సంభోగించు సమయంబున వారి దేహములు రాపు

కొనుటచే వాడి నలఁగియున్న తామరపూలదండల విధముఁజూడుము! వారనేక విధములైన పండ్లనుదిని విత్తనములను మొట్టెలను వదలిపెట్టినారు.

తే. వివిధమూలఫలోదక•విశ్రుతంబు, చిత్రకూటంబు చెలువారు•చెన్ను గనితె
నళిని వస్వౌకసారయం•దమునురమణి!,
యుత్తరకురూర్వులను మించి•యున్నదౌర. ౨౧౬౦

వివిధ=అనేకవిధములయిన, మూల = వేళ్ళచేతను, ఫల=పండ్లచేతను, ఉదక=జలముచేతను, విశ్రుతంబు=ప్రసిద్ధికెక్కినది, నళిని=(1)మానససరస్సు, (2) సౌగంధికాఖ్య సరస్సు, వస్వౌకసార=అలకాచ మహేంద్రస్య నగరీ వస్వౌక సారాస్యాత్. నానా. ర. వస్వౌకసారా శక్రస్య, పూర్వస్యాం దిశి సంస్థితా యని విష్ణు పురాణము. "పురీవస్వౌకసారాస్యా ద్విమానం పుష్పకోస్త్రియామ్" యాదవ నిఘంటు. ఉత్తర కురూర్వులను=ఉత్తర కురుభూములను,ఇవి హిమాలయమున కుత్తరమున నుండునవి. ఇవి పూర్వము చాలరమ్యముగా నుండినట్లు గ్రంథ ముల వలనఁ దెలియవచ్చెడిని. తాత్పర్యము

అనేకవిధములయిన వ్రేళ్ళకు. పండ్లకు, జలమునకుఁ బ్రసిద్ధమైన యీ చిత్రకూటము నందమును జూడుము. ఇది మానస సరస్సును, సౌగంధికమును, ఇంద్రకుబేరుల పట్టనములను, ఉత్తర కురుభూములను మించియున్నది.

కం. వనవాసకాల మెల్లను, వనితా! లక్ష్మణుఁడు నీవు • వరమతిఁ గొలువన్
గొనబుగ నిచ్చటఁ బుచ్చుచుఁ, జనువాఁడను బిదప రాజ్య•సంపదఁ బూనన్.

వనవాసకాలము = (1) వనవాసము చేయవలయునని మనము నిశ్చ యించుకొనిన కాలము పదునాలుగు సంవత్సరములు. (2) వనమువంటి యీ ప్రపంచమందు మనము నిలువఁదలఁచిన కాలము, వరమితిన్ = మంచి మన స్సుతో, గొనబుగన్=అందముగ,పిదపఁజనువాఁడను=వచ్చినకార్యము ముగిసిన తరువాత- (1) అయోధ్యకు (2) పరమపదమునకు.

తాత్పర్యము

ఇంతి! నీవు లక్ష్మణుఁడు నిండుమనస్సుతో సేవింపఁగా వనవాసకాల మంతయు నిందే కడపి వచ్చినకార్యము ముగిసినపిమ్మట మరలఁ బురమునకు రాజ్యభారము వహింపఁ బోయెదను.

—• ౯౫-వ సర్గము. శ్రీరాముఁడు సీతకు మందాకినీనది వర్ణించి చెప్పుట.•—

కం. అని గిరిని దాఁటి మందా,కినిఁ జూపి విచిత్రపులిన•కీర్తితఁ జారు
స్వనసారసహంసాన్వితఁ, గనకనలినలసితనదిని•గాంచితె ముదితా! ౨౧౬౨

ఇంతవఱకుఁ బర్వతమును జూపి వర్ణించి యిఁక నదిని జూపి వర్ణించు చున్నాఁడు.

విచిత్రపిలినకీర్తిత=ఆశ్చర్యకరమైన యిసుకదిబ్బలచేఁ గీర్తింపఁబడినది, చారుస్వన=ఇంపైన ధ్వనిగల, సారస=బెగ్గురులతోను, హంస = హంసలతోను,

అన్విత=కూడినది, కనక నలినలసిత=బంగారు కమలములచేఁ బ్రకాశించునది, ముదితాయని సంబోధించుటచే సీతయు నదినిజూచి సంతోషించెనని యూహించునది.

ఇందలి వర్ణనముచే గొప్పపిఱుదులును (పులినము) శబ్దించు నూపురాది భూషణములును, అందములగు కర పాద నయన ముఖాది యవయవములు గల నీవలె నున్నదని యలంకారధ్వని.

తాత్పర్యము

అని పర్వతమునుదాఁటి మందాకినీనదిని జూపి యాశ్చర్యకరములైన యిసుక దిబ్బలచేతఁ గీర్తింపఁబడినదియు మనోహరమైన ధ్వనిగల బెగ్గురు హంస పక్షులతోను గూడినదియు బంగారు కమలములచేఁ బ్రకాశించునదియు నగు నదిని జూచితివా?

కం. చారుతరపుష్ప ఫలసం,భారంబులచేత వెలుఁగు♦పలుతెగ లగునా
తీరభవభూజములను గు,బేరసరసియట్లు వెలసెఁ♦బ్రేయసి నదియున్.

చారుతర=మిగుల మనోహరములయిన, పుష్పఫలసంభారములచేతన్=పూల పండ్ల యతిశయముచే, తీరభవ=తీరములందుఁబుట్టిన, భూజములన్ = చెట్లచే, కుబేరసరసి=సౌగంధికము, ప్రేయసి=ప్రియురాలా.

తాత్పర్యము

ప్రియురాలా! యందములయిన పూలపండ్ల యతిశయముచేతఁ బ్రకాశించు ననేకవిధములై యొడ్డులందుఁబుట్టిన చెట్లచేఁ గుబేరుని కొలనివలె నదియుఁ బ్రకాశించుచున్నది.

కం. జంతువులు నీరు ద్రావెను, గాంతా! యచ్చోటఁ గంటె♦గలుషిత మయ్యున్
గాంతంబై జల మమరెను, వింతబెడం గగుచు మదికి♦వేడ్క ఘటిల్లెన్.

తాత్పర్యము

అచ్చట జంతువులు నీళ్ళుద్రావెను. ఆచోట నీళ్లు కలసిపోయి యెఱ్ఱగా నున్నను జూచుటకు మనోహరమై క్రొత్తసొగసు కలదై మదికి సంతోషము గలిగించుచున్నది. అందగత్తెలు సొగసులు చేసికొనకయున్నను నదియొక సొగసు గానే కానవచ్చును. అభిజ్ఞానశాకుంతలము.

ఉ. కాలము దప్పకుండ ఋషి♦కాండము లందు జటాజినంబులం
దాలిచి దోఁగుచుండెడిని ♦ దారుణనిష్ఠులు కొంద ఱిల్లదే
బాలిక! యూర్ధ్వబాహువులు ♦ భాస్కరుఁ గొల్చెద; రందుఁ గంటె వా
తూలచలద్ద్రుమాగ్రములఁ ♦ దూల సుమాళి నటించెఁ గొండయున్. ౨౧౬౫

కాలము తప్పకుండఁగన్=ఏవేళకు స్నానము చేయవలయునో యావేళకు సరిగ, ఋషికాండములు=ఋషుల సమూహములు, "బాణావసర గ్రంథిస్తంభర హోవాజవారి వర్గేషు, స్కంధే భూరుహాణాం గర్వే నాళే బలేచకాండోఽస్త్రీ" జటాజినంబులన్=జడలను జింకచర్మములను, దోఁగుచుండెడిని = స్నానముచేయు

చుండును, దారుణనిష్ఠులు=తీవ్రమైన నిష్ఠగలవారు, ఊర్ధ్వబాహులు = చేతులు మీఁదికెత్తినవారు, వాతూల=గాలిచే, చలత్=కదలుచున్న, ద్రుమాగ్రములన్= చెట్లకొనలయందు, సుమాళి=పూలగుంపు, తూలన్=రాలఁగా, నటించెన్=నాట్య మాడెను.

తాత్పర్యము

వేళవేళకు సరిగా ఋషులు జడలు జింకచర్మములు ధరించినవారై స్నానము చేయుచుందురు. తీవ్రనిష్ఠగలవా రదిగోఁ జేతులు మీఁదికెత్తి సూర్యునకు నమస్కరించుచున్నారు. ఈ వర్ణనముచే మాధ్యాహ్నిక సంధ్యావందన సమయమయ్యెనని తోఁచెడి, అదిగోఁ జేతులెత్తి సుమాంజలిచల్లి నృత్యము చేయు నటునివలెఁ గొండయుఁ జలించు చెట్లకొమ్మలనుండి పూలురాలఁగా నటించునట్లున్నది.

సీ. ఒకచోట జలవాటి♦యుత్తమముక్తాఫ,లాభికాంతి నెసంగె♦హారిగాత్రి
 యొకత్రేవ హితభావ♦ప్రకటమనోజ్ఞసై,కతరాజి రాజిల్లెఁ♦దతనితంబ
 యొకవంక మధుపాంక♦మకరాంకశరవార,ముయ్యాల లూఁగెడి♦నుత్పలాక్షి
 యొకప్రక్కఁ దమి నిక్క♦నువిద సిద్ధజనాళి, వయ్యాళి తిరిగెడి♦వనజపాణి
తే. గాలికిని బూలు తటముల ♦ రాలఁ గొన్ని
 జలములను దేలెడిని గొన్ని ♦ జలదవేణి!
 వల్గువచనంబులను జక్ర ♦ వాకతతులు
 చక్రకుచ! కుసుమంబుల ♦ శయ్యలెక్కె. ౨౧౯౯

హారిగాత్రి=మనోహరమైన శరీరముగలదానా, జలవాటి=జలప్రదేశము, ఉత్తమముక్తాఫలాభికాంతిన్=మంచిజాతి ముత్తెములకాంతితో, ఎసంగెన్=అతిశయించెను, నీదేహమందలి లావణ్యమువలె నీనదియందు మంచిముత్యముల కాంతి యతిశయించినది, మంచి ముత్యముల కాంతివంటి కాంతి దేహమునం దుండెనేని దానికి లావణ్యమనిపేరు. తతనితంబ = విస్తరించిన పిఱుఁదులుగల దానా, ఒకత్రేవన్=ఒకప్రక్క, హితభావ = మనస్సునకు సరిపోవు విలాసముచే, ప్రకట=స్పష్టముగాఁ దెలియవచ్చు, మనోజ్ఞ=సుందరమైన, సైకతరాజి=ఇసుక దిన్నెల సమూహము, నీయందలి నితంబులవలెనే యేటియందు నిసుకదిన్నె లున్నవి. ఉత్పలాక్షి=కలువలవంటి కన్నులుగలదానా, ఒకవంకన్= ఒకపార్శ్వమున, మధుప + అంక=తుమ్మెదలు చిహ్నముగాఁగల, మకరాంక = మన్మథుని యొక్క, శరవారము=బాణముల సమూహము- “అరవిందమశోకంచ చూతంచ నవమల్లికా, నీలోత్పలంచ, పంచైతే పంచబాణస్యసాయకా” యన్నట్లు, నల్ల కలువలు మన్మథుని బాణములే, కలువలవంటి కన్నులు వానియందుఁ దుమ్మెదలవంటి చూపులు నీయందెట్లున్నవో యట్లే నదియందు నొకచోటఁ దుమ్మెదలు చిహ్నములుగాఁగల నల్లకలువల గుంపులుయ్యాలలూఁగుచున్నవి.

వనజపాణి=చేతియందుఁ గమలము గలదానా, తమినికన్=స్నానమందలి కోరిక యతిశయింపఁగా, సిద్ధజనాళి = సిద్ధులగుంపు, వయ్యాళి = వాహ్యాళిశబ్ద భవము, ఒయ్యారముగాఁ దిరుగుట, వనజము=నీటియందుఁబుట్టినది కమలము దానిని జేతియందుఁగలది, వనజపాణివినీవు, వీరునీటియందు స్నానముచేయు నభిలాషగలవారు, ఈసిద్ధులు నీచేతిలోనివారని భావము. జలదవేణీ=మేఘము వంటి నల్లని జడగలదానా, తటములన్=గట్లయందు, మేఘము వర్షించునపుడు కొన్నిబిందువులు నేలమీఁదఁ గొన్ని నీళ్ళమీఁద రాలినట్లు గాలికిఁ గొన్నిపూలు గట్టులందును రాలఁ గొన్ని నీళ్ళయందును దేలుచున్నవి; నీవు నల్లనిజడయందుఁ బూలు ధరించినపుడు జడమీఁదగొన్ని, ప్రక్కలందుఁగొన్ని యున్నట్లు చెట్లనుండి రాలినపూలు గొన్ని గట్టులయందుండఁగాఁ గొన్ని నీళ్ళయందుఁ దేలాడుచున్నవి. చక్రకుచ=జక్కవలవంటి స్తనములుగలదానా, వల్గువచనంబులను=మనోహరములైన మాటలచే, చక్రవాకతతులు=చక్రవాకపక్షుల సమూహములు, కుసుమంబులశయ్యలు = పూలపానుపులు, వల్గువచనంబులు=రతికై యాహ్వానించు నింపైనపిలుపులుగను పూలపానుపులెక్కుట రతికాంక్షగను భావించునది.

తాత్పర్యము.

ఓహరిగాత్రీ! యీమందాకినీనది యొకచోట జలములు మంచి ముత్తెముల కాంతివంటి కాంతిగలదై యున్నది ఓతతనితంబా! యొకచోట నింపైన విలాసముగల యందమైన యిసుకదిబ్బలుగలదై యున్నది. మఱియొకచోట నీ నదియందుఁ దుమ్మెదలతోడఁ బూవు లుయ్యాలలూగుచున్నవి. ఒకప్రక్క సిద్ధులు వాహ్యాళి దిరుగుచున్నారు. గాలికి రాలినపూలు గొన్ని గట్టులమీఁదఁ బడియుండఁ గొన్ని నీళ్ళలోఁ దేలుచున్నవి. మనోహరధ్వనులు చేయుచుఁ జక్రవాకములు పూలపానుపు లెక్కుచున్నవి.

కం. లలనా! యీమందాకిని, నలువారెడిచిత్రకూట•నగముం గనినన్
జెలి! నిన్నుఁ జూచుకంటెను నలపురమును గనుటకంటె•హర్షం బిడెడిన్.

తాత్పర్యము ౨౧౬౩

సీతా! యీనదిని నీపర్వతమును చూచినపుడు నిన్నుఁ జూచుటకంటె నయోధ్యను జూచుటకంటె సంతోషమగుచున్నది.

నాయందీయన యింతకామముగలవాఁడై యున్నాఁడే నేను రావణవధార్థమై లంకబోనుండుకాలములో నీయనయెట్లు నావియోగమును సహింపఁగలఁడు. అచ్చటికి వచ్చి రావణుఁ జంపఁగలఁడని సందేహింపకుము. అయోధ్యను విడిచియు నీపర్వతమును జూచి యెట్లు దుఃఖపడకున్నానో యట్టులే నిన్ను స్మరిం

చుటవలనఁ గలిగెడి సంతోషముతో గడుపు దీఱువరకు మనకార్యము దీఱువరకు నిబ్బరించుకొనెదను. కావున నీవు విచారపడవలదని ధ్వని.

తే. దమశమాన్వితు లగుచుమ ♦ దపముఁ జల్పి,
ధూతకలుషులుసిద్ధులు ♦ దోఁగుకతన
నిర్మలం బగుమందాకి♦నీజలముల,
జలకమాడుము నన్నుఁగూడి♦తలిరుఁబోఁడి. ౨౧౬౪

తలిరుఁబోఁడి=చిగురువంటి పోణిమిగలదానా, దమము=బహిరింద్రియ నిగ్రహము, శమము=అంతరింద్రియ నిగ్రహము, అన్వితులు+అగుచున్=కలవారై, ధూతకలుషులు=ఎగురఁగొట్టఁబడిన పాపములుగలవారు, అగుసిద్ధులు=భగవంతుఁడె యుపాయోపేయములనియుండు సిద్ధసాధననిష్ఠులు, దోఁగుకతనన్=స్నానము చేసినకారణమున, నిర్మలంబు=మలినరహితము, జలకమాడుము=స్నానముచేయుము, పరమభక్తులు ప్రపన్నులు స్నానము చేసినకారణమున వారి తేజస్సు నీళ్ళలోఁ బ్రవేశించి నీళ్ళను బవిత్రములను జేసి తీర్థములఁ జేయుచున్నవి. తీర్థములను దీర్థములుగాఁ జేయువారుకదా భక్తులు,ప్రపన్నులు, "తీర్థీకుర్వంతి తీర్థాని" నా-భ-సూ. తాత్పర్యము

బాహ్యేంద్రియ నిగ్రహము అంతరింద్రియ నిగ్రహము గలవారై తపముచేయు (భగవంతునియందు మనస్సైక్యము చేయుటచేఁ బాపరహితులైన భక్తియోగ ప్రపత్తియోగ సిద్ధులు స్నానముచేసిన) కారణముచే నిర్మలమైన మందాకినీ జలమునందు నాతోడ జలక్రీడసలుపుము.

కం. చెలితో నాడెడువడువున, జలకేళులు నన్నుఁ గూడి♦సలుపుము నీటన్
వెలిదమ్ములుఁ గెందమ్ములుఁ,గలికి!మునుఁగు నీదుసొబగుఁ♦గని పెనులజ్జన్.

వెలిదమ్ములు=తెల్లదామరలు, కెందమ్ములు=ఎఱ్ఱతామరలు, ధవళాక్షివగు నీ కన్నులను కమలపాణివగు నీయఱచేతులను జూచి యందమున మనము వీనికి సరిరామైతిమికదా యను సిగ్గున నీళ్ళలో మునుఁగఁగా నీవు నీ చెలికత్తెతో నాడెడి రీతిఁ జనవుగా నాతో జలక్రీడసలుపుము అలంకారము. ఉత్ప్రేక్ష, చెలితో నాడెడువడువునన్=స్త్రీలతో స్త్రీలాడుకొనునపుడు కామోద్రేకము గలుగదు, మనము బ్రహ్మచర్యవ్రతము పూనియున్నారము. కావున నన్ను నీవు భర్తగానెంచి కామమునకు లోపడకుము నన్ను నీ చెలికత్తెవలె నెంచుమని భావము.

తాత్పర్యము

తెల్లకమలములు, ఎఱ్ఱకమలములు నీ కన్నులను కరచరణములను జూచి సిగ్గుబడి తలలు వంచుకొనుటయెకాక స్తనజఘనముల ఘాతములవలనఁ గలిగిన యలల తాఁకున నీటిలో మునిఁగిపోవ నీవు నీచెలికత్తెతో నాడునట్లు జంకులేని మనస్సుతో నాతో జలక్రీడ సలుపుము.

తే. వనమునంగల మృగము లేఁ పౌరజనుల,
వర్గముగను, నయోధ్యగాఁ బర్వతంబు
జలజలోచన! యీనది సరయువుగను,
దలఁచి వర్తింపుమీ యిందు నెలమిదనర. ౧౧౬౦

పౌరజనుల=అయోధ్యాపురవాసులైన మనుష్యుల, వర్గము=సమూహము, ఎలమి=సంతోషము.

తాత్పర్యము

ఈ యడవిమృగములే యయోధ్యాపుర జనులనుకొమ్ము. పర్వతమే యయోధ్యయనుకొమ్ము, ఈమందాకినియే సరయు వనుకొనుము. ఈప్రకారము దలఁచి విచారములేక సంతోషముగ వర్తింపుము.

అయోధ్యాపురవాసులే యడవిమృగము లనుకొమ్ము. అయోధ్యయె పర్వతమనుకొమ్ము. సరయు వీనదియే యనుకొమ్ము. అట్లైన నీకు విచారము లేక సంతోషముగ నుండఁగలవు.

పురజనులయం దుండు ప్రీతి యీయడవి మృగములం దుంచుము. అట్లులే యయోధ్యయందలి ప్రీతి పర్వతము మీఁదను సరయువు నందుండు ప్రీతి మందాకిని యందు నుంచుము విచారముగలుగదు. సంతోషింతువు. "సుఖస్యదుఃఖస్య నకోపి దాతా" యన్నట్లు సుఖదుఃఖములకు మనస్సు కారణముగాని పదార్థములుకావుగదా.

కం. నామాటను జవదాఁటని, సౌమిత్రి భజింప, నీవు జానకి! సతివై
నామతి ననువర్తింపఁగ, నీమహి నింతకును సౌఖ్య మితరము గలదే.

జవదాఁటని=అతిక్రమింపని, నామతిననువర్తింపఁగన్ = నామనస్సుకని పెట్టి చరింపఁగా, ఈమహిన్=ఈభూలోకమందు, ఇంతకును=ఇంతకంటెను, ఈ భూలోకమందుఁ దనమాటమీఱని తమ్ముఁడు తనమనస్సెఱిఁగి వర్తించు పతివ్రత యగు భార్య యుండెనేని యంతకెక్కువసుఖ మీలోకమున లేదు.

కం. ఇమ్మందాకిని మునుఁగుచు, ముమ్మాఱును సమధుమూల ములఁ దిని నీతో
సమ్మతి నుండెద నే రాజ్యమైన నయోధ్యయైన నభిలాషపడన్. ౧౧౬౨

ముమ్మాఱు=మూఁడుమాఱులును, అచ్ఛద్విగుసున కేకవచనంబు ప్రాయికంబు, సు.వ్యా.సమా. ౩౧ సూ. వానప్రస్థాశ్రమమున నుండువారు దినమునకు మూఁడుమార్లు స్నానము చేయవలయును. సుమధు=తేనెతోడి, మూలములను=వేరులను, రాజ్యమైన=ఆలోకమున వైకుంఠమైనను, ఈలోకమున నయోధ్యయైనను గోరను.

తాత్పర్యము

నీవు నన్ను విడనాడక యుంటివేని యీనదిలో మూఁడుమార్లు మునుఁగుచుఁ దేనెతోడఁ గందమూలములఁ దినుచు నీతోసంతోషముగఁ గాలము పుచ్చెదను. నా కారాజ్యమైనను వలదు. అయోధ్యయైన వలదు.

కం. కరటిఘటాశాలినియును, గరి కేసరికీశపీత•కమలయు సుమనో
భరవృక్షయు నగునీనది, దరుణీ! యెవ్వనికి ముదము•దనరింప దొకో.

కరటి ఘటాశాలినియు = ఏనుఁగులగుంపులచేఁ బ్రకాశించునది, కరికేసరి కీశపీతకమలయు=ఏనుఁగులచేత, సింహములచేత, క్రోఁతులచేతఁ ద్రాగఁబడు జలములుగలది,సుమనోభరవృక్షయు=పూలభారముగల చెట్లుగలది, తనరింపదు = కలిగింపదు.

తాత్పర్యము

ఏనుఁగులమందలచేఁబ్రకాశించునదియు,నేనుఁగులు,సింహములు,క్రోఁతు లేకకాలమున నొకచో నీళ్ళుత్రాగు రేవులు గలదియుఁ దీరములందుఁ బూలభారముచే వంగిన కొమ్మలుగల చెట్లుగలదియునగు నీనది తరుణీ! యెవనికి సంతోషమొసంగదు? ఎట్టివానికైనను మనస్సునకు సంతోషము గలిగించును.

౯౬-వ సర్గము

కం. అని రామామణికిని నా,యినకులుఁడు సుసంగతోక్తి•నింపెసయఁగ నా
ధునిఁ జూపుచు శుభనయనాం, జననిభ మగుచిత్రకూట•సానువునందున్.

రామామణికిని=స్త్రీరత్నమైన సీతకును, ఇనకులుఁడు=సూర్యవంశమునఁ బుట్టినవాఁడు, సుసంగతోక్తిన్=ఒకదానితోనొకటి పొసఁగిన మాటలతో, ఇంపు = సంతోషము, ఎసయఁగాన్=కలుగఁగా, ధునిన్=నదిని, శుభనయనాంజననిభము =కంటికిమేలుగలిగించు కంటికాటుకతో సమానము, అగు సానువు=చఱియ.

తాత్పర్యము

స్త్రీరత్నమైన సీతకు శ్రీరామచంద్రుఁడు మిగులఁ బొందికగల మాటలచే సంతోషము కలుగ నానదిని జూపుచు ఆకులచేనిండిన చెట్లచే నిండియుండుటచే నల్లనై కాటుకవన్నెగల చిత్రకూటపర్వతము చఱియయందు.

కం. ఇది పూతం బిది స్వాదువు,సువతీ! యిది తప్తమను మ•సొంపుగఁ బలమున్
మదవతికిఁ జూపుతతి మి, న్గదియఁగ నాదంబు రేణు•కాండం బెగసెన్.

పూతంబు=పవిత్రము, స్వాదువు=తీపు, తప్తము=వండఁబడినది,బాగుగఁ బక్వము చేయఁబడినది, పలమున్=మాంసమును, మదవతికిన్=మదముగల సీతకు, మిన్=ఆకాశము, కదియఁగన్=చేరునట్లు, నాదంబు=ధ్వని, రేణుకాండము = దుమ్ముసమూహము, వండినది వడ్డించినది సీతయైయుండ నామెకు నిది పూతము ఇది స్వాదువు అని చెప్పుటచేఁ దనయుచ్ఛిష్టము సీతకిచ్చెనని తోఁచెడిని. ఉచ్ఛిష్ట మనఁగా నోటియెంగిలిగాదు. తినఁగా మిగిలినది.

తాత్పర్యము

ఇది పవిత్రమైనది, ఇది తియ్యనైనది, ఇది బాగుగఁబక్వమైనది. అని మాంసమును సీతకుఁజూపు సమయమున నాకాశము తగులునట్లు ధ్వనియు ధూళిసమూహ మెగసెను.

శా. ఆనాదంబున కుల్కి తద్గహనస◆త్త్వాళుల్ శకుంతాదులున్
నానాయూథములుం గలంగి దెసల◆న్గగ్గోలుగాఁ బాఱినన్
క్ష్మానాథుం డది గాంచి లక్ష్మణునితోఁ◆గంటే ధరా రేణుసం
తానంబుల్ దివిఁ దాఁకె భీషణమహా◆నాదంబు పెంపారెడిన్. ౨౧౮౯

ఉలికి=భయపడి, తత్=ఆ, గహన=అడవియందలి, సత్త్వావళుల్=మృగసమూహములు, శకుంతాదులున్=పక్షులు మొదలగునవి, నానాయూథములున్=అనేకములయిన యేనుఁగులగుంపులు, కలంగి=కలఁతచెంది, దెసలన్=దిశలయందు, గగ్గోలుగన్=గందరగోళముగ, పాఱినన్=పరువెత్తఁగా, క్ష్మానాథుండు=శ్రీరాముఁడు, ధరారేణుసంతానంబుల్=నేలదుమ్ముసమూహములు, దివిన్=ఆకాశమును, భీషణ=భయంకరమైన, మహానాదంబు=గొప్పధ్వని, పెంపారెడిన్=అతిశయించెడిని.

తా త్ప ర్య ము

ఆధ్వనికి భయపడ యాయడవియందలి జంతుసమూహములు పక్షులు మొదలయినవియును అనేకము లేనుఁగుగుంపులును గలఁతచెంది గందరగోళముగా దిక్కులవెంటఁ బరువెత్తఁగా శ్రీరామచంద్రుఁ డదిచూచి లక్ష్మణునితో నిట్లనియె లక్ష్మణా! నేలదుమ్ము గుంపు లాకాశముఁ దాఁకెను. భయంకరధ్వనియు నతిశయించుచున్నది.

కం. కరులో కాసరమో కే,సరి భీతినిమృగములో ది◆శాంతములకు స
త్వరముగఁ బాఱెడి వేఁటకు, నరపతి యరుదెంచెనో, క◆నన్ శ్వాపదమో.

కరులో=యేనుఁగులో, కాసరమో=అడవిదున్నపోతో. కేసరిభీతిని=సింహమువలని భయమున, దిశాంతములకున్ = దిక్కులకొనలకు, సత్వరముగన్=త్వరతో గూడినట్లుగ, శ్వాపదమో=క్రూరమృగమో.

ఈపద్యమున రెండః పాదంబున నఖండయతి.

తా త్ప ర్య ము

ఏనుఁగులో యడవిదున్నపోతో సింహమునకు భయపడిన మృగములో దిక్కులకొనలకుఁ దొందరగాఁ బరువెత్తుచున్నవి. దీనికిఁ గారణము రాజెవఁడైన వేఁటకై వచ్చెనా? లేక ఘాతుకమృగమేదైన నడవిలోకి వచ్చినదా?

చం. కనుఁగొన నొక్కపిట్టయినఁ◆గానఁగ రా దిట, దీనితత్త్వమున్
కనుఁగొని రమ్ము టన్నఁ జని◆గ్రక్కునఁ బుష్పితసాల మెక్కి తూ
ర్పును గని వెండి యుత్తరముఁ◆బోలిచి చూడఁగ నందు ఘోరమై
తనదెస వచ్చుచున్న యొక◆దారుణసైన్యముఁ గాంచె దవ్వులన్. ౨౧౯౦

పిట్ట+అయిన=చిన్నపక్షియైనను, తత్త్వమున్=యథార్థవిషయమును, పుష్పితసాలము=పూచినచెట్టును, ఘోరమై=భయంకరమై, తనదెస=తానుండు దిస=వైపు, దారుణసైన్యము=భయంకరసేన, దవ్వులన్=దూరప్రదేశమందు

తాత్పర్యము

చూడఁగా నిచ్చట నొకచిన్నపక్షియైనను గానరాక యెక్కడికో పోయినవి దీనివాస్తవ కారణమేమో చూచిరమ్మనినఁ దీవరఁ బోయి పూచిన చెట్టొకటి యెక్కి తూర్పునుగని యాప్రక్కనేమియుఁ గానరాకుండుటచే నుత్తరము పాలించి చూడఁగా నందు భయంకరమై తనవైపునకే వచ్చుచున్న భయంకర సైన్యమును దూరమునందే చూచెను.

చం. ఘనరథనాగవాజిభట♦కాండవిరాజితభూరివాహినిన్
గని, యట నుండి రాముఁగని♦గ్రక్కున నార్పుము వహ్ని, నీశరా
సనమును నెక్కుపెట్టు,మిక♦జానకినిన్ గుహ నుండఁ బంపుమీ,
మునుకొని తాల్పుమీ కవచ♦ముం, బెను మోసము వచ్చెనన్న యా. ౧౧౬౯

గొప్పవియగురథ=రథములచేతను, నాగ=ఏనుఁగులచేతను, వాజి=గుఱ్ఱములచేతను, భటకాండ=భటులసమూహముచేతను, విరాజిత=ప్రకాశించు, భూరి=గొప్పదియగు, వాహినిన్=సేనను, గ్రక్కునన్=శీఘ్రముగ,వహ్నిన్=నిప్పుండి పొగరాఁజిన మనముండుచాయ దెలియును, భరతుని సైనికులు చూచిన దీపా గయే, శరాసనమును=వింటిని, మునుకొని=ముందుగ, పెను=పెద్ద.

తాత్పర్యము

గొప్పరథములు నేనుఁగులు భటసమూహము వీనిచేఁ బ్రకాశించు గొప్ప సేననుజూచి యచ్చటనుండియే శ్రీరామునిజూచి, యన్నయ్యా! వెంటనే నిప్పార్పుము, పొగలేవనీకుము. నీవిల్లెక్కుపెట్టుము, ఇఁక జానకిని గుహలోనికిఁ బంపుము. ముందుగఁ గవచముందొడఁగుము. అన్నా! పెద్దగండము వచ్చెను.

—♦ లక్ష్మణుండు శ్రీరామునితో భరతుండు సేనతో వచ్చుట దెలుపుట ♦—

కం. అనవుడు లక్ష్మణుతో నోయనఘా! కనుఁగొమ్ము లెస్స♦యావాహిని యె
వ్వనిదో నావుడు సైన్యముఁ,
గనుఁగవనె దహించు నట్లు♦కని మండి యనెన్. ౧౧౭౦

కనుఁగవనె=రెండుకన్నులతోనే, మండి=కోపముచేఁ బ్రజ్వలించి.

తాత్పర్యము

అని చెప్పఁగా శ్రీరామచంద్రుఁడు లక్ష్మణునితో లక్ష్మణా! యాసైన్యమెవనిదో చక్కఁగాఁ జూడుమనఁగా నాయనయుఁ గంటి దృష్టులచేతనే యాసైన్యము నంతయుఁ దహించువానివలె మండిపడి యిట్లనెను.

చం. ఘనతరరాజ్యసంపదలు ♦ గైకొని తా నభిషిక్తుఁడై పురిన్
మనల వధింప వచ్చెను జుమా ♦ భరతుం డలకైకపట్టి, యా
ఘనరథమందు నుద్గతప్ర♦కాండము గ్రాలెడిఁ గోవిదార కే
తన మదె చూడవన్న! మదిఁ ♦ దక్కుము సందియ మాతఁడే చుమా.

కైకకుమారుఁడు=భరతుఁడు, (అనఁగాఁ దల్లివంటికుమారుఁడే భరతుఁడు అని కైకగుణము జ్ఞప్తికిఁ దెచ్చుటకై చెప్పినమాట) ఘనతరరాజ్యసంపదలు=మిగులగొప్పదైన రాజ్యముయొక్క యైశ్వర్యములు, కైకొని=గ్రహించి, అభిషిక్తుఁడై=అభిషేకము నొందినవాఁడై, ఉద్గతప్రకాండము=ఎత్తైనబోదె, అనఁగా నట్లువ్రాయఁబడినదని భావము. కోవిదార కేతనము=కోవిదార ధ్వజము.

తాత్పర్యము

కైకకొడుకు భరతుఁడు గొప్పరాజ్యసంపదలు గ్రహించి యయోధ్యయందుఁ బట్టాభిషేకము నొందివాఁడై శత్రుశేష ముండనీయరాదను తలంపుతో మనలఁ జంపవచ్చుచున్నాఁడు. నీకెట్లు తెలిసెనందువా? ఎత్తైనబోదెగల కోవిదారకేతనము ప్రకాశించుచున్నది, అదిగోఁ జూడుము. సందేహములేదు. భరతుఁడేసుమా.

ఉ. రౌతులు మావటీంద్రులు వెస ♦ రా నిటఁ జొచ్చిరి తాల్చి యాయుధ
వ్రాతము నశ్వనాగముల ♦ పై వడిగా, మన మిప్డు చాపముల్
శాతశరంబులం గొనుచు ♦ క్ష్మాధర మెక్కుటొ యింద యుంటయో
నీతలఁ పేది? చిక్కెడిని ♦ నేఁ డనిలో భరతుఁడు భూపతి. ౨౧౮౨

రౌతులు=గుఱ్ఱములనెక్కువారు, మావటీంద్రులు = ఏనుఁగులఁ దోలువారు, ఇటన్=ఇచ్చటికి, రాఁజొచ్చిరి, ఆయుధవ్రాతము=ఆయుధములసమూహము, అశ్వనాగములపై=గుఱ్ఱముల యేనుఁగులమీఁదను, శాతశరంబులన్=పదునైన బాణములు, అనిలోన్ = యుద్ధమందు, చిక్కెడిని = వశపడును, క్ష్మాధరము = పర్వతము.

తాత్పర్యము

రౌతులు మావటీలు త్వరగా మనవైపుగనే యాయుధములు ధరించి గుఱ్ఱముల నేనుఁగులనెక్కి త్వరగా వచ్చుచున్నారు. ఇప్పుడు మనము పదునైన బాణములు విండ్లుతీసికొని కొండయెక్కవలెనా? ఇందేయుందమా? నీయాలోచనయేమి? నేఁటి యుద్ధములో భరతుఁడు చిక్కును.

ఉ. నీకును నాకు సీతకును ♦ నిష్ఠురకష్టము గూర్చె, శాశ్వత
శ్రీకి నినుఁ దొలంచె, మదిఁ ♦ జేర్చెనికారవిధంబు నట్టియా
కైకతనూజుఁ డారిపుఁడు ♦ క్రమ్మఱఁ బైపడి వచ్చెఁ గంటివే
భీకరబాణపాతముల ♦ బీరము నీ ఱొనరించి త్రుంచెదన్. ౨౧౮౩

నిష్ఠురకష్టము=పరుషమైనకష్టము, శాశ్వతశ్రీకిన్ = శాశ్వతమైనసంపద నుండి, పంచమ్యర్థమున షష్ఠి, తొలంచెన్=తొలఁగించెను, నికారవిధంబు=మోస విధము, రిపుఁడు=శత్రువు, భీకరబాణపాతమున్=భయంకరములయిన బాణముల యొక్కపడుటచేత, బీరము=వీర్యము, నీఱు=బూడిద, త్రుంచెదన్=ఖండించెదను

తాత్పర్యము

నీకును సీతకు నాకు నిటువంటి పరుషమైన కష్టము కలిగించెను. నిన్ను శాశ్వతలక్ష్మినుండి తొలఁగించెను. మనసులోఁ దాను మంచివానివలె దూరమున నుండి తల్లిచే నింత మోసమును జేయించెను.

అట్టి కైకకొడుకు, తలచుట్టము తోఁకపగలేదు. తల్లిశత్రువైనఁ గొడుకు మిత్రుఁడగునా? కావున నాకారణముచేతనే విరోధి ఊరఁజేసినదానితోఁ దృప్తిపడక యిక్కడికిని దలుముకొనివచ్చెను చూచితివా? భరతుఁ డెటువంటివాఁడో, కావున భయంకరబాణప్రయోగములచేత వానిపౌరుషము బూడిదచేసి ఖండించెదను.

చం. భరతునిఁ ద్రుంచుటందు నొక•పాపము లే దని నాకుఁ దోఁచె, దు
శ్చరితుని మున్ను కీడులను•జల్పినవానిఁ బరిత్యజించినం
దొరయ దధర్మ మందురు ఘ•నుల్; విను త్యక్తసుధర్ముఁ డీతఁ డా
సరణిఁ జరించె, నీయలుచుఁ•జంపెద, నేలుము రాజ్య మంతయున్.

నీకన్న నాకుఁ దమ్ముఁడు అటువంటి భరతుని జంపెద ననెదవే, ఇది యేమి పాపము అనెదవా? దుశ్చరితున్=చెడ్డనడవడిగలవానిని, పరిత్యజించినన్ వదలినను, దొరయదు=కలుగదు, ఘనుల్=గొప్పవారు, త్యక్తసుధర్ముఁడు=వదలిన పెద్ద పిన్నధర్మముగలవాఁడు, ఆసరణిన్ = తల్లిమూలమునఁ బెద్దవారి సంపద హరించిన యా విధముగా, అలుచున్=నీచుని.

"యోహింసార్థమసిక్రాంతం హంతిమన్యురేవ మన్యుః స్పృశతి న తస్మిన్ దోష ఇతిపురాణే" అని యాపస్తంబులు. ఎవఁడు హింసించుటకై కత్తినిబూని వచ్చునో యట్టివానిని హింసించిన దోషములేదు వాని క్రోధమే వానిని జంపును.

తాత్పర్యము.

భరతుని జంపిన బాపములేదని నాయభిప్రాయము. ఏలన: నిరపరాధిని జంపిన దోషముగాని పూర్వము తానై కీడుచేసినవానిని ద్యజించిన బాపము లేదని పెద్దలు చెప్పుదురు. ధర్మమునువదలి వీఁడావిధముగఁ జరించెను కావున నీనీచుని జంపెదను. రాజ్యమంతయు నీవే యేలుము.

చం. తనతన ముండు మచ్ఛరవి•తానములన్ ధరఁగూల నేడ్చుచున్
గనుఁగొనుఁగాక రాజ్యభర•కాముక కైకయి మత్తహస్తిభ
గ్ననగమునట్లు, సానుచరఁ•గైక సబాంధవ వెండిఁ ద్రుంతు మే
దినియు నపాస్తపాప యయి•తేజమునొందెడుఁగాక నిత్యమున్. ౨౧౩౮

మచ్ఛరవితానములన్ = నా బాణసమూహములచే, రాజ్యభరకాముక= రాజ్యభారమునందుఁ గోరికగలది, మత్తహస్తిభగ్ననగమునట్లు=మదపుటేనుఁగుచే విఱువఁబడిన చెట్టువలె, సానుచర=అనుచరులతోఁ గూడినది, సబాంధవ= బంధువులతోఁ గూఁడినది, అపాస్తపాప=పాపమునుండి తొలఁగింపఁబడినది.

తా త్ప ర్య ము.

తనకొడుకు నాబాణములచే నేనుఁగువిఱిచిన చెట్టువలె నేలఁబడఁగా రాజ్య మనుభవింప నాశపెట్టుకొనిన కైకవాని నేడ్చుచుఁ జూచునుగాక పరిచారకులతోఁ గూడినదై చుట్టముల సహాయముతోఁ దాను పైపడి విరోధించి వచ్చెనా కైకను గూడఁ ద్రుంచెదను.అప్పుడు భూమి పాపహీనయై శాశ్వతముగఁ బ్రకాశించును.

కం. ఎండినపొదరులమీఁదఁ బ్ర,చండహుతాశనునియ ట్ల॰సత్కారభవో
ద్దండక్రోధము శాత్రవ, కాండంబులమీఁద విడుతుఁ॰గాకుత్థ్సవరా!

పొదరులమీఁదన్ = పొదలమీఁద ప్రచండహుతాశనునియట్ల = తీక్ష్ణమైన యగ్నివలె, అసత్కార=అవమానమువలన,భవ=పుట్టిన, ఉద్దండ=అధికమయిన, క్రోధము=కోపము, శాత్రవకాండంబులమీఁదన్=శత్రుసమూహముమీఁద.

తా త్ప ర్య ము

ఎండిన పొదలమీఁదఁ దీక్ష్ణమైన దావానలమువచ్చి పడినట్టు లవమానము వలనఁ గలిగిన కోపమును శత్రుసమూహములమీఁద విడిచిపెట్టెదను.

తే. చించి చెండాడి శాత్రవ॰సేన నెల్ల, ఘోరసునిశితనారాచ॰కోటిఁ బరపి
చిత్రకూటంబుర క్తపి॰శితసుసి క్త, ముగనుగావింతునేనిప్డు॰జగము మెచ్చ.

చెండాడి = చెండుతోనాడినట్లాడి, ఘోర = భయంకరమైన, సునిశిత= మిగులఁపదునైన, నారాచకోటిన్=బాణసమూహములను, పరపి=ప్రయోగించి, రక్త=నెత్తుటిచేతను, పిశిత=మాంసముచేతను, సుసిక్తముగన్=బాగుగఁదడిసిన దానిఁగ, నేనుగావింతును.

నేను = ఇదివఱకు నీతోడవచ్చి శంబరసుతాదులతో యుద్ధము చేసినపు డెట్లు జయము కలుగఁజేసితినో నీ వెఱుఁగవా?అట్లే నేనిపుడు చేసెదను. అప్పుడు లోకము మెచ్చినట్లిపుడు మెచ్చును. 'నశత్రుర్వశమాపన్నో మోక్తవ్యో వధ్యతాంగతః' భార. ౫-౩౮-౭౯. చంపఁదగినశత్రువు వశపడినపుడు విడువరాదు.

తా త్ప ర్య ము

భయంకరమైన పదునైన బాణసమూహములను బ్రయోగించి విరోధిసేన నంతయును జించి యాతునుకలను జెండువలెనాడి లోకము మెచ్చునట్లు చిత్రకూటమును రక్తమాంసములతోఁ దడిసినదానిఁ జేసెదను.

తే. శరవినిర్భిన్నహృదయకుం॰జరతురంగ మానవకళేబరముల స॰మానమోద
మునను దినుఁగాక శ్వాపద॰ములును నిట్లు,
చాపశరఋణము త్తీని॰జలుపువాఁడ. ౨౧౮౮

శరవినిర్భిన్న=బాణములచే భేదింపఁబడిన, హృదయ = గుండెలుగల, కుంజర=ఏనుఁగులయు, తురంగ=గుఱ్ఱములయు మానవ=మనుష్యులయు, కళేబరములను=దేహములను,కళే+అవరము=కళేవరము కళేబరము వబలకభేదము

కావున కళావిహీనమైనది అనూనమోదమునను = కొఱఁతలేని సంతోషముతో, శ్వాపదములు = మాంసమునుదిను క్రూరమృగములు, చాపశరబుణముక్తిని= విల్లు బాణముల యప్పుదీర్చుటను. తాత్పర్యము

బాణముచే భేదింపఁబడిన గుండెలుగల యేనుఁగులయు గుఱ్ఱములయు మనుష్యులయు దేహములను మాంసము దిను జంతువులు కడుపార భోజనము దొరికెనను నిండు సంతోషముతోఁ దినసీ, ఈప్రకార మూరకమోచి తిరుగు విల్లు బాణముల యప్పును దీర్చెదను. అతిస్నేహము పాపశంకి యనున్యాయము ననుసరించి రామచంద్రునియందలి ప్రేమాతిశయముచే నాయనకుఁ గీడురాఁ గలదని వెఱచి లక్ష్మణుఁ డిట్లు చెప్పెను.

-♦ ౯౭-వ సర్గము. భరతునిపైఁ గినిసినలక్ష్మణుని శ్రీరాముఁడు శాంతిపఱుచుట ♦-

చం. అనుఁడను గ్రోధమూర్ఛితుఁడు ♦ నై రణయత్నము సేయుచున్న ల
క్ష్మణుఁ బరిసాంత్వనోక్తులను ♦ శాంతిపడంగ నెచించు రాముఁడున్
బని గలదే సుమిత్రసుత ♦ బాణముచే నసిచేత వింటిచే
తను గురుచాపుఁడున్ సుమతి ♦ తానుగ రా భరతుండు సోదరా! ౨౧౮౯

క్రోధమూర్ఛితుఁడు=కోపముచే దేహము తెలియనివాఁడు, పరిసాంత్వనోక్తులను=ఊరార్పుమాటలచే, అసిచేత=ఖడ్గముచేత, గురుచాపుఁడున్=గొప్పవిల్లు గలవాఁడు, అనుటచే నీవెంతబలవంతుఁడవో భరతుఁడు నంతబలవంతుఁడే కావున నీ వనుకొన్నట్లు నీకు సులభసాధ్యుఁడు కాఁడనుట. సుమతి=మంచి మనస్సుగల వాఁడు, బలముగలదని గర్వించి యితరులకు నిష్కారణముగ నీవలె బాధగలి గింపఁ దలఁచువాఁడుకాఁడని భావము. సోదరా=నీవు నాకెట్టి తమ్ముఁడవో వాఁడు నాకట్టి తమ్ముఁడే, సుమిత్రసుత=భరతుఁడు కైకకొడుకగుటచే దుర్మార్గుఁడయ్యె నేని నీవు సుమిత్రకొడుకవే నీవేల యిట్టి క్రౌర్యమునకుఁ బాలుపడితివి. భరతుఁడు సవతితల్లి కొడుకగుటచే ద్వేష్యుఁడేని నీవుమాత్రముగావా, సోదరా=సవతితల్లి కొడుకను భేదబుద్ధి మీకుండిన నుండనీ నాకు మీరందఱు సోదరులే స+ఉదర =సోదర=ఒకకడుపునఁ బుట్టినవారమే. సమానోదరులమే.

తాత్పర్యము

ఈప్రకారము చెప్పుచుఁ గోపముచే దేహము తెలియక యుద్ధయత్నము చేయుచున్న లక్ష్మణుని నూరార్పుమాటలచేఁ గోపము చల్లారినవానిఁగాఁ జేయ నెంచి శ్రీరామచంద్రుఁ డిట్లనియె. సుమిత్రనందనా! గొప్ప విల్లుగలవాఁడును మంచి మనస్సుగలవాఁడును నగు భరతుఁడు తాను స్వయముగ వచ్చెనేని మనకు బాణముతో నేమిపని, కత్తిచే నేమిపని, వింటిచే నేమిపని.

చం. జనకునసత్యమున్ నిలుప ♦ సమ్ముఖమం దిట నన్నుఁ జూడ వ
చ్చినభరతున్ మనీషి గత ♦ జీవితుఁ జేసియు లోకనిందలన్

గనుచు ధరాతలంబుఁ గొనఁ • గార్యము లక్ష్మణ యేమి చెప్పుమా?
మనమున నీకు నంతరుచి•మంతములే ధనముఁ మహామతీ! ౨౧౯౦

జనకునిసత్యమున్నిలుపన్=తండ్రిచేసిన ప్రమాణమును నిలుపుటకు, తండ్రి తనకు రాజ్యమిచ్చెను గావున నాయనమాట కొనసాగింప రాజ్యభారము వహించెనుగాని తానుగాఁగోరి గాదనుట సమ్ముఖమందున్=ప్రత్యక్షముగ, ఇటన్=ఇచ్చట, మనీషిన్=ఇంద్రియ నిగ్రహము గలవానిని, గతజీవితున్=ప్రాణము పోయినవానిని,రుచిమంతములు=ఇంపైన రుచిగలవి,మహామతీ=గొప్పమనస్సు గలవాఁడా,సర్వసుఖములు వదలి నాసేవకై వచ్చినవాఁడవే;నీకిక్రోధముతగునా?

తా త్ప ర్య ము.

తండ్రిసత్యవాక్యమును బాలించుటకును నిచ్చట నన్నుజూచుటకును వచ్చిన బుద్ధిమంతుఁడు నింద్రియ నిగ్రహము గలవాఁడు నగు భరతుని జంపి లోకముచేఁ దండ్రి తనతమ్మునకిచ్చిన సొమ్మతనికిఁ జెందనీయని సోదరఘాతుకుఁడని నిందలపాలయి భూప్రభుత్వము సంపాదించిన లాభమేమి? గొప్ప మనస్సు గలవాఁడా! నీకుఁగూడ ధనమింతతీపా.

దీనివలన నపకీర్తివచ్చుకార్య మెంతలాభకరముగ నున్నను జేయరాదని సూచన. ఎంతవఱకు నపకీర్తి లోకమున నుండునో యంతవఱ కాపాపికి నరకావాసము తప్పదు.

అకీర్తిః కీర్త్యతేలోకే, యస్య భూతస్య కస్యచిత్
సపతత్యధమాం లోకా, న్యావచ్ఛబ్దప్రకీర్త్యతే॥ భారతము.

ఉత్తరకాండమందు శ్రీరామచంద్రమూర్తి తమ్ములతోఁ జెప్పిన ౯౨౪-౯౨౫ పద్యములఁ జూడుఁడు.

కం. హితబాంధవవర్గంబులు మృతిఁజెందిన వారిధనము • లేఁ గొన నొల్లన్;
మృతనష్టస్వము లే విష, కృతభక్ష్యములట్లు చూచు•టీవెఱుఁగ వొకో.

హితబాంధవవర్గంబులు = హితులయు చుట్టములయు, సమూహంబులు, మృతనష్టస్వము = చచ్చినవారి పాడుద్రవ్యము, విషకృతభక్ష్యములట్లు = విషముతోఁ జేయఁబడిన యాహార పదార్థములవలె.

తా త్ప ర్య ము

యుద్ధమునందు భరతుని నీవు చంపితివనుకో,అతనిరాజ్యము నేను గ్రహింతునని తలంచితివా?తండ్రి యతనికిచ్చినరాజ్య మతనిదిగాక మనదెట్లగును. హితులుగాని బంధువులుగాని మరణించిరేని వారిసొత్తు నేను గ్రహింప నిష్టపడను అత. మరణించినవారి పాడుసొత్తును విషముకలిసినభక్ష్యమువలెఁ జూతును. ఈనా పట్టమును నీవెఱుఁగవాయేమి?కావున నీవు భరతుని జంపినను నేనారాజ్యమాశింపను.

కం. భూమియు ధర్మం బర్థము,గామముఁ గాక్షింతు మీకుఁగా రాజ్యంబేన్
మీమేలునకే కోరెద, సౌమిత్రీ శస్త్ర మంటి శపథ మొనర్తున్. ౨౯౬౨

తాత్పర్యము

భూమి-ధర్మము-అర్థము-కామము మీనిమిత్తము నేను గోరుచున్నాను గాని నేను వానివలన సుఖింపవలయుననికాదు. నాసుఖము నిమిత్తమై నేనేమియుఁ గోరుటలేదు. రాజ్యము కోరుటకూడ మీమేలుకోరియే. మీకేమైనఁ గీడు కలిగెనేని నాకీరాజ్యమేల సుఖమేల? ఇది నానిజమైన యభిప్రాయమని నేను శస్త్రముఁదాఁకి ప్రమాణము చేసెదను.

ఇచ్చటి శ్రీరామచంద్రమూర్తి మాటలు యుద్ధరంగమందలి యర్జును మాటలతోఁ బోల్చునది.

ద్వి భ. కృపలేక చుట్టాల నిచ్చటఁ జంప। గలుగు శుభంబేమొ కానంగ లేను। గెలుపునేఁ గోర నీక్షితిఁ గోర సౌఖ్యములను నేఁగోర; నీభోగ రాజ్యములు। కలుగుటచే నేమి? కలదె ఫలంబు। బ్రతికియుఁ జెప్పుమా?రాజ్యభోగములు ప్రతత సుఖంబు లెవ్వారికై కోరఁ। బడియెనో వారలు ప్రాణముల్ ధనము। విడిచి నిల్చిరి యుద్ధపృథివి గోవింద।........మమ్ముఁ జంపినను నోమాధవా!వారినొల్ల నేజంపఁ। దై త్రిలోక్యరాజ్య కారణముచేనైన,నేలచెప్పంగ మహీస్థలిమాట?"అటుగాన బంధు సమన్వితులగుచు। నిటయున్న వీరుల ధృతరాష్ట్రసుతులఁ బొరిగొనఁ నొల్ల॥ ఈచుట్టములఁ జంపి యేమెట్టులొక్కొ యోచక్రహస్త! సుఖోన్నతిఁ గందు।

చం. జలధిపరీతభూవలయ సంపద లేఁ గొన నా కసాధ్యమె।
తలఁగి సధర్మమార్గమును దమ్ముఁడ! శక్రత నేనిఁ గోర, ని
స్తులితగుణాఢ్యుఁ డైనభర తుండును నీవును నీదుతమ్ముడున్
బొలుపుగ లేనినాడుసుఖ మున్ శిఖి నీఱుగఁ జేయుఁ గావుతన్. ౨౯౬౩

జలధిపరీత భూవలయసంపదలు=సముద్రముచేఁ జుట్టఁబడిన భూచక్రమునందలి సంపదలు, సధర్మమార్గమును = ధర్మముతోఁగూడిన మార్గమును, తలఁగి=విడిచి, శక్రతన్=ఇంద్రత్వమును,నిస్తులితగుణాఢ్యుఁడు=అసమానమైన సద్గుణసంపత్తిగలవాఁడు, నీఱుగన్=భస్మముగ.

తాత్పర్యము

లక్ష్మణా! నేను గోరితినేని సముద్రపర్యంతముగల భూచక్రమునందలి సంపదనంతయు గ్రహించుట నాకసాధ్యమని తలఁచితివా? అసమర్థుఁడనై యాశింప వాఁడఁగాను. ధర్మము తప్పిన మార్గము నింద్రత్వము లభించినను నాకువలదు.అసమాన సుగుణసంపదగల భరతుఁడు నీవు శత్రుఘ్నుఁడు చక్కఁగాలేని నాసుఖము నగ్నిహోత్రుఁడు భస్మముచేయుఁగాక (ఇందు సీతాదేవి పేర్కొనఁబడలేదు.)

సీ. భ్రాతృవత్సలుఁడైన • భరతుఁడు నిజకుల, ధర్మ మెంచుచు నయో • ధ్యకును వచ్చి
నేను నీతో సీత • తో నారలనుగట్టి, ప్రవ్రాజితుఁడనై • వనికి రాక
యాలకించి చు నాకుఁ • బ్రాణంబుకంటెను, బ్రియతరుం డౌట భా • వించి నీతి
నాకులితేంద్రియుం • డగుచు స్నేహాక్రాంత,
హృదయంబునను జూడ • నేగుదెంచెఁ
ఆ. గాని యొండు గాదు • కైకపైఁ గోపించి, యప్రియంబు లాడి • యనఘుజనకు
కరుణ వడసి నాకుఁ • గ్రమ్మఱ రాజ్యంబు, నీయ వచ్చె వింటె • యింతనిజము.

భరతుని రాకవిషయమైన నీ యభిప్రాయము సరిగాదని శ్రీరామచంద్ర మూర్తి తన యభిప్రాయముఁ జెప్పుచున్నాఁడు. భ్రాతృవత్సలుఁడు=సోదరుల యందుఁ బ్రేమగలవాఁడు, నీవలె భ్రాతను హింసింపఁ దలఁపుగలవాఁడు కాఁడ నుట. నిజకులధర్మ మెంచుచున్=తనవంశాచారమును తలంచుచు, ప్రవ్రాజితుఁ డనై=దేశభ్రష్టుఁడనై, వనికిన్=అడవికి, రాక=వచ్చుట, ప్రియతరుండు=మిగులఁ బ్రియముగలవాఁడు, భావించి=ఆలోచించి, ఆకులేంద్రియుఁడగుచున్ = కలఁత చెందిన యింద్రియములు గలవాఁడై, స్నేహాక్రాంత హృదయంబునను= స్నేహముచే నాక్రమింపఁబడిన మనస్సుతో.

తా త్ప ర్య ము.

భరతుఁడు మనమీఁదికి యుద్ధమునకు వచ్చుచున్నాఁడని తలఁచితివి. నీ యభిప్రాయము సరిగాదు. సోదరప్రీతిగల భరతుఁ డయోధ్యకువచ్చి నేను నీతో సీతతో నారచీరలుగట్టి దేశభ్రష్టుఁడనై యడవికి వచ్చినవార్తవిని తనవంశధర్మ ముగుజ్యేష్ఠానువర్తనము నాలోచించి నాకు నా ప్రాణముకంటెను మిగులఁ బ్రియుఁడైన కారణమున వికలమైన మనస్సుగలవాఁడై స్నేహభావంబున నన్నుఁ జూడ వచ్చుచున్నాఁడు గాని యితరమైన తలంపుతోఁ గాదు. ఇట్లు వచ్చు వాఁడు సేనలనేల తేవలెఁ దానుమాత్రమువచ్చి చూచిపోరాదా? యందువేమో! కైకమీఁదఁ గోపించి యామెను దూషించి పాపరహితుఁడైన తండ్రిదయ సంపా దించుకొని తనయభిప్రాయప్రకారము జరుప నాయన యంగీకారము సంపా దించుకొని నాకు రాజ్యమిచ్చుటకై వచ్చుచున్నాఁడు. ఇది నిజము.

కం. భరతుఁడు మనలఁ జూడఁగ, నరుదెంచుట యోగ్యవిధమ • యగు, నతఁ డంతః
కరణంబున నేనియుఁ గీ, డరయఁడు మనయందు నీకు • నలుగం దగునే?

తా త్ప ర్య ము

భరతుఁడు మనలఁ జూడవచ్చుట సరియైనకార్యము. రాకుండినఁ దప్పు. అతఁడు మనకుఁ గీడు కలుగవలయునని మనసునందైనఁ గోరఁడు. నీవు వానిపైఁ గోపింపఁ దగునా?

చం. వినుతగుణాఢ్య నీకు నొక • విప్రియ మెన్నఁడు సల్పె నయ్య యా
యనఘుఁడు? తేర తేరకు భ • యంపడె దేటికి? నిట్టిమాట లే

ననియెనె? సందియంబు దగు•నా? యిఁక నాడకు మిట్టు లాతనిన్
వినయము దప్పి పల్కినను • విన్మది న న్ననినట్టు లెంచెదన్. ౨౧౯౬

వినుతగుణాఢ్య=స్తోత్రము చేయఁబడిన గుణసంపద గలవాఁడా.

తాత్పర్యము

ఆ పుణ్యాత్ముఁడు నీ కేనాఁడైన నప్రియకార్యము చేసెనా? ఏలనీవు నిష్ఠారణముగ భయపడెదవు? అప్రియము చేయకపోవుట యటుండనీ నీవలె నిట్టిమాటలయిన నెన్నఁడైన నాడెనా? ఎన్నఁడు చెడుమాట నాడనివాని విషయమై సందేహింపవచ్చునా? ఇప్పటి కనినదేమో యంటివి. ఇఁకమీఁదఁ బెద్దవాఁడను గౌరవమెంచక వినయము విడిచి యిట్లతని ననకుము. అంటివా నీవనినది నన్నని తలఁచెదను. ఈనాఁడు వానిననినవాఁడవు రేపు నన్ననవా?

దీనివలనదనభక్తులను దూషించినవానిని భగవంతుఁడు తన్ను దూషించినవానిఁగా నెంచునని భావము.

ఉ. ఎంత విపత్తియైనఁ గలఁ•డే తనతండ్రిని జంపుపుత్రుఁడున్
సొంతము ప్రాణతుల్యుఁడగు•సోదరుఁ జంపెడిభ్రాతయుం? గటా
యింతలు నీదునాలుకకు•నేగతి వచ్చెను? రాజ్యకాంక్ష నీ
కంతఘనంబ యేని భర•తా ధర వీనికి నిమ్మటందునా? ౨౧౯౭

విపత్తి=ఆపద, ప్రాణతుల్యుఁడు=ప్రాణముతో సమానుఁడు, ఇంతలు=ఇటువంటి క్రూరవాక్యములు, ఘనంబు=గొప్పదియే, ధర=భూమి.

లక్ష్మణుఁ డింతకుఁబూర్వము తండ్రిని జంపెదననెను. (౨౯౬-౨-వ ప.) ఇప్పుడన్నను భరతుని జంపెద ననెను. ఇట్టివానిని నూరకవిడిచిన నెప్పుడో యొకప్పు డనర్థముఁదెచ్చి పెట్టునని తలఁచి చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

ఎంతటి యాపదయందైనను దండ్రినిజంపు కొడుకైనను సొంతము ప్రాణతుల్యుఁడగు తోడఁబుట్టినవానిని జంపు తమ్ముఁడునుగలఁడా! ఇంతటి క్రూరవాక్యములు నీనాలుక కెట్లువచ్చెను. నీకు రాజ్యముమీఁద విశేషవాంఛ యున్న దేని భరతా! రాజ్యము వీనికిమ్మని చెప్పుదునా?

కం. ఊరకయ మాటమాత్రము, ధారిణి లక్ష్మణున కిమ్ము•తమ్ముఁడ! యన నేఁ
గూరిమి వల్లే యనుఁ జుమి, కోరిక లే దతని కింత•క్షోణీస్థలిపై. ౨౧౯౮

తాత్పర్యము

వేడుకకైన నూరక భరతా! రాజ్యము లక్ష్మణునకిమ్మని మాటమాత్ర మంటి నేని తథాస్తని యంగీకరించును, ఏలన వానికి భూమిమీఁద నీకున్నంత కాంక్ష లేదు.

ఆ. అనిన ధర్మశీలుఁ♦డైన రాముని వాక్య,తతుల నాలకించి♦తద్ధితార్థి
లక్ష్మణుండు మిగుల ♦ లజ్జచేఁ దనలోనఁ,
క్రుంగి యిట్టు లనియెఁ♦గుతిలపడుచు. ౨౧౯౯

ధర్మశీలుఁడు=ధర్మస్వభావుఁడు, తద్ధితార్థి=రాముని మేలుకోరువాఁడు, ఇట్లు చెప్పుటచేఁ దాను దైవమని నమ్మియున్నవానికి నన్యాయముగ నింత కష్టము గలిగించిరని లక్ష్మణునకు దశరథాదులపైఁ గోపమేకాని తనకుఁగష్టము సుఖహాని కలిగించిరనికాదు. కుతిలపడుచున్=సంకటపడుచు.

తాత్పర్యము

ఈ ప్రకారము ధర్మస్వభావుఁడైన శ్రీరామచంద్రమూర్తి యాడిన మాటలు విని ఆ శ్రీరాముని మేలుకోరినవాఁడగుటచే బదులుచెప్పక లక్ష్మణుఁడు మిగుల సిగ్గుచేఁ దనలోనే క్రుంగి సంకటపడుచు నిట్లులనియె.

తే. మిమ్ముఁ గనుఁగొన మనతండ్రి♦మేదినీవి,
భుండు దశరథుఁ డరుదేరఁ♦బోలుననిన
వ్రీళితుని లక్ష్మణునిఁజూచి♦లాలితోక్తి,భావవిదుఁడైన శ్రీరామ♦భద్రుఁడనియె. [౨౨౦౦

తాత్పర్యము

మిమ్ముఁ జూచుటకు మనతండ్రి దశరథుఁడే వచ్చుచున్నాఁడేమో యని మాట తప్పింపఁగా నిర్దోషియందు దోషమెంచితినే యని సిగ్గుపడిన లక్ష్మణునిజూచి యతని యభిప్రాయమెఱిఁగిన శ్రీరామవిభుండు బుజ్జగింపుమాటల నిట్లనియె

సీ. మసలఁ జూడంగనే♦జనపతి వచ్చెనో,వనవాసమున మనఁ♦బడెడిపాట్లు
మదిలోనఁదలపోసి♦మనల నింటికిఁ దోడు,కొనిపోవ వచ్చె నం♦చునుదలంతు
మనకు నై రాకున్న♦మనుజేంద్రుఁ డీసుకు,మారి సుఖార్హను♦క్ష్మాతనూజఁ
దలఁచి యైనను మన♦తండ్రి దశరథుఁడు,వచ్చు సత్యంబ యా♦వచ్చుచున్న
తే. పవనజవనంబులును గోత్ర♦వంతములును,
చారుతరములునైనయ♦శ్వములు రెండుఁ
దండ్రిశత్రుంజయం బను♦దంతి దండు,
మున్నునడతెంచుచున్నవో♦యన్న! కంటె. ౨౨౦౧

సుఖార్హను=సుఖమనుభవించుటకు యోగ్యురాలిని, పవనజవనంబులును =గాలివేగమువంటి వేగముగలవి.గోత్రవంతములు=మంచివంశమునఁ బుట్టినవి, చారుతరములు=మిగుల మనోహరములు తండ్రిశత్రుంజయము=అనఁగా నాకు నామేనమామ యిచ్చినదియు నేను సుయజ్ఞున కిచ్చినదియుఁ గాదని భావము. దండుమున్ను=సేనయొక్క ముందటిభాగమున, కోవిదారధ్వజము కానవచ్చెనే కాని రథమునందలి మనుష్యుఁడు కానరాఁడయ్యెను.కావుననే లక్ష్మణుఁడు తొలుత భరతుఁడనిచెప్పి యావల దశరథుఁడేమో యని మాటపొర్లింప ననుకూలపడెను.

తొలుత శ్రీరామచంద్రుఁడు దశరథుఁడు వచ్చుచున్న యూహ నంగీకరించి నిపుణముగా శోధించి రాజార్హమైన శ్వేతచ్ఛత్రము లేమని సందేహించుచున్నాఁడు.

తాత్పర్యము

మనలను జూచుటకే దశరథుఁడు వచ్చునేమో? ఊరక చూచుట కింత దూరము వచ్చునా కాదు. కాదు, మనలనింటికిఁ దోడుకొనిపోవ వచ్చునేమో యని తలఁచెదను. అదియును సరికాదు. మననిమిత్తమురాఁడు. సుకుమారి సుఖార్హయగు సీతను దలఁచియైన దశరథుఁడు వచ్చును. ఇదియేనిజము. మంచి జాతిగుఱ్ఱములు రెండు మనతండ్రిది శత్రుంజయమను పట్టపుటేనుఁగు సేనకు ముందు వచ్చుచున్నవి చూచితివా?

కం. కనఁబడ దెం దరసిన మన,జనకుని దివ్యంబు భువన•జనపూజిత మై
తనరెడిశ్వేతచ్ఛత్రం,బనుమానం బయ్యె లక్ష్మ•ణా! నామదికిన్. ౨-౨౦౨

తాత్పర్యము

ఎక్కడ వెదకినను మనతండ్రి ధరించునదియగు దివ్యమును లోకులచేఁ బూజింపఁబడునది యగు తెల్లగొడుగు గానరాలేదు. కావున దండ్రివిషయమై నాకనుమానము కలుగుచున్నది. (ఆయన జీవించియున్నాఁడో లేదోయని నా సందేహమని భావము.)

కం. నామాట వినుము లక్ష్మణ, భూమీజము డిగుము వేగ•ముగ రమ్మన నా
సౌమిత్రి యట్ల యొనరిచి,
రామునకున్ మ్రొక్కి యొక్క•ప్రక్కగ నిలిచెన్. ౨-౨౦౩

తాత్పర్యము

లక్ష్మణా! నేనుజెప్పఁబోవు మాటలు వినుము. నీవు చెట్టుదిగిరమ్ము అనిన నాయనయు నట్లుచేసి,శ్రీరాముని మనసు నొప్పించినదానికిఁ బ్రాయశ్చిత్తముగా నమస్కరించి యన్న కేమికీడుమూడునో యను భయముతో వ్యసనముతో నాయన ప్రక్కనే నిలిచెను.

చం. భరతుఁడు క్రందుసందడిని•భ్రాతలయాశ్రమ మార్తి చెందునం
చురుతర సైన్యసంఘము న•గోత్తమసీమను ధర్మబుద్ధియై
నిరవుకొనంగ నిల్పె,నటు•లెంతయుసైన్యము సార్ధయోజనం
బిరవుకొనెం, బదంపడి మ•హీశసుతుండు వినీతవేషుఁ డై. ౨-౨౦౪

క్రందుసందడిని=గుంపులగొప్ప సమ్మర్దధ్వనులచే, ఆర్తి=పీడ,ఉరుతర= మిగులగొప్పదగు,నగోత్తమసీమను=శ్రేష్ఠమైన పర్వతముయొక్క యెల్లయందు అనఁగాఁ బర్వతపాదమందు, ధర్మబుద్ధియై =ఆశ్రమములకు హానిగూర్పరాదను ధర్మజ్ఞానముచేత,ఇరవుకొనంగన్=స్థానముగాఁ జేసికొనునట్లు,సార్ధయోజనంబు=

యామడ, పదంపడి=పిమ్మట, వినీతవేషుఁడై=వినయమును దెలుపు వేషముగలవాఁడై, పెద్దవారియొద్దకుఁబోవునపుడు గర్వముసూచించు వేషముతోఁ బోరాదు. ఉత్తరీయము నడుమునకుఁ జుట్టుకొని భృత్యునివలెఁ బోవలయును.

తాత్పర్యము

భరతుఁడు జనసమ్మర్దమునఁ దోడఁబుట్టినవారల యాశ్రమము బాధపడి చెడునని తలఁచి యాగొప్ప సేనాసమూహము నాశ్రమసమీపమునకుఁ బోనీయక కొండ క్రింద ప్రదేశమందే నిలుచునట్లుచేసెను. ఆసేన యొకటిన్నరయామడ ప్రదేశమాక్రమించుకొనెను. ఇట్లు సేనలనెల్ల నొకచోనిల్పి భరతుఁడు వినయము దెలుపు వేషముగలవాఁడై పైయుత్తరీయము నడుమునకుఁ జుట్టుకొని చేతులు జోడించుకొని మీఁదిపద్యముతో నన్వయము.

—♦ ౯౨-వ భరతుండు పాదచారియై రామాశ్రమంబు వెదకుట ♦—

ఉ. అన్నను జూడఁ గోరి గురు♦నానతిఁ గైకొని పాదచారియై
తన్ను భజించి యున్నపిన♦తమ్మునిఁ గన్గొని యెల్లవార మీ
యున్నవనంబులోపల ర♦ఘూత్తముఁ గాల్నడ నారయంగఁ బో
లు న్నిఖిలావనీజనులు ♦ లుబ్ధులుఁ గొల్వఁగఁ బొమ్ము నీ వటన్. ౨౨౦౫

గురునానతి=గురు+ఆనతి, గురువగు వసిష్ఠునియొక్క యాజ్ఞ, పాదచారియై=వాహనములేక కాలితో నడచువాఁడై, నిఖిలావనీజనులు=సమస్తభూప్రజలు, లుబ్ధులు=బోయలు, అటన్=ఆవైపున.

తాత్పర్యము

అన్నను జూడవలయునను కోరికచే గురువగు వసిష్ఠుని యాజ్ఞనుగ్రహించి తన యాలోచన నాయన సమ్మతింపఁగా దన్ను సేవించుచుఁ బ్రక్కనయుండు శత్రుఘ్నుని జూచి యాకానవచ్చు నడవియందు శ్రీరామచంద్రుని నడచుచుఁ బోయి యందఱు వెదకవలయును. వాహనములమీఁదఁ బోరాదు. నీవు సమస్త జనులు బోయలుకలసి యాప్రక్కన వెదకుచుఁ బొమ్ము.

చం. అసమానబలుండు గొల్చి వచ్చు నస♦మానబలుండు గుహుండు బంధురా
జిని వెసఁ గూడి; మంత్రిజన♦శేఖరులున్ గురుపౌరవర్గముల్
వెనుకొనువారు నన్ను నిట ♦ వేగపడన్ హృదయంబు వారలన్
గనుఁగొనుదాఁక శాంతి మదిఁ ♦ గల్గఁగ నేరదు సుమ్ము తమ్ముఁడా!

అసమానబలుండు=సరిలేని బలముగలవాఁడు, బంధురాజిని=చుట్టముల గుంపును, వెసన్=త్వరగా, గురుపౌరవర్గముల్ = గురువులు పౌరులు వీరల సమూహములు.

తాత్పర్యము

మనతోడ మహాబలవంతుఁడగు గుహుఁడు తనబంధువులతోడ వచ్చును. మంత్రిజనులందు ముఖ్యులగువారు గురువులు పౌరజనులు నావెంటవత్తురు నేను సీతారామలక్ష్మణులను జూచువఱకుఁ దమ్ముఁడా! నామనస్సున నారాటముపోదు.

కం. రాముని దుర్దమబలుఁ డగు సౌమిత్రి మహానుభావ • జనకాత్మజ నే
సేమముగఁ గాంచుదాఁకను,నామదికిని శాంతిలేదు•నాసోదరుఁడా! ౨౦౭

దుర్దమబలుఁడు=అణఁపరాని బలముగలవాఁడు, మహానుభావ = గొప్ప పాతివ్రత్యముగలది.

తాత్పర్యము

శ్రీరామచంద్రుని మిగుల బలశాలియగు లక్ష్మణుని మహాపతివ్రతయగు సీతను వారుక్షేమముగ నుండుటను గన్నారఁజూచువఱకు నా మనస్సులోని యారాటము పోదు.

కం. వనజదళనేత్రుఁ డగురా,మునిపూర్ణసుధాంశుఁ దెగడు•మోముందమ్మిన్
మనమారఁగఁ గన్నారఁగఁ, గనుదాఁకను నాకు శాంతి•గలుగు నటయ్యా. ౨౦౮

వనజదళనేత్రుఁడు=తామర రేకులవంటి కన్నులు గలవాఁడు, పూర్ణసుధాంశున్=నిండుచందురుని, మోముదమ్మిన్=ముఖకమలమును.

తాత్పర్యము

తామర రేకులవంటి కన్నులుగల శ్రీరామచంద్రుని నిండుచందురుని బోలు ముఖకమలమును గన్నుల కఱవుదీరఁ జూచి నిండుమనస్సు నానందించు వఱకు నామనస్సెక్కడ శాంతిపడును?

కం. భూమిపలక్షణయుతములు, రామునిచరణాంబుజములు•రాగంబున నే
నామస్తకమునఁ దాల్పక, నామదికిని శాంతి లేదు•నాసోదరుఁడా! ౨౦౯

భూమిపలక్షణయుతములు=రాజచిహ్నములచేఁ గూడినవి.

తాత్పర్యము

రాజ చిహ్నములగు వజ్రము ధ్వజము కమలము పుష్పము అంకుశము అమృతకలశము మొదలయిన రేఖలనెడి లక్షణములతోఁ గూడిన శ్రీరాముని పాదపద్మములను అనఁగా శ్రీరాముఁ డాయనయోగ్యతకుఁ దగినట్లు పట్టాభిషిక్తుఁడై కిరీటముఁదాల్చి సింహాసనమునఁ గూర్చుండి నాయోగ్యతకుఁ దగినట్టు లాయన శ్రీపాదములను నాశిరస్సున నుంచి సేవించువఱకు నాతమ్ముఁడా! నాకు మనశ్శాంతిలేదు.

కం. మనతండ్రిదాత లేలిన,ఘనరాజ్యభరంబుఁ బూని•క్ష్మాపతి యగుచున్
మనయగ్రజుఁ డభిషేకముఁ,గనుదాఁకను నాకు శాంతి•గలుగు నటయ్యా.

తాత్పర్యము

మనతండ్రియును దాతలును బరిపాలించిన రాజ్యముయొక్క భారమును దాను రాజై మనయన్న పట్టాభిషేకము చేసికొనుట నేను గన్నులారఁ జూచువఱకు నామనస్సునకు శాంతికలుగునా? ఇది బాహ్యదర్శనము.

కం. ఎంతటిధన్యుఁడొ సీతా,కాంతసుధాంశూపమాన♦కమనీయాస్యం
బెంతయు సంప్రీతిని నే,కాంతముఁగను లక్ష్మణుండు ♦ కాకుత్స్థమణీ.

సీతాకాంత=శ్రీరాముల, సీతావిశిష్టుఁడైన శ్రీరాముఁడనుటచే దంపతు లిరువురు నుభయవిభూతుల సేవ్యులని భావము. సుధాంశుసమాన=చంద్రునితో సమానమైన, కమనీయ=మనోహరమైన, ఆస్యంబు=ముఖము, సంప్రీతిని= సంతోషముతో, ఏకాంతము=ఎల్ల వేళ, రహస్యముగను, ఇది హార్దదర్శనమును ముక్తదశయందుఁ జేతనుని బ్రహ్మానందానుభవమును దెలుపును.

తాత్పర్యము

సీతతోడి శ్రీరాముని చంద్రునిబోలు నందమైన ముఖమును నెల్ల వేళ నొంటరిగఁ జూచి యానందమనుభవించు లక్ష్మణుఁ డౌరా! యెంతసార్థక జన్ముఁడో.

కం. ధన్యాత్మిక సాధ్వీమూ,ర్ధన్య మహాభాగ జనక♦రాజాత్మజ రా
జన్యవరుం దనభర్త న,నన్యమతిం గొలిచి వెంట♦నంటెను గంటే. ౨౨౧౨

ధన్యాత్మిక=ధన్యమైన యాత్మగలది, సాధ్వీమూర్ధన్య=పతివ్రతలయందు శ్రేష్ఠురాలు, మహాభాగ=గొప్పభాగ్యముగలది, రాజన్యవరున్=రాజులయందు శ్రేష్ఠుని అనన్యమతిన్=వేఱువిషయములపైఁబోని మనస్సుతో, ఏకాగ్రచిత్తముతో శ్రీరామునికంటె వేఱుదైవముగాని యుపాయముగాని ఫలముగాని లేదని యుండుట.

తాత్పర్యము

ఆహా! సీతాదేవి యెంతసార్థకజన్మ, ఎటువంటి పతివ్రతారత్నము, ఎంతటి భాగ్యశాలిని, రాజశ్రేష్ఠుఁడగు తనభర్తను ప్రేమతో వేఱువిషయమున మనస్సు పోనీయక కొలుచుచు భర్తవెంటఁ బోయెను.

ఇది ప్రకృతికి భగవంతునకుఁగల యవినాభావసంబంధము. విశేషణ విశేష్యభావమును దెలిపెడిని.

కం. నందనవనిని గుబేరుం, డందంబున నుండునట్టు♦ లవనీశ్వరుఁ డీ
సుందరగిరివరకూటం,బం దుండెడి దీని భాగ్య♦మగునే పొగడన్. ౪౨౧౩

నందనవనిని=నందనోద్యానమునందు, (2) సంతోషింపఁజేయునది కావునఁ జైత్రరథమందు, కుబేరుఁడు =(1) ఉత్తరదిక్కునకధిపతి, (2) కు+బేరుఁడు, కు=భూమి, బేరము=దేహము, కావునఁ బ్రపంచము దేహముగాఁగలవాఁడు, భగవంతుఁడు, అవనీశ్వరుఁడు,1 రాజు, రాముఁడు 2 హ్రీశ్చతే లక్ష్మీశ్చపత్న్యౌ యన్నట్టు శ్రీమహావిష్ణువు, 1యక్షరాజు కుబేరుఁడు తనయింటినివదలి యుద్యానమైన

చైత్రరథమందెట్లు క్రీడించునో యట్లు శ్రీరాముఁ డీ సుందరమైన పర్వతకూటంబునఁ గ్రీడించుచున్నాఁడు. "ఇక్ష్వాకూణామియం భూమి స్సశైలవనకాననా" యన్నట్టు లయోధ్యయుఁ జిత్రకూటము రెండు రామునివే అయినను నింటి కంటె నుద్యానవనము రమ్యమైనట్టు లయోధ్యకంటె నేకాంత భోగస్థానమగుటచే నిందున్నాఁడని భావము. ఈయర్థము సూచించుటకే యవనీశ్వరపద మిందుఁ గూర్పఁబడెను. 2 కుబేరుఁడు తన సొంత యుద్యానమును వదలి యింత కంటె నందమైన నందనమునఁ గ్రీడించునట్లు శ్రీరాముఁ డయోధ్య వదలి యీ స్వభావసుందరమైన పర్వతశ్రేష్ఠమందున్నాఁడు. 3 ఈపర్వతము లోకములోని యితరసామాన్య పర్వతముల వంటిదేయైనను శేషాచలమందు వేంకటేశ్వరునివలె హస్తిగిరియందు వరదరాజస్వామివలె నేకశిలయందు శ్రీకోదండరాములవలె శ్రీరాముఁ డిందుండుటచే నిదియు గిరివరమయ్యెను. ఈయన యిక్కడఁ జేరఁ డేని దీనిపేరు దెలిసినవారెందఱుందురో. 4. సమస్తప్రపంచము తనశరీరముగాఁ గల భగవంతుఁడు వైకుంఠమునందలి నందనమున నుండునట్లనిభావముఁ ఈ పర్వతముభాగ్య మేమని పొగడసాధ్యము?

తే. వ్యాళపాళీనిషేవిత•మైనవనము, రామచంద్రుఁడు భువనాభి•రాముఁ డిందు
నధివసించుటఁ జేసి ధ•న్యత్వ మందె,
ఘనత గన దెట్టి రాముసాం•గత్యమునను. ౨౨౧౪

వ్యాళపాళీ=వ్యాళస్సర్పే దుష్టగజే శ్వాపదే నాశఠేత్రిషు నానా.ర. పాము నకు,దుష్టగజమునకు;క్రూరమృగమునకు దుష్టునకు వ్యాలమనిపేరు. దుష్టజంతు సమూహముచే, నిషేవితము=కూడియుండునది, వనము=అడవి, ఇట్టిదయి "దుఃఖమతోవన"మన్నట్లు దుఃఖకారణమైన దగుటచే వాసయోగ్యముగాదు. అయినను భువనాభిరాముఁడు = ప్రపంచమందంతటను గ్రీడించువానికి నిది మాత్ర మభిమానస్థలము గాకుండునా? అయన కనుగ్రహమువచ్చిన పాషాణ మునకు స్థావరత్వము పోలేదా. ఒక్కసారి తాఁకుటచేతనే యట్లు ధన్యత్వము ప్రాప్తింపఁగా నిన్నాళ్ళిచ్చట నుండుటచే నీపర్వతము ధన్యత్వమందకుండునా? శ్రీరాముని సాంగత్యముచే నది ఘనతవహింపదా?పరుసవేది సోఁకుటచే నినుము బంగారమైనట్లు రామసాంగత్యమున నెట్టి నికృష్టజన్మమైన నుత్కృష్టజన్మమే యగును. వ్యాళపాళీనిషేవితమైన వనము ప్రపంచమే అదివాసయోగ్యముకాదు. ఛీ మనుజజన్మ మేటికనికదా సీత యేడ్చెను. అయినను భగవంతునకు దీనియందను గ్రహముకలదు కావుననే యంతర్యామిగను విభూతులుగను అర్చలుగను దీని యందుండును గావున భగవత్సేవాపరుల కిది గర్హ్యముకాదు. శ్లాఘ్యమేయగు.

చం. అని వచియించి యాభరతుఁ • డవ్వనసీమను బాదచారి యై
చనుమును వాగ్మిశేఖరుఁడు • చారుసుమాగ్రము లైన శైలసం

జనితనగాళిమధ్యమునఁ•జక్కఁగఁ బోవుచు సాల మొండు డా
సిన నట గోచరించె రఘు•శేఖరునాశ్రమధూమమూలముల్. ౨౨౧౭

వాగ్మిశేఖరుఁడు=చక్కఁగ మాటలాడువారిలో శ్రేష్ఠుఁడు.శ్రీరాముని సన్నిధానమునఁ దాను మాటలాడవలసిన విధము శ్రీరాముని ప్రశ్నలకుఁ దాను ప్రత్యుత్తరము చెప్పవలసినవిధ మిదియంతయుఁ జక్కఁగ నాలోచించుచుఁ బోవుచున్నాఁడని దీనిచే సూచితము. చారుసుమాగ్రము=అందమైనపూలు కొనల యందుఁగలది, శైలసంజనితనగాళి మధ్యమునన్=కొండయందుఁబుట్టిన చెట్ల నడుమ, సాలము=వృక్షము, డాసినన్=సమీపింపఁగా, గోచరించెన్=కానవచ్చెను, రఘుశేఖరు=శ్రీరామచంద్రుని, ఆశ్రమధూమమూలముల్ = ఆశ్రమమునుండి వెలువడు మొదలు (క్రిందిభాగము) ఇంతవఱకుఁ బొగకొననుఁజూచి దానికి సూటిగఁ బోవుచుండిరి. ఇప్పుడు పొగ యడుగుభాగమును జూచినవారైరి. ఇట్లనుటచే నిది యాశ్రమసమీప ప్రదేశముగను బయలుగాను నుండవలెను.

తా త్ప ర్య ము

ఈ ప్రకారముచెప్పి భరతుఁడాయడవియందుఁ బాదచారియై పోవుచుఁ దనలోఁదాను శ్రీరామునిఁ దాను బ్రార్థింపవలసిన విధము ఆయన చెప్పఁబోవు ప్రత్యుత్తరము దాను దానికిఁ జెప్పవలసిన విషయ మివియన్నియు నాలోచించుచుఁ బూచిన కొనకొమ్మలు గలిగి కొండయందుఁబుట్టిన చెట్లనడుమఁ బోవుచు నొకచెట్టు నొద్దకుఁబోఁగా నచ్చటికి శ్రీరాము నాశ్రమమందుండెడి పొగ యడుగు భాగము కానిపించెను.

కం. శ్రీరాముఁ డచట నుండు ప్రకారము భరతుం డెఱింగి•కడలీఁదునరుం
డారఁగఁ బారముఁ గనిన ట,పారముదమ్మును వహించె•బంధుయుతుండై.

కడలి=సముద్రము, పారము=గట్టు, అపారముదమ్ము = అంతములేని సంతోషము, బంధుయుతుండై=బంధువులతోఁ గూడినవాఁడై.

తా త్ప ర్య ము

ఆ పొగవెడలు ప్రదేశమునందు శ్రీరాముఁడున్న విధము భరతుఁడు తెలిసికొని సముద్రము నీఁదువాఁ డొడ్డుచేరినట్లు చుట్టములతో మిగుల సంతోషించెను.

—• ౯౯-వ సర్గము. భరతుండు రామాశ్రమమును జూచుట. •—

చం. అనఘచరిత్రు లచ్చటిమ•హాత్ములు రామునియాశ్రమం బదే
యనఁ దనతోడిసైన్యముల•నచ్చట నిల్పి గుహుండు వెంట రాఁ
జనె గురువత్సలుండును వె•సన్ మునుమున్న వసిష్ఠుఁ బంచెఁ జ
య్యనఁ దనయెల్లతల్లులను•నచ్చటికిం దొడితేర, సీఁగతిన్. ౨౨౧౨

పూర్వము (౨౧౪౦ ప.) భరద్వాజాచార్య వాక్యమునందు శ్రద్ధయుంచి తదుపదిష్టమార్గంబునఁ బోవ ననుమానచిహ్నము (పొగ) కానవచ్చెను. ఆ యనుమానప్రమాణము నాధారము చేసికొని దానియందు దృష్టిచెదరనీక పోవఁగాఁ బ్రాప్యవస్తు సమీపమునకుఁ దీసికొనపోవును. అప్పుడచ్చట భగవత్సాక్షాత్కారముగల భాగవతులీజిజ్ఞాసువునకు (ఆరురుక్షునకు) భగవన్నివేశనమును జూపి యందు భగవంతుఁడుండుట సత్యమని స్వానుభవముచేఁజెప్పుదురు. ఆవల భగవత్సాక్షాత్కారమగును. ఈ విషయ మీక్రిందిపద్యమువలనఁ దెలియనగు మీఁదఁ జెప్పిన విషయములన్నియుఁ బ్రత్యారురుక్షుఁడగు భక్తునకు ననుభవసిద్ధంబులే.

అనఘచరిత్రులు=పాపరహితమైన నడవడిగలవారు, మహాత్ములు, ఆత్మ, ఆత్మాయత్న ధృతిస్వాంతస్వభావ పరమాత్మను జీవబుద్ధి శరీరేషు" నానా. ర. "నాయమాత్మా బలహీనేన లభ్యో నచ ప్రమాదాత్ తపసో వాప్యలింగా" త్తను శ్రుతివచనము ప్రమాణము. మహాధైర్యము, అప్రమాదమైన మహాప్రయత్నము, గొప్పస్వభావము, గొప్పబుద్ధిగలవారు. ఇంతటివారు గనుకనే భగవంతుఁడగు శ్రీసీతారాముల యాశ్రమమును ‑భక్తి భరతుఁడైన భరతునకుఁ జూపఁగలిగినారు. తనతోడి సైన్యములన్=తనవెంటవచ్చిన సేనలను, గురువత్సలుండును=గురుభక్తిగలవాఁడు. గురుభక్తి లేనివానికి భగవద్విషయమే బోధపడదు. ఇఁక భగవత్సాక్షాత్కార మెక్కడిది? "యస్యదేవే పరాభక్తి ర్యథాదేవే తథాగురౌ। ఏతత్తే కథితాహ్యర్థాః ప్రకాశంతే మహాత్మనః॥ శ్వేతాశ్వ॥ మహాత్ముఁడగు గురువు వసిష్ఠుఁడు వెంటవచ్చిన కారణమున నితఁడు యోగ్యుఁడని గ్రహించి మహాత్ములు రామాశ్రమమును భరతునకుఁ జూపిరి. ఇంతవఱకు గురుకార్యమే. తొడితేరన్=తోడుకొని వచ్చుటకు, గురుని యోగ్యతనుబట్టి శిష్యుని యోగ్యత దెలియవచ్చును. గుహుండు వెంటరాన్ పశుర్మనుష్యః పక్షీవా యేచ వైష్ణవ సంశ్రయాః। తేనైవతే ప్రయాస్యంతి, తద్విష్ణోః పరమంపదమ్మన్నట్టు భాగవతు నాశ్రయించినవారు వాఁడుపోయిన విష్ణులోకమునకుఁబోదురు అనునది యిచ్చట ననుసంధించునది.

తనయెల్ల తల్లులను దొడితేర వసిష్ఠుఁ బంచె ననుటచే నేను రామాశ్రమము నునికి నిశ్చయపఱుచుకొని మీకుఁ జెప్పిపంపెదను. అంతవఱకు మీరిందే నిలువుండని వారిని నిలిపి వచ్చెనని యేర్పడుచున్నది.

తాత్పర్యము

అచటనుండిన పాపరహితులైన మహాత్ములు భరతునకు రామాశ్రమమిదే. అందు శ్రీరాముఁడు సీతాలక్ష్మణసహితుఁడై యున్నాఁడని తెలుపఁగా గురుభక్తిగల భరతుఁడు వసిష్ఠునితో మీరు తల్లులనందఱఁ బిలుచుకొని రండని చెప్పిపంపి

గుహుఁడు తనవెంట రాఁగా రామాశ్రమమువైపు పోయెను. గురువు వచ్చువఱకుఁ గాచియుండినవాఁడుగాఁడు. అచ్చటనుండి యన్వేషణసమర్థులు గురువు సాహాయ్యమక్కఱలేకయే స్వతంత్రించి పోవఁగలరు. స్వసామర్థ్యములేక గురువుపై నాధారపడియుండు వారిని గురువే భగవత్సన్నిధానమునకుఁ దోడు కొని పోవలెను. ఈవిధముగా.

కం. చనునెడ సీతాధవద,ర్శనకాంక్షను భరతునకును • సముఁడు సుమంత్రుం
డును దాపునంద శత్రు,ఘ్నుని నెద్దికొనంగఁ గైక • కొడు కనుజునకున్.

చనునెడన్=పోవుసమయమందు, సీతాధవదర్శనకాంక్షను = శ్రీరాముని దర్శించి కోరికయందు, దాపునంద=సమీపమందే, ఎద్దికొనంగన్=కలిసికొనఁగా.

తాత్పర్యము

౨-౨౦౫-వ పద్యమునఁ జెప్పఁబడిన ప్రకారము భరతుఁడు వసిష్ఠునితో నొక ప్రక్క వెదకఁబోయెను. శత్రుఘ్న సుమంత్రులు మఱియొకప్రక్క వెదకఁబోయిరి. భరతునకు రామాశ్రమము నునికి నిశ్చయముగాఁ దెలిసినవార్త రాఁగానే శత్రుఘ్నుఁడు భరతునిఁ గలిసికొనెను. శ్రీరామదర్శనమందు భరతునంత కోరికగల సుమంత్రుఁడును వచ్చి శత్రుఘ్నునిఁ గలిసికొనెను. శత్రుఘ్నుఁ గలిసికొనెనను టచే భరతుఁడు ముందడుగు శత్రుఘ్నుఁడు వెనుకడుగుగాఁ బోవుచుండి రనియుఁ బెద్దవారితో సమానముగఁ బోరాదు. గావున భరతునివెనుక శత్రుఘ్నుఁడు శత్రుఘ్న వెనుక సుమంత్రుఁడు నుండిరని తెలియవలెను.

తే. తాపసాగారనిచయమ • ధ్యంబునందు
నున్నరామాశ్రమముఁ జూపు • నుద్దవిడిని
నరుగుచును దూరమున నున్న • యగ్రభవుని
యాకుటిల్లును నుటజంబు • నారఁ గనియె. ౨-౨౧౯

తాపసాగారనిచయ మధ్యంబునందున్=తాపసులయిండ్ల సమూహముల నడుమ, ఉద్దవిడిని=శీఘ్రముగ, అగ్రభవుని=అన్నయగు రామచంద్రునియొక్క, ఆకుటిల్లును=అన్నిగృహముగు పర్ణశాలను, ఇది పవిత్రస్థలము దీనిలోనికి శుచులు పోవలయునేకాని యెప్పుడనినపు డెవరనినవారు పోరాదు. కనుక నది ప్రత్యేక ప్రదేశము. ఉటజము=తన్నుఁజూడవచ్చిన ఋషులతోఁ గూర్చుండి మాటలాడుట కనుకూలమగు పర్ణశాల. (1) అగ్రభవుని యాకుటిల్లు = సీతయు శ్రీరాముఁడు రాత్రిపరుండు పర్ణశాల, (2) ఉటజము=పగటివేళనుండు నిల్లు. (3)ఆకుటిల్లు= పెద్ద యిల్లు, ఉటజము=దానినడుమనుండు నిల్లు, ఆరన్ = బాగుగ.

తాత్పర్యము

తాపసుల యిండ్లనడుమనున్న రామాశ్రమమును శత్రుఘ్నునకుఁ జూపుచుఁ దొందరగాఁబోవుచు దూరముననున్న యన్న యాకుటింటిని నుటజమును బాగుగఁ జూచెను.

కం. తెఱపను నుటజమునకు ముం,దఱఁ బూజార్థంబు పుష్ప•తతులుం జీఁక
ట్లలిమిన మంటలు వేయఁగ,
విఱిచినకట్టియలుఁ గాంచి•వీరుఁడు చనుచున్. ౨౨౦
తెఱపను=బయల, అలిమినన్=క్రమ్ముకొనఁగా.

తాత్పర్యము.

పర్ణశాలముందు బయటియందు దేవపూజార్థము పూల సమూహములను చీఁకట్లు వ్యాపించినపుడు మంటవేయ నుపయోగించుటకై విఱిచి సిద్ధముగా నుంచిన కట్టియలును జూచుచుఁబోయి.

తే. రామలక్ష్మణులందుస్వా•శ్రమము తెరువు,
గుఱుతు తెలియంగనందంద•గుర్తులుగను
జెట్లకొనకొమ్మలను కుశ•చీరములను,
గట్టియుండుట గనుఁగొనెఁ•గైకసుతుఁడు. ౨౨౧
స్వాశ్రమము తెరువు = ఏటినుండియో, యడవినుండియో నీటికిఁ గంద మూలాదులకుఁ బోయినపుడు మరలి చక్కఁగాఁ దమయాశ్రమమునకు వచ్చుటకై మార్గము. కుశచీరములును=దర్భలును నారచీరలును.

తాత్పర్యము

ఏటికి నీళ్ళకు నడవికిఁ గందమూలాదులకుఁ బోయి మరల సూటిగాఁ దమ యాశ్రమమునకు వచ్చుటకై మార్గము తెలియుటకుఁగాను జెట్లకొనకొమ్మలందు దర్భలు నారచీరలు కట్టఁబడి యుండుటను భరతుఁడుచూచి యీ త్రోవనే మనము పోవచ్చునని తలఁచెను.

కం. అడవుల మృగముల దున్నల,పిడకలఁ జలికాఁచుకొనఁగ•విడి కుప్పలుగా
నిడినవి చూచుచు సంతస,పడుచు నమాత్యునకుఁ దనదు•భ్రాతకు ననియెన్. [౨౨౨

తాత్పర్యము

చలివేళ దేహము కాచుకొనుటకై మంటవేసికొనుటకుఁ గావలసిన యడవి మృగములవియు దున్నపోతులవియు నెండిన పేఁడకళ్ళుతెచ్చి కుప్పలుగా నుంచినవి చూచుచు సమీపమునకు వచ్చితిమిగదా యని సంతోషించుచు భరతుఁడు సుమంత్రునకు శత్రుఘ్నునకు నిట్లనియెను.

కం మనకు భరద్వాజుం డా,డినదేశం బిదిగఁ దోఁచెఁ•డిన్ నది మందా
కిని యిటకు ననతిదూరం,బున నుండఁగ నోపు నన్న•పొలిచెడి నిచటన్.
ఆడిన=చెప్పిన, అనతిదూరంబునన్=కొంచెముదూరమునందు, పొలిచెడిన్=ఉన్నాఁడు.

తాత్పర్యము

మనకు భరద్వాజుఁడు గుర్తుచెప్పినప్రదేశ మిదియేయని తోఁచుచున్నది. ఇచ్చటికి సమీపమందే మందాకిని యుండవలయును. ఈప్రదేశమందే యన్నయు నున్నాఁడు.

ఉ. ఎత్తునఁ గట్టియున్నయవి ♦ వృక్షములం దవె నారపేలికల్
చిత్తమునందుఁ జూడ వన ♦ సీమలనుండి యకాలమందు న
త్యుత్తమశీలి లక్ష్మణుఁడు ♦ నొయ్యనఁ గ్రమ్మఱుచోట గుర్తుగా
నిత్తెఱఁ గాచరించె నని ♦ యెంచెదఁ దమ్ముఁడ! చూడు మియ్యెడన్.

తాత్పర్యము

తమ్ముఁడా! చెట్లయందు నెత్తుగనున్నచోట నారచీరలపేలికలు గట్టఁబడి యున్నవి. తానకాల వికాల సాయంకాలమందు నడవులనుండి మరలివచ్చునపుడు త్రోవతెలియుటకై యుత్తమస్వభావముగల లక్ష్మణుఁడు గుర్తుగాఁ గట్టెనని తలఁచెదను. ఈదారినే మనము పోవచ్చును.

కం. దంతాదంతిరణంబుగ, దంతులు పోరాడికొనుచు ♦ దారుణభంగిన్
దాంతి గన కాశ్రమంబున,ప్రాంతంబునఁ జనియె లోని♦కరుగఁగ రామిన్.

చెట్లమీఁది గుర్తులుచూచుచుఁ బోనేల నేలకాలియడుగులజాడఁ జూచుచుఁ బోరాదా యనిన నేనుఁగులు మృగములు త్రొక్కుటచే నవి మాసినవని చెప్పుచున్నాఁడు.

దంతాదంతిరణంబుగన్ = ఒకదానినొకటి కొమ్ములతోఁ గ్రుమ్మిచేయు యుద్ధము. ఇది వ్యతిహారలక్షణ బహువ్రీహి. వ్యతిహారమనఁగాఁ దనవిషయమం దొకఁడేవిధముగ వర్తించునో యట్టులే యతనియందుఁ దాను వర్తించుట, దంతులు=ఏనుఁగులు, దాంతి=ఓర్పు.

తాత్పర్యము

ఏనుఁగు లొకదానినొకటిఁ గొమ్ములతోఁ గ్రుమ్మి భయంకరముగఁ గలహించుచు నోర్పులేక యాశ్రమములోనికిఁబోవ వలనుపడమి దానిప్రక్కనఁబోయెను.

కం. సాయంప్రాతర్హోమము,కై యేయగ్నులను ఋషులు ♦ కలకాలంబున్
బాయక రక్షింతురు త,ద్వ్యాయతధూమంబు నిబిడ ♦ మై తనరెనదో.

సాయం=సాయంకాలమందలివి, ప్రాతః=ఉదయమువి, కలకాలంబున్= సర్వదా, తద్వ్యాయత=తత్=దానియొక్క, వ్యాయత=విశేషముదూరముగల, నిబిడము=దట్టము.

ఈయగ్ని వంటకనుకూలముగు నగ్నికాదు. హోమాగ్నియుఁగాదు. ఇది సదా యుండెడి గార్హ్యపత్యాగ్ని యని నిబిడమై యనుపదము సూచించును. వంటనిప్పునందు మంట విశేషించి యుండునుగానఁ బొగ విశేషించియుండదు. హోమమునకుఁ గావలసినది కణకణమను నిప్పులు. దానియందుఁ బొగ విశేషించి యుండదు. శ్రీరాముఁడుంచుకొన్న యాయగ్ని దార్వాగ్నియే. ఈయన యగ్న్యాధానము చేయలేదు కాన నీదార్వాగ్ని శ్రౌతాగ్నికాదు. ఇది శ్రౌతాగ్ని యైనచోఁ బట్టమునుండి వచ్చునపుడు తెచ్చియుండవలెను అట్లాయగ్నిని దేలేదు. ఈయన రాజ్యపాలన కాలమందు శ్రౌతాగ్ని యుండుటచేతనేకదా యుత్తర

కాండమున మహాప్రస్థానము పోవునపుడు వెంటఁబెట్టుకొనిపోయెను. "రామః కమలపత్రాక్షః పురోధ సమథాబ్రవీత్ । అగ్నిహోత్రంవ్రజ త్వగ్రే సర్పిర్జ్వలిత పావక" మ్మని యీ ప్రకరణమున నున్నది. మఱియు శ్రౌతాగ్నిగల పట్టనము లోని బ్రాహ్మణులందఱు (తమ యగ్నులను దోడఁదెచ్చిరిగదా. మఱియు "దీక్షితుని వ్రతసంపన్ను దివ్యతేజు । సజినధరు శుచి నిన్ను నే హరిణ శృంగ । హస్తు నినునేను భజియింప నాశ్రయింతు" అని సీత (౪౭౦-వ ప.) చెప్పెను. కావున రాజ్యాభిషేకమునకుఁ బూర్వము శ్రీరాముడు యజ్ఞాదులఁ జేయలేదు. అని యేర్పడుచున్నది. అట్లుండఁగా యజ్ఞము చేసినవారుంచుకోఁదగిన శ్రౌతాగ్ని శ్రీరామున కిపుడు రాఁజాలదు. కావున నిది స్మార్తాగ్నియే. ఇది యెప్పటికప్పు డచ్చటనచ్చట నేర్పాటుచేసికో వలసినదే కాని సర్వత్ర సర్వదా కూడఁదీసికొని పోవలసినదికాదు. ఎచ్చట నీయగ్నిని ముగింతునో యచ్చట దాని నాత్మారోపణ చేసికొని స్థలాంతరమున మరలఁ బుట్టింపవలెను. శ్రీరాముఁ డొకచో నొకదినముండెనేని యచ్చట నప్పుడగ్నిని నావాహనముచేసి హోమము కాఁగానే యాత్మారోపణము చేసికొనును. కొన్ని స్థలములందు నెలలకొలఁదియు సంవత్సరముల కొలఁదియు నుండెనేని యచట దార్వాగ్నిగానే యుంచుకొనును. ఇది స్మార్తాగ్నియైనను నిందు సాయంప్రాతర్హోమము తప్పరాదు. శ్రీరాముఁడు తమసా గంగా తీరాదులయందు హోమముచేసినట్లు కవి చెప్ప లేదనరాదు. ఒక ప్రయోజనమున్నప్పుడే యొకవిషయమును జెప్పును గాని యట్టిప్రయోజనము లేనప్పు డావిషయము ప్రస్తావింపఁడు. పూర్వోక్త స్థలములందుఁ బ్రయోజనములేదుగానఁ జెప్పలేదు. "అథతేగ్నిం సురాంశ్చైవ వైదేహీ రామ లక్ష్మణౌ । కాల్యం విధివదభ్యర్చ్య తపస్విశరణేవనే ॥ ఉదయంతం దిన కరం దృష్ట్వా విగతకల్మషాః । సుతీక్ష్ణ మభిగమ్యైవ మిదంవచన మబ్రువన్' అని సుతీక్ష్ణాశ్రమ ఘట్టమునఁ జెప్పఁబడును. అచ్చటఁ జెప్పుటకొక ప్రయోజన మున్నది. సూర్యోదయమునకుఁ బూర్వమౌపాసనము చేయవచ్చునని కొందఱి పక్షము, మఱికొందఱు సూర్యోదయానంతరమే చేయవలయునని, యిట్లు రెండుపక్షములు గలవు. ఆరెంటిలో మొదటిది సమ్మతమని తెలుపుటకై యచ్చట నౌపాసనము ప్రస్తావించెను. ఇట్లేవిషయమైన నొకప్రయోజనమున్న ప్పుడే కవి చెప్పును. అన్యత్ర చెప్పఁడు. ఆమాత్రమున నిచటఁ జెప్పిన యగ్ని పచనాగ్నిగాఁ జెప్పుట సరిగాదు. కావున వనవాసకాలమున శ్రీరాముఁడు సీత తనయొద్ద నున్నంతవఱకు నౌపాసనము చేయుచునేవచ్చెను. ఒక దినమైనను వదలలేదు. స్థిరముగా నుండుకొనుట స్థలముల ననుసరించి యుండెను. దీనిచే రామాశ్రమమునకు గుర్తుచెప్పుటయేకాక యది పావనమనియు సూచితము.

కం. పురుషవ్యాఘ్రుని రాముని, గురుతరసంస్కారకరునిఁ • గోవిదవర్యున్
బరమర్షిఁ బోలె నిం దే, నరుసంబునఁ గాంచువాఁడ•నకలుషచరితా. ౨౨౭

గురుతరసంస్కారకరునిన్=మిక్కిలి గొప్పదగు మంత్రోపదేశము (విశ్వామిత్రుఁడు నేర్పిన యస్త్రమంత్రములను) మొదలగువానిని జేసినవానిని, కోవిదవర్యున్=పండితశ్రేష్ఠుని.

తాత్పర్యము

పురుషశ్రేష్ఠుఁడును నాకుగొప్ప యస్త్రమంత్రాదుల నేర్పినవాఁడును పండిత శ్రేష్ఠుఁడును నగు శ్రీరామచంద్రుని మహర్షివలె నిందుండఁగా నేను సంతోషముతోఁ జూడఁగలను.

కం. అని కొండికదూరంబుం, జని మందాకినిని గాంచి • సహచరతతితో
నను భరతుఁడు చింతాభర,వినతాననుఁ డగుచు నీరు•వెడలం గనులన్.

కొండిక=ఒకకొంత, కొంచెము, సహచరతతితోన్=కూడవచ్చువారి సమూహముతో, చింతాభర=చింతయొక్క యతిశయముచే, వినత = వంగిన, ఆననుఁడై=ముఖముగలవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారముచెప్పి మఱికొంతదూరముపోయి మందాకిని జూచి భరతుఁడు శోకభారముచే వంగినముఖము గలవాఁడై కన్నులనుండి నీరుగాఱఁ గూడ వచ్చువారితో నిట్లనియెను.

కం. క్షితిపతి వీరాసనసు,స్థితుఁడై రహిమీఱు పురుష•సింహుఁడు సీతా
పతి నిర్జనవని నుండెడి, హతకుఁడ నాజన్మ మేల•ప్రాణము లేలా. ౨౨౯

క్షితిపతి=రాజు, వీరాసనసుస్థితుఁడై = కుడితొడపై నెడమ పాదముంచి కూర్చుండినవాఁడు, నిర్జనవనిన్=మనుష్యులులేని యడవియందు, హతకుఁడన్=పాడై పోయినవాఁడను.

తాత్పర్యము

భూమికంతయు నధిపతియై సీతకు భర్తయై వీరాసనమున దున్నవాఁడై ప్రకాశించు పురుషశ్రేష్ఠుఁడు జనులులేని యడవియందున్నవాఁడు ఇహమునఁ బరమునఁ జెడి భూమిపైఁ బుట్టనేల పుట్టితినిబో వెంటనే చావక బ్రతుకనేల.

సీ. అక్కటా నాకయి•యఖిలసౌఖ్యంబులఁ, బోనాడి వనముల•లోనఁ బడియెఁ
జగతీశుఁ డౌ రామ•చంద్రుఁ డంచనియెడి,యపకీర్తి జగ మెల్ల•నావరించె
రాముపాదంబుల•వ్రాలి సీతకు లక్ష్మ,ణునకు మ్రొక్కెద•మనసు దీఱ
ననుచు వాపోవుచు • నరుగుచు సాలతా,లాశ్వకర్ణచ్ఛదా•శ్యావృత మయి

తే. విరివి యవుదానిఁ గుశలచే♦వేదివోలె, నంద మవుదాని భూరిశ♦క్రాయుధాభ
భారసాధనశాత్రవ♦భయదచాప,రాజిచేతను మెఱుఁగులు♦గ్రక్కుదాని.

పోనాడి=వదలి, లక్ష్మణునకును, మ్రొక్కెదను=నేను శ్రీరామునిపాదముల మీఁదఁబడి నన్నుమన్నింపఁ బ్రార్థింపఁగా లక్ష్మణుఁడు కైకచేసిన యపరాధమును శ్రీరామచంద్రునికిఁజెప్పి యాయన నన్నుఁ గరుణింపకుండునట్లు చేసె నేని యపుడు లక్ష్మణునకును నమస్కరించెదను. రోగమునకుఁ దగినమందు తిన వలసినదే. నిష్కారణముగ వారియెడ నింతయపరాధమొనర్చి లోకమున శాశ్వతమైన మహాపకీర్తి సంభవించిన నాకు దానిని బోఁగొట్టుకొనుటకై యేమిచేసిన నేమితప్పు. మనసుదేఱన్=మనసు నిష్కళంకమగుటకు, వాపోవుచున్=ఏడ్చుచు, సాల=మద్దిచెట్లయొక్కయు, తాల=శ్రీతాల వృక్షములయు, అశ్వకర్ణ=ఇనుమద్ది యొక్కయు, ఛద=ఆకులయొక్క, ఆళి=సమూహములచే, ఆవృతము=కట్టఁబడి నది, భూరి=గొప్పదియగు, శక్రాయుధాభ=ఇంద్రచాపముతో సమానమైన,భార సాధన=(1) శతపలమనెడి వింటి కొలఁతప్రకారము సాధింపఁబడినదియు, భార మనునది వింటికొలఁతయందలి భేదము. ధనుర్వేదమున నీశానసంహితయందు "భారం పలశతంవిదుః, తేనభారేణ చాపానాం ప్రమాణముపలభ్యతే" యని కలదు. (2) గొప్పకార్యము సాధించునదియును, కావున భయద=శత్రువులకు భయము గలిగించునవియగు, చాపరాజి=విండ్ల సమూహముచేతను.

తా త్ప ర్య ము.

అయ్యయ్యో! నానిమిత్తమై సౌఖ్యములనెల్ల వదలి ప్రపంచమునకెల్ల నధిపతియగు శ్రీరామచంద్రుఁ డడవులపాలాయెనని యెడి యపకీర్తి లోకమునం దంతయు వ్యాపించెను. ఆముఖ్యవిషయంబున నేనపరాధినే కావున మా యన్నకు పదినెకు మ్రొక్కుటయేగాక లక్ష్మణునకును మ్రొక్కెదను. ఆయన నీకంటెఁ జిన్నవాఁడుకదా నీవాయనకు మ్రొక్కవచ్చునా? యందురేని శ్రీరాముని పాదములపైపడి నమస్కరించి నన్ను క్షమింపఁ బ్రార్థించినపుడు కైక చేసిన యపరాధమును స్మృతికిఁ దెచ్చి వీఁడు క్షమింపఁ దగినవాఁడుకాఁడు వీని క్షమింపవలదని లక్ష్మణుఁడు చెప్పునేని యప్పుడాయనను బ్రసన్నునిజేయుటకై యాయనకును నమస్కరించెదను.అట్లుచేయనైతినేని యాయన నానిమిత్తముగఁ బడెడిదుఃఖమున కేది సంహారము. ఉపచారముమాటలు చాలినంత ప్రాయశ్చిత్తముకాదు. అని యేడ్చుచుఁ బోవుచు మద్ది శ్రీతాల మినుమద్ది వృక్షముల యాకులచేఁ గప్పఁబడి విశాలమై దర్భలచే వేదివలె నందమయి పెద్ద యింద్ర ధనుస్సుతో సమానమైన శత్రుభయంకరమైన విండ్లచే మెఱుఁగులు గ్రక్కుచు.

తే. అర్కరశ్మిప్రతీకాశ♦మగుచుఁ జూడ, దిగులు గొల్పుచుఁ దూణుల♦దీప్తవదన
మగుచు శోభింపశరతతి♦యహులచేత,
భోగవతినాఁగ నెంతయుఁ♦బొలుచుదాని. ౨౨౩౧

అర్కరశ్మిప్రతీకాశమగుచున్ = సూర్యకాంతితో సమానమగుచు, తూణప్రదీప్తవదనమగుచున్ = అంబులపొదులచే మండుచున్న నోరుగలదియగుచు, శోభింపన్=ప్రకాశింపఁగా, శరతతియహులచేన్ = బాణముల సమూహమనెడి పాములచేత, భోగవతి=వాసుకిముఖ్యపట్టనము,

తాత్పర్యము

సూర్యకిరణములతో సమానమై చూచుటకు భయంకరమై యంబుల పొదులచే మండుచున్న నోరుగలదై ప్రకాశింపఁగా బాణసమూహములనెడి పాములచేత భోగవతీపురమువలె నొప్పుచుండుదానిని.

ఆ. పసిఁడి యొఱలతోడఁ • బసమీఱుకరవాల, సంచయంబుచేత • జాతరూప
బిందుతతులచేత • సుందరం బగుఫల,కములచేతఁ దేజ • రిల్లుదాని.

కరవాలసంచయము = కత్తులగుంపు, జాతరూపబిందు తతులచేతన్ = బంగారుచుక్కలచేత.

తాత్పర్యము

బంగారు గవిసెనలచేఁ బ్రకాశించు కత్తుల సమూహముచేతను సుందరమగు కడెములచేఁ దేజస్సుగలదియగు దానిని.

తే. కాంచనాభరణాదిస•ముంచితంబు,లై నగోధాంగుళీత్రాళి • యమలకాంతు
లమరుదానిని సింహగ•హ్వర మనంగఁ,
బగఱకును నప్రధృష్యమై • పరఁగుదాని. ౨౩౩

కాంచనాభరణాది సముచితంబు = బంగారు సొమ్ములచేఁ బ్రకాశించునదియు, గోధాంగుళిత్రాళి = ఉడుముచర్మముచేఁ జేయఁబడినదియై వ్రేళ్ళను రక్షించుదానియొక్క, అమలకాంతులు=నిర్మలమైనకాంతులు, సింహగహ్వరము =సింహముల గుహయో యన్నట్లు, పగఱకున్=శత్రువులకును, అప్రధృష్యమై =చెడఁగొట్టరానిదై.

తాత్పర్యము

బంగారుసొమ్ములచే నలంకరింపఁబడిన వ్రేళ్ళురక్షించుటకై తొడుగుకొను నుడుముచర్మముతోఁ జేయఁబడిన తిత్తులుగలదై నిర్మలకాంతులుగలిగి సింహముండు గుహవలెఁ బగవారికి ధిక్కరింపరానిదై

తే. ప్రాగుదగ్భాగనిమ్నమై • ప్రజ్వలద్ధు, తాశనం బగు వేదిచే • నతిమనోహ
రంబు నవుదానిఁ బుణ్య మౌ•రాముఁ డున్న,
పర్ణశాలను గాంచె నా•వరగుణుండు. ౨౩౪

ప్రాగుదగ్భాగ నిమ్నమై=తూరుపు, ఉత్తరము అనఁగా నీశాన్యమూల యెత్తై ప్రజ్వలత్=ప్రకాశించుచున్న, హుతాశనంబు=అగ్నిహోత్రముగల వేదిచేత, అతిమనోహరము=మిగుల మనస్సునాకర్షించునది, వరగుణుండు=శ్రేష్ఠమగు గుణములు గలవాఁడు.

తాత్పర్యము

ఈశాన్యమూల యెత్తైమండుచున్న యగ్నిహోత్రముగల వేదిచే మిగుల నందమై ముఖ్యమైన శ్రీరాముఁడున్న పర్ణశాలను శ్రేష్ఠములగు గుణములుగల భరతుఁడు చూచెను.

—• భరతుఁడు శ్రీరాముని దర్శించుట •—

కం. నిండుతమిఁ గొంతవడి భర తుం డారఁగఁ గాంచి తెలిసెఁ • దోరంపుజటా
మండలితో నుటజాసీ,నుం డగు శ్రీరాము నన్న,నున్ ధీరగుణున్. ౨౯

నిండుతమిన్=సంపూర్ణమైన యభిలాషతో, కొంతవడి=కొంచెముకాలము, ఆరఁగన్=బాగుగ, తోరంపుజటామండలితోన్=విస్తారమైనజడలగుంపులతో, ఉటజాసీనుండు = ఆకులయింటియందుఁ గూర్చుండినవాఁడు, ధీరగుణున్ = ధైర్యవంతుని.

తాత్పర్యము

అన్నను జూడవలయునను నిండుకోరికతో నీకానవచ్చువాఁ డన్నయగునా కాఁడా? యని కొంతసేపు చక్కఁగాఁజూచి జడలగుంపుతోఁ బర్ణశాలయందుఁ గూర్చుండిన తనయన్నను శ్రీరామునిఁ దన్నుఁజూచి సంతోషముగాని కోపము గాని వ్యసనముగాని లేనివానిని జూచి యితఁడే మాయన్న శ్రీరామచంద్రుఁ డని గుర్తించెను.

సీ. కృష్ణాజినం బుత్తరీయంబు గాఁ జీర,వల్కలంబులు గట్టు,వస్త్రములుగఁ
బావకనిభుఁ డయి•భాసిల్లు చాసీనుఁ, డగుమహాబాహుఁ గం•జాయతాక్షుఁ
జతురబ్ధివలయిత•క్ష్మామండలేశు సిం,హస్కంధు ధర్మని•త్యానురక్తు
జానకీలక్ష్మణ•సహితుఁ డై దర్భసం, స్తరణంబుమీఁదను•పరఁపు మీఱ
తే. శాశ్వతబ్రహ్మవై ఖరి•జాను మిగులు, రాముఁ గని పరువెత్తి చేఁ•రంగఁ బోయి
చూచినంతన యేడ్చుచు•శోకబాష్ప,వారి సందిగ్ధవచనుఁడై•పలికె నిట్లు.

భరతుఁడు చూచునప్పటికి శ్రీరాముఁడున్నస్థితి కవి వర్ణించుచున్నాఁడు.

ఉత్తరీయము=పైవస్త్రము, చీరవల్కలంబులు=వస్త్రములుగా ధరింపఁబడిన నారపట్టలు రెండుమూఁడు కలిపినఁగాని నడుముచుట్టు తిరిగిరాదు. కనుక బహువచనము. ఇదివఱకు మహార్హవసనోపేతుఁడు దానికంటె విలక్షణవేషమిది. దానిని జెప్పుచున్నాఁడు, మునుపటివేషముకంటె దీనియందు శోభావిశేషము గలదని చెప్పుచున్నాఁడు. పావకనిభుఁడయి=(1) అటువంటి తపస్సుచేఁగలిగిన పూర్ణతేజోవిశేషముచేఁ జుట్టఁబడినవాఁడు 1 మహార్హవసనోపేతుఁడై యుండినప్పుడు నివురుగప్పిన నిప్పువలె వస్త్రములచే దేహమంతయుఁ గప్పఁబడి యుండుటచే నైజదేహ తేజస్సు మఱుఁగుపడియుండెను. ఇప్పుడా ముసుఁగులు లేమిని మండెడుమంటవలెఁ గానవచ్చుచున్నాఁడు 'నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ

భాస్వరా' విద్యుల్లేఖ సఘమునందుఁ బ్రకాశించు నల్ల మేఘమువలె ననియర్థము. అంచులయందు మెఱుపు. నడుమ మేఘమున్నట్టులని యర్థము. (2) శత్రువులకు సమీపింపనురానివాఁడు (3) తేఱిచూచుటకు సాధ్యపడనివాఁడు కనుకనే భరతుఁడు గుర్తింప నాలస్యమయ్యెను. ఆసీనుఁడు=ఆసనమునఁ గూర్చుండినవాఁడు. అయోధ్యాపురమందలి సభాభవనము కంటె నిదిచిన్నదయ్యెను నీయుటజసభ గొప్పది ఏలనః- ఆసభయందు నెవరైనను సమీపించు చుండిరి. ఇచ్చటనో తమ్ములుగూడ సమీపింపరానివారై యున్నారు. మండెడు మహాగ్నినెవఁడు సమీపించును? మహాబాహున్=నిడుపాటి చేతులు గలవానిని, కంజాయతాక్షున్=కమలములవలె దీర్ఘమైన కన్నులుగలవానిని, చతురబ్ధి=నాలుగు సముద్రములచే, వలయిత=చుట్టఁబడిన, క్ష్మామండల=భూచక్రమునకు, ఈశున్=ప్రభువైనవానిని, సింహస్కంధున్=సింహము మూఁపురమువంటి మూఁపురములు గలవానిని, ధర్మనిత్యానురక్తున్=ధర్మమునందు నెడఁదెగని యనురాగముగలవానిని, దర్భసంస్తరణముమీఁదన్=దర్భాసనముపై, దరముమీఱి=రాజుదశనతిక్రమించి, శాశ్వతబ్రహ్మవైఖరిన్=అశాశ్వత చతుర్ముఖ బ్రహ్మవలెఁగాక, పరబ్రహ్మమువలె, పరబ్రహ్మమునుండువిధ మిదిగాకున్నను భక్తులకు సమయోచితమగు నాకారముతో భగవంతుఁడు దర్శనమిచ్చును గావున నీరూపముతో భరతునకు ననుగ్రహించెనని తెలియవలెను. అర్జునునకు విశ్వరూపముఁ జూపినట్లు భగవంతుఁడు తనభక్తులకు సమయ యోగ్యతానుసారముగ దర్శనమిచ్చునుగాని యందఱికేకవిధముగ దర్శనమీయఁడు. జానుమీఱు=అందముచే నతిశయించు, అయోధ్య యందున్నప్పటికంటె నిప్పుడు విశేష తేజోవంతుఁడై యున్నాఁడని భావము. దీనిచే వనవాసక్లేశ మాయనను నేమియు బాధింపలేదని భావము రాత్రి చంద్రుని బాధించునా? శోకబాష్పవారి = శోకముచే రాలుచున్న కన్నీళ్ళతో, సంధిగ్ధవచనుఁడై=డగ్గుత్తికపడుటచే మాటసరిగా రామిని కొంత తెలియవచ్చి కొంత తెలియరాని మాటలతో.

తాత్పర్యము

జింకచర్మము పైవస్త్రముగా, నారచీరలు కట్టువస్త్రములుగా, నగ్నిహోత్రునితో సమానుఁడయి ప్రకాశించుచు నాసనమునఁ గూర్చుండిన యాజానుబాహుని బుండరీకాక్షుని నాలుగు సముద్రముల నడిమి భూమికంతయుఁ బ్రభువైనవానిని సింహము మూఁపురమువంటి మూఁపురములు గలవానిని ధర్మమందు శాశ్వతమైన యనురాగము గలవానిని సీతాలక్ష్మణులతోడ దర్భాసనమునఁ గూర్చుండినవానిని మునుపటికంటెఁ దేజస్సుచే నధికుఁడగువానిని శాశ్వతబ్రహ్మమువలె నుండువానిని శ్రీరామునిజూచి పరువెత్తుచు సమీపమునకుఁబోయి చూడఁగానే యేడ్చుచు శోకముచేఁ గన్నీళ్ళు రుత్తుకకడ్డపడ నెదుటివారికిఁ గొంతయర్థమై కొంత యర్థముకాని మాటలతో నిట్లు చెప్పెను.

కం. ఉన్నత సింహాసనమున, సన్నుతిఁ జేయంగ జనులు ♦ సభ నుండెడిమా
యన్నయె యిటువలె నడవుల,నున్నాఁడారణ్యమృగఖ♦గోత్కరవృతుఁడై.

ఉన్నతసింహాసనమునన్ = ఎత్తైనసింహాసనమందు, అరణ్య = అడవికి సంబంధించిన, మృగ = మృగములయొక్కయు, ఖగ = పక్షులయొక్కయు, ఉత్కర=సమూహముచే, వృతుఁడై =చుట్టఁబడినవాఁడై.

తాత్పర్యము

ఎత్తైన సింహపీఠమున లోకులందఱు స్తోత్రముచేయఁగాఁ గొలువుకూటంబుననుండు మాయన్నయా యిప్పుడీనేలమీఁద నిటువలె నడవిమృగములు పక్షులు చుట్టుకొని కర్ణకఠోరముగా నఱచుఁగా వినుచునుండువాఁడు? మాయన్నయా యిటులున్నవాఁడు? అట్టైన మాజీవితమే వ్యర్థము.

సీ. వెలలేనిదువ్వలు♦వలను దాల్చెడి మహా,మహుఁడెయీజింక చ♦ర్మము ధరించెఁ
బట్టనంబున సౌఖ్య♦పడయోగ్యుఁడగుసుకు,
మారుఁడా యడవుల♦మలయువాఁడు
వలపులు చల్లుపూ♦వులు దాల్చు సొబగుఁడా, తతజటాభారంబుఁ♦దాల్చినాఁడు
చందనచర్చల♦నందంబు మీఱునా యంగమా యీధూళి♦బ్రుంగినదియు

ఆ. మన్నిమిత్త మకట♦యిన్నిదుఃఖంబులు, సౌఖ్యపరుఁడు రామ♦చంద్రునకును
సంభవించెజగతి ♦ సడి గన్నయీక్రూరు,బ్రతుకదేల యేల♦ప్రాభవంబు.

మలయువాఁడు=తిరుగువాఁడు, వలవులు=వాసనలు, చందనచర్చలన్=గంధపుఁ బూఁతలచే, బ్రుంగినది=మునిఁగినది, సడి=అపకీర్తి, నింద, ప్రాభవంబు=ప్రభుత్వము, దుగ=దుప+వలువ=దువ్వలువ,

తాత్పర్యము

పూర్వము వెలచెప్పసాధ్యపడని సన్నని పట్టువస్త్రముల ధరించుచుండినవాఁడా యిప్పుడీ జింకచర్మము ధరించియుండువాఁడు,పట్టనములయందు నానా విధముల సుఖపడ నర్హుఁడైన కోమలదేహముగలవాఁడా యీ యడవులలోఁ దిరుగువాఁడు గుమగుమ పరిమళించు పూవులు శిరమునధరించు సుందరుఁడా యిప్పుడీజడల భారమును దాల్చినవాఁడు గంధపుఁబూఁతలచే నందమైన యీ దేహమా?యిందు నేల మట్టియందు మునిఁగియున్నది. అయ్యయ్యో! యెంతో సుఖమనుభవించు శ్రీరామచంద్రునకు నానిమిత్తముగా నిన్నిదుఃఖములు కలిగెను. ప్రపంచమున నిట్టి యపకీర్తిగన్న యీక్రూరుబ్రతుకేల? ప్రాభవమేల?

కం. సన్నుతగతి విధియుక్తిగ, జన్నంబులు సలిపి ధర్మ♦సంపన్నుఁడుగా
నున్నయతఁడా యడవుల, నిన్నె టీ మెయిగాసి ధర్మ♦మెంచెం గూర్పన్.

సన్నుతగతిన్=సజ్జనులచేత స్తోత్రము చేయఁబడినవిధముగా,విధియుక్తిగన్ శాస్త్రప్రకారము, జన్నంబులు=యజ్ఞములు,ధర్మసంపన్నుఁడు=ధర్మమేసంపద

గలవాఁడు. కానున్నవాఁడా=కాఁబోవువాఁడా. ఇట్లనుటచే నిప్పటికి నేయజ్ఞములు చేయలేదని యేర్పడుచున్నది. ఇన్నెతిన్=ఈవిధముగా, మెయిగాసిన్ = దేహ కష్టముతో, ధర్మముగూర్ప నెంచెను=ధర్మము సంపాదింపనెంచెను.

తాత్పర్యము

శాస్త్రప్రకారము సజ్జనులు మెచ్చువిధముగ యజ్ఞములుచేసి ధర్మముసంపాదింపవలసినవాఁడా యీరీతి నడవులలోఁ దిరిగి దేహశ్రమము సహించి ఋషుల మార్గమున ధర్మమార్జింపవలసినవాఁడు దేహకష్టముతోఁ గూడి కూటికి నీళ్ళకు మొగమువాఁచి దుఃఖింపవలసిన పర ధర్మమైన ఋషులమార్గమున ధర్మము సంపాదింపనెంచెను. సుకరమైన స్వధర్మానుష్ఠానమునఁ బుణ్యమార్జించుట విడిచి కష్టముతోడి పరధర్మము ననుష్ఠించుట శ్లాఘ్యముకాదని భావము.

కం. ఖిన్నుండై యిటు లేడ్చుచు,స్విన్నముఖాంభోజుఁ డగుచుఁ జేరఁగఁ జన లే
  కన్నను భరతుం డిలఁ బడె, నన్నా! యని యొండుపలుకుఁ నన లే కేమిన్.

ఖిన్నుండై=ఖేదమునొందినవాఁడై, స్విన్న ముఖాంభోజుఁడు=కన్నీటిచేఁ దడిసిన ముఖకమలము గలవాఁడు, చేరఁగఁజనలేకన్నను=అన్నను సమీపింప శక్తిలేక, ఇలన్=భూమియందు.

తాత్పర్యము

దుఃఖముచే నేడ్చుచుఁ గన్నీటిచేఁ దడిసిన ముఖకమలము గలవాఁడై డీలుపడి యన్నసమీపమునకుఁ బోలేక యడుగుపెట్టలేక యన్నా! యని యఱచి నేలఁబడెను. గాని యింకొకమాటయైనఁ జెప్పగలిగినవాఁడుకాఁడు.

కం. కన్నులనీళ్ళులు కంఠం,బు న్నెతీ మాటంగఁ గైకపుత్రుఁడు రాముున్
  గన్నెత్తి చూచి పిలిచియు, నన్నా! యని వేఱుమాటఁనన లేఁ డయ్యెన్.

తాత్పర్యము [౨౪౧

కన్నీళ్ళు కంఠమునుండి మాటరాకుండ నడ్డగింపఁగా భరతుఁడు శ్రీరామునిఁ గన్నెత్తిచూచి యన్నా! యని పిలిచెనుగాని వేఱొకమాట యనలేఁడయ్యెను.

తే. రోదనము సేయు చంత శత్రుఘ్నుఁ డన్న,
  పాదముల వ్రాలెఁ దమ్ములఁ బట్టియెత్తి
  నీరజాక్షుండు వారి కన్నీరు దుడిచి, కౌఁగిలించుచు వారలఁ గలఁకఁ బాపె.

తాత్పర్యము [౨౪౨

అంతట శత్రుఘ్నుఁ డేడ్చుచుఁబోయి శ్రీరామచంద్రుని పాదములమీఁదఁ బడెను. అప్పుడు శ్రీరాముఁడు భరత శత్రుఘ్నులఁ బట్టి యెత్తినిలువఁబెట్టి వారి కన్నీళ్ళు దుడిచి కౌఁగిలించుచు వారి నూరార్చి మనస్తాపముఁ బాపెను.

తే. ఆవలసుమంత్రగుహులు నెయ్యమునడాయ,
శుక్రగురుయుక్తులైనట్టి సూర్యచంద్రు
లనఁగ నొప్పిరి భ్రాతలు వననివాసి,జనములుసుగూడ దుఃఖించెఁ గనుచువారి.

తాత్పర్యము [౨-౪౩

భరత శత్రుఘ్నులపిమ్మట సుమంత్రుఁడు గుహుఁడు స్నేహమున సమీపింపఁగా గురుశుక్రులతోఁగూడిన సూర్య చంద్రులవలె నన్నదమ్ములు రామలక్ష్మణులొప్పిరి. వారినిజూచి యాయడవియందలి మనుష్యులుకూడ దుఃఖించిరి.

—• ౧౦౦-వ సర్గము. శ్రీరాముఁడు భరతునిఁ గుశలప్రశ్న సేయుట. •—

తే. జడలు ధరియించినారవస్త్రములు గట్టి,
పుడమిఁ బ్రాంజలి యగుచును బడినకల్ప
భానుపోలిక దుర్దర్శు దీనుఁ గృశు వి,వర్ణు నెట్టెట్లొ తా నానవాలు పట్టి.

కల్పభానుపోలికన్=ప్రలయకాలమందలి సూర్యునివలె, దుర్దర్శున్=చూడఁ గష్టమైనవానిని, దీనున్=దుఃఖించువానిని, కృశున్=శుష్కించినవానిని, ఆనవాలు = గుర్తు.

తాత్పర్యము

తండ్రి యెచ్చటనైన మంచిపూలదండలు లభించెనేని యపి తన ప్రియురాలి కొడుకగుటచే ముందుగఁ బిలిచి బుజ్జగించి ప్రార్థించినఁగాని వానిని ధరింపనివాఁడు శిరమున జడలుధరించి, యట్టులే తండ్రియెంతో వేఁడుకొని బలవంతముగఁ గట్టినఁగాని విలువగల వలువలఁ గట్టనివాఁడు నారపట్టలు గట్టుకొని తండ్రియెంతో ప్రార్థించినఁగాని యేదియు గ్రహింపనివాఁడు, (చూ. ౯౯౧౮-౯౯౯ ప.) పూలపానుపుకూడఁ గఠినమని తనతొడమీఁదఁ దండ్రి పండఁబెట్టుకొనఁ బండువాఁడు సాష్టాంగముగ నేలపైఁబడి ప్రలయకాలమందలి సూర్యునివలెఁ దేజోహీనుఁడయ్యుఁ దేఱిచూడరానివానిని స్నేహితులుచూడ దర్శింపనొల్లని కష్టదశ యందుండువానిని, శుష్కించినవానిని వన్నెమాసినవానిని భరతునతికష్టముపై నెట్టెట్లో గుర్తుపట్టి.

తే. తనదు నెయ్యంపుటనుజు హ స్తముల నెత్తి
రాముఁ డక్కునఁ జేర్చి శి రంబు మూరు
కొనుచుఁ దనతొడఁ గూర్చుండఁ గూర్మిఁ దిగిచి
కుశలసంభాషణముఁ జేసె విశదఫణితి. ౨-౪౪

నెయ్యంపుటనుజున్=స్నేహముగల తమ్ముని భరతుని,అక్కునన్=ఱొమ్మునందు, మూరుకొనుచున్=వాసనచూచుచు, విశదఫణితిన్=స్పష్టవాక్కులచేత.

తాత్పర్యము

తన గారాబుతమ్ముని భరతుని జేతులనెత్తి ఱొమ్మున నొత్తికొని శిరము వాసనచూచి యీడ్చి తనతొడమీఁదఁ గూర్చుండఁబెట్టుకొని విశదవాక్కుల నిట్లు కుశలప్రశ్నము గావించెను.

ఉ. ఎక్కడ నున్నవాఁ డొకో యి ♦ టీవిట వచ్చుటఁ జేసి తండ్రి? నీ
విక్కడ రావుగా జనకుఁ ♦ డింటను జీవముతోడ నుండఁగా ?
నక్కజ! మెన్నినాళ్ళరిగె ♦ నయ్య నినుం గని,గుర్తు చిక్క వై
తక్కట దుర్గమాటవుల ♦ కై యిటు రాఁ బని యేమి తమ్ముఁడా? ౨-౨౪౬

తాత్పర్యము

నీ వీప్రకార మిచ్చటికి వచ్చితివే, తండ్రియేమైనాఁడు. ఆయన జీవించి యుండఁగా నావలెనే నీవు నాయనను దుఃఖపెట్టి యిచ్చటికి రాలేదుగదా ? నిన్నుఁజూచి యెన్నాళ్ళాయెనురా నాయనా? నిన్ను గుర్తుపట్టుటయే కష్టమాయెనే? నీ వీ విధముగా మనుష్యులు సంచరింపఁగష్టమై యడవులకు నేల వచ్చితివి? నీ వడవులకు రావలసిన పని యేమిపడెను? తండ్రియే నిన్నుఁబోయి రమ్మనెనా? లేక నేను నీవు లేని సమయమున బలవంతులు నీరాజ్య మపహరింప నీవు బయలుదేఱివచ్చితివా?

ఉ. నీ విటు రా నెఱింగి మన ♦ నేర్చినవాఁ డొకొ తండ్రి, నాకముం
బోవఁగ లేదుగా? మిగులఁ ♦ బూజ్యము రాజ్యము బాలకుండ వౌ
నీవు ధరింప భ్రష్టమయి ♦ నెమ్మదిఁ బాయదుగా? మహాత్మునిన్
భూవిభుఁ దండ్రినిం దినముఁ ♦ బూజలఁ దన్పుదు గాదె నాయనా ?

తాత్పర్యము [౨-౨౪౭

తండ్రియాజ్ఞప్రకారము నీవువచ్చితివా? నీ విచ్చటికి వచ్చుటతెలిసి తండ్రి బ్రదికియున్నాఁడుకదా? మరణింపలేదుగదా? బాలుఁడవైన నీ వెట్టివారికిని బూజ్యమగుటచే బలవంతులగు రాజులందఱు గోరునది గావున రాజ్యము నీ యసామర్థ్యమునఁ జెదరిపోయి వ్యాకులపడలేదుగదా ? ప్రతిదినము గొప్ప మనస్సుగలవాఁడును రాజునునగు తండ్రిని నాయనా! పూజించుచున్నావుగదా.

"బాలకుండవౌ నీవు ధరింప భ్రష్టమయి" దీనివలన బాలనాయకము స్త్రీనాయకము అనాయకము చెడునని సూచన.

"యత్రస్త్రీ యత్రకితవో, బాలో యత్రానుశాసితా । మజ్జంతి తేవశా రాజన్ నద్యా మశ్మప్లవా ఇవ" స్త్రీ, జూదరి, బాలుఁడు పెత్తనముచేసి కార్యములు చేయువారైరేని నేటిలోని రాతితెప్పవలె మునుఁగుదురు.

"పూజలం దండ్రిని దన్పుదుగాదె?'' దీనివలనఁ బితృపూజ యనివార్యమని సూచన. దాని ఫలమేమన :—

"శుశ్రూషతే యః పితరం, నచాసూ యత్కదాచన,
మాతరం భ్రాతరంవాపి, గురుమాచార్య మేవచ,
తస్యరాజన్ ఫలం విద్ధి, స్వర్లోకే స్థానమర్చితమ్,
నచపశ్యేత నరకం, గురు శుశ్రూష యాత్మవాన్ ?''

తండ్రిని, దల్లిని, అన్నను, గురునను ఆచార్యుని బూజించువానికి స్వర్గలోకము స్థానము. వాఁడు నరకమును జూడఁడు.

-• శ్రీరాముఁడు కుశలప్రశ్న వ్యాజంబున భరతునకు ధర్మోపదేశము సేయుట•-

ఆ. సత్యసంగరుండు•సకల ధర్మవిదుండు, రాజసత్తముండు•రాజసూయ
సైంధవాధ్వరముల•సలిపినపుణ్యుండు,కుశలి యయ్యె తండ్రి•దశరథుండు.

ఈ ౧౦౦-వ సర్గమునకుఁ గచ్చిత్సర్గ మనిపేరు. ఇట్టిది మహాభారతమున సభాపర్వమునఁ గలదు. ఆవిషయము ౨౩౦౦-వ పద్యముతుదఁ జర్చింపఁబడును.

సత్యసంగరుండు=(1) యథార్థప్రతిజ్ఞ కలవాఁడు. (2) యథార్థక్రియానిశ్చయమును దెలుపువాఁడు "క్రియాకారప్రతిజ్ఞా పద్యుద్ధారేపుంసి సంగరః" నానా. ర. తానుజేసిన సత్యప్రతిజ్ఞనుదలఁచి పశ్చాత్తాపపడి తండ్రి యారోగ్యము చెడినవాఁడాయెనా యని యొకయర్థము. నావిషయమునఁ బరితాసపడి తన మునుపటి నిశ్చయము మార్చుకొని తా నసత్యమాడినను సరియె శ్రీరాముని బిలుచుకొనిరమ్మని నిన్నుఁ బంపలేదుకదా యని మఱియొక యర్థము.

సకలధర్మవిదుండు=సమస్తధర్మములు దెలిసినవాఁడు కావున నాయందలి పుత్రవాత్సల్యముచే నసత్యమునకు వెఱువకుండునని నేను దలఁపను అని భావము. రాజసత్తముండు=రాజశ్రేష్ఠుఁడు కావున వ్యసనముచే రాజకీయవ్యవహారముల నుపేక్షింపలేదుగదా. రాజసూయసైంధవాధ్వరములన్=రాజసూయయాగము,అశ్వమేధయాగము నెఱవేర్చిన పుణ్యాత్ముఁడు. ఈ రెండుయాగములందును సర్వరాజులను జయించుట యనివార్యము కావుననే స్వపౌరుషముచే రాజసత్తముఁ డయ్యెనని భావము. రాజసత్తమ శబ్దము నేతిబీరకాయవంటిది కాదని భావము. కుశలి = కుశలముతో నున్నాఁడుగదా. నావిరహమున వ్యాధిగ్రస్తుఁడు కాలేదుకదా. తాత్పర్యము.

ప్రతిజ్ఞచేసి తప్పనివాఁడును గార్యమును నిశ్చయించి మరల దానినుండి చలింపని మనస్సు గలవాఁడును రాజసూయయాగము అశ్వమేధయాగము చేయుటచే సార్వభౌముఁడై రాజశ్రేష్ఠుఁడని సార్థకనామధేయము వహించినవాఁడును బుణ్యాత్ముఁడును నగు మన తండ్రి దశరథుఁడు కుశలముతో నున్నాఁడుకదా.

కం. మనకులముగురువు విద్వ, జ్జనసర్యుఁడు బ్రాహ్మణుండు•సారద్యుతి యౌ
మునివర్యుండు వసిష్ఠుఁడు, మునుపటివలెఁ బూజితుండె•మొగి దాశరథీ.

కులముగురువు=వంశపరంపరగా వచ్చిన గురువు, మనకు వంశపరంపరగా వచ్చిన గురువనుటచే నాదినుండి వసిష్ఠుఁడు సూర్యవంశరాజులకెల్ల గురువు. కులగురుఁడు వసిష్ఠుఁడఁట యని విశ్వామిత్రుఁడు చెప్పెను. దీనివలన వసిష్ఠుఁ

డనుపేరు గలవాఁడొక్కఁడేయనియు నాయనయే యాదినుండి పురోహితుఁడనియు నది బిరుదుపదము గాదనియు నేర్పడుచున్నది. విద్వత్+జనవర్యుఁడు =సర్వవిద్యలు తెలిసిన పండితులయందు శ్రేష్ఠుఁడు, బ్రాహ్మణుఁడు =బ్రహ్మకుమారుఁడగుటచే బ్రాహ్మణజాతికిఁ జేరిన బ్రహ్మజ్ఞాననిష్ఠుఁడు, సారద్యుతి = గట్టియగు బ్రహ్మవర్చస్సుగలవాఁడు, మునివర్యుండు = మునిశ్రేష్ఠుఁడు, వసిష్ఠుఁడు; మునుపటివలెన్=తండ్రిపూజించిన విధముగా, ఇట్లనుటచే దశరథుఁడు మరణించెనని శ్రీరాముఁడు నిశ్చయించుకొన్నట్టు తేర్పడుచున్నది. మెఁగిన్=చక్కఁగా, దాశరథీ=దశరథకుమారా!, అపత్యార్థక తద్ధితము. గురువు=జ్ఞానోపదేశముచే నజ్ఞానమును బోఁగొట్టువాఁడు. బ్రహ్మ. తదధీతతే తద్వేద యను నర్థమున నణ్ ప్రత్యయము రాఁగా బ్రాహ్మణుఁడని రూపమేర్పడెను.

దశరథకుమారా! యనుటచే నీవు దశరథున కిష్టుఁడవైన పుత్రుఁడవు. కావున నాయన యింటఁగాని వెలుపలఁగాని చేసిన యేర్పాటును నీవు తప్పింపరాదు. ఆయన యిష్టప్రకారము వర్తింపవలయుఁ ననియుఁ గావుననే నీభాగమైన రాజ్యము నీవు తృణీకరింపరాదనియు భావము.

తాత్పర్యము

ఇక్ష్వాకువంశమునఁ బుట్టిన మనకు వంశపరంపరగా వచ్చినవాఁడును సమస్తశాస్త్రములు దెలిసిన పండితులలో శ్రేష్ఠుఁడును వేదాధ్యయనముచేసి యర్థమెఱిఁగి బ్రహ్మజ్ఞానము గలవాఁడును వేదార్థమెఱిఁగి యనుష్ఠానమందుంచుకొనుటచే బ్రహ్మవర్చస్సుచేఁ బ్రకాశించువాఁడును, మననశీలురయందు శ్రేష్ఠుఁడును, జితేంద్రియుఁడును నగు వసిష్ఠుఁడు దశరథనందనా! దశరథుని కాలమందువలెనే పూజింపఁబడుచున్నాఁడా!

కం. ఆమాడ్కి విడిచి వచ్చిన, నామాత సుమిత్ర సాధు•నందన సుఖులే?
　నీమాత పూజ్య కైకయి, యామోదముతోడ నున్న•దయ్యా భరతా?

ఆమాడ్కిన్=ఆవిధముగా, నానిమిత్తమై కంటికిఁ గడవెడుగాఁ గన్నీరు కార్చుచుండఁగా, నేను అనునది అధ్యాహారము. నామాత = నాతల్లి కౌసల్య, సాధునందన=సాధువులగు కుమారులఁగలది, పూజ్య=గౌరవింప యోగ్యురాలు, ఆమోదముతోడన్=మిక్కిలి సంతోషముతో, సౌగంధ్య హర్షామోదౌ = నానా. ర. భరతా=భరించువాఁడు భరతుఁడు. కావున వీరినందఱఁ జక్కఁగా సమదృష్టిని భరించుచున్నాఁడవుగదా యని భావము. పూజ్య కైకయి యనునది శ్రీరామునకుఁ గైకయందుఁగల గౌరవబుద్ధిని సూచించుచున్నది. కౌసల్యా సుమిత్రలు సుఖులా యనుటచే వారు దుఃఖము మానినారా! యని భావము. ఇది యనిష్టనివారణము మాత్రము సూచించును. కైక యామోదించుచున్నదా? యనుటచే దుఃఖకారణమేలేక యిష్టప్రాప్తివలన సంతోషముకూడఁ గలిగియున్నది కదా! యని భావము.

తాత్పర్యము

భరతా! నా వనగమనమునకై మిగుల దుఃఖించుచుండుట చూచియు నేను విడిచివచ్చిన నాతల్లి కౌసల్యయు, జ్యేష్ఠానువర్తనమను గొప్ప సాధుగుణము గల కొడుకులఁగన్న సుమిత్రయు శోకింపమానినారుగదా! పూజ్యురాలగు నీ తల్లి రాజ్యప్రాప్తివలన మిక్కిలి సంతోషించుచున్నదికదా! కౌసల్యా సుమిత్రలు దుఃఖింపకుండునట్లును గైక సంతోషించునట్లు భరించుచున్నావుగదా!

కం. కులపుత్రుఁడును వినయము, గలవాఁడు బహుశ్రుతుండు♦కార్యజ్ఞుఁడు ని
ర్మలమతి యనసూయుండయి, యలఘుమతీ నీపురోధ♦యర్చితుఁడగునే.

కులపుత్రుండును=మంచికులమునందుఁ బుట్టినవాఁడు, వినయము గలవాఁడు, నీకు లోపడియుండువాఁడు, బహుశ్రుతుండు = అనేకులవలనఁ బెక్కుతడవ లనేకవిషయములు విన్నవాఁడు దీనివలన గ్రంథపఠనమాత్రము పర్యాప్తముగాదు. పెక్కురవలన వినుటవలన భిన్నాభిప్రాయములు పూర్వపక్ష సిద్ధాంతములు చక్కఁగాఁ దెలియును. ఒక కార్యమందు నిస్సందేహముగా నిర్భయముగాఁ బ్రవర్తించు శక్తిగలుగును. కార్యజ్ఞుఁడు=వసిష్ఠుఁడు చెప్పినదానిని మరలఁ దాను మనకుఁదగినట్లు చెప్పి కార్యములు చేయుటకుఁ గార్యస్వరూప మెఱిఁగినవాఁడు. వసిష్ఠుఁడు పురోహితులందుఁ బెద్దవాఁడు ఏవైన గొప్పకార్యములు నిర్వహింపవలసి వచ్చినపుడు మాత్రమే యాయనవచ్చును. అల్పకార్యములకు నితర పురోహితు లుందురు. వీరు వసిష్ఠుని యాజ్ఞాప్రకారము వర్తింతురు. అనసూయుఁడు=అసూయలేనివాఁడు, నీపురోధ = నీపురోహితుఁడు, రూ. పురోధసుఁడు, మన పురోహితుఁ డనక నీపురోహితుఁ డనుటచే శ్రీరామునకు సుయజ్ఞునివలె భరతునకొకఁడు కలఁడని సూచితము. సుయజ్ఞుఁడే శ్రీరామునకు భరతునకుఁగూడఁ బురోహితుఁడని కొందఱ యభిప్రాయము. అర్చితుఁడు = పూజింపఁబడుచున్నవాఁడు, దీనిచేఁ బురోహితుఁడు సదా పూజ్యుఁడని భావము. ఈ ప్రకారము మున్ముందు గ్రహింపవలెను. "హితులు భిషగ్గ్రహజ్ఞబుధ బృంద కవీంద్ర పురోహితుల్" అనుక్త, అన్నట్లు. పురోహితులు సర్వదా గృహస్థుని మేలే కోరుచుందురు. కావున వారు పూజ్యులు.

ఉ. ఘనమతి యగ్నిహోత్రములఁ♦గావఁగఁ బూనినవాఁడు, సత్క్రియా
వినియమవేది, ధీయుతుఁడు♦వెల్వల లోపలఁ దుల్యరూపని
ష్ఠనుగలవాఁడు, హోమములు♦సల్పఁగలట్టివి సల్పినట్టివిన్
వినిచెడివాఁడు, నై యుచిత♦వేళల నొప్పునె నీపురోధయున్? ౨౨౨

పురోహితుఁడు చేయవలసిన కార్యములు చెప్పఁబడుచున్నవి.

నీపురోధఘనమతి=గొప్పమనస్సుగలవాఁడు, అగ్నిహోత్రములఁ గావఁగఁ బూనినవాఁడు=అగ్నిహోత్రమును రక్షించువాఁడు, ఈప్రశ్నవలన భరతుఁడు

యజ్ఞముచేసినట్లు సూచితము. అన్నయగు రాముఁడు యజ్ఞముచేయుటకుఁ బూర్వమే తమ్ముఁడెట్లుచేసె ననరాదు. అది యేకోదర విషయమేకాని భిన్నోదర విషయముగాదు. శ్రీరామ భరతులు సవతుల కొడుకులు గావున నధివేదన దోషములేదు. "పితృవ్యపుత్రే, సాపత్నే, పరనారీషుతేషుచ। వివాహ దాన యజ్ఞాదౌ పరివేదోన దూషణ"మ్మని శాస్త్రముగలదు. అని గోవిందరాజీయము.

వివాహమైన కొలఁది కాలములోనే భరతుఁడు మేనమామగారింటికిఁ బోయెను. ఆనాఁడు పోయినవాఁ డీనాఁడువచ్చుచున్నాఁడు. మేనమామగారి యింట యజ్ఞము చేసెననుట యసంభావ్యము. కావున నీప్రశ్నకు నీపురోహితుఁ డిట్టిశక్తిగలవాఁడా యని గ్రహింపవలెను. లేదా ౨౨౮-వ పద్యంబున శ్రీరాముని విషయమై చెప్పినటులిది స్మార్తాగ్నియనియైన గ్రహింపవలెను. లేదా గోవిందరాజీయమునఁ జెప్పినట్లు యద్వాయని యగ్ని కార్యములందని యైన గ్రహింపవచ్చును. సత్క్రియావినియమవేది=అగ్నిహోత్రము మొదలు అశ్వమేధాంతమగు సకల వైదిక కార్యముల విధి యెఱింగినవాఁడు, ధీయుతుఁడు= సమయోచితమగు నూహాపోహములయందు సమర్థుఁడు, వెల్పలన్=బాహ్యాచారమందు, లోపలన్ = అంతఃకరణమందు, తుల్యనిష్ఠను = ఏకవిధమైన నిష్ఠనుగలవాఁడు తానునమ్మినది యొకటి, పరులకుఁ జెప్పునదియొకటి గలవాఁడు గాఁడని భావము. సల్పఁగలట్టివి.... వేళలన్ = చేసినవి చేయవలసినవి యగు కార్యములను నాయాసమయ మతిక్రమింపకుండఁ జెప్పుచుండెడివాఁడు.

నైవకన్యా నయువతి ర్నాల్పవిద్యో నబాలిశః। హోతాస్యా దగ్నిహోత్రస్య, నార్తో నాసంస్కృత స్తథా॥ నరకేహి పతత్యేతే జుహ్వతః సచయస్యతత్॥ దీని వలనఁ గన్యగాని, యౌవనవతిగాని, విద్యలేనివాఁడుగాని, మూఢుఁడుగాని, ఆర్తుఁడుగాని సంస్కారము లేనివాఁడుగాని హోమము చేయరాదని యేర్పడుచున్నది.

తాత్పర్యము

భరతా! నీపురోహితుఁడు గొప్ప బుద్ధిగలవాఁడేకదా! ధనాశచే నీచకార్యములు చేయఁడుగదా! సోమరియై యశ్రద్ధచేఁ గర్మ, మంత్ర, తంత్ర లోపముల సహింపఁడుగదా! నీ యగ్నిహోత్రముల రక్షింపఁ బూనికకలవాఁడేకదా! అగ్నిహోత్రముమొదల లశ్వమేధమువఱకు సకలవైదిక కర్మము లెఱిఁగినవాఁడేకదా! ఏకవిధమైన శ్రద్ధ యాచారము గలవాఁడేకదా! తానొకటినమ్మి నీకొకటి చెప్పఁడుకదా! త్రికరణశుద్ధి గలవాఁడేకదా! నీయెదుట నొకవిధముగఁ జాటున మఱియొక విధముగఁ జేయఁడుకదా! ఏయేసమయమున నేయే హోమములఁ జేయవలయునో వానినెల్ల సకాలముననే వినిపించుచుండునుగదా!

సీ. దేవతలను బితృ♦దేవతలను నెల్ల, జనసుల గురువుల ♦ జనకసముల
వృద్ధుల వైద్యుల♦విప్రుల సత్కృతిఁ, దన్పుదే? యర్థశా♦స్త్రప్రవీణు
నిష్వస్త్రసంపన్ను♦హితు సుధన్వాఖ్యు ను, పాధ్యాయుఁ బూజింతు♦వా సభక్తి?
శూరులే కులజులే♦శ్రుతవంతులే యాత్మ, సములె జితేంద్రియ♦శాలు లొక్కొ

తే. యింగితజ్ఞులె నీమంత్రు♦లెల్లఁ దండ్రి?
మంత్రమే జయమూలంబు♦మహిపులకును
శాస్త్ర కోవిదులైనట్టి♦సచివవరులు, దాని రక్షింతురా ప్రమా♦దంబు లేక?

జనకసములన్=తండ్రితో సములైనవారిని, సత్కృతిన్=సత్కారములను, ఎవరినెవరి నెట్లెట్లు సంతోషింపఁ జేయవలయునో యట్లు చేయుచున్నావా? ఇషు + అస్త్రసంపన్నున్=మంత్రములేక ప్రయోగించు బాణాది శస్త్రములను మంత్రములచేఁ బ్రయోగించు నస్త్రములను జక్కఁగఁ దెలిసినవానిని, హితున్ = మన మేలుగోరువానిని, సుధన్వాఖ్యున్ = సుధన్వుఁడనుపేరు గలవానిని, ఉపాధ్యాయున్=ధనుర్వేదాచార్యుని, కులజులే=మంచివంశముల గొప్పకులములఁ బుట్టిన వారా, అనఁగాఁ బ్రామాణిక కులములందుఁ బుట్టినవారా, శ్రుతవంతులే = నీతి శాస్త్రమెఱింగినవారా, ఆత్మసములె=నీకుసములా అనఁగా నీవు నిన్ను నమ్మినట్లు వారును నమ్మఁదగినవారా యని భావము. జితేంద్రియశాలులు=ఇంద్రియ నిగ్రహముచేఁ బ్రకాశించువారా, అనుటచే లంచగొండులు కారుగదా యనియర్థము, ఇంగితజ్ఞులే = ముఖవైఖరిచూచి యితరుల యభిప్రాయ మెఱుఁగఁ గలవారా, మంత్రమే=ఆలోచనమే, సచివవరులు=మంత్రిశ్రేష్ఠులు, ప్రమాదంబు=పొరపాటు.

సుధన్వాచార్య లక్షణము మనుస్మృతియం దిట్లు చెప్పఁబడెను.

శ్లో॥ వైశ్యాత్తుజాయతే వ్రాత్యా సుధన్వాచార్య ఏవచ.

వ్రాత్యుఁడగు వైశ్యునివలన సవర్ణస్త్రీయందుఁ బుట్టినవాఁడు సుధన్వాచార్యుఁడు, మను. 10-23.

వీనికే దేశభేదమునఁ గారూశుఁడు విజన్ముఁడు మైత్రుఁడు సాత్వతుఁడు అనిపేరు.

తాత్పర్యము

దేవతలను యజ్ఞాదులచేఁ దృప్తిపఱుచు చున్నావా? ఈ నెల లోపలనే యజ్ఞములన్నియుఁ జేసితివా? యని యర్థముకాదు. రాజుగానుండువాఁడు చేయవలసిన కృత్యములఁ దెలుపుచున్నాఁడని యెంచవలయును. ఇట్లే తక్కిన పని యెఱుంగవలయును. శ్రాద్ధాదులచేఁ బితృదేవతలఁ దృప్తిపఱుచుచున్నావా? జనసులను వారు చెప్పినట్టువిని సంతోషపఱుచుచున్నావా? గురువులను శుశ్రూషచేఁ దృప్తులఁ జేయుచున్నావా? తండ్రితో సమానులగువారిని ద్రవ్యదానము చేతను బెద్దలను నమస్కారాదులచేతను దృప్తిపఱుచుచున్నావా? విద్వాంసు

లను ఆయుర్వేద మెఱిఁగినవారిని బ్రాహ్మణులను ద్రవ్యమునిచ్చి సంతోషపఱుచు చున్నావా? అర్థశాస్త్రము నీతిశాస్త్రము నెఱిఁగినవానిని శస్త్రాస్త్రజ్ఞానపూర్ణుని మన మేలుగోరువానిని సుధన్వుఁడను పేరుగల యుపాధ్యాయుని భక్తితోఁ బూజించు చున్నావా? నీమంత్రులందఱు శౌర్యవంతులా? గొప్ప కులముల గొప్ప వంశములఁ బుట్టినవారా? నీతిశాస్త్రము చక్కఁగా నెఱిఁగినవారా? బుద్ధియందు నీతో సమానులా? ఇంద్రియ నిగ్రహము గలవారా? ముఖములుచూచి యెదుటివారి యభిప్రాయ మెఱుఁగఁ గలవారా? రాజులకు మంత్రాలోచనమే జయమునకు మొదటికారణము. శాస్త్రము నెఱిఁగిన మంత్రులు కార్యము నెఱవేర్చుటకు ముందు నీ యాలోచనముల పొరపాటుననైన వెలిపెట్టకుందురుగదా.

కం. కావు గదా యెప్పుడుని ద్రావశుఁడవు, మేలుకొనుదె•తగుకాలమునన్?
నీ వాలోచింతె ధన,ప్రావీణ్యము లేచి యపర•రాత్రములందున్? ౭౦౩౪

నిద్రావశుఁడవు=నిద్రకు లోపడినవాఁడవు, ధనప్రావీణ్యము = ధనార్జన విషయమున నేర్పును, అపరరాత్రములందున్=రాత్రి కడపటిభాగములందు.

"బ్రాహ్మేముహూర్తే చోత్థాయ ధర్మమర్థంచ చింతయేత్" భారతము.

బ్రాహ్మముహూర్తమున లేచి ధర్మ మర్థము నాలోచింపవలెను.

నిద్రయు మేలుకొనుటయుఁ దగినకాలములందుఁ జేయవలయును.

"సంవిశేచ్చ యథాకాల ముత్తిష్ఠే ద్విగతక్లమః। ఏతద్వృత్తిం సమాతిష్ఠేదరోగః పృథివీపతిః॥ సోమరులు తలఁచినట్లు నిద్ర భోగముకాదు. పనిచేసియుండు నవయవములకు విశ్రాంతి యిచ్చుటకే నిద్రపోవలెను. కాని యది గొప్పకార్యముగ నిద్రాదాసుఁడు కారాదు. మితనిద్రవలన దేహము లఘువుగానుండును. అమితనిద్రవలన దేహము బరువెక్కును, ముసలితనము శీఘ్రముగ వచ్చును, రోగములు వచ్చును. కాలము వ్యర్థముపోవును.

తాత్పర్యము

నీవు నిద్రింపఁ దలఁచినపుడు నిద్రవచ్చునేకాని తనంతటనది పైపడి రాదుగదా? ఏసమయమందు మేలుకొని యుండవలయునో యప్పుడు మేలుకొనియే యుందువుకదా. మంత్రసమయములందు నిద్రింపవుగదా? అర్ధరాత్రమున కావలలేచి ధనప్రాప్తి విషయమై యాలోచింతువా?

కం. ఒక్కనితో నైనను మఱి,పెక్కురతో నైనఁ జేయ•వే కద మంత్రం?
బెక్కరణి నీదుమంత్రము,గ్రక్కున వెలువడదుగాదె•రాష్ట్రమునందున్.

తాత్పర్యము. [౭౦౩౫

నీవు రహస్యవిషయము లొక్కనితోఁగాని పెక్కురతోఁగాని యాలోచింపవు గదా! ఒక్కనితో నాలోచించితివా వానికిఁ బక్షపాత మెవనియందుండునో వాని కనుకూలముగాఁ జెప్పును. పెక్కురతో నాలోచించిన వారిలో నొకఁడుగాకున్న

మఱియొక్కఁడైన వెలిపఱచును లేదా భిన్నాభిప్రాయులై వారిలోవారు కలహింతురు. ఆలోచనయందు దాఱుకన్నులు (ముప్వురు) సమ్మతము నీయాలోచన మేవిధముగనైనఁ గార్యము జరగుటకు ముందెవ్వరికి నీవు దెలుపకుందువుగదా.

కం. నయత లఘుమూలము మహో,
దయ మగుకార్యంబు నిశ్చితం బగుడు మఱిన్
రయమునఁ జేయుదె? కార్యము క్షయ
మగుగతిఁ దడవు సేయంగాఁ దలఁపవుగా? ౨౨౯

నయతన్ = నీతిశాస్త్ర ప్రకారము, లఘుమూలము = సులభసాధనము, మహోదయము=గొప్పఫలము, క్షయమగుగతిన్=చెడిపోవువిధముగా, 'క్షిప్రమ క్రియ మాణస్య కాలః పిబతి సంపద' యని నీతిశాస్త్రము. "ఆలస్య మమృతం విషమ్మ"ని కలదుగదా.

తా త్ప ర్య ము.

నీతిశాస్త్రము ననుసరించి సులభసాధనము మహాఫలము నగు కార్యము నిశ్చయమైనపిమ్మట వెంటనే దానిని జేయుదువుగదా! కార్యము చెడునట్టు లాలస్యము చేయవుకదా.

కం. సామంతభూమిపాలురు, నీమంత్రితకార్యసమితి నెఱవేఱెడిమున్
దా మేమి యెఱుఁగ కుందురె? యామీఁదనె
యెఱుఁగు చుందురాయెల్లపుడున్? ౨౩౦

సామంత భూమిపాలురు=లోపడి కప్పముగట్టుచుండు రాజులు, మంత్రిత కార్యసమితి=ఆలోచించి నిశ్చయించిన కార్యసమూహమును, నెఱవేఱెడిమున్= కొనసాగుటకుముందు. ౪-గవ పాదంబునఁ గాకుస్వర యతి.

యస్యకృత్యం నజానాతి, మంత్రంవా మంత్రితంపరే,
కృతమే వాస్య జానాతి, సవై పండిత ఉచ్యతే. ఉద్యోగ.

ఎవని కృత్యముగాని యాలోచనగాని యాలోచింపఁబడినదిగాని యితరు లెఱుఁగకుందురో కార్యమైనపిమ్మటనే యెఱుఁగుదురో వాఁడు పండితుఁడనఁ బడును.

తా త్ప ర్య ము

నీవాలోచించి నిశ్చయించుకొనిన కార్యములు నెఱవేఱుటకు ముందే నీ సామంతరాజులు వాని నెఱుఁగకుందురుగదా! కార్యము నెఱవేఱిన పిమ్మటనేకదా తెలియుచున్నారు.

కం. పలుయుక్తులనో తర్కము,లలననొ మఱి యెట్టు లైనఁబరు లెవ్వరు నీ
వలననొ నీధీసచివుల,వలననొ యెఱుఁగరు గదయ్యవరమంత్రితమున్.

పలుయుక్తులనో=అనుమానములచేతనో, తర్కములననొ=ఊహలచేతనొ, మఱియెట్టులైనన్=ఇంగితాదులచేతనైనను, ధీసచివులు =మంత్రులు, ఎఱుఁగరు

గదయ్యా=నీవుగాని నీమంత్రులుగాని చేసిన యాలోచనము బైటఁబడు మార్గములను దాఁచియున్నారా?

తాత్పర్యము

నీవుగాని నీమంత్రులుగాని నడచెడి నడత ఆడెడి మాటలు చూచెడి చూపులు భ్రూముఖవికాసాదులు వీనివలనను ననుమానముచేతనో యుక్తిమాటల చేతనో యింగితము చేతనో పరులెవ్వరైనను మీ యాలోచనము తెలిసికోఁజాలరు గదా! అనఁగా నట్లు వారు తెలిసికొనుటకు మీరవకాశమిచ్చుట లేదుగదా.

కం. దండిగ వెయిమూర్ఖులకును, బండితుఁ డొక్కండు మేలు•భావింతె మదిన్?
గండంపుటర్థకష్టము, నిండినయెడ నతఁ డొసంగు•సుశ్రేయసమున్.

తాత్పర్యము [౨౨౯

వేయిమంది మూర్ఖులకంటెఁ గార్యమాలోచించి చేయఁగలవాఁడు చెప్పఁగలవాఁ డొక్కఁడు మేలు. ప్రాణగొడ్డమైన ధనవిషయమైన కష్టము సంభవించునపుడు ఆపండితుఁడు సుఖము గలిగించునుగాని మూర్ఖులు నూర్గురున్నను ప్రయోజనపడరు. పండితుని బుద్ధి యేకవిధమైనదిగా నుండును మూర్ఖు లొక్కఁ డొక్కఁడొక్కొక్క యాలోచన చెప్పుటేకాక నిశ్చయజ్ఞానము లేమిచేతఁ దాను ముందు చెప్పినదానికి విరోధముగఁ దరువాతఁ జెప్పును. "వ్యవసాయాత్మికా బుద్ధి, రేకేహ కురునందన। బహుశాఖాహ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్". భ-గీ. ౨-౪౪.

ఉ. వేవు రదేల యొక్కపది•వేవురు మూర్ఖులు గొల్చు చుండినన్
భూవిభు, వారిచేఁ గలుగఁ•బోదు సహాయత, గాన నొక్కమే
ధావియు శూరుఁడుం బనుల•దక్షుఁడు నీతివిదుండు మంత్రిగా
భూవిభునేని భూమివిభు•మాత్రునినే ధనవంతుఁ జేసెడిన్. ౨౩౦

తాత్పర్యము

మీఁదఁ జెప్పినదానినే విశదీకరించి చెప్పుచున్నాఁడు.

వేయిమంది గారు పదివేలమంది నీ సేవకులుగా నుండినను నక్కఱవసరములందు వా రేసాహాయ్యము చేయఁజాలరు. కావున సరియైన యాలోచన చెప్పఁగలవాఁడును, పరులు చెప్పినదానిని దటుకున గ్రహింపఁగలవాఁడును, నగు బుద్ధిమంతుఁడు, దానిని సాధింపఁగల శూరుఁడు, పనులయందు నేర్పరి, నీతి తెలిసినవాఁడు, మంత్రియయ్యేనేని సామాన్యరాజునైనను ధనవంతునిఁ జేయఁగలఁడు.

అ. గొప్పవారి నెల్ల•గొప్పకార్యంబుల, మధ్యములను మధ్య•మంపుఁబనుల
నధము లైనవారి•నధమకృత్యంబుల,భృత్యజనుల నును తెఁ•పెర్మికొలఁది?

భృత్యజనులు=కూలితీసికొని పనిచేయు సేవకులు, జీతగాండ్రనియర్థము. భృతి=కూలి, దానిచే జీవించువారు భృత్యులు.

తాత్పర్యము

జీతగాండ్రను బనులయందు నియోగించునపుడు వారివారికొలఁది గొప్ప తారతమ్యములెఱిఁగి కులమునందు గుణమునందు గొప్పవారుగా నుండువారిని నీ గృహకృత్యమునందును, వంట మొదలగు కార్యములందును, నడిమిరకము వారిని బడుకవేయుట లోనగు సాధారణ కార్యములందును, నధములైనవారిని గాళ్ళుపిసుకుట మొదలగు కార్యములందును, నియమించుచున్నావుగదా! యోగ్యతలేనివారిని యోగ్యులుచేయఁదగు కార్యములందు నియమించుట లేదుగదా! పాదములందు ధరింపవలసిన యాభరణములు శిరస్సున ధరింపరాదు. తలయందు ధరింపవలసినవి పాదముల ధరింపరాదు.

ఉ. ప్రేమఁ గలారిఁ, బెక్కులుప•రీక్షలఁ దేఱినవారిఁ, బూర్వపున్
భూమిపు లాదిగా మనలఁ • బూనికఁ గొల్చెడివారి, సత్యవా
ణీమతికర్మము ల్గలుగ•నిర్మలులన్, సచివాగ్రగణ్యులన్
గా మదిఁ జూచి శ్రేష్ఠమగు • కార్యముల న్నియమింతే శ్రేష్ఠులన్. ౨౨౬౨

రాజ్యకార్యములందు నియోగింపఁదగిన యుత్తములఁ జెప్పుచున్నాఁడు. నీయందు నిజమైన ప్రేమగలవారిని పరీక్షలఁ దేఱినవారిని రాజులు వస్త్రాభరణాదులను దమసేవకుల చేతికిచ్చి యంతఃపురస్త్రీలు మీకిచ్చి రమ్మనిరనియో, శత్రురాజులు మీకుఁబంపిరనియో చెప్పి యిచ్చిరండని మోసముగా మంత్రులకుఁబంపి యామూలమున వారి యభిప్రాయ మెఱుంగుదురు. ఇట్టి పరీక్షలనేకముల నీమంత్రులు దేఱినవారుగా నుండవలయును. పూర్వపున్భూమిపులు, ఇచట స్థిరము పరమైనపుడు నుగాగమము. వంశపరంపరగా వచ్చినారు. సత్యవాణి=సత్యవాక్కు, సత్యమతి=సత్యమగు బుద్ధి, సత్యకర్మము, నిర్మలులన్=త్రికరణముల మలినములేనివారిని, సచివాగ్రగణ్యులన్=మంత్రిశ్రేష్ఠులను.

తాత్పర్యము

నీయందు నిజమైన ప్రేమగలవారిని, అనేక పరీక్షలయందుఁ గడతేఱిన వారిని ఆదినుండి మనపెద్దలను మనలను దమవంశ పరంపరఁగా సేవ చేయుచుండువారిని, వాక్కు మనస్సు కర్మము మూఁడును సత్యముగానే యుండువారిని ఏవిధమైన మాలిన్యము లేనివారినిగాఁజూచి శ్రేష్ఠకార్యములందు శ్రేష్ఠులయిన మంత్రులనే నియమించుచున్నావా?

తే. ఉగ్రదండంబుచేత నీ•వుర్విజనులఁ, బీడితులఁ జేసి తేని మో•మోడి నీదు
మంత్రివర్యులు నీపోవు•మార్గములకుఁ,
దలల నూఁచుచు నుందురా•తగవుమాలి? ౨౨౬౩

ఉగ్రదండంబు=తీక్ష్ణమైన శిక్ష కొంచెము నేరమునకు గొప్పశిక్ష. మోమోడి =మోము+ఓడి=నీయందు దాక్షిణ్యముగలవారై, తలల నూఁచుచు నీవు చేసినది సరియని యంగీకరింతురా, తగవుమాలి=ధర్మము విడిచి.

తాత్పర్యము.

నిష్పక్షపాతముగ విచారించి నేరమునకుఁ దగినట్టు దండింపక కొలఁది దోషములకు దయలేనివాఁడవై గొప్ప కఠినదండములు విధించుచుంటివేని యది సరిగాదని చెప్పిన నీవేమనుకొందువో యని నీదాక్షిణ్యముచే జంకి న్యాయమును వదలి నీవు చేసినదే సరియని నీమంత్రు లంగీకరింపరుకదా. నీవు చేసినది తప్పని నీకు భయపడక చెప్పుదురా?

చం. ధనమును దుష్టమార్గమునఁ • దా నొడఁగూర్చి సవంబుఁ జల్పఁ గో
రినఖలు యాజకుల్, ప్రసభ • రీతి గ్రహింపఁగఁ గోరుకాముకున్
వనితలు వీడనాడుకాతి • నాయన! తీవ్రగతిన్ ధనంబులన్
బెను పొనరించునిన్నుఁ బ్రజ • వీక్షణ సేయదుగా యనాదృతిన్. ౭౭౯౪

దుష్టమార్గమునన్=పాపపుఁ గార్యములు చేయుటచే, ఒడఁగూర్చి=సంపాదించి. సవము=యజ్ఞము, ఖలు = దుష్టుని, యాజకుల్ = యజ్ఞముచేయించు ఋత్విజులు, ప్రసభరీతిన్=బలాత్కారముగా, తీవ్రగతిన్=క్రూరమైనమార్గమున, పెనుపు=వృద్ధి, అనాదృతిన్=ప్రేమలేమిచే.

తాత్పర్యము

పాపపుఁగార్యములు చేసి ధనము సంపాదించి దానితో యజ్ఞముచేయఁ బూనినవానిని ఋత్విజులవలె,బలవంతముగఁ దన్ను గ్రహింపఁగోరిన కాముకుని స్త్రీలవలె కఠిన దండముచేత ధనము సంపాదించు నిన్ను లోకులు నిరాదరణ దృష్టిని జూడరుగదా! నీవు జనులను నన్యాయముగాఁ గఠినముగా దండించి వారిని నొప్పించి యవమానపఱిచి బలాత్కరించి ధనము సంపాదించుటలేదుగదా!

ఉ. లేరు గదయ్య నీకడ మ • లీమసచిత్తులు, దుష్టనీతివి
ద్యారతు, లాత్మభృత్యజన • తాపరిదూషకులున్, నృపాలభీ
దూరు, లసూయకుల్ చెనఁటి • త్రొక్కుడుగూర్పరు లర్థతృష్ణ క్రీఁ
గోరెడివారు? వీరిఁ బతి • గూల్పఁడ యేనియుఁ జప్పు వారిచేన్. ౭౭౯౫

మలీమసచిత్తులు = మలినమైన మనస్సుగలవారు అనఁగా దయలేనివారు, లోభులు, క్రూరులు, కుత్సితులు, వంచకులు, మొదలగువారు దుష్టనీతివిద్యారతులు=కుత్సితనీతులఁ జెప్పునట్టి కణికచాణక్యాదుల నీతివంటి నీతిని దెలుపువారు, ఆత్మభృత్య = నీసేవకులయందు, ఆత్మజనతా = నీకుఁ గావలసినవారియందు, పరిదూషకుల్ = కొండెములుచెప్పి వెడలఁగొట్టించువారు, నృపాలభీదూరులు=రాజభయము లేనివారు, రాజునే వారు చంపవలెనని యత్నించుచుందురు గావున రాజువలనిభయము వారికిలేదు. అసూయకుల్=ఒకరిమేలు కీర్తిప్రతిష్ఠలుచూచి సహింపలేనివారు, చెనఁటిత్రొక్కుడు గూర్పరులు = చెడుమార్గ

ములఁ బోఁజేయువారు, అర్థతృష్ణ = ధనమందలి యాశచే, ధర్మముమీఁది యాశచేఁగాదు, శ్రీ=సంపద.

శ్లో॥ తుల్యార్థం తుల్యసామర్థ్యం, మర్మజ్ఞం వ్యవసాయినమ్ ।
అర్ధరాజ్యహరం భృత్యం, యోహన్యాత్ సహతస్స్వయమ్॥ కామందకము.

సమానప్రయోజనము సమాన సామర్థ్యము గలిగి కార్యసాధనమందుఁ బట్టుదలగలిగి యర్థమును రాజ్యమును హరింపఁజూచు భృత్యుని జంపని రాజు తానే వానిచేఁ జచ్చును.

తాత్పర్యము

భరతా! నీయొద్ద నిర్మలమైన మనస్సులేనివారు చెడునీతిని బోధించు విద్యయందుఁ బ్రీతిగలవారు నీకాప్తులైన భృత్యులమీఁదఁ నయినవారిమీఁదఁ గొండెములుచెప్పి వారిని వెడలఁగొట్టించువారు, రాజభయము లేనివారు చెడ్డ త్రోవలఁ ద్రొక్కింపఁ జూచువారు ధర్మబుద్ధిలేక లోభులై కేవల ధనాశచే సంపద రాఁగోరువారు ఇట్టివారిని రాజు చంపకపోయెనా వారిచేఁ జచ్చుట నిజము.

తే. హృష్టుఁడును శూరవరుఁడును ♦ ధృతియుతుండు
సత్కులుండును సుమతిప్ర ♦ శస్తశుచియు
దక్షుఁడును బ్రీతి గలవాఁడు ♦ దండనాథుఁ
డగుచు పఱులు నెనీ కిప్డు ♦ సుగుణలోల ? —౨౯౯

ఇఁక సేనానాయకుల గుణములఁ జెప్పుచున్నాఁడు.

హృష్టుఁడును=రాజు చేసిన దానమానాదులఁ దృప్తిచెందినవాఁడు శూరవరుఁడు=యుద్ధములందు శత్రువులపైకుఱికి వారిని వధించువాఁడు, పిఱికియై ప్రాణభయమున వెనుకంజపెట్టనివాఁడు, ధృతియుతుండు = ఎట్టియాపదయందును ధైర్యము వదలనివాఁడు, సత్కులుండును=గొప్పవంశమునఁ బుట్టినవాఁడగుటచే నపకీర్తికి భయపడువాఁడు, సుమతి=సమయమునకుఁ దగినట్లు తన సేనలఁ జక్కని వ్యూహముల నిలుపుటకుఁ దగినకాలముల సేనల రప్పించుటకు సమయమెఱిఁగిన శత్రుసేనపైపడి వారి వ్యూహములను జెఱుచుటకుఁ గావలసిన మంచిబుద్ధి గలవాఁడు, శుచి=త్రికరణములయందుఁ బరిశుద్ధుఁడు, దక్షుఁడు=కార్యసాధనమందు నేర్పరి, దండనాథుఁడు=సేనానాయకుఁడు, దండమనఁగా=సేన దీని వికృతియే దండు.

తాత్పర్యము

నీ సేనానాయకుఁడు సుగుణములయందాసక్తిగలవాఁడా? అతఁడు నీ దానమానాదుల సంతోషించువాఁడును శూరుఁడును ధైర్యముగలవాఁడును మంచికులమునఁ బుట్టినవాఁడును సేనలు నడుపుట మొదలగు కార్యములందు మంచి బుద్ధిగలవాఁడు త్రికరణ శుద్ధిగలవాఁడును కార్యములు చేయుటయందు సమర్థుఁడును రాజునందు బ్రీతిగలవాఁడునై యున్నాఁడా?

చం. బలయుతులా, పరాక్రమవి • భాసితులా, రణకేళిదక్షులా,
తొలి దమపౌరుషంబులను • దోఁపఁగఁ జేసినవారె, సైన్యము
ఖ్యులు? నటువంటివారలకుఁ • గూర్తె ముదంబును బారితోషికం
బుల నతులన్ నృపాత్మభవ • పోణిమి నీవయిఁ గూర్మి యెక్కఁగన్? [౨-౧౬౪

తాత్పర్యము

నీ సేనయందలి ముఖ్యులు బలవంతులేకదా? పరాక్రమముచేఁ బ్రకాశించు వారేకదా? యుద్ధక్రీడయందు సమర్థులా? నీయొద్దకు రాకముందు తమ పౌరుషములను బహిరంగపఱిచినవారేకదా? అటువంటివారికి బహుమానములను దాసికలను నొసఁగి నీవయి వారికి స్నేహమెక్కువ యగునట్లు చేయుచున్నావా ?

ఉ. జీతము బత్తెమిచ్చెదవె • సేనకకోటికిఁ గ్లృప్తకాలమం,
దాతతకాలయాపన మొ • కప్పుడుఁ జేయవు గాదె? వేళకున్
వేతన మీయనట్టిపతి • ని గ్గినుకం గనుచుందు రాభటుల్
ప్రీతి దొలఁగి తిట్టుదురు • పెక్కులుకీడులు పుట్టు దానిచేన్. ౨-౧౬౫

తాత్పర్యము

నియమితకాలమునకు సరిగా సేవకులందఱకు జీతమియ్యవలసినవారికి జీతము బత్తెమియ్యవలసినవారికి బత్తెము రెండు నియ్యవలసినవారికి రెండు నిచ్చుచున్నావా? ఒకప్పుడైన నాలస్యము చేయుటలేదుగదా? క్లృప్తకాలమునకు సరిగా జీతమీయని రాజును ఆభటులు కోపదృష్టిచూచి తిట్టుదురు. దానివలనఁ బ్రేమచెడును. దానివలన సమయము వచ్చినపుడు విశ్వాసముతో నిర్వంచనముగాఁ బనిచేయరు. దానివలన ననేకములయిన కీడులు రాజునకుఁ గలుగును.

కం. కులజులు ప్రధానులును ని,శ్చలరక్తి న్నిన్నుఁ గం డ్రె • సమయం బైనన్
గలనను నీకై ప్రాణం,బుల నీయఁ గడంగుదు రె ప్ర • భూతప్రీతిన్?

కులజులు=మన క్షత్రియకులమునఁ బుట్టినవారు, ప్రధానులు,ముఖ్యులు. నిశ్చలరక్తిన్=చలింపని ప్రేమతో, సమయంబైనన్=వారిసహాయ్యము కావలసిన యుద్ధసమయమందు, కలనను=యుద్ధమందు, ప్రభూతప్రీతిన్=అధిక ప్రేమచే, ఇది రాజబంధువుల లక్షణము.

తాత్పర్యము

క్షత్రియవంశమునఁ బుట్టిన ప్రధానులు వారి సాహాయ్యము కావలసిన యుద్ధసమయములందుఁ జలింపని ప్రేమతో నిన్నుఁ జూచుచున్నారా ? సమయమునందు ముఖము తప్పించుకపడుగదా ! అంతియకాదు. యుద్ధమందు నీయందలి ప్రేమచే నిన్ను రక్షింపఁగోరి తమ ప్రాణములనర్పింప సిద్ధపడుదురా?

కం. మనజనపదమునఁ బుట్టినఁ మనుజుం బండితు యథో క్త • మార్గస్థిరు ద
క్షుఁ బ్రతిభాయుతు నీకూ,తనుగా నొనరింతె కార్య • తత్పరమునకై.

ఇఁక దూత లక్షణమును దెలుపుచున్నాఁడు,

మన జనపదమునన్=మనదేశమందు, పండితున్=ఇతరుల యభిప్రాయ మెఱుఁగఁ గలవానిని, యథోక్తమార్గస్థితున్ = రాజెట్లుచెప్పెనో యాప్రకారమే చేయువానిని, అదితప్పని వేఱొకత్రోవఁ బోవువాఁడుగా నుండరాదు. కార్యోప యోగముగాఁ బెక్కుసంగతులు చెప్పుచున్నను దనప్రభువు చెప్పినదానిని వద లక దాని కనుషంగముగాఁ జెప్పువాఁడు, దక్షిణున్=కార్యము చేయఁగల సామ ర్థ్యము గలవానిని, ప్రతిభాయుతున్=సమయోచితముగా నెదుటివారి ప్రశ్నము లకుఁ దగిన ప్రత్యుత్తరములను వెంటవెంటనే యియ్యఁగల క్రొత్తక్రొత్తగా వికాసమునొందు బుద్ధిగలవానిని, కార్యతత్పరమతివై = కార్యము సాధించుటే ప్రయోజనముగాఁగల మనస్సు గలవాఁడవై, దక్షిణు = ఇందలి ణకారము సాధ్యము కావునఁ బ్రాస గతము. తాత్పర్యము

ఇతరదేశములఁ బుట్టినవానిని నీవు దూతలుగాఁ బంపితివేని వాఁడేశమం దున్న ప్రీతి నీదేశమందుండదు గావున నీకార్యము సాధింపఁబోవుదూత నీ రాజ్యమునఁ బుట్టినవాఁడుగానే యుండవలయును. మఱియును వాఁడెదుటివారి మాటల ధోరణిఁబట్టియే వారి యభిప్రాయము నెఱుఁగ శక్తిగలవాఁడై యుండ వలయును. నీవొకటిచెప్పినఁ దానొకటిచేయువాఁడుగాక నీవుచెప్పిన మార్గముఁ దప్పననివాఁడుగా నుండవలయును. కార్యము సాధించు సామర్థ్యము గల వాఁడుగా నుండవలెనుగాని యేదియో నెపముపెట్టి వెనుకకు వృథాగా వచ్చు వాఁడుగా నుండరాదు. ఎదుటివారి యుక్తులకు వెంటవెంటనే తగిన ప్రతియుక్తి చెప్పు సమయోచిత బుద్ధిగలవాఁడుగా నుండవలెను గాని మరల నాలోచించి చెప్పెద ననికాని మారాజుగారి నడిగివచ్చి చెప్పెద ననికాని యనువాఁడుగా నుండరాదు. కావున నీవు నీకార్యము సాధించుటయందు మనస్సుగలవాఁడ వైతివేని యిట్టివానిని దూతగాఁ బంపుము.

సీ. పరపక్షమున మంత్రి•వరపురోహితయువ, రాజసేనానికా•రాగృహాధి
పతి లోనుగాఁ గల•పదునెనమండ్రఁ దీ, ర్థాఖ్యులఁ దనపక్ష•మందు మొదటి
మూవుర విడి పదు•నేవురవృత్తంబు, లరయఁ జారులను ము•వ్వురను బరుల
కును దమలోఁ దమ•కును నెఱుంగఁగ రాని,

యట్టుల నియమింతె•యమలచరిత

ఆ. పగతుఁ డగుటఁ దఱుమ•బడిమున్న గర్వంబు,
చెడియు మరలనిన్నుఁ•జేరనేని
యబలుఁ డనుచు వాని•నవమానదృష్టిని, జూడకుందు వయ్య•సుగుణభూష.

ఇఁక దీర్థుల లక్షణము చెప్పుచున్నాఁడు.

పరపక్షమునన్=విరోధులపక్షమునందు, మంత్రి....పతి=౧ మంత్రి ౨ పురో హితుఁడు ౩ యువరాజు ౪ సేనాపతి ౫ దౌవారికుఁడు ౬ అంతర్వంశికుఁడు ౭ కారాగారాధిపతి ౮ అర్థసంచయకరుఁడు ౯ కార్యనియోజకుఁడు ౧౦ ప్రాడ్వి

వాకుఁడు ౧౧ సేనానాయకుఁడు ౧౨ నగరాధ్యక్షుఁడు ౧౩ కర్మాంతికుఁడు ౧౪ సభ్యుఁడు ౧౫ ధర్మాధ్యక్షుఁడు ౧౬ దండపాణి ౧౭ దుర్గపాలుఁడు ౧౮ రాష్ట్రాంతపాలుఁడు. ౧ మంత్రి = **Minister** = ఆలోచనము చెప్పువాఁడు. ౨ పురోహితుఁడు=**Private Secretary** ౩ యువరాజు = **Prince** ౪ సేనాపతి = సేనలకన్నిటికి నధిపతి **Commander in-chief** ౫ ద్వారపాలకుఁడు=అంతఃపురాది ద్వారపాలకులయందు మేటి **Gate-keeper** ౬ అంతర్వంశికుఁడు = అంతఃపుర కార్యనిర్వాహకుఁడు- **Palace Controller** ౭ కారాగారాధిపతి = చెఱసాలల కధిపతి- **Superintendant of Jails** ౮ అర్థసంచయకరుఁడు = ధనము రాఁబట్టువాఁడు-**Revenue officer Collector** ౯ కార్యనియోజకుఁడు = రాజాజ్ఞలను వెల్లడించువాఁడు- ౧౦ ప్రాడ్వివాకుఁడు = న్యాయస్థానమున న్యాయ విచారణకర్త **Judge** "వివాదే పృచ్ఛతి ప్రశ్నం ప్రతిప్రశ్నం తథైవచ, ప్రియపూర్వం ప్రాగ్వదతి ప్రాడ్వివాకస్తతః స్మృతః॥" అని ప్రాడ్వివాక లక్షణము- ౧౧ సేనానాయకుఁడు=సేనయందలి భటులకు జీతము బత్తెము విచారించువాఁడు, ౧౨ నగరాధ్యక్షుఁడు=రాత్రులందు నగరద్వార ప్రాకారాదుల ప్రహరి తిరుగుచు రక్షించువాఁడు- ౧౩ కర్మాంతకుఁడు =కార్యాంతమందు రాజాజ్ఞప్రకారము సేనలందుఁజేరని జీతగాండ్రకు నందఱకు జీతములు పంచిపెట్టువాఁడు- **Accountant General** ౧౪ సభ్యుఁడు=ప్రతిదినము సభనలంకరించుట రాజుమంత్రి మొదలగువారి యాసనముల నేర్పఱుచుట సభ్యులను రప్పించుట అసభ్యులను నిరోధించుట సభయందు శబ్దములేకుండఁజేయుట సభారక్షకుల నియమించుట యీ యధికారము గలవాఁడు- ౧౫ ధర్మాధ్యక్షుఁడు=దాయభాగాది విషయమున వాదులాడువారి వాదములఁ బరిశోధించి ధర్మశాస్త్రప్రకారము పరిష్కరించువాఁడు **Munsiff** ౧౬ దండపాలుఁడు=జారులను జోరులను ఇతరాపరాధములఁ జేసినవారిని దండించువాఁడు **Magistrate** ౧౭ దుర్గపాలుఁడు=దుర్గము = కోట. గిరిదుర్గము జలదుర్గము వనదుర్గము లోనగు దుర్గములను నెల్లప్పుడు కాపాడువారిపై యధికారి- ౧౮ రాష్ట్రాంతపాలుఁడు=రాష్ట్రమును బరరాజు లాక్రమింపకుండఁ బొలిమేరలను సర్వదా రక్షించువారిపై నిర్వాహకుఁడు- ఈ పదునెనమండ్రుగురు తీర్థులనఁబడుదురు. వీరందఱు పరపక్షమువారు స్వపక్షమున మొదటిముగ్గుర నఁగా మంత్రి- పురోహితుఁడు- యువరాజు వీరుతప్పఁ దక్కినవారు ఈ ముగ్గురు సమక్షమందే యుండువారు కావున వారివర్తనము ప్రత్యక్షముగనే తెలియుచుండును. గావున వీరలపైఁ జారుల వేయరాదు.

"చారాన్ విచారయేత్తీర్థేష్వాత్మనశ్చ పరస్యచ పాషండాదీ నవిజ్ఞాతానన్యోన్య మితరైరపి । మంత్రిణం యువరాజంచ హిత్వాస్వేషు పురోహిత" మ్మని నీతిశాస్త్రము.

తీర్థలక్షణము. 'యో నౌవ జలావతారేచ మంత్ర్యాద్యష్టా దశస్వపి,పుణ్య క్షేత్రే తథా పాత్రే తీర్థంస్యా ద్దర్శనేష్వపి' అని హలాయుధుఁడు. చారులను= వేగువాండ్రను, మువ్వురను = ఒక్కొక్క తీర్థునకును మువ్వురుచొప్పున ఈ మువ్వురు తాము వేగులవారని పరులకుఁ దెలియరాదు- వారిలో వారికిఁ దెలియ రాదు. పగతుఁడు=శత్రువు, అవమానదృష్టిని=అగౌరవముతోఁగూడిన చూపుతో.

తాత్పర్యము

ఇతరరాజుల విషయమున మంత్రి- పురోహితుఁడు- యువరాజు- సేనా నాయకుఁడు- చెఱసాలయధిపతి మొదలైన పదునెనమండ్రను దీర్థులను దన పక్షమున మొదటి ముగ్గురనువిడిచి పదునేవురను వీరి నడవడియెట్టిదో తెలియు టకై యొక్కొక్కరికి ముగ్గురు ముగ్గురు వంతున వేగువాండ్రను వారు వేగు లని వారిలోవారికిఁగాని పరులకుఁగాని తెలియకుండునట్లు నియమింతువా? శత్రు వైనకారణముచే ముందు తఱుమఁబడి పొగరు వదలినవాఁడయ్యు మరల నీయొద్దకు వచ్చెనేని వాఁడు బలహీనుఁడని యవమానింపవుకదా బలహీనుఁడని యవమానింపనురాదు. కేవలము బలహీనుఁడని యెక్కువ చనువీయనురాదు. వాస్తవముగా గర్వముడిగి వేఱుదిక్కులేక వచ్చెనో యెవరిసాహాయ్యమైనఁ గల వాఁడై మోసబుద్ధితోనే వచ్చెనో తెలియవలయును. గావున సావధానుఁడవై యుండవలయును. చేరుటయనఁగా యుద్ధమునకై వచ్చుట యని యొకరు వ్రాసియున్నారు. ఒకసారి దెబ్బదిని పోయినవాఁడు మరల యుద్ధమునకు వచ్చెనేని ముందు దెబ్బతినిపోయిన బలహీనుఁడేకదా యని యలక్ష్యదృష్టిఁ జూడరాదు. అవమానము సహింపలేక విదులాపుత్రునివలె యశోవా మృత్యుర్వా యనియైన వచ్చియుండవచ్చును. లేదా బలమైన యితర సాహాయ్యము సుగ్రీ వునివలె సంపాదించుకొనియైన వచ్చియుండవచ్చును. కావునఁ దగిన సన్నా హముతోనే యుద్ధమునకుఁ బోవలెను. పూర్వోత్తర సందర్భములు విచారింపక గర్వమున వాలివలెఁ బోరాదు.

కం. లోకాయతికుల విప్రుల, నేకాలమునందుఁ గొలువవే కద? వార
స్తోకానర్థచణుల్ సుమీ, ప్రాకటవిపరీతమతులుఁ బండితమానుల్. ౨౨౨

లోకాయతికులగు విప్రులన్=లోకాయతికులగు బ్రాహ్మణులను, అస్తోకానర్థ చణుల్=మిక్కిలి కీడుకలిగించువారు, ప్రాకటవిపరీతమతులు = స్పష్టముగా విప రీతజ్ఞానము గలవారు, పండితమానుల్=పాండిత్యము లేకపోయినను దమ్ముఁ దాము పండితులమని తలఁచువారు.

లోకాయతికులు=(1) లోకమున + ఆయతము = విస్తారమైనది, లోకాయ తము = ప్రత్యక్ష ప్రమాణము- అదికలవారు లోకాయతికులు- మత్వర్థీయ తద్ధి తాంతము. చార్వాకులు మొదలగు నాస్తికమతమునఁ జేరినవారు. వీరు ప్రత్యక్ష

ప్రమాణవాదులు. ప్రత్యక్షమేకం చార్వాక యని ప్రమాణము (2) లోకము దీనిమూలమున జనులందఱు చూతురు. ప్రత్యక్షప్రమాణము. ఆయతము = సమస్త స్థలములందున్న సాధ్యాంశమును గ్రహించుటకు సాధనము హేతు వ్యాపక సాధ్యగ్రాహకము. అనుమాన ప్రమాణము. ఈరెంటిని గలవారు లోకాయతికులు. బౌద్ధాదులు. వీరికిఁ బ్రత్యక్షానుమానములు ప్రమాణములు. జాబాలి చేసిన వాదము వీరివాదమే. ఈకాలమున వీరు అచలపరిపూర్ణవాదులని రహిత వాదులని శుష్కాద్వైత వేదాంతులని చెప్పఁబడుచున్నారు.

భగవద్గీతయందుఁ బదునాఱవ యధ్యాయమున శ్రీకృష్ణ భగవానుఁడు చెప్పిన ఆసురప్రకృతులు వీరే. ఇట్లు చెప్పుటచే నీకాలమందువలె నాకాలమందును నిట్టివారు కొందఱు గలరని యేర్పడుచున్నది. ఇది స్వభావసిద్ధమే పశువు జన్మమునందుండి జీవుఁడు మనుష్యశరీరము తొలుతొల్త ధరించినపుడు పూర్వ జన్మవాసనా బలముచేఁ బూర్వపుఁ బశుభావముపోదు. పశువులకు దేహజ్ఞానమే కాని యాత్మజ్ఞానము లేదు.అట్టులే వీరులును. వీరికిఁ బరమార్థము దేహమే తరువాత నుత్తమ జన్మములు వచ్చినను కామపూరిత మనస్కులగుటచే "నిప్పటి సుఖంబులె మేలయితోఁచు వారికిన్" అని భారతమునఁ జెప్పబడినట్లు వారికిఁ బరలోకదృష్టి కలుగదు. ఆకాలమందిట్టివారిని దండించువారుండిరి. ఇప్పుడు వారు లేరు. కావున విజృంభించుచున్నారు.

తాత్పర్యము

బ్రాహ్మణులుగదా యను తలంపుతో నాస్తికవాదులైన చార్వాకులను బౌద్ధులు లోనగువారిని నేసమయమందైనను గౌరవింపవుకదా! వారినిఁ జేరఁ దీసితివేని మిక్కిలి కీడి లోకమునఁ బరలోకమునఁగూడఁ గలిగింతురు. ఏలనఁగా వారి మనస్సులు యథార్థమునకు విరుద్ధమైన యర్థమును గ్రహించినవి. ఏలన వారు పండితులుగాకున్నను తమ్ముఁదాము పండితులమనితలఁచి సర్వజ్ఞత్వము తలపై వేసికొని విపరీతబుద్ధులు నేర్పుచుఁ దమ్మునమ్మినవారి నుభయలోకములఁ జెఱుతురు. చార్వాకుఁడనువాఁడు బృహస్పతి శిష్యుఁడు బృహస్పతి గీతలయం దీనాస్తికవాదము గలదు.

ఆ. విద్యమానముఖ్య•వివిధధర్మాగమ విధుల దుర్బుధులును • వికటశుష్క
వాదరతులు గాన•వారితో సాంగత్య, మెడలి యుంట మేలు•పుడమిపతికి.

నాస్తికవాదుల సాంగత్య మనర్థకారి యనుదానినే వివరించుచున్నాఁడు.

విద్యమాన = సత్సంప్రదాయ పరంపరగాఁ జదువఁబడుచున్నవియు, ముఖ్య=తామస స్మృతి పురాణములుకాక సాత్త్వికములై సజ్జనాదరణీయములై ప్రధానములయి యున్నవియును, వివిధ=పలువిధములగు, ధర్మాగమవిధులన్ =ధర్మశాస్త్రములయందు, దుర్బుధులు=దుర్బుద్ధికలవారును- వేదమార్గమునకు

విపరీతమగు బుద్ధికలవారును, వికట=మిక్కిలి వంకరయైనవియు, శుష్క=నిస్సారమై నిరర్థకములగు, వాద = వాదములయందు, రతులు = ఆసక్తిగలవారు, ఎడలి = వదలి- 'అర్షం ధర్మోపదేశంచ వేదశాస్త్రావిరోధినా, యస్తర్కేణాను సంధత్తే సధర్మం వేదనేతర' యను స్మృతి యిటఁ బ్రమాణము. ఋషులకు సమ్మతమై వేదశాస్త్రములకు విరోధింపక తర్కములచేఁజేయఁబడు నుపదేశము ధర్మము.

తాత్పర్యము

సత్సంప్రదాయపరంపరగాఁ జదువఁబడునవియు, కేవల సాత్త్వికములయి, నాదరింపఁబడి ప్రధానములైనవియు నానావిధములగు ధర్మశాస్త్రములందు విపరీత బుద్ధిగలవారై వక్రములును నిస్సారములు నిరర్థకములయిన తర్కయుక్తి వాదములందుఁ బ్రీతిగలవారు కావున వారితోఁ గలిసి మెలసి యుండినఁ గీడుతప్పదు.

సీ. వరదృఢద్వారంబు♦ వారణఘోటక,రథసంకులం బయి♦ కాలుదాని
సంతతోత్సాహులు♦సంజితేంద్రియు లార్యు, లాత్మకర్మరతులు♦నైనవిప్ర
రాడ్వైశ్యజనులచే ♦ రాజిత మవుదాని, బహువిధప్రాసాద♦పటలి గలిగి
వైద్యజనాప్తిని♦హృద్య మౌదానిని, నిత్యసంతుష్టిని ♦ నెగడుదాని

తే. వీరు లగుమనపూర్వులు♦విహితరీతిఁ, బాలనము సేసి నట్టియా♦పట్టనంబు
మనయయోధ్యను సార్థక♦మహితనామిఁ,
కగను బాలింతువే తండ్రి!♦కరముఁ బ్రీతి. ౨౩౪

వరదృఢద్వారంబు=శ్రేష్ఠమై గట్టియైన గవనివాకిలిగలది, వారణ=ఏనుఁగులచేతను, ఘోటక=గుఱ్ఱములచేతను, రథ=తేర్లచేతను, సంకులంబు=కలఁతచెందినది, సంతతోత్సాహులు=ఎడఁదెగని యుత్సాహముగలవారు, సంజితేంద్రియులు = చక్కఁగా జయింపఁబడిన యింద్రియములు గలవారు, ఆర్యులు = గొప్పగుణములు గలవారు, ఆత్మకర్మరతులు=తమతమ శాస్త్రీయ వర్ణాశ్రమములకుఁ దగిన కర్మములు చేయుటయందుఁ బ్రేమకలవారు, విప్రరాట్ వైశ్యజనులచే=బ్రాహ్మణక్షత్రియ వైశ్యజనులచే, రాజితము=ప్రకాశించునది, బహువిధ ప్రాసాదపటలి=అనేకవిధములయిన మేడల సమూహములు, వైద్యజనాప్తిని=విద్వాంసులగువారుండుటచే, హృద్యము=మనోహరము, నిత్యసంతుష్టి = ఎల్లప్పుడు కొఱఁత యనునదిలేక సంతోషముచే, విహితరీతిన్=ధర్మపద్ధతిని- అయోధ్యను- సార్థకమహితనామికగన్=అర్థముతోఁగూడిన పేరుగలదానిని- అయోధ్య యనఁగా యుద్ధమున జయింపసాధ్యముగానిది, కరము=మిక్కిలి.

తాత్పర్యము

దృఢమైన గవనివాకిండ్లుగలిగి యేనుఁగులు గుఱ్ఱములు రథములు వీనిచేఁ గలఁతచెంది ప్రకాశించుచు నెల్లప్పుడు నుత్సాహముగలవారును జితేంద్రియు

లును సద్గుణసంపత్తిగలవారును- వారివారి వర్ణాశ్రమ ధర్మముల ననుసరించి పనిచేయువారునగు బ్రాహ్మణులచేతను- క్షత్రియులచేతను- కోమట్లచేతను- ప్రకాశించునదియు ననేకవిధములగు మేడలుగలిగి పండితజనులచే శోభిల్లి మనోహరమై నిత్యసంతోషముగలదానిని వీరులయిన మన పెద్దలు ధర్మపద్ధతి తప్పక రక్షించిన మన పట్టనము నయోధ్యను శత్రువుల కసాధ్యమై దానిపేరు సార్థకమగునట్లు మిక్కిలి ప్రీతితోఁ బాలించుచున్నావా?

సీ. నిలుకడ నెలవుల • నెలకొన్న వారిచే, శతయజ్ఞకలితసు•స్థలులచేత
దేవాలయప్రపా•పావనసరసుల సంహృష్టనరపుణ్య•సతులచేత
నొప్పుగా వరసభా•జోత్సవంబులచేత, నాకృష్టపశుసమూ•హములచేత
సంతతాహింసక•జనసంఘములచేత, వాన నమ్మనిశాల్య•వనులచేత

తే. సత్త్వములు లేక సహృదయ•జనులచేత, వితభయులైనపౌరుల•వేలచేతఁ
గనకమణిరౌప్యభాసిత•ఖనులచేత, నొప్పు మనసీమ సుఖముగ•నున్నదయ్యె?

నిలుకడనెలవులన్=స్థిరమైన యిండ్లయందు, నెలకొన్నవారిచేన్=కాఁపురములు చేయువారిచే (నెలవుకొను=నెలకొను) ఈ రాజ్యము మంచిరాజు పాలనముక్రింద నుండుటచేతను, ఇందు సువృష్టికి నారోగ్యాదులకుఁ గొఱంతలేక యుండుటచేతను దీనినివదలి యొకప్పుడైన దేశాంతరముపోవ నక్కఱలేకుండునట్లు జనులిందే సుప్రీతితో స్థిరముగాఁ దరతరములుగా వసించుచున్నారని భావము. శతయజ్ఞకలిత సుస్థలులచేతన్=అశ్వమేధాంతములగు ననేక యజ్ఞములుచేసిన స్థలములచేతను, దేవాలయ=దేవళములచేతను, ప్రపా=బాటసారులకు ద్రావనీళ్ళిచ్చు చలిపందిళ్ళచేతను, పావనసరసులన్ = పవిత్రమైన జలములుగల కొలఁకులచేతను, సంహృష్ట నరపుణ్యసతులచేతన్ = మిగుల సంతోషించిన పుణ్యపురుషులచేతను పుణ్యస్త్రీలచేతను, వరసభాజోత్సవంబులచేతన్= శ్రేష్ఠములైన సభల యుత్సవంబులచేతను, ఆకృష్ట=సర్వత్ర చక్కఁగా దున్నఁబడిన భూములచేతను- కొంతదున్ని కొంత దున్నక విడిచిన భూములుగాని బొత్తిగ దున్నకయే విడిచిన భూములుగాని లేవనుట, పశుసమూహములచేతన్= ఆవులు మేకలు మొదలగు పశువుల మందలచేతను, సంతతాహింసక జన సంఘములచేతన్ = ఒకరివలన నొకరికి నేవిధమైన బాధయులేని మనుష్యుల గుంపులచేతను, వాననమ్మని=వానకురిసిననే పండును లేనియెడలఁ బండదను భయములేని- భూమియంతయు సరయూనదీతీరము గాన వర్షము కురిసినను గురియకున్నను పొలములకు నీళ్ళులేవను విచారములేదని భావము.

భూమియంతయు నదీమాతృకమేయని తాత్పర్యము. శాల్యవనులచేతన్= శాలి+వనులచేతన్ = వడ్లుపండెడి మాగాణి (తరి) భూములచేతను, సత్త్వములు=క్రూరమృగములు, సహృదయ = మంచిమనస్సులతోఁ గలసిమెలసి

యైకమత్యముగల, జనులచేతన్=ప్రజలచేతను, వీతభయులు=ఈతిబాధలవలన దొంగలు మొదలైనవారివలన భయములేనివారు, పౌరులవేలచేతన్ = వేల కొలఁది పురజనులచేతను, కనక=బంగారు, మణి=రత్నములు, రౌప్య=వెండి వీనిచే, భాసిత=ప్రకాశించు, ఖనులచేతన్=గనులచేతను, మనసీమ=మనదేశము.

శ్లో॥ రాజ్ఞా సప్తైవ రక్ష్యాణి తానిచైతాని బోధమే। అత్మామాత్యశ్చ కోశశ్చ దండోమిత్రాణి చైవహి। తథాజనపదాశ్చైవ పురంచ కురునందన। ఏత త్సప్తాత్మకం రాజ్యం పరిపాల్యం ప్రయత్నతః॥ యదారక్షతి రాష్ట్రాణి యదాదస్యూనపోహతి। యదాజయతి సంగ్రామే సరాజ్ఞో ధర్మఉచ్యతే॥ రాజ ధర్మ-రాజు-మంత్రులు-కోశము- దండము- మిత్రులు- జనపదములు- పురము ఈయేడు గలది రాజ్యము. వీనిని రాజెటులైనఁ బరిపాలింపవలయును. రాష్ట్రము రక్షించి దొంగవైరుల గెలిచిన రాజే ధర్మజ్ఞుఁడు.

తాత్పర్యము

నాయనా! మనదేశమందింతవఱకు ఈరాజులు మంచివారు ధర్మముగఁ బాలింతురు. ఈదేశము మంచిది- రోగాదిబాధలు లేనిది- యనుతలంపుతోఁ బ్రజలు తరతరములుగ స్థిరముగఁ గాఁపురములు చేయుచున్నారు. ఇందొ క్కొక్క స్థలమునందు ననేక మహాయాగములు చేయఁబడినవి- విష్ణ్వాలయము లేని గ్రామమం దొకనాఁడైన వసింపరాదు. అందు భుజింపరాదనియుండుటచే (విష్ణ్వర్చారహితే గ్రామే విష్ణ్వర్చారహితే గృహే॥ నతత్రభోజనం కుర్యాత్, నతత్రదివసం వసేత్॥" విష్ణువిగ్రహము పూజింపఁబడని గ్రామమందు విష్ణు పూజ జరుగని యింటియం దొకనాఁడైన నిలువరాదు భుజింపనురాదు అని యర్థము.) ప్రతి గ్రామమందును దేవాలయములు గలవు. దప్పిగొన్న బాట సారులకు నీళ్ళిచ్చు చలిపందిళ్ళు గలవు. తటాకములు కొలఁకులు గలవు. పుణ్య పురుషులు పుణ్యస్త్రీలు సర్వదా సంతోషయుక్తులై యుందురు. సభామందిరము లందు నుత్సవములు జరుగుచుండును. బీడుభూమి కొంచెమైనను లేదు. ఆవుల మందలకు, మేఁకలమందలకు నిట్టి పశువులమందలకుఁ గొఱఁతలేదు. ప్రజలలో నొకరివలన నొకరికి బాధలేదు. వరిపైరు పండుటకు వానను నమ్మి యాకాశ మెగఁజూడవలసిన పనిలేదు, క్రూరమృగములు లేవు. జనులందఱు స్నేహభావ ముచే నైకమత్యము గలవారై యుందురు. వేలకొలఁది జనులు పురములం దున్నను వారికేవిధమైన భయములేదు. బంగారుగనులు వెండిగనులు రత్నపు గనులు చాలఁగలవు. ఇట్టి మనదేశము సుఖముగా నున్నదిగదా!

తే. దున్నియిలజీవనము చేయుచున్నవారి,
పశువులను మేపుకొనుచును బ్రతుకువారి
పట్లఁ బ్రీతి వహింపుదే వర్తకమున, బ్రదుకునీయాశ్రితులకు శుభంబు గలదె?

తాత్పర్యము.

భూమిదున్ని జీవనముచేయువారి విషయమందును పశువులను మేపి జీవించువారి విషయమందును వారు కష్టజీవులు గావున వారికిఁగావలసిన పదార్థముల సాహాయ్యము చేయుచున్నావా? ప్రజలు తమయాహార పదార్థములకు వారిపైఁగదా యాధారపడియున్నారు. అట్టులే వాణిజ్యముచే జీవించుచు నిన్నాశ్రయించుచుండువారికి శుభమేకదా వారికి నీవలనఁగాని యితరుల వలనఁగాని పీడలేదుగదా.

కం. ఇష్టంబుఁ గూర్చి వారి క,నిష్టంబును దీర్చి ప్రోతు•వే? జనపులు సం
తుష్టిని మన భూపతి విధి, దృష్టగతిం గావ వలయు•నెవ్వరి నైనన్. ౨౨౪౭

కృషిగోరక్షా వాణిజ్యాదులఁ జేయువారి రక్షణము రాజుల కవశ్యకర్తవ్యమని విశేషించి చెప్పుచున్నాఁడు.

ఇష్టంబుఁగూర్చి=కృషిచేయువారికిఁ గొఱముట్లకుఁగాను గావలసిన కొయ్య సామాను సెరవునకు నాకులడవులనుండి తెచ్చుకొనుటకుఁ బశువుల నడవులలో మేయుటకు నాజ్ఞయిచ్చుట మొదలయినవి. అనిష్టంబులు = వారి పశువులకు మృగాది బాధలేకుండఁజేయుట- ఇట్లే తక్కినవారినిగుఱించి యాలోచించునది, ప్రోతువే=రక్షించుచున్నావా, సంతుష్టిని=సంతోషముతో, మనన్=బ్రదుకునట్లు, విధిదృష్టగతిన్=శాస్త్రమందుఁ గానవచ్చువిధముగా, ఎవ్వరినైనన్ = ఏవర్ణము వారినైనను ఏయాశ్రమమువారి నైనను.

తాత్పర్యము

కృషి- గోరక్షణము- వాణిజ్యము చేయువారికి రాజు ప్రాపత్యంతావశ్యకము కావున వారికిఁ గావలసిన సాహాయ్యము చేయుచు వారి బాధలు దీర్చుచున్నావా? రాజగువాఁడు సమస్త వర్ణాశ్రమములవారిని శాస్త్రమునఁ జెప్పిన చొప్పున రక్షింపవలయును.

కం. నీకాంతల మన్నింతువె? ప్రాకట రక్షితలె వారు • వారలపలుకుల్
చేకొన కుందె? రహస్యం బేకాంతమునందు నైన•నెఱిఁగింపవుగా ?

తాత్పర్యము　　　　[౨౨౪౮

నిన్నాశ్రయించియుండు స్త్రీలను గౌరవించుచున్నావుకదా! వారికిఁ బరపురుష సంబంధము బాధలేకుండునట్లు రక్షించుచున్నావా? వారి బుద్ధిప్రకారము నీవు నడచుటలేదుకదా! ఏకాంతమందైనను నీవు వారికి రహస్య విషయములు చెప్పవుగదా! వారు చపలచిత్తలు కావున రహస్యము దాఁపలేరు.

శ్లో॥ పూజనీయా మహాభాగాః పుణ్యాశ్చ గృహదీప్తయా
స్త్రియశ్శ్రియో గృహస్యోక్తా స్తస్మాద్రక్ష్యా విశేషతః ॥

స్త్రీలు భాగ్యవతులు- పుణ్యవతులు- గృహదీపములు- గృహస్థునిపాలి లక్ష్ములు- పూజనీయులు. కావున వారిని విశేషించి రక్షింపవలయును. కాని వారిని నమ్మరాదు. ఉద్యోగ.

శ్లో॥ అర్హంతి నైవవిశ్వాస మర్థకాను పరాస్త్రియః
తాసు తత్త్వేనన బ్రూయా న్నాతిస్నేహో త్సదాసుధీః॥ భోజ.

బుద్ధిమంతులు స్త్రీలను నమ్మరాదు. వారెప్పుడు నర్థకామములందే యాసక్తి గలవారు. కావున మర్మమువిడిచి యథార్థము వారికిఁ జెప్పరాదు.

శ్లో॥ స్త్రీషు రాజను సర్పేషు స్వాధ్యాయే శత్రుసేవిషు
భోగేష్వాయుషి విశ్వాసం కః ప్రాజ్ఞః కర్తుమర్హతి ॥

స్త్రీలను- రాజును- సర్పమును- స్వాధ్యాయమును- శత్రుసేవకుని- భోగమును- ఆయుస్సును బుద్ధిగలవాఁ డెవ్వఁడు నమ్మును; ఉద్యోగ.

స్వభావ దౌర్బల్యమునకుఁ దోడు స్త్రీలకు ధర్మరాజు శాపంబును గలదు.

గీ॥ అంగనా జనమ్ములకు రహస్యరక్షణంబునం
దలిశక్తి మనంబులందుఁ, గలుగకుండెడు
మెల్లలోకముల నని శపించెనా ధర్మదే
వతా ప్రియ సుతుండు। భార. శాంతి. ౧-౪౧

కం. నాగవనము రక్షింతువె? బాగుగ ధేనుకలు గలవె♦పట్టఁగఁ గరులన్?
నాగాశ్వవశార్జనమున, నేగతి సంతుష్టిలేక ♦ యెసఁగుదువు కదా? ౫౦

నాగవనము=ఏనుఁగులుండు నడవి, ధేనుకలు=ఆఁడేనుఁగులు, నాగ = ఏనుఁగులయొక్కయు, అశ్వ = గుఱ్ఱములయొక్కయు, వశా = ఆఁడేనుఁగుల యొక్కయు, ఆర్జనమునన్=సంపాదించుటయందు, సంతుష్టి = తృప్తి.

తాత్పర్యము

ఏనుఁగులుండు నడవుల రక్షించుచున్నావుగదా! నీవు రక్షింపనియెడల నితరు లేనుఁగులఁ బట్టుకొనిపోదురు. మగయేనుఁగులఁ బట్టుటకు నాఁడేనుఁగుల రక్షించుచున్నావుగదా! నా కిన్నియేనుఁగులు గుఱ్ఱము లున్నవి చాలునని తృప్తిపడక యాఁడేనుఁగులను మగయేనుఁగులను గుఱ్ఱములను సంపాదించుచున్నావా ?

కం. దినముదినంబును వఱువా,తను భూమీజనుల కెల్ల♦దర్శన మిడు దే?
యనుమానింతురు దేహం,
బున కేమో నృపతి కనుచుఁ బొడచూపనిచోన్. ౫౧

వఱువాతను=ఉదయకాలమున, పొడచూపనిచోన్=కానరాకున్నయెడల.

తాత్పర్యము.

ప్రతిదిన ముదయకాలమున సభయందుఁ బ్రజలకు దర్శన మిచ్చు చున్నావా? కొన్నిదినములు రాకపోయితివేని నీకేమో రోగము వచ్చినది- ఆ కారణమున వెలుపల రాలేదని సందేహింతురు.

కం. పనివాండ్రను విచ్చలవిడిఁ, దనుఁ జేరఁగ నీయరాదు • తఱచుగ వారిన్
గనుఁగొనక యుండరా దిం,దును మధ్యమవృత్తి మేలు • దొరలకుఁ బూనన్. [౨౨౪౧

తాత్పర్యము

సేవకులు నియమములేక వారివారి యిష్టానుసారము వచ్చుచుఁ బోవుచుందురేని యతిపరిచితివలన వారు నిన్నుఁ జులకనగాఁ జూతురు. వారిని బొత్తుగఁ జూడకయు నుండరాదు. ఎప్పుడైన నొకసారి చూచి వారి స్థితిగతులు రాజు విచారింపవలెను.

కం. ధనధాన్యతోయసాధన, వినిచయసంగతములే ప్ర • వీరభటశరా
సనధరయుతములె శిల్పిక,జనయుక్తములౌనెదుర్గ • చయములు భరతా?

నీదుర్గచయములు=నీకోటల సమూహములు, దుర్గము=చొరరానిది, ధన- ధాన్య- తోయ- సాధన- వినిచయసంగతములె=ధనముయొక్కయు- ధాన్యము యొక్కయు- జలములయొక్కయు- నాయుధములయొక్కయు సమూహములచేఁ గూడినవి, ప్రవీరభటశరాసనధరయుతములె = మిగులవీరులగు భటులతోను- విలుకాండ్రచేతను గూడియున్నవా? శిల్పికజనయుక్తములు = శిల్పపుఁ బని చేయువారితోఁ గూడియున్నావా? ఔదకం పార్వతం వార్క్షమైరిణం ధాన్వనం తథా, జలాన్నాయుధయంత్రాఢ్యం వీరయోధైరధిష్ఠితం, గుప్తిప్రాధాన మాచార్యాదుర్గం సమను మేనిరే యని కామందకము.

తాత్పర్యము

తమ్ముఁడా! నీ గిరిదుర్గములు-జలదుర్గములు-వనదుర్గములు- లోనైనవి ధనముచేతను- ధాన్యముచేతను- జలములచేతను- ఆయుధములచేతను గూడి యున్నవికదా? వీరులగు భటులు విలుకాండ్రు రక్షించుచున్నారుగదా? పనులు చేయుటకు శిల్పులున్నారుగదా.

ఉ. ఆయము లున్నె దండిగ? వ్య • యంబును స్వల్పమ చేయుచుండుదే?
యేయెడ నీధనంబుఁ జన • నీయవు గాదె యపాత్రులందు? నీ
వీయుదె యోధపాతిథిమ • హీసురమిత్రులకు స్ధనంబులన్ ?
జేయుదె దేవతాపితృల • చేఁతలకై ధనరూపసాహ్యమున్ ? ౨౨౪౩

ఆయములు=ఆదాయములు, దండిగ = విశేషముగ, అపాత్రులందున్= అయోగ్యులందు, యోధప=ముఖ్యయోధులకు-అతిథులకు, మహీసుర=బ్రాహ్మ

ణులకు, మిత్రులకున్ = స్నేహితులకు, దేవతాపితృలచేఁతలకై = దేవతాకార్యములు- పితృకార్యములు చేయువారికి.

తాత్పర్యము

వ్యయమునకంటె విశేషించి యాదాయమున్నదికదా! ఆయమును మించి వ్యయము చేయకుండుటేగాక యాయమునకంటెఁ దక్కువగానే వ్యయము చేయుచున్నావుకదా! అయోగ్యులకు అనఁగా నటవిటగాయక చేటీ వేశ్యలకు విశేషముగ నీవు ధనమియ్యవుగదా! యోధముఖ్యులకు నతిథులకు బ్రాహ్మణులకు స్నేహితులకు ధనము లిచ్చుచున్నావా? వీరికిచ్చుట సత్పాత్ర వినియోగము. దేవతాకార్యములు పితృకార్యములు చేయువారికి ధనమిచ్చి సాహాయ్యము చేయుచున్నావా? అన్నికార్యములు మనమే చేయఁజాలము గావునఁ జేసెడివారికిఁ దోడుపడవలయును. పుణ్యకార్యములు స్వయముగఁ జేయఁజాలనివారు, వానిని జేసెడివారికి సాహాయ్యము చేసినచోఁ గొంత పుణ్యము లభించును.

చం. అమలమనస్కుఁడున్ శుచియు ♦ నార్యుఁడు నౌనొకరుండు చోరక
ర్మమునను దూషితుం డయినఁ ♦ బ్రాజ్ఞుల నీ వడుగంగఁబోక లో
భమున వధింతువా? ఖలుఁడు ♦ పట్టుపడంగ సకారణంబ చౌ
ర్యమునకు వానిచే ధనము ♦ లంది వధింపక వీడవే కదా? ౫౬-౫౭

అమలమనస్కుఁడున్=నిర్మలమైన మనస్సుగలవాఁడును, శుచియున్= వాక్కాయములందుఁ బరిశుద్ధుఁడును- ఈరెండు విశేషములవలన వీఁడు త్రికరణశుద్ధిగలవాఁడని యేర్పడుచున్నది. ఇట్టివాఁడు- చోరకర్మమునను = దొంగతనముచేత, దూషితుండయినన్=నిందింపఁబడెనేని, అత్యాశచే = వానిని వధించిన వానిద్రవ్యము నీకు లభించునుగదా యనునాశచే ననిభావము, వధింతువా =చంపుదువా, ఖలుఁడు=దుష్టుఁడు, సకారణంబ=సత్యమైన కారణముతో, చౌర్యమునకున్=దొంగతనమునకు.

తాత్పర్యము

త్రికరణ శుద్ధుఁడైనవాఁడొకఁడు దైవవశమున దొంగతనము చేసినాఁడని నిందింపఁబడెనేని వాని నేమిచేయవలయునని బుద్ధిమంతుల నడుగక వానిని జంపిన వానిద్రవ్యము నీ ధనశాలచేరునను తలంపుతో వానిని జంపవుకదా! వాస్తవముగ నేరముజేసి దొంగతనమునకై పట్టుపడెనేని వానివలన ధనలాభము పొందినవాఁడవై వానిని జంపక వదలిపెట్టవుకదా?

కం. ధనికునకును ధనహీనున,కును వ్యవహారంబు పొసఁగ ♦ గుటిలత మంత్రుల్
ధనికునిరొక్కముపై నా,శను గొన కుండఁగఁ బరీక్ష ♦ సలుపుదె వారిన్?

తా త్ప ర్య ము

ధనము కలవానికిఁ బేదవానికిఁ గలహము గలిగినప్పుడు కుటిలబుద్ధులై నీమంత్రులు లంచగొండులై ధనికుని ధనముపై నాశపడకుండునట్లు వారిని బరీక్షింతువా?

కం. దోసమును జేయకుండియు, శాసింపఁగఁ బడినయట్టి♦జనములయశ్రుల్
వాసి చెడఁ జేయు భోగ్యై, కాసక్తు నృపాలుఁ బశుధ♦నాత్మజహీనున్.

తా త్ప ర్య ము [౨౨౮౬

దోషము చేయకయు దండింపఁబడినవాని కన్నీళ్ళు భోగమందాసక్తిగల రాజుయొక్క పశువులను ధనములను గొడుకులను జంపును. నేరము చేసిన వానిని విడుచుటవలనఁ గలుగు పాపమునకంటె నేరము చేయనివానిని దండించిన నెక్కువ పాపముగలదు.

కం. బాలుర వృద్ధుల వైద్యుల, నోలిని వశ్యులుగఁ జేయు♦చుందువు కాదే
మేలిధనంబులఁ బ్రేమను, మై లలితోక్తులను మూఁడు♦మార్గంబులచేతన్.

తా త్ప ర్య ము [౨౨౮౪

బాలకులను ముదుసళ్ళను వైద్యులను బుజ్జగింపుమాటలచేతను బ్రేమతో నాదరించుటచేతను ధనమిచ్చుటచేతను నీ మూఁడుమార్గములచే వశపఱుచు కొనుచున్నావా?

కం. గురువృద్ధతాపసోర్వీసురచైత్యాతిథుల కెల్ల ♦ శుభసిద్ధార్థో
త్కర దేవతాళి కెల్లను, వరమతి వయి మ్రొక్కు చుందు♦వా కడుభక్తిన్?

ఉర్వీసుర=బ్రాహ్మణులకు, చైత్య=నాలుగుత్రోవలు కలియుచోటనుండు దేవతావాస వృక్షములకు, సిద్ధార్థోత్కర = ప్రయోజనము సిద్ధించినవారి సమూహములకు, దేవతాళికిన్=దేవతల సమూహములకు, వరమతివై=నిర్మల మనస్సు గలవాఁడవై.

తా త్ప ర్య ము

గురువులకు- వృద్ధులకు- తాపసులకు- బ్రాహ్మణులకు నాలుగు వీథులు కలియుచోట దేవతలువసించు చెట్లకు నతిథులకు శుభప్రయోజనము- మోక్ష లాభము సిద్ధించినవారికి- దేవతలకందఱకు మిగులభక్తితో నిర్మల మనస్సుతో నమస్కరించుచున్నావా?

కం. అర్థముచే ధర్మంబును, నర్థము ధర్మంబుచేత ♦ నవి కామముచే
వ్యర్థంబులు గాకుండ స,మర్థింతువె? సుఖము మరగి♦యవి చెఱపవుగా?

తా త్ప ర్య ము [౨౨౮౯

అర్థముచేత ధర్మంబును వ్యర్థముచేయుట లేదుగదా! యనఁగా ధర్మము సంపాదింపవలసిన సమయము పూర్వాహ్ణము, అసమయంబున నర్థము సంపా

దించుట యెట్టులాయని యాలోచించుచు ధర్మముచేయక దానిని నేటఁగలుపుచున్నావా? అట్టులే యర్థము సంపాదింపవలసినకాల మపరాహ్ణము. ఆ సమయమందు ధర్మవిచారముచేయుచు నర్థమును సంపాదింపక వ్యర్థముచేయుట లేదుకదా! రాత్రులందు ననుభవింపవలసిన కామము పూర్వాహ్ణముల నపరాహ్ణముల ననుభవించుచు నారెంటినినాలోచింపక వానిని వ్యర్థముచేయుచున్నావా? ధర్మార్థకామముల మూఁటిని నేయేవేళకేయేది చేయవలయునో యది యావేళకు సరిగాఁ జేయుచున్నావుగదా! అర్థముమీఁది యాశచే లోభివై ధర్మకార్యములుచేయుట మానలేదుకదా! కేవల ధర్మాసక్తిచేఁ గుటుంబపోషణమునకుఁ గావలసిన యర్థము సంపాదింప మానలేదుగదా! కేవల సుఖాభిలాషచే ధర్మార్థముల రెంటిని ధ్వంసము చేయలేదుగదా?

కం. ఉదయంబున ధర్మంబును, బదపడి యర్థంబు ప్రొద్దు•పడఁ గామం బ
 య్యది యెఱిఁగి యనుష్ఠింతువె?
 మది చెడి కలయంగ నీకు•మా యొండొంటిన్. ౨౬౦

తాత్పర్యము.

మీఁది విషయమునే స్పష్టీకరించుచున్నాఁడు. ఉదయకాలమున ధర్మార్జనము- ఆవల నర్థార్జనముచేసి ప్రొద్దుగ్రుంకినపిమ్మట నొకటిన్నరజామైన పిమ్మటఁగామసుఖ మనుభవించుచున్నావా? ఒకదానితో మఱియొకటి కలుపుట లేదుగదా? ఉదయమనఁగా సూర్యోదయమునకు నరజాము ముందటినుండి యని గ్రహింపవలెను. ప్రొద్దుగ్రుంకినపిమ్మట ననఁగా సూర్యాస్తమయము కాఁగానే భార్యతోడఁ భోగశయ్య నలంకరింపుమని యర్థముకాదు. సాయాహ్న కృత్యములు భోజనాదులు జాముపఱకుఁ దీర్చుకొని యావల గంటకో గంటన్నరకో యనియర్థము. రాత్రి భోజనమైన తరువాత నధమపక్షము రెండు గంటలకులోగా భార్యతో సంగమింపరాదు.

తే. సర్వశాస్త్రార్థ నిపుణు లౌ•క్ష్మావిబుధులు, పౌరజానపదాళితోఁ•బ్రత్యహంబు
 నీవుధరమీఁద సుఖివయి•నెగడుటకును,
 బ్రార్థనముఁ జేయుచున్నా రె•రాజతనయ. ౨౬౧

సర్వశాస్త్రార్థనిపుణులు=సమస్తశాస్త్రంబులందు సమర్థులు, క్ష్మావిబుధులు =బ్రాహ్మణులు, పౌరజానపదాళితోన్=పురమువారితోను బయటియూళ్ళవారితోను, ప్రత్యహంబు = ప్రతిదినము.

తాత్పర్యము

సకల శాస్త్రములయందు సామర్థ్యముగల పండితులగు బ్రాహ్మణులు పురజనులతోను బయటియూళ్ళవారితోను గలిసి మారాజు సుఖముగ దీర్ఘాయువై

జీవించునుగాక యని ప్రార్థనము చేయునట్లు వారికి సంతోషకరముగ ధర్మ పద్ధతిని రాజ్యము చేయుచున్నావుగదా! నానిమిత్తమై మీరు ప్రార్థనముచేయుఁడని యాజ్ఞచేసి చేయించుట లేదుగదా?

సీ. అనృతంబుపలుకుట • నాస్తిక బుద్ధియు, దీర్ఘసూత్రత క్రుధ•ధీప్రమాద
మాలస్యమును జ్ఞాని•పాళికి దర్శనం, బీయకుండుట పంచ•వృత్తితయును
గార్యంబుపట్ల నొ•క్కండ యాలోచించు, టెట్టివానికి నెదు•రేగు చుంట
నిశ్చితకార్యంబు•నెఱవేర్పమియు నన,ర్థజ్ఞులతోడ మం•త్రంబు సేఁత
తే. మంత్రమును రక్ష సేయమి•మంగళంబు,లైనకార్యంబులందు న•నాదరంబు
ననఁగఁ బరఁగెడిపదునాలు•గైన రాజ,
దోషములు లేక యుందె ని•ర్దుష్టచరిత. ౧౭౯౦

అనృతంబు=అసత్యము, నాస్తికబుద్ధి =పరలోకము లేదు ఈశ్వరుఁడు లేఁడను బుద్ధి, దీర్ఘసూత్రత = నిశ్చయించిన పిమ్మట వెంటనే కార్యముచేయ నారంభింపక జేపు చేయుదము లే_ మఱునాఁడు చేయుదములేయని వ్యర్థముగఁ గాలయాపనము చేయుట, క్రుధ = మాతాపితృ బ్రాహ్మణాచార్య దుర్బలుల యెడను_ అసమయములందును గోపము, ధీప్రమాదము = బుద్ధియజాగ్రత్త, ఆలస్యము=సోమరితనము_ మదకరములగు పదార్థములఁ దినుటచేఁ గలిగెడి మాంద్యము, జ్ఞానిపాళికిన్=పండిత సమూహమునకు, పంచవృత్తిత = పంచేంద్రియములకు వశుఁడై యుండుట, కార్యంబులపట్ల=రాజ్యసంబంధ కార్యములందు, నిశ్చితకార్యము=కర్తవ్యమని నిశ్చయించినకార్యము అనర్థజ్ఞులతోడన్ =తనకుఁ గీడాలోచించువారితో, మంత్రమును = ఆలోచనను, మంగళంబులైన కార్యంబులందున్=ఉదయమున నద్దము పూలు సరిగ వస్త్రములు లోనైనవానిని జూచుట మొదలయినవి, అనాదరంబు=నిర్లక్ష్యభావము, నిర్దుష్టచరిత=దోషము లేని నడవడిగలవాఁడా.

తాత్పర్యము.

1 అసత్యముపలుకుట 2 పరములేదు, దేవుఁడులేఁడనుబుద్ధి 3 కార్యము చేయక దీర్ఘాలోచనముసందే కాలముగడుపుట 4 కోపింపరానివారి మీఁదను గోపింపరాని సమయములందును గోపించుట 5 బుద్ధిపొరపాటు 6 మాంద్యము 7 జ్ఞానులదర్శనము శ్రేయస్కరము గావున మనమైపోకపోయినను వారైవచ్చి నపుడైనను వారిని దర్శింపకుండుట 8 పంచేంద్రియములకు లోపడియుండుట 9 రాజకార్యములను దానొక్కఁడే యాలోచించుట_ 'కం. విను మధురాహారంబులు। గొనుటయుఁ బెక్కండ్రు నిద్రగూరినయెడ మేల్కని యుండుటకార్యాలో। చనము దెరువు నడచుటయును జనదొక్కనికిన్॥ భార. 10. నీమనకుఁగూడ వాఁడురాఁగానే యెదురుగాఁబోయి గౌరవించుట_ లేక యేకకాలమున నానా దిక్కులనుండు శత్రువులపై దండెత్తుట_11 నిశ్చయింపఁబడిన కార్యము చేయ

కుండుట- 12 అనర్థజ్ఞులగువారితో నాలోచించుట 13 ఆలోచనను దాఁపక బయలుపెట్టుట- 14 శుభకార్యములందు నిర్లక్ష్యభావము- ఇవి పదునాలుగు రాజులయం దుండరాని దోషములు- ఇవిలేక రాజ్యము చేయుచున్నావుగదా?

రాజదోషము లింకను బెక్కులున్నను వానియందు ముఖ్యములైన వీ పదునాలుగని యెఱుంగవలయును.

కం. పదియును నైదును నాల్గెన్మిది యేడును మూఁడు నైన •నెఱివర్గములన్
వదలక విద్యలమూఁటిని, మదిఁ దలఁతువె? యింద్రియములఁ•మర్దించితి వే?

పదివర్గములు = వేఁట- జూదము- పగటినిద్ర- అపవాదము- స్త్రీలు- మదము- నృత్తము- గీతము- హద్యములు- వ్యర్థముగాఁ దిరుగుట- ఈపదియును "మృగయాక్షోదివాస్వప్నః పరివాదః స్త్రియోమదః తౌర్యత్రికం వృథాట్యాచ కామజో దశకోగుణ" ఇతి మనువు. లోభము- క్రోధము- ఆలస్యము- అసత్యము- అజాగ్రత భయస్వభావము- అస్థిరత్త్వము- మౌఢ్యము- దుర్నీతి- అవమానపఱుచుట- యివి పది వర్గములని కామందకుఁడు.

ఆయిదువర్గములు=అయిదుదుర్గములు=జలదుర్గము. పర్వతదుర్గము- వృక్షదుర్గము-(మరు)ఎడారిదుర్గము- ధాన్వనదుర్గము- ఔదకం పార్వతం వార్క్షమైరిణం ధాన్వనంతథా శస్త్రంప్రశస్తమతిభిః దుర్గందుర్గోపచింతకైః" మనుస్మృతి.

అయిదువర్గములు=ఐదువైరములు- "సాపత్న్యం వస్తుజం స్త్రీజం వాగ్జాతమపరాధజమ్ వైరప్రభేద నిపుణై ర్వైరం పంచవిధం స్మృతమ్" కామందకుఁడు. జ్ఞాతులగుటచేతను- ఒక వస్తువు నాదినాదియని కలహించుటచేతను- స్త్రీల నిమిత్తముగను- వాక్పారుష్యముచేతను- అపరాధము చేయుటచేతను విరోధము గలుగును. ఈయైదు విరోధకారణములు.

నాలుగువర్గములు : 1 సామము- దానము- భేదము- దండము. 2 ఔరస మిత్రుఁడు- తంతుసంబంధమిత్రుఁడు- వంశక్రమమిత్రుఁడు- వ్యసనమునుండి రక్షించుటచే నైనమిత్రుఁడు- ఈ నలువురు మిత్రులు. "ఔరసం తంతు సంబంధం తథా వంశక్రమాగతమ్ రక్షితం వ్యసనేభ్యశ్చ, మిత్రంజ్ఞేయం చతుర్విధ" మ్మని కామందకుఁడు. 3 న్యాయేనార్జన మర్థస్య, రక్షణంవర్ధనంతథా సత్పాత్రే ప్రతిపత్తిశ్చ రాజవృత్తం చతుర్విధమ్మని కామందకుఁడు. ధనమును న్యాయముగా సంపాదించుట దానిని రక్షించుట వృద్ధిచేయుట దానిని సత్పాత్రమునకు దానముచేయుట- ఈ నాలుగు ధర్మచతుష్టయ మనఁబడును. ఏడు వర్గములు: 1 రాజు- మంత్రి- మిత్రుఁడు- బొక్కసము- రాష్ట్రము- దుర్గము- సైన్యము- ఇవి సప్తాంగములు. స్వామ్యమాత్యాశ్చరాష్ట్రంచ దుర్గకోశోబలం సుహృత్, పరస్పరోపకారీదం రాజ్యంసప్తాంగ ముచ్యతే॥ 2 తనపక్షమువారిలోని భేద

ములు- తనవాఁడు మైత్రుఁడు ఆశ్రితుఁడు- సుబంధుపుత్రుఁడు కార్యసముద్భవుఁడు భృత్యుఁడు అనేకవిధములగు నుపచారములచే వశపఱుచుకొనఁబడినవాఁడు- నిజోర్థమైత్రశ్చ సమాశ్రితశ్చ సుబంధుజః, కార్యసముద్భవశ్చ,భృత్యో గృహీతో వివిధోపచారైః పక్షంబుధా సప్తవిధంవదంతి— ప్రధానవ్యూహము లేదు. 1 శ్యేన వ్యూహము 2 సూచీవ్యూహము 3 వజ్రవ్యూహము 4 శకట వ్యూహము 5 మకరవ్యూహము 6 దండవ్యూహము 7 పద్మవ్యూహము ఇవి ప్రధానములైనవి. ఇనిగాక గరుడవ్యూహము లోనైనవి కొన్ని గలవు. శ్యేనస్సూచీచవజ్రశ్చ శకటోమకర స్తథాదండాఖ్యః పద్మనామాచ వ్యూహా స్సప్తప్రధానతః॥

ఎనిమిది వర్గములు : కృషి- వాణిజ్యము- దుర్గములు- ఆనకట్ట- ఏనుఁగుల కట్టుట- గనులు పన్నురాఁబట్టుట శూన్యనివేశనము.“కృషి వాణిజ్య దుర్గాణి సేతుః కుంజర బంధనమ్। ఖన్యాకరః కరాదానం శూన్యానాం చనివేశనం। అష్టవర్గమిమం సాధు స్వష్టవృత్తోనలోపయేత్॥ కామందకుఁడు. “పైశున్యం, సాహసం ద్రోహం ఈర్ష్యాసూయార్థదూషణమ్। వాగ్దండ యోశ్చ పారుష్యం క్రోధజోపి గుణోష్టక॥” అని కామందకుఁడు. కొండెముచెప్పుట- సాహసము- ద్రోహము- ఈర్ష్య=ఓర్పులేనితనము- ఓర్పులేకపోవుటగాని ఓర్పునకు విరోధియైనదిగాని యగు గుణము, అజ్ఞులు=దుర్బ్బలులుచేసిన యపరాధముల సహింపలేకపోవుట, అసూయ = పరుల గుణములను దోషములుగాఁ జెప్పుట- ధనము యొక్క వ్యర్థవ్యయము, వాక్పారుష్యము = నిష్ఠురముగ మాటలాడుట- ఇవి క్రోధమువలనఁ గలుగు గుణములు.

మూఁడువర్గములు : ధర్మము- అర్థము- కామము. 2 ఉత్సాహశక్తి- ప్రభుత్వశక్తి-మంత్రశక్తి- = ఇతరులక్షయము స్థానమువృద్ధి క్షయః స్థానంచ వృద్ధిశ్చ- త్రివర్గో నీతివేదనామ్” అనురుఁడు. 4 వస్తుష్వశక్యేషు సముద్యమశ్చ- శక్యేషుమోహాదసముద్యమశ్చ- శక్యేష్వకాలేషు సముద్యమశ్చ- త్రిధైవకార్య వ్యసనంవదంతి” కామందకుఁడు శక్తికిమించిన పనికి యత్నించుట- శక్యమైనదానిని మోహమున యత్నింపకుండుట- శక్యమైనను నకాలమందు యత్నించుట- యీమూఁడు కార్యవ్యసనము లనఁబడును 5 త్రయి- వార్త- దండనీతి- ఇవి ఆన్వీక్షికితో నాలుగైనను నది త్రయియందంతర్భావము— “త్రయీవార్తా దండనీతరితి విద్యాహిమానవాః। త్రయ్యా ఏవవిశేషోయ మియమాన్వీక్షకీమతా’’ కామందకుఁడు. ఇందు త్రయ యనఁగా ఋక్కు యజుస్సు సామము అనఁబడు మూఁడువేదములు. వార్తయనఁగా:— కృషి గోరక్షణ వాణిజ్యములు- కొందఱు వార్తాపత్రికలమీఁద వార్తయంద జగము వర్తిలుచున్నది యను భారతపద్యమును నుదాహరించుచున్నారు. “వార్తయంద జగము వర్తిలుచున్నది యదియులేనినాఁడ యఖిలజగము లంధకార మగ్నమగునటు గావున వార్త నిర్వహింపవలయుఁ బతికి” ఇచట వార్తయనఁగాఁ

గృషిగోరక్షణ వాణిజ్యములనియే యర్థముగాని ప్రొద్దుపోని ముచ్చటలు చెప్పుట గాదు. దండనీతి=నీతిశాస్త్రము.

తా త్ప ర్య ము

దశవర్గము- పంచవర్గము- చతుర్వర్గము- అష్టవర్గము- త్రివర్గము-విద్యాత్రయము. అను వీనిలక్షణములు దెలిసి యందేవి గ్రాహ్యములో యేవిత్యాజ్యములో యెఱింగి గ్రహింప వానిని నాచరించుచు విడువవలసినవానిని వదలుచు నున్నావా? ఇంద్రియములను నీవు చక్కఁగా శిక్షించి వశపఱుచుకొంటివా ?

తే. దైవమానుషవ్యసనము♦ల్దెలఁతె కైత్యప్రకృతిమండల వింశతి♦వర్గములను
షడ్గుణంబుల వానిలో♦సంధి విగ్రహంబు యాత్రయు దండవి♦ధంబుఁ దలఁతె? ౭౬౪

దైవమానుషవ్యసనములు = దైవమువలనను మనుష్యులవలనను గలుగు-వ్యసనములు = నిప్పు- నీళ్ళు- వ్యాధి- కఱవు- చావు- ఈయైదు దైవవ్యసనములు. ఇవి దైవికముగా వచ్చునవి. అధికారులవలన దొంగలవలన- శత్రువుల వలన రాజలోభము వలన రాజప్రియులవలనఁ గలుగు వ్యసనములు మానుష వ్యసనములు. ఇవి యైదు విధములు.

హుతాశనో జలంవ్యాధి ర్దుర్భిక్షం మరణం తథా। ఇతి పంచవిధం దైవం మానుషం వ్యసనంపరం అయుక్తేభ్యశ్చ చోరేభ్యః పరేభ్యో రాజవల్లభాత్। పృథివీపతి లోభాచ్చవ్యసనం పంచధా భవేత్॥

కృత్య=కృత్యము- భేదనము- ఇది అలబ్ధవేతనుఁడు = కొలువుచేసిన దినములకు జీతము రావలసియుండియు నదిరాని ధనాసక్తుఁడు- మానవంతుఁడై యుండియు నవమానింపఁబడినవాఁడు- నిష్కారణముగ రాజుచేఁ గోపింపఁబడి రాజునందుఁ గోపముగలవాఁడు- భయపెట్టఁబడినవాఁడగుటచే భయపడియుండువాఁడు- ఈ నలువురను వారికి వారికిఁ గావలసినవి యిచ్చి శత్రురాజునుండి భేదించునట్లు చేయవలయును. "అలబ్ధవేతనోలుబ్ధో, మానీ చాప్యవమానితః। క్రుద్ధశ్చ కోపితోనస్మాత్తదాభీతశ్చ భీషితః। యథాభిలభిషితైః కామైర్భింద్యాదేతాం శ్చతుర్విధాన్॥ కామందకుఁడు. ప్రకృతి = ప్రకృతివర్గము- అమాత్య రాష్ట్రదుర్గాణి కోశోదండశ్చ పంచమః। ఏతాః ప్రకృతయ స్తజ్జై ర్విజిగీషో రుదాహృతా యని కామందకుఁడు.

మంత్రి- రాష్ట్రము- దుర్గము- బొక్కసము- దండము యీయైదు ప్రకృతివర్గ మనఁబడును.

మండలము=పండ్రెండువిధముల రాజుగలది- నడుమనుండువాఁడు విజిగీషువు- వీనికి ముందుండువారైదుగురు- శత్రువు- మిత్రుఁడు- శత్రుమిత్రుఁడు- మిత్రమిత్రుఁడు- శత్రుమిత్రమిత్రుఁడు- వీనికి వెనుకనుండువారు-

పార్ష్ణిగ్రాహుఁడు ఆక్రందుఁడు పార్ష్ణిగ్రాహాసారుఁడు ఆక్రందాసారుఁడని నాలుగు విధములు- పార్శ్వమందుండు మధ్యముఁడు వీరికి వెలుపలనుండువాఁ డుదాసీనుఁడు.

విజిగీషువు రాజ్యమున కానుకొనియుండు రాజ్యమునకుఁ బ్రభువు విజిగీషునకు శత్రువు, వాని రాజ్యమున కానుకొని యావలనుండువాఁడు విజిగీషునకు మిత్రుఁడు, అమిత్రుని రాజ్యమున కానుకొనియుండువాఁడు విజిగీషునకు శత్రుమిత్రుఁడు, శత్రుమిత్రున కానుకొనియుండువాఁడు విజిగీషునకు మిత్రశత్రుఁడు. వాని కావలివాఁడు శత్రుమిత్రమిత్రుఁడు ఇట్టులే వెనుకవైపు చూచునది, విజిగీషువునకు వెనుకటివాఁడు పార్ష్ణిగ్రాహుఁడు, వానివెనుకటివాఁడు ఆక్రందుఁడు వాని వెనుకటివాఁడు పార్ష్ణిగ్రాహాసారుఁడు వానివెనుకటివాఁడు, ఆక్రందాసారుఁడు, ఇచ్చటి శత్రుమిత్రాది శబ్దము లాయాదేశపు రాజులపేర్లుమాత్రమే కాని వాస్తవ శత్రుమిత్ర వాచకములుగావు. అట్టివాని నట్టివానిఁగా భావించి వర్తింపవలయును.

తన రాజ్యమునకు నానుకొనియుండు రాజు తానెప్పుడు చెడునో తన రాజ్యమెప్పుడు దానాక్రమింతునా యని సమయమునకు వేచియుండును గావున వానిని శత్రువువలె భావింపవలయును, వానిప్రక్క నుండువాఁడు వానికి శత్రువు గావునఁ దనకుమిత్రుఁడు ఇట్లే తక్కినవి, మధ్యముఁడు విజిగీషువునుగాని శత్రువునుగాని నిగ్రహించుటకు సమర్థుఁడగును. విజిగీషు ప్రక్కదేశపురాజు ఉదాసీనుఁడు పదునొకొండుగురికి నొక్కటిగానైనను వేఱువేఱుగానైనను నిగ్రహానుగ్రహములఁజేయ సమర్థుఁడగును.

వింశతి వర్గములు, బాలుఁడు వృద్ధుఁడు దీర్ఘవ్యాధిగ్రస్తుఁడు బంధువులచే బహిష్కరింపఁబడినవాఁడు భయపడుస్వభావము గలవాఁడు భయవంతులగు మంత్రి సేనాపత్యాదులగువాఁడు లుబ్ధుఁడు లుబ్ధజనులుగలవాఁడు విరక్తప్రకృతి, విషయాసక్తుఁడు అనేకాలోచనలు గలవాఁడు, దేవబ్రాహ్మణ నిందకుఁడు, ఋషిశాపగ్రస్తుఁడు దైవమే మనకు సర్వము నిచ్చునని ప్రయత్నము సేయనివాఁడు దుర్భిక్షముచేఁ బీడితుఁడు, సేన నశించినవాఁడు దేశాంతరము పోయినవాఁడు, అనేకశత్రువులు గలవాఁడు క్రూరగ్రహదశలు గలవాఁడు, సత్యము ధర్మము లేనివాఁడు అను నిరువది విధములగు రాజులుగలరు. వీరితో సంధి సేయరాదు. వీరితో యుద్ధమే చేయవలయు నని నీతిశాస్త్రము,

బాలో వృద్ధో దీర్ఘరోగీ తథాజ్ఞాతి బహిష్కృతః
భీరుకో భీరుజనకో లుబ్ధో లుబ్ధ జనస్తథా
విరక్తప్రకృతిశ్చైన విషయేష్వతి సక్తిమాన్
అనేకచిత్త మంత్రశ్చ దేవబ్రాహ్మణనిందకః
దైవోపహత కశ్చైవ దైవచింతక ఏవచ

దుర్భిక్ష వ్యసనపేతో బలవ్యసనసంకులః
అదేశస్థో బహురిపుర్యుక్తో కాలేనయశ్చసః
సత్యధర్మవ్యపేతశ్చ వింశతిః పురుషా అమీ
ఏతైస్సంధిం నకుర్వీత, విగృహ్ణీయాత్తు కేవలమ్. కామందకుఁడు.

(అ) ఇరువది యుద్ధకారణములు రాజ్యము నపహరించుట, స్త్రీనపహరించుట, స్థానము నపహరించుట, దేశము నపహరించుట, బంధువు నపహరించుట, ధనము నపహరించుట,మదము,మానము,విషయాసక్తి, అర్థజ్ఞానశక్తి, ధర్మనాశములు, దైవవిరోధము, మిత్రావమానము, మిత్రద్రవ్యాపహరణము, బంధునాశము, భూతదయాశూన్యత, మండలదూషణము, అనఁగా తనమంత్రి సేనాపతి మిత్రుల విఘటనము,ఒక్కలాభమునకే యనేకులాశపడుట. ఈ యిరువది యుద్ధకారణములు.

శంబరాసురుఁ డింద్రునితోడ విరోధించెను గావున దశరథుఁడు వానిని జంపెను. ఇది దైవవిరోధమను కారణము, తనమిత్రుఁడగు సుగ్రీవునితో వాలి విరోధించి తనసమక్షమందే ప్రహరించెను గావున శ్రీరాముఁడు వాలిని జంపెను. తనకుమిత్రుఁడైన సాత్యకిని,భూరిశ్రవుఁడు తనయెదుటనే జంపఁజూచెను గావున వాఁడితరునితో యుద్ధముచేయుచున్నను అర్జునుఁడు వధించెను. ఇవి మిత్రవిరోధములను కారణము. స్వమిత్రవిరోధి స్వవిరోధియే భోజనవిషయమున కృష్ణ దుర్యోధన సంభాషణము చూచునది.

షడ్గుణములు: సంధి, విగ్రహము యానము, ఆసనము ద్వైధీభావము, సమాశ్రయము, ముఖ్యములైనవి మొదటినాలుగు. యానాసనములు విగ్రహమందు ద్వైధీభావ సమాశ్రయములు సంధియందుఁజేరును. పోఁగామిగిలినవి ముఖ్యములైనవి సంధివిగ్రహములు రెండే యగుచున్నవి. సంధి=విజిగీషువు (జయింపనిచ్చగలవాఁడు) కోరిన నిబంధనములకు సమాధానపడినవానితోఁ జేరుట. విగ్రహము=యుద్ధము, ఆసారమనఁగా=మిత్రబలము, ఆసారస్స్యాన్మిత్రబలే"యని రత్నమాల. విజిగీషువునకు నతనిశత్రువునకు నిరువురకు బలము తగ్గినపుడు మంచిశక్తివచ్చు కాలము నెదురు చూచుచు యుద్ధప్రయత్నము సేయక యూరకుండుట యాసనమనఁబడును.ద్వైధీభావము=ఒక్కనికి నిరువురు శత్రువు లున్నప్పుడు వారిద్దఱితోను మంచిమాట చెప్పుకొని తనయాత్మను వారికి సమర్పించినట్లు చెప్పుట, సమాశ్రయము శత్రువుచేఁ బీడింపఁబడుచున్న యొక రాజు బలవంతుఁడగు మఱియొకని నాశ్రయించుట. "బలినోర్ద్విషతోర్మధ్యే వాచాత్మానం సమర్పయన్। ద్వైధీభావేన వర్తేత కాకాక్షివదలక్షిత"యని ద్వైధీభావలక్షణ మని నీతిశాస్త్రము. యానాసనే విగ్రహస్య రూపం సద్భిరితిస్మృతమ్ సంధేశ్చ సంధిమార్గజ్ఞైః ద్వైధీభావ సమాశ్రయౌ"అని కామందకుఁడు. దీనివలన సంధివిగ్రహములు రెండే ముఖ్యములైనవి.

యాత్ర=యానము=ప్రయాణము=శత్రువుపై దండెత్తిపోవుట, ఈదండ యాత్ర రెండువిధములు.

1 విగృహ్యయానము=పార్ష్ణిగ్రాహాదులతోఁ జేరకయే బలాతిశయముచేత శత్రువుపై దండెత్తిపోవుట

2. సంభూయయానము=సామంతరాజులతోడఁ జేరి దండెత్తుట, 3. ప్రసంగ యానము=ఒకనిపై దండెత్తునట్లు చాటించి మఱియొకనిపై దండెత్తుట, 4.ఉపేక్ష్య యానము=ఒకనిమీఁదికని యుద్ధమునకై బయలుదేఱి వాఁడుబలవంతుఁడు గాపున వానిమిత్రునిపై నెత్తిపోవుట, 5. సంధాయయానము=పార్ష్ణిగ్రాహాదులతోఁ జేరి శత్రుపై దండెత్తుట. దండవిధంబు=1 సేనలను వ్యూహములుగా నిలుపుట, 2 శత్రువును శిక్షించువిధము, వ్యూహముల విషయము ముందే చెప్పఁ బడెను. తలఁతె, ఈచెప్పినవాని నన్నిటిని దెలిసికొని వానిలోఁ ద్యాజ్యములవదలి గ్రాహ్యములను గ్రహించుచున్నావా యని భావము.

తాత్పర్యము

దైవవ్యసనముల గుఱించియు, మానుష్యవ్యసనముల గుఱించియుఁ గృత్యము గుఱించియుఁ బ్రకృతి,మండలము,వింశతివర్గములు షడ్గుణములు వానిలో ముఖ్యములైన సంధి విగ్రహము యాత్ర దండము గుఱించియు నాలోచించి విడువవలసిన వానిని విడిచి గ్రహింపవలసినవానిని గ్రహించుచున్నావా?

కం. నలువురొ ముప్వురొ మంత్రులు,
కలయఁగ యోజింతెమంత్ర•కార్యము లెల్లన్?
దెలిసికొని వారు వారలు. పలికెడివిధ మెల్ల నీవు•భావింతె మదిన్? ౭౧

మంత్రకార్యములు=ఆలోచించి చేయవలసిన కార్యములు.

తాత్పర్యము

ఆలోచించి చేయువలసినకార్యముల గుఱించిన యాలోచన ముగ్గురకుఁదక్కువ లేక నలువుర కెక్కువలేక యుండునట్లు మొట్టమొదట వారితో వేఱువేఱుగాను, ఆవల నందఱఁగలిపి యొక్కటిగాను వారియభిప్రాయముల గ్రహించుచున్నావు గదా! అవల వారందఱు చెప్పినవానిలో మేలుగీళ్ళు నీవు స్వతంత్రించి యాలోచించుచున్నావా? ఇరువురతోనే యాలోచించిన వారిరువురు వేఱవేఱభిప్రాయములు గలవారైరేని యెటుచేయుటకు సంశయమేర్పడును,ముప్వురైన యెడల నిరువురొకవిధము మఱియొకఁడు మఱియొకవిధమైనచో నెక్కువపక్షమువారి యభిప్రాయప్రకారము వర్తింపవచ్చును అందు సందేహమేర్పడినచో నాలుగవ వాని యభిప్రాయము తెలియవచ్చును.అంతకెక్కువమందితో నాలోచింపరాదు. ఐకమత్యముకుదురక వారిలోవారుకలహించిరేని రహస్యముచెడును,రాజునందుఁ బక్షపాతదోషము స్ఫర్ధలేర్పడును,రహస్యవిషయములెక్కువమందితో నాలోచింప

రాదు, కొందఱాలోచనలు చెప్పవారొంటరిగా నున్నప్పుడొకవిధము నలువురిలో నడిగిన మఱియొకవిధము చెప్పుదురు. అట్టిమంత్రులు నమ్మరానివారు, అప్పుడు సత్యమేర్పడదు, ఎందఱెన్ని యాలోచనలు చెప్పినను మంత్రులు చెప్పిరి నేను జేసితి ననరాదు. వారుచెప్పినది విని యాలోచించి తన మనస్సునకు సమాధానమైన విధముగ వర్తింపవలయును. విభీషణ శరణాగతి నాలోచింపుడు.

కం. ఫలయుతములె నీచదువులు? ఫలయుతములె నీధనములు పనులన్నియున్?
ఫలయుతయే నీదారయు? ఫలయుత మే నీశ్రుతంబు ♦ ప్రాజ్ఞవతంసా?

నీచదువులు=నీవేదాధ్యయనము, దార=భార్య, సంస్కృతమున దారాః నిత్యబహువచనాంతము దానికేకవచనమున రూపములేదు. ఆకారణముచే భరతునకుఁ బెక్కురు భార్యలున్నట్టు కొందఱు దురూహచేయుచున్నారు, అది నిరాకరము అది వాల్మీకిమతముగాదు, నలువురన్నదమ్ము లేకపత్నీవ్రతనిష్ఠులే. అక్కసెల్లెండ్ర నలువురిలోఁ బెద్దదియగు సీతకే యప్పటికి ౧౮ సంవత్సరములయియుండ నూండవి కంతకుఁ దక్కువ వయస్సుండవలెను. ఆకారణమున సంభోగార్హదశకు వచ్చినదో లేదో; ఇఁక నీకు బిడ్డలుగలరా యనుట యవివేక ప్రసంగమగును. ఇది,విషయము బోధింపవలసి వేసినప్రశ్న. నీశ్రుతంబు=నీవు పెద్దల వలన వినినది, ప్రాజ్ఞవతంసా=బుద్ధిమంతులందు శ్రేష్ఠుఁడా, మతిమంతులందు శ్రేష్ఠుఁడా వేదాధ్యయనఫల మగ్నిహోత్రాదులు చేయుట గావున నటుచేయుచున్నావా?

తాత్పర్యము

ధనము కలిమికిఫలము దాను భుజించుట యొకరికిచ్చుట. తాను దినినది యిహలోకఫలము, ఒకరికిచ్చినది పరలోకఫలదము, పరజన్మఫలదము. కావున లోభివై నీవుతినక పరులకీయక యున్నవాఁడవు కావుగదా! నీవుచేయు కార్యములన్నియును నీవు కోరినట్లు ఫలించుచున్నవా? వ్యర్థములై పోవుటకాని విపరీత ఫలము నిచ్చుటకాని లేదుకదా! భార్యను సంపాదించుట రతిసుఖమునకు (ఇది యిహలోక ఫలము) పుత్రప్రాప్తికిఁ (ఇది పరలోకసుఖము) గావున నీ భార్య వలన నీ రెండు సుఖములు గలుగఁగలవా? శాస్త్రము పెద్దలవలన వినుటకు ఫలము గుణాగుణములు తెలిసి సద్గుణ మనుష్ఠించి సదాచారము గలిగి దుర్గుణము విడనాడుటకే కావున నట్లుచేయుచున్నావా? అటుచేయక పోయితివేని చదివిన చదువుకు వినిన వినికిడికి ఫలము శ్రమనుమాత్ర మే యగును.

అగ్నిహోత్ర ఫలా వేదా, దత్తభుక్త ఫలంధనమ్
రతిపుత్ర ఫలాదారా, శ్శీలవృత్త ఫలంశ్రుత"మ్మని భారతము.

కం. ధర్మార్థకామసహితము, శర్మద మాయుష్యకరము ♦ జనవరతనయా
నిర్మలమతి నాచెప్పిన,కర్మంబుల నెల్ల జరుపఁగా మదిఁగొంటే. ౭౩

ధర్మార్థకామసహితము=త్రివర్గ మనఁబడు ధర్మము అర్థము కామము అను

వానితోఁగూడినది, శర్మదము = ఇహలోకసుఖము పరలోకసుఖము నిచ్చునది, ఆయుష్యకరము=ధర్మార్థకామమోక్షములను నాలుగిటిని సాధించుటకుఁగావలసిన దీర్ఘాయుస్సు నిచ్చునది, వార్ధకేమునివృత్తీనాం యోగేనాంతే తనుత్యజా మ్మన్నట్టు ముసలితనమున మునియై తపస్సుచేసి యోగబలమునఁ గడపట దేహము విడువవలయును గావున దీర్ఘాయువు కావలయును, నిర్మలమతిన్ = మలినములేనిమనస్సుతో.

తా త్ప ర్య ము

తమ్ముఁడా! నేను నీకుఁ జెప్పిన కార్యములన్నియు ధర్మార్థ కామములతోఁ గూడినవి, ఇహలోకసుఖము, పరలోకసుఖము గలిగించునవి, మోక్షార్థికిఁ గావల సిన దీర్ఘాయువు నిచ్చునవి. కావున వీనినెల్ల నిర్మలమైన మనస్సుతో రాజకు మారా! నీవుచేయవలయునని మనస్సున నిలిపితివా?

కం. మనతండ్రియు మనతాతలు,మునునడచినయట్ల నడుతె॰మునుకొని శుభవృ
త్తిని జరియించెదు గాదే,యనఘాత్మక ధర్మమార్గ॰మాచరితంబే? —౨౯౮

తా త్ప ర్య ము

పాపరహితమైన మనస్సుగలవాఁడా! మన తండ్రి తాత లేప్రకార ముభయ లోక శ్రేయస్కరమైన నడవడి నెట్లు నడచిరో యట్టులే నీవు శుభచర్య నడచుచు న్నావుగదా?ధర్మార్థకామములలో ధర్మమునకే ప్రాధాన్యమిచ్చుచున్నావుగదా? ధర్మకార్యము నూతనముగ నేదైనఁ దటస్థించిన మాపెద్దలు చేయలేదు గనుక నేనది చేయననక నూతనమైనదైనను ధర్మమైనదయినచో విడనాడుటలేదుగదా?

కం. విను మధురాహారంబులు, గొనవుగదా యొక్కరుఁడవె॰ కూర్మిని నీమే
లును గోరుమిత్రవరులకు, ధనముల సంతుష్టి సేయు॰దా వలసినచోన్.

మధురాహారంబులు=తియ్యనైనవి తినుపదార్థములు పాయసము లోనై నవి, వలసినచోన్=అక్కఱపడిన వేళలందు.

తా త్ప ర్య ము

తియ్యనిపదార్థము లొకరికిఁబెట్టక నీవొకఁడవే తినవుగదా? "ఏకస్స్వాదు నభుంజీత"యనునది మఱవలేదుగదా? స్నేహభావముచే నీ మేలుగోరు నీమిత్రు లకు వారి కక్కఱ లవసరముల ధనమిచ్చి సంతోషింపఁ జేయుచున్నావుగదా?

కం. నరపాలుఁడు ధర్మంబునఁ, బరిపాలన సేసి ధరణిఁ॰ బదపడి స్వర్గం
బరుగును గావున ధర్మము, ధరణీవరతనయ! విడువఁ॰ దగ దే వేళన్.

తా త్ప ర్య ము [—౩౦౦

నీవు చెప్పినప్రకారము ధర్మమున వర్తించిన నాకురాఁగల ఫలమేమం దువా? రాజగువాఁడు ధర్మమార్గమునఁ బ్రజలఁ బాలించెనేని మరణించినపిదప స్వర్గమునకుఁబోయియచ్చట దివ్యభోగము లనుభవించును,ధర్మమునఁబరిపాలిం పకపోయెనా ప్రజలుచేయు పాపముచే రాజగువాఁడు నరకమునకుఁబోకతప్పదు.

కావున ధర్మమును దాను బాలించుచుఁ బ్రజలుకూడ ధర్మపద్ధతి నడచునట్లు చేయ వలయును. కావున నెట్టిసందర్భములందును నష్టియైనను గష్టమైనను బ్రాణాపద వచ్చినను ధర్మము విడువరాదు. ధర్మము శాశ్వతము, కష్టసుఖము లశాశ్వత ములు, అశాశ్వతములగు వానికై శాశ్వత ధర్మమును విడువరాదు.

ఈ సర్గమునకుఁ గచ్చిత్సర్గమనిపేరు. ఇందలి కొన్నిశ్లోకములు సభాపర్వ మందలి కొన్నిశ్లోకములు సమానములై యున్నవి. ఆకారణముచే నెవరో భారత శ్లోకములను అసందర్భోచితముగ రామాయణమునం దిఱికించిరని కొందఱి యభి ప్రాయము, భరతుఁడు రాఁగానే కుశలము విచారింపక రాజనీతి బోధించి యుండునా? యని వారివాదము. ఈశ్లోకములు ప్రక్షిప్తము లయిన నగునుగాక, కాకపోయినఁ గాకపోవునుగాక, వారు చెప్పెడికారణము సరియైనదికాదు.

ముందటికాళ్ళకు బంధాలు వేయుటయందు శ్రీరామచంద్రమూర్తికి నగ్ర తాంబూల మియ్యఁదగునని ముందే సూచింపఁబడెను. ఆయన వాక్యధోరణి హెచ్చరికతోచదివినవారంద ఱాయభిప్రాయము నంగీకరింపక తప్పదు. ఇంగిత జ్ఞాశ్చకోసలా యనువాక్య మాయనయందు సంపూర్ణముగ నన్వయించును.

భరతుఁ డే యభిప్రాయముతో వచ్చుచున్నాఁడో యది శ్రీరామచంద్ర మూర్తికి మున్నె తెలియును. ఇది లక్ష్మణునకును జెప్పెను. భరతునివేష మా యభిప్రాయమును బలపఱిచెను, తండ్రి మరణించె ననియు గ్రహించెను. భర తుఁడు రాజుగా నుండవలయుననియే శ్రీరామచంద్రమూర్తి యభిప్రాయము, ఆయన రాజుగా నుండుట తనకు సమ్మతమనియు నాయనయే రాజుగా నుండ వలయు ననియు దానికిఁ గావలసిన విషయములు బోధించు నెపమున వానిని వెలిపఱుపవలయు నని యుద్దేశించి యుభయవిధ ప్రయోజనము గలుగుటకై రాజనీతిని ముందుగనే యుపదేశింపఁ బూనుకొనెను, తెలిసినవారికైనను దెలి యనివారికైనను బెద్దలు హితముపదేశించుట కర్తవ్యము.

ఇది వారిమనస్సు నావిషయమందు దృఢపఱుపవలయు ననియేకాని క్రొత్తగా నేర్పుటగాదు, ధర్మరాజునకు రాజనీతి తెలియదనియా నారదుఁడుపదే శించెను. సీతాదేవికిఁ బాతివ్రత్యలక్షణము తెలియదనియా యనసూయాదేవి యుపదేశించెను. ఈ సమయము దప్పిన మరల సమయము దొరకదనియు శ్రీరామచంద్రమూర్తి యెఱుఁగును. అన్నరాలేదని యేడ్చుచుఁ బోవునపుడా రాజధర్మోపదేశము. కావున నది యసందర్భోచితమనుట సరిగాదు. రామాయణ మునఁ గానవచ్చు శ్లోకములు భారతమునఁ గొన్ని గానవచ్చుచున్నవి. ఇవ న్నియుఁ బ్రక్షిప్తములని యెవ్వరు ననఁజాలరు, కావున వ్యాసమహర్షియే రామాయణ శ్లోకములు గ్రహించె ననుట వాస్తవము.

౧౦౧-వ సర్గము. భరతుండు శ్రీరామునకు దశరథుండు మరణించుట దెల్పుట.

కం. ఆ వాక్కుల విని భరతుం, డావాసవనిభునిఁగాంచి • యనె వినయమునన్
నావంటిధర్మహీనుఁడు, గావించునె రాజధర్మ•కాండము లెల్లన్. ౨౩౦౧

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన యన్నినీతులను ధర్మములను భరతుఁ డొక్కమాటతో వ్యర్థపఱుచుచున్నాఁడు. వాసవనిభునిన్=ఇంద్రునితో సమానుని, ధర్మకాండములు=ధర్మసమూహములు, ధర్మహీనుఁడు=(1) శ్రీరాముని శుశ్రూష యనెడి పరమైకాంతి ధర్మములేనివాఁడు, (2) శేషత్వమనెడి స్వరూపము తప్పినవాఁడు, రాజధర్మసమూహములు సామాన్యధర్మములు, కైంకర్యదాస్యములు విశేషధర్మములు, విశేషధర్మములందు దృష్టిలేనివానికి సామాన్యధర్మములు వ్యర్థములు. అయోధ్యాకాండమంతయు సామాన్య ధర్మములనే బోధించుచున్నది. అరణ్యకాండమునుండి విశేషధర్మములు ప్రారంభమగును.

తాత్పర్యము

శ్రీరాముఁడు చెప్పిన మాటలనెల్ల విని భరతుఁడు దేవేంద్రునితో సమానుఁడైన నాయనతో నణఁకువతో నన్నా! నీవు చెప్పిన రాజధర్మములన్నియు ధర్మాత్ములకు సాధ్యములుగాని రాజ్యమునే యధర్మమార్గమున సంపాదించిన నాకెట్లు సలుపసాధ్యపడును? నావంటి ధర్మహీనుఁడా నీవు చెప్పిన రాజధర్మములాచరించువాఁడు రాజధర్మరక్షణ సమర్థుఁడవు నేవేకాని నేనుగాను, నీవనుగ్రహించిన నేను దాసధర్మరక్షణ సమర్థుఁడనగుదును.

చం. కలదు గదా సనాతనము•గా మనలో నొక ధర్మ, మగ్రజుం
డిల మని యుండఁ బిన్న వహి•యింపఁగరాదు ధరాభరంబు, స
ల్లలితసమస్తవస్తుసువి•లాస కయోధ్యకు నాదువెంబడిం
జెలువుగ నేగుదెంచి యభి•షేకముఁ గైకొను ముత్సవంబుగన్. ౨౩౦౨

మనలో=మనవంశమున, సనాతనముగా=ఆదిమకాలమునుండి, అనఁగా మనువుకాలమునందుండి, అగ్రజుండు=పెద్దవాఁడు, మనియుండన్=బ్రదికియుండఁగా, పిన్న=చిన్నవాఁడు, ధరాభరంబు=భూమిభారము, సత్+లలిత=మిగుల నందమైన, సమస్తవస్తు = సకలపదార్థములయొక్క, సువిలాసకు=మిగులనందముకలదానికి, వెంబడిన్=వెన్ను+బడి=వెంబడి, ఉత్సవంబుగన్=సంతోషముగ.

తాత్పర్యము

అన్నా! మనజాతిలో ముఖ్యముగ మనవంశములో ననాదిగ నొకధర్మముండుటనీవెఱిఁగిన విషయమేకదా! అది యేదనఁబెద్దవాఁడు జీవించియుండఁగాఁజిన్నవాఁడు రాజ్యభారము పూనరాదు కావున సమస్త సుందరవస్తువులచే మనోహరమైన యయోధ్యకు నావెంటవచ్చి సంతోషముతోఁబట్టాభిషేకము చేసికొమ్ము, నీధర్మమును నీవునిర్వహింపవేని స్వధర్మమునునిర్వహింపనిసీవు పరధర్మమునునిర్వ

హింపుమని నాకెట్లు చెప్పఁగలవు? స్వధర్మనిష్ఠుఁడుకదా ధర్మోపదేశాధికారి.

కం. జనపతి నరుఁ డనువారలె, యనుపమధర్మార్థసహిత•మగు నీవృత్తం
బు నమానుష మని చెప్పుట, ననఘా దేవుఁడ పటంచు•నాత్మం దలఁతున్.

అనుపమ=అసమానమైన, ధర్మార్థసహితము = ధర్మమను ప్రయోజనముతోఁగూడినది, ఇచ్చట నర్థమనఁగా ధనమనుట సరిగాదు. వృత్తంబు=శీలము, అమానుషము=అతిమానుషము, మనుష్యశక్తికి మించినది.

తాత్పర్యము

కొందఱు మనుష్యులు "నావిష్ణుః పృథివీపతి" విష్ణ్వంశము లేనివాఁడు రాజు కాఁజాలఁడను నర్థమునుగూడ నంగీకరింపక రాజు మనుష్యమాత్రుఁడే, అదృష్టము కొలఁది రాజైనాఁడనువారుకూడ నసమానధర్మమే ప్రయోజనము గాఁగల నీచరిత్రముఁజూచి యది మనుష్యశక్తికి మించినది, కావున నీయన మనుష్యమాత్రుఁడు కాఁడనుచున్నారు. కావున నాయభిప్రాయమందో నీవు సాక్షాద్దేవుఁడవే, శ్రీమన్నారాయణుఁడవే, కావున మనుష్యమాత్రుఁడగు నన్నవైనను రాజ్యము నీవు భరింపవలసియుండఁగా సాక్షాద్దేవుఁడవగు నీవు భరింప వలసినదానిని నీదాసుఁడనగు నేనెట్లు భరింపఁగలను.

సీ. కేకయక్ష్మాపతి•గృహమున నే నుండ; జానకీలక్ష్మణ•సహితముగను
నడవులకును నీవు•నడచినయంతనే, దుఃఖాభిభూతుఁడై•తూర్ణముగను
మనతండ్రి స్వర్గంబుఁ•జనె లెమ్ము తండ్రికి,
నుదకంబు లిమ్ము మే•ముభయులమును
గార్యంబులెల్ల ము•న్గావించినారము, మీ రిరువురు సేయ•మేకొనుండు
తే. ప్రియుఁడు నీళ్ళను విడఁ దృప్తి•ప్రేతములకు
గరముఁ బితృలోకమునను న•క్షయ్య మగును
దండ్రికిని నీవు ప్రియుఁడవు•తద్ద గాన
లెమ్ము నీ వింకను నివాప•మిమ్ము ప్రీతి. ౨౩౦౪

దుఃఖాభిభూతుఁడు = దుఃఖముచేఁ గ్రమ్ముఁబడినవాఁడు, తూర్ణముగను= శీఘ్రముగ, మేకొనుఁడు=పూనుఁడు, నివాపము=తర్పణోదకము.

తాత్పర్యము

నేను గేకయరాజునింట నుండుసమయంబున నీవు సీతాలక్ష్మణులతోడ నడవులకు నడచిరాఁగా నిన్నుఁబాసిన దుఃఖముచే మనతండ్రి మరణించెను. నీవు లక్ష్మణుఁడు తండ్రికిఁ దిలోదకము లిండు, నేను శత్రుఘ్నుఁడు నిదివఱకే యాకార్యము చేసితిమి, మీరును జేయ నంగీకరింపుఁడు, మేము చేసియు, బ్రయోజనములేదు. ఏలన మరణించినవారికి వారియందు బ్రీతిగలవారు నీళ్ళువిడిచిననే తృప్తికలుగునుగాని వారికిఁ బ్రీతిపాత్రులు గానివారు విడిచినచో దానివలన వారి [illegible] కలుగఁబోదు, నేనువిడుచునీళ్ళు తనకుఁ జెందరాదని పదుగురులోఁ

దండ్రి చెప్పెనంట, కావున మేము లోకధర్మము ననుసరించి చేసినను బ్రయోజ నములేదు. నీవు తండ్రికిఁ బ్రియుఁడవు, నీవు నీళ్ళువిడిచిననే యాయన కూర్ధ్వ గతులు సుఖము కలుగును. కావున నీళ్ళు విడువుము.

జ్యేష్ఠపుత్త్రుఁడే శ్రేష్ఠపుత్త్రుఁ డగుటచేతను దక్కినవారు కామజులగుటచేతను వీరు పితృకార్యములు చేయుటకును బనికిరారా యని సంశయింపరాదు. శ్రాద్ధా దులందు శ్రద్ధప్రధానము, శ్రద్ధలేకున్న నది శ్రాద్ధ మనిపించుకొనఁబడదు. ప్రీతి లేక శ్రద్ధకలుగదు. కావునఁ దండ్రికిఁ బ్రియులయినవారు ముఖ్యులుగాని పెద్ద వాఁడైనంతమాత్రమున దురాచారుఁడు, అవినీతుఁడు నగువాఁడు శ్రేష్ఠుఁడు గాఁజాలఁడు.

శ్లో॥ పుత్త్రాణాం మధ్యమోవాపి, కనిష్ఠోజ్యేష్ఠ ఏవవా
పితుర్యస్తు ప్రియతమః, సర్వం తేనైవ కారయేత్. ఋశ్యశృంగుఁడు.

పుత్త్రులలో నడిమివాఁడైనను, గడపటివాఁడైనను దండ్రికెవ్వఁడు ప్రియ తముఁడో వాఁడే జ్యేష్ఠుఁడు. అన్నికార్యములు వాఁడే చేయవలయును. కావున జ్యేష్ఠుఁడునై ప్రియుఁడునైనవాఁడు నిడుశ్రాద్ధములు నివాపములు నక్షయఫల హేతువులని చెప్పవలసిన పనియేలేదు,

తరళము. నినుఁ దలంచియ యేడ్చుచున్ మతి•నీదు దర్శనకాంక్షి యై,
నినుఁ దలంగకయున్న బుద్ధిని • నేర కేమియుఁ ద్రిప్పఁగా,
ననఘ! నీవిడనాడుటన్, భవ•దా ర్తిపీడితుఁ డౌచు, నీ
జనకుఁ డక్కట యస్తమించెను • జాల నిన్నె స్మరించుచున్. ౨౩౦॥

దర్శనకాంక్షి=చూడఁగోరికగలవాఁడు, తలంగక=వదలక, నేరక=సమర్థుఁడు గాక, భవదార్తిపీడితుఁడు=నీవియోగమువలన గలిగిన దుఃఖముచేఁ బీడింపఁ బడినవాఁడు, నీజనకుఁడు=నీతండ్రి, దశరథుఁడు తనకును దండ్రియైనను గైక కారణమునఁ దనయందుఁ బ్రీతితప్పినవాఁ డగుటచేఁ బేరునకుఁ దండ్రియేకాని తండ్రికుండవలసిన పుత్రవాత్సల్యము లేనివాఁడు, అస్తమించెను=మరణించెను, దశరథుని మరణవార్తను గూర్చి కైక భరతునకుఁజెప్పినసరణియు, భరతుని వచన సరణియుఁబోల్చిచూచునది. నీతండ్రి మరణమునకు నీవే కారణభూతుఁడ వగుటచే నీవు చేసినపని సరిగాదని భావము. తరలము, సభరసజజగములు ౧౨-వ యతి.

అస్తమించుట యనునది సూర్యునివిషయమున సుప్రసిద్ధపదము. దశ రథుఁడస్తమించె ననుటచే సూర్యుఁ డస్తమించిన లోకము గాఢాంధకారమున మునిఁగినట్లు దశరథు మరణమున జగము శోకాంధకారమున మునిఁగెను. సూర్యుఁడు పోయినఁ జంద్రుఁడయిన నుండిన లోక మాహ్లాదించును. అభిరామ చంద్రుఁడు రామచంద్రుఁడు నీవు లేనికారణమున లోకము దిక్కుతెలియక దుఃఖించుచున్నది. చచ్చెను, మరణించెనను నది పరుషోక్తి అస్తమించె ననుట మృదూక్తి, అర్థముసమమే. "భీష్మభానుఁ డస్తమించె" నని తిక్కన. భా. భీష్మ.

నీవలన లోకమున కిట్టియనర్థము కలిగెను. రాముఁడవై లోకమును సంతోషపెట్టుటకు మాఱు నీవు దుఃఖపెట్టుచున్నావు.

తా త్ప ర్య ము

అన్నా! నీతండ్రి నన్నుఁదలంచి యేడ్చియేడ్చి నిన్నుఁబూడఁగోరి యది లభింపమిని నీయందే బుద్ధిదృఢముగ నిలిపి దానిని మరలింపనేరక నీవు విడిచి వచ్చిన కారణమున నీ వియోగ బాధచేఁ గష్టపడుచు రామారామా యని నిన్నే స్మరించుచు నస్తమించెను.

—♦ ౧౦౨-స సర్గము. పితృమరణంబు విని శ్రీరాముఁడు దుఃఖించుట ♦—

చం. అని భరతుండు తండ్రి విల♦యంబును వాసవముక్తవజ్రపా
తనమునుబోనివాక్యముల ♦ దారుణరీతిని విన్పఁ గాననం
బున బలుగండ్రగొడ్డటను ♦ మూలముమట్టుగఁ ద్రుంపఁ ద్రెళ్ళుపు
ష్పనిచయభూషితం బయిన♦పాదపమో యన వ్రాలె రాముఁడున్. ౨౩౦౬

విలయంబును=మరణమును, వాసవ=ఇంద్రునిచే, ముక్త=విడువఁబడిన, వజ్ర=వజ్రముయొక్క, పాతనమునుబోని=పడుటతో సమానమైన, దారుణరీతిని =భయంకరమైన విధముగ, విన్పన్=వినిపింపఁగా, పుష్ప= పూలయొక్క, నిచయ=సమూహముచే, భూషితంబు=అలంకరింపఁబడినది, పాదపము=చెట్టు, పాద+పము=కాళ్ళచే ననఁగా వేళ్ళచేఁ బానము చేయునది.

తా త్ప ర్య ము

ఈప్రకారము తండ్రి మరణవార్తను బిడుగుపడిన విధముగ భయంకరముగు విధమునఁ దననిమిత్తమై వచ్చెనని చెప్పఁగా నడవియందు గండ్రగొడ్డలిచే వేళ్ళవఱకు నఱకఁబడఁగా నేలమీఁద దబాలునఁ బడు చెట్టువలె శ్రీరాముఁడు తబాలున మూర్ఛపోయి పడెను.

ఉ. కూలముఁ గూలఁ ద్రోచి వెత♦గూరిన నిద్దురపోవుదంతినా
వ్రాలినఁ జూచి తమ్ములును ♦ వారిజలోచన సీతయున్ వ్యథా
జ్వాలలఁ గ్రాఁగి రామునకుఁ ♦ జల్లనినీటను దేహమంతయున్
జాలఁగఁ దడ్పి; రంత రఘు♦చంద్రుఁడు మూర్ఛ దొఱంగి దీనుఁడై.

కూలము =ఒడ్డు, వెతగూరినన్ =బడలికకలుగఁగా, దంతినాన్=ఏనుఁగో యనునట్లు, వ్యథాజ్వాలలన్=శోకమనెడి నగ్నిశిఖలచే, దీనుఁడై =దుఃఖించుచున్నవాఁడై, మూర్ఛదొఱఁగుటకై శీతోపచారవిషయమున "యతః అవ్భృతంవా ఆపస్తస్మా దద్భిరవతాం తమభిషించతి" యని శ్రుతియుఁ జెప్పుచున్నది.

తా త్ప ర్య ము

ఏటి యొడ్డులను గొమ్ములచేఁగోరాడికోరాడి యవలఁద్రోచి గాసికలుగఁగా నేలపైఁబండుకొని నిద్దురపోవు నేనుఁగువలె నేలపై శ్రీరాముఁడు సొమ్మసిల్లి

వ్రాలఁగా భరతాది సోదరులును సీతాదేవియు దశరథుని మరణమునకు శ్రీరాముని దశకు శోకమనెడి నిప్పుమంటలచేఁదపించియు శ్రీరామునకు శైత్యోపచారమునిమిత్తము చల్లని నీటిచే దేహమంతయుఁదడిపిరి. అట్లు చేయఁగా శ్రీరాముఁడు మూర్ఛవిడిచి లేచి దుఃఖించుచు.

ఉ. కన్నుల బాష్పపూర మెస•గన్ భరతుం గని యిట్లుపల్కు నే
మున్నది నా కయోధ్య నిఁక • నుత్తముఁడా జనకుండు లేమి, లో
కోన్నతుఁ డేలినట్టిది య•యోధ్య యిఁకన్ భరియింప నెవ్వఁ డో
యన్న సమర్థుఁ, డాదిభుజ•గాధిపుభారము నేది మోసెడిన్. ౨౩౦౮

బాష్పపూరము=కన్నీళ్ళప్రవాహము - ఎసఁగన్=అతిశయింపఁగా - ఆదిభుజగాధిపు=ఆదిశేషుని.

తాత్పర్యము

కన్నులవెంట నీళ్లు ప్రవాహమువలెఁగారుచుండఁగా భరతునితో నిట్లనియె. భరతా-అయోధ్యకు రారమ్మని పిలువవచ్చితివే అయోధ్యయందుత్తముఁడైన తండ్రి లేనప్పు డింక నేను దేనినిమిత్తమైరావలె? రాజ్యభారము వహించుట కనెదవా? జనసత్తముఁడైన దశరథునిచేఁ బాలింపఁబడినది యయోధ్య - అట్లాయనచే మోవఁబడిన భారమును మఱి యెవ్వఁడు మోయ సమర్థుఁడు. ఆదిశేషుఁడు మోయు భూభారమును ఆదిశేషుఁడుగాక మఱి యెవ్వఁడు మోయఁగలఁడు?

కం. ననుఁగూర్చి పనవి చచ్చిన,జనకుని సంస్కారవిధులు • సలుపనిననుఁబోల్
తనయుఁడు దుర్జాతుండా,ఘనమతికిం బుట్టి యేమి•కార్యము చెపుమా.

రాజు మరణమునకుఁ దాను కారణము కావునను దనకై ప్రాణము విడిచిన జనకునకుఁ దాను జేయకుండుటఁ బట్టియుఁ దనజన్మమే వ్యర్థమని తన్నుఁదాను శ్రీరాముఁడు నిందించుకొనుచున్నాఁడు. పనవి = ఏడ్చి- సంస్కార విధులు= దహనసంచయనాది పైతృక కార్యములు, దుర్జాతుండు=చెడుజన్మముగలవాఁడు-ఘనమతికిన్=గొప్ప మనస్సుగలవానికి- కార్యము=ప్రయోజనము.

తాత్పర్యము

నాయందంతటి ప్రేమగలిగి నన్నుఁదలఁచి తలఁచి యేడ్చియేడ్చి చచ్చిన కన్నతండ్రికి నాయన జీవించి యున్నప్పుడెట్టి యుపకారముచేయకున్నను మరణించిన పిమ్మటనైనఁ జేయఁదగినది యొకటియేయైన పైతృకకర్మముచేయని నావంటి పాడు జన్మముగల కొడుకు అటువంటి పుత్రవాత్సల్యముగల తండ్రికిఁ బుట్టి యేమిప్రయోజనము. నాకై ప్రాణమిచ్చినవాని కిన్ని నీళ్లువిడువకపోయితిని గదా.

తండ్రికి నీళ్లు విడిచి శ్రాద్ధముపెట్టనికొడుకు జీవించియుండుటకన్నఁ జచ్చుటే మేలు.

కం. భరతా! శత్రుఘ్నునితోఁ, బౌరి జనకుని ప్రేతకృత్య♦ములు దీర్చితి వీ
వరయఁగ ధన్యుఁడు నాకా, పరమం బగుపుణ్యమబ్బు♦భాగ్యము లేదే.

పౌరిన్=పూర్ణముగా- ప్రేతకృత్యములు=మరణించినవారికిఁ బ్రేతత్వము వదలిపోవు కార్యములు.

తాత్పర్యము

భరతా! నీవు శత్రుఘ్నునితో జనకునకుఁ జేయవలసిన పరలోక హితకృత్యములన్నియుఁ జక్కఁగఁజేసి పుత్రత్వమును సార్థక పఱచికొంటివి. లక్ష్మణుతోడనేనట్లుచేయు పరమపుణ్యములభించు భాగ్యము నాకు లేదాయెఁగదా. ఈ లోకమున నున్న వేళ వారి వారి శ్రేయస్సునకుఁ గావలసిన కార్యములు వారు వారు చేసికొందురు. పరలోకము ఫలభూమి. కావున నచ్చటఁ జేసికొనునదిలేదు. ఇక్కడివారు వారిని గుఱించి యేమైనఁ జేసినఁగలదు లేకుండిన వారిగతియంతే. అట్లు పరాధీనులయినవారికి సహాయపడి ప్రేతత్వము దొలఁగించి స్వర్గస్థులఁ జేయుట పరమపుణ్యకార్యముగదా.

ఆ. దిక్కు లేక జనులు♦దీను లై చీకాకు,పడుచు నున్న పురికి♦వ్రతము పిదప
నైన నందుఁ దండ్రి♦లేనికారణమున, మరలి వచ్చుటకును♦మనసు రాదు.

చీకాకు=కలవరము- వ్రతము పిదపనైనన్=పదునాలుగేండ్ల డడవులలో నుందునను వ్రతము ముగిసిన తరువాతనైన.

తాత్పర్యము

భరతా! తండ్రియాజ్ఞప్రకారము పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయవలయునను వ్రతము ముగిసిన పిదపఁ దండ్రిని సేవించుటకై (రాజ్యమేలుటకై కాదు. యయోధ్యకు రావలయునని యుంటిని. అట్టి భాగ్యము నాకు లేదాయె. దశరథుఁడు చచ్చుటచే జనులు దుఃఖాక్రాంతులై కలవరపడుచున్నారంటివి. అట్టిచోటికి నావలనైన వచ్చుటకు నాకు మనసులేదు. తండ్రిని జంపిన నేనేమని యయోధ్యకు వత్తును? ౨౩౦వ- పద్యములోని భరతు వాక్యమున కిది ప్రత్యుత్తరము.

కం. వనవాసము సంపూర్ణము,గను జరిపి యయోధ్య కేను♦గ్రమ్మఱ నన్నున్
గని దిద్దెడివా రెవ్వరు, జనకుఁడు లోకాంతరంబుఁ♦జనుటను భరతా.

లోకాంతరము=మఱియొక లోకము-మయూరవ్యంసక సమాసము.

తాత్పర్యము

వనవాసము పదునాలుగేండ్లు సలిపెదనని వ్రతము పూని యట్టి వ్రతమును భగ్నపఱచికొని యవకీర్ణినగుట పాపకార్యముగదా. నీ విప్పు డయోధ్యకు నన్ను రమ్మనుచున్నావు. ఆ వ్రతము పూర్ణముగ నెఱవేర్చి నీవు కోరిన ప్రకార మయోధ్యకు వచ్చెదననుకో. ఏమి ప్రయోజనము. అక్కడ నా కెవ్వరు తాఁకుదప్పులు చెప్పిదిద్దెడివారుగలరు. అట్లు చేయఁగల జనకుఁడు పరలోకమేగెఁగదా.

కం. మును కృతసత్కార్యుని ననుఁ, దనతొడఁ గూర్చుండఁబెట్టి • తండ్రి సుధోక్తుల్
విననాడు శ్రవణసుఖముగ, విన నేర్తునె యింక నెన్ని • విధముల వానిన్.

మును=పూర్వము, కృతసత్కార్యునిన్ = చేయఁబడిన మంచిపనులుగల వానిని, సుధోక్తుల్=అమృతమువలెఁదియ్యనైన మాటలు, శ్రవణసుఖముగన్= వీనులకింపుగ.

తాత్పర్యము

భరతా! నీవే యొకరికిఁ దాఁకు దప్పులు చెప్పనేర్తువు. నీ కొకరు చెప్పవలెనా యందువేమో. పోనీ జీవించియున్న కాలమందు నాచే నేదైన మంచిపని చేయించి తనతొడమీఁదఁ నన్నుఁ గూర్చుండఁబెట్టుకొని మనతండ్రి తియ్యని మాటలు విననింపుగాఁ జెప్పుచుండెను. అటువంటి మాటలైనఁ జెప్పెడివాఁడేఁడీ. అయోధ్యకువచ్చి యటువంటి మాటలు నేను వినఁగలనా? మంచిమాటలుకూడ వినుభాగ్యములేనిచోటికి నేనేల రావలె?

శ్రీరామచంద్రమూర్తి శోకవిలాపము నెపమున నేనిప్పుడు నయోధ్యకు రాను గడువుతీఱిన పిమ్మటను రాను, అని తన యభిప్రాయమెఱిఁగించెను. భరతుఁడు పట్టాభిషిక్తుఁడై యుండఁగాఁ దా నయోధ్యకు వచ్చినఁ బ్రజాక్షోభను కలుగునుగాని తప్పదు. అట్టిదానికిఁ దాను నిమిత్తముకారాదని యాయన యభిప్రాయము. పదునాలు సంవత్సరము లయినపిమ్మటఁ గూడఁ దాను రాననుట భరతునకు గోరుచుట్టుమీఁద రోఁకటి పోటు.

ఉ. హా యని భార్యదిక్కు మొగమై • తరుణీ! యిఁక నీకు మామలేఁ
డాయెనుగా, యిఁ కెవ్వరిని • నాడెదు మామ యటంచు, లక్ష్మణా!
నాయన లేనివాఁడ వయి • నాఁడవుగా, యని యశ్రుపూరపూ
ర్ణాయతలోచనుం డగుచు • నారఘువీరుఁడు పల్లటిల్లఁగన్. ౨౩౧౪

ఈ ప్రకారము తండ్రికై దుఃఖించిన విధముగా భరతుని మాటకుఁ బ్రత్యుత్తరమిచ్చి యిఁక లోకవిడంబనార్థము సీతాలక్ష్మణులఁజూచి యనుచున్నాఁడు.

అశ్రుపూర=కన్నీళ్ల ప్రవాహముచే, పూర్ణ=నిండిన,ఆయత=దీర్ఘములైన లోచనుండు=కన్నులుగలవాఁడు పల్లటిల్లఁగన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము

హాయని యేడ్చుచు సీతదిక్కుతిరిగి దేవీ నీవు మామలేనిదానవైతివిగదా. ఇఁక నెవరిని మామాయని నోరారఁ బిలిచెదవు. లక్ష్మణా తండ్రిలేని వాఁడవైతివి కదా యని కన్నులనిండ నీళ్లు గ్రమ్మఁగా శ్రీరాముఁడు దుఃఖించుచుండఁగా.

లక్ష్మణునకుఁ దండ్రిలేకపోయినఁ దనకున్నట్లా? నసంవృత్తః పితామమ' నాతండ్రి మరణించినవాఁడుగాఁడు అని ముందుచెప్పెను. దీని వలనఁ దండ్రి చచ్చిన వ్యసనము తనకు లేదని భావము. తండ్రివలెఁదన్ను లక్ష్మణుఁడు విచారించుచుండుటచే నిట్లు చెప్పెను.

కం. ధరణీతనయాధవు నతి,కరుణోక్తుల నాలకించి•కాకుత్థ్సులు ని
ర్భరశోకమునం గుందిరి, ధరణీశ్వరుఁ దలఁచి తలఁచి•తమమదులందున్.

ధరణీతనయాధవు=భూపుత్రిభర్తయగు శ్రీరాముని, అతికరుణోక్తులు=మిక్కిలి శోకముతోఁగూడిన మాటలు, (కరుణ+ఉక్తులు) కరుణమనఁగా శోకము కరుణ యనఁగా దయ, ఆలకించి=విని, కాకుత్థ్సులు=భరతలక్ష్మణశత్రుఘ్నులు నిర్భరశోకమునన్=భరింపరాని వ్యసనముచే.

తాత్పర్యము

శ్రీరాముని శోకపూరితములయిన వాక్యములువిని భరతలక్ష్మణశత్రుఘ్నులు తమ తండ్రిని దలఁచి తలఁచి సహింపరాని దుఃఖముచే బాధపడిరి. జనకుని మరణవార్తవినుటచేఁ గలిగిన దుఃఖముకంటె శ్రీరాముని వ్యసనోక్తులు వినుటచే నెక్కువశోకము గలిగెనని భావము.

కం. ఉమ్మలికించురఘూత్తముఁ, దమ్ములు దేర్చిరి సుసాంత్వ•తరవాక్కులఁ గా
ర్యమ్మిఁక జనకునకు నివా,పమ్ముల నొసఁగంగ వగవ•ఫలమా యనుచున్.

ఉమ్మలికించు=శోకించు, తేర్చిరి=సమాధానపఱిచిరి, సుసాంత్వతరవాక్కులన్=మిక్కిలి యూరడింపుమాటలచే, నివాపమ్ములు = ప్రేతమునకై విడుచు నీళ్ళు, వగవన్=దుఃఖింపఁగా.

తాత్పర్యము

శోకించు రామచంద్రునిఁ దమ్ములూరట మాటలచే నన్నా యేడ్చిన నేమి లాభము. ఎంతయేడ్చినను జచ్చినవాఁడు మరలివచ్చునా? చచ్చినవారికై యేడువరాదుగదా. నీవు చేయవలసినకార్యము నీళ్ళు విడుచుటకదా. అది చేయక యిది చేసెదవేల యని సమాధానపఱిచిరి.

ఉ. మామ దివంబుఁ జేరె నను•మాట చెవిం బడ నార్తి జానకీ
భామిని యశ్రువేగమునఁ•బ్రాణవిభుం గననేర దేడ్చుచున్
రాముఁడు నామెఁ దేర్చి నయ•నంబులు వాఁచఁగ నేడ్చులక్ష్మణున్
బ్రేముడిఁ బిల్చి తండ్రికిని•నీళ్లు విడం జనువాఁడఁ దమ్ముఁడా. ౨౩౧౪

అశ్రువేగమునన్=మీఁద మీఁదఁ గాఱుచున్న కన్నీళ్ళ యతిశయముచే, ప్రేముడిన్=ప్రేమచే, ప్రేమ, తద్భ, ప్రేముడి.

తాత్పర్యము.

మామ మరణించె ననుమాట చెవిని బడఁగానే దుఃఖముచేఁ బరితపించు జానకి యతివేగముగఁ గాలువవలెఁ బాఱుచున్న నీళ్లు దృష్టి నడ్డగించుటచే భర్తను జూడలేకపోయెను. అప్పుడామెను శ్రీరాముఁడే సమాధానపఱిచి కన్నులు వాఁచిపోవునట్లు శోకించు లక్ష్మణుని సమాధానపఱిచి నాయనా నేను దండ్రికి నీళ్లు విడువబోవుచున్నాను.

ఉ. చీరము గారపిండియును • జెచ్చెరఁ జేర్చుము, పోవ నిమ్ము ముం
దీరమణీమణిం, బిదప • నేగుము నీ, వటువెన్క వచ్చెదన్,
దారుణ మైనకార్యముల • ధర్మపథం బిది, యంచుఁ బోవుచో
వారల నందునున్న తగు • వారలు దేర్చిరి సాంత్వవాక్కులన్.   ౨౩౧౭

చీరము=నారవస్త్రము, గారపిండి=గారగింజలను నూనెపోకుండ నూరి చేసినముద్ద, దారుణమైన దుఃఖముచేఁ దీవ్రములైన ధర్మపథంబు=ధర్మశాస్త్రమునఁ జెప్పఁబడినమార్గము అశుభకార్యములుచేయఁ బోవునపుడు స్త్రీలు బాలురు ముందు పోవలయును వారివెనుకఁ బెద్దవారు పోవలయును. ఉదకొపస్పర్శనే ఆరోహణే ఇతి సర్వత్రసర్వే కనిష్ఠక ప్రథమా అనుపూర్వ ఇతరేస్త్రీ యోగే అని ఆప స్తంబ సూత్రము.

తా త్ప ర్య ము

లక్ష్మణా! నారవస్త్రము గారపిండి త్వరగా సమకూర్పుము. ముందు సీతను బోవనిమ్ము. ఆమె వెనుక నీవు పొమ్ము. నీ వెనుక నేను వచ్చెదను. అశుభకార్యములందు ముందు బాలురు స్త్రీలు పోవుట, వారి వెనుక బెద్దవారు పోవుట ధర్మమార్గము అని వారట్లు దుఃఖపడుచుఁబోవఁగా నందుఁజేరిన యోగ్యులు వారిని సమాధానపఱిచిరి.

కం. దాంతుండును విదితాత్ముఁడు, శాంతుండును రామభక్తి • సంపన్నుఁడు స
త్స్వాంతుఁడు నిత్యానుగధీ,
మంతుండు సుమంత్రుఁ డల్ల • మాటలఁ దేర్చెన్.   ౨౩౧౮

దాంతుఁడు=అంతరింద్రియ నిగ్రహముగలవాఁడు, విదితాత్ముఁడు= ఆత్మస్వరూప మెఱిఁగినవాఁడు, శాంతుఁడు=బాహ్యేంద్రియ నిగ్రహముగలవాఁడు, రామభక్తిసంపన్నుఁడు=రామభక్తియే సంపదగాఁగలవాఁడు, సత్+ స్వాంతుఁడు=మంచి మనస్సుగలవాఁడు, నిత్యానుగ ధీమంతుఁడు=వంశపరంపరగా మంత్రిగా వచ్చిన బుద్ధిమంతుఁడు.

తా త్ప ర్య ము

అంతరింద్రియ బాహ్యేంద్రియ నిగ్రహముగలవాఁడును, ఆత్మస్వరూప మెఱిఁగినవాఁడును, రామభక్తియను నైశ్వర్యముగలవాఁడును మంచి మనస్సుగలవాఁడు వంశపరంపరగా వచ్చిన మంత్రియునగు సుమంత్రుఁడు మెల్లని మాటలచే నూరార్చెను.

సీ. వారు దుఃఖంబునఁ • బాదము ల్దడఁబడ, రమ్యపుష్పితవన • రాజిరాజి
తంబు సుతీర్థ మై • యింపైనమందాకి, నీనది డాయుచు • నిర్మలంబు
శివమును నై కడు • శీఘ్రపుంబుననుబాఱు, చారుతీర్థమున య • శస్వివరులు
ధరణీశు నదిలోనఁ • దలఁచుచు నివె నీకు, నివె నీకు ననుమను • నిడిరి జలము

ఆ. లంత రామచంద్రుఁ•డంజలి నుదకంబుఁ, దీసికొనుచు యామ్య•దిశకుఁదిరిగి
చటులశోకభార • సంతప్తుఁ డగుచును,
జనకుఁగూర్చి యిట్టు•లనుచుఁ బలికె. ౨౩.౨౦

రమ్య=అందమై, పుష్పిత=పూచినదైన, వనరాజి=వనసమూహములచే, రాజితంబు=ప్రకాశించునది, ఇట్లనుటచే నెండబాధలేనిదని భావము, సుతీర్థము=మంచిపుణ్య జలములు గలది. ఇట్లనుటచేఁ బితృకార్యములకు యోగ్యమగు పవిత్రజలము గలదని భావము, రంబు=మనోహరము, ఇట్లనుటచే దీనిదర్శనమునఁగొంత దుఃఖశాంతియయ్యెనని భావము. దీనిచేఁ గొంచెము కాలము తీర్థసమీపమున రోదనముచేయు నాచారము సూచితము, నిర్మలము=బురదలేనిది, శివము=శుభకరము, యశస్విపరులు = శాస్త్రమర్యాదానిష్ఠులైన స్వధర్మరతులని కీర్తికెక్కినవారిలో శ్రేష్ఠులు, జలమునిడిరి=స్నానముచేసి తర్పణములు గావించిరి, వారు=సీతారామలక్ష్మణులు, స్త్రీలకుఁ దర్పణాధికారముగలదని ముందే చెప్పఁబడెను, అంజలిన్=దోసిట, యామ్యదిశకున్=దక్షిణదిక్కునకు, యమసంబంధము యామ్యము. తా త్ప ర్య ము

స్వధర్మనిష్ఠులని కీర్తిగన్న సీతారామలక్ష్మణులు మువ్వురు దుఃఖముచేఁ గాళ్ళుతొట్రుపాటుపడుచుండ మనోజ్ఞమైపూచిన చెట్లవరుసలుగలిగి పుణ్యతీర్థమై మనోహరమైన మందాకినీనది సమీపించుచు బురదలేనిదై శుభకరమై వడిగాఁ బాఱు మనోహరతీర్థమందు నీటికెదురుగ నిలఁబడి దశరథుని మనసులో స్మరించుచు నిదినీకు నిదినీకు నని తర్పణములు గావించిరి. అంత శ్రీరామచంద్రుఁడు దోయిటనీళ్ళుదీసికొని దక్షిణదిశతిరిగి మిగులశోకభరమునఁ దండ్రి నుద్దేశించి యిట్టులనెను.

—• రామలక్ష్మణులు దండ్రికి నివాపంబు లిచ్చుట. •—

కం. నే నొసఁగెడు విమలం బగు, నీనీరమ్ము పితృలోక•మేగిన నీకున్
వానుగ నక్షయసుఖసం,ధానచణం బగును గాతఁ • దండ్రీ యచటన్.

ఈ పద్యము తర్పణమంత్రార్థము. విమలము=దోషరహితమైనది అక్షయసుఖసంధానచణంబు=శాశ్వతసుఖమును గూర్చుసామర్థ్యముగలది, అచటన్=అలోకమందు. తా త్ప ర్య ము.

తండ్రీ! నేనిచ్చు నీ నిర్మలజలము పితృలోకమున కేగిన నీకు నచట శాశ్వత సుఖమును గలిగించు శక్తిగలదగునుగాక.

కం. అని మందాకినితీరం,బున రాముఁడు భ్రాతృయుక్త•ముగను నివాపం
బును విడిచి యొండుకడకుం, జని యచ్చట నొక్కదర్భ•సంస్తరసీమన్.

భాతృయుక్తముగను=లక్ష్మణుతో, నివాపము=తర్పణజలము, ఒండుకడకున్=పిండప్రదానము చేయుటకై వేఱొక స్థలమునకు, దర్భసంస్తరసీమన్=దర్భలు

పఱచినచోట, ఇంతవఱకు జలతర్పణమునకు నందఱు నధికారులే కావున సీతా రామలక్ష్మణులు ముగ్గురు చేసినట్లు చెప్పఁబడెను. ఇఁక సపిండీకరణము పెద్ద కొడుకు చేయునది కావున శ్రీరాముఁడొకఁడే చేసినట్లు చెప్పఁబడుచున్నది.

తాత్పర్యము

ఈప్రకారము లక్ష్మణునితోడ నీళ్లు విడిచి యొడ్డునకువచ్చి వేఱొకస్థలము నందుఁ బిండములు పెట్టుటకై దర్భలు పఱచి వానిమీఁద.

తే. గారపిండియు రేఁగునుఁ • గలిపి పిండ, ములనునిల్పి సీతేశుండు • దలఁచి తండ్రిఁ
గన్నులను నీరు జడగొని • కాఱుచుండ,
సిట్టులనుఁ బిండములఁ జూపి • వృద్ధతరాప్త. ౨౩-౨౩

శ్రీరామచంద్రుఁడు రేఁగుపండ్లు గారపిండి కలిపి పిండములను జేసి దర్భలపై నుంచి తండ్రిని స్మరించి కన్నులవెంట నీరు వర్షమువలెఁ గాఱుచుండ మిగుల శ్రద్ధతోఁ బిండములనుజూపి యిట్లనియె.

ఇచట శ్రీరామచంద్రమూర్తి తండ్రి నుద్దేశించి పిండములను బెట్టెఁగదా. ఈపిండము లెప్పటి పిండములు? దశాహములోపలఁ బెట్టుపిండములా? సపిండీ కరణమునాఁటి పిండములా? "ముఖ్యకర్తా విదేశస్థః కాలేఽకాలే శ్రుతౌయది, తిలవారి ప్రకుర్వీత, పిండదానం వివర్జయేత్॥ ముఖ్యకర్త దేశాంతరమందుండి యేకోదిష్ట కాలమందుఁగాని తదనంతరముగాని తండ్రి మరణము వినెనేని నూవులు నీళ్లు విడువవలయునేగాని పిండప్రదానము చేయరాదు". అని యుండుటచే నిది దశాహము లోపలినాఁటి పిండములుగావు. రెండవదియుఁ గాదు. ఎట్లన:- "పితరౌచే న్మృతౌస్యాతాం, దూరస్థోపిహిపుత్రకః। శ్రుత్వా తద్దిన మారభ్య, దశాహం సూతకీ భవేత్॥ దేశాంతరమునయుండు పుత్రుఁడు తండ్రి మరణవార్త వినెనేని యాదినము మొదలు పది దినములు సూతకము గలవాఁడగుచున్నాఁడు. అను వచనమువలన శ్రీరామచంద్రమూర్తికి సూత కము ప్రాప్తింపఁగా "సర్వేషామేవ వర్ణానా, మాశౌచాంతే సపిండనమ్" అని యుండుటచే నాశౌచాంతమునఁ జేయవలసిన సపిండీకరణము సూతకియై యెట్లు చేసెను? కావున నిది సపిండీకరణము గాదు అని యాక్షేపమురాఁగా సమాధానమేమన:—

ఇక్కడఁ జెప్పఁబడినవి సపిండీకరణము నాఁటివే. అట్లయిన నాశౌచాంత మున జేయవలసిన సపిండీకరణము వెంటనే యెట్లుచేసెను. అనిన- "వేదార్థం యోవిజానాతి వేదమంగై స్సమన్వితమ్। సంకల్పం సరహస్యంచ క్రియా వాంశ్చే న్నసూతకమ్॥ రాజర్త్విగ్దీక్షితానాంచ బాలేదేశాంతరం తథా, వ్రతినాం సత్రిణాంచైవ సద్యశ్శౌచం విధీయతే॥ అని దక్షుఁడు- నరాజా మఘదోషోస్తి, వ్రతినాం నచ సత్రిణాం, ఐంద్రం స్థానముపాసీనా, బ్రహ్మభూతాహితే సదా।

రాజ్ఞో మహాత్మికే స్థానే। సద్యశ్శౌచం విధీయతే। ప్రజానాం పరిరక్షార్థ మాసనం చాత్ర కారణమ్॥ మను- ౫-౯౩-౯౪.

ఈ వాక్యములవలన వేదవేదాంగము లర్థము కల్పము రహస్యముతో నెఱిగినవానికిఁ గ్రియావంతునకు రాజులకు. ఋత్విజులకు- దీక్షితులకు- చౌలముగాని బాలురకు- వ్రతులకు యాగముచేయుచుండు వారికిని సూతకము లేదని యేర్పడుచున్నది.

యతివ్రతి బ్రహ్మచారి నృపకారుక దీక్షితాః

నాశౌచ భాజః కథితా రాజాజ్ఞా కారిణశ్చయే. శంఖ-౧౫-౭

అటైన దశాహసూతక మెవ్వరి కనిన :—

శ్లో॥ అస్నాత్వాచ జపోహుత్వా భుంక్తేదత్త్వాత యోద్విజః

ఏవం విధస్య విప్రస్య దశాహం సూతకం భవేత్ ॥

స్నానముచేయక జపహోమభోజనాదులుచేయు బ్రాహ్మణునకు దశరాత్రములు సూతకము గలదు.

ఇటులని యీనాఁటి బ్రాహ్మణులు మేము స్నానముచేసి భోజనముచేయుచున్నాము కావున మాకు సూతకము లేదనరాదు. ఇది పూర్వయుగములమాట.

కలౌయుగేత్విమాం ధర్మాన్ వర్జ్యానాహుర్మనీషిణః

కల్పాంతరాణి కుర్వాణః కలౌ వ్యామోహ కిల్బిషీ॥ హరితుఁడు-

ఈ ధర్మములు కలియుగమందుఁ ద్యాజ్యములు- సపిండుఁడు చచ్చెనేని బ్రాహ్మణుఁడు పది దినములు సూతకముండవలెను.

"నకర్తవ్యం నకర్తవ్యం, సద్యః సంకోచనం కలౌ" కలియుగమందు సంకోచింపరాదు సంకోచింపరాదు.

ఈ కారణముచే వేదవేదాంగతత్త్వవేదియు, రాజు, క్రియాశీలుఁడు, వ్రతియునగు శ్రీరామచంద్రునకు సూతకము స్నానముతోసరి. అటైనను మఱియొక సందేహము.

సపిండీకరణము ప్రేతత్వ విముక్తికిఁగదా. భరతుఁడు సపిండీకరణము చేసినపుడే దశరథునకుఁ బ్రేతత్వము పోయెనే. ఇప్పుడు మరలఁ బ్రేతత్వ విమోచనమన నర్థమేమి ?

చిన్నవాఁడు ముందు సపిండీకరణము చేసినను దేశాంతరమందున్న పెద్దవాఁడు సపిండీకరణమును బ్రేతశబ్దము విడిచి చేయవలెను- ప్రేతశబ్దముచ్చరింపరాదు. సపిండీకరణము మానరాదు.

యవీయసాకృతం కర్మ ప్రేతశబ్దం విహాయతు

తజ్జ్యాయసాపి కర్తవ్యం, సపిండీకరణం పునః॥ అని ప్రమాణము-

అట్లైనను సపిండీకరణమునాఁడు బ్రాహ్మణ భోజనము చేయవలయునే- ఆ విషయము చెప్పలేదేయనిన- సపిండీకరణము ప్రధానమైనచో నందున్న వారికే, ఫలమూలము లిచ్చెనని యూహింపనగు,

కం. పురుషున కన్నం బెది యా,పురుషుని దేవతలకు నదియ•భుక్తి యటౌటన్
నరవర! భుజియింపుము కడుఁ, బెరిమన్ మా కన్నమైన•పిణ్యాకంబున్.

ఇది తర్పణముచేసిన చోటికిఁ గొంచెము దూరమునఁజేయుటఁబట్టి యిది సపిండీకరణమని యెఱుఁగవలయును. దశాహమైనపిదప నాశౌచమున్న పుత్రుఁడు తర్పణముచేసి సపిండీకరణము చేయవలయును. మఱియు నీ పిండ ప్రదానము తర్పణమునువలె లక్ష్మణుఁడు చేసినట్లు చెప్పలేదు. కావున జ్యేష్ఠుఁడు మాత్రమే చేసిన యీ కార్యము సపిండీకరణమే. దృఢతరాస్థన్=మిక్కిలి దృఢమైన ప్రయత్నముచే శ్రద్ధయాదేయమ్మని శ్రాద్ధమునకు శ్రద్ధ యావశ్యకము గావున నట్టి శ్రద్ధ చెప్పఁబడెను. పిణ్యాకంబున్ = పిండిని, యదన్నః పురుషో భవతి తదన్నాస్తస్య దేవతా యను శ్రుతివాక్యమిచట ననుసంధించునది.

ఓయీ శ్రాద్ధము పైతృక కర్మముకదా. దేవతలకుఁ జెప్పినది-పితృదేవతల కెట్లన్వయించుననరాదు. ఇచ్చట దేవతాశబ్దము దేవ పితృ మనుష్య సంప్రదాన మాత్రపరము- ఎట్లులనినఁ దైత్తిరీయమందు వైశ్వదేవగ్రహ బ్రాహ్మణమున.

"ఏ తస్మిన్వా అపిగ్రహే మనుష్యేభ్యో దేవేభ్యః, పితృభ్యః, క్రియతే- మనుష్యులకు దేవతలకుఁ బితృదేవతలకుఁ జెప్పఁబడినది కడపట" ఏతావతీర్వై దేవతాః తాభ్యః ఏవైనం సర్వాభ్యోగృహ్ణాతి అని మనుష్యాది సాధారణ పరముగా దేవశబ్దము ప్రయోగింపఁబడెను.

యదన్నక్షయే త్తతో దద్యాత్, బలిభిక్షాంచ శక్తితః
అమ్మూలఫల భిక్షాభి రర్చయే దాశ్రమాగతాన్॥ మనువు.

తానేది భుజించునో యదియే శక్తికొలఁది బలిభిక్షములకు నియ్యవలయును. ఆశ్రమమునకు వచ్చినవారిని ఆ జలము కందమూలములు ఫలములు పెనిచే నర్చింపవలయును. ఇచ్చట యజ్ఞశిష్టమని గ్రహింపవలెను. అంతియకాని వచ్చినవారి నిమిత్తమై తనకు లేనిపదార్థములు సంపాదింపఁ బ్రయాసపడవలసిన పనిలేదు.

తా త్ప ర్య ము

పురుషునకేది యాహారమో యా యాహారమే యతని దేవతలకు నిడవలయును గావున రాజా నాయందుఁ బ్రేమచే మాకన్నమైన యీపిండిని దినుము. దీనివలన శ్రీరామచంద్రమూర్తికి నిత్యాహారము ఫలమూలాదులేకాని మాంసము కాదని యేర్పడుచున్నది.

సీ. అనుచుఁ గర్తవ్యక్రి•యల నెల్లఁ దీరిచి, క్రమ్మఱిచనియెఁ బ•ర్వతమునెక్కి
యాకుటింటిని జేరి•హా యని భరతల,క్ష్మణులను గ్రుచ్చి శో•కంబు గదుర
విలపింప వారల • విపులారవంబున, ధరణీధరము ప్రతి•ధ్వనుల నీనె
నది విని భరతు సైన్యంబులు భీతిల్లి, భరతుండు శ్రీరామ•భద్రుఁ జూచెఁ
తే. గావునవెపుట్టె నింతటి•కలకలమ్ము,
వినియెఁ గాఁబోలుఁదమతంద్రి•చనుట దివికి
ననుచు వారలు వారివా•హనము లంద, పీడి పరు వెత్తి రాధ్వని•జాడఁబట్టి.

కర్తవ్యక్రియలన్=చేయవలసిన కార్యములను, తీరిచి=నెఱవేర్చి, ఆకు+ఇల్లు=ఆకుఁటిల్లు=పర్ణశాల, విపులారవంబునన్ = పెద్ద ధ్వనిచే, ధరణీధరము=కొండ.

తాత్పర్యము

ఈ ప్రకారముచెప్పి చేయవలసిన కార్యములనెల్ల నెఱవేర్చి కొండయెక్కి మరలి పర్ణశాలకుఁబోయి భరతలక్ష్మణులను గౌఁగిలించుకొని హాయని యేడ్చెను. వారును నట్లే యేడ్చిరి. ఆ పెద్దధ్వనికిఁ బర్వతమునఁ బ్రతిధ్వని పుట్టెను. ఆ ధ్వని విని భరతుని సేనల వారలు భయపడి భరతుఁడు శ్రీరామునిఁ జూచెఁ గాఁబోలు- శ్రీరాముఁడు తనతండ్రి మరణము వినియెఁగాఁబోలు. కావుననే యిట్టి కలకలము పుట్టెనని వారి వారి వాహనములు వారున్నచోటనే వదలి ధ్వని జాడఁ బట్టుకొని పరువెత్తిరి.

—• పౌరులు శ్రీరాముని పర్ణశాలకుఁ బోవుట. •—

కం. కొందఱు గుఱ్ఱంబులపైఁ, గొందఱు నాగములమీఁదఁ•గొందఱు తేర్లన్
గ్రందుగ సుకుమారులు చన, నందఱుఁ గాల్నడన పోయి•రాస్థలమునకై.

తాత్పర్యము [౩౩-౩౯

నడువలేని సుకుమారులు కొందఱు గుఱ్ఱములమీఁదఁబోయిరి కొందరేనుఁగులమీఁదఁబోయిరి. కొందఱు రథములమీఁఁదఁబోయిరి. తక్కిన యందఱు నా ప్రదేశమునకుఁ నడచి పోయిరి.

కం. మొన్ననె విడిచినరాముని, నెన్నాళ్లో యయిన యట్టు•లేఁకారుచు వే
గోన్నతి నాశ్రమమున కా,యన్నలఁ దమ్ములను జూడ•నరిగిరి లోకుల్.

ఏఁకారుచున్ = వాఁచిపోవుచు, రూ-ఏఁకరుచు, వేగోన్నతిన్ = వేగము యొక్క యతిశయముచే, మొన్ననె=సమీపకాలమందే.

తాత్పర్యము

సమీపకాలమందే నెలకుముందు వదలిన శ్రీరాముని నెన్నియో దినములకు ముందు విడిచినట్లుచూడ వాఁచిపోవుచు మిగులవేగముగ నాశ్రమమునకై యన్నదమ్ములఁజూడ లోకులు పరువుపాఱిరి.

కం. భ్రాతలసమాగమంబును, జేతః ప్రీతిగను జూడఁ • జెచ్చెరఁ జనఁగా
జాతఖురనేమిరావ, వ్రాతము దలఁపించె జలధ•రసమాగమమున్. ౪౩౭౮

సమాగమంబు = చేరికను, చేతఃప్రీతిగను = మనస్సునకు సంతోషము కలుగునట్లు, చెచ్చెరన్=త్వరగా, జాత=పుట్టిన, ఖుర=గుఱ్ఱపు గిట్టలయు, నేమి= రథచక్రములయు, రావ=ధ్వనియొక్క, వ్రాతము=సమూహము, జలధరసమాగమమున్= మేఘముతో మేఘము కలియుటను, తలఁపించెన్ = మనస్సునకుఁ దెచ్చెను, స్మృత్యలంకారము.

తాత్పర్యము

అన్నదమ్ముల కూడికను మనస్సునకు సంతోషకరముగాఁ జూచుటకు లోకులు పోఁగా వారి వాహనములగు గుఱ్ఱములగిట్టల ధ్వనులును రథచక్రముల ధ్వనులను మేఘముల యుఱుములను స్మరణమునకుఁ దెచ్చెను.

కం. గడబడ దడబడ నులివులఁ, దొడిఁబడి యక్కానలోని•దుంతలు దంతుల్
బెడిదపుఁబులులుం బాములు,
గడగడ కొండదురఁ బాఱె•గవయవృకంబుల్. ౪౩౭౯

ఉలివుల=ధ్వనులచే, తొడిఁబడి=చెదరి, దుంతలు=దున్నలు, దంతుల్= ఏనుఁగులు, బెడిదపు = భయంకరమైన, గవయవృకంబుల్ = గవయములు, తోడేళ్లు- గడబడ-దడబడ-గడగడ ఇవి ధ్వన్యనుకరణములు.

తాత్పర్యము

మనుష్యులయు వాహనములయు గడబడ దడబడ ధ్వనులచే నాయడవిలోని దున్నపోతులు- ఏనుఁగులు- పులులు- పాములు- గవయ మృగములు తోడేళ్లు కొండ గడగడ యదరునట్లు పరువెత్తెను.

కం. చక్రంబులచక్రంబులు, చక్రాంగంబులును సార•సంబులు నత్యూ
హక్రౌంచంబులు మింట న,వక్రగతిం గూయ దొడఁగె•వదలనిభీతిన్.

చక్రంబుల = చక్రవాకపక్షులయొక్క, చక్రంబులు = సమూహంబులు, చక్రాంగంబులు=హంసలు, సారసంబులు = బెగ్గురు పక్షులు, నత్యూహ = నీటియుట్టి, నత్యూహో జలరంకుస్స్యాత్ హలాయుధుఁడు, క్రౌంచంబులు=క్రౌంచ పక్షులు, మింటన్=ఆకాశమందు, అవక్రగతిన్=విస్తారముగ.

తాత్పర్యము

జక్కవల గుంపులు- హంసలు- బెగ్గురులు- పసులపోలిగాండ్రడు (కాటుక పిట్టలు) క్రౌంచములు ఇవియన్నియు గూండ్లువిడిచి భయముచే నాకాశమున నెగిరి యందు విస్తారముగఁ గూయుచుండెను.

కం. ఖగములు తారాపథమున, మృగములు మనుజులును నేల♦నెల్లడఁ గ్రమ్మన్
వగ నేలఁ గూరుచుండిన, సుగుణిమణిన్ రాము నచటఁ♦జూచెను జనముల్. ౨౩౩౧

ఖగములు=పక్షులు, ఖ+గ= ఆకాశమునఁబోవునవి, తారాపథమునన్ = ఆకాశమార్గమందు, వగన్=వ్యసనముతో.

తా త్ప ర్య ము

ఆకాశమునఁ బక్షులు, నేలపై మృగములు మనుష్యులు నలుదిశల వ్యాపింపఁగాఁ దండ్రి మరణమునకై వ్యసనపడుచు నేలపైఁ గూర్చుండిన సాధుశ్రేష్ఠుఁడగు శ్రీరాముని జనములు చూచెను.

కం. తిట్టుచుఁ గైకను మంథరఁ, బుట్టెఁడు బాష్పములఁ గనులు♦పూరటిలంగా
నట్టెఁ గనుంగొని రామునిఁ, గట్టా యని యెల్లవారుఁ♦గాఱియపడఁగన్.

పుట్టెఁడు = పుట్టి + ఎఁడు = పుట్టికొలఁతగల అనఁగా విశేషముగ, పూరటిల్లంగా=నిండఁగా, కట్టా=అయ్యో, కాఱియపడఁగన్=బాధపడఁగా.

తా త్ప ర్య ము

ఆదశయందు శ్రీరామునిఁజూచిన వారందఱు కైక మంథర వలనఁగదా యిట్టి మహాత్మునకింత కష్టమువచ్చెనని వారిని దిట్టుచు నుబ్బివచ్చుచుండు విస్తారమైన కన్నీళ్లచేఁ గన్నులునిండఁగా శ్రీరాముని నెగాదిగఁజూచి యయ్యో యీయన కెంతకష్టము వచ్చెనని పరితాపపడిరి.

ఉ. వారలఁ జూచి రామజన♦వర్యుఁడు తండ్రిని దల్లినిం బలెన్
గూరిమిఁ గౌఁగిలించుకొనఁ♦గొందఱు రామునిఁ గూర్పఁ గౌఁగిటం
బోరులు కొంద ఱాయనఘు♦మాటికి మ్రొక్కిరి, బంధులన్ సుహృ
ద్వారము నాదరించెఁ దగు♦భంగుల రాముఁడు సాదరంబుగన్. ౨౩౩౩

తా త్ప ర్య ము

వచ్చినవారి నందఱనుజూచి శ్రీరాముఁడు తనకంటెఁ బెద్దవారును బూజ్యులు నగువారిని దండ్రిని దల్లిని గౌఁగిలించుకొనునట్లు కౌఁగిలించుకొనెను. కొందఱు శ్రీరామునిఁ గౌఁగిలించిరి. పౌరులు కొందఱు శ్రీరామునకు మీఁద మీఁద నమస్కరించిరి. బంధువులను స్నేహితులను వారి వారి యోగ్యతానుసారముగఁ బ్రీతితో శ్రీరామచంద్రుఁ డాదరించెను.

కం. వారల యేడుపుటులివు ల,వారితమై మిన్ను మన్ను♦వారక నిండన్
గైరికగుహలు మృదంగ, స్ఫారరవములట్టు లిచ్చెఁ♦బ్రతినిస్వనముల్.

వారలు=చూడవచ్చినవారియొక్క, ఏడుపు+ఉలివు=రోదనధ్వని, అవారితమై=అడ్డగింపరానిదై, మిన్ను =ఆకాశము, మన్ను = నేల, గైరికగుహలు =

పర్వత సంబంధములైన గుహలు, మృదంగస్ఫారరవములు = మద్దెలలు వాయించిన ధ్వనులు, ప్రతినిస్వనముల్ = ప్రతిధ్వనులు.

తాత్పర్యము

ఆ చూడవచ్చినవారి రోదనధ్వనులు వారింపరానివై భూమి యాకాశము నిండఁగా నాధ్వనులచేఁ బర్వతగుహలు మద్దెలను వాయించినట్లు ప్రతిధ్వను లిచ్చెను.

—• { ౧౦౩-వ సర్గము. కౌసల్య సుమిత్రకు శ్రీరామలక్ష్మణుల యేటినీటి రేవుఁ జూపి దుఃఖించుట. } •—

కం. అంతట దశరథధరణీ,కాంతుని కామినులు మున్ను • గా భూతనయా
కాంతునిఁ గనఁగ వసిష్ఠుం, డెంతే ముదమునను వచ్చె • నెడమార్గమునన్.

తాత్పర్యము

మగవారందఱు ముందుగావచ్చి శ్రీరాముని దర్శించిరి. దశరథు భార్యలను బిలుచుకొని వసిష్ఠుఁడు కాలినడ శ్రీరాముని మరలఁ గనఁగ గలిగెఁగదా యను సంతోషముతో వచ్చుచుండఁగా మార్గమధ్యమందు.

సీ. దేవు లెల్లరుఁ దిన్న • తిన్ననినడకల, మందాకినీకూల • మందుఁ జనుచు
రామలక్ష్మణసేవి • తామలతీర్థంబుఁ, గనుఁగొనఁ గౌసల్య • కనుల వారి
ధారలు గురియంగఁ • దనపజ్జ వచ్చుసు,మిత్రాదిసతులకు • మెల్ల ననియెఁ
దమరాజ్యమునసుండి • తఱుమఁగొట్టంబడి, నట్టి యనాథులు • సనఘచరితు
ఆ. లంబువులకుఁ గాను • నరుగుదెంచెడి రేవు,
చూడుఁ డిదియ యడుగు • జాడ లొప్పె
రాకపోకకలిమి • రాపడి యున్నది, కంటివే సుమిత్ర • కష్టపాటు. —౨౩౩౬

దేవులు = రాజ భార్యలు, ఏక-దేవి; బహు- దేవులు- దేవుఁడనుటకుఁ దెనుఁగున బహువచనములేదు. దేవుండ్లు గ్రామ్యము, తిన్న తిన్నని నడకలన్ = సుకుమారులు గావునను శోకభారముచేతను- మెల్ల మెల్లని నడకలచే, కూలమందున్ = తీరమందు, రామలక్ష్మణ సేవితామలతీర్థంబు = రామలక్ష్మణులచే స్నానపానార్థ ముపయోగింపఁబడు నిర్మలమైన పుణ్యజలము, వారిధారలు = నీళ్ల ధారలు, పజ్జ = పార్శ్వమునందు, అనాథులు = దిక్కులేనివారు, అంబువులకుఁ గాను = నీళ్లనిమిత్తమై, రాపడి = రాపుతగిలి.

తాత్పర్యము

రాజభార్యలందఱు సుకుమారులు శోకతప్తలుగావున మెల్లగా నిట్లనియె. అమ్మలారా తమ రాజ్యమునుండి వెడలఁగొట్టఁబడ దిక్కులేనివారగు పుణ్యచరిత్రులు రామలక్ష్మణులు నీటికై వాడుకగా వచ్చుచుఁబోవుచుండు రేవిదియే. నీకెట్లు తెలియునందురా. ఇదిగో వారి రాకపోకల యడుగుల జాడఁగలిగి కాలి

త్రొక్కడుల నలఁగియున్నది. సుమిత్రా! రామలక్ష్మణులకు వచ్చిన కష్టము చూచితివా? ఇతర మనుష్యసంచార చిహ్నలు కానరామిచే నీయడుగులు వారివే యని తీర్మానించెను.

కం. నాకొడుకు నిమిత్తంబై, నీకొడు కిటనుండి దినము•నీళ్లం బ్రీతిం
జేకొని పోవుఁ గదా య, స్తోకాతంద్రతను దాన•సుమహితచరితా! ౨౩౩౭

సుమహిత చరితా = మిక్కిలి పూజ్యమైన నడవడిగలదానా, అస్తోక = అల్పముకాని, అతంద్రతను=హెచ్చరికతో.

తాత్పర్యము

నాకొడుకు కోసరము నీకొడుకిచ్చటనుండి ప్రతిదినము ప్రేమచే మిక్కిలి జాగరూకతగలవాఁడై నీళ్లు తీసికొనిపోవుచుండు నుగదా. నాపాపము నాతోఁ బోవక నీకును జుట్టుకొన్నది.

సీ. ఇది నీచకర్మంబ•యీ హేతువున నీదు, పుత్రు గర్హింపదు•భువనవితతి
యన్న సేవయె పర•మార్థమం చతఁ డట్లు, చేయు నాసుగుణికే•చెల్లు నదియు
నాతనియాకష్ట•మంతయుఁ దీఱదే, భరతుండు కోరిక•పడసె నేని
యని యేగుచును దక్షి•ణాగ్ర దర్భలమీఁద, జనకునకై రామ•చంద్రుఁ డిడిన
తే. యట్టియింగుదిపిణ్యాక•మనిన చూచి, తోడనుండెడి దశరథు•చేడెలఁ గని
యనియెఁ గంటిరె జనకున•కై రఘూత్త,
ముండు సవిధిగఁ బెట్టిన•పిండములను. ౨౩౩౮

గర్హింపదు=నిందింపదు, భువనవితతి=లోకసమూహము, పరమార్థము= ఉత్తమ పురుషార్థము, మంచిగుణములుగల యతనికే, తీఱదే=నశింపదా, దక్షిణాగ్రదర్భలమీఁదన్ = దక్షిణపు కొనలుండఁ బఱచిన దర్భలమీఁద, ఇడిన = ఉంచిన, ఇంగుదీపిణ్యాకము=గారపిండి, సవిధిగన్=శాస్త్రప్రకారము.

తాత్పర్యము

ఇట్లు నీరు మోసికొనిపోవుట రాజకుమారులకు నీచకర్మమే- కాదనను గాని యీ కారణముచే నీకొడుకును నీచకార్యము చేయుచున్నాఁడని లోకము నిందింపదు. పరుల బలవంతముచేతనో కూటినిమిత్తమో యొకరియొద్ద కొలువునం దుండి వారికై నీళ్లు మోయుట నీచకార్యమే కాని ప్రతిఫలకాంక్షలేక ప్రేమతోఁ గర్తవ్యమను భావముతో నుపకారబుద్ధితోఁ బెద్దల సేవచేయుట పరమపురుషార్థ సాధనమని యతఁడు చేయుచున్నాఁడు. అట్టివాని నెవరునిందింతురు? నిందింపరు కదా మఱి పొగడుదురు. పైలన మీఁదఁ జెప్పినట్లు జ్ఞానము భక్తిగలిగి ధర్మబుద్ధితోఁ గష్టవేళ మానావమానము లెంచక సవతితల్లి కొడుకను తలంపులేక లోకమున నెవఁడిట్లు సేయును? ఇట్లుసేయుట యీసుగుణధన్యునకే చెల్లునుగాని యితరులకుఁ జెల్లదు. శ్రీరాముని మరల నయోధ్యకుఁ బిలుచుకొనిపోవలయు నన్న భరతుకోరిక నెఱవేఱెనేని లక్ష్మణుని యీకష్టమంతయుఁ దుదముట్టునుగదా.

అని చెప్పుచుఁ బోయి పోయి దక్షిణపువైపు కొనల దర్భలమీఁదఁ దండ్రి నిమిత్తమై శ్రీరామచంద్రుఁడు పెట్టిన గారపిండి పిండములనుజూచి తనతోడ నుండు దశరథు భార్యలకుఁజూపి శ్రీరాముఁడు శాస్త్రప్రకారము తండ్రికిఁబెట్టిన పిండములను జూచిరిరా.

శ్లో॥ శుశ్రూషతేయః పితరం, నచాసూయేత్కదాచన
మాతరం భ్రాతరంవాపి, గురుమాచార్యమేవచ
తస్యరాజన్ ఫలంవిద్ధి, స్వర్లోకే స్థాన మర్చితమ్
నచపశ్యేత నరకం, గురుశుశ్రూషయాత్మవాన్. భార. అను- ౧౧౦ అధ్యా.

తండ్రిపైఁ గోపింపక శుశ్రూషచేయువాఁడును అట్టులే తల్లికి- నన్నకు- గురువునకు- నాచార్యునకు సేవచేయువాఁడు నరకమునకుఁబోఁడు. స్వర్గమందుఁ బూజ్య స్థానమును బొందును. దీనిచే నెంతటి నీచకార్యమైనను గురు పితృదేవ కార్యార్థము భక్తితోఁ జేయఁబడునేని యది నీచమెన్నఁటికిఁ గాదు.

మ॥ గృహసమ్మార్జనమో, జలాహరణమో, శృంగార పల్యంకికా
వహనంబో వనమాలికా కరణమో వాల్లభ్యలభ్యధ్వజ
గ్రహణంబో వ్యజనాతపత్రధృతి యో ప్రాగ్దీపికారోపమో
నృహరీ వాదములేల లేరెయితరుల్ నీలీలకుం బాత్రముల్.

అముక్త. ౨-౯౧.

దేవతా నిమిత్తమై కసవూడ్చుట, నీళ్లుమోయుట, పల్లకిమోయుట, దండలు కట్టుట, ధ్వజము మొదలయినవి మోయుట, చామరము గొడుగుపట్టుట, దీపములు పెట్టుట యివి శ్లాఘ్యములుగాని నీచములుగావు. వీనినేకూలి దీసికొని మనుష్యులకుఁ జేసిన నీచములే.

ఉ. దేవసమానుఁ డైనజగ • తీపతివర్యుఁడు శక్రభోగసం
భావితుఁ డార్యమూర్తి పరి • భక్షితసాగర వేష్టితక్షముం
డేవిధి గారపిండి తిను • నియ్యవి రామునివంటిపుత్రుఁడు
ర్వీవిభుఁ డైన తండ్రి కిడె • వే శోకదుఃఖము భూమి నున్నదే. ౨౩౩౯

శక్రభోగ సంభావితుఁడు=ఇంద్రుని సౌఖ్యముచే గౌరవింపఁబడినవాఁడు, ఆర్యమూర్తి=పూజ్యుఁడు, పరిభక్షితసాగర వేష్టితక్షముండు = సముద్రముచేఁ జుట్టఁబడిన భూమిని ననుభవించువాఁడు.

తాత్పర్యము

దశరథుఁడో దేవతలతో సమానుఁడగువాఁడు. రాజులలో శ్రేష్ఠుఁడు- ఇంద్రభోగమువంటి భోగమనుభవించినవాఁడు. లోకులచే గొప్పవాఁడని పూజింపఁ బడినవాఁడు, అట్టివాఁడి గారపిండి నెట్లు దినఁగలఁడు, ఇట్టి పిండములను

రామచంద్రునివంటి కొడుకు భూమీశ్వరుఁడైన దశరథున కిడెనఁట- ఇంతకంటె దుఃఖకారణము వేఱొకటి లోకమునఁగలదా.

తేజోమూర్తులైన దేవతలు పృథివీతత్త్వ భూయిష్ఠములైన పదార్థములు నోరఁదినరు. చూపులచే సారము గ్రహింతురు. వి. పు.

కం. అంగద! రాముఁడు దండ్రికి, నింగుదిపిణ్యాకపిండ♦మిడుటను గన్నా
రం గాంచియు నాడెంద ము,భంగురదుఃఖమున వేయి♦పఱియలు గాదే.

అంగద=అయ్యో, అభంగుర దుఃఖమునన్ = విస్తార దుఃఖమున, పఱియలు=చీలికలు. తా త్ప ర్య ము.

అయ్యో! జీవితకాలమునందు వ్రేలువేసియైనఁ దాఁకియుండని గారపిండితోఁ జేసిన పిండములను నాకొడుకు శ్రీరాముఁడు తన తండ్రికిఁ జేతులారఁ బెట్టుటను గన్నులారఁ జూచియు నాగుండె దుఃఖతాపముచే వెయ్యితునుకలుగాఁ బెటిలిపడకున్నదిగదా. నాకంటె రాతిగుండె యాఁడుది లోకమున నుండునా?

కం. అన్నం బెది పురుషున కా,యన్నమె తద్దేవతలకు♦ ననువేదోక్తిన్
మున్ను విని యుంటి నిప్పుడు,
కన్నారఁగ సత్యమనుచుఁ♦గనుఁగొనుటయ్యెన్. -౩౪౧

తా త్ప ర్య ము

అమ్మలారా! ఏ పురుషునకేది యాహారమో యాపురుషుని దేవత కదియే యాహారము. అని శాస్త్రమునందుఁ గలదని మును వినియుంటిని- అది సత్యమని నేఁడు కన్నారం జూచితిని.

యథాహారో భవేత్తేన, పూజయేత్పితృదేవతాః ।
తేనైవ పూజయేన్నిత్యం, మతిథిం సముపాగతమ్॥ శంఖ.

ఎవనికేది యాహారమో వాని పితృదేవతలకు నతిథుల కదియే యాహారము.

—♦ కౌసల్యాదులు శ్రీరామునిఁ జూచుట. ♦—

చం. అని యిటు లార్తిఁ గూర సవ♦తాండ్రును దేవ్చుచుఁ బోయి యాశ్రమం
బున దివి వీడి నట్టిసుర♦పుంగవుఁ బోలెడి త్యక్తభోగు రా
మునిఁ గని గొల్లు మంచు వెత♦ముగ్గి రపంబుగ నేడ్వ రాముఁడున్
జనులపాదపద్మములఁ♦ జయ్యనవ్రాలి నమస్కరించినన్. -౩౪౨

సవతాండ్రును=ఇచట నిత్యసంధి, ఏష్యాదులలోఁ జేరుట సాధువు. బహువచనపు ప్రత్యయము, దివి=స్వర్గము, సురపుంగవున్ = దేవశ్రేష్ఠుని, త్యక్తభోగున్=వదలిన భోగములుగలవానిని.

కొందఱీ ఇత్వసంధి నిషేధించెదరుగాని యీక్రింది ప్రయోగంబులు గానంబడియెడి. దీనిసాధుతకు శ్రావ్యంబై గ్రాహ్యంబను నథర్వణోక్తియే ప్రమాణము. "అనపిచ్చి" 'కనుదోయిలియన్', 'తిత్తొల్చి', పదాఱు, సవతాలు (సవ

తాలికిఁ బతివలచిన), మగనాలు, తెలివార, తెలివుల్లమ్మున, అని భారతమందును, కాఁపుకోఁడలు కంచంత కాఁపురంబు. (కంచి+అంత)కంట వత్తిడుకొని సైరిక ప్రభుండు (వత్తి+ఇడుకొని) అని పాండురంగ మాహాత్మ్యంబునను, మనవేటికి నూతనమా (మనవి+ఏటికి) భవానీ భర్తకలిమెంత, మన్నింపంగఁ బాడింతటన్ (పాడి+ఇంతటన్) తాళంజాలదు కౌఁగిలియ్యదు, మొలబంటై బొమ్మలబంటై మెడబంటై, అని నరసభూపాలీయ మందును వాకిలిప్పుడు తెఱచినారు (వాకిలి+ఇప్పుడు) అని భాస్కర రామాయణమందును, దూళయ్యె మారుతోద్ధూత పుష్పపరాగ (దూళి+అయ్యె) అని భీమఖండము, ౪ అ. ౧౪౪వ పద్యంబునందును 'వాని కౌఁగిలది యెక్కడ హావిధియేమిసేయుదున్' అని మను చరిత్రము, ౩ ఆ. నందును, 'వెండుంగరంబు' అని శ్రీనాథుని హరవిలాసంబునను; మగనాలి సరిపోల్పఁదగదు విధవయనియు, సవతాలి కొడుకు ౪ ఆ. అనియు, తిత్తొల్చి తోలు పచ్చడముచేసి (౬ ఆ.) అని కాశీఖండంబునందును తిత్తొల్చి తెచ్చిరి దిననాథనందనున నని నైషధంబునను. 'నాకు నొక్క భ్రాంతే సురలోక వందిత మదిం గవచంబునుఁ గుండలంబులున్' అని. భార ఆరణ్య ౭ ఆ. న. ఎఱ్ఱాప్రెగడయు, ధర్మతత్పరులకు గెల్పు భ్రాంతె' యని భార.శల్య. ౧ ఆ. తిక్కనయు మనోవల్లభుం। గనిపెండ్లాడుదుగాని యందనుకఁ జిక్కంబట్టు మీ ధైర్యమున్' అని ౫ ఆ- ౩౭ ప- చంద్రాంగద చరిత్రమునందును ఎఱ్ఱాప్రెగడ హరివంశంబునందు, తెలివొంది నీకే భ్రాంతియే వెన్నలున్- ౬ ఆ. అనియు, కాకేమి తన్నుఁదిట్టెనె, కోకిల తనకేమి ధనముకో కొమ్మనెనే. అని. కవి. కర్ణ-౨-అ-౮ పద్యమునందును. కేలుదోయెత్తి యొూదలఁగీలుకొల్పి నైష-౮- ఆ-మందును. అలరుబంతిది యని ఆంధ్రభాషాభూషణమునను, 'ద్రోవదన్। తీయంబోఁడి' యని పాంచాలీ పరిణయమందును పల్లవపుటార్చెడఁగ రాదు. అని రామరాజ భూషణుఁడును. ఇత్యాది ప్రయోగంబులు పెక్కులు గానంబడుచున్నవి. విజయవిలాస విష్ణుచిత్తీయములందు వలసినన్ని కలవు. వానిని గౌండబు కేవల లాక్షణిక గ్రంథంబులుగ నంగీకరింపమి నుదాహరణంబు లియ్యంబడవయ్యె. ఈ ప్రయోగములవలన శ్రుతికటువులుగాని ఇత్వ సంధులు గ్రాహ్యములని పూర్వులు గ్రహించిరి.

తాత్పర్యము

ఈ ప్రకారము శోకింపంగా సవతులు గతించిన దాసికేలవమ్మా యేడ్చెదవు భరతుఁడెట్లైనఁజేసి శ్రీరామలక్ష్మణులను బురమునకుఁ బిలుచుకొనివచ్చునులే- మనమందఱము పోయి వేఁడుకొనిన శ్రీరాముఁడు రాకయుండునా అని సమాధానపఱుచుచుఁబోయి యాశ్రమమందు, స్వర్గము విడిచిన దేవేంద్రునివలె భోగములను వదలిన శ్రీరామునిఁగని యాయన యునికికి స్త్రీలందఱు గొల్లున

నొక్క పెట్టున నోరని యేడ్చిరి. శ్రీరాముఁడా తల్లులనందఱఁజూచి చివాలునలేచి వారి పాదకమలములపై వ్రాలి నమస్కరించెను.

కం. వారు సుఖస్పర్శములగు,హారిమృదులపాణులన్ ని • జాంగుళులన్ సీ
తారమణీశునివీఁపుదు, మారముఁ బోఁదుడిచి రంత•మాతలఁ గనుచున్.

సుఖస్పర్శములగు=సుఖకరమయిన స్పర్శముగలవి, హారి=మనోహరములైన, మృదులపాణులన్ = మెత్తని యఱచేతులచే, నిజాంగుళులన్ = తమ వ్రేళ్లచే, దుమారము=దుమ్ము.

తాత్పర్యము

ఆ తల్లులందఱు తమ సుఖకరమగు మెత్తని యఱచేఁ దాఁకుచుఁ దమ వ్రేళ్లచే నారబయల నదీతీరమునఁ బండుటచే నయిన శ్రీరాముని వీఁపునందలి దుమ్మును బోవఁ దుడిచిరి. అంత నా తల్లులఁగని.

సీ. సౌమిత్రి దుఃఖించి•సాష్టాంగ మెరఁగిన, నాతనిరఘురాముఁ•నట్లచేయ
జానకి చనుదెంచి•సంతప్తహృదయ యై, యత్తల కెల్లను•నశ్రు లురల
మ్రొక్కి నిల్చుండిన•నక్కటికంబునఁ, దల్లి కూఁతునుబోలెఁ,•దద్ద గ్రుచ్చి
వనవాసకృశ దీన•వామాక్షి వీక్షించి, కౌసల్య పల్కు స•గద్గదముగఁ

ఆ. దండ్రి జనకరాజు•దశరథేశుఁడు మామ,రామచంద్రవిభుఁడు•ప్రాణధవుఁడు
నైననీవు నిట్టి•యడవులలో నెట్లు, దుఃఖపడెదవమ్మ•తోయజాక్షి! ౨౩౪౪

ఎరఁగినన్=నమస్కరింపఁగా, అక్కటికంబునన్=దయచే, వనవాసకృశన్ = అడవియందుండుటచేఁ జిక్కినదానిని, దీనన్=వ్యసనముతోఁగూడినదానిని, సగద్గదముగన్=డగ్గుత్తికతో.

తాత్పర్యము

లక్ష్మణుఁడు వచ్చి సాష్టాంగముగ నమస్కరింపఁగా నాయనను శ్రీరామునకుఁ జేసినట్లే చేయఁగా సీతాదేవివచ్చి తపింపుచున్న మనస్సుతో నత్తగార్లకందఱకుఁ గన్నీరు కాఱుచుండ నమస్కరించి నిలుచుండఁగా దయతోఁ దల్లి కూఁతువలె గాఢముగాఁ గౌఁగిలించి వనవాసము చేయుటచేఁ గృశించి దుఃఖించు సీతనుజూచి కౌసల్య డగ్గుత్తికతో నిట్లనియె అమ్మా! నీవు జనకరాజు కూఁతురవు. దశరథమహారాజు కోడలవు. రామచంద్రవిభుని భార్యవు. అట్టి గొప్పయింటఁ బుట్టి యిట్టి గొప్పయిల్లు మెట్టి యిటువంటి గొప్పవానిఁజేపట్టిన సుకుమారివి ఉత్తమ రాజకన్యవు, నీ వేవిధముగా నమ్మా! యీ యడవులందుఁ గష్టపడుచున్నావు.

ఉ. వాడినకల్వ, యెండ ధర • వ్రాలి కృశించిన తమ్మి, ధూళిచేఁ
గూడినజాతరూపము, మొ • గుల్ గుమి మాటినచందురుండు నాఁ
జూడఁగ నీమొగంబు భృశ•శోకభరారణిసూతి కాల్చెడిన్
రూఢిగ నన్నుఁ గాష్ఠమును•రూక్షముగా శుచి గాల్చు కైవడిన్. ౨౩౪౫

తమ్మి=కమలము, జాతరూపము=బంగారు, మొగుల్గుమి=మేఘముల సమూహము, మాటిన=అడ్డగించిన, భృశ=అధికమైన, శోకభర=శోకభారమనెడి, అరణిసూతి=అగ్ని. కాష్ఠమును=ఎండినకట్టెను, రూక్షముగా=తీవ్రముగా, శుచి = అగ్నిహోత్రుఁడు. ప్ర. రూఢి. విక్ర. రూఢి

తాత్పర్యము

వాడిన కలువపూవు- ఎండకు నీరు పట్టువిడిచి భూమిపైఁబడి శుష్కించిన కమలము- దుమ్ము కప్పిన బంగారము- మబ్బుగ్రమ్మిన చంద్రుఁడో యను నట్లు నీముఖముఁజూడఁగా నన్ను నెండిన కట్టెను దీవ్రముగా నగ్నిహోత్రుఁడు కాల్చునట్లు తీవ్రశోకాగ్ని కాల్చుచున్నది.

సీ. అనుచు నీగతిఁ దల్లి • యడలుచు నుండఁగ, జంభారి దేవతా • చార్యునకును
మ్రొక్కినరీతిని • మ్రొక్కి శ్రీరాముఁడు, శిష్టవినుతుఁడు వ • సిష్ఠునకును
నాతనితోడుత • నాసీనుఁ డైనను, భరతుండు నిజమంత్రి • పౌరయుతము
గాఁగఁ గూర్చుండెఁ దాఁ • గరములు మోడిచి,
భరతుఁడేమని రామ • భద్రు మ్రొక్కి
ఆ పలుకు వింద మనుచుఁ • బ్రజలు వీనులు విచ్చి,
వినుచు నుండ రాముఁ • డనుజులైన
భరతలక్ష్మణులును • బౌరులతో సభ్య,యుక్తసవనవహ్ను • లొప్పఁ గనిరి.

జంభారి=ఇంద్రుఁడు, దేవతాచార్యునకు=బృహస్పతికి, శిష్టవినుతుఁడు= సాధువులచే స్తోత్రముచేయఁబడినవాఁడు అగు వసిష్ఠునకును. షష్ఠికిఁ బ్రథమా విశేషణము, ఆసీనుఁడు=కూర్చుండినవాఁడు, సభ్యయుక్త =సభ్యులతోఁగూడిన, సవన వహ్నులు=యజ్ఞమునందలి త్రేతాగ్నులు.

ఇచ్చటఁ దల్లులకు నమస్కరించిన తరువాత వసిష్ఠునికి నమస్కరించినట్లున్నది- దీనికిఁగారణ మాయన స్త్రీల కందఱకు వెనుక నుండుటయే- రాజస్త్రీల నందఱ ముందిడుకొని వెనుకఁ దాను వచ్చినట్లు ౨౩౩వ పద్యంబుననున్నది. ఆకారణముచే మూఁడువందల యేఁబది రాజభార్యలకు వెనుకనుండిన వాఁడగుటచే వారియేడ్పులయిన పిమ్మట వసిష్ఠుఁడు శ్రీరామునిఁ జేరవచ్చెను. గార్హపత్యము- దక్షిణాగ్ని- ఆహవనీయమని మూఁడగ్నులు.

తాత్పర్యము

ఈ ప్రకారము తల్లి కౌసల్య దుఃఖపడుచుండఁ నింద్రుఁడు బృహస్పతికి మ్రొక్కినట్లు శ్రీరాముఁడు వసిష్ఠునకు నమస్కరించి యాయనతోడఁ గూర్చుండెను. వారిరువురు గూర్చుండిన పిదప భరతుఁడు మంత్రులతోఁ బౌరులతోఁ జేతులు జోడించుకొని కూర్చుండెను. ప్రజలందఱు భరతుఁడు శ్రీరామునితో నేమి మాటలాడునో యెట్లు మాట్లాడునో విందమని చెవులు విచ్చుకొని వినుచుండిరి. పౌరులతోడ శ్రీరామ భరత లక్ష్మణులు యజ్ఞశాలయందు సభ్యుల తోడి త్రేతాగ్నులవలెఁ బ్రకాశించిరి.

—♦ ౧౦౪-వ సర్గము. శ్రీరాముఁడు భరతునిరాకకుఁ గారణం బడుగుట. ♦—

కం. గురువత్సలుఁ డగుతమ్ముఁడు, భరతుఁడు తనుఁ జూడవచ్చు♦భావము సీతా
    వరుఁ డెఱిఁగి కౌఁగిలించును, సరసగతిని నడుగఁదొడఁగె♦సహలక్ష్మణుఁడై.

గురువత్సలుఁడు = పెద్దవారియందుఁ బ్రీతిగలవాఁడు, సరసగతిని = ప్రేమతోఁ గూడినవిధముగా, గురువత్సలుఁడనుటచే భరతుఁడు శ్రీరామునందు భక్తిగలిగి యాయనను నయోధ్యకుఁ బిలుచుకొనిపోవ వచ్చినాఁడేకాని లక్ష్మణుఁ డెంచినట్లు కలహమునకు వచ్చినవాఁడుకాఁడని యేర్పడుచున్నది. అతఁడు సాధుభావముతో వచ్చెను గనుకనే శ్రీరాముఁడు ప్రేమతోఁ గౌఁగిలించి యాదరించెను. సహలక్ష్మణుఁడై యనుటచే రామలక్ష్మణు లేకాభిప్రాయులైరని భావము. లక్ష్మణు సందేహము తీరెను.

తా త్ప ర్య ము

పెద్దవారియందుఁ బ్రేమగల భరతుఁడు తన్నయోధ్యకుఁ బిలుచుకొని పోయి రాజ్యాభిషిక్తును చేయవలయునను తలంపుతో వచ్చెనని భరతుఁడు జడలు ధరించిన కారణమున నింగితజ్ఞుఁడగు శ్రీరాముఁడెఱిఁగి కౌఁగిలించి ప్రేమ వాక్కులచే లక్ష్మణుతోఁగూడి యిట్లనియెను.

ఉ. ఏమిది నీవ మాకు వచి♦యింప వినన్ మన సయ్యె, నేల యీ
    భూమికి నీవు వచ్చితివి ♦ పూనితివేల జటాజినంబు? నీ
    వీమెయి నారచీరల వ♦హింపఁగ నేటికి? రాజ్య మిట్లు నీ
    వేమని వీడి తన్ననని♦ యెన్ భరతుం డిటు కేలిమోడ్పుతోన్.   ౯౧౭౮

జటాజినంబు=జడలు, జింకచర్మము. ఇది సమాహారద్వంద్వము కావున నేకవచనము.

తా త్ప ర్య ము.

ఇదియేమి భరతా! నీ విషయము నీవే చెప్పఁగా విన మనస్సగుచున్నది. రాజ్యభారము వహింపవలసిన వాఁడ వీయరణ్యభూమికి నీవేలవచ్చితివి. వేఁటకు వచ్చితివా? అట్లైన నీజడలేమి. ఈ కృష్ణాజినమేమి. ఈ నారచీరలుకట్టఁ గారణ మేమి ఏమని నీవు రాజ్యమును వదలి వచ్చితివి. అని యడుగఁగా భరతుఁడు చేతులు జోడించుకొని యిట్లులనెను.

సీ. అన్న! చేయఁగరాని♦యట్టికార్యముఁ జేసి,
                    మిముఁ బాసి వెనుక భూ♦మీధవుండు
    పుత్రశోకంబున♦గాత్రంబు దొఱఁగెను, నాఁడుది నాతల్లి♦ యాడినట్టి
    యామాటఁ బాటించి ♦ యాత్మయశోహర, మగుమహాపాపంబు♦నాచరించె
    రాజ్యఫలంబును♦బ్రాపింపమియ కాక, విధవయై యేడ్చుచు♦విపుల ఘోర

తే. నిరయమునఁ బడు నాతల్లి • నిష్ఠురాత్మ,
యట్టియపవాదనిహతుండ • నైన నన్ను
నీదుదాసుఁ బ్రసాదింప • నీకుఁ జెల్లు,
మఘవుపోలిక రాజ్యంబు • మరలఁ గొనుము. ౨౩౪౯

గాత్రంబు=దేహము, తొఱఁగెను=విడిచెను, ఆత్మయశోహరము=తనకీర్తిని నాశముచేయునది, విపుల ఘోరనిరయమునన్=అధికమైన భయంకరమైన నరకమందు, నిష్ఠురాత్మ=పరుషమైన మనస్సుగలది, అపవాదనిహతుండన్=నిందచేఁ జంపఁబడిన వాఁడను, ప్రసాదింపన్ = అనుగ్రహింపఁగ, మఘవుపోలికన్ = ఇంద్రునివలె.

తాత్పర్యము

అన్నా! చేయరాని చెడ్డపనిచేసి మిమ్ము వదలి రాజు పుత్రవియోగ శోకంబున దేహము వదలెను. ఇది తండ్రిచేసిన యకార్యమునకుఁ బ్రథమ ఫలము. గొప్ప విషయములు స్త్రీలతో నాలోచింపరాదనియు "జెడతలనుండుఁగా యువతి బృందములకెల్లను బుద్ధి" "స్త్రీబుద్ధి ప్రలయంకరీ" యన్న ధర్మసూక్తులు మఱచి యాఁడుది నాతల్లి చెప్పినమాటనుబట్టి తన యశస్సు నాశముచేసికొనెను. ఇది రెండవ ఫలము. ఇంత ఘోరకార్యముచేసిన నాతల్లికో ప్రథమఫలమామె కోరినట్లు రాజ్యము లభింపకపోవుట, రెండవ ఫలము విధవయై యేడ్చుచు ఘోరనరకమునఁ బడుట. ఇఁక నాగతియో యేపాప మెఱుఁగకపోయినను గైక కడుపునఁ బుట్టినకారణమున రాజ్యము నిమిత్తమై తల్లిమూలమున నన్ను నడవి పాలుచేసెనను నిందచేఁ జచ్చుట; తండ్రిచేసిన కార్యము తల్లిచేసిన కార్యము సవరింప నిపుడు సాధ్యపడదు. నేను నీదాసుఁడను. నాయందనుగ్రహించి నాకు నిష్కారణముగ వచ్చిన యపకీర్తి తొలఁగిపోవునట్లు లింద్రునివలె నీరాజ్యము నీవు గైకొమ్ము. ఇది నాకోరిక. ఈ నిమిత్తమై నేను వచ్చితిని. నేను నీదాసుఁడను స్వామివగు నీవు జటాజినధారివై నారలుగట్టుకు నడవియందుండ నేనెట్లు రాజచిహ్నములు ధరించి సింహాసనముపైఁ గూర్చుండి నగరవాసిని గాఁగలను? దాస్యము నాకార్యము. స్వామిత్వము నీకార్యము. నాకార్యము నేనుజేసెదను. నీకార్యము నీవు చేయుము.

భరతుఁడింత ఘోరవ్రతము పూనుటకు నపకీర్తి భయమే. లక్ష్మణునకు మాత్రమేకాదు. లోకమునకంతయు నీసందేహము గలదు. ఆయన కీర్తిఁ బోఁగొట్టుకొనుటకు భరతుఁ డింతశ్రమించెను. శ్రీరామచంద్రమూర్తియు నపకీర్తికి భయపడియే కదా సీతను విడనాడుట.

సంభావితస్యచాకీర్తి ర్మరణాదతిరిచ్యతే. భ-గీ. కీర్తిమంతుఁ డపకీర్తి సహించుటకంటె మరణించుట శ్రేయస్కరము.

కం. కలప్రకృతిజనములును విధవలు నగు మనతల్లు లెల్ల • వచ్చిరి వీరే
కులభూషణ! నినుఁ గన నిష్కలుషాత్మక! మమ్ముఁ గరుణ • గనుఁ గొనఁ గదవే.

తాత్పర్యము

ఈ ప్రార్థన చేయువాఁడను నేనొకఁడనే గాను. ఈ యుద్దేశముతోనే యీ మంత్రులు, అమాత్యులు, పౌరులు, సామంతులు విధవలయిన మనతల్లులు నందఱు నిన్నుఁజూడ నిదిగో వచ్చినారు. వారిముఖములు చూడుము. వారి యభిప్రాయములు దెలియును. కలుషచిత్తులమైన నేను నాతల్లి తండ్రి చేసిన కార్యమును గలుషములేని మనస్సుగల నీవు మాతప్పు క్షమించి మమ్ముఁ గరుణఁ జూడుము.

తే. పెద్దవాఁడుండ రాజయి•పిన్న తమ్ముఁ,
డలరుటలు మనవంశమ•ర్యాదయగునె?
భరణదక్షుఁడ వీవ యీ•ధరణి నెల్ల, రాజ వై సల్పుమా హిత•రంజనంబు.

తాత్పర్యము [౨౩౫౧

ఏమితప్పు చేసితివని నిన్ను నేను క్షమింతును, నీవుచేసిన తప్పేమో నాకుఁ దెలియలేదే యందువా.

నాతప్పు నాకుఁ దెలియకపోలేదు. పెద్దవాఁడుండఁగాఁ బిన్నవాఁడు రాజయి సుఖించుట మన వంశమర్యాద యగునా? పెద్దవాఁడుండఁగాఁ బిన్నవాఁడు రాజయిన దృష్టాంతములు లేవా యందువా? పెద్దవాఁడు దుష్టుఁడో-అంధుఁడో- పతితుఁడో- కుష్ఠరోగియో యయ్యెనేని యప్పుడు పిన్నవాఁడు రాజుగా వచ్చును. నీయందట్టిదోషములు లేవు. రాజ్యభరమును వహింప నన్నివిధముల సమర్థుఁడవు, కావున నీవే రాజవై హితులను సంతోషపెట్టుము.

కం. కైరవబాంధవుచేతను, శారదనిశవోలె నిన్ను • జనపతిగాఁ నీ
ధారిణి పొంది సనాథగ, సారసదళనేత్ర! వెలుఁగు•జనహర్ష దయై. ౨౩౫౨

కైరవబాంధవుచేతను=కలువలకాప్తుఁడగు చంద్రునిచే, శారదనిశ=శరత్కాల రాత్రి, సనాథగ=విధవగాక భర్తగలదై, సారసదళనేత్ర=తామరరేకుల వంటి కన్నులు గలవాఁడా,జనహర్షదయై=జనులకు సంతోషముగలిగించునదియై

తాత్పర్యము

శరత్కాలపునాఁటిరాత్రి కువలయ బాంధవుఁడగు చంద్రునిచే లోకులకు సంతోషకరమైనట్టు లీభూమి నిన్ను భర్తగాఁగలదై విధవగాక లోకులకు సంతోషము గలిగించునది యగును.

కం. నీసోదరుఁడన్ శిష్యుఁడ, దాసుఁడ సచివాళితో య•థా యోగ్యగతిన్
నే సాష్టాంగనమస్కృతి,తో సాధునతంస! వేఁడు•దున్ దయఁ గనుమీ.

నీసోదరుఁడన్=నీతమ్ముఁడను- నీవు నాకన్నవు- పితృసమా జ్యేష్ఠా యన్నట్లు నీవు తండ్రివంటివాఁడవు- తన బిడ్డలకు నెప్పుడెప్పు డేమేమి కావలయునో వారడుగకున్నను దానే తెలిసికొని వారివారికిఁ గావలసినవి యిచ్చుట తండ్రికివిధి కావున నేనడుగకున్నను నాకోరిక నీవే తెలిసికొని నెఱవేర్పవలసి

యుండుట నీకు విధియైయున్నను నవసరమునుబట్టి నేనే వేఁడుచున్నాను. తమ్ముఁడ ననుచున్నావే దాయభాగము పంచుకొనవచ్చితివా, రాజ్యమంతయు నీకే యిచ్చివచ్చితినిగదా యిఁక భాగపరిష్కార మేమున్నది యందువేమో? నే నాయభిప్రాయముతో రాలేదు. శిష్యఁడస్=శిష్యుఁడను గాన గురువు దర్శనము శిష్యుఁడు చేసికొనవలసినది విధి కావున వచ్చితిని. నీవు నాకెట్లు శిష్యుఁడవందువా? నీ వన్నవగుట నీ జన్మముచేతనే నీవు నాకు గురువు. అదియునుగాక నాకప్పుడప్పుడు మంత్రోపదేశముచేసి తప్పొప్పులు చెప్పినవాఁడవు కావున గురువవు. మంత్రోపదేశము చేసినవాఁడు తండ్రియేకదా. నీకు నేను శిష్యుఁడను గాన నాయందేదేని దోషముండిన నన్ను దండించియైనఁ జక్కదిద్దవలసినది నీకు విధి. వాస్తవమున నేను నీ కేయపరాధము చేసినవాఁడఁగాను. కావున నీరాజ్యము నీవు గైకొమ్ము. తండ్రి నీకిచ్చిన రాజ్యము నాకేలయందువా? శిష్యునిసొత్తు స్వార్జితమైనను బిత్రార్జితమైనను గురువుదే అర్థము ప్రాణము గురువుదే. తండ్రి నీకిచ్చినది నాకేల యందువా శాస్త్రవిరుద్ధముగా వర్తించి న్యాయ్యముగా నీసొత్తగుదాని నాకిచ్చు నధికారము తండ్రికిలేదు. అధికార విచారముతోఁ బనిలేదు. ఇచ్చినాఁడందువా? ఇచ్చుకోలు పుచ్చుకోలు రెండున్ననే దానము పూర్ణమగును. ఇచ్చుటయందు దాతకున్న స్వాతంత్ర్యము పుచ్చుకొనుటయందుఁ బ్రతిగృహీతకుఁ గలదుగదా. పుచ్చుకొనకున్నఁ దండ్రి కోరిక నెఱవేర్చనవాఁడవుకావంటివా? పుచ్చుకొంటిననుకో దాని వినియోగమందు నేను స్వతంత్రుఁడనేకదా నాయిష్టము వచ్చినట్లు వినియోగించెదను. ఆ విషయమునఁ దండ్రి నిర్బంధము లేదుకదా. నేను శిష్యుఁడను గాన శిష్యునియర్థము ప్రాణము గురువుది గాన నీకిచ్చెదను. నేను క్షత్రియుఁడను ఒకరిచ్చుబిచ్చము నాకేలయందువా? నేను నీకు బిచ్చముపెట్టరాలేదు. శిష్యవిత్తము గురువుది కావున నీది నీవు గ్రహింపవచ్చునుగదా అందుఁ బ్రతిగ్రహదోషము లేదు.

శిష్యమాత్రుఁడనేకాను నేను నీదాసుఁడను. నీవు స్వామిని దాసునిసొత్తు స్వామిదే, దాసునకు సొమ్మేలేదు. కావునఁ దండ్రి నాకిచ్చినదైనను నేనే నీసొత్తైనపుడు నాసొత్తు నీసొత్తేయని వేఱుగఁ జెప్పవలయునా? ఇది నేను నీకు రహస్యముగాఁజెప్ప నేకాకిగా రాలేదు. రాజకర్తలగు మంత్రుల సమూహములతో సేనలతో నీపై యుద్ధమునకు వచ్చినట్లు వచ్చినాను. వీరికైన నాయుధములులేవే, రిక్తహస్తములతో నెట్లు యుద్ధముచేసి నన్ను జయించెదవందువా? నాయందఱయొద్ద నమోఘాస్త్రములు అంజలిముద్రలున్నవి. వానిని నీవు నిరాకరింపలేవు. నిరాదరింపలేవు. వానికి నీవు లోపడక తప్పించుకొనలేవు. ఇదిగో ప్రయోగించెదను. నీపాదములఁబడి సాష్టాంగ నమస్కారము చేయుచున్నాను. నన్ననుగ్రహింపుము. నన్ననుగ్రహింపకపోయితివా? "నామనసు భ్రాతపయిం జనుచున్నదమ్మహా! భావుఁడు చిత్రకూటమునఁ బాదములంబడెఁ జేతులొగ్గెనెం! తోవడి

వేఁడె నస్మరలఁ దోడ్కొనిపోవ నిరాకరించితిన్॥ అని పశ్చాత్తాప పడఁగలవు. బుద్ధిమంతుఁడు వెనుకఁ బశ్చాత్తాపము కలిగించుకార్యము ముందు చేయరాదు.

సాధువతంస=సాధువులందు శ్రేష్ఠుఁడా- దీనుల ననుగ్రహించువాఁడుగదా సాధువు. వీఁడు నాజ్ఞాతి = నాకు ద్రోహముచేసినవాఁడని నన్ను నాప్రార్థనను నిరాకరించిన నిరాకరింపవచ్చునుగాని యేదోషము వీరిపట్ల నీవుచెప్పలేవుగదా. ఇందఱు వేఁడుకొనుచుండ సాధువగు నీవెట్లు వీరిననుగ్రహింపక యుండఁగలవు. వీరిదుఃఖము నీవెట్లు చూచి సహింపఁగలవు. ప్రజలకు సమ్మతుఁడైనవాఁడు రాజుగానుండ నర్హుఁడు. అట్టివాఁడవు నీవని ప్రత్యక్షముగా దృఢపడుచున్నది. నేను వీరికి సమ్మతుఁడనైనచో వీరేల నిన్ను వేఁడ నింతదూరము వత్తురు? కరుణా కాకుత్స్థుఁడను నీబిరుదు వ్యర్థపదమా? వేఁడుదున్=యాచించుచున్నాను గాని యాజ్ఞాపింపలేదు. సోదరుఁడు శిష్యుఁడు దాసుఁడునగు నేనెదుట నిలఁ బడఁగానే నాకోరిక నెఱవేర్పవలసిన గురువవు నీవు. నేను నమస్కరించి యాచించినను నిరాకరించుట తగదు. ఇన్ని బలిష్ఠ కారణములుండుటచే నన్ననుగ్రహింపుము.

తా త్ప ర్య ము

అన్నా! నేను నీకుఁ దమ్ముఁడను శిష్యుఁడను దాసుఁడను. అందఱు మంత్రులతో యోగ్యమగురీతిగా నీకు సాష్టాంగనమస్కారము చేయుచున్నాను. నాయందు దయదలఁపుము.

కం. పూజితమై శాశ్వతమై, రాజిలి పిత్ర్యంబునైన • ప్రజప్రార్థనమున్
భూజనవత్సల! మీఱన్, యోజనసేయంగ నీకు•యోగ్యం బగునే. ౫౩౫౪

పూజితమై=ఇప్పుడు నిన్ను వేఁడవచ్చిన ప్రజ వీథులవెంటఁ బనిపాటలేక తిరుగు సోమరిమూఁకగాదు, నీవును గౌరవింపఁదగినది. ఏలనెదవా- శాశ్వతమై= స్థిరముగ వంశపరంపరగా మన నగరమందే వసించియుండునట్టిది, పిత్ర్యము= వీరందఱు మనతండ్రికిఁ గావలసినవారై- తండ్రివంటివారు. ఇట్టి నీకడకు నీవచ్చియున్న ప్రజల, భూజనవత్సల=భూప్రజలయందుఁ బ్రేమగలవాఁడా- వీరందఱు నీకుఁ దమయందెంతో ప్రేమగలదని నీవు తండ్రివంటివాఁడవని తమమేలే కోరువాఁడవని నమ్మియున్నారు వారియందు నీకుఁగల ప్రేమ కనఁ బఱుచు సమయమిదే, ఇట్టి నీవు ఇట్టి వీరికోరిక నతిక్రమించుట దగినకార్యమా?

తా త్ప ర్య ము

వీరందఱు నీవు పురంబుననున్నప్పుడు రాజగౌరవభీతి దూరదూరమున నున్నవారు. ఇప్పుడు బిడ్డలవలె సమీపమునకు వచ్చినవారు. వీరందఱు రాజ పూజ్యులు. వీరు వంశపరంపరగా మన నగరమందేయుండి మనమేలే తమ మేలుగను మన కష్టము తమ కష్టముగ నెంచియుండువారు. వీరందఱు మన తండ్రికి ముఖ్యులుగాపునఁ దండ్రివంటివారు. నీవు తమయందు నిజమైన ప్రీతి

గలవాఁడవని నమ్మియుండువారు. ఇట్టి నీవు ఇట్టివీరి ప్రార్థన- ఆజ్ఞగాదు- నతిక్రమింపఁదగదు. సవతికొడుకను నెపమున నా ప్రార్థన నిరాకరించినను వీరి ప్రార్థన నెట్లు నిరాకరింపఁగలవు?

—• శ్రీరాముఁడు భరతునితో నీవు నిర్దోషివని చెప్పుట. •—

చం. అని కనులందు శోకజల • మల్ల దొనంకఁగఁ బాదపీఠిపైఁ
దనశిరమున్ ఘటించి పడి• తద్దయు నూర్చుచు నున్న తమ్మునిన్
గనుఁగొని లేవ నెత్తి తన • కౌఁగిటఁ గ్రుచ్చి వచించెఁ దమ్ముఁడా!
చనునె భవాదృశుం డిటులు • సల్పఁగ? నేమనువారు పామరుల్? ॥ ౧౫ ॥

భవాదృశుండు=నీవంటివాఁడు, పామరుల్=అజ్ఞులు, ఇందు భరతుని శరణాగతి విధము చెప్పఁబడెను. తాత్పర్యము.

ఈప్రకారము భరతుఁడు కన్నులందు శోక బాష్పములు కదలుచుండఁగాఁ బాదపీఠముమీఁదఁబడి మిక్కిలి, యూర్పులు పుచ్చుచున్న తమ్ముని లేవనెత్తి కౌఁగిటఁజేర్చి శ్రీరాముఁడిట్లనియె తమ్ముఁడా! నీవంటివాఁ డీప్రకారము సేయఁదగునా? నీవే యిట్లుచేసిన జ్ఞానములేనివా రేమందురు.

కం. కులజుండవు సాత్త్వికుఁడవు, నలఘువ్రతరతుఁడవును మ•హాతేజుఁడ వీ
విలకై యింతటిపాపముఁ, దలపెట్టఁగ నైన నీకుఁ•దర మెట్టులగున్?

భవాదృశుఁడను దానికి వివరణమిందుఁ జెప్పఁబడుచున్నది. కులజుండవు=గొప్ప కులమునఁ బుట్టినవాఁడవు, కులము కొలఁది బుద్ధి గావున నీవు గొప్ప బుద్ధిమంతుఁడవు, కావుననే సాత్త్వికుఁడవు- సత్త్వగుణము విశేషించి కలవాఁడవు కావుననే రాజసులు తామసులు చేసినట్లు కామక్రోధలోభములకు వశపడి కార్యములు చేయఁజాలనివాఁడవు. సహజముగ వచ్చిన యీరెండు గుణములేగాక అలఘువ్రతరతుఁడవు=గొప్పవ్రతములందుఁ బరధనమును బరస్త్రీలను నాశింపరాదు. పరుల హింసింపరాదు. పిత్రాజ్ఞ గుర్వాజ్ఞ మీఱరాదు. ఇటువంటివి సమయోచితముగఁగాక వ్రతములుగ ధరించినవాఁడవు. మహాతేజుఁడవు = ఇట్టి వానిని సాధించుటకును వలయునేని పరాక్రమముననే దేనినైన సాధింపఁగల తేజస్సంపన్నుఁడవు- ఇట్టి నీవు, ఇలకై =ఈమంటికై, ఇంతటిపాపము = లోభకారణమున నన్ను నూరువెడలఁ గొట్టునట్టి తండ్రిని జంపునట్టి పాపములను, తలపెట్టఁగనైనన్=ఆలోచించుటకైన నీకు, తరమెట్టులగున్=ఎట్లు సాధ్యపడును, సాత్త్వికులయందుఁ బరాపకార బుద్ధులు పుట్టనేపుట్టవు, ఆగంతుకముగ వచ్చెనా నిలువను నిలువవు. అపకీర్తి వచ్చెననుమాటకుఁ బ్రత్యుత్తర మిచ్చుచున్నాఁడు.

తాత్పర్యము

సహజములైన గొప్పకులమునఁ బుట్టుట, సత్త్వగుణము కలిగియుండుట యనువానిని గలిగి స్వపౌరుషసాధ్యములైన మహావ్రతనిష్ఠ తేజస్సుగల నీవు భూమి నిమిత్తమైన యన్నవిషయమున నింతపాపముచేయ నాలోచింపఁగనైన

సాధ్యమా? నీవు కావలయునన్నను బాపముచేయఁజాలవు, సత్త్వగుణ మతిశయించినచోట తమోరజోగుణములకు నిలువనీడలేదు.

ఉ. కావునఁ గొంచెమైన నప♦కారము నీయెడ లే దెఱుంగుదున్
నీవును బాల్యహేతువున♦ నీజననిం దగ దిట్లు దిట్ట, న
న్నా! విపరీతమా సుమతు♦లైనను దా రెద మెచ్చుదారపు
త్రావళిపట్ల స్వేచ్ఛమెయి♦నాదర ముంచుట కైకనందనా? —౩౧౭

నేను నీకపకారము చేసితినని తల్లిమూలమున నాకు వచ్చిన నిందను దొలఁగింపుమనిన మాటకుఁ బ్రత్యుత్తరము శ్రీరాముఁడు చెప్పుచున్నాఁడు.

దారపుత్రాదులపట్ల=భార్యాపుత్రుల విషయమున, స్వేచ్ఛమెయిన్=తమ యిష్టమువచ్చినట్లు ప్రేమాతిశయమున శాస్త్రముల్లంఘించి యైనను, కైక నందనా=నేను గైక కొడుకను దోషముతప్ప నాయందు మఱేమి దోషములేదంటివి. కైకనందనుఁడవగుట దోషముగాదని నాయభిప్రాయము.

కైక దుష్టురాలు. ఆమెదోషము నాకు సంక్రమించెనందువా. కట్టెలగుణము దానియందలి యగ్నిహోత్రమునకు సంక్రమించెనా? జలములందలి దోషము వానియందుఁ బ్రతిఫలించిన సూర్యచంద్రులకుఁ గలిగెనా? గులకరాతిలోఁగదా రత్నము పుట్టును? నీయందుఁదల్లి దోషము సంక్రమించెనని నీగుణమెఱింగిన వారు నమ్మరు.

తా త్ప ర్య ము.

కైకనందనా! మీఁదఁజెప్పిన కారణములచే నీయం దేయపరాధము లేదని యిట్లు చేయ నీకు సాధ్యపడదని నే నెఱుఁగుదును. కావున నేను నీ విషయమున నపరాధమెంచితినని తలఁపపలదు. నీవు పిల్లతనముచేతఁ దల్లిని దిట్టుచున్నావు. ఆమె నీమేలెంచి చేసెనా నీకీడెంచిచేసెనా నీమీఁద ప్రేమచేఁగదా యిట్లుచేసెను, ప్రేమతోఁ గార్యముచేసినవారిని దూషింపవచ్చునా? తల్లియగునది చేయరాని పని యేమిచేసెను. లోకములోఁ బెండ్లాము బిడ్డల సుఖము నిమిత్తమై ప్రేమాతిశయముచే నిష్టమువచ్చినట్లు కార్యములు చేయువారులేరా. ఇష్టప్రాప్తి- అనిష్ట నివారణము ఇవి రెండు ప్రతిజంతువు కోరునవేకదా. ఇష్టప్రాప్తికై కొడుకవైన నీకు రాజ్యము లభింపఁగోరెను. అనిష్ట పరిహారమునకై నన్నడవులకుఁ బొమ్మనెను. అంతియకాని నాయందుఁ బగగలిగికాదు. అట్లు నామీఁద ద్వేషభావముండిన శ్రీరామునిఁ జంపవలసినదిగాఁ గోరియుండునుగదా. కావునఁ గార్యసాధనమునకై యెంతచేయవలయునో యంతమాత్రమే చేసెనుగాని యంతకుమించి క్రోధైకతానయై యేమియుఁ జేయలేదు. కావున నామెను దూషించుట నీకుఁ దగదు.

కం. కొడుకులు భార్యలు శిష్యులుఁ, బుడమిని నేగతిఁ జరింపఁ♦బోలు నటంచున్
నొడువుదురో సాధువు లా,వడువున మనతండ్రిపట్ల♦వలదే మనకున్.

ఇఁకఁ దండ్రిని గుఱించి చెప్పుచున్నాఁడు. [—౩౧౮

తా త్ప ర్య ము

నీవు సాత్త్వికుఁడవు సాధువవుగదా లోకములోఁ బురుషులపట్ల వారి కొడుకును భార్యలు శిష్యులు చరింపవలయునని సాధువులు చెప్పుదురో యా ప్రకారము మన తండ్రి విషయమున మనము వర్తింపవలయునా పనిలేదా? వర్తించుట న్యాయ్యమేకదా.

కం. ధరణీభరణంబున నే,కరణిని నర్హుండొ నిలుపఁ • గాసల నను నా
కరణిం గృష్ణాజినములు, ధరియించి చరింపు మనఁగ • దండ్రి తగండే?

తా త్ప ర్య ము.   [౨౩౫౯

తండ్రికిఁ గొడుకులపట్లఁ బెట్టను గొట్టను నధికారము కలదాలేదా. పెట్టుట కధికారముగల తండ్రి కొట్టుట కధికారిగాఁడా. కడియనిన నోరుదెఱచి కష్టమనిన నోరు మూయునదా గుఱ్ఱము. తండ్రి చెప్పినది తనకిష్టమైనదిచేసి కష్టమైనది విడుచువాఁడా కొడుకు. కావున రాజ్యభారము వహించి సుఖింపుమని తండ్రి చెప్పినమాట నంగీకరించి కృష్ణాజినములు ధరించి యడవికిఁ బొమ్మనిన నేను బోనంటినేని నేనేమి కొడుకను. ఆయనయేమి తండ్రి నన్నామాత్రము కార్యముఁ జేయ నాజ్ఞాపింపఁ దండ్రి కధికారములేదా? జీవతో వాక్యకరణాత్ అన్నట్లు తండ్రి చెప్పినమాట వినువాఁడు పుత్రుఁడుగాని యితరుఁడు పుత్రుఁడా?

తే. ధర్మమార్గవిదుం డైన • తండ్రియందు,
మనము జను లెన్న గౌరవం • బునిచినట్లు
ధర్మభృచ్ఛ్రేష్ఠ! మనకును • దల్లియందు,
గౌరవం బుంప మర్యాద • గాదెచెపుము? ౨౩౬౦

ధర్మమార్గవిదుఁడు = ధర్మవిధము తెలిసినవాఁడు, ఎన్నన్=పొగడునట్లు, ధర్మభృత్+శ్రేష్ఠ=ధర్మమును ధరించువారిలో శ్రేష్ఠుఁడా.

తా త్ప ర్య ము

ధర్మమార్గమును దెలిసిన తండ్రియందు జనులు శ్లాఘించునట్లు మనమెట్టి గౌరవముంతుమో తండ్రికంటెఁ బదియంతలు గొప్పదగు తల్లియందు మనము గౌరవముంచుట తగదా? నీవే చెప్పుము.

ఆ. ధర్మశీలు రైన • తల్లియుఁ దండ్రియు, రామ! పొమ్ము నీ వ • రణ్యమునకు
ననుచు నాజ్ఞ సేయ • నాయాజ్ఞ మీఱంగ, నాకు నర్హమగునె • న్యాయ్యచరిత?

తా త్ప ర్య ము.   [౨౩౬౧

యుక్తమైన నడవడిగలవాఁడా! తల్లియుఁ దండ్రియు నిరువురు మనకుఁ బూజ్యులైనపుడు వారిరువురేక వాక్యముగ రామా! నీవరణ్యమునకుఁ బొమ్మని యాజ్ఞాపింపఁగా నేను దిరస్కరించుట న్యాయ్యమా?

తే. నీవు రాజ్యమయోధ్యలో•నెమ్మిఁ దాల్చి,
భువనసత్కృతిఁబొందుము•పూజ్యచరిత!
దండకారణ్యవాటి నే•నుండువాఁడ, వల్కలాజినములు దాల్చి•యల్కు లేక. [-౨౩౬౨

తాత్పర్యము

రాజ్యభారము నేను మోయలేనంటివి. అట్లైన నీకొక యుపాయము చెప్పెదను. దానివలన నీకు భారము తగ్గును. తండ్రి వాక్యమును మన మిరువురమును బరిపాలించినవారమగుదుము. నీవు రాజ్యమును జనపదములను నగరములను నయోధ్యలోనుండి విచారింపుము. అడవులలో నారచీరలు జింకచర్మము ధరించి యేభయములేక నేనుండి యందు ధర్మాధర్మములు విచారించుచుండెదను.

వాలితో శ్రీరామచంద్రమూర్తి చెప్పినదిదియే. చూ. కిష్కింధ-ప-౪౬౦.

కం. లోక మెఱుంగఁగ జనకుం, డీకరణి విభాగపఱిచి • యేగెన్ దివికిన్
నీ కిచ్చినభాగము నేఁ, జేకొన ధర్మంబె నీవ•చెప్పుము భరతా! ౨౩౬౩

తాత్పర్యము

నీవిభాగము నేను గల్పించినదికాదు. లోకమంతయుఁ దెలియునట్లీవిధముగ మనకు దాయభాగము పంచి తండ్రి స్వర్గమేగెను. చిన్నవాఁడవైన నీభాగమును బెద్దవాఁడనైన నేను దీసికొనుట ధర్మమా? భరతా! నీవే చెప్పుము.

కం. లోకగురుఁడు ధర్మాత్ముఁడు, నీకుఁ బ్రమాణంబ కాదె•నియతి జనకుఁడున్?
నీ కతఁ డిచ్చినభాగము నీ కుపభోగింప కుంట•నీతియు నగునే? ౨౩౬౪

తాత్పర్యము.

మన తండ్రి ప్రజలకందఱకు గురువు. ధర్మయుక్తమైన మనస్సుగలవాఁడు. నీవు చిన్నవాఁడవు కావున సుఖభాగము నీకిచ్చి పెద్దవాఁడను గష్టము సహింపఁగలనని యెఱిఁగి కష్టభాగము నాకిచ్చెను. నాకిచ్చిన భాగము నేను సంతోషముతో స్వీకరించితిని. నీకిచ్చినభాగము నీవట్లే గ్రహింపక యనుభవింపక యిట్లు పెనఁగులాడుట నీకుఁ దగునా? ఆయన వాక్యము లోకమున కంతయుఁ బ్రమాణమైనప్పుడు నీకు మాత్రముకాదా.

కం. జనక ప్రదభాగం బీ,వనవాసము నాకు దీనిఁ • బదునాల్గేఁడుల్
వనిఁ దీర్చుటె గురుహిత మని, మనమునఁ దలపోయువాఁడ•మానితచరితా! [-౨౩౬౫

తాత్పర్యము

నీభాగము నీ యిష్టము. నాకుఁ దండ్రియిచ్చినది వనవాస భాగము. దానిని బదునాలుగు సంవత్సరము లడవియందుండియే ముగింపవలయును. ఇదియే యాయనకు నాకు గొప్ప హితకార్యమని నాయభిప్రాయము.

కం. నరలోక సత్కృతుఁడు సుర,వరసన్నిభుఁ డైనతండ్రి•పలికిన యదియే
పరమాత్మహితము లోకే,శ్వరభావం బైన నాకు•సంతస మిడునే? ౨౩౬౬

నరలోకసత్కృతుఁడు = భూజనసమూహముచే గౌరవింపఁబడినవాఁడు, సురవరసన్నిభుఁడు=ఇంద్రునితో సమానుఁడు, పరమ + ఆత్మహితము=నాకు మిక్కిలి హితమైనది, లోకేశ్వరభావము = సమస్తలోకములకుఁ బ్రభువగుట, సంతసము=సంతోషము, ఇడునే=కలిగించునా.

తాత్పర్యము

ఈలోకమున నందఱి జనులచేఁ బూజింపఁబడినవాఁడు పరలోకమున నింద్రునితోసముఁడై దేవతలచే గౌరవింపఁబడువాఁడు- ఇట్లుభయలోక పూజ్యుఁడైన తండ్రి యేమిచెప్పెనో యదియే నాకు మిగుల శ్రేయస్కరము. దానిని విడిచి సర్వప్రపంచ ప్రభుత్వము లభించినను నాకు సంతోషము గలిగింపలేదు.

—• { ౧౦౫-వ సర్గము. భరతుండు శ్రీరాముని రాజ్యంబు గ్రహింపఁ బ్రార్థించుట. } •—

కం. అనాఁటిరాత్రి యీగతి, మానవసింహులకు శోక•మయ మయియె చనెన్
భానుం డుదయించిన నది,లో నిష్ఠను జపతపంబు•లుం దీర్చి వెసన్.

అనాఁటిరాత్రి=భారద్వాజాశ్రమము విడిచి రామాశ్రమముఁ జేరిననాఁటి రాత్రి, శోకమయమయియె=ఏడ్పుతోనే.

తాత్పర్యము

శ్రీరామభరతులు కలిసికొనిననాఁటి రాత్రి యీవిధముగ నాపురుషశ్రేష్ఠులకు నేడ్పులార్పులతోనే గడచెను. ఉదయముకాఁగా వారు మందాకినీ నదిలో స్నానముచేసి త్వరగా సంధ్యాది కృత్యంబులు దీర్చికొనిరి.

ఉ. రామునిఁ గొల్చి యుండిరి న•రప్రవరుల్ హితమంత్రియుక్తి, నా
స్తోమమునందుఁ గొంతవడి • చూపఱునం దొకరుండు నేసి యే
దేమియుఁ బల్కకుండె,మఱి • జ్యేష్ఠునిఁ గన్గొని కైకపట్టియుం
బ్రేమయు భక్తిగౌరవముఁ • బెంపుఁ గనంబడఁ బల్కె నీగతిన్. ౨౩౬౭

నరప్రవరుల్=మనుజశ్రేష్ఠులు- లక్ష్మణ భరత శత్రుఘ్నులు, హితమంత్రియుక్తిన్=హితులతోను మంత్రులతోను గూడినవారై, స్తోమమునందు=సమూహమునందు, కొంతవడి=కొంతవఱకు, చూపఱునందు=చూచువారియందు.

తాత్పర్యము

భరతాదులు హితులతోను మంత్రులతోను శ్రీరాముని సేవించి ప్రక్కనే యుండిరి. ఆ జనసమూహమందుఁ గొంతకాలమువఱకుఁ జూచువారిలో నొకఁడైన నేమియుఁ బలుకకయుండెను. అవలఁ గొంతసేపటికి నన్నఁజూచి భరతుఁడు ప్రేమయు- భక్తి- గౌరవము- పెంపు గానవచ్చునట్టు లీవిధముగఁ బలికెను.

ఉ. చెప్పితి బుద్ధిఁ దల్లికిని • జెన్నఁటిరీతిని నాకు దత్తమై
విప్పగుభాగ్యయుక్తపృథి•వీస్థలి మీకు నొసంగువాఁడనై
యిప్పనిఁ బూని వచ్చితి న•హీనగుణాఢ్య! యకంటకంబు నొ
నిప్పుడమిన్ గ్రహించి యవ•నీశ్వర! నన్నుఁ గృతార్థుఁజేయవే. ౨౩౬౯

చెన్నఁటిరీతిని=కుత్సితవిధమున, దత్తమై =ఈయఁబడినదై, విప్పగు = విశాలమైన, భాగ్యయుక్త=ఐశ్వర్యముతోఁగూడిన, పృథివీస్థలి=భూప్రదేశము, అహీనగుణాఢ్య=గొప్ప గుణములు సంపదగాఁగలవాఁడా.

తా త్ప ర్య ము

తల్లిసంప్రులిరువురు కోరినప్రకారము నీ వడవులకు వచ్చితినంటివి. వచ్చిన తండ్రియనుమతి మరల నేనిప్పుడు తేలేను. ఆయన సమ్మతి నాతల్లి బలాత్కారముచే నైనదికాని స్వబుద్ధిపూర్వకమైనది కాదు, బలాత్కారమున నిచ్చిన సమ్మతి సమ్మతికాదని మనువు చెప్పలేదా, కావునను వాస్తవమునను దండ్రి సమ్మతించినవాఁడు కాఁడని నీకే తెలియును. ఈ యనర్థకారిణి నాతల్లి. ఇదిగో జీవించి యిచ్చటికి వచ్చియున్నది. ఆమెచేసినది సరిగాదని నేనామెకు బుద్ధి చెప్పితిని. ఆమెయు నీవు మరల నయోధ్యకువచ్చుట కంగీకరించినది, రాజ్యము నాకు దత్తమంటివి. అది మోసవిధముగ నన్యాయ్యమార్గమున నాకు లభించినది. అట్టిది నాకేల? ఏవిధముగనో యొకవిధముగ నీకు దత్తమైనదందువా? విస్తారమగు నైశ్వర్యముతోఁగూడిన యీభూమియంతయు నీకునీయఁ బనిపూని వచ్చితిని. కావున నుదారాది గొప్ప గుణములుగల నీవు నాయందు దయయుంచి నిష్కంటక రాజ్యమంతయు గ్రహింపుము అట్లైన నేను గృతార్థుఁడనగుదును.

నేను క్షత్రియుఁడను ప్రతిగ్రహము నాకుఁ గులధర్మము కాదందువా? నేను నీకు దానమీయరాలేదు. నాసొత్తు నీవుతీసికొమ్మని చెప్పరాలేదు, తండ్రి నీకు రాజ్యమిచ్చెను, నీభాగము నీవేలుమని నీవనుటచే నాదైనను నీవు శిష్యుని దాసుని సొత్తు గురువువలె స్వామివలెఁ దీసికొమ్మంటిని, వాస్తవమున రాజ్యము నాదికాదు. రాజ్యము నేను నీవారమే. నీది నీవు తీసికొమ్మనుచున్నానుగాని నాది నీవు తీసికొమ్మనలేదు. కావునఁ గులధర్మ హానిలేదు.

ఆ. వానకాలమునఁ బ్ర•వాహవేగంబునఁ, గట్టఁ దెంచుకొనుచు•నట్టి వచ్చు
వెల్లినాఁ(పరాని•విధమున నీరాజ్య, మీవు దక్క నితరుఁ•డేల లేఁడు.

వెల్లి=ప్రవాహము. [౨౩౭౦

తా త్ప ర్య ము

వానకాలమందుఁ గట్ట త్రెంచికొనివచ్చు ప్రవాహమువలెఁ బ్రజలు నేనన్యాయముగ రాజనైతినని కోపాతిశయముచే నేను రాజను దాము ప్రజలను మర్యాదవిడిచి వర్తింప సిద్ధముగనున్నారు. వారట్లుచేయుట న్యాయ్యమే. ఇట్టి

సంకటసమయమున నీవుతప్ప వారిని శాంతిపఱిచి మర్యాదాసేతువును రక్షింపఁ జాలిన సమర్థుఁడు వఱియొకఁడు లేఁడు.

కం. తురగమునడకను ఖరమును, గరుడునిగ మసంబుభంగిఁ♦గాకము పోలన్
దర మగునే? యట్టులు నీ,వరమార్గము నెసయ నాకు♦వశమే దేవా?

తాత్పర్యము [౨౩౭౧

నీవు రాజపుత్రుఁడవై క్షత్రియుఁడవై యుండి ప్రజలు మర్యాదదప్పి వర్తించిరేని నీపరువు నీవు కాపాడుకొనలేవా యందువేమో? గుఱ్ఱమువలె గాడిద నడచుటకును గరుడునివలెఁ గాకి పోవుటకును సాధ్యమా ? అట్టులే ప్రజాపాలన మందు నీయుత్తమ మార్గ మవలంబింప నాకుసాధ్యమా?

కం. పరులను బోషించుచుఁ ద,ద్భరమున్ వహియించువాని♦బ్రదుకే సుఖమౌఁ,
బరునాశ్రయించి తనువుం, భరియించెడి వానిబ్రదుకు వ్యర్థముసుమ్మీ.

తాత్పర్యము [౨౩౭౨

అన్నా! నీవిచ్చట నొంటరిగానుండి యెవరి కేమిమేలుచేయఁగలవు ? సంపాదించినదానితోఁ బరులఁ బోషించుచు వారి యక్కఱ లవసరముల కాదుకొనువాని బ్రదుకు బ్రదుకుగాని పరులనాశ్రయించి జీవించుచుఁ దనదేహ రక్షా భరమును బరులపై వైచువాని దేమిబ్రదుకు? గృహస్థాశ్రమముతప్పఁ దక్కిన వన్నియుఁ బరాధీనపు బ్రదుకులే. గృహస్థుఁడుగా నుండ నసమర్థుఁడుకదా సన్న్యాసియో వనవాసియో కావలెను. ఇక్కడ నీయింటికి నేయతిథివచ్చును? ఏయభ్యాగతి వచ్చును? వచ్చిన నెంతమువత్తురు? వచ్చినవారి కేమిపెట్టఁగలవు? కావున గృహస్థధర్మ మవలంబించి ప్రజలఁ బాలింపుము.

సజీవతి సఏవైకో బంధుభిశ్చోప భుజ్యతే
జీవంతోపి మృతాస్త్వన్యే, పురుషాః స్వోదరం భరాః॥ దక్షుఁడు.

బంధువులతోడ నెవఁడు భుజించునో వాఁడు బ్రదికియుండువాఁడు, తన కడుపుమాత్రము నింపుకొనువాఁడు బ్రదికియుండినను జచ్చినవాఁడే.

చం. పురుషుఁడు విత్తనద్ది పెను♦భూరుహమై మఱుగుజ్జువానికిన్
వరగతి నెక్కరానిగతి ♦ వర్ధిలుచు న్నునుఁబూత పూచియున్
బరమఫలాన్వితంబు నయి ♦ వాలక యుండినఁ జెట్టుఁబెంచు న
ప్పురుషున కేమి సంతసము♦పుట్టఁగఁ జాలునొ యూహ సేయుమా. ౨౩౭౩

విత్తన్=గింజనాటఁగా, పెనుభూరుహము=పెద్దచెట్టు, మఱుగుజ్జువానికిన్= మిగులఁబొట్టివానికి, వాలక=ప్రకాశింపక.

తాత్పర్యము

నా కష్టసుఖవిచారము లటుండనిమ్ము. ఒకఁడు ఫలము భుజించుకోరిక గలిగి భూమిలో నొకవిత్తనము నాఁటెననుకొమ్ము. అది పొట్టివారి కందరానట్లు

పెరిఁగి మహావృక్షమై పూఁతయుఁ బూచినదనుకొమ్ము. ఇఁకఁ గాయలుకాచును. అవి పండును తిందమని యాచెట్టు పెట్టినవాఁడు కొండంతయాశతో నెదురు చూచుచుండ నది గొడ్డుపోయి ఫలమనునది లేనిదయ్యెనేని యాచెట్టుపెంచిన వాని కేమిసంతోషము కలుగునో నీవే యూహింపుము.

తే. రామ మాకెల్లరకు నీవ♦రక్షకుఁడవు, నీదుభృత్యుల మగుమమ్ము♦నీవ యేలఁ
బూనవేనియుఁబై యర్థ♦మునకు నుపమ,
యిదిమహాభుజ! తక్కిన♦దెఱుఁగుమీవ. ౨౩౪

అర్థమునకు=విషయమునకు, ఉపమ=సమానము- దృష్టాంతము.

తాత్పర్యము

రామచంద్రా! నీవు మాకందఱకు రక్షకుఁడవు మేము నీకు భృత్యులము ఇట్టి మమ్ము నీవు కాపాడకపోయినపక్షమున మీఁదఁజెప్పిన విషయమునకు నీవే దృష్టాంతమగుదువు. నిన్ను దశరథుఁడు కనిపెంచి పెద్దచేసినది నీవు ప్రజల రక్షించి తనకు గీర్తితెచ్చెదవనికదా, అట్టులే నీవు గొప్పవాఁడవైతివి. ఇతరులకు దురారాధ్యుఁడవైతివి. దశరథుఁడు చెట్టుపెట్టినవాఁడు నీవు మహావృక్షము. మావంటివారు మఱుగుజ్జువారు, నీవు పట్టాభిషేక మంగీకరించుట చెట్టుపూయుట; నీవు రాజ్యమేలకుండుట చెట్టుగొడ్డుపోవుట, ఫలహీనమగుట. అట్టి చెట్టునుజూచి చెట్టుపెట్టినవాఁడేమి సంతోషించును? ఈచెట్టు గొప్ప వృక్షమగుచున్నది, ఫలించును, తిందమని కాచికొచి యుండుచిలుకలు పక్షులు మనుష్యులు నేమిసంతోషింతురు? నీశక్తి నీసామర్థ్యము నీ సుగుణసంపత్తి జనులయందుఁ బ్రకాశింపవలెనా యడవిఁగాచిన వెన్నెలవలె నీచెట్లయందు మృగములందుఁ బ్రకాశింపవలెనా ?

తే. రాజ్యసింహాసనస్థు న♦రాతిదమను, నిన్నుఁ గాంచెడివారలు♦నెమ్మితోడ
రాష్ట్రమునవారు సచివులు♦రాజవర్య, నిండుతేజున వెలుఁగుమా♦ర్తండు నట్లు

అరాతిదమనున్=శత్రువుల నణఁచువానిని, నెమ్మితోడన్=సంతోషముతో, మార్తండునట్లు=సూర్యునివలె- మృతంబ్రహ్మాండం జీవయతీతి మార్తండః నశించిన బ్రహ్మాండమును బ్రదికించువాఁడు, రూ. మార్తాండుఁడు- మర్తండుఁడు, మర్తాండుఁడు- మార్తాండ శబ్దము శకంధ్వాదులలోఁ జేరినది- అథ మర్తండ మర్తాండౌ అని శబ్దార్ణవము.

తాత్పర్యము

రాజ్య సింహాసనమునుండి శత్రువుల నణఁచు నిన్ను రాష్ట్రమునందలి జనులు మంత్రులు లోనగువా రుదయాద్రి నధిరోహించి చీఁకట్లఁ బాఱఁదోలి లోకము రంజిలఁజేయు సూర్యునివలెనే నిన్నుఁజూచి సంతోషింతురు. ఇప్పుడు రాజులేని కారణమున దేశము శోకాంధకారమున మునిఁగియున్నది.

కం. నిను ననుసరించి వచ్చుచు, మనుజర్షభ! సింధురములు♦ముదమున గీఁకల్
నినుమను నంతఃపురగత, వనితలు మోదమునఁ బొంగి♦పడెదరు తృప్తిన్.

మనుజర్షభ=పురుష శ్రేష్ఠా, సింధురములు=ఏనుఁగులు, గీః = ఘీంకార శబ్దభవము, నినుమును=నిండించును.

తాత్పర్యము

నీవయోధ్యకుఁ బ్రయాణమైతివేని సంతోషించువారు నీరాజ్యపాలనా సామర్థ్యము శత్రుసంహారశక్తి తెలిసిన పురుషులు మాత్రమే కారు. ఎవఁడు రాజైనను దమకార్యములు కష్టములు తమకుఁ దప్పవుగదా యటుండియు నిప్పుడు కన్నీరుగార్చుచుఁ దలవ్రేలవైచికొని నడచు నేనుఁగులు నీవెంట సంతోషముతో ఘీంకారములు చేయుచు నడచును. అంతఃపురస్త్రీలు సంతోషముతోఁ బొంగిపడెదరు. దీనికిఁ గారణము పశువులకు స్త్రీలకు నీయందుఁగల నైసర్గిక ప్రేమయే (తల్లికి బిడ్డయందువలె స్వభావముగవచ్చిన ప్రేమ). అట్టి సహజ స్నేహభావముగలవారిని దుఃఖపఱుచుట నీకు న్యాయ్యమా.

కం. అనవుడు రాముని భరతుఁడు, వినయంబున వేఁడుచున్న • విధముం గని మే
లని శ్లాఘించెను నాగర, జనములు తద్వచనరచన • సంతసపడుచున్. ౨౩౬౭

శ్లాఘించెను=మెచ్చుకొనెను, నాగరజనములు = అయోధ్యానగరమందలి జనులు, తత్=ఆ భరతుని, వచనరచన=మాటల పొందికకు, సంతసపడుచున్= తృప్తిపడుచు.

తాత్పర్యము

ఈప్రకారము భరతుఁడు శ్రీరామునితో వినయముతోఁ బ్రార్థించుచున్న విధముఁజూచి పురజనులందఱు భరతుఁడు న్యాయ్యముగ యుక్తియుక్తముగ భక్తిశ్రద్ధలతోఁ జెప్పిన మాటల పొందికకుఁ జక్కఁగఁ జెప్పినాఁడని శ్లాఘించిరి.

కం. విని దీనాలాపంబులఁ, దను నార్తిని వేఁడుచున్న • తమ్మునిఁ గని యిం
పెనయంగ ననునయించుచు, వినియతచిత్తుండు రాముఁ • విభుఁ డిట్లనియెన్.

దీనాలాపంబులన్=శోకముతోఁగూడిన మాటలచే, ఆర్తిని=బాధపడుచు, అనునయించుచున్=సమాధానపఱుచును, వినియతచిత్తుండు=జితేంద్రియుఁడు, (నియమింపఁబడిన మనస్సుగలవాఁడు భరతునిది యార్తప్రపత్తి యని యేర్పడుచున్నది.)

తాత్పర్యము.

శోకవాక్యములతో బాధపడుచుఁ దన్నుఁ బ్రార్థించు తమ్ముని భరతునిఁ జూచి చలింపని చిత్తముగల శ్రీరామచంద్రుఁడు సమాధానవాక్యములు చెప్పి యూరార్చుచు నిట్లనియెను.

— • శ్రీరాముఁడు భరతునకు దుఃఖోపశాంతి వాక్యంబులు చెప్పుట. • —

కం. తమ్ముఁడ! నరునకు స్వాతం,
త్ర్యమ్మున్నదె యెన్నఁడైనఁ • దనయిచ్చను లో
కమ్మునఁ గ్రుమ్మర దైవమె,
యిమ్మెయి నమ్మెయిని లాగి • యలయించుఁ జుమీ. ౨౩౬౮

తాత్పర్యము

తమ్ముఁడ! నా వనవాసమునకుఁ గైకయీ దశరథులు కారణమని నీవు మాటలాడువిధము చూడఁగాఁ గార్యనిర్వహణమందుఁ బురుషుఁడే స్వతంత్ర కర్త యని నీవు తలఁచినట్లు తోఁచుచున్నది. ఆ యభిప్రాయము సరిగాదు. పురుషుఁడు తన యిష్టప్రకారము లోకమున సంచరించు స్వాతంత్ర్యముగల వాఁడా? కాఁడు. అట్టైన స్వతంత్రుఁడెవఁడు? ఎవనికిఁ బురుషుఁడు పరతంత్రుఁ డనెదవా? దైవము పురుషుని నీప్రక్కకు నాప్రక్కకు లాగి బాధించునుజుమీ.

ఈశ్వరస్సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని, యంత్రారూఢానిమాయయా

యను భ-గీ- శ్లోకార్థమిచ్చట ననుసంధించునది.

సమస్త భూతముల హృదయ ప్రదేశమందు నీశ్వరుఁడుండి సర్వ భూతములను దన సంకల్పశక్తిచేఁ దన కిష్టమువచ్చినట్లు యంత్రమునకు వేసి త్రిప్పినట్లు త్రిప్పుచుండును.

శ్లో. జానామి ధర్మం నచమే ప్రవృత్తిః జానామ్యధర్మం నచమే నివృత్తిః
త్వయాహృషీ కేశ హృదిస్థితేన యథా నియుక్తోస్మితథాకరోమి॥ ఉద్యోగ.

ఇది ధర్మమని తెలియును. జేయుటలేదు. ఇది యధర్మమని తెలియును. మానుటలేదు. ఇంద్రియములకు నియంతవైన భగవంతుఁడా నీవెట్లు నియోగించుచున్నావో యట్లుచేయుచున్నాను. నేను స్వతంత్రించి చేయునది యేదియు లేదు.

కం. ధనములు నిధనాంతంబులు, విను వృద్ధిమదర్థములును విలయాంతంబుల్
జననము మరణాంతంబగు, నొనరెడిసంయోగములు వియోగాంతంబుల్.

అతరాం

పురుషుఁడే స్వతంత్రుఁడేని యెప్పుడును బురుషుఁడు తన శ్రేయస్సు కోరువాఁడే గనుకఁ దన కేహాని రాకుండఁ జేసికొనవచ్చునుగదా. లోకమున నట్లుగానరాదు. ధనములు, నిధనాంతఁబులు = నాశమే యంతముగాఁగలవి, వృద్ధి మదర్థములు=వృద్ధిగలవి, పెరిఁగి పెరిఁగి, విలయాంతంబుల్=నాశమగు టయే యంతముగాఁ గలవి, పెరుఁగుట విఱుగుటకొఱకే, సంయోగములు = కూడికలు, వియోగాంతంబుల్ = వేఱుపాటే యంతముగాఁగలవి.

వస్తుస్వభావము మార్ప నెవ్వనికి సాధ్యముగాదు. కానఁ దండ్రి మర ణమునకై శోకింపకుము. ఇందు మొదటిరెండు పాదములందును నాలవపాద మందును దృష్టాంతములు చెప్పఁబడెను. మూఁడవపాదమునఁ బ్రకృతాంశము, దశరథు మరణము సూచించును.

తాత్పర్యము

సంపాదించిన ధనములెంత హెచ్చరికతోఁ గాపాడినను గామముపాలో దొంగలపాలో దొరలపాలో యయియో మఱి యేవిధముగనో నాశమగుచున్నవి. పెరిఁగినవన్నియు విఱుగుచున్నవి. బ్రహ్మాదులును దమ పదవులనుండి పడుచున్నవారే- పుట్టినవన్నియుఁ జచ్చుచున్నవి. కూడినవారందఱు వీడిపోవుచున్నారు. ధననష్టి- మరణము వియోగము విలయము నెవఁడైనఁగోరునా? యత్నించునా? ఏలయవి యట్లగుచున్నవి. వీనికన్నిటికిఁ బురుషప్రయత్నము చాలమి కారణము గాదు. దైవమే కారణము.

ఆ. పక్వఫలమునకును•బడిపోవుటయె తక్క, వేఱుభయము లేని•విధముగాఁగ
ధరణిఁ బుట్టినట్టి•నరునకుఁ జావు ద,క్కంగ నొండుభయము•గాన రాదు.

తన్నడవికంపినది దైవమేకాని తలిదండ్రులు నీవు కారణముగాదని మొదటఁ జెప్పెను. తండ్రి మరణము కాలకృతము గావున దానికై దుఃఖపడవలదని రెండవ పద్యమునఁ జెప్పెను. ఇఁక నారెండవ పద్యము నర్థమునే దృష్టాంతముతో వివరించుచున్నాఁడు.

పక్వఫలమునకున్=పండిన పండునకు.

తాత్పర్యము

పండినపండెల్లకాల మట్టులేయుండదు. నేలఁబడుట తప్ప దానికి వేఱుగతి లేదు. అట్టులే భూమియందుఁబుట్టిన మనుష్యుఁడెంత కాలము జీవించినను నేనాఁడో యొకనాఁడు చావవలసియేయుండును. దీనికిఁ గారణము పురుషకారము చాలమియేయందువా కాదు భగవదాత్మకమైన కాలము కారణము.

కం. బలితపుఁగంబంబులు గల,నిలయము కాలక్రమమున•నెఱిచెడురీతిన్
బొలుపు చెడం బురుషుఁడు ముదు,
సలితనమునఁ జావుచేత•సమయుం జుమ్మీ. ౨౩౮౨

బలితపు=బలముగల, కంబంబులు=స్తంభములు, నిలయము=ఇల్లు, నెఱి=అందము.

తాత్పర్యము

ఎంత బలిష్ఠమైన స్తంభములువేసి యిల్లుకట్టినను గాలాంతరమునఁ గ్రమక్రమమున నదియందముచెడి కూలిపోవును. అట్టులే యెంతటి పురుషుఁడైనను గాలక్రమమున ముసలివాఁడై మరణించును. దీనికిఁ బురుషకారము చాలమియే కారణమందువా.

కం. గడచినరే యంతటితోఁ, గడచనియెం గాని మరలఁ•గ్రమ్మఱునే యె
క్కడుజలములఁ గళవళపడు,
కడలిఁ గలిసి నిండుయమున•గ్రమ్మఱు నొక్కో. ౨౩౮౩

కడచిన=దాఁటిపోయిన, రే=రాత్రి, కడచనియెన్=తుదముట్టెను, కడలి=

సముద్రమును, క్రమ్మఱునొక్కొ = మరలివచ్చునా, రామాయణమున రెండు మూఁడుచోట్ల యమునకు సముద్రముతో సాక్షాత్సంగమము చెప్పఁబడెను. ఇప్పుడు యమున గంగలోఁ గలియుచున్నది. కాని ప్రత్యేకముగ స్వతంత్రించి సముద్రమునఁ గలియుటలేదు. ఇది వాల్మీకి తెలియకచెప్పెనని యేమూఢుఁ డనును? ఒకానొక కాలమున వింధ్యపర్వతమునకుఁ గొంచెము దక్షిణమునఁ దూర్పు సముద్రము పడమటి సముద్రముకలిసి కాలువగాఁ బాఱుచుండెననియు ఇప్పుడు బంగాళాఖాత మనునది హిమవత్పర్వతపాదంబు నంటియుండెననియు ననఁగా నిప్పటి బంగాళాదేశము (వంగదేశము) సముద్రములో మునిఁగి యుండెననియు భూతత్త్వవేత్తలు (Geologists) వ్రాసిన గ్రంథములవలనఁ దెలియవచ్చెడిని, హిమవత్పర్వతమే సముద్రములో మునిఁగియుండె ననుటకు దృష్టాంతములుండఁగా మీఁద వివరించినవి వింతలుగావు. వీనినిబట్టిచూడ రామాయణకాలమునకు యమున గంగలోఁ గలియక సముద్రములోనే కలియుచుండెనేమో లేక యట్టికాలము సూచింపఁబడెనేమో యని తోఁచుచున్నది. రామాయణ కాలమున సగము వంగదేశము సముద్రమయమై యుండెను. ఈ సందేహమును బాండురంగ మాహాత్మ్యమునందలి.

శా. గంగా సంగమ మిచ్చగించునె మదింగావేరి దేవేరిగా
నంగీకార మొనర్చునే యమునతో నానందముం బొందునే
రంగత్తుంగతరంగ హస్తముల నారత్నాకరేంద్రుండు నీ
యంగంబంటి సుఖించునేని గుణభద్రా తుంగభద్రానదీ.

యను పద్యము బలపఱచుచున్నది. ఇది సంస్కృత గ్రంథపరివర్తనము గావున మూలమునందట్లే యుండును అది నాకు లభ్యపడినదికాదు. ఈ యూహ వాస్తవమయ్యెనేని రామాయణ మెంతప్రాచీన గ్రంథమో తెలియనగు. అయోధ్య ౧౮౩-౨ ప- ఈయభిప్రాయమునకు విరుద్ధమైయున్నది. దీనికి సమాధానము కొందఱు గంగయే యమున యని చెప్పఁబడెనందురు.

తాత్పర్యము

కడచిపోయిన రాత్రి యంతటితోఁ బోవునేకాని మరలి యారాత్రియేరాదు. అట్టులే విశేషజలములుగల లవణార్ణవమందుఁ గలిసిన యమున మరల యమునగా వెనుకకుఁ దిరిగిరాదు. అవిధముగాఁ బోయినవాఁడట్టులే మరలిరాఁడు. ఇట్లనుటచేఁ గాలాంతరమున రూపాంతరమున రావచ్చునని భావము. సముద్రమందుఁ గలిసిన యమున యమునగా రాదు గాని యాజలము సూర్యరశ్ములచే నావిరియై మేఘమై వర్షమై మరలఁ బ్రవాహమునఁ గలియవచ్చునుగదా.

చం. పవలును రేయి పోవుచును ప్రాణులయాయువు నాహరించెడిన్
రవియు నిదాఘవేళ స్వకరంబుల వేఁడిమి నంబుజాలముం

దివియువిధాన, న ట్లగుట•నీకయి యేడ్వ మి టేల యొడ్ల కై
తవిలినచింత నేడ్చెదవు•తమ్ముఁడ! యాయువు శాశ్వతం బొకో. ౨౩౮౪

ఆహరించు=అపహరించు- మ్రింగు, నిదాఘవేళ=గ్రీష్మసమయమందు, స్వకరంబులన్ = తన కిరణములచే, అంబుజాలమున్ = నీళ్ళ సమూహమును, తివియు=లాగు- పీల్చు, ఒడ్లకున్=ఇతరులకు.

తాత్పర్యము

ఎండకాలమందు సూర్యుఁడు తన వేడికిరణములచే జలమును బీల్చునట్లు రేయి పగలు అనునవి పోవుచు జీవజంతువుల యాయువును దీసికొని పోవుచున్నవి. కాఁబట్టి యయ్యో నాయువిట్లు వ్యర్థముగాఁ బోవుచున్నదే యన నీకై యేడుపుము అంతియేగాని యితరులకేడ్చిన నీకురాఁగల లాభమేమి? తమ్ముఁడా! అయువు శాశ్వతమా ?

ఆయువు శాశ్వతముగాదు, పోయిన నిమిషము మరల రాదు. కావునఁ బోవునిమిషము వ్యర్థముగఁ బోకుండఁ జూచువాఁడు వివేకి.

సీ. వాసుదేవ శ్లోకవార్త లాలించుచుఁ గాలమే పురుషుండు కడపుచుండు
నతనియాయువుఁదక్క నన్యులయాయువు
నుదయాస్తమయముల నుగ్రకరుఁడు
వంచించికొనిపోవ వాఁ డదియెఱుఁగక జీవింతుఁ బెక్కేండ్లు సిద్ధమనుచు
సంగనా పుత్రగేహారామ విత్తాది సంసారహేతుక సంగసుఖము
గీ. దవిలి వర్తింపఁ గాలంబు తఱియెఱింగి,దండధర కింకరులువచ్చి తాడనములు
చేసికొనికొనిపోవఁ బుణ్యంబు సేయనైతిఁ,
బాపరతినైతినని బిట్టు పలవరించు. భాగ.

కం. పొడమిన మడియుట సిద్ధము, నడచినయే న్నిలిచియుండి•నన్ వడి క్షీణిం
చెడినీయాయువు; జన్మము, గడతేఱెడిమార్గ మేదొ•కనుఁగొను మనుజా.

అనుజా=తమ్ముఁడా, పొడమినన్=పుట్టినయెడల.

తాత్పర్యము

పుట్టినవాఁడు చచ్చుట నిజము, నీవు నడచుచుండిన నిలిచియుండిన మఱియెట్లుండిన నోటికడవలోని నీళ్ళవలె నాయువు క్షయించిపోవుచునే యుండును. కాఁబట్టి యేమిచేసిన నీసంసార సాగరము నావలియొడ్డు చేరుదువో యది యాలోచింపుము.

శ్లో. జాతస్య హి ధ్రువో మృత్యు, ర్ధ్రువం జన్మమృతస్యచ
తస్మాద పరిహార్యేర్థే, నత్వం శోచితు మర్హసి. భ-గీ. ౨-౨౭.

అను శ్లోకము ననుసంధించునది.

కం. పురుషునితోఁ బుట్టును మృతి, పురుషునితోఁ గూడియుండుఁ•బురుషునితోడన్
దిరుగుచు నుండును దవ్వుగఁ, బురుషునితో నేగు మరలు•బుద్ధిం గనుమీ.

మృతి=మృత్యువు, దవ్వుగన్=దూరముగ.

తాత్పర్యము

తమ్ముఁడా! మృత్యుదేవత యెక్కడనుండియో వచ్చునని తలంపకుము. పురుషునితోడనే పుట్టును. వాని నంటుకొనియే యుండును. వానితోడఁ దిరుగుచు వాఁడెచ్చటికిఁబోయిన నచ్చటికిఁబోవుచు నుండును.దూరముగఁ బరలోకమునకుఁ బోయిన నక్కడికిఁగూడవచ్చును. అక్కడనుండి మరలి యీలోకమునకు వచ్చిన వెంటనే వచ్చును. కావున నేక్షణమం దది మనలను వాతవేసికొనునోయని హెచ్చరిక గలిగి పోయినచోటను సుఖముగలుగు మార్గ మాలోచించిచేయుము.

కం. ముడుతలు పడ నొడ లెల్లను, దడఁబడఁ బాదములు వెండి•తల తెల్లపడన్
మిడికెడివేళను నీ వే,వడువున నినుఁ గాచికొనఁగ•వలఁతివొ చెవుమా. ౨౩౭౮

ఒడలు=శరీరము, మిడికెడు=దుఃఖపడెడు, వడువునన్=విధముగా, వలఁతివి=సమర్థుఁడవు.

తాత్పర్యము

నీకు దేహము దృఢముగా నారోగ్యవంతుఁడవుగా వయస్సునుండు సమయమందే నీకుఁ బరలోకచింత లేదయ్యెనేని దేహము ముడుతలుపడి నడచునపుడు కాళ్ళుతడఁబడి తల తెల్లపడి కష్టపడుచుండు సమయమందు నిన్ను నీవు రక్షించుకొనువిధమేదో తెలియఁజెప్పుము.ఏధర్మము సాధించుటకును దేహము ముఖ్యముగా నుండవలెఁగదా, అది నీస్వాధీనము తప్పినప్పుడు నీవేమిచేయగలవు చేయఁదలఁచుకొనినను నిహమునకుఁ గావలసినదే చేయుటకు శక్తియుండదుగదా ఇఁకఁ బరలోకమునకుఁ గావలసినది యపుడు ఏవేమిచేయఁ గలవు? నిన్ను నీవే రక్షించుకొనవేని పరులెవ్వరు నిన్ను రక్షింపఁగలరు. కావున బాల్యమునుండి పరలోకచింతన చేయుచుండవలెను. తనకాళ్ళలో బల ముండఁగా నడచుటమాని బలముడిగినతరువాతఁ దన్నుఁ దీసికొనిపొండని పరుల బతిమాలుట తెలివితక్కువతనముగదా.

కం. ఇదె పుట్టె సూర్యుఁ డంచును, నదె సూర్యుం డస్తమించె•నంచును లోకుల్
ముదమునఁ జూతురు; తమతమ, బ్రదుకులు క్షీణంబు లగుట•పరికింప రయో

పరికింపరు=చూడరు- ఇది పరీక్షా శబ్దభవము. [౨౩౭౭

తాత్పర్యము

అదిగో సూర్యుఁడుపుట్టెఁ బనులకు ద్రవ్యార్జనమునకుఁ బోదమనియు సూర్యుఁడస్తమించె సుఖముగ శయనించి కామభోగము లనుభవింపఁ బోదమనియుఁ జూతురేకాని లోకులు అయ్యో సూర్యుఁడుదయించి యస్తమించులోపలఁ బన్నెండు గంటలకాలము పోయెఁగదా మన ముద్ధారించుకొన మనమేమిచేసినట్లు? రాత్రికిఁ గావలసినది పగలు ముదిమినిఁ గావలసినది యౌవనమున, వర్షాకాలమునకుఁ గావలసినది యెండకాలమున సంపాదించి చేర్చిపెట్టుకొన్నట్టు పరలోకమున నా కుపయోగపడునది యీలోకమున నేనేమి సంపాదించితినని మూఢత్వమున నాలోచింపరుగదా.

కం. ఋతు వొకటి పోయి క్రొత్తగ, ఋతు నరుదేరంగ హర్ష•వృద్ధిం గను నీ
క్షితిజనసంఘం బది తన,బ్రతికెడికాలంబుఁ దినుట•పరికింపదుగా. ౨౩౮౯
అరుదేరఁగన్=రాఁగా, హర్ష=సంతోషముయొక్క, క్షితి=భూమియందలి.

తా త్ప ర్య ము

ఎండలకాలము పోయి వర్షము కురియఁగనే అబ్బా యెండలకు మాఁడి పోవుచుంటిమి చినుకులు పడెను. ఇఁకఁ జల్లగానుండునందుము, అదిపోయి శరదృతువు రాఁగానే వానలవలనఁ గదలుటకు మెదలుటకు లేకయుండెను. ఇఁక నెమ్మదిగా రాత్రులందు వెన్నెలలో సుఖింపవచ్చునందుము. ఇట్టులే యొక ఋతువు పోయి వేఱొకఋతువు వచ్చిన సంతోషింతుమేకాని యాయుస్సునం దింత పోయెనే మరణకాలము సమీపించుచున్నదే యని యొకరైన యాలో చింపరుకదా.

ఉ. కట్టియుఁ గట్టె నేళ్ళఁ బడి • కంధిని జొచ్చి తటానఁ గూడి యు
న్నట్టుల యుండి పాయుగతి • నాలును బిడ్డలు బంధు లర్థముల్
పట్టునఁ జేరియుం బిదపఁ • బాయుట కాలబలంబుచేతనే
యెట్టును బాసిపోక ధ్రువ • మియ్యది నమ్ముము చింతయేటికిన్. ౨౩౯౦
కంధిని=సముద్రమునందు, పాసిపోక=ఎడఁబాసిపోవుట.

తా త్ప ర్య ము

ఒక యేటినీటిలో నొకకట్టె మఱియొకయేటిలో నొకకట్టె కొట్టుకొనివచ్చి సముద్రపునీటిలోఁ బ్రవేశించి రెండును దటాలునఁ గలిసికొని మరల నట్టులే తటాలున నెడఁబాసిపోవువిధముగ భార్యలు బిడ్డలు ధనములు వానియంతట నవియే వచ్చి యొకచోటఁజేరి మరల నెడఁబాసిపోవుటకుఁ గాలబలమే కారణము కాని వేఱొక కారణములేదు. కావున నొకరినొకరు నెడఁబాయక తప్పదు. ఇది నిజము.

ఇక్కడఁ గాలబలమనునది పూర్వకృత కర్మబలమే.

శ్లో॥ యథాకాష్ఠంచ కాష్ఠంచ, సమే యాతాం మహోదధౌ
సమేత్యచవ్యపేయాతాం, తద్వద్భూతసమాగమః. భార. ౧౨-౨౭-౩౬.

రామాయణమందలి యీశ్లోకమే భారతమందుఁ గాననగు ౪-వ పాదము మాత్రము భిన్నము.

ఉ. ఇచ్ఛగ జీవయుక్తు లగు•నిష్టజనంబులతోడ నొక్కటన్
మచ్చికఁ గూడి యుంద మన • మానక శక్యము గాక యుండఁగాఁ
జచ్చెడివారి నాఁపుటకు • సారవివేకః వశంబె ప్రాణికి
విచ్చఁ దలంపు మేటిసఖు • లేటిసహోదరు, లేటిపుట్టముల్? ౨౩౯౧
ఇచ్ఛగన్=తమయిష్టప్రకారము, జీవయుక్తులు=ప్రాణముతో నుండువారు, ఇష్టజనంబులు=బంధువులు లోనగు నాప్తులు.

తాత్పర్యము

బ్రదికియున్న బంధువులు మిత్రులు లోనగువారితోఁ గలిసియుందమనిన సాధ్యముగాక బలవంతముగాఁ జీలిపోవలసియుండఁగా నిఁకఁ బ్రాణము పోవు వారిని నాఁపుటకు నెవరికి శక్యము? కావున వీరెక్కడి మిత్రులు? ఎక్కడి యన్న దమ్ములు? ఎక్కడి బంధువులు? ఋణము రాఁబట్టుకొనుటకై వచ్చి ఋణము తీరఁగానే పోవువారు చుట్టాలగుదురా.

శ్లో॥ నాయమత్యంత సంవాసో, లభ్యతే జాతు కేనచిత్
అపి స్వేన శరీరేణ, కిము తాన్యేన కేనచిత్. భార. ౧౨-౨౭-౫౨.

తనకుఁ బ్రియమైన తన దేహమును విడనాడక యుంచుకొందమనిన సాధ్యము కానప్పుడు పరుల దేహములను గుఱించి చెప్పనేల.

కం. త్రోవను నిలిచినయొకఁ డా, త్రోవన చనుపాంథజనము•తోడన్ నేనున్
మీవెంట వత్తు నను వహిఁ, బోవం దగుఁ బెద్దవారు•పోయినత్రోవన్.

పాంథజనము=బాటసారులు, వహిన్=విధముగ. [౨౩౯౨

తాత్పర్యము

దోవలో నిలువఁబడియుండు నొకఁ డెటుపోవుటకుఁ దెలియక యాలోచించుచు నాత్రోవనఁబోవు మఱికొందఱు బాటసారులను మీరెందుఁబోయెదరని యడిగి తానుద్దేశించిన గమ్యస్థానము వారి గమ్యస్థాన మొకటేయైనచో మీవెంట నేను వచ్చెదను నన్నుఁదోడుకొని పొండనిచెప్పి వారివెంటఁబోయి గమ్యస్థానము చేరినట్లు మనమును బెద్దవారు పోయినత్రోవఁ బోవనగు.

శ్లో॥ యేనాస్యపితరో యాతా, యేన యాతాపితామహాః
తేన యాయా త్సతాం మార్గం, తేనగచ్ఛ న్నరిష్యతి. మను. ౪-౧౭౮

తాతలు తండ్రులు పోయిన సన్మార్గమునఁ బోయినవాఁడు చెడఁడు.

దీనివలన వంశసంప్రదాయము కులసంప్రదాయము విడువరాదని యేర్పడుచున్నది. దుష్టసంప్రదాయములు మానవలసినవే. ఇందు మఱియొక విశేషము గననగు కొందఱు జ్ఞానాన్ముక్తియని జ్ఞానము కలిగినంతమాత్రముననే మోక్షము లభించునందురు. జ్ఞానోదయ మైనంతమాత్రముచేతనే దేహము పడదు. కావున యావజ్జీవము తమ పూర్వులు గావించుచుండిన విధమున స్వధర్మము నిర్వహించుచుఁ గర్మములు చేయుచుండవలెను. సన్న్యాసినైతినని విహిత కర్మములు మానరాదు. విరుద్ధకర్మములు చేయరాదు.

ఏవంజ్ఞాత్వా కృతం కర్మపూర్వైరపి ముముక్షుభిః
కురుకర్మైవ తస్మాత్త్వం, పూర్వైః పూర్వతరం కృతమ్. భ-గీ. ౪-౧౫.

ఇట్లు తెలిసికొని మోక్షాసక్తిగల పూర్వులు కర్మములు చేసిరి, నీవును

బూర్వులవలెఁ గర్మమే చేయుము. సర్వకర్మముల మానుమని బోధించువారే యట్టి యసాధ్యకార్యము చేయలేరైరి.

కం. కావున నతిక్రమింపం,గా వశపడనట్టితోవ • గమనించిన యా
　　జీవులకై శోకించిన, నేవిధమున మేలు గలదె•యెఱిఁగింప వయా. ౨౩౮౩

తాత్పర్యము

ఈకారణములచేతఁ దప్పించుకొని దాఁటిపోవుటకు సాధ్యపడనిత్రోవఁ బోయినవారినిగుఱించి యేడ్చిన నేమైన మేలున్నదా చెప్పుము.

　　అంతవంత ఇమేదేహా, నిత్యస్యోక్తాః శరీరిణః
　　జాతస్యహిధ్రువో మృత్యు, ర్ధ్రువం జన్మమృతస్యచ
　　తస్మాద పరిహార్యేర్థే, నత్వంశోచితు మర్హసి
　　అవ్యక్తాదీనిభూతాని, వ్యక్తమధ్యాని భారత
　　అవ్యక్త నిధనాన్యేవ, తత్రకాపరిదేవనా.

ఈదేహముల కంతము గలదు, ఈదేహము గలవాఁడు నిత్యుఁడు, పుట్టినవాఁడు చచ్చుట నిజము, చచ్చినవాఁడు పుట్టుట నిజము. కావునఁ బరిహరింపరానిదానికై యేడ్చి యేమిప్రయోజనము ? అవ్యక్తమునుండి యన్నిభూతములు వచ్చుచున్నవి. ఎందుండి వచ్చుచున్నవో తెలియదు, నడుమఁ గానవచ్చును, మరల నవ్యక్తమందుఁ జేరుచున్నవి. ఇట్టిదాని కేడుపేల?

కం. వయసు ప్రవాహము వంటిది,
　　　　　　　　రయమునఁ జనుచుండుఁ గాని•క్రమ్మఱదెపుడున్
　　నియమింపవలయుఁ దనమది, నయముగ సుఖ మందఁ;
　　　　　　　　ప్రజలు•నవ్యసుఖార్థుల్. ౨౩౮౪

రయమునన్=వడిగా.　　　　తాత్పర్యము

ప్రవాహము వేగముగఁ బోవునట్లు వయస్సుపోవును. ప్రవాహమెట్లు వెనుకకురాదో యట్లు వయస్సు వెనుకకురాదు. కావున సుఖముఁ గోరువారు తమ మనస్సును నియమించి నీతిమార్గమందుఁ బ్రవర్తింపఁ జేయవలెను. మనుష్యులు క్రొత్త క్రొత్త సుఖములనుభవింప యోగ్యులే కావున క్షణభంగురమైన యైహిక సుఖమునకంటె శాశ్వతమైన మోక్షసుఖమును గోరవలయును.

సీ.ధర్మాత్ముఁడై యుండి•తతశుభావహమైన,జన్నంబు లన్నియు•జరపినాఁడు
　　దక్షిణాదులచేత • ధరణీసురాదిక, జనములనెల్లను • దనిపినాఁడు
　　తనభృత్యవర్గంబు • ధరణీజనంబుల, హితదానములచేత • నేలినాఁడు
　　చేకొలందిగ నీవి • చేసి యథేష్టంపు,భోగంబు లన్నియుఁ•బొందినాఁడు
తే.సాధుకర్మంబు లెన్నియో•చలిపినాఁడు,పెక్కుకాలంబు ధరణి జీ•వించినాఁడు
　　నాకలోకసుఖంబుల•నందినాఁడు తండ్రి కేటికి వగవ నా•తండ్రి! చెపుమ.

తతశుభావహము=విస్తారముగ మేలు కలిగించునది, జన్నము=యజ్ఞము, ధరణీసురాదిక=బ్రాహ్మణులు మొదలయిన, తనిపినాఁడు = తృప్తినొందఁ జేసినాఁడు, భృత్యవర్గంబున్ = సేవకుల సమూహమును, ధరణీజనంబులన్ = భూప్రజలను, ఈవి=దానము.

తాత్పర్యము

తండ్రీ! మనతండ్రి భూమిమీఁదఁ బుట్టినపురుషుఁడు రాజగువాఁడు స్వర్గలోక ప్రాప్తికై చేసికొనవలసిన ధర్మములన్నియుఁ జేసెను. ధర్మబుద్ధిచే మిక్కిలి శుభకరములైన యజ్ఞములన్నియుఁ జలిపినాఁడు. ఆ యజ్ఞములందు బ్రాహ్మణాదులకు శాస్త్రోక్త దక్షిణల యథావిధి యిచ్చి వారిని సంతోషింపఁ జేసినాఁడు, తన్నాశ్రయించియుండు భృత్యులకు భూప్రజలకు వారివారి యోగ్యతకుఁ దగినట్టు దానములు చేసినాఁడు, చేతికివచ్చిన ట్లుదారబుద్ధితో దానములుచేసి యిష్టమువచ్చిన సుఖంబులన్నియు ననుభవించినాఁడు. సత్కార్యము లెన్నియో చేసినాఁడు,దీర్ఘకాలము బ్రదికినాఁడు. ఈలోకమున నీపుణ్యకర్మములు చేసినఫలముగ స్వర్గలోకసుఖములఁ బొందినాఁడు. ఇట్టి తండ్రిని గుఱించి నీవేల శోకించెదవు?

తే. జీర్ణమానుష దేహంబు• క్షితిని విడిచి, బ్రహ్మలోకవిహారపా•త్రంబు నైన
దివ్య దేహంబుఁ దాలిచి • తేజరిల్లు,జనకునకు నేల దుఃఖింప • సాధుశీల.

జీర్ణమానుషదేహంబు =వార్ధకముచేఁ జివికిపోయిన మనుష్య దేహము, క్షితిని=భూమియందు, బ్రహ్మలోక విహారపాత్రంబు = బ్రహ్మలోకమందు సంచరింప యోగ్యమైన- పృథివీతత్త్వము విశేషించియుండు నీస్థూలదేహము లీభూలోకమునందు మాత్రమే యుపయోగింపునుగాని తక్కిన తేజస్సులోనగు నవి విశేషించియుండు లోకములందిది పనికిరాదు. దివ్యదేహంబు = దేవతా సంబంధమైన తేజస్సుచేఁ బ్రకాశించు దేహము, సాధుశీల = సాధువర్తనము గలవాఁడా.

తాత్పర్యము

మనతండ్రి వార్ధకముచే జీర్ణించిన మనుష్య దేహమును నిచ్చటనేవిడిచి యీలోకమునకంటె నుత్తమమగు బ్రహ్మలోకమందు సంచారముచేయ యోగ్యమైన దేవతల దేహములవలెఁ బ్రకాశించు తేజోమయమైన దేహము ధరించి సుఖించుచుండఁ దండ్రికై యేలయేడ్చెదవు.

కం. వావిరి యీగతినేడువఁ,బోవఁడు ప్రాజ్ఞుండు నిన్నుఁ•బోలినశ్రుతిమ
త్కోవిదుఁ డగునే మునుకఁగ, నీవిధి శోకింపఁ గార్య•మే మగుఁ దండ్రీ?

ప్రాజ్ఞుండు=బుద్ధిమంతుఁడు, వావిరి=అధికము, శ్రుతిమత్కోవిదుఁడు= వేదార్థ జ్ఞానముగల పండితుఁడు, మునుకఁగన్=సంతాపింపఁగ.

నీవలె వేదార్థజ్ఞానము బ్రహ్మజ్ఞానముగల పండితుఁ డీవిధముగ విశేషించి దుఃఖింపఁడు. ఏలయనెదవా ? చచ్చినవారికై యెంతయేడ్చినను వారు మరల రాఁబోవునది లేదు. కావున నేడ్చుటవలన లాభములేదు కావున నేడువరు.

కం. ఎట్టిదశయందుఁగానీ, దిట్టతనముగలిగియున్న ♦ ధీమంతుఁడు లోఁ
బుట్టినశోకభరంబునఁ, బుట్టఁగనీఁ డశ్రు బిందు♦వులు నయనములన్.

దిట్టతనము = ధైర్యము, ధీమంతుఁడు = ప్రశస్తమైన బుద్ధిగలవాఁడు, శోకభరము = శోకాతిశయము, అశ్రుబిందువులు = కన్నీళ్ళు, నయనములన్ = కన్నులయందు.

తాత్పర్యము

ధైర్యముగల బుద్ధిమంతుఁ డెంతటి కష్టదశ ప్రాప్తించినను, నెంత శోకాతిశయమందును గన్నీరుగార్పఁడుఁ దీనివలన నెంతటి కష్టదశయందును నెంతటి ప్రియవియోగము గలిగినను ధీరుఁడగు బుద్ధిమంతుఁడు కన్నీరుగార్ప రాదు. కన్నీరుగార్చుట మరణించినవారికి శ్రేయస్కరముగాదు.

ఉ. కావున స్వస్థచిత్తుఁ డవు ♦ గమ్ము విషాదము మాని యూరికిం
బోవుము రాజ్యభారమును ♦ బూనుము తండ్రి వచించినట్లు నే
నీవనవాస మోర్తుఁ బది ♦ యేఁడులు నాలుగు, తండ్రియాజ్ఞ నే
నే విఫలంబుసేఁత దగు ♦ నే? యది ధర్మమె నాదుబోఁటికిన్? ౨౩౯

స్వస్థచిత్తుఁడవు = కుదుటఁబడిన మనస్సుగలవాఁడవు, విషాదము = దుఃఖము, నాదుబోఁటికిన్=నావంటివానికి.

తాత్పర్యము

కాఁబట్టి నీమనస్సు కుదుటఁబడనిమ్ము. వ్యసనము మానుము. ఊరికిఁ బోయి రాజ్యభారము వహింపుము. తండ్రిచెప్పినట్లు పదునాలుగు సంవత్సరములు వనవాసము చేసెదను, తండ్రియాజ్ఞను నేనే వ్యర్థము చేయవచ్చునా? నావంటివాని కది ధర్మమా?

కం. ఆతండె మనకుఁ దండ్రియు, నాతండే మనకుఁ జుట్ట ♦ మటుగావున నీ
కాతని సమ్మానించుట, ఖ్యాతికరము నాకు నదియె♦యగు సమ్మతమున్.

సమ్మానించుట=గౌరవించుట, ఖ్యాతిదము = కీర్తి గలిగించునది.

తాత్పర్యము

మనకుఁ దండ్రియు నతఁడె, బంధువు నతఁడె, కావున నీకు మనతండ్రి మాట గౌరవించుటే కీర్తికరము, నీవట్లుచేయుటే నాకు సమ్మతము. కావునఁ దండ్రిమాట తండ్రితో సమానుఁడనైన నామాట నీవు మీఱ నాలోచింపకుము.

కం. పరలోక మందఁగోరెడు, నరుఁడు విపులదయుఁడు ధర్మ•నైష్ఠికుఁ డైనన్
బరిపాలితగురువాక్యుఁడు, ధరణిం గావలయుఁ జుమ్మి•ధర్మార్థవిదా. ౨౪౦౧

పరలోకము=స్వర్గలోకసుఖము, విపులదయుఁడు=విస్తార దయగలవాఁడు, ధర్మనైష్ఠికుఁడు = ధర్మమందు నిష్ఠగలవాఁడు- అయినప్పటికి, పరిపాలితగురువాక్యుఁడు=తండ్రివాక్యమును రక్షించినవాఁడు, ధర్మార్థవిదా=ధర్మముయొక్క యర్థము తెలిసినవాఁడా. తాత్పర్యము

స్వర్గలోకసుఖము గోరెడువాఁడు యెంత విశేష దయగలవాఁడైనను, ధర్మమందెంత నిష్ఠగలవాఁడైనను తండ్రిమాట ప్రకారము నడచువాఁడుగా నుండవలెను. తండ్రియాజ్ఞ ధిక్కరించి యేధర్మముచేసినను నెంత భూతదయ గలిగినను వ్యర్థమే.

దీనివలన భూతదయకంటె ధర్మనిష్ఠకంటె గురుసేవ శ్రేష్ఠమని సూచన. తల్లిదండ్రులయందు దయలేని కృతఘ్నుఁ డేమాత్రము దయావంతుఁడు గాఁగలఁడు, పితృసేవాధర్మము నుల్లంఘించినవాని ధర్మనిష్ఠ యేమాత్రము.

కం. జనకునిసచ్ఛీలము నీ,మనమునఁ దలపోసి యతని • మాటను నిలుపన్
గొనకొనుము రాజ్యభారం,బును బూను మిటేల వనట•మునుఁగఁగ భరతా.

సచ్ఛీలము=సత్ + శీలము=మంచినడవడి, తలపోసి = ఆలోచించి, వనటన్=వ్యసనమందు. తాత్పర్యము.

మనతండ్రి యెటువంటి సాధువర్తనముగలవాఁడో యొక యసత్యమైనఁ జెప్పినాడేమో యాలోచింపుము. అటువంటివానికి మనవలన నసత్యదోషము రావచ్చునా? యదియు నాలోచింపుము. ఇది మనచేతిలోనికార్యము గాని యాయన చేయునదికాదు. ఇదంతయు నాలోచించి రాజ్యభారము వహింపుము, ఏల యేడ్చెదవు.

వాస్తవ మాలోచింప భరతుఁడు తండ్రి చచ్చెనని శోకింపలేదు. రామచంద్రమూర్తికిఁ దననిమిత్తమునఁ గష్టదశ ప్రాప్తించెను, తనకు సేవచేయు నదృష్టము లేకపోయెనని యేడ్చెను. దీనికి శ్రీరామచంద్రమూర్తి తండ్రికై యేడువకుమని బోధించెను. ప్రశ్నోత్తరములకు సంబంధము కానరాలేదు. అయినను రామచంద్రమూర్తి యభిప్రాయము గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితా యను నీతిని నేర్పవలయుననియే. గతించిన తండ్రి కేడ్చుటయు బ్రతికియుండు నాకేడ్చుటయు రెండు వ్యర్థములే. కాఁబట్టి నీవేడుపు మాని నీకార్యము నీవుచేసికొన నయోధ్యకుఁ బొమ్మని బోధించుటయైయున్నది. ఆకారణమునఁ బ్రశ్నోత్తరములందు విరోధము లేదు.(౨౩౯. ప. చూడుము.)

౧౦౬-వ సర్గము. భరతుఁడు శ్రీరామునితోఁ దనదుఃఖము నకుఁ గారణముఁ జెప్పుట.

తే. అనుడు శ్రీరాముఁగనుఁగొని•యనియెభరతుఁ,
డనఘనీవంటినరుఁడిల•నరిదిచూవె
చెట్టని న్నేమి కాఁటియ•పెట్టలేదు,మేలు నినుఁ బొంగఁ జేయంగ•జాలదౌర.

అనఘ = దోషరహితుఁడా- మేలునకు సంతోషించుట- కీడునకు దుఃఖించుట రెండును దోషములే, అవి లేనివాఁడని యర్థము. అరిది = అపురూపము- అనఁగా లేఁడనియర్థము, కాఁటియ=వ్యథ.

తాత్పర్యము

ఈప్రకారము శ్రీరామచంద్రమూర్తి బోధింపఁగా భరతుఁ డిట్లనియె.అనఘాత్మకా! యాహా! నీవంటినరుఁడు లోకమున లేఁడుగదా? ఏలయందువా? లోకమున నందఱు మేలురాఁగోరుచుందురు, వచ్చిన సంతోషింతురు. కీడురాఁగూడదని కోరుదురు, వచ్చిన నేడ్తురు. నీవో మేలువచ్చిన సంతోషింపవు, కష్టము వచ్చిన దుఃఖింపవు, నీమనస్సువంటి మనస్సుగలవారు దుర్లభులు.

కం. ఎఱుక గల పెద్దలకు వా, రెఱుఁగనియవి చెప్ప నీవె•యెఱుఁగనియట్టుల్
గుఱుకొని సందియ మడిగెదు,కొఱలే కవ్వారి కెఱుక•గూర్చెడివాంఛన్.

గుఱుకొని=ప్రయత్నపూర్వకముగ, ఎఱుక=జ్ఞానము, వాంఛ=కోరిక.

తాత్పర్యము

లోకమున జ్ఞానవృద్ధు లనిపించుకొన్నవారికిఁగూడ సందేహములు దీర్చు నీవు నీకుఁదెలియనట్లు వారిని ఖర్మసందేహములు ప్రశ్నించెదవు. ఏల ? నీకుఁ దెలియకకాదు. వారి యభిప్రాయము పొరపాటని తెలిసికొని మీయభిప్రాయము తప్పని చెప్పుట సాధులక్షణముగాదు. కావునను, వారి యభిప్రాయము సవరింపవలసియుండుటను నీవే ప్రశ్నవేసి వారు ప్రత్యుత్తరము నొసఁగినపుడు దానికి వికల్పముగా నీయర్థము చెప్పఁగూడదా? యని వారిచేతనే సరి నీవు చెప్పినదే బాగున్నదని యనిపించెదవుకదా.

చం. కనుఁగొనసట్టివస్తువుసఁ • గల్గదు కామము, తద్విధంబునం
గనుఁగొనువస్తువం దయినఁ • గల్గదు కామము జ్ఞానికిన్; మృతిం
గనినమనుష్యుమీఁదఁ బగ • గల్గదు, తద్విధి నున్నవారిపై
జనవర! కాన నేనును వి • షాదము గూరను దండ్రికై మదిన్. ౨౪౦౫

తాత్పర్యము

పామరులకుఁ దాముచూడని వస్తువులపైఁ గోరికపోదు. జ్ఞానులకుఁ గాన వచ్చు పదార్థములమీఁదను గోరికపోదు. చచ్చినవారిపై నెవనికి ద్వేషములేదు.

అట్లులే జ్ఞానికి బ్రదికియుండువారిమీఁదను ద్వేషములేదు. కాబట్టి తండ్రి విషయమై నేను శోకింపనులేదు.

సీ. అడలె దేటికి నాఁ బ॰రావరజ్ఞుండె ప్డు, దుఃఖపాళికి నింత॰దూలిపోఁడు
నీవు నాకై వడి॰నెగడితి వమరోప, మా! సత్త్వసంపన్నుఁ॰డగుమహాత్మ
సత్యసంగరుఁడవు॰సర్వజ్ఞమూర్తివి, సర్వదర్శివి కడుఁ॰జతురమతివి
ధృతియుతుండవు భవ॰స్థితివిదుండవు నీవ, సహియింప రానట్టి॰సంకటముల
ఆ. ననుభవింపఁ దగునె॰యది దలపోసిన, మాకు సుఖము గలదె॰మాన్యచరిత
నిన్నుఁబోలువాఁడు॰నిష్ఠురారణ్యాళి, నడల నెట్లు దుఃఖ॰పడక యుందు.

అడలెదు=వ్యసనపడెదవు, పరావరజ్ఞుఁడు=పర+అవరజ్ఞుఁడు- (1) భూత భవిష్యద్వర్తమానము లెఱిఁగినవాఁడు- (2) ఇదియాత్మవస్తువు- ఇది యాత్మ వస్తువుకాదని తెలిసినవాఁడు- (3) వీఁడు జీవుఁడు- వీఁడు పరమాత్మయని యెఱిఁగినవాఁడు, దుఃఖపాళికిన్=దుఃఖముల సమూహములకు, తూలిపోఁడు= చలింపడు, ఆకైవడిన్=అవిధముగ, అమరోపమా=దేవతతో సమానుఁడా, సత్త్వ సంపన్నుఁడు=సత్త్వగుణమే సంపదగాఁగలవాఁడు, సత్యసంగరుఁడవు=సత్య ప్రతిజ్ఞ కలవాఁడవు, సర్వజ్ఞమూర్తివి=సర్వము దెలిసినవాఁడవు, సర్వదర్శివి = సర్వము భూత భవిష్యద్వర్తమానములు చూచువాఁడవు, చతురమతివి = నేర్పుతోఁగూడిన మనస్సుగలవాఁడవు, ధృతియుతుండవు=ధైర్యముతోఁగూడిన వాఁడవు, భవస్థితివిదుండవు = జననమరణరూపక సంసారస్థితి తెలిసినవాఁడవు, నిష్ఠురారణ్యాళి=పరుషములయిన యరణ్యములయందు, అడలన్=కష్టింపఁగా- దుఃఖింపఁగా.

తాత్పర్యము

నీవు దుఃఖించినది తండ్రికై కాకున్న మఱియెవరినిమిత్తమందువా? భూత భవిష్య ద్వర్తమానములుగాని ఆత్మానాత్మ వివేకముగాని జీవపరమాత్మల సంబంధముగాని తెలిసినవాఁడు దుఃఖములు ప్రాప్తించినపుడు మనస్సును జలింపనీఁడు. నీవు భగవత్సమానుఁడవు గావున నీవునట్టివాఁడవే నేను గాదనను గాని సత్త్వగుణసంపన్నుఁడు సత్యనియముఁడు సర్వజ్ఞుఁడు సర్వదర్శి ధీరుఁడు సంసార స్థితిగతులు తెలిసిన చతురమతియగు మహాత్ముఁడవు నీవు నిష్కారణ ముగ సహింపరాని కష్టములకుఁ బాలుపడనేల? నాకేదియుఁ గష్టముతోఁపలేదని నీవందువు, నిజమే నీవు ధీరుఁడవు జ్ఞానివి కావున నీకుఁ గష్టముతోఁపక పోవచ్చును. ఎంతోసుఖ మనుభవింపవలసిన మహానుభావుఁ డడవులలో దుఃఖము లనుభవించుచుండిన మేమెట్లు సహించి చూచుచుండఁగలము? మేమెట్లు సహింపఁగలము? నా పాపబలమున నీకిట్టికష్టము వచ్చెఁగదాయని దుఃఖించు చున్నాను. నీతోడ సీతాలక్ష్మణులు దుఃఖించుచున్నారుగదా.

దీనివలన సాధువులగు మహాత్ములు దుఃఖించుచుండ సజ్జనులు చూచి సహింపఁజాలరనియు వారికష్టమును బాపుటకై యెంతకష్టనష్టములైనఁ బడ వలయుననియు నేర్పడుచున్నది.

ఉ. నే నటు లింట లేనియెడ ♦ నీచచరిత్ర మదంబ నాకు నై
తా నిటు లోకగర్హితము ♦ దారుణపాపము నాచరించె, ని
ష్ఠేనియుఁ దల్లి యంచనక ♦ యింతలు నింతలు తుండె తుండెముల్
గా నఱకంగఁ జాలుదును ♦ గాని నిబద్ధుఁడ ధర్మరజ్జులన్. ౨౪౦౭

నీచచరిత్ర=నీచపు నడవడిగలది, మదంబ=నాతల్లి, లోకగర్హితము=లోకులచే నిందింపఁబడినది, దారుణపాపము = భయంకరమైన పాపకార్యము, ఆచరించెన్=చేసెను, ధర్మరజ్జులన్=ధర్మమనెడి త్రాళ్ళచే, నిబద్ధుఁడన్ = బంధింపఁబడినవాఁడను. దీనివలనఁ దల్లి యెంతపాపము చేసినను జంపరాదని యేర్పడుచున్నది.

తా॥ నేనింటలేని సమయమందు నీచపు నడవడిగల నాతల్లి నిన్ను నడవులపాలుసేయుట యనెడి ఘోరపాపమును జేసెను దానికిఁ దగిన శిక్షగా నిపుడే తల్లియనికూడఁ దలంపక ముక్కలు ముక్కలు తుంటలు తుంటలుగా నఱకఁగలను గాని స్త్రీలను జంపరాదను ధర్మశాస్త్రవాక్యము నన్నుఁ గట్టివైచి యట్టులు చేయనీయక యున్నది. నేనట్లుచేసిన నాయందు దోషమున్నదో లేదో లోక మెఱుంగఁగలదుకాని చేయఁజాలక యున్నాను. ఏలయందువా?

దీనివలనఁ బాపాత్మురాలగు తల్లిని దండింపవచ్చునుగాని చంపరాదు. తల్లియను గౌరవ మంచరాదు, అను నీతి గ్రహింపనగు.

కం. పుట్టితి శుద్ధాన్వయమునఁ, బుట్టినయాజికిని ధర్మ♦పుందెరువుల నే
నెట్టన నేర్చితిఁ గని కని, యెట్టులు గర్హ్యం బధర్మ♦మే నొనరింతున్.

శుద్ధాన్వయమునన్=నిర్మలమైన వంశమందు, ఆజికిని=అజకుమారుఁడైన దశరథునకు, నెట్టన = చక్కఁగా, గర్హ్యంబు = నింద్యము, అధర్మము = ధర్మవిరుద్ధము.

తాత్పర్యము

పాపరహితమైన వంశమునఁ బుట్టిన దశరథునకు నేను గొడుకనైపుట్టి ధర్మమిది యధర్మమిది యని చక్కఁగా నేర్చి యెట్లు క్రోధమునకు వశపడి లోకనిందితమైన ధర్మవిరుద్ధ కార్యమును జేయుదును? తల్లినెట్లు చంపుదును? జ్యేష్ఠుఁడవైన నీరాజ్యము నేనెట్లు హరింతును?

దీనివలన వంశమునకు నపకీర్తివచ్చు నధర్మకార్యము చేయరాదని సూచన.

చం. ఘనుఁడు గురుండు వృద్ధుఁడును♦గార్యవిదుండును జచ్చెఁ గాన నా
జనకుఁడు నిండుగోష్ఠిఁ బరు♦షంబులు పల్కఁగరాదు గాక యే
మనుజుఁడు పూను నొక్కొ యొక♦మానినిప్రీతికి నర్థధర్మనా
శన మగునట్టిక్రూరకలు♦షం బొనరింపఁగ ధర్మవేది యై. ౨౪౦౮

ఘనుఁడు=గొప్పవాఁడు, గురుఁడు=తండ్రి, వృద్ధుఁడు=ముసలివాఁడు, కార్యవిదుఁడు=చేయఁదగినదేదియో తెలిసినవాఁడు, నిండుగోష్ఠి=జనసమ్మర్దము గల యీ సభయందు, పరుషంబులు = కఠినవాక్కులు, అర్థధర్మనాశనము = అర్థము ధర్మము చెఱుపునది, అసఁగాఁగేవలకామము, క్రూరకలుషము=నిర్దయ మైన పాపకార్యము, ధర్మవేది=ధర్మముఁ దెలిసినవాఁడు.

తాత్పర్యము

కైకయాఁడుది. కావునఁ గామాసక్తయై తెలివిమాలి పాపముచేసెననిన గుణములచే గొప్పవాఁడు గురుఁడు ముసలివాఁడగుటచే నెంతయో లోకానుభవము శాస్త్రానుభవము గలవాఁడు. ఇది చేయఁదగినది ఇది చేయరానిదని ధర్మము తెలిసినవాఁడు పురుషుఁడునగు తండ్రిచేసిన కార్యమిట్టిది. ఆయన మరణించుటచేతను ఇది నిండుసభగావునను ఆయనను నిందింపరాదుగాని మనుష్యుఁడెవఁడొకయాఁడుదానిని సంతోషింపఁ జేయవలయునని ధర్మము, యర్థము నాశముచేయు క్రూరపాపకార్యము కేవల కామమునాశ్రయించి చేయును? పామరుఁడుగూడఁ జేయని యిట్టి పాపము నటువంటివాఁడుచేసిన నేమనుకొనవలయును?

దీనివలనఁ బరోక్షమందు నెవరిని దూషింపరాదనియు, గురువులయందలి దోషములను సభలోఁ జెప్పరాదనియు నేర్పడుచున్నది. అట్లైననేల తండ్రిని భరతుఁ డెగ్గులాడె ననిన శత్రోరపి గుణాగ్రాహ్యా, దోషావాచ్యాగురోరపి. భా. ౪-౨౧-౨౨.

శత్రువులందైనను గుణములుండిన గ్రహింపవలయును గురువునందు దోషములున్నఁ జెప్పవలయును. అను న్యాయముచే భరతుఁడుచెప్పినది తప్పుగాదు. నిష్కారణముగ నిష్ప్రయోజనముగ నిందింపరాదు. గురువుయొక్క దుశ్చేష్టచేఁ గలిగిన కీడు తొలఁగించుటకుఁ జెప్పవచ్చును. అటుచెప్పకున్న నతఁడుచేసినది యంగీకరించినట్లగును.

ఉ. కూడు వినాశకాలమున • కున్ విపరీతపుబుద్ధి యందు ని
ట్లాడెను లోక మానుడి య • థార్థముఁ జేసె నృపాలుఁ డిప్డు దా
నోడక క్రోధమోహముల • నొప్పనికార్యముఁ జేసి, దాని కీ
పీడుగ సాధువృత్తిఁ జరి•యించి మరల్పుము తత్కృతాఘమున్. ౪౪౧౦

వినాశకాలమునకున్=చెడిపోవుకాలమునకు, నుడి=మాట, ఓడక = భయపడక- జంకక, ఒప్పనికార్యము=లోకము శాస్త్ర మంగీకరింపని కార్యము, అకార్యము, ఈడుగన్=సమానముగ, తత్కృతాఘమున్=ఆయనచేఁ జేయఁబడిన పాపమును, క్రోధమోహములకున్ = నీవు రాముని నడవికిఁ బంపకపోయితివా విషముద్రావి యిచ్చటనే చచ్చెదనని కైకక్రోధము, అట్టి క్రోధముగలదాని యందు మోహము, (2) కైకయందు మోహము ఆమెకు విరోధియగు కౌసల్య యందుఁ గ్రోధమునియైనఁ జెప్పవచ్చును.

తా త్ప ర్య ము

ఒప్పో తప్పో తండ్రిచేసినాఁడు. చనిపోయినాఁడు. ఇప్పుడేమియనుకొని యేమి ప్రయోజనము? ఆయన చెప్పినట్లు మనము చేయవలసినదే మనకు విధి యనెదవా? అట్లుగాదు. "వినాశకాలే విపరీతబుద్ధి" యని లోకము చెప్పుమాటను దండ్రి క్రోధమోహములచేఁ జేయరానిపనిచేసి యథార్థపఱిచెను. క్రోధమోహములచేఁ జేయరానిపనిచేసి యథార్థపఱిచెను. క్రోధమోహములచేఁ జేయరానిపని చేసి పాపమార్జించెను. నీతండ్రి పాపముచే నరకబాధపడుట నీవు సహింప వచ్చునా? కూడదు. కావునఁ బాపముపోవునట్లు నీవు సాధువృత్తిఁ జరియించి యాయనచేసిన యసత్కార్యమును నీవు సత్కార్యముగా మార్పుము. అప్పు డాయనకు బాధ తొలఁగును.

చం. జనకుఁడు కిల్బిషం బొకఁడు ♦ సల్పినయేనియు దానిపాపమున్
 జనకునిఁ బొందకుండఁ గృతి ♦ సల్పినపుత్రుఁడె పుత్రుఁడౌఁ జుమీ
 జనకుఁడు పాపముం బొరయఁ జల్పినవాఁడును బుత్రుఁ డౌనొకో?
 జనకునిఁ గావుమీ యతఁడు ♦ సల్పినదానిని విస్మరింపుమీ. ౨౮౧౧

దానినే వివరించి చెప్పుచున్నాఁడు.

కిల్బిషంబు=పాపము, విస్మరింపుమీ=మఱచిపొమ్ము.

తా త్ప ర్య ము.

తండ్రి పాపముచేసెనేని యాపాప మతని నంటకుండఁజేయు పుత్రుఁడే పుత్రుఁడుగాని తండ్రికిఁ బాపమువచ్చునట్లు చేయువాఁడా పుత్రుఁడు? తండ్రికి నరకబాధ తప్పించువాఁడుకదా పుత్రుఁడు. అట్లుండఁ దండ్రికి నరకబాధ కలుగునట్లు చేయువాఁడు పుత్రుఁడెట్లగును? కాఁబట్టి నీవు తండ్రిని బాపబాధ పాలు గాకుండ రక్షింపుము. ఆయన యీపాపకార్యము చేసెను. గావున నరక బాధ యనుభవింపనీలే యనకుము. ఆయనచేసినది మఱచిపొమ్ము. ఆయనను రక్షింపుము.

దీనివలన మనకొకఁ డపకారము చేసినను దానిని మనస్సునఁబెట్టక మనము వాని కుపకారమే చేయవలయునని యేర్పడుచున్నది. ఉపకారికి నుపకారము చేయుట గొప్పకాదు. అది కర్తవ్యవిధి. అపకారికి నుపకారముచేయుటే గొప్ప అందుఁ దండ్రివిషయ మేమిచెప్పవలె- "సపద్యనేన కించిదక్షప్రయాకృతం భవతి స ఏతస్మాత్సర్వస్మాత్పుత్రో ముంచతి తస్మాత్పుత్రోనామ." బృహదా॥ తండ్రి చేసిన పాపమునుండి యతని ముక్తునిఁజేయువాఁడే పుత్రుఁడనఁబడును.

ఉ. ఎక్కడి క్షత్రధర్మ మిది ♦ యెక్కడి ఘోరమహావనస్థలం
 బెక్కడిరాజ్యపాలన మి ♦ దేటి జటాభరధారణంబు నీ
 కక్కట! యిట్టిచేఁత దగ ♦ దా! నను గైకను దండ్రి మిత్రులన్
 దక్కినపౌరబంధుజన ♦ తం గృప నేలఁగదన్న ప్రొమ్కెదన్. ౨౮౧౨

క్షత్రధర్మము=క్షత్రియుల ధర్మము, ఘోరమహావనీస్థలంబు=భయంకరమైన గొప్ప యడవిప్రదేశము, జటాభరధారణంబు=జడలు ధరించుట. చేత=కార్యము, బంధుజనతన్=బంధుజనుల సమూహమును, కదన్న=ప్రార్థనంబునందన్ప్రత్యయాంత క్రియలమీఁదఁ గద కదవు పూర్వకంబు లన్నాదులను ప్రయుక్తంబులగు ప్రా. వ్యా. కద యనునది ప్రార్థనమును దెలుపును.

తాత్పర్యము

అన్నా! నీవా క్షత్రియుఁడవు. నీకు శాస్త్రవిహితమయినది క్షత్రధర్మము. నగరములందుండి నిర్వహింపవలసిన కార్యము. నీవుండునది ఘోరారణ్యమందు. నీకుచిత చిహ్నము కిరీటధారణము. నీవు ధరించినది జటాభారము. ఇట్టి విపరీతచేష్ట తగునా? కావున నాయందు దయయుంచి క్షత్రియోచితవేషము ధరించి క్షత్రియోచితకార్యము చేయుము. నన్నుఁ గైకను దండ్రిని మిత్రులను దక్కిన బంధువులను బౌరులను దయతో రక్షింపుము. నీకు నమస్కరించెదను.

దీనివలన నెవనికేది స్వధర్మమో దానియందుండి కులధర్మము పాలించుట శ్రేష్ఠమని యేర్పడుచున్నది.

—♦ భరతుఁడు శ్రీరామునితో వనవాసం బతని కర్తృధర్మంబు గాదనుట. ♦—

ఆ. ప్రాజ్ఞలోకవర్య♦ప్రజలఁ బాలింపఁగ,దేన శక్య మగునొ♦మానవేంద్ర
పటలి కట్టిరాజ్య♦పట్టాభిషేకంబు, ప్రథమధర్మ మనిరి♦ప్రాజ్ఞ జనులు. ౨౪౧౩

ప్రాజ్ఞలోకవర్య=బుద్ధిమంతులయందు శ్రేష్ఠుఁడా, పటలికిన్=సమూహమునకు, ప్రథమధర్మము=మొదటి ధర్మము.

తాత్పర్యము

క్షత్రియునకు వానప్రస్థాశ్రమచర్య వేషము శాస్త్రవిరుద్ధము కాదుగదా యందువేమో? క్షత్రియులకుఁ బ్రథమధర్మము ప్రజాపరిపాలనము; ప్రజాపాలనము చేయువాఁడు పట్టాభిషేకము చేసికొని సింహాసనమందుండుట విధి. ఇట్లని ప్రాజ్ఞులు చెప్పుదురు; నీవు వారియందు శ్రేష్ఠుఁడవు. ఇది నేను నీకుఁ జెప్పవలయునా? క్షత్రియస్య విశేషేణ ప్రజానాం పరిపాలనమ్। క్షత్రియునకుఁ బ్రజాపరిపాలనము ముఖ్య ధర్మము.

బ్రాహ్మం ప్రాప్తేన సంస్కారం, క్షత్రియేణ యథావిధి
సర్వస్యాస్య యథాన్యాయం, కర్తవ్యం పరిరక్షణమ్॥ మను. ౭-౨.

శాస్త్రముచొప్పున నుపనయన సంస్కారము పొందిన క్షత్రియుఁడు తన దేశమందలి జనుల రక్షింపవలెను.

సీ. ఏనుంగు నంజలో నెల్లసత్త్వంబుల యంజలు నడఁగినయట్లపోలె। రాజిత
క్షత్రధర్మమునకు లోనయి సర్వధర్మంబులుఁ జనుమఖములు। వేదంబులును
శుభవృత్తంబులును దండనీతి మాసినఁజెడు భూతలంబు। సంస్కారరహితమై

చాలహీనతఁ బొందు సట్లైనఁ బ్రజకుఁ జేటావహిల్లు। రాజులరసిన నెమ్మది
బ్రదుకుఁగాన। రాజు సర్వోత్తముఁడు ధర్మరాజియందు। రాజధర్మంబ
యెక్కుడు రాజనంగ। ధర్మదేవత యనవేఱె ధర్మతనయ॥

భార-శాంతి. 2-238.

క్షత్రియాణా మయంధర్మో, యత్ప్రజా పరిపాలనమ్
వధశ్చ ధర్మయుద్ధేన, స్వరాజ్య పరిపంథినామ్. వి. పు. ౭-౬-౩

క్షత్రియులకుఁ బ్రజాపాలనము తన రాజ్యమునకు విరోధులగువారిని ధర్మయుద్ధమునఁ జంపుట ధర్మము.

అభిషిక్తస్యరాజ్ఞః ప్రజాపాలనం పరమోధర్మః॥ అపస్తంబులు.

పట్టాభిషిక్తుఁడైన రాజునకుఁ బ్రజాపాలనము పరమ ధర్మము.

సీ. ప్రత్యక్ష మగుప్రజా•పాలనధర్మంబుఁ, బోకార్చి మిగులశం•కాకులంబు
గాలాంతరఫలంబు•కలితలక్షణహీన, మవినిశ్చితం బగు•నట్టిధర్మ
మేక్షత్రియుఁడు సల్పు•నీవు కష్టోద్భవ,ధర్మంబుఁ జలుపంగ•దలఁచె దేని
నాలుగుజాతుల•పాలనసేఁత క్లే,శాత్మక మగుట న•య్యది చరింపు

తే. మాశ్రమచతుష్కమున గృహ•స్థాశ్రమంబు,
శ్రేష్ఠమగు ననికాదొకో•శిష్టమతము
ధర్మతత్పర నీయట్టి•ధార్మికుండు, దాని విడనాడఁ జూడంగ ధర్మమగునె?

ప్రత్యక్షము=అందఱకు స్పష్టముగ నింద్రియగోచరమగునది, ప్రజాపాలన ధర్మంబు=ప్రజలను రక్షించుటయను ధర్మము, పోకార్చి=వదలిపెట్టి, శంకాకులంబు=ఫలవిషయమున సందేహముతో వ్యాకులమైనది, కాలాంతరఫలంబు=మీఁద నెపుడో మరణించినతరువాత ఫలము చూపునది, కలితలక్షణహీనము=నిశ్చయమైన లక్షణములేనిది, అవినిశ్చితంబు = క్షత్రియుఁడు మొట్టమొదటఁ దాపసధర్మ మనుష్ఠింపవలయునని యేప్రమాణముచేతను నిశ్చయింపఁబడనిది, అట్టిధర్మము=అట్టి తాపసధర్మము, ఏక్షత్రియుఁడు సలుపున్=ఏక్షత్రియుఁడును జేయఁడని భావము, కష్టోద్భవధర్మంబు=శ్రమమువలనఁ గలిగెడిధర్మము, క్లేశాత్మకము=కష్టముతోఁ గూడినది, ఆశ్రమచతుష్కము = బ్రహ్మచర్యము, గార్హస్థ్యము, వానప్రస్థము, సన్న్యాసము అను నాలుగాశ్రమములు, శిష్టమతము=పెద్దలగు నార్యుల యభిప్రాయము, ధర్మతత్పర = ధర్మమందే విశేషాసక్తి గలవాఁడా.

తాత్పర్యము.

అన్నా! నీవుండఁదలఁచిన తాపసధర్మము ఫలము ప్రత్యక్షముగాదు. దానిఫలమిప్పుడు కనఁబడునదికాదు. ఇప్పుడుగాకున్న నెప్పటికైనఁ గలుగనీ తొందరయేమందువా? ఎప్పటికైనఁ బూర్ణఫలము కలుగునో కలుగదో, అది సందేహమే. ఏలన? ఎక్కడ నెప్పుడు నేవిధమగు కర్మలోపము జరుగునో దాని వలనఁ బుణ్యలోకవాసము భంగమగునేమో యనుసందేహముతోఁ గూడియుండు

నది, తాపసధర్మమున కొకనిశ్చయ లక్షణమున్నదా యనిన నదియులేదు. అది క్రియయా? శక్తియా? అపూర్వమా? స్వరూప నిశ్చయములేనిది. అది యునుగాక క్షత్రియునకుఁ బ్రప్రథమమందే తాపసచర్య యేశాస్త్రము విధింప లేదు. ఇటువంటి తాపస ధర్మమును క్షత్రియుఁడెవఁడు సలుపఁబూనును? రాజ ధర్మమో రక్షారూపముగను దండరూపముగను భోగరూపముగను గనులకుఁ గానవచ్చును. కావున ఫలముగలదో లేదోయను సందియములేదు. రాజు ప్రజా పాలనమే చేయవలయునని శాస్త్రము నిశ్చయించుచున్నది. ఇట్టిదానిని బూనుట యందు క్షత్రియుఁడెవడు సందేహించును? రాజధర్మము సుఖభోగములతోఁ గూడినది. కష్టించి ధర్మము చేయవలయునందువా? ప్రజాపాలన క్లేశము సుకరమైనదికాదు; తాపసధర్మమునకంటెఁ గష్టమైనది. ఇందు నీయొకని యోగ క్షేమ విచారమే; రాజ్యపాలనమందుఁ గోట్లకొలఁది జనుల యోగక్షేమములు విచారింపవలయును. కావున నట్టిన దానిని వరింపు. ఇప్పుడు నీవు వానప్రస్థుఁ డవై బ్రహ్మచర్య మవలంబించితివి ఇవి రెండును గృహస్థధర్మమునకంటె శ్రేష్ఠములు గావు. నాలుగాశ్రమములలో గృహస్థాశ్రమమే శ్రేష్ఠమైనదనికదా పెద్దల యభిప్రాయము. సంసారమును నిర్వహింపలేని దుర్బలుఁడుగదా సంసారము వదలవలెను. కాఁబట్టి ధర్మమందాసక్తిగల నీవు అట్టి ధర్మమును వదలి యిట్టులుండుట ధర్మముగాదు.

అన్ని యాశ్రమములలో గృహస్థాశ్రమమే శ్రేష్ఠమైన దనుటకుఁ బ్రమా ణములు.

శ్లో॥ యథానదీ నదాస్సర్వే, సాగరేయాంతి సంస్థితమ్
ఏవ మాశ్రమిణ స్సర్వే, గృహస్థేయాంతి సంస్థితమ్. భార. ౧౨-౨౭౦-౩౮

నదీ నదములన్నియు సముద్రముచేరి యెట్లు నిలుకడగలవగునో యట్టులే యన్ని యాశ్రమములవారు గృహస్థునియందు నిలుకడ గలవారు.

శ్లో॥ యథామాతర మాశ్రిత్య, సర్వేజీవంతి జంతవః
ఏవం గార్హస్థ్య మాశ్రిత్య, వర్తంత ఇతరాశ్రమాః. భార. ౧౨-౨౭౦-౬.

జంతువులన్నియుఁ దల్లి నాశ్రయించుకొని బ్రదుకునట్లు గృహస్థ ధర్మము నాశ్రయించి తక్కిన యన్నియాశ్రమములు వర్తించును.

శ్లో॥ సర్వేషా మేవచైతేషాం, వేదశ్రుతి విధానతః గృహస్థ ఉచ్యతేశ్రేష్ఠ స్సత్రీ నేతాన్ బిభర్తిహి॥ వేద శ్రుతివలన నన్ని యాశ్రమములలో గృహస్థాశ్ర మమే శ్రేష్ఠము. గృహస్థుఁడే తక్కినమూఁటిని భరించువాఁడు.

శ్లో॥ దైవైశ్చైవ మనుష్యైశ్చ, తిర్యగ్భిశ్చాప జీవతే
గృహస్థః ప్రత్యహం యస్మాత్తస్మాచ్ఛ్రేయాన్ గృహాశ్రమీ.

శ్లో॥ సర్వేషా మాశ్రమాణాంతు, గృహస్థో యోనిరుచ్యతే
సీదమానే నతేనేహ, సీదం తన్యేపి తేత్రయః.

మూలప్రాణో భవేత్స్కంధః, స్కంధాచ్ఛాఖాసపల్లవాః
మూలనైవ వినష్టేన, సర్వమే తద్వినశ్యతి
తస్మాత్సర్వ ప్రయత్నేన, రక్షణీయో గృహాశ్రమీ
రాజ్ఞ్యాచాన్యైః త్రిభిః పూజ్యో రక్షణీయశ్చ సర్వదా॥

దేవతలు మనుష్యులు పశ్వాదులు గృహస్థునివలననే జీవనము కలవగు చున్నవి. నాలుగాశ్రమములకు జన్మస్థానము గృహస్థాశ్రమమమే; గృహస్థుచెడెనా తక్కిన మూఁడాశ్రమములవారు చెడినవారే; నాలుగాశ్రమములకు మూల ప్రాణము గార్హస్థ్యము. అదియే స్కంధము, దానివలనఁ గొమ్మలు, కొమ్మల వలనఁ జిగుళ్ళు. స్కంధముచెడెనా కొమ్మలులేవు, చిగుళ్ళులేవు. కావున రాజు తక్కిన మూఁడువర్ణములవారు గృహస్థుని రక్షింపవలయును.

సర్వేషు వేదేషు ధర్మశాస్త్రేతిహాస పురాణేషు గృహస్థా ఏవఅగ్నిహోత్రిణః ప్రాచుర్యేణ విధీయంతే, స్తూయంతేచ తతోగార్హస్థ్యస్యచ ప్రత్యక్షవిధానాత్ స ఏవైక ఆశ్రమః। ఇతరేతు తత్రాశక్తానాం విధీయంత ఇతిబహవ ఆచార్యా మన్యంతే. వైద్యనాథీయము.

సర్వవేదములందు ధర్మశాస్త్రములందు నితిహాస పురాణములందు గృహస్థునికే యగ్నిహోత్రము కలదని ప్రచురముగా విధింపఁబడినది, మఱి పొగడఁబడినది. కాఁబట్టి గార్హస్థ్యమొక్కటే యాశ్రమము దానిని నిర్వహింపఁ జాలని దుర్బలుల కితరాశ్రమములు చెప్పఁబడినవి. అని యనేకాచార్యు లభి ప్రాయపడి యున్నారు.

తేషాం గృహస్థో యోనిరప్ర జనత్వాది తరేషామ్. గౌతముఁడు.
యస్మాత్త్రయో ద్యాశ్రమిణో, జ్ఞానేనాన్నేన చాన్వహమ్
గృహస్థై రేవధార్యంతే, తస్మా చ్ఛ్రేష్ఠాశ్రమో గృహీ.

శ్లో॥ యథావాయుం సమాశ్రిత్య, సర్వేజీవంతి జంతవః
తథా గృహస్థమాశ్రిత్య, వర్తంత ఇతరాశ్రమాః॥

వాయువు నాశ్రయించి జీవజంతువులన్నియు బ్రదుకునట్లు గృహస్థు నాశ్రయించి యితరాశ్రమములవారు జీవింతురు.

శ్లో॥ అస్యకావ్యస్య కవయోః నసమర్థా విశేషణే
సాధోరివ గృహస్థస్య, శేషస్త్రయ ఇవాశ్రమాః॥   ఆదిపర్వము.

శ్లో॥ ఆశ్రమాంస్తులయా సర్వాన్ ధృతా నాహుర్మనీషిణః
ఏకతశ్చ త్రయోరాజన్, గృహస్థాశ్రమ ఏకతః॥

త్రాసులో మూఁడాశ్రమము లొకప్రక్కన గృహస్థాశ్రమ మొకటి యొక ప్రక్కన వైచి తూఁచితిమేని సరిపోవును.

ఇట్లు గృహస్థాశ్రమము శ్రేష్ఠత్వము సాధించు ప్రమాణ వాక్యములు పెక్కులు గలవు.

కొందఱు సన్న్యాసాశ్రమము శ్రేష్ఠమని దానియందు విశేషఫలము గలదని భ్రమించుచున్నారు. అది భ్రమముమాత్రమే. ఎట్లన :—

'నలింగం ధర్మకారణ'మ్మని మనుస్మృతి; ధర్మము సాధించుటకు ముఖ్య కారణము కాషాయవస్త్రాది చిహ్నములు గావు. 'జ్ఞానం సన్న్యాసలక్షణం'. సన్న్యాసికి ముఖ్యచిహ్నము జ్ఞానము.

ఈ జ్ఞానమనునది జనకాదులవలె గృహస్థులును సంపాదింపవచ్చును. కావున వేషము ముఖ్యముగాదు. అదియునుగాక వాస్తవసన్న్యాసము దండ కమండలుధారణము కాదు.

శ్లో॥ కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయోవిదుః ॥

కామ్యకర్మములు చేయకుండుటయే సన్న్యాసమని జ్ఞానులు దెలియుదురు.

నియతస్యతు సన్న్యాసః, కర్మణో నోపపద్యతే
మోహాత్తస్య పరిత్యాగ, స్తామసః పరికీర్తిత. ॥ భ-గీ.

నిత్య నైమిత్తికరూపమైన మహా యజ్ఞాదికర్మములు బ్రహ్మజ్ఞానమునకు సాధనములగుటచేఁ బ్రాణములు పోవువఱకు విడువరాదు. అట్టి కర్మములను విడుచుటకుఁ గారణ మజ్ఞానమే.

శ్లో॥ యజ్ఞోదానం తపశ్చైవ, పావనాని మనీషిణామ్
ఏతాన్యపిచ కర్మాణి సంగంత్యక్త్వా కరోతి యః
లిప్యతే న సపాపేన, పద్మపత్ర మివాంభసా
కాయేన మనసా బుద్ధ్యా, కేవలై రింద్రియైరపి
యోగినః కర్మకుర్వంతి, సంగం త్యక్త్వాత్మ శుద్ధయే
యుక్తః కర్మఫలం త్యక్త్వా, శాంతిమాప్నోతి నైష్ఠికీమ్
అయుక్తః కామకారేణ, ఫలేసక్తో నిబధ్యతే ॥ భ-గీ.

యజ్ఞము దానము తపస్సు ననునవి బుద్ధిమంతులను బావనులఁ జేయును. ఈ కర్మములనయినను ఫలాపేక్షలేక యెవఁడుచేయునో తామరాకును నీరంటనట్లు వానిని బాపమంటదు. ఆత్మశుద్ధినిమిత్తము యోగులు కాయముచే మనస్సుచే బుద్ధిచే నింద్రియములచే ఫలసంగమువదలి కర్మములు చేయుదురు; యోగి కర్మఫలమువదలి శాంతియందు నిష్ఠగలవాఁడగును. యోగి కానివాఁడు కామముచేఁ గర్మములుచేసి ఫలబద్ధుఁ డగును. భ-గీ. ౧౭. అధ్యా.

గృహస్థోహి క్రియాయుక్తో, నగృహేణ గృహీభవేత్
నచాపి పుత్ర దారాద్యై, స్స్వకర్మ పరివర్జితః ॥

దక్షుఁడు దారపుత్రాదులతో గృహమునం దున్నమాత్రమున స్వకర్మ ముల వదలినవాఁడు గృహస్థుఁడు కాఁడు.

శ్లో. అనాశ్రితః కర్మఫలం, కార్యం కర్మ కరోతి యః
స సన్న్యాసీచ యోగీచ, న నిరగ్ని ర్న చాక్రియః. భ-గీ. ౬-౧.

కర్మఫలము నాసింపక యెవఁడు కర్మములను మన మివి చేయఁదగిన వను బుద్ధితోఁజేయునో వాఁడే సన్న్యాసి; వాఁడే యోగి; వాఁడు అగ్నిహోత్రము లేనివాఁడు కాఁడు. క్రియలు లేనివాఁడు కాఁడు.

ఆప్రయాణాత్తత్రాపి హి దృష్టం బ్రహ్మహి. బ్ర. సూ. ౪-౧-౧౨

ప్రాణము పోవువఱకుఁ గర్మములు చేయవలయునని యీ ప్రమాణములు స్థాపించుచున్నవి. కావున వాస్తవసన్న్యాసము గృహస్థుఁడుగానుండి కామ్య కర్మములు చేయకుండుటయే.

ఇఁక సన్న్యాసికి ఫలమందాధిక్యముగలదా, చూతము.

శ్లో. సన్న్యాసాద్బ్రహ్మణస్థానం, వైరాగ్యా త్ప్రకృతౌలయః
జ్ఞానాత్కైవల్య మాప్నోతి, తిస్రస్త్రాగతయః స్మృతాః॥ యని జాబాలిస్మృతి.

సన్న్యాసమువలనఁ జతుర్ముఖ బ్రహ్మలోకము వైరాగ్యమువలనఁ బ్రకృతి యందు లయము జ్ఞానమువలన కైవల్యము. ఈమూఁడుగతులు చెప్పఁబడెను.

శ్లో. వేదాంతవిజ్ఞాన సునిశ్చితార్థాః। సన్న్యాసయోగాద్యతయః యశుద్ధసత్త్వాః
తేబ్రహ్మలోకేతు పరాంతకాలే। పరామృతాత్పరి ముచ్యంతి సర్వే. శ్రుతి.

దీనివలన సన్న్యాసులు చతుర్ముఖ బ్రహ్మలోకమునకుఁ బోయి యందు చతుర్ముఖబ్రహ్మ యుండువఱకుండి యావల నాయనతోడ ముక్తిగాంతురు. అంతియకాని సద్యోముక్తి లేదు. అక్కడ నేదైన లోపముగలిగెనా మరల నిచ్చటికి రావలసినవారే. 'ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోర్జున' యని కృష్ణభగవానుఁడు చెప్పెనుగదా.

సన్న్యాసులకు బ్రహ్మలోక ప్రాప్తియే యనుటకు.

ప్రాజాపత్యం గృహస్థానాం, బ్రాహ్మం సన్న్యాసినాం స్మృతమ్
యోగినా మమృతంస్థానం, తద్విష్ణోః పరమంపదమ్
ఏకాంతిన స్సదా బ్రహ్మ, ధ్యాయినో యోగినో హియే
తేషాం తత్పరమం స్థానం, యద్వై పశ్యంతి సూరయః

గృహస్థులకుఁ బ్రజాపతిలోకము సన్న్యాసులకు బ్రహ్మలోకము (సత్య లోకమని శ్రీధరీయ వ్యాఖ్య) ప్రతీకోపాసకులగు యోగులకు విష్ణుపరమపద మగు నమృతస్థానము (ఇది ధ్రువునికి మీఁదనుండు లోకము) ఏకాంతభక్తు లయి పరబ్రహ్మమును ధ్యానించు యోగులకు నిత్యసూరులు సర్వదా చూచు దానికిఁ బరమైన స్థానము.

"అనావృత్తిః శబ్దాత్" అను బ్రహ్మసూత్ర వ్యాఖ్యయందు శంకరాచార్యులును "సగుణ శరణానామప్య నావృత్తి సిద్ధిరితి" సగుణ బ్రహ్మమును శరణుచొచ్చినవారికిని మరల జన్మములేదు. అనివ్రాసిరి.

ఇంక గృహస్థుఁడో.

శ్లో. న్యాయాగత ధన స్తత్త్వ, జ్ఞాననిష్ఠోతిథిప్రియః
శ్రాద్ధకృత్సత్యవాదీచ, గృహస్థోపి విముచ్యతే.

న్యాయ్యమార్గమున ధనమార్జించి, తత్త్వజ్ఞాన నిష్ఠుఁడై అతిథుల సేవించుచు శ్రాద్ధములు జరపుచు సత్యవాదియగు గృహస్థుఁడు ముక్తుఁడగును.

కర్మణైవహి సంసిద్ధి మాస్థితా జనకాదయః ।

జనకుఁడు మొదలగువారు కర్మయోగముచేతనే ముక్తిని గాంచిరి.

గృహస్థుఁడు వీరుఁడు ధీరుఁడు. సన్న్యాసి పిఱికి పంద.

అరిషడ్వర్గముతో యుద్ధముచేసి జయించువాఁడు గృహస్థుఁడు; వానికి భయపడి పరువెత్తిపోయి కొండలలో గుహలలో నడవులలో దాఁగుకొనువాఁడు సన్న్యాసి. కావున గృహస్థధర్మమే శ్రేష్ఠమను భరతవాక్యము సముచితమే.

ఉ. పుట్టువుచేత స్థానమునఁ • బోఁడిమివిద్యల నీకుఁ బిన్న నే
నెట్టులు నీవు గల్గియును • నేలఁగఁ జాలుదు? ధీగుణంబుల
న్పట్టునఁ బిన్ననౌట నినుఁ•బాసి నిలంగను నేర నన్నయా!
యెట్టులు రాజ్యభారము వ•హింతునా? పోవఁ జుమీ యయోధ్యకున్.

స్థానమునన్=పెద్దవానిపదవి యైనపిమ్మటఁ జిన్నవానిపదవి యను క్రమమున నీవున్నప్పుడైనను నీకాలాంతరమున నేను రాజ్యమునకు వచ్చిన రావచ్చును. గావున నీవుండఁగనే వచ్చుట ధర్మముగాదని భావము. నీకంటె నేనేమాత్రము పెద్ద? ఒకనాఁడేకదా? కావున నిరువురు సమానులమే యనినఁ జెప్పుచున్నాఁడు. ధీగుణంబులన్ పట్టున బుద్ధిచేత- గుణములచేత- స్థానముచేత.

తాత్పర్యము

అన్నా! జన్మము వరుసక్రమమునందును విద్యలయందును నీకుఁ బిన్నవాఁడను నేను. నాకంటె గొప్పవాఁడవు నీవు కావున నన్నివిషయములందు నీకు వెనుకనుండవలసినవాఁడనే కాని ముందుపడవలసినవాఁడను గాను. సూర్యుఁడుండిన సూర్యకాంత శిల వేఁడిమి చూఁపగలదుగాని సూర్యుఁడులేనివేళ నది యేమిచేయుఁగలదు. అట్టులే నేను నీవుతోడనుండిన నీబలముప్రాపున నెంతైనఁ జేయుఁగలనుగాని నిన్నువిడిచి నేనేదియుఁ జేయఁజాలను. చేయలేకుండుటయే కాదు, బుద్ధిచేత గుణములచేతఁ బిన్నవాఁడనగుటచే నీసహాయములేకున్న నిలువనుగూడలేను. చెట్టుప్రాపులేని తీఁగవలె నేలఁబడవలసినవాఁడనే. ఇట్టివాఁడను

రాజ్యభారముకూడ నెట్లు భరింపఁగలను? కావున నేనయోధ్యకుఁ బోను. ఇందు జీవాత్మ పరమాత్మల సంబంధము ఆధారాధేయ భావము, రక్ష్యరక్షకభావము, అంశాంశిభావము దెలియవచ్చుచున్నవి.

సీ. పౌరపురోహిత♦బాంధవప్రవరులు, గల రిట నెల్లరుఁ ♦ గాన నిచటఁ
బట్టాభిషేకంబుఁ ♦ బడసి నొనర్తుము, పదపడి ధారిణీ♦పాలనమున
కును బొమ్మయోధ్యకుఁ♦గుటిలారులను గెల్చి, వృత్రారిపోలె నీ♦వెల్లరలర
మూఁడుఋణంబుల♦మునుముట్టఁ దీఱిచి, మిత్రకోటులకు న♦మిత్రులకును

ఆ. నిష్టకష్టములను♦నిడుచు మమ్మెల్లరఁ, గావ వయ్య నిన్నుఁ♦గాంచి హితులు
దేలఁ బ్రీతిఁ బగఱు♦దిక్కుమొగంబుగా, రమ్యసుగుణభద్ర♦రామభద్ర.

పౌర=పురజనులు, ప్రవరులు=శ్రేష్ఠులు, కుటిలారులు=కుత్సితశాత్రవులు, వృత్రారి=ఇంద్రుఁడు, అలరన్=సంతోషింపఁగా, మూఁడుఋణంబులు = దేవఋణము- పితృఋణము- ఋషిఋణము, మునుముట్టన్=సంపూర్ణముగ, కొఱఁత లేక, అమిత్రులకున్=పగవారికి, ఇష్టకష్టములను=మిత్రులకిష్టము, అమిత్రులకుఁ గష్టము, క్రమాన్వయము, పగఱు=పగవారు, దిక్కుమొగంబుగన్ = దిక్కుల వంక ముఖముపెట్టి దిక్కునకొకఁడుగా పరుగెత్తినవారు.

తాత్పర్యము

పౌరశ్రేష్ఠులు, పురోహితశ్రేష్ఠులు, బాంధవశ్రేష్ఠులు లోనగువా రుండవల సినవారెల్ల నిందున్నారు. వారి యభిప్రాయమేమో వీరియభిప్రాయమేమో యని నీవు సందేహింపఁబనిలేదు. వారి వీరిమీఁద నెపముచెప్పఁబనిలేదు. అచటికి ముందుగాఁబోయిన నచట వీరు పట్టాభిషేకము చేయుదురో చేయరో యని సందేహింపఁ బనిలేదు. ఇచటనే నీకుఁ బట్టాభిషేకము చేయుదుము. ఆవల నీవు భూపరిపాలనమునకై యయోధ్యకుఁ బొమ్ము. పోయి కుత్సితశత్రువులనుగెల్చి యింద్రునివలె నందఱు సంతోషించునట్లు దేవపితౄషి ఋణములు కొఱఁతలేక దీర్చి మిత్రులకు సంతోషము శత్రువులకు దుఃఖము కలుగునట్లు మమ్మందఱఁ గావుము. అట్లుచేసితివేని నిన్నుఁజూచి నీహితముగోరువారు సంతోషింతురు. నీకుఁ గీడుగోరువారికి నిచట నుండిన దండము తప్పదని దిక్కునకొక్కఁడుగా నందఱుఁ బరువెత్తుదురు. రాజ్యము నిష్కంటక మగును.

కం. నాతల్లి నిందవలనం, బూతగ నొనరించి తండ్రి♦పుణ్యాత్ముఁడుగాఁ
బాతకమునకుం బాపుము, భూతముల మహేశునట్లు♦ప్రోవుము మమ్మున్.

పూతగన్=పవిత్రురాలినిగా, పాతకమునకున్ = పాపమునుండి, మహేశునట్లు=భగవంతునివలె.

తాత్పర్యము

నిన్ను నేనింతదూరము ప్రార్థించుట నాసుఖముగోరికాదు. నీవు పట్టాభిషేకము చేసికొంటివేని శ్రీరామచంద్రమూర్తిని గాఢాతురయై యడవులపాలు చేసెనను లోకనిందచేతను బాపముచేతను మృతప్రాయయై నాతల్లియున్నది. ఆమెకా పాపము నింద పోవును. దోషిగానివాని దండించి ధర్మవిధముఁవిడిచి తండ్రి పాపముచే నరకమునఁ బడియున్నవాఁడు. ఆయన కా నరకబాధ తప్పును. ముఖ్యముఁగా నీరెండుకార్యములుచేసి భగవంతుఁడు జీవకోటులనెల్ల వారివారికిఁ దగిన యోగక్షేమములఁ గూర్చి యెట్లు రక్షించునో యట్లు నీవును మమ్మునెల్ల రక్షింపుము. నీవు పట్టాభిషేకము చేసికొంటివేని యీ మూఁడు పుణ్యములు సంపాదించినవాఁడవగుదువు.

కం. నామాటలు పెడచెవి నిడి, యీమహితారణ్యవాస ♦ మీకొనె దేనిన్
రామా! మీబడిఁ గానన,సీమకు నివసింప వత్తు ♦ సిద్ధ మటన్నన్. ౪౧౧౮

పెడచెవినిడి=ఎడమచెవితో విని, అలక్ష్యముచేసి, మహితారణ్యవాసము=గొప్ప యడవులయందుండుటకు, ఈకొనెదేనిన్=ఇయ్యకొనెద వేని=అంగీకరించు పక్షమున, మీబడి=మీవెంబడి, కాననసీమకున్=అడవి ప్రదేశమునకు.

తాత్పర్యము

నేనురాను నీ వేమిచేసెదవందువా? నీతోడ నేనుండవలసినవాఁడను, నిన్ను విడిచియుండను. నీవయోధ్యకు వచ్చెదవా, అయోధ్యయందు నీతోడనుందును. నీవరణ్యములం దుందువా? నేను మీతోడ నరణ్యమందే యుందును. ఇది నిశ్చయము. ఆత్మను విడిచి శరీర మెందుండఁగలదు ?

ఉ. ఇంతయు నాలకించి పురి ♦ కేగఁగ నీకొనకున్న జానకీ
కాంతునిఁ జూచి నైగమని ♦ కాయము లశ్రుల నించి హా యటం
చెంతటి ధీరచిత్తుఁ డర ♦ రే యని హర్షము గాంచెఁ దల్లులున్
వంతను బొంది హా యనుచు ♦ వ్రాలిరి మెచ్చిరి కైకపుత్రునిన్. ౪౧౧౯

ఆలకించి=విని, ఈకొనకున్న=అంగీకరింపని, నైగమనికాయములు=పౌరజన సమూహములు, నైగమస్త్వాపనిషది దంతే వణిజేనాగరే॥ నానార॥ అశ్రులు=కన్నీళ్ళు, వంతను=వ్యసనమును.

తాత్పర్యము

భరతుఁ డింతగాఁ జెప్పినదంతయు విని శ్రీరామచంద్రమూర్తి యయోధ్యకుఁబోవ సమ్మతింపలేదు. అట్టి శ్రీరామచంద్రునిఁజూచి పౌరులందఱు నాహా శ్రీరామచంద్రుఁడెంతటి ధీరచిత్తుఁడని మెచ్చుచు రాననియెఁగదా! యని కన్నీరు గార్చిరి. తల్లులును దుఃఖముచే నేలవ్రాలి భరతుఁడు నిర్వంచనముగా [illegible]తబాగుగఁ జెప్పెనని శ్లాఘించిరి.

౧౦౭-వ సర్గము. శ్రీరాముఁడు భరతునితో నతఁడు రాజగుట ధర్మ మని చెప్పుట,

చం. భరతుఁడు వేఁడ నిట్లు బహు•భంగుల రాముఁడు పల్కె నాజికిన్
బురుమతి కేకయాత్మజకుఁ • బుట్టిన నీ కిది చెల్లుఁ, గైకయీ
పరిణయవేళఁ దాతకును • బ్రాజ్యము రాజ్యము శుల్క మిచ్చె భూ
వరుఁ డగుతండ్రి యామెసుతుఁ•బట్టముఁ గట్టఁగ బాస చేయుచున్.

ఆజికిన్=దశరథునకు, కేకయాత్మజకున్=కేకయరాజు కూతునకు, కైక యనగ కేకయరాజు కూఁతురనుటచేఁ దండ్రివలెఁ గూఁతురు గొప్పగుణములు గలదేయని భావము. పరిణయవేళన్ = వివాహకాలమందు, తాతకును = కైక తండ్రియగు కేకయరాజునకు, శుల్కము=అరణము.

తా త్ప ర్య ము

ఈప్రకార మనేకవిధముల భరతుఁడు ప్రార్థింపఁగా దశరథుఁడు కామ వశుఁడై యధర్మమార్గమున వర్తించెనను మాటకుఁ బ్రత్యుత్తరము చెప్పు చున్నాఁడు. భరతా! దశరథునివంటి ధర్మాత్మునకుఁ గేకయరాజువంటి గొప్ప వానికిఁ గూఁతురైన కైకకుఁ బుట్టిన నీవిట్లుచెప్పుట న్యాయ్యమె. కాని నీవుచెప్పి నట్లు దశరథుఁడు కేవల మధర్మాత్ముఁడై రాజ్యము నీకీయలేదు. మీతల్లి వివా హమునందుఁ గన్యాశుల్కముగా నీరాజ్య మామెకొడుకున కిచ్చునట్లు కేకయ రాజునకు నీతండ్రి మాట యిచ్చెను. ఇది ప్రమాణపూర్వకముగఁ జేసినకార్యము గావునఁ బ్రమాణముప్రకారము కార్యముచేసిన తండ్రి యధర్మాత్ముఁడెట్లగును.

సీ. విబుధదానవయుద్ధ•వేళ నీజనయిత్రి, పుడమిఱేనికిఁ దోడు•పడినకతనఁ
బరమహర్షంబున•వరములు రెం డిచ్చె, నామెయు వానిన•యడిగె నిప్పు
డిది యును దోషమే•యిందు నొక్కటినీవు, రాజౌటయును నేన•రణ్యములకుఁ
బోవుట మఱియొండు•భూవరుండవి యిచ్చెఁ, గావునఁ దండ్రివా•క్యంబుఁ బట్టి
ఆ. పదియునాలుగేండ్లు•భ్రమియింప వనముల,
వచ్చినాఁడఁ దోడ•వసుధతనయ
లక్ష్మణుండు రాఁగ•లలితపద్ధతిఁ దండ్రి, సత్యవచననిష్ఠుఁ•జల్పుటకును.

విబుధదానవ యుద్ధవేళన్=దేవతలకు రాక్షసులకు యుద్ధముపొసఁగిన సమ యమందు, జనయిత్రి=తల్లి, పుడమిఱేనికిన్=రాజునకు, దశరథునకు,తోడుపడిన కతనన్=సాహాయ్యముచేసిన కారణమున, సత్యవచననిష్ఠున్=సత్యవాక్యమునం దున్నవానిని.

తా త్ప ర్య ము

ఆ వరప్రకారము రాజ్యము నాకిచ్చిన నిచ్చునుగాక! నీ వడవికిఁ బోవలసి నది లేదుకదా? నన్నేల యడవికిఁ బంపెను.అది యధర్మముగాదా!యందువా? దానికిఁ గారణము చెప్పెదను వినుము. దేవరాక్షసయుద్ధమందు నీతల్లి తనకు

సాహాయ్యముచేసిన కారణమున నీతండ్రి యామెకు రెండువరము లిచ్చెను. ఆరెండు వరము లిప్పుడామె యడిగెను. అందొక్కటి నీకు రాజ్యాభిషేకము, రెండవది నా వనవాసము. ఆ రెండువరములు తండ్రియిచ్చెను. కావున నాయన మాటప్రకారము పదునాల్గు సంవత్సరములు నే నడవులయందు సంచరింప సీతాలక్ష్మణులతోడ వచ్చినాఁడను. ఇట్లు నేను వచ్చుటయందుద్దేశము తండ్రి సత్యవాక్యనిష్ఠునిఁ జేయుటయే, కాని కామక్రోధములు గావు.

కం. నీవును దండ్రిని నిజమరిఁ,గావింపఁగవలదె? యట్లు • గావున రాజ్య
  శ్రీవిభవముఁ గైకొనుమీ, నావచనము వినఁగదయ్య • నాకొఱకైనన్.

  నిజమరి=సత్యవాది. [౨౪౨

తాత్పర్యము

కాఁబట్టి తండ్రిని నేను సత్యవచననిష్ఠునిఁ జేయఁబూనినట్లు నీవును దండ్రిని సత్యవాదినిఁ జేయఁదగుదువుగదా. కాఁబట్టి రాజ్యలక్ష్మిని నంగీకరింపుము. తండ్రి నాతోఁ జెప్పలేదు. కావున నేనేల దాని నంగీకరింపవలయు నందువా? అటైనఁ దండ్రిమాట తండ్రిసిగదా నేను. నేనుజెప్పెదను. అయ్యో! పెద్దవాఁడు చెప్పుచున్నాఁడే యని నాకొఱకైనను నామాటవినుము. నష్టమైనను గష్టమైనను ఇష్టమైనను అనిష్టమైనను బెద్దవారిమాట త్రోసివేయరాదుగదా.

కం. జనకుని ఋణంబుఁ దీర్పుము,
  జనయిత్రియు సంతసింపఁ • జరియింపు గయుం
  డనునతఁడు దొల్లి గయయం,
  దనియె సుగీతములఁ బితరు • లందఱు వినఁగన్. ౨౪౩

తాత్పర్యము

కావునఁ దండ్రిఋణ మాయన మాటప్రకారము నడచి తీర్పుము. తల్లియును సంతోషించునట్లు వర్తింపుము. ఈవిషయమై గయమహారాజు పితరులు వినుచుండఁ జెప్పినగీతములు గలవు. చెప్పెద వినుము.

కం. జనకుఁడు పున్నామనరక,మునఁ గూలక కాచుఁ గాన • మొగి నాతనికో
  ర్కిని దీర్చిసుకృతుఁ జేయును,
  గనుకం బుత్త్రాఖ్యఁ బరఁగుఁ • గా సుతుఁ డెందున్. ౨౪౪

పున్నామనరకమునన్=పుత్ + నామ=పున్నామ=పుత్తను పేరుగల నరకమునందు, సుకృతున్=పుణ్యాత్ముని, పుత్త్రాఖ్య = పుత్త్రుఁడను ఖ్యాతి.

తాత్పర్యము

తండ్రిని బుత్తను పేరుగల నరకమునుండి రక్షించును గనుకను, దండ్రి కోరిక నెఱవేర్చి సుకృతుఁజేయును గనుకను గొడుకునకుఁ బుత్త్రుఁడను పేరు గలిగెను. పుత్+త్రాయతే=పుత్త్రః, పితౄన్‌పాతి = పుత్రః ఈ రెండువిధముల వ్యుత్పత్తి గలదు. మొదటి యర్థమందుఁ బుత్త్రియని వ్రాయవలెను. రెండవ

యర్థమందుఁ బుత్రయని వ్రాయవచ్చును. ఇదియును అనచిచ యను సూత్ర ప్రకారము పుత్త్రియని వ్రాసినను వ్రాయవచ్చును.

కం. కలుగుదురు గాక తనయులు, పలువురు గుణయుతులు వేద•పారగు లని కో
　　ర్కులు జనములు గోరఁగఁ దగుఁ,
　　　　　　　　గలుగఁడెయొకఁడైనఁబోవ•గయకనునాశన్. ౨౪౨౩

వేదపారగులు=వేదము తుదముట్ట నధ్యయనము చేసినవారు.

తాత్పర్యము

పున్నామనరకమునుండి రక్షించువాఁడు జ్యేష్ఠ పుత్రుఁడే. అంతటితో భార్యాసంగమ సుఖము చాలింపవచ్చునుగాని యొకకొడుకు కొడుకుగాఁడను న్యాయమనుసరించి యతఁడు చచ్చిన నీళ్ళువిడుచువారే యుండరే యను నభిప్రాయముతో నుతికొందఱు గుణవంతులు వేదాధ్యయనము చేసినవారు కొడుకులుగలుగఁ గోరవచ్చును, ఏల? వారిలో నొకఁడైన గయకుఁబోయి పిండము వేయువాఁ డుండఁడాయను నాశచేత. అంతయేగాని కామతృప్తికై కాదు. "ఏకాభార్యాత్రయః పుత్రా" యని యుండుటచే నొకభార్య ముగ్గురు కొడుకులుండువాఁడు ధన్యుఁడు. అంతకెక్కువమంది బిడ్డలుండుటకుఁ బాపమే కారణము. (చూ. ప. ౧౮౮౭).

దశరథునకు నలుగురు కొడుకులున్నారే యనిన మూఁడువందల యేఁబది ముప్వూరు భార్యలు గలవానికి నలుగురుకొడుకు లేమిలెక్క. నలుగురు నొకతల్లి బిడ్డలు గారుకదా! దీనివలన గయాశ్రాద్ధము విశేషఫలదమని యేర్పడుచున్నది.

శ్లో. గయా ముపేత్య యశ్శ్రాద్ధం, కరోతి పృథివీపతే
　　సఫలం తస్య తజ్జన్మ జాయతే పితృతుష్టిదమ్॥　　వి. పు.

గయకుఁ బోయి యెవఁడు శ్రాద్ధము పెట్టునో పితృదేవతలకు సంతోష మొసఁగినవాని జన్మము సార్థకము.

శ్లో. గయాశీర్షే యదాపిండం, నామ్నా యేషాం ప్రకుర్వతే
　　నరకస్థా దివం యాంతి, స్వర్గస్థా మోక్షమాప్నుయుః.
　　తత్రాక్షయ్యవటోనామ, త్రిషులోకేషు విశ్రుతః
　　పితౄణాం తత్రతైర్దత్తం, మక్షయ్యం భవతిప్రభో
　　వటవృక్షం సమాసాద్య, శాకేనా ప్యుదకేనవా
　　ఏకస్మిన్ భోజితే విప్రే, కోటిర్భవతి భోజితా.

బ్రహ్మకైవర్తము, గయయందు నెవరిపేర్లతోఁ బిండము పెట్టఁబడునో వారు నరకమందుండిరా స్వర్గమునకుఁ బోదురు. స్వర్గమందుండిరా మోక్షమునకుఁ బోదురు. అక్షయ్యవటము మూఁడులోకములఁ బ్రసిద్ధికెక్కినది. అక్కడఁ బితృదేవతల కిచ్చినది యక్షయమగును. వటవృక్షమునొద్దఁ గూరగాని నీళ్ళుగాని యొకని కిచ్చినను గోటిమంది భుజించినట్టగును.

శమీపత్రప్రమాణేన, పిండం దద్యా ద్యథావిధి
ఉద్ధరే త్సప్త గోత్రాణాం, కులమేకోత్తరం శతమ్. గయ మాహాత్మ్యము.

తే. రాజఋషు లందఱును నిట్లు౹రాజపుత్ర!
తలఁచుచుందురు గావునఁ౹దండ్రినీవు
నరకమునసుండి కావుమీ౹ధరణిజనుల,
ననుజుతోఁగూడి పాలింపు౹మరుగుపురికి. ౨౪-౨౬

తాత్పర్యము

రాజర్షులందఱు నీప్రకారము కోరుచుందురు. కావున రాజకుమారా! నీవును దండ్రివాక్యముఁచొప్పున వర్తించి తండ్రికసత్యము దోషమువలనఁ గలుగు నరక బాధనుండి రక్షింపుము. అయోధ్యకుఁబోయి రాజవుకమ్ము.

ఉ. రాజవు గమ్ము నీవు జన౹రాజికి, వన్యమృగాళి కౌదునే
రాజను, దండకాటవికి౹గ్రక్కనఁ బోయెదఁ, బొమ్ము వీటికిన్,
రాజిలుఁ గాక నీకు దిన౹రాజకరాతప మాఁప ఛత్రమున్,
భూజవిశాలశాఖ లిటఁ౹బొల్పగు నాకు సుఖప్రదంబులై. ౨౪-౨౭

జనరాజికిన్=మనుష్యసమూహమునకు, మృగపాళికిన్=మృగసమూహము నకు, వీటికిన్=పురమునకు,దినరాజకరాతపము=సూర్యునికిరణముల వేఁడిమిని, ఆఁపన్=అడ్డగించుటకు, ఛత్రము=శ్వేతచ్ఛత్రము = తెల్లగొడుగు, భూజవిశాల శాఖలు=చెట్లయొక్క వెడలుపగు కొమ్మలు,సుఖప్రదంబులై =సుఖమిచ్చునవియై.

తాత్పర్యము

కాదు కూడదు నీవు రాజవు కావలసినదే యనెదవా ? నీకోర్కి తండ్రి కోరిక నెఱవేఱు నుపాయము చెప్పెదవినుము పురములెటు తండ్రి రాజ్యమునఁ జేరినవో యడవులట్లు తండ్రి రాజ్యమునఁ జేరినవేకదా. కాఁబట్టి నీవు పురము నందుండి జనులను బాలింపుము. అడవులందుండి నేను వన్యమృగములకు రాజయ్యెదను. నారాజ్యము నేను బాలించుటకు దండకారణ్యమునకుఁ బోయె దను. నీవు పురమునకుఁ బొమ్ము. నీకీయెండవేఁడిమి తగులకుండ శ్వేతచ్ఛత్ర ముండును, ఇక్కడ నాకు వెడలుపాటి చెట్లకొమ్మలు గలవు. అవి నాకు సుఖ మిచ్చును, దీని నీవంగీకరింపుము నీకోరిక తండ్రికోరిక నెఱవేఱును.

వన్యమృగాళికనుచోఁ గర్మధారయముగఁజేసి యడవియందుఁ బుట్టినవి యగు మృగములని యర్థము చెప్పవచ్చును. 2. వన్యాళికి + మృగాళికని సుగ్రీవాది మైత్రి సూచించుచున్నది. ద్వంద్వసమాసమున నొక యర్థము చెప్ప వచ్చును. అపుడు వన్యాళి యనఁగా వనములందుండు మునుల సమూహమని యర్థము. అప్పుడు మునులకు మృగములకు ననియర్థము. ఇక్కడ నీయర్థము చెప్పినచే యరణ్యకాండ మందలి.

గీ. పాప మాచరించు పాపాత్మకుల భువ, నాహితార్థులైన యట్టి ఖలుల
సంహరించుటకును జననాథుచే నాజ్ఞ, బొంది వచ్చినాఁడఁ బొలసు దిండి.
అరణ్యకాండము ౫౫౫ ప. అనియు,
కం. మేము స్వధర్మము దప్పక, భూమింగల ధర్మహీనపురుషుల భరతా
జ్ఞామహిమను దండించెద, మేమీ దోషంబు దీననెఱుఁగంజెపుమా.
అని కిష్కింధాకాండమునందును రామచంద్రమూర్తి వాక్యములు సార్థక
పడును.
తే. తోడుపడుచుండు నీకు శ • త్రుఘ్నుఁ డచట
నిచట సౌమిత్రి నాకుఁ దా • నెలమిఁ గూర్చు
మనము నలువురు తనయుల • మనఘచరిత
తండ్రి సత్యస్థుఁ జేయఁగఁ దలఁపవయ్య. ౫౫౯౭
ఎలమిన్=సంతోషమును, సత్యస్థున్=సత్యమునందున్న వానిని.
తా త్ప ర్య ము
పురమునందు నీకు శత్రుఘ్నుఁడు సహాయుఁడుగా నుండును. ఇచ్చట
నాకు లక్ష్మణుఁడు సంతోషము గలిగించుచుండును. ఈవిధముగ మనము
నలుగురము తండ్రిని సత్యముదప్పనివానిని జేయుదము.

—• ౧౦౮-వ స. జాబాలి శ్రీరామునితో నాస్తికవాక్యంబులు చెప్పుట. •—

కం. ఈలీల భరతు హితవా,గ్జాలంబులఁ దేర్చు రాముఁ•గనుఁగొని యట భూ
మీలేఖోత్తముఁ డగుజా, బాలి యధర్మోక్తులిట్లు•పలికె హితేచ్ఛన్. ౫౫౯౮
ఈలీలన్=ఈవిధముగా, హితవాగ్జాలంబులన్=హితములైన మాటలసమూ
హములతో, తేర్చు=సమాధానపఱుచు, భూమీలేఖోత్తముఁడు=బ్రాహ్మణశ్రేష్ఠుఁడు,
అధర్మోక్తులు=ధర్మవిరుద్ధములగు మాటలు, హితేచ్ఛన్=మేలుకలిగించు కోరికతో.
తా త్ప ర్య ము
ఈవిధముగ హితములయిన మాటలచే భరతుని సమాధానపఱుచుచున్న
శ్రీరామచంద్రమూర్తినిఁజూచి బ్రాహ్మణోత్తముఁడగు జాబాలి రామచంద్ర
మూర్తికి నేవిధముగనైన మేలుచేయవలయునను తలంపుతోఁ గతినపథ్య
ముండలేని బిడ్డలకు కేవల వాత్సల్యమున బుద్ధిలేనితల్లి యపథ్య వస్తువునిచ్చు
నట్టు లధర్మోక్తులను జెప్పెను.
దీనివలన జాబాలి వాక్యములు ధర్మశాస్త్ర విరుద్ధములైనను నాయన
యుద్దేశము చెడ్డదిగాదనియు నెటులైన శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషిక్తుఁడై
సుఖపడఁ జేయవలయుననియే యనియు నేర్పడుచున్నది. కాని మార్గము సరి
యైనదికాదు.
చం. అరయఁగ సర్వముం దెలిసి • నట్టి మహామతి వీవు నీకుఁ బా
మరునకు యుక్తమైనమతి • మాంద్య మదెట్టులు కల్గె? నేల యీ

కరమునిరర్థకంపుమతి • గ్రక్కున నేగు మయోధ్య కింక నీ
భరతుఁడు గోరినట్టు జన • పాలనశీలివి గమ్ము రాఘవా! ౨౪౩౦

అరయఁగన్=విచారింపఁగా, మహామతివి = గొప్ప మనస్సుగలవాఁడవు, పామరునకున్=జ్ఞానము లేనివానికి, యుక్తము = తగినది, మతిమాంద్యము = మొద్దుబుద్ధి, కరము=మిక్కిలి, నిరర్థకంపుమతి, వ్యర్థమైన మనస్సు, జనపాలన శీలివి=ప్రజల రక్షించు శీలముగలవాఁడవు.

తా త్ప ర్య ము

సర్వము దెలిసిన గొప్పమనస్సు గలవాఁడవు, నీకుఁ బామరున కుండఁదగిన మతిమాంద్య మెటులుగలిగెను. ఏల? యీ ప్రయోజనములేని బుద్ధి విడిచి వేగమే యయోధ్యకుఁబోయి భరతుఁడు చెప్పినట్లు ప్రజాపాలనమొనరింపుము.

ఉ. ఎక్కడితండ్రి? మానవున • కెక్కడిబంధువు? లేటిమాట, దా
నొక్కనిచేఁ గనం దగుప్ర • యోజన మెయ్యది ? పుట్టువేళఁ దా
నొక్కఁడ పుట్టుఁ, జచ్చునెడ • నొక్కడ చచ్చును, వెంట వచ్చునే
యొక్కఁడునైన? నెట్లగుదు • రో తనవారలు కన్నవారలున్? ౨౪౩౧

తా త్ప ర్య ము

తండ్రి తండ్రి యని పలుమాఱనెదవే. మనుష్యునకుఁ దండ్రియనువాఁ డెవ్వఁడు? బంధువులనువారెవ్వరు? ఇదియేమి యనాలోచిత ప్రసంగము. ఒకని వలన మఱియొకనికిఁ గాఁగల కార్యమేమున్నది ? ఒకఁడు మఱియొకనికి నేమి చేయఁగలఁడు. ముదిమిరాకుండఁ గాపాడఁగలఁడా? చావురాకుండఁ గాపాడఁ గలఁడా? పుట్టినప్పుడు తానొక్కఁడే పుట్టెను; చచ్చునపు డొక్కఁడే చచ్చును. అప్పుడీ తండ్రులలో బంధువులలో నొకఁడైన వెంటవచ్చునా? అట్లు రానప్పుడు, వీరు కన్నవారెట్లయిరి? బంధువు లెట్లయిరి?

ఉ. ఎక్కడితల్లి తండ్రి? మతి • హీనతవో యటు లంట, లేఁడు చూ
యొక్కని కొక్కఁ డెందుఁ,బెఱ • యూరికిఁ బోవుచు బాట నిల్చి తా
నొక్కఁడ వేగినంత మఱి • యొండు కడం జనుపాంథునట్లు దాఁ
దక్కుచుఁ దల్లిదండ్రిధన • ధారలఁ బోవును జీవి రాఘవా! ౨౪౩౨

మతిహీనత=బుద్ధిలేనితనము, పో=నిశ్చయము, వేగినంతన్=ఉదయము కాఁగానే, పాంథునట్లు=బాటసారివలె.

తా త్ప ర్య ము.

ఎక్కడితల్లి? ఎక్కడి తండ్రి, ఒకనిని దండ్రియని యొకతెను దల్లియని యనుటయే బుద్ధిలేనితనమును సూచించును. ఒక ప్రాణికి మఱియొక ప్రాణికి సంబంధములేదు. ఒక బాటసారి దూరపు గ్రామమునకుఁ బోవుచు నొకచోట రాత్రికి నిలిచి యుదయముకాఁగానే తోడిబాటసారులను వదలి లేచిపోవునట్లు

తాను దల్లిని దండ్రిని వదలి జీవి రామచంద్రా! పోవుచుండును. ఇట్లుండ నౌకరికొకరు మేలుచేయుట యన నెట్టిది.

కం. ఆవాసమాత్ర మియ్యవి, కావున వీనికిని బుధుఁడు♦కాంక్షయుఁ గనునే?
భూవరతనయా! ని న్నే,లా విపరీతంపుబుద్ధి ♦ యావేశించెన్? ౨౪౩౩

అవాసమాత్రము=తత్కాలమున వసింప నుపయోగపడు సత్రములు, చలువపందిళ్ళు లోనైనవి, బుధుఁడు=జ్ఞానముగలవాఁడు, కాంక్షయున్ = కోరిక కూడ, అవేశించెన్=చొరఁబడెను.

తాత్పర్యము

రామచంద్రా! యీతల్లిదండ్రుల దేహములు సత్రములు, చలువపందిళ్ళ వంటివి. తత్కాలమునకు నిలువ నుపయోగించునవి. కావున వీనికై వివేకము గలవాఁడు కోరికసేయఁడు. ఇట్టి విపరీతబుద్ధి నీకెక్కడనుండి వచ్చెను? బుద్ధి మంతుఁడవైన నీయం దిది పుట్టునదికాదే;

చం. జనకునిరాజ్యము న్విడిచి ♦ సంకటకారణకంటకావృతం
బును విషమంబు నైనచెడు♦పోకలఁ బోవఁగ నేల? సర్వభో
గనిచయపూర్ణ మౌపురికి ♦ గ్రక్కనఁ బొ మ్మభిషేకసద్విధిన్
గొని సుఖియింపు స్వేచ్ఛ; బు రి♦కూరిమివేచెడినొంటివేణితోన్. ౨౪౩౪

జనకుని=నీయభిప్రాయ ప్రకారము నీవు తండ్రి యనుకొని వాని "పర ప్రతీత్యా పరోబోధనీయ" యను న్యాయము ననుసరించి యిట్లు చెప్పఁబడెను. అనఁగా నెవనికేది తెలిసియున్నదో యెట్లుచెప్పిన నెవనికి సంతోషమో యాయభి ప్రాయ ప్రకారము బోధింపవలెనని యర్థము. కావున జనకునిరాజ్య మను చున్నాఁడు. మృతుఁడైన జనకునకు రాజ్యమెక్కడిదని జాబాలి భావము. సంకటకారణ=కష్టములకుఁ గారణమై, కంటకావృతంబు=ముండ్లచే నావరింపఁ బడినది, విషమంబు=యౌవనవంతుల కనుచితమైనది, చెడుపోకలన్ = తప్పు త్రోవల, సర్వభోగనిచయ=సమస్త భోగ్యపదార్థ సమూహములతో, పూర్ణము= నిండిన, ఒంటివేణి=ఒకటిగాఁ బెనసికొనిపోయిన జడ, దువ్వుట లోనగు సంస్కా రములేక యున్నదని భావము.

తాత్పర్యము

రామచంద్రా! చచ్చినవానికి రాజ్యమెక్కడిది? నీవు జనకుని రాజ్యమను టచే నీయభిప్రాయము ప్రకారము చెప్పుచున్నాను. అటువంటి నీ తండ్రి రాజ్య మునువదలి కష్టకారణమైన ముండ్లచే నావరింపఁబడినదియు భోగానుభవ యోగ్యమైన యౌవనమందుండువారికిఁ దగనిదియునగు చెడుమార్గమున నేల చెడెదవు. సుఖకారణమై భోగ్యవస్తువులతో నిండినదైన నగరమునకుఁబొమ్ము. నీయిష్టప్రకారము సుఖమనుభవింపుము. వ్రతదీక్ష వహించి శిరస్సునకు దువ్వుట

జడవేసికొనుట లోనగు సంస్కారములులేక యొకటిగఁ బెనవేసికొనిపోయిన జడతో నగరి నీరాక కెదురుచూచుచున్నది. (నగరి యనుటచే లక్షణావృత్తిచేఁ బురమున స్త్రీలందఱు తలంట్లు నలుగులు జడలు శృంగారములులేక దుఃఖపూరితలై యున్నారని భావము.) పట్టనమేపోవు రామభద్రునివెంటన్, అనునప్పుడీ లక్షణావృత్తిచేతనే పట్టనజనులని యర్థము గ్రహింపవలెను.

ఉన్నమాటల కున్నట్టు లర్థముచెప్పిన నెచ్చట నర్థముకుదురదో యచ్చట లక్షణావృత్తి చెప్పవలెను. నగరి యేడ్చెననిన నచేతనపదార్థ మెట్టులేడువఁగలదు. అది సరియగు నర్థముగాదు. కావున నగరిలోనుండు స్త్రీలని చెప్పవలసివచ్చెను. స్త్రీలు నగరిలో నుండువారే కావున అజహల్లక్షణ యనిపేరు. గంగయందు గొల్లపల్లె యున్నదన్నప్పుడు నడియేటఁ బల్లెలుండవు. కావున గంగయొడ్డున గొల్లపల్లె యని యర్థము గ్రహింపవలయును. ఇచ్చటఁ బల్లె గంగను విడిచియున్నది గావున జహల్లక్షణ యనిపేరు. దీనిలో నింకను భేదములుగలవు.

ఆ. తండ్రి యెవఁడు నీకుఁ•దండ్రికి నీ వెవ్వఁ? డతఁడు వేఱు వేఱ•యధిప! నీవు
దీని నీ వెఱింగి•మానుగ మే మెల్లఁ, జెప్పినట్లు చేయుఁ•జెల్లు నీకు. ౪౩౫

తాత్పర్యము.

తండ్రియెవఁడు? నీవెవ్వఁడవు? తండ్రికి నీకు నేమిసంబంధము? అతఁడు వేఱు నీవు వేఱు. దీనిని దెలిసికొని మేముచెప్పినట్లు చేయుము.

కం. జనకుండు బీజమాత్రము, జననీజఠరమున శుక్ల•సంయుతరక్తం
బున నగుఁ బిండముదానన్, జనియించును బ్రాణిదీన•సందియ మున్నె.

బీజమాత్రము=బీజమునుంచువాఁడుమాత్రమే, జఠరమునన్=గర్భమునందు, శుక్లసంయుత రక్తంబునన్=రేతస్సుతోఁగూడిన రక్తముచే.

తాత్పర్యము

పురుషుఁ డొకస్త్రీగర్భమందు బీజమువేయఁగా నది స్త్రీరక్తముతోఁ గలిసి పిండమై యది ప్రాణముగలదై జనించుచున్నది. తండ్రియొక యల్పసహాయము మాత్రమే. ఆమాత్రమునకేల తండ్రి తండ్రియని యేడ్చెదవు. ముఖ్యసహాయము శుక్లరక్తములు.

ఉ. ఎచ్చటి కేగఁగా వలె మ•హీశ్వరుఁ డచ్చటి కేగె, నిద్దియే
నిచ్చలు మర్త్యకోటులకు• నిశ్చితవృత్తము దీనిఁ జూడ కే
పిచ్చితనంబునన్ వృథగఁ•బెక్కువిధంబులఁ బల్కె దీవు, నీ
వెచ్చటఁ దండ్రి యెచ్చట? ని•దేమిటి ప్రాజ్ఞులు విన్న నవ్వరే? ౪౩౬

ఎచ్చటికేగఁగావలెన్=ఎచ్చటికిఁ బోవలయునో, మహీశ్వరుఁడు = రాజు, నిచ్చలు=ఎల్లప్పుడు, రూ. నిచ్చ. ఇది నిత్యశబ్దభవము. మర్త్యకోటులకున్ =

మనుష్య సమూహమునకు, నిశ్చితవృత్తము = నిశ్చయింపఁబడిన వర్తనము, చూడక=ఆలోచింపక.

తాత్పర్యము

రాజెక్కడికిఁ బోవలయునో యచ్చటికే పోయినాఁడు. నాలుగు భూతముల సంయోగము దేహము, మరణించినపుడవి మరల నాలిగిటిలోఁ గలిసెను. సర్వకాలములందు మనుష్యకోటులకు నిదియే వర్తనము. పుట్టినవాఁ డెన్నిదినములకైనఁ జావవలసినదే నిశ్చయము. ఇది యాలోచింపక పిచ్చివానివలె వ్యర్థముగ నేమేమో పలికెదవు. నీవెక్కడ? తండ్రియెక్కడ ? ఇరువుర కేమి సంబంధము. ఇది విన్న బుద్ధిమంతులు నవ్వరా!

వలెన్ అనునది యపప్రయోగమని కొందఱ యభిప్రాయము. కూచిమంచి తిమ్మకవిగారి రుక్మిణీ పరిణయము 2-వ అశ్వాసంబున, కం॥ లలనావర సురుచిరలీ। లలనాన్నృపుఁ డెత్తువేయులాగులఁదెలుపన్। వలెనా మదిఁదలఁపఁగ నీ। వలె నాకిఁక నాప్తులైనవారుంగలరే॥ అశ్వమేధపర్వము, 1-ఆ. సుస్థిరుండవు గావలె సుజనవర్య. నాచన సోముని హరివంశము. 5-ఆ. 20-ప కావలె నన్నచోట నయకారణ భంగమనంగఁ బొంగుచున్ అని ప్రయోగములు గలవు.

కం. ధర్మార్థంబులకొఱకై, కర్మంబులఁ జేయువారి • గాసికి వగతున్
గర్మరుఁ డిందును నందు న,శర్మంబున వగచు; మేలు•సౌఖ్యమెకోరన్.

ధర్మార్థంబులకొఱకై =ధర్మము నిమిత్తము, అర్థమునిమిత్తము, గాసికి= శ్రమమునకు, కర్మఠుఁడు=కర్మము చేయువాఁడు, అశర్మంబునన్=సుఖములేక.

తాత్పర్యము

ధర్మము సంపాదింపవలయునని, ధనము సంపాదింపవలయునని శ్రమపడువారికై నేను దుఃఖించెదను. సుఖముగోరువారికై నేను దుఃఖింపను. ఏలనఁ గర్మమందే యాసక్తిగలవానికి దానితోనే వానియాయువు సరిపోవును. వాఁడు సుఖపడు టెపుడు? మరణించినతరువాత నందమా! యేమున్నది? సుఖించు దేహము మట్టిలోఁ గలిసిన సుఖమెవ్వరికి ?

కం. అష్టక యని యాబ్దిక మని, కష్టము పడిచేయువారు • కర్మముఁ,గంటే
అష్టార్జితాన్ననష్టము, శిష్టవినుత! యన్నమున్ భు•జించునె మృతుఁడున్!

అష్టక=అష్టకయను పేరుగల శ్రాద్ధము, అబ్దికము = సంవత్సర సంవత్సరము మరణించినవారి నుద్దేశించిచేయు శ్రాద్ధము, ఏఁడుది, కష్టార్జితాన్ననష్టము=కష్టపడి సంపాదించిన యన్నమునకుఁ గలిగెడు నాశము, మృతుఁడున్ = చచ్చినవాఁడు.

తాత్పర్యము.

ఈదిన మష్టకశ్రాద్ధమని, యీదిన మాబ్దికమని కష్టపడి వైదిక కర్మములు చేయుచున్నారు. కష్టపడి యొకఁడు సంపాదించినది తేరకు నలువురు తినిపోవుట

వలనఁ గలిగెడునష్టి యాలోచించితివా? ఏల నష్టియందువా ? చచ్చినవాఁ డన్నము తినునా ?

అష్టకలనఁబడునవి ఆగ్రహాయణికావల మూఁడు కృష్ణాష్టముల యందుఁ జేయఁబడు శ్రాద్ధములకుఁ బేరు.

ఉ. ఒక్కఁడు కూడు దిన్న మఱి♦యొక్కనిపొట్టయు నిండు నంట హా !
యెక్కడి మాట య ట్లయిన♦ నింటను శ్రాద్ధముఁ బెట్టి రేనియున్
మక్కువబాటసారికిని♦ మార్గమునం దుదరంబు నిండునే?
టక్కులుగాక నిక్క మను♦టల్ మతిమంతులు విశ్వసింతురే? ౨౪౪౦

తా త్ప ర్య ము

చచ్చినవాని పేరుచెప్పికదా యితరులు దినుచున్నారు. దీనివలన లాభ మేమి? బ్రదికియుండినవారు కూడుదినినఁ జచ్చినవారికడుపు లెట్లునిండును ? ఒకఁడు కూడుదినిన మఱియొకని కడుపు నిండునందురే యిదియేటిమాట. అది నిజమగునేని ప్రయాణముపోయినవాని నుద్దేశించి యింట శ్రాద్ధము పెట్టితి మేని బాటసారి కడుపు నిండునా ? ఇవన్నియు మోసపుమాటలేకాని నిజములుగావు. బుద్ధిగలవా రిదివిన్న నమ్ముదురా ?

ఉ. చేయుము యాగముల్, దపము♦ సేయుము, దీక్ష వహింపు, దానముం
జేయు, మటంచు గ్రంథములఁ♦ జెప్పిరి యన్యధనాపహారులై
ధీయుతు, లప్పి నమ్ము నెసు♦ధీమణి, కానఁ బరంబు లేమి నీ
వీయెడ లబ్ధభోగముల♦ నేల త్యజించెదు ధీరసత్తమా. ౨౪౪౧

అన్యధనాపహారులై=ఇతరుల ధనమపహరించు కోరికగలవారై, ధీయుతుల్ =బుద్ధిగలవారు, సుధీమణీ=బుద్ధిమంతులలో శ్రేష్ఠుఁడు, పరము=పరలోకము; అందు ననుభవము, లేమిన్=లేకుండుటచే, లబ్ధభోగములన్=చేతికిప్రాప్తించిన సుఖానుభవములను, త్యజించెదు=వదలెదవు, ధీరసత్తమా =పండితశ్రేష్ఠుఁడా, ధైర్యముగలవారిలో శ్రేష్ఠుఁడా, ధైర్యము పితృవచన పరిపాలనమందని గ్రహింపవలయును.

తే. ధరణి బ్రత్యక్షముగుదాని♦దలఁగఁద్రోసి,
కాని పరోక్షంబునమ్ము నే♦చెనఁటియైన ?
భువనజనసమ్మతంబు నా♦బుద్ధి వినుము,
కట్టుకొన వయ్య పట్టంబుఁ♦గరుణమీఱ. ౨౪౪౨

ప్రత్యక్షము = ఇంద్రియములకు గోచరించునది, రాజ్యభోగము, పరోక్షంబు=ఇంద్రియములకుఁ గానరానిది, స్వర్గలోకము, చెనఁటి=బుద్ధిలేనివాఁడు, భువనజనసమ్మతంబు=లోకములోని జనులందఱు సమ్మతించినది.

తా త్ప ర్య ము

ముబ్బులోని నీరునమ్మి చెఱువునీరు దెగఁగొట్టువాఁడు కలఁడా? చచ్చిన పిమ్మట నేదో సుఖముకలుగునని ప్రత్యక్షముగాఁ గరగతమైన రాజ్య సుఖాను

భవమును బోఁగొట్టుకొను బుద్ధిలేనివాఁ డుండునా? కావున లోకముసమ్మతించు నాయాలోచన వినుము. మాయందు దయయుంచి పట్టాభిషేకము చేసికొమ్ము.

చార్వాక మతము.

ఈ చార్వాకమతస్థుల వాదవాక్యములు కొన్ని యుదాహరించుచున్నాను.

శ్లో. న స్వర్గో నాపవర్గో వా, నైవాత్మా పారలౌకికః
నైవ వర్ణాశ్రమాదీనాం, క్రియాశ్చ ఫల దాయికాః
అగ్నిహోత్రం త్రయోవేదా, స్త్రిదండం భస్మగుంఠనమ్
బుద్ధిపౌరుష హీనానాం, జీవికా ధాతృనిర్మితా
యావజ్జీవే త్సుఖం జీవే, దృణం కృత్వా ఘృతం పిబేత్
భస్మీ భూతస్య దేహస్య, పునరాగమనం కుతః
అంగనాలింగ నాజ్జన్య, సుఖమేవ పుమర్థతా
కంటకాది వ్యథాజన్యం, దుఃఖం నిరయఉచ్యతే
లోకసిద్ధో భవేద్రాజా, పరేశో నాపరః స్మృతః
దేహస్యనాశో ముక్తిస్తు, నజ్ఞానా న్ముక్తిరిష్యతే
దేహః స్థౌల్యాది యోగాచ్చ, స ఏవాత్మా నచాపరః
మమదేహోయ మిత్యుక్తిః. సంభవే దౌపచారికీ.

అర్థము. స్వర్గములేదు- మోక్షము లేదు- ఆత్మయు లేదు- పరలోకము లేదు- వర్ణాశ్రమములు లేవు- ఫలమునిచ్చు క్రియలులేవు. అగ్నిహోత్రములు- మూఁడు వేదములు- సన్న్యాసము- భస్మధారణము ఇవి బుద్ధి పౌరుషములు లేనివారికి జీవనోపాయములుగా ధాత సృజించెను. జీవించియుండునంతపఱకు సుఖముగ జీవింపవలయును. అప్పైనఁదీసి నెయ్యి త్రాగవలెను. బూడిదై పోయిన దేహము మరలవచ్చుట యెక్కడిది? స్త్రీలను గౌఁగిలించుకొనుటవలనఁ గలుగుసుఖమే పురుషార్థము. ముండ్లు మొదలైనవి గ్రుచ్చుకొనుటవలనఁ గలుగుబాధయే నరకము. ప్రత్యక్షముగఁ గానవచ్చు లోకప్రసిద్ధుఁడేరాజు- వాని కంటెఁ బరుఁడైన యీశ్వరుఁడు లేఁడు. దేహనాశమే ముక్తి. జ్ఞానమువలన ముక్తిలేదు. బలియుట కృశించుటగల దేహమే యాత్మ ఆత్మయనునది వేఱు లేదు. నాదేహమనుట యౌపచారికముగాని సత్యముకాదు. అటైన జీవించి యుండు శరీరమునకు మృతకళేబరమునకు భేదము కానవచ్చుచున్నదే యేమి కారణ మనిన వారిట్లు సమాధానము చెప్పుదురు.

శ్లో. అత్ర చత్వారి భూతాని, భూమివార్య నలానిలః
చతుర్భ్యః ఖలు భూతేభ్య, శ్చైతన్య ముపపద్యతే
కిణ్వాదిభ్యః సమేతేభ్యో, ద్రవ్యేభ్యో మదశక్తివత్.

ఈ చార్వాక మతప్రకారము భూమి- జలము- అగ్ని- గాలి యనునవి నాలుగుమాత్రమే భూతములు. ఈ నాలుగింటి కూడికవలనఁ జైతన్య ముత్పత్తి

యగుచున్నది. ఎట్లనఁగా కొన్ని కిణ్వాది పదార్థముల కూడికచే మదము కలిగించు గుణ ముత్పత్తి యగుచున్నదిగదా అట్టులే చైతన్య ముత్పత్తియగు నందురు.

ఇట్లుపమానముచేఁ దమవాదమును జార్వాకులు స్థాపింపఁ జూచెదరు. ఇట్లు చేయుట స్వమత విరుద్ధమే. ఎట్లన: నుపమానము అనుమానప్రమాణమున నంతర్గతము. అది యట్లున్నది గాన నిది యిట్లని యూహ యనుమానమెకదా. కావునఁ బ్రత్యక్షప్రమాణవాదు లనుమానమును గ్రహింపరాదు.

ఉపమానములు సర్వత్ర సరియైన ప్రమాణములు కాఁజాలవు. మనుష్యునకు రెండుకాళ్ళున్నవి- కోడికి రెండుకాళ్ళున్నవి. కోడి మనుష్యుఁడే యన వచ్చునా? నాలుగు భూతముల సంయోగము చేతనే చైతన్య మేర్పడునేని పీనుగుఁ ముడ్డిలోఁ గాలిమిత్తి పెట్టి వేఁడిగాలియూఁదిన నది జీవించునా? ఇట్లు చేయుటచేఁ బీనుఁగునందు నాలుగు భూతము లుండునుగదా. ఏల జీవింపదు.

కార్యముచేయునది దేహము. అట్టిదేహము మరణానంతరము కాలిపోఁగాఁ బాపము దేనిని గఱచుకొనియుండును? కావున నేపాపముచేసినను భయము లేదు. పాపమనునది లోకులను బెదరించి పొట్టపోసికొనుటకై బ్రాహ్మణులు కల్పించిన మిథ్య కావున నిట్టిభయము విడిచి యథేచ్ఛముగా భోగించి సుఖించుటే పురుషార్థము. శుష్కవేదాంతులు- కూటసన్న్యాసులు- మాయాయోగులు- పంచక పరమహంసలు- దొంగస్వాములు- శిష్యులకు శిష్యురాండ్రకు నుతము లనుపేరుగల పిటీపిట సంకేతస్థలములందు రహస్యముగఁజేయుబోధ యిదియే. ఈ మతప్రవర్తకుఁడు బృహస్పతి శిష్యుఁడైన చార్వాకుఁడు. చార్వాకుఁడనఁగా చారు=రమణీయమైన, వాక్ = వాక్కుగలవాఁడు రమణీయమనఁగా వెనుక దుఃఖము గలిగించునది యైనను వినువారి మనస్సును రంజింపఁజేయును గావున రమణీయము. ఈ మతమునకు లోకాయత మనియుఁ బేరుగలదు. ఇందుఁ జేరినవారు లోకాయతికులు. లోక, ఆయతము- లోకమున స్వభావముగ వ్యాపించియుండునది. ఉపదేశము లేకయే లోకులీమతము ననుసరింతురు. గావున నిది దురుచ్ఛేదము. (ఛేదింపఁ గష్టమైనది. ఈ మతమువారికి అర్థకామములే పరమ పురుషార్థములు. అనఁగా ధనము సంపాదించుట స్త్రీలతో భోగించుట ఇవి జన్మమెత్తి సాధింపవలసిన కార్యములు. ఇది దుఃఖకారణమగునుగదా యనిన దుఃఖమిశ్రమము లేనికార్యము లోకమున లేదు. వడ్లు పొట్టూమనట్లు దంపక బియ్యము వచ్చుచున్నదా? దేహకష్టములేని తపస్సున్నదా: అట్లని వానిని మానినారా? అట్టులే యిదియును.

ఈ మతము నభిమానించువా రెవ్వరనిన: విపరీత వేదాంతులు- దొంగ మట్టుల మాయలాఁడులు- మగనిబాసిన మగువలు- పతి జీవించియుండ దీర్ఘకాలము పుట్టినింటనుండు తరుణులు- ముదుసళ్ళ వివాహమాడిన యువతులు- విపరీతనిష్ఠగల మిటారులు- పురుషులగోష్ఠిఁ దిరిగెడి కాంతలు- జారపురుషుల

భార్యలు- వయస్సునందు సపత్నీకులు- వివాహముకాని రజస్వలలు- సొగసులు మరగిన విధవలు- మాఱుమనుసుల మానినులు మొదలయినవారియందుఁ గామదాసులు కామదాసికలు.

తాయి యనఁగాఁ దల్లి- గండ యనఁగా మగఁడు. మీఁదఁ జెప్పిన మతములవారి కందఱకుఁ దల్లిని విషయించుట సమానధర్మము. కావున నందఱి కన్వయించునట్లు తాయిగండమతమని నామకరణము చేయఁబడెను.

వీరి యభిప్రాయము బలాత్కారముగ నొకస్త్రీని జెఱిచినను బరుల దోఁచినను ఇంతయేల బలాత్కారముగ దేనిని జేసినను జేయనివారె యగుదురు. ఏలన?

"సర్వాన్ బలాన్ కృతా నర్థా, నకృతా న్మను రబ్రవీత్" బలాత్కార కృత్యములనెల్ల నకృతములుగా విధించినాఁ డల్లమనువు" శ్లం.౧౨" బలవంతముగా నేమిచేసినను నదిచేయనివాఁడే యని మనువుచెప్పెనుగదా యని వీరివాదము. కావునఁబరస్త్రీలను బలవంతముగఁజెఱిచినను నది చేయనట్లే కావున దోషములేదు.

కేవలప్రత్యక్షమును బ్రమాణముగా గ్రహింపరాదని సాంఖ్యదర్శనమే నిరాకరించినది. ఏలన :-

అతిదూరా త్సమీపా దింద్రియఘాతా మనోనవస్థానాత్
సౌక్ష్మ్యా దవ్యవధానా దభిభవా త్సమానాభిహారాచ్చ. సాంఖ్యకారిక.

ఈ దోషములచేఁ బ్రత్యక్షము బాధితమగుచున్నది. అతిదూరము-ఆకాశమున నతిదూరమునఁ బాఱెడి పక్షి కన్నులకు గోచరింపదు. ఆకారణమున నాకాశమునఁ బక్షిలేదనవచ్చునా? ఆకాశమున మన రిత్తకన్నులకేగాక యంత్రములకును గోచరింపని నక్షత్రము లెన్నియోకలవు. అవన్నియు నసత్యములా? అతిసమీపము=మిక్కిలి సమీపమందుండు వస్తువు కానరాదు. కన్నులందలి కాటుక కానరాదుగదా! ఆకారణమున నది కల్ల యనవచ్చునా?

ఇంద్రియఘాతము కంటికిఁ గామలా-పసిరికలు-పొరలు లోనగువ్యాధులు చెవుడు మొదలయిన రోగములు వచ్చినను నున్నదున్నట్టు తెలియరాదు. "పైత్యదోషోదయంబునఁ బరుసనైన జిహ్వకకుఁ బంచదారయుఁ జేఁదుగాదె" యన్నట్లు జ్వరాదులచే బాధకలిగినపుడు తీపుకూడఁ జేఁదగును. పాము కఱచిన వానికి వేపాకు దియ్యగా నుండును.

మనోనవస్థ=మనస్సు స్వస్థదశయందు లేనప్పుడు సమీపమం దుండున దియే కానరాదు. మనసేకాగ్రముగ నొకవిషయమున నుండునపుడు కన్నులఁ జూచినను గానరాదు. వీనుల ధ్వనిపడినను వినరాదు. ఎవరైనఁ దాఁకినను దెలియరాదు. సన్నిపాతాదులందు నున్మాద దశయందుఁ గన్నులు లోనైనవి చక్కఁగ నుండినను వ్యర్థములేకదా. 'కామాంధోపి నపశ్యతి'యని కలదుగదా.

సౌక్ష్మ్యము=అతిసూక్ష్మములైనవియుఁ గానరావు, జలములందు- గాలి యందు మనకుఁ గానరాని తెలియరాని సూక్ష్మజంతువు లెన్నియో కలవుగదా! అత్యల్ప పరమాణువులు గానరావు.

వ్యవధానము=వ్యవధానమనఁగా మఱుఁగు-చాటు-గోడచాటు మనుష్యుఁడు గానరాఁడుకదా.

అభిభవము=అభిభవమనఁగా దిరస్కారము-లోకువ;సూర్యకాంతికిలోపడిన వగుటచేఁగదా పగలు చుక్కలు గానరాకున్నవి. ఆమాత్రమునఁ బగలుచుక్కలు లేవనవచ్చునా?

సమానాభిహారము=సమానదశ ప్రాప్తించినపుడును బదార్థము తెలియ రాదు. సముద్రమునఁబడిన వర్షబిందువు తెలియవచ్చునా? నల్లనివస్త్రమందు వ్రాయుమసిపడినఁ దెలియఁగలదా? ఆకారణముచే నది లేదనవచ్చునా? పాల యందుఁ బెరుఁగునందు వెన్నలేదా? కానరాదు. కావున లేదనవచ్చునా? కట్టెల యందు నగ్ని కానరాదు. ఆకారణమున లేదనవచ్చునా?

ఇవియునుగాక యొకనికిఁ గానవచ్చినది మఱియొకనికిఁ గానరాకపోవ చ్చును. ఒకనికి వినవచ్చినది మఱియొకనికి వినరాకపోవచ్చును. ఈయిరువురిలో నెవరివాక్యము ప్రమాణము? చార్వాకుఁ డుత్తరహిందూస్థానమున హిమవత్ప ర్వత మున్నదనిన నమ్మఁడు. రామేశ్వరమునొద్ద సముద్రమున్న దనిన నమ్మఁడు- తనముత్తాత యున్నాఁడనిన నమ్మఁడు. ఏల తనకుఁ గానరాలేదు కావున-ఇట్టిది చార్వాకమతము కావుననే యామతమువారి నందఱు ఛీకొట్టు చుందురు.

శ్లో॥ చార్వాక! తవ చార్వంగీ జారతో వీక్ష్యగర్భిణీమ్
ప్రత్యక్షమాత్రవిశ్వాస ఘనశ్వాసం విముంచసి.

పుట్టినింటికిఁబోయి ముట్టుస్నానముచేసి తనభార్య గర్భిణియై మరల వచ్చెను. దానినిజూచి దానిమగఁడు చార్వాకుఁడు విచారపడుచు నిట్టూర్పువిడుచు చుండెను.వానిని జూచి మఱియొకఁడు "చార్వాకుఁడా! నీవు ప్రత్యక్ష ప్రమాణ వాదివికదా? ఏలరా జారునివలన నీభార్యకు గర్భమువచ్చెనని యూహించి నిట్టూర్పు విడిచెదవు? జారునియొద్ద నీభార్య పండుకొనుట నీవు చూడలేదుగదా! నీభార్య ఱంకుటాలని యెట్లు నమ్మెద"వని పరిహసించెను. కావునఁ బ్రత్యక్ష ప్రమాణము కానేరదు. కావునఁ జార్వాకమతము దుష్టము.

—• ౧౦౯-వ సర్గము, శ్రీరాముఁడు జాబాలిమతమును ఖండించుట •—

మ. అని జాబాలి వచింప నట్టివిని సంత్యాత్ముండు నిశ్చంచలా
త్మను బల్కెం బరభక్తి రామవిభుఁడుం బ్రహ్మా! మదర్థంబు నీ
వనునమ్మాటలు కార్యసన్నిభ మకార్యం బౌ, హితాకారమ
య్యు నపథ్యంబును, గాన వాని విన నెంట్లోర్తున్ జగద్గర్హ్యమున్. ౨౪౪౩

అట్టివిని=అడ్డముచెప్పక యేకమనస్సుతోవిని-సత్యాత్ముండు=(1)సత్యము చెప్పు స్వభావముఁగలవాఁడు- (2) సత్యమాడుటయందే సర్వదా మనస్సుగల వాఁడు- (3)సత్యమునందు ధైర్యముగలవాఁడు- (4) సత్యమైన ధర్మముగల వాఁడు- (5) సత్యమైన ధైర్యముగలవాఁడు- నిశ్చంచలాత్మను=జాబాలిమాట లచేఁజలింపనిమనస్సుతో-పరభక్తిన్=పరమునందుఁగల భక్తితో-(2)అధికమైన వైదికకర్మశ్రద్ధచే- బ్రహ్మ=బ్రాహ్మణుఁడా-నీవుపుట్టిన పుట్టుకయేమి-నీవు చెప్పెడి మాటలేమి?యనిభావము. మదర్థంబు=నాకొఱకు- కార్యసన్నిభము=చేయఁదగిన దానివలె స్థూలదృష్టికిఁ గానవచ్చునది- అకార్యము=వాస్తవమునఁ జేయరానిది- హితాకారము=మేలుగలిగించుదానివలెఁ గానవచ్చునది- అపథ్యము=ఆచరించిన పక్షమునఁ గీడుచేయునది- జగద్గర్హ్యమున్=ప్రపంచముచే నిందింపఁబడినది.

సత్యాత్ముఁడు నిశ్చంచలాత్మను=వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన భ-గీ. వాస్తవమును నిశ్చయముగాఁ దెలిసిన బుద్ధి యేకవిధముగా నుండును.

తా త్ప ర్య ము

ఈ ప్రకారము జాబాలిచెప్పఁగా వినివిని సత్యాత్ముఁడగుటచే నామాటలకు మనస్సు చలింపనీక వైదికకర్మాచరణమందుఁగల శ్రద్ధచే శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె. ఓబ్రాహ్మణుఁడా! నీవుపుట్టిన పుట్టువేమి? నీవు చెప్పెడు మాటల తీరేమి? నామేలునకై నీవుచెప్పినమాటలు చేయఁదగినవానితో సమానముగాఁ గానవచ్చుచున్నవి కాని వాస్తవమాలోచించినఁ జేయరానివై యున్నవి. రూప మున హితముగాఁ గానవచ్చుచున్నవి గాని యనుభవమునఁ గీడుచేయునవై యున్నవి. నీవు భువనసమ్మతమని చెప్పితివిగాని లోకమున నింద్యమైయున్నది. లోక సమ్మతమైన పక్షమందు లోకులందఱుప్రకార మేలచేయరు? కావున నట్టి మాటలు విననెట్లు సహింతును?

తే. భిన్నచారిత్రదర్శనుల్ • పేర్మి చెడఁగ
స్ఖలితమర్యాదులును గల్మ•షప్రవర్త
కులును నగుచును మానంబుఁ • గోలుపోయి
సభల దూషితు లగుదురు • సత్య మిదియు.   ౨౪౪౪

భిన్న=వైదిక మతాచారమునకంటె వేఱగు- చారిత్ర=నడవడినిజెప్పునట్టి- దర్శనుల్=మతముగలవారు-అనఁగా వేదబాహ్యమతములవారు-స్ఖలితమర్యాదు లును=వదలిపోయిన యెల్లకలవారు- కట్టుపాటు లేనివారు- కల్మషప్రవర్తకులు= పాపపు నడవడిగలవారు-మానంబున్=గౌరవమును-కోలుపోయి=పోఁగొట్టుకొని- దూషితులు=నిందింపఁబడినవారు-స్ఖలితమర్యాదులు=కర్మములకు ఫలములేదని వీరి యభిప్రాయముగావున నేపాపముచేసిన నేమిభయము, పుణ్యమునకుఫలము లేదు.పాపమునకు ఫలములేదు. కావునఁ బుణ్యకర్మమని పాపకర్మమని విభజనయే

వీరిమతమునలేదు. ఆకారణమునఁ గర్తవ్యాకర్తవ్యములు తెలియవలసినపని లేదు. కావున శాస్త్రములతోను పనిలేదు. పెద్దలతోను బనిలేదు. కావున జారత్వమునకుఁ జోరత్వమునకు నీమొదలయిన కర్మములను స్వేచ్ఛగాఁ జేయవచ్చును. ఈవిధమున వీరు కట్టుపాటులేనివారు కావుననే, కల్మషప్రవర్తకులు=పాపకార్యములు చేయువారు. ఇట్టివారు గావున వీరినెవ్వరు నమ్మి దగ్గఱరానీయరు. సభలయందు గౌరవము లేదు.

తా త్ప ర్య ము.

వేదోక్తమైన యాచారమునకంటె భిన్నమైన యాచారములను దెలుపు శాస్త్రముల నెఱిఁగినవారు కట్టుపాటులేక స్వేచ్ఛగాఁ జరించువారు పాపపు నడవడి గలవారు తమగొప్పతనమేను గౌరవమును బోఁగొట్టుకొని సభలయందు నిందింపఁబడుదురు. ఇది యథార్థము. నీవు వీరిలోఁ జేరినవాఁడవే.

కం. కులహీనునిఁ గులవంతునిఁ, బలువను సజ్జనుని శుచిని • బాపిని శౌర్యా
గళితునిఁ బూరుషమానిం, దెలియఁగఁ దగు వానివాని•నెఱినడవడిచేన్.

కులహీనునిన్=నీచపుఁ గులమందుఁ బుట్టినవానిని-కులవంతునిన్=ప్రశస్తకులమునఁ బుట్టినవానిని-పలువను=దుష్టుని-పలు+వా=మాటనిలుకడలేక పలువిధములుగ మాటలాడువాఁడు- సజ్జనునిన్=మంచివానిని- శుచిని=పరిశుద్ధమయిన నడవడిగలవానిని- పాపిని=పాపాత్ముని- శౌర్యాగళితున్=శౌర్యమునందుఁ దగ్గనివానిని- పూరుషమానిన్=తాను శూరుఁడుకాకయే శూరుఁడనని తలఁచువానిని- నెఱి=నీతితోఁ గూడినవానిని. తా త్ప ర్య ము

నేను గల్మషప్రవర్తుఁడని నీకెట్లు తెలియునందువా? వీఁడు నీచకులమునఁ బుట్టినవాఁడు- వీఁడు గొప్పకులమునఁ బుట్టినవాఁడు వీఁడు దుష్టుఁడు వీఁడు శిష్టుఁడు వీఁడు పాపహీనుఁడు వీఁడు పాపాత్ముఁడు వీఁడు శౌర్యవంతుఁడు వీఁడు శౌర్యహీనుఁడని వానివాని నీతిప్రవర్తనముచేఁ దెలియవచ్చును. నీమాటలఁబట్టి నీవు నియమహీనుఁడవు. కావున నీవు పాపివని తెలియవచ్చెను. శిష్టుఁడైనవాఁడు దుష్టవాక్కులు గూడ నోటరానీయఁడు. మనస్సున నుండునదే నోరవచ్చును నోట వచ్చినపుడు మనస్సున నట్టియభిప్రాయ మున్నదనియే యూహింపవలయును.

సీ. నిక్క మనార్యుఁడై •నెఱియార్యుపోలికి, శుచితాపిహీనుఁడై • శుచివిధమున
లక్షణ్యునట్టు ల•లక్షణ్యుఁడై దుష్ట,శీలుఁడయ్యును సాధు•శీలుమాడ్కి
శ్రుతిహితకార్యవ•ర్జితలోకసంకర,మగు నధర్మము ధర్మ•మనుచుఁ జెప్ప
నాయట్టివాఁడది•న్యాయ్యమంచుగ్రహింపఁ,గార్యవిచక్షణుఁ•డార్యుఁడెవఁడు
తే. లోకముల దుష్టశీలుని•లోకనింద్యు,నన్నుఁజూడఁగ నేర్చు స•న్మార్గదృష్టి?
నేని ప్రతినను గలిపి ము•న్నీట ధర్మ,
మెవని కెఱిఁగింతు?నాక మే•నెట్లుగాంతు? ౨౪౪౮

నిక్క.ము=నిజముగ- అనార్యుఁడై=అయోగ్యుఁడై- నెఱ=నిండు- ఆర్యు పోలికన్=యోగ్యునివలె- శుచితావిహీనుఁడై=శుచిత్వములేనివాఁడై- శుచివిధము నన్=శుద్ధాత్మునివలె-అలక్షణ్యుఁడై=యోగ్యుల లక్షణములు లేనివాఁడై-లక్షణ్యు నట్లు=యోగ్యతగలవానివలె- దుష్టశీలుఁడు=చెడునడవడిగలవాఁడు- సాధుశీలు మాడ్కిన్=మంచినడవడి గలవానివలె- శ్రుతి=వేదమున- హిత=విధింపఁబడిన- కార్య=వైదికకార్యములచేత- వర్జిత=విడువఁబడినదియు- లోకసంకరము=జను లందు సాంకర్యము గలిగించునదియు- న్యాయ్యము=న్యాయముతోఁగూడి నది- కార్యవిచక్షణుఁడు=చేయఁదగిన కార్యములను జేయుటయందు నేర్పరి యగువాఁడు- దుష్టశీలుని=దుష్టాచారముగలవానిని- లోకనింద్యున్=లోకులచే నిందింపఁబడువానిని-మున్నీటన్=సముద్రమునందు-మున్నీరు=సముద్రము- మూఁడు+నీళ్ళు=మున్నీరు ద్విగువు- ఏకవచనాంతము- వాననీళ్ళు-ఏళ్ళనీళ్ళు- ఊటనీళ్ళు- ఈమూఁడు నీళ్ళు గలది..

తాత్పర్యము

వాస్తవముగ యోగ్యుఁడుకాకున్నను యోగ్యునివలె, శుద్ధాచారము లేకు న్నను శుద్ధాచారము గలవానివలె, యోగ్యుల లక్షణములు లేనివాఁడయ్యు యోగ్యులవలె, దుష్టుఁడై శిష్టునివలె, వేదోక్తకార్యములు లేనిదై లోకమున సాం కర్యముగలిగించు నధర్మమును నాయట్టివాఁడు న్యాయ్యము ధర్మమునని చెప్పితినేని యదిచేయఁదగినది యిదిచేయరానిదని తెలిసి కార్యములుచేయ సమర్థుఁడైన యోగ్యుఁడు నావంటి దుష్టవర్తనుని లోకనింద్యుని సన్మార్గుఁడని యెట్లు చూఁడగలఁడు? నేను జేసిన ప్రతిజ్ఞను సముద్రములోఁగలిపి సత్యము నాశముచేసి మీరు సత్యమందుండుఁడని యెవరికి నేనేమని చెప్పుదును? అసత్యమాడి పరలోకసుఖ మెట్లుగందును? 'సత్యేన లోకాన్ జయతి' యని సత్య మునఁగదా యుత్తమలోకప్రాప్తి.

— ♦ శ్రీరాముఁడు జాబాలికి సత్యమవశ్యానుష్ఠేయం బని బోధించుట ♦ —

కం. రాజే నాస్తికుఁడైనను, భూజనతతి యిచ్చకొలఁది ♦ పోకలఁ బోదే
రా జేపోకలఁ బోయిన, భూజనసంచయము లట్టి♦పోకలఁ బోవున్. ౨౪౪

నాస్తికుఁడు=పరలోకములేదు-దైవములేదు- ఆత్మలేదనువాఁడు-భూజన సంచయము=ప్రజలసమూహము. తాత్పర్యము

యథారాజా తథాప్రజా యనున్యాయము ననుసరించి రాజు నాస్తికుఁడై దేవుఁడులేఁడు పరలోకములేదని చెప్పెనేని లోకులు వారివారి యిష్టప్రకారము దొంగతనము బంకుతనము హత్యలు లోనైనవిచేయుచు వర్తింతురుగదా! అప్పుడు ధర్మము సత్యము ననునవి నశించునుగదా! నేను జెడుటయేగాక లోకుల నందఱఁజెఱిచినవాఁడనై యీపాపముకూడ నేనేకదా యనుభవింపవలయును.

ఇచ్చట భగవద్గీతయందలి యీశ్లోకముల ననుసంధింపవలయును.

యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదే వేతరోజనః
సయత్ప్రమాణం కురుతే, లోక స్త దనువర్తతే.
యదిహ్యయం నవర్తేయం, జాతుకర్మ ణ్యతంద్రితిః
మమవర్త్మాను వర్తంతే, మనుష్యాః పార్థసర్వశః
ఉత్సీదే యురిమాన్ లోకా. న కుర్యాం కర్మచే దహమ్
సంకరస్య చ కర్తాస్యా, ముపహన్యా మిమాః ప్రజాః భ-గీ. ౩-౨౧

శ్రేష్ఠుఁ డెట్లుచేయునో వాఁడు చక్కఁగా దెలిసిచేయువాఁడను నమ్మకముతో నితరజను లట్లేచేయుదురు. వాఁడేది ప్రమాణమని చేయునో తక్కినవా రట్లులే వర్తింతురు. నేనొకసమయమందైనను గర్మముచేయకయుండిన నందఱు నా మార్గమనుసరించి కర్మములుచేయుట మానుదురు. కావున నేను గర్మముచేయని యెడల లోకము చెడును. సంకరమునకుఁ గర్త నేనై వారినందఱఁ జెఱిచిన వాఁడ నగుదును.

రాజు సత్కార్యములుచేసిన నతనిసేవకులు లోనగువారట్లు చేయరు గాని రాజొక యకార్యముచేసిన సేవకులు పదియకార్యములు చేయుదురు. రాజొక సీసా సారాయము ద్రావిన సేవకులు పదిసీసాలు త్రాగుదురు.

శ్లో॥ రాజా రాక్షసరూపేణ, వ్యాఘ్రరూపేణ మంత్రిణః
సేవకాశ్చ శ్వరూపేణ, యథారాజా తథాప్రజా,
దురాచారో హిపురుషో, లోకే భవతి నిందితః
దుఃఖభాగీచ సతతం, వ్యాధితోల్పాయు రేవచ. మను.

దురాచారము గలవాఁడు లోకనిందితుఁడగును. ఎల్లప్పుడు దుఃఖమను భవించుచు- రోగియు నల్పాయువగును.

శ్లో॥ రాజ్ఞోహి పూజితో ధర్మ స్తత స్సర్వత్ర పూజ్యతే
యద్యదాచరతోరాజా తత్ప్రజాభ్యశ్చ రోచతే.

కం. సత్యదయారూపక మయి, నిత్యంబుగ రాజవృత్తి • నెగడును గాసన్
సత్యాత్మక మీరాజ్యము, సత్యంబే కుదురు సర్వ•జగముల కెపుడున్.

ఇంతవఱకు రాజైనవాఁడు సత్యప్రవర్తనము గలవాఁడు కాఁడేని ప్రజలు వానిమార్గమవలంబించి చెడుదురని చెప్పి యిఁక సత్యానుష్ఠాన మవశ్యక కార్యమని చెప్పుచున్నాఁడు?

రాజవృత్తి=రాజుల జీవనము, సత్యదయారూపకము=సత్యము దయ యనునవి రూపముగాఁగలవి, సత్యాత్మకము = సత్యమే యాత్మగాఁగలది, కుదురు=చలింపని యాధారము.

తాత్పర్యము

సత్యము దయ యాధారముచేసికొని రాజులు జీవింపవలయును. ఆ రెండు లేనిరాజు పెక్కుకాలము రాజుగానుండఁజాలఁడు. ఈ ప్రజలకెల్ల సత్యమే యాత్మ. వారు సత్యమును విడిచిరేని జీవుఁడువిడిచిన దేహమేయగు. కావున సర్వజగములకు సత్యమాధారము.

కం. సత్యంబె శ్రేష్ఠ మని యా,దిత్యులు మునిపుంగవులును♦దెలుతురు సతమున్
సత్యంబుఁ బలుకువాఁడే, సత్యంబుగఁ బరమపదముఁ♦జాలుం బొందన్.

ఆదిత్యులు=దేవతలు, తెలుతురు=పొగడుదురు, సతతము=ఎల్లప్పుడు.

తాత్పర్యము

అన్నిటికంటె సత్యమే శ్రేష్ఠము. దేవతలు మునులు సత్యమును సర్వదా స్తోత్రము చేయుచుందురు. వాస్తవముగ మోక్షమును గోరువాఁడు సత్యమునే పలుకవలయును.

కం. పామునకు వెఱచినట్టులు, భూమిజనం బనృతవాదిఁ♦ బొడగని వెఱచున్
శ్రీమద్ధర్మమె సత్యము, వోముని! స్వర్గమును సత్య♦మూలము సుమ్మీ.

అనృతవాదిన్=అసత్యము చెప్పువానిని, శ్రీమద్ధర్మము=సంపత్కరమగు ధర్మము.

తాత్పర్యము.

కల్లలాడువానిని జూచి జనులు పామునకు భయపడినట్లు భయపడుదురు. సత్యమే ధర్మము సంపదకలిగించును. స్వర్గప్రాప్తికి మొదటికారణము సత్యమే.

కం. సత్యమున నుండు లక్ష్మియు,
సత్యముంచును యీశ్వరుండు♦జగముల కెల్లన్
సత్యము మూలం బంతకు, సత్యంబునకంటె లేదు♦శాశ్వతపదమున్.

తాత్పర్యము [–౨౪౫౧

సత్యమే లక్ష్మీవాసస్థానము- ప్రపంచమునకంతయు సత్యమే నియంత. సత్యమునకు లోపడి జగము నడచుచున్నది. సత్యమే ప్రపంచము నిలుచుటకు మూలాధారము. మోక్షప్రాప్తికి సాధనము సత్యమును మించినది లేదు.

కం. దానంబును వేదంబును, ధ్యానము హోమంబు నిష్ఠ ♦ తప మిష్టంబున్
మానక సత్యాశ్రయములు, కాన నరుఁడు సత్యపరుఁడు♦గావలయుఁ జుమీ!

తాత్పర్యము [–౨౪౫౨

దానము, హోమము, వేదము, ధ్యానము, తపము, నిష్ఠ, యాగము ఇవన్నియు సత్యమునాశ్రయించి యుండునవి. సత్యము విడిచినవానికి నివి యేవియుఁబనిచేయవు. కాఁబట్టి నరుఁడు సత్యమే ప్రధానముగాఁ గలవాఁడు గావలయును.

కం. ఒక్కఁడు లోకం బేలెడు, నొక్కఁడు వంశంబుఁ బ్రోచు•నుండు నరకమం
దొక్కఁడు స్వర్గతుఁ డొక్కరుఁ, డిక్కరణిని భిన్నగతు ల•వేలా చెపుమా? [౨౪౫౩

తాత్పర్యము

సత్యఫలమునఁ గాకుండిన నొకఁడు లోకమునంతయుఁ బాలించును, ఒకఁడు వంశమును రక్షించును, ఒకఁడు నరకమునకుఁ బోవును, సత్యనిష్ఠగలవాఁడు లోకమేలును, సత్యానుష్ఠానముచేతనే ఫలానుభవము భిన్నము. ఇది చార్వాకమత ఖండనము.

తే. సత్యసంధుఁ డనగుచును•జగతిఁ బరఁగి,
బాస యొనరించి తప్పుట•పాడి యగునె
కాన జనకనియోగంబుఁ•గా దటంచు,
నెట్టు నన నేర్చు నయ్యునా•యట్టివాఁడు. ౨౪౫౪

సత్యసంధుఁడను=నిజమైన ప్రతిజ్ఞగలవాఁడను- బాస=ప్రతిజ్ఞ- భాషా శబ్దభవము- పాడి=న్యాయము- ఈయర్థమున నీపదమున నర్ధానుస్వారము లేదు. జనక నియోగము=తండ్రియాజ్ఞ.

తాత్పర్యము

బ్రాహ్మణుఁడా! లోకమున నింతవఱకు రామచంద్రుఁడు మాటచెప్పినా తప్పువాఁడుకాఁడు. అనుకీర్తిని సంపాదించితిని. అట్లుండఁ బ్రమాణముచేసి తప్పుట న్యాయ్యమగునా? సత్యమందిట్టి పట్టుదలగల నావంటివాఁడు తండ్రియాజ్ఞ నేవిధముగ 'నేనుజేయను' అని చెప్పఁగలఁడు?

ఆ. లోభముననొ రాజ్య•లాభంబుచేతనొ, మోహముననొ బుద్ధి•మోసముననొ
జనకు నెదుట ననిన•సత్య మన్సేతువు, నఱకఁజాల దేని•కొఱకు నైన.

లోభముననో=పిసినిగొట్టుతనముచేతనో- రాజ్యలాభముచేతనో=రాజ్యము కావలయునను నాశచేతనో- మోహముననొ=బుద్ధి తాఱుమాఱుగుటచేతనో-బుద్ధి మోసముననో=బుద్ధిపొరపాటుచేతనో- సేతువు=ఆనకట్ట.

తాత్పర్యము

తండ్రియెదుట నేనొక సత్యముచేసితిని. అది లాభముకొఱకు చేసితిననుకో, లోభముచేఁ జేసితిననుకో, ఒకటియనుకొని మఱియొకటి చేసితిననుకో- లేక పొరపడినాననుకో ఏకారణముచేనైన సరియు, యొకసారిచేసిన ప్రతిజ్ఞయను ధర్మసేతువు ద్రెంపనొల్లను.

ఏటి యీవలియొడ్డునకు నావలియొడ్డునకు నడుమనుండునది సేతువు. దాని నాధారముచేసికొని యీవలియొడ్డువా రావలియొడ్డు చేరుదురు. అట్లులే సత్యమను సేతువు నాధారముచేసికొని సంసారసముద్రమున నీవలనుండువా రావలిదరి చేరుదురు. అట్టియాధారమైనదానిని నేనెట్లు తెగఁగొట్టి యాత్మహాని గావించుకొందును?

దీనివలన నొకసారి మాటచెప్పితి మేని యేకారణముచేనైన నేమి సరి నేను బొరపాటుపడి చెప్పితిననికాని నేనొకటి యనుకొనిన నది వేఱొకటి యైనదనికాని యేకారణముచేనైనను దానిని మీఱరాదు. ప్రాణము పోవునట్లుండినను జెప్పినట్టు జరుపవలసినదే యని సూచన.

నజాతుకామా న్నభయా న్నలోభాత్, ధర్మం త్యజేత్ జీవితస్యాపి హేతోః ॥

కామముచేతఁగాని, భయముచేఁగాని, లోభముచేఁగాని ప్రాణరక్షణము నిమిత్తమైనను ధర్మము దప్పరాదు.

కం. చలచేతస్కుఁడు సత్పథ, చలితుండును గల్ల లాడు♦జనుఁ డిడుశ్రాద్ధం
బులు యాగంబులు పితరులు, నిలింపులు గ్రహింపరన ము♦నీః వినమొకొ్క.

చలచేతస్కుఁడు=చపలచిత్తుఁడు- సత్పథచలితుఁడు=సన్మార్గమునుండి చలించినవాఁడు- కల్లలాడుజనుఁడు=అసత్యములు చెప్పువాఁడు- నిలింపులు= దేవతలు.

తాత్పర్యము

చపలచిత్తుఁడు సన్మార్గమునుండి తొలఁగిపోయినవాఁడు- అసత్యములు చెప్పువాఁడు-ఈ మువ్వురు యాగాది దేవతాకార్యములు చేసిన దానిని దేవత లంగీకరింపరు. శ్రాద్ధాది పితృకార్యములు చేసినఁ పితృదేవత లంగీకరింపరు. అని శాస్త్రములు చెప్పుచుండుట మునీశ్వరుఁడా? మనము వినలేదా?

సీ. ప్రత్యగాత్మంబు ధ♦ర్మంబు సత్యాత్మంబుఁ, బ్రత్యక్షముగఁ జూచు♦వాఁడనేను
సజ్జనాచరితంబు ♦ సత్యధర్మార్థంబు, నే జటాభారంబు ♦ నెటిధరింతు
ధర్మలేశాన్వితా♦ధర్మంబు లుబ్ధులు, పాలసుల్ క్రూరులు ♦ పాపరతులు
సేవింపఁ దగిన దు♦ర్భావనంపుక్షత్రియ, ధర్మంబు విడిచితిఁ♦ దాపసేంద్ర
ఆ. మనసునందు నఘము♦మాటి కాలోచింప, జిహ్వచేతఁ గల్లఁ♦ జెప్పుచుండఁ
గాయమునను బాప♦కార్యంబుఁ గావింప,
ముప్విధములఁ బాప♦ములు లభించు. ౨౪౫౭

సత్యాత్మంబు = సత్యమే స్వరూపముగాఁగల యాధర్మము- ప్రత్యగాత్మంబు=ఏవేళయందైనను ఆత్మనువిడిచి యుండనిదానిఁగా- ప్రత్యక్షముగ= ఎదురుగానున్న దానిని జూచినట్లు చూచుచున్నాను- సజ్జనాచరితంబు=సజ్జనులచే నాచరింపఁబడినటి- సత్యధర్మార్థంబు=సత్యమునిమిత్తముధర్మమునిమిత్తము- సత్యస్వరూపమైనధర్మము కొఱకు- జటాభారము = జడలను- ధర్మలేశాన్వితాధర్మంబు=కొంచెము ధర్మముతోఁ గూడిన యధర్మము- లుబ్ధులు=పిసినారులు- పాలసుల్=జ్ఞానములేనివారు- పాపరతులు=పాపమునం దాసక్తిగలవారు-దుర్భావంపు=చెడునభిప్రాయముతోఁ గూడినదియగు-క్షత్రియధర్మంబు=రాజనీతిని- అఘము=పాపము- జిహ్వ=నాలుక- కల్ల=అసత్యము- కాయము=దేహము-

ముప్విధములన్=మూఁడువిధముల- ఇది మిశ్ర ద్విగువు కావున బహువచనము.

తాత్పర్యము

సత్యమే స్వరూపమునుగాఁగల ధర్మ మాత్మను విడిచి యుండునదికాదు. అది యట్టిదని నేను గనులఁ జూచుచున్నాను కావున సత్పురుషు లాచరించినది యగు జడలు ధరించుటగల వానప్రస్థాశ్రమమును సత్యము ధర్మమునిమిత్తమై నేను ధరింతును. క్షత్రియ ధర్మమందుఁ బాపభాగమెక్కువ ధర్మభాగము కొంచెము కావున దానిని ఆశాపాతకులు బుద్ధిహీనులు హింసాది క్రూరకర్మములు చేయువారు పాపమందాసక్తి గలవారు సేవింతురు. కావున దానిని వదలితిని. పాపకార్యము నాలోచించుటచే నది చేయకపోయినను బాపము వచ్చును. ఇది మానసికము. అసత్యము నోటితోఁ జెప్పినను బాపము వచ్చును. ఇది వాచకము. దేహముతోఁ జేయుటచేత నీమూఁడు విధములఁ బాపము వచ్చును.

పుణ్యములుగాని పాపములుగాని మనుష్యులకు మూఁడుమార్గముల వచ్చును. మనస్సున నాలోచించుట- వాక్కుతోఁజెప్పుట- దేహముతోఁజేయుట- మనస్సుతోఁ జేసిన పుణ్యఫలముగాని పాపఫలముగాని స్వప్నములం దనుభవించును. వాక్కుతోఁ జేసిన పుణ్యపాపములు వాక్కుచేతనే యనుభవమునకు వచ్చును. మనము మాటలచే మాత్రమొకరిని సంతోషపెట్టిన మనల నెవ్వరో మాటలచే మాత్రమే సంతోషపెట్టుదురు. దేహముతోఁ జేసినది దేహముతోనే నరకమందు స్వర్గమందు మరల భూలోకమందు ననుభవింపవలెను. కలియుగమున నొకవిశేషము గలదు.

ఉ. చేసినఁగాని పాపములు చెందవు చేయఁదలంచి నంతటన్
జేసెదనన్న మాత్రమునఁ జెందుఁగదా కలివేళఁ బుణ్యముల్. భాగ.1.442ప.

కలియుగమునఁ బాపము క్రియారూపముగఁ జేసిననే వచ్చునుగాని చేసెదనని సంకల్పించినను జేసెదనన్నను రాదు. పుణ్యముచేసెద నని నిండు మనస్సుతో సంకల్పించిన నాకార్యము చేసినపుణ్యము వచ్చును.

శ్లో॥ యత్కృతే దశభిర్వర్షైః। త్రేతాయాం హాయనేనతత్
ద్వాపరే తచ్చమాసేన, చాహోరాత్రేణ తత్కలౌ.

కృతయుగమునఁ బది సంవత్సరములు చేసినది త్రేతయం దొకసంవత్సరము ద్వాపరమం దొకనెల కలియందు నొక యహోరాత్రము చేసిన వచ్చును. ఈవిధముగ తపస్సు బ్రహ్మచర్యము జపము కలియందు ఫలించును.

మీఁదఁజెప్పిన మూఁడు మరల సత్త్వము- రజస్సు- తమస్సు నను భేదములచే మూఁడువిధములు- దానినిబట్టి ఫలానుభవము- ఏపుణ్య మెవరెట్లు చేసినను సమాన ఫలమురాదు.

శ్లో॥ నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్
అఫలప్రేప్సునాకర్మ, యత్తత్సాత్త్విక ముచ్యతే
యత్తుకామేప్సునాకర్మ, సాహంకారేణవా పునః
క్రియతే బహుళాయాసం తద్రాజస ముదాహృతమ్
అనుబంధం క్షయం హింసా, మనపేక్ష్యచ పౌరుషమ్
మోహా దారభ్యతేకర్మ యత్తత్తామస ముచ్యతే ॥ భ-గీ. 18-అధ్యా.

ఫలేచ్ఛ లేనివానిచేత, స్వవర్ణాశ్రమోచితమగు నేకర్మము కర్తృత్వాదులందు సంగములేకయుఁ గీర్త్యకీర్తులయందు రాగము ద్వేషము వదలియు అవశ్యము చేయఁదగినదే యనుతలంపుతోఁ జేయఁబడుచున్నదో యది సాత్త్వికము. నే నీకార్యము మిగుల శ్రమపడి చేసితినని కర్తృత్వాభిమానముతో ఫలముగోరి చేయుకర్మము రాజసము. ఈకార్యముచేసిన పుణ్యము వచ్చునా? పాపము వచ్చునా? యేమిఫలము వచ్చునని యాలోచింపక వ్యర్థ ధననాశము- హింస- తన సామర్థ్యము ఆలోచింపక వాస్తవకర్త భగవంతుఁడను జ్ఞానములేక చేయుకర్మము తామసము.

మొదటి సాత్త్వికకర్మమునకు శ్రీరామచంద్రమూర్తి దృష్టాంతము. రెండవదానికి మునిబాలునిఁ జంపిన, కైకకు వరములిచ్చిన దశరథుఁడు దృష్టాంతము.

క్షత్రియధర్మంబు విడిచితినని రామచంద్రమూర్తి చెప్పెనే స్వధర్మరక్షాదీక్షాదక్షుఁడైన శ్రీరామచంద్రమూర్తి యిట్లుచెప్పుట స్వవ్రతభంగముగదా. 'క్షత్రియస్య పరోధర్మః ప్రజానామేవ పాలనమ్' క్షత్రియులకుఁ బ్రజాపాలనమే పరమధర్మమనియుండ నట్టిస్వధర్మము నుత్తమధర్మమును దండ్రియెదుట మాటచెప్పితినని యుల్లంఘింపవచ్చునా? అదియునుగాక "శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్। స్వధర్మే నిధనంశ్రేయః పరధర్మో భయావహః ॥ తగస్వనుష్ఠిత పరధర్మంబుకంటె। విగుణమైనను మేలు స్వీయధర్మంబు। మరణమైనను స్వధర్మంబునమేలు। పరధర్మమెప్పుడు భయకారణంబు॥" అని కలదు గదా. ఒకవేళ కొంచెము దోషంబుతో రాజ్యము సంపాదించినను దానికిఁ దగిన ప్రాయశ్చిత్తము యజ్ఞాది రూపములఁ బెట్టుకొనవచ్చునుగదా యని సందేహము.

సజ్జనుల సన్నిధియందిట్లు ప్రతిజ్ఞచేసి రాజ్యమునిమిత్తమై యెవఁడు దానిని విడుచును ? ఆర్యుఁడగువానికి ధర్మమువదలి రాజ్యము చేయుటకంటె మరణము మేలు. అధర్మమునకంటె మరణము చెడ్డదికాదు నాసత్య ప్రతిజ్ఞను వినుము. దేవత్వమునకంటెఁ బ్రాణమునకంటె రాజ్యమునకంటెఁ గొడుకులకంటె యశస్సుకంటె ధనముకంటెఁ బ్రతిజ్ఞ సత్యమగుటయే నేను గోరెదను. ఇవి యన్నియు సత్యమునందలి యాఱవభాగమునకు సరిఁబోలవు.

చం. నుతజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత
వ్రత యొకబావిమేలు మఱిబావులు నూటిటికంటె నొక్క స

త్క్రతువది మేలు తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు త
త్సుత శతంబుకంటె నొక సూనృతవాక్యము మేలు చూడఁగన్.

కం. వెలయంగ నశ్వమేధం,బులు వేయును నొక్కసత్యమును నిరుగడలన్
దులనిడి తూఁపఁగ సత్యము,నలనను ములుసూపు గౌరవంబున పేర్మిన్.

గీ. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద, సమధిగమము సత్యంబుతో సరియుఁగావు
ఎఱుఁగుమెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద,
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు.

వ. రాజ్య పదస్థుండైన క్షత్రియుండు భూరిదక్షిణంబులైన యజ్ఞంబుల దేవ బ్రాహ్మణులకుఁ దృప్తిఁజేసి బ్రాహ్మణులకు నగ్రహారంబులు గోసహస్రంబులు నిచ్చి దురితంబుల వలనంబాసి తమోవిముక్తుండైన చంద్రుండునుం బోలె వెలుంగు". భార. అర. 1 ఆశ్వా అనిసందేహము.

క్షత్రియులకు రాజ్యపరిపాలనము ప్రతిజ్ఞాపరిపాలనము రెండును స్వధర్మంబులే. అందు మొదటిదానికంటె రెండవది యుత్తమము; కావున దానిని శ్రీరామ చంద్రమూర్తి స్వీకరించెను. మహాభారతంబున ధర్మరాజు భీమున కిట్లు చెప్పెను.

శ్లో॥ తం సంధి మాస్థాయ సతాం సకాశే, కోనామ జహ్యాదిహ రాజ్య హేతోః
ఆర్యస్య మన్యే, మరణాద్గరీయో యద్ధర్మ ముత్సృజ్య మహీం ప్రశాసేత్.
మమ ప్రతిజ్ఞాంచనిబోధ సత్యాం వృణే సత్యమమృతాజ్జీవితాచ్చ
రాజ్యంచ పుత్రాశ్చ యశోధనంచ సర్వం న సత్యస్య కాలాముపైతి.

భీమ దుర్యోధనుల గదాయుద్ధంబున దుర్యోధను తొడలు విఱుగఁగొట్టిన భీమునిపై బలరాముఁడు కోపించినపుడు కృష్ణమూర్తి.

"దుర్యోధనస్యగదయా, భంక్త్యా మూరుమాహవే
ఇతిపూర్వం ప్రతిజ్ఞాతం, భీమేన హి సభాతలే
అనృణ్యం యాతువైరస్య, ప్రతిజ్ఞాయాశ్చ పాండవః
అతో దోష నపశ్యామి, మాక్రుద్ధస్త్వం బలంవహన్.

"ప్రతిన సెఱపుట నృపులకుఁ బరమ ధర్మ
మగుట మనమునఁ జింతింపు మనిలసుతుఁడు
గద సుయోధను తొడలు భగ్నములు సేయు
వాఁడు గా సభఁ బూనిన వాఁడుగాదె.

ఈతఁడున్ దనదు ప్రతిజ్ఞకై రిపు గదాహతుఁ జేసె నధర్మ మేలగున్

భారత యుద్ధంబునఁ గర్ణుచేఁ బరాభవింపఁబడిన ధర్మరాజు నర్జునుని రోషంబున నీవిల్లు మఱియొకని కీయరాదా యనిన నర్జునుండు కోపించి—

కం. విను మొరులకు గాండివ మిమ్మని నన్నెవ్వండు పలికె నతని శిరము గ్రక్కునఁ బగుల వ్రేయుటకుఁ జేసినవాఁడఁ బ్రతిజ్ఞ నాదు చిత్తములోనన్.

గీ. ఇట్టి కష్టపుఁగేలికై యిట్లుసేయఁ బ్రతిన పట్టుట దగదె యప్పలుకు నీవు
వినఁగ నితఁడాడ నిమ్మహీవిభుఁడు
ధర్మవంతుఁడగుఁగాక చంపనవలయుఁగృష్ణ.

వ. చంపి పాలితప్రతిజ్ఞుండనైన నాకు నసత్యంబు రాకుండఁబరిహరించెద" ననెను.

కావున క్షత్రియులకు రాజ్యపరిపాలనముకంటెఁ బ్రతిజ్ఞాపాలనమే శ్రేష్ఠము. ఇది స్వధర్మత్యాగముకాదు. హరిశ్చంద్ర చరిత్రము స్మరించునది. రాజగువాఁడు ప్రతిజ్ఞచేసి తప్పెనేలి వానిమాట నెవ్వరు మరల నమ్ముదురు? ప్రజలవిశ్వాసము సంపాదింపని రాజేమిరాజు? రాజసత్యమాడినఁ బ్రజలేలయాడరాదు? ప్రజలంద అసత్యము మరగిన లోకముఁగతి యేమగునో? కావున రాజు ప్రజాపాలనము మానిన మానవచ్చునుగాని సత్యప్రతిజ్ఞత్వము మానరాదు.

కం. ధర కీర్తియశోలక్ష్ములు, పురుషున్ సత్యైకనిష్ఠుఁ • బొందును దమిచే
సురభూమి కరుగుఁ దోడుగఁ.
బురుషుఁడు సత్యంబు నెట్లు • పోకార్పఁ దగున్. ౨౪౩౮

కీర్తియశోలక్ష్ములు=యశస్సు-బలపరాక్రమములచే సంపాదించు గొప్ప పేరు- కీర్తి-దాన యజ్ఞాదులచే సంపాదింపఁబడునది- సీ.తపనీయ దండైక ధవళాతపత్రితోద్దండ తేజః కీర్తిమండలుండు- నైష-లక్ష్మీ=సంపద-సత్యైక నిష్ఠున్=సత్యమే ప్రధాననిష్ఠగాఁ గలవానిని- పోకార్పన్=నాశముచేసికొన.

తాత్పర్యము

సత్యమే ప్రధానముగాఁగల పురుషునికి గీర్తియశస్సు లక్ష్మి తమంతటఁ దామే వలచి వచ్చును. ఈలోకమున నివి సమకూర్చుటేకాక సత్యము స్వర్గలోకమునకుఁ దోడుగఁబోయి దివ్యసుఖములను గలిగించును. ఇట్టి సత్యమును నెనఁడు విడనాడుదును?

సీ. ఎంత యాలోచించి • యిది మేలటంచును, డక్కుమాటలనీవు • నొక్కియనిన
చెనఁటిధర్మం బెట్లు • చేయఁగ నోపుదుఁ? బార్థివేంద్రునిముందు • బాసఁ జేసి
భరతునిమిత్తమై • గురువాక్య మే నెట్లు, తుంగలలోఁద్రొక్క • భంగపఱుతుఁ
పతి మున్ను నాయన్న • ప్రతినకై కైకేయి,హర్షించెదానేమి • యాత్మనెంచు.

ఆ. నిపుడు మాటఁ దప్ప; • విపినవీథులయందు,నియతభుక్తిఁ గొంచు • నిష్ఠఁబూని
పూలఁ బండ్ల మూల • జాలంబులను బిత్రు,దేవతాసురులకుఁ • దృప్తి నిడుదు.

టక్కుమాటలన్=మోసపుమాటలచే- విపినవీథులయందున్=అడవిప్రదేశములందు- నియతభుక్తిన్=క్షత్రియవానప్రస్థులకు శాస్త్రమున నియమింపఁబడిన యాహారము.

తాత్పర్యము

నీవెంతయో యాలోచించి మోసపుమాటలచే నీవు చెప్పినది మేలనినొత్తి చెప్పినను నేనెట్లధర్మము చేయఁగలను? రాజునెదుట భరతునిమిత్తమై చేసిన

ప్రమాణమును నేనెట్లు ధ్వంసముచేయుదును? పూర్వము తనమగనియెదుట నేను జేసిన ప్రమాణమునకై కైకయెంతో సంతోషించెను. ఇప్పుడు నేనామాటతప్పిన నిప్పుడామె యేమి యెంచును? ఇప్పుడామె యంగీకరించెనందువా! యది మీ బలాత్కారముచే నైనదికాని స్వబుద్ధిపూర్వకమైనదికాదు. స్వబుద్ధిపూర్వకమైనచో నిట్లు చేసియేయుండదు. కాఁబట్టి వానప్రస్థులకు నియతమైన యాహారము పండ్లు-పూలు-గడ్డలు లోనైనవానిచే దేవతలకుఁ బితృదేవతలకుఁ దృప్తికలిగించి యడవులందుందును. ఇది జనపాలనశీలివి గమ్ము రాఘవా యను జాబాలి మాటకుఁ బ్రత్యుత్తరము.

ఇప్పటి ప్రాజ్ఞమానులు గొందఱు జాబాలి ప్రశ్నలకన్నిటికిఁ బ్రత్యుత్తర మీయలేక యొక సత్యమునుమాత్రమే స్థాపించెనందురు. ఇది యాలోచన లేని మాట, ఏలన:శ్రీరామచంద్రమూర్తి భరతునితోఁ జెప్పినదంతయుఁ దల్లిదండ్రుల యెదుట నే నరణ్యమునకుఁ బోదునని ప్రతిజ్ఞ చేసితిని. నీవెన్ని చెప్పినను ఆసత్యమును నేను మీఱఁజాలను. రాజ్యపాలనముకంటె సత్యపరిపాలనమే శ్రేష్ఠమని త్రిప్పి త్రిప్పి చెప్పెను. ఆయభిప్రాయము తప్పని జాబాలిమతము. లోకమునందు సత్యాసత్యములు, ధర్మాధర్మములు, పుణ్యపాపములు, వాని యనుభవించు నాత్మలేదని కావున నసత్యమాడిన దోషములేదని జాబాలివాదము.

కావున సత్యమనుష్ఠేయమగునా కాదా! యనునది ముఖ్యముగ విచారింపవలసిన విషయము. కావున దానిని స్థాపించెను. ఎప్పుడు సత్యమనుష్ఠేయమని సిద్ధాంతితమయ్యెనో యప్పుడే ధర్మాధర్మములు పుణ్యపాపములున్నట్లు సిద్ధాంతపడెను. ఈఫలమనుభవించు నాత్మలేదను జాబాలిమాటకు నేను గన్నులార నట్టి యాత్మను జూచుచున్నానని శ్రీరామచంద్రమూర్తి చెప్పెను.(౨౪౨ ప.ప్రథమపాదము) తనకొక్కనికి నాత్మయుండుట తెలిసిన నేమిలాభమందురు గాఁబోలు; తన విషయమైన ప్రస్తావన గావునఁ దాను జూచెదనని చెప్పెను. కాని యితరులకెవ్వరికిఁ దెలియరాదని చెప్పలేదు. జ్ఞానదృష్టిగలవారికిని, యోగసమాధియందుండువారి కండ్లకు నిది గోచరించును. ఇట్టివారెందఱో గలరు.

> ఉత్క్రామంతం స్థితంవాపి, భుంజానం వాగుణాన్వితమ్
> విమూఢానాను పశ్యంతి, పశ్యంతి జ్ఞానచక్షుషః. భ-గీ.

దేహమువిడిచి పోవువానిని, దేహమునం దుండువానిని, అట్లుండి గుణముల ననుభవించువానిని జ్ఞాననేత్రములు గలవారు చూతురుగాని మూఢులు చూడలేరు. అని కృష్ణమూర్తి సెలవిచ్చెను. రామచంద్రమూర్తిమాట కృష్ణమూర్తిమాట యటుండనిండు. ఈకాలమున రామకృష్ణ పరమహంసగారిని వివేకానంద స్వాములవారు "నీవు దేవునిఁ జూచితివా"యని యడిగెను. "నీకంటె స్పష్టముగాఁ గానవచ్చుచున్నాఁ"డని యాయన బదులిడెను.మఱియొకఁడు దేవుఁడుగలఁడని నీకు నమ్మకము గలదా? యనెను. నమ్మకమేమిటి నేను గన్నులారఁ జూచు

చున్నానే యనెను. ఇప్పుడు పాశ్చాత్యదేశములందు నాత్మసాక్షాత్కార మైన వారు కొందఱుగలరు. **Cosmic Consciousness** లోకములోని నాస్తికులందఱుఁ గలసియుఁబరమహంసగారి యభిప్రాయము మార్చఁగలరా? నూఱుగురు పుట్టుగ్రుడ్డులు సూర్యుఁడులేఁడని వాదించినను గన్నులుగలవాఁడు వారిమాటల నమ్మునా? ఎప్పుడు సత్యప్రశస్తి ఆత్మయునికి స్థాపితమయ్యెనో జాబాలి వాద మంతయు సమూలము హతమయ్యెను, దానికి వేఱు ప్రత్యుత్తర మీయవలసిన పనియేలేదు. కావున శ్రీరామచంద్రమూర్తి వ్యర్థభాషణము లాడలేదు.

వైదికవాద మటుండనిచ్చి చార్వాకులగు వారివాదప్రకార మేమితేలునో చూతము. వారు పృథివ్యప్తేజో వాయువులను నాలుగుభూతములు కలిసిన సున్నము పసుపుగలసిన నెఱ్ఱరంగు పుట్టినట్లు,కొన్ని వస్తువులుచేరిన మత్తుగుణము పుట్టినట్లు చైతన్యము పుట్టునని యెంచవలయు నందురుగదా! ఉపమాన బలముచేఁగదావీరిట్లు చెప్పుట. ఆయుపమానమునే మనమాశ్రయింతము. లోకము నందు వడ్రంగిలేక,వానికి శక్తిలేక,కొఱముట్లు, కొయ్య మొదలగు పదార్థములు లేక యేగృహమైనను నిర్మింపఁబడలేదు. తనంతటఁదానే పుట్టినయిల్లులేదు. అట్టులే, సృష్టికర్త-వానిశక్తి-జీవులు-ప్రకృతి లేక ప్రపంచము నిర్మింపఁబడలేదని యెంచవలయుననిన వారేమి ప్రత్యుత్తర మీయఁగలరు? ఆ నాలుగుభూతములు కలిసినంతమాత్రముననే చైతన్యము పుట్టునని ప్రత్యక్షముగా వీరేల కనఁబఱుప రాదు? ఒక పాశ్చాత్యుఁడు కోడిగ్రుడ్డులను సృష్టింపనెంచి యందుఁ బ్రకృతి వస్తువు లెట్లెట్లు కలిసి గ్రుడ్డులయ్యెనో యావిధముగనే కొన్ని సిద్ధముజేసి నిజమైన కోడిగ్రుడ్డులతోపాటు వీనిని కోళ్ళక్రిందఁ బొదుగుటకై యుంచెను. వీఁడుంచిన కృతిమపుగ్రుడ్లుతప్పఁ దక్కినవన్నియుఁ బిల్లలయ్యెను. వీఁడు సృష్టించిన వట్టులే యుండెను. అప్పుడు నాఁడు హా! నాదైవమా యని కేకవేసెను.

ఇట్లు పాశ్చాత్యులు వ్రాసియున్నారు. భూతములు నాలుగు కలసినంతనే చైతన్యము పుట్టదు. దీనికంటె భిన్నమైన ప్రాణశక్తి మఱియొకటి కలదు. అది జగత్కర్త స్వాధీనమందున్నది. ఇంట శ్రాద్ధముపెట్టిన బాటసారికిఁ గడుపునిండునా? యనుట సరిగాదు. మనశరీరములన్న గతప్రాణములు. పృథివి విశేషించి యుండునది కావునఁ బ్రత్యక్షముగ భుజించిననే దేహము నిలుచును దేవతలది మనోమయ దేహములు కావున వారియన్నము దినఁజాలరు. వారికి మనోమయమైన యన్నమే గావలసియున్నది. కావుననే దేవతలు చూపులచే నాహారము గ్రహింతురని చెప్పఁబడెను.అదియునుగాక,శ్రద్ధాసమన్వితైర్దత్తం, పితృభ్యో నామగోత్రతః।యదాహారస్తు తేజాతా, స్తదాహారత్వమేతితత్॥శ్రద్ధతోఁబితరులకు నామగోత్రములుచెప్పి పెట్టినపిండము ఆయావారికేదియాహారమో యదిగావారలకందును.పితరులు స్వర్గమందుండిరాయమృతముగను,మనుష్యులందుండిరా

యన్నముగను, పశువులయందుండిరా పచ్చికగను నందును. వి-పు. 3-16-15. శ్రద్ధతోఁ బెట్టఁబడునది శ్రాద్ధము. శ్రద్ధమనోవ్యాపారము కావున మనము పితరుల నుద్దేశించి శ్రద్ధతోఁ బెట్టితిమేని వారును మనశ్శక్తిచే వానియందలి ప్రాణధారక సూక్ష్మాంశముల గ్రహింతురు. కావున శ్రాద్ధములు వ్యర్థములని బుద్ధిగలవారు చెప్పరు.

ఆత్మవిచారమందు (అతీంద్రియ వస్తువిచారమందు) శాస్త్రమే ప్రమాణము. తర్కయుక్తులుగావు. ఊహలొకరిబుద్ధి యనుసరించియుండును. వానిని నమ్మరాదు. ఒకఁడొకబాట ప్రక్కఁ బరుండి నిద్రించుచుండెను. అత్రోవఁబోవు నొకఁడు వానిని మహాయోగి సమాధియందున్నాఁడని తలఁచెను. మఱియొకఁడు తప్పఁద్రాగి పడినాఁడనుకొనెను. మఱియొకఁడు బాగుగఁ గష్టముచేసి గాఢనిద్రయందున్నాఁడనెను ఇవన్నియు నూహలే. ఇందేయూహ ప్రమాణము కావున శాస్త్రాధారములేని యూహ ప్రమాణము కాఁజాలదు.

—• జాబాలికి శ్రీరాముఁడు కర్మం బవశ్యకర్తవ్యంబని చెప్పుట •—

కం. సంతుష్టేంద్రియతను ధుత,చింతారతి లోకయాత్రఁ • జేసెద శ్రద్ధా
వంతుఁడనై నిష్కలుష,స్వాంతంబున సాధుకార్య•సంగతి దనరన్.

ఇంతవఱకు సత్యము శ్రేష్ఠత్వముచెప్పి యిఁకఁ గర్మానుష్ఠాన మవశ్యమని చెప్పుచున్నాఁడు.

సంతుష్టేంద్రియతను = సంతోషించిన పంచేంద్రియములు గలుగుటచే ధుత=ఎగురఁగొట్టఁబడిన- చింతా=వ్యసనము- అరతి=అసౌఖ్యము- శ్రద్ధావంతుఁడనై =శాస్త్రమునందుఁ గర్మఫలంబునందు విశ్వాసముగలవాఁడనై- నిష్కలుష స్వాంతంబునన్=పాపరహితమైన మనస్సుతో- సాధుకార్యసంగతిన్=సాధువులుగానుండువారు చేయఁదగు సత్కార్యముల కూడికచే- లోకయాత్ర=పితృవాక్య పరిపాలనమనెడి లోకధర్మము- చేసెదన్=చేసెదను.

తా త్ప ర్య ము

అది లేదాయెనే యిదిలేదాయెనే యను విచారముగాని లభించిన దానియందప్రీతిగాని లేక లభించినవానితోఁ బంచేంద్రియములను సంతోషపెట్టుచు శాస్త్రమునందుఁ గర్మఫలమునందుఁ నమ్మకము గలవాఁడనై పాపరహితమైన మనస్సుతో సత్కార్యములు చేయుచుఁ బితృవాక్యమును బరిపాలించుచుఁ గాలము గడపెదను.

ఆ. కర్మభూమి దీనఁ•గాపింపవలయును, బుణ్యకర్మములను•బురుషు లెపుడు
వాయు వగ్నిశశియు•స్వకృతకర్మంబుల,ఫలముచేత వారి•పదముఁ గనిరి.

శ్రాద్ధాదుల నుదాహరించి సకలవైదిక కర్మములును నిష్ప్రయోజనములని జాబాలి యన్నమాటకు రామచంద్రమూర్తి ఖండనము చెప్పుచున్నాఁడు.

తాత్పర్యము

ఇది యీభూమండలము కర్మభూమి కావున నిందుండువారు కర్మములే చేయవలయును. ఊర్ధ్వలోకములు ఫలభూములు; ఇక్కడచేసిన కర్మముల ఫలము నక్కడ ననుభవింపవలయును. ఇచ్చటఁ బుణ్యముచేసినవాఁడు అక్కడ సుఖమనుభవించును. ఇచ్చటఁ బాపముచేసినవాఁడు అచ్చట దుఃఖ మనుభవించును. కావున నిచటఁ బుణ్యకర్మములే చేయవలయును. అట్లు పుణ్యకర్మములు చేసిన మనుష్యులే వారివారి పుణ్యకర్మముకొలఁది వాయువుగా నొకఁడు అగ్నిగా నొకఁడు చంద్రుఁడుగా నొకఁడు పుట్టును.

సూర్యుఁడు, చంద్రుఁడు, అగ్ని, ఇంద్రుఁడు, బ్రహ్మ, రుద్రుఁడు లోనైనవి యుద్యోగపదవులు; మనుష్యులలో నెవఁడెవడేసంకల్పముతో నేకర్మము లాచరించునో యాకర్మములకు ఫలముగా వాఁడేయుద్యోగపదవి కర్హుఁడో, వానికాపదవి యియ్యఁబడును. వీరందఱు కొంతకాలము (కొన్ని కల్పములు) ముందు మనవలె నున్నవారే. వారువారు చేసిన పుణ్యఫలముకొలఁది నాయా స్థానము లలంకరించిరి. కావునఁ గర్మములకు ఫలములేదనరాదు.

ఇహ యత్క్రియతే కర్మ, తత్పరత్రోపి యుజ్యతే
కర్మభూమి రియంబ్రహ్మన్ ఫలభూమి రసౌ మతా. అరణ్యపర్వము.

ఈలోకమునఁ జేసినకర్మము పరలోకమున కుపయోగపడును. ఇది కర్మభూమి.

భరతవర్ష ప్రశంస.

తత్రాపి భారతం శ్రేష్ఠం, జంబూద్వీపే మహామునే
యతోహి కర్మభూరేషా, అతోన్యా భోగభూమయః
అత్రజన్మ సహస్రాణాం, సహస్రైరపి సత్తమ
కదాచిల్లభతే జంతు, ర్మానుష్యం పుణ్యసంచయాత్.
గాయంతి దేవాః కిలగీతకాని, ధన్యాస్తుయే భారత భూమిభాగే
స్వర్గా పవర్గా స్పద మార్గభూతే, భవంతి భూయః పురుషా స్సురత్వాత్
కర్మాణ్య సంకల్పిత తత్ఫలాని, సన్న్యస్య విష్ణౌ పరమాత్మరూపే
అవాప్యతాం కర్మమహీమనం తతే, తమాలయం యేత్వమలాః ప్రయాంతి.
జానీమనైతత్క్వపయా విలీనే, స్వర్గప్రదే కర్మణి దేహబంధం
ప్రాప్స్యామి ధన్యాః ఖలుతే మనుష్యా, యేభారతే నేంద్రియే విప్రహీనాః.

మునీంద్రా! జంబూద్వీపమందు భరతవర్షమే శ్రేష్ఠము. ఇది కర్మభూమి. తక్కినవి భోగభూములు. వేయివేల సంవత్సరములుగడవఁగా నెపుడో మనుష్య జన్మము లభించును. తెలిసియో తెలియకయో చేసిన కర్మమువలననే యుద్భిజ్జములు స్వేదజములగును. స్వేదజము లండజములగును. అండజములు జరాయుజములగును. అందుఁ గడపట మనుష్యజన్మము లభించును. అవల సుర

త్వము వచ్చును. అందుండి మరల స్వర్గమునకు మోక్షమునకు మార్గభూమి యగు భరతవర్షంబునఁ బుట్టినవారే ధన్యాత్ములు. ఫలములుగోరక ఫలము పర మాత్మయగు విష్ణువునకు సమర్పించు నిర్మలులు, విష్ణులోకమునకుఁ బోదురు. స్వర్గమునకుఁబోయి మరలజన్మములకు వచ్చువారెందుఁ బుట్టుదురో నిశ్చయము తెలియదు. కర్మసాధనములు కన్నులు కాళ్ళు లోనగు నింద్రియముల వికలత లేక మనుష్యులుగా భారతంబునఁ బుట్టువారే ధన్యులు. పూర్వకృత పుణ్యవశ మున నీదేశమునఁ బుట్టియుఁ గన్నులు కాళ్ళు చక్కఁగానుండియు శాస్త్రీయ సత్కర్మములు చేయనివారు భ్రష్టులు.

కం. క్రతువులనూటిటి నొనరిచి.శతమన్యుఁడు స్వారపదము•సంపాదించెన్
వితతోగ్రతపోనిష్ఠల, నతులితదివ మందఁ జాలి•రఖిలమహర్షుల్. ౨౯-౧

క్రతువులన్=యజ్ఞములను, శతమన్యుఁడు=ఇంద్రుఁడు, స్వారపదము= స్వర్గపదము, వితతోగ్రతపోనిష్ఠలన్ = విస్తారమైన తపస్సులయందలి నిష్ఠలచే, అతులిత దివము=అసమానమైన స్వర్గము, చాలిరి=సమర్థులైరి- వీరందఱు వేద విహితకర్మములు చేయుటచే నీఫలము నొందిరి. బాటసారి కింత నన్నము పెట్టు మని వేదము చెప్పలేదు. గనుక ఫలములేదు. ఇది చార్వాకవాదమును క్షణిక వాదమును ఖండించుచున్నది.

తాత్పర్యము

నూఱు యజ్ఞములు చేసినవాఁ డింద్రుఁడై నహుషునివలె స్వర్గాధిపతి యగును. మహర్షులందఱు స్వర్గముఁ గాంచుట వారువారు చేసిన తపోనిష్ఠలచేతనే.

ఈ కారణముచేతనే హనుమంతుఁడు బ్రహ్మ కాఁబోవుచున్నాఁడు. అశ్వ త్థామ వ్యాసుఁడు కాఁబోవుచున్నాఁడు. బ్రహ్మకు నూఱేండ్లునిండి మహాప్రల యము వచ్చి యదిపోయి మరల సృష్టికాలము వచ్చినపుడు పూర్వకల్పమం దెవఁడెట్టి తపస్సులుచేసెనో యెఱిఁగి యట్టిజీవునికి రజోగుణ విశిష్టమైన దేహము నిచ్చి భగవంతుఁడు బ్రహ్మపదమందు నిలిపి యతనిలోఁ దాను బ్రవేశించి సృష్టి కార్యము చేయును. అట్టులే రుద్రునియందుఁ బ్రవేశించి సంహారకార్యము చేయును. రక్షాకార్యము తానే విష్ణుస్వరూపముతోఁ జేయును. కావున బ్రహ్మ రుద్రేంద్రాది పదవులన్నియుఁ గర్మఫల లబ్ధములే. ఫలదాత భగవంతుఁడు విష్ణువే.

శ్లో॥ సృష్టిస్థిత్యంత కరణాత్, బ్రహ్మవిష్ణు శివాత్మికామ్
స సంజ్ఞాం యాతిభగవాన్, ఏకఏవ జనార్దనః.

భగవంతుఁడైన జనార్దనుఁ డొకఁడే బ్రహ్మ, విష్ణు, శివ స్వరూపములతో సృష్టిస్థితి సంహార కార్యములు చేయును.

శ్లో॥ స్రష్టా సృజతిచాత్మానం, విష్ణుం పాల్యంచ పాతిచ
ఉపసంహ్రియతేచాంతే, సంహర్తాచ స్వయంప్రభుః.

భగవంతుఁడగు విష్ణువు తానే సృష్టికర్తయై తన్ను సృజించుకొను చున్నాఁడు. పాలించువాఁడై తన్ను రక్షించుకొనుచున్నాఁడు. సంహరించు వాఁడు తానై సంహరింపఁ బడుచున్నాఁడు.

అనాలోచ్యైవ జగతాం, త్రాతార మపరం హరిః
స్వయమేవాంశరూపేణ, పాలయ త్యఖిలం జగత్.

జగద్రక్షణమునకు వేఱొకని నాలోచింపక విష్ణువు తానే యంశరూపమున సమస్త జగముఁ బాలించును.

ఆత్మను ప్రత్యక్షముగఁ జూచినవారిమాట యటుండనిచ్చినను, నెంతటి పామరునకైనను బండితునకైనను, నేను లేను అనుభావ మేనాఁటికిని గలుగదు. దేహముతోడ సర్వము పోవునుగాక! నేను, అనునదిమాత్ర మేమిచేసినను బోదు. ఆత్మయొకటి కలదు. అది నిత్యమనుటకు నీ యనుభవమే చాలును. ఎప్పుడాత్మ యొకటి యున్నది, పాంచభౌతిక శరీరమొకటి గలదని యంగీకరించితిమో కర్మ ఫలానుభవ మంగీకరింపక తప్పదు. మనస్సుతో నెంత చిన్నయాలోచన చేసినను దాని ఫలము తప్పదు.

కార్యకారణ కర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే
పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే. భ-గీ. 13-20.

శరీరము ఇంద్రియములు చేయుకార్యములకు శరీరరూపమునఁ బరిణమించిన ప్రకృతి కారణము. ఆ కర్మములవలనఁ గలుగు సుఖదుఃఖము లనుభవించుట యందు నాత్మ కారణము.

శ్లో॥ పురుషః ప్రకృతిస్థోహి, భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్
కారణం గుణసంగోస్య సదసద్యోని జన్మసు. భ-గీ. 13-21.

ప్రకృతిపరిణామమైన శరీరమందుండు జీవాత్మ ప్రకృతిగుణముల ననుభవించును. ఈ గుణములతోడఁ జేరుటయే మంచిజన్మమునకుఁ జెడ్డజన్మమునకుఁ గారణమగును.

చం. అనుమను వెండి యాతపసి • నాస్తికవాక్యములన్ స్మరించి ఛీ
యని మదిలో నసహ్యపడి • యాగ్రహ మెత్తి వచించె సత్యమున్
ఘనతరవిక్రమంబు నను • కంపయు ధర్మము సాధువాద మా
ర్యనిచయదేవతాతిథిస ? మర్చయుఁ ద్రోవలు నాకవాటికిన్. ౨౪౬౪

ఘనతరవిక్రమంబు=మిగుల గొప్పదియగు పరాక్రమము, అనుకంప= దయ, సాధువాదము = మంచిమాటలాడుట, ఆర్యనిచయ = గొప్పవారి సమూహముయొక్కయు, దేవతాతిథి = దేవతలయు- అతిథులయు, సమర్చ = పూజ, నాకవాటికిన్=స్వర్గమునకు.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి పరములేదు; పరలోక సుఖములేదని చెప్పిన జాబాలి మాటలను మనస్సునకుఁదెచ్చుకొని ఛీఛీ యివియేమి పనికిమాలిన మాటలని రోసి యిట్టి దుర్బోధము చేయవచ్చునా యని కోపించి శ్రీరామచంద్రమూర్తి యిట్లు చెప్పెను. సత్యము, పరాక్రమము, భూతదయ, ధర్మగుణము, మంచిమాట, పెద్దలను, దేవతలను, అతిథులను నర్చించుట యివి స్వర్గమార్గములు. వీనియందొకటొకటియు స్వర్గఫలమిచ్చును. ఎట్లనః—సత్యమువలన స్వర్గఫలము వచ్చుననుటకు

"నాస్తి సత్యాత్పరోధర్మో, నానృతాత్పాతకంపరమ్
స్థితిశ్చ లోకధర్మశ్చ, తస్మాత్సత్యం విశిష్యతే
సత్యం స్వర్గస్య సోపానం, పారావారస్య నౌరివ.   మనువు.

సత్యమునకు మించిన ధర్మములేదు. అసత్యమునకు మించిన యధర్మములేదు. లోకస్థితికి ధర్మమునకు సత్యమే యాధారము. కావున సత్యమే శ్రేష్ఠమైనది. సముద్రము దాఁటువానికి నావవలె, స్వర్గమునకు సత్యమే సోపానము.

ధర్మము పరలోకకారణ మనుటకు :—

శ్లో॥ ధర్మం శనైః సంచిను యా ద్వల్మీక మివధార్మిక
పరలోక సహాయార్థం, సర్వభూతాన్య పీడయన్
ధర్మప్రధానం పురుషం, తపసా హతకల్మషమ్
పరలోకం నయత్యాశు, భాస్వంతఖే శరీరిణమ్.

చెదలు పుట్టను బెంచునట్లు మెల్లమెల్లగా ధర్మమును సమకూర్పవలయును. ఇది యితరప్రాణులకు హానిలేకుండునట్లు పరలోక సహాయముకొఱకుఁ జేయవలయును. తపస్సుచేఁ బాపము పోఁగొట్టుకొని ధర్మమునే ప్రధానముగా నెంచువానిని నది దివ్యతేజముచేఁ బ్రకాశించు దేహముగల యతనిని బరలోకమునకుఁ దీసికొనిపోవును.

పరాక్రమము పరలోక సాధనమనుటకు—

శ్లో॥ యే యజ్ఞసంఘై, స్తపసాచ విప్రాః, స్వర్గేషు శీఘ్రేణ యథైవ యాంతి
క్షణేన యాంత్యేవహి తత్రవీరాః, ప్రాణాన్ సుయుద్ధేచ పరిత్యజంతః.
పరాశర.

అనేక యజ్ఞములు, తపస్సులుచేసిన బ్రాహ్మణులు శీఘ్రముగ స్వర్గలోకమునకుఁ బోదురో యట్లు ధర్మయుద్ధమునఁ బ్రాణములు వదలిన వీరులు క్షణమునకు స్వర్గమునకుఁ బోదురు.

భూతదయ పరలోకప్రాప్తి హేతువనుటకు :—

శ్లో॥ సర్వభూతే ష్వనుక్రోశం, కుర్వత స్తవభారత
ఆనృశంస్యే ప్రవృత్తస్య, నియతః పుణ్యసంచయః.   భార. రాజధర్మ.

సర్వభూతములయందు దయగలిగి హింససేయక నుండు నీకుఁ బుణ్యములు నియతములు.

ప్రియవచనము పరలోక ప్రాప్తికారణ మనుటకు :—

శ్లో॥ వాక్చైవ మధురాశ్లక్ష్ణా, ప్రయోజ్యా ధర్మమీప్సతా
సవై సర్వ మవాప్నోతి, వేదాంతోపగతంఫలమ్.

ధర్మఫలమం దాసక్తిగలవారు తియ్యని ప్రియవాక్యము లాడవలయును. దానివలననే వేదాంతజ్ఞానమువలనఁ గలుగు ఫలము లభించును.

దేవతాతిథిపూజ పరలోక హేతువనుటకు :—

నివాపేన పితౄనర్చే ద్యజ్ఞై, ర్దేవాం స్తథాతిథీన్
అన్నైర్మునీంశ్చ, స్వాధ్యాయై రపత్యేన ప్రజాపతిమ్
బలికర్మణాచ భూతాని, వాత్సల్యేనాఖిలం జగత్
ప్రాప్నోతిలోకాన్ పురుషో, నిజకర్మ సమాశ్రితాన్. వి. పు.

నివాపములచేఁ బితృదేవతలను, యజ్ఞములచే దేవతలను, నతిథుల నన్నముచేతను, స్వాధ్యాయముచే ఋషులను, బిడ్డలఁగనుటచేఁ బ్రజాపతిని, బలికర్మములచే భూతములను, వాత్సల్యముచే సర్వప్రాణులను బూజించువాఁడు తన కర్మములచే సంపాదించిన పుణ్యలోకములకుఁ బోవును.

శ్లో॥ యోన్యథా సంతమాత్మాన, మన్యథా ప్రతిపద్యతే
కింతేన నకృతం పాపం, చోరేణాత్మాపహారిణా. స్మృతి.

ఒకవిధముగానుండు నాత్మను వేఱొకవిధముగా నుండుదానిగా నెవఁడు తెలిసికొనుచున్నాఁడో యట్టి యాత్మాపహారిచేఁ జేయఁబడని పాపమేదిగలదు?

ఉ. కావున నింతయుం దెలిసి ♦ కాదె ధరామరు లైకకంత్యసం
భావన వారివారికుల ♦ పద్ధతిఁ దప్పక ధర్మకార్యముల్
వావిరి చేయువారు? నిను ♦ వంటియధర్మపథాక్తు నాస్తికున్
ఛీ విషమస్థబుద్ధి దరిఁ ♦ జేర్చ్చనతంద్రిని దూఱఁగాఁ దగున్. ౨౪౬౪

ధరామరులు=బ్రాహ్మణులు, ఐకమత్యసంభావనన్=ఒక యభిప్రాయమునే కలిగియుండుటచే, అధర్మపథాక్తున్ = అధర్మమార్గముతోఁ గూడినవానిని, నాస్తికున్=పరము లేదనువానిని, విషమస్థబుద్ధిన్ = వైదికముకాని మార్గమున నున్నవానిని, దరిన్=సమీపమున, దూఱఁగానగున్=తిట్టవచ్చును.

తా త్ప ర్య ము.

"బ్రాహ్మణానా మనేకత్వ" మన్నట్టు లన్నివిషయములలో బ్రాహ్మణులు పరస్పర భేదాభిప్రాయము గలవారైనను ఈవిషయమందు వారందఱు నేకాభిప్రాయముగలవారై యున్నారు కావుననే వారివారి కులాచారప్రకారము ధర్మకార్యములు విడువక చేయుచున్నారు. ఫలములేదేని వారేలచేయుదురు. నీ

వధర్మమార్గమందున్నవాఁడ వని నాస్తికుఁడ వని యవైదిక మార్గనిష్ఠుఁడ వని నిన్ను దూషించి ప్రయోజనములేదు గాని నీవంటివానిని దగ్గఱఁజేర్చిన మాతండ్రిని నెంతైన దూషింపవచ్చును.

ఇట్లనుటచే నాస్తికవాదము చేయువారిని దగ్గఱఁజేర్పరాదని వారితోమాట లాడరాదని యేర్పడుచున్నది.

శ్లో. “యోవమన్యేత తేమూలే, హేతుశాస్త్రాశ్రయాద్ద్విజః
ససాధుభి ర్బహిష్కార్యో, నాస్తికో వేదనిందకః. మను. ౨-౧౧

ఏ ద్విజుఁడు ప్రమాణములైన శ్రుతిస్మృతులను హేతుతర్క వాదముచేఁ జర్చించుచు దూషించునో అట్టి నాస్తికుని వేదదూషకుని సాధువులు బహిష్కరింపవలయును.

శ్లో. విద్యాచోరో గురుద్రోహీ, వేదేశ్వర విదూషకః
తఏతే బహుపాప్మానః, సద్యోదండ్యా ఇతి శ్రుతిః ॥

దొంగతనముగా విద్య నేర్చుకొన్నవాఁడు, గురుద్రోహి వేదములను భగవంతుని దూషించినవాఁడు, వీరు మిక్కిలి యనేక పాపములు చేసినవారు, కావున వీరిని వెంటనే దండింపవలయునని శ్రుతి చెప్పుచున్నది.

శ్లో. మూఢైః పాపరతైః క్రూరై, స్సదాగమ పరాఙ్ముఖైః
సంబంధం నాచరేద్భక్తి, ర్నశ్యతే వైస్తు సంగమాత్.

మూఢులతోను, బాపకార్యములం దాసక్తిగలవారితోను, క్రూరకార్యములు చేయువారితోను, వేదముల నంగీకరింపనివారితోను సంబంధము చేయరాదు. వారితోఁ గలిసియుండినను భక్తి నశించును.

ఇచ్చట నొకశంక—

‘నిన్నుఁ దరిఁజేర్చిన తండ్రిని దూఱఁగాఁ దగున్’

అని రామచంద్రమూర్తి చెప్పెనుగదా. ఇది తండ్రిని బుద్ధిలేనివాఁడని, చేయరానిపని చేసెనని దూషించుటగదా? “శ్లో. శ్వపాక పుల్కసాదీనాం, కుత్సితానా మచేతసామ్। కులేషు తేభిజాయంతే, గురువృత్తావమానినః” గురువుల నడవడి నెవఁడు నిందించునో వాఁడు మాలమాదిగలయుఁ గుత్సితజాతులయుఁ గులమందుఁ బుట్టుననికదా శాస్త్రము చెప్పుచున్నది. ఇట్టికార్యము రామచంద్రమూర్తి యెట్లుచేసెను? తండ్రిని దూషించిన లక్ష్మణుని దల్లిని దూషించిన భరతుని నిరాకరించినవాఁడు తానిట్లు చేయవచ్చునా? జాబాలి బ్రాహ్మణుఁడుగదా! బ్రాహ్మణుని రామచంద్రమూర్తి నీవు దొంగవంటివాఁడవని దూషించెఁగదా! బ్రాహ్మణునట్లు దూషింపవచ్చునా ? “పరమప్యాపదం ప్రాప్తో, బ్రాహ్మణాన్న ప్రకోపయేత్, దైవాన్ కురు, రదైవాంశ్చ కఃక్షిపస్తాన్ సమ్మృధ్నుయాత్”అని యెంత యాపద్దశయందును బ్రాహ్మణుని గోపింపరాదనియుండ శ్రీరామచంద్రమూర్తి బ్రాహ్మణనింద యెట్లు చేసెనని సందేహము.

శ్రీరామచంద్రమూర్తి పితృనింద చేయలేదు. వైదిక విరుద్ధాచారముగల జాబాలిని జేర్చుకొనుట తప్పని చెప్పుటచే జాబాలిని నిందించినట్టిగాని తండ్రిని నిందించినట్లుగాదు. తండ్రియందు దురుద్దేశ మారోపింపలేదు. జాబాలినిదూషించినది సత్యమే. బ్రాహ్మణుఁడు ఋత్విజుఁడు నగుటచే జాబాలి నింద్యుఁడుగాఁడుగాని చార్వాకమతానుసారియై చార్వాకుని వలె మాట్లాడుటచేఁ జార్వాకుని వలె నింద్యుఁడేయగును; బ్రాహ్మణజాతియందుఁబుట్టి బ్రాహ్మణవృత్త మనుసరించిననే బ్రాహ్మణ గౌరవమునకు యోగ్యుఁడగునుగాని బ్రాహ్మణుఁడుగాఁబుట్టి క్షత్రియవృత్తియందుండిన క్షత్రియునిగాను వైశ్యవృత్తియందుండిన వైశ్యునిగాను, శూద్రవృత్తుఁడైనచో శూద్రుఁడుగా నెంచవలయునేగాని బ్రాహ్మణజాతియందుఁబుట్టి బ్రాహ్మణ వృత్తమందుండువానికిఁ జూపఁదగు గౌరవము తక్కినవానికిఁ జూపవలసిన పనిలేదు. దీనికి భీష్మవాక్యమే ప్రమాణము. ఆయుధముఁలు ధరించి తనమీఁదికి యుద్ధమునకై వచ్చిన పరశురామునితో భీష్ముఁడిట్లు చెప్పెను.

శ్లో. ఏతేవేదా శ్శరీరస్థా, బ్రాహ్మణ్యం యచ్ఛతే మహత్
తపశ్చ సుమహత్తప్తం నతేభ్యః స్పృహయామ్యహమ్
ప్రహరే క్షత్రధర్మస్య, యత్త్వం రామసమాశ్రితః
బ్రాహ్మణ క్షత్రియత్త్వం హి,యాతిశస్త్ర సముద్యమాత్. ఉద్యోగ.

పరశురామా! నీయందు వేదములున్నవి, గొప్ప బ్రాహ్మణ్యముగలదు, గొప్ప తపస్సుచేసితివి. ఇవన్నియు నేనాలోచింపను. క్షత్రధర్మము నాశ్రయించి నీవు వచ్చితివి గావున క్షత్రియుని గొట్టినట్లే కొట్టెదను. ఎప్పుడు నీవు చేత శస్త్రము పట్టితివో యప్పుడే నీవు క్షత్రియుఁడవైతివి. ఈ కారణముచేతనేకదా పాండవులు ద్రోణకృపాశ్వత్థామలను యుద్ధమునఁ గొట్టిరి. ఎప్పుడు జాబాలి చార్వాకమత మాశ్రయించెనో యప్పుడు చార్వాకునివలెనే భావించుట తప్పుగాదు. శుద్ధ బ్రాహ్మణ జాతులైన పరశురామ ద్రోణకృపాశ్వత్థామల విషయమే యిటుండ బ్రాహ్మణునకు క్షత్రియస్త్రీయందు జన్మించి క్షత్రవృత్తియందుండు రావణుఁడు బ్రాహ్మణుఁ డెట్లుకాఁగలఁడు? వానిని జంపిన బ్రహ్మహత్య యెట్లు రాఁగలదు? చూడు, సుందర. ౧౧౦లా ప. మందరము.

ఆ. చోరునట్టివాఁడు•సుమ్ము బుద్ధుఁడు నాస్తి,కుఁడునుం దథాగ•తుండ నిజము
ప్రజకు శంక్యుఁ డైన•వాఁడు నాస్తికుఁడౌట,
యతనికెదురువిబుధుఁ•డరుగరాదు. ౨౪౯౩

శంక్యుఁడు- తథాగతుఁడు=ఆమార్గమునఁ బోవువాఁడు.

తాత్పర్యము

బుద్ధుఁడు దొంగవలె దగ్గఱఁ జేరనీయరానివాఁడు- నాస్తికుఁడు బుద్ధుని మార్గమునఁ బోవువాఁడే- వీఁడు అవైదికుఁడని దురాచారుఁడని ప్రజలచే సందే

హింపఁబడువాఁడు- భయకారణమైనవాఁడు- కావున జ్ఞానముగలవాఁడు వాని కెదురుగఁబోరాదు. అనఁగా వానిముఖము చూడరాదనుట.

బుద్ధుఁడు.

ఈ పద్యమునందు బుద్ధుఁడు తథాగతుఁడని రెండుశబ్దములు కానవచ్చుచున్నవి. ఈరెండును కపిలవస్తురాజగు శుద్ధోదనునకు మాయాదేవియందు జనించిన రాజకుమారుని పేరని-

సర్వజ్ఞ స్సుగతో బుద్ధో. ధర్మరాజ స్తథాగతః। సశాక్యసింహ స్సర్వార్థ సిద్ధ శౌద్ధోదనిశ్చసః। గౌతమాశ్చార్క బంధుశ్చ, మాయాదేవీ సుతశ్చసః॥ అను శ్లోకములచేఁ దెలియనయ్యెడి. ఈయన భార్యపేరు యశోధర, పుత్రుఁడు రాహులుఁడు. ఈయన తమ్ముఁడు దేవదత్తుఁడు, కొందఱితఁడు సమానోదరుఁడు కాఁడందురు.

భగవంతుఁడగు విష్ణుని దశావతారములలో బుద్ధావతారము తొమ్మిదవ యవతారముగ మనవారు లెక్కించుచున్నారు. "మత్స్యః కూర్మో వరాహశ్చ, నారసింహాశ్చ వామనః। రామోరామశ్చ రామశ్చ బుద్ధః కల్కిరేవచ॥ ఈ శ్లోకమునే కొందఱు బుద్ధశబ్దముమాఱు కృష్ణశబ్దము పఠింతురు. అది యెట్లున్నను బుద్ధుఁడు కృష్ణుని వెనుకటివాఁడనియుఁ గలియుగమందుఁ బుట్టినవాఁడనియుఁ జెప్పుటయందు సందేహములేదు. అట్లయినయెడల బుద్ధునిపేరు రామాయణమున నెట్లు చెప్పఁబడెనని యాక్షేపము రాకమానదు. ఆకారణముచేఁ గొందఱు దీనిని బ్రక్షిప్తమందురు. అనఁగాఁ గ్రొత్తగా నెవరోతెచ్చి యిఱికించినదని యర్థము. ఇది యొకవిధమున నంగీకరింపవలసినదిగానే యున్నది. రెండవ సమాధానము, కల్ప కల్పమందు దశావతారములు వచ్చుచుండును పూర్వకల్పమం దెట్టిసృష్టియో యట్టి సృష్టియే యీావలి కల్పమందు జరగును. ధాతా యథా పూర్వమకల్పయత్తని వేదముల నాధారము చేసికొని పేర్లతోఁగూడ మునుపటివలెనే బ్రహ్మ సృష్టించుచుండును. వేదముల మూలమున పోయిన కల్పమునందు జరిగినవికొన్ని యిప్పుడు మనకుఁ గానవచ్చుచున్నవి.

అట్టులే బుద్ధునివిషయమని కొందఱందురు. బుద్ధునిపేరు తెలిసియుండిన నుండవచ్చునుగాక బుద్ధుఁడు పుట్టినతరువాతఁగదా బౌద్ధమతము పుట్టెను. రాముని కాలమునకు బౌద్ధమతము లేదే, ఆప్రశంస రానేల యని యాక్షేపము రాకతప్పదు. నాకుఁదోఁచిన సమాధానము నేను జెప్పెదను. పరిణామవాదప్రకారము ప్రథమ మనుష్యులు ఆస్ట్రేలియా దేశమందలి బుష్మెన్ (Bush men) వలెఁ గేవల పశుప్రాయులు. అది మనుష్యులయందుఁ బ్రథమదశ. అవలఁ బైపై తరగతులకు రానురాను గొంతకాలమున కప్పటిమనుష్యులకు మనుష్యులు పుట్టుట చచ్చుట యవిరెండు ప్రత్యక్షముగ గోచరించుచుండెను. అప్ప

టికి వారికి దేవుఁడున్నాఁడను జ్ఞానము లేదు, పరలోకజ్ఞానము లేదు. కావున నప్పటివారిలో బుద్ధిమంతులగువారు మరణించిన దేహములను గాల్చినను బూడ్చినను శేషమేమి మిగులకపోవుటచే సర్వము దేహమేకాని దేహమునకంటె భిన్నమైన వస్తువు మఱియొకటి లేదనియు మన్ను- నెత్తురు- గాలి- వేఁడిమి యీనాలుగు దేహమునందుండుటను లోకమున నివి కానవచ్చుటను, ఈనాలుగు కలిసి దేహమయ్యెనని తీర్మానించిరి.

ఆకాశము ఇంద్రియగోచరముకానిది గావున నది వారు లెక్కకుఁదీసికొన రైరి. ఉండునది దేహమే కావున నదియుండువఱకు దైహిక భోగములన్నియు ననుభవింపవలయుననియు, నాకు వక్క సున్నము గలిసిన నెట్లొక విలక్షణ వర్ణము గుణముపుట్టునో యట్టులే నాలుగు భూతములు కలిసినపుడు చైతన్య ముదయించుననియుఁ దీర్మానించుకొనిరి. చార్వాకమత మిదియే. ఈమతమం దాత్మయను వస్తువులేదు. ఆత్మ వీరు కలదనినను లేదనినను నది నిత్యవస్తువు గావున లేకపోదు. ఇట్లు కొంతకాలము జరుగఁగా నప్పటి బుద్ధిమంతులు శవమును జూచి యిట్లాలోచించిరి. మునుపున్న నాలుగుభూతము లీదేహమున నిప్పటికి నున్నవికదా. ఇంతకుముందు మాటలాడునది, చూచునది, నడచునది యిప్పు డేల మాటలాడదు, చూడదు, నడవదు? ఊపిరిపోయినది యందమా! మనము లోపలికి గాలిని బంపిన బ్రదుకునా? కావున నీనాలుగు భూతములుగాక లోపల నేదోయొక శక్తియుండుటచే నదియున్నంతవఱకు నిది కదలుచు మెదలుచుండి నది. అదిపోఁగానే యాశక్తిపోయినది. కావున జడమైన దేహముకాక దానికంటె భిన్నమైన చైతన్యశక్తి యొకటియున్నదని తీర్మానించిరి. దీనికిఁదోడు స్వప్న ములువచ్చుట అందుఁ జచ్చినవారు కనఁబడుట మాటలాడుట తటస్థించుచుండు టచే వారియూహ స్థిరపడెను. ఇప్పుడు జడదేహము అజడచైతన్యము రెండు గలవని యేర్పాటయ్యెను. ఈ రెంటిలో నేదిసత్యమని యప్పటి ప్రాజ్ఞులు విమ ర్శింపఁబూనిరి. చార్వాకాదులు దేహమే సత్యమనిరి. మఱికొందఱు చైతన్యమే సత్యము. దేహమునకు వినాశోత్పత్తులు కలవు. కావున నది సత్యమనరాదని వాదించిరి.

ఇదియే మాయావాదముగఁ బరిణమించి యిప్పుడద్వైతమయ్యెను. వీరి కలహమునుజూచి మీరేల కలహించెదరు? రెండును సత్యములే. అసత్యమైనది లేదని కొందఱనిరి. ఈవాదమే ద్వైతము విశిష్టాద్వైతముగఁ బరిణమించెను మతమనఁగా నభిప్రాయము. మతభేదము లిట్లుకలిగెను. కావున నిన్నియభి ప్రాయము లన్ని కాలముల నుండునవే. దశరథు రాజ్యమున నాస్తికుఁడు లేఁడని చెప్పఁబడెను, గాని లోకమున నాస్తికమతమే లేదని చెప్పఁబడలేదు. నాస్తికమతమే లేదేని నాస్తికుఁడు లేఁడని చెప్ప నెట్లుసాధ్యపడును? పుట్టనిబిడ్డకుఁ బేరెట్లువచ్చును? మనుస్మృతియందే 'నాస్తికః వేదనిందక'యని శబ్దములు కానవచ్చునపుడు వారున్నారని యర్థమా? లేరనియర్థమా?

శ్రీరామానుజాచార్యులవారి వలన విశిష్టాద్వైతము, శ్రీశంకరాచార్యుల వారివలన నద్వైతము, మధ్వాచార్యులవారివలన ద్వైతము ప్రబలినట్లు బుద్ధుని వలన నామతము ప్రబలెను. అంతియకాని త్రిమతాచార్యులు పుట్టకముందు త్రిమతములు లేవని యర్థముగాదు. బౌద్ధులుపయోగించు బుద్ధ తథాగత శ్రమణ చైత్య శబ్దములు రామాయణమందున్నవి. అవి సంస్కృత పదములు వానినే బౌద్ధులు గ్రహించిరి. బౌద్ధులకుముం దాశబ్దములు లేవనుట సరిగాదు. కావున రామచంద్రమూర్తి బౌద్ధము నిరసించినాఁడనుటయందు వింత యేమియులేదు. ఆత్మలేదని యాత్మజ్ఞానము హరించుటచే నాస్తికుఁడు చోరుఁడనఁబడెను.

జాబాలి యీప్రశంస చేయకముందే శ్రీరామచంద్రమూర్తి భరతునకుఁ జేసిన యుపదేశవాక్యములందు "లోకాయతికుల విప్రుల. నేకాలమునందుఁ గొలువ వేకదవార, స్తోకానర్థచణుల్ సుమి ప్రాకట విపరీతమతులు బండిత మానుల్." అని చెప్పెఁగదా. అయోధ్య, ౨-౭౭-౨.

బుద్ధుని కాలమునకుముందే వైతండికులు వితండావాదులని కొందఱు బ్రాహ్మణులుండిరి. అవునన్నది కాదనుట వీరిమతము. వీరు స్వపక్ష పరపక్ష నిర్ధూమధాములు. వీరితో సంభాషింపరాదని సాంగత్యము చేయరాదని బౌద్ధ గ్రంథములందు జైన గ్రంథములందును గలదు. జనకరాజు సభలో వంది బౌద్ధవాదముచేసి బ్రాహ్మణుల నోడించినట్టును అతనిని అష్టావక్రుఁ డోడించినట్టు భారతమున నరణ్యపర్వమునఁ గలదు. కావున నాస్తికమతము బౌద్ధమతము రామునికంటె ముందటినుండి యున్నవి. వానినే రామచంద్రమూర్తి చెప్పెను. శాక్యబుద్ధుఁడు తానేడవ బుద్ధుఁడనియుఁ దనకుముం దార్వురు బుద్ధులు పోయి రని చెప్పెను. సుందర, ౨౧౧ ప. చూడు.

బౌద్ధమతమువారు జ్ఞానమే బుద్ధియని యందురుగాని యంతఃకరణమును వారంగీకరింపరు. బుద్ధిశబ్దము జ్ఞానార్థకము గావున బుద్ధి జ్ఞానమే యని వారి వాదము.

బౌద్ధులందు నలుతెగలవారు (1) మాధ్యమికులు (2) యోగాచార్యులు (3) సౌత్రాంతికులు (4) వైభాషికులు గలరు. ఇందు మాధ్యమికులు సర్వశూన్య వాదులు. ఈమతమే యచలమని, పూర్ణమని హీనజాతులందు వ్యాపించి యున్నది. శ్రీశంకరాచార్యులవారి ప్రాచార్యులు గౌడపాదాచార్యు లీశాఖకుఁ జేరియుండి యందు గ్రంథముకూడ వ్రాసినట్టు తెలియుచున్నది. వీరి యద్వైతమునకు మాధ్యమిక సర్వశూన్య విజ్ఞానవాదములకు విశేషభేదములేదు. బ్రహ్మ మొకటి యలంకార విద్యార్థివలె నున్నదని యద్వైతులందురు. అదియు లేదని శూన్యవాదులందురు. వీరియస్తి వారినాస్తి రెండు నించుమించు సమానార్థక ములే యని మధ్వాచార్యులవారు బృహదారణ్యకోపనిషత్తు భాష్యమందు వివరముగ వ్రాసియున్నారు. (చూడు. బృహ. ౪-౩-౧౦ నతత్రరథ భాష్యము చూ.)

ఇచ్చట నొకయాక్షేపము, వేదబాహ్యులైన చార్వాకులమతము బౌద్ధమతము రామచంద్రమూర్తి తన వైదికమతము నాధారముచేసికొని ఖండించుట యేమిప్రశస్త మార్గము, మామతప్రకారము మీమతము తప్పనుట వాద లక్షణమా? యనికొందఱందురు.

చార్వాకుల వాదమునకుఁ బ్రత్యక్షము ప్రమాణమైనను లోకవ్యవహారమున ననుమానము గ్రహింపక విధిలేదు. ఆకారణముచే నాత్మలేదను నామతమును ఖండించి యాత్మ కలదనియు దేహమెంతో యాత్మయంతయే యుండుననియు నేనుఁగునందాత్మ యేనుఁగునంత చీమయందలియాత్మ చీమయంత యుండునని మఱియొకమతమువారు ఖండించి దానిని మఱియొకరు ఖండించి యిట్లు ఖండించుచు రాఁగారాఁగాఁ దుదకు వైదికమతము మిగిలెను, కావున దీనినాధారము చేసికొని రామచంద్రమూర్తి మాటలాడెను. అటుకాకుండిన నిన్నిమత వాదములను వరుసగ మాటలాడియుండును. జాబాలి కివన్నియుఁ దెలియనివి కావు. అట్టివానికి నేమియుఁ దెలియనివానికివలె వరుసగానేల చెప్పవలెను. ఇవన్నియు వరుసగఁ జెప్పఁబూనిన నదియొక సర్వదర్శన సంగ్రహమగును గావున నాపనికి యత్నింపలేదు.

ముఖ్య వైదికమతములు అనఁగా వేదముల నాధారము చేసికొని వానినే ప్రమాణముగా గ్రహించినవి మూఁడు, (1) అద్వైతము, వీరేకతత్త్వవాదులు, వీరి మతప్రకారము పరబ్రహ్మముతప్పఁ దక్కినదంతయు మిథ్య(2) ద్వైతము, ఇది యద్వైతమునకుఁ బ్రత్యక్షవిరోధము, వీరు జీవులనేకులని భగవంతుఁడు జీవులు ప్రకృతి యన్నియు సత్యము అన్ని వేఱువేఱని చెప్పుదురు.అద్వైతులు నిర్గుణ బ్రహ్మమును వీరంగీకరింపరు. (3) విశిష్టాద్వైతము, ఇది యుభయము నకు మధ్యస్థము, ద్వైతమువలె జీవబాహుళ్యము నంగీకరింతురు. ఈశ్వరుఁడు జీవుఁడు ప్రకృతి భిన్నములేకాని జీవప్రకృతులు రెండు నీశ్వరునికి విశేషణమని శరీరి శరీరభావమున నంగీకరింతురు. సూక్ష్మ చిదచిద్విశిష్టుఁడైన యీశ్వరుఁడే స్థూల చిదచిద్విశిష్టుఁడైన ప్రపంచముగాఁ బరిణమించెను. గావునఁ బ్రపంచము సత్యమే భగవత్స్వరూపమే యందురు. ఈముగ్గుర కుపనిషత్తులే ప్రమాణము. వారివారికిఁ దోఁచినట్లు వారు వారర్థము చెప్పుదురు. కాని వేదబాహ్య మతముల ఖండించుటయందు ముగ్గురి కైకమత్యము గలదు.

తథాగతశబ్దమిందేకాక సుందరకాండము ౧౩-వ సర్గము ౪౯-వ శ్లోకమందును గలదు."రామం తథాగతం దృష్ట్వా"ఇచ్చట రాముని బుద్ధుఁడనవచ్చునా?

శా. నీకుం బూర్వులు నీకు మిన్నలు మహా◆నిష్ఠాత్ములై కర్మముల్
సాకల్యంబుగఁ జేయరే? యిహపర◆స్ఫాయజ్జయశ్రీకులై
జోకన్ శాశ్వతమూర్తులై వెలుఁగరే◆ శుద్ధాత్ముల ట్లొటఁ దా
రేకాలంబున మంగళాత్మకమహా◆శ్రీస్ఫూర్తియుల్ సల్పరే? ౪౫౬

నీకున్=నీకంటె- "అన్యదూర సమీపేత రాద్యర్థయోగంబునఁ గంటె కువర్ణంబులగు, సు. వ్యా. కారక ౧౯ సూ. మిన్నలు=శ్రేష్ఠులు,మహానిష్ఠాత్ములై =కర్మయోగమందు గొప్పనిష్ఠగలవారై, సాకల్యంబుగన్=పూర్ణముగ- కొఱఁత లేకుండ ఇహ...శ్రీకులై =ఇహపర=ఈలోకమందుఁ బరలోకమందు, స్ఫాయత్= ప్రకాశించు, జయశ్రీకులై =జయలక్ష్మిగలవారై, శాశ్వతమూర్తులై =గ్రహములు నక్షత్రములును స్థిరమైన యాకారముగలవారై, వెలుఁగరే = ప్రకాశింపరా- "సుకృతాంహి ఏతాని జ్యోతీగ్ంషి యన్నక్షత్రాణి" యని శ్రుతి. యుద్ధకాండ మండలి సీతాదేవి వాక్య (౬౮౩-౫) మీయర్థమునే బోధించెడిని.

కం. అయ పుణ్యశీలురకు సు,ప్రియముం బుణ్యంబు నగుచుఁ బేర్గన్నత్వద
న్వయముం గనుచున్నాఁడవె, నయశీలా! మింటనిల్చి నక్షత్రమవై.

శుద్ధాత్ములు=నిర్మలమగు నంతఃకరణము గలవారు, అట్లౌటన్ = వైదిక కర్మానుష్ఠానమువలన నిహపరలోక సుఖములు గలుగుటవలన, ఎట్టికాలము నందు = ఎట్టిదశయందు, మంగళాత్మక = శుభస్వభావముగలవై మిక్కిలి యిష్టములగు కార్యములను జేయలేదా.

దీనివలన శ్రీరామచంద్రమూర్తి కర్మానుష్ఠానము ఫలవంతమని యవశ్య కర్తవ్యమని చెప్పినవాఁడాయెను. భగవంతుఁడొకఁడు గలఁడని యాయన సర్వ జ్ఞుఁడు, సర్వశక్తుఁడు, సర్వవ్యాపి, సర్వకర్త, సర్వకర్మ ఫలప్రదాత యని వైదిక మతము.

కొందఱు జీవులు కర్తలందురు. అటైనఁ బ్రతిజీవియుఁ దనకు మేలైనదే చేసికొనునుగాని తనకనిష్ట ఫలమిచ్చుదానిని జేయఁడుకదా. ఎల్లప్పుడు సంతోష సుఖములు గోరునుగాని జీవి కష్టశోకములు గోరఁడుకదా. సంతోష సుఖప్రాప్తికిఁ గాని దుఃఖశోక నివారణమునకుఁగాని జీవులు శక్తిమంతులుగాక యున్నారు కదా. కావున జీవులు ప్రయోజక కర్తలుగారు. ప్రయోజ్యకర్తలు.

ఇఁక గర్మములు కర్తలందమా! కర్మము లచేతనములు. అవి యెట్లు కర్మఫలములను స్వర్గనరకాదులను సుఖదుఃఖములఁ గలిగింపఁగలవు? కావునఁ గర్మములు కర్తలుగావు.

ప్రకృతి కర్తయందమా! యనిన నదియు నచేతనమే. అచేతనమెట్లు చేతనులకుఁ గర్మఫలము లీయఁగలదు? కర్మముచేయువారి యుద్దేశము తెలిసి కొనఁ గలదు? కావునఁ బ్రకృతియుఁ గర్తకాదు.

కాలము కర్తయందమా యనిన నదియు నచేతనమే కావునఁ గర్మఫల మీయఁజాలదు.

ఒకఁడు కోడిగ్రుడ్డునం దేయేవస్తు పరమాణువు లెట్లెట్లు కలిసియున్నవో యట్టులే యేమిభేదములేకుండ నొకకోడిగ్రుడ్డును గల్పించి, యొకకోడి గ్రుడ్లను

బొదుగుచుండ వానిలో దీనినిగలిపి యుంచెను. అన్నిటికిఁ జైతన్యమువచ్చి కోడిపిల్లలు బయటవచ్చెనుగాని వీఁడు పెట్టినది పెట్టినట్లె యుండెను.

పరమాణుసాంగత్యము వలననే చైతన్య ముదయించునను వాదము నిది ఖండించుచున్నది. పసుపు సున్నము కలిపినవచ్చు నెఱ్ఱఁగుగాని తమల పాకులు పోకలు సున్నము గలిసినవచ్చు నెఱుపుగాని చైతన్యముగాదు.

కావున బాహ్యమతములవారు కర్తలనిచెప్పెడు నవి కర్తలుకామిని సర్వ జ్ఞుఁడు సర్వశక్తుఁడగు భగవంతుఁడు మీఁదియన్నిటికంటె వేఱగువాఁడొకఁడు **కర్మఫలదాత** యుండవలయును.

కావున భగవంతుఁడు లేఁడనికాని యుండినను నాస్తికల్పుఁడని చెప్పెడు వాదము సరిగాదు. వేదోక్త కర్మములకు ఫలమున్నదా లేదా యనువిషయమున ననుభవము ననుమానము ప్రమాణములు. అభిచారహోమాదులవలనఁ గలుగు ఫలము ప్రత్యక్షము. ఎప్పుడు వేదోక్తములగు నథర్వణ మంత్రములు ప్రత్యక్ష ఫలము లిచ్చుచున్నవో యప్పుడే యందలి తక్కినమంత్రములు ఫలవంతము లని యనుమాన ప్రమాణముచే సాధ్యము. కావున స్వర్గాపవర్గములు కర్మ ఫలములని యేర్పడుచున్నది. వేదాంగమగు జ్యోతిషము ప్రకారము గ్రహ ణాదులు నిశ్చయము లగుచున్నవి ఇట్టివి యితరమతములందు లేవుగదా. అనేక దేవాలయములందుఁ బ్రతిష్ఠిత దేవతామూర్తులవలననే యిష్టసిద్ధులు ననిష్ట నివారణములు కలుగుచున్నవి. వీని కితరమతములందుఁ గారణము చెప్పఁబడలేదు. నాస్తియనుటకు నామతము వారిమాటతప్ప వేఱుప్రమాణము లేదు. తర్కము బుద్ధిసాధ్యము. ఒక బుద్ధిమంతుఁడు యుక్తులచేఁ జెప్పినదానిని మఱియొక బుద్ధిమంతుఁడు యుక్తులచేతనే ఖండింపవచ్చును. కావునఁ గేవల తర్కము ప్రమాణముగాదు. ప్రత్యక్షానుమానములు స్వతంత్ర ప్రమాణములు గావని ముందేచెప్పఁబడెను. కావున శాస్త్రమే ప్రమాణము, శాస్త్రోక్తకర్మమే ఫలకారణము, ఫలదాత భగవంతుఁడు. కావునఁ గర్మస్వరూప త్యాగము సర్వదా నిషిద్ధము.

శ్లో॥ భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః ప్రాణినాం బుద్ధిజీవినః
బుద్ధిమత్సునరాశ్శ్రేష్ఠా నరేషు బ్రాహ్మణా స్స్మృతాః
బ్రాహ్మణేషుచ విద్వాంసో విద్వత్సుకృత బుద్ధయః
కృతబుద్ధిషు కర్తారః కర్తృషు బ్రహ్మవేదినః.　　మను.

స్థావర జంగములందుఁ బ్రాణముగలవి శ్రేష్ఠములు. ప్రాణములు గల వానిలోఁ బశువులు శ్రేష్ఠములు. పశువులలో మనుష్యులు శ్రేష్ఠులు, మనుష్యు లందు బ్రాహ్మణులు శ్రేష్ఠులు, బ్రాహ్మణులందు వేదవేత్తలు శ్రేష్ఠులు, వేదవేత్త లందు వేదార్థ జ్ఞానముగలవారు శ్రేష్ఠులు, వేదార్థ జ్ఞానముగలవారిలో వేదోక్త కర్మము చేయువారు శ్రేష్ఠులు, కర్మములు చేయువారియందు బ్రహ్మవేత్తలు శ్రేష్ఠులు.

ఈ శ్లోకముల విషయమున వైద్యనాథీయమందు "కర్తృషు బ్రహ్మవేదిన ఇతి వదతా బ్రహ్మవిద్భిరపి కర్మకర్తవ్యమితి సూచితం భవతి" యని వ్రాయఁబడెను. ఇవి మనుస్మృతి ౭-౯౬-౯౮ శ్లోకములు. దీనివలన బ్రహ్మవేత్తలకైనను గర్మస్వరూప త్యాగ వాదము నిరస్తము.

తా త్ప ర్య ము

నీకంటె ముందుండినవారు కాదుకాదు, జ్ఞానమునందు నీకంటె గొప్పవారు కఠినమైన నిష్ఠలుగలవారై కొఱఁతలేకుండఁ గర్మములు చేయలేదా? వారు బుద్ధిహీనులసియా నీతలంపు, నిర్మల మనస్సుతోఁ గర్మములు చేసినవారు, ఈ లోకమందుఁ బరలోకమందుఁగూడ జయలక్ష్మిని బొందినవారై తేజోమూర్తులై శాశ్వతంబుగఁ బ్రకాశించుచుండలేదా? అటువంటిఫలము గలుగుటచేత శుభస్వభావముగల తమకిష్టమైన కార్యములను సర్వకాలములందుఁ జేయలేదా? కర్మములు నిష్ఫలములైన వీరెల్లరేల యిట్లు చేయుదురు.

ఉ. దానగుణప్రధానులు ని • తాంతదయామతు లార్యవర్య సం
  తానసమేతు లప్రతిహ • తప్రభు లుత్తమధర్మమార్గస
  మ్మానులు వీతపాపు లస • మానచరిత్రులు కర్మనిష్ఠలం
  బూనెడిమౌనిసత్తములు • వో మునివేషక! లోకపూజితుల్. ౭౪౬౮

మునివేషక = మునివేషము ధరించినవాఁడా, దానగుణప్రధానులు=దానగుణమే ప్రధానముగాఁ గలవారు, 'తస్మాద్దానం పరమంవదంతి' 'త్యాగేనైకే నమృతత్వమానశుః' ఇత్యాదులు ప్రమాణములు. నితాంతదయామతులు = మిక్కిలి దయగల మనస్సుగలవారు, ఆర్యవర్యసంతానసమేతులు=గొప్పవారి సమూహముతోఁ గూడినవారు, అప్రతిహత=ఎదురులేని, ప్రభులు=తేజస్సుగలవారు, ఉత్తమ=శ్రేష్ఠమైన, ధర్మమార్గసమ్మానులు = ధర్మపుఁద్రోవ వర్తించుట యను గౌరవముగలవారు, వీతపాపులు = పాపములేనివారు, లోకపూజితుల్ = జనులచేఁ బూజింపఁబడువారు.

తా త్ప ర్య ము

నీవు మునివేషము వేసితివేకాని నీయందు మునికుండవలసిన జ్ఞానముగాని గుణముగాని వర్తనముగానిలేదు. జనులచేఁ బూజింపఁబడువారు నీవంటి వేషధారులు గారు. దానగుణము ప్రధానముగాఁ గలవారు, అపార భూతదయగలవారు. గొప్పవారి సమూహముతో సాంగత్యము గలవారు. ఎదురులేని తేజస్సుగలవారు. ఉత్తమమైన ధర్మమార్గమును గౌరవించువారు, పాపరహితులు, సమానములేని మంచి నడవడి గలవారు, కర్మనిష్ఠల విడువని మునీశ్వరులు. వీరు నిజముగా లోకపూజితులు.

సారాంశము.

1) పరలోకము లేదు. కావునఁ దండ్రితో నసత్యమాడినను పాపానుభవ భయము లేదు.

2) బాటసారి నుద్దేశించి యింట శ్రాద్ధముపెట్టిన నతని కడుపు నిండనట్లు చచ్చినవాని నుద్దేశించి శ్రాద్ధములు పెట్టినను బ్రయోజనములేదు కావునఁ గర్మములు వ్యర్థములు. ఇవి జాబాలి వాదములోని ముఖ్యాంశములు.

1) లోకమంతయు సత్యముపై నాధారపడియున్నది. రాజగువాఁడసత్యమాడెనేని వానినిఁజూచి లోకులందఱు నసత్యమాడుదురు. అసత్యము ప్రబలిన ధర్మము నాశమగును. సత్యము ధర్మము రెండుఁజెడెనేని ప్రజలొకరి నొకరు పీఁకితిందురు. కావున సత్యధర్మము లవశ్యానుష్ఠేయములు.

2) కర్మములు ఫలవంతములగునా కావా? యనునది తర్కయుక్తులచే సాధ్యమగునది కాదు. అనుభవవేద్యము! ఇంద్రియగోచరమైనదానికిఁ దర్కము గాని యతీంద్రములయినవాని విషయమునఁ దర్కము పనికిరాదు. తర్కము బురదలోని కంబము. ఎవఁడే ప్రక్కకీడ్చిన నాప్రక్కకుఁ బోవును. తర్కయుక్తులచే నేఁడొకటి యొకఁడు సిద్ధాంతముచేసిన దానిని నంతకంటె వేఱొకఁడు బుద్ధిమంతుఁడు దానిని ఖండించి తద్విరుద్ధముగా సిద్ధాంతము చేయవచ్చును. కావునఁ గేవల ప్రత్యక్షమెట్లు ప్రమాణముగాదో యట్టులే కేవల తర్కయుక్తులు ప్రమాణములు గావు.

శ్లో. శ్రుతిసాహిత్యరహిత, మనుమానం నకుత్రచిత్
నిశ్చయా త్సాధయేదర్థం, ప్రమాణాంతరమేవచ
శ్రుతి స్మృతి సహాయం య,త్ప్రమాణాంతర ముత్తమమ్
ప్రమాణపదవీ గచ్ఛన్నాత్ర కార్యావిచారణా
పూర్వోత్త రావిరోధేన కోత్రార్థోభి మతోభవేత్
ఇత్యాద్య మూహనం తర్కః, శుష్కతర్కంతు వర్జయేత్.

అర్థము.

అనుమానముగాని, యితర ప్రమాణములుగాని వేదముల సాహాయ్యము లేకుండిన నిశ్చయార్థమును సాధింపలేవు. శ్రుతి స్మృతి సాహాయ్యముగల యితర ప్రమాణ ముత్తమము. అదియే ప్రమాణ మనిపించుకొన యోగ్యమైనదగును. పూర్వోత్తర విరోధములులేక యర్థము సాధించునూహయే తర్కము. శుష్కతర్కము త్యాజ్యము. మనుస్మృతియందు.

శ్లో॥ ఆర్షం ధర్మోపదేశంచ, వేదశాస్త్రావిరోధినా
య స్తర్కేణాను సంధత్తే, సధర్మం వేదనేతరః.

వేదశాస్త్రములకు విరోధింపకుండ స్మృతులయందుఁ జెప్పఁబడిన ధర్మోప దేశమును నెవఁడు తర్కముచే ననుసంధించుచున్నాఁడో సమన్వయపఱుచు కొనుచున్నాఁడో వాఁడే ధర్మము తెలిసినవాఁడు కాని యితరుఁడుకాఁడు.

అతీంద్రియములైనవాని విషయమున వేదములే ప్రమాణములు. అవి యపౌరుషేయములు. అవి యనాదిగఁ బ్రమాణముగఁగొని కార్యములు చేయఁ బడుచున్నవి. వానికిఁ గర్తయెవఁడో తెలియదు. అట్టి వేదముల ప్రకారము కర్మములుచేసిన ఫలము కలుగుటచేతనే యవిసత్యములని యంగీకరింపవలసి యున్నవి. కర్మములకు నైహిక ఫలములు ప్రత్యక్షానుభవమునకు వచ్చినపుడు ఆముష్మికములు కూడవచ్చునని యేల నమ్మరాదు? విశ్వాసమాత్రమేగాక ఫల మనుభవించినవారిని జూచుచున్నాముకదా. నహుషుఁడు నూఱుయజ్ఞములుచేసి యింద్రుఁడయ్యెను. అగ్నిత్యాది పదవులు కర్మఫలములుకదా. నక్షత్రాదులు కర్మఫలముల నైనవియేకదా. కావున వైదిక కర్మములకు ఫలములేదనరాదు. బాటసారిగుఱించి యింటఁ దద్దినము పెట్టుట వైదికకర్మముగాదు. కావున దానికి ఫలములేదు. కావునఁ గర్మనిష్ఠులే శ్రేష్ఠులుగాని కర్మభ్రష్టులుగారని శ్రీరామ చంద్రమూర్తి ప్రత్యుత్తర సారాంశము.

చం. అనుచు సరోషభాషణము • లాడుమహాత్మ నదీనసత్త్వుఁ గ
న్గొని మునివెండి యాస్తిక మ•కుంఠితసత్యము నైనపల్కు సా
నునయముగా వచించె సుమ•నోవరసన్నుత! కాను నాస్తికుం
డను, నవ నాస్తికోక్తి, మఱి•నాస్తి యటన్నది నాస్తి యెంతయున్.

సరోసభాషణములు = కోపముతోఁగూడిన మాటలు, మహాత్మున్ = గొప్ప మనస్సుగలవానిని, అదీనసత్త్వున్=గొప్ప సత్త్వగుణము కలవానిని, ఆస్తికము= పరలోకము- దైవము గలఁడనునది, అకుంఠితసత్యము=మొక్కవోని సత్యము గలది, సానునయముగాన్=ఊఱడింపుమాటలతో, సుమనోవర=దేవతాశ్రేష్ఠులచే, సన్నుత=బాగుగఁ బొగడఁబడినవాఁడా, నాస్తికోక్తి = నాస్తికవాక్యము, నాస్తి యన్నదినాస్తి=లేదు అనునదిలేదు- సర్వము సత్యము అనిభావము.

దీనివలన నాస్తికవాదము వినవైన వినరాదనియు నెవరైనఁజేసిన చీకొట్టవలయుననియు నేర్పడుచున్నది.

పాషండభోజిభిః పాపైః వేదవాద విరోధిభిః
పాషండినో వికర్మస్థాన్, బైడాల వ్రతికాన్ శ్చరన్
హైతుకాన్ బకవృత్తీంశ్చ, వాఙ్మాత్రేణాపి నార్చయేత్.

వి. పు. ౧౮-౩-౯౪.

పాషండుల కన్నము పెట్టువానిని, పాషండునియన్నముఁ దినువానిని, వేద వాద విరోధిని, పాషండుని, ప్రచ్ఛన్నముగాఁ బాపములు చేయువానిని, నెదుట

మంచిమాటలాడి చాటున నిందించువానిని, సత్కర్మములయందు సందేహబుద్ధి గలవానిని మాటలచేనైన గౌరవింపరాదు.

తాత్పర్యము

అని యీప్రకారము కోపముతో శ్రీరామచంద్రమూర్తి మాటలాడఁగా గొప్పమనస్సుగలవాఁడు మహాసత్త్వగుణము గలవాఁడునగు రామచంద్ర మూర్తిని గని నిష్కారణముగ నిటువంటివాని మనస్సును నొప్పించితినే యని జాబాలి మరల నాయనను గేవల సత్యమైన పలుకులతో నూఱడించుచు నిట్లనియె. రామచంద్రా! నీవు దేవశ్రేష్ఠులగు బ్రహ్మాదులచే స్తుతింపఁబడు వాఁడవు. నేను నాస్తికుఁడనుగాను. నేను నాస్తికోక్తులను జెప్పను. నాస్తియను నది లోకమునలేదు. సర్వమస్తియే.

దీనివలనఁ బ్రపంచము పారమార్థిక మిథ్యయని యింద్రజాలమని చెప్పెడు వారిమాటలు నమ్మరాదని భావము. నాల్గవ పాదంబున నుభయయతి.

—• జాబాలి శ్రీరామునితోఁ దన్ను క్షమింప వేఁడుట. •—

సీ. జానకీశ్వర! ధ•ర్మసంకటవేళ య,త్కించి న్మతం బూని•కీడు దలఁగఁ
ద్రోచుట యొప్పది•చూచి యే నిప్పు డ,రాజకం బనునుప•ద్రవము దొడర
నాస్తికవాద మొ•నర్చితి నంతియ, కాని నాస్తికుఁడ నేఁ•గాను వింటె
యన్యుఁ డెవ్వం డేని•నాస్తికవాదంబుఁ జేయఁ దద్వాదంబుఁ•జెఱుతు నేన

తే. ధర్మసంకటకాలోచి•తంబు సుమ్ము; నాదుప్రకృతపు నాస్తిక•వాద మిట్టి
ధర్మసంకటకాలంబు•దాపరించె, నేని వెండి నాస్తికతను•బూనువాఁడ.

ధర్మసంకటవేళన్ = ధర్మము చెడునట్టిసమయమున, యత్కించిత్ = ఏదియో యొకమతము, అరాజకంబు=రాజులేకపోవుట యను, ఉపద్రవము= విపత్తు, ధర్మసంకట కాలోచితంబు = ధర్మమునకు విపత్తువచ్చిన కాలమునకుఁ దగినది.

తాత్పర్యము

నీవు నాస్తికుఁడవు కాకపోయిన నాస్తికవాద మేలచేసితివందువా? చెప్పెద వినుము. రామచంద్రా! ధర్మమునకు నపాయము సంభవించినపు డేదోయొక విధముగా న్యాయముగనో యన్యాయముగనో ధర్మము చెడకుండఁ గాపాడుట న్యాయ్యము ఇది యాపద్ధర్మము. ఇప్పుడు మీతండ్రి మరణించెను. నీవు రాజ్యము నంగీకరింపవైతివి; నాకు రాజ్యమక్కఱలేదని భరతుఁడు కూడునీళ్ళు చాలించి వానప్రస్థవేషము వేసికొనినాఁడు; మీరిద్దఱు రాజ్యము సంగీకరింపని యెడల రాజ్యము ప్రజలు నేగతి నట్టిపోవలె? దేశమెంతటి దుస్థితికి వచ్చును? ఈ మహావిపత్తు నాలోచించి న్యాయముగా రాజ్యము నీది గావున నీవు రాజ వగుట ధర్మమనియెంచి న్యాయోక్తులకు నీవన్నిటికి నన్నివిఱుపులు చెప్పుటచే నీమార్గమునసైన నిన్ను నంగీకరింపఁజేయఁదలఁచి నాస్తికవాదము చేసితినిగాని నేను నాస్తికుఁడనుగాను, నేనట్టివాఁడనై యుండిన మీతండ్రి నన్నేల చేరఁదీసి

యుండును? ఈ వసిష్ఠాదులెట్లు నన్నుఁ దమతో గలుపుకొని పనిచేయుదురు? ఎవ్వఁడైన నాస్తికవాదముచేసిన నేనే వాని వాదమును ఖండింతును. ఇప్పుడు నేనుజేసిన వాదము ధర్మమునకు హానివచ్చినప్పుడు ఎటులైన ధర్మస్థాపనము చేయుటకై చేసినదే. నీవు రాజవై యట్లుచేసితివేని నిన్ను నేనే యాక్షేపించి యిప్పుడు నేనుజేసిన వాదమును ఖండించియుందును. ఇప్పుడు నాస్తికవాదము చేయుటేకాదు. ఎప్పుడైన నిట్టి కష్టకాలము వచ్చెనేని మరల నాస్తికవాదము చేయుదును. ధర్మమందుండి యింతదేశమును నరాజకముచేసి యిందఱి ప్రజల నాశముచేయుట యెక్కువకీడా? నీవొకఁడు తత్కాలమున నాస్తిక్యము నంగీకరించిన ప్రభువై లోకరక్షణముసేయుట మేలా? నీవొకఁడవు చెడినను లోకమంతయు బాగుపడునుగదా! యని నాయభిప్రాయము. ఏకకాలమున రెండు పరస్పరవిరుద్ధ విపత్తులు సంభవించెనేని తక్కువ విపత్తుగ్రహించి గొప్ప విపత్తును దొలఁగఁ ద్రోయవచ్చును.

ఆ. కడఁగి నిన్నుఁ బురికిఁ గ్రమ్మఱింపఁగఁగోరి, భరతుఁ డిట్లు జాలిఁ పడుటకతన
నీయనుగ్రహంబుఁ నెఱిఁపొందుకొఱకునై, యట్లు పలికినాఁడఁ ననఘ సైఁపు. [౨౪౫౦

తాత్పర్యము

నిన్ను నేవిధముగానైన నయోధ్యకుఁ బిలుచుకొనిపోవభరతుఁ డీప్రకారము వ్యసనపడుటచేత నతనియందు నీకు దయవచ్చునుగాక యని యాప్రకారము చెప్పితిని. పాపరహితా! క్షమింపుము. ఒకకార్యము సాధింపఁబూనిన వాఁడెన్ని విధములఁ బ్రయత్నింపవలయునో యన్నివిధములఁ బ్రయత్నింపవలసినది విధి. యుద్ధమందు వీరులు మహాస్త్ర శస్త్రములే ప్రయోగించుచున్నారా? అల్ప బాణములఁ బ్రయోగించుటలేదా?

—♦ { ౧౧౦-వ సర్గము. వసిష్ఠుఁడు శ్రీరామునితో జ్యేష్ఠుఁడు రాజ్యార్హుఁడని పూర్వరాజ వృత్తాంతము జెప్పుట. } ♦—

సీ. అనఁ గ్రుద్ధుఁడైనరాఁ మునితో వసిష్ఠుండు, పలుకు జాబాలియుఁ బార్థివేంద్ర!
జనులగతాగతంఁబును జక్క నెఱుఁగుని, స్మరలింపఁ గోరి యుఁ వమ్మాడ్కిఁ బలికె
లోకేశ! వినుమ యీఁ లోకసముత్పత్తి యఖిల మేకార్ణవఁ మైనయపుడు
పుడమి నిర్మింపఁగఁబడెఁ బరంబునను స్వయంభువు బ్రహ్మ దేఁవాళితోడఁ
ఆ. గలిగె నీటమునుఁగుఁ క్ష్మాతలంబును హరి,
పోత్రి యగుచుఁ దేల్చెఁ బుత్రయుక్తి
నవ్యయుండు నిత్యుఁ డాకాశభవుఁ డల, బ్రహ్మ జగములెల్లఁ బరఁగఁ జేసె.

క్రుద్ధుఁడైన=కోపించిన, గతాగతంబును=పోకరాకలను- మరణజననము లను, లోక సముత్పత్తి=లోకము పుట్టినవిధము, అఖిలము=బ్రహ్మాండమంతయు, ఏకార్ణవము=ఒక సముద్రముగా, పరంబుననున్=పరబ్రహ్మమగు నారాయణుచే, స్వయంభువుబ్రహ్మ = చతుర్ముఖబ్రహ్మ, క్ష్మాతలంబును = భూప్రదేశంబును,

పోత్రి=వరాహము, హరి=విష్ణువు, పుత్రయుక్తి=పుత్రులతోడ, అవ్యయుండు=వ్యయములేనివాఁడు, నిత్యుఁడు=ఎల్లప్పుడు నుండువాఁడు, ఆకాశభవుఁడు=పరబ్రహ్మమువలన గలిగినవాఁడు, బ్రహ్మ=చతుర్ముఖబ్రహ్మ.

తాత్పర్యము

జాబాలి యాప్రకారము చెప్పఁగా నతనిపైఁ గోపమువహించిన శ్రీరామచంద్రమూర్తితో వసిష్ఠుఁ డిట్లనియె, రామచంద్రా! జాబాలియు జనుల జననమరణములు మరణించిన వారెచ్చటికిఁ బోవునదియుఁ బుట్టుచుండువా రెచ్చటినుండి వచ్చునదియుఁ జక్కఁగాదెలియును నిన్నుఁ బురమునకుఁ బిలుచుకొనిపోవ నవ్విధముగఁ జెప్పితినసుటయు సత్యమే. అదట్టులుండనీ. ఈలోకము పుట్టిన విధమును జెప్పెదవినుము. బ్రహ్మాండమంతయు జలముతోనిండి యొకసముద్రముగా నున్నప్పుడు భూమి సృష్టింపఁబడెను. పరబ్రహ్మముచే బ్రహ్మయు దేవతలు గలిగిరి. ఈభూమి నీట మునుఁగుచుండఁగా విష్ణువాదివరాహమై తన కొమ్మున దానిని బైకెత్తెను. అప్పుడు, అవ్యయుఁడు నిత్యుఁడు పరబ్రహ్మమువలనఁ గలిగినవాఁడునగు బ్రహ్మ తన తనయులగు మరీచ్యాదులతోఁ బ్రపంచమంతయు వ్యాపింపఁజేసెను. ఆకాశము పరబ్రహ్మము. "ఆకాశోహవై నామరూపయో ర్నిర్వహితాతే యదంతరా తద్బ్రహ్మ"యని శ్రుతి. "ఆకాశో బ్రహ్మ" యని శ్రుతి. ఆకాశమనఁగా సర్వత్ర ప్రకాశించునది. బాలకాండమున ౧౬౪౨ పద్యమున అవ్యక్తజుఁడు నిత్యుఁడవ్యయుఁడగు బ్రహ్మయని చెప్పఁబడెను. అక్కడ నవ్యక్తవాచ్యుఁడే యిచట నాకాశవాచ్యుఁడు.

ఈ సృష్టివిషయము మనుస్మృతియందు స్పష్టముగా వివరింపఁబడినది.

శ్లో. ఆసీ దిదం తమో భూత మప్రజ్ఞాత మలక్షణమ్
　　అప్రతర్క్య మవిజ్ఞేయం, ప్రసుప్తమివ సర్వతః.

ఈ ప్రపంచము ప్రలయకాలమందుఁ జీఁకటిలో మునిఁగియుండెను. అనఁగా నాకాలమందు మహదాదియగు ప్రకృతి సూక్ష్మప్రకృతియైన తమస్సునందు లీనమై తమస్సు భగవంతునితో నేకీభావముగలదై యుండెను. ఈకారణముచే నది ప్రత్యక్ష ప్రమాణమునకు నగమ్యమై చీఁకటిలోని వస్తువులు కనులకుఁ గానరానియట్టి దశగలదై యిది ప్రపంచమని గుర్తింపఁదగిన చిహ్నములు లేనిదై అప్పుడు వాచకశబ్దములు లేనికారణమున శబ్దముచేఁగూడఁ దెలియరానిదై యంతయు నిద్రించుచున్నట్లుండెను.

శ్లో. తతః స్వయంభూ ర్భగవా నవ్యక్తో వ్యంజ యన్నిదమ్
　　మహాభూతాది వృత్తౌజాః, ప్రాదురాసీ త్తమోనుదః.

ప్రలయావసానకాలమున జ్ఞాన బలైశ్వర్య తేజోవీర్యములుగల భగవంతుఁడగు పరమాత్మ తానే తన సంకల్పముచే శరీరమును బరిగ్రహించుసుగాని

యాయన శరీర పరిగ్రహమునకు మనవలెఁ గర్మాదులు కారణముగాదు. ఇట్లు బాహ్యేంద్రియములకు గోచరముగాని శరీరముధరించి మహత్తు, ఆకాశాది మహాభూతములను దొలుత సూక్ష్మరూపమున నావల స్థూలరూపమున నప్రతిహతవృత్తుఁడై ప్రకాశింపఁజేయును. ఆయనయే ప్రలయావస్థను ధ్వంసనుచేసి సృష్టివిషయమై ప్రకృతిని బ్రవేశించుచు నావిర్భవించెను.

శ్లో. యోవసాతీంద్రియగ్రాహ్యః సూక్ష్మోవ్యక్త స్సనాతనః
సర్వభూత మయోచింత్యః సఏవస్వయము ద్బభౌ.

సకలలోక వేదపురాణేతిహాసాది ప్రసిద్ధుఁడగు పరమాత్మ మనస్సుచే గ్రహింప యోగ్యుఁడై బాహ్యేంద్రియములకు గోచరింపనివాఁడై యవయవరహితుఁడై నిత్యుఁడై సర్వభూతాత్మయై కావున నిట్టివాఁడని చింతింపరానివాఁడై తానే మహదాది సర్వరూపముల నుద్భవించెను.

శ్లో. సోభిధ్యాయ శరీరా త్స్వాత్సి సృక్షు ర్వివిధాః ప్రజాః
అపఏవ ససర్జాదౌ తాసు బీజమవాసృజత్.

ఆపరమాత్మ తన శరీరమునుండి సమస్త ప్రజల సృష్టింపనెంచి జలములు గలుగునుగాక యని ధ్యానింపఁగా మొట్టమొదట జలములు గలిగెను. ఆ నీటియందు స్వశక్తిరూపమైన బీజముంచెను,

శ్లో. తదండ మభవద్ధైమం, సహస్రాంశు సమప్రభమ్
తస్మిన్జజ్ఞేస్వయంబ్రహ్మ, సర్వలోక పితామహః.

ఆబీజము సూర్యకాంతిగల బంగారువన్నెగల యండమయ్యెను. పూర్వజన్మమందు నేను హిరణ్యగర్భుఁడ నౌదునుగాక యని యేప్రాణి భగవంతునుపాసించెనో యాలింగశరీరముగల జీవమునఁ బ్రవేశించి పరమాత్మ తానే సర్వలోకములకుఁ గారణభూతుఁడైన హిరణ్యగర్భుఁడుగ జన్మించెను.

శ్లో. ఆపో నారా ఇతిప్రోక్తా, ఆపోవై నరసూనవః
తాయదస్యాయనం, తేన నారాయణః స్మృతః.

ఆపములు (జలము) నారములు అవి నరుఁడనుపేరుగల పరమాత్మ బిడ్డలు. అట్టి నారములు పరమాత్మ కునికిపట్టగుటచే నీపరమాత్మ నారాయణుఁ డనఁబడెను.

దీని సారాంశమేమనఁగా! ప్రలయమునఁ దొలుతఁ బృథివి గంధతన్మాత్రమున లయించును, గంధతన్మాత్రము జలమందు లయించును, జలము రసతన్మాత్రమున లయించును, రసతన్మాత్రము తేజస్సున లయించును, తేజస్సు రూపతన్మాత్రమున లయించును, రూపతన్మాత్రము వాయువున లయించును, వాయుస్పర్శ తన్మాత్రమున లయించును, స్పర్శతన్మాత్రము ఆకాశమున, లయించును, ఆకాశము శబ్దతన్మాత్రమున లయించును, శబ్దతన్మాత్రము కర్మేంద్రియ జ్ఞానేంద్రియ మనస్సు అహంకారమున లయించును. అహం

కారము మహత్తు (బుద్ధితత్త్వము) నందు లయించును, మహత్తు ప్రకృతి యందు లయించును, ప్రకృతి తమస్సునందు లయించును, తమస్సు జీవుని యందు లయించును, జీవునకుఁ బరమాత్మతో నేకీభావము కలుగును. లయ మనఁగా నాశమనికాదు. ఇమిడిపోవుట; దుర్భిణియంత్రమందు నొకదానిలో నొకటి ౫-౬ గొట్టములుండును, అన్ని సాగఁదీసితిమా గజముపొడుగగును. ఒక దానిలో నొకటి క్రమముగా ముడుచుచువచ్చిన బ్రేలెఁడు గొట్టమగును. బ్రేలెఁడు గొట్టముగానున్నప్పుడు తక్కినవానికి స్వరూపనాశము లేదు. ఈవిధముగా భగవంతుఁ డవ్యాకృతాత్ముఁడై రూపము, నామము, క్రియ లేనివాఁడై కొంత కాలముండును. ఆవల మరల సృష్టిని సంకల్పించును. ఆ సంకల్పశక్తిచేఁ బ్రకృతియందు క్షోభము గలుగును, అప్పుడు మరల నొకదానిలోనుండి మఱి యొకటి తమస్సు, ప్రకృతి, మహత్తు, అహంకారము, ఆకాశతన్మాత్రము, ఆకా శము, వాయుతన్మాత్రము, వాయువు, అగ్నితన్మాత్రము, అగ్ని, జలతన్మా త్రము, జలము, పృథివీ తన్మాత్రము, పృథివి, పృథివినుండి యోషధులు- ఈప్రకారము వరుసగా నుద్భవించును. ఇది పరిణామమందురు, **(Evolution)** ముందుచెప్పినది విపరిణామము **(Involution)** విపరిణామము చాఁప చుట్టుట వంటిది. పరిణామము చాఁపవిప్పి పఱచుటవంటిది.

ఇవన్నియుఁ జేయువాఁడెవఁడు? వానియంతట నవియే యైనవా? ప్రకృతి జడము కావునఁ దానంతటనది పరిణామము చెందలేదు. జీవుఁడు కర్మబద్ధుఁడై యాకాలమునఁ బ్రకృతిలోఁ గలిసియుండుటచే నతనికి నాశక్తిలేదు. కావున నివన్నియుఁ జేయువాఁడు భగవంతుఁడే. పూర్వకల్పమందు నేజీవి తాను బ్రహ్మగాఁ గావలయునన కోరి తపస్సుచేసెనో లింగశరీరముతోఁగూడి తన యందు లీలమైయున్న జీవిలోఁ దాను బ్రవేశించి యాబ్రహ్మ తానేయై సృష్టి కార్యము చేసికొనును. అట్టులే క్రమముగ సూక్ష్మములుగనున్న తన రూపము లను స్థూలములుగఁ జేసికొనును.

ఈవిధముగ సర్వము భగవంతుఁడేయని యేర్పడెను. జీవుఁడు, ప్రకృతి యనునవి రెండును భగవచ్ఛక్తులు; జీవుఁడు చైతన్యశక్తి, ప్రకృతి జడశక్తి. ఈ రెంటియందు భగవంతుఁడు ప్రవేశించియే యుండును. ఈ రెండును భగ వంతుని ధారణ పోషణములకు లోపడియుండును. ఇదియే మనుసమ్మతమైన మతమని కుల్లూకభట్టు.

"కింతు బ్రహ్మైవా వ్యాకృత శక్త్యాత్మవా జగత్కారణ మితి త్రిదండి వేదాంత సిద్ధాంత ఏవాభిమతః ప్రతిభాతి" యని వ్రాసియున్నాఁడు. విష్ణు పురాణమందు నిట్టులేయున్నది. కాని గ్రంథవిస్తరభీతి ననువదింపఁ బడ దయ్యెను. కావున జగత్సృష్టి యింద్రజాలము కాదు. మిథ్యయుఁగాదు.

సీ. ఆయనకు మరీచి♦యతనికిఁ గశ్యపుఁ, డతనికి భాస్కరుఁ ♦ డాతనికిని
ఘనుఁ డుదయించెను♦మనువాతఁ డిక్ష్వాకుఁ, గనియె నయోధ్యనా♦తనికి నిచ్చె
మను వట్టు లగుట నా♦తని మూలపురుషుఁగా, నెంచు మీకులమున♦కెల్ల నధిప
కుక్షి యాతనికి వి♦కుక్షి యాతనికిని, నతనిపుత్రుఁడు బాణుఁ♦డతుల బలుఁడు
తే. బాణపతి కనరణ్యుఁ డా♦క్షోణినాథు, పాలనంబునఁ దస్కర♦బాధగాని
కఱవు డామరములు గాని♦కలుగవయ్యె, సత్యధర్మగరిష్ఠుఁడై ♦జరగుకతన.

తా త్ప ర్య ము [౨౪౭౨

ఆబ్రహ్మకు మరీచి, మరీచికిఁ గశ్యపుఁడు, కశ్యపునకు భాస్కరుఁడు, భాస్కరునకు మనువు, మనువునకు నిక్ష్వాకువు నుదయించిరి. అయోధ్యను మను విక్ష్వాకునకిచ్చెఁ గావున మీవంశమునకు నిక్ష్వాకువే మూలపురుషుఁడు. అతనికిఁ గుక్షి, అతనికి వికుక్షి, అతనికి బాణుఁడు, బాణున కనరణ్యుఁడు కలిగిరి. ఈయనయే రావణుతో యుద్ధముచేసి శపించినవాఁడు. ఈయన పాలనవేళ దొంగలభయము కఱవులు లోనగునవి లేవు. ఈయన మిగుల సత్యధర్మనిష్ఠుఁడు.

కం. ఆతనికి బృథుభూపతి, జాతుం డై కీర్తిఁ గనెఁ ద్రి♦శంకుఁ డతనికిన్
ప్రీతికరపుత్రుఁ డై దివి, కై తనమెయితోడఁ జనియెఁ♦నతిసత్యరతిన్.
కం. కలిగెం ద్రిశంకునకు ని,ర్మలచరితుఁడు సుతుఁడు ధుంధు♦మారఖ్యాతిన్
వెలయుచు యువనాశ్వుం డన,
బలియుఁడు మాంధాత యతని♦పట్టియ రామా. ౨౪౭౪

తా త్ప ర్య ము.

అనరణ్యునకుఁ బృథువు, అతని కుమారుఁడు త్రిశంకుఁడు. ఇతనికి సత్యవ్రతుఁడని మొదటిపేరు. ఇతఁడు దేహముతో స్వర్గమునకుఁ బోయెను, త్రిశంకునకు ధుంధుమారుఁడు అతనిపేరే యువనాశ్వుఁడు అతనికి బలశాలి మాంధాత జనించెను.

కం. మాంధాతృతనయుఁ డయ్యె సు,
సంధి యతనితనయులు ధ్రువ♦సంధియు దృఢవీ
ర్యాంధుఁడు ప్రసేనజితుఁడున్, బంధురకీర్తి ధ్రువసంధి♦భరతుం గనియెన్.

తా త్ప ర్య ము

మాంధాత కొడుకు సుసంధి. అతని కొడుకులు ధ్రువసంధి, ప్రసేనజితుఁడు, ధ్రువసంధికొడుకు భరతుఁడు.

సీ. భరతుఁడసితుఁగాంచె♦బగతురు హైహయుల్, తాలజంఘులుశూర♦తములువాని
నాహవంబున గెంటి♦నతఁడు ప్రవాసియై, చలిమల ముని యయి♦సంచరించె
నతనియిల్లాం డ్రిర్వు♦రటఁ జూఁడి ధరియింప,
సవతికి విష మన్య♦సతి యొసంగె
నటఁ గర్భనష్టికై ♦యాసతి కాళింది, చ్యవనునిచెంతకుఁ♦జని యెఱింగి

ఆ. నంత నతఁడు సదయుఁడై వరకామ కిట్లనియె నీకుఁబుత్రుఁడఖిలలోక
విశ్రుతుండు వైరివిజయుడు వంశకరుండు సాధునుతగుణుండు పుట్టు.

తాత్పర్యము [౨౪౫౬

భరతునికొడుకు అసితుఁడు, ఈయనకు హైహయులు తాలజంఘులు నను వారు యుద్ధమున నోడించి రాజ్యమునుండి వెడలఁగొట్టిరి. అతఁడు దేశము విడిచిపోయి మంచుఁగొండయందుఁ దిరుగుచుండెను. అయన కిరువురు భార్యలు, వారిలో నొకతె గర్భవతికాఁగా సవతిమచ్చరమున రెండవ దామెకు విషము పెట్టెను. గర్భవతియగు కాళింది చ్యవను నొద్దకుఁబోఁగా నాముని దయ గలవాఁడై తనవలన వరముకోరు నామెకు నీకు జగములఁ బ్రసిద్ధిగాంచి శత్రువుల గెలిచి వంశము నుద్ధరించు సజ్జనస్తోత్ర పాత్రుఁడైన కొడుకు పుట్టునని దీవించెను.

కం. అని దీవించిన మ్రొక్కుచుఁ, జని యింటికిఁ బద్మ నేత్రసారసగర్భా
భుని సుతునిఁ గనె గరముతో, జనియించుటఁజేసి యతఁడుసగరుం డయ్యెన్.

సారసగర్భాభుని=బ్రహ్మతో సమానుఁడగువానిని, గరముతోన్=విషముతో.

తాత్పర్యము

ఇట్టులు దీవింపఁగా నామె నమస్కరించి యింటికిఁబోయి కమలముల వంటి నేత్రములుగలిగి బ్రహ్మతోసమానుఁడైన కొడుకును గనెను. వాఁడు విషముతోడఁ బుట్టినవాఁడగుటచే సగరుఁడను పేరుకాంచెను.

కం. త్రవ్వించె నీరనిధి ము,న్నవ్విభుఁ డాతనితనూజుఁడసమంజుఁడు దాఁ
గ్రొవ్వున శిశువులఁ జంపఁగ, నెవ్వగపడ గానలందునెట్టింపఁబడెన్.

నీరనిధి=సముద్రము. [౨౪౫౭

తాత్పర్యము

ఆరాజు పూర్వము సముద్రమును ద్రవ్వించెను. అతనికొడు కసమంజుఁడు వాఁడు శిశువులను బొగరునఁజంపఁగ సగరుఁడతని దేశమునుండి వెడలఁగొట్టెను.

సీ. ఆయసమంజునకంశుమంతుఁడు పుట్టె, నతఁడు దిలీపుఁ డన్సుతునిఁ గాంచె
నతఁడు భగీరథాఖ్యమహీశుఁ గాంచెనా,యనపుత్రుఁడుకకుత్స్థుఁడార్యచరితుఁ
డతనిపేరన కాదెయన్వయజుల కెల్లఁ, గాకుత్స్థు లనఁగఁ బ్రఖ్యాతి గలిగె
నతఁడు రఘువుఁ గాంచెనతఁడు కల్మాషపా,
దుం డనఁ బురుషాదకుండు ననఁగ

తే. మఱియు సౌదాసుఁ డనఁగ నామముల నొప్పు
నతనిఁ గాంచెను; శంకణుఁ డతనిసుతుండు
దశములను గూడి జనకుని వలనఁ జచ్చె
నతనికొడుకు సుదర్శనుఁ డనెడుఱేఁడు.

౨౪౫౮

తాత్పర్యము

ఆ యసమంజునకు నంశుమంతుఁడు పుట్టెను, అతనికి దిలీపుఁడు, అతనికి భగీరథుఁడు, అయనకొడుకు కకుత్థ్సుఁడు, ఆయనపేరనే మీవంశమువారు కాకుత్థ్సులనఁబడుచున్నారు. అయనకొడుకు రఘువు. అతనికొడుకు కల్మాషపాదుఁడు. ఆయనపేరే పురుషాదకుఁడు, సౌదాసుఁడు. అతని కొడుకు శంఖణుఁడు, అతనికొడుకు సుదర్శనుఁడు.

ఆ. ఆసుదర్శనునకు♦నగ్నివర్ణుఁడు తత్సు,తుండుగాఁగ శీఘ్రు♦గుండు నయ్యె
　వానికొడుకు మరుఁడు♦వాఁడు ప్రశుశ్రుకుఁ,
　　　　　　　　గనియె నంబరీషుఁ♦గనియెనతఁడు. ౨౪౮౦

తాత్పర్యము.

ఆ సుదర్శనునకు నగ్నివర్ణుఁడుపుట్టెను, అతనికొడుకు శీఘ్రగుఁడు, వానికొడుకు మరుఁడు, వానికొడుకు ప్రశుశ్రుకుఁడు, వానికొడు కంబరీషుఁడు.

కం. మహిపతి నహుషుం డతనికి, నహుషునకుం బుత్రుఁ డయ్యె♦నాభాగుం డా
　మహితాత్మున కిరువురు సుతు,
　　　　　　　　లహార్యధృతులజుఁడు సువ్రత♦తాఖ్యుఁడు నాఁగన్. ౨౪౮౧

తాత్పర్యము

అతనికి నహుషుఁడు, నహుషునికొడుకు నాభాగుఁడు, అతనికి నిరువురు కొడుకులు మొదటివాఁడు అజుఁడు, రెండవవాఁడు సువ్రతుఁడు.

కం. ఆయజునకు దశరథపతి, దాయాదుం డయ్యె నతని♦తనయులలో నీ
　వే యగ్రజాతుఁడవు రా,మా! యట్లొట నిలనేలు♦మాతండ్రివలెన్. ౨౪౮౨

దాయాదుఁడు = కొడుకు. అగ్రజాతుఁడవు = మొదటఁ బుట్టినవాఁడవు-జ్యేష్ఠుఁడవు.

తాత్పర్యము

అజుని కుమారుఁడు దశరథుఁడు, ఆయన కొడుకులలో నీవు పెద్దవాఁడవు, గనుక రామచంద్రా! నీతండ్రివలె నీవు భూమిని బాలింపుము.

కం. అనఘా! యిక్ష్వాకులలోఁ, దనయుఁడు జ్యేష్ఠుండు రాజ్య♦తంత్రముఁ దీర్పన్
　జనుఁ గులధర్మము విడువక, కొనుమీ రాష్ట్రంబు నేలు♦కొనుమీ ప్రజలన్.

పాపరహితుఁడా యిక్ష్వాకువంశమునఁ బుట్టినవారిలో నిప్పుడు నేనుజెప్పిన ప్రకారము వంశపరంపరఁగా బెద్దవాఁడే రాజగుచున్నాఁడు. కావున నీవును వంశధర్మముఁ దప్పింపక రాజ్యాభిషేకము నంగీకరించి ప్రజలఁ బాలింపుము.

-♦ ౧౧౧-వ సర్గము. వసిష్ఠుఁడు శ్రీరాముని రాజ్యంబుఁ గొనుమనివేఁడుట. ♦-

మ. అనుచు న్వెండి వసిష్ఠుఁ డెంతయును న్యా♦యం బార నిట్లాడు నో
　జనపాలాగ్రణీ రామ! పూరుషున కా♦చార్యుండునుం దల్లియున్

జనకుండు స్గురు లై రి ముప్వ రిల జ॰న్మం బిచ్చుటం దల్లియున్
జనకుండున్, మఱి జ్ఞానదాత యయి యా॰చార్యుండు, నవ్వారిలోన్,
వెండి=మఱియును, జ్ఞానదాత=జ్ఞానము నిచ్చినవాఁడు. [౨౮౭౮

తాత్పర్యము

ఈ ప్రకారము వంశాచారము ననుసరించి పెద్దవాఁడవైన నీవే రాజుగా నుండవలయుననిచెప్పి వేఱొకన్యాయ మనుసరించి మఱియుఁ జెప్పుచున్నాఁడు. రామచంద్రా! పురుషునకుఁ దండ్రి, తల్లి, యాచార్యుఁడని ముగ్గురు గురువులు. జన్మమునకుఁ గారణభూతులౌటచేఁ దల్లిదండ్రులును జ్ఞానోపదేశము చేయుటచే నాచార్యుఁడును గురువులైరి.

కం. తనువు నొసంగినజననీ, జనకులకంటెను సుబుద్ధి॰సంపదఁ గూర్పన్
గనుటను నాచార్యుఁడె గురు,
డనుపెనుపుం గాంచి శ్రేష్ఠుఁ॰డయ్యెను రామా. ౨౮౭౯

తనువు=దేహము, సుబుద్ధిసంపద = మంచి జ్ఞానసంపత్తి, ముప్వరన్ = ముప్వరయందు- కొన్నియెడల నజడము తృతీయ సప్తములకు బహుత్వంబున ద్వితీయ చూపట్టెడి. ప్రౌ. వ్యా.

తాత్పర్యము.

ఆ ముప్వరయందు దేహమునకుఁ గారణభూతులైన తల్లిదండ్రులకంటె జ్ఞానసంపద ననుగ్రహించిన యాచార్యుఁడే శ్రేష్ఠుఁడు, మనుష్యుఁడుగాఁ బుట్టినను జ్ఞానము లేనివాఁడు పశువువంటివాఁడేకదా. సహి విద్యాతస్తం జనయతి తచ్ఛ్రేష్ఠం జన్మ' యని ప్రమాణము.

తల్లిదండ్రులకంటె గురువు శ్రేష్ఠుఁడనుటకుఁ బ్రమాణము.

శ్లో. ఉత్పాదక బ్రహ్మదాత్రోర్గరీయాన్ బ్రహ్మదః పితా
బ్రహ్మజన్మహి విప్రస్య, ప్రేత్యచేహచ శాశ్వతమ్.

రెండవ జన్మము నొసఁగు నాచార్యుఁడును దండ్రికంటె శ్రేష్ఠుఁడు. బ్రహ్మగ్రహణార్థమైన జన్మము బ్రహ్మప్రాప్తియను ఫలము గలిగించును గాన నది యిహపరములందు రెండింటియందును శాశ్వతమైనది. తండ్రికంటె గురువు శ్రేష్ఠుఁడేకాని తల్లికంటె గాఁడు.

శ్లో. కామాన్మాతాపితాచైనం యదుత్పాదయతోబుధః
సంభూతి తస్యతాం విద్యాద్యద్యో నావభిజాయతే.

తల్లిదండ్రులు మోహముచేఁ గలిసి శిశువును బుట్టించుచున్నారు, పశువులు పున్నగువానివలె మాతాపితలు శిశు వేయోనియందుఁ బుట్టునో యతనికిఁ దప యుపయుపముల నొసఁగుదురు.

శ్లో. ఆచార్య స్త్వస్య యాజాతిం, విధివద్వేదపారగః
ఉత్పాదయతి సావిత్ర్యా, సాసత్యా సాజరామరా.

వేదపాఠకుఁడైన యాచార్యుఁడా బ్రహ్మచారికి గాయత్రిచే శాస్త్రపురస్సరంబుగ నేజన్మము నొసఁగుచున్నాఁడో అదియే బ్రహ్మప్రాప్తి హేతుభూతమైనది గాన శాశ్వతమై ముదిమి చావులులేని జన్మము ఉపనయనము చేసికొన్నవానికి వేదాధ్యయనము వేదార్థజ్ఞానము అనుష్ఠానము వీనిచే నిష్కామముగ మోక్షసిద్ధిగలదు గాన నాచార్యుఁడే శ్రేష్ఠుఁడు.

శ్లో. పితు ర్మాతుర్గురూణాం చ, ఆచార్యస్యచ సర్వదా
హితం వా ప్య హితంవాపి, తత్కార్య మవిశంకయా. అనుశాసనిక.

తల్లి, తండ్రి, గురువు, ఆచార్యుఁడు చెప్పినది హితమైనను అహితమైనను సందేహింపక చేయవలయును.

కం. ధరణీతనయాధవ నీ,గురువునకున్ గురుఁడ నేను • గురుఁడను నీకున్
వరమతి నానుడి వినినను, బరఁగదు సన్మార్గగతికి•భంగము తండ్రీ.

తాత్పర్యము

శ్రీరామచంద్రా! నేను నీతండ్రికి గురుఁడను, నీకును గురుఁడను నామాట వినిన నీ సన్మార్గవర్తనమునకు భంగమురాదు.

కం. ధరణీసురులును వీ రే, పురజనులును వీరె ద్విజులు•పుణ్యులు వీరీ
పరిపాలింపుము వీరలఁ, బరఁగదు సన్మార్గగతికి•భంగము తండ్రీ! ౨౪౩

ధరణీసురులును=బ్రాహ్మణులును, వీరే=ఇదిగో, పురజనులు=అయోధ్యయందుండు పెద్దమనుష్యులు, ద్విజులు=క్షత్రియులు- వైశ్యులు.

తాత్పర్యము

ఇదిగో బ్రాహ్మణులు, వీరే క్షత్రియులు, వీరే వైశ్యులు, వీరే నగరమునను౦డు తక్కిన పెద్దమనుష్యులు. ఇందఱు నేకగ్రీవముగ నిన్నుఁ బ్రార్థించుచున్నారు. కావున వీరినెల్ల నాయనా! పాలింపుము.

కం. వరధర్మశీల వృద్ధయు, గురుమతి నీతల్లి యామెఁ•గొలువమి తగునా?
చరియింపు మామెనుడి విని, పరఁగదు సన్మార్గగతికి•భంగము తండ్రీ!

వరధర్మశీల = శ్రేష్ఠమైన ధర్మముచేయు గుణము స్వభావముగాఁగలది, వృద్ధ=పెద్దది, గురుమతి=గొప్పమనస్సుగలది, కొలువమి=సేవింపకయుండుట.

తాత్పర్యము

ఇదిగో మీతల్లి, గొప్పధర్మమునందు వర్తించుట యామెకు సహజగుణము. ఆమె ధర్మమునకు విరుద్ధముగాఁ జెప్పునదికాదు. అందు ముసలిది, పుత్రవియోగబాధ సహింపలేని వయస్సునందున్నది. ఆమె నీదుఃఖముతో మరణించెనా యామె మృతికి నీవు కారణమగుదువు అది పుణ్యకార్యము కాదుగదా!

అదియును దలిదండ్రులు జీవించియుండువఱకు వారిసేవతప్ప మఱియే వ్రత ములు తపములు చేయరాదను ధర్మశాస్త్రవాక్యము నీవెఱుఁగవా? తల్లిమాట మీఱి వర్తింపరాదుగదా. కావున నామెమాటవిని యట్లు ఎర్తించిన నీకుఁ బర లోక హానిలేదు. 'పితుశ్శతగుణం మాతా' యను పలుకు నీవెఱుంగవా?

"తేషాం త్రయాణాం శుశ్రూషా పరమంతప ఉచ్యతే
నతైరభ్య ననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్".

తల్లి, దండ్రి, ఆచార్యుఁడు వీరి శుశ్రూషయే పరమతపము, వారియాజ్ఞ లేక వేఱుధర్మ మనుష్ఠింపరాదు.

శ్లో. యావత్పితాచమాతాచ, ద్వావేతౌ నిర్వికారిణౌ
తావత్సర్వం పరిత్యజ్య, పుత్రస్స్యాత్త త్పరాయణః
మాతాపితాచ సుప్రీతౌ స్యాతాం పుత్రగుణైర్యది
సపుత్ర స్సకలం ధర్మం ప్రాప్ను యాత్తేన కర్మణా. దేవలుఁడు.

తల్లిదండ్రు లెంతవఱకు జీవించియుందురో అంతవఱకు సర్వమువదలి వారి శుశ్రూష చేయవలయును. ఎవని శుశ్రూషవలనఁ దల్లిదండ్రులు సంతో షింతురో యాకొడుకా శుశ్రూషచేతనే సకలధర్మములు చేసినఫలము నొందును.

తే. సత్యధర్మపరాక్రమ•జానకీశ, ప్రార్థనముచేయు చున్నట్టి•భరతుపల్కుఁ
బట్టి వర్తించు టాత్మాతి•వర్తనంబు,గాదు నాపల్కుఁ గైకొమ్ము•కరుణమీఱ.

సత్యధర్మపరాక్రమ=సత్యమును ధర్మము ననుష్ఠించుటయందుఁ బరా క్రమము గలవాఁడా- సత్యము ధర్మమే పరాక్రమముగాఁ గలవాఁడా- సత్య ముచే ధర్మముచేఁ బరుల నాక్రమించువాఁడా, ఆత్మాతివర్తనంబు=ఆత్త=సత్య ధర్మముల ననుష్ఠించు స్వభావమును, అతివర్తనంబు = అతిక్రమించుట-(2) నీకుఁ బ్రాణమువంటి భరతుని నతిక్రమించిపోవుట, కాదు=తగదు.

తాత్పర్యము

నీవు తక్కిన క్షుద్రరాజులవలె భుజబలముచేఁ బరుల నాక్రమింపవలయు నని చూచువాఁడవు కావు. నీవు సత్యధర్మముల ననుష్ఠించుటయందుఁ బరా క్రమము చూపువాఁడవు. సత్యధర్మముచేఁ బరుల నాక్రమించువాఁడవు. సత్య ధర్మములచేఁ బరమును సాధించువాఁడవు. ఇట్టి నీవు సత్యధర్మమార్గమునఁబోవ నిష్టపడియున్నావు. అది మంచిదే సత్యధర్మములకు విరుద్ధమగుకార్యము చేయు మని నేనుజెప్పను. అయినను భరతుఁడుచేయు ప్రార్థనమును నీవంగీకరించుట నీయాత్మను నీవతిక్రమించి యంతఃకరణమునకు విరోధముగా వర్తించుటగాదు. జానకీశా! నీవు కష్టపడఁగలిగినను నీ జనకరాజకుమారి సుకుమారియగు సీతను జూడుము. ఆమె యెట్లీయడవులలో దుఃఖింపఁగలదు? ఆమెను నిష్కారణముగ దుఃఖపెట్టుట తగునా? అది పాపకార్యముగాదా? కాఁబట్టి నామాట వినుము,

నీకాత్మాతివర్తనదోషము తగదు. ఆశ్రితులకుఁ బరతంత్రుఁడవై యుండుట నీస్వభావము. నీవు సామాన్యధర్మములైన సత్యమును ధర్మమును మీఱరాదని యెట్లు తలఁచుచున్నావో యట్లే నీవాశ్రితుల నతిక్రమించిపోవుట యను ప్రత్యక్షధర్మమును నతిక్రమింపరాదు. శరణాగతుఁడైన భరతుని ద్రోచిపుచ్చి యెట్లు శరణాగతరక్షణ ధర్మము నతిక్రమింపఁగలవు?

శ్రీరాముఁడు వసిష్ఠునితో నాచార్యులకంటెఁ దల్లిదండ్రులు శ్రేష్ఠు లని చెప్పుట.

చం. అన విని రాముఁ డిట్లనియె • నార్యజనోత్తమ పుత్రలబ్ధికై
పనిగొని తల్లి దండ్రి పడు•పాటులకుం బ్రతి సేయ నౌనె! యిం
పునఁ దలఁ జూచి నీళ్ళు, కడు•పుం గని యన్నము, పోసి పెట్టి యెం
డను జలి గాలిఁ బ్రోతురు ది•నంబును,వారలతుల్యులే యొరుల్? ౨౪౯౦

ఆర్యజనోత్తమ=సన్మార్గప్రవర్తకులయందు గొప్పవాఁడా, పుత్రలబ్ధికై= పుత్రులు గలుగవలయునని, పనిగొని=ప్రయత్నపడి, పడుపాటులకున్=అనుభవించు కష్టములకు, ప్రతి=బదులు, చేయనౌనె=చేయసాధ్యమా.

తాత్పర్యము

అయ్యా! సన్మార్గవర్తకులలో నీవెంతో గొప్పవాఁడవే, నీవిట్లు చెప్పెద వేమి? కొడుకులు కావలయునని కోరి యుపవాసాది వ్రతములుచేసి యాహార నియతి వహించి రోగాదులచే వారు పడుకష్టములకుఁ బ్రత్యుపకార మెవరేమి చేయఁగలరు? వారేకదా తలచూచి నీళ్ళు, కడుపుచూచి యన్నము వేళవేళకుఁ బోసిపెట్టి కేవలము పరాధీనదశయందుండు బిడ్డలను జలికిగాలికి బాధపడకుండ దినదినము గడియగడియ రక్షింతురు. వారితో సమానము గురుఁడగునా? గురుఁడు విద్యనేర్పువాఁ డంటివి. 'సతికుడ్యే చిత్రకర్మా'. గోడయుండినఁగదా బొమ్మలువ్రాయుట, యలంకరించుట లోనైనవి. గోడలేకున్న నెవరేమిచేయు దురు? అట్లులే వారు బిడ్డను గలిగించినఁగదా గురు వుపదేశించుట. ఈ గురువు నొద్దకు వచ్చువఱకుఁ బోషించినవారు, కావలసినవి నేర్పినవారెవరు? అట్టి తల్లి దండ్రులకంటె గురువెట్లెక్కువ! శ్రుతియును మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవయనితల్లినిదండ్రినిజెప్పినతరువాతనేకదా యాచార్యునిజెప్పెను

ప్రది, ఇది సంస్కృతశబ్దము. అవ్యయము అయినను సదా, సర్వదా శబ్దములవలె దీనికి నాంధ్రంబునఁ బ్రత్యేక ప్రయోగముకలదు. "ఎవ్వారు నీప్రతిలేరీ భువనత్రయంబున, ఉ. హరి 10. ఆ. ఏనునీ ప్రతిగ నర్చనచేసెద". జై. ౮ ఆ.

కం. తనుఁ దాను గాచుకొనఁ జా,లనిదశ నేమఱక యెపుడు•లాలించుచు వ
ర్ధన మొనరింతురు సత్ప్రియ,మును బల్కుదురయ్య! వారు•ముచ్చట మీఱన్

తాత్పర్యము

అ తల్లిదండ్రులు శిశువులు దమ్ముఁదాము కాపాడుకొననేరని దశయందుఁ బ్రమాదపడక యెల్లవేళల బుజ్జగించుచుఁ బెంతురు. సంతోషముతో బిడ్డలకు సంతోషకరమైన మాటలనే చెప్పుదురు. వారిమేలే కోరుచుందురు. ఇట్లు మనోవాక్కాయములచే బిడ్డలను బెంతురు. కావున నిట్టివారితో నితరులెట్లు సమానులగుదురు.

గురువులకంటెఁ దల్లిదండ్రులు శ్రేష్ఠులనుటకుఁ బ్రమాణములు.

శ్లో. ఉపాధ్యాయాన్ దశాచార్య ఆచార్యాణాం శతంపితా
సహస్రంతు పితౄన్మాతా, గౌరవేణాతిరిచ్యతే.

పదిమంది యుపాధ్యాయులకంటె నొకయాచార్యుఁడు శ్రేష్ఠుఁడు. నూర్వురాచార్యులకంటెఁ దండ్రి శ్రేష్ఠుఁడు. వేవురు తండ్రులకంటె గౌరవమునందుఁ దల్లి గొప్పది.

ఏతేమాన్యా యథాపూర్వమేభ్యో మాతాగరీయసీ.

ఉపాధ్యాయుఁడు మొదలగువారి యందఱికంటెఁ దల్లి గొప్పది.

యోభావయతి యస్సూతే యేనవిద్యోపదిశ్యతే
జ్యేష్ఠభ్రాతాచ భర్తాచ పంచైతే గురువస్స్మృతా.

తండ్రి, తల్లి, విద్యనుపదేశించినవాఁడు, అన్న, భర్త, యీయైదుగురిలో మొదటి ముగ్గురు శ్రేష్ఠులు, వారిలోఁ దల్లిశ్రేష్ఠురాలు.

శ్లో. యంమాతా పితరౌక్లేశం, సహేతే సంభవేన్నృణామ్
నతస్య నిష్కృతి శ్శక్యా, కర్తుం వర్షశతైరపి.   మను. ౨-౨౨౭

బిడ్డను గనుటయందు దల్లిదండ్రు లెంతో దుఃఖమును సహింతురు. నూఱు సంవత్సరములైనను వారుచేసినదానికిఁ బ్రతిచేయ సాధ్యముగాదు.

శ్లో. మాసాన్ దశోదరస్థం యాధృత్వా శూలైస్సమాకులా
వివిధై ర్వేదనాదుఃఖైః ప్రసూయేత విమూర్ఛితా
ప్రాణైరపిప్రియాన్ పుత్రా న్మన్యతే సుతవత్సలా
కస్తస్యా నిష్కృతిం కర్తుం శక్తోవర్షశతైరపి.   వ్యాసులు.

తల్లి పదినెలలు కడుపునధరించి కడుపుశూలలు నానావిధములైన దుఃఖములు సహించి ప్రసవవేదనచే మూర్ఛపోయి బిడ్డను గనుచున్నది. తన ప్రాణమునకంటెఁ గొడుకెక్కువయని తలంచుచున్నది. అట్టి తల్లికి నూఱువర్షములు జీవించినను నామె ఋణమెవఁడు తీర్చుకోఁగలడు?

శ్లో. ద్వౌగురూ పురుషస్యేహ, పితామాతాచ ధర్మతః
తయోరపి పితాశ్రేయాన్ బీజప్రాధాన్య దర్శనాత్
అభావే బీజనో మాతా తదభావేతు పూర్వజా.

పురుషున కిరువురు గురువులు, తల్లి దండ్రి, వారిలో బీజప్రదానము శ్రేష్ఠము కావునఁ దండ్రియెక్కుడు, తండ్రిలేని కాలమునఁ దల్లియెక్కుడు, వారిరువురు లేరేని అన్న యెక్కువ.

ఆచార్యః శ్రేష్ఠో గురూణా మాతేత్యేకే. గౌతముఁడు.

ఆచార్యుఁడు గురువులందు గొప్పవాఁడు, కొందఱు తల్లిశ్రేష్ఠరాలందురు.

శ్లో. నాస్తి మాతృసమందైవం, నాస్తిపిత్రా సమోగురుః
తయోః ప్రత్యుపకారోపి, నకథంచ నవిద్యతే. దేవలుఁడు.

తల్లితో సమమైన దైవము తండ్రితో సమానుఁడగు గురువులేఁడు. ఆ యిరువురకుఁ జాలినంత ప్రత్యుపకారమెట్టిదో తెలియదు.

ఆచార్యుఁడు తల్లిదండ్రులకంటెఁ దానెక్కువ యనెను. తండ్రికంటె గురువునకంటెఁ దల్లి తానెక్కువయనెను. అందఱకంటెఁ దండ్రియెక్కువని రామచంద్రమూర్తి యనుచున్నాఁడు. ఈవివాద పరిష్కారమెట్లు:— బ్రహ్మచారికి విద్యాభ్యాస కాలమందుఁ దల్లిదండ్రులకంటె నాచార్యుఁడే యెక్కువ. గురువు చెప్పినదానికి విరోధముగఁ దల్లిదండ్రులు చెప్పరాదు. అంతకుఁబూర్వము, ఆవల గురునికంటెఁ దల్లిదండ్రులే యెక్కువ. ఆ యిరువురిలో గౌరవమందుఁ దల్లియెక్కువ యైనను నాజ్ఞయందు (మగనియాజ్ఞకుఁ దాను లోపడియుండవలసినదే కావున) దండ్రి యెక్కువ. ఇచ్చట ముందాజ్ఞచేసినవాఁడు తండ్రి కావున నాయనయాజ్ఞకు విరోధముగ నుత్తరకాలమునఁ దక్కినవారు చెప్పిన దానికంటె నాయనచెప్పినదే పాటింపవలయును.

ఉ. కావునఁ గన్న తండ్రి కొడుకా! యిటు సేయు మటంచు మున్నదా
నావిధి నాజ్ఞ సేసెఁ గద ♦ న్యాయ్యమె యాతనిపల్కు కల్లయై
పోవఁగఁ జేయ? నాఁ గయిక♦పుత్రుఁడు సూతునిఁ జూచి సారథీ!
నీ విట నేలఁ గూర్పు కుశ ♦ నిర్మిత మాసనమున్ మదర్థమై. ౨౪౬౩

కుశనిర్మితము=దర్భలచేఁ జేయఁబడినది, గన్నతండ్రి=దత్తుతీసికొన్న తండ్రిగాదని భావము. దీనివలన దత్తుతీసికొన్న తండ్రి యాజ్ఞ మీఱినను విశేషదోషము గాదని సూచన. దత్తత యించుమించు పుత్రుని వెలకుఁగొనుట వంటిది. తనసొత్తు వానికి వ్రాసియిచ్చి వానిని గైకొనుటయేకదా! కన్నవానికిఁ గొన్నవానికి నెంత భేదములేదు?

తాత్పర్యము

ఈకారణముచేఁ గన్నతండ్రి పుత్రకా! నీ వీప్రకారము చేయవలసినదని మీకందఱకుఁ దెలిసిన ప్రకారము నా కాజ్ఞయిచ్చెఁగదా! ఆయనమాట యబద్ధమై పోవునట్లు చేయుట నాకున్యాయ్యమా? మీమాట మీఱినదానికై మిమ్ముక్షమింపఁ బ్రార్థింపఁగలను, మరణించినవానిని నేనేమని ప్రార్థింతును. నేను మీమాట మీఱినచో మీకురాఁగల నష్టిగాని కష్టముగాని లేదుగదా. ఆయనమాట మీఱిన నాయ

నకు స్వర్గహాని నరకప్రాప్తి గలుగునుగదా? నన్నుఁగని పెంచినదానికి నిదియా నేనాయనకుఁజేయు నుపకారము? తండ్రిలేనప్పుడు తల్లియాజ్ఞ పాటింపవలయు నంటివి. సంతోషమే. అదియెప్పుడు? తండ్రి యేమియుఁ జెప్పకుండినప్పుఁడు గదా. ఆసన్న మరణదశయం దెవరేమిచెప్పినను వారికోరిక దీర్పవలసినది బ్రదికియుండువారికి విధి. కావున నాకుఁ దండ్రియాజ్ఞయెట్టిదో మాతల్లికి భర్త యాజ్ఞ యట్టిదేకదా. భరతుఁ డాశ్రితుఁడు. ఆశ్రితత్యాగము ధర్మముకాదంటివి. సత్యము. నేను దానిని గాదనను. పితృవాక్య పరిపాలనమను ప్రారబ్ధ మతని కడ్డుపడియున్నది. అది తీరఁగానే యతని యభీష్టము నెఱవేర్పఁగలను. కాల విలంబనమే కాని పూర్ణత్యాగము లేదు. ప్రజలందఱు యాచించుచున్నవారం టివి వారికిఁగావలసినది పరిపాలనమేకదా. పాలించువాఁడెవఁడైన వారికేమి? నేనుగాకున్న నాతమ్ముఁడు పాలించును, దానివలన వారికేహానియు లేదుగదా. కావునఁ దండ్రియాజ్ఞమీఱి వర్తించుటకు నాకు సామర్థ్యములేదు. అని యీ ప్రకారము శ్రీరామచంద్రమూర్తి చెప్పఁగా విని భరతుఁడు నిరాశుఁడై వాదముతోఁ గార్యము చక్కఁబడదు. మొండికివేసికొని యయోధ్యాపాపమని మనస్సు కరగఁజేయవలయునని తలఁచి సుమంత్రునిఁజూచి సారథీ! నానిమిత్తమై యిచ్చట దర్భాసన మేర్పఱుపుము. అనెను.

దీనివలన శ్రీరామచంద్రమూర్తి ప్రాచార్యుఁడైన వసిష్ఠునికంటె గురువగు తండ్రి వాక్యమే శ్రేష్ఠమని చెప్పినట్టాయెను. అది సరిగాదు. "ఆచార్యప్రాచార్యసన్నిపాతే ప్రాచార్యాయోప సంగృహ్యోప సంజిఘృక్షే దాచార్యం ప్రతిషేధేదితర" యని యభివాదన ప్రకరణమున నాపస్తంబసూత్రము కలదు. దీనివలన నాచార్యునికంటెఁ బ్రాచార్యుఁడే (ఆచార్యున కాచార్యుఁడు=ప్రాచార్యుఁడు) ప్రబలుఁడని యేర్పడుచున్నది. కావున నాయన వచనమే కర్తవ్యమని చెప్పవలయునుగదా. మఱియును విప్రతిషిద్ధ ధర్మములనేకము లొకసారిగఁ దటస్థించెనేని స్వధర్మనిర్వహణమే శ్రేష్ఠమనికదా న్యాయము. కావునఁ దండ్రియొకఁడు వనవాసమునకు బొమ్మనిచెప్పిన దానికంటె నాచార్యుఁడు, తల్లి, పౌరులు ఇందఱు చెప్పిన స్వధర్మనిర్వహణమే శ్రేష్ఠముగదా, కాదు. ఎట్లనః— "ఆచార్యాధీనః స్యాదన్యత్ర పతనీయేభ్య" యని యాపస్తంబ సూత్రము కలదుగదా, దానివలనఁ బతనమురాని కార్యములందు గురువచనము కర్తవ్యమేకాని పతనభయము కలిగినపు డాచార్యవాక్యము పాటింపరాదు. ఇచ్చట సత్యవచనభంగముచేఁ బాతిత్యము సంభవించునుగాన నాచార్య వాక్యము నవలంబింపరాదు. మఱియు "పాతకాన్యపి పూయంతే పితుర్వచన కారిణ" యను చిరకారివాక్యముచేఁ బితృవాక్యము పాలించుటచే నితరపాపములును నశించుచున్నవి. కావునఁగదా పరశురాముఁడు తండ్రి వాక్యముచొప్పున

మాతృహత్య గావించెను. కావున నాజ్ఞావిషయమునఁ దండ్రి వాక్యమే యతి ప్రబలము, ఆచార్యునికంటెఁ బ్రాచార్యుఁ డెక్కువయను విషయమభివాదన విషయమేకాని సర్వత్రగాదు. కావునఁగదా విశ్వామిత్రుఁడు తాటకను జంపుమని చెప్పినప్పుడు తండ్రియాజ్ఞ స్మరించి యట్లుచేసెను. తొలుత దశరథుఁడు నీపడవికిఁ బొమ్మని రామచంద్రమూర్తికిఁ జెప్పలేదు. అవల సీతాలక్ష్మణులతో నే నడవికిఁబోయెదననినఁ బోయిరమ్మనెను. ఇది యనుజ్ఞయేగాని యాజ్ఞకాదు. ఇప్పుడు తల్లి పట్టాభిషేకము చేసికొమ్మనునది యాజ్ఞ. దానినెట్లు మీఱవచ్చునని నఁ దల్లికి నాజ్ఞాధికారము లేదని ముందే చెప్పఁబడెను.

కూర్చ కుశనిర్మిత మాసనమున్=దీనివలన నెంతకష్టించియైన గురువుల యనుగ్రహము సంపాదించుకొనవలయునని సూచితము. "యోవాచయతి యస్స్వాతేయేన విద్యోపదిశ్యతే జ్యేష్ఠభ్రాతాచ భర్తాచ పంచైతే గురవస్తథా। ఆత్మనః సర్వయత్నేన ప్రాణత్యాగేనవాపునః। పూజనీయా విశేషణ పంచైతే భూతిమిచ్ఛతా॥ శుక్రుఁడు.

తండ్రి, కన్నతల్లి, విద్యనేర్పినవాఁడు, అన్న, మగఁడు వీరైదుగురు గురువు లనఁబడుదురు. ఎన్ని ప్రయత్నములచేనైనఁ దుదకుఁ బ్రాణత్యాగము చేసియైన వారిని దనశ్రేయస్సు గోరువాఁడు విశేషించి పూజింపవలెను.

ఉ. రాముఁడు పట్టనంబునకు ♦ రా మదిఁ బూనెడిదాఁక నింద శా
లాముఖమందు నప్పిడి యి ♦ లాత్రిదశుం డధమర్ణు వాకిటన్
మోమున గుడ్డ వైచుకొని ♦ ముట్టక కూడును నీళ్ళునుండు న
ట్లీమియు ముట్టకేను వసి ♦ యించెద, నిశ్చయ మిద్ది నావుడున్. ౨౪౯౩

రాన్=వచ్చుటకు, శాలాముఖమందు=ఇంటివాకిట, అప్పిడి=అప్పు+ఇడి=అప్పిచ్చి, ఇలాత్రిదశుండు = బ్రాహ్మణుఁడు, అధమర్ణు = అప్పుదీసికొనినవాని యొక్క.

తాత్పర్యము

రామచంద్రమూర్తికి నామీఁద దయవచ్చి యయోధ్యకు వచ్చెదనుఁలేరా నాయనా యని చెప్పునంతకు నప్పిచ్చిన బ్రాహ్మణుఁ డప్పు రాఁబట్టుకొనుటకై యప్పుదీసికొన్నవాని వాకిట ముఖమున గుడ్డముసుఁగువేసికొని కూడునీళ్ళు ముట్టక యెట్లు పండుకొనునో యట్లు పండుకొనెదను. ఇది నానిశ్చయము.

సీ. అసుమంత్రుండు రా♦మాస్యంబుఁ జూచుచు,
వేచియుండఁగ రఘు♦వీరుఁ డపుడు
తాన దర్భలతోడఁ♦దల్పంబుఁ గల్పించి,కౌనియున్ననాతని♦కనియె రాముఁ
డన్న! యేయపకార♦ము న్నీకుఁ జేసితి, వాకిటి కడ్డంబు♦పండుటకును
నుత్తమర్ణుఁడువిప్రుఁ♦డొంటిప్రక్కనపండు,
దనసొమ్ము మరలంగఁ♦గొనుటకొఱకుఁ
ఆ. దల కిరీట మూని♦ధరణిఁ బాలించెడి,ధరణిపతికిఁ నిట్లు♦దగునటయ్య
లెమ్ము విడుము భరత♦యిమ్మహావ్రతమును,మరలి చనుము నాదు♦మాటవినుము

రామాస్యంబు=రామచంద్రమూర్తిముఖము, వేచియుండఁగ=అంగీకారమునకై కాచియుండఁగా, భరతుఁడు తలపెట్టినది ప్రాయోపవేశము=మరణార్థియై పండుకొనుట. అంత ఘోరపరీక్ష శ్రీరామచంద్రమూర్తికి సమ్మతమో యసమ్మతమో తెలియక సుమంత్రుఁ డేమియుఁ జేయఁజాలక యూరకుండెను. పెద్దవారు సమక్షమున నున్నప్పుడు వారి యనుమతిలేక పిల్లవాండ్రయాజ్ఞను సేవకులు చేయరాదు. ఈ కారణముచేతనే రావణవధానంతరము సీత లక్ష్మణునితోఁ జితి పేర్పుమన్నప్పుడు లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి సమ్మతిదీసికొని యాపని చేసెను. (యుద్ధ పద్య. ౨౮౮౮. అని జనకాత్మజాత యిటులాడిన దీనత లక్ష్మణుండు రా। ముని వదనంబుఁ జూచి నృపముఖ్యుని యాకృతి సూచిశతా యం। బునుగొని తన్మతంబునను భూరిచితన్ సమకూర్చె)నని యున్నది. రఘువీరుఁడు=భరతుఁడు, తల్పంబు=శయనము, ఉత్తమర్ణుఁడు=అప్పిచ్చినవాఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యాజ్ఞకొఱకై కాచి యాయనముఖముఁ జూచుచు సుమంత్రుఁ డూరక నిలఁబడియుండఁగా భరతుఁడు తానే దర్భలుపఱచుకొని పండుకొనుటకు సిద్ధపడిన భరతునిఁజూచి రామచంద్రమూర్తి యిట్లనియె. తమ్ముఁడా! అప్పిచ్చిన బ్రాహ్మణుఁడు తనయప్పు రాఁబట్టుకొనుటకై యప్పు దీసికొనినవాని వాకిట నొకప్రక్కనే యిటులటులు పొరలక పండుకొనును; నీకు నేనేమి యపకారము చేసితినని నీవట్లు చేయఁదలపెట్టితివి? ఇంతకు నది బ్రాహ్మణునకుఁ దగుఁనుగాని తలమీఁదఁ గిరీటముపెట్టుకొని రాజ్యమేలు క్షత్రియునిధర్మమా? లేలే, యిటువంటి వ్రతమును వదలుము. నామాట విని మరల నయోధ్యకుఁ బొమ్ము.

కం. అన విని భరతుం డనుఁ బుర,జనులను వీక్షించి రామ♦చంద్రుని మీరై
నను దేర్పరె మరలింపరె, యనవుడు వారెల్లఁ బలికి♦రాభరతునకున్.

తాత్పర్యము [౨౮౯౫

అని రామచంద్రమూర్తి చెప్పఁగా విని భరతుఁడు ప్రజలదిక్కు మొగమై యార్యులారా! మాయన్నకు నామీఁద దయరాలేదు. మీరాయనకు ముఖ్యులుగదా మీరైనఁ జెప్పి యయోధ్యకుఁ బిలుచుకొనిపొండు, మీరే యాయనకుఁ దగిన సమాధానము చెప్పుఁడనఁగా వారందఱు భరతునితో నిట్లనిరి.

ఉ. కంటిమి రామచంద్రుమదిఁ♦ గల్గినచందముఁ, దద్వచస్థితుల్
వింటిమి లెస్సపల్కెడి వి♦వేకధనుం డల తండ్రి వాక్యమం
దుంటయె యిష్ట మీసుకృత♦ కొండువిధంబులు ప్రీతిఁ గూర్చె, వీ
దంట మరల్ప మాతరమె♦ దాశరథీ? యన రామచంద్రుఁడున్. ౨౮౯౬

తద్వచఃస్థితుల్=తత్=రామచంద్రమూర్తియొక్క, వచస్స్థితుల్=మాటల తీరు, వివేకధనుండు = తప్పొప్పులఁ జక్కఁగాఁ దెలిసినవాఁడు, సుకృతికిన్ = పుణ్యాత్మునకు, ఒండు=వేఱు, దంటన్=సమర్థుని.

తాత్పర్యము.

భరతా! నీవు చెప్పినదానికంటె నెక్కువ మేమేమి చెప్పఁగలము? నీకాయన చెప్పుచున్న ప్రతివచనముల తీరుఁబట్టి యాయన మనస్సువిధముఁ దెలిసికొంటిమి. ఒప్పుదప్పులు జక్కఁగాఁ దెలిసినవాఁడు కావునఁ జక్కఁగానే చెప్పుచున్నాఁడు. ఆయన యేమితప్పు చెప్పెనని యీయనకు మేము చెప్పఁగలము? తండ్రివాక్యము పరిపాలింపవలయుననియే యాయన కోరిక. ఆయనకు దానియందుండు ప్రీతి రాజ్యమందు మఱియెవరియందు లేదు. ఇట్టివానిని మరల్చుటకు మాకుసాధ్యమా? అనిరి.

ఉ. ఆపలు కాలకించి భర•తా యిటు లౌ హితు లౌమధర్మమే
ధాపరు లైనవారినుడి•దద్దయు నీమది వీరిపల్కులున్
నాపలుకుం దలంచి మఱి•న్యాయ్యపథంబునఁ బొమ్ము, తేరకే
లా పడియుండ, నన్నును జ•లంబుల నంటుము దోషశాంతికై. ౨౪౯౩

హితులు=మేలుగోరువారు, ధర్మమేధాపరులు=ధర్మబుద్ధియందాసక్తిగలవారు.

తాత్పర్యము

ప్రజలుచెప్పిన మాటలువిని రామచంద్రమూర్తి భరతా! లోకులు చెప్పిన మాట వింటివికదా. మేలుగోరి ధర్మమందే యాసక్తిగలిగి నిష్పక్షపాతముగాఁ జెప్పెడివారిమాట తిరొటులేయుండును; నీవు ధర్మపక్షపాతివిగాక నాయందలి ప్రేమచేఁ బలుకుచున్నావు కావున వీరిమాట నామాట మనస్సునకుఁ దెచ్చుకొని న్యాయ్యమార్గమునఁ బొమ్ము. ఏల యూరక నేలఁబడియున్నాఁడవు? వ్రతము లేనివాఁడు దర్భలపై బరుండరాదు. దోషము. క్షత్రియుఁడు నీవు సంకల్పించిన వ్రతము సంకల్పింపనురాదు. అది స్వధర్మ విరుద్ధము. కావున దోషముపోవ నన్నుఁ జలములను దాఁకుము.

జలములు తాఁకుటయనఁగా నాచమింపుమని యర్థము. అశుద్ధి నిమిత్తము కలిగినప్పుడు గురువుల స్పృశించి యాచమించిన శుద్ధుఁడగును. తన్నుఁదాఁకుమనుట నిఁక నిట్టివి చేయనని ప్రమాణము చేయుమనుట.

కం. అన లేచి భరతుఁ డటువలె, వినయంబున జలము లంటి•విశ్వజనంబుల్
విన నిట్లనియె న్విభుఁడీ, జనములు నాపల్కు సరస•సమ్మతరీతిన్.

విశ్వజనంబుల్=సమస్త ప్రజలు. [౨౪౯౪

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యీప్రకారము చెప్పఁగా విని భరతుఁడు దర్భాసనము విడిచి లేచి యాయన చెప్పినప్రకారము జలములను దాఁకి ప్రజలందఱు

వినునట్లు వారితో నిట్లనియె, జనులారా! నాపలుకులు సరసము సమ్మతమునునైన విధముగా వినుఁడు.

ఉ. కోరినవాఁడఁగాను ధరఁ ♦ గూర్పు మటంచును దండ్రి, నెప్పుడున్
గోరినవాఁడఁగా నిటులు ♦ కుత్సితవృత్తిఁ జరింపఁ గైకయిన్,
శ్రీరఘురాముఁ డీయడవిఁ ♦ జేరు టెఱుంగను, దండ్రి వాక్య మే
తీరుపఁ గార్యమేని వని ♦ దేవరమాఱుగ నేన యుండెదన్. ౨౪౯౯

కుత్సితవృత్తిన్=మోసవ్యాపారము,దేవర=దేవశబ్దభవము,ప్రభువనియర్థము.

తాత్పర్యము

తండ్రిని నాకు రాజ్యమిమ్మని నేను గోరలేదు. ఇటువంటి కుచేష్టలు చేయుమని తల్లిని గోరలేదు. శ్రీరామచంద్రమూర్తి యడవికి వచ్చినవార్తయు నేనెఱుంగను. తండ్రివాక్యము పరిపాలించుట యావశ్యకమేని మాయన్నగారి మాఱుగ నేనుండెదను. ప్రతినిధుల నేర్పాటుచేయుట శాస్త్రసమ్మతమయిన కార్యమేగదా. కావున నీ పరివర్తనము నంగీకరింపుఁడు.

—♦ శ్రీరాముఁడు వనవాసానంతరము రాజ్యంబుఁ గొన నంగీకరించుట. ♦—

కవిరాజ విరాజితము.

అనవుఁడు దథ్యహితోక్తికి విస్మితుఁ♦డై విభుఁడిట్లనుఁ బౌరులతో
జనకుఁడు కొన్నది యమ్మిన దాహిత♦సత్త్వము మార్పఁగ నొప్పనె యీ
తనికిని నాకును గావునఁ దద్విధి♦దప్పఁగ నేఁడిట నొల్లఁ జుఁడీ
వని విధిఁ దీర్పఁగఁజాలెడి నేనెటు♦భంగి భరం బిడ బాలునిపై. ౨౫౦౦

తథ్యహితోక్తికిన్=సత్యము హితమునైనమాటకు, ప్రతినిధుల నేర్పాటు చేయుట శాస్త్రసమ్మతమగుటచేఁ దథ్యము, రాజ్యమర్పించుట హితము, విస్మితుఁడై=ఆశ్చర్యపడినవాఁడై, ఆహితము=కుదువయుంచఁబడినది, రామచంద్రమూర్తికిఁ దాను శిష్యుఁడుగావున నాయన పూనినవ్రతము నాయనకుమాఱుగఁ దాను జేసెదనని భరతుఁడు చెప్పెను. శ్రీరామచంద్రమూర్తి దానిని దథ్యసూక్తి యని తలఁచెను. దీనివలన గురువుల వ్రతమును శిష్యులు వారికిమాఱుగఁ జేయ వచ్చునని యేర్పడుచున్నది. అట్లు శిష్యులుచేసిరేని గురువులపాపము పోవును. ఈవిషయమై విష్ణుపురాణంబున నిట్లుగలదు.

"పూర్వమేవం మునిగణైః, సమయోయః కృతోద్విజ
వైశంపాయన ఏవంతు, తం వ్యతిక్రాంతవాన్ స్తదా,
స్వస్త్రీయం బాలకం సోఽథ, యథాభ్రష్ట వఃఘాతయత్
శిష్యానా హచ హేశిష్యాః, బ్రహ్మహత్యాపహంవ్రతమ్

చరధ్వం మత్కృతేసర్వే, నవిచార్యమిదం తతః
బ్రహ్మహత్యా వ్రతంచీర్ణం, గురుణా చోదితై స్త్రయైః.

ఇందు బ్రహ్మహత్యచేసిన గురెవు తనపాపముపోవ శిష్యులను వ్రతము చేయుఁడని చెప్పెను.

తా త్ప ర్య ము

భరతుఁడు చెప్పిన తథ్యము హితమునైనమాటకు రామచంద్రమూర్తి యాశ్చర్యపడి పౌరులతో నిట్లనియె. ఆర్యులారా! తండ్రి జీవించియుండఁగా నాయన కొన్నదానిని అమ్మినదానిని గుదువయుంచినదానిని నిప్పుడాయన లేఁడను కారణముతో వీఁడుగాని నేనుగాని తప్పిపోవచ్చునా? అటుచేయుట వీనికిఁదగదు. నాకుఁదగదు. నేనేమో తండ్రిమాట వ్యర్థముచేయనొల్లను. వీఁడు తండ్రిమాటయందు లక్ష్యములేక తానుగూడ నడవిలోనుండి తండ్రియాజ్ఞ మీఱిన నేనేమి చేయఁగలను? తండ్రి నాకు వనవాసమిచ్చి దానికి వెలగా నా రాజ్యమును గొనెను. దానినెట్లు మార్పసాధ్యము? నాకుఁ బ్రతినిధిగాఁ దాను నడపులయందుండెద ననెను. శక్తిలేక వేఱుమార్గములేక యున్నప్పుడుగదా ప్రతినిధులను శాస్త్రమంగీకరించుచున్నది. వారుణస్నానము చేయలేనివానికిఁ గదా గౌణస్నానము విధింపఁబడినది; వారుణ స్నానమునకు శక్తియున్నప్పుడు గౌణస్నానము చేయవచ్చునా? ఆపద్ధర్మము లాపదయందుఁగాని తక్కినవేళల నాచరింపవచ్చునా? కావున నేను వనవాసము చేయుటకు శక్తియుండఁగా నాకు మాఱుగఁ జిన్నవానిని నీవు వనవాసము చేయుమని యెట్లు చెప్పుదును? పెద్ద వాఁడను నేనే చేయలేనేని వీఁడెట్లు చేయఁగలఁడు?

"కొన్నది....దీనివలనఁ గొడుకుల నమ్ము నధికారము తండ్రికిఁ గలదని యేర్పడుచున్నది."

శ్లో. శోణితశుక్ల సంభవో మాతాపితృ నిమిత్తకః
తస్యదాన పరిత్యాగ విక్రయేషు మాతాపితరౌ భవతః॥ బోధాయనుఁడు.

తల్లిశోణితము తండ్రిశుక్లము కలిసి బిడ్డఁడగుచున్నాఁడు కావున వానిని దానమిచ్చుటయందుఁ, బరిత్యజించుటయందు, విక్రయించుటయందు వారి కిరువురకు నధికారము గలదు.

ఉ. న్యాయము పల్కెఁ గైక, వసుధాధిపుఁడుం జరియించె ధర్మమం
దీయనఘుండు ధీరగుణుఁ డీడ్యుఁడు క్షాంతుఁడు వృద్ధసేవనా
త్యాయతభక్తియుక్తుఁ డని యాత్మ నెఱుంగుదు, సత్యశీలి కై
తెయిప్రియాత్మసూతికిని క్షేమము కల్గెడు నెల్ల వేళలన్. ౨౨౦౧

ఈడ్యుఁడు = పొగడ్తకుఁ దగినవాఁడు, క్షాంతుఁడు = ఓర్పుగలవాఁడు, వృద్ధ సేవనా=వృద్ధుల సేవించుటయందు, ఆయతభక్తియుక్తుఁడు=విస్తారమైన భక్తిగలవాఁడు, ప్రియాత్మసూతికిని=ప్రియకుమారునకు.

తా త్ప ర్య ము

ఆర్యులారా! వీఁడు తల్లిని దండ్రిని దూషించుచున్నాఁడు గాని వారి యందు దోషములేదు. కైక న్యాయమే చెప్పెను. వివాహకాలమందు దశరథుఁడు చేసిన వాగ్దానమునే కదా యామె యడిగెను. నీవుచెప్పిన మాటప్రకారము నడచు కొమ్మనుట తప్పా? దశరథుఁడును ధర్మమందే చరించెను. తానుజేసిన వాగ్దాన మును నెఱవేర్చుటయందేమి యధర్మమున్నది? ఇతనియందును దోషములేదు. ధీరాత్ముఁడు, కనుకనే స్తోత్రపాత్రుఁడు. ఓర్పుగలవాఁడు పెద్దలసేవయందు మిగుల భక్తిగలవాఁడు. కావుననే నాసేవకోరుచున్నాఁడు. ఇవన్నియు నాకుఁ దెలియును.కాఁబట్టి సత్యస్వభావముగల యీభరతునకు క్షేమము గలుగునుగాక!

చం. వనమున నాలుగుంబదియు•వర్షము లుండి యనంతరంబు ప
 ట్టనమున కేగుదెంచి ప్రక•టంబుగఁ బట్టము నొంది యప్పు డీ
 యనుజునితోడ నుందు నెఱు•లంబ వచించినపల్కుఁ దీర్తు నా
 యనువునఁ బెద్దవాఁడ నని•యాడినఁ దీర్పఁగ రాదె వీనికిన్. ౨౩౦౨

నాలుగుంబది=పదునాలుగు, వర్షములు=సంవత్సరములు, అంబ=తల్లి, అనంతరము=ఆవల, అనువునన్=విధముగా.

తా త్ప ర్య ము

నేను బదునాలుగు సంవత్సరముగా వనములందుండి యావల నయో ధ్యకు వచ్చి పట్టాభిషేకము చేసికొని యప్పు డీతమ్మునితోడ నుండెదను. ఏవిధ ముగనైనను దల్లియగు కైకచెప్పినమాట నెఱవేర్తును. పెద్దదిగదా తల్లి. ఆమె మాటను జిన్నవాఁడనైన నేను నెఱవేర్పవలయునుగదా యని నేను బూనినట్లు నేను దనకంటెఁ బెద్దవాఁడను, తండ్రివాఁటు తండ్రిని. అట్టినేను జెప్పినప్పుడు పెద్దవాఁడు చెప్పుచున్నాఁడే అయనమాట విందము అని యీమాత్రము నాగౌరవము వీఁడు దక్కింపరాదా! ఇంత మొండితనమా!!

౧౧౨-వ సర్గము.

సీ. అనఁగ నంతిర్హితు•లైనసిద్ధర్షులు, నన్నదమ్ములపల్కు•లాలకించి
 యద్దిరా యిట్టిమ•హాత్ములఁ గన్నయా, దశరథుం డెంతటి•ధన్యతముఁడొ
 యని ప్రశంసించిరి•యాత్మల దశకంఠు,
 వధముఁ గోరుచు నున్న•పరమమునులు
 భరతునిఁ గన్గొని•పల్కిరి సీతండ్రి, తఱియింపఁ గోరెడి•తలఁపు గల్గె
ఆ. నేని గ్రాహ్య మగును•జానకీధవుపల్కు, దండ్రిబుణముఁదీర్పఁ•దగు నితనికిఁ
 గైకబుణము దీఱఁ•గాదె నీజనకుండు, స్వర్గలోకమునకుఁ•జనుట భరత.

అంతర్హితులు=కానరాకయున్నవారు, సిద్ధర్షులు = సిద్ధులు ఋషులు, ఆల కించి=విని, అద్దరా=ఔరా, ప్రశంసించిరి = పొగడిరి, గ్రాహ్యము = గ్రహింపఁ దగినది.

తాత్పర్యము

ఈప్రకారము శ్రీరామచంద్రమూర్తి చెప్పఁగా సభవారికిఁ గానరాకయున్న సిద్ధులు ఋషులు నా యన్నదమ్ముల మాటలు విని యౌరా! యిటువంటి గొప్ప మనస్సు గొప్పస్వభావము గలవారిని గొడుకులుగాఁగన్న దశరథుఁడెంత పుణ్యాత్ముఁడొ కారణగుణము కార్యమందు వర్తించునన్నట్టు లతఁడెంత గొప్పవాఁడు గాకుండిన నింతగొప్పవారిని గొడుకులుగాఁ గనునా? యని రామభరతులఁ దమ మనస్సులందే పొగడిరి. ఇఁక సభయందుండి వారి సంవాదము వినుచున్న గొప్పమునులు దశకంఠుని చావుగోరుచున్నవారగుటచే శ్రీరాముఁ డయోధ్యకుఁ బోవుటకు సమ్మతింపనివారై భరతునిఁజూచి యిట్లనిరి. భరతా! నీతండ్రి తరింపవలెనని నీకుఁగోరికయుండెనా శ్రీరామచంద్రమూర్తి చెప్పినట్లు నీవుచేయుము. ఈయన తండ్రి ఋణముఁ దీర్చుటే తగును; కైకయప్పుతీరుటచేఁగదా నీతండ్రి స్వర్గమునకుఁ బోఁగలిగెను. లేకున్న నసత్యమాడిన దోషమునకై నరకము పాలయి యుండునుగదా.

తే. అనుచు గంధర్వసిద్ధర్షు•లరిగి రిచ్చ,హృష్టవదనాబ్జుఁ డగుచు సీ•తేశుఁ డపుడు
మునులవాక్యంబులకుఁ జాల•మోద మంది,
వారి నెల్లరఁ బూజించె•గౌరవమున. ౨౫౦౮

ఇచ్చన్=వారి యిష్టప్రకారము, హృష్టవదనాబ్జుఁడు=సంతోషించిన ముఖకమలము గలవాఁడు, మోదము=సంతోషము.

తాత్పర్యము

ఈ ప్రకారము గంధర్వులు సిద్ధులు ఋషులు చెప్పి వారివారి యిష్టము ప్రకారము వెడలిపోయిరి. మునులమాటలకు శ్రీరామచంద్రమూర్తి మిగుల సంతోషముచే వికసించిన ముఖకమలము గలవాఁడై వారిని గౌరవించెను.

తే. అందఱకు సమ్మతం బైన•యగ్రజాతు,
వాక్యముల విని భయముస•వణఁకు మేన
హస్తములు రెండుజోడించి•యధికవినయ,
గరిమని ట్లను జానకీ•కాంతుఁగనుచు, ౨౫౦౯

సమ్మతము=మనస్సునకు సరిపడినది, అగ్రజాతు=అన్న.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి మాటలనే సభ్యులంద ఱంగీకరించుటఁ జూచి మన మాట నెవరు సమ్మతింపరైరే యిఁకనేమి చేయుదును అన్న యయోధ్యకు రాఁడే నాగతియేమి యని భయమున వణఁకుచుఁ జేతులు రెండు జోడించి భరతుఁడు మిక్కిలి వినయముతో శ్రీరామచంద్రమూర్తితో నిట్లనియె.

చం. అతులపరంపరాగతని•జాన్వయధర్మము క్షత్రధర్మమున్
మతిఁ దలపోసి తీర్పఁ దగు • నామకమాతృమనోరథంబు లీ

క్షితితల మే నొకండఁ దమి ♦ సేయఁ జుమీ భరియింప, భూప్రజా
వితతిమనంబు సంతసము♦పెట్టఁగ నైనను నేర నన్నయా. ౨౫౦౬

అతుల=అసమానమైన, **పరంపరాగత** = వంశపారంపర్యముగా (క్రమముగా) వచ్చిన, **నిజాన్వయధర్మము**=మనవంశముయొక్క ధర్మమును, **క్షత్రధర్మమున్**=రాజ్య పరిపాలనమే ముఖ్యధర్మమను క్షత్రియుల ధర్మమును, **తలపోసి**=ఆలోచించి, **మామక**=నాయొక్క, **మాతృమనోరథంబు**=తల్లికోరిక, **తమి**=కోరిక, **భూప్రజా**=భూమీజనులయొక్క, **వితతి** =సమూహముయొక్క.

తాత్పర్యము.

అన్నా! అసమానమైన మనవంశక్రమమున వచ్చినదైన ధర్మమును క్షత్రధర్మమును మనస్సునందాలోచించి నాతల్లికోరిక నెఱవేర్పను. ఈ భూభారమును నే నొకఁడనే భరియింపఁగోరను. ఒకవేళ కోరినను నేనీప్రజలకు సంతోషకరముగఁ బాలనము చేయలేను.

కం. మనచుట్టంబులు యోధులు, మనసుహృదులు మిత్రజనులు♦మాననితివుటన్
నిను నెదురుచూచువారలు,జనవర! వానకును హాలిక♦జనములమాడ్కిన్.

సుహృదులు = మంచి మనస్సుగలవారు, **తివుటన్**=కోరికతో, **హాలికజనముల**=దున్నుకొనిబ్రతుకు కాఁపుల, హాలికుఁడు యోజిదున్నునెడ, యని భారతము. హాలికులైననేమి పోతన. హలిక హాలిక శబ్దములు రెండును గలవు. మన చుట్టంబులు యోధులనుచో మనయనునది యోధులతో మనసుహృదులు మిత్రజనులనుచో మన యనునది మిత్రజనులతోడను నన్వయించును. మన చుట్టంబులు మన యోధులు మన సుహృదులు మనమిత్రుజనులని యన్వయము. "పరుల ధనమునకు విద్యాపరిణితికిన్ దేజమునకు" నని భారతము. ఇచ్చట పరుల ధనమునకు, పరుల విద్యాపరిణితికి, పరులతేజమున కని యన్వయము.

తాత్పర్యము

మనబంధువులు మన యుద్ధశూరులు మనహితము గోరువారు మన మిత్రులు వీరందఱు నెంతోకోరికతో వానకై హాలికు లెదురుచూచుచున్నట్లు నీరాక కెదురుచూచుచున్నారు.

శా. అన్నా! రాజ్యము నొల్ల, నీవ కొనవే♦ యర్థుండ వీ వంచు నా
పన్నుండై పడి పాదపద్మయుగళిం♦బ్రార్థింపఁగా రాముఁడు
త్పన్నప్రేమను లేవ నెత్తి తనయు♦త్సంగంబునం జేర్చి భా
స్వన్నీలాబ్దతనున్ మరాళరవుఁ గం♦జాతేక్షణుం బల్కెడున్. ౨౫౦౭

ఆపన్నుండై =దుఃఖముచే దీనుఁడై, **పాదపద్మయుగళిన్** = కమలములవంటి రెండుకాళ్ళమీఁద, **ఉత్పన్న**=పుట్టిన, ఇప్పుడు ప్రేమపుట్టెననుటచే నింతవఱకుఁ బ్రేమలేదని యర్థముకాదు. పాదములమీఁదఁబడి శరణాగతి చేయుటచేఁ

ప్రేమ యతిశయించెనని భావము. ఇది శ్రీరామచంద్రమూర్తి మనస్సున బాగుగ నాటియున్నది. శరణాగతవత్సలుఁడుగదా కావుననే.

ఉ. నీ వచనంబులన్ విననినిష్ఠురచిత్తుఁడ నంచు నెంచకో
పావనశీల నామనసు భ్రాతపయిం జనుచున్న దమ్మహా
భావుఁడు చిత్రకూటమునఁ బాదములంబడెఁ జేతులొగ్గి నెం
తోవడి వేఁడె నన్మరలఁ దోడ్కొని పోవ. యుద్ధ. ౨౬౭ ననికదా చెప్పెను.

భగవంతుని యనుగ్రహము సంపాదింపఁ దలఁచినవా రింతకుమించి చేయవలసినదిలేదు. ఉత్సంగము=తొడ, భాస్వన్నీలాబ్జతనున్=ప్రకాశించు నల్లకలువవంటి దేహముగలవానిని, మరాళరవున్=హంసధ్వనివంటి కంఠధ్వనిగల వానిని, కంజాతేక్షణునిన్=కమలములవంటి కన్నులుగలవానిని, ఇంతవఱకుఁ దన మీద నన్నకు సందేహమేమో చేరఁదీయలేదే యని దుఃఖపడుచుండినవాఁ డిప్పుడు తన్ను శ్రీరామచంద్రమూర్తి లేవఁదీసి తొడపైఁ గూర్చుండఁబెట్టుకోఁగానే యింక భయములేదు బ్రతికితినన్న సంతోషమున నతని కింతవఱకు దుఃఖాతిశయముచేఁ దెల్లఁబాఱియుండిన దేహము యథాప్రకారము నల్లకలువ వన్నెగలదయ్యెను. ఏడుపుగొంతుపోయి హంసకంఠధ్వనివంటి మంచి కంఠధ్వని వచ్చెను. కన్నులును గమలములవలె వికాసమునొందెను. అని యుపమానముల సారస్యము.

ఇంతవఱకు భరతుఁడు రామానుగ్రహము సంపాదించుకొనుటకై ధర్మశాస్త్రవాదము చేసెను. ఇతరులచేఁ జెప్పించెను. మఱెన్నియుపాయములు చేసినను వ్యర్థమగుటచూచి యివన్ని నిష్ప్రయోజనములని యెంచి శ్రీరామచంద్రమూర్తినే యుపాయముగాఁ గొని యాయన కాళ్ళమీఁదనేపడెను. అప్పుడు శ్రీరామచంద్రమూర్తి యనుగ్రహించెను. కావునఁ దక్కిన సాధ్యోపాయములగు కర్మజ్ఞానయోగ భక్త్యాద్యుపాయముల నెల్ల నదలి "అకించనో నన్యగతి శ్శరణ్య త్వత్పాదమూలం శరణం ప్రపద్యే" యని నిర్వేదముతోఁ గన్నీరు కార్చుచు భగవంతుని పాదములఁబడుటే పరమోపాయము చరమోపాయము. ఇంతకు మించినదిలేదు. ఇంత దీనుఁడై నిష్కల్మష హృదయముతో భరతుఁడు చేసిన శరణాగతి యేల ఫలింపలేదు? ఫలింపక వ్యర్థముకాలేదు. రావణవధార్థమై దేవత లింతకుముందే శరణాగతి చేసిరి. (బాల. ౪౪౭-వ ప.) ఇప్పుడు భరతుఁడుచేసిన శరణాగతి దానికి విరుద్ధమయినది. అయోధ్యలోఁ బట్టాభిషేకము చేసికొని సింహాసనముపై హాయిగఁ గూర్చుండిన దండకయందలి రాక్షసుల నెవఁడు చంపును? అందలి మునుల నెవఁడనుగ్రహించును? రావణాదుల నెవఁడు వధించును? ఇది తనకుఁగల నక్షౌహిణీసేనతో నగుకార్యముకాదు. అదియును గాక నిష్కారణముగ నందఱ నేమని వధించును? కావున నరణ్యావాసము విహిత కృత్యమైయున్నది. పరస్పరవిరుద్ధములైనవి రెంటు తటస్థించి రెండును జేయ

వలసినవే యైనపుడు ముందు తటస్థించినది ముందు చేయఁదలఁచెను. వెనుకఁ దటస్థించినది వెనుకఁ జేయఁదలఁచెను. తండ్రి వాక్యము నెఱవేర్చికదా యావల తల్లివాక్యము నెఱవేర్చెను. కావునఁ బ్రబల ప్రారబ్ధ మడ్డపడెనేని యాలస్యమగునుగాని శరణాగతి వ్యర్థముపోదు; ప్రారబ్ధము తీఱఁగానే యా జన్మమందే ఫలించును.

—• శ్రీరాముఁడు భరతుని సమాధానపఱుచుట. •—

చం. అహితభయప్రదానచరి•తా! వినయాన్విత మిట్టిబుద్ధియున్
సహజముగా లభించిన ప్రశ•స్తగుణుండవు నీకు లక్ష్యమే
మహిపరిపాలనంబు, మతి•మంతులు మంత్రులు మిత్రులున్ సదా
విహితమె పల్కుచుండుదురు•వీరిమతిన్ ఘటియింపు కార్యముల్. ౨౦౯

అహిత=శత్రువులకు, భయప్రదాన=భయముగలిగించు, చరితా=నడవడి గలవాఁడా, ఈ విశేషణము రాజ్యపాలనమందు శక్తిగలవాఁడని సూచించు చున్నది. వినయాన్వితము=అణఁకువతో గూడుకొన్నది, విహితమె = మిక్కిలి మేలైనదానివే.

తాత్పర్యము

రాజ్యమును నేనొకఁడనే భరింపలేను, ప్రజలను రంజింపలేనని భరతుఁడు చెప్పినమాటకు శ్రీరామచంద్రమూర్తి ప్రత్యుత్తరము చెప్పుచున్నాఁడు:

శత్రువులకు భయముగలిగించు నడవడిగలవాఁడా! అణఁకువతోఁ గూడిన యిట్టిబుద్ధి స్వభావసిద్ధమైన గొప్పగుణముగల నీకు భూమిని బాలించుట లక్ష్యమా! గర్వము వినాశసూచకముగాని యణఁకువ యెవరియందున్నను శ్రేయస్సూచకమే. అదిగాక నీవొకఁడవే మోయునది యేమున్నది? ఈ మంత్రులు మిత్రులు బుద్ధిమంతులు గావున శ్రేయస్కరమైనవానినే యెప్పుడు చెప్పుదురుగాని యపయశస్సు గలిగించునవి చెప్పరు. కావున వీరియభిప్రాయ ప్రకారము కార్యములు చేయుచుండుము.

ఉ. పాయును గాక లక్ష్మి హిమ•భానుమనోహరమండలంబునున్,
బాయును గాక మంచు హిమ•వన్నగరాజమునుండి, వేలనే
పాయును గాక సాగరము • విశ్వము ముంపఁగ రామచంద్రుఁడున్
నాయన! తండ్రిసత్యవచ•నంబును దప్పఁడు, మాట లేటికిన్. ౨౧౦

సందేహము దీరునట్లు తన యభిప్రాయమును దెగఁజెప్పుచున్నాఁడు. హిమభాను=చల్లని కిరణములుగల చంద్రునియొక్క, మనోహర=మనస్సునాక ర్షించు నందముగల, మండలంబునున్=బింబమునుండి, లక్ష్మి = కాంతి, లక్ష్మి దేవి. 'ధ్యేయస్సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ' యన్నట్లు సూర్య బింబమందు విష్ణువున్నట్లు చంద్రబింబమందు లక్ష్మిదేవి యున్నది, సినీవాలి శబ్దమున కుత్పత్తి గురు బాలప్రబోధికయం దిట్లు వ్రాయఁబడినది. అః విష్ణుః తేన సహవర్తన ఇతి సా లక్ష్మీః సా అస్యామితి సినీ చంద్రకళా- సాబాలా అస్యా మితి సినీవాలీ ఈ సీ-అ అనఁగా విష్ణువు అతనితోఁ గూడినది గనుక సా అనఁగా

లక్ష్మి ఆ లక్ష్మిగలది గనుక సిని యనఁగాఁ జంద్రకళ ఆచంద్రకళ దీనియందు లేఁతదై యుండును గనుక సినీవాలి వబయోరభేదః" శ్రీసూక్తమందును ఈ యర్థము కానవచ్చుచున్నది. వెన్నెలను ఆమె తేజస్సుగాఁ జెప్పినను జెప్ప వచ్చును. లోకములోనివా రమావాస్యనాఁడు చంద్రునికాంతి పోయినదని తలంతురుగాక. ఆకాంతి మనకుఁ గానరాలేదుగాని చంద్రునికిఁ గాంతియే నాశమై పోలేదు. సూర్యగ్రహణమునాఁడు సూర్యరశ్మి మనకు లేకున్నమాత్రమున సూర్యకాంతియే నాశమైపోయినదని యర్థమా? హిమవన్నగరాజము=మంచుఁ గొండ,మంచుఁగొండయందు మంచులేకపోయిన స్వరూపనాశమనియేయర్థము. ఆవల దానికి మంచుఁగొండయని పేరెక్కడిది? ఎండకాలమందుఁ గొంతమంచు కరఁగినంతమాత్రమున నది మంచులేనిదగునా? మంచుఁగొండయందు మంచు లేకుండఁ జేయసాధ్యమా? వేల = సముద్రతీరము, చెలియలికట్ట, సాగరము = సముద్రము, విశ్వము=ప్రపంచము, సముద్రము చెలియలికట్టనుమించి రాఁగూడ దని మర్యాద; ప్రలయకాలమందు మించివచ్చును. అట్లు ప్రలయము తటస్థించి నను శ్రీరాముఁడుమాత్రము తండ్రిచెప్పిన సత్యవచనము తప్పఁడు.

తా త్ప ర్య ము

నాయనా! భరతా!! యేల వలవని జాలిపడెదవు ? చంద్రునినుండి లక్ష్మి తొలఁగినఁ దొలఁగునుగాక. హిమవంతమున మంచు లేకపోయినఁ బోవునుగాక. చెలియలికట్టదాఁటి సముద్రము లోకమును ముంచిన ముంచునుగాక యీరామ చంద్రుఁడు మాత్రము సత్యము తప్పఁడు. ఏల వృథామాటలు?

ఆ. కామ మైననేమి ♦ కడులోభ మగు నేమి, నీకుఁగాను గోరె ♦ నీదుతల్లి
తల్లి తల్లిగాదె ♦ తనయుఁ డాయమపల్కు, సేయ వలదె తక్క ♦ చింత విడుము

తా త్ప ర్య ము. [౨౩౧౧

కామముచేతనే కోరెనో లోభముచేతనే కోరెనో నీకుఁగా నీ తల్లిగోరినది నిజము. ఎంతచెడ్డదైనను దల్లితల్లియేకదా. అట్టి తల్లిపలుకు కొడుకు చేయక యుండవచ్చునా? తక్కిన యాలోచనలన్ని వదలిపెట్టుము. ఈ యొకదానికిఁ బ్రత్యుత్తరమిమ్ము.

—♦ శ్రీరాముఁడు భరతునకుఁ దనపాదుక లొసంగుట. ♦—

సీ. అనుచు వచించిన ♦ యాదిత్యసమతేజు, నన్నను గనుఁగొని ♦ యనియె భరతుఁ
డన్న నీవింతటి ♦ యచలప్రతిజ్ఞుండ, వైన నేనే మందు ♦ నయ్య నిన్ను
నాయభాగ్యముగాక ♦ మాయురే యింతైన, నీమది గరఁగదు ♦ నిర్మలాత్మ
యూరక పో నొల్లఁ ♦ గూరిమి మోపుము, భర్మభూషితరత్న ♦ పాదుకలను
ఆ. నీదుచరణములను ♦ నెమ్మి నాశ్రీరామ, భద్రుఁ డట్ల యిచ్చె ♦ భరతునకును
వానిఁ దా గ్రహించి ♦ వఱలినభక్తిని, హస్తయుగళిమ్రొక్కి ♦ యన్న కనియె.

ఆదిత్యసమతేజున్=సూర్యునితేజస్సుతో సమానమైన తేజస్సుగలవానిని, అచలప్రతిజ్ఞుండవు=చలింపని ప్రతిజ్ఞగలవాఁడవు, అభాగ్యము=దురదృష్టము, మాయురే=(ఆశ్చర్యార్థకము) ఔరా!, భర్మభూషిత రత్నపాదుకలను=బంగారు సొమ్ములచే నలంకరింపఁబడి రత్నములతోఁ జేయఁబడిన పావుకోళ్ళను, హస్త యుగళి=రెండుచేతులు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యీప్రకారము తెగఁజెప్పఁగా సూర్యునివలెఁ బ్రకాశించు నన్నను జూచి భరతుఁ డిట్లనియె. అన్నా! నీ వీప్రకారము ప్రతిజ్ఞ నుండి చలింపననిన నేనేమి చెప్పఁగలను. అది నాదురదృష్ట మనుకొందును. ఔరా! నేనింతదూరము ప్రార్థించినను నీమనస్సు కరఁగలేదే. నీకు నాయందు నిర్మలమైన మనస్సుండెనా యీబంగారు పాదుకలమీఁద నీచరణములను మోపుము. అనిన శ్రీరామచంద్రమూర్తి యట్టులేచేసి యిచ్చెను. భరతుఁడు వానిని భక్తితోఁదీసికొని రెండుచేతులు జోడించి యన్నతో నిట్లనియె.

౨౨౨౨-వ పద్యమందు వసిష్ఠుఁడు పాదుకలిమ్మని శ్రీరామునకుఁ జెప్పి నట్లున్నది. దీనివలన నన్నదమ్ములిరువురు మొండికి వేసికొనుటచూచి వసిష్ఠుఁడు మధ్యవర్తియై యడుగమని భరతునకు, నిమ్మని శ్రీరామచంద్రమూర్తికిఁ జెప్పె నని తోఁచుచున్నది. ఈ బంగారుపాదుక లెక్కడివి? ఆసమయాని కెందుండి వచ్చెను? అను ప్రశ్నకుఁ బ్రత్యుత్తరము రామాయణమున లేదు. భరతుని ప్రయత్నము నెఱవేఱదని తెలిసి వసిష్ఠుఁడు భరతునతో రామునకు నక్కడనే పట్టాభిషేకము చేసెదవేని క్రొత్తపాదుకలు చేయింపుమని చెప్పి చేయించెనని తోఁచెడిని. రామమూర్తి యుత్తకాళ్ళతోనేకదా యడవికి వచ్చెను.

చం. విను పదునాలుగేండ్లు రఘు♦వీర! జటాజినధారి నై ధృతిన్
దినములు లెక్కవెట్టుచును ♦ దిన్చు ఫలంబుల, నూరివెల్పలన్
గొని నిలయంబుఁ, బాదుకల♦కున్ వినిపించుచు రాజ్యతంత్రమున్
మనియెద; నగ్నిఁ జొచ్చెదఁ జు♦మా మఱుతేపట నీవు రానిచోన్. ౨౨౧౩

కం. అనవుఁడు నట్టుల కానిమ్మని బాస యొనర్చి క్రుచ్చి♦యతనిన్ శత్రు
ఘ్నునినూఱడఁబల్కుచు నిట్లనియెన్ రాముండు కైక♦యాత్మజుతోడన్. ౨౨౧౪

జటాజినధారినై=జడలుధరించి కృష్ణాజినము కట్టుకొన్నవాఁడనై, ధృతిన్= మరల నీవు వచ్చెదవను ధైర్యముతో, నిలయము=కాఁపురము, ఇల్లు, మనియె దన్=బ్రదికియుండెనను, మఱుతేపట = పదునాలుగేండ్లకు మఱుసనాఁడు, రాని చోన్=రాకపోయిన పక్షమందు.

తాత్పర్యము

అన్నయా! నేనాడుమాట సావధానుఁడవై వినుము. నేను సరిగావినలేదన వలదు. ఒకటి రెండు అని దినాలెంచుచు జడలు దాల్చి జింకచర్మము గప్పుకొని పండ్లు దిని యయోధ్యలోఁగాక యూరికి వెలుపల నివ్వేర్పఱుచుకొని రాజ్యతంత్రమంతయుఁ బాదుకలకు వినిపించుచుఁ బ్రాణము బిగఁబట్టి యుండెదను. పదునైదవ సంవత్సరము మొదటిదినము నీవు రాకపోయితివో నేనగ్ని ప్రవేశముఁ జేసెదను.

ఇది సీతాదేవికిఁ గైకపైఁ గోపములేదని తెలుపఁ జెప్పినమాట.

భరతుఁడిట్లు చెప్పఁగా నట్లేకానిమ్మని శ్రీరామచంద్రమూర్తి మాటయిచ్చి శత్రుఘ్నుని సమాధానపఱిచి భరతునితో నిట్లనియె.

కం. పోషింపుమి కైకను సం,తోషంబున; నాడె దేమొ♦దూషణ మామెన్
రోషమున నిన్ను సీతా,యోషయు నేనును శపింతు♦ముర్వీశసుతా! [౨౯౧౧౨]

తాత్పర్యము.

నీవు కైకను సంతోషముతో రక్షింపుము. కోపముచే నామెను దూషించెద వేమో. అట్లుచేసితివేని నేను సీతాదేవియు నిన్ను శపింతుము. ఒకవేళ నాశాపము తప్పినా పతివ్రతయగు సీతాదేవిశాపము తప్పదు. జాగ్రత్త యనిభావము.

మ. అనుచుం గన్నుల నీరు గ్రమ్మఁ జని ర♦మ్మా నాయనా! యంచుఁ ద
మ్ముని వీడ్కొల్పె, నతండు పట్టకరిరా♦ణ్మూర్ధంబునం బాదుకల్
వినయం బారఁగ నిల్పి రామునకు బా♦ళిన్ మ్రొక్కె, రాముండునున్
జనవారన్ సెల విచ్చె నైగమవయ♦స్యస్తోమమంత్ర్యాళికిన్. ౩౦౧౧౨

పట్టకరిరాణ్మూర్ధంబునన్=పట్టపేనుఁగు కుంభస్థలమందు, నైగమ=పౌరులకు, వయస్య=మిత్రులయొక్క, స్తోమ=సమూహమునకు, మంత్ర్యాళికిన్=మంత్రుల సమూహమునకు.

తాత్పర్యము

అనిచెప్పి కన్నులందు నీరు గ్రమ్ముచుండ నాయనా పోయిరమ్మనిచెప్పి పంపెను. భరతుండును బాదుకలను బట్టపుటేనుఁగు కుంభస్థలమునందు వినయముతో నుంచి రామచంద్రునకు నమస్కరించెను. రామచంద్రమూర్తియుఁ బౌరులకు మిత్రులకు మంత్రులకుఁ బోయిరండని సెలవిచ్చెను.

కం. తను వీడ్కొనలేకేడ్చెడు, తనతల్లుల కెల్లరకును♦ దగుగతి వం
దనములు ఘటించి చొచ్చెం, దనదుకుటీరంబు రోద♦నస్వరయుతుఁడై.

వీడ్కొనలేక=వదలిపోలేక, తగుగతి నభివాదనములు=ఉపసంగ్రహణము, ఘటించి=కావించి, రోదనస్వరయుతుఁడై=ఏడుపుధ్వని గలవాఁడై. శ్లో. గురువత్ప్రీతిపూజ్యాస్స్యుః, సవర్ణా గురుయోషితః। మాతృష్వసా మాతులానీ శ్వశ్రూరథ పితృష్వసా! సంపూజ్యా గురుపత్నీ వత్సమాస్తా గురుభార్యయా, భ్రాతృభార్యోప సంగ్రాహ్యా, సవర్ణా హ న్యహ న్యపి, విప్రోష్య తూపసంగ్రాహ్యా జ్ఞాతి

సంబంధియోషితః । అవృద్ధా గురుపత్నీచ నోపసంగ్రహ మర్హతి॥ ఉపసంగ్రహణమనఁగాఁ గోత్రముపేరు తనపేరు చెప్పి అహంభో అభివాదయే యనిచెప్పి రెండు చెవులు స్పృశించి కుడిచేతిచే గురువు కుడిపాదము ఎడమచేతిచే నెడమ పాదము పట్టుకొని శిరస్సువంచుట. ఈ మీఁదిశ్లోకమున గురువులనఁగా: తల్లి, సజాతి పాలిచ్చిన దాది, తండ్రి, తండ్రితండ్రి, తల్లితండ్రి, అన్నదాత, భయత్రాత, ఆచార్యుఁడు, ఉపనయనము చేసినవాఁడు, మంత్రముపదేశించిన వాఁడు, వారిభార్యలు వీరంద ఱుపసంగ్రహణమునకు నర్హులు.

గురువువలెనె సవర్ణలగు గురుభార్యలను గౌరవింపవలెను. తల్లితోడఁ బుట్టునది, మేనమామభార్య, బిడ్డనిచ్చినయత్త, తండ్రితోడఁబుట్టినది, వీరందఱు గురుభార్యలవలె గౌరవింపఁబడఁ దగుదురు. వీరందఱు గురుభార్యతో సమానురాండ్రే. సవర్ణస్త్రీ యైనచో నన్నభార్యయు నుపసంగ్రాహ్యయే. గురుభార్య తనకంటెఁ జిన్నదైనయెడ నుపసంగ్రహణము కూడదు.

రోదన స్వరమునకుఁ దనవలన నెందఱ కెంతయసంతుష్టి, కష్టము, దుఃఖము కలిగెననునది కారణము.

— ♦ { ౧౧౩-వ సర్గము. భరతుఁ డయోధ్యకుఁ బ్రయాణమయి భరద్వాజాశ్రమంబుఁ జేరుట. } ♦ —

సీ. భరతుండు శ్రీరాము♦పాదుకల్ తలఁదాల్చి,
తుష్టుఁడై రథము శ♦త్రుఘ్నుతోడ
నెక్కె వసిష్ఠము♦నీశుండు జాబాలి, వామదేవుండుఁ బ్రా♦గ్భూమిఁ జనిరి
మంత్రియుక్తంబుగ♦మందాకినిఁ గనుచుఁ, దూరుపుముఖముగ♦దూర మరిగి
చిత్రకూటము ప్రద♦క్షిణముగ నరుగుచో, గైరికధాతుని♦కాయములను
ఆ. పార్శ్వములను గనుచు♦భరతుండు సేనతోఁ, జిత్రకూటమునకుఁ♦జేయలంతి
నబ్జగర్భ తేజుఁ♦డగుభరద్వాజుని,యాశ్రమంబుఁగాంచె♦నమలమతిని.

ప్రాగ్భూమి = ముందువైపు, గైరికధాతునికాయములన్ = కొండలలోఁ బుట్టిన, ధాతువుల = లోహముల సమూహములను, చేయలంతి = సమీపము, ఉత్తరమునుండి దక్షిణముగా వచ్చినవారు పోవునపుడు తూర్పుముఖముగా గిరి ప్రదక్షిణించి పోయిరని భావము. తుష్టుఁడు=సంతోషించినవాఁడు.

తాత్పర్యము

భరతుఁడు పట్టపేనుఁగు తలమీఁదనున్న పాదుకలను దీసి తనశిరస్సునందుంచికొని శత్రుఘ్నుతోడ రథమెక్కెను-వసిష్ఠుఁడు, జాబాలి, వామదేవుఁడు ముందుగాఁ దూర్పుగాఁ బోయిరి. మంత్రులతోడ భరతుఁడు మందాకినిఁ జూచుచుఁ దూరుపు ముఖమై గిరికిఁ బ్రదక్షిణముగఁ బోవుచుఁ గొండయందలి లోహములను బ్రక్కలందుఁ గనుచు సేనతోఁ జిత్రకూటమునకు సమీపమం

దుండు భరద్వాజాశ్రమము చూచెను, పోవునపుడు కాలినడక, ఆౖశ్రమము వెద కుచుఁబోవుట. దానివలన నెక్కువకాలము ఎక్కువదూరము నయ్యెను. ఇప్పుడు చక్కఁగాఁ బయనించుటచే మునుపటికంటె సమీపమయ్యెను.

చేయలంతి=సమీపమున, భరద్వాజునకు రెండాశ్రమములు గలవు. మొదటఁ బ్రయాగక్షేత్రమున నున్నవాఁడు. రామ భరత సంవాద మప్పుడప్పు డతిశీఘ్రమున వినుటకై యచోటునదలి చిత్రకూటప్రాంతమునకు వచ్చెనని యెఱుఁగునది. భరతుఁడు చిత్రకూటమునుండి మరలునపుడు చిత్రకూట సమీ పాశ్రమముననే భరద్వాజునిఁ గాంచెను. కాఁబట్టియే భరద్వాజాశ్రమానంతరము యమునా నదిని దాఁటినట్లు మీఁదఁ జెప్పఁబడెను. తిలక వ్యాఖ్య.

వనాదుల యందమును జూచుచుఁ దిన్నఁగాఁ బోవుటచే భరతునకు భర ద్వాజాశ్రమము సమీపమున నున్నట్లు తోఁచెనని గోవిందరాజీయము.

శ్రీరామచంద్రునిఁ బిలుచుకొని పోవలయునని వచ్చినవాఁడు పావుకోళ్ళతో నెట్లు భరతుఁడు సంతోషించెను? భరతుఁ డింతదూరము శ్రమించినది రాజ్యము పాలింపలేకకాదు. తాను రాజనఁగానే స్వాతంత్ర్యమొకటి యేర్పడుచున్నది. దాసుఁడెప్పటికిఁ బరతంత్రుఁడేకాని స్వతంత్రుఁడుకాఁడు. స్వతంత్రుఁడ నను కొనుట పతన హేతువు. ఇప్పుడాభయములేదు. రాజ్యము పాలించుభారము పాదు కలయందున్నది. కావున తనదాస్యమునకు హానిలేదుగదాయని సంతోషించెను.

భరతుఁడు ముందుకోరిన దిదియేకదా.

కం. భూమిప లక్షణ యుతములు। రాముని చరణాంబుజములు రాగంబుననే
నామస్తకమునఁ దాల్పక।నామదికిని శాంతిలేదు నాసోదరుఁడా.౨-౫౯-ప.

చం. అరదము డిగ్గి కాల్నడన ♦ యాయన డాయఁగ నేగి నమ్రుఁడై
చరణములందు వ్రాలుటయు ♦ సమ్మదమార నతండు నాయనా!
ఖరకరతేజు రామవిభుఁ ♦ గాంచితివే? పను లెల్లఁ దీరెనే?
భరత! యటన్న నాతఁ డిటు♦పల్కెఁ దపోధనశీతభానువున్. ౨౩౧౯

అరదము=రథము=తేరు, తద్భవమందు వర్ణాగమము, డాయఁగన్=సమీ పించునట్లు, నమ్రుఁడై = వంగినవాఁడై, ఖరకరతేజు = సూర్యతేజస్సువంటి తేజస్సుగలవానిని, తపోధనశీతభానువున్ = తపస్వులలో శ్రేష్ఠుని (తపస్వి చంద్రుని).

తాత్పర్యము

తేరుదిగి కాల్నడకతో భరద్వాజు సమీపించి యభివాదనము చేయఁగా నాయన సంతోషముతో నాయనా! సూర్యప్రతాపుఁడైన శ్రీరామచంద్రమూర్తినిఁ జూచితివా నీవుపోయినపని చక్కఁబడెనా యని యడుగఁగా భరతుఁ డాఋషి శ్రేష్ఠున కిట్లనియె.

ఉ. అన్నవు నీ వటంటి, వృథ ♦ యాఱడిపా లయినాఁడ నంటి, నన్
మన్నన చేయు మంటి, దయ ♦ మాలుదె శిష్యునియందునంటి, నేఁ
గన్నుల నీరు పెట్టితిని ♦ గట్టిగఁ బట్టితిఁ బాదయుగ్మ, మే
నెన్నివిధాల వేఁడ మది ♦ నించుక త్రిప్పఁడ యేమి సేయుదున్. ౨౫౨౦

తా త్ప ర్య ము.

రామచంద్రా! నీవు నాకన్నవుగదా నన్నపకీర్తిపాలు చేయనచ్చునా? నన్ను క్షమించి నాకువచ్చిన యపకీర్తి పోఁగొట్టుము. నేను నీశిష్యుఁడను. శిష్యునియందు గురువు దయ తప్పవచ్చునా యని కన్నీళ్ళు కార్చితిని. రెండు పాదములు గట్టిగఁ బట్టుకొంటిని. ఎన్నివిధాలనో ప్రార్థించితిని. ఏమిచేసినను ఆయన మనస్సు తిరిగినదికాదు,

తే. మాగురుండును గడుబతి ♦ మాలుకొనఁగ,
రాముఁడనియెను మౌనిసు ♦ త్రామునకును
జనకుఁ డాడినరీతిని ♦ వనములందుఁ,
బదియు నాల్గేండ్లు వసియింతు ♦ బాసదీర్తు. ౨౫౨౧

తా త్ప ర్య ము

నేను వేఁడుకొనుటయేకాదు, మాగురువు వసిష్ఠుఁడు నెంతో బతిమాలు కొనెను. ఆయనతోఁ దండ్రి చెప్పినరీతి పదునాలుగు సంవత్సరములు వనవాసముచేసి నామాట చెల్లించుకొందుననని రామచంద్రమూర్తి చెప్పెను.

ఉ. ఆదృఢచిత్తుమాట విని ♦ యాముని యిట్లను క్షేమయోగసం
పాదనచుంచువుల్ కనక ♦ పాదుక లిమ్ము యయోధ్య నేల నా
శ్రీదయితుండు ప్రాఙ్ముఖుఁడు ♦ చెచ్చెరఁ బాదుక లెక్కి వీని నెం
తే దయతోడ నిచ్చెను ము ♦ నీశ్వర! భూపరిపాలనార్థమై. ౨౫౨౨

దృఢచిత్తు=నిశ్చలమైన మనస్సుగలవాని, క్షేమయోగసంపాదనచుంచువుల్=యోగక్షేమములఁ గలిగించుటయందు నేర్పుగలవి,యోగము=లేనిదానిని గలిగించుట, క్షేమము=ఉన్నదానిని రక్షించుట, కనకపాదుకలు=బంగారు పావుకోళ్ళు, శ్రీదయితుండు=లక్ష్మీదేవియగు సీతకుఁ బ్రియుఁడు, ప్రాఙ్ముఖుఁడు=తూర్పు ముఖమైనవాఁడు, భూపరిపాలనార్థమై=భూజనుల రక్షించుకొఱకు.

తా త్ప ర్య ము

నిశ్చలచిత్తుఁడైన మాయన్నగారి మాటలువిని వసిష్ఠుఁడిట్లనియె. అట్లు నీవు వచ్చుట కిష్టములేదేని నీపాదుక లిమ్ము, అవియే ప్రజలఁ బాలించుచు వారికి యోగము క్షేమము కలిగించును అనిచెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి తూర్పుగాఁ దిరిగి పాదుకలపై నెక్కిదిగి వానిని ప్రజాపరిపాలనార్థమై యిచ్చెను.

ఉ. పొమ్మన నిట్లు వచ్చితిని • బోదు నయోధ్యకుఁ బాదుకాద్వయిన్
నమ్మతిఁ గొంచు నన్న విని • సంయమి యిట్లను సాధుశీలవృ
త్తమ్ముల సన్నుతుండ వఁట • ధన్యచరిత్ర భవచ్చరిత్ర చి
త్రమ్మొకొ? మిట్టనీళు లరు•దా కనఁ బల్లపునేల కేగుటల్? ౨౨-౨౩

పాదుకాద్వయిన్=రెండుపావుకోళ్ళు, సంయమి=ముని, సాధుశీలవృత్తమ్ముల = మంచి స్వభావము నడవడులచే, సన్నుతుండవు = సత్పురుషులచే స్తోత్రము చేయఁబడువాఁడవు.

తాత్పర్యము

పొమ్మనిచెప్పిన కారణముచే రెండుపావుకోళ్ళు తీసికొని యయోధ్యకుఁ బోవుచున్నాను అనిచెప్పఁగా భరద్వాజమహర్షి యిట్లనియె. రాజకుమారా! నీవు సాధుస్వభావముచేతను నడవడిచేతను సత్పురుషులచే స్తోత్రము చేయఁబడు వాఁడవని ప్రసిద్ధిగావించితివి. పుణ్యాత్మకా! నీకిటువంటి నడవడి యాశ్చర్యకరము గాదు. స్వభావసిద్ధము. మిట్టనీళ్ళు పల్లమునకుఁబోవుట స్వభావసిద్ధమే. కాని యందు వింత యేమున్నది.

కం. నీవంటిసుతుఁడు గలుగఁగ, భూవిభుఁ డగుదశరథుండు • భువి విడిచియుఁ దా
జీవించిన వాఁడే యనఁ, బావనమతి భరతుఁ డెఱఁగి • వాచంయమికిన్.

ఎఱఁగి=నమస్కరించు, వాచంయమికి=ఋషికి, వాక్కునియమము గలవాఁడు వాచంయమి.

తాత్పర్యము

నీవంటికొడుకు గలిగిన కారణముచే మీతండ్రి దశరథుఁడు దేహము విడిచి యీలోకమునుండి పోయినను గీర్తికాయముచే జీవించియున్నవాఁడే. "ప్రజామను ప్రజాయసే, తరుతే మర్త్యామృత"మ్మను శ్రుతి కలదుగదా అని చెప్పఁగా నిర్మల మనస్సుగల భరతుఁడా మునికి నమస్కరించి.

చం. తనపరివారము ల్గొలువ • దాశరథుండు పురంబుఁ బోవుచో
నినతనయం దరించి కని • యింపు దొలంకక జాహ్నవీస్రవం
తిని, వెస దాని దాఁటి చని • తీరమునందలి శృంగిబేర ప
త్తనమును జొచ్చి యన్నయును • దండ్రియు లేనియయోధ్యఁ గాంచుచున్.

దాశరథుఁడు=దశరథుని కుమారుఁడు, తస్యేదమ్మని సంబంధార్థకము. "ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" యని వాల్మీకియే ప్రయోగించి యున్నాఁడు. పురంబున్=ఉద్దేశార్థక ద్వితీయపురంబు నుద్దేశించియని యర్థము, ఇనతనయన్=యమునను, "కాళిందీ సూర్యతనయా" నిఘంటువు. తరించి=దాఁటి, జాహ్నవీస్రవంతిని=గంగానదిని.

తాత్పర్యము

తనసేనలు సేవకులు మొదలగువారు తన్ను సేవించుచు వెంటరాఁగా భరతుఁడయోధ్యకుఁబోవుచు యమునానదిని దాఁటిపోయి సంతోషముతో గంగనుజూచి దానిసదాఁటి దానితీరముననున్న శృంగిబేరపురము ప్రవేశించి ప్రయాణమైపోయి తండ్రియు నన్నయులేని యయోధ్యను జూచి

కం. సారథితో ననియె నిరా,కార నిరానంద దీన ♦ గళితస్వరయై
సారమఁటి నగరి యుండెడి తీరును గను మనుచుఁ బురము ♦ దీనతఁ జొచ్చెన్.

నిరాకార=శుభమైన యాకారములేని, నిరానంద=సంతోషములేనిది, దీన=దుఃఖముగలది, గళితస్వర = సంతోషముతో నున్నప్పుడువలె నుత్సాహపూరితమైన కంఠస్వరములేనిది, సారమఁటి = సారము+అఁటి=నిస్సారమై, దీనతన్ = వ్యసనముతోఁ గూడినవాఁడై, నిరాకార శబ్దమునకుఁ గొందఱు భగవత్పర్యాయమున నాకారము లేనివాఁడని యర్థము చెప్పుదురు. ఇక్కడ నిరాకారయనఁగా నాకారము లేనిదని యర్థముగాదుకదా. మఱియొకచోట భరతుఁడు రాముఁడు నిరుదరులు కడుపులేనివారని చెప్పఁబడిరి. కావున 'నిర్' అను నుపసర్గమునకు వ్యతిరేకార్థమొక్కటియేకాదు. నిరుదరుఁడు అనినఁ జిన్న పలుచని కడుపుగలవాఁడని యర్థము. కావున భగవంతుఁడు నిరాకారుఁడనిన మనుష్య పశుపక్ష్యాదులకువలె నొకేవిధమై నిర్దుష్టమైన యాకారములేక యిష్టమువచ్చిన చొప్పున నాకారములు ధరింపఁగలవాఁడని యర్థము కావుననే నిరాఖ్యాతుఁడనిచెప్పి శ్రుతి వెంటనే ఏకోనారాయణ యని చెప్పెను. కావున నిరాఖ్యాతుఁడనఁగాఁ బేరులేనివాఁడని యర్థముగాదు. ఒక్కపేరే గలవాఁడుగాఁడు సహస్రనామములు గలవాఁడని భావము.

తాత్పర్యము

భరతుఁడు సారథితో నిట్లనియె. సారథీ! యయోధ్య యుండెడి విధము చూడుము, వన్నెచెడి సంతోషహీనమై దుఃఖముతోఁగూడి కంఠస్వరముచెడి నిస్సారమై యెట్లున్నదో చూడుము.

—♦ ౧౧౪-వ సర్గము. నిరానందయైన యయోధ్యాపురి వర్ణనము. ♦—

మధురగతిరగడ.

పిల్లులు గూబలు ♦ పెల్లవుదానిని, మల్లడిగొను కరి ♦ మనుజులదానిని
శ్రీ లఱఁ జిమ్మని ♦ చీఁకట్లలమఁగఁ, గాలనిశాగతిఁ ♦ గ్రాలెడిదానిని
గ్రహపీడితశశి ♦ కాంతారీతిని, మహమఁటి తేజము ♦ మలిగినదానిని
నిగిరిన క్రాఁగిన ♦ యింపుకనీళ్ళను, సెగలను బొగిలెడి ♦ చిఱువిహగములను
విలయముఁ గాంచువి ♦ విధమత్స్యములను, సెలయే ఱనఁగను ♦ జెలఁగెడిదానిని
నవమున బంగరు ♦ చాయుల మండుచు, హవిసున నణఁగిన ♦ యగ్నిని బోలుచుఁ

జెదరినగజములుఁ♦జిట్లినధ్వజములుఁ, బదరినవాజులుఁ♦బగిలిన తేరులుఁ
గలిగి విరోధులు♦కలఁచిన బెగ్గిలి, కలఁగినదం డనఁ♦గాఁ దగుదానిని
ఫేనము ధ్వానము♦పెల్లయి పెద్దతు,పానును గాలియుఁ♦బరిశాంతముగా
స్తిమితతఁ గాంచిన♦సింధుతరంగము,గుమి నా మ్రోఁతలు♦గూడనిదానిని
యజనాంతంబున♦యాజకయూథము,
యజనాయుధములు♦నన్నియుఁ బాయఁగ
వీతరవం బగు♦వేదిని బోలుచు, వాతతజనశూ♦న్యం బవుదానిని
దినఁబచ్చికఁ దల♦దిరముగ బ్రాల్పక, పెనుగోడియచన♦వెతలం గొనియెడి
గోవులమందనఁ♦గూడినదానిని, శ్రీవిలసితమయి♦స్నిగ్ధతరం బయి
తేజునుగూడుచు♦దివ్యతరం బయి, రాజిలునుత్తమ♦రత్నశ్రేణులు
తీరఁగ రాలినఁ♦దేజము దూలిన,హారమెుయనఁ గొమ♦రారనదానిని
జలిపినపుణ్యము♦క్షయ మయి పోవఁగ,నిలఁ బడుచుక్కను♦నెనసినదానిని
బంభరకోటులఁ♦ బలుసూనంబుల, సంభరిత మయి వ♦సంతముకడపలఁ
గారున నగ్గికిఁ ♦ గమరినతీఁగల,తీరునఁ గొంతులు ♦ దీఱినదానిని
బేరము సారము ♦ పేరును లేమిని,ద్వారము తెఱవని♦పణ్యస్థలమై
మఱుఁగఁగఁ జుక్కలు♦మబ్బున శశితో, నెఱిమాసినయా♦నిశ నగుదానిని
నుత్తకడవలును ♦ నుత్తపిడుతలును, గత్తరఁ గెడసిన♦కలుమందిరమన
దొరలెడికుండలుఁ♦ దూలెడిగోడలు, జరగుచుఁ బాడఱ♦చలిపందిలి యన
వీరుని బెడిదపు♦వింటను నెక్కిడ, నారసమో యన ♦ నఱకఁగ వైరులు
బిగి చెడి నేలను♦ వ్రీలినజ్యాలత,వగ వగ చెడి జిగి♦పాసినదానిని
నాహవశూరుం ♦ డశ్వవిభాండస,మూహంబులచేఁ♦ బొలుపుగఁ దీర్చియుఁ
గలనికి నుపయో♦గము గా కుండుట, తొలఁచుకిశోరము♦తోఁ బోల్దానిని
గచ్ఛపమత్స్యని♦కాయములొప్పఁగ, నచ్ఛం బయి శు♦ష్కాంబుక మగుచును
గూలము దొరలఁగఁ♦గువలము వెడలఁగ, హాళి చెడినకూ♦పాళిని బోలుచు
వగపునఁ జీర్ణాం♦భరణవిహీనుని, జిగిచెడు మే ననఁ ♦ జెలఁగిన దానిని
జడికారున బహు♦జలధరసంతతి, విడువక క్రమ్మర ♦ విప్రభ నాఁగను
నొప్పుచు నున్నయ♦యోధ్యనుగనుఁగొని,
యప్పుడు భరతుం♦డలమటఁజొచ్చెను. ౨౨-౨౮

గూబలు=గుడ్లగూబలు, పెల్లవు=అధికమగు, మల్లడిగొను=దుఃఖపడెడి, కరిమనుజ....దానిని = ఏనుఁగులు మనుష్యులు గలదానిని; శ్రీలు = కాంతులు, అఱన్=క్షయింపఁగా, చిమ్మనిచీఁకట్లు = దట్టమైనచీఁకట్లు, అలమఁగ = ఆక్రమింపఁగా, కాలనిశాగతిన్ = కృష్ణపక్షరాత్రివలె, గ్రహపీడిత = రాహుగ్రహముచే బాధింపఁబడిన, శశికాంతా=రోహిణి, మహము=తేజస్సు, ఉత్సవము, మలిగిన దానిని=నశించినదానిని, ఇగిరిన=ఇంకిన, చిఱువిహగములను=చిన్నపక్షులను,

చెలఁగెడిదాని నని యన్వయము, సవమునన్ = యజ్ఞమునందు, హవిసునన్ = హోమముచేసిన నెయ్యిపెరుఁగు మొదలగువానిచే, చిట్లిన = చీలిన, పదరిన వాజులు=బెదరిన గుఱ్ఱములు, బెగ్గిలి=భయపడి, దండు=సేన, దీనికిఁ బ్రకృతి రూపము దండము, ఫేనము=నురుఁగు,పరిశాంతముగాన్=తగ్గఁగా, స్తిమితతన్ = నిశ్చలముగా నుండుటను, సింధుతరంగము గుమి=సముద్రపుటలల సమూహము, యజన + ఆయుధములన్ = యజ్ఞమునకుఁ గావలసిన యుపకరణములను, పీతరవంబు=ధ్వనిలేనిది, పెనుగోడియ = పెద్దకోడె, శ్రీవిలసితమయి = కాంతిచేఁ బ్రకాశితమయి, స్నిగ్ధతరంబు=మిగుల నిగనిగలాడునది, శ్రేణులు= సమూహములు, వరుసలు,కొమరారు=కోమలత్వముచే నతిశయించు,క్షయము= వ్యయము, చుక్క=నక్షత్రము, బంభరకోటులన్ = తుమ్మెదల సమూహముచే, బంభరశ్చ మిళిందశ్చ హిందోళ భసలౌ సమౌ॥ నిఘంటువు. సూనంబులన్ = పుష్పములచే, సంభరితమై=పూర్ణముగ నిండినదై, వసంతము కడపల=గ్రీష్మ ఋతువునందు, కారునన్=అడవియందు,కమరిన=వాడిన,పణ్యస్థలము=అంగడి, మబ్బున శశితోఁజుక్కలు మఱుఁగఁగ=చంద్రునితో నక్షత్రములు మబ్బుచాటున మఱుఁగుపడఁగా, నెఱి=అందము, నిశ=రాత్రిని,నగుదానిని=పరిహసించుదానిని, పిడుత=చిన్నమంటికుండ, గత్తర=ఉపద్రవము, కెడసిన=పొందిన, కలుమందిరము=కల్లమ్మెడి యిల్లు, పాడఱు=పాడుపడిన, బెడిదపు=భయంకరమైన, ఎక్కిడన్ = ఎక్కుపెట్టఁగా, నారసమో = బాణమో, నారాచ శబ్దభవము నారసము, ప్రీలిన=పడిన, జ్యాలత=అల్లెత్రాడు, వగన్=విధముగా, బిగి=బిఱ్ఱు, జిగి=కాంతి, ఆహవశూరుండు=యుద్ధవీరుఁడు, అశ్వ=గుఱ్ఱముయొక్క, విభాండ=విశేషాభరణముల, సమూహములచే=గుంపుచే, తీర్చియు=అలంకరించియు, కలనికిన్ = యుద్ధమునకు, కిశోరముతోన్=గుఱ్ఱపుఁ బిల్లతో, కచ్ఛపమత్స్యనికాయములు = తాఁబేళ్ళు చేఁపలు వీనియొక్క సమూహములు, అచ్ఛము=నిర్మలము, శుష్కాంబుకము=ఎండిన నీళ్ళుగలది, కూలము=ఒడ్డు,దొర్లఁగ=ఉర్లిపోఁగా,కువలము= కలువ=కువాలయం కువలయం కువాలం కువలం కువం" ద్వి.కో, హాళి=అందము, కూపాళిని = బావుల గుంపును, వగపునన్ = వ్యసనముచే, చర్చాభరణ హీనుని=గందపుఁబూఁతలు భూషణములు లేనివానియొక్క, మేను = దేహము, జడికారున=వానకాలమందు, బహుజలధరసంతతి=విస్తారములైయిన మేఘముల సమూహము, క్రమ్మన్=వ్యాపింపఁగా, రవిప్రభ =సూర్యకాంతి, అలమటన్ = దుఃఖముతో, చొచ్చెన్=ప్రవేశించెను.

తాత్పర్యము

సీతారామలక్ష్మణులు లేని యయోధ్యస్థితి వర్ణింపఁబడుచున్నది. అదలించువారు లేమిని బిల్లులు గూబలు విస్తారముగఁ దిరుగుచున్నదియు వ్యసనముచే

బాధపడుచుండు మనుష్యులు నేనుఁగులు కలదియు నక్షత్రకాంతిగాని చంద్ర కాంతిగాని లేక చిమ్మచీఁకట్లు క్రమ్ముకొనఁగాఁ గృష్ణపక్షపు రాత్రివలె నుండునదియు రాహువుచేఁ బీడింపఁబడి కాంతిహీనమైన రోహిణివలె నుండునదియు, నెండవేఁడిమికి నీళ్ళిగిరి క్రాఁగి సెగలెగయు నెండ నీళ్ళుత్రాగుటకులేక తపించుచున్న చిన్నపక్షులును, నీళ్ళవేఁడిమికి లోపలనేతపించి చచ్చుచేఁపలునుగల సెలయేఱువంటిదియు, యజ్ఞమునందు బంగారుకాంతితో మండుచు హవిస్సునందణఁగిపోయిన యగ్నివంటిదియు, శత్రువులధాటి సహింపలేక బెదరిన యేనుఁగులు విఱిగిన టెక్కెములు, భయపడి పరువెత్తు గుఱ్ఱములు, కూలిన తేరులు గలిగిన దండువంటిదియు, నురుఁగు, ధ్వని విస్తారముగాఁగల పెద్దతుపానునందు గాలినిలువఁగా సద్దుచప్పుడులేక నిశ్చలముగానుండు సముద్రపు టలలసమూహమువలె ధ్వనిలేనిదియు, యజ్ఞముకడపట యాజకులు యజ్ఞోపకరణములు అగ్నిహోఁగా ధ్వనిలేక జనులులేక యజ్ఞవేదివలె నుండునదియు, మేపుతినుటకుఁగూడ తలవంగని విధముగ బలిసిన యాఁబోతుకోడె మరణింపఁగా గోవులమందవలె నుండునదియు, నిగనిగలాడుచుఁ గాంతితోఁ గూడి దివ్యమై రత్నములచేఁ బ్రకాశించుచుండి యన్నియు రాలిపోఁగా గన్నులుమాత్రము మిగిలిన హారమువంటిదియు, జేసినపుణ్యము క్షీణమైపోఁగా నేలపైఁబడు నక్షత్రమువలెనుండునదియు, దుమ్మెదలచేతను బూలచేతను నిండియుండి యెండకాలమునఁ గారుచిచ్చు వేఁడిమికిఁ గమరిన తీఁగలవలె నుండునదియు, వ్యాపారమేమియు లేక, కొనువాఁడమ్మువాఁడులేక తలుపులుమూసియుండు నంగడివలె నుండునదియు, జంద్రుఁడు నక్షత్రములు మబ్బుమాటున నుండుటచే నందములేని రాత్రివలె నుండుదానిని, గల్లుతోనిండిన కడవలు త్రాగెడి పిడుతలులేక యుపద్రవము వచ్చి విఱుగఁబడిన కల్లంగడివలె నుండునదియు, గోడలు విఱుగఁబడి కుండలు దొరలుచునుండు చలిపందిరివలె నుండునదియు, యుద్ధవీరుఁడెక్కుపెట్టి బాణము సంధింపఁగా శత్రువు నఱకుటచే బిగువుచెడి నేలపడిన యల్లెత్రాడుగల విల్లువంటిదియు, యుద్ధవీరుఁడు యుద్ధమునకుఁ దీసికొనిపోనలయునని నానా భూషణములచే నలంకరింపఁగా నది యుద్ధమునకుఁ గొఱగామిని బాఱఁదోలిన గుఱ్ఱపుఁబిల్లవంటిదియుఁ దాఁబేళ్ళు చేఁపలు కలిగి నిర్మలమైయుండి నీరిగిరిపోఁగా నొడ్డులురలఁగాఁ గలువలు చెడిపోఁగానుండు బావులవంటిదియు, గంధపుఁబూఁతగాని యలంకారముగాని లేక కాంతిహీనమైన దేహమువంటిదియు, వానకాలమున మేఘములు గ్రమ్ముటచే నుండు సూర్యకాంతివంటిదియు నగు నయోధ్యను జూచి భరతుఁడు దుఃఖాక్రాంతమైన మనస్సుతోఁ బ్రవేశించెను.

మధురగతి రగడ.

నాలుగుమాత్రలు నాటిన గణములు

నాలుగు రెంటికి నలి విరమణములు

గలసి మధురగతి కనలును జగణము
తొలఁగిన ధృతకౌస్తుభ కవిరమణము॥ అప్ప.

—• భరతుఁడు మరల నయోధ్యఁ బ్రవేశించుట. •—

ఉ. స్యందనమంద యుండి తన•సారథిఁ జూచి యయో పురంబునం
దెందును మున్నటట్లు కడు•హృద్యము లౌశుభగీతవాద్యముల్
విందుగ వీనులం బడవు • విశ్రుతచందనగంధమాలికా
బృందసుగంధబంధురవ • రిష్ఠసమీరము వీవ దియ్యెడన్. ౨౫-౨౮

స్యందనమంద=తేరునుండి దిగక యందేయుండి, మున్నటట్లు=పూర్వము వలె, హృద్యము=సంతోషకరము, విందుగన్=ఆహ్లాదకరముగ, విశ్రుత=ప్రసిద్ధి కెక్కిన, చందనగంధ = గంధపువాసనచేతను, మాలికాబృంద = పూలదండల సమూహముయొక్క, సుగంధ = మంచిపరిమళముచేతను. బంధుర = నిండిన, వరిష్ఠసమీరము=మిక్కిలి యింపగుగాలి, వీవదు=విసరదు.

తాత్పర్యము

భరతుఁడు రథమందేయుండి దిగక సారథినిఁజూచి యిట్లనియె. అయ్యో! సారథీ! శ్రీరామచంద్రమూర్తి యీయూర నున్నప్పటివలె శుభకరమైన పాటలు మంగళవాద్యములు చెవులఁ బడకున్నవి. ప్రసిద్ధమైన చందనపు వాసనచేతను, బూలదండల వాసనచేతను నిండి మిగుల మనోహరమైన గాలియు విసరకున్నవి.

ఉ. రాముఁడు లేమిఁ జూవె నగ•రంబునఁ బల్లకి మోయుమ్రోఁతలున్
సామజబృంహితంబులును • సైంధవహేషలు స్యందనారవం
బేమియుఁ దోఁప దయ్యె యొక•రేనియుఁ జందనపుష్పమాలికా
స్తోమముఁ దాల్ప రాత్మఁ బరి•తోషము లేమి వయోవిజృంభితుల్. ౨౫-౨౯

సామజ=ఏనుఁగుల, బృంహితములు=ఘీంకారములు, సైంధవహేషలు=గుఱ్ఱముల సకిలింపులు, స్యందనారవంబులు = రథముల దడదడ చప్పుడులు, చందన పుష్పమాలికాస్తోమము = గంధమును పూలసరముల సమూహమును, తాల్పరు=ధరింపరు, పరితోషము=సంతోషము, వయోవిజృంభితుల్=వయస్సు విజృంభించువారు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి పట్టణంబున లేకుండుటచేఁగదా! పల్లకుల మ్రోఁతలుగాని, యేనుఁగుల ఘీంకారములుగాని, గుఱ్ఱముల సకిలింపులుగాని, రథముల చప్పుడులుగాని గోచరింపలేదు. వయస్సునందుండి సుఖమనుభవింప వలసినవారుకూడ మనస్సులందు సంతోషములేమి గంధము పూసికొనుటగాని పూలదండలు ధరించుటగాని కానరాకున్నవి.

కం. హేళిం బురివెలుపల వా,హ్యాళిం జన రెవరుఁ బుష్ప•హారవిభూషా
పాళి న్మెయిఁ దాలిచి జన,పాళిన్ రాముండు లేమి•బ త్తనమందున్. ౨౩౩౦

హేళిన్ = విలాసముగ, వాహ్యాళి=వయ్యాళి = స్వారి, పుష్పహారవిభూషాపాళిన్=పూలదండలను,ఆభరణముల సమూహములను,మెయిన్=దేహమునందు

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి పట్టనమందు లేనికారణముచే నీయూరనున్న జనులలో నెవరును బూలసరములు, ఆభరణములు దేహమునందు ధరించి యూరి వెలుపలికి విలాసముగా స్వారిపోయెడివారు గారు.

కం. మాయన్న రాముతోడనె, యీయయూరికళావిలాస• మెల్లను జనె; ధా
రాయతివృతసితయామిని,యో యనఁగన్పట్టె నీయ•యోధ్యాపురియున్.

ధారాయతి=జడివానచేత, వృత=క్రమ్ముకొనఁబడిన, సితయామినియో యనన్=శుక్లపక్షరాత్రియో యనునట్లు.

తాత్పర్యము

ఈయూరి యధికమైన కాంతి మాయన్నతోడనే పోయెను. ఇప్పుడీ యయోధ్య జడివానచేతఁ గ్రమ్ముకొనఁబడిన శుక్లపక్ష రాత్రివలె నున్నది.

కం. ఎన్నండు వచ్చునో మా,యన్న జనోత్సవముతోడ•నందఱకును దా
నెన్నండు మోద మిడునో, పన్నగ వేసంగిమబ్బు•భాతిని సఖుఁడా. ౨౩౩౨

జనోత్సవముతోడన్ = జనుల సంతోషముతో, అనుటచే జనుల సంతోషమంతయు నాయనతోడనే పోయినది. ఆయనవచ్చిన మరలవచ్చును. వేసంగి= ఎండకాలమందలి, మబ్బు=మేఘము, భాతి=వలె.

తాత్పర్యము

సఖుఁడా! యీయయూరి జనుల సంతోషము శ్రీరామచంద్రమూర్తితోడనే పోయినది. ఆయన వచ్చినఁగాని మరల రాదు. కావున నాయన యెప్పుడు వచ్చునో యెప్పుఁడు వీరికెండకాలమందలి మబ్బువలె సంతోషము గలిగించునో అంతవఱకు వీరిస్థితి యింతే.

చం. యువయువతీజనావళుల•నొక్కరయేని మహాపథంబునన్
సవురుగఁ డాఁకుటీకుగను•సంచరణం బొనరింప రంచుహె
చ్చువగ సింహహీనగుహ•యందుఁ జొరంబడురీతి భూమిభృ
ద్భవనముఁ జొచ్చి సూర్యరహి•తం బగు మి న్నన నున్నఁ బొక్కుచున్.

యువయువతీ జనావళులన్=వయస్సు పురుషులయు వయస్సు స్త్రీల యొక్కయు గుంపులయందు, యువయువతీ=ఇది ద్వంద్వసమాసము, సాధారణముగా యువతీ శబ్దము ముందురావలసి యుండును. అల్పాచ్తరమ్ లఘ్వక్షరంపూర్వమ్ ఈ సూత్రముల ప్రకారము యువశబ్దము ముందు గూర్పఁ

బడియె. ఇచ్చట నేకశేష చెప్పవలసియుండినను అవిరెండేగాక జనావళులన్ అని యుండుటచే నేకశేష రాలేదు. "త్వద్దాసదాసీజనాః" మహాపథంబునన్=రాచబాటయందు, టాకుటీకుగను=ఓయారముగ, సంచరణంబొనరింపరు=తిరుగరు, సింహహీనగుహ = సింహములేని గుహను, భూమిభృద్వసను = రాజగృహము, సూర్యరహితంబగుమిన్ను=సూర్యుఁడులేని యాకాశము. పూర్వము దేవాసురులకు యుద్ధముజరుగఁగా నందు రాక్షసులకు దేవత లోడిపోయిరి; రాహువుచే సూర్యుఁడు భూమిమీఁదఁ బడఁగొట్టఁబడెను. అప్పుడు బ్రహ్మపను పున నత్రి యేడుదినములు సూర్యుఁడుగా నుండెనని పురాణకథ. పొక్కుచున్=దుఃఖించుచు.

తాత్పర్యము

యౌవనమందున్న స్త్రీపురుష సమూహములం దొకరైనను రాచబాటయందు నందముగ డంబముగ సంచరించువారులేరు అని దుఃఖించుచు బోయి సింహములేని గుహయందు నిర్భయముగఁ జొచ్చునట్లు రాజునింటియందుఁ బ్రవేశించి సూర్యుఁడులేని యాకాశమువలె నదియుండఁగాఁ బరితాపపడుచు.

—♦ ౧౧౫-వ సర్గము. భరతుఁడు నందిగ్రామముఁ జేరుట. ♦—

శా. అందుం దల్లుల నుండఁ బంచి గురుతో ♦ నా సద్వ్రతాఢ్యుం డనున్
నందిగ్రామమున న్వసించిన దురం♦తం బైనశోకంబునన్
గ్రుంగం బోవక తాళుకోఁ గలను జు♦మ్మా కావునం బోయి నే
నందే కాఁపుర ముందు, నెల్లరును నా♦కాజ్ఞప్తిఁ గావింపుఁడీ. ౨౫౩౪

అందున్=ఆపట్టనమందు, ఆ రాజగృహములందు, సద్వ్రతాఢ్యుఁడు=మంచి వ్రతములను సంపత్తుగలవాఁడు, అనున్=ఈప్రకారముచెప్పెను,దురంతము=అంతము లేనిది, గ్రుంగంబోవక=నశింపక, తాళుకోఁగలను = సహింపఁగలను, ఆజ్ఞప్తి=ఆనతి.

తాత్పర్యము

ఆపట్టనంబునఁ దల్లుల నందఱను వారివారి యిండ్లయందు వారివారి నుండఁజెప్పి యా వ్రతసంపన్నుఁడైన భరతుఁడు వసిష్ఠుతో నిట్లుచెప్పెను. నేనిక్కడనుండిన శోకముతో బ్రదుకలేను. ఏదిచూచినను నాకుఁ దండ్రియు నన్నయు జ్ఞప్తికి వచ్చుచుందురు. వా రనుభవింపవలసిన వివి వారిని విడిచి నేనెట్లు లనుభవింపఁగలను? ఇక్కడ నాకు సుఖములేదు. నందిగ్రామము పల్లెటూరు. అక్కడకుఁ బోయియుందును మీరందఱు నాకు నాజ్ఞ యిండు.

కం. భూమీశుఁ డరిగె దివికి, రాముఁడు నాగురుఁడు వనికి♦నడచెను నట నే
రామాగమనము వేచెద, రాముఁడె రాష్ట్రమునకెల్ల♦రాజు మహాత్మా.

రామాగమనము=రాముని రాక, వేచెదన్=కాచియుండెదను. [౨౫౩౫

తాత్పర్యము

తండ్రియు, రాజునగు దశరథుఁడు స్వర్గమునకుఁ బోయెను. నా గురుఁడగు శ్రీరామచంద్రమూర్తి యడవులకుఁబోయెను. కావున నే నా నందిగ్రామమున రామునిరాకకై కాచియుండెదను. మరల శ్రీరామచంద్రునితోడ వచ్చెదను. రాష్ట్రమునకంతయు శ్రీరామచంద్రమూర్తి ప్రభువుగాని నేనుగాను. కావున నే నెచ్చటనుండిన నేమి. రాజగువాఁడుగదా రాజధానియందుండవలె.

చం. అది విని మంత్రులు న్గురుఁడు ♦ నాశుభవాక్యము గారవించి త్వ
ద్గదితము శ్లాఘనీయము హి♦తంబు భవాదృశ భ్రాతృవత్సలుం
డుదితయశుండు సన్నుతకు♦లోద్భవుఁడున్ నిజబంధులుబ్ధుఁ డి
య్యది ఘటియింతు నన్నఁ జరి♦తార్థక యెవ్వఁడు సమ్మతింపఁడో. ౨౫౩౬

శుభవాక్యము=మంచిమాట, త్వద్గదితము=నీవు చెప్పినది, శ్లాఘనీయము =పొగడఁదగినది, హితంబు = మేలైనది, భవాదృశ = నీవంటి, భ్రాతృవత్సలుఁడు=సోదర ప్రీతిగలవాఁడు, ఉదితయశుండు=ఉదయించిన కీర్తిగలవాఁడు, సన్నుత కులోద్భవుండున్ = సజ్జనులచేఁ బొగడఁబడిన వంశమందుఁ బుట్టినవాఁడు, నిజబంధులుబ్ధుఁడు=తన బంధువులయందు మిక్కిలి యాశగలవాఁడు, ఇయ్యది ఘటియింతున్=ఈప్రకారము చేసెదను, అన్నన్=అనిచెప్ప, చరితార్థక = కార్యము నెఱవేర్చినవాఁడా.

తాత్పర్యము

భరతుఁడు చెప్పినమాటలు విని సుమంత్రాది మంత్రులు గురుఁడగు వసిష్ఠుఁడు ఆమాటల గారవించి యిట్లనిరి. భరతా! నీవుచెప్పినది శ్లాఘింపఁ దగియున్నది; హితమైయున్నది, నీవంటి సోదరప్రీతిగలవాఁ డుదయించుచున్న కీర్తిగలవాఁడు గొప్ప వంశమునఁ బుట్టినవాఁడు బంధుప్రీతిగలవాఁడు నగువాఁడు నే నీప్రకార మొకకార్యము చేసెదనన్న నెవ్వఁడు సమ్మతింపకుండును.

చం. అని తనయిచ్చచొప్పునన ♦ యాడఁగ మంత్రులు రాజు సారథిం
గని ఘటియింపుమీ రథము ♦ గ్రక్కున నా నతఁ డట్లు సేయఁగా
జనుల కెల్ల మ్రొక్కి యను♦జాతుఁడు దోడన రాఁగ ముందుగాఁ
జన గురుఁ డాదిగా, నరిగె ♦ శక్రదిశాభిముఖంబుగా వెతన్. ౨౫౩౭

ఇచ్చచొప్పునన్ = ఇష్టప్రకారము, ఘటియింపుమీ = కూర్పుము- సిద్ధము చేయుము, అనుజాతుఁడు = తమ్ముఁడగు శత్రుఘ్నుఁడు, శక్రదిశాభిముఖంబుగాన్=తూర్పుముఖముగా, వెతన్=వ్యసనపడుచు.

తాత్పర్యము.

మంత్రులందఱుఁ దనయిష్టమున కనుకూలముగాఁ జెప్పఁగా శీఘ్రముగ రథమును సిద్ధముచేయుమని సారథి కాజ్ఞాపించి తల్లులకందఱకు నమస్కరించి శత్రుఘ్నుఁడు తనతోరాఁగా గురుఁడు మంత్రులు ముందుగాఁబోగా నెటువంటి

వారి కెటువంటి కష్టదశవచ్చెనని సీతారాములఁ దలఁచి దుఃఖించుచుఁ దూర్పు దిక్కుగాఁ బ్రయాణమైపోయెను. వచ్చినపూఁట భోజనమునకైన నయోధ్య యందు భరతుఁడు నిలిచినవాఁడు కాఁడు. ఔరా! యెటువంటి భక్తి.

శ్రీరామచంద్రమూర్తిలేని యూర, శ్రీరామచంద్రమూర్తిలేని యింట నన్నము దినరాదు. నీళ్ళుత్రాగరాదు. నిద్దుర పోరాదు. అని యేర్పడుచున్నది.

మ. దళము ల్మంత్రులు వారె రాఁగఁ దనమూ♦ర్ధంబందుఁ బాదూద్వయిన్
వెలయం జేసి నృపాలనందనుఁడు నం♦దిగ్రామము జేరి మౌ
నిలలామంబును గాంచి యిల్లడగ మౌ♦నీ! యుంచె మాయన్న య
స్ఖలితప్రేమను రాజ్య మివ్వ క్షితియో♦గక్షేమముల్ పూనెడిన్.   ౨౫౩౮

దళముల్=సేనలు, వారె=వారంతటవారె- అనఁగా మీరురండరని భరతుఁ డాజ్ఞాపింపనైన లేదనుట, మూర్ధంబందు=తలయందు. పాదూద్వయిన్=రెండు పాదుకలు, మౌనిలలామంబును = మునిశ్రేష్ఠుని, ఇల్లడగన్ = రక్షణార్థముగ, అస్ఖలితప్రేమను = దృఢమైన ప్రేమచే, క్షితి = భూప్రజలయొక్క, యోగక్షేమ ముల్=లేనివి యిచ్చుట, యున్నవి రక్షించుట యనుకార్యములను.

తా త్ప ర్య ము

తాను గష్టపడుటగాక యితరులుగూడ నేల కష్టపడవలయునని యభి ప్రాయము గలవాఁడై యెవ్వారిని భరతుఁడు బిలువకున్నను సేనలు మంత్రులు వారంతటవారే రాజుతోడ నుండుటవిధి గావున రాఁగాఁ బాదుకలరెంటిని శిర మందు ధరించి భరతుఁడు నందిగ్రామముఁజేరి వసిష్ఠునితో నిట్లనియె.

మునీంద్రా! రాజ్యమును నేను వచ్చువఱకు నీవు పాలింపుమని యిల్లడ గానిచ్చి తనకుమాఱుగఁ దనస్థానమున నుండ వీని నిచ్చెను. కావునఁ బ్రజల యోగక్షేమములను నిఁక నివియే విచారించును.

సీ. అని సచివాదులఁ♦గనుఁ గొని మాయన్న,చరణంబులకు ఛత్ర♦చామరములు
పట్టుఁడీ యివియ చూ♦ప్రభుత నింక వహించు,
నతులితకరుణ మా♦యన్న వీని
నాకు నిల్లడ యిచ్చెఁ♦క్ష్మాకన్యకాధవుం, డరుదెంచుదాఁక న♦త్యంతభక్తి
రక్షింతు వీనిని♦ రాముండు చనుదేర, నర్పించి మరల రా♦జ్యంబుతోడ
తే. నతని భజియించి యపకీర్తి♦ నణఁచువాఁడ
నాయనకు రాజ్య మిచ్చుట♦ యందఱికును
సంతసం బిడు నదియు య♦శంబుఁ గూర్చు
మఱియు రాజ్యంబుకంటె న♦ల్మడుఁగు లెస్స.   ౨౫౩౯

సచివాదులన్=మంత్రులు మొదలగువారిని, ఛత్రచామరములు=గొడుగు వింజామరములు, అతులితకరుణ=అసమానమైన దయచే, క్ష్మాకన్యకాధవుండు= సీతాపతి, అరుదెంచుదాఁకన్=వచ్చువఱకు, చనుదేరన్ = రాఁగా, భజియించి=

కొలిచి, అపకీర్తి=దుర్యశము, చెడ్డపేరు, సంతసము=సంతోషము,నల్మడుఁగు= నాలుగంతలు, నాలుగు+మడుఁగులు, అచ్ఛికద్విగువు ఏకవచనము.

తాత్పర్యము

అని వసిష్ఠునకుఁజెప్పి మంత్రులు మొదలగువారినిఁ జూచి యిట్లనియె. మాయన్నగారి పాదములకు ఛత్రముపట్టుఁడు. వింజామరలు వేయుఁడు. ఈ పాదములే యిఁక భూమిని రక్షించుభారము వహించును. నాయందు మాయన్న యెంతో దయగలవాఁడై వీని నిల్లడగా నిచ్చెను. మరల శ్రీరామచంద్రమూర్తి వచ్చువఱకు మిగుల భక్తితో వీనిని రక్షించుచుందును. ఆయన రాఁగానే రాజ్యముతోడ వీనిని నాయనకు సమర్పించి యాయనను గొలిచియుండెదను. అట్లుచేసి యపకీర్తిఁ బాపుకొనెదను. మాయన్న రాజ్యము మాయన్నకిచ్చుట యందఱకు సంతోషము గలిగించును. అదియే నాకుఁ గీర్తిని గలిగించును. ఆయనరాజ్య మాయనకిచ్చి యాయనసేవ సేయుచుండుటయే రాజ్యము నేలుటకంటె నాకు నాలుగంతలు మేలు.

ఈపద్యమందు మాయన్నపాదుకలని చెప్పక మాయన్న చరణములనియే భరతుఁడు చెప్పెను. భక్తునకుఁ దానుబూజించు రూపములందిట్టి యభేదబుద్ధి యుండవలెను. భగవంతుఁడు వేఱు తాను బూజించు విగ్రహము వేఱనుభావన యుండనేరాదు. తాము బూజించునది ప్రత్యక్ష భగవంతుననియే భావన యుండ వలయును. భగవంతునకుఁ బ్రతినిధిగా నుంచుకొన్న రూపమనియు నుండ రాదు. భక్తుని మనస్సునందారూపముతో భగవంతుఁ డనుగ్రహించె ననుకొన వలయునుగాని యా పాషాణాదులు భగవంతుఁడని తలంపరాదు.

చం. అని మునివేషయుక్తుఁ డగుఁ♦నా భరతుం డలపాదుకాద్వయిన్
గనకపుసింహపీఠి నిడి ♦ కౌతుక మారఁగఁ గట్టి పట్టమున్
దినముదినంబు కార్యములఁ ♦ దెల్పి యుపాయనమిచ్చి తొల్త నా
వెనుకనె తాఁగ్రహించుచుని♦వేదితమున్ భరియించె రాజ్యమున్. ౨౫౪౦

మునివేషయుక్తుఁడు=మునివేషము ధరించినవాఁడు, పాదుకాద్వయిన్= రెండు పావుకోళ్ళను, కనకసింహపీఠినిడి=కనకపు సింహాసనమున నుంచి, కౌతుక మారఁగన్=కోరిక యతిశయింపఁగా, పట్టముఁగట్టి = రాజులు పట్టాభిషేక సమ యంబున ధరించుపట్టమును వానికికట్టి, దినముదినంబు=ప్రతిదినము, తొలుత = మొదట, ఉపాయనము=కానుక.

తాత్పర్యము

ఈప్రకారము మునివేషమును ధరించిన భరతుఁడు చెప్పి పావుకోళ్ళ రెంటిని బంగారు సింహాసనమందుంచి సంతోషముతో వానికిఁ బట్టముఁగట్టి ప్రతిదినము నెవరైనఁ దెచ్చియిచ్చిన కానుకల వానికి ముందుగ సమర్పించి యా నివేదితమును బిమ్మటఁ దాను గ్రహించుచు రాజ్యముచేసెను.

ఈపద్యమందు దినదినము చేయవలసిన భగవదారాధన క్రమము సూచింపఁబడినది. దినదిన మనుటచే భగవదారాధనము నిత్యకర్మమనియు నదిచేయక భుజింపరాదనియు గ్రాహ్యము.

శ్లో. యోమోహా దథవాలస్యా, దకృత్వా దేవతార్చనమ్
భుంక్తే సయాతి నరకాన్, సూకరేష్వపి జాయతే ॥

అజ్ఞానముచేఁగాని విపరీతబుద్ధిచేఁగాని సోమరితనముచేఁగాని దేవతార్చనముచేయక యెవఁడు భుజించునో వాఁడు నరకములపాలై పందిజన్మంబునం బందియై పుట్టును.

శ్లో. విష్ణ్వర్చా రహితేగ్రామే, విష్ణ్వర్చా రహితే గృహే
నకుర్యా దన్నపానాది, నతత్ర దివసం వసేత్ ॥

విష్ణుబింబములేని గ్రామమందు విష్ణుబింబములేని గృహమందు నన్నము నీళ్ళు గొనరాదు అందొకనాఁడైన వసింపరాదు.

శ్లో. కేశవార్చా గృహేయస్య, నతిష్ఠతి మహీపతే
తస్యాన్నం నైవభోక్తవ్య, మభక్ష్యేణ సమంహితత్ ॥

కేశవార్చన యేయింటలేదో ఓరాజా! యాయింటివాని యన్నము పక్వమైనను అపక్వమైనను భుజింపరాదు. అది యభక్ష్యముతో సమానము.

ఈ కారణముచే దినముదినమని చెప్పఁబడెను.

శ్లో. తైర్దత్తా నప్రదాయైభ్యో యోభుంక్తే స్తేన ఏవసః॥

తనకు దేవత లిచ్చినదానిని వారికి నివేదింపక భుజించువాఁడు దొంగయే

శ్లో. యజ్ఞశిష్టాశినస్సంతో, ముచ్యంతే సర్వకిల్బిషైః
భుంజతే త్వఘం పాపా, యేపచంత్యాత్మ కారణాత్ ॥

విష్ణునివేదనమైనది భుజించు సజ్జనులు సమస్త పాపములనుండి విముక్తులగుదురు. భగవంతునికనిగాక తనకని యెవఁడు పాకముచేయునో వాఁడు పాపము దినువాఁడగును. యజ్ఞమనఁగా విష్ణువని శంకరభాష్యము. యజ్ఞోవై విష్ణుః అని శ్రుతి. కనకపు సింహపీఠినిడి యనుట, భగవంతునకు నాధారపీఠాది కల్పనము దెలుపును.

కార్యముఁదెలిపి యనుట—

"త్వయ్యారాధాన కామోయం, వ్రతం చరితుమిచ్ఛతి
సంకల్పసిద్ధైర్భగవన్, పూరయాస్య మనోరథాన్ ॥

భగవన్ పుండరీకాక్ష, హృద్యాగంతు మయాకృతమ్
ఆత్మసాత్కురుదేవేశ, బాహ్యైస్త్వాం సమ్యగర్చయే
విభోసకలలోకేశ, ప్రణతార్తి హరాచ్యుత
త్వాం భక్త్యా పూజ యా మ్యద్య భోగై రర్ఘ్యాదిభిః క్రమాత్ ॥

ఇత్యాది మంత్రములచేఁ జేయఁదగుకార్యమును దెలుపుచున్నది. ఉపాయనము. నివేదితము గ్రహించుటయనుటచే పుష్పమాల్యగంధనైవేద్యాదులు ముందు స్వామికి సమర్పించి యావల వానిని దానుగ్రహింపవలెనని చెప్పుచున్నది.

భరియించె రాజ్యమున్, అనుటచే గృహస్థుఁ డిట్లుచేసి వానివాని గృహకృత్యములు దీర్చుకోవలయునని సూచితము.

భగవంతుని ప్రతినిధిగా నగ్నినో, సూర్యునో దేనినైన నుంచుకొని పూజించుట ప్రతీకోపాసనము. భగవంతునిబింబమును బూజించుట విగ్రహారాధనము. బేరపూజ యందురు. వీరేయుపాసకులు బేరమనఁగా మూర్తి. దీనికే విగ్రహారాధనమనిపేరు. వి+గ్రహమనఁగా భగవంతుని తేజస్సును విశేషముగ గ్రహించినదని యర్థము. వి+గ్రహము=పరమాత్మను గ్రహించినదనియుఁ జెప్పనగు. వి=పరమాత్మ. విశ్చంక్షుషి వ్యోమ్నివాతే, పరమాత్మని పక్షిణి॥ నానా. ఈశబ్దము తేజస్సామ్యమును, ప్రతిమాయనునది యాకారసామ్యమును దెలుపును. ఈరెండును గలదే యర్చా. అర్చింపబడునది. అర్చకు యోగ్యమైనది. ఇది ప్రతీకమునకంటె శ్రేష్ఠము. అట్లైన "ప్రతిమాస్వ ప్రబుద్ధీనా" మనువాక్యముగలదే యదియెట్లు? అనుసందేహము గలుగును. ఈ వాక్యము నుదాహరించువారు "బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణ" యన్నట్లు మూలమునుండి విడఁదీసి దానికి విపరీతార్థమును గల్పించుచున్నారు. శ్లోకమును సమగ్రముగఁ బూర్వాపరము లన్వయించి చూచిన వీరు చెప్పెడి యర్థము దుష్టమని బోధపడఁగలదు.

శ్లో. అగ్నౌతిష్ఠతి విప్రాణాం, హృది తిష్ఠతి యోగినామ్
ప్రతిమాస్వ ప్రబుద్ధానాం, సర్వత్ర సమదర్శినామ్ ॥

ఇందు భగవత్సాక్షాత్కారము గలవారు నాలుగుదెగలవారు చెప్పఁబడిరి. విప్రులు, యోగులు, అప్రబుద్ధులు, సమదర్శులని. బుద్ధిలేనివారికి భగవత్సాక్షాత్కారము కాదుగదా. ఈ పదమున కీయర్థము చెప్పిరేని పూర్వోత్తరములతో నన్వయమెట్లు కుదురును.

ఈ కారిక కాకదంతకారికవలె నసంబద్ధ ప్రలాపములు గలదికాదు. విప్ర, యోగి, సమదర్శి, యనుపదములనడుమ నిది యుండుటచే సాహచర్యబలమును వస్తుబలమును రెండు నాలోచించి యర్థము చెప్పవలెను. శాస్త్రతత్త్వవేత్త లీకారిక కిట్లర్థము చెప్పుదురు.

ఈ కారికయందు భగవత్సాక్షాత్కారముగలవారి స్వార్థపరార్థ ప్రసంజన ప్రకారము సంగ్రహముగఁ దారతమ్యము చెప్పఁబడెను. ప్రథమపాదమందు స్వకృతి సాధ్యముగాక భూతసంబంధమైన యగ్నియందు శాస్త్రమత మనుసరించి దేవతోపాసనము చెప్పఁబడెను. రెండవ పాదమందు బాహ్యేంద్రియ విశ్రాంతిచే సమాహితమైన చిత్తముగలవారికి హృదయమందు సాక్షాత్కారము

నిరూపింపఁబడెను. పూర్వార్థమం దీ రెండువిధముల స్వకృతి సాధ్యముకాని స్వార్థము చెప్పఁబడెను. కాని పరార్థసిద్ధి చెప్పఁబడలేదు. అది యుత్తరార్థమునఁ జెప్పఁబడెను. మూఁడవపాదమందు ప్రతిమాసు, ప్రతిమలందు ననఁగా నగ్న్యాదులకు వ్యతిరేకమై స్వకృతి సాధ్యమై స్వాభిమత రూపాదులచే యోగ్యములైన యాకారములందు అప్రబుద్ధానాం=ఎవరికంటె నతిశయించిన ప్రబుద్ధులులేరో వారికి ననియర్థము. ఈ యప్రబుద్ధ శబ్దము, అఘోరము, అనుత్తమమువంటిది. దేనికంటె ఘోరమైది లేదో యది యఘోరము. దేనికంటె నుత్తమమైనది లేదో యది యనుత్తమము.అట్టులే యెవరికంటెఁ బ్రబుద్ధులులేరో వారు అప్రబుద్ధులు. వారివారి కభిమతమైన కృతిచే సాధ్యమైన కృతియందు వారివారి యిష్టదేవత సన్నిధానమగును. అయి వారితేజస్సుచే దానిని బూరించి వారా యాకృతినే వహించి యెఱ్ఱగాఁ గాలిన యినుపగుండునందు నగ్నిహోత్రమువలె నుందురు.

"అర్చకాభిమతితః స్వీకుర్వతే విగ్రహమ్" అని ప్రమాణము. "ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" ఉపాసకుల కార్యార్థమై వారువారు కోరిన స్వరూపమునే భగవంతుఁడు కల్పించుకొనుననికదా శ్రుతి చెప్పుచున్నది.

ఇచ్చటనే కాదు.

"భక్తాస్తే యాదృశేరూపే, సంసారపద మాశ్రితాః
తాదృశం తే సమీక్షంతే, పరమవ్యోమవాసినః" అహి.

ఈ లోకమందు గృహస్థులగు భక్తులెట్టి భగవత్స్వరూపమందు భక్తిగలవారై యుందురో వారు మరణించి ముక్తులై పరమాకాశమగు వైకుంఠమునకుఁ బోయినపుడు అటువంటివారినే చూచెదరు. ఇక్కడ నభ్యస్తమైనరూపమే యచ్చటను గోచరించుటచే మనోవికారమునకుఁ గారణము గలుగదు. అటుగాదేని క్రొత్తవారియొద్దకుఁ బోయినట్లుండును. యథాక్రతున్యాయము దీనినే బోధించుచున్నది.

అట్లు భగవత్సన్నిధానము గలుగదేని దానుజేసిన బొమ్మలందుఁ దనకెట్లు దేవతాబుద్ధి పుట్టఁగలదు? ఫలమెట్లు గలుగఁగలదు? కొన్ని దేవతా మూర్తులయందు ఫలము ప్రత్యక్షానుభవసిద్ధమేకదా.ఈకాలమున రామకృష్ణ పరమహంస గారి బాలరాముఁడు ప్రత్యక్షప్రమాణముగదా. ఇట్టి భావము శాస్త్రజ్ఞానము శ్రద్ధాభక్తులు గలవారికిఁ బురుషవిశేష సంబంధానుబంధముచేఁ గలుగుచున్నది. ఇదియు నగ్న్యాదులవలెనే ప్రాకృతాగ్ని భగవంతుఁడగునా? హృదయరంధ్రము భగవంతుఁడగునా? మనము చూచు సమస్త వస్తువులు భగవంతుఁడగునా? మన యిప్పటిదృష్టికిఁ గావుగదా. ఆయాపదార్థములే భగవత్స్వరూపములని భావించుటచే భగవంతుఁ డాయారూపములతోనే యాయాభక్తులకు గోచరించును. వస్తుభేదమేకాని క్రియాభేదము ఫలభేదము లేదు. వాస్తవమిట్లుండఁ దక్కినవారు ప్రతిబుద్ధులని విగ్రహారాధకులు మూఢులని బుద్ధిమంతుఁ డెవ్వఁడనును?

వాస్తవమారయ సర్వము భగవత్స్వరూపము. మనకుఁ గానవచ్చునది కానరానియది మనస్సునకు గోచరించునది గోచరింపనిది లోపలవెలుపల సర్వము భగవంతుఁడే. సర్వం ఖల్విదం బ్రహ్మ. ఈశావాస్య మిదంసర్వం. అంతర్బ హిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థ్సితః॥ అను వాక్యములు ప్రమాణములు. ఇందులో మాయయని టక్కని డమారమని యింద్రజాలమని త్రోసివేయవల సినదేదియు లేదు. అన్నియు దేవాలయములే. మనకుఁ గానవచ్చు వెలుపలి భాగము భగవంతుని శరీరము. అంతర్భాగము భగవన్మూర్తి. నాకు దేవునందు భక్తియేకాని దేవాలయమందు భక్తిలేదనువాఁడు మూఢుఁడు. తల్లిదండ్రులు గురువులు వీరిమీఁద నాకు భక్తియేకాని వీరి శరీరములు మిథ్యలు నేమిచేసినను దోషములేదనువాఁడు కర్మచండాలుఁడు. కావున మనమింతకుముం దజ్ఞానముచే రాతిగాను చెట్టుగాను జూచుచున్నవానినే యాభావము మార్చుకొని దైవభావ ముతోఁ జూడవలెను. భరతుఁడు చేసినపని యిదియే. ఇంతకుఁబూర్వము రామ చంద్ర చరణములకు బంగారు పాదుకలని తలంచుచున్నవానినే యిప్పుడు చరణములే యని తలఁచెను.

ఇఁక నాలుగవ పాదమునఁ జెప్పబడిన సమపర్ణులు వీనికి భిన్నులు. వారికి భగవత్సాక్షాత్కారము అగ్నిహోత్రాదులఁ బూజించువారివలె నకృతి సాధ్యముగాదు, విగ్రహారాధకులవలె స్వకృతి సాధ్యముగాదు. వారికన్ని వస్తు వులు భగవత్స్వరూపమువలె మొదటివారికంటె రెండవవారు, రెండవవారికంటె మూఁడవవారు వారికంటె నాలుగవవారు శ్రేష్ఠులని శ్లోక తాత్పర్యము.

ఈ విధముగఁ బూజించువారు ముందుగ హృద్యాగ మనఁగా భూతశుద్ధి చేసికొని హృదయమందు భగవంతునకు నాసనాదులర్పించి ధ్యానించి నైవే ద్యాదులర్పించి యావల మరల బాహ్యపూజ చేయవలయును. ఈ రెంటిలో నొకదానితో సంతుష్టిపడి యుండరాదు. భగవత్సాక్షాత్కారమైన యోగులు నత్యంత భక్తియుక్తులు మాత్రము బాహ్యపూజ చేయకుండిన దోషములేదు. తక్కిన యందఱు రెండువిధములైన పూజలు చేయవలెను. ఏవిధమైన పూజ యైనను సాధనమే. భగవంతునందు మనస్సు సర్వదా సర్వావస్థల నిలుచుట ముఖ్యము. అది యేయుపాయముచే మనకు సాధ్యమో యది శ్రేష్ఠము. అంతియే కాని యందొకటి యెక్కువని మఱియొకటి తక్కువని యజ్ఞులు చెప్పుదురు. ఎవ రెవరెవరి కేదిసాధ్యమో వారికదియే శ్రేష్ఠము.

ఒక పెద్దచెఱువున్నది. దానినిండ నీళ్ళున్నవి, ఆ చెఱువుచుట్టు పల్లె లున్నవి. ఏపల్లెలవారి కేరేవు లనుకూలములో నచ్చటి నీరు గ్రహించి స్నాన పానాదులు గావింపవచ్చును. భాగ్యవంతుల రేవునందలి నీళ్ళుతప్పఁ దక్కిన రేవుల నీళ్ళు దాహమార్ప వనరాదు.

ఇప్పుడొకటి యిచ్చట విచారింపవలసి యున్నది. ఇప్పుడు వాస్తవముగ రాజెవఁడు? రామచంద్రమూర్తియా? పాదుకలా? భరతుఁడా? ఎవరుకారా ?

శ్రీరామచంద్రమూర్తి రాజందమా కాఁడు. తండ్రి రాజ్యమును భరతున కిచ్చి తన్నడవులకుఁ బొమ్మనఁగాఁ బోయి యడవులలో వానప్రస్థాశ్రమమం దుండువాఁడు. పట్టనదేశ వ్యవహారము లెట్లు దీర్పఁగలఁడు ? కావున రామచంద్రమూర్తి రాజుగాఁడు.

పాదుకలందమా! అవి యచేతనములు గావునఁ బ్రజాపాలన మవి చేయ లేమిని నవి రాజుగాఁ జెప్పరాదు.

భరతుఁడు రాజందమా? కైకేయి భరతునకుఁగోరినది యౌవరాజ్యాభిషేకమేకాని స్వతంత్రరాజ్యముగాదు. అదియునుగాక భరతుఁడు రాజగుట వంశమర్యాదాభంగము. పరివేత్తృత్వ దోషాపాదకము. కావున భరతుఁడు రాజనని చెప్పుకొననే లేదు.

ఎవరు రాజు గా రందమా? యరాజకత్వదోషము ప్రాప్తించును. పూర్వాపరము లన్నియు నాలోచించిన భరతుఁడే రాజనవలయును. తండ్రి యున్న కాలములో యువరాజుగా నుండువాఁడే యాయనయనంతరము రాజుగావలెను, గాని వేఱొకఁడు రాజుగారాదు. ఈకారణముచేతనేకదా రాముఁడు యువరాజయ్యెనా యాయనకొడుకులే యనంతరరాజు లగుదురని మంథర చెప్పెను.

కం. మును తమ్ముఁ డనుభవించిన,
　　ధనమును రాజ్యంబు పిదపఁ దానెటులు గొనున్
　ఘనమతి వరిష్ఠుఁ డగునా,తనయుఁడు జ్యేష్ఠుండు నగుట ధరణిప చెపుమా.

యనికదా కౌసల్య దుఃఖించెను.

భరతుఁడే స్వతంత్రరాజని కౌసల్యయు నంగీకరించిన దాయెను. భరతునందుఁ బరివేత్తృత్వ దోషములేదు.

ఏలన : శ్రీరామచంద్రమూర్తి భరతుఁడు ఏకోదరులు గారు సవతితల్లుల కొడుకులు.

“జ్యేష్ఠోభ్రాతా యదాతిష్ఠే దాధానం నైవకారయేత్ । అనుజ్ఞాతస్తు కుర్వీత శంఖస్యవచనం యధా॥ పితృవ్యపుత్రాన్సాపత్న్యాన్ యానారీతు సుతాం స్తథా। దారాగ్నిహోత్రసంయోగే, నదోషః పరివేదనః ॥ పరాశరుఁడు. అని వాక్యముండుటచే అన్నదమ్ముల కొడుకులందు సవతితల్లుల కొడుకులందుఁ బరివేదనదోషము లేదు. పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు వివాహము చేసికొనరాదని యున్నది కాని రాజ్యస్వీకారము చేయరాదని పైవాక్యమందు లేదే యనరాదు. దారాగ్నిహోత్రరాజ్యాని యః కుర్యాదగ్రజేస్థితే। పరివేత్తా స విజ్ఞేయః పరివేత్తిస్తు పూర్వజః॥ భార్యను అగ్నిహోత్రమును రాజ్యమును బెద్దవాఁడుండఁగా గ్రహించిన చిన్నవాఁడు పరివేత్త యనఁబడెను. ఆ పెద్దవాఁడు పరివేత్తియనఁ

బడును. కావున భరతుఁడు పరివేత్త యైనను అన్న యనుమతించి యిచ్చిన కారణముచేఁ బరివేత్తగాఁడు. కావున రాజుగానుండ నర్హుఁడు. అట్లైనఁ బాదుకలతో నేమిపని యనిన:

శాస్త్రప్రకారము భరతుఁడు పరివేత్త గాకపోయినను పామరులు శాస్త్రజ్ఞానము లేనివారగుటచే భరతుఁడు పరివేత్తయని యవనియందు నిందనారోపించి తాము నట్టులే చేయనారంభింతురు.

చిన్నవాఁ డనుభవించివిడిచిన రాజ్యము నాకొడుకునకేల యని కౌసల్య చెప్పెనుగదా ఆమెకు మనస్తాపము గూర్పకుండుటకు వంశక్రమాగతమైన జ్యేష్ఠ మర్యాద భంగముగాకుండుటకుఁ బాదుకలు గ్రహింపఁబడెను. కావున వాస్తవ రాజు భరతుఁడే. పాలించువాఁడుగదా రాజు.

వాలియును రాజు భరతుఁడుండ నీవెవ్వఁడవు నన్ను దండించుట కనిగదా శ్రీరామచంద్రమూర్తి నాక్షేపించెను. అపనిందఁ బాపుకొనుటకై భరతుఁడును, బట్టాభిషేకానంతరము శ్రీరామచంద్రమూర్తియు నెంత శ్రమించిరో పాఠకులాలోచించి యపనిందలపాలు గాకుండఁ బ్రయత్నింతురుగాక.

—♦ ౧౧౬-వ సర్గము. ఋషీశ్వరులు చిత్రకూటంబు విడిచి పోవుట. ♦—

సీ. అక్కడ శ్రీరాముఁ♦డనుజసమేతుఁ డై, చిత్రకూటమున వ♦సించు చుండి
భరతుండు పోయిన♦పదపడి యచ్చటి, సంయమీంద్రులు తన♦చాయఁ జూచి
గుసగుస లాడుచుఁ♦గొంకుచుఁ జెప్పంగఁ, గనుబొమ్మలార్చుచుఁ♦గనులుగిఱపు
కొనుచును డాయుచు♦ననఁ బోయియే మేమొ, భ్రమింగుచు నీరీతి♦మిణుకుచున్న
తే. వీరిచంద మిదేమియో♦వింతదోఁచె,
నంచు శంకించి యెఱిఁగెద♦నంచు నందుఁ
గులపతినిఁజూచి కేల్మోడ్చి♦జలజబాంధ, వాన్వవాయప్రదీప మి♦ట్లనియె నపుడు.

ఇక్కడ నయోధ్యాపురమందలి విషయముచెప్పి యచ్చటఁ జిత్రకూటమందలి వృత్తాంతము కవి చెప్పుచున్నాఁడు.

అనుజసమేతుఁడై = తమ్మునితోఁ గూడినవాఁడై, పదపడి = తరువాత, కొంకుచున్=సందేహించుచు, గిఱపుకొనుచు=గిఁటుచు, వింత=క్రొత్త, కులపతి= మునిశ్రేష్ఠుఁడు, ౧౦,౦౦౦ మంది శిష్యుల కన్నముపెట్టి చదువుచెప్పువాఁడు కులపతి, అయినను నిచ్చట శ్రేష్ఠార్థమందుసయోగింపఁబడెనని తోఁచుచున్నది, జలజబాంధవ=కమలములకు మిత్రుఁడగు సూర్యుని, అన్వయము=వంశమును, ప్రదీపము=పెద్ద దీపమువలె వెలిఁగించువాఁడు.

తాత్పర్యము

చిత్రకూటమందు శ్రీరామచంద్రమూర్తి తమ్మునితో వసించుచు భరతుఁడు పోయినపిమ్మట నాపర్వతమునమన్న మునిశ్రేష్ఠులు తన్నుఁజూచి తమలోఁ దాము గుసగుసలాడుచు నేమో చెప్పఁబోయి యూరకుండుచుఁ గనుబొమ్మ

లాడించుచు గనులు గీఁటుచు నేమో చెప్పవచ్చినవారివలె సమీపించి యేమిచెప్ప వచ్చితిరన నేమిలేదులే యని దాఁచుచు సగముచెప్పి మరల మ్రింగుచు నీరీతి బాధపడుచుండఁగా వీరివిధము మునుపటివలె లేదే, యేమో క్రొత్తగానున్నదే యని శంకించి యిదియేమో తెలిసికోవలెనని యామునులయందుఁ బెద్దవానిని జూచి చేతులు జోడించి నమస్కరించి శ్రీరామచంద్రమూర్తి యిట్లనియె.

చం. మునివర! నాదువర్తనము ♦ మున్పటియట్టిది కాదొ, కాక నా
యనుజుఁడు పాడి దప్పెనొ క ♦ కటా, పొరపాటుననేని ధారిణీ
తనయయు మత్పర్యకయి ♦ తావకసేవలపట్టులన్ సతీ
జనహితవృత్తిఁ బాసెనొకొ ♦ సంభ్రమ మేటికి నొంద సంయములే? ౨౫౪౨

వర్తనము=నడవడి, పాడి=న్యాయము, మత్పర్యకై = నాసేవచేయుచుండి, తావకసేవలపట్టులన్ = మిమ్ము సేవించు విషయమునందు, సతీజనహితవృత్తిన్ = పతివ్రతలకుఁదగిన నడవడిని, సంభ్రమము = తత్తఱపాటు, సంయములే=మునులారా! తాత్పర్యము.

మునిశ్రేష్ఠా! మునుపటివలె నే నిప్పుడు నడచుకొనుటలేదా ? నాతమ్ముఁడేమైన ధర్మముతప్పెనా? లేక సీత నాసేవచేయుచుండి పొరపాటుననైన మీసేవలఁ బతివ్రతలకుఁ దగనియట్టులు ప్రవర్తించెనా? ఏల యిట్లు ఋషీశ్వరులు తత్తఱపడుచున్నారు. భగవత్సేవకన్న భాగవతసేవ శ్రేష్ఠమని భావము.

—♦ వృద్ధఋషి తమ కష్టంబుల శ్రీరామునితోఁ జెప్పుట. ♦—

సీ. అనుడు వయోవృద్ధుఁ ♦ డును దపోవృద్ధుఁడు,
నైనయామముని వేప ♦ మానుఁ డగుచుఁ
బరమకళ్యాణస్వ ♦ భావజానకియేడ, నందులోఁ దపసుల ♦ యందుఁ దప్పి
నడచుట యది యేడ ♦ నాయనా! నిన్గాచ్చి, యే సుమ్ము తాపసు ♦ లిట్టు లగుట
రాక్షసతతిచేత ♦ రాయిడిపడి యిట్టు, లందఱు గుసగుస ♦ లాడువారు

అ. రాక్షసేంద్రుఁ డైన ♦ రావణుతమ్ముఁడు, ఖరుఁడు నిర్దయుండు ♦ పురుషభోజి
గర్వి పాపి సుజిత ♦ కాశి నీవిట వచ్చి,నదియు మొదలు మమ్ము ♦ నుదిల పెట్టు.

అనుడు=అని యడిగినపిమ్మట, వయోవృద్ధుఁడు=వయస్సుచేఁబెద్దవాఁడు, తపోవృద్ధుఁడు = తపస్సునందుఁ బెద్దవాఁడు, వేపమానుఁడు = వణఁకుచున్నవాఁడు, పరమ కల్యాణస్వభావ = మిగుల శుభకరమైన కార్యములు చేయుట స్వభావముగాఁగల, నిర్దయుఁడు=దయలేనివాఁడు, పురుషభోజి=పురుషులఁదినువాఁడు, గర్వి=పొగరుకలవాఁడు, పాపి=పాపకార్యములు చేయువాఁడు, సుజితకాశి=(1) యుద్ధమున జయించువాఁడు, (2) మంచి జయముచే, కాశి = ప్రకాశించువాఁడు_ 'జితకాశీ జితాహవ' యని హలాయుధుఁడు. ఉదిల=పరితాపము,

తా త్ప ర్య ము

శ్రీరామచంద్రమూర్తి యాప్రకార మడుగఁగా వయస్సునందుఁ దపస్సునందుఁ బెద్దవాఁడైన యా మునిశ్రేష్ఠుఁడు వణఁకుచు నిట్లనియె, నాయనా! రామచంద్రా! స్వభావముగా గొప్ప శుభాచారముగల సీతయెక్కడ? అందులోఁ దపస్వులవిషయమై వక్రమార్గమున వర్తించుటెక్కడ? ఆమెయందేమి లోపము లేదు. నిన్నుద్దేశించియే మునులిట్లగుచున్నారు. వారి తత్తఱపాటునకు నీవే కారణము, నేనేమి చేసితినందువా రాక్షసులవలన బాధపడుచు నిట్లు గుసగుసలాడుచున్నారు రాక్షసరాజైన రావణునకు ఖరుఁడను నొకతమ్ముఁడు గలఁడు. వాఁడు దయయెట్టిదో యెఱుఁగడు, మనుష్యులఁ దినువాఁడు, పొగరుపోతు, పాపాత్ముఁడు, యుద్ధమం దారితేఱినవాఁడు- వాఁడు నీవిచ్చటికి వచ్చినది మొదలు మమ్ము బాధపెట్టుచున్నాఁడు.

ఉ. ఒల్లరు వారు నీయిచటి♦యున్కిని, మీ రిట వచ్చు టాదిగాఁ
బెల్లున మౌనికోటులకుఁ♦బీడ నొనర్చుచు నున్నవారు హృ
ద్భల్లనికాశు లై బహుళ♦దారుణభీషణరూపధారు లై
యెల్లెడఁ బెల్లురేఁగి మము♦హింస యొనర్చెద రేమి చెప్పుదున్. ౨౫౪౪

ఉన్కి = ఉండుట, హృద్భల్లనికాశులై = గుండెలందు బల్లెముతో సమానులై, బహుళదారుణ = మిక్కిలి క్రూరములు, భీషణ = భయంకరములునగు, రూపధారులై = రూపముల ధరించినవారై, ఎల్లెడ = అన్నిప్రదేశములందు, పెల్లురేఁగి=మిగుల విజృంభించి.

తా త్ప ర్య ము

రామచంద్రా! నీ విచ్చటనుండుట వారికి సరిపడలేదు. మీరిచ్చటకు వచ్చినదిమొదలు వారు మునిసంఘములను మిగుల బాధించుచున్నారు. మాగుండెల బల్లెములై మిగులఁ గ్రూరములు భయంకరములునైన యాకారములు ధరించి యెక్కడఁజూచిన వారేయై మిగుల విజృంభించి మమ్ము హింసచేయుచున్నారు. ఇఁకనేమి చెప్పుదును.

తే. అప్రశస్తంబు లైనప♦దార్థములను
మీఁద వర్షించి మునులను♦మోఁది చనిరి
పెలుచ దుష్టులు ఋషులముం♦గలను నిలిచి
ప్రాణములు దీసి చనిరి వి♦త్రాస మొదవ. ౨౫౪౫

అప్రశస్తంబులు=అపరిశుద్ధములు, మోఁది=మొత్తి, విత్రాసము=మిగుల భయము, పెలుచ=కోపము.

తా త్ప ర్య ము.

అపరిశుద్ధ వస్తువులను మునులపై వేసి కొట్టిపోయిరి. కోపముతో ఋషుల యెదుట నిలఁబడి వారు భయపడుచుండఁ జంపిపోయిరి.

ఉ. డాఁగి మఱుంగుతావులఁ దటాలునఁ బైపడి కొన్ని చోటులన్
జాఁగఱగొంచు స్రుక్కులను ♦ నాశము సేయుచు హోమవహ్నులం
దోఁగఁగఁ జేయుచుం జగుల ♦ నూకుచుఁ బాత్ర లుపద్రవింపఁగా
వేఁగుచు నున్నవారము వి ♦ వేకనిధీః యొకభంగి నియ్యెడన్. ౨౩౪౬

జాఁగఱగొంచున్=నాశముచేయుచు, స్రుక్కులను=హోమసాధనములను, దోఁగఁగ=నీటమునుఁగ.

తాత్పర్యము

కొన్ని స్థలములందు మఱుఁగుచాటుల డాఁగియుండి తటాలునఁ బైపడి నాశముచేయుచు హోమసాధనముల నాశముచేయుచు హోమాగ్నుల నీటఁ దడుపుచుఁ బాత్రలు పగులఁగొట్టుచు బాధపెట్టఁగా నేదోయొకవిధముగా బాధ పడుచున్నారము.

ఉ. చచ్చినవార లేమొ యిటఁ ♦ జచ్చిరి, చావక యున్నవార మే
నెచ్చటికైనఁ బోద మని ♦ యిందఱు న న్నరిగొల్ప వచ్చినా
రిచ్చటి కెంతొదవ్వున నరేశ్వరః నిర్భరపత్రపుష్పసం
పచ్చతురంబు భాసిలుఁ జుమా ప్రతనాశ్రమ మొండు రమ్య మై. ౨౩౪౭

నిర్భరపత్ర పుష్పసంపచ్చతురంబు = అధికమైన యాకులు పూలు వీని యతిశయముచే గొప్పది, ప్రతనాశ్రమము = ప్రాతదియగు నాశ్రమము- 'పురాణ ప్రతనప్రత్నపురాతన చిరంతనాః' యని యమరుఁడు.

తాత్పర్యము

ఇంతవఱకుఁ జచ్చినవారేమో యిటచావనే చచ్చిరి. చావఁగా మిగిలిన వారైన మఱియెచ్చోటికైనఁ బోయి బ్రదుకుదమని తలఁచి నీకుఁజెప్పుమని నన్నుఁ బురికొల్ప వచ్చినారు. ఇక్కడికి మిగుల దూరమునందు నాకులు, పూలు విశేషముగాఁ గలిగిన పురాణాశ్రమమొండు గలదు.

ఉ. చేరెద మందు నిందఱము ♦ చేవ గలట్టిర యైన సీతతో
మీ రిట నుంట కానిపని ♦ మేకొనుదేనియు వెంట రాఁగ నే
తేరుఁడు మీర, లాఖరుఁడు ♦ దేఁకువఁ బైపడకుండుమున్న, యా
క్రూరునితోడిపోరితము ♦ గోడిడు దక్షున కైన రాఘవా. ౨౩౪౮

చేవగలట్టిరయైనన్=బలవంతులేయైనను, కానిపని=సరిగానిపని, మేకొను దేని=అంగీకరించెదవేని, ఏతేరుఁడు=రండు, తేఁకువన్=ధైర్యముతో, పోరితము =కలహము, దక్షునకైనన్=ఎంతటి సమర్థునకైనను.

తాత్పర్యము

ఆ యాశ్రమమునందుఁ జేరుదమని యాలోచించినాము, మీరెంత బలవంతులే యైనను సీతతో నిచటనుండుట సరిగాదు. కావున నీవు మావెంట వచ్చుట

కంగీకరించెదవేని ఖరుఁడు పైపడి రాకముందే బయలుదేఱుఁడు. ఎంతటి సమర్థునకైనను వానితోడి కలహము హానికరమే.

ఉ. మౌనివరుం డిటుల్ పలుక • మానవసింహము వారికిన్ సమా
 ధానము లెన్ని చెప్పిన య•థామతిఁ బోయిరి వారు, రాముఁడున్
 మౌనులవెంటఁ గొంచనుక • మార్గము పోయియు సాగనంపి య
 మ్మౌనివరేణ్యు మ్రొక్కి ముని•మండనునానతి వచ్చె నింటికిన్. ౨౫౪౬

యథామతిన్=వారి యిష్టప్రకారము, కొందనుకన్=కొంతదూరము, మునిమండను = మండనమనఁగా నలంకారము- మునులందు శ్రేష్ఠుఁడని యర్థము. ఆనతి=ఉత్తర్వు.

తాత్పర్యము

ఆమునిశ్రేష్ఠుఁ డాప్రకారము చెప్పఁగా మనుష్యులందు శ్రేష్ఠుఁడైన శ్రీరామచంద్రమూర్తి యయ్యలారా! యీ విషయము నాకింతకుముందేల చెప్పలేదు? చెప్పియుండిన దానికిఁ బ్రతిక్రియ చేసియుండనా? ఇప్పుడు చెప్పి తిరిగదా. ఇఁకమీఁద వారు మిమ్మంటకుండ నేను రక్షించెదను. మీకు వచ్చిన భయములేదని యెన్నివిధాల సమాధానపఱిచినను వారు వినక వారియిష్టప్రకారము వెడలిపోయిరి. రామచంద్రుఁడును వారివెంటఁ గొంతదూరము పోయి సాగనంపి మునిశ్రేష్ఠుఁ డిఁకఁబోయిరమ్ము. ఎంతదూరమని వచ్చెదవనిచెప్పఁగా మరలి యింటికివచ్చెను.

ఇచ్చట నొకటి యాలోచింపవలసియున్నది. శ్రీరాముని నిమిత్తమై మునీశ్వరులేల వెడలిపోవలె? నీనిమిత్తమై మాకీకష్టమువచ్చినది నీవిచ్చట నుండవలదు పొమ్మని చెప్పియుండరాదా! లేక దీనికిఁ బ్రతిక్రియ యేమని యడిగియుండ రాదా? వాస్తవ మాలోచింప నిది దండకారణ్యవాసులందఱుఁ గలిసి పన్నిన పన్నాగము. చిత్రకూటవాసులుకూడఁ గలిసియున్నారని తోఁచుచున్నది. అరణ్యకాండము ౪౬౭-వ ప. చూడుము "మహాత్మ నిన్ను నీప్రాంతముఁ జేరఁబంప శరభంగునిఁ జూడఁగవచ్చె నాఁడు పాకాంతకుఁ డా మహర్షులు నుపాయమునన్ నినుఁజేర్చి రీయెడన్" అని కలదు. రాముఁడయోధ్యయందున్నను జిత్రకూటమునం దున్నను నించుమించు రెండు సమానములే. కావున శ్రీరామచంద్రమూర్తినిఁ జిత్రకూటమునుండి లేవఁదీయుటకై మును లీయుపాయము చేసిరి. నీవు పొమ్మనుట మర్యాద గాదు. ఆయనకార్యము వేఱొకచోనుండ నిచ్చట నాయన యుండుటయుఁ దగదు. మనము లేచిపోయిన నాయనయు లేచిపోవునని యిట్లుచేసిరి. ఈ సమయమందే వాల్మీకి తమసాతీరము చేరెను.

—• ౧౧౭-వ సర్గము. సీతారామలక్ష్మణు లత్రిముని యాశ్రమంబుఁజేరుట. •—

చం. తపసులు చన్న వెన్క వసు•ధాపతి యించుక చింత సేయుచున్
 నెపములు పెక్కు లున్నయవి • నే నిట నిల్వఁగరామి కియ్యెడన్

సపరిజనుండు మాతృజన•సంయుతుఁ డాభరతుండు నగ్గనెం
దపతపలాడెడిన్ మనము ♦ తద్దయు నయ్యది సంస్మరించినన్. ౨౩౩౦

ఇంచుక = కొంచెము, సపరిజనుండు = పరివారముతోఁ గూడినవాఁడు, మాతృజనసంయుతుఁడు=తల్లులతోఁ గలిసియుండినవాఁడు.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి యా మునీశ్వరులందఱుఁ బోయినవెనుక నిట్లాలోచించెను. నే నిక్కడ నుండరామికిఁ గారణము లనేకములున్నవి. భరతుఁడు పరివారముతోఁ దల్లులతోవచ్చి యిచ్చట నన్నుఁజూచెను వానిదుఃఖము వారిదుఃఖము పలుమాఱు స్మరణమునకు వచ్చుటచే మనస్సు వ్యసనాక్రాంత మగుచున్నది.

కం. బంధురగుణుఁ డగుభరతుని,స్కంధావారంబు విడిసె ♦ సవిధావనిఁ ద
త్సింధురవాజికరీషపు,గంధంబున నిలువ మేలు ♦ గా దిచ్చోటన్. ౨౩౩౧

బంధురగుణుఁడు=మనోహరమైన గుణములుగలవాఁడు, స్కంధావారము= సేన-దండు దిగినప్రదేశమునకు స్కంధావారమని పేరుగలదు.విడిసిన=దిగిన, సవిధావనిన్=సమీపభూమియందు, తత్=ఆసేనయందలి, సింధుర = ఏనుఁగులయు, వాజి=గుఱ్ఱములయు, కరీష=పేఁడ (లద్దె)యొక్క, గంధంబునన్=చెడు వాసనచేత.

తాత్పర్యము

భరతుఁ డిచ్చటికి సమీపప్రదేశమందే సేనతో దిగెను. ఆ సేనయందలి యేనుఁగులు గుఱ్ఱములు పెట్టినలద్దె కంపుకొట్టుచున్నది. కావున నిచట నిలుచుట యారోగ్యకరముగాదు.

ఎప్పుడు సీతారామలక్ష్మణులు చిత్రకూటము విడిచి పోయిరను విషయమునఁ దిలక వ్యాఖ్యానమందు జ్యేష్ఠమాసమందు భరతుఁడు చిత్రకూటమునకు వచ్చిపోయెను. ఆపై వర్షాకాలమగుటచే నది ముగియుదాఁక రాముఁడు చిత్రకూటముననే యుండెను. ఆమధ్యకాలముననే కాకాసురుఁడు సీత నుపద్రవించి భంగపడినది. వానకాలమైన పిదప ఋషులు తొందరపడి వెడలిపోయిరి. ఆవల రామచంద్రుఁడును వెడలిపోయెనని యున్నది.

ఈ యభిప్రాయమున కాధారముగ "రాఘవశ్చిత్రకూటాద్రౌ సానుజో రమతస్త్రియా, కదాచిదంకే వైదేహ్యా, నిద్రాణే రఘునందనే, ఐంద్రిః కాకస్సమాగమ్య, జానకీం వీక్ష్యకాముకః॥" అని పాద్మమందలి వాక్య ముదాహరింపఁబడెను. కాకాసుర వృత్తాంతము చెప్పుటకై యిది యిట్లుచెప్పఁబడెను. కాని భరత నిర్గమానంతరము జరిగినదని చెప్పుటకుఁ గాదని తోఁచుచున్నది.

ఇది సయుక్తికముగాదు. ఏలన శ్రీరామచంద్రమూర్తి చెప్పినవి రెండు కారణములు. 1. బంధు స్మరణము. 2. లద్దెకంపు. చత్వారో వార్షికామాసా యని యాషాఢము, శ్రావణము, భాద్రపదము, ఆశ్వయుజము ఈ నాలుగు వాన

నెలలు. కిష్కింధాకాండము చూడుడు. అట్లగుట కార్తీకమాసమునందు వెడలి పోయి యుండవలె. ఐదునెలలుగా సహింపఁగూడిన బంధువియోగతాపము లద్దె కంపావల నసహ్య మెట్లయ్యెను? అదియునుగాక లద్దె కంపుకొట్టుచున్నట్లు శ్రీరామచంద్రమూర్తి చెప్పెనుగదా; క్రొత్తలో పచ్చిగానున్నప్పుడు కంపుకొట్టి యుండునా? ఐదు నెలలయిన తరువాతఁ గొట్టియుండునా? వానలకుఁ గొండ వంకలకు నదియంతయుఁ గొట్టుకొనిపోయియుండదా? కావున భరతుఁడు వెడలి పోయిన పది పదునైదు దినములలో జరిగిన వృత్తాంతమిదియై యుండవలెను.

ఉ. కావన దీనిఁ బాసి యెడ•గాఁ జనుటే యుచితం బటంచు నా
మూవురు బైలుదేరి ముని • ముఖ్యుని నత్రిని జేరి మ్రొక్కినన్
భావము పొంగఁ బుత్రకుల • భంగిని వారల నాదరించి సం
భావన నాతిథేయ మిడి • భవ్యచరిత్ర పవిత్రవృద్ధయున్. ౨౫౫౨

ఎడగాన్=దూరముగ, ఉచితము = తగినది, పుత్రకులభంగిని = ముద్దు బిడ్డలవలె, సంభావన = గౌరవముతో, భవ్యచరిత్ర = శుభమైన నడవడిగలది' పవిత్ర=పాతివ్రత్య మహిమచేఁ బవిత్రురాలు, వృద్ధ=ముసలిది.

తాత్పర్యము

ఈ కారణములచే దీనిని వదలి దూరముగాఁ బోవుటే తగినపని యని యాలోచించి సీతారామలక్ష్మణులు ముగ్గురు పయనమై యత్రిమహామునిఁ జేరి నమస్కరింపఁగా నాయన సంతోషముచే నుప్పొంగుచుఁ జిన్నబిడ్డల నాదరించి నట్లు వారి నాదరించి సగౌరవముగా విందుపెట్టి శుభచరిత్రయుఁ బాతివ్రత్య ముచేఁ బరిశుద్ధయు ముసలిదియు– (ముందుపద్యముతో నన్వయము.)

అత్రి శబ్దమున కర్థము నత్రియే యిట్లుచెప్పెను.

శ్లో. అరాత్రి రత్రిః సారాత్రి, ర్యాంనాధీతే త్రిరద్యవై
అరాత్రి రత్రి రిత్యేవ, నామమే విద్ధి శోభనే॥ భార. అను. 142–అ.

వ్యాఖ్య.

అరాత్రిః అరయః కామాదయః సంత్యస్మిన్నిత్యరం పాపం అర్శ ఆదిభ్యోఽజత్యచ్। తస్మాత్ త్రాయత ఇత్యరాత్రిః। అరశబ్దాపలుప్త పంచమీ కాత్ పరస్యత్రాయతే రుపరి క్విప్పిత్యయః। యస్మాదరాత్రి స్తస్మాదత్రిః। అత్తీత్యద్ మృత్యు స్తస్మా త్త్రాయత ఇత్యత్రిః, మృత్యుశబ్దస్య, పాప్మని ప్రయోగదర్శనాత్ ॥ నీలకంఠీయము.

నేను లోకములను బాపములనుండి రక్షింతును గావున నాపే రత్రి. మఱి యును వేదములు దినమునకు ముమ్మాఱు పఠించుటచే రాత్రులనుగూడఁ బగళ్ళను జేసితిని. కావున నాపేరత్రి. మఱియును నేను వేదాధ్యయనము చేయనిరాత్రి లేదు కావున నాపేరత్రియని సుందరీ! తెలిసికొనుము.

మ. తనయిల్లా లనసూయ తాపసి మహా♦ధర్మాత్మ తన్ డాసినన్
జనకాధీశుతనూజఁ జూపి సతి! యీ ♦ సాధ్వీలలామంబు భూ
తనయారత్నము గారవింపు మని ప్రీ♦తస్వాంతుఁ డై పల్కె యా
యనసూయామహిమంబు వాకొనియె రా ♦ మాధీశుతో నీగతిన్. ౨౨౨౩

ఇల్లాలు=గృహిణి- భార్య, మహాధర్మాత్మ=స్త్రీలకుఁ బరమధర్మమగు పాతి వ్రత్యము స్వరూపముగాఁగలది, డాసినన్=సమీపింపఁగా, జనకాధీశు తనూజన్= సీతను, సాధ్వీలలామంబు =పతివ్రతలలో శ్రేష్ఠురాలు, భూతనయారత్నము = భూమియందు జనించిన రత్నమువంటి సీత, ప్రీతస్వాంతుండై=సంతోషించిన మనస్సు గలవాఁడై.

తాత్పర్యము

తన భార్యయు, మహాతపస్వినియుఁ బాతివ్రత్యమే స్వరూపముగాఁగల దియునగు ననసూయాదేవి తన సమీపమునకు రాఁగా సీతాదేవిని జూపి యీ పతివ్రతా శిరోమణి భూదేవికూఁతురు. ఈమెను నీవు గారవింపుమని సంతోష ముతోఁ బల్కె యాయనసూయ గొప్పతనమును నత్రి శ్రీరామచంద్రమూర్తితో నిట్లనియె.

చం. చినుకనుమాట లేక నర ♦ జీవచయంబు ప్రదగ్ధమైనచోఁ,
దనదుతపంబునన్ ఫలవి ♦ తానము మూలములున్ దశాబ్దముల్
పెనుపడఁ బాఱ గంగ నలి ♦ పెన్ సుతపంబునఁ దీవ్రనిష్ఠఁ గై
కొనెఁ బదివేలయేఁడులు వి ♦ కుంఠిత సర్వతపోంతరాయ యై. ౨౨౨౪

నర జీవచయంబు =మనుష్యులు ఇతర ప్రాణిసమూహము, ప్రదగ్ధమైన చోన్=మిగులఁ గాలిపోఁగా, ఫలవితానము = పండ్ల సమూహమును, మూలము లున్=వేళ్లును, దశాబ్దముల్=పది సంవత్సరములు-ఇది పంచపాత్రమువంటిది, పెనుపడన్=వృద్ధి పొందునట్లు, గంగపాఱన్ =గంగ ప్రవహింప, వికుంఠిత = చెడఁగొట్టఁబడిన, సర్వము=సమస్తములైన, తపః = తపస్సులయొక్క, అంత రాయమై=విఘ్నములు కలదై.

తాత్పర్యము.

చినుకనుమాటలేక మనుష్యులు నితరజీవికోటులు మాఁడిపోఁగాఁ దనతప స్సుచే ఫలములు కందమూలములు పదిసంవత్సరములు వృద్ధిపొందఁజేసెను. గంగను బ్రవహింపఁజేసెను. పదివేల సంవత్సరములు విఘ్నములులేక తీవ్ర నిష్ఠఁబూని తపస్సు చేసెను భర్తయాజ్ఞగైకొని చేసినది కావున నిది తప్పుగాదు.

తే. దేవకార్యనిమిత్త మీ♦దేవి పదియు, రాతురుల నెల్ల నేకరా♦త్రంబుఁ జేసె
స్నాత యయ్యెను వ్రతముల♦సౌమ్యశీల,
తల్లివలెఁ బూజ్యనీకు నో♦ధన్యచరిత. ౨౨౨౫

పదియురాతురులు=పది దినములు, ఏకరాత్రము = ఒకరాత్రిగానే- పగలనునది లేకుండునట్లు, పూజ్య=పూజకు యోగ్యురాలు- అనసూయాదేవి కుమారుఁడు దత్తాత్రేయుఁడు విష్ణ్వంశ సంభూతుఁడేకదా.

తాత్పర్యము

దేవకార్యము నిర్వహించుటకై యీమె పదిదినము లొకరాత్రిగా సూర్యోదయ మనునదిలేకుండఁ జేసెను. వ్రతములన్నియు సాంతముచేసి స్నాతక కర్మము జరపెను. నీవు నీతల్లివలె నీమెను గౌరవించి పూజింపుము. నీ పూజ కీమె యోగ్యురాలు.

తే. సర్వభూతనమస్కార్య • సాధుకీర్తి
కోపసంత్యక్త నిజకర్మ • కోటిచేతఁ
గనియె ననసూయ యనఁగఁ బొ • గడ్త జనక
తనయ మ్రొక్కింపు మీవు తా • త్పర్యయుక్తి. ౨౫౨౯

సర్వభూత నమస్కార్య = సమస్తజనులు మ్రొక్కుటకు యోగ్యురాలు, సాధుకీర్తి=మంచి కీర్తిపరురాలు, కోపసంత్యక్త = కోపముచే విడువఁబడినది- ఈమెయందు నిలువ నెలవులేక కోపము తనంతటఁదానే తొలఁగిపోయెను. నిజ కర్మకోటిచేత = తానుజేసిన సత్కర్మముల సమూహములవలన, అనసూయ = అసూయ లేనిది- లేదా నిజకర్మకోటిచేత = స్త్రీధర్మమైన పాతివ్రత్యమునకు సంబంధించిన యితరుల కసాధ్యములైన యనేకవిధ శుశ్రూషలచే- గొప్ప మహిమగలది గాన- అనసూయ=అసూయ పడరానిది, పొగడ్త=కీర్తి, తాత్పర్య యుక్తిన్=మంచి యభిప్రాయముతో.

తాత్పర్యము

ఈమె సమస్త భూతముల నమస్కారమునకు యోగ్యురాలు, సత్కీర్తి గలది, కోపములేనిది, తానుజేసిన పుణ్యకర్మములచే నసూయలేనిది యనుపేరు సంపాదించినది, స్త్రీధర్మమైన పాతివ్రత్యమునకు సంబంధించిన యితరులకు సాధ్యముకాని కార్యములు చేయుటచే నసూయపడరానిదని కీర్తిగన్నది, నీవు సీతాదేవి నీమెకు నమస్కరింపఁజేయుము.

కం. అనవుడును రామచంద్రుఁడు, జనకసుతం గాంచి యనియె•జానకి? వింటే
మునిపల్కులు వృద్ధతపస్విని వే కాన్పించుకొనుము•చేకుఁశుభముల్. [౨౫౩౦

తాత్పర్యము

అని యత్రిమహాముని చెప్పఁగా శ్రీరామచంద్రమూర్తి సీతాదేవిం జూచి వింటివిగదా మునీంద్రుఁడు చెప్పినమాటలు, నీవు పోయి యామెను దర్శింపుము. నీకు మేలగును

—• సీత కనసూయ హితోపదేశంబుఁ జేయుట. •—

సీ. పతిపలు కాలించి•క్షితికన్య చని వృద్ధ, నొడల లెల్ల ముడుతలు•పడినదానిఁ
బంఁడుముదిమిచేతఁ•బాండురం బగుతల,వెండ్రుకల్ జడ లయి•వెలయుదాని

నోరుగాలిఁ జలించు • చున్నయనంటి నా, మిగుల వణంకెడి• మేనిదాని
ధాత్రి బతివ్రతా•ధర్మంబె రూపంబుఁ, జేకొన్నవిధముగఁ•జెలఁగుదానిఁ
తే. గాంచి జనకతనూభవ•కరముభక్తిఁ,
దనదుపేర్వాడిమ్రొక్కి హ• స్తములుమోడ్చి
నిలిచి కుశలంబు లడుగ నా•నిర్మలాత్మ,
యమ్మహాభాగతోడ ని• ట్లనియెఁ బ్రీతి. ౨౩౫౮

పాండురము = తెల్లనిది, పేర్వాడి = పేరుచెప్పి, మహాభాగ = మిక్కిలి భాగ్యముగలది- ఇచ్చటఁ జెప్పఁబడిన భాగ్యము పాతివ్రత్యమే.

తాత్పర్యము

భర్తచెప్పిన మాటలు విని సీతాదేవి పోయి దేహమంతయు ముడుతలు పడి నిండు ముసలితనముచేఁ దెల్లనైన వెంట్రుకలు జడలుగాఁగలదై యోరు గాలికి నరఁటిచెట్టువలె మిక్కిలి వణఁకుచున్న వృద్ధురాలిని భూమిమీఁదఁ బతివ్రతాధర్మ మీరూపము వహించి వచ్చినదని చెప్పఁదగినదానిని జూచి మిగుల భక్తితోఁ దనపేరుచెప్పి నమస్కరించి రెండుచేతులు జోడించుకొని నిలువఁబడి కుశలమడుగఁగా నిర్మలమైన మనస్సుగల యనసూయాదేవి సంతోషముతో నా ధర్మాత్మురాలగు సీతతో నిట్లనియె.

ఉ. ఎంతటిపుణ్యశీలవొ క • దే జనకాత్మజ! సాధ్వీధర్మ మే
కాంతముఁ బూని, బంధులను • గల్మిని సౌఖ్యముఁ బాసి, మాన మా
వంతయు లెక్కసేయక, వ • నావళికిన్ వ్రత మూని వచ్చునీ
కాంతునితోడ వచ్చితివి • కామిను లిట్టిరు గల్గిరే భువిన్. ౨౩౫౯

సాధ్వీధర్మము = పతివ్రతలయొక్క ధర్మము, ఏకాంతము = మిక్కిలి- "తీవ్రైకాంత నితంతాని గాఢ బాఢదృఢానిచ" అమరుఁడు. కల్మి = సంపద, మానము=గౌరవము- మహారాజుకోడల నను గర్వము. వ్రతము = పితృవాక్య పరిపాలనా నియమము, కామినులు=స్త్రీలు, ఇట్టిరు=ఇట్టివారు.

తాత్పర్యము

సీతా నీవెంతటి పుణ్యచరిత్రవే! పాతివ్రత్యమునే విశేషము గొప్పదిగ భావించి చుట్టాలను సంపదను సౌఖ్యము వదలి మహారాజు కూఁతురను మహారాజు కోడలను నను గొప్పతనమును లక్ష్యముసేయక తండ్రిని యథార్థవాదిని జేయవలయునని యడవికి వచ్చుచున్న మగనితోడ వచ్చితివి. ఇట్టి స్త్రీలుకూడ లోకమందున్నారా?

కం. నగరస్థుఁడొ విపినస్థుఁడొ,యగుణియొ నిర్ధనుఁడొ ఖలుఁడొ•యతికాముకుఁడో
మగనాలికిఁ దనపతియే, సుగతికిఁ గారణ మతండ•చూ దైవంబున్. ౨౩౬౦

నగరస్థుఁడొ = పట్టనమందున్నవాఁడో, విపినస్థుఁడొ = అడవియందున్న వాఁడో, అగుణియొ = మంచిగుణము లేనివాఁడో, నిర్ధనుఁడొ = ధనహీనుఁడో,

ఖలుఁడో=దుష్టుఁడో, అతికాముకుఁడో=మిగుల కాముకుఁడో, మగనాలికి = పతివ్రతకు, సుగతికి=మంచిలోకములకుఁ బోవుటకు. సీతకు రాఁబోవు కష్టదశను దెలిపి యామెమనస్సు దృఢపఱుచుటకై పతివ్రతాలక్షణ ముపదేశించుచున్నది.

తాత్పర్యము

పతివ్రతయైన స్త్రీకి మగఁడు పట్టనమందుండి భోగము లనుభవించు నాగరకుఁడైనను అడవియందుండి కష్టములనుభవించు వనచరప్రాయుఁడైనను గుణహీనుఁడైనను దరిద్రుఁడైనను దుష్టుఁడైనను కామాతిశయముచే జారుడైనను నతఁడే పుణ్యగతులకుఁ గారణము. అతఁడే యామెపాలికి దైవము.

చం. తనయొనరించినట్టిసుకృ ♦ తంపుఁ దపంబువిధాన జానకీ!
తను నిఖిలస్థలంబులను ♦ దద్దయుఁ బ్రోచెడిప్రాణభర్తకం
టెను మఱి మేటిచుట్టమును ♦ నే నెఱుఁగం జుమి, జాఁగలైన యా
వనిత లెఱుంగలేరు మగు ♦ వా! తగ వాఱిడిపోక పోవుచున్. ౨౫౧

జాఁగలు=జారిణులు, తగవు=ధర్మము, ఆఱిడిపోక = నింద్యమగు మార్గమునఁ బోవుట.

తాత్పర్యము

జానకమ్మా! తానుజేసిన పుణ్యము తన్నెట్లు సర్వకాలములందు సర్వదశలందు సర్వస్థలములందు రక్షించునో యట్లు మిక్కిలి రక్షించు మగనికంటె స్త్రీకి గొప్ప చుట్టమును నేనెఱుఁగను. కామాతిశయముచేఁ జెడునడవడిగల పడఁతులు నింద్యమగు మార్గమునఁ బోవుచు ధర్మమెఱుంగలేరు.

చం. తనపతి సడ్డ సేయక ని ♦ తాంతలతాంతశరార్తి నిచ్చమైఁ
జనియెడివారు, ప్రాణవిభు ♦ శాసనపెట్టెడివారు, దుర్యశం
బున వరధర్మసంచ్యుతిని ♦ బొల్పఱి పోవుదు రమ్మ! యిందు నం
దును గుణదోషమూఢ లయి♦దుష్టగుణంబు సుఖంబుఁ గూర్చునే. ౨౫౨

సడ్డ=లక్ష్యము; శ్రద్ధాశబ్దభవము, నితాంత = అధికమైన, లతాంతశర=మన్మథునియొక్క, ఆర్తిన్=బాధచే, ఇచ్చమైఁ=ఇష్టమువచ్చినట్లు, శాసనపెట్టు=ఆజ్ఞపెట్టు, దుర్యశంబునన్ = అపకీర్తిచే, వరధర్మసంచ్యుతిని = శ్రేష్ఠమైన పాతివ్రత్యమును వదలుటచే, పొలుపఱి = బాగుచెడి, ఇందున్ = ఈలోకమందు, అందును=పరలోకమందును, గుణదోషమూఢలయి=ఇది గుణము ఇది దోషము అని తెలియనివారై, దుష్టగుణంబు=చెడుగుణము.

తాత్పర్యము

తన మగనియందు లక్ష్యములేక కామబాధచే నిష్టమువచ్చినట్లు తిరుగువారు, మగనిని దమయాజ్ఞలో నుంచువారు, అపకీర్తిపాలై ధర్మహానివలన క్షేమమును నాశముచేసికొని యీలోకమందుఁ బరలోకమందుఁగూడ నిది గుణము

ఇది దోషమని తెలియనివా రగుటచేఁ జెడిపోదురు. చెడుగుణమువలన సుఖమున్నదా.

కం. ఇలువడి పాటించుచు మదిఁ, దలఁచుచు మేల్కీళ్ళు శుభముఁ♦దప్పనిసాధ్వీ
తిలకము సమస్తధర్మం,బులు చేసినవారిమాడ్కిఁ♦బొందుఁ ద్రిదివమున్.

ఇలువడి=(1) కులీనత- (2) మంచినడత- ఇలు + వడి=ఇంటిమర్యాద-కులపాలికాత్వమని యర్థము. సాధ్వీతిలకము=ఉత్తమ పతివ్రత, త్రిదివము = స్వర్గము- పాతాళమర్త్యస్వర్గములలో స్వర్గము మూఁడవది గనుకఁ ద్రిదివమని పేరు.

తాత్పర్యము

వ్యభిచారములేక కులధర్మము పాలించుచు నిది మేలు ఇది కీడని తెలిసి మంచికార్యముచేయు పతివ్రతారత్నమునకు నామె మఱియేమియుఁ జేయకున్నను ధర్మములన్నియుఁ జేసినవారికి లభించు స్వర్గము లభించును.

చం. సుమతిని బుట్టినింటికిని ♦ జొచ్చినయింటికిఁ గీర్తిఁ దెచ్చునా
సుమహితసద్గుణప్రకర ♦ శోభిత సన్నుతశీల సాధ్వ యు
త్తమయశముం బదంపడి ని ♦ తాంతశుభంబును బొంది నాకసౌ
ఖ్యముఁ గనుఁగాన భర్తృహిత♦కారిణి వై చరియింపు మంగనా! ౨౯౮౪

సుమతిని=మంచి మనస్సుతో, చొచ్చినయింటికి=ప్రవేశించిన మగనియింటికి, సుమహిత=మిగుల శ్రేష్ఠములైన, సద్గుణప్రకర =మంచిగుణముల సమూహముచే, శోభిత=ప్రకాశించునది, సన్నుతశీల = సజ్జనులచే స్తోత్రము చేయఁబడిన స్వభావముగలది, సాధ్వి=సాధుగుణముగల పతివ్రత,ఉత్తముయశమున్=గొప్పకీర్తిని, పదంపడి=అవల, నితాంతశుభంబును=అధికమైన మేలును, నాకసౌఖ్యము=స్వర్గలోకమందలి సుఖమును, భర్తృహితకారిణివై = మగనికి మేలు చేయుదానవై.

తాత్పర్యము

మంచిమనస్సుగలదై పుట్టినింటికి మగనింటికిని గీర్తికలిగించు సుగుణములు సదాచారముగల పతివ్రత గొప్పకీర్తిని నావల మేలిశుభంబును బొంది స్వర్గసుఖమును బొందును. గావున నీవు కుమారీ! భర్తకు హితమైన కార్యములే చేయుము.

కం. అని యనసూయయు ననసూ,యను దను వచియించినట్టి♦యప్పలుకులకున్
జనకతనూభవ యలరుచు,
మనమున నిట్లనియె మంద♦మధురమృదూక్తిన్. ౨౯౮౫

తాత్పర్యము

అనసూయ యసూయలేని తనకుఁజెప్పిన మాటలు విని నాయందెంత ప్రేమ లేకున్న నిట్లు హితముబోధించునా యని సీతాదేవి సంతోషించుచు మెల్లని తియ్యని మాటల నిట్లనెను. అనసూయ యనసూయ యగుటన్ను ననుటచేఁ బాతివ్రత్యమందు ననసూయతో సమానురాలని భావము. ఈమె చెప్పునదియేమి

నేను వినునదియేమి నాకీమె చెప్పవలయునా నాకుఁదెలియదా యనకుండుటయే యనసూయ లక్షణమని తెలియునది.

—♦ ౧౧౮-వ సర్గము. సీత యనసూయ వాక్యంబులకు మోదించుట. ♦—

కం. నీవంతటితపశ్శాలిని, యీవిధముగ ననుట చిత్ర ♦ మే సాధ్వులకున్
సేవింపఁ బ్రాణనాథుఁడె, దైవం బనుమాట దెలియు♦దానను దల్లీ. ౨౯౬౬

తపశ్శాలిని=తపముచేఁ బ్రకాశించునది, చిత్రమే=ఆశ్చర్యమా?

తాత్పర్యము.

తల్లీ! గొప్పతపస్సుచేఁ బ్రకాశించు నీవంటి పతివ్రత యీప్రకారము చెప్పుట వింతగాదు. సేవించుటకై పతివ్రతలకు మగఁడే దైవమనుమాట నాకుఁ దెలియును.

ఉ. నాపతి వృత్తహీనుఁ డయి ♦ నన్ దృఢభక్తి నభేదబుద్ధినై
నోపిక నేను గొల్చి తగ ♦ నుండఁదగున్; విజితేంద్రియుండు శ్లా
ఘాపరిపూతసద్గుణుఁడు ♦ కారుణికాగ్రణి ధర్మబుద్ధి మా
తాపితృవత్ప్రియుండు నగు ♦ ధన్యుని రామునిఁ గొల్చు టబ్రమే. ౨౯౬౭

నాపతి వృత్తహీనుఁడు=వృత్తహీనుఁడు నాపతియైయుండిన ననియర్థము. వృత్తహీనుఁడు = మంచి నడవడిలేనివాఁడు, అభేదబుద్ధినై = భేదభావములేక-మంచివాఁడు చెడ్డవాఁడు అను తారతమ్యజ్ఞానములేక, విజితేంద్రియుండు = ఇంద్రియముల జయించినవాఁడు, శ్లాఘాపరిపూతసద్గుణుఁడు=పొగడ్తచేఁ బరిశుద్ధమైన మంచిగుణములుగలవాఁడు, కారుణికాగ్రణీ=దయావంతులలో మొదటివాఁడు, ధర్మబుద్ధి=ధర్మమంచే బుద్ధినిలుపువాఁడు, మాతాపితృవత్ప్రియుఁడు=తల్లివలెఁ దండ్రివలె మేలుకోరువాఁడు, అబ్రమె = అబ్బురమా- ఆశ్చర్యమా-అబ్బురాదులం దుత్వమునకు లోపంబు విభాషనగు. సు-వ్యా, సూ. ౨౪. సంధి.

తాత్పర్యము

తల్లీ! నాతండ్రి నన్నెవనికిచ్చునో వాఁడు గుణహీనుఁడైనను వాని యందు గుణాగుణములెంచక వాఁడే దైవమని నిశ్చలభక్తితో సేవింపవలసినది నాకువిధి. అట్లుండ నింద్రియముల జయించి కీర్తికరములగు పరిశుద్ధ గుణములు గలవాఁడై దయావంతులలో మేటియై ధర్మమందు బుద్ధినిలిపి తల్లివలెఁ దండ్రివలె మేలెంచువాఁడయిన శ్రీరామచంద్రమూర్తి నాకుఁ బతియైనసపు డాయనను సేవించుట యేమి యాశ్చర్యము.

కొందఱు నాపతి=రామచంద్రుఁడు గుణహీనుఁడైనను అని యర్థము చెప్పుదురు. అది ప్రశస్తముగాదు.

ఉ. తుల్యవిలోకనుండు గుణ♦తోయధి రామవిభుండు తల్లి గౌ
సల్యనుబోలె నన్యనృప♦సారసనేత్రలఁ జూచి భక్తి సా

కల్యము గా నదాటునను • క్ష్మావిభుచూచినకాంత దోఁప సౌ
శీల్యము పేర్మి మాతృమతి • చేయు నహంకృతిముక్తచిత్తుఁడై. ౬౯౮

తుల్యవిలోకనుండు=సమదృష్టిగలవాఁడు- అనఁగా భార్యవలెఁ దల్లిని, తల్లివలె భార్యను జూచువాఁడని యర్థముగాదు. యోగ్యతానుసారముగ నని యర్థము. గుణతోయధి=సముద్రమునందు రత్నములవలెఁ దనయందు గుణరత్నములు గలవాఁడు- లేదా సముద్రమునందు నీళ్ళవలె నీయనయందు సద్గుణము లున్నవని భావము- తోయములేని తోయధియెట్లులేదో గుణములులేని రాముఁడు లేనివాఁడనియే భావము. కల్యాణగుణముల నొకప్పుడైన విడిచి యుండువాఁడు కాఁడు. అన్యనృప సారసనేత్రలన్=ఇతర రాజస్త్రీలను, సాకల్యముగా=పూర్ణముగా. అదాటున=తటాలున, క్ష్మావిభుచూచినకాంత=దశరథుఁడు చూచినస్త్రీ, తోఁపన్=కనబడఁగా, అహంకృతిముక్తచిత్తుఁడై = అహంకారముచే విడువఁబడిన మనస్సుగలవాఁడై

తాత్పర్యము

నన్నుఁదప్పఁ దక్కిన యందఱు రాజస్త్రీలను గౌసల్యను జూచినట్లు చూచును. వీరందఱు స్త్రీలేగదా, మాతల్లియు స్త్రీయేకదా, ఆమెకు వీరికి నేమి భేదము. కావున వీరు నాకుఁదల్లులవంటివారే అని యీప్రకారము సమదృష్టిఁ జూచును. దశరథమహారా జొకసారి చూచినస్త్రీయైనను దటాలునఁ గానవచ్చెనేని సాక్షాత్తు తల్లియనియే యహంకారములేక భావించును.

ఉ. హత్తినరక్తి నేను విపి•నావళికిం జనుదెంచువేళ మా
యత్తయు, నావివాహసమ•యంబున నంబయుఁ, జెప్పినట్టివా
క్యోత్తమపాళి నాటినది • యుల్లమునం దిపు డీవు నానినిన్
గ్రొత్తలు చేసి; తంగనల•కుం బతిసేవయె సత్తపం బగున్. ౬౯౯

హత్తినరక్తిన్=ప్రేమతోఁ గూడినదై, విపినావళికిన్=అడవులకు, వాక్యోత్తమపాళి=శ్రేష్ఠములైన వాక్యసమూహము.

తాత్పర్యము

నేను నాపతివెంట నడవులకు వచ్చుసమయమునందు నాయత్తగారును బెండ్లిసమయమున నాతల్లియుఁ బాతివ్రత్యముగుఱించి గొప్పమాటలు చెప్పినారు. అవి మనస్సున నాటుకొనియున్నవి, కాని ప్రాఁతపడినవి. ఇప్పుడు నీవు వానిని గ్రొత్తగా మనస్సునకుఁ దెచ్చి బలపఱిచితివి. తల్లీ! నాయభిప్రాయమున స్త్రీలకుఁ బతిశుశ్రూషయే మంచితపస్సు వేఱుతపస్సు లక్కఱలేదు.

కం. పతిశుశ్రూషన కాదే, సతి సావిత్రియు వెలుంగు • స్వర్గమునందున్
బతి శుశ్రూషను గాదే, యతివ భవద్ధస్తకలిత•మయ్యె దివంబున్. ౭౦౦

పతిశుశ్రూషన=పతిసేవ చేయుటచేతనే, భవద్ధస్తకలితము = భవత్ = నీ యొక్క, హస్తకలితము=చేతియందుండునది-

తాత్పర్యము.

పతిసేవ చేయుటచేతనేకదా సావిత్రి స్వర్గలోకమునఁ బ్రకాశించుచున్నది. పతిసేవ చేయుటచేతఁగదా నీకు స్వర్గ మఱచేతిలోనిదయ్యెను.

కం. దివిదేవత యగురోహిణి, యువతిజనశ్రేష్ఠ యొకముహూర్తం బేనిన్
స్వవిభుం దారాపతి వె, న్దవులక చరియింపఁ గలుగునా యెన్నండున్.

తాత్పర్యము [౨౫౪౧

ఆకాశదేవత స్త్రీరత్నమగు రోహిణి యల్పకాలమైనను తన భర్తయగు చంద్రునివెంటఁ బోవక యుండఁగలదా. ఈ రోహిణి ౨౭ నక్షత్రములలోఁ జేరిన రోహిణిగాదు.

చం. స్థిరపతిభక్తిఁ జేసెడిప తివ్రత లిట్లు జగన్నుతంబుగా
ధరణిఁ జరించి యాత్మకృత ధర్మమునన్ దివిఁ బూజ్యమాన లై
పరఁగుదు రంచుఁ పల్కముని పత్ని నితాంతముదాన జానకిన్
శిరమును మూరుకొంచుఁ దనుఁ జేరఁగఁ దీసి వచించె నీగతిన్. ౨౫౪౨

జగన్నుతంబు=ప్రపంచము పొగడునట్లుగా, ఆత్మకృత ధర్మమునన్ = తాముచేసిన పతివ్రతా ధర్మముచే, పూజ్యమానలై = గౌరవింపఁబడినవారై, నితాంతముదాన = అతిశయించిన సంతోషముతో, మూరుకొంచున్ = వాసన చూచుచు- తనుఁ జేరఁగఁదీసి మూరుకొంచు నని యన్వయము.

తాత్పర్యము

చలింపని మనస్సుతోఁ బతిసేవచేసెడి పతివ్రతలు లోకులు నుతించునట్టు లీలోకాలోకమునఁ బతివ్రతలై చరించి వారుచేసిన యాపుణ్యముచేతనే స్వర్గము నందుఁ బూజింపఁబడుదురు. అని సీతాదేవిచెప్పఁగా ననసూయాదేవి మిక్కిలి సంతోషించి యామెను దగ్గఱకుఁదీసికొని శిరస్సు వాసనచూచి యిట్లుచెప్పెను.

శా. అమ్మా! నీదుమనోజ్ఞవాక్కుల మహాహ్లాదంబు సంధిల్లెఁ, గో
ర్మ్యామ్మా నీకు నభీష్ట మెద్ది సమకూర్తున్ మత్తపశ్శక్తి, నా
నమ్మాటల్ విని విస్మయంబు దరహాసాంకూరముల్ దోఁపఁగా
నమ్మీనాక్షి భవత్కృపం గొదవ లే దమ్మా యెదీ న్నావుడున్. ౨౫౪౩

మనోజ్ఞవాక్కులన్=మనస్సునకింపైన మాటలచే, మహాహ్లాదంబు=మిగుల సంతోషము, సంధిల్లెన్=కలిగెను, దరహాసాంకూరముల్=చిఱునవ్వు మొలకలు- అంకూరోంకుర మస్త్రీయామ్మని వైజయంతి. భవత్కృపన్=నీదయచే.

తాత్పర్యము

అమ్మా! యింపైన నీవాక్కులచే మిగుల సంతోషమైనది. నీకేమి కావలయునో కోరుకొమ్ము. నా తపోబలముచే నీకు దానిని గలిగించెదనని చెప్పఁగా నామాటలువిని యాశ్చర్యపడి యీమె నన్నుఁ బరీక్షించుచున్నదేమోగదా యని చిఱునవ్వుతో సీతాదేవి తల్లీ! నీదయవలన నా కేకొఱఁతయులేదు. నేనేమి కోరుదును అని చెప్పెను.

—• అనసూయ సీతాదేవి కంగరాగాదు లిచ్చుట. •—

సీ. ఆమాట లాలించి • యధికతరప్రీతి, నాతపస్విని యిట్టు•లనియె సతికి
నీమాల్యములు వస్త్ర•మీయాభరణములు, నీయంగరాగంబు•లీవిలేప
మెంతయు దివ్యంబు•లిష్టంబు సంప్రీతిఁ, గొమ్మరో వీనిఁ గై•కొమ్ము నీవు
వాడవు వీడవు • వలపులు నూడవు, నీ కనురూపమై • నెఱిగ నుండు

తే. వీని ధరియించి తేనియు•విద్రుమోష్ఠి! లసదనూనశోభాయుత•లలితదేహ
వగుచు నలరించెదవు నీవు•ప్రాణవిభుని, నెలఁది మంగళదేవత•విష్ణునట్లు.

అధికతర ప్రీతిన్ = మునుపటికంటె హెచ్చిన సంతోషముచే- ఇదివఱకు నామె పాతివ్రత్యమునకు సంతోషించెను. ఇప్పుడామె నిష్కామత్వమునకు మిక్కిలి సంతోషించెను. మాల్యములు=పూలదండలు, వస్త్రము=చీర, ఆభరణములు=సొమ్ములు, అంగరాగములు=దేహమునకుఁ బూసికొను గంధము మొదలైనవి, విలేపము = అత్తరు మొదలైనది, దివ్యంబులు = దేవలోకములోనివి, ఇష్టంబు=మనస్సునకింపైనది, వలపులు = వాసనలు. అనురూపమై = తగినవై, లసత్=ప్రకాశించు, అనూన=కొఱఁతలేని, శోభాయుత=కాంతితోఁగూడిన, లలిత= మనోహరమైన, దేహవు=దేహముగలదానవు, అలరించెదవు = సంతోషింపఁజేసెదవు, విద్రుమోష్ఠి = పగడమువంటి యెఱ్ఱని పెదవిగలదానా, మంగళదేవత = లక్ష్మీదేవి- 'రమామంగళ దేవతా' యమరుఁడు. తపస్విని = తపస్సు విశేషించి గలది- అస్మాయామేధాస్రజోవినిః" పాణిని ౫-౨-౧౨౧. మాయావి, మేధావి. స్రగ్వి, యశస్వి, తపస్వి యిత్యాదులకు స్త్రీలింగమున 'ని' వచ్చును.

తాత్పర్యము

సీతాదేవి చెప్పిన యామాటలు విని మిక్కిలి యతిశయించిన ప్రీతిచేఁ దపశ్శాలినియైన యనసూయాదేవి యామెకిట్లనియె. ఈ పూలదండలు, ఈ వస్త్రము, ఈ సొమ్ములు, ఈ మైపూఁతలు, ఈ పరిమళద్రవ్యము లివి దేవతా సంబంధమయినవి. భూలోకవాసులకు లభించునవికావు. మనస్సునకు సంతోషకరములైనవి. ఈ పూలదండలు వాడవు, వీడిపోవు, వాసనయుఁబోదు, నీకుఁ దగి యందముగ నుండును. వీనిని నీవు ధరియించితివా ప్రకాశించునదియై పూర్ణకాంతితోఁగూడి మనోహర దేహముగలదానవై లక్ష్మీదేవి విష్ణువును సంతోషపెట్టినట్లు సంతోషపెట్టఁగలవు.

దీనివలన సీతాదేవి లక్ష్మీదేవియని యనసూయ గ్రహించెనని తోఁచెడిని.

కం. అని ప్రీతి నొసంగిన న,జ్జనకతనూజాత వాని ♦ సంతసమునఁ గై
కొని పూతభక్తితోన,మ్మునిపత్నికి మ్రొక్కి నికట♦మునఁగూర్చుండెన్.

నికటమునన్=సమీపమునందు. [౨౫౪౫

తాత్పర్యము.

అని ప్రేమతో నీయఁగా సీతాదేవి వానిని సంతోషముతో గ్రహించి నిర్మలమైన భక్తితో నామునిభార్యకుఁ గృతజ్ఞతా సూచకముగ నమస్కరించి యామె యంచునఁ గూర్చుండెను.

కం. ఇటు లంచునఁ గూర్చుండిన,కుటిలాలకఁ గాంచి యత్రి♦కోమలి విడిము
చ్చట లాడఁ దొడఁగుచును ము,
చ్చటమీఱఁగ ననియె రామ♦చంద్రునిసతికిన్. ౨౫౪౬

కుటిలాలక=వంకరయగు ముంగురులు గలది, ముచ్చట=సంతోషము.

తాత్పర్యము

ఇట్లు తనప్రక్కనఁ గూర్చుండిన సీతనుజూచి యనసూయ యిటుసు మాటలాడుచు సంతోషముతో నిట్లనెను.

—♦ సీత యనసూయకుఁ దన స్వయంవరము వృత్తాంతముఁ జెప్పుట. ♦—

చం. ప్రరుచిరగాత్రుఁడై నరఘు♦రాముఁడు విక్రమమార నిన్ స్వయం
వరమునఁ బెండ్లి యాడె నను♦వార్తను వింటిని, గాని నే సవి
స్తరముగ నాలకింపఁ బ్రమ♦దా! మది గోర్వెడుఁ దత్కథన్ వినన్
జరగిన దంతయుం జెపుమ ♦ సమ్మద మార నరాళకుంతలా. ౨౫౪౭

అరాళకుంతలా = వంకరయగు తలవెంట్రుకలు గలదానా, ప్రరుచిరగాత్రుఁడు=మిగుల నందమైన దేహముగలవాఁడు, విక్రమమారన్ = పరాక్రమ మతిశయింపఁగా, అరాళకుంతలా యనుటచే నీయందరాళత్వము వెంట్రుకల యందున్నది. గాని మనస్సు సరాళమే యని భావము.

తాత్పర్యము

కుటిలకుంతలా! నిన్ను రామచంద్రమూర్తి తనపరాక్రమముచే స్వయంవరమునఁ బెండ్లియాడెనని మాటమాత్రము వింటినిగాని యిదియెట్లో యేమో పూర్ణముగ విన్నదానను గాను. ఆకథ వినవలయునని కోరికగలదు. జరిగినదంతయు సవిస్తరముగఁ జెప్పుము.

సీ. అనవుడు జానకి♦వినవమ్మ వినుతు నా,జనకుఁడు ♦ క్షత్రధర్మ
రతుఁడు విదేహాధి♦పతి యొక్కనాఁడు దాఁ,
గ్రతువొండు సేయంగఁ♦గడఁగి నేల
దున్నింప నాఁగటి♦తుదతాఁకునను భూమి, పెల్లగిల్లఁగ నేను♦వెడలి రాఁగ
భూపతి ముష్టివి♦క్షేపతత్పరుఁడు ధా,త్రీపాంసుకుంఠిత♦దేహ నన్నుఁ

తే. గాంచి యబ్బురపడి కన్న•కన్నెవోలె,
స్నేహ మూరంగఁ దనయంక•సీమఁ జేర్చి
మత్తనూభవ యిది యని•మమత చేసె,
గగనవాణియు నీమె నీ•కన్య యనియె. ౨౩౬౮

క్షత్రధర్మరతుఁడు=క్షత్రియధర్మమం దాసక్తిగలవాఁడు, క్రతువు=యజ్ఞము, ముష్టివిక్షేపతత్పరుఁడు="షడ్గవేనకృషతి" యని పూర్వమున భూమిని దున్న వలయుననిన ౬-కాండ్ల యెద్దులుకట్టి దున్నువారు. ఏల:- ఒకకాఁడి యెద్దులు గట్టినఁ గష్టమెక్కువగుటచే హింసయగునని, యజ్ఞముచేయుటకుముం దాభూమి శుద్ధముగా నున్నదికదా ఎముకలు, వెంట్రుకలు, పెంకులు లేకయున్నదాయని శోధించుటకై నేల దున్నుదురు.అట్లుదున్ని పిడికిట గింజలు తీసికొని చల్లుదురు. "యాజాతా ఓషధయో దేవేభ్య ఇతి చతుర్దశభి రోషధీర్వపతి"యని ప్రమాణము. అట్లులే పిడికిటితో గింజలుచల్లుటయం దాసక్తిగలవాఁడు. ధాత్రీపాంసుకుంఠిత దేహ నన్న = నేలదుమ్ముచేఁ గప్పఁబడిన దేహముగలనన్ను, అబ్బురపడి = ఆశ్చర్యపడి, అపూర్వ శబ్దభవము అబ్బురము. కన్నకన్నెవోలెన్=కన్నకూఁతురు వలె, అంకసీమన్=తొడయందు, మత్తనూభవ=నాకూఁతురు.

సీతాదేవి తొలుత లంకలోఁ బద్మమందుఁ బుట్టెననియు దానిని రావణుఁడు తీసికొనిపోయి మంత్రులకుఁజూపఁగా లక్షణజ్ఞులు నిన్నుఁజంపుట కీబాలిక యుద యించెననియుఁ జెప్పఁగా వాఁడామెను సముద్రములోఁ (బంగారుపెట్టెలోనుంచి యని కొందఱు) బాఱవైచెననియు, నామె జనకుని యజ్ఞభూమియుం దుద యించెననియుఁ జెప్పుదురు. కథకుఁ గాళ్ళు, ముంతకుఁ జెవులు లేవు.

1. వేదవతి నీలంకలోఁ బుట్టెదనని చెప్పలేదు.

2. ఈకాలమందు వలదు వలదనఁగాఁ బుట్టెడిబిడ్డలే మూఁడుజేనల పొడు గైన నున్నారే సీతాదేవి యెంతయుండవలయును ? అంతబిడ్డ పట్టు కమల మదెంత యుండవలెను ?

3. పాంసుకుంఠితదేహ యని చెప్పుటచే బంగారుపెట్టెలో వేసెనన్నమాట యసత్యము. లోపల మనుష్యులుండు బంగారుపెట్టె నీళ్ళపై నెట్లుదేలును?లోపల గాలిపోవు మార్గము కలదాలేదా, గాలిపోవుమార్గముండిన నీళ్ళులపోలేదు?

4. లంకనుండి గంగాసాగర సంగమమునుండి బిడ్డగాని పెట్టెగాని నీటి కెదురెక్కి యెట్లుపోఁగలిగెను? ఒకవేళ సముద్రములోని యలలకట్టు లిటుకొట్టు కొనుచు బోయినదన్నను గంగ కెదురెక్కి యెట్లు పోఁగలిగెను? ఆవల మిథిలకు నేలలో నెట్లు పోఁగలిగెను? నేలమీఁదఁబోయెనా? నేలలోపలనే పోయెనా? అంత దూరము నేలమీఁదఁ బోవుచుండిన నేల యెవరికిఁ గానరాలేదు? బిడ్డగాని పెట్టె గాని నేలలో నెట్లు పోఁగలదు?

ఈ విధముగఁజూచిన నిది దీనినెవఁడో లంకయెందున్నదో మిథిలయెందున్నదో తెలియనివాఁడు కల్పించెనని స్పష్టపడఁగలదు. ఈప్రకారము భూమిలో నాఱుసంవత్సరము లుండెనందురు. ఏమిటికో? కావున నీవిషయము ప్రక్షిప్తమనుటయే సత్యము. గోదాదేవివలె స్వసంకల్పప్రకార మామె యాసమయమున కందుద్భవించె ననిచెప్పుట యొప్పు.

తాత్పర్యము.

అని యనసూయ యడుగఁగా సీతాదేవి యమ్మా! వినిపించెద వినుము. నాతండ్రి జనకుఁడు క్షత్రధర్మమందుఁ బ్రీతిగలవాఁడు. విదేహ దేశమునకు రాజు. ఒకనాఁడు యజ్ఞము చేయవలయునని నేలదున్నింపఁగా నాఁగేటి కఱు తాఁకున నేలపెళ్ళలు లేవఁగా నేను భూమిలోనుండి వెడలివచ్చితిని. అప్పుడు ధాన్యము చల్లుటకై పిడికిట గింజలుంచుకొన్న జనకుఁడు నన్నుఁజూచి యాశ్చర్యపడి తాను గన్నకూఁతురువలె స్నేహ మతిశయింపఁగాఁ దన కుడితొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని యీమె నాకూఁతు రనియెను. ఆకాశవాణియు నీమె నీకూఁతురే యనెను. కూఁతురు కోడలు చెల్లెలు కుడితొడమీఁదఁ గూర్చుండవలెను. భార్యవరుసవా రెడమతొడమీఁదఁ గూర్చుండవలెను.

చం. అన ముద మంది హర్షలసి♦తాననుఁడై తనజ్యేష్ఠపత్నికి
చ్చినఁ దనకూఁతువోలె నను ♦ స్నేహము పేర్మిఁ బెంచు చుండఁగాఁ
బనుపడె భర్తృయోగసుల♦భం బగుప్రాయము, దానిఁ జూచి ని
ర్ధని ధనసష్టికైవలె ని♦తాంతము చింతఁ దపించుచు న్మదిన్. ౨౨౮

ముదము=సంతోషము, హర్షలసితాననుఁడై=సంతోషముచేఁ బ్రకాశించు ముఖముగలవాఁడై, జ్యేష్ఠపత్నికి=పెద్దభార్యకు, (దీనివలన జనకునకును ఒకతెకంటె నెక్కువమంది భార్యలున్నట్టు తోఁచుచున్నది) పేర్మిన్=అతిశయముచే, భర్తృయోగసులభము=భర్తతోఁ గూడియుండుటకు యోగ్యమైనది, ప్రాయము = వయస్సు, సీతాదేవి కిప్పటికి జనకునొద్దకు వచ్చినప్పటినుండి యాఱు సంవత్సరముల వయస్సు. భూమిలో నాఱుసంవత్సరము లుండినట్లు చెప్పెదరుగాని రామాయణమున దానికాధారములేదు. కావున భర్తృయోగ సులభప్రాయ మనఁగా వివాహమునకు యుక్తమైనదశ యనియే చెప్పవలయును. భర్తృసంభోగ సులభప్రాయ మనరాదు. నిర్ధని = ధనము పోఁగొట్టుకున్నవాఁడు, ధననష్టికై =పోయిన ధనమునకై, నితాంతము=మిక్కిలి.

తాత్పర్యము

ఆకాశవాణి వలుకులకు సంతోషించి ముఖవికాసము గలవాఁడై నన్నుఁ దన పెద్దభార్యకిచ్చెను. ఆమెయును దన కన్నబిడ్డవలెనే నన్నుఁ బ్రేమాతిశయమునఁ బోషించుచుండెను. అంత నాకు వివాహయోగ్యదశ వచ్చుట చూచి

దీనికిఁ దగిన వరుఁడెవ్వఁడా యని ధనము గోలుపోయినవాఁడు ధనసక్తికై పరితపించునట్లు పరితపింపసాగెను.

కం. కూఁతులఁ గనునాతఁడు కాఱ్ఱుకూఁతలు విను వియ్య మాడి॰కొలఁదులచేనో
లాఁతులచేనో తనతల, వ్రాఁతకొలఁది నింద్రు నంత॰వాఁడై యున్నన్.

కార్కూఁతలు=కాఱుకూఁతలు=పరుష వాక్యములు, సంశ్లేషంబున నలఘు రేఫములఘు రేఫమగును. వియ్యమాడి = వివాహసంబంధము చేసి, కొలఁదుల చేస్ = తనకంటె నల్పులచేనో, లాఁతులచేనో = వారికంటె నితరులచే ననఁగా సమానులచేతనో.

కన్యావివాహ విషయచింత యీ సమయమునకు వచ్చునదిగాదు. కొంచెము వయస్సు వచ్చినమొదలు లేదా యది పుట్టినప్పటినుండి తల్లిదండ్రులను బాధించుచునే యుండును.

కం. "గౌరవముం గాంక్షించెడు, పూరుషునకుఁ గూఁతురొకతె పుట్టిన యేనిన్
గూరును దుఃఖం బెవఁడా, యీరమణికి మగఁడటంచు నెసఁగినచింతన్॥

కం. జననీవంశము వారిని, జనకు కులమువారి స్వపతిసంతతివారిన్
దనయా కన్యకసంశయ,మునఁ ద్రోయు సదా యకీర్తిముంచునొ యనుచున్
ఉత్త. రా. ౧౮-౧౮౩.

కావున వివాహాలోచనఁ జేసె నసఁగానే కన్య గర్భాధానమునకు సిద్ధపడినదని యర్థము చేయరాదు.

తాత్పర్యము

ఆఁడుబిడ్డలఁ గలవాఁడు తనకంటె నల్పులచేతనో తనతో సములచేతనో యాపిల్లను వివాహము చేసికొనినవాని యింటివారిచేత నిష్ఠురములు పడవలసి వచ్చును. పిల్లతండ్రి దేవేంద్రుఁడైనను వాని కీతలవ్రాఁత తప్పదు. పిల్ల గుణవతి బుద్ధిమతి యగునేని తల్లిదండ్రులకుఁ బరితాపమెక్కువ.

తే. ఇట్టిగుణధన్య కర్హుఁడై ॰ యెసఁగునట్టి
కాంతుఁ డెవ్వఁడొ సజ్జనా ॰ గ్రణీ లభించు
నంచుఁ జింతార్ణవమున ను ॰ గ్నాత్ముఁ డగుచు
దరిని గనఁ డయ్యెఁ బ్లవహీను ॰ కరణిఁ దండ్రి. ౨౫౮౧

గుణధన్య=గుణసంపత్తిగలది, కాంతుఁడు=భర్త, సజ్జనాగ్రణీ = సత్పురుషులలో శ్రేష్ఠుఁడగువాఁడు, చింతార్ణవమునన్=విచార సముద్రమున, మగ్నాత్ముఁడు=మునిఁగిన మనస్సుగలవాఁడు, ప్లవహీనుకరణి=తెప్పలేనివానివలె.

తాత్పర్యము

ఈకన్యక యిటువంటి గొప్పగుణములు గలదిగానున్నదే, దీనికిఁదగినవాఁడు సద్గుణ సంపత్తిగలవారిలో గొప్పవాఁడగువాఁ డెవ్వఁడు భర్తగా లభించునో ఏవిధముగా నటువంటివానిని సంపాదింపఁగలను. అని విచారసముద్ర

మున మాతండ్రి మునిఁగి తెప్పలేనివాఁడు నదిని దాఁటలేనట్లు దరిగానలేక యుండెను.

కం. నన్ను నయోనిజఁ గని యెం,
దు న్నృపతిని మదనరూపుఁ దుల్యునిఁ గన కా
సన్నుతమతి దలఁచెను నా, ప్రన్ననితనయకు స్వయంవరంబు ఘటింతున్.

అయోనిజన్=స్త్రీలగర్భమునందుండి పుట్టనిదానిని, మదనరూపున్=మన్మథునిఁబోలిన సుందరుని, తుల్యుని = నాసౌందర్యమునకుఁ దగిన సౌందర్యము గలవానిని, సన్నుతమతి = సత్పురుషులచే స్తోత్రముచేయఁబడిన మనస్సుగలవానిని, ప్రన్ననితనయకున్=ప్రియపుత్రికకు.

తాత్పర్యము

తల్లిగర్భమునందుండి పుట్టని సుందరియగు నన్నుఁజూచి యిటువంటి దేవకన్యవంటిదానికిఁ దగినరాజును మన్మథాకారుని దీనికి సమానుఁడగువానిని సంపాదింపవలెనని విచారించెనుగాని తగినవాఁడు కానరాఁడయ్యెను. అప్పుడిదికా దుపాయమని తలఁచి స్వయంవరము చాటించితినేని తగినవాఁడు దొరకునని తరఁచెను.

చం. అని తనకున్ మహాధ్వరమునందుఁ బ్రచేతసుఁ డిచ్చి యున్న యా
ధనువును నక్షయాశుగవితాన మమానుషచాల్య మౌటచే
జనపతు లెక్క పెట్టఁ దమస్వప్నములందుఁ దలంపరానిదా
నిని దనపిల్వఁబంచుధరణీవిభుకోటికిఁ జూపి యిట్లనున్. ౨౩౪౩

మహాధ్వరమునందున్=గొప్పయజ్ఞమునందు, ప్రచేతసుఁడు=వరుణుఁడు, అక్షయాశుగవితానము=అక్షయబాణముల సమూహము, అమానుషచాల్యము= మనుష్యులు కదలింపరానిది, తనపిల్వఁబంచు = తాను బిలిపించిన, ఈమె యయోనిజ యనుటచే నమానవ కన్యకగాఁ గానవచ్చుచున్నది గావున నీమెకుఁ దగినవరుఁడు అమానుష శక్తిసంపన్నుఁడుగా నుండవలెనని మనుష్యులకు సాధ్యముగాని పరీక్ష యేర్పాటుచేసెను.

తాత్పర్యము.

ఈప్రకార మాలోచించి తానుజేసిన గొప్ప యజ్ఞమునందు వరుణుఁడు తనకిచ్చియుండిన వింటిని మనుష్యులు కదలించుటకును సాధ్యముగాని దౌటచే రాజులు తమ కలయందైనను నెక్కుపెట్టఁ దలంపరానిదానిని నక్షయబాణములను దాను బిలిపించిన రాజులకెల్లఁజూపి యిట్లనెను.

కం. ఈవింటిని మోపెట్టిన, యావీరుఁడు నాదుపుత్రికకగు నాథుఁడు నా
క్ష్మావల్లభతతి మ్రొక్కుచు, రావడి యది యెత్తలేమిఁ గ్రక్కనఁ జనఁగన్.

మోపెట్టిన=ఎక్కుపెట్టిన, మోపు+పెట్టు=మోపెట్టు, రాయి+వడు=రావడు రాతివలెనగు.

ఈ విల్లెక్కు పెట్టిన వీరుఁడు నాకూఁతునకు మగఁడు కాగలఁడు. అని చెప్పఁగా నారాజులు దాని నెత్తఁజాలక చూడఁగానే రిచ్చవడి దానికొక నమస్కారము చేసిపోఁగా.

చం. అరుఁగఁగ దీర్ఘకాలము మ॰హాత్ముఁడు గాధితనూభవుండు దా
శరథుల రామలక్ష్మణుల ॰ సన్నుతమజ్జనకుండు సల్పిన
ధ్వరమును జూడఁ దోడుకొని॰వచ్చి పచించె విదేహనాథుతో
స్మరసుకుమారు లీన్నృపకు॰మారకు లాజికుమారు లర్మిలిన్. ౨౨౮౭

దీర్ఘకాలము=చాలఁగాలము, గాధితనూభవుండు=విశ్వామిత్రుఁడు,అధ్వరమును=యజ్ఞమును, స్మరసుకుమారులు=మన్మథునివలెఁ గోమలమైన దేహము గలవారు, ఆజికుమారులు=దశరథరాజు పుత్రులు, అర్మిలిన్=ప్రేమతో.

తాత్పర్యము

చాలఁగాల మిట్టులే కడచిపోయెను. రాజకుమారులెవ్వరును దాని నెక్కుపెట్టఁ బూనుకొననైరి. అంత విశ్వామిత్రుఁడు మాతండ్రిచేయు యజ్ఞమును జూడ రామలక్ష్మణులఁ బిల్చుకొనిపచ్చి మాతండ్రితో మన్మథులవలె సుకుమారులైన యీ రాజకుమారులు దశరథరాజపుత్రులు.

కం. చూపుము నీదాఁచినశివు,చాపముఁ దెప్పించి రామ॰చంద్రున కనినన్
భూపాలుఁ డట్లు చేయఁగఁ, దాపసునుడి రామవిభుఁడు॰ధనువుం గదిసెన్. [౨౨౮౮.

తాత్పర్యము

జనకమహారాజా! నీవు దాఁచియుంచిన వింటిని దెప్పించి శ్రీరామచంద్రమూర్తికిఁ జూపుము అనిచెప్పఁగా జనకరాజట్టులే చేసెను. విశ్వామిత్రుని మాటప్రకారము శ్రీరామచంద్రమూర్తి వింటిని సమీపించెను.

కం. చాపర బవలీల సమారోపం బొనరించి గుణ ము॰రుగతిం దివియన్
జూపఱు బెగడొందఁగ నది, కోపఱి రెం డయ్యె నశని॰ఘోషము నిండన్.

అవలీలన్=అనాయాసముగా, సమారోపంబొనరించి=ఎక్కుపెట్టి,గుణము=అల్లెత్రాడు, ఉరుగతిన్=గొప్పరీతిని, తివియన్=లాగఁగా, చూపఱు = చూచువారు, బెగడొందన్=భయపడ, కోపఱి=అందముచెడి, అశనిఘోషము = పిడుగువంటి ధ్వని.

తాత్పర్యము

ఆవింటిని శ్రీరామచంద్రమూర్తి యనాయాసముగా నెక్కుపెట్టి యల్లెత్రాడు గట్టిగఁబట్టి లాగఁగాఁ జూచువారు భయపడునట్లు పిడుగుపడునప్పటి ధ్వనినంటి ధ్వనితో నది రెండుగ విఱిగెను.

అమానుషయగు సీతకు నమానుషమైన శివువిల్లు విఱిచిన యమానుష పురుషునకు నిచ్చెదనన్న ప్రతిజ్ఞయగుటచే శ్రీరామచంద్రమూర్తి యమానుషత్వ మేర్పడుచున్నది. శివుఁడెక్కుపెట్టి లాగినప్పుడు విల్లు విఱుగలేదు. శ్రీరామచంద్రమూర్తి యెక్కుపెట్టి లాగినపుడు విఱిగెను. కావున నీయన యంతకంటె గొప్పవాఁడని యిట్టివాఁడే తన పుత్రికకుఁదగిన భర్తయని జనకరాజు గ్రహించెనని భావము.

ఉ. అంతట సత్యవాది జన♦కావనినాథుఁడు నన్ను రామభూ
కాంతున కీ జలంబుఁగొనఁ♦ గైకొనఁ డయ్యెను దండ్రియిష్ట మా
వంత నెఱుంగరామి, నపు♦డాదట మజ్జనకుండు పంచె న
క్ష్మాకాంతుని మామగారి నటఁ♦ గ్రచ్చఱఁ దోడ్కొనిరాఁగ దూతలన్. ౬౩౮౮

సత్యవాది=నిజము చెప్పువాఁడు, ఆవంత=ఆవ + అంత=ఆవగింజంత=అల్పము, ఆదటన్=ప్రీతితో, క్రచ్చఱన్=శీఘ్రముగా.

తాత్పర్యము

ఈవిల్లు విఱిచినవానికి నాకూఁతు నిచ్చెదనని ప్రతిజ్ఞచేసియుండిన మాతండ్రి తనమాట నిజముచేసికొన శ్రీరామచంద్రమూర్తికి నన్ను దానముచేయ జలపాత్ర గైకొనెను గాని తమతండ్రి యభిప్రాయము తెలియరామిని శ్రీరామచంద్రమూర్తి దానము గైకొన నంగీకరింపఁడయ్యె. అప్పుడు మాతండ్రి దశరథమహారాజు నొద్దకు వెంటనే దూతల నంపెను.

దీనివలనఁ దండ్రిసమ్మతి లేక బిడ్డలు స్వతంత్రించి వివాహమాడ రాదని సూచన.

తే. జనకుఁడంతట శ్రీరామ♦చంద్రునకును,
నన్ను నొసఁగుచు నూర్మిళా♦నామధేయ
నాదుచెల్లెలి లక్ష్మణు♦నకు నొసంగె, నట్లు రామున కనురక్త♦నైతి నమ్మ.

తాత్పర్యము. [౬౩౮౯

మాతండ్రి యాహ్వానము నాదరించి దశరథమహారాజు రాఁగా శ్రీరామచంద్రునకు నన్నును, నాచెల్లెలూర్మిళను లక్ష్మణునకును దానముచేసెను. ఈవిధముగ నేను శ్రీరామచంద్రమూర్తియందుఁ బ్రియముగలదాన నైతిని. తండ్రిచేసిన పెండ్లియని శ్రీరామునకు నేను బ్రియురాలనైతిని.

—♦౧౧౯-వ సర్గము. అనసూయ సీతకు సాయంకాలము వర్ణించి చెప్పుట.♦—

కం. అన మునిసతి శిరమున్ మూ,ర్కొని కౌఁగిటఁ గ్రుచ్చి యనియెఁ♦గోకిలవాణీ
వినఁ జిత్రము స్పష్టము తి,య్యన గా భాషించితివి స్వ♦యంవరచరితన్.

మునిసతి=అనసూయాదేవి, మూర్కొని=వాసనచూచి, కౌఁగిటఁగ్రుచ్చి=కౌఁగిలించి, కోకిలవాణీ=కోకిల కంఠస్వరమువంటి స్వరముగలదానా.

తాత్పర్యము

అని సీతాదేవిచెప్పఁగా మునిపత్నియగు ననసూయాదేవి యామె శిరస్సును వాసనచూచి కౌఁగిలించి యిట్లనెను. కలకంఠీ! వినుటకుఁ జిత్రముగాను సందేహముకలుగకుండునట్లుగను మధురముగా నీస్వయంవర చరిత్రమును జెప్పితివి.

ఉ. క్రుంకెను ప్రొద్దు, చీఁకటులు • గూడెను, మేఁతకుఁ జన్న పుల్గులుం
దెంకులు చేర కూసెడిని • నిద్రకుఁగా, నభిషేకవారికై
పంకజనేత్ర! చన్నమునివర్యులదే తడినార లూని పా
త్రాంకితహస్తులై మగిడి • రద్దెసఁ జూడఁగదమ్మ జానకీ.　　౨౫౯౧

ప్రొద్దు=సూర్యుఁడు, బ్రధ్నశబ్దభవము, తెంకులు = స్థానములు, ఏక, తెంకి. అభిషేకవారికై=స్నానముచేయు నీటికై, తడినారలు=తడినారచీరలు, పాత్రాంకిత హస్తులై=నీళ్ళతోనిండిన పాత్రములను చేతియందుఁ గలవారై, మగిడిరి=మరలి వచ్చిరి, దీనివలన స్నానముచేసినవారు జలపాత్రలు చేతలేక యింటికి రారాదు.

"ఉదపాత్రం కరేధృత్వా, బహిర్యాతి యదిద్విజః
చండాల దర్శనాలాప, స్పర్శదోషై ర్విముచ్యతే ॥

జలపాత్రము చేతధరించి వెలుపలపోయిన బ్రాహ్మణుఁడు చండాలుని జూచిన, మాటలాడిన, దాఁకిన దోషమునుండి విడివడుచున్నాఁడు.

తాత్పర్యము

సూర్యుఁడస్తమించెను, చీఁకటులు క్రమ్ముకొనెను, మేఁతకుఁగా దూరము పోయిన పక్షులు మరల నిద్రకై గూండ్లుచేరుచున్నవి; స్నానము చేయఁ బోయిన మునులు స్నానముచేసి తడివస్త్రములతో జలపాత్రమును జేతఁబట్టుకొని మరలి వచ్చుచున్నారు. ఆప్రక్క చూడుము.

ఆ. వీతిహోత్రునందు • విధియుక్తి ఋషులు హు
తంబు సేయ మారు • తమున కెగరు
ధూమములను గంటె • తొగ రెక్క పావురాల్
మెడలజిగిన మెఱసెఁ • బుడమిపట్టి.　　౨౫౯౨

వీతిహోత్రునందు=అగ్నియందు, విధియుక్తి=శాస్త్రప్రకారము, హుతంబు=హోమముచేయఁబడినది, మారుతమునకున్ = గాలికి, ధూమములు=పొగలు, తొగరెక్క=ఎఱుపు వర్ణముగలవై, జిగిన=కాంతిచే, పుడమిపట్టి=జానకీ.

తాత్పర్యము

శాస్త్రప్రకారము ఋషీశ్వరు లగ్నిహోత్రమునందు హోమము చేయఁగా గాలికెగురు పొగలను జూడుము. పావురముల మెడయందుండు కాంతివంటి కాంతిగలదై జానకీ! యెగురుచున్నది.

కం. పలుచగ నాకులు గలకుజ,ములు సైతము దూరమంద♦పొలిచియుఁ జీఁక
ట్లలమఁగ నాకులు నిండిన,చెలువునఁ గన్పించె; దెసల♦చెలువు దొలంగెన్.

పలుచగన్=దట్టముగఁగాక యెడమెడముగ, కుజములు=చెట్లు, సైతము =కూడ, సహితశబ్దభవము. అలమఁగన్=క్రమ్ముకొనఁగా, చెలువున=విధముగా, చెలువు = కాంతి.

తాత్పర్యము

ఆకులు పలుచనగానుండ చెట్లుకూడ దూరమందుండియుఁ జీఁకట్లు వ్యాపించిన కారణమున దండిగ నాకులచే నిండినవానివలెనే కానవచ్చుచున్నవి. దిశలు కాంతిహీనము లయ్యెను.

కం. అమ్మా! రేద్రిమ్మరి సత్త్వమ్ములు చరలాడఁ దొడఁగెఁ♦దపసులమృగజా
తమ్ములు వేద్యవతరణత,లమ్ముల శయనించెఁ గంటె♦లలితేందుముఖీ.

రేద్రిమ్మరి=రాత్రిసంచారముసేయు, సత్త్వమ్ములు = జంతువులు, చరలాడన్=సంచారముచేయ, తొడఁగెన్ = ప్రారంభించెను, మృగజాతమ్ములు= పెంపుడుజింకల సమూహములు, వేద్యవరణతలములన్=అరుఁగునుండి దిగెడి చోటులందు, లలితేందుముఖీ = మనోహరమైన చంద్రబింబమువంటి ముఖము [గలదానా.

తాత్పర్యము

సీతమ్మా! రాత్రిసంచారముసేయు జంతువులు సంచరింపఁ బ్రారంభించెను. తపస్వులు సాకుజింకలు వేదులక్రిందివైపు శయనించెను. చూచితివా ?

ఉ. రాతిరి చాల నేగె, నుడు ♦ రాజముఖీ! గగనంబు తారకా
జాతముతో వెలింగెడిని ♦ జంద్రిక మేలిముసుంగుగా నదే
శీతకరుండు దోఁచె రఘు♦శేఖరు డాయఁగఁ బోఁగదమ్మ, సం
ప్రీతి జనించె నిన్నుఁ గన ♦ వేడుక ముచ్చట లాడుచుండఁగన్. ౫౩౯

ఉడురాజముఖీ = చంద్రునివంటి ముఖముగలదానా, గగనంబు = ఆకాశము, తారకాజాతముతోన్ = నక్షత్రసమూహముతో, వెలింగెడిని = ప్రకాశించుచున్నది, చంద్రిక = వెన్నెల, మేలిముసుంగుగా = మీఁదఁగప్పుకొన్న వల్లెవాటుగా, శీతకరుండు=చంద్రుఁడు, తోఁచెన్=ఉదయించెను, డాయఁగన్=సమీపింపఁగా.

దీనివలన స్త్రీలు భర్తతోడఁ దప్ప వేఱుగ రాత్రులందుఁ బరుండరాదని సూచన.

తస్యాః సహపత్న్యా పూర్వరాత్రా ఉపసంవేశనమ్। అర్ధరాత్రా దధః శయనం,ఆబ్రహ్మముహూర్తాత్ అధోపోత్థాయ నిత్యాన్యారభతే॥ బోధాయనులు.

భార్య మగనితోడఁ బూర్వరాత్రమందుఁ బండుకొనవలయును. అర్ధరాత్రము మొదలు బ్రహ్మముహూర్తమువఱకు వేఱుగఁ గ్రిందఁ బండుకోవలెను,

బ్రహ్మముహూర్తమున లేచి నిత్యకృత్యములు ప్రారంభింపవలెను. మగని విడిచి చాటుగ వేఱుగఁ బండుకొనునది చెడిపె యని మనుస్మృతి చెప్పుచున్నది.

"పానం దుర్జన సంసర్గః పత్యాచ విరహోటనమ్
స్వప్నోన్య గేహవాసశ్చ నారీణాం దూషణానిషట్."

తా త్ప ర్య ము.

రాత్రి చాలఁగడచెను, చంద్రముఖీ! యాకాశము నక్షత్రసమూహముతోఁ బ్రకాశించుచున్నది, వెన్నెల వల్లెవాటు ముసుఁగుగాఁ జంద్రుఁ డుదయించెను. అదిగోఁజూడు. ఇఁక నీవు శ్రీరామచంద్రమూర్తియొద్దకుఁ బొమ్ము. నిన్నుఁ జూడ నీతోడ ముచ్చటలాడఁ జాలసంతోషమయ్యెను.

తొలుఁత జీఁకట్లు, ఆవల నక్షత్రకాంతి, ఆవలఁ జంద్రోదయము చెప్పుటచే నిది కృష్ణపక్షము కార్తికబహుళ ప్రతిపత్తని తిలకము. ఏ బహుళపక్షమందైన నిట్టులే యుండును.

ఉ. వారిజనేత్ర! నాయిడిన • వస్త్రము లాదిగ నీవు దాల్పఁ గ
న్నారఁగఁ జూడఁ గోరెద, స•మక్షమునంద ధరింపవమ్మ, నా
ధారిణికన్య యన్నియును • దాల్చి నమస్కృతి చేసి రామునిం
జేరఁగఁ బోయెఁ దన్నుఁ గని•చిత్తమునన్ ముద మంద నాతఁడున్.

వారిజనేత్ర=కమలములవంటి కన్నులుగలదానా, నాయిడిన=నేనిచ్చిన.

తా త్ప ర్య ము

కమలాక్షీ! నేను నీకిచ్చిన చీరలు, సొమ్ములు, వాసనద్రవ్యములు నీవు నాయెదుట ధరింపఁగాఁ గన్నులపండువుగాఁజూచి సంతోషింపఁగోరెదను.వానిని ధరింపుమన నామెయు నట్లుచేసి యామెకు నమస్కరించి శ్రీరామచంద్రమూర్తి యొద్దకుఁ బోయెను. ఆయనయు నామెనుజూచి సంతోషించెను.

దీనివలనఁ గ్రొత్తవస్త్రములు ధరించినవారు పెద్దలకు దేవునకు నమస్కరింపవలయునని సూచన.

కం. జరగినది చెప్పెను నా,భరణంబులు వస్త్రమాల్య•పటలియుఁ దనకున్
గరుణను మునిసతి యిచ్చిన,సరణిని వినిపించె రామ•చంద్రున కెలమిన్.

వస్త్రమాల్యపటలియు=వస్త్రము యొక్కయు పూలదండల యొక్కయు సమూహము.

తా త్ప ర్య ము

అనసూయా దర్శనవేళ జరగిన సంభాషణమంతయుఁ జెప్పి యామునిపత్ని తనకుఁ జీర, పూలదండలు లోనైనవి యిచ్చిన విధమును శ్రీరామచంద్రునకు వినిపించెను.

దీనివలనఁ దనకు లభించిన సంతోషము లాభము భర్తకు సర్వము భార్య వినిపింపవలయునుగాని యేమిచెప్పవలయునులే యని యుపేక్షింప రాదని సూచన. మఱియుఁ గరుణ ననుటచే నప్రతిగ్రహ వ్రతముగలవారును ప్రీతిదత్తములు నయానితములునగు మంగళ ద్రవ్యములు నిరాకరింపరాదు.

శ్లో. శయ్యాం గృహాన్ కుశాన్, గంధా నపః పుష్పం మణీ న్దధి
ధానా మత్స్యాన్పయో మాంసం, శాకంచైవ ననిర్ణుదేత్. మను. ౪-౨౫౦

శయ్య, గృహము, కుశలు, గంధము, నీళ్ళు, పుష్పము, మణులు, పెరుఁగు, బొరుగులు, చేఁపలు, పాలు, మాంసము, కూరలు ఇవి యయాచితముగ నప్రచోదితముగ బలవంతముగ నీయఁబడెనేని నిరాకరింపరాదు.

శ్లో. ఏధోదకం మూలఫల మన్న మభ్యుదితం చయత్
సర్వతః ప్రతిగృహ్ణీయాత్, మధ్వథాభయ దక్షిణామ్.

కట్టెలు, ఉదకము, గడ్డలు, పండ్లు, అన్నము, తేనె, అభయదక్షిణ వీనిని శూద్రాదులైనను వారై తెచ్చి యెదురుగనుంచి తీసికొనుమనిరేని తీసికోవచ్చును

అహృ తాభ్యుద్యతాం భిక్షాం, పురస్తా దప్రచోదితామ్
మేనే ప్రజాపతిర్గ్రాహ్యా, మపి దుష్కృత కర్మణః

వారికివారై యియ్యఁదలఁచినచోటికిఁ దెచ్చి ప్రతిగ్రహీత యెదుట నుంచి, ముందిచ్చెదనని చెప్పినదిగాక, తీసికొనువాఁ డితరులచే నడిగించినది గాకయున్నచో, శూద్రులిచ్చినను గ్రహింపవచ్చునుగాని ఱంకుటాండ్రు, షండులు, పతితులు, శత్రువులు వీరిచ్చినది పుచ్చినగవ్వయైనఁ దనకుఁ బ్రాణము పోవు స్థితిలోనైన గ్రహింపరాదు. గ్రహింపఁ గూడినవైనను దత్కాలమున కెంతకావలయునో యంతే గ్రహింపవలయును.

ఉ. మానవదుర్లభం బయిన ♦ మానితసత్కృతిఁ జూచి జానకీ
జానియు లక్ష్మణుండు నరు ♦ సంబునఁ బొంగి తపోధనాఢ్యస
మ్మానన మంది కూర్కి రవి ♦ మండల మభ్ర మలంకరింప సం
ధ్యానియమాదికల్యవిధు ♦ లన్నియుఁ దీర్చి మునీంద్రకోటులన్. ౬౫౯

మానవదుర్లభంబు=మనుష్యులకు లభింపనివి, మానితసత్కృతిన్=గౌరవార్హమైన సత్కార్యమును, జానకీజాని=రామచంద్రమూర్తి, అరుసంబునన్=సంతోషముతో, హర్షశబ్దభవము అరుసము, తపోధనాఢ్య=తపస్సను ధనముచే సంపన్నులైన ఋషులవలన, సమ్మానన = గౌరవము, కూర్కి = నిద్రించి, అభ్రము=ఆకాశము, కల్యవిధులు=ప్రాతఃకాల కృత్యములు.

తా త్ప ర్య ము

మనుష్యులకు లభింపనిదై ప్రీతిదత్తమైన బహుమానమును జూచి శ్రీరామ లక్ష్మణులు సంతోషంబునఁ బొంగిరి. ఈవిధముగాఁ దపస్వులచే గౌర

వింపఁబడినవారై వారు నిద్రించి సూర్యుఁడుదయింపఁగా సంధ్యావందనాది ప్రాతఃకాల కృత్యములు దీర్చి యందలి మునీశ్వరులను-

ఉ. మార్గము వేఁడ వారలు క్ష ♦ మాధవనందన! యెందుఁ బోవ దు
ర్మార్గచరిష్ణువుల్ వికట ♦ మానవభోజులు క్రూరరూపసం
సర్గులు రాక్షసు ల్గలరు ♦ మైలయు సోఁకఁ, బ్రమాద మూన, మా
వర్గమువారఁ గ్రమింగుదురు ♦ వాసవసన్నిభ! దీని నాఁపవే. ౨౫౯౯

దుర్మార్గచరిష్ణువుల్=చెడుదోవల సంచరించువారు, వికటమానవభోజులు= భయంకరులై మనుష్యులఁదినువారు, క్రూరరూపసంసర్గులు = భయంకర రూపములతోఁగూడినవారు, ప్రమాదము = హెచ్చరికదప్పుట, మావర్గమువారిన్ = మావంటివారిని, వాసవసన్నిభ=ఇంద్రునితో సమానుఁడా, ఆఁపవే=నిలుచునట్లు చేయుము.

దీనివలన రాక్షస భూతప్రేత పిశాచాది భయము అశుచులకేగాని శుచి మంతులకు లేదని సూచన.

భూతములు పిశాచము లెవ్వరిని బాధించునను విషయము భారతంబున ననుశాసనిక పర్వంబున ౧౮౪-వ యధ్యాయమున నిట్లు చెప్పఁబడెను.

"తత స్సర్వే మహాభాగా దేవాశ్చ పితరశ్చహ
ఋషయశ్చ మహాభాగాః ప్రమథా వాక్య మబ్రువన్
భవంతో వై మహాభాగా అపరోక్ష నిశాచరాః
ఉచ్ఛిష్టా నశుచీన్ క్షుద్రాన్ కథంహింస థ మానవాన్
కేచ స్స్మృతాః ప్రతీఘాతా యేనమర్త్యా న్నహింసథ
రక్షోఘ్నానిచ కానిస్యుర్యై ర్గృహేషు ప్రణశ్యథ
శ్రోతు మిచ్ఛామ యుష్మాకం సర్వమేత న్నిశాచరాః
ప్రమథా ఊచుః.
మైథునేన సదోచ్ఛిష్టాః, కృతేచై వాధరోత్తరే
మోహాన్మాంసాని ఖాదేత వృక్షమూలేచయః స్వపేత్
ఆమిషం శీర్షతో యస్య, పాదతో యశ్చ సంవిశేత్
తత ఉచ్ఛిష్టకా సర్వే బహు చ్ఛిద్రాశ్చ మానవాః
ఉదకే చాప్య మేధ్యాని శ్లేష్మాణంచ ప్రముంచతి
ఏతేచ భక్ష్యాశ్చ వధ్యాశ్చ మానుషా నాత్రసంశయః
ఏవంశీల సమాచారాన్ ధర్షయామోహి మానవాన్
శ్రూయతాం ప్రతీఘాతాన్యై ర్నతాంశక్ను మహింసితుమ్
గౌరోచనా సమాలంభో వాచాహ స్తశ్చ యోభవేత్
ఘృతాక్షతంచ యోవద్యా న్మస్తకే తత్పరాయణః
యేచమాంసం నఖాదంతి తా న్నశక్నుమహింసితుమ్

యస్యచాగ్నిగృహే నిత్యం దివారాత్రౌచ దీప్యతే
తరక్షో శ్చర్మదంష్ట్రాశ్చ, తథైవ గిరికచ్ఛపః
ఆజ్యధూమో బిడాలశ్చ, చాగః కృష్ణోథపింగళః
యేషా మేతాని తిష్ఠంతి గృహేషు గృహమేధినామ్
తాన్యథృ ష్వగారాణి పిశితాశైః సుదారుణైః
లోకానాస్మద్విధాయేచ, విచరంతి యథాసుఖమ్
తస్మాదేతాని గేహేషు రక్షోఘ్నాని విశాంపతే
ఏతద్వః కథితం సర్వం యత్రవః సంశయోమహాన్.

అర్థము.

అంత మహాభాగులైన దేవతలు, పితరులు, ఋషులు ప్రమథులను జూచి యిట్లనిరి. (ప్రమథులు=శివుని పరిచారక గణములు, ప్ర+మథ=హింసించు వారని వ్యుత్పత్త్యర్థము) మహాభాగులారా! మీరు పరోక్ష నిచాచరులుకదా, మీ రెట్లుచ్ఛిష్టులను, అశుచులను, క్షుద్రులను హింసించెదరు? మీరెట్టివారిని హింసిం పరు, మీకృత్యములకు నడ్డమువచ్చునవి యేవి? మనుష్యు లెట్టివారైనచో మీరు హింసింపఁజాలరు? నిశాచరులారా! యివి వినవలయునని కోరుచున్నాము.

ప్రమథు లిట్లనిరి :

మైథునమువలన జను లుచ్ఛిష్టులగుచున్నారు. ఆకార్యము ముగిసిన వెంటనే తమ్ముఁ బవిత్రులుగాఁ జేసికొననివారిని, శ్రేష్ఠులను నవమానించువారిని, మోహముచే మాంసములను దినువారిని, చెట్టుమొదళ్ళ నిద్రించువారిని, నిద్రించునపుడు తలక్రింద నేదైన మృగసంబంధపదార్థము నుంచుకొనువారిని, కాళ్ళవైపు శిరస్సుంచి పండుకొనువారిని, తలవైపు కాళ్ళుంచి పండుకొనువారిని మేముచ్ఛిష్టకులని భావింతుము. మనుష్యులందనేక ఛిద్రములున్నవి. నీళ్ళలో నుమ్మివేయువారిని, మలమూత్రములుగాని, యశుద్ధవస్తువులుగాని వేయువారిని నుచ్ఛిష్టకులనియే భావింతుము. ఇట్టివారిని మేము నిస్సందేహముగా బాధింతుము. వీఁకి తిందుము. ఇంకను నిటువంటి గుణములు గలవారిని బాధింతుము. ఇఁక మాచేష్టలకుఁ బ్రతిక్రియలుగా నుండువానిని, మా బాధలకు లోపడనివారిని జెప్పెదము.

ముఖమున గోరోజనము చేతియందు వాచ (దీనికిఁ దెనుఁగుపదము తెలియలేదు వసకాఁబోలు) గలవారిని, ఘృతాక్షత లొకరి కిచ్చువారిని, ఘృతాక్షతల శిరస్సున ధరించువారిని, మాంసముఁ దిననివారిని హింసించుశక్తి మాకు లేదు. ఎవనియింట రాత్రిపగ లగ్ని వెలుఁగుచుండునో యెవనియింట సివంగి చర్మముగాని కోఱలుగాని యుండునో, కొండలలోనుండు మెట్టతాఁబేలుగాని నేయిహోమము చేయుటవలన వెలుపడు ధూమముగాని పిల్లిగాని నల్లమేకగాని గోరోజనము రంగుగల మేఁకగాని యివి యేగృహస్థునింట నుండునో వారి

యిండ్లకు మిగుల భయంకరములైన పిశాచములవలనను భయములేదు. మేము మూఁడులోకములు సంచరించువారమైనను నీపదార్థములుగల యిండ్లలోకిఁ [బోము.

తాత్పర్యము

మేమేమార్గమునఁ బోవలయునో చెప్పుఁడని యడుగఁగా వారేత్రోవపోయినను చెడునడతగలిగి మనుష్యులనుదినురాక్షసులును, భయంకర రూపములు ధరించి యశుచులును హెచ్చరిక దప్పినవారిని మావంటివారిని మ్రింగుచున్నారు. ఇంద్రునితో సమానుఁడా! దీని నిలిచిపోవునట్లు చేయుము.

తే. అడవులకుఁ బోయి ఫలసంగ్ర♦హంబు సేయు
సంయములు పోయి వచ్చెడి ♦ జాడ యిదియ
యిదియ మీకును దగుత్రోవ ♦ యేగ వయ్య
యనుచుఁ బ్రాంజలు లగుచు దీ ♦ వనలు పలుక. ౨౬౦౦

ఫలసంగ్రహము=పండ్లుజతకూర్చుట, సంయములు=మునులు, ప్రాంజలులు=చేతులు జోడించి నమస్కరించినవారు.

తాత్పర్యము

పండ్లు తెచ్చుటకుఁగాను నడవులకు మునులు పోయివచ్చుదోవ యిదియె. ఈత్రోవ మీరును బోవచ్చును. పొండని నమస్కరించి దీవింపఁగా.

తే. సంయమీంద్రులు మంగళా♦శాసనములు,
పలికి తన్నంపఁ దమ్ముం డు♦ జలజనయన
వెంటఁ జనుదేరఁ జొచ్చెను♦విపినభూమి,నభ్రమండలమును జల♦జాప్తులీల.

సంయమీంద్రులు=మునిశ్రేష్ఠులు, మంగళాశాసనములు=ఆశీర్వాదనములు, జలజనయన=కమలములవంటి కన్నులుగల సీత, విపినభూమిన్=అడవిప్రదేశమును, అభ్రమండలమును=మేఘసమూహమును, జలజాప్తులీల=సూర్యునిలీల.

తాత్పర్యము

ఈప్రకారము మునీశ్వరులచే దీవింపఁబడి శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులు తనతోడరాఁగా సూర్యుఁడు మేఘమండలముఁ బ్రవేశించినట్లు ప్రవేశించెను.

ఈ యుపమానము రాఁబోవు నల్పకాల విపద్దశను సూచించుచున్నది. మేఘమడ్డపడిన సూర్యునకుఁ గాంతిహీనత లేదు. చూచెడివారికి వెలుఁగు లేక పోవును. అట్లులే శ్రీరామచంద్రమూర్తి కేబాధలేదు. ఆయనకు వచ్చిన బాధవలన బాధపడునది లోకమే.

అయోధ్యాకాండాంత పద్యములు.

కం. రాంకారబీజమంత్రవ,రాంక సమస్తప్రశస్త♦హారిగుణాచయా౽.
లంకార సకలసులభా, శంకానాస్తిక్యరుద్ధ♦జనతాదూరా. ౨౬౦౨

రాంకారబీజ మంత్రవరాంకా=రామ్మను నక్షరము బీజముగాఁగల మంత్ర శ్రేష్ఠము చిహ్నముగాఁ గలవాఁడా, సమస్తప్రశస్త హారిగుణచయాలంకార=సకలములైన కీర్తింపఁబడిన కల్యాణములైన గుణసమూహములే యలంకారముగాఁ గలవాఁడా! దీనిచే నయోధ్యాకాండమందు వర్ణింపఁబడిన శ్రీరామచంద్రమూర్తి కల్యాణగుణములు సూచింపఁబడెను. సకలసులభా=వీరువారనక సకల జనులకు సులభమైనవాఁడా, ఇది గుహసమాగమము లోనైనవి సూచించును. శంకా=సందేహము, శ్రీరామచంద్రమూర్తి భగవంతుఁడగునో కాఁడో సేవించిన ఫలము గలదోలేదో యను సందేహముచేతను,నాస్తిక్య=దేవుఁడులేఁడు, పరము లేదను బుద్ధిచేతను, రుద్ధ=అడ్డగింపఁబడిన లేక చుట్టఁబడిన బుద్ధిగల. జనతా=జనసమూహమునకు, దూరా=దూరమునందుండువాఁడా.

దూరస్థం చాంతికేచతత్=తన భక్తులకు సమీపమందుండును, భక్తి లేని వారికి దూరమందుండును, అనికదా భగవద్గీత చెప్పుచున్నది. ఇది జాబాలి నాస్తికవాదమును సూచించుచున్నది.

వనమంజరి. గురుజనవాక్యసమాచరణాసమ ♦ కోపకామవిహీనధీ
పరమకృపాశ్రయ నిశ్చలచిత్తక ♦ భ్రాతృవత్సల కామదా
విరహిత దుఃఖసుఖాంతరచేతన ♦ విశ్వసన్నుత భూధవా
నిరుపమధర్మవిధాయి దయామయ♦నిత్యహర్ష గుణోజ్జ్వలా.

గురుజనవాక్య సమాచరణాసమ=తండ్రివాక్యమును పరిపాలించుటయందు నసమానమైనవాఁడా, కోపకామవిహీనధీ=కీడుచేసినవారియందుఁ (కైకేయీ మంథరలయందు) గోపముగాని కామముగాని లేని బుద్ధిగలవాఁడా, పరమకృపాశ్రయ=ఉత్తమమైన దయకు నిలువనీడయైనవాఁడా, నిశ్చలచిత్తక=ఎంత విపత్తు వచ్చినను సంపత్తువచ్చినను జలింపని మనస్సుగలవాఁడా, భ్రాతృవత్సల=సోదరప్రీతిగలవాఁడా, కామదా = కోరినవారికోర్కెల నిచ్చువాఁడా, విరహిత దుఃఖసుఖాంతరచేతన=ఇది సుఖము ఇది దుఃఖమని యంతఃకరణమందు లేనివాఁడా, విశ్వసన్నుత=సమస్త ప్రపంచముచేఁ బొగడఁబడువాఁడా, భూధవ = భూమికి భర్తయైనవాఁడా, నిరుపమ=అసమానమైన, ధర్మవిధాయి=ధర్మమునే స్వానుష్ఠానముచే విధించువాఁడా, దయామయా=దయాస్వరూపుఁడా, ముందు చెప్పఁబడినది స్వభావము. ఇది స్వరూపము. నిత్యహర్ష = ఎప్పటికి సంతోషమే గలవాఁడా, గుణోజ్జ్వలా = సౌశీల్య సౌలభ్య కృతజ్ఞతాది కల్యాణగుణములచేఁ బ్రకాశించువాఁడా-

వనమంజరి=నజజజ భరగణములు ౧౪-వ యింట యతి.

కమల విలసితము.

భువనధిఖరజ♦ముఖసయనాంక, ప్రవిదితపురకృత♦ప్రథితచరిత్రా
దివిజమనుజనుత ♦ స్థిరతరచిత్తా, ధవవర భవహర ♦ దశరథపుత్రా. ౨౬౦౪

భువనధి=సముద్రము, ఇది నాలుగవ యంకెను సూచించును. ఖ=ఆకాశము, ౦ సున్నను సూచించును. శరజముఖ = కుమారస్వామిముఖములు, ఇది ఆఱును సూచించును. నయన=కన్నులు, ఇది రెండును సూచించును. ౪౦౬౨ అని యేర్పడఁగా దీని కడనుండి చదివిన ౨౬౦౪ అగును. ఈ యంకెలచేత ప్రవిదిత = తెలియఁబడిన, పురకృత = అయోధ్యాపురమందుఁ జేయఁబడిన, ప్రథిత=కీర్తికెక్కిన, చరిత్రా=నడవడిగలవాఁడా.

దివిజ=దేవతలచేతను, మనుజ=మనుష్యులచేతను, నుత=స్తోత్రముచేయఁబడినవాఁడా, స్థిరచిత్తా=మిగుల దృఢమైన మనస్సుగలవాఁడా, ధవవర=రాజులలో శ్రేష్ఠుఁడా, భవహర=జననమరణములఁ బోఁగొట్టువాఁడా, దశరథపుత్రా=దశరథరాజనందనా. ఈకాండమందు ౨౬౦౪ పద్యము లున్నవి.

సీ. తనపాదభక్తుల తనయునిఁగాఁజేసి, యనుకంప వీక్షించె జననమంద
ఆవలఁ దా లక్ష్మణార్యుఁడై రక్షించి, రామాయణం బనుగ్రహముచేసె
స్వీయమంత్రంబును జేట్లూరి నరసింహ, దేశికుండై యుపదేశమిచ్చె
ఏకశిలా నగరౌకుఁడై గ్రహియించి, యాంధ్రవాల్మీకి రామాయణంబు
వ్యాఖ్య దానికిపుడు వ్రాయించుకొనియెను,గరిమతో నయోధ్యకాండమునకు
వాసుదాసుచేత స్వప్రభావంబును, బ్రకటపఱుప రామభద్రవిభుఁడు.

ఇది శ్రీమద్రామచంద్ర చరణారవింద మిళిందాయ
మాన మానసత్వ మహావైభవ వావిలికొలను
రామచంద్రరాయ తనూభవ వాసుదాస
నామధేయ ప్రణీతంబయిన మంద
రాఖ్య వ్యాఖ్యానసమేత
శ్రీమదాంధ్రవాల్మీకి
రామాయణమందు
నయోధ్యాకాండము.

శ్రీరామార్పణమస్తు.
శ్రీ. శ్రీ. శ్రీ.

శ్లో. నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ, నమోస్తు వల్మీక భవాయ తస్మై.

శ్రీరామ.

శ్రీ రా మ ది న చ ర్య.

శ్లో. పరిత్రాణాయ సాధూనాం, వినాశాయచ దుష్కృతామ్
ధర్మసంస్థాపనార్థాయ, సంభవామి యుగే యుగే.

అను భగవద్వాక్యము చొప్పున సాధువులను రక్షించుటకై పాపాత్ములను నాశముచేయుటకును, ధర్మమును స్థాపించుటకును ప్రతియుగంబున భగవంతుఁడు శ్రీమన్నారాయణుండు భూమిపై నవతరించుచుండును. కల్పకల్పమందు వచ్చిన యవతారములే మరలమరల వచ్చుచుండును. కావున ప్రతి కల్పమందును ముఖ్యావతారములు పదియేగాక గౌణావతారములు మఱికొన్ని కలుగుచునే యుండును. ఈవిధమునఁ జూడఁగా నిప్పటికి నెన్ని మత్స్యావతారము లయినవో యెన్ని నృసింహావతారము లయినవో యెన్ని శ్రీరామ కృష్ణావతారము లయినవో చెప్పసాధ్యపడదు.

సందేహము.

ఒకసారివచ్చిన యవతారములే మరలమరల రావలయుననిన తొలిసారి యుండినవారే, యా యా సందర్భములే మరల మరల రావలయునుగదా మరల మరల దశావతారములు రావలయుననిన మరల మరల సోమకాసురుఁడు, హిరణ్యాక్ష. హిరణ్యకశిపులు, బలిచక్రవర్తి, రావణ, కంస, శిశుపాలాదులు రావలయునుగదా వారువచ్చినపుడు వారిసహాయులు, సహచరులు, తల్లిదండ్రులును నవతార పురుషునకుఁ గావలసినవారు యథాపూర్వము రావలయునుగదా అట్లయిన నొకసారి యుండినస్త్రీలు పురుషులు మరల మరల వచ్చుచుండవలయునుగదా. అట్లయినఁ బరిణామవాదము పొడగునుగదా. ఒక కల్పమున ముక్తుఁడయిన జీవుఁడు మరల నెనుబదినాలుగులక్షల యోనులందు జన్మింపవలయునుగదా! అప్పటికి ముక్తి యనునది పునర్జన్మ రాహిత్యమనునది వ్యర్థపదములేకదా! యనుసందేహము కలుగవచ్చును.

పరిహారము.

అవతారములు వచ్చుట నిజమే. వారికిఁ గావలసినవారు వారికి విరోధులు వారికిఁ గావలసినవారు వచ్చుట నిశ్చయమే అట్టి సందర్భములు కలుగుటయు సత్యమే. మరల బ్రహ్మేంద్రాదులు, నష్టదిక్పాలకులు, సూర్యచంద్రులు, సప్తర్షులు వీరువారననేల నందఱుఁ బుట్టుట యథార్థమే. ఇంతయేల ? ఆడిన యాటయేయాడవలయును,పాడినపాటయేపాడవలయునుగాని పరిణామవాదము పొడగుట లేదు. ముక్తియనునది వ్యర్థపదముగాదు బ్రహ్మరుద్రేంద్రాగ్ని వరుణాది పదములన్నియు నాయాపదవుల పేర్లేగాని యా యుపాధులయందుండు జీవాత్మల పేర్లుగాదు. కలెక్టరు, డిప్టికలెక్టరు, తహశీల్దారుఁడన్నట్లు తహశీల్

దారుఁడుపోయి తహశీలుదారుఁడు వచ్చెననినఁ బూర్వముండిన మనుష్యుఁడే మరలవచ్చెనని యర్థమా? కాదుకదా. అట్టులే యిదియును. ఒకస్థానమున నున్న వాఁడు పోఁగానే యాస్థానమున నుండ నర్హుఁడెవ్వఁడో వాఁడాస్థానమున నియమింపఁబడును. వాఁడా కార్యముల నెఱవేర్చును. ఇట్లు వచ్చువాఁడు భిన్న జీవుఁడేకాని మునుపటి జీవుఁడుకాఁడు. కావునఁ బరిణామవాదమునకుఁ బ్రాణ భయములేదు. ముక్తునకుఁ బునర్జన్మభయము లేదు. పరిణామక్రమమున నడుమఁ దెంపులులేవు. ఒకస్థానమున రెండుజీవులుండవు. కావుననే కేవలమైక్యముగా నుండునవి లోకమున రెండులేవు. పరిణామ మంకెలవంటిది. ౧-౨-౩-౪-౫-౬ వీనియందు నొకటిని దెలుపునది యొకటియేకాని ౧ $\frac{౧}{౧౦౦౦౦}$ నైనను నొకటికంటె భిన్నమేకదా. కావున జీవయాత్రా విషయమునఁ బరిణామమే సరియైనమార్గము. లోకమునఁ గల వ్యత్యాసముల కన్నిటికిఁ దగిన సమాధానము చెప్పునదదియే.

బ్రహ్మండకోటు లనంతములు, జీవకోటు లనంతములు, ప్రపంచము నిత్యము. సంసారము నిత్యము. కాలము నిత్యము. గంగానదిరేవున మనము నిలుచుండితిమేని మనకెదురుగనున్న జలబిందువులు దాఁటిపోవును. వానిస్థానమున మఱికొన్ని బిందువులు వచ్చును. ఒక బిందువు సముద్రమునఁ బ్రవేశింపఁగనే యాదియందుఁగాని యంత్యమందుఁగాని శూన్యస్థానము లేనట్టు లొకఁడు ముక్తుఁడుకాఁగానే యాస్థానముగాని యాదియందుఁగాని శూన్యము కానేరదు. అట్టులే యిదియనియు భావించునది. కావున నాస్తంబ బ్రహ్మపర్యంతము బ్రహ్మజన్మదివసము మొదలు లయదినమువఱకు నెంతచర్య జరగునో తరువాతిబ్రహ్మల కాలమం దంతచర్య యట్టులే యేదైనఁ గొంచెము భేదముతో జరగును.

శ్రీరామావతారమునకుఁ దగిన సందర్భము శ్రీవైవస్వత మన్వంతరమున నైదవ మహాయుగమందలి త్రేతయందుఁ దటస్థించెను.

సంవత్సరములు.

కృతయుగమునకు	౧౪౪౦౦౦౦	౧౭౨౮౦౦౦.
సంధి	౨౮౮౦౦౦	
త్రేతాయుగమునకు	౧౦౮౦౦౦౦	౧౨౯౬౦౦౦.
సంధి	౨౧౬౦౦౦	
ద్వాపరయుగమునకు	౭౨౦౦౦౦	౮౬౪౦౦౦.
సంధి	౧౪౪౦౦౦	

కలియుగమునకు	౩౬౦౦౦౦	౪౩౨౦౦౦.
సంధి	౭౨౦౦౦	
మహాయుగము,		౪౩౨౦౦౦౦.

ఇట్టివి వెయ్యిమహాయుగములు బ్రహ్మకొక పగలు. వెయ్యి మహాయుగములు బ్రహ్మకొక రాత్రి. ఇవిరెండు కలసినదినము బ్రహ్మకొక కల్పము. ౩౬౦ కల్పములు బ్రహ్మకొక సంవత్సరము. ౩౬౦౦౦ కల్పములు బ్రహ్మాయువు.

త్రేతాద్వాపర సంధియందుఁ బరశురామ శ్రీరామావతారములు.

'త్రేతాద్వాపర సంధి రాముఁడలుకన్'

అని భారతంబున నుంటఁజేసి త్రేతాయుగాంతమున శ్రీరామావతారమని నిశ్చయింపనగు.

త్రిమూర్తులం దవతారములు విష్ణువునకేకాని తక్కిన యిరువురకు లేవు. కొంచెము శ్రమముతోఁ బిడ్డలఁ బుట్టింపవచ్చును. అవలీలగా వారిని జంపవచ్చును. వారిని రక్షించుటకే యెంతశ్రమమైనఁ బడవలసియుండును. ఎన్ని వేషములయిన వేయవలసియుండును. సర్వకాల సర్వావస్థల బిడ్డలను గనిపెట్టి వారి యోగక్షేమములు విచారించుకొనుచు వారిని సన్మార్గవర్తులఁ జేయుట సుకరముగాదు. కావున విష్ణువు రాజసుఁడైన బ్రహ్మను సృష్టికార్యమందును, దామసుఁడైన శివుని సంహార కార్యమందు నిలిపి రక్షాభారము తనయందుంచుకొని దానికిఁ బోవలసిన పోకలఁ బోవుచుండును. కావున విష్ణువిప్పుడు మనుష్యరూపమున నవతరించెను.

—♦ జన్మ సంవత్సరమేది ? ♦—

"తతశ్చ ద్వాదశేమాసే, చైత్రే నావమికేతిథౌ
నక్షత్రేఽదితి దైవత్యే, స్వోచ్చ సంస్థేషు పంచసు
గ్రహేషు కర్కటేలగ్నే వాక్పతా విందునాసహ
ప్రోద్యమానే జగన్నాథం, సర్వలోక నమస్కృతమ్
కౌసల్యాఽజనయద్రామం, సర్వలక్షణ సంయుతమ్
విష్ణో రర్ధంమహాభాగ, మిక్ష్వాకు కులవర్ధనమ్". ౧-౧౮-౮.

కం. క్రతువు పరిపూర్తి యగుడున్, ఋతుషట్కంబరుగఁ బదియు రెండవనెలలో
క్షితిఁ జైత్రశుద్ధ నవమిన, దితి తారను రవియు నడిమి దివిని వెలుంగన్.
బాలకాండము. ౪౯౯

కం. వర కర్కట లగ్నంబున, సురగురుఁ డుదయించుచుండ సోమునితోడన్
ధరణీముఖ గ్రహపంచక, మరుదుగ స్వోచ్చ స్థలంబులందు వెలుంగన్.
బాల. ౫౦౦,

కం. కౌసల్య జగత్పతి శ్రీ, వాసుని యద్ధాంశమూర్తి వరశుభ చిహ్నున్
భాసుర రఘుకులవర్ధను, వాసిఁగనెన్ సర్వలోక వందితు రామున్. బా.౨౦౧.

దీనినిబట్టి శ్రీరాము జననకాలమున గురువు, చంద్రుఁడు కర్కాటక లగ్నమందుండిరనియు,

శు	ర బు		
			గురు ల. చం.
కు			
		శ	

జన్మలగ్నము కర్కాటకమనియు, మేషమున రవి బుధులు, తులయందుశని, మకరమందుఁ గుజుఁడు, మీనమందు శుక్రుఁడు నుండిరని యేర్పడుచున్నది.

ప్రమాది, ఖర, శోభకృత ద్రాక్షస ప్రభవేషు
ధనుర్గురుః ప్రమాద్యాది వర్షాణాంతు యథాక్రమాత్
కుంభి, కర్కి, ధను, ర్మేష, కన్యారాశౌ శనిక్రమాత్.

అని కాలప్రకాశికయందుఁ గలదు, అనఁగాఁ బ్రమాధియందు ధనుస్సున గురువు, కుంభమందు శని యుందురు. ఖరయందు ధనస్సున గురుఁడుండిన కర్కాటకమందు శనియుండును. శోభకృత్తునందు ధనుస్సునఁ గురు శను లిరువురు నుందురు. రాక్షసయందు ధనుస్సునందు గురువుండిన మేషమందు శనియుండును. ప్రభవయందు ధనుస్సున గురువుండినఁ గన్యయందు శని యుండును. గావున నేసంవత్సరమున గురువు కర్కాటకమందుండిన శని తులలోనుండునో చూతము.

ఖరసంవత్సరమందు గురువు ధనుస్సునందుండెనేని సంవత్సరమున కొకరాశి యందుండువాఁడు కావున నాయన కర్కాటకమునకు వచ్చుటకు నెనిమిది సంవత్సరములు పట్టును. ఖర సంవత్సరమునకు నెనిమిదవ సంవత్సరము విలంబియగును. శని యొక్కొక్కరాశియందు రెండున్నర సంవత్సరముండు వాఁడు కావునఁ గర్కాటమందున్న శని యెనిమిదవ సంవత్సరమున తుల యందుండును. ఈ యెనిమిదవ సంవత్సరము విలంబియగును. శ్రీరాముల జననకాలమున గురువు కర్కాటకమందు శని తులయందుండుటచే నాయన పుట్టిన సంవత్సరము విలంబి యగుట నిశ్చయము.

నక్షత్రము పునర్వసువు.

—• జన్మయుగమేది? •—

దీనిని నిర్ధారించుటకు శ్రీమద్రామాయణమున నాధారములు లేవు. అనుక్తమన్యతో గ్రాహ్య మ్మనున్యాయ మనుసరించి గ్రంథములు శోధింపఁగా శ్రీరంగ మాహాత్మ్యమం దీవాక్యములు కానవచ్చుచున్నవి.

ఇవి భగవంతుఁడు బ్రహ్మకుఁ జెప్పిన వాక్యములు.

శ్లో. త్వయార్చితోహ మధునా, శ్రీరంగే ధామ్ని పద్మజ
అయోధ్యాంగంతు మిచ్ఛామి రఘుభిః పరిపాలితామ్
తేమాంత త్రార్చ యిష్యంతి చతుర్యుగ చతుష్టయమ్
తతః పరం ప్రయాస్యామి కావేరీం చోళరక్షితామ్
చంద్రపుష్కరణీతీరే శయిషేహం చతుర్ముఖ.

బ్రహ్మదేవా! శ్రీరంగధామమందు నీచే నర్చింపఁబడు నేను రఘు వంశమువారు పాలించు నయోధ్యకుఁబోవఁ గోరుచున్నాను. అచ్చట వారు నన్ను నాలుగు మహాయుగము లర్చింతురు ఆవల జోళరక్షితమైన కావేరీ తీరమునకుఁ బోయి చంద్రపుష్కరిణీ తీరమున శయనించెదను. అనిచెప్పఁగా బ్రహ్మ శ్రీరంగధామమును నిక్ష్వాకు మహారాజున కర్పించెను. ఆయన దానిని దీసకొని పోయి—

"ఫాల్గునే మాసిదేవస్య, నక్షత్రే భగదైవతే
ఉత్సవావ భృథంచక్రే, పుత్రపౌత్రై స్సమన్వితః.

ఫాల్గున మాసంబున, శుద్ధపక్షమున, పున్నమనాఁడు ఫల్గునీ నక్షత్రమున నాయన కొడుకులు మనుమలతోడ నుత్సవంబులు జరపె. ఇట్లు నాలుగు మహా యుగములు గడచెను.

శ్లో. త్రేతాయుగే పంచమేతు రాజా దశరథోనఘః
పుత్రార్థం హయమేధేన యష్టుం సముపచక్రమే.

అయిదవ త్రేతాయుగమందుఁ బుత్రుల నిమిత్తమై దశరథరా జశ్వ మేధము చేయ నారంభించెను. ఈ వాక్యములవలన నైదవ మహాయుగమం దలి త్రేతాయుగమందు దశరథుఁ డశ్వమేధము చేసెనని తెలియుటచే నాయుగ మందే శ్రీరామ జననము. విలంబి సంవత్సరమున శ్రీరామ జననము కావున హేవిలంబియందు నశ్వమేధయాగము పుత్రకామేష్టి జరగెను. దుర్ముఖి చైత్ర మందు నశ్వము విడువఁబడెను, మన్మథయందు దశరథుఁడు బిడ్డలులేరని విచారము.

శ్లో. పుష్యే జాతస్తు భరతో, మీనలగ్నే ప్రసన్నదీః
సార్పే జాతౌతు సౌమిత్రీ కుళీరే భ్యుదితే రవౌ.

గీ. పుష్యమున మీనరాశిని బుట్టె సుప్ర, సన్నమతి భరతుండును సార్పభమునఁ
గర్కటకమున మధ్యాహ్నకాలమందుఁబుట్టిరి సుమిత్రతనయులు పుణ్యనిధులు

పునర్వసువు నక్షత్రమున శ్రీరామ జననము బుధవారము. పుష్యనక్షత్రమున భరత జననము గురువారము. ఆశ్లేషానక్షత్రమున లక్ష్మణ శత్రుఘ్నుల జననము శుక్రవారము.

అతీత్యైకా దశాహంతు నామకర్మ తథాకరోత్.

గీ. పదియు రెండవదినమునఁ బార్థివుండు,
పురుడు పాయంగఁ దనప్రియపుత్రకులకు
నామకరణ మహంబు నొనర్చెఁ బ్రేమ, నని యుండుటచే-

చైత్ర బహుళపంచమి సోమవారమునాఁడు నామకరణము.

పరాభవ సంవత్సరమున ననఁగా తొమ్మిదవ యేఁట నుపనయనము. ఎట్టులనఁగా సీతాదేవి రావణునితో-

శ్లో. మమభర్తా మహాతేజా వయసాపంచ వింశకః
అష్టా దశహి వర్షాణి, మనుజన్మని గణ్యతే. అరణ్య. ౪౭-వ సర్గము.

కం. ప్రతిభట రహితుండగునా, పతి కిరువదియేను సమలప్రాయం బపుడీ
క్షితిఁ బుట్టు కాదిగాఁగన, హితగుణ నాకపుడు పదియునెనిమిది యేఁడుల్
అరణ్య. ౭౬౭.

తామరణ్యావాసమునకై వెడలునప్పటికి శ్రీరామునకు నిరువదియైదు వత్సరములనియు తనకుఁ బదునెనిమిది యేఁడులనియు చెప్పెను.

కౌసల్య శ్రీరామునితో

శ్లో. దశసప్త చ వర్షాణి తవ జాతస్య రాఘవ. అయోధ్య. ౨౦ స.

మ. పదునేఁడేఁడులనుండి యెప్పుడొకొ, నాభంగంబు దుఃఖంబులున్
దుదఁగాంచున్ సుఖమబ్బునంచు, మదినెంతో వేచి మోదింపగా.

నని చెప్పుటచే రెండవజన్మమైన యుపనయనమైన దాదిగానని యెంచవలయును. కేవల బాలుఁడేమి యాశలఁ గల్పింపఁగలఁడు. అదియునుగాక దశరథుఁడు కైకేయీ పక్షపాతి. కైకేయికిఁ గౌసల్యయందు విరోధభావము కైకేయికి వివాహకాలమున నిచ్చిన వరమునుబట్టియుఁ బగచేతను దనకొడుకును దనభర్త యాదరించి యుపనయనమైనఁ జేయునో చేయఁడో యట్లుచేయఁడేని తనకొడుకు దనకేమి మేలుగూర్పఁగలఁడని సందేహించుచున్న కౌసల్యకు నుపనయనానంతరము ధైర్యము వచ్చెను. ఆశలు మొలకలెత్తెను. కావున నీ పదునేడనునది ద్విజన్మప్రాప్తి మొదలనియే చెప్పవలయును. అట్లైనచోఁ దొమ్మిదవ యేఁట నుపనయనమైననే ప్రవాసమునాఁటికి నిరువదియైదేండ్లగును. ౨౫ లో ౧౭ పోయిన నెనిమిది కావున నెనిమిదవ సంవత్సరమం దుపనయనమనుట సరిగాఁదోఁపదు. కావునఁ బరాభవ సంవత్సరమందే యుపనయనమని యెంచ

వలయును. తరువాత విశ్వామిత్రువెంటఁ దమ పండ్రెండవ సంవత్సరమున ననఁగా సౌమ్యవత్సరమున యాగరక్షణార్థమై రామలక్ష్మణులు పోయిరి.

ఈ విషయమున శ్రీమద్రామాయణ వాక్యములే ప్రమాణములు.

మారీచుఁడు రావణాసురునితో సీతను హరింపవలదని చెప్పునపుడు తనకు భయపడి విశ్వామిత్రుఁడు శ్రీరాముని మ్మని దశరథుని వేఁడఁగా దశరథుఁడు విశ్వామిత్రునితో-

శ్లో. బాలో ద్వాదశవర్షోయ మకృతాస్త్రశ్చ రాఘవః॥

"పసివాఁడు రాఘవుఁడు ద్వాదశ వత్సరుఁ డస్త్రకౌశలంబును నెఱుఁగండు' అని చెప్పినట్టు చెప్పెను.

కావున శ్రీరామునకు నిప్పటికిఁ బండ్రెండు వత్సరములనుట స్పష్టము. ఇది మఱియొకవిధముగ దృఢపడుచున్నది.

సీతాదేవి రావణునితో నిట్లు చెప్పెను.

శ్లో. ఉషిత్వా ద్వాదశసమా ఇక్ష్వాకూణాం నివేశనే
భుంజానా మానుషాన్ భోగాన్ సర్వకామ సమృద్ధినీ
తతస్త్రయో దశేవర్షే రాజామంత్ర యతప్రభుః.

సీ. శ్రీరాముభార్యను సర్వకామసమృద్ధ జనసుఖములఁ బదియు రెండేఁడు
లిక్ష్వాకులయింటను గడపితి నేదియుఁ గడమలేక। యంతటఁ బదియు
మూఁడవవత్సరంబున రామాభిషేక కార్యంబు పొంటె,
రాజు మంత్రులతోడ మంత్రంబుసేసి. ఆరణ్య. ౭౬౩.

సీతారామ లక్ష్మణుల యరణ్యవాస గమనము రాముని యిరువదియైదవ యేఁట యని మీఁదఁ జెప్పఁబడెను. ఈ యిరువదియైదవదే యీపద్యంబునఁ జెప్పిన పదుమూఁడవయేఁడు. అంతకుముందు పండ్రెండు సంవత్సరములత్తగారింట సుఖమనుభవించుచున్నట్లు చెప్పెను. కావున శ్రీరామునకుఁ బండ్రెండవయేఁట సీతకు ౧౮లో ౧౩ను పోను ౬వయేఁట వివాహమని యేర్పడుచున్నది.

ఈ విషయమునఁ గల సందేహపరిహారములు వ్యాఖ్యానమందు వ్రాయఁబడి యుండుటచే నిచ్చట వ్రాయఁబడవయ్యెను.

సౌమ్యసంవత్సర మాఖ బహుళమందు శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రు వెంటఁ బోయి-

౧-వ దినము పగలు సరయూనదీ దక్షిణతీరంబున బలాతిబల గ్రహణము, హస్తపోను చిత్రానక్షత్రము. ఆరాత్రి సరయూతీరమందు శయనము.

౨-వ దినము నుదయము గంగా సరయూ సంగమ దర్శనము, అంగదేశ వృత్తాంత కథనము, రాత్రి కామాశ్రమవాసము.

౩-వ దినము పగలు తాటకావధ, రాత్రి తాటకారణ్యవాసము.

౪-వ దినము పగలు అస్త్రగ్రహణము, సిద్ధాశ్రమ ప్రవేశము, రాత్రి విశ్వామిత్ర దీక్షాగ్రహణము.

౫-వ దిన ముదయము "నేఁడు మొదల్ సవావనంబుం గడఁకన్ ఘటింపుఁడు తపోధనుకై తమినారు యామినుల్" అని విశ్వామిత్రుఁడు మౌన మూనుటచే మునులు రామలక్ష్మణుల బోధించుట.

ప్రభాతకాలే చోత్థాయ పూర్వాం సంధ్యాముపాస్యచ. ౧-౨౯-౩౧.

అద్యప్రభృతి షడ్రాత్రం రక్షతం రాఘవౌ యువాం. ౧-౩౦-౪.

౫-౬-౭-౮-౯-౧౦ యాగరక్షణము. ౧౦-వ దినమున సుబాహు వధాదికము. ౧౦-వ రాత్రి సిద్ధాశ్రమవాసము.

౧౧-వ దినము విశ్వామిత్ర ప్రయాణము, రాత్రి శోణనదీ తీరవాసము, స్వచరిత్ర కథనము.

౧౨-వ దినము త్రిపథగా వృత్తాంతకథనము, రాత్రి గంగాతీరవాసము.

౧౩- దినము విశాలాప్రవేశము, రాత్రి విశాలావాసము.

౧౪-వ దినము అహల్యా శాపమోక్షణము, జనక దర్శనము, విశ్వామిత్ర చరిత్ర కథనము, రాత్రి ఆశ్రమవాసము.

౧౫-ఉదయము మిథిలా ప్రవేశము, శివధనుర్భంగము.

౧౬-౧౭-౧౮ జనకదూతల ప్రయాణము, ౧౮-వ దినము జనక దూతలయోధ్యఁ బ్రవేశించుట.

౧౯-వ దినము దశరథ ప్రయాణము.

౨౩-వ దినము దశరథుఁడు మిథిలఁ బ్రవేశించుట. ౧-౬౩-౨

౨౪-వ దినము జనక యజ్ఞాంతము. ౧-౬౩౫-పద్యము.

౨౫-వ దినము కుశధ్వజాగమనము, వంశకథనము, మఖానక్షత్రము.

౨౬-వ దినము గోదానము, యుధాజిత్తునాగమనము.

౨౭-వ దినము ఉత్తరఫల్గుని, సీతాకల్యాణము, శుక్లత్రయోదశి.

శుక్లత్రయోదశి వివాహమునకు శుభదినము, ఆదిన ముత్తరఫల్గునీ నక్షత్రము కావున శ్రీరాము జన్మనక్షత్రమున కాఱవది యగుటచే శుభతార.

శ్రీరాముఁ డయోధ్య విడిచిన యిరువదియేడవ దినము ఫాల్గున శుద్ధత్రయోదశి యగునేని యయోధ్యవిడిచిన దినము మాఖబహుళ ద్వితీయయై యుండవలయును. విదియ ప్రయాణమునకు మంచిదినమే. ఈ దినము హస్త యగును, అది శ్రీరామునకు ౭-వ ధనతారయగును, కావున నాదినమున హస్తపోను చిత్రయందు నభిజిల్లగ్నమునఁ బ్రయాణమై యుండవలెను.

శ్లో. తిథిర్నదోషా హ్యుదయేచకాలే, నక్షత్రదోషోఽభిజి దౌచకాలే
లగ్నాది దోషా స్తమయే చకాలే, నవారదోషాః ప్రభవంతి రాత్రౌ.

అను సూక్తి ననుసరించి నక్షత్రము హ స్తయైనను అభిజిత్సర్వదోషఘ్న మ్మని యుండుటచే దోషములేదు.

ఈ దినము సరయువు దాఁటుటతప్ప దూరప్రయాణము చేయలేదు. సరయు వయోధ్యనంటి పాఱుచున్నది. కావున మధ్యాహ్నము పండ్రెండు గంటలకు బయలుదేఱినను రెండుగంటలకు బయలుదేఱినను పడవమీఁద రెండుగంటలలో దక్షిణతీరము చేరియుందురు.

వివాహ మయిదుదినములు జరగెను; ఫాల్గున బహుళమున విదియతో వివాహము ముగిసెను.

ఫాల్గున బహుళ తృతీయను జనకుఁడు బిడ్డల కరణము లిచ్చుట.

చతుర్థిని నంపకములు.

ఫాల్గున బహుళపంచమి దశరథుఁ డయోధ్యకుఁ బ్రయాణమగుట. షష్ఠి యందో సప్తమియందో పరశురామ భంగము.దశమినాఁ డయోధ్యాప్రవేశము. ఆవలఁ బండ్రెండు సంవత్సరములు యథాసుఖ వర్తనము. బాలకాండము ౨౪ సంవత్సరముల చరిత్రము.

అయోధ్యాకాండము.

దుందుభి సంవత్సర చైత్రశుద్ధ చతుర్థియందు దశరథుఁడు శ్రీరాము నకుఁ బట్టాభిషేకము చేయవలయునని పౌరులతో మంత్రులతో నాలోచించుట చైత్రశుద్ధ పంచమినాఁ డుదయమునఁ బుష్యనక్షత్రమున యౌవరాజ్య పట్టాభి షేకమునకు నిశ్చయింపఁబడిన దినము.

ఈ దినమునందే సీతారామలక్ష్మణులు వనములకుఁ బ్రయాణము.

శ్లో. పూర్ణే చతుర్దశేవర్షే పంచమ్యాం లక్ష్మణాగ్రజః
భరద్వాజాశ్రమం ప్రాప్య, వవందే నియతోమునిమ్.

యుద్ధ. ౧౨౪. సర్గము-౧.

వనవాసము పదునాలుగు సంవత్సరములు పూర్ణముకాఁగా పంచమి యందు శ్రీరాముఁడు భరద్వాజాశ్రమము చేరెనని చెప్పుటచేఁ జైత్ర శుద్ధ పంచమి వనవాసారంభదినమని యేర్పడుచున్నది.

చం. వనముల నాలుగుంబదియు వర్షము లుండఁగ మీరలిప్పుడే
చనుఁడని చెప్పెఁగైక యదిసాగుత నేఁడుమొదల్గ రాఘవా.

అనుటచేతను. [అయోధ్య. ౧౧౦౦ ప.

కం. కొనిచని మహానుభావుని, జనపదములనెల్లఁ గడచి చని యటవిడుమీ
యని దశరథుఁ డనుటచేతను, చైత్రశుద్ధ పంచమి నుండియె లెక్కింపఁ దగు. ఈరాత్రి సీతారామలక్ష్మణులు ముగ్గురు తమసాతీరమందు శయనించిరి. అచ్చటఁ జేరఁగానే శ్రీరాముఁడు లక్ష్మణునితో-

శ్లో. ఇయమద్యనిశా పూర్వా, సౌమిత్రే ప్రహితావనమ్
వనవాసస్య భద్రంతే, సనోత్కంఠితు మర్హసి. ౨-౪౬-౨.

కం. మన కానన యాత్రావ్రత, దినములలో నిదియ మొదటిదిన మరిగెడి నో
యనఘా చేరితి మడవియు, వనవాసం బెట్లొ యనుచు వగవకుమన్నా.
అయో. ౧-౨-౨౩

శ్రీరాముని యీ వాక్యమువలనను వనవాసారంభదినము దుందుభి చైత్రశుద్ధ పంచమియని యేర్పడుచున్నది. చైత్రశుద్ధ షష్ఠి గంగాతీరవాసము. గుహ దర్శనము. ఇది యూరువిడిచిన రెండవనాఁడు.

ఊరువిడిచిన మూఁడవనాఁడు సప్తమి. జడలు ధరించుట, గంగాతరణము, సుమంత్రున కనుజ్ఞయిచ్చుట, వనస్పతిమూలమున నిదురించుట.

నాల్గవనాఁ డష్టమి. ప్రయాగదర్శనము, సాయంకాలమున భరద్వాజాశ్రమ ప్రదేశము, అయో ౧౪౩౪-ప. ఆరాత్రి యాశ్రమమందే శయనము. ౧౪౪౬-ప. ఐదవనాఁడు నవమి, యమున దాఁటుట, శ్యామవృక్ష దర్శనము, యామునోపవనమున రాత్రి శయనము. అయో. ౧౪౬౭. ప.

ఆఱవనాఁడు దశమి, చిత్రకూటమున వాల్మీకి దర్శనము, పర్ణశాల నిర్మాణము. (ప. ౧౪౭౭-౧౪౭౯.)

ఆఱవనాఁటి సాయంకాలమున సుమంత్రుఁ డయోధ్యఁజేరుట. (ప. ౧౪౮౭). ఈ పద్యమున మూఁడవనాఁటి సంజయని యున్నది. అనఁగా సుమంత్రుఁడు మూఁడు దినములు ప్రయాణముచేసెనని యర్థముగాదు. సీతా రామలక్ష్మణులతోడ బ్రజలడ్డము వచ్చుచుండఁగా నయోధ్యనుండి గంగకు మొదటిదినమున సగము రెండవదినమున సగము ప్రయాణముచేసిరి కావున సుమంత్రునకు నంతకెక్కువ కాలము పట్టుట యసంభావ్యము. ఒక్క మధ్యాహ్నమున కెక్కువ పట్టియుండదు. కావున సీతారామలక్ష్మణులు చిత్రకూటము చేరినవార్త విని యారాత్రికే సుమంత్రుఁ డయోధ్యచేరెను. ఈ రాత్రియందే కౌసల్య దుఃఖించుచు-

కం. ఏను నిశలేగె రాముఁడు, కానన వాసంబు చేయఁ గడఁగినది మొదల్.

అని చెప్పెను, కావున నిది యాఱవరాత్రి యనుట స్పష్టము. ఆ వెంటనే యర్ధరాత్రమున దశరథుఁడు మేల్కని తనకు గలిగిన మునిశాపము గుఱించి కౌసల్యకుఁ జెప్పెను-

కోడలినిం గొడుకుం దలంచి యా,క్ష్మారమణేంద్రుఁ డాఱవనిశన్ నడురే ధవళాక్షి కిట్లనున్. ప. ౧౫౯౧.

ఈ రాత్రియందే దశరథు మరణము.

ఏడవనాఁ డేకాదశి, స్త్రీల విలాపము, దశరథ కళేబరమును తైలద్రోణి యందుంచుట, (ప. ౧౬౯౫). ఎనిమిదవనాఁడు ద్వాదశి, యుదయమున మంత్రిపురోహితుల సభ. భరతునకు దూతలనంపుట. మఱుదినము (౯-వనాఁడు త్రయోదశి) ప్రయాణముచేసి యారాత్రి కేకయునగరముఁజేరి పదవనాఁటి యుదయము చతుర్దశినాఁడు భరతుని దర్శించిరి. ౯-వనాఁటిరాత్రి భరత దుష్ట స్వప్నము. పద్య. (౧౭౪౨-౧౭౪౩-౧౭౫౭.) పదవనాఁడే భరతుఁ డయో ధ్యకుఁ బ్రయాణము. ౧౭-వ నాఁటి యుదయమున భరతుఁ డయోధ్యఁ బ్రవే శించుట.

అరుణోదయంబున భరతుఁ డాత్మ,పురము మనునిర్మితంబయి సిరులమీఱు
నయ్యయోధ్యను గనుఁగొనె నవనినాథ,తనయుఁ డిట్టులు సప్తరాత్రములు
నడచి తనదు పురమును జూచి సూతునకు ననియె.   ౧౭౭౦-వ ప.

కం. అని యడిగిన నిజ జననికి ననియెన్ భరతుండు నేఁటి కాఱు నొకండున్
జనెనమ్మరేలు మాపుస, దనమును నే విడిచి"   ౧౭౯౦-వ ప.

అనుటచే శ్రీరాముఁ డయోధ్యవిడిచిన ౧౭-వనాఁడు భరతుఁ డయోధ్యఁ జేరెను. చైత్ర బహుళషష్ఠితిథి ౧౮-వ దినము చైత్రబహుళ సప్తమినాఁడు భరతుఁడు తండ్రికి నౌర్ధ్వదైహిక క్రియల నారంభించుట.

సీ. పదునొకండవనాఁడ భరతుఁ డాశౌచంబు, దీర్చి పండ్రెండవ దినమునందు
శ్రాద్ధకర్మములెల్ల జరపి.   (ప. ౧౯౧౨).

యని యుండుటచేఁ గనినముట్టు వినినఁజావు. అను నియతి ననుసరించి చైత్రబహుళ షష్ఠినాఁడు దశరథ మృతివార్త విన్నవాఁడు కావున నాదినము మొదలాశౌచము ప్రారంభము. వైశాఖ శుద్ధమునఁ బాడ్యమినాఁడు నివృత్తి. ౨౭వ దినము భరతుఁ డయోధ్యఁజేరిన ౨౮-వదినము వైశాఖశుద్ధ ద్వితీయ నాఁడు శ్రాద్ధ కర్మములన్నియుఁ జేయుట, సపిండశ్రాద్ధము, సంవత్సరాంత కృత్యము. ఇప్పటి దేశకాల స్థితులఁబట్టి సంవత్సరాంతమువఱకుఁ గర్త జీవింపఁడేని ప్రేతకుఁ గతులులేకపోవునని ౧౩-వ దినమందుఁ జేయఁబడు చున్నది. పూర్వ మట్టిభయములేదు. ఇది ౧౨-వ నాఁటి చరిత్రము. ౨౯-వ దినము వైశాఖశుద్ధ ౩-వనాఁడు (భరతుఁ డయోధ్య జేరిన ౧౩-వ నాఁడు).

గీ. మఱి త్రయోదశ దినమున మహిపతనయుఁ
డస్థి సంచయనార్థమై యరుగుదెంచి.

ఈనాఁడే శత్రుఘ్నునిచే మంథరకుఁ బ్రహారములు, (౧౪-వ దినము) ౩౦-వ దినము వైశాఖ శు. చతుర్థినాఁడు రాజకర్తలు రాజ్యభారము వహింపుమని భరతుని వేఁడుట (ప. ౧౯౩౭) భరతుఁడు నిరాకరించి శ్రీరాముని దోడి తెచ్చెదనని చెప్పుట మార్గశోధకుల నియమించుట, ౩౧-వ దినము వై. శు. పంచమినాఁడు (౧౫-వ దినము) భరతుఁడు సభకువచ్చుట, వసిష్ఠుఁడు భరతుని రాజ్యము పట్టముఁ గట్టుకొమ్మని చెప్పుట భరతుఁడు గర్హించుట.

౩౨-వ దినము వై. శు. షష్ఠి (౧౬-వ దినము) భరతుఁడు చిత్రకూటంబునకుఁ బ్రయాణమగుట గంగాతీరవాసము. గుహదర్శనము. (౧౯౭౦-వ ప.) ౩౩-వ దినము వై. శు. సప్తమి (౧౭-వ దినము) భరత జటాధారణము. భరతుఁడు సేనతో గంగదాఁటుట, భరద్వాజు దర్శించుట, భరద్వాజుని విందు. (౨౦౬౬-వ పద్యము) ౩౪-వ దినము వై. శు. అష్టమి. (౧౮-వ దినము) చిత్రకూటమునకుఁ బ్రయాణము శ్రీరామదర్శనము, రాముఁడు దశరథునకు నివాపంబులు విడుచుట. ౩౫-వ దినము వై. శు. నవమి. (౧౯-వ దినము) రామభరత సంభాషణము. (౨౩౬౭-వ ప.) ౩౬-వ దినము వై. శు. దశమి (౨౦-వ దినము) పాదుకాదానము భరతుఁడయోధ్య జేరుట. ౩౭-వ దినము వైశాఖ శుద్ధము, ఏకాదశి (౨౧-వ దినము) భరతుఁడు నందిగ్రామముఁ జేరుట.

భరతుఁడు వెడలిపోయిన పిమ్మటఁ బున్నమవఱకుఁ జిత్రకూటమందే యుండి పయనంబులకునెల్ల బహుళప్రతిపత్తు మేలు గావున వైశాఖ బహుళమునఁ బాడ్యమినాఁడు సీతారామలక్ష్మణులు అత్రియాశ్రమముఁ జేరిరి. రాత్రి సంజచీఁకటులు వెంటనే చంద్రోదయము వర్ణించుటచే నీ దినము పాడ్యమియో విదియయోయై యుండవలయును, సంజ చీఁకటులు బహుళమందేకదా యుండును.